LIBA131B214

నాటికా పంచవింశతి

సంపాదకుడు

డా॥ కొర్రపాటి గంగాధరరావు



ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాదు,
హైదరాబాదు.4

NATIKA PANCHA VIMSHATI
An Anthology of 25 best play-lets adjudged by
Andhra Nataka Kala Parishat, Edited by
Dr. Korrapati Gangadhara Rao, Bapatla, Guntur Dist.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి
హైదరాబాదు : 500 004

ప్రచురణ : **322**

ప్రథమ ముద్రణ : **1982**

ప్రతులు : **2,000**

వెల : రూ. 17-50

ప్రతులకు :
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి
కళాభవన్, సైఫాబాద్, హైదరాబాదు - 500 004.

ముద్రణ :
పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాదు-500 001.

Paper used for the Printing of this book was made available by the Government of India at Concessional rate.

తొలి పలుకులు

పాఠకుడులేని పుస్తకం అన్నా, ప్రేక్షకుడు లేని నాటకం అన్నా, చంద్రుడు లేని వెన్నెల అన్నా, ఒక్కటే. సాహిత్య ప్రక్రియగా రూపకం అత్యున్నత స్థానాన్ని సంపాదించుకున్నది. నాటకం, ప్రహసనం, నాటిక, యక్షగానం, ఇంకా మరింకెన్నో రూపాలలో రూపకం అవతరించింది. విభిన్న అభిరుచులు కల్గిన ప్రజలకు ఆదరపాత్రమైనది. ఇతర సాహిత్య ప్రక్రియలవలెకాక, రూపకానికి, నాణెమున కున్నట్లు రెండువైపులున్నవి. ఒకటి సాహిత్యం, రెండవది ప్రయోగం (ప్రదర్శనం). రూపకమర్యాదలు అధ్యయన పరులకు ఎంత ఆవశ్యకములో సామాజికులకు అంటే ప్రేక్షకులకు అంతే ఆనంద దాయకములు. రూపకం సమాహార కళ. సంగీతం, సాహిత్యం, శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, ఇత్యాదికళలన్నీ రూపకనిర్మాణంలో పాలుపంచుకుంటాయి.

అధ్యయనానికీ ప్రయోగానికీ ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో సాహిత్య అకాడమి ఆంధ్ర నాటకకళాపరిషత్తు బహుమతినందుకున్న 25 నాటికలను ఏరుకొని వాటిని ఒక సంపుటిగా మలచి అందిస్తున్నది. ఈ నాటికల్లో సాహితీపృష్టితో ఎంపిక చేసినవి కొన్ని ఉన్నవి; మరికొన్ని నటనావైదుష్యంతో సహృదయులను అలరించినవి కొన్ని ఉన్నవి. 1947 మొదలుకొని 1979 వరకు ఆంధ్ర నాటక కళా పరిషత్తులో, సర్వోత్తమంగా ప్రయోగింపబడిన నాటికలను శ్రీ కొర్రపాటి గంగాధరరావుగారు సేకరించి చక్కని పీఠికను సమకూర్చి, నాటికా రచయితలను పరిచయము చేసి "నాటికా పంచవింశతి"గా తీర్చిదిద్దినారు. శ్రీ గంగాధరరావుగారు నాటికా రచయితలే కాక రూపక ప్రయోగదక్షులుకూడ. ఎందరో మనీషుల నాటికలు ఈ సంపుటితో ఉన్నవి. ఆ రచయితల సౌజన్యానికి పొందిత్యానికి అభివందనములు. ఈ సంపుటిని సిద్ధంచేసిన శ్రీ కొర్రపాటి గంగాధరరావుగారికి అకాడమీ పక్షాన కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాను.

హైదరాబాదు
తేది 1-1-1982

ఇరివెంటి కృష్ణమూర్తి
కార్యదర్శి

'నాటికా పంచవింశతి'

విషయసూచిక

1.	చేసిన పాపం	—కొప్పరపు సుబ్బారావు	...	1
2.	తుఫాను	—పులుగుండ్ల రామకృష్ణయ్య	...	21
3.	ఎవరు దొంగ ?	—ఆచార్య ఆత్రేయ	...	69
4.	తారాబలం	—పడ్డమూడి సీతారామరావు	...	95
5.	ప్రగతి	—ఆచార్య ఆత్రేయ	...	127
6.	ఆడది	—పీనిశెట్టి శ్రీరామమూర్తి	...	153
7.	నా బాబు	—డా॥ కొర్రపాటి గంగాధరరావు	...	185
8	బంగారు సంకెళ్ళు	—డా॥ కొర్రపాటి గంగాధరరావు	...	243
9.	దిష్టి బొమ్మలు	—వేణు	...	267
10.	ప్రార్థన	—డా॥ కొర్రపాటి గంగాధరరావు	...	311
11.	వెంకన్న కాపురం	—ముదిగొండ లింగమూర్తి	...	345
12.	మనస్తత్వాలు	—భమిడిపాటి రాధాకృష్ణ	...	367
13.	దంత వేదాంతం	—భమిడిపాటి రాధాకృష్ణ	...	399
14.	చావకూడదు	—ఆచార్య ఆత్రేయ	...	435
15.	పుణ్యస్త్రీ	—ఎస్. ఆర్. నంది	...	453
16.	కుక్కపిల్ల దొరికింది	—రావి కొండలరావు	...	491
17.	చరమాంకం	—పీనిసెట్టి సుబ్బారావు	...	527
18.	వాన వెలిసింది	—ఎస్. ఆర్. నంది	...	553
19.	సుల్తానీ	—వేదాంతి శివరామశాస్త్రి	...	593
20.	చీకటి తెరలు	—గన్నిసెట్టి వెంకటేశ్వరరావు	...	623
21.	జ్వలితజ్వాల	—హనుమంతరావు	...	649
22.	శిరోమణి	—దివ్య ప్రభాకర్	...	677
23.	ఉలిపికట్టె	—ఆపుల శ్రీనివాసరావు	...	717
24.	మనిషి చావకూడదు	—ఎస్. ఆర్. నంది	...	763
25.	కళ్ళు	—గొల్లపూడి మారుతీరావు	...	801

ఈ సంకలనాన్ని గూర్చి

ఈ సంకలనంతో, ఆంధ్ర నాటక కళా పరిషత్ నిర్వహించిన పోటీలతో రచనకూ ప్రదర్శనకూ బహుమతులందిన నాటికలను మాత్రమే చేర్చగలిగాము. వాటిలోనూ లభ్యమైనవి మాత్రమే, అనుమతి నందినవి మాత్రమే చేర్చటం జరిగింది.

1965 తరువాత నాటక కళా పరిషత్ సభలు ఎక్కువగా జరగలేదు. అంచుపల్ల తదనంతరం ప్రసిద్ధికి వచ్చిన రచనలు కొన్నింటిని [పరిషత్ పోటీలతో పొత్తులేకపోవటం వల్ల] ఈ సంకలనంలో చేర్చటానికి వీలుకాలేదు. నిజానికి నాటక కళా పరిషత్ పోటీలతో పొత్తులేకపోయినా ఆ తరువాత కాలంలో చాలా మంచి రచనలు వెలువడినాయి. ప్రదర్శనలో అత్యుత్తమంగా పరిగణించబడినాయి కూడా. ముందు ముందు అవి వేరే సంకలనంగా ఆశిద్దాం.

అయితే—ఆంధ్రదేశంలో నాటికారచన ప్రారంభ దశలోనే, తెలుగు నాటికా రచయితలు రకరకాల ప్రయోగాలు చేశారని, ఈ సంపుటిలో నాటికలను చూచినప్పుడు ఒప్పుకోక తప్పదు. "ఎవరు దొంగ"—"దిష్టి బొమ్మలు"—"ప్రార్థన"—"కప్ప" మొదలైనవి ఎన్నో ఇందుకు ఉదాహరణలు.

నిజానికి రచన + ప్రదర్శనకు కాక, వేరు వేరు బహుమతులందిన నాటికలుకూడా ఇదే కాలంలో వచ్చాయి. వాటిలో పరిగణించదగినవి చాలా ఉన్నాయి. కాని —

కొన్ని నాటికల విషయంలో- "పేటికానాడు బహుమతి ఎట్లా వచ్చిందా?" అన్న సందేహం రావచ్చునేమో! కాని ఆ విషయంలో చెప్పవలసింది ఒక్కటే ఉన్నది. కొన్ని రచనలు చదవటానికి వీలుగా ఉండవచ్చు. కొన్ని రచనలు చదవటానికీ ప్రదర్శనకూ దూరంగా వుండవచ్చు. కాని అసలు సినిమాలు లేని నాటకాలు లేని నాటికలు వెలువడినప్పుడెల్లా ఉన్నాయి, ప్రదర్శన సమయంలో నిండు సభలలో

లోనున్న శక్తి పురివిప్పుకొని అమితంగా రక్తి కట్టివచ్చు. ఇది ప్రపంచ సర్వజనాంగీకారం పొందిన వాక్యమే.

ఏమైనా నాటికో నాటకమో అన్న తర్వాత దానికి ప్రదర్శనమే గీటురాయి కదా?

ఈ సంకలనంలో పరిషత్ కార్యదర్శుల ద్వారా నాకు ఏవిధమైన సహాయ సహకారాలు రాలేదు. అందువల్ల ఏ సంవత్సరము ఎన్నవ పరిషత్ జరిగిందీ నేను నా పట్టికలో ఇవ్వలేకపోయాను. కనుక నా పట్టికలో వరుసగా ఊళ్ళ పేర్లను ఉదాహరించటంలోనూ, సంవత్సరాల క్రమంలోనూ పొరపాట్లు ఉండవచ్చు. డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారి "నాటక వికాసం"లో, ఈ పట్టిక కొంత పరచి ఉన్నది. అది కొంతా, నా జ్ఞాపకం కొంతా, ఇతర మిత్రుల సంప్రదింపు లతో కొంతా నా పట్టికను ఈ మాత్రంగా సమగ్రం చేయగల్గాను.

నాతో సహకరించి కోరినవెంటనే అనుమతి పొసగిన తోటి రచయిత లందరికీ, ఈ సంకలనంలో నాకు అనేక విధాల సహాయపడిన మిత్రులు శ్రీ బి. బాబురావు [అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ], శ్రీ డి.ఎస్.ఎన్. మూర్తి [హైదరాబాదు], శ్రీ కాకరాల [సినీ నటులు-మద్రాసు] గార్లకు నా కృతజ్ఞతలు.

నన్ను ప్రోత్సహించి ఈ సంకలనం ప్రచురించటానికి నాకు అవకాశ మిచ్చిన సాహిత్య అకాడమీ అధ్యక్షులూ, పూజ్యులూ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి గారికీ, ఉపాధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికీ, కార్యదర్శి శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తిగారికి నా మనఃపూర్వక నమస్కారాలు.

చాపల్లి.

కొర్రపాటి గంగాధరరావు
సంకలనకర్త

ఆంధ్ర నాటక కళా పరిషత్ చరిత్ర

19-6-1939 తేదీన ఆంధ్ర నాటక కళాపరిషత్ స్థాపించబడింది. మొదటి పరిషత్ సభలు తెనాలిలో జరిగాయి. ఆ కాలంలో ఈ సభలు ప్రతి సంవత్సరం సమయందరూ కలుసుకోవటానికీ, పెద్దల్ని సన్మానించటానికీ, నాటకాలమీద శాస్త్రీయమైన చర్చలకూ మాత్రం ఉపయోగపడేవి. దానివల్ల ఎప్పుడూ ప్రయోజనం కలగనూ లేదు, ఎప్పుడూ మరింత ప్రయోజనం ఆశించనూ లేదు. కొందరు కొత్త నటులు దేశానికి పరిచయ మవటం మాత్రమే జరిగింది. ఆనాటి పరిషత్ సభలలో జరిగిన ప్రసంగాలు—ఎంతో కొంత ఆర్థికంగా సహాయపడటానికేగాని, మనం వాగా ఎంగిపున్న పోటీలూ బహుమతి ప్రదానాలూ మాత్రం కావు.

విశ్వనాథ కవిరాజుగారూ, పసారస గోవిందరాపుగారు, కొత్తపల్లి లక్ష్మయ్యగారు మొదలైన పెద్దల పూనికవల్ల ఈ సభలు దిగ్విజయంగానే జరిగేవి. అయితే ప్రయోజనం శూన్యం కావటం పల్లా—వీటిని 'భోజనాల పరిషత్'లనేవారు. ఈ పేరు చాలా కాలం నిలిచిపున్నది గూడా !

సంవత్సరానికోసారి—నటులూ, నాటక రంగ శ్రేయోభిలాషులూ, అభిమానులూ కలుసుకుని పరిచయం చేసుకునేవారు. పగలు చర్చలూ, గోష్ఠులూ వుండేవి. ప్రతిరాత్రీ రెండు ప్రదర్శనలు ప్రఖ్యాతిగాంచిన నటవర్గంతో నిర్వహించేవారు. ఈ భోజనాలకూ, సన్మానాలకూ, 'గేటు కలెక్షన్' మీదే కాక, పసారస గోవిందరాపుగారిలాంటి వారి ఆర్థిక సహాయం చాలా వుండేది. 1936 ప్రాంతంలో ఏలూరులో జరిగిన పరిషత్ నొకదానిని—నా చిన్నతనంలో నేనూ చూచాను.

ఈ ఎత్తయిన పరిషత్ సభలు ఎవ్వరికీ తృప్తి నివ్వనిమాట వాస్తవం. ఈ రోజుల్లో ఏ నటునికి ఒక నటుడే పెద్ద. అన్ని కంట్రాక్టు నాటకాలు. ఒక్కొ

C

దేవీ భాగవతం

డా॥ కొర్రపాటి గంగాధరరావు

ప్రచురణ

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - సైఫాబాద్,
హైదరాబాద్-4

'రభస'గా ప్రదర్శించే ప్రదర్శనలు. కాని పరిషత్ ప్రదర్శనలు మాత్రం-తమ శక్తి సామర్థ్యాల ప్రదర్శనగా రక్తికట్టేవని మాత్రం చెప్పక తప్పదు. సభలు మాత్రం నిష్ప్రయోజనంగానే పుండేవి.

1943లో పరిషత్ ప్రదర్శనలలో ఒక కొత్తపులుపు పచ్చింది. అప్పటి నుంచి పరిషత్ సభలు ప్రోత్సాహిక సదుపర్లాలను ప్రోత్సహించటానికీ, తద్వారా నాటకరంగాన్ని తీర్చిదిద్దటానికీ కృషి చేయ నారంభించాయి. పెద్దలు, పూజ్యులు శ్రీ రాజా రంగయ్యప్పారావుగారి అధ్యక్షతన, శ్రీ కాజ వెంకట్రామయ్యగారూ, శ్రీ యర్రోజు మాధవాచార్యులుగారూ, శ్రీ దుక్కిపాటి మధుసూదనరావుగారూ, ప్రసాదరావుగారూ, పసల సూర్యచంద్రరావుగారు లాంటి ప్రసిద్ధులూ, సమర్థులూ పూనుకున్నారు. . ఆంధ్ర నాటక కళాపరిషత్‌ను ప్రజాస్వామ్య పద్ధతిలో నడిపారు. ఒక నిబంధనావళి ఏర్పడింది. సభ్యత్వం ఏర్పడింది. అధ్యక్షులు ఎన్నుకున్న కార్యవర్గం ఏర్పడింది. ముఖ్యంగా పోటీలు నడిపే విధానం రూపు దిద్దుకుంది.

ఒక్కొక్క సంవత్సరం—ఒక్కొక్క ఊళ్ళో-పరిషత్ సభలు జరిగేవి. ఇతర సన్మానాది కార్యక్రమాలతో బాటు - పోటీలు జరిగేవి. ఏ ఊరివారు ఆహ్వానిస్తే-ఆ వూరిలో పోటీలు జరగటంపల్ల, ప్రోత్సాహకులకు తమ స్వంత వూరిలోనే కాకుండా—పలు ప్రాంతాలలో తమ నైపుణ్యం ప్రదర్శించటానికి 'మంచి వేదిక' ఏర్పడింది. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించవలెనన్న నిబంధనపల్ల-స్త్రీలు కొందరన్నా - ఇదొక వృత్తి చేసుకున్నారు. ప్రదర్శనా యోగ్యమైన నాటకాలను రచయితలు రాయ నారంభించారు. వెలుగులోకి వచ్చారు. రంగా లంకరణ పద్ధతులు మారిపోయాయి. మంచి రంగస్థల సౌకర్యాలేవీ లేని ఆంధ్ర దేశంలో, మంచి 'టేం' వర్కుతో—చక్కని రిహార్సల్స్‌తో— శాస్త్రీయమైన పద్ధతులలో ప్రదర్శన లివ్వసాగారు. ఇంకా తృప్తికరమైన అభివృద్ధి లేదంటే అది ప్రోత్సాహకుల తప్పుగాదు. నాటక ప్రదర్శనకు కావాల్సిన లన్ని హంగులూ గల 'హాలు' ఆంధ్ర దేశంలోనే లేవు. అటువంటి హాలులూ, పరలా రైటింగ్ పగ్గాలు చేతా ప్రోత్సాహకుల పెర్పరుచుకోవాలనుట వారి రాహిత్యపు మించిన గాఢతెమ్మ కోరిక.

ఆంధ్ర నాటక కళాపరిషత్ ప్రారంభించటానికి పూర్వమే మనదేశంలో పోటీలుండేవి. కాని ఈ పద్ధతినగాదు. ఒకే నాటకాన్ని పోటీకి పెట్టేవారు. దానిలోనే ఒకరికి బహుమతు లిచ్చేవారు. ఏ సమాజానికా సమాజం—తమకు నచ్చిన నాటకాన్ని ప్రదర్శించవచ్చుననే పద్ధతి ప్రవేశపెట్టినవారు-1931లో-సరేపల్లి రాధాకృష్ణ—విక్రమదేవ్ మొదలగు వారట.

మొత్తం మీద పరిషత్ పోటీలు నిర్వహించటం వల్ల, ఔత్సాహిక నాటక రంగం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిందనటం నిర్వివాదాంశం. ఈ ఒక్క దశాబ్దంలో సాధించిన అభివృద్ధినే సాధించటానికి—ఇతర దేశాలలో దశాబ్దాలూ, శతాబ్దాలూ పట్టింది. ఇది గర్వించదగినదే. అయినా - సరియైన 'న్యాయనిర్ణయ పద్ధతి' ఇంతవరకూ ఏర్పడలేదు. పెద్దలూ అనుభవజ్ఞులూ అయిన శ్రీ కె॥వే॥ మాధవపెద్ది మొదలైన వారు - న్యాయనిర్ణేతలుగా వుండగా ఏ పేచీలు వచ్చేవికావు. ఆటువంటి వారు తోపించిన కొద్దీ, ఔత్సాహికుల్లో అశాంతి ఏర్పడింది. పేచీలు ఎక్కువయినాయి. నిర్వాహకులలో గూడా నిరుత్సాహం ఏర్పడింది.

మొత్తం మీద పోటీలను ప్రవేశ పెట్టింది ఆంధ్ర నాటక కళా పరిషత్తు-దానికొక విధానం ఏర్పరచింది పరిషత్తు. ఇతరత్రా అనేక పోటీల నిర్వాహణ పరంపర మూర్ఖం చూపింది పరిషత్తు. నేను ఆంధ్రదేశంలో నాటక కళాభివృద్ధి కంతటికీ మాతృ సంస్థ పరిషత్తే.

ఆంధ్ర నాటక కళా పరిషత్ నాటక పోటీలు ప్రారంభించిన దగ్గరుండే 'నాటికల పోటీలు' కూడా ప్రారంభించినదనుకుంటాను. పరిషత్తు ఒక ఆఫీసంటూ లేకపోవటం వల్ల సరియైన రికార్డు లేకుండా పోయింది. లభ్యమయినంత వరకే ఈ సంకలనంలో నేకరించటం జరిగింది. పరిషత్ సభలు ప్రతిసంవత్సరం తప్పకుండా జరగలేదు. అయినా, అధికారికమైన రికార్డు దొరకకపోయినా, సాధ్యమైనంతలో - ఈ సంకలనం చేశాను. క్షంతవ్యుణ్ణి.

ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహించటం ప్రారంభించిన-1944లో. అందే ధనపొట్టికి (1991 నాటికి) 37 వార్షికోత్సవాలు జరిగి

వుండాలి. కాని ప్రతి సంవత్సరమూ పోటీలు జరగక పోవటంవల్ల, ఇప్పటికి 25 పరిషత్ పోటీలే జరిగాయి. ఈ ఇరవై అయిదు సంత్సవరాలలో గెలుపొందిన నాటికల 'లిస్టు' కూడా సమగ్రంగా, అధికార పూర్వకంగా దొరకలేదు. ఎకాడమీ వారు ఈ సంకలనంలో 25 నాటికల పరకే ప్రచురించ తలపెట్టారు. కనక రచనా-ప్రదర్శనలకు బహుమతి నందిన వాటినే ఇందులో చేర్చగలుగుతున్నాను. ఇంచుమించు కూడా కొన్ని ముద్రణ కాలేదు. అయినవన్నీ కూడా సేకరించటం కష్టమయింది. ఒకటి రెండు పోటీలలో ఏది గెలుపొందిన నాటికో భోగట్టాకూడా ఎక్కడా దొరకలేదు. ఉదాహరణకు 1944 తర్వాత ఏ సంవత్సరం ఏ ఊరిలో-తమ నాటికకు బహుమతి లభించిందో రచయితలు గూడా, తమ అచ్చయిన పుస్తకాలలో ఉదాహరించలేదు. "సుల్తానీ", "చరమాంకం" మొదలైవి కొన్ని-అచ్చు కాలేదనే తెలిసింది. పోనీ ప్రాత ప్రతుల కోసం ప్రయత్నిస్తే - అవి దొరక గలిగిన వారి ఎడ్రస్సులు తెలియటం కష్టమయింది. కనక ఈ సంకలనం అసమగ్రంగా వుండక తప్పలేదు.

దాదాపు పది పన్నెండు సంవత్సరాలుగా పరిషత్ వార్షికోత్సవాలు ప్రతి ఏటా జరగటం లేదు. కాని 10-12 ఏళ్ళల్లో రచించబడిన చక్కని నాటికలు అనేకం వున్నాయి. పరిషత్‌లు జరిగి వుండే - ఇవి పోటీలకు వెళ్ళేవే. విజయం పొందేవే. అదొక దురదృష్టం-వాటికి ఈ సంకలనంలో స్థానంలేదు.

ఆంధ్ర నాటక కళా పరిషత్ పుట్టుపూర్వోత్తరాలు, పొందిన అడరాధి హనాలూ-చేసిన కృషిని గూర్చి చాలామంది పెద్దలు అనేక వ్యాసాలు ప్రకాశం. విషయ విస్తరణ భీతిలోన, చర్విత చర్వణం కాకుండాసూ చాలాపరకూ నా విస్మృతనంలో నేను ఎరిగివున్న విషయాలే ఇందులో పొందుపరిచాను.

ఏమైనా పరిషత్ చరిత్ర - "ఆంధ్ర నాటక చరిత్రలోనే" అత్యంత ప్రాముఖ్యం వహించినది. నేను ఆంధ్ర దేశంలో తెలుగు నాటకం తలఎత్తుకోవటానికీ-నిలబడడానికీ-పరిషత్ చేసిన కృషే ముఖ్యకారణం.

10-15 సంవత్సరాలుగా పరిషత్ కృషి మందగించినా-తిరిగి పునరుద్ధరించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అది అత్యంత శుభావహం.

కొర్రపాటి గంగాధరరావు.
సంకలన కర్త

ఏకాంకిక VII

"One Act Play" అన్న ఇంగ్లీషు పదాలను బట్టి తెలుగులో "ఏకాంకిక" అన్న పదం వాడుకలోనికి వచ్చింది. పాశ్చాత్య దేశాలలో ఈ ఏక్కాంకిక ఏనాడు ఆరంభమయిందో గట్టిగా తెలియదుగాని అతి పూర్వకాలం లోనిది మాత్రం కాదు.

నాటక ప్రదర్శనకు వచ్చే "ముఖ్యమైన ప్రేక్షకులు", వారి వారికున్న కార్యభారం వల్ల నాటక ప్రదర్శనకు రాదలచినా, ఆలస్యంగా వస్తూ వుండే వారట! ముందుసీట్లు నాక్రమించటానికి కాబోలు సామాన్య ప్రేక్షకులు, ముందే వచ్చి-ఆసీనులయి వుంటారు. వీరికి వేరే కాలక్షేపం లేకపోతే — అసలు నాటక ప్రదర్శన కాలానికి విసిగిపోతారు. ప్రదర్శన రక్తికి ఈలా జనించిన "విసుగు" దోహదకారికాదు. కనక వారి కాలక్షేపానికి-చిన్న ప్రదర్శన ఏదో ఒకటి-ఏర్పాటు చేయటం అవసరమనిపించిందిట! — కొంత ముంది నాటక నిర్వాహకులు-ఏదో ఒకటి రెండు హాస్య పాత్రల్ని ప్రవేశపెట్టి—ఏదో తోచినట్లు నటిస్తూ, తోచినట్లు మాట్లాడుతూ ఆ ప్రేక్షకులకు విసుగు జనించనీయకుండా చేయటమే వీటి ముఖ్యోద్దేశం. ప్రారంభ దశలో వీటిని 'Curtain Raisers అనేవారు.

ఇల్లా ప్రారంభమయిన ఏకాంకిక మొదట్లో కేవలం కాలక్షేపానికిగాను పూర్తిగా హాస్యభరితంగా విశోద ప్రధానంగా మాత్రమే వుండేది. ఆశువుగానే సంభాషణలు నడిచేవి. కథగూడా అప్పటికప్పుడు తోచుకున్నదే సరిపోయేది. రాను రాను అది అక్షర రూపం దాల్చింది. ప్రక్రియలో పుస్తక శక్తిపల్ల వేరైన తన స్వరూపాన్ని తను కల్పించుకున్నది. ఈనాటికి— పుష్టినొంది తన 'విశిష్టతను' తనే నిరూపించుకున్నది. పాశ్చాత్యదేశాల కంటే సుమారుగా 200 సంవత్సరాలాల్సా వెనుకబడి-ప్రారంభమయిన ఆధునిక ఆంధ్రనాటకంలో గూడా సుమారు అంత వెనుకగానే ఈ విశిష్ట నాటక రచనా ప్రక్రియ రూపు దిద్దుకున్నది.

ఏకాంకికను- "నాటిక" అనటం అంత ఫాస్యం కాదేమో! భరతముని చెప్పిన "దశరూపకాల" తర్వాత "నాటిక" అనేది ఒకటి వుంది. దాని లక్షణాలు ఇవి:- ఇతివృత్తం—ఉత్పాద్యము. నాయకుడు — రాజు; ఆంకములు నాలుగు; సంధులు-5, వృత్తి— కైశికి; రసము-శృంగారము, ప్రహసన+

నాటకముల సమ్మేళనముల వలన కలిగినది. నాయిక అంతఃపుర కన్య లేదా సంగీతశాలా కన్య.

దీనిని అనుసరించి—నేటి మన ఏకాంకికలను నాటికలనరాదు. అంటే కాక దశరూపకాలలోని (1) వ్యాయోగము (2) అంకము (3) ప్రహసనములు (4) భాణము (5) వీథి అనేవి ఏకాంకికలు. [ఒకే అంకము గలవి] కనుక ఒకే అంక పరిమితి గలిగి వుండటం అనే ఒక్క భేదం రూపకాల జాతి విభాగానికి కారణంగాదు.

ఈ వివాదానికి మనం దిగకుండానే, "నాటిక" అంటే ఏకాంకిక అని—మన వాడుకలో రూఢి అయిపోయింది గనక మనం గూడా నాటిక - ఏకాంకిక అనే పదాలను Synonyms గా వాడుకోవటం మంచిది.

నేడు మనం అలవాటు పడిన అర్థంలోనే, అదే టెక్నిక్‌తోనూ—ఎంతో ఆశ్చర్యపంతంగానూ-మనకు "భాసుని" రచనలలో కొన్ని ఉదాహరణలు కనిపిస్తాయి. ఇంగ్లీషు వారికి షేక్స్పియర్-రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం అంటే గర్వకారణమైతే—భారతీయులకు "భాసుని" రచనలు మరింత గర్వకారణం అనవచ్చు.

పూర్వం సంగతెట్లా వున్నా, తెలుగుదేశంలో మాత్రం - నాటికా రచన 1939 కి ముందుగానే ప్రారంభమయిందనవచ్చు. విశ్వనాథ కవిరాజుగారూ, రాజమన్నారు గారూ వంటి ప్రముఖులు ఈ పద్ధతికి వారసులై పెట్టారు. అవి చాలా ప్రజాదరణ పొందినవి గూడా. రంగస్థల సౌకర్యాలేవీ లేని ఆంధ్ర దేశంలో, అనేక నాటికా రచనలు మొదలు పెలువడినాయి. పాశ్చాత్య నాటికా రచనలలో వెలువడిన రకరకాల మార్గాలతోనూ (Different Schools Like-'Realism' 'Surrealism'; 'Symbolism'; Expressionism వగైరా) రచనలు సాగినవి. అయితే ప్రదర్శనావకాశాలు దేనికో లేక, అవి ఎక్కువభాగం- "చదువుకొని సంతోషించటానికి మాత్రమే" ఉపయోగపడినాయి. [చలం, విశ్వనాథ మొదలైన రచనలు. 1930-40 ప్రాంతం].

తర్వాత కాలంలో పరిషత్ పోటీలు ప్రారంభమయిన తర్వాత, ఈ ప్రక్రియకు పూర్తి ప్రాముఖ్యం రావటమే కాక—ప్రదర్శన సౌలభ్యమే ప్రధానంగా భావించనారంభించారు. పాశ్చాత్యదేశ పద్ధతులు—కొన్ని అనుసరణలు తప్పలేదు గాని—అవే ఇతర రచయితలకు మార్గదర్శకాలయినాయి కూడా.

ఆంధ్ర నాటక కళాపరిషత్ వారి పోటీలలో కొన్ని నిబంధనలను తగినట్లుగా, తెలుగు నాటకా రచన మొపట తన రూపుదిద్దుకున్నదని కూడా చెప్పక తప్పదు. అందులో ఒకటి ఒక గంట కాలపరిమితి. నిజానికి నాటిక ౬౦ నిమిషాల నుండి—రెండు గంటల వరకు కూడా వుండవచ్చు. ఈ కాల పరిమితి ఉత్సవ నిర్వహణకు ఉపయోగించేదేగాని, నాటికా లక్షణాన్ని నిర్ణయించేది కాదు. నిర్వాహకుల సౌకర్యం కోసం ఇది ఏర్పడింది. దీనిని జడ్జీలు పరిగణించాల్సినది కాదు. అయినా కొన్ని నాటికా ప్రదర్శనల కాలం గంట పరిమితికి మించి వుండటం వల్లా, ఆ కారణంగా బహుమతి నివ్వార పోవటం వల్లా - నాటిక ప్రదర్శన కాలం గంటకు ఏమాత్రం మించరాదన్న దురభిప్రాయం ఏర్పడింది.

పరిషత్ ప్రదర్శనా పోటీలకు పూర్వం - 'నాటిక' అంటే ఏదో చిన్న ప్రహసనం అన్నదే బహు జనాభిప్రాయం. విశ్వనాథ కవిరాజు, భమిడిపాటి కామేశ్వర రావుగార్ల రచనలు ఎక్కువ ప్రచారంలోనికి రావటమే దీనికి కారణం కావచ్చును. పరిషత్ ప్రదర్శనలవల్ల ఈ దురభిప్రాయం తొలగిపోయి-మంచి పరవడి ఏర్పడింది.

నటీమణుల కొరతవల్లా, నాటికకు చాలా సమయాలు ఎక్కువ ఖర్చు పెట్టలేకపోవటం వల్లా—'స్త్రీ పాత్రలులేని' నాటికా రచనలు ఎక్కువగా వచ్చాయి. ఇందులో పొరపాటేమీ లేదు. కథలో కావాల్సిన పాత్రలు మాత్రమే ప్రవేశ పెట్టటం అవసరం కూడా. ఈ సౌలభ్యం వల్ల పౌత్సాహికుల్లో పెరిగిన ఉత్సాహం అంతా ఇంతా అన్న మీయగాదు. ఈ ఒక్క సౌలభ్యం వుండటం వల్ల పండలాదిగా నటులు ఉబ్బసించి, రాణించారనటం కూడా సత్య దూరంగాదు.

రచనా కాల సంపత్సరాల వెనకటివై వుంటవచ్చు, అనేది మరొక నిబంధన. దీనివల్ల చాలా సమాజాల వారు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం 'నాటిక' రాయించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందే కొత్త రచయితలకు ప్రోత్సాహం లభించినదన్నమాట. నేను—నటుడ్ని—రచయిత కావటానికి ముఖ్య కారణం ఇదే—నిజానికి నాలాంటి వారే ఇంకెంతమందో—ఈ కారణం వల్లనే వెలుగులోనికి వచ్చారు - వస్తున్నారు. పరిషత్ పౌరాణిక నాటికలను ప్రోత్సహించక పోలేదు. "చేసిన పాపం"; "ఆ నాడు" మొదలైనవి పౌరాణికాలే. కాని దీన్నిసాకు చెప్పుకొని సాంఘిక ఇతివృత్తాల్నే చేపట్టటం వల్లనూ,

అనవసర విషయాలు చొప్పించకుండా — చిలపలూ పలపలూ అల్లకుండా వుంటే లీరాని నాటికలో. నాటకానికీ— నాటికకూ వున్న భేదాలలో ఇదే అతి ముఖ్యమైనది. నాటకంలో ప్రధానోద్దేశ్యానికి తోడ్పడుతూ, కథ ఎన్నో పలుపులు లీరుగుతూ కథ గమ్యానికి చేరుతుంది. నాటికలో నేరుగా— చెప్పడలుచుకున్న విషయాన్ని సిర్మొహమాటంగా-మొహం మీద విసిరికొట్టినట్లు వుంటుంది. కనకనే నాటిక మరింత శక్తివంతమైనది. ప్రేక్షకులకు అన్యా సక్తి కలగ నివ్వదు. ఆలోచనను ప్రధానోద్దేశ్యాన్నుంచి చెదరనివ్వదు.

ఒక్కమాటలో చెప్పాలంటే-

'నాటిక'-క్లుప్తీకరించిన 'నాటకం' గాదు.

నాటికలో గూడా "విషయం"— ప్రధానోద్దేశ్యం-ఏదైనా కావచ్చు. చరిత్ర కావచ్చు. సాంఘిక కథా సన్నివేశం కావచ్చు. మరేదైనా కావచ్చు. ప్రేక్షకులు ప్రదర్శన చూసి లేచి వెళ్ళేటప్పుడు, తామొక మంచి ప్రదర్శన— సమగ్రమైన దాన్ని-చూశామన్న "తృప్తి" కలగటం ముఖ్యం.

నాటికలో-"కథ"—"సన్నివేశాలూ" చక చక నడవాలి. ఏ ఒక్క విషయాన్ని—ఒక్కసారి కంటే ఎక్కువసార్లు నొక్కి చెప్పకూడదేమ. సంభాషణలు చిన్న చిన్నవిగా వుండాలి. పాత్రపోషణా చిత్రణలు కూడా-ఏ పాత్రం సందేహాస్పదంగా వుండగూడదు. ఒక్క [మొదటి] వాక్యంలోనే ఆ పాత్ర లీరు తెన్నులు అర్థమయిపోవటం మంచిది. ప్రతి పాత్రా— ఎంత చిన్నదైనా— పచ్చిగ కాసేపట్లోనే ప్రాముఖ్యం పహించాలి. ప్రేక్షకులు గుర్తు పెట్టుకోగలగేట్టుండాలి. అనవసరంగా ఏ పాత్రా రాగూడదమా—పోకూడదమ. ప్రదర్శనలో కదలికలు పటిపటిగా వుండాలి. మొత్తానలు ఆకర్షణీయంగా వుండాలి. నాటకంలో ఒక్కొక్క రంగంలో క్రమంగా రక్తి పెరిగి-అందిన రంగంలో పరాకాష్ఠాయికి చేరుకుంటూ పోతే, నాటికలో-ముందు రంగాలన్నింటి వివరాలు మొదటి కొంత నిముషాలలోనే ఇమిడి-కోలం పరావ సన్నివేశం ప్రధానంగానే మిగతా భాగం నడుస్తుంది.

నాటిక చిన్నది గనుక—స్పష్టంగా వుంటుంది గనుక, కొంచెం అస్పష్ట యంలో కేవలం హాస్యప్రధానం గనుక, మనం చిన్న చూపు చూడనక్కర లేదు. చిన్నదైనా పక్షాన్ని మనం శ్రద్ధగా కాపాడుకుంటూంగాని - పారవేసు కోంగదా?

సాహిత్యంలో కథానిక లాగా, 'ఏకాంకిక' నాటకాలలో తన సుస్థిరమైన స్థానం లాని సంపాదించుకుంది.

కొర్రపాటి గంగాధరరావు
సంపాదకుడు

ఈ నాటికలూ-నాటికా రచయితలనుగూర్చి-

చేసిన పాపం:—[1947]

కీ॥ శే॥ కొప్పరపు సుబ్బారావుగారి రచన. ప్రపర్యస ఆంధ్ర ప్రవా సాంస్కృమండలి, విజయవాడ. విశ్వవిఖ్యాత నటుడు శ్రీ ఎస్. టి. రామారావుగారు ఈ ప్రదర్శనతో పాల్గొని, ఉత్తమ నటులుగా ఎన్నికయినారు. పరిషత్తులో ఇది ప్రథమ ప్రదర్శనగా ఎన్నికయినది.

కీ॥ శే॥ సుబ్బారావుగారి జననం 29-4-1890. మరణం 3-5-1959. సుబ్బారావుగారికి చిన్ననాటి నుంచియు నాటక కళపై అభిమానము. పాశ్చాత్య దేశములను గూడా పర్యటించి, అక్కడి అభినాతన మార్గములను తెచ్చి, ఆంధ్రదేశమున గూడా వానిని ప్రవేశపెట్టినవారు. అనేక పౌరాణిక నాటకము లను, సాంఘిక నాటికలనును రచించినారు. ఆధునిక తెలుగు నాటకానికి పితే ఆమ్మలని చెప్పక తప్పదు.

తుపాను:—[1947]

15-1-1948 — 14 వ ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలో రచనపు బహుమతి నందిన నాటిక ఇది. రచయిత-శ్రీ పులుగుంట్ల రామకృష్ణయ్యగారు. జననం 5-5-1911. మంచి సంస్కృత పండితులు. నెల్లూరు వి.ఆర్. కాలేజి— హైస్కూలులో ఉపాధ్యాయులు. తుపాను నాటికను ప్రదర్శించిన నెల్లూరు ఆంధ్ర సభలో ప్రముఖ సభ్యులు.

తారాబలం:—[1949]

ఏలూరులో జరిగిన పరిషత్తులో ప్రదర్శనపరా, రచనపరా బహుమతి పొందిన నాటిక. ప్రదర్శన జాతీయ కళామందిర్, దాపల్లి. రచయిత శ్రీ పట్ల మూడి సీతారామారావుగారు. ఈ ప్రదర్శనతో నేనూ పాల్గొన్నాను.

శ్రీ పట్లమూడి సీతారామారావుగారి జననం కృష్ణాజిల్లా ఉయ్యూరు గ్రామంలో. దాపల్లి స్థిరనివాసం. ప్రముఖ న్యాయవాది. జాతీయ కళామందిర్ సంస్థ నెలకొల్పి, రచయితగానూ, నటుడుగానూ-ఆంధ్రదేశపు చక్కని సాంఘిక నాటకాల మీదను మరపురాని చిత్రములు వదిలి పోయినారు. చిన్నాది, పెద్దాది ఏరి నాటకాలలో రెండు ముఖ్య లక్షణాలు.

పౌరాణిక నటులు ఉత్సాహం చూపకపోవటం వల్లనూ ఆ విధమైన నాటక నాటి లు పోటీలకు ఎక్కువగా రాలేదు.

కనుక ఒక విధంగా — పరిషత్ నిబంధనలే, నేటి మన నాటిక స్వరూపాన్ని ఈ విధంగా తీర్చిదిద్దాయి—అనటం అతిశయోక్తి కాదు. ఈ కాల పరిమితి నాటికకు ఒక గంటా, నాటకానికి రెండు గంటలుగా పరిమితం చేయటం వల్ల చాలా వరకూ ఇప్పుడు వస్తున్న మన 'నాటకాలు' నిడివికి - నాటికలే - కథా వస్తువు దృష్ట్యా. దీనికి - ఈ రెండింటికీ - తేడా సామాన్య రచయితకూ—ప్రేక్షకులకూ తెలియక పోవటమే. ఇది ఒక్క తెలుగు నాటకా నాటికల విషయంలోనే కాదు; ప్రపంచంలో అన్ని భాషా ప్రాంతాలకు వర్తిస్తుంది.

ఏకాంకికల విశిష్టత

నాటక ప్రక్రియలోంచే నాటిక పుట్టినా — నాటిక తనకొక విశిష్ట ప్రక్రియగా ఈనాడు రూపొందింది. రచయితలూ, నటీ నటులు, దర్శకులూ, ఇతర కార్యకర్తలూ కూడా దీనిని గుర్తుంచుకోవాలి.

నాటికలో కాలపరిమితి తక్కువ. సుమారు 40-60 నిమిషాలలో - రచయిత-తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చెయ్యాలి. అందే నాటికా రచయిత-ఒక్క నిమిషంగాని, ఒక్క మాటగాని వృథా చేయగూడదు. అల్లా అన్నాంగదా అని, ఏదో ఒక చిన్ని సన్నివేశమో—చిన్నమైన సందేశమో- తీసుకుని- సరిపుచ్చుకోగూడదు. నాటిక ప్రధానోద్దేశ్యం ఎంత తీవ్రమైన సన్నివేశమైనా కావచ్చు. ఉదా :- "ప్రళయ", "ప్రాక్పశ్చిమ". ఈ నాటికలలో చాలా పెద్ద విషయాలే చర్చించబడ్డాయి. వాని రచయితలు ఆ పెద్ద విషయాన్ని తమ అవపులోనికి తెచ్చుకున్నారు. తమ ముఖ్యోద్దేశాన్ని ఒక చిన్ని వివర సంఘటనలోనికి తెచ్చుకున్నారు. ఒక సంపూర్ణ జీవితాన్ని నాటికగా ప్రదర్శించటం అసాధ్యమే. నిజానికి—నాటికలో పూర్ణ సన్నివేశం ఒక గంట కాలంలో జరిగితే—సుమారుగా అంతే కాలంలో నిజ జీవితంలోనూ, అదే సన్నివేశం జరగటానికి పట్టాలి.

నాటకంలో ఎన్నైనా రంగాలు ఉండవచ్చు. రంగం మారినప్పుడల్లా— తెర మారినప్పుడల్లా రక్తి భంగం జరుగుతుంది. ఈ రోజుల్లో "Lights off

and on"తో కూడా-ఈ రక్తి భంగం జరిగి లీరుతుంది. ఎక్కడో స్వల్ప కాల వ్యవధి సూచించటానికి తప్ప —తెర వాలటం గాని, Lights ఆరటంగాని జరగకూడదు. 'నా బాబు', 'కళ్ళు' రెండు రంగాల నాటికలయినా నాటికలుగానే పరిగణించబడినాయి. ఇది తప్పనిసరి అయినప్పుడు కూడా, తెరవేసి ఎంత తొందరగా తెర తీయగలిగితే అంత మంచిది. తెరవాలినప్పుడల్లా-రక్తి భంగం కథా క్రమ భంగం జరుగుతుంది. ప్రేక్షకులు అన్యాసక్తు లవుతారు. నాటక వాతావరణం మారిపోవాల్సి వస్తుంది. ఇవన్నీ జరగకుండా కాల వ్యవధి కావల్సి వస్తే—మరేదో సన్నివేశాన్ని కల్పించి—ప్రేక్షకుల బ్రద్ధా సక్తుల్ని నిలిపి వుంచటం మంచిది.

'నాటికల పోటీల'లోనే గాదు—ఎక్కడ ఎప్పుడైనా, నాటికలను మరి 2-3 ఇతర నాటికల ప్రదర్శనలో కలిపి ప్రదర్శిస్తారు. అంటే పెద్ద పెద్ద సెట్లు కట్టే రంగాలంకరణలకు కాల వ్యవధి చాలినంత వుండదు. ఇది కూడా రచయిత తన దృష్టిలో వుంచుకుని, కాలహరణ లేకుండా, రంగస్థల నిర్మాణం చేసుకునేట్లు-అతి సామాన్యపు 'సెట్' మీద జరగ గలిగే ఇతి వృత్తాన్నే తీసుకోవటం మంచిది.[ఉదాహరణకు బంగారు సంకెళ్ళు] సెట్స్‌గాని—ఇతర టెక్నిక్‌గాని — స్పాట్‌లైట్ పగ్గాలు గాని-ఇతివృత్తానికి రక్తికి అవసరమైనంతవరకే ఉపయోగించాలి—ఏ ప్రదర్శనలోనైనా, నాటికలో-దీనిని మరింత తేలికగా నిర్వహించవచ్చు. ఉదా:- వైప్పొస్టేషన్ చూపటానికి బదులు— "వైప్పొస్టేషన్" అన్న బోర్డుతో సరిపుచ్చవచ్చు. ప్రదర్శనలూ "వేలాడే తెరల" మీదే గాని, 'సెట్స్‌ను' Prohibit చేశారు-ఈ కాలహరణం జరగకుండానే.

నాటికల రచనలోనేగాదు—నాటక రచనలో కూడా కొందరు రచయితలీ మధ్య రాజకీయ సిద్ధాంతాల ప్రచారం చొప్పిస్తున్నారు. అసలు నాటక ప్రదర్శనే ఒక ప్రచార సాధనం— అది పౌరాణికమైనా సరే. కనక దీనిలో తప్పు పట్టటానికి ఏంలేదు. కాని ఆ ప్రచార భాగం ప్రదర్శనలో గల [Drama] నాటకీయతగం సన్నివేశాలను మింగివేయకూడదు. నాటికలో కూడా నాటకీయతే ప్రధానం.

నాటకంలో కూడా 'స్పష్టత' ముఖ్యమే. కాని నాటికలో ఇది మరీ ముఖ్యం. ఆ భాగం ఎంత చిన్నది అయినా సరే— నేకుగా— ఇతర

ప్రగతి:—[1950]

శ్రీ ఆచార్య ఆత్రేయగారి రచన ఇది. ప్రసిద్ధ సినీనటులు శ్రీ సి. నాగభూషణంగారు నటించగా, కాకినాడలో ప్రథమ బహుమతి నందుకున్నది.

శ్రీ ఆచార్య ఆత్రేయగారు సుప్రసిద్ధ సినిమా రచయితలు. అనేక నాటికా నాటక రచయితలు. స్వయంగా పర్యటకులు. వీరి నాటకాల్నీ స్వభావ వాదమునకు ప్రతినిధులై, ఆంధ్ర నాటక రంగంలోనే ఒక నూతన సంచలనమును లేవదీసినవి. వాస్తవిక జీవిత చిత్రణమే వీరి రచనలలో ముఖ్యంగా కానవస్తుంది. అనేకమైన ఇతర ప్రయోగములను చేసినవారిలో వీరు ఒకరు.

ఆదది:—[1950]

ప్రసిద్ధ సినీ రచయిత శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తిగారి రచన ఇది. ఇది కూడా రచనకు కాకినాడలోనే బహుమతి నందినది. దీనిలో సినీ నటులు శ్రీ చలంగారు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు నటించినట్లు జ్ఞాపకం.

ఎవరు దొంగ?:—[1951]

శ్రీ ఆచార్య ఆత్రేయగారి రచన. ప్రదర్శన ప్రభాకర నాట్య మండలి, గుడివాడ వారిది. తెనాలి పరిషత్‌లో ప్రథమ బహుమతి నందుకున్నది.

మనిషి చావకూడదు:—రచన శ్రీ ఎన్. ఆర్. నంది.

నా ఖాతా:—[1954]

డాక్టర్ కొత్రపాటి గంగాధరరావు రచన. విజయవాడ లలితకళాసమితి ప్రదర్శన. మచిలీపట్నం పరిషత్ ప్రదర్శనలలో ఉత్తమ రచనకు బహుమతి నందుకున్నది. కీ॥ శే॥ శ్రీ కె. వెంకటేశ్వరరావుగారికి నటనకు బహుమతి లభించింది. కీ॥ శే॥ శ్రీ వెంకటేశ్వరరావు అనేకసార్లు ఈ నాటకాన్ని ప్రదర్శించి, వారి ప్రథమ దశలో ఉత్తమ నటులుగా ప్రసిద్ధులయ్యారు.

బంగారు సంకెళ్ళు:—[1954]

మచిలీపట్నంలో జరిగే సంవత్సరమునకో రచనకు బహుమతి నందుకున్నది.

ప్రదర్శన కళాపరిషత్, బాపట్ల. గంగాధరరావుగారి జననం 10.5.1922.

దిష్టిబొమ్మలు:-

శ్రీ సి. వేణుగారి రచన. 1955 సంగమంతో హైదరాబాదులో జరిగిన పరిషత్ ప్రదర్శనలలో ప్రథమ బహుమతి సంపాదించుకున్నది.

ప్రార్థన:- [1955]

1955 లో రచనకు బహుమతి సంపాదించిన నాటిక. డాక్టర్ కొత్తపాటి గంగాధరరావుగారి రచన. కళాపని, దాపట్ల వారి ప్రదర్శన.

వెంకన్న కాపురం:- [1958] లేక [1959]

సుప్రసిద్ధ సినీనటులు కె. వి. ముదిగొండ లింగమూర్తిగారి రచన. మొదటగా వారిని నాటక రచనకు పురిగొల్పినది ఇది.

మనస్తత్వాలు:- (1958)

సుప్రసిద్ధ సినీరచయిత, బహునాటక గ్రంథకర్త శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారి రచన.— రచనకు బహుమతి సంపాదించుకున్నది.

దంతవేదాంతం:- [1959]

హైదరాబాదులో జరిగిన పరిషత్ పోటీలలో ప్రథమ ప్రదర్శనకూ, రచనకూ కూడా బహుమతి పొందిన నాటిక. శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారి రచన.

శ్రీ భమిడిపాటి రాధాకృష్ణగారి జననం 14-11-1931 రాజమహేంద్రవరంలో. కీ॥శే॥ శ్రీ భమిడిపాటి కామేశ్వరరావుగారి పుత్రులు. తండ్రి ఎంతటి ప్రఖ్యాత పురుషుడో, ఎంతటి ప్రతిభాపంతుడో రాధాకృష్ణగారున్నూ అంతటి ప్రతిభా ప్రఖ్యాతులను ఆర్జించారు.

చావకూడదు:-

రచన శ్రీ ఆచార్య ఆత్రేయ. గుడివాడ పరిషత్తులో ప్రదర్శనకు బహుమతి నందిన నాటిక. ఈ నాటికలో అన్నీ స్త్రీ పాత్రలే.

కుక్క పిల్ల దొరికింది:- [1961]

శ్రీ రావి కొండలరావుగారి రచన. తణుకులో జరిగిన పరిషత్తులో ఉత్తమ రచనకు బహుమతి నందినది.

చరమాంకం:- [1961] ముద్రణ కాలేదని తెలిసినది.

పుణ్యస్థలి:-

రచన శ్రీ ఎస్. ఆర్. నంది. 13-1-1962 తేదీన పరిషత్ ప్రదర్శనంలో (22 సెషన్) గుడివాడలో జరిగినపుడు, విద్వాన్ విశ్వం ఎస్సెస్సి యేషన్ వారు ప్రదర్శించగా, ఉత్తమ రచనకు బహుమతి నందినది.

సుల్తానీ:- [1962]

వేలూరి శివరామశాస్త్రిగారి రచన. గుడివాడలో జరిగిన పరిషత్‌లో ప్రథమ ప్రదర్శనకు బహుమతి నందినది. ప్రఖ్యాత నటులు పామర్తి సుబ్బారావు గారు ఇందులో నటించి, నాటికకు వన్నె తెచ్చారు. అచ్చయినట్లు లేదు.

వాన వెలిసింది:- [1963]

రచన శ్రీ ఎన్. ఆర్. నంది. జనవరి 1963 లో పరిషత్ ప్రదర్శనంలో (23 సెషన్) హైదరాబాదులో ఉత్తమ ప్రదర్శనకు బహుమతి పొందిన నాటిక.

చీకటి తెరలు:- [1963]

అదే పరిషత్‌లో రచనకు బహుమతి పొందిన నాటిక. శ్రీ గన్నిశెట్టి వెంకటేశ్వరరావుగారి రచన.

జ్వలితజ్వాల:- [1962]?

కే॥ శే॥ చింతపల్లి హనుమంతరావుగారి రచన. అనంతపురంలో జరిగిన పరిషత్‌లో బహుమతి నందినది.

శిరోమణి:-

అదే సంపత్సరము రచనకు బహుమతి నందిన నాటిక. రచయిత దివ్య ప్రభాకర్, విజయవాడ.

ఉలిపికట్టె:-

రచన:- శ్రీ ఆవుల శ్రీనివాసరావుగారు. 1965 లో పరిషత్ పోటీలకో ప్రదర్శనకు బహుమతి నందిన నాటిక.

కళ్ళు:- [1979]

ప్రఖ్యాత నాటికా నాటక సినీ రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావుగారి రచన. 8-9-1979 పరిషత్ పోటీలలో ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనమూ, రచనకూ, ఇతర ప్రత్యేక బహుమతులనూ పొందిన నాటిక. 1975 లో సాహిత్య అకాడమీ బహుమతి పొందిన నాటిక గూడా.

చేసిన పాపం

రచన :

కీ॥శే॥ కొప్పవరపు సుబ్బారావు

పాత్రలు

ఒక బౌద్ధ భిక్షువు

ఒక దేశ దిమ్మరి

రాజ కుమారుడు-నలందా పాలకుడు

మాయ-ఒక పూజారిణి

పర్యదేశం—నలందా శిథిలాలు

గమనిక—ఈ నాటికలో వచ్చే పాత్రల వేష ధారణం
అజంతా శిల్పాన్ని అనుకరించాలి.

ప్రదేశం—నలందా శిథిలాలు

నలందా శిథిలాల్లో ఒక పడిపోయిన గోడ. ఆ గోడలో సగం విరిగిన ఒక స్తంభం. బౌద్ధభిక్షువు ఆ పడిపోయిన గోడమీద కూర్చొని ఆ స్తంభశేషానికి వీపు ఆనించి ఏదో ధ్యానంలో వున్న సమయంలో మాయ నిశ్శబ్దంగా ప్రవేశించి మోకరించి అంజలి సిబద్ధయై తలవంచుకుంటుంది. దూరంగా పిల్లంగోవు గానం విని పిస్తూ వుంది. కొంతసేపటికి భిక్షువు కలవరంతో లేస్తాడు-వింటాడు-చూస్తాడు.

భిక్షు:- మళ్ళీ వచ్చావా నన్ను పీడించటానికి?—ముందు ఆ గానం ఆపించు.

మాయ:- (గానం వినిపిస్తున్న వైపుకు చేతితో సైగ చేస్తుంది. గానం ఆగి పోతుంది.) ఇందాక చాలా విసుగుతో ఉన్నావు. ఈసారైనా ప్రసన్నుడవౌతావేమో అని ఆశతో వచ్చాను. తథాగతా!

భిక్షు:- తథాగతుడూ లేడు,-యథాగతుడూ లేడు' పో!

మాయ:- నీవు భగవంతుడవనీ, మా తొమ్మిదో అవతారమైన బుద్ధుడవనీ—

భిక్షు:- ఆగు!—నేను బుద్ధుణ్ణా? అదిచాలక భగవంతుణ్ణా! ఎవరు చెప్పారు నీకు?

మాయ:- లోకమంతా చెబుతూవుంది.

భిక్షు:- చెప్పుకోనియ్. నేను బుద్ధుణ్ణికాదు-భగవంతుణ్ణికాదు. దారినిపొయ్యే బికారుల్లో వొకణ్ణి. తెలిసిందా? ఇకపో!

మాయ:- సిద్ధార్థా! భగవంతుడు తన నిజ వృత్తాంతాన్ని నిజమైన భక్తులకు తప్ప ఇతరులకు చెప్పడనీ—

భిక్షు:- ఆగు! నేనున్న ఈ ప్రదేశం పేరు ఏమిటి?

మాయ:- ఇది వొకప్పుడు విశ్వవిఖ్యాతమైన నలందా బౌద్ధవిహారం. ఇప్పుడు దారుణ శిథిలావస్థలో వుంది. కాని సర్వజ్ఞా! అగతా నాగత వేదివైన నీవు ఏమీ తెలియనట్లు నన్ను ప్రశ్నలు వేస్తున్నావు. ఇది కూడా భగవంతుడి లీలావినోదాల్లో వొకటా?!

భిక్షు:- ఈ నలందా శిథిలాలు ఎందాకా విస్తరించివున్నయ్యో చెప్పగలవా?

మాయ:- కొంచెం పెచ్చు తగ్గుగా నాలుగు కోసులందాకా.

భిక్షు:- (లేచి జోలిసర్దుకుంటూ) అయితే, ఈ గాఢాంధకారం కూడా నాలుగు కోసులదాకా విస్తరించిఉంటుంది. సాయంత్రానికైనా దాటగలిగితే ధన్యుణ్ణి—

మాయ:- సుగతా! నన్ను తప్పించుకుపోవాలనుకుంటున్నావు. నేచేసిన నేరం ఏమిటి?

భిక్షు:- నేరం? యువతీ! 'తథాగతా' అనీ, 'సిద్ధార్థా' అనీ సంబోధించి ఎర్రగా కాచిన సిసాన్ని నా చెవుల్లో చుక్క చుక్కగా నిషేపించడానికి నే చేసిన నేరం ఏమిటో చెప్తావా ?

మాయ:- నన్ను పరీక్ష చేస్తున్నావా! పోసి. భగవాన్! నేను వచ్చిన పని సఫలంచేసి నన్ను పంపివెయ్.

భిక్షు:- సరే. ఏమిటాపని? (మళ్ళీ కూర్చుంటాడు)

మాయ:- (తల వంచుకుని) సుగతా ! నేను ఒక దారుణ పాపం చేశాను.

భిక్షు:- (ఆవలిస్తూ) నీవంటి పడుచులకు అది అసామాన్య విషయం కాదు.

మాయ:- చేసిన పాపం చెప్పుకుని పాప పరిహారం పొందాలని వచ్చాను.

భిక్షు:- ఎక్కడ నేర్చుకున్నావు ఈ సితిరాజం ?

మాయ:- ''యద్రాత్రౌత్ కురుతే పాపమ్, తద్రాత్రౌత్ ప్రతిముచ్యతే'' అంటూ దిన దినం నా భర్తగారు సంధ్య వారుస్తుండగా వింటూ వుంటాను.

భిక్షు:- ఓహో? నీకు ఒక భర్త ఉన్నాడా ? అందువల్లనే పాపం చేసి వుంటావు.

మాయ:- నేను మనస్ఫూర్తిగా చేసిన పాపం కాదది. ఆ పరపురుషుని ఉదంతం మొదట నాకు ఏమీ తెలియదు. ఆయన —

భిక్షు:- వర్ణనలు వద్దు. సంగ్రహంగా చెప్పు.

మాయ:- ఆ పురుషుడు ఒక మహోత్సాత్ర తేజస్వి. సుకుమార సుందరుడు. నేనో ఓంటరిదాన్ని. సమయమా రాకాచంద్ర చంద్రికా పులకితం. ప్రదేశమా మనోహర సురభినిశ్వాసితమైన వకుళోద్యానం. అతడు మెల్లగా నా వద్ద చేరి చెవిలో "మాయా ! జగదేక సుందరీ! ప్రియే!"—

భిక్షు:- ఆగు! ఆ కలుషభాషను మా వద్ద ఏకరు పెట్టవద్దు.

మాయ:- క్షమించు తథాగతా!—

భిక్షు:- కాబట్టి నీ అనంతర కథా భాగం సులభ గ్రాహ్యం.

మాయ:- ఔను సర్వజ్ఞా!

భిక్షు:- సరే. ఇక పో.

మాయ:- ఆ పాపంనుంచి నాకు విమోచనం అనుగ్రహించావా?

భిక్షు:- ఆ విషయం నాకు తెలియదు.

మాయ:- ఆ పాపానికి నేను పొందిన పశ్చాత్తాపం ఎంతో నా హృదయ సాక్షికి తెలుసు. సర్వ సాక్షివైన నీకు తెలుసు.

భిక్షు:- నాకు ఏమీ తెలియదు. పో యిక!

మాయ:- తథాగతా! నీ ఉపదేశ సుధా రసాన్ని కొంచెమైనా చెవులార తాగ కుండా—

భిక్షు:- ఆపు నీ కవితా ధార! పో! పోయి, పాపం అని నీకు తోచిన కార్యాన్ని ఇక మీద చెయ్యకు.

మాయ:- సుభాషితం, సుభాషితం.

(వయ్యారంగా లేస్తుంది. మోహినీయ వున్న ఒక పట్టుఉల్లారు సంచిని తన కంచుకంలోనుంచి బయటికి తీస్తూ)

మాయ:- తథాగతా! ఏ కానుక నీకు తృప్తి పుటిస్తుందో నాకు తెలియదు. అయినా—

భిక్షు:- కానుక!—లంచానికి ఎంత చక్కటి పేరు!

మాయ:- సర్వజ్ఞా! భగవంతుడికి యధాశక్తి కాన్కలివ్వడం భక్తుల ధర్మం కాదా?

భిక్షు:- నీ ధర్మగీతాలాపం చాలించి యిక పో!

మాయ:- తధాగతా! నీకు తెలియని విషయాలు ఉండవు. పూరీ క్షేత్రంలో జగన్నాధస్వామికి ఏటేటా భక్తులు చెల్లించే మొక్కుబళ్ళు మూడు లక్షల వరహాలకు తక్కువఉండవు. అతడో సామాన్య దైవం. నీవో తొమ్మిదో అవతారం. కాబట్టి నేను చెల్లించుకునేకానుక చాలా స్వల్పం అని తెలిసికూడా—

భిక్షు:- ఆపు నీ వాచాలత. నీ క్షుద్రకాంచనంతో నాకు పని లేదు.

మాయ:- (ఉబ్బితే పుచ్చుకుంటాడేమో !) సిద్ధార్థా ! ఈ ధనం నీ చేతుల్లో చాలా సద్వినియోగం పొందగలదని నా విశ్వాసం. ఏ విహారమో స్తూపమో, తటాకమో, సత్రమో-

భిక్షు:- యువతీ ! నీ పొగడ్తల కుబ్బి నీ విచ్చే లంచాలు తీసుకునే దేవుళ్ళు చాలామంది ఉన్నట్లున్నారు. వారివద్దకేపోయి నీ అభీష్టం నెరవేర్చుకో. పో ! నన్నుమాత్రం బాధించకు.

మాయ:- భగవాన్ ! మీకు నావల్ల అంత బాధగా వుందా ?

భిక్షు :- బాధ ? 'తధాగతా' 'సిద్ధార్థా' 'సర్వజ్ఞా' అను నీ భట్టు పొగడ్తలతో నా చెవుల్నీ, అత్తరు గమగమల వెదజల్లుతూన్న నీ పైట చెరగుతో నా ఘ్రాణాన్ని, బంగారు నాణాల మిలమిలలతో ప్రతిఫలిస్తున్న ఆ సంచితో నా కన్నుల్నీ దారుణదారుణంగా హింసిస్తూ బాధ యేమని ఇంకా అడుగుతున్నావా ? నారీ ! పో ! పో ! నీ జగన్నాధుడి దగ్గరకు పో ! లేక మరే నాధుడి వద్దకైనా పో !

మాయ:- (ఘాటుగా తగిలినయ్ అయినా భక్తులకు ఇవో లెక్కా ?) సర్వజ్ఞా; జగన్నాధ క్షేత్రం ఇక్కడికి చాలా దూరం. అందుచేత వ్యయ మధిక-ప్రయాస మెండు.

భిక్షు:- కాబట్టే గనుకు పట్టుకున్నావు

మాయ:- కాదు, నీ మహిమను ఎందరో చెప్పుకోగా వినివిని నీ దర్శనానికై పరితపించి వచ్చాను. (చిరునవ్వు తొలకరిస్తూన్న పెదవులతో) భగవాన్ ! అదే ఆ వకుళోద్యానంలో ఆ కాళీగుడిని ఆనివున్న సౌధమే నాది. నా పేరు మాయాదేవి. నా భర్త ఆ గుడి పూజారి. వస్తు సంభార సంగ్రహణార్థం ఆయన ప్రతిరోజూ పాటలీపుత్రం వెడుతూ వుంటాడు. ఆయన లేని సమయంలో నేను తమ సన్నిధికి వస్తూ పోతూ (అంటూ భిక్షు భుజంమీద చనువుగా వేలు పెడుతుంది).

భిక్షు:- (విసిరి కొట్టి) పో శాకినీ ! పో డాకినీ ! పోతావా, లేక నేనే పోవలెనా ? (చివాలున లేస్తాడు)

మాయ:- సరే. భగవాన్ ! మీకు మనశ్శాంతి కుదిరినపుడే మళ్ళీ దర్శనం చేసుకుంటా. సెలవు. (అంటూ భిక్షువుకు తెలియకుండా మొహారీల సంచిని గోదమూల జారవిడిచి వయ్యారంగా నమస్కారం చేసి కులుకునడకలతో వెళ్ళిపోతుంది.)

భిక్షు:- (కూర్చుంటూ) ఈ భక్తులకు మెదడు ఊసర క్షేత్రం-చర్మం మందం. అబ్బబ్బ ! ఒక్క స్త్రీతో ఇంత బాధపడ్డానే ? ఓ జగన్నాధా! నీవు పాషాణివి కాబట్టి బ్రతికిపోయావు. లేకపోతే ఈ భక్త జనం నిన్ను ఏకాహతిగా భక్షించి వుండేది. (జోలి అందుకుని, ఒక అరిటిపండు తీసి తింటూ వుంటాడు.)

(అపుడు కూనరాగం తీసుకుంటూ దేవదిమ్మరి ప్రవేశం.)

దిమ్మ:- (భిక్షువును ఆశ్చర్యంగా చూసి) ఏమిటీ వేషధారణం ? భాయీ ! ఎవరండీ మనం ? నమస్తే ! నమస్తే !

భిక్షు:- నమస్తే !

దిమ్మ:- (స్నేహం కలిపేస్తున్నాడు) చూడు భాయీ! ఇవాళ అంతగా యెండ లేదు; వడగాడ్పూలేదు. మంచి హాయిగా వుంది సుమా!

భిక్షు:- ఏ ప్రాంతం నుంచి నీ రాక ?

దిమ్మ:- నేనా? ప్రపంచంలోకల్లా బ్రహ్మాండమైన పట్నం యేదో, అక్కణ్ణుంచి వస్తున్నా. (ఛాతీ విరుస్తూ) దాని పేరు కాశీ - మహాకాశీ - వారణాసీ-మణికర్ణిక - హరిశ్చంద్ర ఘాట్ !

భిక్షు:- ఓహో ! యాత్రికుడవా నీవు !

దిమ్మ:- (చక్కటి ఊహే!) ఔను. ఔను. యాత్రికుణ్ణి. మరి-గురూజీ! మన జోలిలో ఏమైనా తినుబండారాలున్నయ్యా ?

భిక్షు:- (జోలిలో చెయి పెట్టి) అరిటి పళ్లున్నయ్. (రెండు పళ్ళు యిస్తాడు.)

దిమ్మ:- పాపం - నీకో ?

భిక్షు:- ఇంకా ఉన్నయ్.

దిమ్మ:- అన్నదాతా సుఖీభవ ! (వొలిచి ఆత్రంతో తింటాడు)

భిక్షు:- నీది దిగులు లేని బ్రతుకు.

దిమ్మ:- నీకు దిగుళ్లున్నయ్యా యేమిటి భాయీ ?

భిక్షు:- (మౌనం)

దిమ్మ:- పోష్! ఎటువంటి చల్లటి రోజు ఇవ్వాళ్ల ! ఎంత మనోహరంగా వుంది ?

భిక్షు:- అల్లదిగో !- ఆ గుడి వంక పోయే దారి మీద దృష్టి సారించి చూడు ! నా శోక హేతు వొకటి కాళ్లతో నడచి పోతూ వుంది.

దిమ్మ:- (అటుచూస్తూ) ఎవరు? - ఓహో ! స్త్రీ అనుకుంటా! కాదు-లొట్టి పిట్టేమో ! - కాదు. కాదు. స్త్రీయే.

భిక్షు:- అందుకనే నా బాధ.

దిమ్మ:- (ఇందులో ఏదో కథ ఉందన్న మాట! కన్ను గీటుతూ) అయితే-భాయీ! మనకీ ఆ స్త్రీకి ఏమిటి సంబంధం ? ఆత్మా పరమాత్మా సంబంధమా ? హహ్హహ్హా !

భిక్షు:- సోదరా ! నెలత పల్లి సుఖాన్ని అపేక్షించడం, నీళ్లులేని బావిలో చేద వెయ్యడం సుమా !

దిమ్మ:- హి హి హి ! వేదాంతం ! హా హి హి ! (నవ్వుతూ వుండగా గోడ మూల పడి వున్న సంచి కంట పడుతుంది) ఐలే ! ఐలే ! భాయీ ! ఇవ్వాళ మన రొట్టె నిజంగా నేతిలో పడ్డది. జై ! గంగామాయికీ జై ! (ఆ సంచిని అందుకుంటాడు)

భిక్షు:- ఆ యువతి ఎంత గసగరి ! ఆ పాపసంచితాన్ని ఇక్కడ దూర విడిచి పోయిందా !

దిమ్మ:- ఓహో ! ఆ మహానుభావురాలిదా యీ సంచి ? వాసన గుమ గుమ. ఆహాహా ! ఎంత సుఖంగా వుంది ఈ పరిమళం?

భిక్షు:- భ్రష్టుడా ! నీ ఆత్మ నైర్మల్యాన్ని కాపాడుకోవాలంటే దాన్ని దూరంగా పారవెయ్.

దిమ్మ:- ఓహో ! నేను పారేస్తే నువ్వు తీసుకోవచ్చుననా ఉపాయం ?

భిక్షు:- బుద్ధిహీనుడా ! ఆ సొత్తు నీదీ కాదు - నాదీ కాదు - ఆ యువతిది.

దిమ్మ:- కొంపతీసి ఆమె మళ్ళీవస్తే దీన్ని ఇచ్చేయ్యమనవుకదా ?

భిక్షు:- మరి? దానిని నా వద్ద నుంచుకొని నా అంతరాత్మను శాశ్వతంగా కలుషం చేసుకో మంటావా ?

దిమ్మ:- వద్దులే. నీ బదులు ఆ అంతరాత్మ బాధంతా నేనే పడతా ! (సంచి విప్పి చూస్తాడు. బంగారు నాణ్యాలు కనిపిస్తయ్. కదిలిస్తాడు. శ్రవణానందం. పళ్ళికిలిస్తూ భిక్షువుకేసి చూస్తాడు.)

భిక్షు:- (చాలా రోతతో) ఛీ ! భ్రష్టా ! పో ! దూరంగా పో ! పుణ్య క్షేత్ర సమీక్షా కుతూహలుడ నగు యాత్రికుడ నంటివే ! అబద్ధం ! యాత్రి కుడవు కావు. గజ దొంగవు. కలి బిడ్డవు. కాంచన దాసుడవు.

దిమ్మ:- ఏమిటి ఛాందసం ?

భిక్షు:- పో! నా సన్నిధినుంచి పో ! ఊఁ !

దిమ్మ:- ఆదికాదు భాయీ! అంత కంగారు పడతావెందుకూ అంట ? చూడు ! మన స్నేహం ఇప్పుడిప్పుడే గంగాయమునల్లాగా కలిసిపోతూ వుంది. స్నేహధర్మమంటే ఎంత పవిత్రం ! ఎంత అమూల్యం !—

భిక్షు:- (చివాలున లేచి) పాపీ! నీవు పోకపోతే నేనే పోవకతప్పదు. అంతరాత్మ అనేది నీకువుంటే, దానికి నీవే సమాధానం చెప్పుకో ! (గోడ దిగి అదే పాటున నిష్క్రమణం.)

దిమ్మ:- (భిక్షువుకేసి చూస్తూ పకపక నవ్వుకుంటాడు. అనంతరం-భిక్షువు కూర్చున్నచోటు పీఠికి దృష్టి మరలుతుంది.) కూర్చోడానికి మొండి గోడ, ఆనుకోడానికి స్తంభం. భలే! ఇదీ ఒక కొత్త అనుభవమే! కాని, కూర్చొని చూద్దాం...(ఎక్కుతాడు. సరిగ్గా ఆ భిక్షువు కూర్చున్న చోటులో అతడిలాగే తిష్ఠవేస్తాడు. చేతిలోని మొహారీల సంచిని గబగబా మళ్ళీ కదిలిస్తాడు.) ఎంత మధురంగా వుంది ఆ నాదం! (ముసి ముసి నవ్వులు నవ్వుతూ) పిచ్చుకలండీ! బంగారు పిచ్చుకలు! (ఒక్కొక్క పిచ్చుకనే గూటినుండి లాగుతూ) ఒకటి-రెండు - మూడు - నాలుగు (సంచి దులుపుతాడు). నాలుగేనా?! కానియ్! తృప్తి కంటే పరమరహస్యం లేదని శాస్త్రకారుడు చెప్పాడు (ఆ నాలుగు టేబులో వేసుకున్నాడు), బ్రహ్మానందం కాని, ఇప్పుడు మనకు చచ్చేటంత దాహం అవుతున్నది. ఏమిటుపాయం? .....బలే! ఆ భిక్షువు తన జోలి సొరకాయబుర్రా ఇక్కడే దిగ బెట్టి వెళ్ళాడు. ఇంకేం (దిగి బుర్రను అందుకుంటాడు. కదిపి చూస్తాడు. లొటలొట. ఆనందం. బుర్రయెత్తి నోట్లోకి ధారను పంపుతాడు. తృప్తి. ఇక జోలిని పరామర్శిస్తాడు) బైరాగుల జోలిలో గంజాయి చిలుముగాక మరేముంటుంది? అయినా చూద్దాం. (గోచీ వస్తుంది.) ఛీ ఛీ! (పారేస్తాడు. ఈసారి తాటాకుల గ్రంధం వస్తుంది.) ఓహో! ఇదేదో వేదాంత సరుకు కాబోలు? (సంచిలో మరేమీ కనబడవు.) కానీ పెద్దమనిషి లాగా కాసేపు గ్రంథావలోకనం చేద్దాం. (సరిగ్గా ఆ భిక్షువు స్థానంలో అతడిలాగే కూర్చొని గ్రంథావలోకనం చేస్తూ వుంటాడు.)

(కొంతసేపటికి రాజకుమారుడు నిశ్శబ్దంగా ప్రవేశం. ఆరడుగుల పొడవు-ఆపాదమస్తకం మేలిపట్టు ముసుగు-ముఖం మాత్రమే కని పిస్తున్నది - శాత్రతేజస్సు. దిమ్మరి అతణ్ణి చూడలేదు. ఎందుకంటే, తన వెనుకనుండి అతడి ప్రవేశం. ఆ రాజకుమారుడు దిమ్మరి వెనకనే నిలబడి అతడి పీపును తన భక్తి పీఠికాలతో అభిషేకిస్తూ)

రాజ:- వం—దే!

దిమ్మ:- (ఉలికిపడి) ఎవరు ?

రాజ:- (నమస్కరిస్తూ) తమ యేకాగ్రతకు భంగ మొనర్చితిని కాబోలా భగవాన్ !

దిమ్మ:- (భగవాన్ ఏమిటి) నా యేకాగ్రతకా ? భంగమా ? ఓష్ ! ఇంత మాత్రానికేనా ? పిడుగులు పడితే అనుకోవలసినమాట అది.

రాజ:- మరి - ఈ దీనుని సొద నొక్కింత యాలింతురా ?

దిమ్మ:- సొద ! పోష్ ! మగపురుషుడికి సొద యేమిటి ?

రాజ:- భగవాన్! నీ సంభాషణలు నీ ప్రశ్నలు నీ లీలలు మిగుల దురవగాహము లని పెక్కురు చెప్పగా వింటిని.

దిమ్మ:- (ఆ భిక్షువే తానని ఈతడు భ్రమ పడుతున్నట్లు గ్రహించాడు. ఐలే పుట్టం ! కానీ-మళ్ళీ లభిస్తుందేమో పిచ్చుకల వేట) అయితే - నన్ను గూర్చి ప్రజలంతా యేమనుకుంటున్నారు ?

రాజ:- సర్వజ్ఞా ! నీ వెరుంగని విషయము లుండునా ? ఈ కలిమానవులను తరింపజేయుటకై ఈ నలందాశిథిలములలో ఈ బికారి వేషమున ఆ బుద్ధపరమాత్ముడే యవతరించెనని లోకమెల్ల ఏకగ్రీవముగ వాకొను చున్నది.

దిమ్మ:- బలే ! బలే ! మీ మానవులు ఇంత కుళాగ్రబుద్ధులా ?

రాజ:- భగవాన్! చివికి చినిగిపోయిన నీ చేలము, దానిపై దట్టముగ నంటు కొని యున్న దేళ దేళముల మార్గధూళి, నీవు సిద్ధార్థుడవని చెప్పక చెప్పుచున్నవి.

దిమ్మ:- అబ్బెబ్బే ! అంత వికారంగా వుందా మనవాలకం !

రాజ:- తథాగతా ! భక్తులను కఠినపరీక్ష సేయకుండ, నీవు సుప్రసన్నుడవు కావని లోక మెరుంగును. పెక్కు తెరంగుల నన్నుకూడ పరీక్ష సేయుదువని యెరింగియే వచ్చితిని.

దిమ్మ:- కాని, (దగ్గుతూ) నా పరీక్షకు నీవు పూర్తిగా నిలబడ్డావు సుమా !

రాజు:- సుగతా ! యుక్తాయుక్త వివేచన నాకు వెన్నతో బెట్టిన సుగుణము. నన్ను భ్రమింపజేయుటకు ఎంద రెందరో నీవలెనే యత్నించి విఫలు లైరి. భగవాన్ ! వేయి మాటలేల ? నిన్ను చూచిన నా తొలి చూపు నందే నీవు సర్వార్థసిద్ధుడవని నూటిగా గ్రహించితిని.

దిమ్మ:- (పొంగివస్తున్న నవ్వును దబాయించుకుంటూ) అంత సులభంగా గ్రహించావా ? అయితే, నాపీపులో కూడా ఏదో మహత్తు ఉందన్న మాట. దాన్నేగా నీవు మొదట చూసింది ?

రాజు:- మరల నన్ను పరిశోధించుచున్నావా ? తథాగతా ! పీపైన నేమి ? ముఖమైననేమి ? వస్తుతత్త్వపరిజ్ఞానమునకు వస్తువు నామూలాగ్రముగ బరిశీలింపవలెనా ? అందలి ఒక్క యణువును బరీక్షించిన జాలదా ! భగవాన్ ! నేను వచ్చిన పనిని గూర్చి ఇక విన్నవించుకొందును. ఆజ్ఞయా ?

దిమ్మ:- ఓ. కానియ్ !

రాజు:- నేను సామాన్య మానవుడను కాను.

దిమ్మ:- నీది గొప్ప విగ్రహం. (కొద్ది బుద్ధి !)

రాజు:- ధన్యోస్మి. నేను క్షత్రియాగ్రేసరుడను. ఈ నలందా ప్రజలెల్లరు నా కఠోర శాసనమునకు బద్ధులు. నే జేసిన పాపమును సామాన్య మానవుంతో జెప్పుకొనుట అగౌరవకరమని నీతో చెప్పుకొనుటకై వచ్చితిని.

దిమ్మ:- (బాగా బోధపడలేదు) అయితే వుండు - మొదటి సంగతి, నువ్వో పాపం చేశానంటున్నావు. రెండో సంగతి, ఆ పాపం చెప్పుకోడానికి వచ్చానంటున్నావు. అంతేకదూ ?

రాజు:- చిత్తము.

దిమ్మ:- మంచిది. అంతవరకూ అర్థమైంది. మరి- నువు చేసిన పాపాన్ని ఎందుకు చెప్పదలచుకున్నావ్ ? అంత ప్రమాదం ఏమొచ్చింది ?

రాజు:- మరల పరీక్షయా భగవాన్ ! చేసిన పాపము జెప్పుకొన్నచో బరిహార మగునని కదా పెద్దల సూక్తి ? అందువలన నాపంటి

అసామాన్య వ్యక్తి నీవంది యుత్తమోత్తమునితో జెప్పుకొనుదే సమంజసమని నిశ్చయించితిని.

దిమ్మ:- (అయితే, తాను కూడా వ్యాకరణయుక్తంగా మాటలాడుట సమంజసం. భగీరథ యత్నంతో) సరియ, సరియ. నా బిడ్డా! నీ పాపమును మాకు దప్ప కెరింగించుకొని రంగత్తుంగ తరంగ శృంగ భంగుడవు గమ్ము. (ఏమైనాసరే అని సమాసాన్ని వదిలేశాడు.)

రాజు:- భగవాన్! మరల బరీక్షయా? నీ లీల యెంతో నీ వాక్కును అంతియ. అగాధము! అచింత్యము! (నమస్కారము చేస్తాడు.)

దిమ్మ:- (నవ్వును ఆపుకోడానికి దగ్గు తెచ్చుకుంటున్నాడు.)

రాజు:- నా పాపమును గూర్చి ఇక మొర వెట్టుకొందునా?

దిమ్మ:- అవశ్యము బిడ్డా! అవశ్యము.

రాజు:- మీ పవిత్రచరణ పద్మముల ముందు మోకరింతునా?

దిమ్మ:- ఓ.

(రాజకుమారుడు మోకరిస్తాడు. దిమ్మరికి నవ్వు ఆగేటట్టు లేదు. మరి నవ్వితే కథ అంతం కాబట్టి, కప్పి పుచ్చడానికి చివాలున లేచి ఆ మొండిగోడమీద నిలుచుంటాడు.)

రాజు:- తథాగతా! నే జేసిన ఘోర పాతకము నిక నాలింపుము.

దిమ్మ:- ఆలించుచున్నాను. పుత్రా! ఆలించుచున్నాను.

రాజు:- నిన్న రాత్రి- ఇచటికి సమీపమం దున్న ఆ కాళీ దేవ్యాలయములో- సర్వజ్ఞా! నీపు చూచియే యుందువు-

దిమ్మ:- నేనా. అబ్బే! కాళీగుడికి నే నెప్పు డొచ్చాను?

రాజు:- నివు దివ్యదృష్టి బెట్టుకొనియుంటివి.

దిమ్మ:- (ఔను సుమీ! ఎంత పొరపాటు!) ఔను. ఔను. కాని-మరి-బిడ్డా! మానవుల పాపకృత్యముల నరయుటకై మా దివ్యదృష్టిని ఉపయోగించం సుమా!

రాజ:- క్షమించుడు. క్షమించుడు. అజ్ఞానమున నట్లంటిని.

దిమ్మ:- ఇహ కానియ్ నీకథ. మాకు సమాధి వేళ అయింది. (భిక్షువు మళ్ళీ వస్తాడేమో అని అసలు దిగులు)

రాజు:- సర్వజ్ఞా ! నిన్నరాత్రి - ఆ కాళీ దేవ్యాలయములో ఆ మనోహర వకుళోద్యానములో, ఆ మంజు మంజుల కుసుమ గంధ గంధిల వాతావరణములో, ఆ రాకాచంద్ర చంద్రికా పులకిత విభావరిలో, నేను-కాళీదర్శనార్థమై పోయిన నేను - కించిన్మధుపానమత్త చిత్తావస్థయందున్న నేను-ఒక యువతిని, పూజారిణిని, నవనవోన్మేష యౌవన ప్రాదుర్భావను, నా యున్మత్త నేత్రములతో జూచి యెదలు పులకించి-సర్వజ్ఞా! సర్వజ్ఞా! అనంతర కథాభాగమును జెప్పుటకు నోరు వెనుదీయుచున్నది.

దిమ్మ:- ఇంత చాటభారతం వినడానికి నా చెవులుకూడా తపస్సపడుతున్నయ్.

రాజ:- ఆ యువతి పేరు మీవద్ద దాచుటేల? సర్వజ్ఞా! ఆమె ఆ గుడిపూజారి భార్య. పేరు మాయ-మాయాదేవి.

(అంటూ ఉండగానే మాయ ప్రవేశం.)

మాయ:- రాజకుమారా! ఇక్కడికి వచ్చి ఇదా మీరు చేస్తున్న పని?

రాజ:- మాయా? చేసిన పాపము చెప్పవలదా?

మాయ:- పీడితోనా?! ఎవడి వాలం లేని వానరం?

రాజ:- (లేచి మాయను కొంచెం దూరంగా తీసుకొనిపోయి చెవిలో) ప్రియా! నీ పేరు బయలు పెట్టలేదు సుమా!

మాయ:- అబద్ధం. నా చెవులతో విన్నాను.

రాజ:- అనగా-మరి-అంటే-అది-నీ పేరుకాదు. మరొక మాయాదేవి పేరు.

మాయ:- (కోపం. ప్రణయం.) నాపంటి మాయ మరొక రున్నారా మీకు? పురుష లెంత వంచకులు ! ఈ సంగతి నాకు మొదటనే ఎందుకు చెప్పలేదు?

రాజు:- కాదు-మరి- మాయా!-మాటవరుసకు అట్లంటిని. క్షమించు. చూడు. ఈయన మహాత్ముడు. అగాధలీలా సముద్రుడు.

మాయ:- వీడా! వీడు! హాస్యాస్పదం. ఎవడో నిర్భాగ్యవేషధారి.

దిమ్మ:- నారీ! ఆ భక్తుని ధర్మాచరణానికి ఆలా ఆటంకం కలిగించ వచ్చునా?

మాయ:- నోరు ముయ్.

రాజ:- ఎంత మాటందివి? (దిమ్మరితో) భగవాన్ ! క్షమించు. మాయా ! భగవన్నింద నరక హేతువు సుమా !

మాయ:- ఇంత మౌధ్యమా! రాజకుమారా! వీడెవ్వడో మూటల దొంగ.
(పై సంభాషణ జరుగుతున్న సందర్భంలో ఇక కాలికిబుద్ధి చెప్పటం సమంజసమని నిశ్చయించుకొని దిమ్మరి మొండిగోడనుండి మెల్లన దిగి చల్లగా పారిపోతున్న సమయంలో)—

రాజ:- (అతడికి అర్ధంతగిలి మోకరించి) భగవాన్! నా పాపము పరిహారమైనదా!

దిమ్మ:- అయింది. అయింది. ఇక నేను పోవాలి, పాపం! ఒక నిరుపేద-బహుకుటుంబీకుడు - నా సాయం అర్థించి నాకోసం కనిపెట్టుకొని వున్నాడు. ఆ సంగతే మరిచిపోయా. ఇక తొందరగా పోవాలి.

మాయ:- పో! వంచకా! పో!

రాజ:- మాయా! ఏమి నీ ధూర్తత్వము. భగవాన్! క్షమించు. నాయొసంగు స్వల్పనివేదనమును స్వీకరించి నన్ను బునీతు నొనరించుమా. (ఒక చిన్న మొహరీల సంచిని రొండినుంచి తీస్తాడు.)

మాయ:- రాజకుమారా! మీకు పూర్తిగా మతిపోతున్నట్లున్నది. వీడెవ్వడో దేబు కత్తెరదొంగ. నా మాట వినండి.

దిమ్మ:- ఈమారా ! నీవిచ్చే తానుకను ప్రతిఫలాపేక్ష రహితముగ నిష్కామ కర్మబుద్ధితో శ్రీకృష్ణార్పితంగా ఇస్తే స్వీకరించటానికి మాకు ఎలాంటి ఆభ్యంతరమూ లేదు.

రాజ:- (సంచి ఇస్తూ) శ్రీకృష్ణార్పణమస్తు.

దిమ్మ:- (తీసుకుంటూ) తథాస్తు. (నిష్క్రమణం)

మాయ:- ఎంత మోసం ? ఎంత వంచకత్వం ?

రాజు:- ప్రియా ! అతడు వంచకుడని నీ అభిప్రాయము. మహాత్ముడని నా నిశ్చితము. చూచిన చూపు వెంబడినే ఏ మానవు డేవర్గమునకు జెందునో నిర్ణయింపగల సూక్ష్మ విచక్షణజ్ఞానము నాకు జన్మతో వచ్చిన సుగుణము. నన్ను వంచింప గల్గిన వ్యక్తి నేడివర కెందును బొడగట్ట లేదు. (నాటకంలో శృంగార నాయకుడిలాగ భంగిమ పెడుతూ) అనగా - ప్రియే ! నీ వొక్కతెవు తప్ప-

(అంటూ వుండగా భిక్షువు ప్రవేశం.)

మాయ:- చూడండి రాజకుమారా ! ఈయనే నిజమైన మహాత్ముడు. గమనించండి. ఈ బ్రహ్మ తేజ మెక్కడ ! ఆ వానర వాలకం ఎక్కడ ?

రాజు:- బ్రహ్మ తేజము ? బోడితల, బూదియొడలు, కాషాయవసనము. ఇవియేనా బ్రహ్మ తేజమునకు చిహ్నములు? హాహాహా ! ప్రియా ! మీ స్త్రీలు ఇట్టి వేషధారులను చూచి ఎంత సులభముగా మోసపోవుచుందురు.

మాయ:- వేషధారికాడు. ఈయనే నిజమైన మహాత్ముడు.

రాజు:- నీకెట్లు తెలియును ?

మాయ:- నే చేసిన పాపం ఈయనకే చెప్పుకున్నా.

రాజు:- వీనికా ? నా పేరుకూడ వెల్లడించితివా యేమి ?

మాయ:- లేదు.

రాజు:- ఇకనేమి ? ఈ దేశదిమ్మరి వాడవాడలా దండోరా వేసి నా పరువును నట్టేట కలుపక మానడు.

(ఇంతలో ఆ భిక్షువు మాయచెక్కిన మొహంకిలసంచిని మొండి గోడ మీదనుంచి లాగుకొని).

భిక్షు:- యువతీ! ఇదిగో, నీ పాప పంచితం. ఆ వికారియెవడో దీని ప్రాణాల్ని దొంగిలంచి పారిపోతుంటే తోలులో పట్టుబడి మళ్ళి లాగుకొన్నా.

(అంటూ నాల్గు మొహరీలు సంచిలో పెట్టి మాయకు అప్పగిస్తాడు.)

మాయ:- (తీసుకుని) ధన్యవాదాలు. భగవాన్ ! మీ మహిమ తెలుసుకోలేక ఈ రాజకుమారుడు కొంచెం పరుషంగా భాషించాడు. క్షమించాలి.

భిక్షు:- బొత్తుగా అనవసరం. అతడు నన్ను గూర్చి చెప్పినదంతా సత్యం. ధ్రువం. (అంటూ గోడ యెక్కి యథాస్థానములో యథారీతిగా కూర్చుంటాడు.)

రాజు:- వింటివా ? మాయ ? తాను మహాత్ముడను గానని తానే యొప్పుకొను చున్నాడు.

మాయ:- అదే మహాత్ముల లక్షణం.

రాజు:- (మాయ ఇంకొకర్ని మెచ్చుకోవడం చాలా దుస్సహంగా ఉంది.) ఏయ్ ! నీవు వేషధారి వగునా, కాదా ? నిక్కము వచింపుము.

భిక్షు:- వేషధారి కాని మహాత్ముడు యుగానికి ఒకడైనా ఉండవచ్చు. కానీ బుద్ధిహీనులు గాని యువకులు మచ్చుకైనా కనిపించరు.

రాజు:- ఏమీ, నన్ను బుద్ధిహీను డంటివా?

భిక్షు:- కాదని నీవు నిరూపించుకొనేదాకా అనక తప్పదు.

రాజు:- ఎవరితో భాషించుచున్నావో తెలియునా ?

భిక్షు:- వీనులుండి వినజాలని, కనులుండి కనజాలని ఒక నరాకృతి యంత్రంతో.

(రాజకుమారుడు తాను కప్పుకున్న అవకుంఠాన్ని గభాలున తీసేస్తాడు. నెత్తిమీద నవరత్న ఖచిత కిరీటంతో- మెడలో అమూల్య మణి ముక్తాహారాలతో - ఒరలో కత్తితో - కనిపిస్తాడు. అజంతా శిల్పాల్లో నుంచి ఒక బొమ్మ నడచివచ్చిందా అన్నట్లు ఉంది అతని విగ్రహం.)

రాజు:- ఓ గర్వితుడా ! ఇక తెలిసికొనుము. ఈ నలందా మండలమును శాసించు హిందూ ప్రభుడను నేను. నా కరవాలము అరివీర మత్తేభ ములకు సింహ స్వప్నము. అపరాధీ! సుక్షత్రియు నవమానించితివి. ఫలితము సత్వరమే నీ కనుభావ్యమగుగాక. (ఒరలో కత్తిమీద చెయ్యివేస్తాడు.)

మాయ:- (చెయ్యిపట్టుకుని) ఏమిటిది రాజకుమారా ? ఇలాటి అవతార పురుషులను వధించి మహా పాతకాన్ని మూటగట్టుకుంటారా ?

రాజ:- తాను అవతారపురుషుడు కానని తానే ఒప్పుకొనెను. నీవు వినలేదా? (ఇంతలో భిక్షువు చివాలున లేచి ఆ మొండిగోడమీద నిలబడతాడు. ఆ గోడ, దానిమీద అతని అజానుబాహు విగ్రహం, ఆ అలౌకిక తేజస్సు, ఆ పురాతన శిథిల పరిసరాలు, అవన్నీ ఒక దానిలో ఒకటి లీనమైపోయి ఆ దృశ్యానికి ఒక అనిర్వాచ్య గంభీరతను ఆపాదిస్తున్నాయి.)

భిక్షు:- క్షత్రియా! నన్ను వధించు. కాని, హేచ్చరిక! నేను వధింపబడిన మరునాటి నుండి నా పేరుతో గుళ్లు, గోపురాలు ఊరూరా నిర్మించడం, అక్కడికి నీకన్న బుద్ధిహీనులేగాక నీకన్న బుద్ధిమంతులు కూడా భక్తినిబద్ధాంజలులై రావడం సంభవిస్తుంది. ఆ మందలో నీ వొక దవు !—

రాజ:- ఏమీ? మందలో నొకడనా ? నేను! నలందా రాజ్య—

భిక్షు:- జీర్ణ శిథిల—

రాజ:- సింహాసనాధిష్ఠాతను, మందలో నొకడందువా ?

భిక్షు:- కొంచెపు బుద్ధులకే అలాటి పదవులు గొప్ప. దొడ్డ బుద్ధికి అవి యెడారిలో ఎండ మావులు.

మాయ:- సుభాషితం! సుభాషితం!

రాజ:- (మాయతో) భట్టువలె పొగడుచున్నావు. నీవెంత? నీ జ్ఞానమెంత?

భిక్షు:- నేదాంతీ! జ్ఞానమంటే యేమిటో కొంచెం నీవే చెప్పు, చెప్పవేం? (రాజకుమారుడు తెల్లబోయి సమాధానం కోసం మాయ వంక చూస్తాడు. మాయ పక్కున నవ్వగా అతడు తలవంచుకుంటాడు.)

మాయ:- రాజకుమారా ! ఇహరండి! శృంగభంగానికి నాందీ ప్రస్తావన అయింది.

భిక్షు:- సరే జ్ఞానమంటే ఏమిటో నేనే చెబుతా. యువకుడా! తలయెత్తి ఒక్కసారి నా ముఖంకేసి చూడు!
(రాజకుమారుడు యిప్పటికే పరాజితుడయ్యాడు. దీగజారిన గుండెతో తలయెత్తి భిక్షువు ముఖంకేసి చూస్తాడు.)

భిక్షు:- నేరస్తుడా! మాటవరసకు, ఈ యువతి భర్తను నేనే యనుకో.
(రాజకుమారుడి మొహాన్ని నెత్తురుచుక్క లేదు.)

భిక్షు:- ఈ భిక్షువు యెదుట ఎంతధైర్యంతో నీ పాపాన్ని వెల్లడించావో, అదే ధైర్యంతో ఈమె భర్త ముందు వెల్లడించగలవా?

రాజ:- (అర్థమయింది. తల వంచుకుంటాడు.)

భిక్షు:- అదే–జ్ఞానం! పో! పోయి ఆమెభర్తను వెతకి పట్టుకొని అతడికి నీ పాపాన్ని చెప్పుకొని ఆ విధంగా పరిహారం పొందు. అది జ్ఞానం. ధీరుడా ! అదివీర మత్తేభ సింహ స్వపమా! వణుకుతున్నా వెందుకు? పో! పో!
(రాకుమారుడు వణికిపోతూ మాయను ఒక చేత్తో పట్టుకుని వంచినతల ఎత్తకుండా ఒక్కొక్క అడుగేస్తాడు. మాయకూడా తల వంచుకుని ఉంది. వణికిపోతున్నది. ఆ విధంగా యిద్దరూ వెళ్ళిపోతున్న సమయంలో)

భిక్షు:- (మేఘగర్జాగాంభీర్యంతో) చేసిన పాపమట! చెప్పుకొనుటకు వచ్చిరట! జ్ఞానుల లక్షణమట! ప్రాపంచిక సంగము లేని బైరాగుల ముందు, నోరులేని పాషాణ ప్రతిమలముందు, వంక నంక దండము లిడి లెంపలు వైచుకొని ఁంచము లర్పించుకొని ధన్యోస్మి యని తృప్తినొందజూచు ఓ ఁపదమత్త యువతీ యువకులారా! పొండు. మీకు కావలసినవి బైరాగుల యాశీస్సులు కావు - భగవంతుని యనుగ్రహమూ కాదు- ఎవనిశయ్యను మీరు కలుషిత మొనర్చిరో, ఆ మగడు మీ మొగములమీద ఉమ్మియు నిష్ఠీవనం - వాని కళాఘాతం-వాని పాదతాడనం,ఇదే పరిహారమార్గం. పొండు!పొండు!

(భిక్షువు ఈ విధంగా గర్జిస్తుండగా తెర నెమ్మదిగా దిగుతుంది.)

తు పా ను

రచన :

పులుగుండ్ల రామకృష్ణయ్య

భూమికలు

రాఘవరెడ్డి

కుప్పుస్వామిరెడ్డి

భద్రయ్య

గోపాలరెడ్డి

రమాదేవి

స్థలం: త్యాగరాయ నగరు-రాఘవరెడ్డి మేడ-హాల్లో ఒక పేము మంచము, ఒక నవారా మంచము వున్నాయి. పేము మంచము వాల్చి వుంది. చుట్టిన పరుపులు, దిండ్లు కొన్ని విడిగా పేము మంచముమీద చిందరవందరగా వున్నవి. రోజు వారి, ఆసామివారి లెక్క పుస్తకాలు వాటిమీద పెట్టి వున్నాయి. ఒకటి-రెండు లెక్క పుస్తకాలు తెఱచిపెట్టి వున్నాయి. మంచానికి సమీపంగా మూడు కొయ్య కుర్చీలు, వాటిమధ్య పేముసోఫా-ప్రక్కనే ఒక బెంచి-బెంచిమీద ట్రంకుపెట్టె-చలవమడతలు-స్టూలుమీద భారతము-భాగవతము పెట్టి వున్నాయి. క్రింద చిరిచాప పఱచివుంది. ప్రాతఱల్లపై లెక్కపుస్తకాలు పెట్టివున్నాయి-కోటుస్టాండు దానిమీద విప్పిన చొక్కాలు-పై పంచలు-కట్టుపంచలు-యింకా కొన్ని చలవ మడతలు కూడా వేసివున్నాయి.

కాలం: ఉదయం 10 గంటలు ఆ ప్రాంతం.

భద్రయ్య:- (రాఘవరెడ్డిగారి గుమాస్తా—ప్రాతఱల్లదగ్గర కూర్చొని లెక్కలు వెతుకతూ ప్రాస్తున్నాడు—ఏదో అనుమానంగా లెక్కపుస్తకం చూచి మంచంమీద తెఱచివుంచిన పుస్తకం దగ్గఱికి తను ప్రాస్తున్న పుస్తకంతో వెళ్తూన్నాడు—

ప్రాస్తూన్నప్పుడు చేతికంటిన సిరాను తలకు రుద్దుకొంటున్నాడు-ఉనికి అంతా పల్లెటూరిరకం-ఎత్తు-అంచుకు తగ్గ లావు-మాటల్లో నిదానం)

రాఘవరెడ్డి:- (వచ్చాడు. ఎట్టగా ఓడ్డు పొడుగు మనిషి- మంచి వీసర్టు-వయస్సు 60 ఏండ్లు ఆ ప్రాంతం. పెద్ద తెల్లటి సరిగపేటు తల పాగా-తెల్లటిచొక్కా పైన సరిగ అంగవస్త్రం-మల్లు కట్టుపంచ-చేతిలో కర్ర-కాళ్ళకు చెప్పులు. ఉనికి అంతా పల్లెటూరి రకం-కాని, గంభీరమయిన రూపం-మాటల్లో చేతల్లో గాంభీర్యం వ్యక్తమౌతూ ఉంటుంది. తన మాటకు ఎవరూ అడ్డు చెప్పరాదు. పట్టుపట్టి చెంతుస్సుకోపం వచ్చినా—వెంటనే సర్దుకోడానికి ప్రయత్నిస్తాడు—గోపాలపురం అగ్రహారీకుడు—సంపన్నుడు)

రెడ్డి:- ఆరణాలిస్తే డాలందంచ్నే ? రూపాయలిస్తా, తీసుకొందువులే... మనగోడివి.

భద్రయ్య:- ఎవరాతడు ?

రెడ్డి:- ఎవరో—రిక్షావాళ్ళుగదో—యింకెవరో ? బండ్లో ఎక్కిందాక ఐతీ వాలేది, ఎక్కింది మొదలుకొని ఒకటే గీరుడు. పేగుల్లో తీట. అణా యీమని, బేడీమని ఒకటే నస. తీరా దిగినపాట బిడికోలి. యీళ్ళతో, గుట్టాబ్బిందోళ్ళతో ఒకటేపీడ. [రిక్షావాడి వంకదిరిగి] ఏందబ్బయ్యా నీ వసడం? అర్ధరూపాయ గావాలా ?...ఎందుకూ ? ఆరణాల కొప్పుకోని ఎక్కమందివే ? తీరా దిగినపాట ఎందుకూ రెండణాలుజాస్తి—నీ బండ్లో ఎక్కిందానికి అపరాధం ఏవన్నా ఉడదిగనేం ?... [రిక్షావాడు ఏదో అంటుంటే వింటున్నట్టుగా వున్నాడు] కానాదూరం లాగినా ? బేడిచ్చినపాట నీవు లాగిన దూరంగాని దగ్గరి కొస్తదిగనేం ? అందుగ్గాదూ?.....అందుగ్గాకి పోతే ఎందుకన్నా అవద్దిలే. మాకు పండిరాలా పో రూపాయలా— మేవిస్తే తీసుకొనేవాళ్ళు కానామందుండారు, పో-యీడ, రూపాయలు కోళ్ళు కొక్కరాయలు ఏరకతినటంలా, పో. [తలగుడ్డ-పై పంచ-కోటుస్టాండుకు తగిలించాడు. భద్రయ్య చేతికట్టువతలం బెట్టాడు.] పోలేదంటయ్యా రిక్షాయన ? పయిటాలదాకా కూకున్నా నీ వనుకున్న దానికంటే అదనం అణాగూడా యియ్యనుపో చెప్తుండా—బండెక్కిందాక ఆట్టా-దిగినపాట యిట్నా, దరువు ? అమ్మా! ఐలే మన గోడివే...సామిలేదు—గీమీలేదు ఎల్లు. ఎందుకు పని పంచెరువు— ఇంకెవర్నన్నా అడుగుపో—ఇస్తారు. ఆ...ఏందీ?—యీయకపోతే నన్నేం జేయమంటావు ? అదీ నా తప్పేనా ?

భద్రయ్య:- పోనీ పారేస్తే పోతుంది. బేడ్డబ్బులు—పేదవాళ్ళు.

రెడ్డి:- పారేస్తే పోవూ; దబ్బులుంటాయా ? అది నువ్వుజెప్పాలా ?

భద్రయ్య:- రెండణాలు ఎక్కడరాలా—ఎక్కడబోలా ?

రెడ్డి:- సిపీ,-షావుకారివి — సివిస్తే నే నొద్దంటుండానా? మారాజుగా యియ్యి—ఏఁపీ—ఆచ్చాపణ ఏవుందది ? ఐలే తెంపుజేసినావే— యియ్యమంటుండావే సిదేం బోద్ది ?

భద్రయ్య:- పేదవాళ్ళని అన్నా.

రెడ్డి:- నాకు దెలీదూ ఆమాత్రం? అప్పటికీ సీవు ఐలే తెంపయనోడివని, నేను పనికిమాలినోణ్ణని గాఁవాల సీవనడం ? మొండికేస్తే యిస్తా రనిగదో, యిట్ట దిరుక్కునేది ? ఒక్కసారి ఎగనాఁవంబెడ్తే ఖడేరావ్. మళ్ళడగతారా ? యాడికన్నా ఓ పెద్దమాసిందికి పోతే ఆద, పోయిన పనొదులుకొని, యీళ్ళతో యిది రంపు, పీడ. పరువు బోగడ్తారు పెద్దమ్మలు.

భద్రయ్య:- వెళ్ళాళ్ళంది.

రెడ్డి:- ఊఁ...యెళ్ళకపోతే భోజనఁవో అబ్బయ్యకు ? ఎక్కింది మొదలు కొని ఒకే గీరుడు. దూరఁవనీ గీరఁవనీ...ఎండనీ, వాననీ. నాకు ఐలే తలనొప్పి పీడ—ఎక్కకుంటే జరగదు. భద్రయ్యా!

భద్రయ్య:- అయ్యా!

రెడ్డి:- కాపీ ఉండాయేఁవో చిన్నోణ్ణి అడిగి యిట్టదెమ్మను.

(భద్రయ్య లోనికివెళ్ళి వచ్చాడు)

భద్రయ్య:- కాపీ అయిపోయినాయట. మళ్ళీ కాళ్ళి పెట్టమంటారా ?

రెడ్డి:- ఎందుకో ? అయ్యి అయిపోవడానికా ? పిల్లిమెళ్ళో రొయ్యలు గట్టి నట్టేగదో, చిన్నోణ్ణి వంటయింట్లో బెట్టడం-అన్ని నగదిగిం చేయడఁవే గదో...

భద్రయ్య:- కుప్పస్వామిరెడ్డిగారు వస్తున్నారు.

రెడ్డి:- అవునే...

(లేచి ఇంకో కుర్చీ దగ్గరికి పోయాడు)

(కుప్పస్వామిరెడ్డి వచ్చాడు. ఎఱ్ఱగా పొట్టిగా వుఁటాడు. బుఱ్ఱమీసాలు. మంచి వస్త్రధారణ-వయస్సు 60 సం॥ లు పైబడ్డవాడు-మాట్లో చేతల్లో నిదానం. ఉనికి, మాటలంతా అరవ సాంప్రదాయం.)

(భద్రయ్యలోనికి వెళ్ళాడు రెడ్డితో ఎవరన్నా సంప్రతించటానికి వచ్చినపుడు లోనికివెళ్ళే ఆచారము.)

రెడ్డి:- దండంబెడతా కుప్పయ్యగోతికి (నమస్కరించాడు) యీ కుర్చీ మీద గూకోవాల...

కుప్పయ్య:- ఎక్కడ కూర్చున్నా అంతా ఓటిదానే—మరేమి తేడా వుండాది?

రెడ్డి:- అట్టగాదులే—వారుండకబోతే నేనంటానా ?

కుప్పయ్య:-ఊర్కేదా మీరంట్రు—మీరుకూర్చోండి.

రెడ్డి:- నేను గూకోనయితే— యీడ గూకుంటాలే— వారలేకబోతే పేము సోపామీద కూకోమంటానా నిన్ను? పట్నమాసపోళ్ళు మీరు మాసున్నితంగదో? మాదేంది. ఎండనా, గాలినా తిరిగేవాళ్ళం.

కుప్పయ్య:-మాకేం— గోషా వుండాదని తలిస్తిరా?

రెడ్డి:- కాల్లేంది మీరు కాలు బయటపెడ్తారంటయ్యా? మాదేంది, ఎట్టబడ్తే అట్ట బొయ్యేదేగదో—గుంటన, మిట్టనబడి...

కుప్పయ్య:- మీరంతా సొచ్ఛుందానే?

రెడ్డి:- ఇట్టావుండాం—అయితే, కుప్పయ్యా! నా జాబు జేర్లా?

కుప్పయ్య:- మీ జాబు చూచిదా, నా ప్రయాణం మానేస్తిని. లేకుంటే మన గ్రామం వచ్చేస్తామాని చూస్తిని. ప్రయాణంకూడా కడ్తిని—జాబు చూచి మానేస్తిని—ఏమి? చూస్తిరా?

రెడ్డి:- మంచిపని చేశ్నావులే— మళ్ళీ వ్వడా కష్టాలుగదో!

కుప్పయ్య:- ఊ ఊ—అంతదానే—ఇంట్లో ఆడవాళ్ళు, అమ్మాయి, మనబిడ్డ పెళ్ళికి నిండా తొందరచేస్తుర్రు. పోయిరచ్చేయి — అని నిండా గొడవపెట్టి—.

రెడ్డి:- అవునులే. చెప్తినే—ఒకపని– అనుకున్నపాట అదయిపోతే, ఇంకో పని ఎతుకోకవచ్చుగదో— నేనొకపని ఎత్తుకున్నపాట— రెక్కా ముక్కాడకుండా — ఆ పని చరామసిగా పూర్తిజేయండి నే నిద్రబోను.

కుప్పయ్య:- అద్దానే మంచిది—

రెడ్డి:- అబ్బయ్య, గోపాళయ్యగూడ సెంవలకు బెంగుళూరునుంచి యీడకే వచ్చుండా — అన్నివైణాలు యీడనే మాట్లాడుకోవచ్చని — మీ ణాబు చూడగానే, అప్పుడే పోస్టునుంచి కవరు దెప్పించి, భద్రయ్య చేత ణాబు రాయిస్తినే—

కుప్పయ్య:- బిద్ద లోపలవుండారా అని అడుగుతాను.

రెడ్డి:- ఉన్నట్టులా, భద్రయ్యా!—

భద్రయ్య:- (లోపలనుంచి వచ్చాడు) అయ్యా!

రెడ్డి:- అబ్బయ్య, గోపాళయ్య వుండాడేంవో చూడు.

భద్రయ్య:- చీకట్లో ఎక్కడికో వెళ్ళాడు—

రెడ్డి:- చెప్తినే—యిప్పటికి వాణ్ణి నేను చూచానాంట!

కుప్పయ్య:- సరిదా— నిండా ణాగుండాది—

రెడ్డి:- రాత్రి యాణ్ణంచో పొద్దుబోయి వచ్చాడంట— మళ్ళి తెల్లారే టప్పటికి యాడికెళ్ళాడో యెళ్ళాడు– మీరు చూచిళ్ళా గోపాళయ్యను?

కుప్పయ్య:- ఇప్పుడు చూళ్ళా. యింతకుముందు చూస్తిని. సాపాటుకు యిప్పుడు వస్తుదానే— అప్పుడు చూస్తాను.

రెడ్డి:- రాడో— యాటికి బోతాడు? అయినా ఏంవో? యాదన్నా స్నేహితులయింటికి బోతాడేంవో— మనకేందెలుసు—

కుప్పయ్య:- అప్పుడుదా మూడు ఘంటలకు చూస్తాను– ఇప్పుడేమి అంత ముణిగింది?

రెడ్డి:- అట్టగేలే, ఏంవంత తిరబోయే కూణ్ణ్– యసికోసరం తొందర?

కుప్పయ్య:- మీ ప్రయాణం నిండా సౌకర్యందానే ?

రెడ్డి:- బలేసౌకర్యం! చెప్తేతీరదు. ఒళ్లు మొగం కదుంవులుగట్నె–తన్నులు, పొడుపుల్దిని—

కుప్పయ్య:- అయ్యో, అంత కష్టపడ్తిరా!

రెడ్డి:- తిన్నగా అంటావంటయ్యా, ఒక్కటే తొక్కుడు గదంటయ్యా! యాద అడుగు పెట్టబోయినా, రైల్లో—మూతులు, ముక్కులూ బొడుసు కోటవేగదో! పైన పడుకొన్నోళ్లు కాళ్ళతో దన్నిరి, కిందోళ్ళు మోచేతుల్తో, మోకాళ్ళతో బొడిచిరి. అడుగెత్తి పెట్టడానికి— సావాస్లు తొసుగుపడ–యెంపలికయ్యలో నుసుగులున్నట్లు–ఐందలు ఐద్ధ అడ్డాలు. సావాస్లు బెట్టేచోట పండుకొనిరి, కూకునేచోట పండుకొనిరి. పడుకొన్న పెద్దమాసుల కదిలిస్తే, కాంట్రిస్తా పెద్ద పులులు పైనబడ్డట్టు చంపబోయేది, లేకుంటే ఎత్తుబడ్డ గొడ్డోలు ఈడి గిలఐడి మెడలు ఱాచేది. దోపలో సావాస్లు ఆడ్డాలు బెట్టిరి- ఇంక యాద కదిలేది, మెదిలేది? అసలు మనోళ్ళకు మాసిమీద మాసికి నిహూవుంటేగదో? మొదటమనోళ్ళు మొరటోళ్లు గదంటయ్యా— ఎద టోడి కష్టసుకాలు ఎరిగినోళ్ళయితే యింత యెతలాదది? ఇంక యాద మనదేశం ఱాగుపడేది?

కుప్పయ్య:- నిండా మొరటుదా, చూస్తామే ఐనాలు—

రెడ్డి:- అదేందో పెట్టికాడికి ఎవుడన్నా ఎక్కాలనొస్తే - పెట్టెల్లోవాళ్ళ మొగాలు— తుమ్మల్లో అస్తమానమయినట్టు— నల్లగ చీకటిఐద బెట్టుకొంటా రెందుకో! వాళ్ళబ్బసొత్తుగ్గాని వస్తుండావా? లోపల గూకున్నపాట— ఐలే మొనగోళ్లుగావాల వాళ్లే? ఎదటోణ్ణిజూస్తే ఐలేతుస్కారం అబ్బయ్యాలకు.

కుప్పయ్య:-మన ఐనాలకే మట్టు, మర్యాద తెలిస్తే దానే—

రెడ్డి:- అసలు ఎంత మంచోడిగ్గూడ బండిలోకి ఎక్కతేపరి, పుడ్తాదిలేవయ్యా తెగులో !

కుప్పయ్య:-నిజందా !

రెడ్డి:- నిజవేంది-నేనుజూస్తునే వుండా, గూడూరుకాడ ఐండ్లో వాళ్ళను-కాళ్ళు ఏళ్ళుపట్టుకొని ఐతివాలి ఐండ్లోకి ఎక్కాడు ఓ పెద్దమాసి లోపంకొచ్చినపాట, తిరుక్కున్నాడయ్యో దరువుకో!—ఎవడు పెట్టి కాడికొచ్చినా "పో, యింకోపెట్టికెళ్ళు- యీద చోటులే" దని దబా యిస్తుండాడు.

కుప్పయ్య:- అద్దా - మనవాళ్ళు - ఏరుదాటి తెప్పపగులంగొట్టేది దానే. వాడుదా దాటినాడు- ఎవరు ఎట్టపూడిస్తే వాడికేమి ?

రెడ్డి:- ఆమయిన—జవిర్నా అబ్బయ్యను- ఆడ ఎక్కిందాక ఐతివాలి, పని అయినపాట మొనదేలినావే మనగోడివి. సంసారి బిడ్డవు ఆట్ట జెయ్యిచ్చంటయ్యాసి ఆడిగిన పాట మొఖం నల్లగ బెట్టుకొన్నాడు.

కుప్పయ్య:- మంచిపనిజేస్తిరి-

రెడ్డి:- తప్పుజేస్తే, చెప్పకపోతే వాడికి తప్పొప్పు ఎట్టా దెలసేది-—అట్టా చూస్తుండేవాళ్ళంతా తాత్సారం మాసులు... ఒకరి కష్టసుఖాలు ఎరిగినోళ్ళుగాదో ! ఆవదం వుండేచోట—పురుడుబోసుకొనేవాళ్ళు- నా కిష్టంలా ఆపన్లు—

కుప్పయ్య:- ఇంటికి టాన్సి మోటారులో వస్తిరా ?

రెడ్డి:- ఎవరో—మేవా - ఎందుకో ? ఆర్ద రూపాయతో బొయ్యేదానికి ఐదులు-ఆర్లు-

కుప్పయ్య:- మీరు ఎప్పుడొచ్చేది రాస్తే—నేను కారు పంపేవాణ్ణిదా-

రెడ్డి:- ఎప్పుడొచ్చేది నాకు తెలిస్తేగదో—ఆణ్ణుంచి యీడికి కాలుపెరుక్కోని వచ్చేటప్పటికి చావుదంపులయింది.

కుప్పయ్య:- ట్రాంలోదా వస్తిరి ?

రెడ్డి:- ఏం ట్రావులో, బస్సులో పో—ఆడ అడుగుపెట్టేటట్టుందదా ?

కుప్పయ్య:- ఎందుకు చెప్తురు—ఏది చూడండి, నిండుదా. హోటలు నిండుదా- రైలు నిండుదా - బస్సు నిండుదా - ఒక్క మనిషికిదా కదుపు నిండేదిలేదు. ఎప్పుడు ఆకలిదా యీ పొట్టకోసందానే యింత కష్ట పడ్తురు.

రెడ్డి:- నిజవే—అసలు మాసులకు ఆశలుజాస్తి ఆయినాయిలే అయ్యా ! యింక యాడుటంది స్థివితవో ? ఎంత ఉప్పుదించే అంత దాహవే గదో ! లేకుంటే యీవంతన మాసులు యిసుళ్ళపుట్ట పిగిలినట్టు ఏందిది ? ట్రాంబండి కిక్కిరిసి వుండది. ఆడ నలగతా ఆడోళ్ళు— యీళ్ళకు మగోళ్ళకు మించిన పనుల్లే ! ఇంకేంది కుప్పయ్యా ! ట్రిప్లికేనులో కొంచెం పనుండేనూ జూచుకొనే. ఆదనుంచి మాంబళానికి

బస్సునెక్కుడావని భద్రయ్య, నేను ట్రాంలో ఎక్కినావు...సూది మోపడానికి సందులేదు...మాసికి మాసికి అతికిచ్చినట్టుందది... భద్రయ్య సళ్ళుగా గావాల నిలుచుకొని వుండాడు—ట్రాంబండి గబక్కున కదిలేటప్పటికి—ఆమయిన మా భద్రయ్య బిళ్ళపాటుగ ఎదాళం కూకోనున్న ఓ ఆడకూతురిమీద బడ్డాడు. ఆమయిన ఆగం, జాతర—ఏం భద్రయ్యా ! ఆమాయన బిళ్ళపాటుగా బడ్డవే !

భద్రయ్య:- ఏంజేసేది—గభక్కున కదిలింది—

రెడ్డి:- చేసినమటుకు జాల్లే—మళ్ళీ యింకా పడాలనా ? [అందరూ నవ్వు కొన్నారు] అబ్బా- పయాణం బలేయెతలు, పీద.

కుప్పయ్య:- అందుకుదా, మీరు కారుకొంటే... నిండా మంచిది. వచ్చేదానికి, పోయేదానికి నిండా సౌకర్యం. కారుకుకూడా కంటోర్లు పూడ్చింది. సీఘ్రం కొనండి. మీకుదా, ఎప్పుడు తిరిగేపని...చేతిలో కారుంటే ...నిండా మేలుదా...

రెడ్డి:- ఏంమేలో...ఇప్పుడే పిల్లగోళ్ళు చెప్పినమాట యినడంలే. యింకా కారుకొంటే దాంట్లో కూకొని వాళ్ళెళ్ళుతుంటే వాళ్ళ పరుగంటు కొనేది ఎవరో ? కారొద్దులే - యిట్టుంటే చాల్లేయ్యా... లేకుంటే నీ బిడ్డ నియ్యాలనుకొంటుండావ్- నీవే ఒక కారుకొని...ఆలుమొగుడు దాంట్లోగూకొని యెట్టుంటే నీవులగుదోల్దువ్...నన్నించేవోగాదో... నిలబడిపోయినా...

కుప్పయ్య:- మీరు డుడ్డు దాస్తుర- ఖర్చుపెట్టురా...

రెడ్డి:- ఖర్చుపెట్టడానికి మత్తే కొండైనా తరిగేదేగదో...ఆస్తులు జాల్తాయా ఖర్చులకు కుప్పయ్యా ?

కుప్పయ్య:- మీకుదా ఆస్తిలేదు-

రెడ్డి:- ఉంటేఉంటదిలే... ఉంటే ఖర్చుపెడ్తే కొడుకులంకు రేపు జవాబు చెప్పొద్దు?...

కుప్పయ్య:- మరి...మనందా విషయం అందవాల...నాకోరిక చెప్పివుండానే !

రెడ్డి:- అచ్చాపణే వుండది- చెప్తినే- మాటిస్తినే-

కుప్పయ్య:- పై నెల్లో ముహూర్తం వుండాది-జోస్యులు చెప్పిరి - అమ్మాయిని గోపాలుకుయిచ్చి కళ్యాణంచేస్తే నా భారం తీరిపోతాది- ఏమో, వాళ్ళు గంజో, అంబలో తాగుతురు- మన జబాబుదారి పోను...అంతదా...

రెడ్డి:- యాడకి నీ జవాబు పోయేది ! ఆ మూడుముళ్లు పడ్డబాట తప్పించు కొందావనుకుంటుండా?... అమ్మా చిక్షిణాదోళ్ళు చిక్కితారా- మాటల్లో మనగోళ్లుగదో...

కుప్పయ్య:- ఏమో, ఓ బిడ్డదా- కొడుకు కూతురు- అంత ఆమెదానె-మీచేతుల్లో పెడ్తే నాభారం తీరుతు- ఎదిగిన బిడ్డను యింట్లో పెట్టుకొనివుండేది సిప్పలు ఒళ్ళోకట్టుకున్న మాదిరిదా...

రెడ్డి:- అచ్చాపణేవుండది? మాసుల్లో—యిప్పుడు యివేకంకంటే ఉద్రేకం జాస్తి. నిలకడ తక్కువ. ఎనకా ముందు జూచేదిలా—నెత్తికొచ్చిన పాట-అప్పుడు దారి ఎతకడానికి ఆరంభంజేస్తారు. సంవిష్టిమీద మంచి శబ్బర్లు చూచేదిలా—అదంత మంచిదిగాదు. ఏదయినాగానీ, పై నెల్లో ముడిబెడ్తేపోద్దిపో.

కుప్పయ్య:-ఆద్దా – నేను తీర్మానం చేస్తిని — మీరు సమ్మతిస్తిరి — నిండా సంతోషం.

రెడ్డి:- అయితే...మా కోడలు...అయ్యో! పెండ్లిగాకముందే మా కోడలం టుండా. పరవలేదుగదో...

కుప్పయ్య:-మీకోడలుదానే—మీ గోపాల్ భార్యదానే—

రెడ్డి:- గద్దె తే-బెంగుళూరు నుంచి ఎప్పుడొచ్చింది?—

కుప్పయ్య:-రెండారోజుల్దా అయింది.

రెడ్డి:- నేను జూళ్ళేదులే—యిప్పటికి మీ అమ్మాయిని.

కుప్పయ్య:-రండి సాయంత్రం— చూడండి. అచ్చాపణేవుందీ అంటాను.

రెడ్డి:- అచ్చాపణేవుం దయితే—అసలిప్పుడేం తొందర—నిదానంగా చూడ గూడదో...

కుప్పయ్య:-అబ్బాయిని కూడా పిల్చుకొనిరండి—చూడండి.

రెడ్డి:- ఎందుకూ అబ్బాయి ? ఏంబన్లా పో—సంసార్ని ఏంది జూచేది. మే వేం సినిమాలు తియ్యడం లేదులే — మూతులు ముక్కులు వైఖాలు జూడ్డానికి.

కుప్పయ్య:-అది సరిదా—మీరు, అబ్బాయి—రమాను చూస్తేదా మంచిది—ఉభయులకు తృప్తిదానే.

రెడ్డి:- చెప్తినే...ఎందుకు చూసేది—ఏంబన్లా—అమ్మాయికేం బంగారొంటి బిడ్డ—నాకు తెలుసుపో.

కుప్పయ్య:-అంతా వాళ్ళ తల్లినోట్లో వూడిపడినట్టుండ్లు.

రెడ్డి:- అచ్చాపణేవుండది-నిన్నుజూస్తే తెలుస్తుళ్ళేదంటయ్యా మీ అమ్మాయి ఎట్టుండేది? నాకు జెప్పాలా? ఎట్టున్నా జేసుకొనేదే—యింకేఁవి—ఎవురు నన్నడిగేది?

కుప్పయ్య:-అంతా వాళ్ళ తల్లిదా—

రెడ్డి:- అవునూ - మీ సంబంధానికేఁవి - దరిమాల్న ఆస్తి—చదువు, నగనట్రా, వైనంతైనం—యింకేంకావాలం? బంగారం వంటి సంబంధం గదంటయ్యా...బంగారు వాసనగొట్టే యిల్లూ, సంసారంగదో సీది-చూడాలంచ్నే...పిల్లను. అబ్బయ్యా...ఎంబన్లాపో...చేసుకొనేది—చేసుకొనేదే...పో...

కుప్పయ్య:-ఇప్పుడు పది వేల రూపాయల నగకట్టుండాది - పెళ్ళినాటికి పాతిక వేలు భర్తిచేస్తును—

రెడ్డి:- చెయ్యివైతే? నాకు తెలీదు? యింకా పది వేలు-ఆధనవే బెడ్తావులే-ఏఁవుకలేని చెయ్యిగదో సీది? నాకు తెలవదో...

కుప్పయ్య:-కళ్యాణవప్పుడు మద్రాసులో టవున్లో గోవిందప్ప నాయకర్ వీధిలో మూడిళ్లు ఆమె పేరిట చదివిస్తును-నెలకు ఎనిమిది వందలు బాడుగ వచ్చును—

రెడ్డి:- ఆస్తంతా ఆ బిడ్డదయితే - యియ్యంతా నాకెందుకూ చెప్పడం? సీ తెంపు నాకు తెలవదో...ఫీజు తీసుకోపుండా నా యవ్వారాలంతా

జక్కపెట్టివే...సందెడు గుండె వుండే వోడివిగదో, నకు తెలువదో ...నా కెంతపని జక్కపెట్టుండావు! మరచిపోతానా? కుప్పయ్యా-

కుప్పయ్య:-స్నేహితందానే...

రెడ్డి:- పాణపన్నా యియ్యవంటయ్యా? నీతో యియ్యం అందుకోడవంటే నా మనసు కెట్టుండా దనుకొంటుండావు? మా గోపాలయ్యకు నీ బిడ్డను పెళ్ళిజేసేది ఖాయం ... ఇటు సూర్యుడు అటు బొడిచినా తప్పదు - నీవు గాదంటే కూడ ఆ అమ్మాయిని దొంగిలించుకొని ఎత్తకపోయి మా పిల్లోడికి పెళ్ళిజేసేది ఖాయం, జెప్తుండా...

కుప్పయ్య:-అట్టజేస్తేదా దుడ్డు మిగుల్తాది నాకు—ఏం ముణిగింది? ఎట్టా — అమ్మాయిని మీ అబ్బాయికి పెళ్ళిచేస్తురు-అంతదానే-నాకేం కావాలి. యిప్పుడే ఎత్తుకొని పూదవండి-నేను సిద్ధందా.

రెడ్డి:- అమ్మా! ఖర్చులేకుండా పెళ్ళిచేస్తా ననుకుంటుండా - ఎట్టనో ఒకట్టి వద్దిలే పెళ్ళి-పొద్దుబోయిందిలే, భోంచేస్తాం. ఒరే చిన్నోడా-పీటలై.

కుప్పయ్య:-క్షమించండి-యింటికిపోవాల-అమ్మాయి కాసుకొని వుండును. పీరు రాండి-మా యింట్లో భోంచేస్తాము...

రెడ్డి:- నేను పిలిచినపాట పిలుస్తుండావేగానీ-ముందు పిలిచినా? అమ్మా కుప్పయ్యా! ముందు మాటమిగిల్నిస్తాడేవో చూచినా? చూడ్డానికి ఏంతెలీనోడున్నట్టుంటావుగాని, లోపల యింకంతమాసి వుళ్ళే దంటయ్యా-ఆవును-సంసారి అట్టనే వుండాల్లే. పైకి పొంగగూడదు. చేసి చెప్పాలగాని, చెప్పి చేయగూడదు-లే, భోంచేస్తాం.

కుప్పయ్య:-ఏమి అనుకోవద్దు-యింకా అంతా మనయిల్లుదానే-ఎప్పుడు ఇక్కణ్ణే భోంచేస్తుము-తృప్తిదానే-

రెడ్డి:- పట్నమాసపోళ్ళతో మేవు మాట్లాడి గెలవగలవో, అయ్యా! అందులో వకీలయిపోతివి...కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి అంటిస్తుండేదే గదో...మీకు మేవేంది మాటలు జెప్పేది ... దాపకు యీత నేరిపి నట్టేగదో!...

కుప్పయ్య:-మరి నేను పూడుస్తానా? — ఆందరూ రావాల. గోపాలును మళ్ళీ మూడు గంటలకు చూస్తాను...మీరు చెప్పండి — రాత్రికి మనింట్లో విందుదా...అందరూ రావాల...వస్తునా ?

రెడ్డి:- ఈ రోజుల్లో పిలిస్తే రాకుండా వదలడం యాడదీ? నికేం అనుమా నంబన్లా పో...పీటలు పగల్తాయి పో...

కుప్పయ్య:- వస్తునా?...

రెడ్డి:- మంచిది...దణ్ణంబెడ్తా...

కుప్పయ్య:- శుభం...నమస్కారం...

(వెళ్ళాడు)

రెడ్డి:- భద్రయ్యా...

భద్రయ్య:- అయ్యా...(వచ్చాడు...చేతిలో లెక్కపుస్తకం, పేనా ఉన్నాయి)

రెడ్డి:- ఆ చెల్లుల ఇవరాలు కనబడ్డాయంటయ్యా!

భద్రయ్య:- కనబళ్ళా. వెతుకుతున్నాను...

రెడ్డి:- ఎందుకూ ఎతికేది...రాస్తెగదంటయ్యా కనబడేది ? నేను నూరు మార్లు చెప్పంగా... తపిసీళ్లు బాడిలో, యివరంగా శుద్దంగా-రాయం డయ్యాని. రాస్తెగదంటయ్యా? నే జెప్పలా భద్రయ్యా?...

భద్రయ్య: - చెప్పారు...

రెడ్డి:- ఎప్పుడూ?

భద్రయ్య:- ఎన్నోసార్లు చెప్పారులెండి...

రెడ్డి:- చెపితే ఏం లాభం? నీ అవకతవక పని నూవు జేస్తూనే వుండివే! ఏవీ...తవుడుతింటా అంత ఓయ్యారం? చేసే పనిమీద నిగావుండే గదో. ఉత్తపద్దులు రాస్తివే, యేదైనా యివరం గావాలండే మళ్ళి ఆసోవితాడికి, బత్తెఖర్చులు పెట్టుకొని తిరగతుంటా? ఎగుడు దిగుడుగా రాసేది. ఇన్‌కంటాక్సు ఆఫీసర్లచేత మాటలు బడతుంటా? ఇంక జెప్తుండా, అంతా కరకటుగా వుండాలి... మనకు అన్నా దొంగకూళ్లు.

భద్రయ్య:- చిత్తం, అదేదో పొరపాటయింది.

రెడ్డి:- యాడ? అదేనా పొరపాటు? ఇంక నీ రాతలో పొరపాట్లు లేవనా నీ వనేది ? నీ వంటే ఏం లాభం? నేనుగదో చెప్పాలం. ఏం లెక్కలయ్యా, పొద్దస్తమానం...రాయను తుడవను సరిపాయ. పనేంది జరిగేది? లెక్కఏఁవో వగదిగదు. ఒళ్ళు మొహము ఆవంతన సిరామాత్రం పూసుకొంటావు... మానుదోలిన ఎద్దులు బురదపూసు కున్నట్టు. అదేందయ్యా యింతమదుగు? పీడ... యెంతసేపటికి యెనకదండెమీ దుంటావే గాని ముందుకు నడవ్వే! అసలు నీవు కూకున్నచోట ముద్ది మరచిపొయ్యేవాడివే...నీ కేంది పని జరిగేది? ఎత్కొకోను సరిపాయనే పొద్దస్తమానం...

భద్రయ్య:- ఇంక పది పద్దులుంటాయి...వగదిగిస్తాను...

రెడ్డి:- వగదిగించు...యీడ పని పూర్తిచేసుకో పోవాల. గోపాళయ్య పెళ్లి వస్తుండది. ఇంక మనకు తీరదు. మొత్తాలు యివరంగా ధాన్యానికి ధాన్యం...రొక్కానికి రొక్కం...ఇవరంగా వుండాల. చెప్తుండా, ఎగుడుదిగుడుగ రాయబాక. గోపాలయ్య వచ్చిందే, ఇట్రమ్మని చెప్పు.

భద్రయ్య:- అట్లాగేలెండి... (లెక్కపుస్తకాలతో లోనికెళ్ళాడు)

గోపాలరెడ్డి:- (వచ్చాడు. వయస్సు 22. మంచిరూపం, ఒద్దుపొడుగు, చలాకి మనిషి, మాటల్లో నిదానం వుంది. మెత్తటి హృదయం. తండ్రిని జూస్తే గౌరవం భయంకూడా కద్దు. తండ్రి కోప్పర్ధప్పుడు తగ్గి మాట్లాడ్తాడు. మొత్తంమీద సరదామనిషి.)

రెడ్డి:- భద్రయ్య నీతో ఏఁవన్నా జెప్పినాడా మందల ?

గోపి:- నాతో యేం చెప్పలేదు. యేం విశేషం ? చెప్పండి...

రెడ్డి:- మకోళ్ళేలే...పెళ్ళి విషయంగా వచ్చారు. నీతోజెప్పి నాడేఁవోసని...

గోపి:- ఎవరి పెళ్ళి ?

రెడ్డి:- యేందా అదగడఁవా! నీ పెళ్ళికేగదో...ఇంక మనింట్లో ఎంత మందుండారు. పెళ్లి కావాల్సినోళ్ళు? నీకు దెలవదో?

గోపి:- నా పెళ్ళికా?

రెడ్డి:- అంటె...నీకు పిల్లనిస్తానని ఎవరూ మనింటికి రాగూడదు గనేం?... నాకు తెలీలేదులే...

గోపి:- ఎవరండి వాళ్ళు?

రెడ్డి:- మనోళ్ళేనని జెప్పిల్లా!

గోపి:- మీరు జెప్పేది అర్థం కావటంలేదు...

రెడ్డి:- నీకు పిల్లనిస్తావని వచ్చారు. పెళ్ళిచేసుకోవని చెప్తుళ్ళా... అంత అర్థంగాకుండా చిక్కగా యేవుండది? నే నేం మలయాళం గాని మాట్లాడుండానా?

గోపి:- నేను పెళ్ళిచేసుకోదల్చుకోలేదు...

రెడ్డి:- ఇప్పుడేనా ? యింకెప్పటిక్కూడానాని ?...

గోపి:- ఇప్పుడల్లా అక్కర్లేదు. ఇంకెప్పటి విషయమో ఇప్పుడు జెప్పలేను.

రెడ్డి:- ఎట్లా ! !

గోపి:- నాకు పెండ్లక్కరలేదు...ఏం?...

రెడ్డి:- ఎందుకూని?

గోపి:- నా కిష్టంలేదు.

రెడ్డి:- ఏవో అంత యిష్టం లేకపోవడం? యీ కాలపు పిల్లకాయలు పెళ్ళి జేసుకోమన్నప్పుడు ఒద్దని నీలిగేది... తీరా, పెద్దోళ్ళు ఎట్నో పెళ్ళి జేస్తే పెళ్ళంమాటలు యిని, అమ్మ అబ్బాలగ్గూడా కూడుపెట్టకుండా తిరుక్కొంటుండార్లే...నీవి అదే దరుపుగా వుండదే జూస్తే...

గోపి:- నేను చదువు పూర్తిచేసుకోవాల.

రెడ్డి:- పెళ్ళిచేసుకొని చతకరాదో ఆ చదువులు...

గోపి:- చదువు పూర్తిగాంది నా కిష్టంలేదు. అంతే...

రెడ్డి:- అయితే నా యిష్టం దొంగలకు దోల్నా?

గోపి:- నా అభిప్రాయం జెప్పాను. మీ యిష్టం...

రెడ్డి:- మంచిసంబంధం వచ్చినపుడు కాదంటే అవతల మనకిష్టబడ్డ సంబంధం వస్తదా ? ఇట్ట జూడవయ్యా...దొరా?

గోపి:- ఇంతకూ వాళ్ళెవరో జెప్పకూడదాసి?

రెడ్డి:- అదెందుకూ నీకు? నీవు పెళ్ళిచేసుకుంటావా? లేదా?

గోపి:- మీరేం జెప్పందే ఎట్లా?

రెడ్డి:- నీ కేం జెప్పాలం? వాళ్ళను నీ వెరగవు...

గోపి:- మీకు నచ్చిన సంబంధం నాకు నచ్చకపోవచ్చు. వీం?

రెడ్డి:- ఎట్లా !!

గోపి:- అసలు పెళ్ళికి మీ నిర్బంధం యెందుకూ?

రెడ్డి:- ఎందుకంటే నేను బతకలాక. యింకెందుకయ్యా?

గోపి:- నా పెళ్ళిగూర్చి మీకు ఆందోళ నక్కర్లేదు...

రెడ్డి:- పెద్దచదువులు చదివినోళ్ళకు అమ్మఅబ్బలు పెళ్ళికుదిర్తే చేసుకో కూడదుగావాల...

గోపి:- ఇంతకూ మీ రిప్పుడు కుదిర్చారా ఏంటి కొంపదీసి ?

రెడ్డి:- కుదిర్తే చేసుకోగూడదని, మీ చదువుల్లో వుండదాని? తెలీక అడగతాలే...

గోపి:- దాంపత్యం ఒకరు కుదిర్చేది గాదులెండి, ఎవరెవరి చిత్తసంస్కారా న్ననుసరించి వాళ్ళే భార్యను ఏర్పరచుకొంటారు. అలాగే స్త్రీ భర్తను ఏర్పరచుకొంటుంది. అదే నిజమయిన దాంపత్యం. ఆ దంపతులు తమ జీవితాన్ని సార్థకం జేసుకొంటారు.

రెడ్డి:- కవనం జెప్తుండావే! నాకు మా అబ్బ, అమ్మ కవసం జెప్పలా... లేకుంటే నేను జెప్పనూ యింత పొవగరా? అయితే నీ కుండే ప్రేమ నాకు లేదనా నీవనేది? అంతేగదో?

గోపి:- ఏమో మీరే ఆలోచించండి...

రెడ్డి:- ఆలోచించినా...ఆలోచించగుండా చెయ్యడంలా... బాగా ఆలోచించే కుల..., గోత్రం...,యీతు...జోడు, నాణ్ణెం... నవ్వుతూ, మంచి

సెబ్బరా... ముందెనకలుజూచుకొనే, మాట జెప్పినా, నీయాం గుడ్డెద్దు చేలో బడ్డట్టు గుంటామిట్టా జూడకుండా పోవడంలా...

గోపి:- నేను నా హృదయంలో రాసుకొన్న చిత్రంలాంటి స్త్రీ దొరకంది నేను పెండ్లాడదలచుకోలేదు...

రెడ్డి:- అబ్బో! పూరాగా వుండిందే... యవ్వారం? ఎట్టా? అంతకంటె యింకా మెరుగైనబొమ్మ కనబడ్తే...అప్పుడు యీ బొమ్మను తుడి పేది, యింకోటి రాసుకొనేదిగదో? యింకోటి కనబడ్డపాట మళ్ళీ తుడిపేది, మళ్ళీ రాశేది. తుడవను రాయను. రాయను తుడవను సరిప్పాయనే కాలంవంతా. యింకేంది పని జరిగేది? వొళ్ళంతా నీ బొమ్మలన్నట్టు...ఏవో జెప్పినశాస్త్రంగా... లోకంలో నీవను కొన్నబొమ్మ ఒక్కటయితేసరే, యెతల్లా. అంతకుమించి యింకా మేలురకం బొమ్మలెన్ని యుండాయోనే ... ఎప్పుడు నీవు కాయంజేసేది?

గోపి:- అందరికీ ఒకే అభిప్రాయాబుండవు...

రెడ్డి:- ఎందుకుందవో? నీవేనా యిట్ట ఆలోచనజేసేది...యిప్పుడు అందరూ నీ దరువే ఏస్తేది.

గోపి:- అప్పుడు మీ తత్వంగూడా తప్పే అవుద్ది.

రెడ్డి:- పోసీలే... అయితే అవద్దిలే...అంతేగదో...

గోపి:- అందుకే యెవరికివారు నిర్ణయించుకొంటారు...

రెడ్డి:- ఆదోళ్లగూడా నీవనుకున్నట్టు అనుకుంటే ...అప్పుడు నిన్ను పెండ్లాడే ఆడకూతు రెవరూ? వాళ్లు వాళ్ళ కిష్టంవచ్చిన బొమ్మల్ను వాళ్లు రాసి తుడపనూ, మీకిష్టంవచ్చిన బొమ్మల్ను మీరు రాసి తుడపను మళ్ళితే యింకేంది సంసారాలు ముందుకొచ్చేది?

గోపి:- కాబట్టి ఆ బాధ్యత యిరువురి యందుంటుంది. ఇరువురు నిర్ణయించుకొంటారు.

రెడ్డి:- యాడ నీవు నిర్ణయించుకొనేది? నీవు రాసిన బొమ్మ కాయంవయితే గదో నిర్ణయించేది? యింకో బొమ్మను చూచి చూడక ముందే దాన్ని

తుడిపితివే ! ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకొని ఒకరి కష్టసుఖాలు ఒకరు అనుకొని 'కాడిగొడ్డ'మో స్తరిగా సంసారాన్ని గుంజి ఐయటపడకుండా, బొమ్మరాసినాడంట్నే బొమ్మను ! రాస్తే తుడిపేయి, చించేయి, బోద్ది, పీడొది. లియీవంతన యెతికి గట్టు చేరే దెప్పటికి? యప్పటికైనా ఆలు, మొగుడు ఒకర్ని కనిపెట్టి ఒకరు, మంచి సెబ్బర్లు చూచుకుంటూ ఒకరి కొకరు లొంగిపోయి సంసారాలు యెగదోసుకోకపోతే యాద నిగ్గేది ? యియ్యాన్ని వల్ల గాదనే ఎవర్నో ఒకర్ని మెడగట్టుకొని ఊరేగమనింది, చిక్కున ఐడ్తారనేవయ్యో...తెలీకగాదు, మాసి అనుకునే వన్ని అవతాయ ? యాడకాడ సరిపుచ్చుకోని, ఎదటోడికి యతల్లేకుండా, వుండే దాంట్లోనే సుఖం జూచుకొని, సంసారం గుట్టుగా ఎల్లదోసుకున్నోడు, వాడు మనగోడు...తెలిసిందా ?

గోపి:- ఏఁవైనగాసింది. మీ ప్రయత్నం మానేయండి. లాభంలేదు. నా కీ పెళ్ళొద్దు.

రెడ్డి:- (కోపంవచ్చింది) ఎవర్తో జెప్పేది ఆ మాట ! తెలిసి అంటుండా వాని!... తీరు దినుసు లేకుండా మాట్లాడున్నావే...

గోపి:- ఏం ? ...

రెడ్డి:- మాలుగు మీ దుండావే మాసివి ఏఁవో ?

గోపి:- నా కిష్టంలేదు. చెప్తే తప్పా ఏఁవిది ?

రెడ్డి:- మళ్ళిజూడు... ఒక పని నేను గావాలి అనుకున్నపెట వదులు కొన్నది ఎప్పుడైనా జూచినా ?

గోపి:- కాబటి ?...

రెడ్డి:- పెళ్ళిచేసుకోవలసిదేగదో, మళ్ళి తిరగేదది ?

గోపి:- ఏఁవిటండీ యీ మొండిచట్టం ? మీరు దుందెందుకు మాట యిచ్చారు, నా మాట లేకుండా ?

రెడ్డి:- ఐతే క్రాసు జేస్తుంచావే జట్టివి... నేను మాఁజెప్పటానికి నిన్నేంవి అడిగేది, ఐలే పెత్తనదారువి... నిన్నురగద్దోమది !

గోపి:- పీ రెవరో్న పీ యిష్టంవచ్చిన వాళ్ళనుజూచి, నన్ను నిర్బంధ పెట్టడం ఏఁవిటి, అర్థంలేదు. అసలు పీ యిష్టం వచ్చినవాళ్ళను నేను పెండ్లాట్టం ఏఁవిటి ?...

రెడ్డి:- నే నెంతమందినో జూళ్ళా... పరాయిపిల్లల్ని వూరికే జూస్తుంటే వూర్కుంటారా ? ముఖంమీద కొడ్తారు.

గోపి:- మీరు ఎవరో్న... కోతినో, కొండముచ్చునో తెచ్చి కట్టిపెట్టాలను కున్నా రేఁవిటి ?

రెడ్డి:- ఏఁవీ కోత్తై తే జేసుకోగూడదో ?

గోపి:- అబ్బా ఏఁవిటిహింస ?

రెడ్డి :- కోతినై నా జేసుకోవాల, కొండముచ్చునయినా జేసుకోవాల. సంసారికి 'యిల్లు యిరకటం, ఆలు మరకటం' అన్నారు పెద్దోళ్ళు.

గోపి:- మీ తత్వంవేరు, మా తత్వంవేరు. మానేయండి చాలు.

రెడ్డి:- చాల్లే నిలాపుదువూ. ఏఁవో ఐలేతిరుక్కుంటుండావే అబ్బయ్యవు ఎట్టా ? అంతా గోవగొడ్డు లైనుగా వుందదే! మేతకుమాత్రం వచ్చేది, పనికి పట్టుకోబోయినపాట అరిచేది, తన్నేది, పొడిచేది...అట్టుందదే నీ యవ్వారం ! మీ యిష్టపకారం బోతే సరి, లేకుంటే తిరగబడేదా?

గోపి:- మీతో నేను వాదించలేదు.

రెడ్డి:- ఇంకా జవాబు చెప్తుండావే ! చెప్తుండా, ఏఁవయినా ఆ పిల్లను జేసుకోవాల్సిందే.

గోపి:- ఏఁవయినా కానీండి, నేను చేసుకోను. అంతే.

రెడ్డి:- ఎంతయినాగాని ఆ పిల్లను నీవు జేసుకోవాల్సిందే...చెప్తుండా.

గోపి:- ఆఁ...

రెడ్డి:- ఆఁ లేదు, గీఁ లేదు. మళ్ళీ జెప్తుండా, ఆ పిల్లకు పళ్లు పొడుగు, మూతొంకర, అవిటికాలు...

గోపి;- చాల్లేండి, మానేయండి.

రెడ్డి:- కళ్ళులేవు, గుడ్డిది; నెత్తి ఊసిపొయ్యుండాది. నేను వాళ్ళకు మాటజెప్నా. చెప్పినా, చెప్పకపోయినా యిప్పుడు జెప్తుండా, చేసు కోవాలి...కావాలి. చెప్పు, కాని పొద్దుబోతుండది.

గోపి:- [తండ్రివంక తీక్షణంగా చూచాడు]

రెడ్డి:- చూస్తే చూచినావులే! కోపం వచ్చినపాట పొడస్తావుగనేం? కొమ్ములల్లేవులే. మంచిచెప్తేగూడ ఇలే కష్టంగా వుందదే. ఆడవదం బిడ్డకు ఉగ్గుపెడ్తుంటె వద్దని ఏడుస్తుళ్నా? ఏడవన్నా, వదులుకొనే టట్టుందదా...ఏడుస్తుందది బిడ్డ పాపవని? మంచిదిగాబట్టి ఏది పించన్నా బోస్తుళ్నా? అంతేగదో.

గోపి:- అయితే యిప్పు డేంచేయమంటారు?...

రెడ్డి:- ఒప్పుకోమనగదో చెప్తుండేది. చెవులు మధ్యంగానేం?

గోపి:- ఆ అమ్మాయిని చూచి చెప్తాను ... చేసుకోటవో, మానేయ టవో...

రెడ్డి-: నీ వెందుకూ చూచేది ? నేం జెప్తుళ్నా? అసలు నీవు ఆ పిల్ల బాగున్నా బాగలేదంటే, అప్పుడు నీ పరు గంటుకొనేదెవరూ? అసలు యింత దూరం వచ్చినపాట నీవు బాగలేదని ఎగనావం బెట్టవాని? ఆమాత్రం నాకు తెంవదో. నాకు కవసలోడే వెవులు కుట్టింది; నాగేళ్ళసే నన్నేసాపెబుగాదు.

గోపి:- మీరు బాగుందంటే నాకేం కావాల ? నాకు నచ్చాల అంతేగా.

రెడ్డి:- అందుకే జెప్తినే.... పళ్ళుపొడుగు, ఒక్కన్ను, నెత్తూసిపో యుండది... ఆ పిల్లకని. దాపరికం ఏవుండది ?

గోపి:- ఆ అమ్మాయి యెంత అనాకారయినా నన్నంగీకరించకపోవచ్చు. అప్పుడు మీ ప్రయత్నవంతా వ్యర్థమవుతుందేవో ?

రెడ్డి:- ఆ యవ్వారం నీ కెందుకూ ? అదెందుకూ నీకూంట ?

గోపి:- ఇంతకూ ఓమారు చూణ్ణివ్వండి, తప్పేం ?

రెడ్డి:- నీ పెళ్ళాం వనివించుకొని చూడు, నాకేం ఆచ్చాపణలా.

గోపి:- పెళ్ళయినతర్వాత యింకేవిటి జూట్టం, అంగీకరించటవున్ను ?

రెడ్డి:- అబిగదో నే ననేది !

గోపి:- ఏఁవిటండీ, యీ గొడవ ?

రెడ్డి:- పరాయిబిడ్డను నీవేంది జూసేది ? చూచి బాగలేదంటే ఆ బిడ్డకు ఆదొక వొరకా ! అసలు నీ కెందుకో నే చెప్తుళ్నా ? మేఁవంతా అమ్మా అబ్బ చూచి పెళ్ళిచేస్తే చెఁపోతిమి... అందు గ్గావాల భయ పడ్డం పొపం? నీ కంటె పెద్దాస్తి; నీతోపాటు చదువుకొన్నది; బంగా రంలాంటిపిల్ల.... దరిమాల్ని ఆస్తితోగూడ మనింటికి వస్తుంటె వద్దటనే, ఆ పిల్లను జూడాలట్నె; ఏందో బలే పోలా అవతలబడ.

గోపి:- అయితే.....

[ఏమో అనటోయి మానేశాడు. మాటరాబేదు. కళ్లు ఎఱ్ఱనైనాయి.]

రెడ్డి:- ఏఁవయితే... బలే మిటకరిస్తుండావే.

గోపి:- ఏఁవయినా కానీండి. ఈ బఱవంతపు పెళ్ళి నాకక్కర్లేదు.

రెడి:- ఎటా ! !

గోపి:- మీ వాగ్దానాలతో నాకు ప్రమేయం లేదు. చెప్తున్నాను.

రెడ్డి:- మళ్ళి జెప్పూ ?

గోపి:- నూరుసార్లంటాను, అక్కర్లేదని...రఁభయినా నాకక్కర్లేదు, మానే యండి. [వెళ్తున్నాడు]

రెడ్డి:- ఎట్టచేసుకోవో జూస్తాఁగా ! యుగటాయించి యాడకి బోతావో చూణ్ణో ? ఆల్లా సినిమాల్లో, నాటకాల్లో నాయనఁకున్నావుగనేం నన్ను ? నేను వొమలుకొనేవాణ్ణిగాదు వాళ్ళలా...వాళ్ళు కొంచెం సేపు పొంగేది, చల్లారేది... ఆమయిస దొడుపులు నే నెల్తానన్నో, చస్తానన్నో అని చెప్పినమాట, అబ్బాయిని బతివాలి తీసికొచ్చి సరసాలాడ్తుంటార్లే ! అట్టనుకున్నావేమో నన్ను నీవు ? ఏం ఉపయో గంలా. చెప్తుండా, కళ్లు రెండు మూసుకొని తాళిబొట్టు కట్టాల్సిందే... ఏవయినాగాని...

గోపి:- నే నంగీకరించను, ఏమవుతుందో చూస్తాను... [రెండడుగులు నడిచాడు.]

రెడ్డి:- ఎగటాయించి ఎల్తుండావే.... యాడి కెళ్ళేది నీవు ? ఎళ్ళడా నికిలా...

గోపి:- [నిలిచాడు] ఏంటిటిఘోరం ! వెళ్ళానికిగూడ మీ యిష్టవేంటి ?

రెడ్డి:- నా యిష్టం గద్రైతే... నీ యిష్టంవా ? నా మాట గాదన్నపాట యిం కాద నీ వుండేది ? మద్దాల భోజనం యాదన్నా యెతుక్కోపో...

గోపి:- ఆలాగే లెండి... [మళ్ళి రెండడుగులు నడిచాడు]

రెడ్డి:- ఎల్తా అయితే... ఏంరా గోపయ్యా ! ఎళ్తావాఅంట ! చెప్పరాదో? నా మాట గాదన్నపాట నిన్ను నేను మయిట్ చేస్తావనుకొన్నా ? యింక పయికం బంపుతాలే... బొంగుళూరులో ఖర్చు బెడ్తువు. ఎద్దునోటికి చొప్పందించినట్టు అందిస్తుంది రూపాయలు నీ యిష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టి... యిదా, నీవు జదివింది ? యీడ నీవు సంపాదించిపెట్టింది లేదుపో.

గోపి:- మీ సంపాద్యం నా కక్కర్లేదు. ఎట్లాగో బతుకుతానులెండి.

రెడ్డి:- ఐతకవోమరి!... మూడు లోకాల్లో యాడున్నా నిన్ను వదల్ను; జెప్తుండా... తప్పించుకుందా వనుకుంటుండావుగావాలి.

గోపి:- ఏంటిటండీ యీ హింస ?

రెడ్డి:- నీకు ఆ పిల్లను గట్టిపెట్టకపోతే నేను రాఘవరెడ్డిని గాననుకో. ఏంవో ఎగతాళి అనుకుంటుండావు గాంవాలి, యిప్పుడేబోయి పిల్చుకొస్తావాళ్ళను... ఎట్ట తాళిబొట్టు కట్టవో జూస్తా. ఒరే చిన్నోడా! పీక్రై, వస్తుండా... నీదొక ఆలస్యవంటరా. [వెళ్తున్నాడు... లోనికి వెళ్తూ మళ్ళి వెనక్కి తిరిగాడు.] నేను మళ్ళి కోర్టుకు పొయ్యే లోపల నాకు ఏమందలా చెప్పాల. ఎగతాళని అనుకుంటుండా వేంవో... [రెడ్డి లోనికి వెళ్ళాడు.]

[గోపాంరెడ్డి ఏమీ తోచక ఆటు ఇటు ఓమారు పచారుచేశాడు... ఓ నిమిషం అంతా నిశ్శబ్దం... రెడ్డికి వినబడకుండా గుమాస్తాను పిలిచాడు]

గోపి:- భద్రయ్యగారూ !

భద్రయ్య:- (వచ్చాడు) అయ్యా !

గోపి:- ఇట్లా రండి.

భద్రయ్య:- ఏం ?

గోపి:- వినలా యీ గొడవంతాను ?

భద్రయ్య:- నేను లోపల వేరేపనిలో వుణ్ణాను.

గోపి:- ఎవరో నా పెళ్ళి విషయం మాట్లాడ్డానికి వచ్చారట. మీకు తెలుసాండి?

భద్రయ్య:- తెలుసండి.

గోపి:- ఎవరూ? నాయన్నడిగితే చెప్పరూ... కోప్పడతారు.

భద్రయ్య:- కుప్పస్వామిరెడ్డి గారు.

గోపి:- ఏ వూరు ?

భద్రయ్య:- ఈ ఊరే.

గోపి:- వారేంజేస్తున్నారు ?

భద్రయ్య:- వకీలుగా వున్నారు. యిప్పుడు మానుకొన్నారులెండి.

గోపి:- ఎప్పుడొచ్చారు ?

భద్రయ్య:- మీరు యింటికి వచ్చేదానికి ముందు.

గోపి:- యీ వూళ్ళో వాళ్ళ యిల్లెక్కడో తెలుసా మీకు ?

భద్రయ్య:- తెలుసండి.

గోపి:- ఎక్కడ, చెప్పండి.

భద్రయ్య:- మాంబళంలో...

గోపి:- ఎక్కడ ? వీధి పేరు ?

భద్రయ్య:- నెల్రూ రోడ్డు...

గోపి:- ఆ క్రొత్తమిద్దేనా ? వీధి తిరుగుళ్ళోనే మొదటి యిల్లు.

భద్రయ్య:- ఆవునండి.

గోపి:- వారేనని మీకు బాగా తెలుసా ?

భద్రయ్య:- తెలుసండి. మనకు కొన్నాళ్ళు వకీలుగా కేసులు చూస్తుండేవారు...

గోపి:- అయితే ఆ అమ్మాయి పేరుగూడా తెలుసా మీకు ?

భద్రయ్య:- తెలీదండీ...

గోపి:- యింతకు మా నాయన చూచారా ఆమ్మాయిని ?

భద్రయ్య:- చూచినట్టులా.

గోపి:- ఏడ్చినట్టుంది. పోనిలే... మళ్ళీ కుప్పస్వామిరెడ్డిగా రొస్తారా ?

భద్రయ్య:- సాయంత్రం వస్తానన్నారు.

గోపి:- మా నాయన వస్తున్నారు...

భద్రయ్య:- నేను వెళ్తాను... (భద్రయ్య వెళ్ళాడు).

(రెడ్డి వేరే దుస్తులు ధరించి, తలపాగతో కోర్టుకెళ్ళటానికి తయారయి వచ్చాడు. గోపి తండ్రినిచూచి చాలా నమ్రతగా వున్నాడు.)

రెడ్డి:- భద్రయ్యా !

గోపి:- భద్రయ్యగారు, నాయన పిలుస్తున్నారు, త్వరగా రండి.

భద్రయ్య:- (వచ్చాడు.) అయ్యా !

రెడ్డి:- నేను బోతుండా... కాని మరి... పోదాం... కట్టి యిట్టి...

గోపి:- మీరు పోండి, నేను యిస్తాను. (కట్టి నమ్రతగా యిచ్చాడు)

రెడ్డి:- (తీసికొన్నాడు) ఏంజేసినావు మందల ?

గోపి:- మీ యిష్టమొచ్చినట్లే కానివ్వండి

రెడ్డి:- వాళ్ళిప్పుడొస్తారు...

గోపి:- ఎవరండి ?

రెడ్డి:- పెళ్ళోళ్లుగదో ! రాత్రికి వాళ్ళింట్లో...

గోపి:- ఏం ?

రెడ్డి:- ఏం బలే గత్తరబడ్తూండావే! ఏఁవో శైను మార్చుకొన్నట్టుండావే! రాత్రికి వాళ్ళింట్లో మనకంతా యిందు.

గోపి:- ఎన్నిగంటలికండీ?...

రెడ్డి:- ఎన్నిగంటల కంటుండావు...యాడికన్నా పోయిరావాలగనేం ?

గోపి:- మీరు వెళ్ళమంచె వెళ్తాను...

రెడ్డి:- యాడికి బోవద్దు...

గోపి:- పెళ్ళి యీ రోజేనాండి?

రెడ్డి:- యియ్యాల గాకపోతే నెలరోజుల కవద్దిలే ! పెళ్ళయిన పాట తిరుక్కుంటావుగనేం? అమ్మాయియిని జూడబన్లేదుగదాని?

గోపి:- అక్కర్లేదు, మీరు చూస్తేచాలు. యింతకూ మీరు చూచారా ?

రెడ్డి:- నేను చూస్తాలే. నువు జూడకుండా ఒప్పుకొనేదేగదాని?

గోపి:- తప్పతుందా?

రెడ్డి:- తీరా, వాళ్ళొచ్చినపాట కోతని, కొండముచ్చని, నలుపని, తెలుపని, పళ్లున్నాయని, ఉన్నపళ్ళు మిట్టని, పల్లఁవనీ అనవే?...

గోపి:- ఎట్టున్నాసరే... కుంటిదైనా, గుడ్డిదైనా సరే...మీకు బాగుంటే చాలు.

రెడ్డి:- సరేపో... (గోపి రెండడుగులు నడిచాడు) మళ్ళీ అనికలు బెట్టవే ?...

గోపి:- ఊఁహూ.

రెడ్డి:- తెలీదు? నేను యాడకి బోతా, నీవాడికి బోతావు? భద్రయ్యా! [భద్రయ్య వచ్చాడు].

రెడ్డి:- ఓ రిక్షా పిలవయ్యా...రాఘవయ్య యింటికి బోయి రావాల.

భద్రయ్య:- అట్లగే.

రెడ్డి:- ఎంత బాడిగ...ఆరణాలకు పైన యివ్వనని జెప్పు. కరకటుగా మాట్లాడు. నీళ్ళు నవల్తా రాబాక...

భద్రయ్య:- ఆరణాలకు రాకబోతే...

రెడ్డి:- రిక్షావాణ్ణి ఆడ వుండమని నీవు రిక్షా లాక్కోరా, యింకేవి? యీడకే దగ్గిరకేగదో...వస్తారు పో...యిందాకొచ్చిళ్ళా; భద్రయ్యా! పరమానందయ్య శిష్యులరకాసికి తిరుగుతుండవే ! రేటుగాని చెరిచేవయ్యా! ఆరణాలపైన దువ్వమీద దుమ్ముగూడ లా.

(భద్రయ్య వెళ్ళాడు)

రెడ్డి:- ఆ తలగుడ్డ యిట్ట దేవోయ్ గోపయ్యా !

(గోపి తెచ్చియిచ్చాడు. భద్రయ్యవచ్చి)

రిక్షా వచ్చింది.

రెడ్డి:- బాడుగెంత ?

భద్రయ్య:- ఆరణాలు.

రెడ్డి:- రారంటివే ఆరణాలకు! ఐతే పాలుమాలినోడివయ్యా నీవు.

భద్రయ్య:- అర్ధరూపాయి అడిగి ఆరణాలకు వచ్చాడు.

రెడ్డి:- వా డెంత అడిగితే మనకేం. మనం విచ్చేది ఆరణాలుగదో! నే నిప్పుడేవస్తా. నీవు కోర్టుకుపోయి, వాయిదా మందం కనుక్కోరా... (యిద్దరు వెళ్ళుతారు)

(గోపాలరెడ్డి తన చేతిలో వున్న పుస్తకాన్ని చదువుతూ, అప్పుడప్పుడు కాగితాలు తిరగవేస్తున్నాడు. ఓ అరనిమిషం అట్లా జరిగింది. అంతా నిశ్శబ్దం. ఎవరో వస్తున్నట్టు గమనించాడు. రమాదేవి వస్తుంది. చూచాడు. కాని ఏం ఎరగనట్టు పుటలు తిరగవేస్తూ చదువుతున్నాడు.)

రమ:- (వయసు 18 ఆ ప్రాంతం. మంచి రూపం, చలాకి మనిషి, మంచి వస్త్రధారణ, ఆడంబరం లేదు, నాగరికత ఉట్టిపడుతూంది, పట్టుదల జాస్తి, ముఖంలో నిస్సహాయత, ఆందోళన కనబడుతున్నవి. వచ్చి నిలచింది, గోపి గమనించనట్టున్నాడు. రమ గోపిని పిలిచ్చరించ లేదు, గోపి మౌనం.)

రమ:- క్షమించండి.

గోపి:- (చూచాడు) రమా !

రమ:- గొప్ప ఆదర్శపురుషులని లోకం అంతా అనుకొంటూంది.

గోపి:- అందుకు మీ అభ్యంతరం ఏఁవీ లేదనుకొంటాను.

రమ:- ఎప్పుడూ చదువుతప్ప లోకంలో యింకేం మీకక్కర్లేదూ?

గోపి:- చదువంతా పూర్తిగాంది యింకేం చేయదల్చుకోలేదు.

రమ:- అలాగా...నాకు తెలీదులేండి...క్షమిస్తారా? ...

గోపి:- ఆలోచిస్తాను... మరి అక్కడ నిలుచుకోడఁ వేఁవిటి ?...

రమ :- ఇప్పటికైనా కనుక్కున్నారు సంతోషం.

గోపి:- అసలు యీ అపరాహ్ణంలో మీ ఆగమనానికి కారణం అవగాహన కావటం లేదు.

రమ:- ఆపదలొస్తే అర్ధరాత్రయినా, అపరాహ్ణమయినా రాక తప్పదుగా.

గోపి:- ఏవంతవసరం.

రమ:- (మౌనం. గోపి 'రమా!' అంటూ సమీపించాడు. రమ మాట లాడదు.)

గోపి:- ఏఁవిటాపద? చెప్పేయి...ఏఁవయినా చేయదగుంటే చేస్తాను.

రమ:- చెప్తే విన్నారా? నెత్తిన నోరుపెట్టుకొని కొట్టుకుంటే విన్నారా ?

గోపి:- ఏంచెప్పావ్, వినకుండా పోటానికి ?

రమ:- మీకు నిజంగా ప్రేముంటే ఎలా మరుపొస్తుంది?

గోపి:- నాకర్థం కాలేదు...

రమ:- అవును ... అర్థంకాదు. నా స్థితిలో మీరుంటె అపుడు అర్థఁవయి వుండేది...మీ కేం ?...

గోపి:- ఏఁవిటీ నిష్ఠూరం ?

రమ:- నిజవాఁడ్తే నిష్ఠూరం తప్పదు. నాకంఠానికి ఉరి వచ్చిందాక మీరు తెవల్లేదు...

గోపి:- ఏంజేశావేం...అంత అపరాధం !

రమ:- ఈ సంఘంలో స్త్రీజన్మ ఎత్తటమే, యింకేంకావాలి ?

గోపి:- "ఆదబ్రతుకే మధురం" అన్నారు. పినలా ఆ పాటను?

రమ:- చాల్లెండి...పరియాచికాలు.

గోపి:- మీ నాన్న చదువ మానేయమన్నాడా ఏం?

రమ:- తర్వాతమెట్టు అదే అవుతుంది. మీకు సంతోషమేనా?

గోపి:- మొదటి మెట్టేదిటి?

రమ:- ఏమవుంది?

గోపి:- ఆఁ...

రమ:- పెండ్లి !...

గోపి:- ఎవరికి?...

రమ:- ...యింకెవరికి?...

గోపి:- నీకే !...

రమ:- (మౌనం. తలవాల్చేసింది)

గోపి:- రమా!...

రమ:- గోపి!...(కన్నీళ్లు)

గోపి:- ఏమిటీ అవాంతరం! (రమ మాట్లాడదు). ఎక్కడ సంబంధం?

రమ:- ఎక్కడో ఎవరో పల్లెటూరట, మా నాన్న స్నేహితులట. నాతో హెచ్చరించాడు. నేనేం జవాబు చెప్పకుండా యిక్కడికి వచ్చేశాను. వాళ్ళకు విందుకూడ మా యింట్లో రాత్రికి...(గోపి ఏమో ఆలోచిస్తున్నాడు) ఏమిటా ఆలోచన?

గోపి:- రాత్రి మీ యింట్లో విందుకు నీవు పిలుస్తావో లేదోని, ఆదవా పిలిస్తే రాకుండా ఉండటం బాగుంటుందాని ఆలోచిస్తున్నాను.

రమ:- ఈ మాటల్తోనే యిలా అయింది.

గోపి:- మరి ఏంచేయమంటావ్?

రమ:- ఏంవిటాప్రశ్న?

గోపి:- అంటే?

రమ:- మనపెళ్ళి యిప్పుడే అయిపోవాలి...

గోపి:- (ఓ నిట్టూర్పుతో వెళ్ళి సోఫాలో కూర్చొని పుస్తకం చదువు తున్నాడు.)

రమ:- (కోపం వచ్చింది) తర్వాత చదవొచ్చు, ఇంకా కాలముంది. (పుస్తకం లాక్కొని చేతిలో వుంచుకొంది.)

గోపి:- ఇలా యిచ్చేయి...ఇంకా యెంతో చదవాలి...

రమ:- ఇప్పుడు చదివిన చదువుకు జ్ఞానం వృద్ధికాకుంటె...యింకగాదు. చదువు మానేయొచ్చు.

గోపి:- ఓ...అలాగా...నాకు తెలియదు.

రమ:- ఎలాగయినా యీ రోజు మన పెండ్లి కావాలి.

గోపి:- నాకు యిప్పుడు పెండ్లేవిటి?

రమ:- ఈ మాటలతో లాభంలేదు...నేను యిప్పుడు పెండ్లాడ్డానికే వచ్చాను. లేకుంటె నాకిప్పుడు పనేవుంది?... ఎందుకొస్తాను.?

గోపి:- నా చదువు భంగమవుతుంది. నేను వెళ్ళాలి...(లేచి రెండడుగులు నడిచాడు,)

రమ:- ఎక్కడికి?

గోపి:- మిడెమిడికి...

రమ:- నేనూ వస్తాను...(గోపిని సమీపించింది)

గోపి:- పుస్తకం యిలా యిచ్చేయి...

రమ:- ఇవ్వను.

గోపి:- ఏవన్నావ్?

రమ:- నేను మీతో వస్తాను...

గోపి:- (నిట్టూర్పు) ఇంకేం...చదువు సాగినట్టే. ఇంక మిద్దెమీది కెందుకు? యిక్కడే ఉండొచ్చు. (వెళ్లి కూర్చున్నాడు సోఫాలో.)

రమ:- నేనుండె చదవటానికేం?...ఇదిగో తీసికొండి మీ పుస్తకం.

గోపి:- (తీసుకుని) ఇంక మీరు వెళ్లితే నేను చదువుకుంటాను (పుస్తకంలో చదువుకుంటున్నాడు...ఇరువురు క్షణం నిశ్శబ్దం.)

రమ:- మరి పెళ్లిమాట ఏఁవిటి?

గోపి:- ఆ విషయాన్ని గూర్చి ఈ గ్రంథకర్త యిక్కడేం సమాధానం ఇవ్వలేదు. కాని ఓ ఉపాయం తోస్తుంది, మీ నాన్న యేర్పాటు చేసిన అబ్బాయిని నీవు పెండ్లాము. మా నాన్న యేర్పాటు చేసిన అమ్మాయిని నేను పెళ్ళాడుతాను.

రమ:- (కోపం వచ్చింది...వెళ్ళబోయింది)

గోపి:- రమా! (ఆపాడు) మన పెళ్లికి మా నాన్న అంగీకరించడేఁవో! యేం చేయటం?

రమ:- మీ నాన్న అంగీకారం ఎవరిక్కావాలి?

గోపి:- మరి నా ఇష్టంతో లాభంలేదు. నేను అయినకు మాటిచ్చాను.

రమ:- (మ్రాన్పడింది) ఏఁవన్నారు?...

గోపి:- ఆయన ఎక్కడో సంబంధం చెప్పారు... కానీ... యిప్పుడు మానేయమన్నాను...

రమ:- ఆఁ...

గోపి:- మా నాన్న మాటలేంది నేనేం చేయలేను.

రమ:- మరి నన్నేం చేస్తారు?...

గోపి:- (మౌనం)

రమ:- మరి వేయుండి...ఇద్దరి పీడ వదలిపోతుంది...

గోపి:- (మౌనం)

రమ:- ఎవరో దొ్భాగ్యుడికి, ఓ పల్లెటూరి మొరటు మొద్దుకు కట్టిపెడ్తుంటే చూస్తూ ఊరుకొంటారా?

గోపి:- మరి నన్నేంచేయమంటావ్? నేనేం సామ్రాట్టునా, నాకు చతురంగ బలాలున్నాయా... వాణ్ణి ఏ చెట్టుకో పుట్టకో కట్టి నిన్ను రాక్షస వివాహం చేసుకోటానికి?

రమ:- మరి నన్నెందులో దూకమంటారు ?

(రెడ్డి మాటలు వినవచ్చాయి)

గోపి:- అదుగో ! మా నాన్న వస్తున్నాడు. ఇంక నీవు వెళ్లిపో... తర్వాత మాట్లాడుకుందాం.

రమ:- నేను వెళ్ళను...మీ నాన్ననే అడుగుతాను...

గోపి:- ఏంటి! (వెలవెల బోతాడు)

రమ:- తమ కిష్టంవచ్చినవాళ్ళకు మిమ్మల్ని ఎలా కట్టిపెడతారో...అడుగుతాను...

గోపి:- వద్దు, మానేయ్...

రమ:- ఏం, భయంవా?

గోపి:- ఆయన సహించరు.

రమ:- ఆయన ఇష్టం ఏంటి ? అడుగుతాను చూడండి...మీ ఎదటే అడుగుతాను.

గోప:- నీ యిష్టం... నే వెళ్తాను... (రెండడుగులు నడిచాడు)

రమ:- ఎందుకంత భయం?

గోపి:- ఆయన సమాచారం నీకు తెలీదు. (వెళ్ళాడు)

రమ:- ఆది తెలుసుకొంటాను.

(రెడ్డి వచ్చాడు...వింటున్నాడు. రమ గమనించక మాట్లాడుతూ వుంది.)

రమ:- మన పెండ్లి ఇప్పుడే కావాలి. మీ నాన్న ఎవరు మన పెండ్లి అడ్డు పెట్టడానికి? వారికేం హక్కుంది? మనం ప్రేమించుకొన్నాం. మన ఇష్టం. మీ నాన్న కిందులో జోక్యం లేదు. రానీండి. ఏరీ మీ నాన్న? నాకేం భయంలేదు.

రెడ్డి:- అవును. నీకు భయంవుంటె యీడ కెందుకొస్తావో? అంతా యింటానేవుండా. నే నీడ్నే వుళ్ళా!

రమ:- మీరేనాండి రాఘవరెడ్డిగారు?...

రెడ్డి:- ఏం కత? ఏవో బలే అగాయిత్యం జేస్తుండావే...పడుగు మీదికి ఎద్దల దోలినట్లు రంపులు గొంపులు జేస్తుండావే! ఏవిరా అబ్బయ్యా! బలేవై ణం నేర్చుకొన్నావే?

రమ:- మీ అబ్బాయిని మీ యిష్టంవచ్చినోళ్ళకు కట్టిపెట్టడానికి మీకేం హక్కుంది? చెప్పండి.

రెడ్డి:- ఆ మాట ఆడగడానికి నీకు హక్కుందే... నాకు వాడికి పెళ్ళి జేయడానికి హక్కులేదంటా?

రమ:- అవును, మీకు హక్కు లేదు.

రెడ్డి:- ఏందీ ఆడగటం! నాకు తెలవడం లేదే! అసలు మా గోపయ్యకు నీ కెట్ట తెలుసు?

రమ:- మేవు ఒకే క్లాసులో చదువుకుంటున్నాం

రెడ్డి:- అట్టగా.....అయితే.....నీవు?

రమ:- మేమిరువురం ప్రేమించుకొన్నాం, పెండ్లాడదలచాం

రెడ్డి:- అదా కత? నీ మాటల్లోనే నా కనుమాణం దగిలిల్లా...

రమ:- దాపరికం ఏమీలే దిందుకో.

రెడ్డి:- యింకేంవుందది? నిజం బయటబడ్నే...

రమ:- మా పెండ్లికి మీరు అంగీకరించక తప్పదు.

రెడ్డి:- అయిన్నీ యీభూపతవు, చెప్తుండా... (వికటంగా నవ్వాడు)

రమ:- ఏం ?

రెడ్డి:- ఏఁవంటె? ఏవో కారణాలు. నీకు చెప్పడానికి మాకు తీరికలుంద
బిన్లా ?

రమ:- కాస్త తీరిక జేసుకొండి. మమ్మల్ని అడ్డ పెట్టేది అంత తేలిక
గాదు.

రెడ్డి:- తేల్గాపోతే బరువవద్దిలే...ఏమీ ?

రమ:- నాకా భయంలేదు...

రెడ్డి:- అది తెలుస్తూనే వుళ్నా. మళ్ళీ చెప్పాలం నీవు? అమ్మా.....
యిదంతా బలే బరువుగా వుందదే. మా గోపయ్య వుండాడా
యింట్లో...?

రమ:- ఉన్నారు పిలవండి... అంతా వారే జెప్తారు...

రెడ్డి:- ఏంది ఆయన జెప్పేది... నీవే జెప్తివే అంతా... ఒరే గోపాలా!
ఒరేయి... యిట్టొచ్చిపోవోయ్... బలే మనగోడివి... రాల్నా...
ఇప్పటిదాకా మీరిద్దరు యిట్టే ఉన్నారా ?

రమ:- యిక్కడ్జె వుణ్ణాం. ఏం ?

రెడ్డి:- ఏఁవుండది ? యేఁవీ లేదులే... ఊరికే అడిగినాలే...
(గోపి చాల భయంగా వినమ్రుడై వచ్చాడు)

రెడ్డి:- ఈ అమ్మాయి ఏంది ? నీ పెళ్ళి విషయం మాట్లాడ్డం ఏంది ?...
ఏంది యీ యవ్వారం ? నాకేం తెలవటం లేదే ? నన్ను మోసం
జేసి, నీ యిష్టం వచ్చినట్లు పరాయిపిల్లను తీసుకొచ్చి... తందనా
లాడ్తుండా ? ఎవరుజెప్పారీ బుద్ధి నీకు ? మన యింట వంట లేని
పని జేశావే ?...

గోపి:- నాకేం తెలీదండి...

రమ:- అబ్బ ఎంత మంచివారండి ! ఎంత వినయం!...

రెడ్డి.- అయితే నీవ్ తాటాకు మడిదొక్కినట్లు మాట్లాళ్ళేదనా నీవనేది ?
నీ కేఁవైన భయం వుందాంట ?

రమ:- నాకేం భయం ? నేనేం అబద్ధం చెప్పడం లేదు.

రెడ్డి:- అయితే మావాడికేం తెలీదంటుండాడే మరి !

రమ:- నిజం చెప్పడానికి భయపడ్తున్నారెందుకు ? చెప్పండి... ఏంటిటా కపటం ? చెప్పండి.

రెడ్డి:- మళ్ళీ ఏందో తెచ్చినావే రంపు ?

గోపి:- నాకేం తెలీదండి... నేను మీకు మాట యిచ్చానుగా.

రెడ్డి:- ఏంచిచ్చావో...అసలేందిది ? నీవేంవో దక్షిణాది సంగీత పాట కుదున్నట్టు కటక్కున బిగదీసుకొని నిలబడితివి... యీ అమ్మా యేంవో రేగి మాట్లాడ్తుండా... ఏంది కుమ్మక్కు ! ఇద్దరూ తోడు దొంగలుగా వుండారే ? ఒరే గోపయ్యా ? ఈంవెను పెండ్లి జేసు కుంటానన్నా ?

గోపి:- ఈంవేవో నన్ను పెండ్లాడదలచిందట! నాకేం తెలీదు.

రమ:- మన మిరువురం పెండ్లాడదలచుకోలేదూ?

గోపి:- నాకు జ్ఞాపకం లేదు.

రమ:- నిజం చెప్పండి.

గోపి:- అబద్ధం చెప్పటంలేదు.

రమ:- ప్రమాణం చేయండి.

గోపి:- అవసరం లేదు.

రమ:- అయితే ..

గోపి:- ఇంక నన్ను నమ్మకొని లాభంలేదు. వెళ్ళిపోతే వంచిది.

రమ:- నేను వెళ్ళను...పెళ్ళికావాలి...వెళ్ళాలి...

రెడ్డి:- ఏండబ్బా యీ చంగదం! ఏంటమ్మో చెప్తుండా...నాకు ఒళ్ళే కోపం వస్తుందది.

రమ:- రానీయుంటి...

రెడ్డి:- ఎట్టా?..,

రమ:- ఏం?...

రెడ్డి:- నీవు మొండికేస్తే నేను ఇంకేవాణ్ణైనా? ఎందుకు పిచ్చికపీద ప్రాహ్మ ణ్ణని జూస్తుండా...

రమ:- అంతకంటె నేనూను...

రెడ్డి:- ఏందీ?

రమ:- ముందు నాకు మాటిచ్చి పీకిచ్చారు.

రెడ్డి:- ఇస్తే యిచ్చినాన్నే...అయంతా ఏఁపీ యీలుపడవు.

రమ:- మీ కుమారుడు ముందు నా మాట నెరవేర్చాలి...

రెడ్డి:- ఇదేందిరా యీ రంపు?...అంతా యేర్పాటు జేసుకొని వాళ్లు ఇప్పుడు రాలోతుంటె...యిట్టజేసినావే?...యేంపన్లుయియ్యి?...నేను జెప్పిన పిల్లను జేసుకుంటానని జెప్తివే...మళ్ళీ యీ అమ్మాయిని కొంప పీదికి దెచ్చినా?...నీవు చాల్ను బోవమ్మా! నీవల్ల మాకు బలే రంపు అయిందే! ఏవో యీగలు కుట్టిన పసరఁవాల చిర్రుబుర్రు లాడ్తుం డావే?

గోపి:- (మౌనం)

రెడ్డి:- ఏఁవిరా పలకవు?

గోపి:- నేను మీ యిష్టప్రకారం జేస్తాను. ఈమెతో నాకేం పూచీలేదు...

రమ:- ఈ మాటల్తో లాభంలేదు. మీరు నన్ను పెళ్ళాడక తప్పదు. మీ ఇష్టం వచ్చినట్లు భార్యల్ను కొన్నగొడ్లలా మార్చటం ఎవరు చెప్పారు యీ ధర్మం? మీరు పెండ్లాడాలి, కావాలి ... ఏఁవయినా సరే ... నేను వెళ్ళను. (ధైర్యంగా కూర్చుంది)

రెడ్డి:- ఎల్లకుంటె జేసుకోవా పెళ్ళి...నేను జూడ్తా...
(కూర్చున్నాడు)

రమ:- నేను ఎలా పెళ్ళిజేసుకోనో చూస్తాను.

గోపి:- రమా...ఏఁవిటి?...నీ విలా వొచ్చేయి.

రమ:- నేను రాను...

రెడ్డి:- మా యతలు నూ రుంటాయి ... మా కిష్టపడ్డపిల్లను మేం జేసు కుంటాం. నిన్ను జేసుకోవాలని యాదన్నా రాసుందదాని?

గోపి:- రమా! నీకు నేను మాట యిచ్చుంటె ఉపసంహరించుకొంటున్నాను. ఇక ప్రయోజనం లేదు.

రమ:- నేను ఒప్పుకోటంలేదు.

గోపి:- నా అంగీకారము లేనిది యింక పెండ్లేమిటి?

రమ:- ఇంక మీ యిష్టంలో లేదు...

గోపి:- మా నాన్నొప్పుకోరు.

రమ:- వారితో నాకు ప్రమేయం లేదు.

గోపి:- గడిచింది.

రమ:- కాబట్టే పెండ్లాడ్డానికి ఒప్పుకోండి.

గోపి:- నేను యిప్పుడు అస్వతంత్రుణ్ణి.

రమ:- స్వతంత్రించండి.

గోపి:- తండ్రిమాట తప్పటం తప్పు!

రమ:- అంతకంటె పాపం మమ్మల్నిట్లా ఏడ్పించటం.

రెడ్డి:- యింత జఁవాఖర్చులేకుండా ఆర్గ్యుమెంటు జేస్తుండావే...తాయరువి– నీకు భయఁవేవైనా వుండదాంట?

రమ:- నేనేం దొంగసుకాను...భయపడ్డానికి...

రెడ్డి:- ఎందుగ్గాదో ?

రమ:- నేనేం మీ యింట్లో దొంగిలించలేదు.

రెడ్డి:- నేను లేనప్పుడు నా యింట్లో జొరబడి మావాణ్ణి ఎత్తకెళ్ళా లను కొనిళ్ళా... యింకేం గావాల ? దొంగ దొరక్కుంటే దొరేగదో ? ...దొరికితేగదో పళ్ళుతెరిచేది అబ్బయ్య !... నేను యింకాసేపు

రాకుంటె యిప్పుడు నీ వుండే వూపులో ఎత్తుకెళ్ళేదానివే గదో... సందేహంగూడానాంట.

రమ:- నా సొత్తును మీరు ఎగవేస్తున్నారు.

రెడ్డి:- నే నేం జాకీ లేదుపో...యెగవెయ్యడానికి. ఐలే షావుకారివిలే..

రమ:- ఏం కాక? మీకంటె మాకు పెద్దాస్తి వుందిలేండి...అన్న పేదలంటయి మహారాజును పెండ్లాడ్తె బాగా బ్రతకొచ్చని ప్రాధేయపట్టంలా...

గోపి:- రమా !...నా మాట వినవూ ?...

రమ:- యింకేం చేయదలచారో చెప్పండి...

గోపి:- నీ విలా రా. చెప్తాను.

రమ:- ఏ నూతిలోనో, గోతిలోనో తోయండి... మీ పీడ వదలిపోతుంది..

రెడ్డి:- అమ్మా, యిదేగావాల్నోయ్ ఆదోళ్ళ ఆగాయిత్యావంటెనో ! ఇదా చదువుకొన్నందుక్కా గుర్తు ? ఐలే నేర్చుకున్నారే ? బళ్ళో యియ్యా మీకు నేర్పిన పాఠాలు ? అదగతా తాళు మీ ఆయ్యోర్లను.

రమ:- ఏం, అదగండి... మా ప్రేమ గాదంటారా ?

రెడ్డి:- ఏవిరా...యిందుకా వందలు యేలు ఖర్చుపెట్టి నీవు చదవటం.? చదివినమటుకు చాల్లే నాగేళ్ళకాడికి పా... ఆసలు యిదేంది యీ యికారవు ? యాదన్నా అమ్మా అబ్బలు పెళ్ళిళ్ళు కుదురుస్తారు గాని... యిదేంది పెళ్ళికూతుళ్ళే పెళ్ళిళ్ళు ఏర్పాటు జేసుకోడవు ! శాస్త్రాల్లో, పురాణాల్లో ఆడోళ్ళను మగోళ్లు ఎత్తుకపోవడం చూచావు, యిన్నాం గాని, యీవంతన ఆడోళ్లు మగోళ్లను ఎత్తుకపోవడం నేను యాద జూశ్నా, యిన్లా.

రమ:- ఏం తప్పా ? మీ కెంత హక్కుందో మాకు అంతే... ఏమో. మా కిష్టపడ్డవాళ్లనే మేమూ పెండ్లాడ్తాం... తప్పేవిటి ?

రెడ్డి - మీకు ఏం లోకానుభవం వుందని మీరు మాట్లాడేది ?

రమ:- లోకానుభవంచేతే ప్రేమించి పెండ్లాట్టం మంచిదని తేలింది...

రెడ్డి:- పెండ్లాడి ప్రేమించటం నాజ్ఞెంగాదు గావాల ! ఈవంతన పెండ్లిగాక ముందే ఏం దరువులియ్యి ? మేఁవంతా పనికిమాలినోళ్ళనయినా వనా నీ వనేది ? మాకు అమ్మబ్బలు పెళ్ళిచేస్తే కాపరాలు నిగ్గించు కోదంటా ? మీరే మనగోళ్లు !

రమ:- కాలానుగుణ్యంగా ధర్మాలు, తత్వాలు మార్చుకోవాలి...

రెడ్డి:- మాకేం ఐన్లాపో... మాకు పెద్దోళ్ళ లైనువల్ల యేం యిబ్బందులు రాలేదులే...వస్తే అప్పుడు జూస్తా.

గోపి:- పోసింది, యింత ప్రాధేయపడుతోంది... అంగీకరించండి ... పెండ్లాడ్తాం.

రెడ్డి:- యాద పెండ్లాడేది ! వాళ్ళకు మాటజెప్పి, మళ్ళి ఎవరో దోవన బొయ్యేవాళ్లు పెళ్ళిజేసుకోమన్నపాట... యిప్పుడు యీ దరువుకు తిరిగినా ? యీలుపడదు. జెప్తుండా. ఏం పెళ్ళంటె ఏవో ఎగ తాళిగా వుందదే. కులం తీరుగాని ఐన్లా ? యెయ్యేళ్ళ పంటయి పోయనే... ఏ వనుకున్నావు ?...యీలుపడదో ! నీవు దోవమ్మా. చాల్నో... యిప్పటికి జరిగింది.

రమ:- నేను వెళ్లను.

రెడ్డి:- ఏందో ఐలే యికాలాలుగా వుండాయే...ఎవర్నో ఒకరిని పెండ్లిజేసు కోరాదో ? యీన ఒక్కడేనా మగోడు లోకంలో ? అందరు నీయాల ప్రేమించి పెళ్ళి జేసుకుంటుండారు గాఁవాల ? పెద్దోళ్ళు ఎవర్నోళ్ళి కట్టిబెట్టే కాలం ఎళ్ళదోసుకుంటుళ్ళా ? ... ఏఁవో ఐలే గట్టి పట్టు పడ్తావుండావే ! ఎవర్నో ఒకర్ని కట్టుకుంటే కాలం ఎల్లిపొయ్యే దానికి. మా యతలు మేము బడ్తాం ... వాణ్ణే గావాలంటె...మాకు కులం, గోత్రంగాని ఐన్లా? ... వా దిష్టఁవా ?

రమ:- మేఁవూ రెడ్లఁవేలెండి !

రెడ్డి:- యట్లా ! ...

రమ:- మేమూ మీలాగే రెడ్లం...

రెడ్డి:- ఏం రెడ్లు ?

రమ:- పంటకాపులం.

రెడ్డి:- పంటకాపులా ?

రమ:- అవును. పంటకాపులయితే పెండ్లికంగీకరించరా ఏం ?

రెడ్డి:- ఏ వూరు ?

రమ:- ఈవూరే లెండి...

రెడ్డి:- యాద వుండేదమ్మా ?

రమ:- మాంబళంలో.

రెడ్డి:- మీ తండ్రిగారి పేరేవో?

రమ:- ఎందుకూ, అక్కర్లేదులెండి.

రెడ్డి:- చెప్తే తప్పా?

రమ:- పోలీసుకు పట్టిస్తారా ఏం?

గోపి:- చెప్పేయి పరవాలేదు...రమా! చెప్పేయ్.

రెడ్డి:- నీకు తెలుసంట్రా? తెలిస్తే జెప్పరాదో? ఏందా దాపరికం?

గోపి:- నాకు తెలీదండీ. పోసీ...

రమ:- మా పెళ్ళి కంగీకరిస్తారా?...

రెడ్డి:- ఓహో! నీవు ఒడులుకొనేటట్టు లేదే...కడుగునీళ్ళు బోసినా ఉట్టొంక జూస్తుండావే?...

గోపి:- రమా! చెప్తే వినవూ?...ఆయన యిష్టప్రకారం ప్రవర్తించు, కనిక రిస్తారు.

రమ:- మీరే చెప్పండి.

రెడ్డి:- యాకిక తెలిసినట్టుండదే...యేందో యాళ్ళిద్దరి సందన రవంత దాపరికం వుండదే!

గోపి:- అబ్బె, నాకు తెలీదండి.

రమ:- మా నాన్న పేరు కుప్పుస్వామిరెడ్డిగారు.

రెడ్డి:- ఏ కుప్పస్వామిరెడ్డి?...

రమ:- కుప్పస్వామిరెడ్డి— అడ్వకేటు...

రెడ్డి:- యట్టా! మా కుప్పయ్య కూతురివంటమ్మా?

రమ:- మీ కుప్పయ్య ఎవరు?

రెడ్డి:- కుప్పస్వామిరెడ్డి మా కుప్పయ్యగదో! ఎవురనుకున్నావ్? కుప్పయ్య కూతురివంటమ్మా? నే నెవరో పరాయివాళ్ళనుకున్నా... అమ్మా, పొరపాటె...ఏఁవనుకోబాకమ్మా...

గోపి:- ఇంతకూ యీ అమ్మాయిని మీరు చూళ్ళేదన్నమాట!

రెడ్డి:- నేను యాడ జూచాను...నేను జూచేలోపల యింతజరిగెనే...

గోపి:- చూడకుండానే మీరు వర్ణించారే...

రెడ్డి:- యిప్పుడు మాత్రం అంటున్నా...కులం తీరు జూడాలగాని పిల్లనేది జూచేదని!

గోపి:- యిప్పుడింతకు మా పెళ్ళికి అంగీకరించినట్టేనా?

రెడ్డి:- ఆచ్చాపణ ఏంవుండది... కుప్పయ్య కూతుర్ని జేసుకోవాలనే గదంటోయ్...యిఁతదూరం నేను గట్టిపట్టు పట్టింది? ఎవరో పరాయోళ్ళ పాడుపీడ యింతసేపు ఏమందల తెలీకుండా మాట్లాడుకోవలసి వచ్చిందే...పొరపాటే... కుప్పయ్య కూతురివంటమ్మా... ఏవఁనుకోబాకమ్మా...

రమ:- లదులెండి...

రెడ్డి:- ఏఁ పుండడల లసుకోటానికి... నే నేం పొరపాటుగ ఏవనలేదు... పెద్దోళ్ళమాటి యినమన్నా...అంతేగదో. ఒరే గోపయ్య-లె, మీరు బోయి కాపి తీసికో బోండి. పలారాలు, కాపి తీసుకో బోండి... నీవుకూడా బోరా ... కొత్తోళ్లగదో... చిన్నోడా! వాళ్ళకు ఏం గావాల్నో బాగా యిచారించరా. నేను వస్తుండా... పదండి పొద్దు బోయింది. [రమ మెల్లగా పోతుంది... గోపికూడా వెళ్తున్నాడు] ఒరే! కూడాబోయి యిచారించరా. ఏ వో యెనక దండెమీద తార

ట్లాడ్తావే? గడ్డిమీద గొడ్లోంతొక్కలాడ్తావే! అంతా మీ తాత సోది కరా సీకో... [గోపికూడా వెళ్ళాడు]
(రెడ్డి యేమో సర్దుతూ ఉండగా కుప్పస్వామి రెడ్డి వచ్చాడు...చాలా కంగారుగా వున్నాడు...మాటలు తొట్రుపాటు కూడా వున్నాయి... కొంచెం కొంచెంగా తేరుకొంటున్నాడు...)

రెడ్డి:- [గమనించాడు] ఏఁవయ్యో కుప్పయ్యా, దండంబెడతా...రా... కూర్చో...మేవేఁవో పెళ్ళికి సిద్ధం...హూరాగా వస్తాం జనం ..మరి ఎంతమందికి బోజనం బెడ్తావో...ఎట్ట యిదారిస్తావో...ఏంకతో...

కుప్పయ్య:- నన్ను మీరు మన్నించాలదా...

రెడ్డి:- యిదేంది యీ అనడం...

కుప్పయ్య:- ఏందా చేస్తును...

రెడ్డి:- మా బంగం హూరాగా వుండారు...అందుకు ముందు జెప్తే మంచిదని చెప్పినా... అంతేగదో...భయపడ్తుంటావే...

కుప్పయ్య:- అంత నోముదా నోయలేదని...ఏడుస్తావుండాను. ఏం చెప్పుదును మీకు మూతి జూపేదానికిదా సిగ్గుతో చస్తాను... ఏమి చేస్తును... మాటదా వినేదిలేదు...

రెడ్డి:- ఎందుకు గత్తర పడ్తుండావే?

కుప్పయ్య:-ఆమె ఎవర్నో తనతో చదివేవాణ్ణిదా పెండ్లిచేసుకోవాలని మొండి చేస్తావుండది.

రెడ్డి:- పెండ్లిగాకముందే ఏందీ యతలంట?

కుప్పయ్య:-కాలందా!...

రెడ్డి:- ఎవురేం జేస్తారు? ఆడోళ్ళు మొగోళ్లు ఒక్కచోట కూడుతుండిరి... అడ్డగింపు లాకపాయ...యింక వూర్కో వుండమంటే, యీలవద్దా? ఏఁవన్నా కరగోడలు ఏసేటట్టయితే ఏఁవో అడ్డగింపు చేయొచ్చు! యాద యీలవద్ది? మంచి సెబ్బర్లు వాళ్ళకు వాళ్ళు తీర్మానం జేసుకోవాల్సిందేగాని ! ఎవరు కావళ్లుగాస్తారూ ? కుప్పయ్యా, అయితే యింతా ఏఁవయింది?

కుప్పయ్య:-ఏమి అయింది...వాణ్ణిదా చేసుకోవాలని మొండిదాచేస్తుంది...వాడు ఎవడో పనికిమాలినవాడుదా...దీనికి దాపరించి వుండాడు...కష్మి నాటి ముండావాడు.

రెడ్డి:- మంచోడేఁవోలే...లాకుంటే మీ అమ్మాయి అట్టంటదా?

కుప్పయ్య:-ఏమో మంచో సెబ్బరో నేనుదా చూస్తినా? నిండా అవమానందా... ఏమో నా మాట వినకపోనాని తలిస్తిని, ఎంత జతిమాలిని ... ''వాళ్లనిండా గొప్పవాళ్లు...వాళ్ల బిడ్డా నిండా పెద్ద చదువు చదివిన వాడు...పాడి పంటా అంతా లక్ష్మీకటాక్షంతో తులతూగుతారు... ఇట్లాచేస్తే మన పరువుపోను...మంచి సంసారం ఒప్పుకో అమ్మా''ని జతిమాలిని...

రెడ్డి:- ఏవో ఒప్పుకోక పోవడం? వాణ్ణి ప్రేమించింది గాఁవాం పాపం... అయినా పెద్దోళ్ళమాట లేకుండా యింత పని జరిగిఁదే! పోనీ వాడు మంచోడయితే వదిలై, మళ్ళి యాద యతకతావు...యతలుపనిగదో?

కుప్పయ్య:-నా కిష్టం లేదు...

రెడ్డి:- అయితే యిప్పుడేం జేయాలని?

కుప్పయ్య:-మీతో సలహాపడ్తామాని వస్తిని...

రెడ్డి:- వకీలు వయితివే...నీ కేంది నేను సలహాజెప్పేది? అమ్మాయి యింటి కాడుందదా?

కుప్పయ్య:-నామీద కోపంవచ్చి వెళ్ళిందిదా...

రెడ్డి:- అయితే యింకేంది మనం జేసేది...యాద దాగురుమూత శాడు తుండదో...యాడని యెతికేది?

కుప్పయ్య:- పోలీసుకు రిపోర్టు చేస్తామని ఆలోచిస్తాను.

రెడ్డి:- రిపోర్టా?

కుప్పయ్య:- ఎంత నగా నట్రా పుండది ! ఎవరో షోదావాణ్ణి కట్టుకుంది నే నొప్పుదునా?... వాడుదా కంటికి కనబడ్తే కాల్చేస్తును. గూండా...

రెడ్డి:- తొందర పడబాక. అవతల పోలీసోళ్ళతో కలదెలుపుకునేది బలే గడుసు. ఊరికే పీక్కతింటారు, వందలీమని... యేలీమని. యాడిస్తావ్?

కుప్పయ్య:- రెడ్డిగారూ క్షమించండి. మీ రేమి అనుకోవద్దు. అమ్మాయిని పట్టు కొంచె నిదానంగా పెళ్ళి ఆలోచిస్తాము.

రెడ్డి:- కారు కొనమంటివే ! యిప్పుడే వాళ్ళ పరుగంటుకునేది గదుస్తైతే యింక దాంట్లో కూకోని ఎల్తుంటే ఎవురు వాళ్ళపరుగంటుకునేది... చెప్తినే అప్పుడే...

కుప్పయ్య:- నిజం చెప్తిరి, అబ్బాయిని చూచి క్షమాపణ చెప్పిపోతాను... కాస్త పిలుస్తురా.

రెడ్డి:- ఒరే గోపయ్యా ! యిట్టొచ్చిపో.

కుప్పయ్య:- బంగారంలాంటి సంబంధందా... పాడుజేసింది అమ్మాయి.... పోలీసుకు రిపోర్టుచేస్తే వాళ్లుదా రోగం కుదురుస్తారు... [గోపి వచ్చాడు]

రెడ్డి:- కుప్పయ్య కూతురు యాడికో పలాయనం చిత్తగించిందంటనే...

గోపి:- ఎక్కడకి వెళ్ళిందేం ?

రెడ్డి:- నీకు వాళ్ళమ్మాయిని యిస్తావని తీర్మానం జేసుకొని యింటికిబోయి, ఆమందలు వాళ్ళ పిల్లకుజెప్తే ఒప్పుకోక తిరగబడి యాడికో యెళ్లిందంట.

కుప్పయ్య:- క్షమించండి... తప్పుజేస్తిని.

గోపి:- పోనీండి...ఆమె యిష్టం...ఆమె పెళ్లికి మీ నిర్బంధం ఎందుకు ?

రెడ్డి:- ఈడు...తక్కువయినోడాంట. నేను యింటికొచ్చేటప్పటికి ఎవర్నో పెళ్ళిజేసుకొని వంటింట్లో కారపం బెట్టాడు... యింకెట్ట తరిగేది... ఒప్పుకొని నోరుమూసుకొని వుండా... దొంగకు తేలుగుట్టినట్టు...

కుప్పయ్య:- అయితే ఎట్టచేస్తురు ?

రెడ్డి:- మీ అమ్మాయి ఎగటాయించి ఎత్తే నీవేం జేశావు? అంతేగదూ ... నేనుగూడ జేసేది. పోసీ మా కోడల్ను జూచిపో. గోపయ్యా! పిలు ... [గోపి వెళ్ళాడు]

కుప్పయ్య:- పిలవండి చూస్తాను. ఎవురో అదృష్టవంతురాలుదా. మా బిడ్డదా దరిద్రురాలు అయిపూడ్చింది.

రెడ్డి:- ఎవురి అదృష్టం వాళ్ళదిలే... మనమేం జేస్తావు...

కుప్పయ్య:- ఎంత బతిమాల్తిని...మంచి సంబందందా పూడ్చింది...

రెడ్డి:- ఇప్పుడేం ముణిగిపోలేదులే.

కుప్పయ్య:- మీ వాడికి పెళ్ళిదా అయింది... యింకేమిదా చేసేది ?

[గోపి వచ్చాడు]

రెడ్డి:- అమ్మాయి ఏదీ ?

గోపి:- వస్తూంది.

రెడ్డి:- రమ్మను...

గోపి:- చపలా !

రెడ్డి:- ఆమె ఎవరు ? యింకోళ్ళిగాని కొంపమీదికి దెచ్చినావుగనేం ? మనగోడివి !

గోపి:- నేను ఆమెను అలా పిల్చే వాడుకలెండి.

రెడ్డి:- ఏమన్మా... మీ నాయన పిలుస్తుండారు-రా...

కుప్పయ్య:- మా అమ్మాయి యిక్కడ వుందదా ?... [ఆశ్చర్యం]

రెడ్డి:- వాళ్ళ నాయనగూడా కుప్పయ్యలే- అందుకని అట్టన్నా. పరాయి బిడ్డలు ఎవరయినా మన బిడ్డలొంటోళ్ళిగదో!...

కుప్పయ్య:- ఆ బిడ్డ మా అమ్మాయి కాదని కనుక్కొంటిరా ? మీకుదా మా అమ్మాయిని తెలుసునే...

రెడ్డి:- నాకేం తెలుసు! మీ అమ్మాయిని నేను జూచుండానా? తెలీడానికి యింత బలే మనగోడివే! మీ అమ్మాయి ఎల్తుంటే మావాడు పట్టు కొచ్చి ముడేసుకొన్నాడు...

కుప్పయ్య:- [చకితుడైనాడు] ఏమిదా చెప్తారు రెడ్డిగారూ?

రెడ్డి:- ఇంకేంది జెప్పేది... యెప్పుడో పెళ్ళయిపోయిందిపో... మనం పెళ్ళిజేసిందాక కనిపెట్టుకొని ఉన్నారనుకొంటుండా...

కుప్పయ్య:-ఏమాను...మీ అబ్బయ్య పెండ్లాడినాడా?

రెడ్డి:- ఓహో! యాడ నీ వినేదీ? గత్తర్లో వుండావే...

కుప్పయ్య:-చచ్చిదా బతికితిని...

రెడ్డి:- నిజమేలే...

కుప్పయ్య:-మా అమ్మాయిని గోపికి యెట్ట తెలుసు?

రెడ్డి:- బెంగుళూరులో యిద్దరు ఒక్కచోటంటనే జదివేది...

కుప్పయ్య:-అమ్మా! రమా! రమా!...ఏవమ్మా నిండా కష్టపెట్టివి? నీవు కోపంతో బైటవస్తివి...నేను యేమో భయబడి చస్తిని-తల్లి...
[రమ నాయన కాళ్ళమీద పడింది-కన్నీళ్ళు]

కుప్పయ్య:-(లేవదీశాడు) అమ్మా, యిది యేమి ఏడుస్తావు? మంచి పనిదా చేసినావు. నాకుదా సంతోషం. రమా!...రమా!...

రమ:- క్షమించండి...

కుప్పయ్య:-అమ్మా! ఏడ్వవద్దు ... నాకుదా యిష్టమయిన పనిజేశావు. సంతోషందా...రెడ్డిగారికి దణ్ణంబెట్టు.

రెడ్డి:- ఎందుకూ? ఏంబన్లాపో. నీకు దణ్ణంబెడ్తె చాలదూ. ఏమో చెప్పిన సామెతగా వుండే లందుకో పళ్ళాడాయంట. నీ బిడ్డ, వాడి పెళ్ళాము...మధ్య నాదేంది?
(రమ సమీపిస్తుంది)

కుప్పయ్య:-పెద్దవాళ్లదా.

రెడ్డి:- ఏంబన్నాపో; ఎందుకాబిడ్డను లేవను వంగను యతలుబెట్టేది.

కుప్పయ్య:-రమా! దణ్ణంబెట్టమ్మా.

(రమ కాళ్ళమీద వాలింది)

కుప్పయ్య:-ఆశీర్వదించండి...

రెడ్డి:- నేనేం మంత్రాలు జదివుండనా కుప్పయ్యా?

కుప్పయ్య:-''సుఖీభవ'' అనండి...అంతదా...

రెడ్డి:- సరే...కుప్పయ్య ఒదులుకునేవాడేనా అనకుంటే...మొండిపట్టు, కోతి పిడికిలి. అమ్మా! మీరు ఆలుమొగుడు కలకాలం కాపురం నెగ్గించుకొంటూ, కట్టుకొన్నోడు కాస్త ఎతలుబెట్టినా ఎగసందోసుకుంటూ, యెవరైనా యింటి కొచ్చినోళ్ళకు చేయి జాచినోళ్ళకు, మనతోపాటు గంజో ... లంబిలో పోస్తా కష్ట సుఖాలు, మంచి సెబ్బర్లు మస కెట్టనో ఎదటోళ్ళకుగూడా అట్టనే ననుకొంటూ, మీ పుట్టింటోళ్ళకు ... యిట్టా మాకు మంచి పేరుదెచ్చి లచ్చణంగా యెయ్యేళ్ళు కాపరం నిగ్గించుకో బోమ్మా...లే తల్లీ లే.

కుప్పయ్య:- గోపి... రమా... మీరిద్దరు నాయన కాళ్ళమీద నమస్కారం జేయండి (రమ, గోపి ఇద్దరు జేశారు.)

రెడ్డి:- ఆలుమొగుడు ఒకరి కష్టసుఖాలు ఒకరు యిచారించుకొంటా కాపరం నిగ్గించుకో బోండోయ్.

కుప్పయ్య:- అమ్మా...రమా! గోపి కాళ్ళమీదబడి దణ్ణంబెట్టు... భర్తదానే...

(రమ అలా చేస్తుంది)

రెడ్డి:- చాల్లే కుప్పయ్యా! ఆయనకు దణ్ణాలుబెట్టడానికి గాని యింక కాలం లేదుగనేం? వంగను లేవను...లేవను వంగను...మాతో సంబంధం జేసిందానిగనేం...యీ శిక్ష...

(రమ గోపి కాళ్ళమీద బడింది... గోపి లేవదీశాడు)

రెడ్డి:- దేపుడు పెట్టిన ముహూర్తం యిదిగదంటయ్యా... మనం నెంరోజులు నాటికి పెళ్ళి చేయాలనుకొంటిమే.

కుప్పయ్య:- అంతా దేవుడి దయదా.

రెడ్డి:- కుప్పయ్యా! ఇంక వాళ్ళాయతలు నూరుంటాయి... మనం బోదాం పా... మనం యీడుండగూడదు... రా... నీకు ఐరవ లేదులే... కూతురు ఎప్పటికయినా మా నాయనే... మంచి సెబ్బరే అనుకుం టుందిగాని, కొడుక్కు పెళ్ళాం వచ్చినపాట... యింక నాయనకు నాఁవాలేగదో. మనం యింక వెళ్దాంరా.

(ఇద్దరు వెళ్ళారు. గోపి రమా ఉన్నారు. రమ సిగ్గుతో తలవంచు కొనివుంది.)

గోపి:- రమా!... ఏమిటిసిగ్గు... (రమ యింకా అలాగేవుండి) దేవతలు పూలవర్షం కురిపించలేదనా కొరవపడ్తున్నావ్?

రమ:- కనుక్కొన్నారు...యింకేం. నారదుడు తన సంతోషాన్ని వెలిబుచ్చ డానికి రాలేదేఁవాని ఆలోచిస్తున్నాను.

గోపి:- అదా ! యింతకూ మన యిరువురి హృదయాలు ఒకటైనప్పుడు ఆ ఆశీర్వచనాలు అట్టె మనమీద ఏంపని చెయ్యవు.

రమ:- ఎలాగో యీ ''తుపాను'' లోంది గట్టు ఎక్కాం...యింక రండి... మళ్ళీ మీ నాన్నొస్తున్నారు.

(ఇద్దరూ లోనికి వెళ్లతూండి తెఱ)

స మా ప్త ం

ఎవరు దొంగ?

రచన :

ఆచార్య ఆత్రేయ

పాత్రలు

దొంగ

చౌదరి

కానిస్టేబుల్

సబ్ ఇన్‌స్పెక్టరు

హారెస్

డి. యస్. ఓ.

మునసబు

డాక్టరు

పత్రికా విలేఖరి

ఇద్దరు ఖైదీలు, కుర్రవాడు

[తెర ఎత్తకుండానే నాటకము మొదలవుతుంది. మొట్ట మొదట నాటకము మొదలు పెడుతున్నారని ప్రేక్షకులకు తెలియడానికి మైక్‌లో ఫలానావారు – ఫలానా వారు రచించిన "ఎవరు దొంగ" అన్న ఏకాంకిక ప్రదర్శిస్తారు, అని ప్రకటన చేయబడుతుంది. తరువాత బెల్ అయిన వెంటనే పోలీసు విజిల్స్ నాలుగైదు వరుసగా గోలగా వూదబడతాయి. నలుగురైదుగురు బూట్ల కాళ్లతో పరుగెత్తుతున్న ధ్వని. రాను రాను దగ్గరవుతుంది. కాసేపటిలో తెరముందునుంచి ఒకతను వాయువేగముతో పరుగెత్తుకొచ్చి స్టేజీ దిగి కూర్చుంటాడు. ఆ తరువాత ఒకతను పరుగెత్తుకువచ్చి ఆగి ఇటు ఇటు చూచి, స్టేజీ దిగి, ప్రేక్షకుల దగ్గరకొచ్చి ప్రేక్షకులనంతా కలియచూచి, ముందు వరసలో వున్న వాళ్ళను చూచి-]

అతడు:- అరె. ఇలా ఒకతను పరుగెత్తుకొచ్చాడు. చూచారండి మీరు? ఇప్పుడే వచ్చాడు. అరె! ఇంతలో ఎలా వెళ్ళాడు? దొంగవెధవ. మీరెవరూ చూడలేదాండి? వాడు దొంగండీ. మనమంతా ఇక్కడున్నామని తెలిసి ఎలా వచ్చాడో చచ్చాడు హాస్టల్లోకి. మెల్లగా ఇటు ఇటు చూచి స్టోర్సు తాళం పగులగొట్టి లోపల దూరాడు సార్. రాస్కెల్. నేను కనపడ్డేటప్పటికల్లా పరారయ్యాడు. కాస్త చూడండయ్యా చూడండి.

[ప్రేక్షకులలోంచి ఒక కుర్రాడు లేచి]

కుర్రాడు:- అరె! హాస్టల్‌లో దొంగ చూశాడా? ఏం పట్టుకెళ్ళాడో? ఇప్పుడే ఇలా ఎవరో పరుగెత్తు కొచ్చారోయ్.

2 వ వాడు:- (తమిళంలో) ఆమా; ఆమా; నాను పాతేన్. ఇప్పిడా వందాన్.

3 వ వాడు:- (ఇంగ్లీషులో) జస్టు ఐ సాయె ఫెలో రన్నింగ్ ఫ్రం దే

4 వ వాడు:- ఏరా, ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ కాదుగదా కొంపదీసి?

1 వ వాడు:- అయితే వార్డెన్‌తో చెప్పాలా?

అతను:- వార్డెన్ ఎక్కడ?

1వ వాడు:- చూడు, బ్రదర్, చూడు, ఆ మేకప్ రూంలో వు-టాడేమో, వద, వద,

[ఒకటవవాడు, అతడు స్టేజిమీదకు పరుగెత్తుతారు. ఇంతలో వార్డెన్ వస్తూ]

వార్డె: ఐసే, ఏమిటిగోల ! నాటకం జరగనీకుండా. వాట్ ఈజ్ దాంగ్ విత్ యు !

అతను: హాస్టల్ స్టోర్స్‌లో దొంగ పడ్డాడండి.

వార్డె: దొంగ !

1 వ వాడు:-అవునటండీ.

వార్డె:- తాళం పగలగొట్టాడా ?

అతను:- అవునండీ !

వార్డె:- మనిషిని చూసావా ?

అతను:- ఎవడో బెగ్గర్ వెధవండీ. రేగ్స్ (చింకిపాతలు)లో ఉన్నాడు.

వార్డె:- వాచ్‌మన్ అంతా ఏం చేస్తున్నారోయ్ ?

1 వ వాడు:-ఇక్కడ నాటకం చూడ్డాని కొచ్చేరండి.

వార్డె:- నాన్ సెన్స్. ఆ వెధవంకూ వైజ్ఞానిక వారోత్సవాలు కావలసి వచ్చినాయ్ ? కమాన్ కమాన్. వెళ్ళి ఆక్కడ ఏం జరిగిందో చూద్దాం రండి. [పోతూ, వెనక్కు తిరిగి] మహాశయులారా ! ఈ అవాంతరము కలిగినందుకు విచారిస్తున్నాము. తొందరలో ఇంజనీరింగు కాలేజీవారి నాటకం మొదలు పెడతాం. మీరు కాస్త ప్రశాంతంగా వుండాలి. ఇప్పుడే వస్తా [అని పోతుండగా, ఎదురుగా పోలీస్ సబ్ ఇనస్పెక్టరూ, కానిస్టేబుల్ వస్తారు]

వార్డె:- పోలీస్ !!!

సబ్ ఇనస్పెక్టరు:-గుడ్ మార్నింగ్ సార్.

వార్డె:- గుడ్ మార్నింగ్. ఏం కావాలండీ ?

స.ఇ:- ఏం లేదండీ ? ఈ హాస్టల్ వార్డెన్ గారెవరండీ ?

వార్డె:- నేనే, ఎందుకండీ ? దొంగ దొరికాడా ?

స.ఇ:- దొంగా ?

వార్డె:- ఆగండి. దొంగండి. హాస్టల్ స్టోర్సులో తాళం పగలగొట్టి దూరాడు. మనిషి కనపడేటప్పటికల్లా పత్తా లేకుండా పోయాడు.

[ఇంతలో లోపలనుంచి ఒక కుర్రాడు పరుగెత్తుకొస్తూ]

కుర్ర:- సార్! సార్!

వార్డె:- ఏం ?

కుర్ర:- మనం నాటకానికి తెచ్చిన డ్రస్సు మూటంతా కనపడ్డం లేదండీ.

వార్డె:- వెదకండోయ్ ! ఎక్కడో వుంటుంది. అన్నీ ఇప్పుడే వస్తాయి మీకు.

కుర్ర:- వెదికామండీ ! ఎక్కడా లేదు. ఇప్పుడే తెచ్చి ఆ బైట డ్రెసింగ్ రూమ్‌లో పెట్టాం. ఒక్క మినిట్! చూస్తే లేదు.

వార్డె:- చూచారండి, ఇదీ ఆ దొంగే కొట్టేసుంటాడు. సందేహం లేదు.

స. ఇ:- దొంగ ఎలా పారిపోయాడో ఎవరన్నా చూసారా?

అతను:- కాస్త దూరంనుంచి టార్చివేసి చూడానండి, మనిషి ముఖం కన పడలే! ఒక ముష్టివాడిలా ఉంటాడు. చిరిగిన చొక్కా, చింపిరి తల అయిదడుగుల రెండంగుళాలు లేక మూడంగుళాలు ఉంటాడు.

స.ఇ:- లావుగా వుంటాడా! బక్కగా వుంటాడా?

అతను:- మీడియం (మధ్యస్థం)గా ఉంటాడండి.

స.ఇ:- [కానిస్టేబుల్‌తో] ఏయ్! ఈ గుంపులో ఎక్కడన్నా ఉన్నాడేమో వెతుకు.

[కానిస్టేబుల్ స్టేజి దిగి ఆడియన్సులోంచి మెల్లగా దూరుకుంటాడు]

స.ఇ:- వాడు వెతికి పట్టుకొస్తాడు లెండి; మీరు కాస్త దయచేసి స్టేషన్ దాకా రావాలి.

వార్డ:- దొంగ దొరకండే !

స.ఇ:- దొంగ వాడే దొరుకుతాడు లెండి.

వార్డ:- రేపు మార్నింగు రాకూడదూ? నాకో ఫంక్షనుంది.

స.ఇ:- లేదండీ! వెంటనే రావాలి.

వార్డ:- కాస్త కూచోండి, వెళ్దాం! ఇప్పుడు ఇంజనీరింగు కాలేజీవాళ్ళ నాటకం వుంది. చూచిపోదాం. లాస్ట్‌యియర్ (నిరుడు) ఫస్ట్‌ప్రయిజ్ వచ్చింది వీళ్ళకే. ఈసారి కూడా మంచి నాటకమే ఆడతారు. చూచి వెళ్దాం ఏమంటారు?

స.ఇ:- నో, ఎక్స్‌క్యూజ్‌మి; ప్లీజ్; క్షమించండి. మాకు నాటకాలు చూసే తీరిక లేదు.

వార్డ:- పోనీ రేపు మార్నింగ్ వచ్చి రిపోర్టు యివ్వకూడదాండీ?

స.ఇ:- రిపోర్టు యిదివరకే యిచ్చేశారు. ఇక మీరు యివ్వాల్సింది సంతా యిషినే!

వార్డ:- ఏమిటి ?

స.ఇ:- యు ఆర్ అండర్ అరెస్టు. (మిమ్మల్ని అరెస్టు చేశాం)

వార్డ:- అరెస్టు! మైసెల్ఫ్! వాట్? నన్నా, ఏమిటి!

స.ఇ:- యు ఆర్ అండర్ అరెస్టు.

వార్డ:- ఓ.....

స.ఇ:- రాండి సార్, రండి !

[ఇంతలో ఒక కానిస్టేబుల్ గబగబ వస్తాడు.
సబ్ ఇన్‌స్పెక్టరుకి సెల్యూట్‌కొట్టి.....]

కాని:- సార్ !

స.ఇ:- ఏం రా ?

కాని:- బాపూజీ రైస్ మిల్లుదాకా వెళ్ళి రావాలి సార్!

స.ఇ:- ఎందుకూ ?

కాని:- పెద్ద గొడవ జరుగుతూందండి అక్కడ !

స.ఇ:- ఏమిటా గొడవ ? ఐందిపోటా ?

కాని:- కాదండి !

స.ఇ.- కమ్యూనిష్టుల కాలచేజా ?

కాని:- కాదండి !

స.ఇ:- మరి ఏమిటి నీ తలకాయ్ !

కాని:- వచ్చి చూడండి సార్ !

స.ఇ:- చెప్పవోయ్, ఏం ఫరవాలేదు.

కాని:- నేనలా మిల్లు దగ్గర నిలఐడి ఉన్నాను సార్ ! లైట్లున్నట్టనిపించింది. ఏమిటిరా, అర్ధరాత్రిలో లైట్లేమిటని కాస్త చెవిపెట్టి విన్నానుసార్! ఎవరో యిద్దరు మాట్లాడుతున్నారు. ఒక అతను ''మూటకు అరపడి రాళ్ళు కలిపితే మీ కెంత లాభం వస్తుందయ్యా ! నువ్వు సుమారు 60 లక్షల మూటలు సప్లయి చేస్తున్నావు. అరవై లక్షల అర్ధ రూపాయలు 30 లక్షలు వొస్తుంటే, మాకు పదివేలివ్వడానికి ఏడుస్తావు ? సరే నీ ఇష్టం" అంటున్నాడండి. ఇంకో అతను "మన సంబంధం యీ రోజుతో తీరేదండి! యింకా వుందిగా! ప్రస్తుతం ఈ అయిదూ తీసుకొండి. మీముందున్న ఆఫీసరుగారు కూడా ఇంతే పుచ్చుకునేవారు'' అంటున్నాడండి. ఏమిటో గొడవ !

స ఇ:- ఊఁ. గొడవ ఏముందీ ! కరప్షన్ (అవినీతి). ఈలాంటి మనుషులుంటే, దేశంలో తిండి ఎందుకుంటుంది? తిండి లేకుండా చస్తారంటే ఎందుకు చావరూ? ఛీ... ఛీ... ఆల్‌రైట్, రాండి.

వార్త:- జస్టు ఎ మినిట్ ప్లీజ్; మహాశయులారా ! ఈ నాటక కార్యక్రమం యధాప్రకారంగా సాగుతుంది. ఇంజనీరింగు కాలేజి వారు నాటకం ఆడతారు; సెలవు. (సైడ్ కర్టన్సులోకి చూచి) కమాన్, కమాన్ ఆరంభించండి. తెరెత్తండి, తెరెత్తండి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది.

[అని అందరూ వెడతారు; తెర లేస్తుంది]

[ఒక పోలీసు స్టేషన్-సబ్ ఇన్‌స్పెక్టరు వచ్చి కూర్చుంటాడు]

[ఒక వైపులో ఉన్న రిమాండు సెల్లులో ఒక రిద్దరు ఖయిదీలు ఉన్నారు. -తెర లేచేటప్పటికి]

2 వ ఖైదీ:- "ధాంగలెవరో దొరలు ఎవరో" తెలుసుకొనవొయ్ బ్రహ్మయా !

1 వ :- " అన్నమైతే నేమిరా సున్నమైతే నేమిరా.

2 వ :- ,, అందుచేతను పాడుపొట్టకు అన్నమే వేతామురా!

(అని పాడుతుంటారు)

[ఇంకొకవైపు బియ్యపు బస్తాలు ఉన్నాయి కుడివైపు నుంచి బావిలో పెద్ద బరువయిందేదో వేసినట్లు రెండు మూడుసార్లుశబ్దం, తరువాత కెవ్వుమని ఒక అరదాని కేక. ఈ పాటికి సీటు లోంచి లేచిన స.ఇ. గాభరాగా పరుగెత్తుతాడు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు ద్వారం దగ్గరకువచ్చి ఆత్రంగా చూస్తుంటారు. బయట ఏదో గోల. ఇంతలో కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చాడు. టేబిలుమీద ఉన్న టార్చి లైటు, మూలనున్న చేంతాడు తీసుకొని మళ్ళీబయటకు పరుగెడ్తాడు. ఒక క్షణము నిశ్శబ్దం. స.ఇ. తొందరగా వచ్చి టేబిల్ మీదనున్న టెలిఫోన్ తీసుకుని, "హలో ! హలో ! డాక్టర్ అర్జంటు, కమాన్ క్విక్" అని టెలిఫోన్ పెట్టేస్తాడు. గాబరాగా అటూ ఇటూ తిరిగి, "చూస్తూ, నిద్చాంటారేమిటిరా ఇడియట్స్, వస్టుఎయిడ్ ఇవ్వండిరా!" ఇంతలో ఇంకొక కానిస్టేబుల్ వస్తాడు.]

కాని:- ముగ్గురు బిద్దలు దొరికారండి.

స.ఇ:- ఓ మైగాడ్! ముగ్గురు బిద్దలే? అందరూ చచ్చిపోయారా?

కాని:- చచ్చి ఎప్పుడో పోయారండి.

స.ఇ:- ఛీ. ఛీ ఛీ నేను చూస్తున్నా! ఏమిటో ఈ స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచీ ఒకటే చావులు! ఒకటే ఆత్మహత్యలు!

కాని:- ఇంగ్లీషువారుండగా చావటానికి స్వాతంత్ర్యం లేదండి.

స.ఇ:- అయితే ఇప్పుడు స్వాతంత్ర్యం చావటానికి వచ్చిందంటావా?

కాని:- ఆ రోజుల్లో మన కాంగ్రెసు వాళ్ళు ఉపన్యాసాల్లో కానిసలుగా బ్రతకడంకన్నా, స్వతంత్రులుగా చావటమే మేలనేవారండి!

స.ఇ:- కాదురా ఈడియట్! బానిసలుగా పాయసం తాగడం కన్నా స్వతంత్రులుగా గంజి తాగటం మేలని.

1 వ ఖైదీ:- ఇప్పుడు కాయకూరలు తింటమే మేలంటున్నారండి.

[ఇంతలో డాక్టరు వచ్చాడు]

స.ఇ:- హల్లో డాక్టర్!

డాక్ట:- ఏమిటండి గొడవ?

స.ఇ:- ఆ ఆడమనిషి ముగ్గురు పిల్లల్ని బావిలో పడేసి తానూ పడిపోయిందండీ. ఇంకో క్షణముండే...!

డాక్ట:- ఏ బావిలో?

స.ఇ:- మన స్టేషన్ బావిలోనండీ.

డాక్ట:- తప్పు చేసింది. ఏ ఎమ్.ఎల్.ఏ. ఇంటి వెనకాల బావిలోనో పడివుండే, కొంత ఫలితముండేది.

స.ఇ:- ఏ ముండేది? తీసేవాళ్ళయినా లేకుండా చచ్చేది.

డాక్ట:- మరిప్పుడామెను బ్రతికించి గొప్ప మన కార్యము చేశామనుకుంటున్నారా?

స.ఇ:- కాదుమరీ! ఒక ప్రాణాన్ని కాపాడాం.

డాక్ట:- ఎందుకూ? ఈ రామరాజ్యంలో ఇంకా పది కాలాలపాటు బ్రతకమనా? రైట్ రైట్ (వెళ్తూ బస్తాలు చూచి ఆగి, బస్తాలో బియ్యం చూస్తూ] యస్.ఐ. గారూ! ఈ కేసుకు కారణం ఏమిటో చెప్పమన్నారా?

స.ఇ:- ఆ, ఏముంటుంది? ఏవో కొంపలో వెధవగొడవలు.

డాక్ట:- [పిడికెడు బియ్యము తీసుకొచ్చి ఎస్.ఇ. చేతిలో వేసి] నా బిడ్డ తనంలో అందరూ అనేవాళ్ళు-అన్నంతేకుండా ఎవ్వరూ చావరు తెలా

అని. కాని ఇప్పుడు నూటికి-యాభై చావులు అన్నంలేకనే. దేశం మారిపోయింది.

[డాక్టరు వెళ్ళిపోతాడు. ఎస్. ఐ. బియ్యాన్ని ఒక చేతిలో నుంచి ఇంకొక చేతిలో పోసుకుంటూ, అలాగే చూస్తూ కుర్చీలో కూల బడ్డాడు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు...]

ఒకడు:- ఇదంతా చూస్తుంటే జైళ్ల్లో నుంచి విడుదల చేస్తారంటే– భయంగా ఉందిరా!

రెండ:- ఆఁ. విడుదల చేసినా ఎంతసేపు. మరా ఒక్క రోజులో తిరిగి రావచ్చు

1 వ:- ఎట్టా?

2 వ:- నీకు తెలియదేం? సుఖమైన దోవ వుంది. ఎర్ర గుడ్డ పిలిక పట్టుకు బయలుదేరావంటే, కళ్ళు మూసి తెరిచే లోపల—మళ్ళీ కటకటాల వెనుక ఉంటాము.

స.ఇ:- (తిరిగిచూచి) ఆ కాలం పోయింది. ఇప్పుడు తుపాకి పెట్టి కాల్చేస్తాం!

2వ - అది మరీ సుఖవుకదయ్యా—ఒకేసారి చస్తాం.

స.ఇ:- చస్తాం, చస్తాం. ఏమిటి దేశంలో అందరూ ఒకటే చస్తాం, చస్తాం అంటారు!

1 వ:- బతుకుతాం— బతుకుతాం— అనటానికి ధైర్యం లేదుగనక.

స.ఇ:- ఎందుకు లేదోయ్! అనండి, ధైర్యంగా అనండి — బ్రతుకుతా మని...

2 వ:- మీరీ వుద్యోగానికి చాలా కొత్తగా బోలయ్యా?

స.ఇ:- ఏం?

2 వ:- పాతబడ్డ పోలీసోళ్ళెవరూ, బతకమని అనరే!

[ఒక పత్రికా విలేఖరి ప్రవేశము]

ప.వి:- నమస్కారమండి...

స.ఇ:- నమస్కారం. రాండి కూచోండి. ఏమిటి విశేషాలు?

ప.వి:- ఏ మున్నయ్, మీరే చెప్పాలి. మరి మన పోలీస్‌స్టేషన్ బావిలో—

స.ఇ:- అవునవును. ఒక తల్లీ ముగ్గురు పిల్లలూ పడి చచ్చారు.

ప. వి:- చచ్చిపోయారా!

స. ఇ:- తల్లిని మాత్రం తీశాం. డాక్టరు వచ్చారు. బహుశా-బ్రతకొచ్చు.

ప. వి:- పేపరుకు న్యూస్ పంపించమంటారా?

స. ఇ:- పంపండి; ఏం? నన్నడగట మెందుకూ?

ప. వి:- అలా కాదులెండి; ఈ మధ్య ఈలాంటి వార్తలు పూర్తిగా ఐపోష్కరిస్తున్నారుగా.

స. ఇ:- ఎవరు?

ప. వి:- ఎవరేమిటి. ప్రభుత్వమే. ఇదిగో— చూడండి. ఈ రోజు పేపరులో ఏమంటున్నారో మన వాళ్ళు– ''ఆహార పరిస్థితిని గురించి కొందరు విష ప్రచారము చేస్తున్నారు. గోరంతలు కొండంతలు చేస్తున్నారు. నిజంగా అంత తీవ్ర పరిస్థితులు లేవు. చిత్తూరు జిల్లా తదితర ప్రాంతాలలో చావులకు కారణం— అన్నంలేకకాదు, ఇతర జబ్బులే. ఆహార పరిస్థితి సంతృప్తికరంగా ఉందని గ్రామాలలో నుంచి బాధ్యతకల ప్యక్తులు మాకు స్వయముగా తెలియజేస్తున్నారు'' విన్నారా?

స. ఇ:- నిజమే! నేనూ ఇన్నాళ్ళు అలాగే అనుకున్నా, కాని అదంతా అబద్ధమని ఈనాడు తెలుసుకున్నా!

ప. వి:- ఏదంతా అబద్ధమని?

స. ఇ:- అన్నము లేనందువల్ల, ఆకలి బాధకి ఆగలేక, మనుష్యులు చస్తున్న మాట యదార్థం.

ప.వి:- యస్.ఐ. గారూ!

స ఖ:- ఏందుకలా తెల్లబోతారు?

ప. వి:- మీరు గవర్నమెంటు ఉద్యోగులు!

స.ఖ:- అయితే నిజం మాట్లాడకూడదంటారా ?

ప. వి:- నిజం మాట్లాడటమే ఈ రోజుల్లో ఒక విధ్వంసక చర్యగా వుంది.

స.ఖ:- నేనిప్పుడు గవర్నమెంటును పడగొట్టాలని ప్రయత్నించడములేదు. నాకు మంత్రి పదవిమీద ఆశా, వున్నవారిమీద అసూయా–రెండూ లేవు. నేను కమ్యూనిస్టును కాను. కాని నా అభిప్రాయ మందే మనమే మనవాళ్ళని చంపుతున్నాం, మనలోనే వున్నారు దొంగలు! మనలో ఉన్న దొంగల్ని మనం పట్టుకోగలిగితే, గవర్నమెంటు దానంతటదే బాగుపడుతుంది.

ప.వి:– అయితే మీరు ఆహార సమస్యమీద తీవ్రంగా పనిచేయదలచుకున్నా రన్నమాట!

స. ఖ:- నా శక్తివంచన లేకుండా!

[డాక్టరు వస్తాడు]

స. ఖ:- డాక్టర్! ఆ పేషెంట్ ఎలా వుంది?

డాక్ట:- (తాపీగా) ఆవిడ కింక రేషన్‌కార్డు ఆవసరం లేదు.

స. ఖ:- వాట్?

డాక్ట:- వాట్‌లేదు, గీటూలేదు. ఆహార సమస్యను అతి సులభంగా పరిష్కరించుకొని వెళ్ళింది.

స. ఖ:- అయితే ఆకలితోనే!–అన్నం లేనందువల్లనే చచ్చిందంటారా?

డాక్ట:- సైన్సుకు తెలిసినంతవరకూ ఆలాగే చెప్పుతుంది. పత్రికల్లో స్టేట్‌మెంట్లా? ప్లాటుఫారంమీద ఉపన్యాసాలు ఎవరిననా మోసం చేయవచ్చునుగాని, మెడికల్ సైన్సును మోసం చేయటానికి వీల్లేదు.

ప. వి:- డాక్టరుగారూ! మా పేపరుకు ఒక స్టేట్‌మెంటు యిస్తారా?

డాక్ట:– నేనింకా కనీసం ఒక ఎం.ఎల్.ఏ. నయినా కాందే.

ప. వి:- ఈ విషయం ప్రజలకి బాగా తెలియటం అవసరం కదండీ ?

డాక్ట:- చస్తున్న వాళ్ళకు చస్తున్నామని తెలియడ మేమిటి ? ప్రజలకు కాదు —తెలియాల్సింది, ప్రభుత్వానికి.

స. ఇ:- డాక్టరు గారూ ! అయితే నిజంగా చచ్చిపోయిందంటారా ?

డాక్ట:- చచ్చిపోలేదు–కానీ, ప్రాణాలు పోయినాయి. (యస్. ఐ. పిదకు ఉరికి) నువ్వింకా ఆరొన్నులు కాదు, బస్తా బియ్యం ఇచ్చినా ఆమె బ్రతకదు.

స. ఇ:- (కుర్చీలో కూలబడ్డాడు) ఒక తల్లి, ముగ్గురు బిడ్డలూ. అబ్బ ! ప్రాణాలంటే ఎంత చులకనై పోయింది !

డాక్ట:- (యస్. ఐ. పీపు తట్టి) నువ్వు పోలీస్ ఉద్యోగంలో ఉండతగ్గవాడివి కావు. నీకేదో కాస్త హృదయం ఉన్నట్లుంది.

స. ఇ:- (లేచి పిచ్చిగా తిరుగుతూ) ఇదేనా నాదేశం ? ఇన్ని పొలాలూ, ఇంత పంటా, ఇందరు జనముండీ, ఒక్క ఆదది అన్నం లేకుండా చచ్చిందంటే మన కెందుకు సిగ్గులేదు ? మనమెలా తలెత్తుకు తిరుగుతాం ?

డాక్ట:- కాలేజీ నాటకాల్లో ఎప్పుడన్నా వేషాలా వేశావా ?

స. ఇ:- డాక్టరు గారూ ! పరిహాసానికి ఇదా సమయము ?

డాక్ట:- పరిహాసం కాదోయ్ పిచ్చివాడా ! తొంభై మంచి గింజల్లో-ఒక్క పుచ్చుగింజ ఎంతో, తొంభై పుచ్చుల్లో ఒక్క 'మంచు'న్నా అంతే. నువ్వొక్కడివి ఏం చేయగలవు ? లంచగొండి తనమూ, బ్లాక్ మార్కెట్ అధికారం చెలాయిస్తున్న రోజుల్లో, నీ ఆవేదనంతా నిరుపయోగం.

స. ఇ:- అయితే నేను ఈ ప్రవాహంలో కొట్టుకు పోవలసిందేనా ? ఏం చేయ లేనంటారా ?

డాక్ట:- చేయగలవు. కాని నీకు ప్రమోషన్లు రావు. నిన్ను ఏ ఎడారికో బదిలీ చేస్తారు. ఇంకా ఇలాంటి ఇబ్బందులెన్నో వస్తాయి.

స. ఇ:- ఎన్నొచ్చినాసరే, యీ నిండు ప్రాణాలు తిండిలేకుండా మాడిపోయే దౌర్భాగ్యాన్ని ఆపాలి.

డాక్ట:- సరే ! ప్రయత్నించు. విష్ యు సక్సెస్. (వెళ్ళిపోతాడు)

స. ఇ:- (కాస్సేపు ఆలోచించి కాలింగుబెల్ కొట్టాడు; కానిస్టేబుల్ వచ్చాడు) ఏయ్ ! ఆ వార్డెన్‌ని పిలుచుకురా !

[కానిస్టేబుల్ వెళ్ళాడు]

స. ఇ:- (విలేఖరితో) మీరా గదిలో ఉండండి. ఇక్కడ జరిగే ప్రతి విషయం — తు. చ. తప్పకుండా రేపు పత్రికకు పంపండి. (ప॥వి॥ వెళ్తాడు. ఇంతలో వార్డెన్ వచ్చాడు). వార్డెన్ గారూ; ఇప్పుడొక స్త్రీ—ముగ్గురు పిల్లల్ని బావిలో పడేసి, తానూ పడి చచ్చిపోయింది. కారణం ఏమిటో తెలుసా ?

వార్డె:- ఓ ! ఈజిట్ ?

స. ఇ:- అవును; ఇలా తిండి లేక పోవటానికి కారణం ఎవరో తెలుసా ?

వార్డె:- ఆదేనండి ! మీరు ఉండమంటే ఉన్నారు కారు; ఇండిసిరింగు కాలేజీ వాళ్లు ఆహార సమస్యమీద మంచి నాటకం ఆడబోతున్నారు. చూచి వుండే తెలిసేది- తిండి లేకపోవటానికి కారణం ఎవరో !

స.ఇ:- నాన్‌సెన్స్ ! నాటకాలు ! నాటకాలు ! 'ఆహార సమస్య'ను నాట కాలటయ్యా పరిష్కారం చేసేదీ ! మీబోటి పెద్ద మనుషులంతా ఇలా బస్తాల బియ్యం బ్లాకు మార్కెటులో కొని దాచేస్తుంటే, తిండెలా వుంటుంది ? మనుషులెందుకు చావరు ?

వార్డె:- ఇదంతా మా స్టూడెంట్సు కోసం కొన్నానండీ ! ఇచ్చే రేషన్ చాలటం లేదు. చూడండి ! స్టూడెంట్సు ఫ్యూచర్ సిటిజన్స్ (కావి పౌరులు) వాళ్ళకు మంచి నరిష్మెంట్ ఉండాలి.

స.ఇ:- మీ సమర్థనంస్నీ తర్వాత చెప్పుకుందురు కాని, ఎక్కడ కొన్నారీ బియ్యాన్ని ?

వార్డె:- చెప్పాలంటారా?

స. ఇ:- చెప్పాలనే ఆదగటం!

వార్డె:- చూడండి, ఇది ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్,

స. ఇ:- ఇదేనేమో మీరిచ్చే ఎడ్యుకేషన్! ఆడిగిందానికి జవాబు చెప్పండి.

వార్డె:- బాపూజీ రైస్ మిల్లులో కొన్నానండి.

2వ ఖైదీ:- బాపూజీ రైస్‌మిల్లే! బాపూజీ రైస్‌మిల్లే!

స.ఇ:- బాపూజీ రైస్‌మిల్! సరే, మీరు వెళ్ళి అక్కడ కూర్చోండి.

[వార్డెన్ వెళ్ళాడు]

స.ఇ:- (బెల్ కొట్టాడు. కానిస్టేబుల్ వచ్చాడు) సుబ్బయ్య చౌదరిని పట్టుకురా. (కానిస్టేబుల్ వెళ్ళాడు. మూలనున్న ఒక పెద్ద పట్టా తీసి బియ్యం బస్తాలు కప్పేశాడు యస్. ఐ. ఇంతలో సుబ్బయ్య చౌదరి వచ్చాడు)

చౌదరి:- నమస్కారమండీ.

స.ఇ:- నమస్కారం. రాండి, రాండి!

చౌదరి:- ఏమిటో అంత తొందరగా కబురు పంపారు?

స.ఇ:- ఏంలేదు. మీ మిల్లు నుంచి ఎన్ని బస్తాలు రవాణా అవుతాయ్?

చౌదరి:- సుమారు 60 లక్షలు.

స.ఇ:- ఊఁ! ఎన్ని బస్తాలు రాళ్లు సరఫరా చేస్తారు?

చౌదరి:- అబ్బే! రాళ్ళెక్కడివండి?

స.ఇ:- పోసీ- మట్టి ముద్దలా?

చౌదరి:- ఏదైనా పొరపాటున ఉంటే ఒకటి రెండూ వస్తే వస్తాయేమో గానీ-

స.ఇ:- డి. యస్. ఓ.కి ఎంత యిస్తారు?

చౌదరి:- వీతమాంది?

స.ఇ:- కాదు. అర్ధరాత్రిలో లైటు వేసుకొని బస్తాకి అరపడి రాళ్ళు కలపడానికి ఆయన అనుమతి కోసం-మీరిస్తారే సంభావన?

చౌదరి:- లంచమాండీ?

స.ఇ:- ఛ;ఛ; పెద్ద వాళ్ళు తీస్తే లంచమెందుకు అవుతుందండి?

చౌదరి:- అట్లాంటివి మేము ఇంతవరకు ఎరగమండి. రైస్‌మిల్ బాపూజీ చనిపోయిన రోజున స్థాపించామండి.

స ఇ:- బాపుజీ బ్రతికి వున్నప్పుడు స్థాపించినవే కరప్టయి పోతుంటే, చచ్చిన తరువాత స్థాపించిన దాంట్లో తప్పులేదులెండి.

చౌదరి:- మీరేదో కానివాళ్ళ మాటలు నమ్మి—

స ఇ:- (చాలా సీరియస్‌గా లేచి) చౌదరిగారూ! (పెద్దగా అరిచాడు)

చౌదరి:- (కాస్త కంగారుపడి- తెప్పరిల్లి కాస్త విసురుగా) ఏమిటండీ మీ బెదిరింపులు?

స.ఇ:- (తాపీగా) బ్లాక్ మార్కెటు చేసిన వాళ్ళను ఉరి తీస్తానని నెహ్రూ ఒకప్పుడు చెప్పాడు.

చౌదరి:- ఆ! చెప్పాడు. ఒక్కడిని ఉరి తియ్యగా ఇప్పటికి చూడలా!

స.ఇ:- అదే పొరపాటు జరిగిపోయింది. తీసి వుంటే ఈ బస్తాలు ఇక్కడికి వచ్చేవికావు (బస్తాలు తీసి చూపుతాడు) ఈ బస్తాలు ఇక్కడికి రాకుండే, ముగ్గురు బిడ్డలం తల్లి చచ్చేదికాదు. న్యాయశాస్త్రం లేదు కానీ, నువ్విప్పుడు నల్గురి ప్రాణాలను ఖూనీ చేసావు.

చౌదరి:- ఏమండి! కాస్త మర్యాదగా మాట్లాడండి.

స.ఇ:- మనుష్యుల్ని తినేవాళ్ళకు మర్యాదా, గౌరవమూ, పదవులూ ఇవ్వబట్టి మనలోకం యిలా తయారైంది. నేను మీకలాంటి మర్యాదా యివ్వదలుచుకోలా. (రిమాండ్ సెల్లువైపు చూచి) గవర్నమెంటు తరుపున మీకిక్కడ కావలసిన మర్యాదలు జరిపిస్తా. (బెల్లు కొట్టి) వార్డెన్‌గారూ! (వార్డెను వచ్చాడు) యీయన్ని మీరెరుగుదురా?

చౌదరి:- తెలిస్తే?

స.ఇ:- ఏమీలేదు. కాస్సేపు కూర్చోండి (యస్.ఐ. బైటికి వెళ్ళాడు.)

చౌదరి:- (కటు ఆటు చూచి) చెప్పారా ఏం, కొంపతీసి?

వార్డె:- మీరూ డి.యస్ ఓ మాట్లాడుతుండగా వినొచ్చి'కానిస్టేబుల్ చెప్పాడు.

చౌదరి:- అయితే ఈ రాయి డి. యస్. ఓ. దాకా తగుల్తున్నదన్నమాట.

వార్డె:- పీడెవడో కాలాంతకుడిలా ఉన్నాడు; గట్టి పట్టు పట్టాడు.

చౌదరి:- ఏం పర్వాలేదు. డి.యస్.ఓ. గారి బావగారు ఎం.ఎల్.ఏ. క్షణంలో కేసు కొట్టించేస్తాడు.

వార్డె:- అయినా మనం చేసింది తప్పే.

చౌదరి:- తప్పేమిటండి, తప్పు! ఈకాలంలో ఎవడికివాడు నాలుగు కాసులు చేసుకోవాలి.

వార్డె:- గవర్నమెంటు ఇప్పుడు కాస్త తీవ్రంగా చర్య తీసుకుంటున్నట్లుంది.

చౌదరి:- తీవ్రమూలేదు, చర్యాలేదు. బాపనయ్య దగ్గర రెండు మూడు వందల పుట్ల ధాన్యం మూలుగుతోంది. ఆయన గడప తొక్కి, 'పది'ధాన్యం తెచ్చే ధైర్యం ఒక్క ఆఫీసరుకూ లేదు.

1వఖై :- అవున్రా, ఆఫీసర్ల ధైర్యమంతా మన బోటాళ్ళ మీదనే!

2వఖై :- అంతేకదూ! మొనగాళ్లు! గుడిసెం మీదపడి, రోజుకు పెట్టుకున్న ధాన్యాన్ని కూడా లాక్కు పోతున్నారు.

1వ ఖై :- మా వూళ్ళో "రిలీఫ్ అంగడంటూ" పెట్టారు. ఊరి మునసబు కిచ్చారు; 20 బస్తాలొస్తాయి; అందులో వారానికి అదమపచ్చం 10 బస్తాలు ఆయన ఎనకేస్తాడు.

2వ ఖై :- ఎట్టా? లెక్క లేదూ?

1వ ఖై :- ఎట్టా గేంటోయ్ ? చుట్టు ప్రక్కలున్న గ్రామాల్లో అంతా కూలీ నాలీ చేసుకునే జనం అధికం. వాళ్ళకొక్కక్క వారం మొత్తం రేషను కొనుక్కునేందుకు దబ్బులుండవు; అంతగా కూలీనాలీ చేసి దబ్బులు తెచ్చుకుంటే-వారం అయిపోయిందంటాడు; రేషను కార్డులన్నీ ఆళ్ళ దగ్గరే వున్నాయ్. ఆళ్ళకీ సమువా సందా ? ఇచ్చినట్లు గీట్లు గీస్తుంటాడు. అడిగే నాయాలెవడు ?

2వ ఖై :- చెక్కింగు ఆఫీసర్లుంటారు గదట్రా ?

1వ ఖై:- ఆఫీసర్లంటే ఆకాశాన్నుం డూడి పడ్డారనా? ఆళ్ళూ మనుషులే; ఆశ చూపిత్తే అందరూ లొంగుతారు.

2వ ఖై:- అయితే యీడెట్టా తెగేదంటావు?

1వ ఖై:- మనకు తోసే దొకటే, అందరూ జైల్లోకొచ్చి కూచుంటేసరి.

2వ ఖై:- మరి బువ్వో?

1వ ఖై:- ఆఁ, గవర్నమెంటు పెట్టటంలా! అట్టాగే అందరికీ పెడతాది.
[చౌదరి, వార్డెన్ పెద్దగా నవ్వారు. ఖయిదీలు జవాబుగా వెకిలిగా నవ్వుతారు. చౌదరీ, వార్డెన్ మొఖాలు చిన్న చేసుకుంటారు...]

చౌద:- (ఉన్నట్టుండి ఏదో జ్ఞాపకమొచ్చి) ఇక్కడ ఫోనుందా?

వార్డె:- ఎందుకూ?

చౌద:- పనుంది.

వార్డె:- ఇక్కడెక్కడో పబ్లికు ఫోనుండాలి.

చౌద:- రైటో! అయిపోయింది. ఒక్క క్షణంలో తేల్చేస్తా. వీడెంత? వీడి సబ్ ఇన్‌స్పెక్టరు పనెంత? మహా మహా వాళ్ళనే చూదాను (వెళ్తాడు).
[వార్డెన్ ఏమీతోచక, అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంతలో మొట్ట మొదట ఆడియన్సులోకి పరుగెత్తిన దొంగ గబా గబా పరుగెత్తుకుంటూ వచ్చాడు. వచ్చి అటూ ఇటూ చూచి, వార్డెన్‌తో.....]

దొంగ:- అయ్యా! అయ్యా!

వార్డె:- ఏం?

దొం:- ఇప్పుడే ఇక్కడ, ఈ బావిలో, ఓ ఆకమనిషి పడి చచ్చిపోయిందట. మీరు చూసారా బాబూ? నిజమేనా?

వార్డె:- అవును, చచ్చిపోయిందట! అది చస్తే చచ్చింది, మా ప్రాణాలు తీస్తోంది అది చావటానికి కారణం మేమట? ఎవరు దీనికి కారణం, ఎవరి కర్మ వాళ్ళదిగాని—

దొం:- ఇంతకూ చచ్చిపోయిందా బాబూ?

వార్డె:- చచ్చిందట!

దొం:- మీరు మనిషిని చూశారా ?

వార్డె:- లేదు.

దొం:- ఎట్టావుంది కాలూ మనిషి ?

వార్డె:- ఆరె ! చూడలేదంటే - ఎట్లా వుందని అడుగుతావేం ? ఆడమనిషి లాగే వుంటుంది.

దొం:- పిల్లలా బాబూ ? పిల్లలన్నా బ్రతికున్నారా బాబూ ? మీరు చూశారా పిల్లల్ని ?

వార్డె:- పిల్లలూ తల్లీ, అంతా క్లోస్. చెప్పకుండా పోయాయి—ప్రాణాలు.

దొం:- ఎందరు పిల్లలు బాబూ ?

వార్డె:- నిన్ను చూస్తే వదిలేటట్టు లేవే ! ఎందరు పిల్లలా ? ఎవరికి పుట్టారు ? ఇదంతా విచారించటమా నా పని ?

దొం:- కాదు బాబు ! మా యింట్లో వాళ్ళం వారం రోజులుగా పచ్చి మంచి సీళ్ళు తాగుతున్నాం. పిల్లా జల్లా అంతా ఆట్లాగే బ్రతుకున్నాం మేం సరే- ఆ పిల్లలు- ఆళ్ళేం చేశారు ? అళ్ళట్టా ఎండిపోతావుంటే చూడలేకపోయా ! చివరికి.....

వార్డె:- బావిలో తోసేశావా ?

దొం:- లేదు బాబూ, ఆ పని చెయ్యలేకనే బయల్దేరా-దొంగతనానికి.

వార్డె:- దొంగతనానికి !! నువ్వు దొంగవా ? ఎక్కడికి వెళ్ళావు దొంగ తనానికి ?

దొం:- ఆశ చచ్చుకుంటారే - ఆ చోట్లో - ఆస్తలంట, అదీ—

వార్డె:- ఓ, నువ్వేనా ఆ మహానుభావుడివి ! యస్. ఐ. గారూ...ఇన్స్పెక్టరు గారూ!..... (చాలా ఆత్రంగా వెడుతూ పిలిచాడు; బెల్ కొట్టాడు) దొంగ.....! దొంగ.....!

దొం:- జైల్లో ఎయ్యటానికేనా బాబూ ? మీరెయ్యకపోతే ? నేనే వెళ్ళి కూసుంటా. నేనేం లచ్చలూ, వేలూ దొంగతనం చెయ్యలా! పిడికెడు కూడు బాబూ ! ఆకలితో చస్తున్న బిడ్డలకి అంత కూడు. అంతే

బాబూ ! ఎప్పుడూ దొంగతనం ఎరగను. మావోళ్ళంతా చాల గొప్పగా మర్యాదగా బ్రతికినోళ్ళు. మర్యాదా, గౌరవం, గొప్పా-అన్నీ చచ్చాయ్ ఆకలితో.....దొంగిలించా.....తీరా తీసుకుని యింటికి పోతే, ఇల్లు ఖాళీ. యింతలో యీ చావు కబురు విన్నాను. నా లంచే మోనని పరుగెత్తుకొచ్చా. చెప్పండి బాబూ, ఏదుండి ? చెప్పండి బాబూ !

వార్డె:- లోపలుందట! పోలీసు నడుగు, చూపుతాడు.

దొం:- ఆఁ! ఆఁ ! ! బాబూ! బాబూ! (పరుగెత్తి వెళ్ళాడు)

వార్డె:- ఏయ్! పోలీసు! దొంగ! దొంగ! జాగ్రత్తగా చూడు! వాడు పచ్చి దొంగ!

[ఇంతలో యస్. ఐ. వస్తాడు]

స. ఇ:- వాడు కాడు దొంగ. మీరూ, మనం, మనపైన వున్న వాళ్ళూ!

వార్డె:- నిజంగా దొంగ వచ్చాడండీ !

స. ఇ:- కాని అసలు దొంగ తేలాలి!

వార్డె:- యస్. ఐ. గారూ! నన్ను కాస్త తొందరగా పంపేయండి దయ చేసి. ఇంజనీరింగు కాలేజీ వాళ్ళ నాటకం! తప్పక చూడాలి.

స. ఇ:- ఈ జీవిత నాటకం చూడండి సార్, చాలు...ఇదిగో, కొత్త పాత్రలు వస్తున్నాయి చూడండి. ఈ పాత్రలను నాటకంలోలా నేను ద్రమెటిక్‌గా ప్రవేశపెట్టి పరిచయం జేయలేను. అయినా... ఈయనెవరో తెలుసునా? మన డి.యస్.ఓ. ఆయన వెనకాల వున్నవారు ఓ గ్రామ మునసబు (ఇటూ ఆటూ చూచి) చౌదరిగా రెక్కడ?

వార్డె:- ఫోన్ చేయాలని వెళ్ళాడండి.

స. ఇ:- ఎవరికో?

వార్డె:- ఏమోనండీ !

స. ఇ:- బహుశా గవర్నమెంటు హౌసేకై ఉంటుంది. వుంటసీడి. (డి. యస్ ఓ తో) రాండి సార్! రాండి, కూర్చోండి.

[డి. యస్ ఓ. తలవంచుకొని కూర్చున్నాడు]

స. ఇ:- (సెల్లులా వున్న ఖైదీలను చూపి) వీళ్ళెవరో తెలుసాండి?

[డి. యస్. ఓ. మౌనం]

స. ఇ:- వీళ్ళు దొంగలు.

వార్డె:- ఏమండీ, నాటకం ఈపాటికి సగం అయిపోయి వుంటుంది.

స. ఇ:- ఇదిగో, తొందరలో పంపివేస్తా. మిమ్మల్ని ఎక్కడికి పంపాలా అనేదే ఆలోచిస్తున్నా. ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నా. డి. యస్. ఓ. గారూ! ఈరోజు ఒక ఆదది ముగ్గురు బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకుంది.

డి.యన్.ఓ:- అబద్ధం !

స. ఇ:- ఇదిగో- డాక్టర్ సర్టిఫికేట్!

డి.యన్.ఓ:- ఇదేదో నాటకం !

స. ఇ:- హూఁ, మీకందరికీ నాటకం జబ్బు పట్టిందేం! ఇక్కడ కాదు. పచ్చయప్ప కాలేజీలో జరుగుతోంది. యిది యదార్థం. కావాలంటే శవాన్ని చూసిరండి.

డి.యస్.ఓ:- నేను చూడాల్సిన అవసరంలేదు.

స ఇ:- అవును, 5 వేలు చూచిన కళ్ళతో శవాన్నెలా చూస్తారు, పాపం!

డి యన్.ఓ:- ఓ, మీకు రుజువూ ?

స. ఇ:- రుజువులన్నీ ఉన్నాయి. అవి కోర్టుకో మాట్లాడాల్సిన మాటలు. కాని ఇక్కడ మిమ్మల్ని నే కోరేదొక్కటే. మీ గుండెలమీద చెయ్యి వేసుకొని చూడండి, మీరు రోజు కెందరి ప్రాణాలు తీస్తున్నారో! మీ బిడ్డల్ని ఒక్కసారి బావిలో పారేస్తే.....

డి.ఎస్.ఓ:-యస్. ఐ. గారూ!

స. ఇ:- మీ భార్య బావిలో పడితే...

వార్డె:- మమ్మల్ని ఏడిపించాలనా ఇదంతా?

స. ఇ:- ఏడిపించాలని కాదు, మీ కర్థం కావాలని; అంతే!

డి ఎన్ ఓ:-యస్ ఐ. గారూ! మీకు రుజువులుంటే కోర్టులో వాళలు చేసుకోండి, మీ చేతనైన పని చేసుకోండి; అంతేగాని ఒక గవర్నమెంటు ఆఫీసరును బాధ్యతారహితంగా...

స. ఇ:- మీరు బాధ్యత కలిగే ప్రవర్తిస్తున్నారా ?

డి.ఎన్ ఓ:-మాకు తెలిసినంతవరకు మేమెరి ప్రాణాలూ తీయలేదు.

[డి.ఎన్.ఓ. పై మాటలు చెప్తూ మెల్లగా జేబులోంచి నోట్ల కట్ట తీసి వేస్టుపేపరు బుట్టలో వేయబోతుంటాడు]

స. ఇ:- స్టాప్! నోట్లకట్ట బుట్టలో పడ్డదా- తల పేల్తుంది!

[డి.యస్.ఓ. ఆగిపోయాడు]

స. ఇ:- హాండ్సప్.

[డి.యస్.ఓ. చేతులెత్తాడు. ఇంతలో చౌదరి వచ్చి వెనక్కి తగ్గాడు]

స. ఇ:- రాండి ! చౌదరిగారూ ! (చౌదరి వెనకటడుగు వేశాడు) ఇంకొక్క అడుగు కదలకండి, ప్రమాదం (బెల్ కొట్టాడు; కానిస్టేబుల్ వచ్చాడు) చౌదరిగారి కోటు జేబులో ఒక ఉత్తరం ఉంది తియ్యరా? (కానిస్టేబుల్ చౌదరి జేబులోనుంచి ఉత్తరం తీశాడు) వార్డెన్‌గారూ! ఉత్తరం చదవండి.

వార్డె:- (ఉత్తరం తీసుకొని చదువుతాడు) "చౌదరిగారికి, రేపు ప్రొద్దున్నే 60 లక్షల బస్తాలు పంపాలన్న విషయం జ్ఞాపకము ఉందనుకుంటా. ఇంతవరకు మన విషయం సెటిల్ చేయలేదు. నాకు కాస్త ప్రైకం జరూరుగా ఉంది. రాత్రికి కలుస్తా."

స. ఇ;- ప్రసాద్ మీరేనాండి?

డి.ఎన్.ఓ:-అవును.

స. ఇ:- ఈ ఉత్తరం మీరు వ్రాసిందే? అవునా?

(డి.ఎన్.ఓ. మౌనం)

స. ఇ:- గిద్దలూరు బాపనయ్య దగ్గర 200 పుట్ల ధాన్యం వుందని మీకు తెలీదా?

డి.యన్.ఓ :-తెలీదు.

స. ఇ :- మీకు తెలిసినట్లు దాఖలా చూపుతాను.

డి.ఎన్.ఓ:-తెలిస్తే ?

స. ఇ:- మీరెందుకు 'ప్రొక్యూర్' చేయలేదు ?

డి.ఎన్.ఓ:-ఆయనివ్వలేదు.

స. ఇ:- మళ్ళా అరెస్టు!

1వ ఖై:- ఇవ్వనంటేనే ఊరుకున్నారా? మా ఇళ్ళల్లో దూరి కుండా బొబ్బా అంతా గాలించి లాక్కెళ్ళలా! అట్టా ఎందుకు చేయకూడదుట?

2వ ఖై :- ఎందుకంటే, ఆళ్ళు లావాంటాళ్ళురా?

1వ ఖై :- బాపనయ్య పెద్ద మంత్రులతో చెప్పి ఏద ఉద్యోగం వూడబెరికిస్తాడో అని భయంరా!

స. ఇ:- (ఖైదీలతో) సూస్ (డి.ఎన్.ఓ.తో) బాపనయ్య బ్లాక్‌మార్కెటు వ్యాపారం చేయటం మీకు తెలీదూ?

డి.ఎన్ ఓ:-తెలిస్తే ?

స. ఇ:- మీరూ, బాపనయ్యా, చౌదరీ - మీరందరు ఈ వ్యాపారంలో భాగ స్వాములు; మీరందరూ షరీక్‌ై ఇది సాగిస్తున్నారు.

డి.యస్.ఓ:- లేదు; లేనేలేదు—

స.ఇ:- అయ్యా, గ్రామ మునసబుగారూ!

డి.ఎస్.ఓ:- ఏమని బెదిరించారు మిమ్మల్ని?

[మునసబు చెప్పడానికి జంకుతాడు]

స.ఇ:- చెప్పు, పర్వాలేదు.

మున:- మా ఊళ్ళో 200 ఇళ్ళున్నాయండి. 200 ఇళ్ళలో ఏ పది ఇరవై మందికో సరిగా రెండుపూటలా భోజనం వుంటుంది. మిగతా అందరూ వారానికి మూడురోజులు తింటే అధికం. ఈ విషయం నే నెన్నో సార్లు అయ్యగారితో మనవిచేసుకున్నాను. పండినపంటలు పండినట్టు

లాక్కెళుతున్నారు. పెద్దవాళ్ళదగ్గరనుంచి గింజయినా కదల్చడం లేదు. మహా బాగా పండినా, రైతుకు మూడు నెలల ఖర్చొస్తుంది. అది కాస్తా లాక్కెడితే వాళ్ళేంకావాలి? ఈ విషయం పైకి రాయమని ఎన్నోసార్లు చెప్పానండి.

డి.ఎస్.ఓ:- నేను రాశాను.

మున:- రాశారేమోగానీ, పత్రికల్లోమాత్రం, మా ఊళ్ళో తింపికరువేమాత్రం లేనట్టే వచ్చిందండి!

డి.ఎస్.ఓ:- పత్రికల్లో వచ్చిందానికి నేనా కారణం?

మున:- కారణం ఎవరిక్కావాలిబాబూ, ఫలితం కావాలిగానీ. ఇది ఇట్టా వుండగా మొన్న అయ్యగారు మా ఊరొచ్చి మా ఊళ్ళో ఆహార పరిస్థితి బాగుందనీ, తిండి లేకుండా మనుషులు చావటం వట్టి అబద్ధమనీ రాసివ్వమన్నారు.

స.ఖ:- నువ్వేమన్నావు?

మున:- రాసివ్వనన్నానండి.

స.ఖ:- ఎందువల్ల ?

మున:- అదొట్టి అబద్ధం బాబూ!

స.ఖ:- తరువాత?

మున:- అయ్యగారు నన్ను బెదిరించి, బలవంతాన రాయించుకుపోయారు బాబూ!

డి.ఎస్.ఓ:- అబద్ధం! పచ్చి అబద్ధం! యూ సోషలిస్ట్! [విసురుగా వెళ్ళి కొట్టబోయాడు]

స.ఖ:- (డి.ఎస్.ఓ. నాపి) ఆగు!

దొం:- (పిచ్చివాడిలాగా వస్తూ) అబద్ధం, నా పెళ్ళాం చచ్చింది అబద్ధమా ? నా పిల్లలను నూతిలో పడేసింద అబద్ధమా? నేను కడుపుమాడి చావలేక, తిండికోసం దొంగతనం చేయడ మబద్ధమా? మనకు సోషలిస్ట్రం వచ్చినమాట అబద్ధం. ఇది పేదోళ్ళరాజ్యంఅనటం అబద్ధం.

స.ఇ:- ఏయ్! ఎవరు నువ్వు?

వార్డె:- పీడేనండి మా హాస్టల్లోపడ్డ దొంగ !

దొం:- నువ్వు సెప్పక్కర్లా, నేనే చెప్తా; నేనే దొంగను. మీ రందరూ పెద్ద మనుషులు! మీకు డబ్బుంది, అధికారముంది; తిండివుంది; మీ దొంగ తనాలు పెద్ద తరహావి (చంకలోవున్న అన్నంమూట తీసిచూపుతూ) ఇదిగో, మీ అన్నం. దీనికోసమే నేను దొంగనయ్యాను. దీనితో నా పెళ్ళాం బిడ్డల్ని ఒక రోజు బతికిద్దామనుకున్నాను. పిచ్చివాణ్ణి, దీంతో ఒక రోజు గడిచినా మళ్ళీ పస్తులేకదా అన్న విషయం మర్చి పోయాను. నా పెళ్ళాం తెలివయింది. దానికి తెలుసు, ఈ బాధ ఎప్పటికీ తీరదని, బాగా ఆలోచించి చచ్చింది. నాకు దారి చూపింది. తీసుకోండి మీ అన్నం (విసిరికొట్టాడు వార్డెన్‌మీద. వెంటనే యస్.ఐ చేతిలోఉన్న పిస్టల్ తీసి పేల్చుకున్నాడు)

స. ఇ:- ఆఁ ఆఁ !

దొం:- (ఒరిగిపోతూ) ఇంకా నేను దొంగనేనా ? సెప్పండి. మీ అన్నం మీకిచ్చేశాను. ఇఁక నా కన్నం వద్దు... ఇంకా నేను దొంగ నేనా?... దొంగనేనా ?... దొంగ... నే... నా... (పడిపోయాడు)

స. ఇ:- (ఒక క్షణం అల్లా వుండి కన్నీళ్ళతో) నువ్వు కాదు తమ్ముడూ దొంగ... ఇదిగో వీళ్ళు... వీళ్ళందరూ దొంగలు... తోడు దొంగలు. నీ ప్రాణాలు, నీ పెళ్ళాం బిడ్డల ప్రాణాలు తీసింది వీళ్ళు. పదండి, కదలండి. (విసురుగా డి.యస్.ఓ, దగ్గరకు వెళ్ళి మెడ పట్టుకుని) మిమ్మల్ని ఉరితీసే అధికారం లేదు. కానీ- మీకు తిండి లేకుండా పోవడం అంటే ఏమిటో చూపిస్తా. (సెల్లులోకి గెంటుతాడు. వార్డెన్, చౌదరీల నుద్దేశించి) ఊఁ ! కదలండీ.

[మెల్లగా వాళ్ళిద్దరూ సెల్లువైపు నడుస్తుంటారు. కానిస్టేబుల్ వచ్చాడు...]

కాని:- సార్ ! (ఒక కవరు ఇచ్చాడు. యస్. ఐ. కవరు చించి చదివి, చౌదరి వైపు– అందరివైపు చూచి)

స. ఇ:- చౌదరిగారూ ! మీరే గెలిచారు. నేనే ఓడిపోయాను. అవినీతిని అరికట్టాలనేది వట్టి ఉపన్యాసాలని, ఇప్పుడు తెలుసుకున్నా. నన్ను ట్రాన్స్‌ఫర్ చేశారు. మీరు ప్రతికి పోయారు.

(చౌదరి అందరూ వికటాట్టహాసం చేశారు.)

స. ఇ:- (బియ్యపు బస్తా క్రిందకు తోసి) తీసుకెళ్ళండి, తినండి, చచ్చేదాకా తినండి. దీన్ని ఎవరు కష్టించి పండిస్తున్నారో, వాళ్ళందరూ చస్తున్నారు. వాళ్ళ కిది నిరాకరించబడింది. వాళ్ళందరూ పోయిన తరువాత మీరు బ్రతికుంటారా ? బ్రతకండి.

[డి.ఎస్.ఓ, చౌదరి, వార్డెన్ వికటాట్టహాసం చేస్తూపోతారు.)

స. ఇ:- (మెల్లగా గ్రామ మునసబు దగ్గరకెళ్ళి) మునసబుగారూ ! నా చేత నైనది చేద్దామనుకున్నా. అవినీతిని అరికట్టాలనుకున్నా. కాని అంతా నా కెదురయింది. ఇక మీరు – గ్రామాలలోని ప్రజలు పరిష్కరించుకోవాలీ తిండి సమస్యను. (ఒక పిడికెడు బియ్యము తీసుకొని దొంగ శవం దగ్గర కూర్చొని) ఇదిగో తమ్ముడూ ! బ్రతికుండగా పిడికెడు బియ్యం ఇవ్వకపోయినా, ఇప్పుడైనా ఇస్తున్నా. (నోట్లో పోస్తాడు) యీ పిడికెడు బియ్యంతో – యీ దొంగల్ని – తిండి దొంగల్ని, మమ్మల్ని క్షమించు.

(తల పట్టుకుని విచారంగా ఉంటాడు. ఇంతలో పత్రికా విలేఖరి వచ్చి, రిపోర్టు తీసి విచారంగా చింపేస్తుంటాడు).

(తెర జాలిగా దిగుతుంది)

తారాబలం

రచన :

వడ్లమూడి సీతారామరావు

పాత్రలు

విశ్వనాధం

సూర్యం

అప్పారావు

నరహరి

నౌకరు

మాణిక్యం

[పల్లెటూరిలో సాధారణ కుటుంబీకుని గృహం. పంచ గది. ఒకనాటి సాయంకాలం. గోడకు పురాతన పటాలు, క్యాలెండరు, గాంధీ ఫొటో వుంటాయి. వెనుక గోడలో మధ్య ద్వారం. గదిమధ్య మేజాబల్ల. దానిమీద అగరొత్తులు. ఒక పడక కుర్చీ, మూడు సాదా కుర్చీలు. ఒక ప్రక్కతివాసి మీద వీణ, హార్మోనియమ్. తెర లేవ గానే ఎవరూ వుండరు. నరహరి హడావుడిగా ప్రవేశించి, అన్నీ అమర్చారా లేదాఅని అటూయిటూ చూసి. ఏదోసవరించుతూ వుంటాడు. నరహరికి నడివయస్సుదాటింది. మనంమామూలుగా 'పెళ్లిళ్లపేరయ్య' లంటూ వుండేవారిలో ఒకడు. తనని అలా ఎవరైనా అంటే మటుకు ఒప్పుకోడు. కాలానుగుణ్యంగా ఛలోక్తులు విసిరే స్వభావం. కను బొమ్మల్లో పట్టుదల కన్పిస్తూవుంటుంది. పూర్వాచారాలు అనుసరించు తాడో లేదో గాని నమ్మకం చూపిస్తాడు. బయటవేపుకు వెళ్ళిపోతోతూ, ఇంతలో లోపలికి వచ్చేవారిని చూచి ఆహ్వానిస్తాడు. విశ్వనాథం, సూర్యం వస్తారు. వారిద్దరూ పెళ్ళిచూపులకు వచ్చిన తండ్రికుమారులు. విశ్వనాథం తహశీల్దారుచేసి రిటైరైనాడు. కోటుగుండీల బిగింపు, ఉత్తరీయం మడతలు, కట్టుమీసం, చేతికర్ర-అన్నిటిలో ధీమా కల వాడులా కనుపిస్తాడు. ఆయన కుమారుడు సూర్యం చదువు కొంటున్న యువకుడు. జీవితమొక వెన్నెలస్వప్నం అనుకుంటూ యదార్థజీవితం అర్థంకాక, పెద్దల మాటలు కాదనలేక బాధపడే యువకుల్లో ఒకడు]

నరహరి:- రండి ! రండి! విశ్వనాధంగారూ ! ఇలా దయచేయండి. అబ్బాయ్ ! అబ్బాయ్ ! కుడికాలు-కుడికాలు ముందర వెయ్ నాయనా !

సూర్యం:- ఓ ! ఫర్వాలేదండీ. నాకలాంటివి నమ్మకమూలేవు - పట్టింపూలేదు.

న:- అలా అనకు నాయనా ! మావన్నీ, అనుభవంమీద చెప్పే మాటలు, ఆ, ఆ, ఇలా దయచేయండి, ఇలా, నిల్చున్నారే! విశ్వనాధంగారూ-అబ్బాయ్ [ఇద్దరూ కూర్చుంటారు.] వేళకందుకున్నారు. చాలా సంతోషం ! రైలుకు...

విశ్వనాథం:-ఆ మరె, రైలుకు సమ్ముకుంటే, ఇంతేనండి.

న:- ఏం. ఇవాళ వేళకేవచ్చింది !

వి:- చచ్చింది, మేం వచ్చింది నిన్నటిబండి. ఇవాళబండి అంతేలేదు. ఏం రైళ్ళో, ఏం ప్రయాణాలో-ఏ పనికీ వేళకందుకోలేం కదా !

సూ:- అంతేమరి, మన ఆచార సాంప్రదాయాలంటే, నమ్మకంలేని యీ రోజుల్లో, తిధులు, శకునాలు పెట్టుకుంటే 'లంగరందనిబోటు ప్రయాణం'లా వుంటుంది.

న:- పోసి, బస్సులో రాకపోయారా ? మీకు సీట్లగొడవ లేదాయె ! ఎలాగైనా రిజైర్డు తహశీల్దారు గారంటే సీట్లివ్వకేం చేస్తారు?

వి:- ఆ అపన్నీ వెనక, అందులో బస్సువాళ్ళెప్పుడూ వాళ్ల జుట్టును చేతిలో వుంచుకున్న వాడికే, వంగి వంగి సలాములు చేస్తారు.

న:- ఇంతకూ నాలుగుమూళ్ళు పడేయోగంవుంటే బస్సులు, రైళ్ళు అడ్డమొస్తాయా ? తారాబలముంటే అన్నీ ఎలాగోలా నిర్విఘ్నంగా నెరవేరవూ ! ఆ! పెళ్ళిచూపు లవగానే పెళ్ళెంతసేపూ ! [పెళ్ళికొడుకు తండ్రి ధీమాతో ఇల్లు నలువేపులా విశ్వనాథంచూస్తూ వుంటాడు] ఆ! అదుగో, ఇది పంచగది, ఆ వాకిలి దాటగానే తోట, ఆ తోటలో భవంతి, అప్పారావుగారు, ఆదేపిల్ల తండ్రి గ్రామపెద్దకదూ. వచ్చిన వాళ్లు కూర్చోడానికి, పంచాయతీలకు, సంప్రదింపులకూ, కాస్త మీబోటి వారొస్తే మర్యాద చెయ్యడానికి, ఇలా పంచగది పీధివరకు కట్టించాడు.

వి:- ఓవ్ బాగుంది. ఆ, చూడండి, పిల్లతండ్రి ఇంటోలేడా ?

న:- మీ కోసం స్టేషన్ కొచ్చాడే, కలుసుకోలేదూ ?

వి:- లేదే !

న:- అలాగా, మరివచ్చాడే. అయితే పిలుచుకొస్తాను, నిమిషం [కదలి నడుస్తూ] అబ్బాయ్, టయిమెంత నాయనా ?

సూ:- ఏడూ ఏభై నిముషాలు.

న:- సరె, ఫర్వాలేదు. ఇంకా పదినిముషాలు వ్యవధి వుంది. ఈ లోపుగా ఆన్నీ సిద్ధం చేస్తాను. పిల్లను చూసి అబ్బాయి 'సరే' అంటే ఇక పెళ్ళెంతసేపు? ముహూర్తాలు కూడా, దగ్గరలోనే, ఖలే భేషుగ్గా వున్నాయ్!

వి:- సరే, చూద్దాం, కానివ్వండి !

న:- ఊ, కానిస్తున్నా, అలాగే. (వెళ్ళబోతున్నాడు)

వి:- ఇదుగో! మేం, మళ్ళా వెంటనే వెళ్ళిపోవాలి.

న:- చిత్తం చిత్తం, అలాగే (అంటూ వెనక్కివచ్చి మళ్ళా వెళ్తూ' సూర్యం వంక ఓ క్షణం ముఖంలోకి చూసి) ముఖాన బొట్టేది నాయనా ?

సూ:- (బొట్టు పెట్టుకోడం పాతకాలపు పద్ధతి అనుకునేవాడు గనుక కోపం వచ్చేసింది) నేనేం ఆడదాన్ననుకున్నారా?

న:- మొగాడివయితే మీసాలేవీ ? ఏం ఫ్యాషన్లయ్యా ? ముచ్చటగా మీసాలు కూడా లేకుండా?

వి:- మీసాలు లేవనుకోవడమెందుకు ? ఈ కాలపువాళ్ళకు మెదళ్ళే లేవు, ఏమిటో !

న:- బాగా సెలవిచ్చారు. (అంటూ విశ్వనాథం, నరహరి నవ్వుకుంటారు. నరహరి వెళ్తాడు)

(విశ్వనాథం తలవంచుకొని పత్రిక చూస్తూ వుంటాడు. సూర్యం క్రాపు, డ్రస్సు సవరించుకొంటూ ఆలోచిస్తూ, లేచి ఏదో ఆడగాలని విశ్వనాథం దగ్గరకెళ్ళి, తను ఆడబోయేది ఆడిగితే ఏమనుకుంటాడో అని మళ్ళా తనకుర్చీ దగ్గరకెళ్ళి, మళ్ళా తండ్రివేపుచూసి ఆయన దగ్గరికెళతాడు. ఇదంతా తల ఎత్తకుండానే విశ్వనాథం గమనిస్తాడు. కొడుకు మనస్సులోని ఆదుర్దా గ్రహించాడు)

సూ:- నాన్నా! (ఆగి) నాన్నా!

వి:- యిష్! పెళ్ళంచేసరి, నీకిన్ని అనుమానాలేమిటిరా? ఇలాంటప్పుడు, మౌనం, మనస్థిమితం చాలా అవసరం. వూరికే బుర్ర పాడు చేసుకోకు.

సూ:- మిమ్ము:ను...ఒకటి అడగాలనుకొంటున్నాను.

వి:- అడగవద్దంటున్నాను.

సూ:- చూడండి!... పెళ్ళి, అసలవసరమా ?

వి:- [ఈ సన్నివేశంలో, గుండె పగిలేప్రశ్న గనుక క్షణం నిశ్శబ్దం తర్వాత] అందరి సంగతి ఏమో, నీకవసరం !

సూ:- ఆవసరమో, అనవసరమో నిర్ణయించవలసిం దెవరు ?

వి:- నేను.

సూ:- నేను కాదా ?

వి:- కాదు.

సూ:- ఎంచేత ?

వి:- నీకదనవసరం ?

సూ:- బాగా ఆలోచించారా ?

వి:- నువ్వు పుట్టినప్పట్నుండీ ఆలోచించాలేవోయ్ !
[అని తమాయించి మార్చుతాడు]

సూ:- [వాదనలో దెబ్బతిన్నాడు. ఆదుర్దా ఎక్కువయింది] ఇంకా చాలా... చాలా అడగాలనుకున్నాను. కాలేజినుండీ ఇంటికి రాగానే లాక్కొచ్చేస్తిరి, బయలుదేరితే గాని పిల్లేదంటిరి !
[ఇంతలో నరహరి, అప్పారావు ఫలహారాలు తీసుకుని ప్రవేశిస్తారు. పిల్లతండ్రి అప్పారావు పల్లెటూరి సాధారణ కుటుంబీకుడు. యాభయి సమీపిస్తున్నాయి. ఆడపిల్లల్ను కన్న అదృష్టహీనుని అవతారం కాదుగాని, మనుషులు వెతకడంవల్ల కొంత బాధ అతనిలో కనుపిస్తుంది.]

న:- బయలుదేరితేగాని పిల్లేదంటాడేమిటి, అబ్బాయ్ !

వి:- ఆ, పీకా ! వెంటనేబయలు దేరద్దా అంటున్నాడు.

అ:- నమస్కారమండి !

వి:- నమస్కారం, కూర్చోండి.

అ:- ఫర్వాలేదు. ఆలస్యానికి క్షమించండి. మీరొచ్చారని తెలిసి, అవ దానిగారినికూడా కేకేసుకు వద్దామని వెళ్ళాను. మాట తప్పకుండా వచ్చారు. సంతోషం !

న:- [అప్పారావుకి సూర్యాన్ని చూపుతూ] వారి అబ్బాయ్ !

అ:- ఆలాగా !

న:- తండ్రికి తగిన కుమారుడు. యోగ్యుడు. భేషైనవాడు. తండ్రిమాట జవదాటడు సుమా !

అ:- మంచిది !

న:- ఇంతపిల్లవాడప్పటినుండీ నాకు తెలుసు. చూడండి, క్లాసులోకల్లా వస్టు. మంచి పదునైన పిల్లవాడులేండి. ... [విశ్వనాథం, సూర్యంతో] ఆ, ఆ, ముందర ఫలహారం సేవించండి ! అబ్బాయ్ ! కానివ్, సిగ్గుపడతావే !

సూ:- నాకు వద్దండి !

అ:- మన పల్లెటూరి పాకాలు వారికి నచ్చుతాయా?

వి:- [తింటున్నవాడల్లా సడన్‌గా] అహ, అదేమిటండోయ్ ! అలా అంటారు, మా బాగా వుంటయ్. వెనక మేం క్యాంపులకెళితే, ఏం తినేవాళ్ళం, ఏం తినేవాళ్ళం ! [అటూ తినడం సాగిస్తాడు]

న:- అబ్బాయి, కాస్త రుచిచూడు.

వి:- పోనివ్వండి, వద్దంటున్నాడుగా.

న:- ఏం, పాకం రుచిలో పిల్ల మసూచిక మేదన్నా వుంటే మరచిపోతా దనా మీ భయం? ఆ అమ్మాయికలాంటివేమీ లేవండోయ్, రవ్వంత రాణి!

వి:- ఆహహ, అదికాదు. గతికితే అతకదంటారు!

అ:- నరహరిగారు ఆలాంటి పొరపాటు జరుగనిస్తారా ? ఈ పాకాలన్నీ ప్రక్కయింటివారిచేత చేయించారు,

న:- (సూర్యాన్ని చూసి) ఊ, ఊ, అలా తినడం ఆచారం నాయనా!

సూ:- తినడానికి కూడా ఆచారం-చట్టం కూడానా ?

న:- మరే, ఆచారం బాబూ తినమంటే తింటారా? రేషనింగ్ చట్టం పెట్టి మట్టిగడ్డలు తినమంటే మహాప్రసాదమని మింగరూ...ఊ, కానివ్వ వయ్యా. ఇంకో క్షణంలో పిల్లను చూద్దువుగాని - ఆ తర్వాత... (సూర్యం గత్యంతరంలేక తినడం ప్రారంభిస్తాడు)

ఆ:- ఏమండీ! అబ్బాయి చదివేది ఇంజనీరింగ్ కదూ?

వి:- ఆ, మరేనండి,

ఆ:- ఎన్నో సంవత్సరం ?

వి:- రెండో సంవత్సరం. ఫస్టుక్లాసులో పాసవుతున్నాడు. ఏదో ఈ కోర్సు కాగానే అమెరికా పంపించాలని వుంది. ఏదో అన్నీ సమకూడాలి కాదండీ!

ఆ:- అవునవును. మరి సామాన్య చదువా?

వి:- సామాన్య చదువుకి జీతాల్లేవండీ. పెద్దచదువు చదివితేగాని పెద్ద ఉద్యోగాలు రావుకదా! అదే చూస్తున్నా, మరి ఎలావుందో ఏమిటో...

న:- ఇంతకూ తారాబలముంటే !

వి:- అదుంటే, అడిగినదల్లా యిచ్చే మామగారు రాకూడదూ?

ఆ:- లేక కట్నం తీసుకోకుండానే పెళ్ళి కాగూడదా? చిన్న చదువుతోనే పెద్ద ఉద్యోగాలు రాకూడదా?

వి:- అవునవును చెప్పలేంలెండి, ఇంతకూ, పెద్ద చదువు చెప్పించాలని సంకల్పం...మరి ఏమవుతుందో!

సూ:- ఏ పెద్ద చదువయినా, నాకు మాత్రం ఉద్యోగం చెయ్యాలని.....

వి:- (తనేదో దర్పంగా, పెద్ద ఉద్యోగం కోసం, పెద్ద చదువు చెప్పించాలంటేగాని ఎక్కువ కట్నానికి గాలం పడదని చెప్తూవుంటే, వీడేమిటి ఉద్యోగం వద్దంటూ ఏబ్రాసిముఖం వీడూనూ అనుకుంటూ) ఆ, పసివాడివి, నీకేం తెలుసురా!

న:- పసివాడంటారేమిటి, పెళ్ళికాబోతూ వుంటే !

వి:- పెళ్ళికాగానే పెద్దవాళ్ళయిపోతారా ఏమిటి, ఇంకా మనం ఉన్నాంగా!

అ:- పోనీ. ఉద్యోగం చెయ్యాలని లేకపోతే, హాయిగా ప్లీడరు కోర్సో, డాక్టరు కోర్సో చదివించక పోయారా!

వి:- ఆ, అవి దేనికి? తగవులుంటేగాని ప్లీడరు సంపాదించడు. రోగులుంటేగాని డాక్టరు సంపాదించడు. సంఘంమీద కుళ్ళుని ఆధారం చేసుకు బ్రతకాలి.

అ:- అలాగంటే ఎలా, ఏ బ్రతుకు తెరువయినా అంతే! దేనికదే దుర్భరంగా వుంది. అయితేమట్టుకు, మీరన్నట్టుగా ఓ పక్షాన ఉద్యోగమే నయం!

వి:- మరే, ఏదో మీలాంటి మామగారాశీర్వదిస్తే మా వాడికేం కొదవలెండి. ఎంతైనా చదవచ్చు. ఎంత ఉద్యోగమైనా సంపాదించవచ్చు.

న:- [అప్పారావుతో] చూశారా ఎత్తు. మీరిచ్చే కట్నాలతో చదివించాలని కాబోలు.

అ:- అహ, మనదాకా రావాలా! వారెక్కడ శ్రీమంతులు.

వి:- ఏం శ్రీమంతులం! ఎలాగయినా, మీ పల్లెటూరివారి భాగ్యాలు, మా బస్తీ వారి కెక్కడివిలెండి.

న:- అయినా నేటి యువకులలా ఆదర్శాభిప్రాయులు. అభ్యుదయ శిఖరాలకు పరుగులు తీస్తున్నారు, నవశకాశ్చభారావాన్ని వూదిపారేస్తున్నారు. మరి కట్నాలను తీసుకోరనుకుంటాను. పెళ్ళిమార్కెట్లలో అమ్మిడు పోటానికి ఎండిపోతున్న కాకరకాయ మొహాలు వేసుకుని కూర్చోరనుకుంటాను [సూక్ష్మంతో] ఏం నాయనా నీదేపార్టీ? కాంగ్రెసా, కమ్యూనిస్టా, సోషలిస్టా!

సూ:- (చిరునవ్వు) మరింకొపార్టీ కాగూడదా?

న:- నువు చెప్పక పోయినా, ఈరోజుల్లో ఎవడేపార్టీవాడో మూడునిమిషాల్లో చెప్పవచ్చు కాంగ్రెసయితే ధూమ్‌మంజూరు లిస్టుల్లో వుంటాడు.

కమ్యూనిస్టయితే పోలీసు లిస్టుల్లో వుంటాడు, సోషలిస్టయితే హోటల్సు లిస్టుల్లో వుంటాడు.

అ:- ఇంకోటేవన్నా పార్టీ అయితే?

న:- ఆ, యీ మూడుపార్టీలు పాడేనని గోలగా వాగుతూ వుంటాడు. (అందరూ నవ్వుతారు) అయితే విశ్వనాధంగారు, మీవాడేపార్టీయో తెలుసుకోలేక పోతున్నానండి!

వి:- మావాడా? ఏమోమరి, ఇద్దరు గుడ్డలుతప్ప వెయ్యడు. కమ్యూనిస్టు వాళ్ళ పుస్తకాలు తెగచదువుతాడు. ఇక సోషలిస్టులకు చెల్లించే చందాలు అంతుండవు.

న:- ఇకనేం, ఏమంత్రివర్గమయినా, మీవాడికి ఉద్యోగం తధ్యమన్నమాటే! భేష్; అయితే అబ్బాయ్ రాజకీయాలు, ఆదర్శాలు మాట్లాడుతారే, మీరు కట్నాలు తీసుకోరాదవి అదన్నా ఆందోళన చెయ్యరాదూ?

సూ:- (వుషారుగా అందుకుని) అందుకనే...నేను...

వి:- (అడ్డంవచ్చి) ఆ. ఆ. సరేలే. అసలాకాదండీ. కట్నాలు నిషేధించాలని ఆడపిల్లల తండ్రిలే పూనుకోవాలి.

న:- ఆడపిల్లల తండ్రిలంటూ, మొగపిల్లల తండ్రిలంటూ రెండు తెగలా ఏమిటండీ?

అ:- అయినా, పిల్లల తండ్రిలేంచేస్తారండి, ఖుజాఖతో కల్యాణమై, సంసారం సరిదిద్దుకునేసరికి సతమతమవుతూ వుంటే? పోనీ ప్రజా ప్రభుత్వం ఇన్ని చట్టాలు పాస్ చేస్తుంది. కట్నాలు నిషేధిస్తూ ఓ చట్టం పాస్ చెయ్యగూడదూ ?

వి:- చట్టాంతో నేమవుతుందండీ, మీ పిచ్చి, ప్రజలు గుర్తించాలి గాని. దీనిలోనూ బ్లాక్ మార్కెటుచేసే వారుండరూ? మొన్న కారదా ఆక్టు వస్తే, ఏనాం, ఎగ్గుపాలెం పరుగెత్తలా ? ఏమిటో ప్లీడర్ల పేచీతో అంతటి చట్టమయినా ఏమీ ప్రయోజనం లేకుండా పోవడం లేదూ ! పది రూపాయలిస్తే ఎంత పెద్ద నేర మయినా నేరం కాదని కాస్త్రీయంగా, చట్టబద్ధంగా, కొట్టొచ్చినట్లు వాదించడంలా ?

వి:- ఇదంతా దేనికండీ, కట్నాలుంటే పెళ్ళిచేసుకోమని ఆడపిల్లలంతా సమ్మెచేస్తే సరి !

న:- (సూర్యంతో) ఇవ్వకపోతే, మీరు సమ్మె చేయరూ ?

సూ:- మా ప్రశ్నేముంది (తండ్రిని చూపిస్తూ) వారు, చదువుకి, సర్వానికి తండ్రిమీద ఆధారపడే వయస్సులో కట్నాలు వద్దనే అధికారం మాకుంటేగా, కావలసిందే అనేవారున్నప్పుడు... (నవ్వుతూ) మీ రామాట వారి నడగాలి.

న:- (నవ్వుతూ) చూశారా అప్పారావుగారూ ! మంచి పదునైన వాదం దినే... ఆ. ఆ. వెళ్ళి అమ్మాయిని తీసుకరండి...

అ:- అలాగే (వెళ్తాడు)

సూ:- నిజంగాచూస్తే, మన సాంప్రదాయాలు మార్చెయ్యాలండి, ఎంత డబ్బు తగలేస్తామో. అసలు తన్నుతాను పోషించుకోలేని వాడు పెళ్ళెందుకు చేసుకోవాలి చెప్పండి. ఇతర దేశాల్లో చూడండి, ముప్పది యేళ్ళకు పైబడితేగాని పెళ్ళి చేసుకోరు.

న:- ఓహో ! నీకూవుంది యీ పాశ్చాత్య వ్యామోహం ! అసలదొక అంటువ్యాధి. అయితే నీకిక్కడ (మెదడు చూపిస్తూ) ఆపరేషన్ అవసరమన్నమాట !

సూ:- నే చెప్పేది మీరు...

వి:- (కోపం వచ్చేసి వూరుకుంది, కొడుకు మాటలకి. మాటకు అర్థం వచ్చి) పోనీ పెళ్ళిళ్ళే మానెయ్యమన రాదురా !

సూ:- అలాకాదు. నన్ను చెప్పనివ్వండి మరి !

న:- \
వి:- / (మాటకు అడ్డువచ్చి) బాబూ, బాబూ, నీ కొడుకుల

హయాంలో నీ యిష్టంగాని, అందాకామట్టుకు మా సాంప్రదాయాలే వుండనిద్దూ.

న:- పిళ్ళహయాంచూస్తేనే వున్నాంగా, నవయువకులంతా కంచుకాగడా లతో ముందడుగు వేస్తూనే వున్నారు. లోకాలు భగ్గునమంటి పోతూనే

వున్నాయి కాని, మారేదేమిటో. అన్ని మోసాలు, దురాచారాలు. అన్నీ, అలాగే వున్నయి. పైగా రానురానూ పతనమై పోతున్నాం.

సూ:- (ఏదో చెప్పబోయి ప్రేలిలా చూపిస్తూ లోపలనుంచి వస్తున్నవారి అలికిడివల్ల దృష్టి వారివేపు పడి, చెప్పబోయి మానేసి వూరుకుంటాడు)

(అప్పారావుతో పెళ్ళికూతురు మాణిక్యం ప్రవేశం. అప్పారావు చెయిపట్టుకుని కూర్చోపెడతాడు. మాణిక్యానికి అంతగా అందం లేకపోయినా యువకుల్ని ఆకర్షించే లక్షణాలున్నాయి. అమితమైన సిగ్గుచేత తల వంచుకుని తివాసిమీద వీణా, హార్మోనియం దగ్గరగా కూర్చుంటుంది. పిల్లను సూర్యం, విశ్వనాధం చూస్తారు. క్షణం నిశ్శబ్దం. సూర్యం, విశ్వనాధం వంక నరహరి, అప్పారావు చూస్తారు)

న:- ఆ, విశ్వనాధంగారు, అబ్బాయ్, ఆ మరి, ఆమ్మాయి నేమైనా నాలుగు ప్రశ్నలు...వేస్తారా ?

వి:- ఆ, అలాగే.

సూ:- అహా, అక్కర్లేదులెండి !

న:- అలా అనకు. వెయ్యండి, హిందీ, ఇంగ్లీషు, తెలుగులోనైనాసరే !

వి:- (తాపీగా పిల్లనుచూసి) పేరేం పెట్టారు ?

అ:- మాణిక్యం.

వి:- (బాగుంది అన్నట్టుగా తల వూపుతూ, తలవూపడం ఆపి మాణిక్యం మీద దృష్టి నిలిపి) చూడండి, కొంచం అమ్మాయి నలిగినట్టుంది. ఎప్పుడయినా, ఏమయినా సుస్తి చేయలేదు కదా !

అ:- ఈ మధ్యనే ఓ పక్షం మాత్రం లంకణాలు చేసింది, అంతే ! అది తప్ప...

న:- ఊ, ఊ, ఆపగంటి, అప్పారావుగారంటే ఏమనుకున్నారో, ఏదైనా దాచకుండా చెప్పేస్తారు. చుట్టుపక్కల ఆరవై గ్రామాల్లోనూ సత్యం తప్పడని పేరండోయ్ మీ రా పిల్లను చేసుకోండి, చేసుకోపోనివ్వండి, సివ్వర్మషంగా, వున్నదున్నట్లు చెప్పేస్తారు

సూ:- ఏమండీ వారు హిందీ అన్నారు. తాను స్వతహాగానే నేర్చుకుందా ?

అ:- స్వతహాగా—కాదులెండి, దాని మేనత్తకొడుకు-

న:- (మాణిక్యం పేరుతో మేనత్తకొడుకు ప్రస్తావన రావడం, నిష్కారణంగా లేనిపోని అపోహలకు కారణమవుతుందనే ఆదుర్దాతో) అది, అతను-

వి:- (అప్పారావుని చూపిస్తూ, నరహరితో) వారిని చెప్పనివ్వండి.

అ:- ఆ, మేనత్త కొడుకు నేర్పాడులెండి !

వి:- (ఇక తరచి అడగాలన్న ఆదుర్దా మొదలెట్టింది) ఈ వూరిలోనే వుంటాడా ఆ అబ్బాయి ?

అ:- లేదు. చదువుకుంటున్నాడు. కాని ఎప్పుడన్నా శలవులకు వస్తూ వుంటాడు.

న:- (మళ్ళా అడ్డంవచ్చి సంభాషణ మార్చాలని ప్రయత్నం) అతనంటే, అతను, అతను-

వి:- (అప్పారావుని చూపిస్తూ, నరహరితో కొంచెం నిశితంగా) వారిని చెప్పనివ్వండి.

అ:- అలా వచ్చినప్పుడల్లా, కొంచం కొంచంగా నేర్పాడు.

వి:- [అడగటం అవసరమన్నట్లుగా] అతని వయస్సెంత ?

అ:- [అమాయకంగానే] మన అబ్బాయి వయస్సే ఉంటుంది?

వి:- [అనుమానం ఎక్కువవుతోంది] అతనికి వివాహమయిందా?

అ:- చేసుకోడట.

సూ:- మంచిపని. భలేవాడు, అయితే ఎందుకు చేసుకోదో?

వి:- ఇంకెందుకూ, అమ్మాయికి పాఠాలు చెప్పడానికే!

న:- ఆ, అతను, అతనంటే, సూక్ష్మం! మీ గోపాలరావోయి!

సూ:- అతనంటే, వాడు నాన్నా! ఉత్తరం వ్రాయలేదూ యీ మనుషు గురించి, అతను చాలా మంచివాడు నాన్నా!

వి:- (నవ్వుతో) ఓరి, అతనుటొ్ర పాపం! మరి చెప్పేవుకా వేమయ్యా నరహరిగారూ?

న:- నన్ను చెప్పనిస్తేనా...అప్పారావుగారి లాంటి విషయం చెప్పడం చేతగాని తండ్రులుంచే, ఆడపిల్లలు పెళ్ళిళ్ళుగాక అడుక్కతినా ల్సిందే!

సూ:- అసలా మనుషుల మంత్రాంగాలు నిజంగా చదరంగపు చెత్తులేమో నని!

న:- ఆ, విశ్వనాధంగారూ, అమ్మాయినేమన్నా అడగండి?

సూ:- ఎందుకూ, అక్కర్లేదండి?

న:- అలా అనకయ్యా, తీరా పెండ్లయాక మాటలురాని మంగమ్మను మా మెడకు కట్టారంచే!

వి:- అవా. మంచిమాట! మీరంత మోసం చేస్తా రనుకుంటామా!

న:- అనుకోరనుకోండి!

సూ:- దేనికిలెండి!

న:- (మాణిక్యం దగ్గర కెళ్ళి) ఇదుగో అమ్మాయ్! ఒక పాట పాడమ్మా (వంగి హార్మోనియంమీద చేతులు చాచి వాయించమన్నట్లు చేళ్ళు చూపుతూ) ఓ త్యాగరాజకృతి పాడమ్మా! (మాణిక్యం వాయించడం మొదలెడుతుంది. నరహరి సూర్యంవంకచూసి) త్యాగరాజ కృతనం గానే, ముఖం ఎలా ముడుచుకున్నాడో చూడు!

సూ:- దేనికండి, యీ మ్యూజికల్ చెస్టు!

వి:- (మాణిక్యం మరొకమారు వరస వాయించేస్తుంది. పడక కుర్చీలో విశ్వనాధం వెనక్కు ఆనుకుంటాడు. ఆయన జీవితపథంలో కొన్ని మధురస్మృతులు మనసును కదిలించాయి కాబోలు, మళ్ళా ముందరికివంగి శూన్యంతోకి చూస్తూ) నాపెళ్ళి చూపులనాకు మీ అమ్మపాట జ్ఞాపకం వస్తూందిరా (అంటుంచే కంటతడి వచ్చింది కాని ఎవరూ గమనించలేదు).

సూ:- అవును. ఆనాటి సంగీతం జ్ఞాపకం రాక...ఈమధ్య పాడటం వుండేనా...పెళ్ళి సంగీతం పెళ్ళితో సరి!

న:- ఎందుకూ, వినతీరికవుండే నవుకరీ తెచ్చుకో, పెళ్ళాం చేత అస్త్ర మానం పాడించుకో, కాదన్నదెవరూ ఊ, పాడమ్మా, పాడనివ్వ వయ్యా, నీబోటి గాన విశారద లెవరో అని సంగీతం భ్రమపడి నేర్పించాడయ్యా !

సూ:- ఆ, దేనికండీ !

న:- అలాగనవద్దు.

సూ:- పోనివ్వండి.

న:- ఆచారాన్ని కాదనకు.

సూ:- వద్దంటూ వుండే!

న:- [పాయించడం మానివేసిన మాణ్యికం దగ్గరకెళ్ళి] ఊ, ఏదీ ! పాడమ్మా పాడు ! (నిశ్శబ్దం) సరే, నిన్ను సాగదీయడం మళ్ళా అర గంటా !

సూ:- ఎందుకండీ, అనవసర శ్రమ !

న:- ఓహోహో ! ఏం సున్నిత భావాలయ్యా ! కాబోయే పెళ్ళాం అరిగి పోతుందనా ?

వి:- మరేం ఫర్వాలేదండీ, అప్పారావుగారూ, ఆమ్మాయిని లోపలకు తీసు కెళ్ళండి (మాణిక్యం యింతవరకు కదల మెదలకుండా అలాగే కూర్చుని వుంటుంది. అప్పారావు దగ్గరకెళ్ళి మళ్ళా చెయిపట్టుకుని లోపలకు తీసుకెల్తాడు).

న:- ఏం అబ్బాయి, పిల్ల నచ్చిందా (నిశ్శబ్దం) ఏం ?

సూ:- (ఆలోచన తెగలేదు) చె...ప్పడం ఎ-లా-గా అని ?

న:- లగ్నం పెట్టెయ్యమా ?

సూ:- (అయ్యబాబో) ఆ, ఏమంటాడు ?

న:- చూపులంకు నచ్చిందా ?

సూ:- (ఇంకా ఆలోచన తెగలేదు కాని మొహమాట పెట్టేస్తున్నాడే నరహరి మరిఎలాగ) న... చ్చిందనే...అనుకుంటాను.

న:- ఇకనేం, మాఘమాసంలో పెళ్ళి ఖాయం ! (హడావిడిగా లోపలికి చూస్తూ) అప్పారావుగారూ ! (వెళ్తున్నాడు)

సూ:- నరహరిగారూ ! (నరహరి అగిపోతాడు) వచ్చే మాసంలోనే !

న:- నీవు కావాలంటే యీ క్షణం, అన్నీ !

సూ:- నరహరిగారూ !

న:- ఏం కావాలి నాయనా?

సూ:- నా పెళ్ళి కోసం, మీకింత కొందరేమిటండీ !

న:- ఇలాంటివసలు ఛప్పున పైసలవాలి, ఆలస్యం అమృతం విషం !

సూ:- అలా తొందరపడితే ఎలా ? (ఆలోచనలలో మునిగిపోయి) కాస్త వ్యాపారానికి, అణాభాగస్తుని చేర్చుకోడానికి, ఆరువై ఆరు నక్షత్రాలు లెక్కెడుతామే ! జీవితంలో సగభాగస్తురాలు, అర్ధాంగిని ఎన్నుకోవాలంటే ఎన్ని ఆలోచించాలి ?

న:- ఇంకా ఆలోచన దేనికయ్యా, రూపం చూచావు గదా ? కుటుంబం తెలిసినదే ! ఇక మిగతా విషయాలు మాకు వదిలేయ్ !

సూ:- (దూరాన ఏమిటో చూస్తున్నాడు) ఆ అమ్మాయి మనసెలాంటిదో- - ఆశయాలేమిటో - - - అభిరుచులేమిటో - - - ఏమీ తెలియకుండా - - - ఎలా - - పెళ్ళాడటమా అని - ఏదో బాధగా వుందండీ !

న:- పెళ్ళి చేసుకోమంటే బాధంటావేమిటయ్యా, నోటకని ఆల్లుడల్లే ! మా అమ్మాయెలాంటిదో తెలుసా, చూశావుగా, మేనక పాకం; కొత్తపల్లి కొబ్బరి !

సూ:- [ఆలోచన తెమిలింది] చూడండి, నరహరిగారూ ! మీకు నామీద నమ్మకమే కదూ!

న:- అహ, నిస్సందేహంగా ! నీకంటే యోగ్యుడెవరు ?

సూ:- చూడండి - - ఆ అమ్మాయి - తో - అయిదు నిముషాలు - - -

న:- ఆ, ఏమిటేమిటీ !

సూ:- అయిదునిముషాలు అమ్మాయితో మాట్లాడుతాను.

న:- [విసుగ్గా] ఆ, ఏమిటి !

సూ:- అమ్మాయితో ఏకాంతంగా !

న:- [కోపం వచ్చేస్తున్నది] ఆ, ఏ మన్నావ్ ?

సూ:- మాట్లాడిన తర్వాత !

న:- [కోపం ఆపుకోలేదు] చాల్లేవయ్యా, ఎవడన్నా వింటే నవ్వుతాడు.

వి:- ఒరేయి ! ఇవి పిల్లతండ్రివింటే మనల్ని పొలిమేరల దాకా తరుము తాడురా !

సూ:- ఇందులో తప్పేంలేదే, మాట్లాడటం ఒక్కటేగా నే కోరింది.

న:- ఏం ఒక్కటయ్యా, ఇవి పెళ్ళి చూపులనుకున్నావా, సంత జాతరనుకున్నావా ?

వి:- మనమడిగేది సబబుగా వుండాలిరా ?

సూ:- (సమర్థించుకుంటూ లేచి) ఏం సబబండి, మంచి చెడ్డలేం పరామర్శ చేయనక్కర్లా ? ఏం లేకుండానే, ఏ చెవిటిదాన్నో మూగదాన్నో చేసుకోమంటారా ?

న:- (చిందులు తొక్కేవాడల్లా ఆగి) ఆ మాటంటేనే జాతరనేది. ఇందాక అడగమంటే అడగనంటివి, పాడమంటే పాడవద్దంటివి—

సూ:- ఇప్పుడు మాట్లాడనివ్వరని నాకేం తెలుసూ !

వి:- తెలిసేదేమిటి, లోకాచారం తెలియదూ ?

సూ:- లోకాచారం కాకపోతేనేం, మంచిదైతే చెయ్యగూడదా ?

న:- మంచేమిటయ్యా మంచి - - పరాయి పిల్లతో - ప్రయివేటుగా - పరామర్శ చెయ్యడం మంచా !

వి:- మేమంతా అలాచేశాంగా ?

సూ:- మీరు చేయకపోతేనేం, మేం చెయ్యగూడదూ ?

న:- [లేచి తెగించుకు వెళ్ళిపోతున్నాడేమో) పోనీలే బాబూ, పోనీ. ఇక ఇంతటితో కట్టిపెట్టు. పిల్ల నచ్చకపోతే పోయింది. ఆ అమ్మాయికి తగ్గవరుడు ఆ అమ్మాయికి పస్తాడు. తారాబలం కుదిరితే సరి ! ఇది కుదరదని నాకు మొదటే తెలుసు. వద్దన్నకొద్దీ ఎడంకాలు అడుగు పెట్టావ్ - - - (కూర్చుంటూ) అయినా ఆమాట మాట్లాడితే, నీవు అంబరవీధి కెగసిపోతుంటే, నిన్ను పట్టుకు ఎందాకా వేళ్ళాడం! (అందరూ బుర్రలు పాడుచేసుకుంటూ ఎవరి ఆలోచనల్లో వారుంటారు. వెనకాలగా మామూలుగానే వచ్చినట్లు వచ్చి జోరుగా సాగిపోతున్న సంభాషణకు అడ్డురాకుండా వెనకాలే నిలబడివింటూ వుంటాడు]

సూ:- అయితే మీరనేది, కాబోయే భార్యతో అయిదు నిముషాలు !

న:- అదుగో మళ్ళా కాబోయే భార్యంటావు, నువ్వు చేసుకుంటానను. నీ ఇష్టం వచ్చినంతసేపు.....

సూ:- అయితే మాట్లాడిన తర్వాతగా...

న:- (లేస్తూ) అందుకే.....ఇది కుదిరే బేరం కాదండీ ! (విసురుగా అవతలకెళ్ళి నిలబడతాడు)

వి:- ఓరేయ్! నీ చాదస్తం పిల్లతండ్రి చూస్తే,మన ముఖాన ఉమ్మేస్తాడురా. మేం చెప్పినట్టు వినరా ! మన పరువు పోతుంది!

సూ:- పిల్లను పరామర్శ చేయకుండా పెళ్ళికొప్పుకోనండీ !

వి:- ఆ పరామర్శ అనవసరం !

సూ:- నాకు చాలా అవసరం.

వి:- (లేచి) నే చెప్తున్నాను.

సూ:- (తాపీగా) నే వింటున్నాను.

వి:- (కోపం) ముహూర్తం పెట్టేస్తాను !

సూ:- (నిర్లక్ష్యం) పెట్టేసుకోండి !

వి:- (మీదకెళ్ళి) నీవు పెళ్ళాడాలి !

సూ:- (తొణకకుండా) నే పెళ్ళాడను.
(కొడుకు మాటలలో అవిధేయత, తృణీకారంతో తండ్రికి కంగారు-కోపం, ఆవేశం కలిగాయి. వుత్తరీయం, చేతికర్రకోసం చిందులు తొక్కుతున్నాడు. వెళ్ళిపోదామనే ఇంతదాకా వెనక నిలబడిపోయిన అప్పారావు ముందర కొస్తాడు.)

ఆ:- (విశ్వనాధంతో) ఏమంటున్నాడండీ, అబ్బాయి ?

వి:- (బయలుదేరుతూ) ఆ ఏం లేదు. ఏంలేదు. మేం శలవు తీసుకుంటా మండి, నెళ్ళగానే మీకు జాబు వ్రాస్తాం.

న:- జాబెందుకులెండి, ఎమరుగా వున్నాడుగా, చెప్పండి !

సూ:- చెప్పండీ !

వి:- నా కనవసరం.

ఆ:- ఏమిటో చెప్పండి !

న:- ఏముంది...ఏమీలేదు...ఏమిటంటే...

వి:- (మాట కడ్డువచ్చి) ఎందుకూ చెప్పడం ? వారికేం కోపం వస్తుందో, ఎందుకులెండి !

సూ:- ఏం లేదండీ...! మీ అమ్మాయితో నే మాట్లాడాలన్నాను. (క్షణం నిశ్శబ్దం)

ఆ:- (చిరునవ్వు) అంతేకదా !

న:- (షాక్‌తో) వంటరిగాటండీ !

ఆ:- (క్షణం ఆగి) వారంతగా అడిగితే ఎలా కాదనటం... సరే కానివ్వండి! ఇంతకీ ఏం జరుగనున్నదో అదే జరగాలి కదా... (సూర్యంతో) ఆ, చూడండి, నేవెళ్ళి అమ్మాయిని తీసుకొస్తాను..... కాస్త సిగ్గువల్లి...

సూ:- నాకూ కాస్త సిగ్గుగానే వుంటుంది లెండి. ఫర్వాలేదు లెండి. (అప్పారావు వెళతాడు)

న:- త్వరగా...ముగించునాయినా ! (నరహరి, విశ్వనాధం వెళతారు)
(అందరూ నిష్క్రమించిన తర్వాత, సూర్యం అటూ ఇటూ తిరుగుతూ వుంటాడు. వంటరిగా తన యెదుట వచ్చి నిలబడే మాణిక్యంతో యెలా సంభాషణ మొదలెడదాం, ఏవిధంగా పోజు పెట్టుదాం, ఏమడుగుదాం, మనం అందంగా కనబడమా? కనబడకేమిటి, అసలు మనం యెలావున్నాం, మనం, మన [కాపు, [డ్రెస్సు) యెలా వున్నాయి? ఇలా అనేకం ఊహాగానం చేస్తూ తిరుగుతూ, ఆగుతూ, ఎదురు చూస్తూ వుంటాడు. ఇలా వకమారు బయటదాకా వెళ్ళి అదో ఆలోచన చేస్తూ చేతివ్రేళ్ళ మీది అదో అంచనాలు మనస్సులో నిచ్చెనలు వేసుకుంటూ వాకిటవేపు తిరిగివుండే, లోపం నుండి నవుకరు కప్పులు, సాసర్లు తీసుకెళ్ళడానికి వచ్చి బల్లమీద కప్పులూ సాసర్లు చేతిలోకి తీసుకోవడంలో చప్పుడు చేయగానే, మాణిక్యం వచ్చిందనుకొని సూర్యం ''ఏం అమ్మాయి'' అంటూ ఇటు తిరిగి నవుకరును చూచి తెల్లబోయి చూస్తాడు. నవుకరు ఇదేమిట్రా, మనల్ని అమ్మాయి అంటాడు? అని ఏదో విత్తరచూపు సూర్యం వేపు పారేసి, తన పని చేసుకు కప్పులు, సాసర్లు లోపలికి తీసి కెళ్తూవుండే, తోచక తిరుగుతున్నట్టుగా నవుకరు వెంట లోపం వాకిలిదాకా వచ్చి, మళ్ళా బయటవాకిలిదాకా, మళ్ళా లోపలవాకిలి దాకా పదార్లుచేస్తూవుండగా మాణిక్యం ప్రవేశించి ఒక ప్రక్కగా నిల్చుని తలవంచుకుంటుంది. ఒక క్షణం నిశ్శబ్దం)

సూ:- (ఎలా నిశ్శబ్దాన్ని ఛేదించాలో, ఎలా సంబోధించాలో తెలియక అప్రతిభత్నంగా అనేస్తాడు) ఏం! వచ్చారా అమ్మాయ్?

మా:- (అలాగే తలవంచుకుని మాట్లాడదు)

సూ:- ఆ, మరి అలా కూర్చోండి.

మా:- (కూర్చోదు. చలనంలేదు. తలఎత్తదు)

సూ:- ఆ ఊఁ. ఇటు చూడండి.

మా:- (చూడదు. చలనంలేదు, తలఎత్తదు)

సూ:- (దగ్గరకెళ్ళి, ఆమెవంక చూడకుండా) కూర్చోండి!

మా:- (తలఎత్తి. ఆతనివంక చూడక ఎటో చూసి తలవంచుకుంటుంది)

సూ:- (అవతలకెళ్ళి వచ్చి దగ్గరకెళ్ళి తనచేయి ఆమెచూపుల్లో పడేలాగు కుర్చీ చూపిస్తూ) అలా కూర్చోండి, మరి !

మా:- (అతని చేసంజ్ఞనుబట్టి కుర్చీలో కూర్చోమంటున్నాడని గ్రహించింది గనుక కుర్చీలో కూర్చుంది. తలమాత్రం ఎత్తలేదు)

సూ:- (ఎలాగైతేనేం మాణిక్యంలో చలనం తెచ్చానుగదా అనే సంతోషం) మిమ్మలను అడిగి తెలుసుకుందామని...మీరు అపార్థం చేసుకోవద్దు ...మీరు ఎంతవరకు చదువుకున్నారు ?

మా:- (జవాబు లేదు, చలనం లేదు)

సూ:- మీరూ ఎంతవరకు చదువుకున్నారని ?

మా:- (ఇతనివంక చూడకుండా అనవసరమైన వేపు ఓ మారు చూచి మళ్ళా తలవంచుకుంటుంది)

సూ:- (చిరునవ్వు) చెప్పరేం...మీపేరు ?

మా:- (చలనం లేదు. తల ఎత్తదు)

సూ:- అరె. పేరు చెప్పడానికేం ?

మా:- (మాడ్పులేదు)

సూ:- మీరిలా బిగుసుకుపోతే ఎలా ? ఇంకా చాలా అడగాలి ?

మా:- (జడముందర వేసుకుని జడలో ఏదో చూసి జడమళ్ళా వెనక్కు వేసుకుంటుంది. ఎదురుగా ఎక్కడో ఏమిటో చూస్తూ కూర్చుంటుంది. అక్కడున్న సూర్యంతో గాని సూర్యం అడిగే ప్రశ్నలతో గాని, ఆమెకు సంబంధం లేదని ఆమెను చూస్తే గ్రహించవచ్చు)

సూ:- (ఇంకా ఓర్పుపోలేదు. కొంచెం రసవత్తరంగా అవస్థగా) పేరేమిటీ చెప్పండీ ?... చెప్పరా ? మూగనోము పట్టారా ? (నవ్వుతూ)

నిజంగా మూగా ? (తోచక అటు ఇటూ పచారుచేసి దగ్గరకెళ్ళి) ఏం జవాబు చెప్తారా ? (మళ్ళా అవతలకి వెళ్ళిపోతాడు. మాణిక్యంలో చలనంలేదు. కొట్టేసేటంత కోపంతో గబగబా మాణిక్యం దగ్గర కొచ్చేసి ఆగి నెమ్మదిగా) ఏం చెప్తావా లేదా ? (మాణిక్యంలో చలనం లేదు. అవలకు వెళ్తూ) చస్, మూగమేళమే ! (ఆగి) మూగయితే ఇందాక పాడటానికెలా సిద్ధమయావ్ ! నీవు వాయించడం, నేవద్ద నటం – ఆయన పాడమనటం, నీవు పాడక పోవడం అరెరె ! నా బ్రతుకు పగటి భాగోతం చేశావే ! (క్షణం పచారుచేసి దగ్గరకొచ్చి) ఏమయినా చెవుడుకూడా వుందా ? (మాణిక్యంలో చలనంలేదు) (ఓ మారు పచారుచేసి దగ్గరకెళ్ళి) ఏమయినా చెముడుందా ? (కోపం వచ్చి మీద పడిపోతూ బిగ్గరగా) చెవుడు, చెవుడుందా ? (మీద పడుతున్నాడే అని మాణిక్యం చెయ్యి అడ్డంగా వూపుతుంది) ఏమిటి చెయ్యివూపడం, చెముడు లేదనా, మీద పడవద్దనా ? (విసుగ్గా ఇవతలకొచ్చేస్తూ) చస్ ! తేలిపోయింది. చెవిటి మూగ మేళ సమ్మేళనం ! (వెళ్ళి కూర్చుంటూ) అమ్మా ! నన్ను మోసంచేద్దామనా ? సరేనని నిన్ను చేసుకున్నట్టయితే వురి - వురి తీసుకోవాల్సి వచ్చేది ! అన్ని అవయవాలుంటేనే, దాంపత్యాలు అధ్వాన్నం చతుర్మాథ్యంగా ఏడుస్తున్నాయి.

మా:- (ఇందాక సూర్యం కూర్చునే సమయానే లేచి నిలబడివుంది. అంతా అయోమయంగా వుంది. ఇప్పుడు కళ్ళ నీళ్ళు చీరె చెంగుతో అద్దుకుంటూవుంది)

సూ:- (చూచి) విచారం దేనికీ, గుట్టు బయట పడిందనా ? సమస్య ఇప్పుడే తేలిపోయిందని సంతోషించు ! ఈ మూగ మేళానికేనా 'మాణిక్యం' అని పేరు ! నీబోటి వాళ్ళు పేర్ల విలువ, చీరెల విలువా కూడా పాడు చేస్తూ వుంటారు !

మా:- (అతనిదగ్గరకు నడచి వస్తూవుంటుంది)

సూ:- (లేచి) కాళ్ళమీద పడదామనా ?

మా:- (దగ్గరకెళ్ళి నిలబడి) నమస్తే ! కలవు ! (వెళ్ళిపోతోంది)

సూ:- ఆ, అయితే !

మా:- (వెళ్ళేదల్లా అతని వేపు తిరగదుగాని, ఆగిపోతుంది)

సూ:- నన్ను వట్టి ఫూల్ క్రింద జమకట్టావన్న మాట !

మా:- (తలవంచుకుని) క్షమించండి !

సూ:- క్షమించండి (మరొక అడుగు దగ్గర కేసి) నేనడిగిన వాటికి - - - సమాధానం - - - (ఆగింది ఎలాగోలా, ఇక ప్రశ్నలు వేద్దామనే ఆదుర్దాతో) మీరు పుస్తకాలేమయినా చదివారా ?

మా:- లేదండి !

సూ:- లేదు—విశ్రాంతి సమయాల్లో ఏం చేస్తారు ?

మా:- (క్షణం ఆగి) ఏం చెయ్యను ?

సూ:- కూర్చోండి మరి.

మా:- (కూర్చుంటుంది)

సూ:- ఇంగ్లీషు ఎంతవరకు చదివారు ?

మా:- చదువుతాను. అర్థం కాదు.

సూ:- ఆరోగ్య శాస్త్రం, శిశుపోషణ, కుట్టుపని చదువుకున్నారా ?

మా:- లేదే !

సూ:- మరి సంసారం ఎలా చేస్తారూ ?

మా:- ఏమో మరి !

సూ:- చూడండి, లేడీస్ క్లబ్‌లో మెంబరుగా చేర్తారా ?

మా:- ఆ, ఏమిటీ ?

సూ:- లే--డీస్ క్ల బ్ బ్ - - లో మెంబరుగా చేర్తారా ?

మా:- (కొంచెం విసుగ్గా) ఏమోనండీ ?

సూ:- (క్షణం నిశ్శబ్దంతో ఆమెను తీక్షణంగా చూసి) సుఖానికి అందం ముఖ్యమంటారా ?

మా:- (సూర్యం ఆందం ఎలా వుందో ఓమారు చూసి) ఏమో బాబూ ?

సూ:- మీ భర్త ఏం ఉద్యోగం చెయ్యాలని వుంది ?

మా:- అసలేదో ఒకటి చేస్తే చాలు.

సూ:- నన్ను పెళ్ళి చేసుకోవాలని మీకు వుందా ?

మా:- (ఏమిటీ గొడవ అన్నట్లు) మీరసలు పెళ్ళి చేసుకుంటారా ?

సూ:- ఎదురుప్రశ్న వేస్తావేం ? జవాబు చెప్పు ?

మా:- (స్వచ్ఛమైన కంఠంతో, ఆత్మవిశ్వాసంతో) ఏమిటండీ జవాబు చెప్పేది ? మీ ఇష్టమొచ్చినట్లడగటానికి స్త్రీలంత అమ్ముడుపోని సంతసరకులనుకున్నారా ? ప్రశ్న లడగటానికేం అడుగుతారు. అడిగేవాడికి చెప్పేవారు లోకువ ? మీరింత చదువూ, ఇంత విజ్ఞానంతో పట్టుమని పది రూపాయలు సంపాదించగలమని చెప్పగలరూ? ఇన్ని పుస్తకాలు చదివానన్నారే, మీరేం చదివారు ? రామాయణం ఒక్కమారైనా చదివారూ? మీ ఇంగ్లీషు చదువులు ఉద్ధరిస్తున్నాయి. ఇక మా ఇంగ్లీషు చదువులు? మీరు భుక్తి గడిచేటందుకు సంపాదిస్తే గదా ఆటుపైన మా క్లబ్ సభ్యత్వాలూ, గ్రంథ సమీక్షలున్నూ ! 'విశ్రాంతి సమయాల్లో, ఏం చేస్తావ్' ఇంటిచాకిరేగా ! భార్య అస్తమానం ఆరవచాకిరీ చేస్తూ-అత్తపోరు పడుతూవుంటే, మీ బోటి విద్యావంతులైన భర్తలంతా గుడ్లప్పగించి ఇదుగో, ఇలాగే చూస్తూ కూర్చుంటారు. 'సుఖానికందం ముఖ్యమా' అన్నారు. అందచందాలు దేనికండీ అదృష్టం లేనిదే ! సూర్యుడు సహితం గ్రహణంలో కాంతి విహీనుడవుతాడే ! మానవ జీవితం అనుక్షణం విధివశమే ! ఇక దేనికి మనం కర్తలం? దేనికీ ప్రశ్నలు ? శవ !!! (చరచరా వెళ్ళిపోతుంది)

(సూర్యం నిర్భ్రాంతపోయి మాణిక్యం వెళ్ళగానే కుర్చీలో కూలుతాడు. సూర్యానికి తన పరాభవానికి పట్టరాని కోపం వచ్చింది. కాని ఏం చేయలేనితనం వల్ల దుఃఖంలోకి దిగి హస్తాల్లో తలదాచుకొని వున్నాడు)

(విశ్వనాథం, అప్పారావు, నరహరి ప్రవేశిస్తారు)

అ:- వర్షం వచ్చేసిందేమో నరహరిగారూ !

న:- మరేం ఫర్వాలేదు. ఆ, విశ్వనాథంగారు అలా దయచెయ్యండి... మనం నాలుగూ అనుకొని... పుచ్చుకుందే...ఏది... శలవు పుచ్చు కోదం కాదు... తాంబూలం పుచ్చుకుందే-

వి:- అలాగే, మీకన్నీ తెలిసినవే, అన్నీ చూస్తున్నారు.

న:- ఎన్నో చూస్తున్నాను.

అ:- ఏదో మనసులు కలవాలిగాని. వేటిల్లోనూ పేచీలు రావనుకోండి. ఏదో ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళూ ఏ గొడవా లేకుండానే చేశాను.

న:- (చిరునవ్వు) వారికి మట్టుకు తెలియదూ ? ఎలాగయినా వురామరిగా నన్నా అనుకుంటే మంచిది.

సూ:- (మనసులో ఏదో బాధపడుతున్నాడు) అదికాదండీ !

న:- (చెప్పనివ్వకుండా అడ్డంవచ్చి) తొందర పడకయ్యా, ఓహోహో ! నీవిప్పుడే పెళ్ళాడాలంటే ఎలా ?

సూ:- మీరు పొరపాటు - -

న:- పొరపాటులేదు – గ్రహపాటులేదు, నువ్వలా వుండవయ్యా! అన్నీ నీ ఇష్టం ప్రకారమే చేయించేస్తున్నానా ! ఆ - - అప్పారావుగారు, కట్నం మాట అనండి !

అ:- అనేదేముందీ, మిగతా పిల్లల మాదిరే - - - మూడువేలు కట్నం ఇస్తాను - - -

సూ:- (లేచి) నేనొక్కటి చెప్తాను - -

న:- యిష్, కట్నం విషయం నీకెందుకయ్యా, అది మా విషయం. (కూర్చోపెట్టకుండానే సూర్యం కూర్చుంటాడు)

వి:- నేను చెప్పాను కాదండీ నరహరిగారు ! మాది సూర్యవంశం. చంద్రవంశం తాతాబలం మాకేం అడ్డురావు. నాకేం కట్నం విషయంలో పట్టింపులు లేవు. కానీ – మా వంశంలో ఇంత వరకు అయిదువేలకట్నం, అయిదురోజుల పెళ్ళి - ఆచారం క్రమం

తప్పకుండా వస్తోంది. చూశారూ, నేను నలుగురిలో తిరగవలసిన వాడిని - - ఇక మీ ఇష్టం !

అ:- ఈ రోజుల్లో అయిదు రోజుల పెళ్ళి, అయిదువేల కట్నం !

న:- మీరాగండి, ఇదుగో విశ్వనాథంగారూ! ఇన్ని మాట లెందుకుగాని మూడువేల రెండువందలు, ముప్పయి రెండువందలు.—

వి:- ఏభయి పందలు.

న:- ముప్పయి అయిదు.

వి:- ఏభయి !

న:- ముప్పయి అయిదు !

వి:- ఏభయి !

న:- నలభయివందలు,

వి:- నలభయి రెండు.

న:- నలభయిమూడు, ఒకసారి, రెండుసార్లు.

వి:- మూడుసార్లు !

న:- రైట్, నలుభయి మూడువందలు !

వి:- ఇక ఆపబిడ్డల లాంఛనాలు అవీ !

అ:- ఇంకో లాంఛనాలు కూడానా ?

వి:- అంతకాడికి ఇదంతా ఎందుకండీ ?

న:- అన్నట్టు విశ్వనాథంగారూ, మీకు ఆడపిల్లలు లేరు కదా!

వి:- [విసురుగా] నా తమ్ముడు కూతుళ్ళు లేరూ ! లాంఛనా లివ్వకపోతే వాళ్ళసలు పెళ్ళి జరుగనిస్తారా ?

న:- సరె. ఓ మూటపదహార్లు వేసుకోండి.

వి:- అమ్మమ్మా! లాభంలేదు (లేవబోతాడు)

న:- (కూర్చోపెట్టూ) నే మాట్లాడుతూగా మీతమ్ముడు కూతుళ్ళతో! మీరలా వుండండి !

వి:- సరే మీ ఇష్టం !

సూ:- మీరందరూ ఇన్ని విషయాలు మాట్లాడుతున్నారు కదా ! ఇందాకటి నుండి చూస్తున్నాను, నా విషయం ఎవరన్నా ఆలోచించారా ?

న:- నీ విషయమా? ఆడుగూ? మోటార్ సెక్కిలేనా? ఆడిగేసెయ్, ఊ, ఆలాగే కొనుక్కో ! ఇంకా మనసులో వున్నదేమిటో ఆడిగేసెయ్.

అ:- ముహూర్తంకూడా అనుకుంటే మంచిది. మరి మాఘ మాసం బాగుంది.

వి:- వీల్లేదు. మావాడిపెళ్ళాం కనే నెలలు.

అ:- మీవాడి పెళ్ళామా ?

వి:- నరహరిగారికి చెప్పానుకూడా !

న:- ఇదేంటండోయి, నాకెప్పుడు చెప్పారూ!

వి:- నా తమ్ముడిపెళ్ళాం, కనే నెలంని చెప్పలేదూ !

అ:- ఇకనైతే చైత్రమాసం.

సూ:- వీల్లేదు. నే ఒప్పుకోను.

న:- పోసీలే, కోప్పడకు. ఆ నెలలో పరీక్షలా ? (సూర్యం చతికిల పడుతాడు) అహహ ! మీవాడికి చదువంటే ఏం ప్రాణమండీ !

అ:- ఇకనైతే వైశాఖం బాగుంటుందేమో!

న:- వైశాఖానికేం దివ్యం, అమోఘం. ఎవ్వరూ ఏ ఆక్షేపణ పెట్టటానికి వీల్లేదు. ఫస్టుక్లాసు రిజర్వుడు ముహూర్తం యేర్పాటు చేస్తాను! అప్పా రావుగారూ...ఊ ఊ-తాంబూలాలు...మళ్ళా వర్జ్యం వస్తుందో, వచ్చేసిందో. ఊ, ఊ (అప్పారావు వెళ్తాడు)

వి:- వచ్చేసిందా వర్జ్యం?

న:- ఎలా వస్తుందండీ, మనకు తెలియకుండా? ఇదుగో, పంచాంగం తీసుకొస్తాగా, అయినా వర్జ్యం ఏముందండీ. వర్జ్యం మేమిటి వేదైనా మనం రమ్మంటే వస్తయి, పొమ్మంటే పోతయి! పంచాంగం తెస్తాగాని...

విశ్వనాథంగారూ! మీరు చాలా అదృష్టవంతులు. కామధేనువులాంటి కోడలు దొరికింది...ఇక అబ్బాయి సంగతి (లోపలికెళ్తూ) టిహోహో (నరహరి వెళ్తాడు)

(సూర్యం తలవంచుకు కూర్చునివుంటాడు, విశ్వనాధం చూసి దగ్గర కెళ్ళి క్షణం చూస్తాడు)

వి:- (బుజంతట్టి) ఏమిట్రా?

సూ:- (పలకడు. తలెత్తి శూన్యంలోకి చూస్తాడు)

వి:- ఏమిట్రా ?

సూ:- ఇప్పుడూ ?

వి:- (విసుగు) ఇప్పుడు?

సూ:- నా పెళ్ళి దేనికి ?

వి:- (కోపం) నా చావుకి !

సూ:- పెళ్ళిప్పుడు చెయ్యకపోతేనేం ?

వి:- ఇక చెయ్యనే చెయ్యను !

సూ:- అయినా, అలా అనడానికి మీకధికారం వుందా?

వి:- ఛా వెధవ! వంశం పాడుచెయ్యడానికి పుట్టావ్, (గొంతు తగ్గించి) భండాలుడా !

సూ:- అబ్బ అలా అరుస్తారేం !

వి:- అరుస్తానా, నరుకుతానా!

సూ:- అబ్బ. అరవకండి, చెప్పనివ్వండి.

వి:- చెప్పనిస్తానా, చెప్పుచ్చుకు లెంపలు వాయిస్తానా? ఇలా అయితే ఇక చూడు నీ తిప్పలు. ఇంట్లో అడుగుపెట్టు, చవడా లెక్కతీస్తాను. ఇక నేచెప్పినట్లు నడుచుకో పోయినావా -ఇటుచూడు (చేతికత్తి చూపిస్తూ) నరహరిగారన్నట్లుగా దీనితో నీకు ఆపరేషన్ చేసి తీర్తాను !

న:- (పంచాంగంతో హడావిడిగా ప్రవేశించి, విశ్వనాథం చిందులు తొక్కడం చూసి) ఏమిటందోయి!

సూ:- (లేచి అవతలకు వెళ్తూ) అబ్బ! మీకు చెప్పలేను బాబూ !

న:- ఏమన్నాడండీ విశ్వనాధంగారూ ?

వి:- అధికారంలేదుట ! ఆడదానెదుట అణాకుపనికిరానిపక్షి, అధికారం లేదుట ! అష్టకష్టాలు పడి, పెంచి, పెద్దవాళ్ళను చేస్తే, పెళ్ళిచెయ్యడానికి అధికారంలేదూ! మదమెక్కి వళ్ళుబలిసి!

న:- ఏమిటన్నాడు ?

వి:- పెళ్ళాట్ట! వూరిమీద వూరేగుతాడు కాబోలు, క్షామ దేవత!

న:- నే చెప్పలేదండీ, తారాబలం లేనిదే, ఎవ్వరం ఏం చేయంలేం!

వి:- అదికాదండీ, వాడికేమన్నా వళ్ళుతెలిసేనా ?

న:- ఇదుగో విశ్వనాధంగారూ! (విశ్వనాధాన్ని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టూ) మీరంత హైరాన పడతారేమిటి? కూర్చోండి, (సూర్యం దగ్గరకెళ్ళి) అబ్బాయ్, ఇలా అడుగడుగున ఇలా హంసపాదులా పెట్టకు! యేదోఒకటి తేల్చెయ్.

సూ:- నరహరిగారూ! ఇంతమంది ఇన్నిసార్లు నన్నడుగుతారు గాని, మరి ఆ అమ్మాయినడిగారా, నన్ను పెళ్ళిచేసుకుంటుందో లేదో?

న:- నువ్వడగలా?

సూ:- అదే, చెప్పలేదు.

న:- అసలు నువ్వడిగావా?

సూ:- అడిగాననే అనుకుంటాను.

న:- అనుకోటాలేమిటయ్యా! పోనీ నువ్వు చేసుకుంటానను.

సూ:- ఒక్కసారైనా ఆ అమ్మాయి మనసారా 'సరే' నంటే.

వి:- అన్నా, నేను చెయ్యనురా బాబూ, యీ పెళ్ళి, చెయ్యను.

న:- విశ్వనాధంగారూ, ఏదో పసివాడూ!

వి:- పసివాడంటారేమిటి, పెళ్ళి కాబోతూంటే!

న:- పెళ్ళికర్ధ కాబోతూంద? అసలవుతుందోలేదో, పోసి ఆ అమ్మాయి చేతనే అనిపిద్దాం. మీరేమి అనకండి. ఆర్ఘ్యం వస్తోంది. అమ్మాయిని తీసుకువస్తాను.

(సరహరి తోపలికెళ్ళి మాణిక్యాన్ని వెంట తీసుకువస్తాడు. మాణిక్యం కూర్చుంటుంది.)

న:- అమ్మాయి, నీ నోటిమీదుగాట చెప్పు. నీ కిష్టమేనా ?

మా:- వారిని చెప్పమనండి?

న:- ఆ, నువ్వాట చెప్పవయ్యా!

సూ:- చెప్పాకదండీ, ఆ అమ్మాయి ముందర చెప్తే.

న:- ఆ, సరే నువ్వానమ్మా అను.

మా:- ముందు వారినిగా ఆడగవలసింది?

న:- ఆమ్మాయికి, సిగ్గుకదటయ్యా నువ్వనవయ్యా?

సూ:- పోసి- పెళ్ళిచేసుకుంటుంది కదా?

న:- ఏమమ్మాయి, పెళ్ళిచేసుకోవడం ఇష్టమేనా?

మా:- మా ఇష్టాయిష్టాలు దేనికిలేండి, యెవరినోఒకరిని యెప్పుడోకప్పుడు చేసుకోవాలిగా!

సూ:- చూశారా!

న:- మధ్యవాళ్ళం మేం ఆడిగితే ఇలాగే ఊగులాడుతుంది పచ్చిగడ్డి ! నువ్వాడగవయ్యా!

సూ:- నే అడగనండీ, నన్ను పెళ్ళిచేసుకుంటావా అని నే అడగనండీ, కావాలంటే మీరడిగి మాట తీసుకోండి!

న:- నే నెలాగయ్యా?

సూ:- మీరడిగేసెయ్యండి చెప్తా!

న:- (మాణిక్యం దగ్గరకెళ్ళి) నన్ను పెళ్ళిచేసుకుంటావా అని ఆయన ప్రశ్నమ్మా! (అనేవాక్యం పూర్తికాక మునుపే మాణిక్యం జవాబు చెప్పేస్తుంది)

మా:- ఆ !

సూ:- ఎవరిని?

మా:- అడిగిన వారిని !

సూ:- చూశారా ఆ విరుపు?

వి:- విరుపేమిట్రా ? మాట్లాడకపోతే మూగంటివి. మాట్లాడితే ఇలా అంటివి. ఇప్పుడే ఇలావుంటే ఇక కాపురమేం వెలగపెట్తావురా నాయనా?

న:- ఇదుగో అమ్మాయి! మాట్లాడకుండా వుండకూడదు, మాట్లాడకూడదు, విరుపు విపరీతాలు లేకుండా, ఎవ్వరికేకోపం రాకుండా--ఊ ఊ ఊ!
(మాణిక్యంవెళ్లి సూర్యాన్ని చెయ్యిపట్టుకుని మధ్యకు తీసుకువస్తుంది. అప్పారావు తాంబూలంతో ప్రవేశించి ఆశ్చర్యపడతాడు)

అ:- ఏమిటిదంతా ?

సూ:- ఇదా

మా:- పెళ్ళి ?

న:- తారాబలం ?

(అందరూ నవ్వుకుంటారు. అప్పారావు భార్యతో కాబోయు చెప్పటానికి లోపలకి "ఏమేవ్" అంటూ వెళ్తూవుండే నరహరి ఆర్ద్రంవెళ్ళి, ఇంకెవ్వరూ చూడకుండా, నాకిస్తానన్నపైసా ఏది అన్నట్లు చేతితో చూపిస్తూ, కళ్ళ చూపులతో అడుగుతాడు. అప్పారావు బదులు చెప్పకుండా)

అ:- వర్జ్యం, తాంబూలాలు !

న:- తారాబలం !

:- తెర :-

ప్రగతి

రచన :

ఆచార్య ఆత్రేయ

పాత్రలు

సైంటిస్టు

పెట్టుబడిదారు

పిచ్చివాడు

బోయ్

శాంతి

అది ఒక సైన్సు పరిశోధకుని గది.
గదినిండా గ్లాసు ట్యూబులు, రికార్డులు, స్పిరిట్ దీపాలు, స్టౌలు తదితరాలు.
గోడలకు రకరకాల విమానాలు, బాంబులు, స్టీమర్లు, యుద్ధ నౌకలు తదితరాలు అట్ట కత్తిరింపులు, ఫోటోలు, బొమ్మలు తగిలించబడి వున్నాయి. గదంతా చిందరవందరగా వుంది.
ఎప్పుడో తెచ్చిపెట్టిన ఫలహారం, దానిప్రక్కనే భోజనం ఒక చిన్న టేబిల్‌మీద ఎండిపోతూంది.
మొత్తంమీద ఆ గదిలో మనుషులైన వాళ్ళెవ్వరూ హాయిగా ఒక్క క్షణకాలం కూర్చోలేరు.
ఒక పెద్ద టేబిల్‌మీద ఏదో ఎక్స్‌పెరిమెంటుకు సంబంధించిన పరికరాలున్నవి. గ్లాస్ ట్యూబులో ఏదో ద్రావకం పొంగుతూంది. ఆ టేబిల్ దగ్గర "సైంటిస్టు" నిలబడి వున్నాడు. అతడు ఈ లోకంలో లేడసలు. సంపూర్ణంగా తన పరిశోధనలో మునిగి వున్నాడు. చాల తీక్షణం, తీవ్రావధానంతో ఆ పరిశోధన వైపు చూస్తున్నాడు. మధ్యమధ్య తల పంకిస్తున్నాడు. ఏదో గొణుక్కుంటున్నాడు. కొద్దిలో నిరుత్సాహం, మరుక్షణం ఆశ, ఆతరువాత జుగుప్స, ఆ వెంటనే ఏదో ఆనందం అతని ముఖంలో తెరలు తెరలుగా వచ్చిపోతున్నాయి. ఆ గది వాతావరణంనుంచి అతన్ని బయటికితీసి వేరేగాచూస్తే కేవలం అప్పుడే పిచ్చాస్పత్రినుండి బయట పడ్డ వ్యక్తి అంటారు మీరు- లోతుకళ్ళు- పొడుగాటి ముక్కు- పెద్ద నుదురు, దానిండా ముడుతలు-సంస్కారం ఎరగని జుట్టు- కొన్న నెలలుగా కత్తి సంపర్కం ఎరుగని గడ్డం-మాసి నలిగి- మిచ్చలుపడి చిరగటానికి సిద్ధంగావున్న పంట్లాం షర్టు. ఒక వైపు తెగి కాలిసంటిపెట్టుకొనివున్న జోళ్ళు—ఇవీ అతని లక్షణాలు.
"బోయ్" వచ్చాడు.
"బోయ్" సామాన్య బంట్రోతు. కుర్రవాడు-సుమారు 19 సం॥లు ఆ ప్రాంతం వుంటుంది వయసు. సైంటిస్టుముందు వాడే కొంచె•

శుభ్రంగా వున్నట్లనిపిస్తాడు. నిక్కరు, ఆఫ్ షర్టు. తలదువ్వుకొని వున్నాడు. అప్పుడే వస్తున్న మీసాలను సన్నగా కోలగా తీర్చి వున్నాడు. వచ్చి ద్వారానికి కొంచెం దగ్గరగా నిలబడి ఒకటిరెండు నిమిషాలు ఇతనివంక చూస్తూన్నాడు. "సైంటిస్టు" మాత్రం వాడి వంక చూడనేలేదు. నిలబడి నిలబడి విసుగేసింది.)

బోయ్:- సార్ !

[సైంటిస్టు బదులులేదు]

బోయ్:- (ఇంకా కొంచెం బిగ్గరగా) సార్!

[సైంటిస్టు ఇటు తిరిగాడే కాని వెంటనే అటు తిరిగేశాడు. అసలు వాణ్ణి చూచినట్టే లేదు. ఏదో శబ్దానికి సహజగుణంగా ఇంద్రియాలు పనిచేసినట్టున్నాయి.....]

బోయ్:- (తిరిగి చూచాడు కదా అని సోది మొదలెట్టాడు.) నిన్న ఉదయం కాఫీ ఫలహారం, రాత్రి భోజనం అట్టాగే వుండిపోయాయి సార్! ఇప్పుడు టి తీసుకురమ్మంటారా? యీరోజు అక్కగారు వస్తున్నారు సార్! నిన్న ఉత్తరం వ్రాశారు. ఈ రోజు తంతికూడా ఇచ్చారు. స్టేషను కెళ్ళటానికి టైమైంది. ఆమె మీకోసం ఎదురు చూస్తుంటారండి-వెంట ఇంకెవరూ మగతోడులేదని కూడా వ్రాశారండి. (ఇంత సోద చెప్పిన తర్వాత "సైంటిస్టు" తన మాటలు వినటం లేదని వాడికి తెలిసింది. విసుగుతో) టి సార్!

సైంటి:- యు ఇడియట్! గెటౌట్. (చాలా నెమ్మదిగా అన్నాడు)

బోయ్:- సరే. సార్! (అని వెళ్ళాడు)

సైంటి:- (ఏదో జ్ఞాపకం వచ్చి) ఒరే!

బోయ్:- సార్! (తిరిగి వచ్చాడు)

[సైంటిస్టు పరిశోధన ధోరణిలో పడ్డాడు;
బోయ్ ఏమీ పలక్కుండా నిలబడ్డాడు]

సైంటి:- అయిపోయింది! ఇంకో అయిదే నిముషాలు! అయిపోతుంది!

బోయ్:- అయిదు నిముషాల్లో ఎక్స్‌ప్రెస్ వస్తుంది సార్!

సైంటి:- అది కాస్త పచ్చేసిందంటే ఇంక అయిపోయిందన్న మాటే! విజయం దిగ్విజయం... ప్రపంచ విజయం... ఓ...

బోయ్:- విజయంగారు రావటం లేదండి...

సైంటి:- విజయం తప్పక వస్తుంది.

బోయ్:- రాదండి.

సైంటి:- యు ఇడియట్ !

బోయ్:- ఆవునండి! ఉత్తరంలో అమె ఒక్కరే వస్తూన్నట్లు వ్రాశారండి, విజయంగారు రావటంలేదు.

సైంటి:- ఓ! అదా నువ్వనేది! వెధవబుర్రలురా మీవి. ఎంతసేపూ ఇల్లూ-వాకిలీ-బంధువులు—

బోయ్:- నిన్నటి భోజనం అలాగే వుండిపోయిందండి.

సైంటి:- నాన్‌సెన్స్! భోజనం భోజనం! నేనెంత పెద్దపని చేస్తున్నాను. దీనిముందు భోజనం హిమాలయం ముందు చదపుట్టలాంటిది తెలుసా? వెధవబుర్రలు! అంతాచెత్త!! సందులో? గొందులోపడి ఆలోచిస్తాయి! విశాలంగా చూడవు. (అంటూ పళ్ళెంలో వున్న చిప్స్ ఒకటి రెండు తింటూ) ఆయిపోయిందీ! ఇంకో అయిదు నిమిషాలే! అయిపోయింది!

బోయ్:- శాంతమ్మగారు వస్తున్నార్ సార్!

సైంటి:- డామిట్! శాంతీలేదు గీంతీలేదు. వస్తేగిస్తే మళ్ళా యుద్ధమే వస్తుంది. యుద్ధమే రావాలి. అప్పుడు—

బోయ్:- అదికాదు సార్! మీ అక్కగారు శాంతమ్మగారు వస్తున్నారు సార్!

సైంటి:- ఓ! మరచా! ఆవునవును. ఈరోజేగా వస్తానని రాసింది. ఎక్స్‌ప్రెస్‌లో-పోనీలే! స్టేషన్‌దాకా వచ్చింది ఇంటికి రాకుండా పోతుందా? వస్తుందిలే! శాంతి వచ్చేలోగా నా పని పూర్తికావాలి. విజయం సాధించాలి. ఆ సంతోష వార్తతో శాంతిని ఆశ్చర్యచకితని చేయాలి. శాంతివస్తే ఇంక నా పని సాగదు వెళ్ళు— వెళ్ళరా-నువ్వెళ్లు (ఈ మాటలన్నీ తన పరిశోధన చూస్తూనే అంటూన్నాడు)

బోయ్:- టి సార్ ?

సైంది:- టి, భోజనం, ఫలహారం అన్నీ శాంతి వచ్చిన తర్వాతనే. ఇప్పుడేమీ వద్దు, వెళ్ళు.

బోయ్:- సరే సార్! (వెళ్ళాడు)

సైందీ:- (మళ్ళా తన పరిశోధనలో పడ్డాడు) యుద్ధం రావాలి. శాంతి రావటానికి వీల్లేదు. వట్టి వెధవలు ! శాంతి, శాంతి అంటారు. (మెల్లగా గొణుగులోకి దిగి, పూర్తిగా అయిపోయింది. ఒక్కక్షణం అలాగే నిశ్శబ్దంగా శూన్యం (చిల్లుంగి) పెట్టేవానిలా చూస్తూన్నాడు, ముఖం మెల్లగా ఆనందంతో విప్పారుతుంది. ఉన్నట్లుండి ఒక అగ్ని పర్వతం బద్దలైనట్లు నవ్వటం మొదలెట్టాడు. ఆర్క్‌మెడుసులాగా పరుగెత్తుతాడు ఆ గదిలోంచి బయటికి. మళ్ళీ గదిలోకివచ్చి కుర్చీలో కూర్చుండి విరగబడి నవ్వుతూన్నాడు. సంతోషంలో జుట్టు, బట్ట పీక్కుంటున్నాడు. ఆ చినిగిన చొక్కా కాస్తా చిరిగింది)
వచ్చేసింది విజయం ! ఐ హావ్ ఫౌండౌట్ !
(ఈలాంటి మాటలేవేవో పెద్దగా అరుస్తూ వున్నాడు. ఆ నవ్వుతో మిళితమై వాకిట ఇంకెవరి నవ్వో వినిపిస్తూంది. ఈ గోలకు "బోయ్" వచ్చి కంగారుగా చూస్తాడు. సార్ సార్ అంటూ ఇతన్ని పట్టుకో బోతాడు. కాని ఇతడు వాడి బుజాలు పట్టుకొని కుదుపుతూ) ఒరే ఫూల్ ! ప్రపంచంలోకల్లా మహారాజు మనంరా ఇంక. ప్రభుత్వమే మన వాకిట కాపలా కాస్తుందిరా ! చూడు ! ఓ ! సక్సెస్. యు ఇడియట్ ! అనరా ? పెద్దగా అను ! నవ్వరా నవ్వు ! ఫూర్ బ్రెయిన్స్ మీకెలా తెలుస్తుంది ఆనందం !
(వాడు నిజంగానే కంగారుపడి వణికిపోతున్నాడు.)
(ఇంతలో బయటినుంచి పెద్దనవ్వు - నవ్వుతోపాటు పిచ్చివాడు లోపలికి వచ్చాడు. ఇప్పుడైనా మీరు తెలుసుకుంటారు - సైంటిస్టుకీ పిచ్చివాడికీ ఏమి తేడాలేదని. సైంటిస్టు, పిచ్చివాడు ఈ ఇద్దరిలో ఎవరు సైంటిస్టో తెలుసుకోవటం కష్టం. పిచ్చివాడు నవ్వుతున్నాడు; సైంటిస్టూ నవ్వుతున్నాడు. ఈ మధ్య "బోయి" కంగారుపడి చావు కేక వేసి తప్పించుకొని పారిపోతాడు.)

పిచ్చి:- ఆపు ! (ఉన్నట్టుండి సీరియస్ అయాడు.)
(సైంటిస్టు నవ్వు ఆపేసి తెల్లబోయి చూస్తున్నాడు.)

పిచ్చి:- ఏమిటి నువ్వు చేస్తున్నది ? ఎందుకు నవ్వుతున్నావు?

సైంటి:- నవ్వటంకాదు - ఆనందిస్తున్నాను.

పిచ్చి:- ఏం ఘనకార్యం చేశావని ఆనందిస్తున్నావు. ఆనందించటానికి ఈ ప్రపంచంలో ఎవడికీ హక్కు లేదు మనకు తప్ప ! తెలుసా? చెప్పు ఏం చేశావని ఈ ఆనందం?

సైంటి:- ఇప్పుడేంవుంది నా ఆనందం ! యుద్ధంరావాలి, వస్తుంది. తప్పకుండా వస్తుంది యుద్ధం. అప్పుడు చూడాలి నా ఆనందం ! ఆఁ- ఇంతకూ నువ్వెవరూ ?

పిచ్చి:- (కుర్చీలో కూర్చుని) నేనే. యుద్ధదేవతను.

సైంటి:- నాన్ సెన్స్ !

పిచ్చి:- నాన్ సెన్స్ ! నీకు నోసెన్సు, అంతే. దేవతలను చూదావా నువ్వు ఎప్పుడైనా ?

సైంటి:- మోస్టు అన్ సైంటిఫిక్ !

పిచ్చి:- పోవోయ్ పుల్లాయ్ ! నీ సైన్సు యింకా దేవతలను చూచేంత అభివృద్ధి కాలేదు, తెలుసా ?

సైంటి:- నువ్వు పిచ్చివాడివి !

పిచ్చి:- నువ్వు ?

సైంటి:- ఏయ్ గెటౌట్ ! నా ఆనందానికి అడ్డురాక ! నేను తృప్తిగా నవ్వుకోవాలి ! ఈ రోజు మహా పర్వదినం. ఈ రోజు నా జీవితంలో స్వర్ణదినం, ప్రపంచ జీవితంలోనే ఒక పండుగ దినం ! సైన్సు శిఖరాగ్రాన్ని చేరుకుంది. ఇంతకంటే ప్రగతి ఇక సైన్సుకు లేదు. సంతోషించవోయ్ ! నువ్వూ సంతోషించు !

(పిచ్చివాడు భోరుమని ఏడుస్తున్నాడు)

సైంటి:- ఎందు కేడుస్తున్నావు ?

పిచ్చి:- ఏడవటంలేదు, నవ్వుతున్నా.

సైంది:- డామిట్.

పిచ్చి:- ఇంకా సైన్సుకు సవ్వేదో ఏడుపేదో తెలియలేదు. అంతా వట్టి ఫూల్స్ యీ మనుష్యులు. నవ్వాల్సిన దాని కేడుస్తారు. ఏడవాల్సిన దానికి నవ్వుతారు. బిడ్డపుడితే నవ్వుతారు, చస్తే ఏడుస్తారు. "అబ్సర్డ్".

సైంది:- అబ్సర్డ్ ? గెటౌట్ !

పిచ్చి:- వెళ్ళను, ఇక్కడే కూచుంటా, నేనీ ప్రపంచములోకి దేవదూతనుగా వచ్చాను. యుద్ధదేవతగా వచ్చాను. యుద్ధదేవతగా పనిచేస్తున్నా. యుద్ధం ఇంకా వుంటుందంటావా, లేదా ?

సైంది:- తప్పకుండా ఉంటుంది. ఇంకో యుద్ధం తప్పదు.

పిచ్చి:- మరి శాంతి సభలు అవీ-ఇవీ-చేస్తున్నారే ! ఏమంటావు ?

సైంది:- అదంతా మోస్టు అన్ సైంటిఫిక్. వాళ్ళంతా శాంతిని గురించి మాట్లాడుతూ యుద్ధాన్ని గురించి ఆలోచిస్తూంటారు. అంతే !

పిచ్చి:- అయితే నాకిక్కడ పనుంది.

సైంది:- ఇక్కడ నీ కేం పని ?

పిచ్చి:- ఉందంటే ఉంది, అంతే !

సైంది:- ఓ మై గుడ్నెస్ ! అయితే దయచేసి గోలచేయక కూర్చో, నా పని చూచుకోనీ.

పిచ్చి:- ఆల్రైట్ !

(ఇంతలో బయట తలుపులు తట్టిన శబ్దం)

సైంది:- రావచ్చు.

పెట్టుబడిదారు:- (వచ్చాడు, కోటీశ్వరుడు. ప్రపంచాన్నంతా బ్లాక్‌మార్కెట్లోనైనా కొనేయగల ధీమా కనుపిస్తుంది అతనిలో. వాళ్ళిద్దరి మధ్య అతను వెక్కిరింతగా వుంటాడు) హల్లో !

సైంటి:- హల్లో ! రాండి రాండి, కూర్చోండి !

(పిచ్చివాడు పిల్లిలా అణిగి కూర్చున్నాడు.)

పెట్టుబడి:- (పిచ్చివాడివైపు చూచి) ఎవరూ ?

సైంటి:- ఎవరో పిచ్చివాడు.

(పెట్టుబడిదారు నవ్వుతాడు)

(పిచ్చివాడు వెక్కిరింతగా నవ్వుతాడు.

పెట్టుబడిదారు కంగారుపడి ఆగుతాడు)

సైంటి: డామ్‌న్యూసెన్స్ ! యు గెటౌట్. ఆ పిచ్చివాడితో ఏంపనిలెండి.

పెట్టుబడి: అవునవును, మీతోనేలెండి. మరి మనం మాట్లాడుకోవచ్చా ?

సైంటి: ఓ యస్. కాని తొందరగా ముగించాలి. లేకుంటే శాంతి వస్తుంది.

పెట్టుబడి: శాంతి మీ అక్కగారు కదూ !

సైంటి: అవును. ఆవిడవస్తే యుద్ధాన్నిగురించి ఏమీ మాటలు సాగనీదు. యుద్ధమంటేనే పణికిపోతుం దావిడ. వట్టి సెంటిమెంటల్ ఫిమేల్. యుద్ధంలో - అంటే గడిచిన యుద్ధంలో - సత్యం చనిపోయి నప్పటి నుంచి ఆమె అలా అయిపోయింది. వట్టి గాంధీమతం.

పిచ్చి: అది ఇంతా బతికుందా ?

పెట్టుబడి: ఆఁ, బతికేవుంది. కొందరి పిచ్చిబుర్రల్లో. నీకెలా తెలుసు ఆ మతం?

పిచ్చి: ఎప్పుడో - కాదుకాదు ఈ మధ్యనే - ఎవరో ఉపన్యసిస్తుంటే విన్నా. ఉపన్యాసానికి చాలా బాగుంటుం దా గాంధీమతం, పెరుగులో ఆవ కాయ ముక్కలా.

పెట్టుబడి: అందుకే బతకిదలచుకున్న వాడెవడూ దాన్ని ఆమలులో పెట్టడం లేదు.

సైంటి: నాయకుడు కాదలుచుకున్న వాడెవడూ వదిలిపెట్టడం లేదుగా !

పెట్టుబడి: ఆఁ ! అసలు విషయం దూరమైపోయింది. రాండి మనం కాస్త రహస్యంగా మాట్లాడుకోవాలి. (ఇద్దరూ కొంచెం దూరంగా వెళ్ళి నిలబడతారు. పిచ్చివాడు అలాగే కూర్చొని తనలోతాను నవ్వు కొంటాడు)

పెట్టుబడి:- డబ్బు కావాలా ?

సైంటి:- అక్కర్లేదు.

పెట్టుబడి:- ఏం ?

సైంటి:- అక్కర్లేదు, అంతే !

పెట్టుబడి:- ఇంకా కాలేదూ ?

సైంటి:- ఏమిటి ?

పెట్టుబడి:- అదే !

[సైంటిస్టు పెద్దగా నవ్వాడు, పిచ్చివాడు నవ్వాడు.]

సైంటి:- డామ్ న్యూసెన్స్ (ఈ మాట అంటూండగానే బయట తలుపు తట్టిన శబ్దం) రాండి !

[బోయ్ వచ్చాడు.]

సైంటి:- ఏమిటిరా ?

బోయ్:- ఆమె వచ్చారండి.

సైంటి:- శాంతి ?

బోయ్:- అవును సార్ !

పెట్టుబడి:- శాంతి అప్పుడే వచ్చేసిందా ?

బోయ్:- అవును సార్ !

పిచ్చి:- నాన్‌సెన్స్ ! అబద్ధం, పచ్చి అబద్ధం !

బోయ్:- నిజం సార్! పచ్చినిజం సార్!

పిచ్చి:- అయితే శాంతి కేవలం ఒక మనిషి పేరు అయివుండాలి.

బోయ్:- మనిషి పేరే సార్!

పిచ్చి:- రైట్! కరెక్ట్! చూచారా! నన్నందరూ పిచ్చాడంటారు. ఎంతసరిగా వూహించానో! నాకు తెలుసు, ప్రపంచంలో ఇంత తొందరలో శాంతి రావటానికి వీల్లేదని.

బోయ్:- సత్యం చనిపోయిన రోజట సార్, ఈ దినం!

సైంటి:- అవునవును!

బోయ్:- ఆమె చాలా విచారంగా వున్నారు సార్!

పిచ్చి:- చచ్చినవాళ్ళకోసమే!

సైంటి:- అంతా సెంటిమెంటల్!

పెట్టుబడి:- ఫీమేల్స్ అందరూ అంతే!

బోయ్:- ఈరోజు ఆయన దినం చేయాలని వచ్చారట సార్!

సైంటి:- ఓ మై గుడ్‌నెస్ ! నేను ఆనందంతో పొంగిపోతూంటే ఇదెక్కడి ఏడుపు? నేను ఈ రోజంతా తృప్తిగా ఖుషీ చేసుకోవాలి, నవ్వాలి, తాగాలి, పిలైతే డాన్స్ కెళ్ళాలి. ఆమె ఏడుస్తూ కూచోవాలి. తలుపు లన్నీ మూసుకొని ముఖం ముడుచుకొని కూచోవాలి. ప్రార్థనలు చేయాలి. ఓ వాట్ ఎ హారిబుల్ థింగ్! వాట్ ఎ టెరిబిల్ కాంట్రడిక్షన్!! వాట్ ఎ హెల్!!!

పిచ్చి:- అదే జీవితం! అదే బ్రదర్, బ్రతుకు,

సైంటి:- నాన్‌సెన్స్! వెళ్ళిచెప్ప! శాంతితో చెప్ప. ఇన్ని సంవత్సరాలుగా నేను చేస్తున్న కృషి, నిద్రాహారాలు కూడా లేకుండా చేస్తున్న పరిశోధన ఫలించిందని చెప్ప! ప్రపంచానికే ఒక మహాభాగ్యం లభించిందని చెప్ప! విజ్ఞానానికి ఒక వెలలేని మణి దొరికిందని చెప్ప! ఈ మహదానందంలో– ఈ బ్రహ్మానందంలో విచారానికి చోటులేదని చెప్ప! చెప్ప పోవోయ్!

[పెట్టుబడిదారు పెద్దగా నవ్వాడు]

సైంటి:- ఓ-మీరు ఇక్కడే వున్నారా?

పెట్టుబడి:- (సైంటిస్టు వీపుమీద తడుతూ) ఏం ఫర్వాలేదు! ఏం ఫర్వాలేదు! కంగ్రాచ్యులేషన్స్!

సైంటి:- (అదోరకంగా నవ్వి) థాంక్ యు! మీతో చెబుదామనే! కాని ఏవో మాటల్లోపడి మరచిపోయా. క్షమించండి!

పెట్టుబడి:- దానికేంలెండి. మీరు సక్సెస్‌ఫుల్ కావడమే మాకు కావలసింది. చూచారా-సైన్స్, ఆర్ట్ ఇవన్నీ ప్రోత్సహింపబడాలి. అప్పుడే దేశం

ఎంతైనా ముందడుగు వేస్తుంది. మరి ఈనాటి ప్రపంచంలో సైన్సు కున్నంత విలువ ఇంక దేనికీలేదు భోజనం మొదలు అన్నీ సైంటిఫిక్‌గా వాడబడుతున్నాయి. నాగరికతకు మొదటి గురుతు సైన్సు అభివృద్ధి కనుక—

[పిచ్చివాడు చేతులు తట్టాడు.]

పెట్టుబడి:- చావటాన్నీ బ్రతకటాన్నీ ఎంతో నాజూకుగా చేసింది సైన్సు. మనిషిని మనిషి చంపటం ముచ్చటెంతో ఘోరంగా వుండేది. మునుపటి యుద్ధాలు ఈటెలతో బాణాలతో ప్రతి అంగం నరికి, నరికించుకొని ఎంతో బాధపడేవాళ్ళు. ఇప్పుడలాటి అనాగరిక యుద్ధం లేదు. విషవాయువు ప్రయోగిస్తే వున్నమనిషి వున్నట్టే హాయిగా ప్రాణాలు వదుల్తాడు. ఇంత నాజూకు చావుకు కారణం సైన్సు!

[పిచ్చివాడు చేతులు తట్టాడు]

పెట్టుబడి:- కనుక సైంటిస్టులు దేశానికి జీవగ్రర్రలు. వాళ్ళులేని దేశం వల్లకాడు. వాళ్ళని పోషించని దేశం నాశనం. హిట్లర్ కొన్ని వేలమంది సైంటిస్టులను పోషిస్తూ వుండేవాడు. అందుకే అంత పెద్ద యుద్ధం ఆన్ని రోజులు చేయగలిగాడు.

పిచ్చి:- చివరికి చచ్చాడు.

సైంది:- చావడం సహజం!

పిచ్చి:- అవును. మన నాగరికతలో బ్రతకడమే అసహజం!

పెట్టుబడి:- ఇప్పుడు అన్ని దేశాలలో పెద్దవాళ్ళ మనుకునే కొందరు యుద్ధం అనేది లేకుండా చేయాలని ఆలోచిస్తున్నారు.

పిచ్చి:- కాదు కాదు. మాట్లాడుతున్నారు.

పెట్టుబడి:- ఆలోచించకుండా ఎలా మాట్లాడుతారు?

పిచ్చి:- మాట్లాడేదే ఆలోచిస్తూండాలని రూలెక్కడిది?

పెట్టుబడి:- రెండూ వేరు కావటానికి వీల్లేదు. మోస్టు అక్ సైంటిఫిక్.

పిచ్చి:- రెండూ వేరు వేరు కావడమే మోస్ట్ సివిలైజ్డ్.

పెట్టుబడి:- నీవొట్టి పిచ్చాడివి. నీతో నాకు మాటలేమిటి?

పిచ్చి:- నాకు మెదడుంది కాబట్టి పిచ్చివాడి నయ్యాను. నీ కదిలేదు తెలుసా?

సైంటి:- ఓస్! యు బెగ్గర్, అతనెవరో తెలుసా?

పిచ్చి:- తెలుసు. బెగ్గర్‌ను సృష్టించినవాడు.

సైంటి:- పెద్ద కోటీశ్వరుడు.

పిచ్చి:- యుద్ధకాలంలో పుట్టి పెరిగిన ముద్ద. ఆంతేనా?

పెట్టుబడి:- సరే పోసీలే! అతనితో మనకేమిటి?

సైంటి:- బయటికి గెంటిస్తా.

పెట్టుబడి:- అక్కర్లా! వాడే పోతాడు. అసలు విషయం మరచాం. యుద్ధం పూర్తిగా లేకుండా పోవడానికి వీలే లేదు. యుద్ధం సృష్టితోపాటు పుట్టిన గుణం. యుద్ధం లేకుంటే విజ్ఞానం, అభివృద్ధి ఏమీలేదు.

పిచ్చి:- యుద్ధం లేకుంటే ఆకలిలేదు - చావులులేవు - వ్యభిచారంలేదు - బ్లాక్ మార్కెట్టు లేదు-కోట్లు కోట్లు కొల్లగొట్టడంలేదు - బొజ్జలు పెరగడం లేదు.

పెట్టుబడి:- నాన్‌సెన్స్! యుద్ధంలేనిదే-యుద్ధంలేందే—

[సరిగా ఈ సమయానికే శాంతి తలుపు తెరుచుకొని వచ్చింది. తెల్లటి బట్టలు, మనిషి చాలా అందగత్తె కాని, ముఖంలో విషాద రేఖలు అగుపిస్తుంటాయి. వితంతువని చూడగానే తెలుస్తుంది. నిజానికి సైంటిస్టుకన్నా పెద్దదయినా చూట్టానికి చిన్నదిగా వుంటుంది. తెల్లటి చీరమీద ఒక నల్లటి ముసుగు వేసుకుంది. కళ్ళల్లో దైన్యం, దయ, ప్రశాంతత అగుపిస్తుంటాయి.]

శాంతి:- (యుద్ధం అన్నమాట వినగానే వణికిపోతుంది; ఏ పెద్దపులినో సింహాన్నో చూచినట్టు బెదిరిపోతుంది) యుద్ధం! ఓ, యుద్ధం !

సైంటి:- పేపరు చూచావా ?

శాంతి:- యుద్ధం ! తమ్ముడూ ! మళ్ళీ యుద్ధమే ! ఓ ! (ఏడుపు పర్యంత మవుతుంది. అక్కడున్న కుర్చీలో కూలిపోతుంది)

సైంది:- ఓ. మన అదృష్టం పండింది అక్కయ్యా! నీతమ్ముడి పేరు దశదిశలా మారు మోగుతుంది. ప్రపంచమంతా నీ తమ్ముడికి జోహారు లర్పిస్తుంది. ప్రపంచాని కింత అమూల్యమైన పరిశోధన చేసినందుకు ఆకాశాని కెత్తేస్తారు. నే ననుకుంటూనే ఉన్నాను, ఇంకో యుద్ధం తప్పదని. వచ్చింది. మనకు ఋక్రదశ వచ్చిందక్కయ్యా! ... యుద్ధం ...

శాంతి:- ఆ మాట పల్కకు! నేను వణికిపోతాను. నే నూపిరి పీల్చుకోలేను. నా గుండె ఆగిపోతుంది. తమ్ముడూ! ఆ మాటే ఎత్తకు.

పెట్టుబడి:- ఇంతకూ యుద్ధం వచ్చిందని యెవరు చెప్పారు ?

శాంతి:- మీరే ! మీరే అంటున్నారు, నేను వచ్చేటప్పటికి. సరిగ్గా నా కర్ణ కాలి ఆడేమాట విన్నాను.

సైంది:- నాన్ సెన్సు, నువ్వు పేపరులో చూడలేదూ?

శాంతి:- నేనేమీ చూడలేదు.

సైంది:- చచ్చాం. నువ్వింకా పేపరు చూచివచ్చి కేకలేస్తున్నా వనుకున్నా. డిసెప్పోయింటెడ్, హారిబుల్.

శాంతి:- ఇంతసూ అట్టాంటిదేమీ లేదుకదూ తమ్ముడూ ?

సైంది:- లేదులే ! తాపీగా కూర్చో.

శాంతి:- అమ్మయ్య !

[బోయి టీ తెచ్చాడు]

శాంతి:- కూర్చోండి. అందరూ కూర్చోండి. హాయిగా టీ తాగుదాం. (అతనితో) మీరిలా కూర్చోండి ఏమిట్రా తమ్ముడూ, ఈ గది ! ఒక్క క్షణం కూర్చోబుద్ధివేయదు. (పెట్టుబడిదారునితో) ఈరోజు మీరు మా ఇంటికి రావడం నాకెంతో యిదిగా వుంది ! ఈరోజు - సరిగా 5 సంవత్సరాలకు పూర్వం ఇదే రోజున మా సత్యం పోయాడు - సత్యాన్నెరుగరూ మీరు ?

పిచ్చి:- సత్యం ముక్కు మొహం ఎరగడు అతడు !

శాంతి:- అన్నట్టు ఈయనెవర్రా మంచి స్నేహితుడే ! సైంటిస్టేనా. ?

పిచ్చి:- చస్తే యీ జన్మలో కాను.

శాంతి:- అచ్చం మా తమ్ముడిలాగే వుంటీ:అడిగా !

పిచ్చి:- మీ తమ్ముడే నాలా గున్నాడు. నే నతనిలా లేను.

శాంతి-: ఇంతకూ క్షమించండి, మీ రెవరో ...

సైంటి:- అక్కయ్యా ! ఆయన ...

పిచ్చి:- నేనే చెప్తా. ఒక పిచ్చాడిని-పరేనా ?

శాంతి:- (నవ్వి) టీ తీసుకోండి. ఏంరా తమ్ముడూ ! స్టేషనుకు రాకనే పోయావు. నువ్వు తప్పకుండా వస్తావనుకున్నా సుమీ ! నీకోసం ఆ మంచులో ఎంతసేపు కాచుకున్నాను ! చివరికి విసిగి టాక్సీ వేసుకొచ్చా.

సైంటి:- రావాలని ఎంతో అనుకున్నా నక్కయ్యా. కాసె రాలేకపోయా, చూచావు;ఒక్కక్షణం ఈ గదిలోంచి కదలటానికి వీల్లేకపోయిందనుకో

పిచ్చి:- గదిలోమాత్రం కది లేదిస్తేగా ! ఇదిగో నిన్నటి కాఫీ, భోజనం...

సైంటి:- అవునక్కయ్యా! చూడు. చేస్తూన్నదీ- ఎంత అమూల్యమైన కృషో. నువ్వు గ్రహించి స్టేషనుకు రానందుకు ఆగ్రహించకుంటావని నా నమ్మకం. ఇంతకూ నీకు చెప్పాల్సిన దేమంటే, అక్కయ్యా విను.

శాంతి:- ఇంకొంచెం టీ పోయనా ?

సైంటి:- అక్కర్లేదులే. విను చెప్తా. నే నిన్నేళ్లుగా చేస్తున్న పరిశోధన విజయవంతమైనది అక్కయ్యా ! బ్రహ్మాండంగా ఆనందించాల్సిన శుభదినం యిది. చూశావ్! ప్రపంచంలో యింతవరకూ ఎవరూ కనీ వినీ ఎరుగని ఒకకొత్త శక్తిని కనిపెట్టా నక్కయ్యా !

శాంతి:- అలాగా ! పోనిలే, నువ్వు రాక్కున్నా నేనే వచ్చేశాగా ఎలాగో ! ఈ రోజు నాకేం బాగాలేదు సుమా చాలా బరువుగా ఉంది గుండె ! ప్రతీ క్షణం కళ్ళయెదుట సత్యం ప్రత్యక్షమవుతూన్నాడు తమ్ముడూ!

పిచ్చి:- డామిట్, సత్యం! సత్యం! సత్యం కళ్ళకు కనబడటం పచ్చి అబద్ధం.

శాంతి:- సత్యం నా ఒక్కగాని ఒక్క కొడుకండి.

పిచ్చి:- ఓహో ! చచ్చిపోయాడా ?

శాంతి:- ఆవును. ఐదు సంవత్సరాలకు పూర్వం అన్యాయంగా...అనవసరంగా ...ఎందుకో చచ్చిపోయాడు...కాదు, చంపేశారు...సత్యం !...

పిచ్చి:- సుఖపడ్డాడు,

శాంతి:- ఏమన్నారు ?

పిచ్చి:- ఏమీలేదు. సత్యం యీ లోకంలో ఉండకుండా వెళ్ళడమే మంచిదైంది.

శాంతి:- మీదెంత కటికిగుండె అండి ?

పిచ్చి:- సత్యం కంటేనా ? సత్యందే చాల రాతిగుండె.

శాంతి:- కాదు, కానేకాదు. మా సత్యం చాల మంచివాడు. ఎంతో మెత్తటి హృదయం. అన్యాయంగా పోయాడు. వాళ్ళనాన్నను చేరుకున్నాడు. నా కెందుకిచ్చాడో ఈ తీరని ఆయుస్సు. నా తండ్రికిబదులు నన్ను తీసుకుపోరాదూ, నీకు పుణ్యముంటుంది.

పిచ్చి:- అసాధ్యం ! మోస్టు అన్ సైంటిఫిక్.

శాంతి:- మీకు తెలీదు, నా గుండె యెలా తరుక్కు పోతుందో - ఆ పాడు యుద్ధం, నాశనమైన యుద్ధం - దాని వెధవాయుస్సు కూలిపోను- ఐదు సంవత్సరాలు జరిగింది. నా సత్యంకోసమే కాచుకున్నట్టు వాణ్ణి పొట్టనబెట్టుకుంది - ఆగిపోయింది — తమ్ముడూ ! ఇన్ని కనిపెడుతున్నావు ! ఈ యుద్ధాని కేదైనా కనిపెట్టరాదూ ? నీకు పుణ్యముంటుంది.

పిచ్చి:- అదే! సరిగ్గా అదే! మీరు కోరేదే కనిపెట్టా డిప్పుడు.

శాంతి:- నిజంగా !

పెట్టుబడి:- అవును. సరిగ్గా అదే !

శాంతి:- నిజం తమ్ముడూ ?

సైంటి:- అవునక్కయ్యా !

శాంతి:- తమ్ముడూ ! (ఒక్కసారి లేచి అతన్ని కౌగలించుకొని) ప్రపంచ మంతా నీకు ఋణపడుతుంది తమ్ముడూ ! నువ్వు కేవలం దేవుడివి తమ్ముడూ ! (చేతులు తడుతూ) ఒరే అబ్బాయి ! ఎంత ఆనందం ! ఇది ముందుగా చెప్పావు కావేం ? సత్యం చనిపోయాడన్న విచారం ఒక్కసారిగా పోయింది తమ్ముడూ ! కనీసం యికమీదైనా తల్లికడుపు దహించుకుపోకుండా వుంటుంది.

బోయ్:- (వచ్చాడు) పిలిచారమ్మా ?

శాంతి:- ఏదిరా హారం, సత్యానికోసం తెచ్చిన హారం? అదిలాపట్రా. వెళ్ళు - త్వరగా - పరుగెత్తుకు రావాలి.

(బోయ్ నిజంగానే పరుగెత్తాడు)

శాంతి:- తమ్ముడూ ! ఈ రోజు నా సత్యం పోయిన దుఃఖంతో కుమిలి పోవటానికని యిక్కడికి వచ్చాకాని, యింతటి సంతోష వార్త వింటా ననుకోలేదు. సైన్సంటే నా కిన్నాళ్లు ఎంతో అసహ్యం. సైన్సు లోకాన్ని నాశనం చేయటానికి ఉపయోగపడుతుందని అనుకునేదాన్ని. యీనాడు విన్నా, లోకాన్నంతా ఉద్ధరించడానికీ సైన్సు కారణమని.

పిచ్చి:- పొరపాటు ! కేవలం పొరపాటు.

బోయ్:- (హారంతో వచ్చాడు) ఇదిగోనమ్మా హారం!

శాంతి:- ఆ తెచ్చావూ ? తీసుకోలా ! — ఇదిగో తమ్ముడూ ! ఇది నా ముద్దుల సత్యానికోసం — కేవలం సత్యానికని — ప్రత్యేకంగా ఆర్డరిచ్చి కట్టించాను. ఈ రోజు నీకు — నువ్వు లోకానికి చేస్తున్న యీ గొప్ప సహాయానికోసం - నీకు వేస్తాను. నేను సత్యాన్నెంతగా ప్రేమిస్తానో నీకు తెలుసు. ఈ హారం ఆ ప్రేమకు గుర్తు ! రా తమ్ముడూ ! వేసుకో. ప్రపంచం నీ కింతకంటె గొప్ప సత్కారం చేయబోతూంది. కాని-నీ స్వంత అక్క, ఈ తృణం అర్పిస్తూంది, స్వీకరించు.

పిచ్చి:- ఆగండి ! ఆగండి ! ఆయన కనిపెట్టిం దేదో ఆడిగి ముందుగా తెలుసుకోండి. మీరు వట్టి వుద్రేకం మనిషిలా అగుపిస్తున్నారు.

శాంతి:- వుద్రేకం మనిషిని కావచ్చు. కాని పిచ్చి మనిషిని కాను.

పిచ్చి:- కావచ్చు. కాని అదేదో ముందుగా తెలుసుకోందే ఆయన్ను సత్కరించటం నేను సుతరామూ అంగీకరించను.

శాంతి:- మీరే మంటారు ?

పెట్టుబడి:- నేనూ అదే మంచిమార్గ మనుకుంటా.

శాంతి:- పోని తమ్ముడూ, నువ్వు చెప్పు ?

సైంటి:- చెప్తా—కాస్త టీ త్రాగని.

శాంతి:- ఒరే ! (బోయ్ వచ్చాడు) టీ పట్రా.

సైంటి:- టీ వచ్చేలోగా మీ రందరూ ఒక్కసారిగా వూహించి చెప్పండి—నేనేం కనిపెట్టి వుంటానో ?

శాంతి:- ఏముంటుంది ? యుద్ధం చేయాలనే వెధవాలోచనే మనుషులకు రాకుండా ఒక మందు కనిపెట్టి వుంటావు, అంతేనా ?

(పిచ్చివాడు పెద్దగా నవ్వాడు)

పెట్టుబడి:- అదికాదు.

పిచ్చి:- ఆఁ, ఏదికాదు ? చీకటబజారు యింకా చీకటి అయ్యే సాధనం కనిపెట్టి వుంటాడనేనా ?

పెట్టుబడి:- అదీకాదు !

పిచ్చి:- మరింకేది ? రూపాయలు పిల్లలు పెట్టే యింజక్షన్ ?

పెట్టుబడి:- అదంతా కాదు ! ఎప్పుడూ సమ్మెలు చేస్తూండే వెధవల కొక మత్తు మందు కనిపెట్టి ఉంటాడు !

(బోయ్ టీ తెచ్చాడు)

పిచ్చి:- ఒరే! అయ్యగారు యిన్ని రోజులు ఈ గడిలో కూర్చొని ఏం కనిపెట్టి వుంటారో నువ్వు చెప్పరా !

బోయ్:- నాకేం తెలుస్తుంది సార్ ! ఏదో అందరికీ కూడూ, గుడ్డా పెట్టే యిదానం ఏదైనా కనిపెట్టి వుంటారు.

(పిచ్చివాడు పెద్దగా నవ్వాడు. బోయ్ వెళ్ళాడు.)

సైంటి:- (టీ తాగుతూ ఇటూ అటూ పచారుచేస్తూ) మీరూ వాడూ వూహించిం దంతా వట్టిది. నేను కనిపెట్టిందంత తేలికైంది కాదు. మీరు కాదు, ప్రపంచంలోని గొప్ప గొప్ప బుర్రలు కూడా వూహించుకోలేవు.

పెట్టుబడి:- నేనుచెప్తా - చావులేనిమందు అమృతం.

సైంటి:- కాదు. అమృతమే కనిపెడితే ఘోరమై పోతుంది ప్రపంచం. యుద్ధాలకు యెడ తెరిపే ఉండదు.

శాంతి:- అదేదో నువ్వు చెప్పరా, తమ్ముడూ !

సైంటి:- చెప్తా వినండి.

(టీ ముగించి ఉపన్యాసం పోజులో)

పిచ్చి:- సైలెన్స్ !

సైంటి:- నాకు రహస్యాలను రహస్యాలుగా ఉంచటమే యిష్టం. చెప్పకుండా ఉండడం మేలైనమతం. అసలు యిటువంటివాటి విషయమంతా రహస్యంగా ఉంచటంలోనే ఉంది. నేనీ పరిశోధన చేస్తూ నాకు తప్ప మరెవ్వరికి తెలియరాదని చెప్పగూడదనే చెప్పలేదు. అయినా యిప్పుడు మీ రందరూ చేరడం, నా విజయాన్ని గురించి ఇంతగా ఆనందించడంవల్ల చెప్పాలనిపిస్తుంది. ఒక చిన్న ముక్కలో చెప్పా లంటే నే నీరోజు మన యుద్ధచరిత్రలో ఒక మహా విప్లవం తెచ్చాను.

శాంతి:- అంటే యుద్ధాన్ని పూర్తిగా రూపుమాపడమే గదూ, తమ్ముడూ!

పిచ్చి:- ఉండండి ! అతన్నే చెప్పనీండి.

శాంతి:- యుద్ధాన్ని రూపుమాపడ మనేది కేవలం అసంభవం.

పిచ్చి:- అసంభవం అన్నది యేమోగాని అనవసరం మాత్రం కాదు.

పెట్టుబడి:- అవసరమైతే అసంభవమవటానికి వీల్లేదు. కాని అది అసంభవం కనక అనవసరం.

సైంది:- చాలా బాగా అన్నారు.

శాంతి:- తమ్ముడూ ! ఏమిటన్నావు ? యుద్ధాన్ని రూపుమాపడం అనవ సరమా ? నాకు జీవితంలో అంతకన్నా చాలా అవసరమైంది,

ముఖ్యమైంది వేరే కనిపించటం లేదు తమ్ముడూ ! ఆయనకేం ? యుద్ధం ఆయన్నేమీ బాధించలేదు. పైగా అతనికి డబ్బును కుడిపి స్తుంది. కాని నాలాంటి సామాన్య స్త్రీ ఎలా బాధపడుతుందో తెలుసా మీకు ? యుద్ధానికి పూర్వం నా యిల్లు ఎంతో ప్రేమించే భర్తతో ఆల్లారుముద్దుగా పెంచిన కొడుకుతో ఎంత కళ కళ లాడుతూండేదీ? యుద్ధం ముగిసేటప్పకి అవేవీ లేవు – ఆంతా శూన్యం. అంతా నాశనం - కొడుకు పోయాడన్న చింతతో గుండెపగిలి పోయా రాయన.

సైంటి:- అదే సెంటిమెంట్ ! అదే మోస్టు ఆన్ సైంటిఫిక్ ఫీలింగ్. యుద్ధం వల్ల నువ్వు కొంత నష్టపడ్డావు నువ్వే కాదు; ఎందరో నష్టపడ్డారు. ఎందుచేత ? యుద్ధం చేయటంలో - ఆంటే యుద్ధపరికరాల్లో మనం చాలా వెనుకబడివున్నాం. యుద్ధం ఈ నాటికన్నా ఇంకా భయంక రంగా కావాలి.

శాంతి:- ఓ, తమ్ముడూ ! ఇంకా భయంకరంగానా ?

సైంటి:- అక్కయ్యా, సరిగ్గా విను. నా పాయింటు నువ్వు గ్రహించటం లేదు. ఎన్నో యుగయుగాలుగా బుద్ధుడు, ఏసుక్రీస్తు, గాంధీ లాంటివాళ్లు యుద్ధాలు మానండ్రరా అని ఎలుగెత్తి అరుస్తున్నారా. ఏం ? చెప్పు.

శాంతి:- అరుస్తున్నారు. కాని, ఏం లాభం?

సైంటి:- కాని యెందువల్ల మానలేకుండా వున్నారు?

పెట్టుబడి:- అది మానవసహజం కనుక. భోజనం మానేమంటే ఎలా మానేస్తాం?

పిచ్చి:- ఎందుకు మానేయకూడదు ! మెదడుంది ఆలోచించటం మానేయడం లేదూ ?

సైంటి:- అది కేవలం అసంభవం. నీతి ప్రబోధాలవల్ల యుద్ధాలు ఆగవు కనుక ఇక మిగిలిందొకటే దారి. ఏమిటది తెలుసా ? చిన్న ఉదా హరణతో చెప్తా ! చేతులు కాల్తాయని ఒకసారి అనుభవమైన తర్వాత ఎవరన్నా నిప్పుజోలి కెళ్తారూ ?

పెట్టుబడి:- చాలా గొప్ప సత్యం.

సైంటి - అలాగే యుద్ధంకూడా అతి భయంకరంగా, ఒళ్ళాదాని జోలికి రానట్లుగా తయారుకావాలి. అంటే యేమిటి? ఉప్పుతప్ప వాటికంటే గొప్ప మారణాయుధాలు తయారుకావాలి. గడచిన యుద్ధం అయిదు సంవత్సరాలు జరిగింది. అది తలచుకుంటేనే నాకు సిగ్గేస్తుంది. మనం యింకా కొండజాతుల దశలో వున్నామన్పిస్తుంది. శాస్త్రీయ విజ్ఞానం కలిగిన ఈ యుగంలో కూడా యుద్ధం అయిదేళ్లు జరగడం హాస్యాస్పదం. ఒక్కరోజులో ముగించి వుండాలి.

పెట్టుబడి:- నాన్‌సెన్స్! అప్పుడు యుద్ధంలో మజా యేముంటుంది?

పిచ్చి:- మజాలేదు. నర్లిజాతులేందే మజా యేముంటుంది? జనం కొన్ని సంవత్సరాలపాటు తింటికి, బట్టకూ కరువెత్తిపోకుంటే మజా యేముంటుంది?

సైంటి:- అలాకాదు. ఆ మజాలన్నీ లేకుండాపోవు. ఇప్పుడు ఏ సంవత్సరాలలో జరిగేదంతా అప్పుడు ఒక రోజులోనే జరుగుతుంది.

శాంతి:- ఇప్పటిలాగే ఇంతజనం చచ్చిపోతారా తమ్ముడూ!

సైంటి:- నేనిప్పుడు కనిపెట్టింది ఆ ఆటంబాంబుకన్న చాలా తీవ్రమైంది. దీన్ని విసిరితే రెండు ఆఫ్రికాలను, ఒక అమెరికాను నాశనం చేయవచ్చు. దీని గాలి సోకినంతమాత్రం, దీని శబ్దం వ్రాకినంతవరకు, మానవులు మానవులేకారు; సకల చేతనా చేతనాలు మసి అయిపోతాయి. ఆ ప్రదేశంలో ఇక ఏలాంటి సృష్టి జరగదు. మనం మన ఇష్టప్రకారం కావలసిన సృష్టి అక్కడికి దింపుకోవలసిందే. మనుష్యులు, మనుష్యులకు సంబంధించిన స్థిరచరాస్తులు, ఆలోచనలు, అభిప్రాయాలు, విజ్ఞానం అన్నీ నాశనమైపోతాయి. సైన్సు ఇంత మహత్తర ఆయుధాన్ని ప్రసాదించబోదు. మానవ విజ్ఞానానికి మకుటమణి. ప్రకృతి శాసకుడుగా మానవుడు పొందే అంతిమ విజయం ఇది.

[శాంతి వెర్రికేకవేసి కూలిపోతోంది]

సైంటి:- వట్టి ఫీమేల్సు! ఒక సెంటిమెంటల్ ఫీమేల్! నాన్‌సెన్స్!

పిచ్చి: నువ్వు ప్రపంచాన్ని ఉద్ధరించడానికి వచ్చిన దేవతవు. సర్వ వినాశనానికి కాలికి గజ్జెకట్టిన పరమశివుడవు. అవునా? ముందా మెకు పరిచర్య చేయి.

సైంది:- (కాసిని నీళ్ళు ఆమె ముఖాన చల్లి) అక్కయ్యా! అక్కయ్యా!

శాంతి:- తమ్ముడూ! సత్యం నీకు జ్ఞాపకం లేదూ?

సైంది:- జ్ఞాపకం లేకేం?

శాంతి:- నాకంటే నీవు ఎంతో ముద్దుగా పెంచావు.

సైంది:- అవును.

శాంతి:- యుద్ధం ప్రారంభమయ్యేటప్పటికి వాడికి నూనూగు మీసాలు వస్తున్నాయి. ఆ నిమ్మపండులాంటి రంగు నిగనిగలాడుతూంటే, ఆ కోటేరులాంటి ముక్కు - కోలకళ్లు - ఇంకా నాకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాడు. యుద్ధానికి వెళ్ళాడు. ఎందుకు వెళ్ళాడో తనకే తెలియదు-ఎందు కీ యుద్ధమో, ఎవరెవరికో, వాళ్ళకు-తనకు ఏమి వైరమో ఏమీ తెలియదు-వెళ్ళాడు; చచ్చిపోయాడు. అందరూ ఏదో ఒకనాడు చావక తప్పదు. నాకు తెలుసు. కాని ఈ చావు అలాంటిది కాదు. కొందరు తమ బ్రతుకు తాము బ్రతికిచస్తారు. కొందరు ఇతరులకోసం, ప్రపంచంకోసం, ఏదో మహత్తర కార్యంకోసం చస్తారు. సత్యానికి అలాంటి దేదీలేదు. అనవసరంగా అసహ్యంగా అయ్యో అనేవాళ్లలేక చివరికి దహనం చేసేవాళ్లు లేక కుళ్ళి కుళ్ళి... (ఇక చెప్పలేకపోయింది.)

పిచ్చి:- చచ్చిపోయినందుకు సంతోషించు, చస్తే బాధలేదు నా పెద్దకొడుకు యుద్ధానికి వెళ్ళాడు. రెండు కళ్ళూ పోయినాయి. ఒక కాలు పోయింది. నా చిన్నకొడుక్కు అప్పుడే పెళ్ళిచేశాను. యుద్ధానికి వెళ్ళాడు. చాలా అందంగా ఉంటాడు. వానికి తగ్గట్టే వాడి పెళ్ళాం రంభ. యుద్ధంలో వాడు చచ్చిపోయివుంటే నాకేడుపు లేదు. తిరిగి వచ్చాడు. ఇప్పుడాపసికందుల దుఃఖం చూడలేకున్నా. ముక్కు-మొహం అంతా పోయింది. రెండు చేతులూ పోయినయి. ఆ దాంపత్యం ఎంత నరకంగా వుంటుందో ఆలోచించండి. (బోరుమని ఏడుస్తున్నాడు.)

సైంది:- నాన్‌సెన్స్! మీరు చాలా సంకుచితంగా ఆలోచిస్తున్నారు. స్వార్థాన్ని ముందు పెట్టుకొని చూస్తున్నారు. మీకు విశాల దృక్పథమే లేదు.

పెట్టుబడి:- అవును. కేవలం ఖాపిలో కప్పలు.

శాంతి:- నువ్వెప్పుడైనా యుద్ధాని కెళ్ళావా?

పెట్టుబడి:- లేదు.

పిచ్చి:- నీ కొడుకు వెళ్ళాడా?

పెట్టుబడి:- లేదు.

పిచ్చి:- నీ కూతురు ముందమోసిందా ?

పెట్టుబడి:- నేను వార్ కాంట్రాక్టులు తీశాను; యుద్ధానికివెళ్ళేవాళ్ళను చూడాను- నా కొడుకు డాక్టరు.

పిచ్చి:- యుద్ధంలో పనిచేశాడా ?

పెట్టుబడి:- లేదు. ఇక్కడే యుద్ధానికి వెళ్ళేవాళ్ళను పరీక్షించి పంపేవాడు. నేను వార్ హాస్పిటళ్ళకు ఆహారం సప్లయి చేశాను. గాయపడ్డ సోల్జర్ల నెందరినో చూచాను.

శాంతి:- మద్రాసులో బాంబులు పడుతూన్నప్పుడు నువ్వు అక్కడ ఉన్నావా?

పెట్టుబడి:- లేదు. మావూరు వెళ్ళాను.

శాంతి:- భయంచేతనే కదూ ?

పెట్టుబడి:- ఆ వూరికే రెప్పుకోసం.

పిచ్చి:- అబద్ధం.

పెట్టుబడి:- అయితే అయింది. హల్లో ప్రొఫెసర్! నేను కేవలం వ్యాపారరీత్యా వచ్చాను. యుద్ధం మంచి చెడ్డలను తర్కించటానికి కాదు. నేనేం కాలేజీ స్టూడెంటుని కాను, అటువంటి వివాదం పడటానికి. మీరు చెప్పండి. మీ పరిశోధన సర్వాహక్కులు ఎంతకిస్తారు ? వెంటనే చెక్కు పంపుతా!

సైంది:- ఫీకా!

పెట్టుబడి:- ఏం ?

సైంటి:- నేను, ముందు మన గవర్నమెంటు నేనుకోరే పారితోషకం ఇవ్వకుంటే, వేరే ఇంకో గవర్నమెంటుకైనాసరే ఇస్తాను.

పెట్టుబడి:- ఇదుగో, నామాట వినండి. గవర్నమెంటుతో మీరు ఆవస్థలు పడలేరు. ఆ బాధంతా మీకక్కరలేదు. హాయిగా మీరు కోరినంత డబ్బు ఇస్తాను. ఇంకా మా సైన్సు అకాడమీ ఆధ్వర్యాన మీకు పెద్ద బిరుదులు కూడా ఇప్పిస్తాను. మీ పేరిట ఒక యుద్ధబాధిత సహాయ నిధి ఏర్పాటు చేస్తాను. అనామక శిశు రక్షణాలయంలో రోజూ మీ పేరిట పాలు పోయిస్తాను. ఇంకా...

పిచ్చి:- ఇల్లంతా ఇనప్పెట్టెగా మారుస్తాను. చలవరాయి మేడలో బంగారు పూలు పొదుగుకుంటాను. ఇంకా ఒక్క ఆడుగుమందం బొజ్జ పెంచుతాను.

శాంతి:- ఇంకా కొందరిల్లాళ్ళని వెధవలు చేస్తాను. తల్లుల కడుపుల్లో చిచ్చు పెడతాను. పసిజీవితాలను చిదిమేస్తాను. పచ్చి కసాయి వ్యాపారం చేస్తాను.

పెట్టుబడి:- నాన్‌సెన్స్! మీరు ఇస్తారా ఇవ్వరా?

శాంతి:- తమ్ముడూ! నీ పరిశోధనను ఆడుగంట ధ్వంసం చేస్తావా లేదా?

సైంటి:- శాంతీ !

శాంతి:- అవును! ఈ రాక్షసవిజ్ఞానం నాశనం చేయాలి !

సైంటి:- విజ్ఞానాన్ని నాశనం చేయడమే రాక్షసత్వం.

శాంతి:- తమ్ముడూ! ఇది విజ్ఞానం కాదు. మానవుని జీనితాన్ని సుఖప్రదం చేసేదే విజ్ఞానం. మానవుని ఆయుర్దాయాన్ని పెంచేదే విజ్ఞానం.

పిచ్చి:- అకలి, శోకం లేకుండా చేసేదే విజ్ఞానం.

సైంటి:- అదీ విజ్ఞానం కావచ్చుగాని ఇది విజ్ఞానం కాకపోదు.

పెట్టుబడి:- పోషించేవాడూ దేవుడే-నాశనం చేసేవాడూ దేవుడే!

శాంతి:- ఛీ! దేవుడ్ని కూడా ఎందుకు దోపిడి చేయాలని చూస్తావు ?

పిచ్చి:- అసలు దేవుడు లేకుంటే వీళ్ళదోపిడి సాగనేసాగదు.

శాంతి:- తమ్ముడూ అంతా నాశనం చేసేయి. నువ్వు కనిపెట్టిందంతా మరిచిపో! నీ మేధస్సును మంచి మార్గానికి ప్రేరేపించు.

సైంటి:- అసంభవం! ఇన్నాళ్ళ నా కష్టాన్ని చేతులారా నాశనం చేయటం అసంభవం. సైన్సు చరిత్రలో నాకు రానున్న అగ్రస్థానాన్ని నేను వదులుకోలేను.

శాంతి:- నాశనం చేయవూ ?

సైంటి:- చేయను.

శాంతి:- చేయవూ ?

సైంటి:- నన్ను బెదిరించకు శాంతీ!

శాంతి:- ఐతే నేనే ధ్వంసం చేస్తా. (అక్కడున్న రిటార్ట్, టెస్టు ట్యూబులు అన్నీ క్రిందకి తోసేసింది.)

సైంటి:- శాంతీ ! (పెద్దగా నవ్వాడు) ఎంత పిచ్చిదానివి శాంతీ ! అందులో ఏముంది? అవి నాశనంచేస్తే విజ్ఞానం నాశనమౌతుందా ? ఇదుగో - అంతా యీ మెదడులో వుంది. నువ్వీ గదంతా ధ్వంసం చేసేస్తే. ఏం పర్వాలేదు, – రాండీ సేట్‌గారూ, రాండి, వెళ్దాం–పిచ్చి పిల్ల ! తృప్తిపడనీ, యీ గ్లాసు ముక్కలతో—

(పెద్దగా నవ్వుతూ పోతుంటారు - పిచ్చివాడు టేబిల్ మీదవున్న బాకు శాంతి చేతికిస్తాడు-ఒక్క క్షణం తటపటాయించి వెనకాలనే వెళ్ళి - సైంటిస్టుని పొడిచేస్తుంది. సైంటిస్టు కూలిపోతాడు. పెట్టుబడి దారు పారిపోతాడు. శాంతి విచారంగా 'తమ్ముడూ' అని ఆతని మీద వాలింది.)

[తెరపడింది]

ఆడది

రచన :

పినిశెట్టి శ్రీరామమూర్తి

పాత్రలు

పురుషోత్తం	గృహస్థుడు	వయస్సు	55
రాము	పురుషోత్తం కొడుకు	,,	16
అచ్యుతం	మేనల్లుడు	,,	50
వెంకటరమణ	బంధువు	,,	40
శతభిషం	వంటవాడు	,,	30

[తెరవెనక పాత్రలు: అంట్లు తోమేవాడు, కాయకూరలమ్మేవాడు]

పురుషోత్తం యిల్లు. ఎదురుగా కిటికీలోంచి దూరంగా మర్రిచెట్టు కనిపిస్తూ వుంటుంది. ఒకప్రక్కగా డెస్కు. డెస్కుపై ఏవో కాగితాలు - ఒక మామూలు కుర్చీ, రెండు యీజీచైర్లు వుంటాయి. రాముడు, కృష్ణుడు యిత్యాదు ఫోటోలు గోడకు తగిలించి వుంటాయి. ఒక డ్రాయరు. డ్రాయరు మీద భాగవతపు బైండు వుంటుంది. పురుషోత్తం విసుగుదలగా పచార్లు చేస్తూ వుంటాడు.

పురుషోత్తం:-నీ యిష్టం వచ్చినట్లు సాగుతుందనుకున్నావ్! ఒక్క క్షణం కూడ ఇంట్లో వుండటానికి వీల్లేదు. నేను మాట అననే అనను. అన్నానా అంతే.

(రాము ప్రవేశిస్తాడు)

పురు:- ఒరే రామూ !

రాము:- (వెనక్కి తిరుగుతాడు)

పురు:- మీ అమ్మ ప్రయాణమవుతోందా ?

రాము:- తెలీదు.

పురు:- తెలుసుకోవలసిన బాధ్యత నీకుందంటావా ?

రాము:- ఆదీ తెలీదు.

పురు:- నీ వెక్కడికి వెళుతున్నావ్ !

రాము:- వీధిలోకి.

పురు:- ఎందుకు ?

రాము:- బండికోసం.

పురు:- (బిగ్గరగా) ఎవరు తీసుకు రమ్మన్నారు ?

రాము:- అమ్మే.

పురు:- ప్రయాణం కాలేదని చెప్పావుగా ?

రాము:- ప్రయాణం అనే ప్రయత్నం అమ్మ ఏమీ చేయడం లేదు కాబట్టి.

పురు:- మరి బండి ఎందుకు ?

రాము:- ఫలానా అందుకని అమ్మ చెప్పలేదు.

పురు:- అమ్మ చెప్పలేదు... నేను చెపుతున్నానురా... ఆమె తన పుట్టింటికి వెళ్ళడానికి. జన్మనిచ్చినా భర్తా బిడ్డలు వున్నారనే జ్ఞప్తి లేకుండా వుండటానికి. అర్థంలేని స్వాతంత్ర్యాన్ని కోరే ఆడదాని దుర్గతికి ఆదర్శప్రాయంగా నిలవడానికి. చెప్పానుగా... తిరిగి వెళ్ళు... ఆవల పీదిలోవున్న అమ్మగారింటికి అర్ధ రూపాయి తగలేసి, ఆటోకాని, కార్లు కట్టించిపంపే జమీందారు ఇక్కడపడి యేడ్వటం లేదని చెప్పు.

రాము:- ఆ డబ్బులు తాతగారే యిస్తారులే నాన్నా!

పురు:- అలాకూడా వీల్లేదు.

రాము:- మరి ఎలా వెళుతుందంది?

పురు:- నీకు కళ్ళులేవురా? ఆమెకు కాళ్ళున్నాయి. ఆమె ఈ చావిడిలోంచి పీధిలోనికి బయలుదేరుతుందేమో. అదికూడా జరగడానికి వీల్లేదు.

రాము:- ఎలా వెళ్ళమన్నారు?

పురు:- మనిషిలా కాళ్ళతో నడచి. వెధవప్రశ్నలు నువ్వూ. దొడ్డిగుమ్మ ముందిగా, ఆదారిని పొమ్మను.

(రాము రెండడుగులు వేస్తాడు.)

పురు:- ఒరేయ్! వెళ్ళేటప్పుడు నాతో మాట్లాడాలని ప్రయత్నిస్తుందేమో ! ప్రయత్నం చేస్తుందంటావా?... వద్దని చెప్పు.

రాము:- సరే !

పురు:- సరే అంటే చెప్పవా? ఏమిటి? వినదేమిట్రా?

రాము:- వింటుంది. తప్పకుండా చెపుతాను.

పురు:- ఏడిశావ్‌లే! చెప్పొద్దని నే నంటానని నీవనుకుంటున్నావా? తప్పకుండా చెప్పు.

రాము:- చెపుతాలెండి.

పురు:- ఆమె చెప్పొద్దన్నా చెప్పాలి.

రాము:- అమ్మ చెప్పొద్దనదు. చెప్పిన తరువాత తప్పకుండా వింటుంది.

పురు:- తప్పకుండా వింటుంది...వినమను. జాగ్రత్తగా వినమన. అదే నాకు కావాలి. వెళ్ళు!

(రాము లోపలికి వెళతాడు. పురుషోత్తం ఆటు, ఇటు పచార్లుచేస్తూ వుంటాడు. లోపలినుండి శతభిషం వస్తాడు.)

శత:- అమ్మగారూ!

పురు:- (వెనక్కి తిరగకుండానే) పిలుస్తోందా ? నేను రావడానికి పీల్లేదని దానితో, ఈ జిహ్వతో... ఈ జన్మలో మాట్లాడనని...

శత:- కాదండి.

పురు:- (వెనక్కి తిరిగి) ఏమిటి ?

శత:- పిల్లల్ని...

పురు:- తీసుకువెడతానంటుందా ?

శత:- అదీ కాదండి.

పురు:- ఏమిట్రా ?

శత:- మీ యిష్టమయితే...

పురు:- తీసుకువెళతానంటుంది. అంతేగా ?

శత:- (బిగ్గరగా) బాబుగారూ ! (నెమ్మదిగా) మీ యిష్టమయితే ఇక్కడ వుంచుతానన్నారండి.

పురు:- అదీ... అలా అంటుంది. దానితెతీడు, వీడు మొండి ఘటమని.

శత:- (వెడుతూ తిరిగి) అవసరమయితే...

పురు:- పిలవను! పిలవను! చస్తే పిలవను !

శత:- కాఫీకాచి...

పురు:- ఇస్తుందా ? ఊహూ... తాగను, వెళ్ళు. పెందలాడే వెళ్ళిపొమ్మని చెప్పు.

శత:- బేబీ అమ్మగారిని విడిచిపెట్టలేక ఏడుస్తూందండి.

పురు:- ఏడుస్తున్నా సరే, విడిచిపెట్టి ఆలకువెళ్ళిపొమ్మను. ఏం, వెర్రివేషాలు వేస్తోందా? పిల్లల మిషతో తప్పు కదలకుండా వుండాలని చూస్తోందా? అలా పిల్లేదు.

శత:- అందు క్కాదండి.

పురు:- ఎందుకురా ? కొండముచ్చిలా మొహం నువ్వూనూ ! వెళ్ళు. ఆ బేబీని ఇలా తీసుకురా ? (శతభిషం వెళుతూ వుంటాడు.)

పురు:- ఒరేయ్ ! ఇల్లారా ! (నెమ్మదిగా) బేబీ బాగా ఏడుస్తోం దేమిటి ?

శత:- అమ్మగాడు కూడాను.

పురు:- దానిమాట నా కనవసరం. అంతగా బేబీ ఏడుస్తుంటే కడుపారా కాసిన్ని పాలిచ్చి మరీ వెళ్ళమను.
(శతభిషం నవ్వుతూ వెళ్ళిపోతాడు. వీధిలోనుంచి మాటలు వినిపిస్తాయి.)

వీధి:- అమ్మగారో !

పురు:- ఎవరు తమరు ?

వీధి:- వంకాయలండి బాబూ!

పురు:- ఎందుకూ ?

వీధి:- అమ్మకానికండి.

పురు:- వూరికే ధారవోస్తావని కాదోయ్ ! ఇప్పుడెందుకంట ?

వీధి:- కూర వండుకోడానికండి.

పురు:- ఉహు... అందుకా (కోపంగా) బుద్ధిలేదూ ! ఇక్కడ అయ్యగారుంటే అమ్మగారే కావలసి వచ్చిందేమిటి ? నీ వంకాయ లక్కర లేదు; చెంకాయ లక్కరలేదు. ఆవలకు పో !

వీధి:- లేత వంకాయలండి !

పురు:- కబుర్లు ముదురుగా వున్నాయే ! ఒరేయ్ ! నేను మాట అననే అనను. అన్నానంటే ఇక తిరుగులేదు. వెళ్ళిపో !

వీధి:- చిత్తం. (పోవును)

పురు:- (పుస్తకం తిరగవేస్తూ) అమ్మగారట అమ్మగారు. బొమ్మగారున్నూ.

రాము:- (బిక్కముఖంతో లోపలినుండి వస్తాడు) అమ్మో...

పురు:- ఏవమ్మా? (కూర్చుంటాడు)

రాము:- మీ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోమంది.

పురు:- దాని ఆరోగ్యం మహా గొప్ప ఆరోగ్యం అయినట్లు, పోతూ పోతూ ఈ ఏడ్పెందుకు? వెళ్ళిపోయిందికదూ ?

రాము:- (తాళం చెవులిస్తూ) తాళం చేతులు మీ కిమ్మంది.

పురు:- దాని తాళంచేతులు నా కెందుకు ? దాని పెట్టి, బీరువా నేను ముట్టుకుంటానా ? జన్మలో ఆ పని జరగదని చెప్పు.

రాము:- అవన్నీ మీవేననీ, ఆమ్మకీ యింటిలో గట్టిపరకకూడా లేదని, తన దంటూ ఏమన్నా వుంటే అవి ఏనాడో మీవిగా భావించానని, చెప్పమంది.

పురు:- (లేస్తాడు) అందీ ! భేషుగ్గా అంది ! అలా అంది- నాపు నచ్చింది. తానుకూడా ఒప్పుకుందిగా ! అదే కావాలి. ఏనాడైనా 'నా' అనే పరిస్థితిలో నా నట్టింట కాలు పెట్టిందంటే చూస్తాను... ఓరేయ్ ! రామూ! నువ్వు వింటున్నావ్‌గా — అది మీ అమ్మ...నేను మీ నాన్నను—కాదు...ఇక ఆది మీ అమ్మకాదు, అందుచేతనే వెళ్ళిపోతుంది.

రాము:- మీరు వెళ్ళిపొమ్మన్నారు.

పురు :- నన్నెదిరిస్తే వెళ్ళమంటానా? వీపు చిట్లగొడతానా?

రాము:- అమ్మ ఏమెదిరించింది నన్నా ?

పురు :- ఎదిరింపులకేం కావాలిరా? నేను మగాణ్ణి, అది ఆడది. సృష్టిలో భగవంతుడే పెట్టాడుగా ఈ విచక్షణ. కాస్త అణిగి మణిగి వుండ నక్కర్లేమా ? ఏమిటుండే ఏమిటి? ఇవ్రా వరస? సావిత్రి, సీతా, అనసూయ ఈలాగే చేశారా కాపురాలు? యముడు సావిత్రిని 'ఫో! పొమ్మ'ని పొలికేకలు వేస్తే చచ్చిపోయిన భర్త శరీరాన్ని పట్టుకు విడిచిపెట్టిందా? 'నువ్వు చస్తావ్. వనవాసం చెయ్యలే'వని రాముడు 'వద్దు! మొర్రో' అంటే వినిపించకుందట్రా సీత? ఆడవాళ్ళు అంటే వాళ్ళు. ఇదీవుంది. వెళ్ళిపోయింది కదూ?

రాము:- వెళ్ళలేదు.

పురు :- ఇంకా వెళ్లలేదూ! తక్షణం వెళ్లిపొమ్మని చెప్పు. ఆఖరిసారి నాతో అవతలకు గెంటించుకుందామని చూస్తుందేమో! ఆ మర్యాదకాస్త జరక్కముందే కాలు కదపమను. (రాము లోనికి వెళతాడు.)

పీది :- అమ్మగారో!

పురు :- పీడెవడు?

పీది :- అంట్లు.

పురు :- అమ్మకానికేనా? ఏ మంట్లు? మల్లంట్లా? మామిడంట్లా?

పీది :- అంట్లు తోముతానండి బావ్, మా ఆడదీయాల వూట్టం పడ్డాదండి.

పురు :- (కూర్చుని పుస్తకం చూస్తూ) అలాగా! తోమేవన్నీ అమ్మగారంట్లేనా. ఇక అయ్యగారివేమీ లేవన్నమాట?

పీది :- ఓటండిబావ్! అందరియి తోముతా!

పురు :- అయితే అమ్మగార్నే పిలవడమెందుకు ?

పీది :- అనవాట బావ్.

పురు :- గ్రహపాటురా? వెళ్ళు...ఇప్పుడేమీ కాళీలేదు. కాస్సేపుండిరా.

పీది :- ఆ యీది తిరిగొచ్చినానంటే, ఆకాశంమీదికి పొద్దెక్కి పోతాది బావ్.

పురు :- (లేస్తాడు) ఆకాశంమీద పొద్దెక్కకపోతే, సీ నెత్తిమీద ఎక్కుతుందా? ఒరే ! ఆట్టే ఏడవక ఆవలికి పో.

పీది :- ఏంటయ్యో! ఏడ్పు గీడ్పు అంటున్నావ్ !

పురు :- ఏమనా లేమిటి?

పీది :- మరేదా, గిరేదా చూసుకు మాటాడాలి.

పురు :- పో!పో! ఆట్టే వెధవకబుర్లు చెప్పక.

పీది :- మాటలొగ్గేత్తున్నావ్, జాగరత.

పురు :- ఏమిట్రా! ఎర్రబడి చూస్తున్నావ్! ఏం, ఏమన్నా చేస్తావా ఏం ? ఆయినా సీతో నాకెందుకు వెళ్లిపో, అందరికీ అమ్మగారే.

(వెంటనే శతధిషం లోపలనుంచి వస్తాడు)

పురు :- ఏరా, ఎందుకొచ్చావ్?

శత:- పిల్లలు రావటంలేదండీ!

పురు:- ఈడ్చుకుని లాక్కురా! వెధన వేషాలు, వాళ్ళూనూ.

శత:- అమ్మగార్ని పట్టుకుని విడిచిపెట్టడం లేందే !

పురు:- ఆ పిల్లలను పట్టుకొని నువ్వు విడిచిపెట్టొద్దు.

శత:- నన్ను మీరు విడిచిపెట్టొద్దు.....నాకేం తెలీదు బాబూ! నేను ఏమీ చెప్పలేను. అయ్యగారూ! అమ్మగారితో ఒక్కసారి...

పురు:- మాట్లాడమంటావా? పళ్ళు రాలగొడతాను. మొద్దులా ఆలా చూస్తావేరా? వెళ్ళి లాక్కురా పిల్లల్ని.

శత:- (ఏడ్పుముఖంతో) చిత్తం (వెళ్ళిపోతాడు)
(రాము కోపలినుంచి వస్తాడు)

రాము:- మీ కోపానికి అర్థముండదు. అమ్మేం తప్పు చేసింది ? ఎందుకు ఇంట్లోంచి వెళ్ళిపొమ్మనాలి ?

పురు:- ఓరి బోడివెధవా! ఏం తప్పులేకుండానే వెళ్ళిపొమ్మంటాను. వెళ్ళి పొమ్మనడానికి నాకు అధికారముందిరా! నన్నెదిరిస్తుందేం? వెళ్ళనని ఒక్కసా రనమను చూద్దాం.

రాము:- అందే ?

పురు:- అనమను చెపుతాను.

రాము:- అమ్మ అలా ఒక్కనాటికీ అనదు.

పురు:- అలా అనమని అందే, వుండమని నే నంటానని నువ్వు అనుకుంటున్నావ్. నేను అననే అనను.

రాము:- (ప్రక్కకు చూస్తూ దుఃఖంగా) అదిగో ! అమ్మ వెళ్ళిపోతోంది, పిల్లల్ని విడిచిపెట్టలేక వెళ్ళిపోతోంది. వెనక్కి తిరిగిచూస్తూ వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళిపోతోంది...ఆగమని చెప్పేవారు లేక, అపు చేసేవారు లేక అనాధగా వెళ్ళిపోతోంది. (హఠాత్తుగా పురుషోత్తాన్ని

కౌగలించుకొని) నాన్నగారూ! మీకు పిలవండి వస్తుంది. అమ్మ మీమాట కెదురుచెప్పదు. రమ్మంటే వస్తుంది. పొమ్మంటే పోతుంది. అమ్మ అంత మంచి అమ్మ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. (లోపల పిల్లలు 'అమ్మా! అమ్మా!' అని ఏడుస్తుంటారు.)

పురు:- ఏడవండి. మీతోపాటు నేనుకూడా ఏడుస్తాను. కాని మాటతప్పే మనిషిని కాదు. నా జన్మలో మళ్ళీ దాన్ని పిలవను. తిరిగివస్తే (ఆశగా) వస్తుందా?...రాదు...రానివ్వను. నా గుమ్మం ఎక్కనివ్వను. జానకీ, వెళ్ళిపోతున్నావ్‌గా! వెళ్ళిపో. (వెళ్ళి యీజీ చైర్లో కూలబడతాడు.)

రాము:- (బిగ్గరగా) నాన్నా (కుర్చీ దగ్గరగా వెళతాడు)

పురు:- రామూ! పిల్లల్ని వెళ్ళిచూడు. (రాము వెళతాడు)
(అచ్యుతం వీధిలోనుంచి యీజీచైర్ ప్రక్కనిలబడి, తిన్నగా మూలకు వెళ్ళి చూచి తిరిగివచ్చి)

అచ్యు:- మామయ్యా!

పురు:- కాయా!

అచ్యు:- ఒక మనమైన సత్యాన్ని ఈనాటికి సాధించావు.

పురు:- గ్రహించావు కదూ?

అచ్యు:- అహంభావమే గంభీరంగా పోజ్‌చేసే అడవాళ్ళ మానసిక తత్వానికి మామయ్యా! సీలాంటివాడుండాలి.

పురు:- (ఆనందంగా లేస్తూ) అచ్యుతం! నా తత్వం నీకు తెలుసుగా! నాకు కోపము రానేరాదు...వచ్చిందా, అటో ఇటో తక్షణమే తేలిపోవాలి. ఏమంటావ్?

అచ్యు:- కాదంటానా? అసలు రాముడు అవతారమూర్తి కావడానికి ఆ పట్టుదలేగా కారణం.

పురు:- నిజంగావా?

అచ్యు:- అబద్ధం చెబుతానా మామయ్యా! చాకలాడు ఏదో వాగితే సీతను ఏం చేశాడు? మారాత్తుగా అవలికి పొమ్మన్నాడు. అంతే. గవ్‌చివ్‌గా

కార్యసాధన అయిపోయింది. ఉత్తర రామాయణం ఉత్తమంగా తయారయి వూరుకుంది. అసలు కోపం రానేరాదు. వచ్చినా? అటో యిటో తేలిపోవాలనే నినాదమే ఆయన ఆశయం కూడాను. చూడు ...అసలు ఆడదనే వస్తువునే సృష్టిలో చాల తేలికైన పదార్థంతో తయారుచేసి విడిచిపెట్టారు! ఎవరు? దేముడు-ఆ దేముడే ఏమి చేశాడంటే, మొగాణ్ణిమట్టుకు నాలుగుపాళ్ళు ఎక్కువచేసి నారీవ్వేషిలా తయారుచేశాడు. అసలు సృష్టిలోవుండే రహస్యాన్ని ఏ ఆడది గమనించదో ఆ ఆడది ఆడదేకాదు.

పురు:- అచ్యుతం! నువ్వు నిజంగా బుద్ధిమంతుడివిరా! అందుకే మీ అమ్మ చచ్చిపోతూ అందిలే, మా వాడు మంచి జాతకుడవుతాడని.

అచ్యు:- (ఆనందంగా) అందీ-అంచుకే మామయ్యా! నాకు తెలియకుండా వయస్సు మీరేకొద్దీ వెధవలక్షణాలు నాలో బయలుదేరుతున్నాయ్... అత్తయ్యమీద అంతకోపం దేనికి?

పురు:- అదే ఆడగొద్దురా అచ్యుతం!

అచ్యు:- ఓహో! అడగాలని అడగలేదు. అసలు అత్తయ్య చాలా మంచి దేగా?

పురు:- కాదంటానా? చాలా మంచిదే. ఆ మంచి తనమనే ఆధారం ఆయుధంగా వున్నదని అడ్డమయిన స్వల్ప విషయాలకు స్వాభిమానమే! ...చిర తెచ్చానే అనుకో. ఖరీదు కాస్త ఎక్కువే, కట్టాలంటావా? వద్దంటావా?

అచ్యు:- చచ్చినట్లు కట్టాలి.

పురు:- అది కట్టగా ఆనందించేవాణ్ణి నేను. అందుచేత నా యిష్టప్రకారము అది నడవాలంటావా? దానిష్ట ప్రకారం నేను నడవాలంటావా?

అచ్యు:- అబ్బే, నీ యిష్టప్రకారమే నడవాలి. అసలు ఎందుకొచ్చింది తగువు?

పురు:- ఆదే ఆడగొద్దన్నాను. అసలు ఆటువంటి విషయాలు నీవు ఆడగకూడదు; నేను చెప్పకూడదు.

(శతభిషం రెండు గ్లాసులతో కాఫీ తీసుకొస్తాడు.)

శత:- పంచదార ఆంచనా నాకు తెలియదండి, అమ్మగారే వేశేరు.

పురు:- అదే అనొద్దు. దాని తాతలా నే వేస్తాను. పంచదార డబ్బా యిలా తీసుకురా!

(శతభిషం వెళతాడు.)

పురు:- చూశావ్ అచ్యుతమ్ ! ఆడదానికి ప్రతి పనిలోను ప్రాముఖ్యత యివ్వడం వల్లనే-పట్టపగ్గాలు లేకపోతున్నాయ్. వంట మనం చేసుకోలేం? కాఫీ మనం కాచుకోలేం? మా శతభిషంలాంటి వంటవాడు ఒక్కడుంటే వూరంతా వడ్డన చెయ్యొచ్చు ఒక పూటలో—

అచ్యు:- ఆడదాని అవసరం లేకుండా మగాడు బ్రతకొచ్చు. మగాడి అవసరం లేకుండా ఆడది బ్రతుకలేదు మామయ్యా!

పురు:- ఒరేయి వెధవా! పంచదార తొందరగా తీసుకురారా! అచ్యుతం, చక్కని మాటన్నావ్.

అచ్యు:- భారతదేశంలో బ్రహ్మచారు లున్నారు కాని, బ్రహ్మచారిణులు వున్నారా?

పురు:- ఏరీ...వెతికి ఒక్కదాన్ని బ్రహ్మచారిణిగా మన మతంలో చూప గలమా? అంతా మగాళ్ళే. భారతంలో భీష్ముడు, రామాయణంలో ఆంజనేయులు.

అచ్యు:- కలియుగములో వివేకానంద, సుభాన్ చంద్రబోస్.

పురు:- ఒరేయ్! కాఫీ చల్లారిపోతోందిరా!

(శతభిషం డబ్బా తీసుకువస్తాడు.)

పురు:- (డబ్బా చూడకుండా చంచాతో పంచదార అనుకొని కాఫీపొడి కలు పుతూ) రామూ ఏమి చేస్తున్నాడు?

శత:- కాఫీ కావాలని కూర్చున్నాడండి.

పురు:- వాళ్ళకింకా యివ్వలా ?

శత:- మళ్ళి పట్టుకొస్తానండి. (లోపలికి వెళతాడు)

పురు:- అచ్యుతం! వెధవ... కుక్కలాంటివాడు. తెలివిలో చిత్రగుప్తుడు గూడా సిగ్గుపడాలి. పని చేశాడంటే, పటానికి ఫ్రేమ్ కట్టినట్లుంటుంది.

అచ్యు:- అసలు మీరు కాఫీలో వేసేదేమిటి?

పురు:- పంచదార! (డబ్బాకేసి చూచి) ఒరే వెధవా! పంచదారని కాఫీ పొడి డబ్బా తీసుకొస్తావట్రా? కళ్ళు మూసుకుపోయి పనిచేస్తున్నావా? ఇలారా!

(కతభిషం వస్తాడు.)

పురు:- ఇదేం డబ్బారా?

కత:- పంచదార డబ్బా కూడా ఆచ్చం ఇలాగే వుంటుందండి.

పురు:- రెండు డబ్బాలు ఆయింటు చేస్తే నీ ముఖంలా వుంటుంది. (డబ్బా గిరవాటేసి) వెళ్ళు... ఈ గ్లాసులుకూడా తీసుకువెళ్ళి కాఫీచేసి తీసుకురా!

(కతభిషం వెళతాడు. పురుషోత్తం నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చుంటాడు.)

పురు:- ఆబ్బబ్బ! యింత శుద్ధ తెలివితక్కువ వెధవతో నేను కాబట్టి వేగుతున్నా ననుకో—

అచ్యు:- అసలు అత్తయ్యే వాణ్ణి అలా తయారుచేసిందేమో!

పురు:- ఆ! బాగా చెప్పావు. అదే ఆడదానిలోవున్న కిటుకు. తన పనితనం ప్రక్క మగాడికి చెప్పేస్తే; ఇక వాళ్ళ అవసరమే వచ్చి ఏడ్వదని వెధవ అదురు. లేకపోతే కాస్తంత కాఫీలో పంచదార వెయ్యడమే చేతకాలేదంటే...

అచ్యు:- అంతా పొలిటికల్ కుట్ర

పురు:- ఏదో పొయ్యిలో కుట్ర. నా సంసారానికి చాలా ద్రోహం చేసింది అచ్యుతం!

అచ్యు:- ఇక అత్తయ్య అవసరం లేకుండా జాగర్తపడ్డంలోనే నీ తెలివి తేటలున్నాయ్ మామయ్య!

పురు:- ఒరేయ్! మీ అమ్మ నెరుగుదువుగా?...ఆవిడ స్వయం నా చెల్లెలు... మీ నాన్న ఏంచేసేవాడు? ... ఆగ్రహంవచ్చి ఆవలకు పొమ్మంటే; హఠాత్తుగా వచ్చి 'నేను ఆదదాన్ని, నాకు మీరే దైవము, నన్ను చంపినా మీ పాదాలదగ్గరే ప్రాణం విడుస్తాను' అని కాళ్ళు పట్టుకునేది. మీ నాన్న కౌగలించుకొని కన్నీళ్ళ తుడిచేవాడు. అదిరా దాంపత్యం. ఆదదంటే మా చెల్లెలే ఆదది. మీ అత్తయ్యను పొమ్మన్నానే అనుకో. ఒకసారివచ్చి, అహ(! ఆది యింట్లో వుండాలని నా వుద్దేశంకాదు. కోరిందంటావా ? ఈ పిల్లల గురించికాని... లేకపోతే దానవసరం నాకేమిటి?

(రాముడు వస్తాడు.)

రాము:- నా స్కూలుకు టైమయింది.

పురు:- నీ స్కూలుకేగాని టైమయింది, ఈ భూ ప్రపంచంలో దేనికి కాలేదేమిటి?

రాము:- టిఫిన్ ఏమీ చెయ్యలేదు. కాఫీ యింకా కాచలేదు.

పురు:- ఒరే శతభిషం!

రాము:- చెల్లాయి ఆకలితో ఏడస్తోంది. బేబీ పాలకోసం బాధ పెడుతోంది.

పురు:- ఒరేయ్! వెధవ శతభిషం! (విసురుగా లోపలికి వెళతాడు)

అచ్యు:- రామూ!

రాము:- (తిరుగుతాడు)

అచ్యు:- ఏమిట్రా ఈ గొడవ?

రాము:- బావా ! నేనీ యింట్లో వుండలేను.

అచ్యు:- అదేమిటి ?

రాము:- వయస్సు మీరినకొద్ది నాన్న మరీచెడ్డగా తయారవుతున్నాడు. అమ్మ ఎన్నన్నా మాట్లాడదు. ప్రతి సాధింపును ఎంతో సమానంగా భరిస్తుంది. ఆటకోతిలా చేసి అమ్మను ఆడిస్తున్నాడు నాన్న.

అచ్యు:- అసలు ఎందుకొచ్చిందిరా?

రాము:- మూడువందల రూపాయలుపెట్టి జరీపువ్వులం సిల్కు చీర తెచ్చాడు రాత్రి...

అచ్యు:- తీసుకొస్తే ?

రాము:- ఆంత ఖరీదెందుకంది అమ్మ. అంతే. రాత్రి తెల్లవార్లు సాధించాడు. ప్రొద్దున్నే సాగనంపాడు.

అచ్యు:- రోజూ యింతేనా ?

రాము:- రోజూ కేకలు వేసేవాడు. కాని వెళ్ళిపొమ్మని ఎప్పుడూ అనలేదు. ఈ రోజున అలా అన్నాడు. అమ్మ వెళ్ళిపోయింది. ప్రొద్దుటనుంచి కాఫీలేదు.

అచ్యు:- (జేబులో రూపాయితీసి) నువ్వు ఆ ప్రక్క హోటల్‌కు పోయి కాఫీ త్రాగిరా. మీ నాన్నతో నేను మాట్లాడుతాగా—
(ఆచ్యుతం రూపాయి యిస్తాడు. రాము అది తీసుకొని బయటకు వెళతాడు. లోపలనుంచి పురుషోత్తం వెంటనే వస్తాడు.)

పురు:- ఏమిటి చెపుతున్నాడు వాడు ?

అచ్యు:- ఏదో చెప్పాడు. ఇప్పుడు మీ కెందుక్కావాలి ?

పురు:- (కూర్చుంటూ) నాక్కాకపోతే, నీక్కావాలా ? అంతా విన్నానులే, నువ్వు చెప్పకపోయినా నాకు గ్రహింపే. ఈ పిల్లల్నికూడా చాడీ కోర్లుగా తయారుచేసింది.

అచ్యు:- అత్తయ్య మహాచెడ్డదిగా కనిపిస్తుంది మామయ్య !

పురు:- నెమ్మదిగా అంటావేమిటి ? వంటవాడి విషయం ఒక్కటి చాలదు ? అంటుతప్పేలాలన్నీ అలాగే వుండిపోయాయి. అచ్చికి రోగం వచ్చిందట, రోగం. వెధవజాతి.

అచ్యు:- ఆడజాతేనా ?

పురు:- నన్ను మళ్ళీ ప్రశ్నించకు.

అచ్యు:- మా అమ్మకూడా ఆడదే మామయ్య !

పురు:- ఆడదే. అయితే ?

అచ్యు:- ఇంట్లోవున్న పిల్లలుకూడా ఆడవాళ్ళే అయ్యారు.

పురు:- నా పిల్లలు ఆడవాళ్ళుకాని, మొగవాళ్ళుకాని నీకెందుకు ?

అచ్యు:- వాళ్ళు అత్తయ్యకు పుట్టినవాళ్ళేగా ?

పురు:- ఏమిట్రా ?

అచ్యు:- ఎవ్వరయినా సరే ! జాతివిచక్షణ వచ్చినపుడు ఆడవాళ్ళు ఆడవాళ్ళే, మొగవాళ్ళు మగవాళ్ళే !

పురు:- నీ వుద్దేశం ?

అచ్యు:- ఆడవాళ్ళ విషయంలో మన, పర అనే భేదాలు ఆవలకు నెట్టి, జాతి దౌర్బల్యానికి, దేశహీనతకు, సంసార విచ్ఛిన్నానికి హేతు భూత మైన ఆచజాతినంతా వెలివేసి, మనం! పురుషులం! సర్వశక్తి సంపన్నులం మనమే! ఆడవాళ్ళకు ఆధారం మనమే! దేశానికి, జాతికి, కనీసం సంతానానికి కారణభూతులం మనమే అని ఇల్లు గుద్దుదాం. బాహ్యాంగా వెళ్ళి ప్రచారం చేద్దాం.

పురు:- ఫలితం ?

అచ్యు:- తన్నులు !

పురు:- (కోపంగా) అచ్యుతం ?

అచ్యు:- మామయ్యా !

పురు:- ఎవడ్రా తన్నేది ?

అచ్యు:- ప్రజ... ఇంటిలో కాఐట్టి నీ అవకతవక పనులు సరిపోతున్నయ్ వీధిలో ఆడవాళ్ళ యెదురుగా వెళ్ళి ఆ మాటలకు చూద్దాం.

పురు:- వాళ్ళని ఆనడానికి నా కేమవసరం ?

అచ్యు:- అత్తయ్య కాఐట్టి లోకువా ? భారత, రామాయణ కాలాలనాటి ఆడవాళ్ళ బైపుకు పుబ్రాలో పెట్టుకొని ఆవలకు తోలుతావా ? ఆత్తయ్య అమాయకురాలు కాఐట్టి సరిపోయింది.

పురు:- లేకపోతే ఎవర్తయితే ఏం చేస్తుందోయ్ ? ఒరేయ్ అచ్యుతం ! పెద్ద కబుర్లు చెపుతున్నావ్ కాని, రేబ్రొద్దున ఏ ఆడదయినా నీ పెండ్లా మయితే ?

అచ్యు:- నాతో సమానాధికారమిచ్చి సగౌరవంగా చూస్తాను.

పురు:- ఆప్రాచ్యుడా !

అచ్యు:- ఇంతకాలం అన్యాయంగా ఆడవాళ్ళను అంధకారంలో వుంచిన దానికి ప్రతిఫలంగా వాళ్ళ పాదాలు పట్టుకొని క్షమాభిక్ష కోరుకున్నా పాప మింకా సశేషంగా మిగిలివుంటుంది మనకి.

పురు:- (బిగ్గరగా) అచ్యుతం !

అచ్యు:- ఇప్పటికైనా కాస్త తమాయించి అత్తయ్యను రప్పించడం...

పురు:- మంచిది మామయ్యా ! చచ్చు కబుర్లు చెప్పక గౌరవంగా బయటకు వెళ్ళు.

అచ్యు:- నీ పట్టుదల విడిచిపెట్టవన్నమాట.

పురు:- నువ్వికక్కడనుంచి వెళ్ళాలి.

అచ్యు:- ఇక్కడ వుండమన్నా ఉండను. కాని...

పురు:- కానిలేదు, ఆర్డరాలేదు, కాలు బైటపెట్టు.

అచ్యు- వెళ్ళకపోతే నీవు చేసేదేమిటి ?

పురు:- దౌర్జన్యం సాగిస్తావా ? సరే ! అదీ నేను చూస్తా. (నడుం కదతాడు)

అచ్యు:- ఆడవాళ్ళ మీద చేయుటలేదుగా. (నవ్వి) మామయ్యా ! అత్తయ్యను బాధపెట్టడమనేది ఆర్థంలేని పని. ఆలోచించుకో. వస్తాను.

పురు:- (వెళ్ళే అచ్యుతాన్ని చూస్తూ) ఓరి పీకుగా ! ఎంతటి వాడివయ్యావ్ ! ఒరే రామూ! ఏమిట్రా యింతసేపుందు నువ్వు అచ్యుతంగాడితో చెబుతున్నది ?

రాము:- ఏమో జ్ఞాపకములేదు. (లోపలికి వెళతాడు)

పురు:- (వెళ్ళేవాణ్ని చూస్తూ) ఆ ! పొగరు. ఎంత నిర్లక్ష్యం (అని వెళ్ళి పోతూవుంటే, శతభిషం కాఫీ తెస్తాడు)

పురు:- ఎంత పెందలాడే చచ్చావురా ?

శత:- పచ్చి పుల్లలండి.

పురు:- బొగ్గులు పొయ్యి ఏర్పించిగా. దానిమీద తగలెయ్యలేక పోయావ్. (కాఫీ తీసుకుంటాడు)

శత:- కూరలేమీ లేవండి.

పురు:- శకునపక్షివిరా. అది చేయాల్సిందంతా చేసివెళ్ళింది. ఆ మంత్రాం గంలోపడి నవ్వుకూడా మాయముండా కొడుకు పవుతున్నావు. (కాఫీ రుచిచూచి) ఇది ఏ పదార్థమురా ?

శత:- నా కర్థమవటం లేదండి.

పురు:- నికే అర్థంకావటంలేదు. బాగానే వుంది !

శత:- మీ రన్నమాట అర్థం కావటం లేదండి.

పురు:- నవ్వు ఏడుస్తూ పొయ్యిమీద పెట్టిన (గ్లాసు చూపిస్తూ) ఈ ఆకారం గల పానీయం ఏమిటా ? అని; వాసనలేదు, రుచిచూస్తే చేదు... వేడిలేదు, తెలియకడుగుతాను, ఇది కాఫీయా ? టీయా ? కోకో ఆ ? ఓవల్టిన్నా ? లేక అన్నీ కలిపి చౌచౌగా తయారుచేసిన చావు ద్రావకమా ! (మళ్ళీ త్రాగి) ఛీ ! ఛీ ! దీనిలో ఏదన్నా నాభి ఏరి పొరపాటున నీ చెయ్యి పడవేయలేదుకదా ? ఆహా ! అది చెప్పి వెళ్ళిందేమోలే! ఒరేయ్ ఇష్టంలేకపోతే చెప్పేయ్. నా దుంపతెంచి ఇలాంటి పదార్థాంతో నా ప్రాణంమట్టుకు తీయకు.

శత:- రామ! రామ! అవేం మాటలండి?

పురు:- (గ్లాసు చూపుతూ) చూడు, నీ కళ్ళతో నీవే చూడు. యింత నల్లగా యేర్పించిందేం ?

శత:- ఇందాక మీరిచ్చిన కాఫీలో చక్కెరవేసి మళ్ళా కాచానండి.

పురు:- ఓరి శనిగా! అలా ఏర్పవేం? (గ్లాసు త్రాయరుమీద పెట్టి ఉసూరు మంటూ కుర్చీలో కూలబడి) తీసుకువెళ్ళరా, కాఫీ తీసుకువెళ్ళు! నిపేరుమీద ఇవాళ వుపవాసం చేస్తాను.

శత:- మళ్ళీ కాస్తాలెండి.

పురు:- చచ్చారులెండి (లేచి) వెళ్ళేటప్పుడు మీ అమ్మగారు ఏమన్నా చెప్పి వెళ్ళిందా? అబ్బే! ఏమీలేదులే. కాస్త ఇలా ప్రతి పనీ తగలేస్తే; అచ్యుతంగాడు ఏడ్చినట్లు తిరిగివెళ్ళి ఆమె పాదాలు పట్టుకుంటానని.

శత:- అమ్మగార్ని అనుకున్నవారు పాపాన్ని మూటకట్టుకు పోతారండి.

పురు:- నేనే నన్నమాట-అంత దుర్మార్గుణ్ణి. ఒసేయ్ ! తెలియకడుగుతాను- అది వున్నప్పుడు ఎప్పుడైనా ఇంత ఆధ్వాన్నంగా తగలేశావా కాఫీ ?

శత:- అమ్మగారే అన్నీ పైనుండి చూచేవారండి.

పురు:- నీపు క్రిందనుండి జీతాన్ని కాజేయటానికి ప్రవేశించావనుకుంటాను మా యింట్లో.

శత:- మీ కిష్టం లేకపోతే...

పురు:- వెళ్ళిపోతానఁటావా ? (ఆలోచిస్తాడు) అబ్బెబ్బె ! ఏదో పొరపాటు అయిందనుకో. కాస్త జాగ్రత్తగా పనిచేసుకోవాలిగాని చికాకుపడితే ఎటా ?

శత:- అమ్మగారు లేకపోతే ఈ యింట్లో ఒక్క క్షణంకూడా వుండలేనండి. అలాంటి అన్నపూర్ణమ్మను కాదని గెంటిస్తే కష్టాలేకాదు, అన్నం కూడా దొరక్క అవస్థపడతారండి.

పురు:- ఏమిటి? అన్నం వండవల్చుకోలేదేమిటి రోజు?

శత:- అంట్లు అలాగే వున్నాయండి.

పురు:- ఆ అచ్చికి వంట్లో ఏదో రోగ మొచ్చిందంట. దానిమొగుడు పెద్ద మొనగాడిలా వచ్చి...

శత:- వాడుకూడా తోముతాడు కదండి.

పురు:- వళ్లు మండుతూవుంటే వద్దు పొమ్మన్నాను.

శత:- ఇవాళ కడుపు మంటేనండి మనకి.

పురు:- శతభిషం! ఆ అంట్లు...

శత:- అంట్లుతోమేపని నా ప్రాణముండగా నేను చెయ్యను.

పురు:- బంగారంలా నేనే చేస్తాను, చూద్దువుగానిగా—

(కొంతదూరం వెళ్ళేటప్పటికి వీధిలోనుంచి వెంకటరమణ వస్తాడు)

వెంక:- బాబాయ్ !

పురు:- (వెనక్కి తిరిగి) వెంకటరమణా ఎంతకాలానికి చూశానురా! ఎలా నిలబడిపోయావే కొయ్యలా! కూర్చో... నాన్న, అమ్మ అంతా క్షేమమే కదూ !

వెంక:- అంతా క్షేమంగానే వున్నారు బాబాయ్ ! కాని మా ఆవిడకు కంట్లో నలుసుపడింది బాబాయ్. (కూర్చుంటాడు)

పురు:- ఎంతపని జరిగింది ?

వెంక:- బ్రహ్మాండమైన పని. నలుసు పడితే అది వూరుకుందా? దాని యిష్టమొచ్చినట్టు నలిపింది. కన్నంతా ఎర్రగా అయిపోయింది.

పురు:- తరువాత?

వెంక:- తెల్లవార్లు నిద్రలేకుండా గుడ్డతో ఆవిరిపెట్టాను. మా అమ్మ, నాన్న వచ్చి కోడలికి ఎలావుందో పంకరించాలా. బాబాయ్? నాకు ఒకలే బాధగా తోచిందిలే బాబాయ్ !

పురు:- అసలు కన్నెలాగుండిరా ?

వెంక:- నాక్షేమ వూరికే పోతుందా ? తెల్లవార్లు దానిగురించి నిద్రపోయానా బాబాయ్! పైన భగవంతుడు చూశాడు. తెల్లవారేటప్పటికి కన్ను మామూలుగానే అయిపోయిందిలే.

శత:- మీలాంటివారు వుంటే పెళ్ళాలు సుఖపడతారు. కాని...

పురు:- నువ్వు నోరుమయ్యావోయ్ ! (లేస్తాడు.)

వెంక:- నిజం బాబాయ్ ! అతను చెప్పినమాట్లో అబద్ధంలేదు. యింత ప్రాణంగా చూసుకున్నా, అది అంటుంది 'నన్ను పెళ్ళిచేసుకున్నాక అది మహా కష్టాల్లో పడిపోయిందిట, అసలు అది మంచిదేలే బాబాయ్, పైకి అలా అంటూ వుంటుంది. ఒక్కొక్కసారి పుట్టింటికి వెళ్ళిపోతా నని ఒకలే బెదిరిస్తుందిలే !

పురు:- పొమ్మనలేక పోయావు.

వెంక:- చచ్చిపోనూ ! అది నా కంటికి కనుపించకపోతే. నువ్వలా వెళ్ళావంటే, ఇలా రైలుక్రింద తలకాయ పెడతానంటాను. అంతే బాబాయ్ ఖడేరావ్, ఆగిపోతుంది. (లోపలకు చూచి) ఏదీ ? చిన్నమ్మ ఎక్కడా కనిపించదేం ?

పురు:- వెలుపలుంది.

వెంక:- అయితే బాబాయ్. మన భోజనాలేర్పాటు ?

శత:- నే నున్నానండి.

పురు:- ఇప్పుడే వస్తానుండు. (లోపలికి వెళతాడు)

వెంక:- నీ పేరేమిటోయ్ ?

శత:- శతభిషం.

వెంక:- (నవ్వి) శ...త...భి...షం. మంచి పేరేనోయ్ అయితే మనకు పెళ్ళయిందా ?

శత:- లేదండి. దాని గురించే...

వెంక:- అరె ! ఇంతమనిషి వున్నావ్..... ఆడది లేకుండా జీవిస్తున్నావా?

శత:- ఏం చెయ్యనండి?

వెంక:- గంతకుతగ్గ బొంత. ఎవ్వర్నన్నా ! చూచుకోవాలి శతభిషం. మా వూరులో ఒక అమ్మాయి వుంది, చేసుకుంటావా ? వయస్సుకు పెద్ద దనుకో. పేరు ఆశ్వని. ఇద్దరి పేర్లు నక్షత్రాలే. కాబట్టి తారాబలం బాగుంటుందని తోస్తుంది. ఆమెకూడా వంట బాగానే చేస్తుంది. మెత్తని మనస్సు. ఏం చెప్పినా కాదనదు ఆమెను పెండ్లిచేసుకుంటే ఇద్దరూ కలసి భోజనహోటలు పెట్టొచ్చు. ఏమంటావ్ ?

శత:- ఆమె వయస్సు ఎంత వుంటుందండి ?

వెంక:- ఆఁ...ఎంతా ? ఒక్కటితక్కువ యాభై. స్థిరమైన మగ దిక్కులేక మహా చికాకు పడుతోంది. చూడమంటే మాట్లాడుతాను (లోపలకు చూచి) బాబాయ్ !...

శత:- వస్తారులెండి. అంట్లు తోమడానికి వెళ్ళారు.

వెంక:- ఛీ ! ఛీ ! బాబాయ్ అంట్లు తోముతున్నాడా ?

శత:- ఆడదాన్ని కాదన్నవాళ్ళకు అదేగతి పడుతుందిలెండి !

వెంక:- ఆడదాన్ని కాదనడమేమిటి ?

శత:- మీ చిన్నమ్మగార్ని కోపమొచ్చి పుట్టింటికి పంపేశారుగా !

వెంక:- ఆరి బాబాయ్ ! వెఱపలుందని చెప్పావ్. శతభిషం, ఆసలు ఎందుకు పంపేశాడఁటావ్ ? చిన్నమ్మ చాలా మంచిదే.

శత:- ఒళ్లు బలిసి, కళ్లు మూసుకుపోయి !

వెంక:- మా యావిణ్ని నా జన్మలో ఆలా అంటానా ? అంటే మళ్ళీ నా కంటికి కనిపిస్తుందా ?

(రాముడు లోపలినుంచి వస్తాడు.)

వెంక:- రాముడేనా? కాస్త సాగావే ?

రాము:- ఎప్పుడొచ్చారు?

వెంక:- ఇప్పుడే. ఒరే రాఘుడూ! మన భోజనం ఏర్పాటు ఇవాళ కాస్త కష్టంగా వుండేటట్టుఁదే... మూ ఆవిడ సీసు తెలుసుగదూ ! మన భోజనం సంగతి ఆవిడకు తెలుసు. శతభిషం ! కాస్త కడుపులో కంగారు లేచింది. ఏదో మీరంతా కాపాడాలి. ఇలాఁటి ఆపద సమయంలో మా ఆవిడ వుంటేనా...

రాము:- కాపాడి, రక్షించేది!

వెంక:- నీకూ కూడా తెల్సుగా రాఘుడూ!

రాము:- ఆట్టే మాట్లాడకండీ.

వెంక:- మా ఆవిడ ఒక్కనాటికి కూడా ఆలాంటిమాట అనదు. ఇంతకూ మన భోజన ఏర్పాటు ఏమన్నా జరిగేనా?

రాము:- మా అమ్మ యింట్లో లేదు.

వెంక:- శతభిషం ఉన్నాడుగా?

రాము:- వాడి జన్మలో ఏ పనీ కాదు.

వెంక:- కార్యక్రమం ఏమిటి?

రాము:- కాఫీహోటల్లో చూచుకోవడం.

వెంక:- అంతేనా ?

రాము:- యస్.

వెంక:- ఇంగ్లీషు నేర్చుకున్నావ్. మా ఆవిడకూడా వచ్చున్నే. నన్ను ఎ. యస్. యస్., యాస్ అని అప్పుడప్పుడు అవసరార్థంగా పిలుస్తూ వుంటుంది.

రాము:- ఏముందోయ్! మీ ఆవిడ్ని గురించి యాకరవు పెట్టమని ఎవ్వరూ ఏడ్వటంలేదు. కావలిస్తే కామ్‌గా కూర్చోండి, కాదంటారా వెళ్ళి పొండి.

వెంక:- మా ఆవిడ ఏ చుట్టాన్ని ఈ విధంగా మర్యాద చేయలేదు, చేయ బోదు, చేయదు.

రాము:- మీ ఆవిడ సంగతి ఎవరి క్కావాలండి?

వెంక:- నాకు, సర్వ ప్రజలకు, ప్రపంచానికి - పరమాత్మ అనే నిర్వికార నిరంజన రూపంలో మా ఆవిడ ఆత్మకూడా ఒక అంగా సంధూ తమే.

రాము:- మీరు మాట్లాడక ఊరుకొంటారా, ఊరుకోరా,

వెంక:- భోజనయేర్పాట్లు చేస్తే సరి.

శత :- నేను చేసాలెండి.

వెంక:- అయితే కాలక్యత్యాలు తీర్చుకువస్తాను. శతభిషం! పెద్ద కాల్వలో నీళ్లు పరిపుభ్రమైనవేనా? రాముడూ! మా ఆవిడుంది చూశావ్, పెద్ద కాలవంటే శలే భయంలే.

రాము:- మీరు వెళతారా ? వెళ్ళరా?

వెంక:- భోజనయేర్పాటు చేస్తారన్నారుగా. వెళ్లి తప్పకుండా మళ్ళి వస్తాను. (వీధిలోకి వెళతాడు)

రాము:- (వెళ్ళేవాణ్ణి చూస్తూ) తిండిపోతు.

శత :- భగవంతుడిచ్చిన అకలి.

రాము:- నీకేమన్నా పెళ్ళాళ పెట్టాడేమిటి?

శత :- పెండ్లామంటే అందరికీ ఆశే గదండి, బాబుగారికి తప్ప.

రాము:- ఏడ్చావులే. ఆ బెల్లాయికిచ్చిన కాఫీ మవ్వు కాచిందేనా ?

శత :- బాబుగారు కాఫీ పొడరు కలిపిచ్చారు.

రాము:- నువ్వు కాచి పిల్లలమొహాన్ని తగలేశావ్. అదే, తాగనక్కర్లేదూ? దాని బడికి వేళయింది. యేడుస్తూ కూర్చుంది. కాఫీ లేదు, గీఫీలేదు.

శత :- నన్నేం చెయ్యమంటారు ?

రాము:- నిన్ను చెయ్యమనక యెవ్వరిని చెయ్యమంటాను ! ఎందుకున్నావ్ యింట్లో? నాకు స్కూలుకు టైము కావస్తూంది. ఇంతవరకు పొయ్యిమీద పాత్రయెక్కలేదు. వెధవయిల్లు, వెధవ పనులూను.

శత:- అలా అని మీ నాన్నగారిదగ్గర అనండి.

రాము:- అంటే? పోనీ, నేనలా అన్నానని నువ్వు చెప్పరాదూ ?

శత:- నేను చాడికోరును కాదండోయ్ !

రాము:- యజమానురాలు ఇంట్లోంచి వెళ్ళిపోతూంటే, ఏడుస్తూ కూర్చునే వాడవు, అంతేగా ?

శత:- అగమంటే బాబుగారితో తగాదా.

రాము:- అందుకాయనకు తాళం వేశావ్. ఇద్దరూ కలిసి అమ్మను సాగ నంపారు.

శత:- రాముగారూ ! అన్యాయంగా మాట్లాడితే పడేవాణ్ణి కాదు.

రాము:- ఇంట్లో అన్యాయం జరుగుతూవుంటే చూస్తూ వూరుకునేవాడివేగా !

శత:- ఏమన్నా అనడానికి నాకేం సంబంధం ?

రాము:- ఏం సంబంధం లేకుండా యింట్లో ఎందుకున్నావ్ ? నువ్వు కాదంటే నాన్నగారు ఆ ధైర్యం చేయగలరా ? ఆ మాత్రం బుద్ధి వుండక్కర్లేదూ ?

శత:- మాటలు జాగ్రత్తగా రానివ్వండి.

రాము:- ఆ మాటన్నావంటే పళ్ళు రాలగొడతాను (మీదకు వెళ్ళబోతాడు.)

(పురుషోత్తం లోపలనుంచి వస్తాడు. రాము వెళ్ళిపోతాడు.)

పురు:- ఏమిట్రా పేలుతున్నాడు వాడు?

శత:- ఏమీలేదు.

పురు:- నువ్వు దాస్తేమాత్రం దాగుతుందా? అంతా విన్నాను. అంతా ఏకమై, ఆఖరికి వంటపాత్రలు తోమించే గతికి కూడా తీసుకొచ్చారుగా. ఇక మీ యిష్టం. కానివ్వండి.

శత:- బాబుగారూ ! నేను వంట ప్రారంభించినది లగాయతు యింతవరకు చాలా ఇళ్ళు చూశాను. నాకెన్నో అనుభవాలున్నాయ్. కాని, మీవంటి అనుమానపు మనిషిని, అమ్మగారంత మంచి తల్లిని నేను ఏ కుటుంబములోను చూడలేదు.

పురు:- ఏమంటున్నావ్ ?

శత:- నిజమే చెపుతున్నానండి. వెళ్ళిపోతూ అబద్ధమాడడమెందుకు !

పురు:- వెళ్ళిపోతున్నావా ?

శత:- అవునండి. మొత్తం పదిహేను రోజుల జీతం పడెయ్యండి. ఈ ఇంట్లో వుండను.

పురు:- (కోపంగా) నేను ఒక్క కానీ యివ్వను. (కూర్చుంటాడు) ఇంటిలో ఆడది లేనిసమయంలో ఈ విధంగా దగా చేస్తావా? సరే! నీ యిష్టం, వెళ్ళిపో. ఆపుచేస్తే అడుగుదువుగాని. నేను మాట అననే అనను, అన్నానా అంతే.

శత:- జీతం యివ్వరన్నమాట ?

పురు:- చస్తే చిల్లి కానికూడా యివ్వను.

శత: అది మీకు ధర్మంగావుంటే సరే. (లోపలికి వెళతాడు)
(పురుషోత్తం లోపలకు తీవ్రంగా చూస్తూవుంటాడు. చిరాకుగా మధ్య మధ్య తిరుగుతూ వుంటాడు. తువాలు వేసుకుని చిన్న సూటుకేసుతో శతభిషం వీధివైపుకు వెళ్ళిపోతూ వుంటాడు. పురుషోత్తాం లేస్తాడు.)

పురు:- శతభిషం !

శత:- (తిరిగి చూస్తాడు.)

పురు:- వెళ్ళిపోదుగాని... ఒక్కమాట. నీ డబ్బు నాకక్కరలేదు. ఆది కూడా వెళ్ళిపోయింది. వెళ్ళిపొమ్మన్నానే అనుకో, తిరిగివస్తే నేను కాదంటానా ? నాకీ యింట్లో అధికారముంది, నేను వెళ్ళనంటే నేను నొరెత్తుతానా ? అది యిప్పుడూ రావాలని నేను అనడం లేదు.

శత:- అమ్మగారు తనకుతానై ఎప్పుడూ రాదు. ఇన్ని సంవత్సరాలు అమ్మ గారితో వుండి ఆవిడ గుణమేమిటో మీరు తెలుసుకోలేక పోయారు. అలాంటి ఆపిదతో కాపురం చేయించుకోవడం చేతగాని మీకు లోకంలో సుఖంగా బ్రతకడం గూడా చేతగాదన్నమాట నిజం... వెళతానండి.

పురు:- వెళతావా ? నే వెళ్ళనివ్వను.

శత:- ఒక్క నిముషంగూడా ఈ ఇంట్లో వుండను.

పురు:- ఎలా వెళతావో నేనూ చూస్తాగా ! (సూటుకేసు లాగుతాడు)

శత:- నా కిష్టంలేనప్పుడు నన్నాపు చెయ్యడానికి మీరెవరు ?

పురు:- నీ యజమానిని నేనే.

శత:- పుస్తికట్టిన పెళ్ళాన్నికాదు.

పురు:- నిన్ను నమ్మకొని దాన్నికూడా విడిచిపెట్టాను. (చెయ్యి పట్టుకొని) శతభిషం! యింతమంది పిల్లలతో నే ఒక్కడిని వేగలేను. నీక్కావలంచే జీతమెక్కువ చేస్తాను. నీకు కష్టం కలగకుండా ప్రవర్తిస్తాను. నీ కాళ్ళుకూడా పట్టుకొని ప్రార్థిస్తున్నాను.

శత:- ఎంతమాటండి, వెళ్ళనులెండి,(తిరిగి సూటుకేసుతో లోపలికివెళతాడు)

రాము:- (వస్తూ) వెళ్ళేవాణ్ణి అంత బ్రతిమాలడ మెందుకు ?

పురు:- మీరంతా మాడిచస్తారని.

రాము:- వాడిగురించే బ్రతుకుతున్నామా ?

పురు:- వాడు లేకపోతే వంట ?

రాము:- వంటకోసం, వాడు వండిన తిండికోసం వాడి కాళ్ళు పట్టుకొని బ్రతిమాలే బదులు చావడం మంచిపని.

పురు:- రామూ !

రాము:- అవసరానికి జీతం తీసుకుంటూ కాస్త అన్నం పెట్టే నౌకరుగురించి మీరింత బాధపడుతూ. అంత నీచమైన బాధ్యత తీసుకుండే, తన

జీవితాన్ని మన సుఖానికి తాకట్టుపెట్టి దుఃఖాన్నికూడా సంతోషంగా స్వీకరించిన అమ్మకు మనమిచ్చే ప్రతిఫలం, 'యింట్లో ఒక్కక్షణం వుండొద్దు వెళ్ళిపో' యింతేనా ?

(రాముడు త్వరగా యింటిలోకి వెళతాడు. పురుషోత్తం కుర్చీలో కూలబడతాడు. ఆలోచిస్తూ వుంటాడు. వీధిలోంచి వెంకటరమణ వస్తాడు.)

వెంక:- బాబాయ్ ?

పురు:- (వెర్రిగా చూస్తూ వుంటాడు.)

వెంక:- భోజన ఏర్పాటు అయిందా ?

పురు:- ఇంకా లేదు.

వెంక:- మా ఆవిడుంది చూశావ్. పంటలో మహా ఎరుక్కైంది బాబాయ్! అయితే చిన్నమ్మ పుట్టింటికి వెళ్ళిందటగా ?

పురు:- వెళ్ళింది.

వెంక:- వెళ్ళిందా ? నువ్వు వెళ్ళగొట్టావా ?

పురు:- (కుర్చీలోంచి విసురుగా లేచి) ఏదో వేళాను. అదంతా నీ కనవసరం.

వెంక:- అందరికి అవసరమే బాబాయ్. మా యావిడుంది చూశావ్ బాబాయ్, ఎవ్వరికీ మంచిదికాదు. నాకుంది చూశావ్, అది దేవత. నా తిండి కోసం అది బాధపడి భోజన ఏర్పాటు చేస్తుంది. చెప్పడానికి వీల్లేదు. అప్పుడప్పుడు విసుగుదలతో ఏమన్నా అంటుందే అనుకో. మనం గప్‌చిప్. అంతా మళ్ళీ అరగంటలో తయారు ! బాబాయ్, ఆడవాళ్ళ గుణం కనిపెట్టి మగవాడు సంచరిస్తే మోక్షం సంసారంలోనే వుంది బాబాయ్ !

పురు:- మీ యావిడ్డి కోపమొచ్చి యింట్లోంచి వెళ్ళిపొమ్మన్నావే అనుకో, అప్పుడేం చేస్తుంది ?

వెంక:- ఆఁ ! అంతపనే బాబాయ్ ! అన్నాను అంటే ఈ జన్మలో దాని మొహం చూపించదు, దాని మొహం చూడకపోతే నేను బ్రతకను బాబాయ్ !



పురు:- వెళ్ళమంటే వెళ్ళనని ఎదురుతిరగడం గాని, ప్రాధేయపడ్డం గాని ఏదో జరగాలిగా ?

వెంక:- చీ ! చీ ! ఏ ఆడదీ అలా చేయదు బాబాయ్ ! ఇంతకూ చిన్నమ్మ చాలా మంచిదేగా ? ఎందుకు వెళ్ళిపొమ్మన్నావ్ బాబాయ్ !

పురు:- వెళ్ళిపొమ్మన్నామ.

వెంక:- ఛా ! చాల తప్పుచేశావ్ బాబాయ్ !

పురు:- (ఇటూ అటూ చూచి) తప్పే అంటావా ?

వెంక:- ముమ్మాటికి తప్పే బాబాయ్.

పురు:- మరి మనం చెప్పినపని కాదని ఎదిరించడం దాని తప్పు కదూ ?

వెంక:- బాబాయ్ ! నీ కిష్టంలేని పని నేను చెయ్యమంటే నువ్వు చేస్తావా ? ఆడదికూడా అంతేగా–

పురు:- ఆడది మగాడు చెప్పినట్లు వినొద్దూ ?

వెంక:- వినే సంగతి వింటారు. వినని వినరు. ఆడవాళ్లు ఏదైనా చెబితే మనం కూడా అంతేగా బాబాయ్ ! ఆడది తక్కువనీ నీవు ఎక్కువనీ అనుకుంటున్నట్లున్నావ్. అబ్బే ! అక్కడే వస్తుంది చిక్కు బాబాయ్ ! ఎవళ్ళూ అనుకోకూడదు. ఆమాట అనుకున్నామా వచ్చిందే చిక్కు. మా యీవిడకూడా యిదే జబ్బు - మగాళ్ళకంటే ఆడవాళ్ళే గొప్పవాళ్లని. అందుకు అవసరార్థంగా అలాగేకానీ అంటాను. నేను గొప్ప, నేను గొప్ప అనుకుంటూ ఉంటే సంసారం ఎలా సాగుతుంది బాబాయ్ !

పురు:- (వుద్రేకంగా అతని చేయిపట్టుకొని) నువ్వు నాకంటే ఎంతో తెలివైనవాడవురా వెంకటరమణా !

వెంక:- అబ్బే ! మా ఆవిడ ఒక్కనాడుకూడా ఇలాంటి పొరపాటు మాట అనలేదు.

(రాము లోపలనుంచి కంగారుగా వస్తాడు.)

రాము:- నాన్నా ! బేబీ మంచం మీదనుంచి పడిపోయింది. బిగిసిపోయింది. మాటాడ్డం లేదు.

(అచ్యుతం కూడా వస్తాడు.)

పురు:- (భయంగా) ఆ ! ఎంతపని జరిగింది రామూ ! వెళ్ళి డాక్టర్ని తీసుకురా. వెంకటరమణా ! మనస్సు యిప్పుడేం బాగుండలేదు. ఇదుగో, యీ రూపాయి తీసుకువెళ్ళి నా మర్యాద దక్కించు.

వెంక:- దీనికింత పట్టుబలవంత మెందుకు బాబాయ్. రూపాయి యిచ్చావుగా, హాయిగా హోటల్‌కువెళ్ళి భోజనం చేసి వస్తాను.

(పురుషోత్తం లోనికి వెళతాడు. వెంకటరమణ వీధిలోకి వెళతాడు)

అచ్యు:- రామూ ! డాక్టరు ఆక్కరలేదు. (రామూ, అచ్యుతం లోనికివెళతారు)

(అచ్యుతం, పురుషోత్తం వస్తారు.)

అచ్యు:- ఆడదాని ఆధారం లేకుండా మగవాడే సంసారాన్ని చక్కబెట్టుకోవాలంటే, యింత చక్కగా వుంటుంది వ్యవహారం !

పురు:- అచ్యుతం !

అచ్యు:- ఎందుకు !

పురు:- ఇప్పుడు మనస్సేమీ బాగుండలేదు. నీవు మాట్లాడావంటే ఏమీ మాటదక్కదు.

(రాము వస్తాడు)

రాము:- మనస్సనేది మీ కుంటే !

పురు:- రామూ !

రామ:- కోపమెందుకు నాన్నా! కాస్త కళ్ళు తెరచి చూడు. చెల్లాయికి యింత వరకు కాఫీలేదు. బేబీ మాటలేక పడిపోయింది. నాకు స్కూలుకు టైం కావచ్చింది. యింతవరకు ఎవరికీ భోజనంలేదు. అమ్మకు బదులు శతభిషంగాడున్నాడు కాబట్టి మీ పుభయులు క్షేమంగా వుండగలిగి. చెల్లాయిని తీసుకొని నేను అమ్మ దగ్గరకు వెళ్ళిపోతాను.

పుర:- వెళ్ళిపోడానికి నీ యిష్టమేచ్చిందిక్కద.

రాము:- అమ్మను పొమ్మనడానికి మీకు అధికార ముందనుకుంటాను.

పురు:- వుంది, వుందిరా. మళ్ళి మాట్లాడితే పళ్ళు రాలగొడతాను.
(మీదకు వెళ్ళబోతాడు. అచ్యుతం ఆపుచేస్తాడు. రాముడు లోనికి వెళతాడు)

అచ్యు:- మామయ్యా ! ఏమీ తెలియలేదనుకుంటున్న రాము కూడా నీకంటె తెలివైనవాడే. అమ్మలోవుండే విలువ వాడికి బాగా తెలుసు. వాడు వెళ్ళడం గురించి నీవు ఆపుచెయ్యడం అనేది తెలివైన పనికాదు.

పురు:- నిన్ను మధ్యవర్తిగా మా యింటికి తగలడమని, వెధవ తీర్పులు తీర్చమని యిక్కడెవ్వడూ పడి ఏడ్వలేదు. ఆవలకు వెళ్ళిపో !
(సూటుకేసుతో శతధిషం కోపంగా వస్తాడు.)

శత:- చేతగాని వెధవని ఈ యింట్లోకి చాకిరీకి రావడమేమిటి ?

పురు:- ఎవడ్రా నిన్నన్నది ?

శత:- (సూటుకేసు పడేసి, నమస్కారం పెట్టి) మీకు దణ్ణం పెడతాను. నన్నాపుచెయ్యవద్దు. చేతులో శక్తి వుండగా కుర్ర కుంకలతో కూడా మాట అనిపించుకోమని భగవంతుడు నా నొష్టనేమి వ్రాయలేదు. దబ్బిస్తున్నారు, పని చేయించుకుంటున్నారు. మాటలంటే ఎవరు పడతారండి ! (రాము వస్తాడు)

రాము:- నువ్వు అనవసరంగా వాగకు. మంచివాణ్ణి గాబట్టి మాటల్తో విడిచి పెట్టాను.

శత:- లేకపోతే ?

రాము:- పళ్ళు రాలగొడతాను. (మీదకు వెళ్ళబోతాడు)

పురు:- రామూ !

శత:- చూచారా ?

రాము:- బండి తీసుకురావడానికి వెళుతున్నాను.

పురు:- ఎందుకు ?

రాము:- పిల్లల్ని అమ్మదగ్గరకు తీసుకువెళ్ళడానికి.

పురు- తీసుకు వెళ్ళటానికి వీల్లేదు. ఇది నా యిల్లు. నా బిడ్డలపై నా కధికారముంది. నేను చెప్పినట్లు వినాలి వ్యతిరేకించారా రక్తాన్ని కళ్ళ చూస్తాను. వెళ్ళవేం లోపలికి ?

అచ్యు:- మామయ్యా !

పురు:- ఎవరు చెప్పినా నా పట్టుదలకు భిన్నంలేదు. ముందు లోపలికి వెళ్ళరా !

రాము:- వెళ్ళను. బండి తీసుకువస్తాను. (వెళుతుంటాడు)

పురు:- ఆఁ ! ఆగు ! (చెంపపై కొడతాడు. పిల్లలు ఏడుస్తుంటారు. అచ్యుతం, శతభిషం నివ్వెరపడి చూస్తారు)
(పురుషోత్తం కొట్టిన కొంతసేపటికి తేరుకొని కళ్ళనీళ్ళతో)

పురు:- మీరెవ్వరూ ఎక్కడకు వెళ్ళొద్దు... నేనే వెళతాను. నా తప్పును ఒప్పుకుంటాను... నా జానకిని రమ్మని ప్రాధేయపడతాను. ఆడది తక్కువని అహంభావంతో చూస్తే నాలాంది వాళ్ళకు ఇలాంది అనుభవం కావల్సిందే ! ఆడదిలేని సంసారం నరకంతో సమానమని గుర్తించాల్సిందే—
(రాము కళ్ళనీళ్ళతో ఆనందంగా చూస్తాడు. పురుషోత్తం వీధిలోనికి వెళతాడు)

(తెర మెల్ల మెల్లగా జారుతుంది)

నా బాబు

రచన:

డా. కొర్రపాటి గంగాధరరావు

పాత్రలు

1. శ్రీనివాసం
2. చైతన్యం
3. బాబు (1)
4. బాబు (2)
5. నర్వయ్య
6. ఇనస్పెక్టరు
7. పోలీసు
8. రాధ

ఒక సామాన్య గృహంలో వక సావిడి, కుడివైపు ద్వారం బయటికి దోవ. ఎడమవైపు ద్వారం లోపల గదులకి దోవ. గదివెనక గోడకి కుడివైపున వక రాధాకృష్ణుల బొమ్మ. మధ్యలో వక స్త్రీ చిత్రం. (పెద్ద enlargement). ఎడమవైపున వక రంభా రావణాసురుల బొమ్మలుంటాయి. ఈ బొమ్మకి క్రింద కాస్తకుడివైపుకి వక చిన్న టేబుల్ వుంటుంది. దానిమీద వక పాత Table cloth వుంది. టేబుల్ ప్రక్కగా ఒక చిన్న కుర్చీ వుంది. రాధాకృష్ణం బొమ్మ క్రింద భూమిమీద వక కంచు గ్లాసు పడవేసివుంది రంగానికిముందు కుడివైపున మరో చిన్న stool వేసివుంది. దానిమీద వక తోమని కంచుగ్లాసు. దానికుడివైపున మరోగ్లాసు క్రింద పడవేసివున్నది. గదినిండా పాత కాగితాలు చెల్లాచెదరుగా పడవేసివున్నై. తెర ఎత్తగానే శ్రీనివాసం వక మధ్య వయస్కుడు-దాదాపు 45 సం॥ల వాడు, రంగాన్నంతా కలియచూస్తూ ఏదో దిగులుగా తిరుగుతూ కనిపిస్తాడు. జుబ్బా, పంచ ధరించివున్నాడు. క్రింద పడవేసివున్న కాగితాలు ఏరుతూ టేబుల్ దాకా వెళ్ళాడు. ఆ Table ను పరకా యించి చూసి, విసుక్కుని "రాధా...రాధా...ఇట్లారా వక్కసారి" అంటాడు.

(రాధ వచ్చింది చేతిలో వక గుడ్డ పుచ్చుకుని)

శ్రీనివాసం:- (వెనకవున్న Table cloth మొ॥ నవి చూపిస్తూ) ఇవన్నీ యింకా తియ్యలేదేం. తీసెయ్యి.

(రాధ ఆ Table cloth తీస్తుండగా)

ఆ? ఆ దీనిమీద ఆ Table cloth వెయ్యి- ఆ-చూడూ- కాఫీ filter వేశావా-లేదా? (రాధతలవూపగా నవ్వి) వేశావుగదా చూడూ- కాఫీ యిప్పుడే కలపకు. వాడు వచ్చిన తర్వాత కలపచ్చు. ఇంకా ఆరగంటసేపు వుందిలే. ఆరగంట! చాలాసేపు వుంది.

(ఏదో ఆలోచనలో మునిగి తెప్పరిల్లి)

ఆ; యీలోపున ఆ మధ్య గదీ-వెనక గది కూడా సర్దు, ఫో...

ఆ... వెన్నీళ్ళు కాగేయా?

(రాధ 'ఆ...' అని తల వూపుతుంది)

ఆ! సరే! ఫో! ఆ Table cloth తెచ్చియిచ్చి వెళ్ళుత్వరగా.

(రాధ లోపలికి వెళ్ళింది)

(శ్రీనివాసం మధ్యకొచ్చి (గోడ దగ్గరికి) మధ్యలో పైగావున్న enlargement చూసి నిట్టూర్చుతూ నుంచున్నాడు. ఇంతలో చైతన్యం-అతని యీడువాడే బయటనుంచి వచ్చి శ్రీనివాసం వెనగ్గా నుంచుంటాడు. శ్రీనివాసం యితన్ని చూడకుండా లోపలికి వెళ్ళిపోతాడు. చైతన్యం వెనక కుర్చీలో కూర్చుంటాడు. శ్రీనివాసం వక పడకకుర్చీతో వచ్చి stage Rt. side కి సరాసరి వెళ్ళి అక్కడవేస్తాడు. పడకకుర్చీ అడ్డంగా వుండటంవల్ల చైతన్యాన్ని చూడలేదు. అక్కడనుంచి ముందుకి నడిచి ముందువున్న బల్లమీద గ్లాసు తీసి చూసి) రాధా, ఇది తోమకుండా యిక్కడే వుంచావేం?

(రాధ వస్తుంది)

ఇట్లా నల్లగా అసహ్యంగావుంటే బాగుంటుందా చెప్పూ. వాడిల్లాంటివి ఇట్లోవుంటే అసహ్యించుకోడూ? వాడూ మనలాగానే అను కున్నావా యేం? ఇంద. తోముకురా.

(గ్లాసు రాధకివ్వగా తీసుకు వెళ్ళిపోయింది)

(ఆ Table వెనగ్గావున్న మరో గ్లాసుచూసి)

సరే; ఇక్కడొకటివుంది. (అంటూ అది తీసుకుని లోపలికి వెళ్ళ తాడు. చైతన్యం వెనక గోడదగ్గర పడవేసివున్న వక గ్లాసు తీసుకు వచ్చి ముందు Stool మీదపెట్టి వెనక్కివెళ్ళినుంచుంటాడు శ్రీనివాసం ఒక Table cloth తో వచ్చి ముందు Stool మీద గ్లాసుచూసి తెల్లబోయి, తను తెచ్చిన flower Vase Stool మీద పెట్టి ఆ గ్లాసు తీసుకుని లోపలికిపోతాడు చైతన్యం flower vase తీసి వెనక table మీద పెట్టి, తను వెనక్కి వెళ్ళి వుంటాడు. మళ్ళీ శ్రీనివాసం వచ్చి ముందు Stool మీద Vase లేకపోవటం చూచి తెల్లబోయి తలగోక్కుని Table cloth తీసుకుని వెనక Table దగ్గరికెళతాడు. చైతన్యం శ్రీనివాసం వెనగ్గా తిరిగి తప్పు కుంటాడు. శ్రీనివాసం ఆక్కడ flower Vase వుండటంచూచి ఆశ్చర్యపోతాడు, ఆక్కడ Table మీద cloth వేసి, Vase

దానిమీదవుంచి అంతా బాగుందని సంతృప్తిపడుతూ తనచుట్టూ తానుతిరుగుతూ గది అంతా కలియచూస్తాడు. చైతన్యం అతని వెనకే తిరుగుతూ కనబడకుండా తప్పించుకుంటుంటాడు.]

శ్రీనివాసం:- (తిరుగుతూ) ఆ. ఆ. అంతా బాగుంది.

(అని తనలోతాను నవ్వుకుంటాడు. రాధ తిరిగివస్తుంది)

Decoction తయారయిందా? ముందే కలపకు. వాడు రాంగానే కలిపి యిస్తూగాని- ఆ. చూడూ. ఆ మధ్య గదిలో పట్టెమంచం తెచ్చివెయ్యి.

(రాధ చైతన్యంవంక సొజ్జచేస్తూ మాట్లాడబోయింది' కాని... అది తననే అనుకుని...)

శ్రీనివాసం:- నువ్వు మాట్లాడకు, మంచం మధ్య గదిలోనే వెయ్యి, మరేం పర్వాలేదు. (మళ్ళీ మాట్లాడబోగా) నేనంతా ఆలోచించాగా, అక్కడే వెయ్యి. వెళ్ళు. (వెళ్ళబోగా) ఆ వేరే పెరుగు పోయించుకున్నావా! ఆ? (రాధ పోయించుకున్నానని తలవూపుతుంది) అహా, అయితే ఆ కాఫీ కుంపటిపిన వేరే అత్తెసరు వేసివుంచు. వాడు ఎప్పుడు భోంచేస్తాడో ఏమో- ఎందుకైనా మంచిది..... ఊ ఊ పో! త్వరగా పో! వచ్చేస్తాడు. ఇంకొక్క 20 నిమిషాల్లో వచ్చేస్తాడు- 20 నిమిషాల్లో... [రాధ వెళ్ళింది. తర్వాత తన జేబులోంచి వక ముడేళ్ళ పిల్లవాడి లాగూ చొక్కా తీసిచూసుకుంటాడు. గుండెల కద్దుకుంటాడు. అది జాగ్రత్తగా మడిచి జల్లిమీద పెట్టబోతాడు- వేరేవైపు చూస్తూ పరధ్యానంగా. చైతన్యం చెయ్యిదాచి దాన్ని అందిపుచ్చుకుంటాడు. అయినా అది గమనించకుండా శ్రీనివాసం ఏదో జ్ఞాపకము వచ్చి లోపలికి పోతాడు.]

[కాసేపటికి రాధ వస్తుంది]

రాధ:- మిమ్మల్నింకా చూసినట్టులేదే!!

చై:- లేదు. ఎక్కడో మతి తాకట్టు పెట్టినట్టున్నాడు.

రాధ:- ఏమె. పొద్దుట్నించీ అల్లాగే వున్నారు. ఆ. నిన్న గూడా అల్లాగే వున్నట్లున్నారు- ఆహ కాదండీ మొన్న-ఆసలు మొదలు.

చై:- కాదులే! ఆటుమొన్న కూడా యిల్లాగే వున్నాడు.

రాధ:- ఆయితే ఏమె. పొద్దుట్నించీ యిల్లు సర్దటమే సరిపోయింది. ఈ రైలుకి ఎవరో వస్తారట. చాలా గొప్ప వారులావుంది. అందుకని యిల్లంతా శుభ్రంగా వుంచాలట.

చై:- నాకేం చెప్పలేదే! సాధారణంగా నాతో ఏదీ చెప్పకుండా వుండదు. (లోపల్నించి ''రాధా రాధా'', అని శ్రీనివాసం పిలుస్తాడు)

రాధ:- పిలుస్తున్నారు. వస్తా (వెళ్తుంది)

చైతన్యం కాసేపాగి...వకసారి లోపలికి చూస్తాడు. పువ్వులు పట్టుకు వస్తున్న శ్రీనివాసాన్నిచూసి Vase తన నెత్తిన పెట్టుకుని మధ్యలో కూర్చుంటాడు. శ్రీనివాసం వచ్చి ఆ Vaseలో పూలగుత్తులు పెట్టి పైకి చూస్తూ (గదిఅంతా) బాగానే వుంది యిప్పుడు (ముందున్న స్టూలు దగ్గర కెళ్ళి) ఇది యిక్కడెందుకూ? అక్కర్లేదు. (అని తీసి వెనక్కు పెడతాడు. యిలోగా చైతన్యం లేచి Vase Table మీదపెట్టి తప్పుగుంటాడు. శ్రీనివాసం వెనక Table దగ్గరకెళ్ళి Vase చేతిలోకి తీసుకుని ''ఇది నేని క్కడ పెట్టానా?'' అని అనుమానిస్తుండగా చైతన్యం దగ్గరకొచ్చి చెయ్యి దాపుతాడు. అతని చేతిలో పరధ్యానంగా పెట్టి) ఇది నేనిక్కడ పెట్టానా (అని గొణుగుతూ కాస్త తిరిగి, చైతన్యాన్ని చూసి) నువ్వెప్పుడు వచ్చావ్?

చై:- వచ్చిచాలాసేపయిందిలే. కాని ఏమిటిది యింత పరధ్యానంలో వూరేగుతున్నావ్.

శ్రీ:- (కాని యింకా పరధ్యానంలోనే) ఏమిటి అంటావ్?

చై:- సరిగా నావంక చూడు. నేకనిపిస్తున్నానా?

శ్రీ:- (దిక్కులు చూస్తూ) ఊ !

చై:- (నిరాశగా) స్సారె... నామాటలన్నా వినిపిస్తున్నాయా?

శ్రీ:- ఆ!

సై:- (నిరాశగా) బాగానే వుంది,

శ్రీ:- ఆ.ఆ. (నవ్వి) కాగుండికాదూ. యీగది యిల్లా వుంటే బాగుంటుంది కదూ!

సై:- (విసుగ్గా) బాగానే వుందయ్యా, మహాశయా, కాస్త యీలోకంలోకి వచ్చి మాట్లాడు.

శ్రీ:- వస్తా వస్తా (పరధ్యానంగానే) వాడొచ్చే వేళ అయింది. ఇంకో 10 నిమిషాల్లో వాడొచ్చేస్తాడు.

సై:- ఎవరూ వచ్చేది?

శ్రీ:- మావాడు... (ధ్యానంలోకొచ్చి) అరరే! చెప్పేశానే!

సై:- సర్లే, ఏం చెప్పండే.

శ్రీ:- వాడొస్తాడని చెప్పలే?

సై:- కాని వాడెవరని?

శ్రీ:- అవును. వాడెవరో చెప్పలే. అవును, చెప్పలే. ముందు చెప్పకుండా వకసారి - నీకు- విస్మయం కలిగేట్టు చెయ్యాలని చెప్పలే. కాని నువ్వప్పుడే వచ్చావేం? నిన్ను 11 గం॥లకి రమ్మని కబురు చేశాగా.

సై:- కాని రోజూ యిప్పుడే రావటం అలవాటు కాదూ? అందుకని వేళ కాంగానే కాళ్ళు ప్రయాణం కట్టాయి. ఇంతకూ యీ హడావుడి యెందుకో చెప్పావుకాదు.

శ్రీ:- అదో పెద్ద కధలే. నీకు తెలియదు- కానీ, నాకు వకప్పుడు వక పెళ్ళాం వుండేది.

సై:- అలాగా! పెళ్ళిచేసుకున్న పెళ్ళామేనా!

శ్రీ:- ఆ. అదిగో. (మధ్య Enlargement చూపించి) ఆమెదే ఆ చిత్రం. వక కొడుకు కూడా పుట్టాడు. వాడూ...

సై:- ఆ. ఆ. పండులాగుండేవాడు కాదూ?

శ్రీ:- అవును. నీకెలా తెలుసు?

చై:- తండ్రికి తనకొడుకు పందులాగే వుంటాడెప్పుడూ.

శ్రీ:- కాని వీడు నిజంగా పందులాగే వుండేవాడు. ఆ పసిగుడ్డును చూసుకొని మురుస్తూ మూడేళ్ళు గడిపాం.

చై:- మూడేళ్ళా! అయితే ఏదోవకటి జరిగివుంటుందప్పుడు.

శ్రీ:- జరిగింది. మా మురిపెం ముక్కలయింది. ఆనందం అణగారిపోయింది. నా భార్య నన్నువీడి పోయింది.

చై:- ఆ!!

శ్రీ:- (Pause) ఆ. Hospital ల్లో 10 రోజులు బాధపడింది. నేనా రోజున చూడటానికి వెళ్ళాను. చూశాను–కలకలలాడే మొహం కళావిహీనంగా - నులి వెచ్చని చేతులు మంచుగడ్డలాగ ...ఆమె వెళ్ళిపోయింది. నాకు నా పసివాణ్ణి..వొదలి. నేను మనసు మొరడుసుకుని బ్రతికుండాల్సి వచ్చింది. ఆ పిల్లవాడికోసం, చిగురించని ఆ మొలక కోసం...బ్రతికేవున్నాను. నాకోసం కాకపోయినా.

చై:- మరీ...ఆ కుర్రవాడేడీ?

శ్రీ:- పెంచమని వక వృద్ధురాలి చేతిలోవుంచి నేనీవూరు వచ్చేను. వాళ్ళిద్దరి పోషణభారం నేనే వహించాను. ఒక యేడాది జరిగిందో లేదో-అక్క స్మాత్తుగా వకనెల నే పంపిన మనిఆర్డరు తిరిగివచ్చేసింది. రెక్కలు గట్టుకు ఎగిరిపోయాను ఆ వూరికి. వూరుకలియ వెతికాను. ఆ పిల్లవాడెక్కడో తప్పిపోయాడట. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది.

చై- అయితే యింతకూ .....!!!

శ్రీ :- 15 ఏళ్ళయిన తర్వాత, రెండురోజులక్రిందట. మొన్న తెల్సింది. నా ఎడ్రసు ఎల్లాగో కనుక్కుని వక అనాధ శరణాలయంవాళ్ళు వ్రాశారు. మావాడక్కడున్నాడనీ. చదువుకుంటున్నాడనీ ..... యివ్వాళ యిక్కడికి వస్తున్నాడనీ - యిప్పుడే- యీ ఐండికే...

(జేబులోంచి చొక్కాలాగూ తీసిచూస్తూ) ఈ వయస్సులో చూశాను. తిరిగి యిప్పుడు చూస్తున్నాను. అనాటి పసివాడు- యీనాడు నవ యువకుడు. నా జీవితంలో విదియ చంద్రుడు. ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?

చై:- ఆహ, ఏంలేదు.

శ్రీ:- ఇప్పుడు నాకు నిజంగా జీవించాలనే వుంది. నాకోసంగాదు. వాడి కోసం. ఆ వేళ్ళు పాతుకోని చిన్ని మొలకకోసం.

చై:- శ్రీనివాసం!

శ్రీ:- నిరాశతో ఎప్పుడూ - ఎప్పుడు యీదేహం రాలిపోతుందా అనే ఆలోచించే వాడిని...ఇందుకేగాబోలు బ్రతికివున్నాను, ఇప్పుడు జీవించాలి జీవించి తీరాలి, నాకోసం కాకపోయినా-వాడికోసం. వాడి భవిష్యత్తు కోసం...చైతన్యం ! (ఉద్రేకంతో) నేనింకొక్క పదేళ్లు జీవించగలనంటావా ?

చై:- జీవిస్తావ్. (వేళాకోళంగా) నేవద్దంటే మాన్తావ్ గనక !

శ్రీ:- అయితే ఫర్వాలేదు 10 యేళ్ళలో ఎంతైనా చెయ్యగలను.

చై:- చెయ్యగలవ్, కాని యేం చేద్దామని ?

శ్రీ:- మావాడికి చదువు చెప్పించి పెద్ద వుద్యోగస్తుణ్ణి చేస్తాను. వాడి కుటుంబం మూడుపువ్వులూ ఆరు కాయలుగా జీవితాన్ని గడిపేట్టుగా ఆస్తి సేకరించి సమకూర్చి పెడతాను. ఏం ? బాగుందదూ ?

చై:- బాగానే వుంటుంది. కాని...వాడి రాత బాగుంటే.

శ్రీ:- (కోపంగా) చైతన్యం.....

చై:- ఏం, కోపం వచ్చిందా ! వస్తే వంటికి మంచిదేలే. నేనసేదీ యేం లేదు. మీవాడు వర్ధిల్లాలనే నా కోరికానూ. కాని యీ కాలాన్ని ఐట్టి...కుర్రవాళ్ళూ...

శ్రీ:- నా కుర్రవాడు అందరిలాగా యెప్పుడూ అవడు. నా పిల్లవాడు - నా పిల్లవాడే.

చై:- ఇప్పటికి నాకర్థం అయింది.

శ్రీ:- ఏమర్థమయింది ?

చై:- నీకు మతి యింతవరకూ పోకుండా వుండే-ఇక త్వరగా పోతుందని.

శ్రీ:- కాసి నాకివ్వాళ వున్నట్టు ఎన్నడూ లేదు. ఆనందం అంటే యేమిటో అర్థమవుతోంది. ముందు చూపుతో సంతోషం, వెనక చూపుతో విచారం, రెండూ కలిసి నా హృదయం బరువెక్కి పోతూంది. నిజమే. సంతోషంలో మతి పోవచ్చు. నువ్వు దగ్గరుండి పోకుండా చూడు. (రాధ వస్తుంది)

రాధ:- Decoction తయారయింది. మీకు కాఫీ కలిపి పట్టుకు రమ్మంటారా ?

శ్రీ:- వాడింకా రాందే!

చై:- పోనీ - నేను వచ్చాగా! (నవ్వుతారు)

శ్రీ:- (నవ్వి) పట్టుకురా పోసి. (రాధ వెళ్ళబోగా) అంతా కలిపేశేవ్ సుమా! మా యిద్దరికే కలుపు. ఆ, ఆ, నువ్వుకూడా తాగు. (వెళ్ళబోగా) ఆ, రాధా, నిన్న కొన్న కొత్తబట్టలు కట్టుకోలేదేం ?
(రాధ తలవంచుకు వెళ్ళిపోతుంది.)
కట్టుకో-కట్టుకో...(రాధ వంకే చూస్తూ) పాపం, నన్నింతవరకూ తల్లి పిల్లని సాకినట్టు సాకింది. దాసిపిల్లయినా నా కూతురిలాగ ప్రవర్తించింది. ఎవర్నో వకర్ని చూపిస్తాడా భగవంతుడు.

చై:- మరే. అల్లాగేగా-నువ్వీ వూరు రాంగానే నన్నూ చూపించాడా భగవంతుడు-రోడ్డుమీద-

శ్రీ:- దీనికి మంచివాణ్ణి చూసి పెళ్ళి చెయ్యాలి. కాస్త డబ్బు ఖర్చయినా సరే.

("అయ్యా" అంటూ బయటనుంచి సర్వయ్య వస్తాడు)

శ్రీ:- ఎవరది ? (చూసి) సర్వయ్యా ? వచ్చావ్. రా. సికోసం కబురు చెయ్యాలనుకుంటున్నా.

స:- ఆహ్హాహ్హా (నవ్వి) మా పిల్లదీ...వచ్చిందాండి ?

శ్రీ:- ఆదేనా !

స:- ఆదే వదండీ...ఏరే ఎవరున్నారు ?

శ్రీ:- ఇప్పుడేం! ప్రొద్దున్నే వచ్చింది.

సర్వ:- వచ్చిందాండీ—మరి ఏవన్నా చెప్పిందాండీ—

శ్రీ:- ఏం చెప్పలేదే.

సర్వ:- మర్చిపోయింది కావాల. పిచ్చిమాలోకం. అయ్యగోర్నడిగి రెండు రూపాయలు ఎత్తుకరాయే అని నోరు కాయగాచేట్టు చెప్పా.

శ్రీ:- అహా, చెప్పలేదే.

చై:- చెప్పవద్దనుకుందేమొ.

శ్రీ:- ఏం అలా అన్నావ్.

చై:- అలా ఎందుకన్నా నంటావా—సర్వయ్యా, ఎందుకా 2 రూ॥లు?

స:- అదేటండీ! డబ్బెందుకని అడుగుతారూ?

చై:- డబ్బు అవసరం చాలా వాటికుంటుంది, కాని యీ రెండు రూ.లూ ఎందుకని? తాగటాన్కా?

సర్వ:- రామ రామ!! అది నేనేప్పుడూ ఎరగనండీ.

చై:- మరి ఎందుకూ! వెచ్చానికా, గుడ్డలకా, ముండలకా?

స:- ఏదో నాశిరకపోళ్ళం బాబూ, మీరు నిలవేసి అడిగితే ఎట్లా సావటం!

శ్రీ:- సర్లే. సర్వయ్యా, సాయంకాలంచూద్దాంగాని, నువ్వీపూటల్లా ఇక్కడే వుండు. మా అబ్బాయి వస్తున్నాడు.

సర్వ:- అబ్బాయిగోరండీ! ఎప్పుడు పుట్టారండీ?

శ్రీ:- అదో పెద్ద గాథ. నువ్వెరగవ్‌లే. ఇప్పుడే ఈ బండికే వస్తాడు. నువ్వు వుండు.

స:- చిత్తం బాబయ్యా, మీ పాదాలకాడ— ఈ గుమ్మందగ్గరే కూకుంటా. కేకెయ్యండి-లగెత్తుకువత్తా.
(సర్వయ్య వెళ్ళంగానే రాధ వస్తుంది)

రాధ:- ఆ వెళ్ళేది మా నాన్నకదండీ?

శ్రీ:- ఆ.

రాధ:- రెండు రూపాయలు అడిగేడా?

శ్రీ:- అడిగాడు.

రాధ:- ఇవ్వకండి.

శ్రీ:- ఏం?

రాధ:- ఏం లేదు.

శ్రీ:- సరేలే గానీ నువ్వింకా ఇలాగే వున్నావేం- ఆ కొత్త బట్టలు కట్టుకోకుండా.

రాధ:- అవ్వి...లేవు.

శ్రీ:- ఏం లేవూ?...నిన్ననే కొన్నవీ...లేవూ.

రాధ:- అవ్వే...లేవు.

శ్రీ:- ఏం? ఎందుకు లేవూ?

రాధ:- మా నాన్న ఉంచుకున్నదాని కూతురికి వెళ్ళాయి.

శ్రీ:- (తెల్లబోయి) ఆ!

రాధ:- నిన్నరాత్రి నన్నేడిపించి, అవ్వి లాక్కున్ని, దాని కిచ్చాడు?

చై:- ఓరి, వెధవ!!!

రాధ:- ఆ రెండు రూ।।లు అడిగితే ఇవ్వకండి. దాంతో వాళ్ళు ముగ్గురూ సినిమాకి వెళతారు- రేప్రొద్దున్న తిండికి లేకపోయినా—

శ్రీ:- సర్లే.

(రాధ వెళ్ళిపోతుంది)

శ్రీ:- బైము అయినట్టుండే.

చై:- అయింది ఇంకో 5 నిముషాలు ఓపికపట్టు.

శ్రీ:- స్టేషన్‌నుంచి యిక్కడికి రావటానికి 5 నిముషాలు కావాలా ?

చై:- విమానంమీద వస్తే అక్కర్లేదుకాని బండిమీదయితే కావాలి.

శ్రీ:- అలేవోరకం విమానాలు మన దేశంలోకూడా వస్తే బాగుండును.

చై:- వచ్చేవే, మీ అబ్బాయి ఇవ్వాళ వస్తాడని తెలిస్తే!

శ్రీ:- తెలుసుకో అక్కర్లే—(నవ్వి) ఈలోగా నువ్వికడ వుండి ఏం చేస్తావ్! రాధకి వక చీర కొనుక్కువస్తావా-పోసీ.

చై:- తెస్తాన; ఏం చేస్తానూ యిక్కడ. వచ్చేది మీ అబ్బాయిగాని- మా అమ్మాయి కాదుగా.

శ్రీ:- ఆ...పట్రా (డబ్బు తీసియిచ్చి) కాస్త మంచిదే పట్రా, కట్టుకుంటుంది-ఇంతలో ఏం పోయింది.

(చైతన్యం డబ్బు తీసుకుపోతాడు)

(శ్రీనివాసం ఏదో ఆలోచిస్తూ కాసేపాగి—)

శ్రీ:- రాధా! (రాధ వస్తుంది)

రాధ:- ఎందుకండి?

శ్రీ:- 18 యేళ్ళ కుర్రవాడూ...ఎంత యెత్తు వుంటాడంటావ్?

రాధ:- (చేతితో తన యెత్తు చూపిస్తూ) ఇంత వుంటాడు.

శ్రీ:- అంతేనా?

రాధ:- (చెయ్యి బాగా పైకి యెత్తి) ఇంత వుండవచ్చు.

శ్రీ:- అంత!! ఉంటాడంటావా?

రాధ:- ఏమో!

శ్రీ:- ఉన్నా వుండవచ్చులే. వాళ్ళమ్మ బాగా పొడుగే. నామీద ఓ గుప్పెడు వుండేదేమో. వీడూ బాగానే ఎదిగి వుంటాడు-కాని చొక్కా చాకుండా (అని తన దగ్గరున్న చొక్కాలాగు తీసి చూసుకుంటూ) పాడు.)

ఇంతవరకూ నా జన్మ వృధాయేననుకునేవాణ్ణి, రాధా; కాని అనుకో కుండా అదృష్టం కలిసివచ్చింది. అంధకారంలో ఆశాకిరణం కని పించింది. ఇకచూడు. Bank లో 5 వేలున్నాయి. వాడి చదువుకి అదిచాలు. పోతే 5, 6 యేళ్ళలో 20, 30, వేలు సంపాదించలేనూ? కిష్టయ్య యేడాదిలో లక్ష సంపాదించాడు. లక్షా !! Black market లో. నేను 4–5 యేళ్ళలో సంపాదించ లేనూ? చూడూ? 4-5 యేళ్ల వరకూ Black market వుండదూ? ఉంటుందా వుందదా? మాట్లాడవేం?

రాధ:- నాకేం తెలుసునండీ?

శ్రీ:- ఆ... ఈమాత్రం తెలియదూ?

రాధ:- తెలియదు—కానీ—Black market చెయ్యటం తప్పుగాదండీ ?

శ్రీ:- కాదు. ఎవరన్నారు తప్పని ?

రాధ:- మీరే అన్నారొకసారి.

శ్రీ:- అదివేరు. సొంతానికి చేస్తేతప్పు. కాని నేను నాకోసం చేశానా-వాడి కోసంగాని. నేబాగా సంపాదించక పోతే వాడు కష్టపడిపోడూ-తల్లీ తండ్రిలేని బికారి లాగ వాడు అవస్థ పడుతుంటే - నేనుండీ-చూస్తూ వూరుకోనా? నీకు తెలియదు రాధా; వాడు దరిద్రం అనుభవించలేడు.

రాధ:- మీకెల్లా తెలుసునండీ ?

శ్రీ:- ఎల్లాతెలుసు!! మావాడు - మాఅబ్బాయి సంగతి నాకు తెలియదూ ?

రాధ:- అహ! మీరు ఎప్పుడూ చూడలేదు గదండీ ?

శ్రీ:- చూడలేదు; చూడలేదు; నిజమే కాని యీ 15 యేళ్లబట్టి యేరోజు వాడు జ్ఞాపకం రాకుండావున్నాడు, ఏరోజు కలలోరాకుండా వున్నాడు, ఏరోజు కళ్లలో ఆడకుండా వున్నాడు. నా కళ్ల యెదట పెరగలేదు గాని- నా కళ్ళల్లోనే పెరిగాడుగా-ఆ...ఇంతవుంటాడు. సరిగ్గా వాళ్ళమ్మ కళ్ళు. నవ్వితేసరిగ్గా వాళ్లమ్మే. కాస్త గడ్డంలో తేడా.

పిచ్చివెధవ. తల్లీ తండ్రీ తెలియకుండా ఎల్లా గడిపాడో- 15 యేళ్లు.
(కళ్ల నీళ్లు పెట్టుకుంటాడు)

రాధ:- (ఖంగారుపడుతూ) ఇదేమిటండీ?

శ్రీ:- ఈ భాష నీకర్థం అవుటంలే. అర్థం కాదులే, నీకూ, కడుపుపండి వక కుర్రవాడు పుడితే—వాడూ ఇలాగే...(ఆవేశంతో) ఆహహా! వద్దు, వద్దు ఈ కడుపు కోత పగవాడికైనా వద్దు, వద్దు-రాధా-వద్దు,

రాధ:- (ఆదుర్దాగా) ఏమిటండీ-ఏమిటండీ యిదీ ?

శ్రీ:- (తెప్పరిల్లి) ఏంలేదు. ఏంలేదులే,

రాధ:- ఏమిటండీ, ఇవ్వాళంతా మీరదోమాదిరిగా వున్నారు?

శ్రీ:- ఏంలేదు. (తెప్పరిల్లి) ఆ — చూడు. ఆ గదిలో ప్రక్కవేశావా ?

రాధ:- లే- నేనామంచం ఎత్తలేను.

శ్రీ:- అహ! అయితే నేనేవేస్తాలే-ఆ గదిలోగాని గాలి బాగా రాదు.
(శ్రీనివాసం వెళ్తాడు, వెనకనే రాధ వెళ్ళబోతుంటే సర్వయ్య బయటనుంచి వచ్చి)

స:- రాధా,

రాధ:- (ఆగి) ఏం?

స:- నే రెండు రూపాయలడిగానని అయ్యగారితో చెప్ప లేదంటగా !

రా:- అవును, అది నేకష్టపడి సంపాదించుకున్నడబ్బు,నీకూ, నీ తిరుగుళ్ళకి ఎందుకివ్వాలి?

స:- అయితే...తల్లీ తండ్రీ ఆక్కర్లే?

రాధ:- 'తల్లీ తండ్రి' నా గుడ్డలు తీసుకెళ్ళి దాని క్కుట్టబెట్టడం, నా తండ్రి చెయ్యాల్సిన పనేనా?

స:- పిట్ట కూతట్టిందే, కట్టా వాగటం మొదలెట్టావంటే కాళ్ళూ చేతులూ కట్టేసి యింట్లో పడేస్తాను.

రాధ:- (ఆక్షేపణగా) అ-పారేస్తావ్ - నేనింటికి వస్తేనా?

స:- రాకేంచేస్తావ్? ఇక్కడ యిల్లరికముంటావా ?

రాధ:- వుంటే వుంటాను, నా పొట్ట వెళ్ళిపోదనే బెంగలేదు.

స:- ఎందుకుంటుందీ ''అయ్యగోరికి ఓ అబ్బాయి గోరొస్తున్నారు. కన్నేసి కరగిసే కావల్సిందుండదు'' అనేగా నీ దీమా!

రా:- ఛీ! మాట్లాడకు.

స:- ఏమిటే కూశావ్!
(అని కోపంగా చెయ్యెత్తి కొట్టబోయాడు. కాని వెనక చైతన్యం రావటంచూసి ధోరణిమార్చి)
మా అమ్మగా, తల్లివిగా. పనిఅవంగానే-యింటికిరా.

చై:- (వచ్చి) ఏమిటి సర్వయ్య-అది?

స:- ఏం లేదండీ, పిల్లది...నామీద అలిగిందీ...బ్రతిమాల్తున్నా

చై:- (చీరపాకెట్ యిస్తూ) రాధా! ఈ చీర తీసుకెళ్ళి కట్టుకో. (రాధ తెల్లబోయి-తీసుకు వెళ్తుంది)

స:- అహ్హహ! ఇంకేం !

చై:- ఆ?...ఏమిటి ?

స:- ఏం లేదు బాబూ, అమ్మాయి చీరచూసి— ఆ చీర కడితే బలేసోగ్గా కనిపిస్తుందిగదా- ఆరోచ్చేటప్పటికి అనుకున్నా.

చై:- ఏడిశావ్‌లే. బైటకూకోచ్చ. చెప్పకుండా వెళ్ళిపోక.

స:- అయ్యో బాబూ, చెప్పకుండా వెళ్తానాండీ? ఆ రెండూ చేతిలో పడ్తే గాని వెళ్ళకుగా.
(అని వెళ్ళి... గబ గబా తిరిగివచ్చి)
ఏదో బండి మాట్చించండి — అబ్బాయిగారు కాళ్ళు దిగారు.

చై:- ఆ, ఆ. (అని ఖంగారు పడ్తూనగానే బాబూరావు వస్తాడు. వచ్చీ వస్తూనే హుషారుగా)

బాబూ:- Hallo Daddy, బలే సంతోషం. చాలా సంతోషంగా వుంది, మిమ్మల్ని కన్నుకోవటం.

చై :- నేనూ—

బాబూ:- మీరు సంతోషిస్తారు. నాకూ తెల్సు. నాకామాత్రం తెలియదా?

చై :- కాని—

బాబూ:- కానీ ఎందుకండీ యింకా. మీరు నా తండ్రి. మీ కొడుకును నేనూ. 15 ఏళ్ళయితే మాత్రం ఆపేక్షలు తగ్గుతాయా ?

చై:- కాని అసలు సంగతి వినవేం ?

బాబూ:- ఇక ఆస్నీ సంగతులూ మర్చిపొండి. పాత సంగతులు విస్మరించి కొత్తవాటికి మార్గం తీద్దాం.

చై:- కానీ- నా మాట వినుమరి.

బాబూ:- హృదయాలు సంతోషంతో నిండివుండగా యింకా మాటలెందు కండీ మాటలు.

చై:- కానీ... నా హృదయం అంత సంతోషంతో లేదు.

బాబూ:- ఇది నేను అసలు నమ్మను. వినను. ఎట్లా వుంటుంది సంతోషం లేకుండా.

చై:- నాకూ సంతోషం అసలు లేకపోలేదు.

బాబూ:- ఆ, అల్లా చెప్పండి.

చై:- కాని నేను నీ తండ్రిని కను.

బాబూ:- కారూ? (తెల్లబోయి) Damit, చెప్పరేం యిందాకట్టించి.

చై:- మీ నాయన లోపలేదో చేస్తున్నాడు.

(లోపలికి చూస్తూ) శ్రీనివాసం. శ్రీనివాసం.

బాబూ:- అయితే మీరు శ్రీనివాసం కాదన్నమాట.

చై:- అబ్బే, నేనెట్లా అవుతానూ నేనతని స్నేహితుణ్ణి (శ్రీనివాసం యేదో గుడ్డ చేతిలో పుచ్చుకుపస్తాడు. రాంగానే) మీ వాడయ్యా!

శ్రీ:- (చేతిలోవున్న గుడ్డ క్రిందపడేసి సంతోషంతో) మావాడా! (Pause) (వెళ్ళి కౌగలించుకుంటాడు), నువ్వేనా మావాడివి? (మళ్ళీ

కొగలించుకుంటాడు) ఏదీ? సరిగ్గాచూడనీ, 15 యేళ్ళుగా కనిపించని వాడిని కళ్ళారా చూడనీ.

చై:- కాఫీ పెట్టించినట్లున్నావ్. మర్చిపోయావా శ్రీనివాసం?

శ్రీ:- ఊ. మరే. కాఫీ... రాధా... కాఫీ (లోపలికి తనే వెళ్తాడు.)

చై:- ఇట్లా కూర్చో అబ్బాయ్. నిన్నేమని పిలుస్తారూ?

బా:- బాబూరావ్.

చై:- ఆం. ఏం చదువుతున్నావ్?

బా:- Inter.

చై:- బాగుంది. మీ నాన్న కలలు కంటున్నాడు నీకోసం.

(శ్రీనివాసం కాఫీ తెచ్చియివ్వగా)

బాబు:- (తాగుతూ) అబ్బ, రాత్రంతా నిద్రలేదండీ. కళ్ళు తూలి పోతున్నై.

శ్రీ:- పడుకుంటావా? రాధా! ఆ మంచం యిట్లా పట్రా.

చై:- ఆ గదిలోనే వేస్తే బాగుంటుందేమో.

శ్రీ:- నీకు తెలియదు రాధా! (తప్పు దిద్దుకుంటూ) ఆ. రాధా అంటా – చైతన్యం అక్కడుంటే సరిగ్గా కనిపించదు. (వెళ్ళి మంచం తెస్తూ ఉగా ఐయటనుంచి సర్వయ్యా)

శ్రీ:- ఇదిగో సర్వయ్యా అబ్బాయి. అబ్బాయిని చూశావా ఇదిగో, వీడే.

స:- చిత్రం బాబయ్యా; చూశానండీ; అబ్బాయిగారు వచ్చారు గనక నాకు సెలవిప్పిస్తారేమోనని...

శ్రీ:- వెళ్తావా, పనుందా? పనుంటే పోయి సాయంకాలం రా.

స:- అట్టానే వత్తానండి కాని ఆ రెండు రూ॥ ఈ పూటే కావాలండి.

శ్రీ:- అదా? అది రాధ యివ్వాల్సిన్నది. నేనివ్వను.

స:- అదట్లాగే అంటది లెండీ- పిచ్చిది. అయ్యో త్రేగాని యియ్యాళ పొయ్యిలో పిల్లి లెగదండి.

శ్రీ:- కాదు. ఇవ్యను. నువ్వు దాన్ని సరిగా చూడటంలేదు. పో! పో! (బాబుతో వేసిన మంచంమీద పక్కవేసి సర్దుతూ.) రా... బాబు. ఇల్లా పడుకో.

స:- కోపం చెయ్యకండి బాబూ. మీకు కోపంవత్తే నెల్లా బతకటం?

శ్రీ:- అందుకని ఏమంటావ్?

స:- వేరేమంటానండీ– ఆ రెండూ యివ్వమంటాను.

శ్రీ:- ఏడిసినట్టుంది. యివ్వను (బాబుతో) పడుకో. బాబూ (సర్వయ్యతో) ఇక పో సర్వయ్యా పో. నే కుట్టించినట్టలు యెవరికోఇచ్చావటగా. దాన్ని కొట్టావటగా. పో, నీకు చస్తే యివ్వను. పొమ్మని నీక్కూడా చెప్పటం?

(బాబు వచ్చి పడుకోగా) దిండు యివ్వనా?

బాబు:- వద్దులెండి.

స:- ఇవ్వన్నీ మీకు అదే చెప్పిందాండి?

శ్రీ:- ఆ. అదే చెప్పింది. చెప్పదూమరి.

స:- కోపంతో రెండు వేసినమాట నిజమే కానండీ- అంత మాత్రానికి మీతో చెప్పాలా! ఇంటికి రానియ్యండి. దాని పని పదతా.

శ్రీ:- అది యింటికేరాదూ. నువ్వెళ్ళు.

స:- ఇంటికేరాక యిక్కడే వుంటుందేమంది?

శ్రీ:- వుంటే వుంటుంది.

స:- అయ్యగోరోవ్. దణ్ణం పెడతా! దాన్ని వుంచేసుకుని నన్నూ, నా పిల్లనీ పేరు చెయ్యకండి.

శ్రీ:- ఏడిశావ్‌లే ఆట్టేవాక్క...వెళ్ళు.

స:- దాన్ని వదిలి నేనెక్కడికెళతాలెండి...వస్తా.

(వెళతాడు.)

శ్రీ:- పో పో!

శ్రీ:- బాబూ...బాబు నిద్రపోతున్నాడు.
(కాళ్ళగట్టున యెదురుగా నిలబడి) నిద్రపోతున్నాడు. ఆనాడు వుయ్యాలల్లోనూ, తల్లి పొత్తిలిలోనూ ఆదమరచి నిద్రపోయినట్టే-యీనాడునూ. నాటికీ నేటికీ నా కంటికి తేడా కనిపించటంలేదు. ఒక్కసారి కావలించుకోవాలనుంది...కాని మెలకువ వస్తుందేమో. వద్దులే... ... ఈడుకు తగ్గట్టుగా పెరిగాడు.

మొహంలో యవ్వనం తొణుకుతోంది. పెదవులమీద నవ్వు నాట్యం చేస్తోంది. చెక్కిళ్ళు మెరుగు టద్దాలలాగ మెరిసిపోతున్నై. చైతన్యం! నువ్వున్నావని వూరుకున్నాగాని, లేకపోతే వక్కసారి ముద్దాడాలని వుంది. (మధ్యకు నడిచి, తలయెత్తి. enlargement చూశి) నిర్భాగ్యురాలా! నామాత్రం నోచుకోలేదు- నువ్వు.

చై:- ఇన్నాళ్ళూ పండిన వేదాంతిలాగా కనిపించేవాడివి. యిల్లా మమకారంలో పడిపోతున్నావేం శ్రీనివాసం?

శ్రీ:- నువ్వెరగవులే నా మనసు. నాలాగ నీకూ వక కొడుకుంటే.

చై - కొడుకు లేడు. కూతురుండిగా.

శ్రీ:- (యేదో తట్టినట్లు) చైతన్యం!

చై:- ఏం? అల్లా అరిచావ్!

శ్రీ:- ఏంలేదు. నాకో కొడుకు; నీకో కూతురూ వున్నారు. వీళ్ళిద్దరికీ పెళ్ళి చేసి దానిమీదట మన భవిష్యత్తు నిర్మించుకుంటే యెట్లా వుంటుంది?

చై - బాగానే వుంటుంది. కాని నీ ఊహాలిట్టా పరుగెత్తుతున్నాయేం?

శ్రీ:- పరుగెత్తు తున్నాయి. 15 యేళ్ళుగా ఆణిగిపోయి, వడిలి, వాడి, యెండిపోయిన ఆలోచన లన్నిటికీ ప్రాణం వచ్చి, రెక్కలు విచ్చి, విచ్చలవిడిగా ఎగిరి పోతున్నై. ఈ వేగంతో రాగలిగితే సాగిరా. లేకంటే ఆగిపో.

కాని మీ అమ్మాయిని యివ్వనంటే సాగదు. ఆ ఆ. వాడు నిద్ర పోతున్నాడు. భోజనం వేళకి తిరిగి వద్దాం. లే-పద. (చైతన్యం ఏదో మాట్లాడబోగా) ఎక్కడికని అడగకు, పద పోదాం.

(ఇద్దరూ బయలుదేరి వెళ్తారు)

[సర్వయ్య తోపలికి వస్తాడు]

స:- రాధా- రాధా! (రాధ వస్తుంది)

స:- అయ్యగోరితో ఆన్నీ చెప్పేసి నట్టుండావే.

ర:- చెప్పా. ఏం చెపితే?

స:- చెప్తావ్ చెప్తావ్- దవడ యాపళాన బద్దలు కొడితే యెవరే నీకడ్డం వచ్చేది? ఊరుకుంటుండానని ఊగిపోతున్నావే. పనీవద్దు పాటావద్దు రేప్పొద్దుట్నించీ యింటికాడే పడివుండు.

ర:- ఏ యిల్లు? నీ యింటికి నేరాను.

స:- ఊఁ?

ర:- నీ యిల్లూవద్దు, నీ పోషణావద్దూ, నా రెక్కల్లో శక్తుండగా నా పొట్ట నే పోషించుకోగలనులే.

స:- ఆ? చాలా నేర్చావే?

ర:- నేరిస్తే నేర్చాలే. నేర్చకపోతే నీకుమల్లే నీచంగా తయారయేదాన్నే.

స:- ఏమిటే కూస్తావ్? (అని చెయ్యెత్తి కోపంగా మీద కెళతాడు) (బాబు లేచి అడ్డుపడి)

బా:- ఏయ్! ఏయ్! ఆగవయ్యా ఆగు. ఈడొచ్చిన ఆడపిల్లని అమాంతం కొట్టబోతున్నావే... అందులో యిలాంటి పిల్లను.

(రాధవంక చూస్తాడు)

స:- ఆ? (ఏమిటీ?? అని ఆశ్చర్యంగా అన్నట్టు)

బాబు:- పాపం, ఆ కళ్ళుచూడూ...కవిని కాదు కాని యేదో వర్ణించే వాణ్ణే యీపాటికి.

స:- ఆ. (స్వరం తగ్గిస్తాడు ఆలాగా అన్నట్టు.)

బా:- ఆ చూడు. కళ్ళు భయంతో వణుకుతున్నాయి. పెదవులు అదురుతున్నాయి. ఎరుపెక్కాయి చెక్కిళ్లు.
(తడుముకుంటూ) ఇంకా ...ఇంకా
(రాధ కోపంగా లోపలికి వెళ్ళిపోతుంది)

బా:- ఎవరా అమ్మాయి? అంతగా కోప్పడి కొట్టబోతున్నావ్?

స:- అమ్మాయా, మన అమ్మాయేలెండి. మనింట్లోనే పని చేస్తోంది. అయితే మనం ఏవూరినుంచి వచ్చాం బాబూ, కొత్తపురంనుంచి కాదుగదా ?

బాబు:- అంతా "రాయల్ వ్యవహారంగా" వుందే ! అయితే మనం ఎవరేం ?

సర్వ:- అట్టా ఎరగనట్టు అంటారేం బాబూ, (నవ్వుతూ) మనం మనం వకటేగా.

బాబు:- ఆ ఆ వకటేగా! అమ్మాయి మన అమ్మాయే.

సర్వ:- బాబుగారు కాస్త రసికత్వం తెల్సినవోరే.

బాబు:- తెలియక పోవటమేం. కాస్తోకూస్తో సిటీటివాళ్ళ సావాసం వుంటే.

సర్వ:- అయితే నేనెందుకు బాబు, వెళ్ళిరానా?

బాబు:- ఓ శీఘ్రంగా.

సర్వ:- సరి...(సందేహిస్తూ) బాబూ!

బాబు:- ఏం ?

సర్వ:- మరేంలేదు బాబు! నే వెళ్ళొస్తాగాని, యిబ్బందిలో వస్తుండాం. వక నాలుగు రూపాయలు యిప్పించండి.

బాబు:- (జేబులు తడుముకొని) ఊ ... చిల్లర లేదే.

సర్వ:- పోనీ, అయిదూ పారెయ్యండి, రేపటికి కూడా వస్తుంది.

బాబు:- ఆహా! బాగా చెప్పావ్-ఊ, నీ పేరేమన్నావ్?

సర్వ:- సర్వయ్యంటారండి.

బాబు:- ఆ. సర్వయ్యా, చూడూ! మనకివున్న సర్వస్వం యీ కోటు (కోటు పుచ్చుకు చూపిస్తూ) ఈ కోటులో 5 జేబులున్నాయి. ఐదు జేబుల్లో నాలుగు జేబులు ఖాళీ. 5 వ దాంట్లోవున్న సర్వస్వం యీ రెండు రూపాయలు. ఇది మన Balance, ఇక నీ కెంత కావాలో అడుగు.

స:- ఇక ఏమడుగను. ఆ రెండే యిప్పించండి.

బాబు:- అహ! అయితే కళ్ళు మూసుకో. (సర్వయ్య మూసుకోగా) వెనక్కి తిరుగు. (తిరగ్గా మెడమీద చెయ్యేసి గెంటుతూ) Get out rascal.

స:- (క్రిందపడి లేచి, కోపంగా) మీకేకాదండోయ్ నాకూ ఇంగ్లీషొచ్చు. నేనూ దొరలందగ్గర రెండేళ్ళు వంటచేశా. మనవంక కాస్త కనిపెట్టి చూడండి.
(బయటికి కోపంగా వెళ్తాడు)
(లోపల్నించి రాధ వస్తుంది)

రా:- మిమ్మల్ని దబ్బడిగినట్టున్నాడు ?

బాబు:- అడిగాడు.

రా:- అడుగుతాడు, ఇవ్వకండి.

బాబు:- ఏం?

రా:- వాడుత్త పొగరుపోతు, రౌడీ, ముండల ముఠాకోరు.

బాబు:- అంతేకదా!

రాధ:- మీబోటి వాళ్ళని యిల్లా అడిగి-తీసుకుని తగలేస్తాడు.

బాబు:- Very Good.

రాధ:- అది చెప్పటాన్కే వచ్చాను. వస్తా (వెళ్ళబోతుంది)

బాబు:- కాని వెళ్ళకు... (రాధ వెళ్ళిపోయింది) అమ్మా... తారాజువ్వ...
ఇదిగో అమ్మాయి. నీ పేరేమిటి? పలక వేం—తారేనా? తారా—
(తనూ లోపలికి వెళతాడు)

[కాసేపటికి రాధ గబగబా బయటికి వస్తుంది. వెనకనే బాబు వస్తాడు.]

బాబు:- అంత రుసరుసలాగావుందే మొహం.

రా:- ఏం, ఎల్లావుంటే మీకేం ?

బాబు:- ఒక అపురూపపు అపరంజి బొమ్మ అగ్నిహోత్రం లాగ మండి పోతుంటే, ఏ సౌందర్య పిపాసి, చూసి, సహించగలడు ?

రా:- అగండి. (కోపంగా చూస్తుంది అతనివంక.)

బాబు:- ఆ. అట్లా అట్లాగేవుండు (కళ్ళల్లోకి చూస్తూ) తెల్లని కళ్ళల్లో నల్లని పాపలు — అదో అందం, ఎర్రని కళ్ళల్లో కోపంతో కదిలే కనుపాపలు—ఇదో అందం.

రా:- ఛీ (వెళ్ళిపోతుంది, విసుగ్గా)

బాబు:- ఛీ-ఇదివరకీ సరసం నేనెరగనే, అల్లా పరుగెత్తుతావేం [వెంట పోబోతాడు]

[వెళ్ళబోయిన రాధ ఎదురు తిరిగివచ్చి-]

రా:- (కోపంగా) నా వెనకనే వస్తారెందుకు?

బా:- పేరన్నా చెప్పకుండా అల్లా పరుగెత్తుతావేం?

రా:- పేరుకోసమా, మీరు రావటం?

బా:- మరి యింకెందుకనుకున్నావ్?

రా:- (కోపంగానే) అయితే పేరు రాధ.

బా:- రాధ! రాధ! హృదయ వేధ, (రాధాకృష్ణుల పటంవంక చూస్తాడు)

రా:- ఏమిటి మీరనేది?—

బా:- అహ-అదేం పటం. దాన్లో వక రాధాకృష్ణుల జంట. దాని ముందో రాధా రమణుల జంట.

రా:- వళ్ళు మంట.

బా:- ఏమంటావ్ ?

రా:- వచ్చి వక గంట కాలేదు. మీ ధోరణి యేమీ బాగా లేదంటాను. మీ నాన్నగార్తో చెప్తానంటాను.

బా:- ఏమిటి, నామీద నెపం వేస్తున్నట్టున్నావ్ ?

రా:- నేను నెపం వేస్తున్నానా ?

బాబు:- మరి నాన్నగారితో చెప్తానంటున్నావ్ ?

రా:- మరి చెప్పనూ, ఇట్లా...ఇట్లా (ఎట్లాగో చెప్పటానికి సిగ్గుపడి ఆగిపోతుంది)

బాబు:- ఇట్లా-ఆ-ఇట్లా...నేనేం చేశానిప్పుడు?

రా:- (కోపంగా, విసుగ్గా) ఏం చేశానుట? ఏం చేశాను.

బా:- (రాగయుక్తంగా)
పూలమేల్కొనుగునే తొలగించి తొంగిచూసేవూ॥
మనసిచ్చి మాటాడ మనసు లేదే నీకు చిలకా॥
(రాధ కోపంగా అతనివంక చూడగా, బాబు తల వేరేవైపుకి నెమ్మదిగా తిప్పి ''చిలకా'' అంటూ ఆలాపిస్తాడు.)

రా:- (కోపంగా) అది ఏమిటండీ?

బాబు:- (తడుముకొంటూ) పాట-నాటకం...నాటకం పాట.

రా:- బాగుంది నాటకం.

బాబు:- బాగుందా...నిజంగానేనా? (దగ్గరికెళతాడు.)

రాధ:- (దగ్గరకు రాంగానే కాళ్ళమీద వాలి) మీకు దణ్ణం పెడతాను. నా జోలికి రాకండి. మీరెక్కడ; నేనెక్కడ? మీకూ నాకూ సాపత్యమెక్కడ? పచ్చని కొమ్మ-మచ్చ మాపకండి. గొంతు నులిమి గోతిలో పారేసినా యిష్టమే. గుణాన్ని చంపి గోతిలో తొయ్యకండి. మీ తండ్రిగారు నన్ను కూతురిలాగ పెంచారు. తోడబుట్టినదానిలాగ నావంక చూడండి. మీరు చదువుకొన్నవారు. చదువులేని దాన్ని నేను. మీ కడుపున పుడతాను. చదువులేనిదాన్ని ''నీతి లేనిదాన్ని'' చేసి నన్ను నిందలపాలు చేయకండి. (తలయెత్తి) నేనిప్పటికే

రెక్కలువిరిచి కట్టిన పిట్టలాగ కొట్టుకుంటున్నాను. రెక్కలు కత్తిరించి నా జీవితాన్ని పాప కూపంలో పడవెయ్యకండి. మీ పాదాలంది ప్రార్థిస్తాను. (మళ్ళీ పాదాలంది లేస్తుంది) నా ప్రతుకు నన్ను ప్రతకనివ్వండి. నన్ను బాధపెట్టకండి (దుఃఖిస్తూ వెళ్ళిపోతుంది.)

బాబు:- రాధా రాధా! (అంటూ వెనకనే వెళ్ళి ఆగాడు...వెళ్ళాడు. బయట నుంచి ఈల వేసుకుంటూ సర్వయ్య వస్తాడు. అంతా కలియచూసి ద్వారందాకా వెళ్ళి విన్నట్టు అభినయించి వెనక్కి వచ్చేస్తాడు. కాసేపటికి రాధ వెనకనే బాబు వస్తారు. వీళ్ళని చూసి సర్వయ్య బయటికి తప్పుకుంటాడు.)

రాధ:- ఎంత చెప్పినా వినరే. మీ నాన్నగారొచ్చే వేళయింది, వారు చూస్తే ఏమంటారు ?

బాబు:- ఏమంటారూ?

రాధ:- చూసి వూరుకుంటారా ?

బాబు:- ఊరుకోక యేం చేసారు?

రాధ:- ఏమైనా చేస్తారు. వారు మీ నాన్నగారు.

బాబు:- కాదు.

రా:- ఏమంటారూ!

బాబు:- ఆయన తండ్రికాదు; నేను కొడుకునూ కాదు.

రా:- అనేమాట అర్థం చేసుకునే అంటున్నారా !

బా:- అర్థంచేసుకోలేని అంధకారంలో లేను.

రా:- అంధకారంలోపడే అంధులైపోయారు. లేకపోతే యేమిటిది?

బా:- నువ్వేమనుకున్నా సరే.

రా:- కాని-మీ మూర్ఖం వదలరు.

బా:- అహ !

రా:- కాని యీ కంఠంలో ప్రాణం వుండగా మీ కోరిక తీరదు. (వెళ్తుంది.)
(బాబు అదే చూస్తూ నుంచుండగా సర్వయ్య బయటనుంచి వస్తాడు)

స:- ఆయ్యగోరు మాచెడ్డ ఆలోచనలో వుండారే.

బా:- ఆ !

స:- ఏదో పెద్ద పని మీదుండారు.

బా:- ఎందుకొచ్చావు మళ్ళీ ?

స:- ఏం లేదు బాబయ్యా; ఆ రెండూ యిస్తారేమోననీ.

బా:- ఈ ?

స:- ఇందాక అడిగుండా సూడండి.

బా:- ఇవ్వను, పో.

స:- (నవ్వి) కొత్త బిగువంతే లెండి. కొంత బండి సాగితే మీరే నన్ను కనిపెట్టి సూత్తారు. నాబోటోళ్ళని మీరు కనిపెట్టి చూడకపోతే మరెవరు చూస్తారు, బాబూ ? నేను రాధ తండ్రిని.

బా:- అయితే ?

స:- కిట్ట సమయంలో నన్ను కనిపెట్టుండే- కోరినవస్నీ తెచ్చి కాళ్ళ మీద పడేస్తా.

బా:- ఏ మక్కర్లే; పో అవతలకి.

స:- పోడల్చుకుండే మిమ్మల్ని తిసుకే ఎళ్తాలెండి.

బా:- ఏమిటి నువ్వనేది?

స:- ఆ రెండూ పారెయ్యండి.

బా:- బెదిరించి మాట్లాడుతున్నావే!

స:- బెదిరింపుదాకా ఎందుకులెండి. నా గుట్టు మీ కెరుక లేదుగాని, మీ లోగుట్టు నాకెరికే.

బా:- ఏమిట్రా నువ్వు వాగేది?

స:- ఆ. అయ్యగార్కి కోపంలో తల పనిచెయ్యదులాగుందే ?

బా:- పళ్ళాదతాయ్- పేలావంటే.

స:- ఆ బెదిరింపులేం లాభంలేదు లెగండి.

ఖా:- (కోపంగా) లాభంలేదూ (చెంపకాయ కొడ్తాడు.)

స:- సరేలెండి; ఈడి సంగతి తర్వాత తెలుస్తుంది.

(వెళ్తాడు.)

ఖా:- [లోపంవైపుకి నడిచివెళ్లుతూ రంభా రావణాసురుల బొమ్మమీద చెయ్యివేసి నుంచుని లోపలికి చూస్తాడు. కాసేపు ఆలోచించి లోపలికి వెళ్తాడు. కొంత తడవయిన తర్వాత శ్రీనివాసం, చైతన్యం ఐయట నుంచివస్తారు.]

శ్రీ:- (ప్రక్కమీద ఖాబు లేకపోవటం చూసి) ఏడీ వీడు?

చై:- లోపలికెళ్ళాడేమో.

శ్రీ:- అప్పుడే లేదాడే నిద్ర!

చై:- మరయితే టిపార్టీకి ఎవర్ని పిలవాలో... అది చెప్పు.

శ్రీ:- టిపార్టికేగా; మనవాళ్లందర్నీ పిలు. పర్వాలేదు. రేపు సాయంకాలంగా- Time వుండిలే. ఇదిగో, ఈ డబ్బు నీదగ్గరుంచు. Hotel ల్లో ఎడ్వాన్సు యివ్వటానికీ- దానికీ-వుంటుంది. వీడు రాలేదేం యింకా?

చై:- వస్తాడే...ఇదిగో- ఏదో మాట్లాడుతున్నాడు రాధతో.

శ్రీ:- (శనూవిని) ఆ. మాట్లాడుతున్నాడు రాధతో— రాధ ఆ చీర కట్టుకుందో-లేదో చూసి వస్తానాగు.

చై:- కాసేపట్లో యింత యిదవుతావేం శ్రీనివాసం? ఎంత కొడుకైతే మాత్రం.

శ్రీ:- ఆ?

చై:- ఎంత కొడుకైనా- అంత మమకారం పనికిరాదయ్యా.

శ్రీ:- ఉహ్హూహు (నవ్వేశి) ఏదో 15 యేళ్ల తర్వాత చూడటం చూడు (ధోరణి మార్చి) ఆ. మరి నువ్వెళ్ళిరావూ...?

చై:- ఎక్కడికి?

శ్రీ:- అహ్హా; మనవాళ్లందర్నీ పిలవద్దూ టి పార్టీకి? - తర్వాత Time వుండదు.

చై:- మరేంభయంలేదు. అదంతా నా కొదిలెయ్యి. ఇంతకూ అసలు సంగతి మాట్లాడవేం?

శ్రీ:- (లోపలికి చూస్తూ) ఏదీ ?

చై:- మా అమ్మాయిని మీ అబ్బాయికివ్వటం.

శ్రీ:- అదా! దానికేం తొందరలే.

చై:- మరి పార్టీకేనా తొందర?

శ్రీ:- చూద్దాంలే. మావాడికి మీ అమ్మాయిని చూపించి- చూసిన తర్వాత- అన్నీ ఆలోచించి, యేర్పాటుచేద్దాం.

చై:- (నిరాశతో) సరేలే! ఆలోచనలో పెట్టావ్ !

శ్రీ:- అట్లా అంటావేం ? నాకిష్టమయితే సరా ? వాళ్ళిద్దరూ వప్పుకోవాలా వద్దా? తీరా మీ అమ్మాయే వద్దనవచ్చు. ఆలోచించుకో.

చై:- అయితే ఒక పనిచేద్దాం. మా యింటికి రాత్రి భోజనానికి రావాలి- మీరిద్దరూ. దాంతో చాలాభాగం తేలిపోతుంది.

శ్రీ:- అవా! అల్లాగేకాని. నిన్ను కాదనగలనా... ఇంకా రాదేం వీడు? (పోబోతాడు.)

చై:- కొడుకును చూసుకుంటేగాని కాలాగేటట్టులేదు. వెళ్ళిచూసిరా. ఆదుర్దా తగ్గుతుంది.

శ్రీ:- (నవ్వి) వస్తా. వెళ్ళివస్తా. ఉంటావుగా (వెళ్తాడు.)

[కాసేపటికి భిక్కుడైవచ్చి వెనక Table మీద కూలబడి పోతాడు.]

చై:- (ఖంగారుగా) శ్రీనివాసం, శ్రీనివాసం, ఏమిటిది?

శ్రీ:- (కోలుకొని) ఏం లేదు.

చై:- ఏం జరిగింది?

శ్రీ:- ఏం జరగలేదు.

చై :- అబ్బాయి యేడీ? ఎక్కడ? (లోపలికి పోబోగా)

శ్రీ:- (విగ్గరగా) వెళ్లకు లోపలికి.

చై :- (ఆగి) ఏం?

శ్రీ:- ఏంలేదు వెళ్లకు; వెళ్తేమన స్నేహంమీద వట్టు.

చై :- నాకేం అర్థమవటం లేదు.

శ్రీ:- అర్థం కాకపోవటమే మంచిది. అర్థం కాకపోవటమే మంచిది. ఈ భగవంతు డెందుకివ్వాలి నాకీ కళ్లు?

చై :- ఏం జరిగిందయ్యా; అసలు సంగతి చెప్పవేం?

శ్రీ:- చెప్తానయ్యా చెప్తా ... ఎట్లా చెప్పాలా అనే...
[సర్వయ్య, పోలీసు ఇన్‌స్పెక్టరు, ఒక పోలీసు వస్తారు.]

శ్రీ:- (సర్వయ్యనుచూసి ఆశ్చర్యపోయి) సర్వయ్యా !!! ఎందుకొచ్చావ్?

స:- రెండు రూపాయలంకోసం కాదు లెగండి. అవతారం యెత్తిన అబ్బాయి గారికోసం వచ్చా.

చై :- ఎందుకూ ?

స:- ఎందుకో తెలుస్తుంది లెగండి; మీ అబ్బాయినీ మా అమ్మాయినీ బయటికి రమ్మనండి.

శ్రీ:- ఆ !

స:- ఆ, అందుకే యీరినీ తెచ్చుకున్నా, ముందు వాళ్ళిద్దర్నీ రమ్మనండి.

శ్రీ:- (దిగాలుగా) సర్వయ్యా!

స:- (కర్కశంగా) సర్వయ్య!

శ్రీ:- సర్వయ్యా - మాట. సిక్కాపల్సింది డబ్బేగా?

స:- కాదు; అమ్మాయి.

శ్రీ:- మీ అమ్మాయి సంగతి నేచూస్తా. నన్ను గోల చెయ్యకు. డబ్బుకావాలంటే తీసుకో. ఎంత కావాలి ? వంద కావాలా ? వెయ్యికావాలా ? చెప్పు ఇప్పుడే యిస్తా.

స:- (మెత్తబడి) యిప్పుడే యిస్తారా !

ఇన:- ఆ, ఆ, యిప్పుడే యిస్తారు. లేకపోతే ఎట్లా, కాని కంప్లైంటు దాఖలయింది, ఇప్పుడు చర్య మాది.

శ్రీ:- (ప్రాధేయపూర్వకంగా) ఇనస్పెక్టరుగారూ !

ఇన:- ముందు మీ అబ్బాయిని పిలవండి. లేదా మేమే పిలుస్తాం.

శ్రీ:- (నిస్సహాయతతో) చైతన్యం !

ఇన:- పదండి తర్వాగా.

శ్రీ:- నా మాట వినండి. మీ మేలు మర్చిపోం.

ఇన:- మర్చిపోరు. మర్చిపోరు. అది నాకు తెల్సు, కాని case book చేసుకున్నాం. ముందు మీ అబ్బాయిని వప్పగిస్తే తర్వాత మీతో తీరుబడిగా మాట్లాడతాను.

చై:- ఏమిటండీ ఇదంతా; అసలు సంగతి ఎవ్వరూ చెప్పరేం ?

ఇన:- ఎవ్వరూ చెప్పలేదూ ! అప్పుడే పూరంతా గోలయిపోతే, రోడ్డుమీద ఎవరి నడిగినా తెలిసేదే ! ! కేసు లెండి. Rape కేసు; మీరి అబ్బాయి మీద (సర్వయ్యతో) పదవయ్యా లోపలికి.

శ్రీ:- ఆగండి.

ఇన:- ఏం ?

శ్రీ:- మా అబ్బాయేగా మీకాప్పల్సింది ? నేనే వప్పగిస్తా తీసుకువెళ్లుదురు గాని- ఆగండి. చైతన్యం, ఇందాక సీకిచ్చింది యిట్లా యియ్యి.

చై:- ఏది ?

శ్రీ:- అదయ్యా- (డబ్బని సొజ్జగా చేసి) ఆ (అతను జేబులోంచి డబ్బు తీసి ఇవ్వగా దాన్ని తన జేబులో పెట్టుకుంటూ లోపలకి వెళతాడు.)

ఇన:- (సర్వయ్యతో) ఏమోయ్ మాడగ్గరకొచ్చి "పిల్లి అన్యాయమైపోయిం" దని బయఉడేరేదాకా అంత గోలపెట్టావ్ - ఆయన డబ్బిస్తా-నే సరికి - కరిగిపోయావేం?

స:- ఏదో బీదోళ్ళం బాబూ?

జై:- సర్వయ్యా, అసలు జరగటం నిజమేనా?

స:- నిజమే బాబూ! అద్దంపోతే నా గూబ పగలగొట్టాడు.

జై:- ఎవరూ!

స:- ఆడే. అబ్బాయినంటూ దిగాడు.

ఇన:- (లోపలికి చూస్తూ) ఇంకా రాడేం యీయన.

జై:- వస్తాడు...ఏమిటో గోల, కాస్త బయటకిపోయి, Bank లో డబ్బు Draw చేసుకు వచ్చేసరికి - ఇట్లా జరిగింది.

స:- జరిగింది బాబూ - జరిగింది-నేకిక్కడ వుండగానేగా. రెండు రూపాయం కోసం నేనిక్కడ కూకుంటే-
ఆ రెండూ లేకుండా- యీ వందా లేకుండా జరిగింది.

ఇన:- ఏదీ యీయన ? ఇంకా తిరిగి రాలేదు ?

జై:- వస్తాడు.

ఇన:- పిల్చుకు రావటానికి యింతసేపెందుకు ?

జై:- కాస్త ఓపిక పట్టండి. 15 యేళ్ళయిన తర్వాత కొడుకు తిరిగి వచ్చాడు. చూసి పూర్తిగా సంతృప్తి పడనేలేదు. ఇంతలో జైలుకి పంపాల్సి వచ్చింది.

ఇన:- ఏదైతేనేముంది. అంతగా అయితే Bail అప్లికేషన్ పెట్టి తంటాలు పడాలిగాని- మమ్మల్నిల్లా నిలబెడితే ఎట్లా?

స:- నిలబడకండి బాబూ, కూకోండి. (కుర్చీ ముందుకు లాగి వేస్తాడు)

ఇన:- ఏడిచినట్టుంది. (పోలీసుతో) లోపలికెళ్ళి పిల్వావోయ్ !

జై:- (లోపలికి చూసి) అదిగో వస్తున్నాడు.
(శ్రీనివాసం విచారంగా, నిశ్చలంగా వస్తాడు.)

ఇన:- ఏడండీ మీ అబ్బాయి ?

శ్రీ:- లేడు.

సై:- (తెల్లబోయి) ఏమయ్యాడు ?

శీ:- పరారీ అయ్యాడు.

ఇన:- పరారా ! ఎట్లా పరారీ అయ్యాడు ?

శీ:- ఏమో.

ఇన:- ఏమోనా ! మా కన్ను కప్పుదామనే... ఆ. మీరు లోపలికి తీసుకెళ్ళిన డబ్బేదీ? (వెతకబోగా)

శీ:- లేదు.

ఇన:- ఏమయిందేం ?

శీ:- ఏమో !

సై:- శ్రీనివాసం !!!

ఇన:- ఏమోనా. తెలుస్తుందాగండి, ఆ డబ్బూ వస్తుంది, ఏ కుర్రవాడూ వస్తాడు- వెతుక్కుంటూ! ఏయ్, వీరికి బేడీలు వెయ్యవోయ్. (పోలీసు బేడీలు వేస్తాడు)

సై:- ఎందుకూ?

ఇన:- ఎందుకా? నేరస్థుణ్ణి నెమ్మదిగా దాటేయించినందుకు, డబ్బుకూడా యిచ్చి, దొడ్డిదోవని ఆయన్ని సాగనంపినందుకు. ముందీయన్ని కుక్కితే- ఆయన తేల్తాడు. ఎక్కడికి పోతాడు- చుట్టూరా సముద్రం వుంటే. ఏయ్ సర్వయ్యా- మీ అమ్మాయినిగూడా ఠాణాలో హాజరు పెట్టు.

సర్వ:- చిత్తం. నే పిలిస్తే ఆది రానంటుందండి.

ఇన:- రానంటే జుట్టట్టుకు లాక్కురా. లేకపోతే నువ్వూ వెళతావు-లాకప్ లోకి. పదండి.

(అప్పటికి బేడీలు వెయ్యటం అయిపోయింది.)

శ్రీ:- పదండి.

సై:- శ్రీనివాసం! (ఆర్ద్రంపోయి దీగాలుగా.)

శ్రీ:- చైతన్యం! (నవ్వి) నే బ్రతికివుండటంలో అర్థంవుంది చూశావా. ఏ జన్మకైనా వకప్రయోజనం వుంటుంది. ఇట్లా అయినందుకు విచార మల్లా (లోపల్నించి రాధవచ్చి కనిపిస్తుంది. దానివంక చూసి) దాని బ్రతుకిల్లా బ్రద్దలైందిగదా అని. (నిట్టూర్పు)పదండి. (ఇన।। పోలీ।। శ్రీని।। వెళ్ళారు.)

చై:- (ఆవేశం ఆపుకుంటూ) సర్వయ్యా!

స:- (విచారంతో) అయ్యా.

చై:- నీకు దబ్బు కావాలిగాదూ?

స:- అక్కర్లేదుబాబూ. ఆక్కరలే; బుద్ధి గడ్డితిన్నది. ఉక్రోషంలో గుడ్డా ణ్ణయిపోయా. గోవువంటి మారాజుని కటకిటాలపాలు చేశా. తొందర బడ్డా, (బాగా దుఃఖంతో అంటాడు.)

చై:- నీకూ హృదయముందా, సర్వయ్యా! చట్టాల కట్టుదిట్టాలకు లేని హృదయం నీకుందా... 11 గం. ల ఐండీ వచ్చినట్టుంది. పద; శ్రీని వాసం సంగతేమిటో, ప్లీడర్లనీ, వాళ్ళనీ, విచారిద్దాం. (రాధ కూల బడింది)

[ఇద్దరూ లేచి వెళ్ళబోతుండగా తెర వెయ్యదలిస్తే వేసుకోవచ్చు.]

2 వ రంగం

[ఆదేగది, మరొక రెండు గంటల తర్వాత రాధ వంటదిగా కూర్చొని వుండగా...కొంతసేపటికి వక 18 ఏళ్ళ కుర్రవా డొస్తాడు.]

కుర్ర:- శ్రీనివాసంగారిల్లు ఇదేనాండి?

రాధ:- ఇదే.

కుర్ర:- వారున్నారా?

రాధ:- లేరు

కుర్ర:- ఎక్కడి కెళ్ళారండి ?

రాధ:- ఏమో. (వెళ్ళబోతుంది)

కుర్ర:- వారెక్కడికెళ్ళారో చెపితే వెళ్ళి కల్సుకుంటాను. కాస్త చెపుతారా?

రాధ:- తెలియదు (వెళ్ళబోతుంది)

కుర్ర:- క్షమించాలి. నేను వారి అబ్బాయిని. వారిని కల్సుకోవాలి...

రాధ:- ఆఁ!!!

కుర్ర:- చిన్నప్పట్నించి వారిని చూడనేలేదు. వారెక్కడ కనిపిస్తారో చెప్పండి.

రాధ:- (దిగ్భ్రమతో అటూ ఇటూ చూసి లోపలికి పరుగెత్తుతుంది.)

కుర్ర:- అదేమిటి-కాస్త ఆగండి. (కాని రాధ వెళ్ళిపోయింది. చేసేదిలేక కుర్రవాడు దిక్కులు చూస్తాడు.)
(బయటనుంచి సర్వయ్య వస్తాడు)

కుర్ర:- (సర్వయ్యతో) ఇది శ్రీనివాసంగారి ఇల్లేనా?

స:- ఆ. యేం?

కుర్ర;- వారెక్కడికెళ్ళారో మీకు తెల్సా?

స:- ఆ.

కుర్ర:- నేను వారబ్బాయిని—కాస్త...

స:- (తెల్లబోయి) ఆ!!!

కుర్ర:- ఆ వార్ని వెంటనే కల్సుకోవాలి. యెక్కడున్నా రాయన?

స:- (పరకాయించి చూసి బయటికి గబగబా పరుగెత్తాడు)
(కాసేపటికి బయటనుంచి చైతన్యం వస్తాడు)

కుర్ర:- మీరేనా శ్రీనివాసంగారంటే ?

చై:- కాదు.

కుర్ర:- అయితే వారెక్కడుంటారు ?

చై:- వారూ...

కుర్ర:- నాకోసం కనిపెట్టుకుంటానని వ్రాశారు. ఇక్కడలేరు. ఎక్కడుంటారో చెప్పండి

చై :- మీరెవరూ?

కుర్ర:- వారి అబ్బాయిని.

చై :- ఆ!! అబ్బాయా!!!

కుర్ర:- ఇదిగో ఆయన వ్రాసి పంపిన వుత్తరాలు.

చై :- (తెల్లబోయి మంచంమీద కూల బడతాడు.)

కుర్ర:- ఏమిటండీ యిది, ఇల్లా కూలబడి పోయారేం? అందరూ యిల్లా తెల్లబోతారేం? మాట్లాడరేమండి? ఏమండీ, మిమ్మల్నే : (మనిషిని కుదిపిస్తాడు. చైతన్యం కదలదు. కుర్రవాడు నాడి చూస్తాడు. చైతన్యం తెప్పరిల్లి.)

చై :- రాధా, రాధా! కాసిన్ని మంచినీళ్ళుపట్రా అమ్మా! సువ్వా, శ్రీనివాసం కొడుకువి?

కు:- అవునండి. నేనే, చూడండి-నాన్నగారు నాకు పంపిన టెలిగ్రాము.

చై :- ఆగు చూస్తా. మంచినీళ్ళు తాగనీ (రాధ మంచినీళ్ళు తేగా, త్రాగి) ఆ; ఏవీ? (అని వుత్తరాలు తీసుకుచూసి) ఆయితే, సువ్వన్నమాట, శ్రీనివాసం కొడుకువి!! ఏబండికివచ్చావ్?

కు:- 11 గంటలబండికి వచ్చాను.

చై :- అహ్హా! శ్రీనివాసం ఘగం॥ లకే వస్తావనుకున్నట్టున్నాడు.

కు:- అసలు బయలుదేరటం ఆ బండికే బయలుదేరాను. కాని నా పెట్టె, Bed ఎవరోకాజేశారు, అవ్వి వెతుక్కోవడంలో ఆబండి దాటింది! ఆవి దొరకనూలేదు. చేసేదిలేక, తర్వాత బండికి బయలుదేరాను.

చై :- ఓహో! (వెరక పెట్టివున్న పెట్టే, Bed చూపించి) ఆ పెట్టే-Bed సివేనా?

కు:- ఇవ్వే! ఇక్కడికెల్లా వచ్చాయి? (ఆశ్చర్యంతో వాటిదగ్గరకుపోయి చూసుకుంటాడు)

చై:- గాభరాపడకు. అంతాతెలుస్తుంది. మీనాన్నను నేవెళ్ళి తీసుకువస్తా నుండు.ఆ రాధా, యితనికి కాఫీ కావాలేమో-యియ్యి [వెళ్ళిపోతాడు]

కుర్ర:- ఆగమ్మాయి..... యేమిటిదంతా? నన్నుచూశి గాభరా పడ్డారే, అందరూ?

రాధ:- ఏంలేదు.

కుర్ర:- (ఇక బాబు no (2) ఏంలేదూ? నాకేం అర్థంకావటం లేదు. నువ్వు. నాకేమవుతావు?

రా:- ఏమవను.

బాబు(2):- ఏమవవ్? ఏమవకుండా యిక్కడెందుకుంటున్నావ్?

రా:- నేనీయింట్లో పనిచేసే మనిషిని.

బాబు(2):- ఆహా.మా నాన్నగారేరీ.

రా:- 9 గంటలబండికి మీ బదులు వేరే ఎవరో వక రౌడీ "తన కొడుకు నంటూ"దిగాడు. అందరూ వాడే కొడుకని నమ్మారు. వాడు వక అపచారంచేస్తే- పట్టుకోటానికి పోలీసులు వచ్చారు. మీ నాన్నగారు వాణ్ణి తప్పించి, తప్పించిన నేరానికి తనే జైలుకి వెళ్ళారు.

బాబు(2):- ఆ !

రా:- కొడుకు మీద ప్రేమతో – కొడుకుకోసం కన్నతండ్రి త్యాగం చేశారు.

బాబు(2):- అరరే, నాసామాను తాజేసిన వెధవే అయి వుంటాడు వీడు. మా నాన్న! అబ్బ... ఆయన్ని చూడాలి త్వరగా. ఎక్కడా ఆయన Photo అన్నాలేదూ? (చుట్టూరా చూస్తాడు)

రా:- ఇక్కడలేదు. లోపల వక చిన్న Photo వుండాలి. తేనా వెతికి-?

బాబు(2):- ఉండా! తీసుకురా–తొందరగా, (రాధ వెళ్ళింది.)

[బాబు తల్లి Photo దగ్గరకెళ్ళి తేరిపార చూస్తాడు. "మరణం 1988" అని చదువుతాడు. తలవంచుకుంటాడు. బయట నుంచి ఇనస్పెక్టర్ వస్తాడు]

ఇన:- ఈ యింట్లో వక అమ్మాయివుంది. 'రాధ' అని, పిలవండి.

బాబు2:- ఏముందాగండి.

ఇన:- త్వరగా పిలవండి. వక Statement తీసుకోవాలి.

బాబు2:- ఏ Statemenet?

ఇన:- ఏదోవకటి. పిలవండి. ఇక్కడ వక Rape కేసు జరిగింది. ఆమె దగ్గర Statement తీసుకోవాలి.

బాబు 2:- ఎక్కడా?

ఇన:- ఎక్కడా !! ఇక్కడే; యీ యింట్లో-ఏదో ఆడివిలోంచి సరాసరి యీ యింట్లోకి దిగినట్టు మాట్లాడతారేం?

బాబు 2:- ఆడివిలోంచే వచ్చాను. ఏమీ తెలియని మాటా నిజమే. నేను శ్రీనివాసంగారబ్బాయిని. యిప్పుడే వచ్చాను.

ఇన:- What !!!

బాబు 2:- What యేమిటి, What?

ఇన:- శ్రీనివాసంగారబ్బాయి! ఏయ్ 804,-804.
(పోలీసు రాగా) Arrest-Arrest him first.

బాబు 2:- ఆ-ఆదీ బాగానేవుంది. రండి, నా అభ్యంతరం ఏంలేదు. (Police బేడీలు వేస్తుండగా రాధ లోపల్నించి వస్తుంది.)

రా:- (తెల్లబోయి) ఇదేమిటి!

బాబు 2:- ఏం లేదు. నువ్వూరుకో. మా నాన్నగార్ని త్వరగా చూడటానికి వెళ్తున్నాను. పదండి.

ఇన:- (రాధతో) ఇతన్ని Lock up లో పెట్టివచ్చి నీదగ్గర State-ment తీసుకుంటాను; నువ్వికక్కడే వుండమ్మా! ఈ మధ్య పొగరు బోతు లెక్కువయ్యారు. నాలుగు కేసుల్లో పడితేగాని బుద్ధిరాదు.

(బాబును తీసుకు ఇనస్పెక్టరు, పోలీసు, వెళ్తారు)

రాధ:- [దిగాలుగాపడి ఆదేకాసేపుచూశి, తలవంచుకు లోపలకు వెళ్ళి పోయి-తలెత్తిచూశి; తెల్లబోయి వెనక్కి వెనక్కిపోతూ]- ఆ!... నువ్వా?!...
ఎందుకొచ్చావ్, మళ్ళీ? (లోపల్నించి బాబు (1) వస్తాడు)

బాబు(1):- వచ్చాను. ఎందుకొచ్చానంటావా? వక పనిమీద వచ్చాను. వెళ్ళ టానికి రైలులేక వచ్చాను.

రాధ:- ఫో! పో. శనిపీనుగులాగ దాపురించావ్.

బాబు(1):- పోవటానేక్కి వచ్చాన్లే-ఊ-మానాన్నగారేరీ?

రాధ:- జైలుకి పోయారు. ఫో- ఆక్కడికే నువ్వుగూడా.

బాబు(1):- జైలుకా!— ఎందుకు?

రాధ:- ఆ; నిన్ను విడిపించిన పుణ్యానికి.

బాబు(1):- అరరే.

రాధ:- నీకు విచారం గూడానా?

బాబు(1):- ఆయన కొడుకును. నాకు విచారంగాక మరెవరికి ?

రాధ:- నువ్వా కొడుకువి! నీ దొంగతనం మాకింకా తెలియదనే!

బాబు:- ఆ?

రాధ:- అసలు కొడుకు వచ్చాడు. నీ సంగతి ఒట్టబయలయింది.

బాబు(1):- ఆ!

రాధ:- కాసేపాగు, నీ పాపం పండి బ్రద్దలవుతుంది.

బాబు(1):- అయితే, నేను త్వరగా పని ముగించాలి. ఊ... శ్రీనివాసంగారు డబ్బెక్కడ దాస్తారో చెప్పు.

రాధ:- ఆ...?

బాబు(1):- ఎక్కడ దాస్తారో చెప్పు ముందు.

రాధ:- నే చెప్పను.

బాబు(1):- చెప్పనంటే కుదరదు.

రాధ:- నిలువునా కోతత వేసినా, చెప్పను.

బాబు(1):- పెంకెతనం చాలించు. నువ్వు అంతా అర్థంచేసుకోలేదు. బాగా ఆలోచించుకో. సికిష్టం వున్నా - లేకపోయినా నాతో రావటమే సీకు మంచిడి. ఒప్పుకోకపోతే ఎంతైనా బాధపడ్తావ్ - వస్తే సుఖపడతావ్. ఈ యింటిని దోచుకుపోయి మనం ఆనందిద్దాం. ఆలోచించు.

రా:- ఆలోచిస్తున్నాను- నీ తల పగలలేదేమా ఆని.

బాబు(1):- ఆతలగలదానివైతే అలాగనవ్.

రా:- (లోపలికి చూచి) ఆగు, మా నాన్న వస్తున్నాడు. తల యిప్పుడే పగులుతుంది.

బాబు(1):- ఆ ! (అని ఖంగారుపడి పారిపోతాడు; లోపలికి) (బయటనుంచి సర్వయ్య వస్తాడు.)

స:- (ఎవరో పారిపోయినట్టు చూశి, అనుమానించి, ఆగి) ఎవరది ? ఎవరే ఆ పారిపోయిన యెదవగాడిద ?

రా:- వాడే, యిందాక వచ్చినవాడు.

స:- ఇందాక వచ్చినోడా ! వాడింకా ఎక్కడున్నాడు ?

రా:- వాడే నాన్నా!

స:- చీ; నోరుముయ్యి; మాట్లాడతావేం- దాచేవోళ్ళని దాచేసి.

రా:- (బిగ్గరగా) నాన్నా...

స:- చీ, మాట్లాడకు, కన్నవాడిని నన్నూ, నిన్ను నమ్మిన ఆ మారాజు కళ్ళల్లో గూడా కారం గొట్టి - దరిద్రపు మొహం. ఫో. పోక పొయ్యావ్ ఆడితోబాటు ? మా ఛీద్రం వడిలేది.

(బాబు (1) వస్తూ)

బాబు(1):- ఆదే నేనూ అన్నా - సర్వయ్యా! కాని రానంటోంది.

స:- అహ్హా, తమరేనా స్వాములు. దొరగారిక్కడే వున్నారే ?

బాబు(1):- ఆ వున్నా. దీనికోసమే వున్నా.

స:- చిత్తం, ఇక వేషంతీసి మాట్లాడవచ్చు. ఇంకెందుకూ సంగతి తేలి పోయాక.

బాబు(1):- ఏం వేషం ?

స:- చాల్లే, నాదగ్గర యీ పప్పులుడకవ్; నీకెనో్న నేర్పాను గాని యీ వేషాలు వెయ్యటం నేర్పేలేదే. ఇవి ఎక్కడ నేర్చావ్ నాయనా?

బాబు(1):- ఏమిటి వాగుతున్నావ్ ?

స:- వాగుడేలేగాని, మొహంమీద మచ్చవుండాలి, ఎట్లా మాయంచేశా ?- ఏంరంగుపూశా ?

(దగ్గరికి పోబోతాడు చేత్తో మొహంమీద రంగు తుడవబోయినట్టుగా.)

బాబు(1):- ఆగు.

స:- దబాయింపులు దాచిపెట్టవోయ్, గురువుకే పంగనామాలా ! మనకి చుట్టలూ అగ్గిపుల్లలూ అందిచ్చిన రోజులు మర్చిపోయా ?

బాబు(1):- ఇస్తే యిచ్చాను. ఆ రోజులు మారాయి. రోజుల్తోబాటు ఆ మనుష్యులూ మారారు. ఆ దొరయింట్లో నీ చేతి క్రింద పనిచేస్తూ వెంటతిరుగుతూ వంటచేసే కుర్రవాణ్ణి కాదు, నేనింక...

స:- కాక కొమ్ములు మొలిచాయా ?

బాబు(1):- మొలిచాయి. దగ్గరకొస్తే కనిపిస్తాయి.

స:- ఏవీ ? చూపించు నాయనా! (ముందుకు పోతాడు)

బాబు(1):- ఇదిగో (వక బాకు పైకిలాగి) దూరంగా వుండు.

(రాధ కెవ్వున కేక వేస్తుంది. సర్వయ్య వెనక్కి తగ్గాడు)

బాబు:- జాగ్రత్త ! కొరివితో తల గోక్కోకండి. వెంటపడ్డావా జాగ్రత్త!

(లోపలి వైపుకి వెళ్ళిపోతాడు)

స:- ఎధవ; పెద్ద మొగోడయ్యాడు-పదేళ్ళక్రింద నాచేతికింద తిరిగినోడు.

రాధ:- పో, వెంటబడి పట్టుకోరాదూ?

స:- ఎక్కడికి పోతాడు రాత్రి ఏడు గంటలదాకా పారిపోవటానికి రైలు బండి లేదు. వూళ్ళో అన్ని వేపులా మన పచ్చంవోళ్ళని పారా పెట్టా (బయట వైపుకి చూసి) అయ్యగారొస్తున్నారే. బేలు (Bail) ఇచ్చారు గామోలు.

రాధ:- ఆ. వస్తున్నారు.

(చైతన్యం, శ్రీనివాసం వస్తారు)

శ్రీ:- నాకోసం చాలా శ్రమపడ్తున్నావ్ చైతన్యం, చాలా శ్రమపడ్తున్నావ్. ఇదిగో తండ్రీకూతుళ్ళు యిక్కడే వున్నారే, ఏడి, మావాడు ?

స:- మర్చిపోయా, ఏరే ఆరు?

రా:- తీసుగెళ్ళారుగా, వాళ్ళొచ్చి.

స:- ఎవరొచ్చి ?

రా:- పోలీసులు.

చై:-
శ్రీ:- } పోలీసులా !!!

రా:- ఆ, మీరెళ్ళిన తర్వాత పోలీసులొచ్చారు. వాళ్ళతో నేనే శ్రీనివాసం గారబ్బాయినని చెప్పారీయన, "నేరం చేసిందీయనే" అని తీసు కెళ్ళారు.

చై:- ఇతను నా తప్పేంలేదని చెప్పలే?

రా:- చెప్పలే. నేచెప్పపోతే నన్నూ చెప్పనియ్యలే. మా నాన్నను తర్వగా చూడాలీ– ఆజైల్లోకే నేనూ పోతా నన్నారు.

శ్రీ:- నన్ను చూట్టానికి-తను నేరం నెత్తినవేసుకు జైలుకి వెళ్ళాడా?

రా:- అ. మిమ్మల్ని చూట్టానికి తొందరపడ్డారు. ఆఖరికి Photo అన్నా చూపించమన్నారు. లోపలికి వెళ్ళి Photo తెచ్చేప్పటికి యిల్లా జరిగింది.

చై:- హు! కొడుకు చెడ్డవాడయితే తండ్రిని జైలుకి పంపైనా తను తప్పు కుంటాడు. మంచివాడైతే తండ్రికోసం తనే జైలుకి వెళతాడు.

శ్రీ:- అయ్యో ఖర్మమా ! చెయ్యి పెదవికందిచ్చే లోపల చెప్పలేని అవాంతరాలు. వాడు కనిపిస్తాడని కొండంత ఆశతో యిటికొచ్చాను. క్రూరఖర్మం యిలా వేధిస్తోంది. ఇప్పుడేమిటి చెయ్యటం ?

చై:- ఆగు! నేవెళ్ళి విడిపించుకు వస్తాను.

శ్రీ:- ఆ, నేనూ వస్తా.

చై:- మళ్ళీ నువ్వెందుకూ ? నేవెళ్ళొస్తాగా, వుండు, (వెళతాడు)
[లోపలి కేకలు "తన్నండి దున్నపోతును", "తొయ్యండి లోపలికి," "20 ఏళ్ళున్నయో లేదో వళ్ళు పొగరెక్కింది."]

స:- ఏంటందది? (సర్వయ్య బయటికి వెళతాడు)
[బాబు(1) ని సర్వయ్య పట్టుకుని లోపలికి లాక్కొస్తాడు]

స:- ఆయ్యగారోయ్, అబ్బాయిగారు దయచేశారు. బోజనానికి లెగండి. మీరు పొండ్రా. వీసిసంగతి నేపడ్తాను. (శ్రీనివాసం. బాబు (1) దగ్గరకుపోయి.)

శ్రీ:- ఎవరు నువ్వు ?

స:- యీడా అండి. హైదరాబాదులో దొరింటో నేను వంట చేశేప్పుడు నాచేతికాడ కుర్రోడండి. యియ్యాళ యీడూ దొరయ్యాడు. తస్సగొయ్యా ! పారిపోదామనే– వూరినిండా మన మణుసులు తిరగతావుంటే ఏడకి పారిపోదామనో.

శ్రీ:- ఎందుకు చేశావబ్బాయ్- యీ పాడు పని ?

స:- ఎందుకనా ! కొడుగ్గా చలామణి అయిపోదామని.

శ్రీ:- ఏం ? అంతేనా ?

బా(1):- ఆ.

స:- (ఎక్కిరిస్తూ) 'ఆ' ఆట. మరి అసలారొస్తే ఏ మేశుద్దామనుకున్నా ?

శ్రీ:- అది అంత తేలిక పనే అనుకున్నావా ?

బా(1):- తేలిక కేముంది? ఈ గోలవల్లగాని లేకపోతే ఆయనే నకిలీ – నేనే అసలూ అంటే నమ్మనిదెవరు? నే నసలు ఆయన్ని లేకుండా చేద్దామనే అనుకున్నా.

స:-
శ్రీ:- } అ.

బాబు(1):- అంతా నా తొందరవల్లే పాడయింది.

స:- పాడయిందేం, పొడిచేవాడు లేక. అరేయ్. నేను నీ గురువుని. నే చెయ్యని పాడుపనిలేదు. ఏం చేసినా, ఏం కూసినా నమ్మినవాడి నోట్లో మన్ను పొయ్య లేదురా.

శ్రీ:- అసలు మావాడి సంగతి ఎలా తెల్సు ?

బాబు(1):- నాకంతా తెల్సు. నేను అనాధాశ్రమంలో పని చేసేవాణ్ణి. మీ అబ్బాయి పూర్వోత్రం తెల్సుగోవాబని ఆశ్రమం అధికార్ల ఆత్రం; మీ కుత్తరం రాయటం అంతా తెల్సు.

స:- కాబట్టి ఈనా రోజుల్నించే ప్లానేదీవన్నమాట. పద. పదండీ అప్ప గిద్దాం పోలీసుల్కి (లాగబోతాడు)

శ్రీ:- ఆగు సర్వయ్యా !

స:- ఆ; చెప్పండి, పోలీసులికి అప్పజెపుదామా? మనమే కర్రుకాల్చి వాతలేసి వూరిమీద వదుల్దామా ?

శ్రీ:- వద్దు. వప్పచెప్పా వద్దు. వాతలూ వద్దు. వదిలేద్దాం.

స:- వదిలేద్దాం !! ఎందుకూ. మరో పేరుతో మరో యింట్లో జొర బట్టానికా !

శ్రీ:- ఇంకా బుద్ధి రాలేదంటావా?

స:- మీరూరుకోండి బాబుగారూ ! వీడిసంగతి మాకొదలండి. నేనూ మనోళ్ళాకల్ని యీడి మక్కలిరకొక్కదతాం.

శ్రీ:- (కోపంగా గట్టిగా) సర్వయ్యా!

స:- ఆయితే వీడి పాడుపన్లకి వదిలెయ్యిరమే !

శ్రీ:- పోనీ, వాడి పాపాన వాడే పోతాడు.

స:- అదే అబ్బుసు. అబ్బాయిగోర్ని చంపాలని చూశాడే– యీడు! యీణ్ణా వదలటం!

శ్రీ - వెళ్ళొచ్చాయి. వెళ్లు; ఇట్లాంటి పనులిక చెయ్యకు.

స:- పోసి- ఆ డబ్బన్నా తీసుకోండి.

శ్రీ:- పోసి. ఆదీ తీసుకుపోసి. మనకు కనపడకుండా పోతే అదేచాలు.

(బాబు వెళ్తాడు.)

(రాధ మంచినీళ్ళతో ప్రవేశించి)

రాధ:- వదిలేశారు... దయతలచి... మంచివారు కాబట్టి. మంచిగా వుండటం నాకూ యిష్టమే కాని అల్లరిపాలైన అమాయకురాల్ని – నేను, నేను క్షమించలేదు.

శ్రీ:- నేనూ వాణ్ణి క్షమించలేను. నిన్నుచూస్తూ అసలు క్షమించలేను. కాని నేనంకా మా అబ్బాయి ఎల్లాగుంటాడో చూడనేలేదు. నా కొడుకనే దృష్టితో వాణ్ణే మొదట చూశాను. ఇప్పుడెంతకాదనుకున్నా ఇంకా వాడు ''మావాడే'' అనిపిస్తుంది-యీ మనసుకో. నువ్వు నన్ను తిట్టుకుంటావేమో. కాని ఏం చెయ్యను? హృదయంలో ప్రేమ తడి ఆరలేదు. రాధా! (దగ్గరకెళ్ళి) రాధపదకు.

(చైతన్యం వస్తాడు.)

చై:- వెధవ పోలీసులు! అనవసరమైన వాళ్ళని పట్టుకు వదలరు! అసలు వాళ్ళు రోడ్డుమీద ఉట్లా తిరుగుతుంటే వూరుకుంటారు

శ్రీ:- మావాడేడీ ?

చై:- ఆ వేషపు వెధవ రోడ్డుమీద విచ్చలవిడిగా తిరుగుతున్నాడు.

స:- వాణ్ణిక్కడికి మనోళ్లు పట్టుకొచ్చారు బాబూ, అయ్యగారే... పదిలేశారు.

చై:- ఆదేమిటి శ్రీనివాసం ?

శ్రీ - అడిసన్లే, మావాడి సంగతేమయింది?

చై:- వదలరట!!

శ్రీ:- వదలరూ!... ఏం?

చై:- వాళ్ళకి నమ్మకం చాలదట.

శ్రీ:- అయ్యో రామా! అదేమిటి ?

చై:- ఏమి టేమిటి! నేరస్థుణ్ణి మనమే వదిలేసి- వాళ్ళచేతిలో వున్నవాణ్ణి నేరస్థుడు కాదంటే ఎవరు నమ్ముతారు? నిన్నొదలటమే ఆ ఇన్‌స్పెక్టర్‌కి యిష్టంలేదు.

శ్రీ:- ఇప్పుడేంచేద్దాం? ఎట్లామరి?

చై:- ఏదోచూద్దాం కానీ...

శ్రీ:- ఏం కానీ? ఒంటిగంటయింది. అన్నంవేళదాటింది. ఆ జైల్లో తిండి తిప్పలూ సరిగ్గావుంటాయా ఏమన్నానా, ఎట్లా...

చై:- 15 ఏళ్ళనుంచి ''ఆ తిండి తిప్పలూ'' సంగతి ఆలోచించా యీవక్క పూటలో యిదవుతావ్ ? నేనవన్నీ ఏర్పాటు చేసేవచ్చాన్లే. బెంగ పడకు. నువ్వు తిండి తిన్నావా?

శ్రీ:- నాతిండికేం తొందరలే...యింతకూ...

చై:- (నవ్వుతూ) సరే, నాసంగతి నీకసలే పట్టదు.

శ్రీ:- ఆ మర్చిపోయా! మీరందరూ భోంచెయ్యండి.

[ఇన్‌స్పెక్టర్ వస్తాడు]

చై:- ఏమండీ, యిట్లా వచ్చారు?

ఇన:- రావద్దుటండీ! యీ గల్లంతంతా మాకు పనితక్కువయిందనేగా.ఇట్లారా అమ్మాయి– Statement యివ్వాలి.

చై:- ఇస్తుంది కానీ, మాకీకేసు వదిలేద్దామనే వుంది. ఏం సర్వయ్యా?

స:- వదిలేద్దామంటి. వదిలేద్దాం.

ఇన:- వదలేసుకోండి-కోర్టులో నాపనికి అడ్డురాకండి, కేసు పెట్టటమే మీయిష్టం. తీసెయ్యటం మీయిష్టంగాదు, మాపని మాది. తర్వాత కోర్టు యిష్టం ఆ ఇట్లారా అమ్మా! ఏం జరిగిందో, చెప్పు.

రా:- ఏం జరగలేదు.

ఇన:- నీ మీదకు ఎవరో వచ్చారే, అతనెవరు?

రా:- తెలియదు.

ఇన:- తెలియదూ? పీరబ్బాయేగా? పీరబ్బాయి తెలియదూ ?

రా:- పీరి అబ్బాయి కాదు.

ఇన:- అదీ నిజమేటలే. ఏదో గొడవ విన్నాను. పోన్లే ఎవరో పకరు. ఇక్కడి కెందుకు వచ్చాడు?

రా:- నే పిలిస్తే వచ్చాడు.
(తెల్లబోయి మాట రాక ఆగి తెప్పరిల్లి)

ఇన:- ఆ!!! ఊ, ఎక్కడుండే పిలిచావ్?

రా:- రోడ్డున పోతుండే.

ఇన:- రోడ్డున పోతుండే పిలిచావా?

రా:- అవును.

ఇన:- అబ్బే! అలా చెప్పగూడదు. కేసు బలం పోతుంది.

రా:- కాని...వున్న సంగతది.

ఇన:- అయితే, అతను రావటం నీకిష్టమేనా?

రా:- ఆ.

ఇన:- ఊ...వచ్చిన తర్వాత ఏమయిందో చెప్పు.

రా:- ఏమీ కాలేదు.

ఇన:- ఏదీ ?

రా:- నా కయిష్టమయిందేదీ కాలేదు.

ఇన:- అయితే కేసేదీ?

పై:- ఏదీ ?

ఇన:- మరి యీ సర్వెయ్యి యింత గోల చేశాడు.

రా:- నాకిష్టమేనని తెలియక చేశాడు.

ఇన:- మరి కోర్టులో అడిగినా యిల్లాగే చెప్తావా ?

రా:- ఆ.

ఇన:- అయితే లాభమేమిటి?

చై:- లాభంలేదు.

ఇన:- ఇంకెందుకూ యీ కేసు...?

చై:- అబ్బే !. ఎందుకూ?

ఇన:- (విసుక్కుంటూ గట్టిగా) ఆగండీ మీరు.

చై:- ఆల్లాగే,

ఇన:- ఓ! బాగానే వుంది. అమ్మాయిని బాగా తయారు చేశారే! సరేలెండి, నేనూ కేసు వదులుకుంటాను, ముద్దాయిని వదిలేస్తాం.

చై:- అంతా మీ యిష్టం.

ఇన:- వస్తాను...రా, సర్వయ్యా నీ సంగతి ఆలోచిద్దాం.

స:- నా సంగతేంటండోయ్ ?

ఇన:- ఆ, రా. తప్పుడు కేసు పెట్టినందుకు వూరికే పోతుందనుకున్నావా?

స:- ఇదేంటండోయ్. ఉరుము వురిమి నక్కమీద పడ్డట్టు, (ఒక పోలీసు వస్తాడు. తొందర తొందరగా రావటం వల్ల మాట తడబడుతూ మాట్లాడతాడు)

పో:- మిమ్మల్ని రమ్మంటున్నారండి.

ఇన:- ఎవరూ?

పో:- స-స-స. సర్కిల్‌గారు, మిమ్మల్నీ, వీరినీ, వీరినీ (శ్రీనివాసం చైతన్యంని చూపిస్తూ) అర్జంటుగా ర-ర- రమ్మన్నారు.

ఇన:- ఎందుకూ?

పో:- ఏమోకండి, "వీ-వీరి అబ్బాయిని నేనూ, జైల్లో పెట్టి నాయన కాదూ" అంటూ ఎవరో వచ్చాడు. ఈ తికమక తెలియక "అందర్నీ కేకేసుకురావోయ్" అన్నారు.

ఇ:- మళ్ళీ యిదేమిటి?

పో:- ఏమోనండి.

ఇ:- ఏమోనంటావేం? నువ్వు వినలే?

పో:- వి. వి. విన్నాగానీ అర్థం కాలేదండి!

ఇన:- ఏమిటో గోల- పదండి సార్.

స:- (చేతులు నలుపుకుంటూ) నేనక్కర్లేదుగదండి!

ఇన:- నువ్వా? వద్దులే...వీరందరూ చాలరూ, పదండి సార్ (అందరూ వెళ్తారు)

స:- రాధా !

రా:- (పలకదు.)

స:- రాధా!

రా:- ఎందుకూ?

స:- నువ్వు పుణ్యంచేసుకు పుట్టావే.

రా:- ఆ, కనిస్తూనేవుంది.

స:- సరేగాని, నీకు కొత్త చీరకట్టబెట్టానుగా. ఆ పాతయ్యి మీ చెల్లెలికివ్వు.

రా:- పాతయి చెల్లిక్కి యివ్వాలా. చెల్లెలు. మాతావు చెల్లెలు.

స:- అట్టా అంటావేంటే. ఆది నీ చెల్లెలు గాదూ?

రా:- అది నా చెల్లెలుగాదూ, నేనప్పసి కాను.

స:- అదేంటే? నా కడుపున పుట్టింది నీకు చెల్లెలు గాదూ

రా:- ఆ చెల్లెలే. వుంచుకున్న ప్రతిదానికీ పుట్టినదల్లా నాకు చెల్లెలవు తుందేం !

స:- చెల్లెలవదూ! ఏమొ, నాకు మతిమరపు జాస్తి గాని మీ అమ్మని మాత్రం నేను పెళ్ళిప్పుడు చేసుకున్నానూ?

రా:- అయితే, మా అమ్మ కూడా వక లేచివచ్చిన మనిషా !!

స:- ఆఁ, నాకోటి ఎదవతో వచ్చిందిగనక అది వక లేచి వచ్చిన మనిషి! అదే కాస్త గొప్పోడితో లేచొస్తే 'ప్రేమ' అనేవోళ్ళు - పాటలు రాసేవోళ్ళు, ఆ పాటలు యీ నాటికి నువ్వు పాడేదానివి.

రా:- చాలు, వూరుకో. మా అమ్మని కూడా పాడుచేశి...

స.- ఏమో. ఎవరు ఎవర్ని పాడుచేశామో- అది బ్రతికుండగా ఎవ్వరం ఆలోచించుకోలే. అది చచ్చిపోయిన తర్వాత నన్నే అది ఊబిలో దింపిపోయిందని బాధ పడ్డా. కాదూమరి, సచ్చి అది సుకపడిందం టావా? బ్రతికి నే సుకపడ్డానంటావా? నేనేం చేసినా నీ బాగుకోసమే!

రాధ:- ఏమిటి వాగుడు? చాల్లే! నాబాగుకోరే నువ్వుచేశేవింతా. నాకేదన్నా ఆశవుంటే అది నిరాశ చేశావ్. నాతల్లి వక లేచి వచ్చిన మనిషి! నా తండ్రి వక తిరుగుబోతు! నాబ్రతు కివ్వాళ యిల్లా అల్లరయింది. ఇంకా యీజన్మకి సుఖం, అవకాశం వస్తుండట ఛీ! ఛీ!

స:- బ్రతకటం బాధే- సేతకానోళ్ళకి. కాని బ్రతకటం నేర్చుకోవాలి రాధా, నేర్చుకోవాలి.

(బాబు (2) వస్తాడు.)

(సరాసరి లోపలి కెళతాడు.)

[బాబు (2) తిరిగొచ్చి]

బాబు(2):- ఏరీ? మానాన్నగారు యింట్లోలేరే యింట్లోవున్నారా?

స:- దేషన్‌కే వచ్చారుగా.

బాబు(2):- Station కా? ఎందుకు?

స:- ఇనస్పెక్టర్‌గారు పిలిపించారు మీకు కనిపించలే

బాబు(2):- లే. ఒక పోలీసువచ్చి ''తలుపుతీసి'' వదిలేశారన్నాడు. నే పరు గెత్తుకువచ్చి జట్కా ఎక్కా. అదే. జట్కావాడికి దబ్బులివ్వనేలేదు. ఇచ్చొస్తానాగు.

(బయటికి వెళ్తాడు)

స:- ఎంత తొందరో!

రాధ:- అంత అలస్యం. (బాబు (2) తిరిగొస్తాడు.)

బాబు(2):- ఇది విన్నారా ? నాపేరు పెట్టుకు వచ్చినవాడు ఎవరో కాదు. మా Hostel ల్లో వాడే. వెధవ, ఎంతో నమ్మకస్తుడిలాగ కనిపించేవాడు. వాడొచ్చి తనంతట తనే పట్టుబడ్డాట్ట!!

స:- వెధవ.

రాధ:- సాపీగా నడిచేదాన్ని సకల తిప్పలూ పెట్టాడు.

బాబు2:- వాడిప్పటికి తనే అసలు కొడుకునని వాదిస్తున్నాట్ట. ఆ Police అన్నాడు.

స:- మీరు భోంచేశారా?

బాబు2:- అహ, వాళ్ళేవో తెచ్చి యిచ్చారుగాని- తినలే.

స:- అయితే భోంచెయ్యండి మీరు.

బాబు2:- భోజనానికేం తొందరలే. వాళ్ళని కూడా రానీ.

స:- లెగండిబాబూ! వాళ్ళందరూ వచ్చేలోగా చాలా పొద్దుపోతుంది. లెగండి. ఈలోగా స్తైనమన్నా చేద్దురుగాని. రాధా-అయ్యగారికి నీళ్ళు తోడు.

బాబు2:- ఊ! సరే-కాని (ఇద్దరూ లోపలికి వెళతారు.) (సర్వయ్య నవ్వుతూ అటే చూస్తుండగా బయటినుంచి చైతన్యం వస్తాడు.)

స:- అయ్యగోరేరండి?

చై:- వస్తున్నారు. అబ్బాయి ఏడి?

స:- స్తైనాని కెళ్ళాడు.

చై:- సర్వయ్యా, అబ్బాయి ఎట్టాంటివాడు?

స:- అబ్బాయికేమండి!

చై:- బుద్ధిమంతుడేనా?

స:- అనుమానం ఎందుకండీ!

సై:- ఊ, మరేంలేదు. మన అమ్మాయిని అబ్బాయిని యిద్దామని - అనుకున్నాంలే.

స:- ఎట్టా?

సై:- సంబంధం బాగుంటుందంటావా?

స:- బాగోకేమండి. చిలకా గోరింకల్లా గుంటారు.

సై:- ఆ! అయితే మా అమ్మాయి 'చిలక'లా గుంటుందంటావా?

స:- అహ. చిలకలా యెల్లా వుంటుందండీ? నలుపు కాదూ? గోరెంకలా గుంటుంది. (నవ్వుతారు)

బాబు2:- (వచ్చి) మా నాన్న వీరండీ?

స:- మీరు స్నానానికి వెళ్ళలే?

బాబు2:- లే. వీరి మాటలు విని వచ్చేశా. మీరు Station లోనే వున్నారటగా.

సై:- ఆ. వున్నాం. నువ్వింటికెళ్ళావని చెప్పారు. మేమూ బయలుదేరి వస్తున్నాం. త్రోవలో రోడ్డు మీద వక కారు స్పీడుగా ఎదురువచ్చింది కాస్త యిటు తప్పుకున్నాం. ఇంతలో వెనుకనుంచి మరోకారు... ...వచ్చి...

బాబు:- ఆ కారు...వచ్చి...

సై:- మా వెనగ్గా వచ్చేసి...ఆగింది.

బాబు:- అయితే...

సై:- కారు మమ్మల్ని చూసే ఆగిందిలే. దాంట్లోంచి మీ నాన్న స్నేహితుడొకడు దిగి, అర్జంటుగా మాట్లాడాలని బలవంతంగా లాక్కెళ్ళాడు- మీ నాన్నని. కాసేపటికి వస్తాడు నువ్వెళ్ళి స్నానం చెయ్యి...పో..

బాబు:- సరే. (2) (లోపలికి వెళతాడు)

సై:- సర్వాయ్యా! మాట; శ్రీనివాసం ఇప్పుడే వస్తున్నాడు. నా వెనకే వచ్చాడులే. కాస్త నాటకం ఆడదాం. మాట. (చెవులో ఏదో చెపుతాడు.)

స:- అబ్బే, ఎందుకండీ?

చై:- నువ్వూరుకో. నే చెప్తాగా.

(శ్రీనివాసం వస్తాడు.)

శ్రీ:- ఆ Shop దగ్గర నన్నుండమని నువ్వొచ్చేశావేం?

చై:- (నవ్వి) నువ్వు వుంటావనుకోలే.

శ్రీ:- మరి మావాడేడీ?

చై:- మీవాడా,...రాలే.

స:- అవు; వచ్చినట్టుండారండీ.

చై:- ఏహ! రాందే. రాలే.

శ్రీ:- స్టేషన్నుంచి బయలుదేరినవాడు యింటికి రాక ఏమయ్యాడంటావ్ ?

చై:- త్రోవలో వుండివుంటాడు. మరీ...మీ వాడికి మా పిల్ల నచ్చుతుందా, కాస్త నలుపుగా?

శ్రీ:- స్టేషన్నుండి ఇంటికి రావటాన్కి ఇంత సేపెందుకు ?

చై:- కుర్రవాడుగాదూ! త్రోవలో ఎక్కడన్నా సిగరెట్ కాల్చుకోడాన్కి ఆగాడేమోలే.

శ్రీ:- మా వాడు సిగరెట్లు కాలుస్తాడంటావా!

చై:- ఏమొ. కుర్రతనం. ఇంతకూ పెళ్ళిసంగతి ఏమంటావ్?

శ్రీ:- ఏదీ వాణ్ణి రానీ...త్రోవ తప్పాడేమొ - అందాకా వెళ్ళి చూసిరానా- ఏమిటి?

చై:- ఆగవయ్యా; నా మాట...కాస్త విను.

శ్రీ:- మీ ఆమ్మాయి పెళ్ళిసంగతి తర్వాత చూద్దాంలే ఆగు.

(బయటికి వెళతాడు.)

స:- ఎందుకండీ అనవసరంగా ఆయన్ని ఆడిస్తారు ?

చై:- ఉత్త తొందర మనిషి.

(రాధ వస్తుంది.)

రా:- ఏరీవారు ?

స:- ఎవరు ?

రా:- బాబుగారే.

చై:- బయటికి వెళ్ళారు. అబ్బాయి ఏడీ ?

రా:- బాబుగారొచ్చినట్టున్నారని నేననేసరికి గబగబావస్తున్నారు.(పైజామా షర్టు బనీను వేసుకొని బాబు 2 వస్తాడు)

బాబు 2:- ఏరండీ ?

చై:- మీనాన్నేనా ? నీకో పెళ్ళిసంబంధం కుదుర్చుకు రావటాన్కివెళ్ళారు.

బాబు 2:- ఏమంటారూ ?

చై:- ఏమంటారేమిటయ్యా ! ఎగిరి గంతెయ్యక - పెళ్ళి !-పెళ్ళి అంటే ఎరగవ్ ?

బాబు 2:- వేళాకోళం ఎందుకండి. ఆయనింకా రాలే ?

చై:- వస్తాడు. తొందరగానే వస్తాడు. నువ్వెళ్ళి కాస్త తల దువ్వుకురా. వెళ్లు, యింతలో ఆయనా వస్తాడు.
(నిరాశగా కుర్రవాడెళ్తాడు-లోపలికి)

స:- పాపం !
(శ్రీనివాసం బయటనుంచి వచ్చి)

శ్రీ:- లేదటయ్యా, అబ్బాయి యింటి కిందాకే వచ్చాట్ట – ఆ కొట్టువాడం టున్నాడు.

చై:- అయితే యింట్లోనే వున్నాడన్నమాట !

శ్రీ:- ఆ యింట్లోనే వుండి వుండాలి.

చై:- అయితే ఏ పెట్టెలోనన్నా దాక్కున్నాడేమొ చూడూ!

శ్రీ:- ఏమొ; కుర్రవెధవ...చూసి వస్తానాగు.
(లోపలికి పోబోగా ఎదురు కుర్రవాడొస్తాడు. ఇద్దరూ ఆయనేనా అని ప్రశ్నార్థకంగా కళ్ళతో చైతన్యాన్ని అడుగుతారు. సంతోషం ఎక్కువవుతుంది - యిద్దరిలో. చైతన్యం తల వూపుతాడు. ఇద్దరూ

సంతోషంతో కౌగలించుకుంటారు. సంతోషంలో కళ్ళనీళ్ళు తిరిగాయి శ్రీనివాసానికి)

శ్రీ:- క్షమించు బాబూ! నీ నాయన యింతవరకూ బ్రతికివుండీ చచ్చిన వారితో సమానమయ్యాడు.

బాబు 2:- నాన్నా !

శ్రీ:- బాబూ !

బాబు 2:- నాన్నా !

శ్రీ:- నాన్న, నాన్న. ఈ మామూలుమాటలో యింత తియ్యదనం ఎక్కణ్ణించి వచ్చింది బాబూ !

బాబు 2:- నాన్నా !

శ్రీ:- చాలు. చాలు బాబూ! చాలు ఇగిరిపోయిన కన్నీళ్లు ఉబికివచ్చి ఎండి పోయిన హృదయం నిండిపోయింది, ఇక చాలు. ఈ సంతోషం– ఈ సంతోషం కలకాలం నిలిచివుండే ఆదే చాలు. నాతోనువ్వుండే అంతే చాలు.

చై:- ఇక తండ్రీకొడుకులు మమ్మల్ని బొత్తిగా మర్చిపోయారు.

శ్రీ:- ఆ... మర్చిపోయా. నీ భోజనం సంగతేగా! రాధా, అందరికీ వడ్డించు. సర్వయ్యా, నువ్వుకూడా...

స:- వద్దులెండి. నేపోతా. ఇంటికాడ అళ్లు తిన్నారో-పడుకున్నారో.

శ్రీ:- వాళ్ళ సంగతి నాదగ్గరెత్తకు.

స:- వాళ్ళసంగతి మీ దగ్గరెత్తక ఎట్టా బాబూ ? మీ పిల్లాడు మీ కెట్టాగో నా పిల్లలు నా కట్టాగేగా !

శ్రీ:- (ఆలోచించి) అవును. అంతేగా. ఇంద- యీ రెండూ తీసుకో... (పర్సు చూసి) అరే, చిల్లరలేదే.

స:- పోనీ, నోటే యిప్పించండి.

శ్రీ:- ఊ, తీసుకో, కాని భోజనం చేసి మరీ వెళ్లు.

చై:- ఇకయితే నాసంగతేంచేశావ్ ?

శ్రీ:- ఏది?

చై:- మా అమ్మాయిని చేసుకోవటం

శ్రీ:- అదా, భోజనం చేసి మాట్లాడదాంలే.

చై:- ఎంతసేపు మాట్లాడాలీ...

శ్రీ:- చైతన్యం, స్నేహితుణ్ణి బాధించటం తేలికా ? క్షమించటం తేలికా ?

చై:- రెండూ తేలికే- తల్చుకుంటే.

శ్రీ:- అయితే ఇందులో నీ కేది యిష్టం ?

చై:- క్షమించటమే.

శ్రీ:- అయితే నన్ను క్షమించు.

చై:- అంటే ? నాకర్థమయ్యేటట్టు చెప్పు.

శ్రీ:- మీ అమ్మాయిని మావాడికి చేసుకోం.

చై:- ఏం ?

స:- గోరెంకలాగుంటుందని.

శ్రీ:- కాదు. రాధని వాడికిచ్చి చెయ్యాలి.

స, చై, ర:- రాధనా !

రాధనా !!

నన్నా !!!

శ్రీ:- ఆ. రాధను. 8 ఏళ్ళనుంచీ నాకు అదే కొడుకూ, అదే కూతురూ. యీ యింట్లో దీపం పెట్టి యీ జీవితాన్ని సాకిన రాధను నా కోడలుగా చేసుకోవడం బాగుండదూ? ఏం చైతన్యం? లేకపోతే దాని జీవితం గోతిలో దిగమారిపోదూ ?

చై:- శ్రీనివాసం! నీ సంకల్పాని కడ్డంరాను. ఇదినేనే నీకు చెప్పి, నీ చేత చేయించాల్సింది. అది నాకెందుకు తట్టలేదా అని విచారిస్తున్నాను.

రాధ:- వద్దు, వద్దు. విచారించకండి. మీ అమ్మాయినే యిచ్చి చేయండి.

మై:- ఏం ?

రాధ:- ఏమని అడుగుతున్నారా ? అంతా తెల్సినవారేగా మీరు.

శ్రీ:- నేనంతా ఆలోచించా, రాధా! ఆలోచించి చేసిన పనే యిది.

రా:- కాదు. మీకు తెలియదు. మీకు తెల్సినవికాక తెలియనివి చాలా వున్నై.

బాబు2:- తెలియనివి తెలియకుండానే వుండనియ్యి. తెల్సినవాటిని తెల్సుకుని, నేను నిర్ణయానికి వచ్చాను. రాధా ! నిన్ను పెళ్ళి చేసుకుంటాను. నిమిడ వున్న "వాడు" మాపెయ్యటానికి కాదు. నీ అందం చందం చూశి కాదు. కాని అంతకంటె ఎక్కువే ఆలోచించి, నిన్నే పెళ్ళి చేసుకుంటాను.

రా:- వద్దు. మీరెంతో మంచివారు. మంచితనం చూపించుకోటానికి మీరెంతైనా త్యాగం చేస్తారు. కాని క్షమించండి. యీ ప్రయత్నం ఆపండి.

బాబు2:- ఎందుకు ?
మై:- ఎందుకు రాధా ?
శ్రీ:- ఎందుకు రాధా ?

రా:- నేను మీకు తగను. మీ అబ్బాయికిగాని, మీ కుటుంబానికి గాని, మీ అంతస్థుకిగాని నేను తగను. మీకు తెలియదు-నా తల్లి వక లేచి వచ్చిన మనిషి.

మై:- ఏమిటీ !

రా:- కలుషితమైంది నాతల్లి, నా వంశం. మీ వంశాన్ని కలుషితం చెయ్యటం నా చేతగానిపని. నేనిక్కడ వక దాసిని, దాసిగానే నన్ను బ్రతక నివ్వండి.

మై:- నిజమేనా సర్వయ్యా ?

స:- నిజమేనండీ– నా సుఖం, నా సంతానానికి సంతాపమౌతుందని నేనెప్పుడూ అనుకోలేదండీ!

శ్రీ:- అనుకోవద్దు. మనకు కావల్సింది "మనసు మంచితనం". "వంశం వంకరలు" మనసును మలినం చెయ్యలేవు. మనకు కావల్సింది గుణంగాని, కులంగాదు రాధా; నువ్వు వప్పుకోవాలి.

బాబు:- రాధా, ఇదిగో నా చెయ్యి. నీ చేతికోసం కాచుకునుంది. కాచుకునే వుంటుంది కలకాలం.

రాధ:- ఏమంటారూ!

బాబు:- పెళ్ళిచేసుకుంటే నిన్నే చేసుకుంటా! అంతే నేననేది.

రాధ:- కాని నేను మీ చేతికి సరికాను. నా స్థానం అదికాదు. నా స్థానం యిది-మీ పాదాలు.

(కాళ్ళమీద వాల్తుంది.)

శ్రీ:- నా హృదయపూర్వకంగా కోరతాను, ప్రార్థిస్తాను, యీ చిరంజీవుల సౌశీల్యం శాశ్వతం కావాలని. చైతన్యం! మీ అమ్మాయి రాధకు కల్యాణపు కుంకుమ దిద్దాలి. పిలచుకురా మీ వాళ్ళని...పిలుచుకురా సర్వయ్యా; మీ వాళ్ళందర్నీ పిల్చుకురా. అందరికీ యిక్కడే భోజనాలు. (అందరూ అన్నివైపులకీ వెళ్ళబోగా.) చైతన్యం! నా జన్మకి ఫలితం దక్కింది. వాళ్ళిద్దరూ కాపురం చేస్తుంటే, కళ్ళారా చూస్తూ, నేనూ (గోడమీద Enlargement చూపిస్తాడు) వక బొమ్మలాగ కాలం గడుపుతాను. ప్రాణంవున్న ప్రతిమలాగ చూసి సంతోషిస్తాను. తండ్రిగా నా జీవితం తరించిందని తలుస్తాను. (నెమ్మదిగా మధ్య Enlargement దగ్గరకొచ్చి చూస్తూ)

శ్రీ:- నిర్భాగ్యురాలా !!

(కంటినీటి బొట్టు క్రింద రాల్తుంది)

-:తెర:-

బంగారు సంకెళ్లు

రచన :

డా. కొర్రపాటి గంగాధరరావు

పాత్రలు

1. రంగనాథం
2. రామం
3. బాబాయి
4. కుర్రవాడు

(రామం యింటిలో మధ్య సావడి. ఒక ప్రక్కగా రెండు కుర్చీ లుంటాయి. రెండు ప్రక్కలా రెండు ద్వారా లుంటాయి.

ఒక వైపునుంచి - రంగనాథం ప్రవేశించి, రెండవ వైపు ద్వారందాకా వెళ్ళి, "రామం" "రామం" అని పిలుస్తాడు.)

(లోపల్నించి ఏవో మాటలు వినబడతాయి.)

లోపల్నించి రామం కంఠస్వరం:- అందుకని - ఆ మాటంటావా ? నేను మొగుడ్ని, నువ్వు పెళ్ళానివా? నువ్వు మొగుడూ, నేను పెళ్ళాన్నినా!

స్త్రీ కంఠస్వరం:- మీరే మొగుడైతే మాత్రం, మీరు ఏం చేసినా వూరుకోవాలా ?

రామం:- కంఠస్వరం:- ఊరుకోవద్దూ ? వూరుకోకపోతే వూరి వాళ్ళంతా ఏమంటారు ?

స్త్రీ కంఠస్వరం:- ఏమంటారూ ? 'వట్టి దద్దమ్మ' అంటారు ?

రామం:- అంటే అనిపించుకుని వూరుకోనా - నిజంగా నేను దద్దమ్మ నయినట్టు?

స్త్రీ కంఠస్వరం:- నిజంగా దద్దమ్మ కానట్టు !

రామం:- నేను దద్దమ్మనా ? మళ్ళీ అను ఆ మాట. ఈతదవకు వూడుకున్నా యిక్కడ ఎవరూ లేరుగనుక. ఇక వూరుకునేది లేదు, జాగ్రత్త!

స్త్రీ కంఠస్వరం:- జాగ్రత్తగా లేకపోతే ఏంజేస్తారేం?

రామం:- (లోపల్నించి) ఏంజేస్తానా? ఏమైనా చెయ్యగలను. తర్వాత మీరంతా కల్సి-ఏడ్చినా సరే. ఏమైనా చేసేస్తాను. ఆ ! జాగ్రత్త ! ఏమనుకున్నారో! నే తల్చుకుంటే ఏమైనా చెయ్యగలను. (అంటూనే మధ్య సావడిలోకి వస్తాడు, రంగనాథం అదిరిపోతూ వెనక్కి వెనక్కి పోతాడు.) తల్చుకున్నా ఏం చెయ్యలేని దద్దమ్మ ననుకున్నావా ? ఇక అనుకోకు. చేతిలో కర్రవుంటే పీకు పగులగొట్టేస్తాను. ఏం లేకపోతే చేత్తో దవడ పేలగొట్టేస్తాను.

రంగ:- (నిమ్మదిగా దగ్గరకెళ్ళి) ఏమిట్రా యిది ?

రామం:- (వినిపించుకోకుండా) అదీకాకపోతే యింట్లోంచి గెంటెయ్యగలను. లేకపోతే నేనే వెళ్ళిపోగలను.

రంగ:- ఏమిట్రా యిది?...

రామం:- ఇది కోపంలే; ఆగు కాస్త. బలే కోపంగా వుంది ?

రంగ:- కోపం కనిపిస్తూనే వుంది. కాని ఎవరిమీదేం ?

రామం:- ఎవరిమీదేమిటి- దానిమీదే... లోపలుంది. (ఆయాసపడ్తూ) మా ఆవిడమీద.

రంగ:- మీ ఆవిడమీదా? (ఆశ్చర్యపోయి) నీకు కోపం వచ్చిందా !

రామం:- ఆ! ఆ! వచ్చింది.

రంగ:- ఎప్పుడూ !

రామం:- ఇప్పుడే, 2 నిమిషాలయింది.

రంగ:- ఎందుకు వచ్చిందేం ?

రామం:- ఎందుకేమిటి? వెధవ ప్రశ్నలూ, నువ్వూను. పెళ్ళాం మీద కోపం రాదూ మొగుడికి!

రంగ:- వస్తుంది-వస్తుంది- కాని నీ కెందుకు వచ్చిందని ?

రామం:- ఏం? నాకు రాకూడదా? నేను మొగుణ్ణి కాదా ?

రంగ:- నువ్వు మొగుడివేరా. నీకూ కోపం రావచ్చు. కాని ఎందుకొచ్చిందని ?

రామం:- అదే వచ్చింది- మీ బ్రహ్మచారిగాళ్ళతో; కోపం వచ్చినప్పుడల్లా ఎందుకొచ్చిందని ఆలోచిస్తూ కూర్చుంటామా ?

రంగ:- అబ్బే? ఆలోచిస్తే కోపం ఎందుకొస్తుంది ?

రామం:- మరెందుకొచ్చిందని అడుగుతావేం?

రంగ:- నీ బుర్రలో కాస్త ఆలోచన వున్న వాడివిగదా అని.

రామం:- ఊ ?

రంగ:- బుర్రలో ఆలోచనవుంటే కోపం రాదుగా!

రామం:- నా బుర్రలో ఆలోచన లేదంటావా? కోపం లేదంటావా?

రంగ:- ఏదో వకటి లేదంటాను.

రామం:- కాదు; రెండూ వున్నాయి. బుర్రకెమించిన ఆలోచనా వుంది, బుర్ర పగిలిపోయేటంత కోపం వుంది.

రంగ:- ఏమిటి వుందీ?

రామం:- అవి నీ కర్థం కాదులే.

రంగ:- ఏం ?

రామం:- నీ బుర్రలో రెండూ లేవు గనుక.

రంగ:- లేవుగాని, నువ్వు చెపితే- గ్రహించగలనా!

రామం:- అయితే చెపుతా విను. నీ బుర్రలో ఏ మాత్రం ఆలోచనవున్నా బోలెడు కోపం వస్తుంది.

రంగ:- కానీ చెప్పు చూస్తా.

రామం:- విను. నువ్వు కాస్త శ్రద్ధగా వింటేగాని అర్థం కాదు. ఆ, అటు మొన్న...రాత్రీ...ఏమిటిమ్మా అదీ... (ఆలోచనలో పడ్డాడు.)

రంగ:- నీకు కోపం వచ్చింది యివ్వాళగాదుగా ?

రామం:- ఆగు నువ్వు. అసలేం జరిగిందో, జ్ఞాపకం చేసుకుంటుంటే అర్థమౌతా వేం?.....అటు మొన్న రాత్రి...

రంగ;- అటు మొన్న రాత్రి, మరం గుంటూరు వెళ్ళాంగాదురా ?

రామం:- ఉహూ; అయితే మొన్న రాత్రి కాదోలు. ఇంటికి రాంగానే, చొక్కా మాపుకున్నానని సాధింపు మొదలెట్టింది.

రంగ:- మీ ఆవిడ?

రామం:- ఆ, మా ఆవిడ. మాపే...ద్ద ఆవిడ-నామీద తను మేనే[illegible] అయి నట్టు-అక్కడికి ప్రపంచంలో ఎవ్వరూ చొక్కాలు మాపుకోట్టు-

రంగ:- అవునా; నువ్వు చొక్కాలు మరీ మాపేస్తావ్!

రామం:- (కోపంగా) నా చొక్కాలు, నే మాపుకుంటే తనకేం?

రంగ:- అబ్బే, తనకేం?

రామం:- నీకేం?

రంగ:- అవును నాకేం?

రామం:- సీపాటి బుద్ధి లేదేం దానికి! చొక్కాలు తెగమాపితే ఎక్కువసార్లు వుతుకులుకి వెళ్తాయటా - వెళ్తే చిరుగుతాయట-తను నాకేమన్నా చొక్కాలు కట్టిస్తోందా? నా చొక్కాలమీద పెద్ద లెక్చరు మొద లెట్టింది-దాంతో కోపం వచ్చింది...

రంగ:- ఆది మొన్నరాత్రి...ఆ?

రామం:- ఆ, మొన్నరాత్రి...నిన్న రాత్రి...

రంగ:- నిన్న రాత్రి గూడా కోపం వచ్చిందా?

రామం:- నిన్న రాత్రి, పొద్దుపోయి యింటికి వచ్చాను. ఆకలితో కడుపు కాలి పోతూంది. ప్రాణానికి శోష వచ్చేసింది. రాంగానే కుర్చీలో కూల బడి కాసిన్ని మంచి నీళ్ళడిగాను. వెంటనే యివ్వాలా, అక్కర్లేదా?

రంగ:- ఇవ్వాలి, యివ్వాలి.

రామం:- ఇవ్వాలా? యివ్వలేదు. ఇవ్వనుగాక యివ్వనంది. మంచినీళ్ళు ఒక గుక్కెడు కూడా యివ్వనంది.

రంగ:- పోనీ, నువ్వే వెళ్ళి తాగెయ్యక పోయావు? Self help మంచి దన్నారు.

రామం:- ఆ, నేనేవెళ్ళి తాగబోతే-బేతిలో గ్లాసు లాగేసుకుంది.

రంగ:- ఛా-ఛా.

రామం:- అన్నానికిముందు మంచినీళ్ళు తాగితే ఆకలి చస్తుందట- "అన్నం తినండి. మంచినీళ్లు తాగద్ద"ని ఆరోగ్యశాస్త్రం ఉపదేశించింది.

రంగ:- * (ఆశ్చర్యంగా) ఆ!

రామం:- ఇవ్వాళ ప్రొద్దున్న మట్టుకు ప్రొద్దున్న - కాఫీలో తను First decoction కలుపుకుతాగేసి-Next decoction బాబాయికి, Last decoction ను నాకూ యిచ్చింది.

రంగ:- ఆ, (ముక్కుమీద వేలేసుకొని అంటాడు.)

రామం:- ఆలా అన్నానని మధ్యాహ్నం మరీ చేదు కాఫీ యిచ్చాడి.

రంగ:- అహా!

రామం:- ఇవన్నీ వింటుంటే కోపం రావటం లేదురా నీకు?

రంగ:- అహా! ఇంకారాలే.

రామం:- ఎందుకొస్తుందీ? నీకూ నీ యింట్లోవున్న సర్వాధికారాలూ పరహస్త గత మయిపోతే వస్తుంది. నువ్వేమన్నా అను అబ్బాయ్, ఇది కాపరానికి వచ్చిందీ- నేనీ యింట్లో వక నౌకర్ని అయిపోయాను. మాట మాట్లాడితే తూబ్ను ఇంట్లో సిగరెట్లు కాల్చగూడదు. తనకి వాసన గిట్టదట. రెండో ఆట సినిమాకి వెళ్ళగూడదు. తను వంటరిగా ఉండ లేదట. ఇంట్లోవున్నా రాత్రి 10 గంటలదాకా తనతో మాట్లాడ గూడదు-తను నవలలు వ్రాసుకోవాలట. పోనీ, ఏం తోచక రేడియో పెట్టుకుందామంటే అదీ వీల్లేదు; తనకి-Disturbance అట. చచ్చి పోతున్నాననుకో యీ రూల్సుతో.

రంగ:- అహా!

రామం:- ఎల్లాగరా! ఇంత చెప్పినా నీకు కోపం రాకపోతే!

రంగ:- అదే చూస్తున్నా. నాకు రానికోపం "నీకెట్లా వచ్చిందా" అని.

రామం:- ఈ సంగతి చెప్తా విను. ఇవ్వాళ 2 Sets Tennis అడి ఆరున్న రకి యిందికివచ్చా. అలుపు తీర్చుకోటానికి సరాసరివెళ్ళి, ప్రక్క మీద పడుకున్నా. ఇంతలో వచ్చింది- ఎక్కణ్ణించి వచ్చిందో- "Get Down from the bed" అంది. చూశావా? bed మీద పడుకోటానికి కూడా వీల్లేదన్న మాట!

రంగ:- ఏమిటి?

రామం:- నేనూ ఏమిటి అన్నా. "I say, get down from the bed" అంది. నేనేమనను?

రంగ:- ఇహ ఏముంది అంటానికి?

రామం:- మరి కోపం రావాలా వద్దా?

రంగ:- రావచ్చు.

రామం:- ఇంట్లో సర్వెంట్‌కన్నా కనాకష్టమా? ఈ మాదిరి Insult చేస్తుంటే కోపం రావాలా, వద్దా? "No. I dont" అన్నా, " I say you must" అంది. నేను "No No. No." అన్నాకోపంగా.

రంగ:- ఆది ఇంగ్లీషులో అన్నావా, తెలుగులో అన్నావా?

రామం:- తెలుగులో కోపం ఎట్లా వస్తుందోయ్? ఇంగ్లీషులోనే అన్నా.

రంగ:- అయితే, నీకు నిజంగానే కోపం వచ్చినట్టుంది.

రామం:- కాస్తా కూస్తాగా వచ్చిందా? మా ఆవిడ ఆడదయి పోయిందిగాని-మగాడయితే ప్రాణాలు తోడేద్దును. వళ్ళు మండిపోయింది. కోపం నిండిపోయింది; ఇష్టం వచ్చినట్లు కోప్పడి- నోటికి వచ్చినట్లు తిట్టి, ఇంకా కోపం తీరక...కోపం తీరకా...

రంగ:- కోపం తీరక- ఏంచేశావు?

రామం:- కోపం తీరక యిట్లా బయటికి వచ్చేశాను. ఇక్కడ నువ్వున్నావు.

[బాబాయి కోపంగా ప్రవేశం]

బాబా:- ఉన్నావూ- ఇక్కడ. ఇల్లారా; రా దగ్గరికి, ఈ యిల్లు ఎవరిది?

రంగ:- (భయంగా) మీది

బాబా:- నాదా? నాదికాదు. అమరశ్రీది. తెలిసిందా? ఈ యింటిపీద పెత్తనం ఆమెదే- తెలిసిందా?

రంగ:- తెలిసింది.

రామం:- పెత్తనం తనదని నోటికొచ్చినట్లల్లా అంటే- పడి వూరుకోవాలా?

బాబా:- నోటికొచ్చినట్లల్లా ఏమంది?

రామం:- ఏమనాలి? 10 నిమిషాలక్రింద నన్ను దద్దమ్మంది.

బాబా:- అవును, నిజమేగా. "నవ్వు దద్దమ్మ"వని నేనెన్నిసార్లనలేదు. అదీ-అదే-అన్నది.

రామం:- అంటే అన్నది. కాని కాసిన్ని మంచినీళ్ళడిగినా యివ్వనిపెళ్ళాం-ఎందుకొచ్చిన పెళ్ళాం అంట?

రంగ:- పైగా చొక్కాలు మాపాపని సాధిస్తు

రామం:- సినిమాకి వెళ్ళగూడదు-రేడియో పెట్టగూడదు.

రంగ:- సిగరెట్లు కాల్చగూడదు. (రామం నోరు నొక్కుకుంటాడు.)

బాబా:- ఆ-నువ్వు సిగరెట్లు కాలుస్తా ?

రంగ:- అప్పు దప్పుడూ-ఎప్పుడన్నాలెండి.

రామం:- మొగుడూ పెళ్ళాం అన్నాక- మాటా, మంచీ అంటూ వుంటుంది. పది గంటలదాకా నవలలు రాస్తుంది, అందుకని మాట్లాడటానికి వీలులేదు.

రంగ:- పది గంటల తర్వాత నిద్రవస్తూంది.

రామం:- ఇవ్వాళమట్టుకు యివ్వాళ "Get out of the bed" అంది. ఆస్తి అంతా తనదే అయితే- bed కూడా తనదేనా?

బాబా:- నిన్ను Get out అందేం ?

రామం:- ఒక్క Get out ఏమిటి ? సర్వెంట్‌కంటె హీనమయిపోతే! మంచి కాఫీకూడా గతిలేదు. తనకి fist filter కాఫీ-నీకు "next", నాకు last యిస్తుందీ ?

బాబా:- నాకూ first filter కాఫీ యివ్వదూ?

రామం:- నీకు first లేదూ, నాకు second లేదు. ఛీ, ఛీ, వళ్ళు మండిపోతుందే-

బాబా:- మండదూ? ఆగు. కనుక్కువస్తా. (తోపలికి వెళతాడు.)

రంగ:- మీ బాబాయికి కోపం వచ్చినట్లుందిరోయ్ ?

రామం:- వచ్చినట్టేవుంది.

రంగ:- లోపలికి వెళ్ళి ఆవిడమీద కేకలేస్తాడు.

రామ :- వేస్తాడు. ఆగు, కుర్రాణ్ణి పిలిచి, విసిరమ్మందాం. అరే! ఇట్లా రారా (కుర్రవాడు రాగా) బాబాయి ఏమని కేకలేస్తున్నాడో-వినిరా...పో'

కుర్ర:- ఎట్లాగేవుంది? (వెళతాడు.)

రంగ:- బాగా కేకలేస్తుండాలి యీపాటికి.

రామం:- బాబాయికి కోపం వస్తే కేకలు బాగా వేస్తాడు. ఈ దెబ్బతో అణిగి పడివుంటుందిలే! ఇక ఎదురు చెప్పిందంటే ''బాబాయితో చెప్తా'' అని బెదిరించవచ్చు. ఇక చూడు. చేతికో ఆయుధం దొరికింది. ఇక ఎట్లా ఆడిస్తానో, చూడు.

రంగ:- (తలుపు దగ్గరకెళ్ళి వింటాడు రామం దగ్గరకెళ్తాడు. లోపల్నుంచి బాబాయి కేకలు వినిపిస్తాయి)

బాబా:- (లోపల్నించి) కాస్త మగవాళ్ళమని భయభక్తు లక్కర్లే? ఇంత చదువుకున్నందుకు ఇదా లాభం? వాడంటే భయం లేకపోతే మానె? నేనన్నా భయం అక్కర్లే?

రంగ:- బాగా కోప్పడుతున్నాడ్రా!

రామం:- అవును.

రంగ:- బాబాయికి కోపంవస్తే వళ్లు తెలియదసలు.

రామం:- నిజం.

రంగ:- తన్నిగూడా Insult చేసిందని మహాకోపం వచ్చింది.

రామం:- మరే.

రంగ:- ఈ కోపంలో వళ్లు మర్చిపోయి...

రామం:- మర్చిపోయి!...

రంగ:- వళ్లు మర్చిపోయి చెయ్యిచేసుకోడుగదా ?

రామం:- ఊ! కొడతాడంటావా?

రంగ:- ఆ కోపంలో...ఏమో ?

రామం:- ఆదెప్పుడూ ఎవరిచేతిలోనూ దెబ్బలు తినలేదురా!

రంగ:- ఉల్లాగా?

రామం:- బాబాయికి కోపం వస్తే వళ్లు తెలియదు.

రంగ:- మరే.

రామం:- ఆ కోపంలో చావకొడితే?

రంగ:- కొట్టినా కొట్టవచ్చు.

రామం:- ఎల్లారా? ఎకక్కడపోయి కోప్పడ్డాను.

రంగ:- ఆది మంచికే వచ్చిందిలే? ఇకనుంచీ ''బాబాయితో చెప్తా'' అని బెదిరించవచ్చు.

[కుర్రవాడొస్తాడు]

రామం:- ఏమంటున్నాడ్రా బాబాయి?

కుర్ర:- బాబాయిగారిది - పై డాబుసరి అనుకున్నాగాని ఇంత కోప్పడతారని నేననుకోలేదండీ!

రామం:- బాగా కోప్పడుతున్నాడా?

కుర్ర:- అమ్మగారిమాట వినిపించుకోకుండా కోప్పడుతున్నారు.

రామం:- రంగనాధం! నువ్వు వెళ్ళి సర్దన్నా చెప్పిరారా?

రంగ:- సర్దిచెప్పటానికేంగాని-ధైర్యం చాలటం లేదురా. (కుర్రాడితో) ఆ! ఇంకేమంటున్నాడు?

కుర్ర:- ఇకనుంచి తనకే First decoction యివ్వాలట?

రామం:- ఆ!

కుర్ర:- మీరు చొక్కాలు మాపుకున్నా - ఆలస్యంగా యింటికి వచ్చినా-సిగ రెట్లు కాల్చినా-తనతో చెప్పాలిటగాని ఆమెగారే కోప్పడగూడదట.

రామం:- తనతో చెప్పాలా?

కుర్ర:- First decoction తనకే ఇవ్వటానికి వప్పుకున్నారు గాని రిపోర్టుచేసి వూరుకోటానికి అమ్మగారేమాత్రం వప్పుకోటంలే!

రామం:- ఏం ?

కుర్ర:- తను చదువుకున్న భార్యగాబట్టి తన భర్తప్రవర్తన నదవడిక తనే సరిదిద్దుకోవటానికి తనకి సంపూర్ణ అధికారం వుందట, కనక బాబాయి అడిగినా-ఆ భగవంతుడే అడిగినా-ఆ అధికారం తను వదులుకోనని అమ్మగారు ఖచ్చితంగా చెప్పారు.

రామం:- అనేసిందీ అంతమాట!

కుర్ర:- దాంతో బాబాయిగారు కోపం పట్టలేకపోయారు. మొహం కంద గడ్డలాగయింది. కళ్ళెర్ర బడ్డాయి. మీసాలు నిక్కబొడిచాయి.

రంగ:- బాబోయ్!

కుర్ర:- ఇక కోపం పట్టలేక, గడిలో, ధనా ధనా-ఆటూ-ఇటూ-తిరుగుతూ మూలనున్న దుడ్డుకర్ర తీసుకొనీ-

రామం:- తీసుకున్నాడూ - కొట్టేడా - దెబ్బ తగిలిందా?

రంగ:- కొట్టే వుంటాడు యీ పాటికి?

రామం:- కొట్టాటరా-కొట్టేశాడా?

కుర్ర:- ఈ పాటికి కొట్టే వుంటారండి. ఆయన కర్ర ఎత్తేటప్పటికీ—మీకు చెప్పేద్దామనీ-నే వచ్చేశాను.

రామం:- ఏడిసినట్టుంది. పో! చూసిరా.

కుర్ర:- ఈ పాటికి అంతా అయిపోయే వుంటుందండీ. ఇంకా ఏముంటుంది చూడటాన్కి-?

రామం:- ఏడిశావ్! పో బాబాయి ఏమంటున్నాడో-అమ్మగారు ఏడుస్తోందో-ఏమన్నా కట్టూగిట్టూ కట్టుకుందో ! అంతా చూసిరా!

(కుర్రవాడు వెళ్తాడు)

రామం:- రంగనాధం!

రంగ:- రామం...?

రామం:- ఇప్పుడు నేనేం చెయ్యాలి?

రంగ:- ఏం చేస్తానంటావ్?

రామం:- ఏదోవకటి చెయ్యాలి.

రంగ:- పోసి చెయ్యి.

రామం:- సరాసరి వెళ్ళి బాబాయిని కోప్పడితే!

రంగ:- బాబాయినే!

రామం:- ఆ, బాబాయినే! ఏం, కోప్పడలేనూ?

రంగ:- కోప్పట్టానికేం? కోప్పడగలవ్, కాని ఆ కర్రతోనే నిన్నూ వకటి వేస్తే?

రామం:- (తగ్గి) ఒకటి!-ఒకటివేసివది త్తే బాగానే వుంటుంది.

(కుర్రవాడు గాభరాగా వచ్చి)

కుర్ర:- బాబుగారూ! బాబుగారూ!

రామం:- ఏంరా? ఏం?

కుర్ర:- ఇల్లా అవుతుందని నేనెప్పుడూ అనుకోలేదండి!

రంగ:- ఏమయిందేం?

కుర్ర:- బాబాయిగారు కర్ర ఎత్తేరా-ఎత్తేటప్పటికి-

రంగ:- |
రామం:- | ఆ.

కుర్ర:- అమ్మగారు కన్నీళ్ళు కడవలుగా కార్చేరు. "నే నెంత చేసినా మీరూ మీరూ వకటే-చివరికి ఆయన మాటలే నమ్ముతారు - Coffee Strongగా తాగితే మీ ఆరోగ్యం చెడుతుందని మీ కాఫీలో పాలెక్కువ వేసి యిస్తుంటే యీమాట అన్నారూ" అన్నారు. దాంతో బాబాయి గారు "అల్లాగా, అయితే సరే...నాకు కాఫీ ఎప్పుడూ అల్లాగే యిస్తూండు" అన్నారు. పైగా-మీ మాట, యిక చస్తే నమ్మనని ప్రతిజ్ఞ చేశారు.

రంగ:- ఉహూ!!!

కుర్ర:- "లేనిపోనికన్నీ నాతో చెప్తాడా? ఆగు వీడి సంగతి చెప్తా" అని కర్రతీసుకు బయలుదేరారు.

రంగ:- ఆ, ఆ, వస్తున్నారా ఏం?

కుర్ర:- అప్పుడమ్మగారు అడ్డుపడి "ఎంత చెడ్డా, నా భర్త నా కళ్ళెదట ఆయన్ని కొట్టద్దూ" అనీ-కర్ర లాగేసుకున్నారు.

రంగ:- అయితే ఫర్వాలేదు. కర్ర తేవటంలేదుగా.

కుర్ర:- "కొట్టద్దూ, బాగా తోప్పడమనీ" మరి-మరీ చెప్తున్నారు. (బాబాయి రాగా కుర్రవాడు నిమ్మడిగా వెళ్ళిపోతాడు)

బాబా:- ఇల్లారా! రా. దగ్గరకి. ఏమిటి చెప్పావిందాక?

రామం:- ఏం చెప్పాను-పెద్ద, ఏం చెప్పందే?

బాబా:- ఏడిశావు పూరుకో, ఏం చెప్పలేదంటావేం? లేనిపోనివన్నీ కల్పించి పెద్ద లిస్టుగా-రిపోర్టులా ఏకరువు పెట్టి-ఏం చెప్పలేదంటావేం?

రామం:- అవును. అవన్నీ నిజమేగా!

బాబా:- నిజం? ఏం నిజంరా? అసలు సంగతి దాచిపెట్టి, అన్నీ అతుకులు పెట్టి, పితూరీలు చెప్తావు-పైగా అన్నీ నిజమంటావు!

రంగ:- ఏం అతుకులు పెట్టావురా రామం?

బాబా:- మన విషయం, మన ఆరోగ్యం విషయం, ఆది అంతగా ఆలోచించి-జాగ్రత్తగా చూసుకొస్తూంటే; దాని మీద పితూరీలు చెప్తావు-పితూరీలు.

రామం:- నా ఆరోగ్యం సంగతా అది చూసింది? అన్నీ అలావుంచి "Get out, get down" అనటం గూడా నా ఆరోగ్యం సంగతేనా?

రంగ :- ఆవునండి. రెండు Sets Tennis ఆడి, ఓడిపెచ్చి, వాడు కాస్త నడుం వాల్చితే-"Get out of the bed" అని అంటే - వాడి లాటి మగవాడి కెలావుంటుంది! చెప్పండి ?

బాబా:- ఊ ?

రంగ:- అహహ. మీరు కోప్పడితే, నే చెప్పలేను గాని ...

బాబా:- కానీ? కాని ఏమిటోయ్ గాని? వూరంతా తిరిగి వచ్చి, మట్టి కాళ్ళతో-మంచమెక్కి కూర్చుంటే, దిగి వెళ్ళి కాళ్ళు కడుక్కోమంటం తప్పా ?

రామం:- ఊ. అట్లా అందేమిటి ?

బాబా:- మరి ఎట్లా అందేం ? ఒరేయ్ ! ఇవన్నీ ఎందుకు ? నే చెప్తున్నా విను. ఆది నీకంటె తెలివయిందని వప్పుకుంటావా-వప్పుకోవా ?

రంగ-: వప్పుకోరా రామం-ఆ మాట నిజమే గాదురా ?

బాబా:- ఆది తెలివైందిగనక-దానిమాట నువ్వు విని తీరాలి, అవునా కాదా?

రంగ:- ఆవున్నెండి.

బాబా:- కాబట్టి యిక నీ విషయం నాతో ఏమైనా చెప్పించా, జాగ్రత్త!

రామం:- అయితే అది చెప్పించల్లా నిజం, నే చెప్పించట్లా అబద్ధం అన్న మాటా ?

బాబా:- అన్నమాటేమిటి ! అంతే. అనుమానం లేదు. అందువల్ల నోరు మూసుకు పడివుండి అది చెప్పినట్లల్లా విను.

రామం:- ఉహూ ! నేను వినను.

బాబా:- ఏశిశావు. నోరుమయ్యి. పెద్దవవేషాలు నాదగ్గర కాదు. ''పెళ్ళాం చెప్పిన మాట వినరా'' అంటే వినలేని దేవయ్యవేంరా నువ్వు? నాకే పెళ్ళాంవుంటే, మాట వినకుండా వుండేవాడినా ? అది మంచిది గనక నీ ఆటలు సాగుతున్నై, అది మహా యిల్లాలు గనుక నీకిన్ని మంచినీళ్ళు పుడుతున్నాయి, అది మహామంచిది గనక నీతో కాపురం చేస్తున్నది.

రంగ:- రామం !

బాబా:- (విసుగ్గా) రామం, రామంట. ఒరే, రంగనాధం! విను. విని నువ్వు నీ స్నేహితులందర్కీ చెప్పు. వీడి పేరు యిక రామంగాదు.

రంగ:- కాదూ ?

బాబా:- కాదు. రామంగాదు. వీడిపేరు ఇకనుంచీ అమరశ్రీ మొగుడు, ఇహ నుంచీ అట్లా పిలవాలి-మీ స్నేహితులందరూ. (లోనికి వెళ్తాడు.)

రామం:- (చాలాసేపు ఆలోచించి) రంగనాధం !

రంగ:- ఆ, ఏంరా ?

రామం:- మా అమ్మా నాన్నా నాకు రామం అని పేరు పెట్టారు.

రంగ:- మీ అమ్మా-నాన్నా పెట్టింది ?

రామం:- ఆ పేరుకూడా యివ్వాళ పోయింది.

రంగ:- ఏం శాశ్వతం లెద్దూ ? వాళ్ళిచ్చిన ఆస్తులే ఆగలేదు- పేర్లా ఆగేవి ?

రామం:- ఉన్న పేరుకూడా పోయింతర్వాత ఏం లాభంరా బతికి?

రంగ:- అయ్యాయ్! మనం ప్రతిదానికీ లాభనష్టాలు లెక్కపెట్టూ కూర్చో గూడదు.

రామం:- అందుకే ఏ లెక్కా లేకుండా యివ్వాళ మనకి - వున్నది లేనిదీ- అంతా త్యాగం చేస్తున్నాను.

రంగ:- సోసీ—చేసెయ్యి.

రామం:- ఈ కష్టం, సుఖం, కలిమీ లేమీ, ఆస్తి పాస్తి, అంతా చేసుకున్న భార్యతో సహా-వదిలేస్తున్నాను.

రంగ:- అలాగే.

రామం:- ఐహికమైన యీ తుచ్ఛ జీవితాన్ని వదిలి జీవితాన్ని భగవదార్పణం చేసి, ఆధ్యాత్మికంగా జీవితం వెళ్ళబుచ్చుతాను.
(వెళ్ళి ఒకమూల సన్యాసి పోజు పెట్టి కూర్చుంటాడు)

రంగ:- ఏమిట్రా యిది?

రామం-: సన్యాసంరా-సన్యాసం. వైరాగ్యం-దివ్యనేత్రం వికసించింది, ఆత్మ జ్ఞానం కలిగింది. ముక్తి మార్గానికి "గేటు" తెరుచుకుంది.

రంగ:- ఏమిట్రా యిది...రామం?

రామం:- ఇకనుంచీ మన పేరు రామంగాదు.

రంగ:- అవును. ఆ పేరు బాబాయి రీశేషాడుగా!

రామం:- ఇకనుంచి మన పేరు "రామేశ్వర యతీంద్రులు"

రంగ:- "యతీంద్రులా" అంటే—?

రామం:- ఆ. సర్వసంగ పరిత్యాగం చేసి - మోక్షమార్గాన్ని అన్వేషిస్తూ— శ్రీశ్రీశ్రీ రామేశ్వర యతీంద్రులు-ఈ యిందినీ, ఈ ఆస్తినీ, ఈ సర్వ సుఖాల్నీ, ఆ బాబాయినీ (కళ్ళ నీళ్ళు తుడుచుకొని) ఆ యిల్లాలినీ-ఇక-యిల్లా-విడిచేసి.....

రంగ:- విడిచెయ్యటమే!

రామం:- నిద్రాహారాలు వర్జించి-ఎండనక, వాననక, కేవల పరమేశ్వరోపాసనాసక్తుడై; యిల్లా ... యిల్లా ..... వెళ్ళిపోతున్నాడు. (వెళ్ళిపోబోతాడు)

రంగ:- నిజంగానే, నిజంగానే, (అర్ధంపోతూ) ఒరే! రామం! కాస్త ఆలో ఓంచరా?

రామం:- ఇక ఏ ఆలోచనల్లేవు.

రంగ:- తర్వాత విచారిస్తావ్!

రామం:- ఏ విచారం లేకుండా వుండటానికే, ఈ పని చేస్తున్నాను. చూశావా! నాలో ఎంత మార్పు వచ్చిందో?

రంగ:- ఆ.

రామం:- సన్యాసం తీసుకునేసరికి-ఉన్న విచారాలన్నీ పోయాయి. మనసు తేలిగ్గా వుంది. ఒళ్ళు బరువు తగ్గింది. కళ్ళు చల్లబడ్డాయి. ఒరేయ్, నే వెళ్తున్నా- నాతోబాటు నువ్వూ రా.

రంగ:- నేనూ రానా?

రామం:- ఆ సన్యాసంలోవున్న సుఖం- సంసారంలో లేదు. అనుభవం మీద చెప్తున్నా-అన్నీ విడిచిరా. సుఖపడ్తావు.

రంగ:- ఎల్లా రానూ? పెళ్ళి అవందే ఎవర్ని విడిచిపెట్టి రాను?

రామం:- సరే, నీ ఇష్టం-ఎంతో అనుభవిస్తేగాని నా అంతవాడివి కావులే. నే వెళ్తున్నాను. (వెళతాడు)

రంగ:- ఆ. ఆ. వెళ్ళటమే. ఒరే. కుర్రాడా!

[కుర్రవాడు రాగా]

కొంప మునిగిందిరా. బాబాయిని పిలవరా. రామం సన్యాసం పుచ్చుకుంటున్నాడ్రా. పో-పిలూ-అమ్మగార్నికూడా పిల్చుకురా. ఆమెను చూశన్నా-ఏమన్నా, కిరుగుతాడేమో.

(కుర్రవాడు లోపలికివెళ్ళి బాబాయితో సహా ఎస్తాడు.)

బాబా:- ఏడీవాడు?

రంగ:- వెళ్ళాడు.

బాబా:- ఎక్కడికి?

రంగ:- సన్యాసం పుచ్చుకోడానికి-

బాబా:- సన్యాసం పుచ్చుకోడానికా?

రంగ:- ఆ, అందుకే. కోప్పడి పిలిచి వెళ్ళారూ- వాడు అటు వెళ్ళాడు.

బాబా:- వెళ్తుంటే, చూస్తూ వూరుకున్నావు?

రంగ:- ఏం చెయ్యను? మీరన్న మాటకి "ఛ! ఎందుకీ జీవితం" అనుకున్నాడు. ఇంతలో-ఎక్కడ్నించి వచ్చిందో- వైరాగ్యం వచ్చేసింది. వెళ్ళిపోయాడు. పైగా నన్నూ రమ్మని బలవంతం చేశాడు.

బాబా:- వెళ్ళకపోయావు తోడు?

రంగ:- వెళతా. మీతో చెప్పుదామని ఆగా. (తనూ వెళ్ళబోతాడు.)

బాబా:- ఆగు (అని కోపంగా కేకవేసి) ఇద్దరూ తోడుదొంగలు పోగయ్యారు. చెప్పు-ఈ నాటకమంతా ఏమిటి?

రంగ:- నాటకం!

బాబా:- ఆ. నాటకం! ఇలా బెదిరించి, నన్ను లొంగదీసుకోవాలని గాదూ? చెప్పు-ఇది యిద్దరూ కలిసి వేసిన ప్లానా, కాదా?

రంగ;- (మాట్లాడడు)

బాబా:- చెప్పవేం? చెప్తావా లేదా? ఏమిటీ ఆలోచన?

రంగ:- (వణికిపోతూ) సన్యాసం తీసుకుని వాడితో వెళితే బాగుండేది కదా అని ఆలోచిస్తున్నా.

బాబా:- నోరుముయ్యి (మహాకోపంగా) దొరికారు ఒకళ్ళ కొకళ్ళు ఏడివాడు? రానీ. సన్యాసం గిన్యాసం చదలగొడతా.

రంగ:- (కళ్ళ నీళ్ళతో) వాడికరాడు.

బాబా:- పోనీ, ఎన్నాళ్ళని-ఎక్కడికి పోతాడో?

రంగ:- పోతాడు. పోయి సన్యాసుల్లో కలుస్తాడు.

బాబా:- కానీ, కలిస్తే కలుస్తాడు.

[కాషాయ వస్త్రాలు ధరించి రామం ప్రవేశిస్తాడు.]

రంగ:- వచ్చావుట్రా రామం? ఇంకా వెళ్ళలేదూ?

రామం:- హెళ్: ''స్వామీ రామేశ్వర యతీంద్రులవారిని'' 'రామం' అన గూడదు.

బాబా:- ఆహా, మహబాగా కుదిరించే వేషం- (దగ్గరికి వెళ్ళి కోపంగా) వేషం ఊడగొట్టేవాడు లేక, వేషం విప్పుతావా దవడ పేలగొట్టమంటావా?

రామం:- హుష్. ఆగ్రహం పనికిరాదు. దురాగ్రహం అసలు పనికిరాదు. సామాన్య ప్రజలకు కామ క్రోధ మద మాత్సర్యాలలో, కామంతప్ప తక్కినవన్నీ వర్జనీయాలు.

బాబా:- ఏమిటి ఎంగిలి కూతలు?

రామం:- అంతా సొంతం. రామేశ్వర యతీంద్రుల ఉవాచ-అంటే అన్నారన్న మాట-ఏమన్నారంటే.....

బాబా:- వళ్లు పొగరెక్కితే ఏమన్నా అంటారు.

రామం:- పొగరు. అది మనం వర్జించేశాం. ఈ ఐహికమంతా వదిలేసి, ముక్తి మార్గా న్నన్వేషిస్తూ దేశదేశాలూ...

బాబా:- తిరుగుతావేం? తిరగటాన్కి జోలె అక్కర్లేదూ- జోలె? ఇదిగో-నే దానంచేస్తా ఠీసుకో.

రామం:- జోలె ఆక్కరలేదు. గీలె అక్కరలేదు. కావల్సిందల్లా ఒక్క శిష్య వర్గం. శిష్యులుగా చేరేవారెవరో రండి. నే వెళుతున్నా, జై సీతారాం (వెనక్కి తిరగ్గా)

బాబా:- ఆగు.

రామం:- ఆగను.

బాబా:- ఆగకపోతే అధోగతి పాలవుతావు.

రామం:- అదంతా కేవలం ఐహికం.

బాబా:- మళ్ళీవస్తే తిండిగూడా పెట్టను.

రామం:- నిరాహార దీక్ష యివాళే ప్రారంభం.

బాబా:- అమరశ్రీతో మాట్లాడనివ్వను.

రామం: సన్యాసికి సంసారబంధం పనికిరావు.

బాబా:- అయితే కానీ, అమరశ్రీకి మళ్ళీ పెళ్ళి చేస్తాను.

రంగ:- రామం! ఇదన్నా ఆలోచించరా.

రామం:- భౌతిక విషయాలు ఆత్మని కలుషితం చెయ్యలేవు.

బాబా:- అయితే పో, ఇక్కణ్ణుంచి తొందరగా.

రామం:- పోతున్నాను. జై సీతారాం పోయేముందు పెద్దలయినందున, మీకు నమస్కారం చేసి పోతాను. (అని దగ్గరకు వెళ్ళి పాదాభి వందనం చేస్తాడు)

బాబా:- నిజంగా వెళ్తున్నావట్రా !

రామం:- ఆఁ.

బాబా:- మమ్మల్నిద్దర్నీ యిల్లా వదిలి వెళ్తావుట్రా, పెద్దవాణ్ణి నా సంగతి ఆలోచించవు సరే. చిన్నది-దాని సంగతి ఆలోచించరా!

రామం:- పెద్దాలేదు. చిన్నాలేదు. అంతా విధి విలాసం.

[కుర్రవాడొస్తాడు]

కుర్ర:- మీరు వెళ్ళేముందు ఒకసారి మాట్లాడి వెళ్ళమన్నారండి.

రామం:- ఎవరా అన్నది ?

కుర్ర:- అమ్మగారండి.

బాబా:- పాపం !

రంగ:- అవున్రా. ఆఖరిసారి - ఒక్కసారి - ఒక్కమాట మాట్లాడిపోరా.

రామం:- వద్దు మనకి ఆఖరిసారీ, మొదటిసారీ లాంటివిలేవు

బాబా:- ఇంత కఠోరుడివేరా! కోరి చేసుకున్నందుకు యీ కోరిక చెల్లించరా ?

రామం:- అదరే. ఆత్మజ్ఞానంలో పరిపక్వమై భగవదైక్యం కావటాన్కి ఎన్ని అడ్డంకుల్రా ప్రపంచంలో...సరే కానీ, వెళ్ళి వస్తాను. (లోపలి కెళ్తాడు)

బాబా:- వేళాకోళం అనుకున్నాను. ఎంత అఘాయిత్యం తలపెట్టావురా !

రంగ:- వేళాకోళం ఆపుకోవట మేమిటండీ, నేనింతగా మొత్తుకుంటుంటే-

బాబా:- ఆఁ ?

రంగ:- వాడు సన్యసిస్తున్నాడండీ అని నేను నెత్తినోరూ కొట్టుకుంటుంటే వినకుండా, మీరూరికే పళ్ళు తెలియకుండా కోప్పడటమేనయ్యో.

బాబా:- ఊఁ.

రంగ:- సన్యాసిందాడంటే సన్యసించడూ - మీరిద్దరూ కల్సి వాణ్ణి ఇలా ఆడక త్తెరలో నొక్కుతుంటే!

బాబా:- ఎవరిద్దరూ ?

రంగ:- ఇంకా ఎవరిద్దరూ ఏమిటి? మీరే. మీ మామాకోడళ్ళు; పొద్దస్తమానం వాడి ఎముకలు కొరుక్కుతిని వెన్నవంటి వాడి మనసు విరిచేశారు.

బాబా:- మేం విరిచామా ?

రంగ:- కాదూ మరి ? వాడు బయటికి సినిమాకి వెడితే తప్పు, ఇంట్లో రేడియో పెడితే తప్పు. మంచిసీళ్ళు తాగటానికి వీల్లేదు. మనిషితో మాట్లాడటానికీ వీల్లేదు. మంచంమీద కూర్చోటానికి వీల్లేదు. చస్తాడేం, సన్యాసం పుచ్చుకోక?

బాబా:- ఏడిశావ్, ఆగు. చూడగా చూడగా నువ్వే యిదంతా రేపెట్టి నట్టున్నావు-

రంగ:- నేను రేపెట్టేదేమిటి? వాడి అవస్థచూసి నేనూ పెళ్ళి చేసుకోకుండా వెళ్ళి వాడి శిష్యుడుగా చేరదామని చూస్తుంటే!

బాబా:- ఇంకేం? నీవల్లే వాడి కీబుద్ధి పుట్టింది.

రంగ:- నావల్ల ఎందుకు ? వాడికే పుట్టింది. యింట్లో Servant కన్న హీనంగా చూస్తుంటే పుట్టదూ! ఎన్నిసార్లు fail అయినా మాత్రం, వాడూ B. A. దాకా చదివాడు.

బాబా:- చదివినందుకు యిదా ? సన్యాసుల్లో కలవడమా !

రంగ:- అది నయంకాదూ, మీ యిద్దరిమధ్యా నలిగేదానికంటే; మీకు మీరే. ఆమెకి ఆమేనాయె.

బాబా:- అబ్బాయ్, నన్నంటే అన్నావు, దాన్ని అనకు... అహహ... దాన్నంటే అన్నావు-నన్ననకు.

రంగ:- ఇద్దర్నీ అంటాను. ఎందుకు అనను ? అలాంటి స్నేహితుణ్ణి యిలా కాషాయగుడ్డల్తో చూస్తుంటే కడుపు మండిపోతుంటే!

బాబా:- ఇదిగో! నన్ను రేకొట్టావంటే వాడితోపాటు నీకూ సన్యాసం యిచ్చి యింట్లోంచి గెంటిస్తా.

రంగ:- నాకు చిరాకొచ్చిందంటే వాడితో పాటు నేనూ సన్యాసం పుచ్చుకు వెళ్ళిపోతా, జాగ్రత్త-ఆఁ-

బాబా:- పొండి, పోతే యిద్దరూ కల్సి.

రంగ:- పోతాం మహారాజుల్లాగా, పిలవండి వాణ్ణిగూడా.

బాబా:- పిలుస్తా, పొండి ముందు.

రంగ:- పిలవండి ముందు వాణ్ణి.

బాబా:- ఓరేయ్ రామం !

రంగ:- రారా రామం !

బాబా:- ఈనాటికి నువ్వూ ధైర్యవంతుడ వయ్యావే !

రంగ:- మీరవలా, నాటకంలో Villain లాగా.

బాబా:- నన్ను Villain అంటావుట్రా ?

రంగ:- ఏం, అంటే అంటా...ఆఁ.

బాబా:- పో ముందు, నా యింట్లోంచి.

రంగ:- పోతా, వాడూ వస్తే

బాబా:- ఒరే రామం, బయటికి రా.

రంగ:- ఒరే రామం, పోవాం పద.

బాబా:- పోతాడు. అడుక్కు తింటానికి.

రంగ:- అక్కర్లే, నాతో వుంటాడు.

బాబా:- పెద్ద దొరకావు. వాడికి ఆసరా.

రంగ:- లేకపోతే లెక్కమిటి, పెద్ద.

బాబా:- అయితే తీసుకుపో, వాణ్ణి.

రంగ:- పోతా రమ్మనండి, వాణ్ణి.

బాబా:- రావేరా రామం, పిలుస్తుంటే.

రంగ:- రావేరా రామం, పోదామంటే.

బాబా:- రామం, నిన్నే పిలిచేది.

రంగ:- రామం. నిన్నే రమ్మనేది.

[కుర్రవాడొస్తాడు]

బాబా:- ఏం చేస్తున్నాడ్రా వాడక్కడ?

రంగ:- ఎందుకున్నాడ్రా వాడింకా అక్కడ?

బాబా:- రాడేంరా, అక్కణ్ణుంచి కదలి!

రంగ:- రాడేరా, యిల్లిక వదలి !

కుర్ర:- రామంగారే నాండి?

రంగ:- |
| ఆఁ, వాడే.
బాబా:- |

కుర్ర:- అమ్మగారితో మాట్లాడుతున్నారండి.

బాబా:- రమ్మను - గెంటేస్తా – యింట్లోంచి.

రంగ:- రమ్మను. పోతాం-గెంటకముందే.

(కుర్రవాడు వెళతాడు)

బాబా:- చూసుకో బాబాయి అంటే ఏమిటో.

రంగ:- కాచుకోండి రంగనాధం అంటే ఏమిటో.

బాబా:- ఆఁ.

రంగ:- ఆఁ.

[కాషాయ గుడ్డలు చేతో పుచ్చుకొని కుర్రాడొస్తాడు.]

బాబా:- ఏడిరా వాడు?

రంగ:- (కాషాయగుడ్డలు చూసి) ఏమిట్రా యిది ?

బాబా:- వాడింకా రాడేం ?

రంగ:- వాణ్ణింకా పిలవలేదేం?

కుర్ర:- పిలిచానండి. పిలిస్తే, నవ్వేసి తలుపేసేస్తూ, యీ గుడ్డలు నా మొహాన పారేసి, ఇవి, మీ మొహాన పారేసి నన్ను యింటికి పొమ్మన్నారండి. (అని రంగనాథం మొహాన పారేసి బయటికి వెళతాడు.)

బాబా:- వాళ్ళిద్దరూ కలిసిపోయారేం!

రంగ:- ఆ-కలిశారు, మనిద్దర్ని విడదీసి. హారి రామం! మళ్ళీ సంకెళ్ళు వేయించుకున్నావు! (కుర్చీలో కూలబడతాడు.)

(తెర)

దిష్టి బొమ్మలు

రచన :

వేణు

పాత్రలు

న్యాయపతి

డాక్టర్ ఆరోగ్యం

M. L. A. ప్రజాపతి

నాగేశం

కోటి రూపాలు

(హిందూ దేశంలో తయారయిన గడియారం సాయంకాలం 5 గంటలు వినిపించింది. జీవిత నాటకంలో మానవునికి కొంత వ్యవధి దొరికిందా సమయంలో. వివిధసమస్యలు, ఆందోళనం మధ్య నలిగి, నాశనమవుతున్న మానవుల (ప్రేక్షకుల) తో నిండిపోయిందా నాటకశాల. దొరికిన దొక గంట అవకాశాన్ని ఆనందంగా అమాయకంగా గడిపి వెళ్లాలనుకొని వారంతా నాటకానికి వొచ్చారు. ధర్మాత్ములా, దరిద్రులు, స్వార్థపరులు, స్వార్థత్యాగులు, రాజకీయ దురంధరులు అందరితోను ఆ నాటకశాల కిటకిటలాడి పోతూందంటే అతిశయోక్తి వుండబోదు. నాటకం యెప్పుడు ప్రారంభమవుతుందా, యెవరు బాగా నటిస్తారా, కథ, మాటలు యెవరు వ్రాశారు. సినిమా తారలెవరైనా నటిస్తున్నారా లేదా అనే అతురతను ప్రకటిస్తున్నారు పెద్దమనుష్యులు నాగరికత తలిసిన వారు యేవో ముఖ్య విషయాలు (తమ స్వంత వ్యవహారాలు) తమలో తామే ఆలోచించుకుంటూ పదే పదే గడియారం వంక చూచుకుంటూన్నాడు. ఆంతవరకు రంగాన్ని కప్పివేసి, ప్రేక్షకులకు విసుగునుకలిగించి, వివేకాన్ని కోల్పోయేలా చేసిన ఆ తెర (ఉక్కు తెరకాదు) తొలగిపోయింది.

ప్రేక్షకులు కన్నార్పకుండా కుతూహలంతో ఆ దృశ్యం చూస్తున్నారు. జీవిత నాటకంలో మానవుని మధ్య తిరుగాడే వివిధ మనస్తత్వాలు, వాతావరణంలాగే అటికూడా 'జూపిటర్స్ క్లబ్' హాలు. విలువైన కుర్చీలు, పొడుగాటి టేబిలు, ద్వారాలకు విలువైన సిల్కు కర్టన్లు, గోడలపు రాజకీయ నాయకుల బొమ్మలు, అన్నీ వున్నాయ్. ప్రపంచాన్ని తెలుసుకోవటానికి అవకాశం కలిగించే వొక గ్లోబ్ టేబిల్ మీద వుంది. ఆకాశంలోని తారా మండలాలు, చంద్ర మండలం, వాటి దూరాలను తెలుపు వొక పెద్ద మ్యాప్ (గీచినది) తగిలించబడి వుంది. రంగస్థలం నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుంది. జీవితంలో గడిచిపోయిన సాయంత్రం 5 గంటలను-తిరిగి సృష్టిస్తూ నాటకం లోని వాతావరణం 5 గంటలు వినిపించింది. యెవరో వొక పెద్ద మనిషి 45 సం॥ వయసు వుంటుంది. సన్నని చెదరిన జుత్తు, చొక్కా ప్యాంటు, మెడకు టై కట్టుకొని టేబిలు మీదకు వాలి, దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఆలోచిస్తున్నాడా లేక దీర్ఘంగా నిద్రి

స్తున్నాడా అనే సందేహం కూడా కలక్రపోదు ఆ వాలకం చూసే ప్రేక్షకులకు. క్షణం గడచిన తర్వాత మరో పెద్ద మనిషి ఆ క్లబ్ లోకి ప్రవేశించాడు. వయసు 60 సం॥ మీరిన సోమరిలాగున్నాడు. కాని జీవితంలో బా గా బ్రతికినవాడే. కంటికి అద్దాలు, కాలికి చిరిగిన పాత చెప్పులు, చేతిలో వొక పాత గొడుగు, ధోవతి చొక్కాపైన కట్టి ఆ చొక్కాకు వొక పై బిగించాడు. వెంట్రుకలు బాగా నెరిసి తెల్లబడి పాపం ఆ పెద్దమనిషి వయస్సును బయటపెట్టేస్తున్నాయ్. అతన్ని చూడగానే 60 సంవత్సరముల బాలుడని బాగా తెలుసుకోవచ్చును. ముఖంపైన మూడు నామాలున్నాయ్. దైవభక్తుడేమోననే సందేహం కూడా కలుగుతుంది ప్రేక్షకులకు రాగానే చేతిలోని కోటును గొడుగును వో స్టాండుకు తగిలించి, మెడను నులుముతున్న పైని కొంచెం వొదులు చేసి, అద్దాలు తీసి, చేతిరుమాలుతో ముఖం తుడుచుకొని, దగ్గరలోనేవున్న కూజాలోని నీళ్లను వో గ్లాసులోనికి పోసుకొని రెండు గ్లాసుల నీరుత్రాగి అలసట తీరినట్టుగా వో నిట్టూర్పు విడిచి కుర్చీపై కూర్చున్నాడు. టేబిలుమీదనున్న తెలుగు మాసపత్రిక ''భారతి''ని చేతితో అందుకొనబోయి అద్దాలు కంటికి తగిలించి దగ్గరకు పొయ్యాడు. వెంటనే కుర్చీలో దీర్ఘాలోచనలో నిమగ్నుడై వున్న పెద్ద మనిషిని చూచాడు. కాస్త తటాపటాయించి తన చేతి గడియారం వంక చూచుకొని మెల్లగా ఆలోచిస్తున్న వాని దగ్గరకొచ్చి సంభాషణ ప్రారంభించాడు. ఇంతకూ యీ ముసలి పెద్దమనిషిపేరు న్యాయపతి. అప్పుడప్పుడూ వీరికి మాటలు యెక్కువ దొర్లుతూ వుంటాయి.)

న్యాయపతి:- హల్లో డాక్టర్ ! నేను మిమ్మల్ని చూడనేలేక పొయ్యాను. ముందు మీరు నన్ను క్షమించాలి. మిమ్మల్ని గుర్తు పట్టలేక పోవడానికి యింకో కారణం కూడా వుంది. అద్దాలు కంటికి తగిలించిన తర్వాత గాని మీరు నాకు కనిపించలేదు. క్షమించాలి. ఇంటికెళ్ళి కాఫీ త్రాగితే అలస్యమవుతుందని సరాసరి యిక్కడికే వచ్చి రెండు గ్లాసుల మంచి నీళ్ళు త్రాగి తృప్తిపడ్డాను. (పిసినిగొట్టు భావాన్ని చూపిస్తూ) అయ్యో ! యింటి వద్ద నాకొరకై వుంచిన కాఫీ వృధా అయిపోతా

యేమో ! ఆ పిల్లముండలు వాడిని బురదగుంటలో పారబోస్తారేమో? అనవసరంగా అణాపాలు నష్టమైపోతాయి గదా ! (డాక్టరు విన్నాడేమోనని భయపడి) క్షమించాలి. యిది నా స్వంత విషయం. మరి, మన కార్యక్రమం ప్రారంభిద్దామా ! (డాక్టరు పలకడు, కదలడు, కన్నెత్తయినా చూడలేదు. వొకటే ఆలోచనలో వుండి పోయ్యాడు) (కాస్త దగ్గరగా సమీపించి) మీరు నిద్రపోతున్నారా, ఆలోచిస్తున్నారా ? (డాక్టరు దగ్గరనుంచి జవాబు లేదు)

నా ఆలస్యం మీ కోపానికి కారణం కాలేదుగదా ? నాకు తెలియదు. మీరు చాలా శాంతమూర్తులు. యేదో గొప్పవిషయం ఆలోచిస్తున్నారు. మీ ఆలోచన యేమిటో నేను గూడా తెలుసుకోవచ్చునా ?
(డాక్టర్‌లో చలనం లేదు)

(కాస్త పొడుంపీల్చి రెండు తుమ్ములు తుమ్మి) డాక్టర్ ! డాక్టర్ ! అరే! ఆత్మహత్య కాదుగదా? లేక ఆలోచిస్తూనే ప్రాణం పోయిందా? రామరామ- యీ సమయంలో నేనెందుకు వచ్చానిక్కడికి ? ఆ ! ఇంతకూ చచ్చినట్టేనా? (మరీ దగ్గరకు ప్రవేశించి) లేక నేనేమైనా పొరపాటున.....డాక్టర్! యేమండి ఆరోగ్యంగారు! (వీపుమీద తట్టాడు. వెంటనే డాక్టర్ శవంలాగా ముందుకు టేబిలు మీద పడిపోయాడు. న్యాయాధిపతికి చెమటలు పోసినయ్.) తప్పకుండా ఎవరో హత్య చేసారు. ఇది కోటిరూపాలుగాడి పనే. ఇంక నన్ను మాత్రం బ్రతకనిస్తాడా.....నన్నూ చంపేస్తాడు. (బయటనుంచి పోలీసు విజిల్ వినిపిస్తుంది. న్యాయపతిలో దడ ప్రారంభమయింది) అదిగో పోలీసులు! యేడుకొండలవాడా, వెంకటరమణా రక్షించు! నాకేమీ తెలియదు (బయటకు వెళ్ళిపోవడానికి గొడుగు కోటు తీసుకుంటాడు. మరలా పోలీస్ విజిల్ వినిపిస్తుంది. గాబరాతో నేలకూలిపోతాడు. లేవను శక్తిరాదు. మెల్లగా కుర్చీని పట్టుకొని లేస్తాడు. కోటును వేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. చేతులు వణకడంమూలాన అది సాధ్యంకాదు. గొంతులో తడిలేదు ఒకసారి డాక్టర్‌ను చూశాడు. కూజాను పైకితీసి గ్లాసులో నీళ్ళు పోస్తుండగా కూజా జారిపోయి మరలా

పట్టుకుంటాడు. మరలా పోలీస్ విజల్ వినిపిస్తుంది. (ఈసారి అలాగే కుర్చీలో కూలబడి పొయ్యాడు.) రామ! రామ! రామ! రామ! ఏడు కొండలవాడా! ఆపద మొక్కులవాడా ! రక్షించు! రక్షించు! (మనిషి బాగా వణికిపోతున్నాడు. ఆలోచిస్తున్న డాక్టరు వొక్కసారిగా)

డాక్టరు:- I have found out the way !

న్యా:- అయ్యో! వచ్చేశారు పోలీసులు! వెంకటరమణా! రక్షించు. (కళ్ళు రెండు గట్టిగా మూసుకొన్నాడు.)

డా:- Now I can catch the moon. I can go upto the destiny of moon. (పైకి వేచాడు. కుర్చీలో భయంతో ప్రాణం విడుస్తున్న న్యాయపతిని జూచి) Oh! you are here? (దగ్గరకొచ్చాడు) Mr. న్యాయపతి! (తుజం తట్టాడు)

న్యా:- (పిచ్చిగా ఆరచి) నాకేం తెలియదు సార్! యీ హత్య నేను చేయ లేదు. నేను వచ్చేలోపలే యీన చచ్చిపడి ఉన్నారు. అంతేసార్! నాకేమీ తెలియదు.

డా:- ఇక్కడెవర్ని హత్య చేసాను ? మీ రెందుకు యిలా భయపడు తున్నారు ? యిలా చూడండి.

న్యా:- (చూడకుండానే) నా కేమీ తెలియదు సార్! ఆయన కాయనే ఆత్మ హత్య చేసుకున్నాడు సార్!

డా:- మీరు వొక్కసారి యిలా చూడండి.

న్యా:- ఊహు! నేను చూడను సార్!

డా:- ఇక్కడ యెవ్వరూ లేరు. యిలా చూడండి.

న్యా:- ఎవ్వరూ లేకపోబట్టే యీ నేరం నామీద పడింది. (కళ్లు మూసు కునే) మీకు నమస్కారం చేస్తాను సార్! నా కేమీ తెలీదు. అయినా నేను ప్లీడర్ని. 20 సం॥ సర్వీసు. నేనెందుకు చేస్తాను సార్ హత్య!

డా:- ఇప్పుడు హత్య ఎవరు చేశారు?

న్యా:- కోటిరూపాలుగాడు.

డా:- వాడెవడు?

న్యా:- గజదొంగ.

డా:- వాడు హత్య ఎందుకు చేస్తాడు?

న్యా:- హత్యలు చెయ్యటమే వాడి పని. మొన్ననే జైల్లో నుంచి పారి పోయాడు. నన్ను చంపుతానని...సార్ పబ్లిక్‌గా- ఆఁ! పబ్లిక్‌గా చంపుతానని వొక ఆకాశరామన్న ఉత్తరం రాశాడు సార్. యిదిగో కోటు జేబులో వుంది తీసుకొని చూడండి సార్. (అని గొడుగు ఇండిస్తాడు.)

డా:- మీరు కళ్ళు తెరచి మాట్లాడండి!

న్యా:- నాకు కళ్ళులేవు సార్. ఫ్యాషన్‌కోసం అద్దాలు వేసుకున్నాను. అంతే.

డా:- మీరు నాటక మాడుతున్నారా?

న్యా:- ఎప్పుడో చిన్నతనంలో నాటకాలు వేశాను. అంతే.

డా:- ఏదీ! మీ చెయ్యి యిలా యివ్వండి.

న్యా:- ఎందుకూ సంకెళ్ళు వేస్తారా? అమ్మో; నేనివ్వను.

డా:- మీ రెవరితో మాట్లాడుతున్నారు?

న్యా:- పోలీసు యిన్స్‌పెక్టర్‌తో.

డా:- (పెద్దగా నవ్వేశాడు) (నాగేశం న్యాయపతి రికార్డు తీసుకొచ్చాడు.)

నాగే:- రికార్డు తీసుకొచ్చాను సార్.

న్యా:- ఎందుకూ? నా దగ్గర స్టేటుమెంటు తీసుకుంటారా? నేను చంపలేదన్నానుగా.

డా:- మీరు మతితప్పి మాట్లాడుతున్నారు-అవునా?

న్యా:- అంతే. అంతే. మతిపూర్తిగా పోయింది. నేను రేపు కోర్టులో గూడా యిదే చెబుతాను. మా అబ్బాయిని, అమ్మాయిని పిలిపించండి.

వారితో కొన్ని ముఖ్య విషయాలు చెప్పాలి. ఆఖరిసారిగా వారిని చూచి మరీ చస్తాను.

నా:- రికార్డు తెచ్చాను సార్.

న్యా:- నా దగ్గరికేనా ?

నాగే:- అవును.

న్యా:- అయ్యో వెంకటేశా! మీరు నన్ను తప్పకుండా అరెస్టు చేస్తారా ?

డా:- ఎందుకండి?

న్యా:- ఆయన్ను యెవరో హత్య చేసినందుకు.

డా:- ఎవర్ని?

న్యా:- డాక్టర్ ఆరోగ్యం గార్ని

డా:- (విస్తుపోయి) What! డాక్టర్ ఆరోగ్యాన్నా?

న్యా:- అదిగో చూచారా, మీరప్పుడే నన్ను అనుమానిస్తున్నారు. నేనందుకే మా పిల్లల్ని పిలిపించమని చెప్పాను. జైలు కెళ్ళేలోగా వారిని ఒక్కసారి చూడాలని వుంది...వెంకటరమణా, రక్షించు తండ్రి !

నాగే:- మీరేంమాట్లాడుతున్నారు సార్?

డా:- Mr. న్యాయపతి ! మీరు చాలా పిచ్చిదశలో వున్నారు. డాక్టర్ ఆరోగ్యం బ్రతికేవున్నాడు. యిలా చూడండి.

న్యా:- (ఆశ్చర్యంగా) ఆ! బ్రతికున్నాడా! అబద్ధం. యింత క్రితం చచ్చి పడున్నవాడు యిప్పుడే యేలా బ్రతికాడు, నన్ను పరీక్షిస్తున్నారా సార్?

డా:- ఏమంటి, మీరు యీ లోకంలోనే వున్నారా?

న్యా:- యిప్పటివరకు వున్నానుసార్! యింకోక్షణం దాటితే జైలు ప్రపంచంలో వుంటానని నాకు తెలుసు. యెందుకు సార్, నన్ను యేడిపిస్తారు? మా పిల్లల్ని పిలిపించండి చూచిపోతాను.
(మూర్ఛపడినట్లు పడిపోతాడు.)

డా:- (నాగేశంతో) Water రిసుకో!

నా:- (తెచ్చాడు)

డా:- (న్యాయపతి ముఖాన సీళ్ళుజల్లి) యిప్పుడెలాగుందో చెప్పండి.

న్యా:- (కళ్ళుమూసుకునే) ఎలాగుంటుంది? నేను ఖైదీలాగే వున్నాను. యిదంతా ఆ కోటిరూపాలుగాడు చేసిన పని.

డా:- న్యాయపతిగారు, వొక్కసారి కళ్ళు తెరవండి. నేనే! Dr. Arogyam Speaking.

న్యా:- (తాపీగా) ఏమిటి! నిజంగానా? పోలీసు గాదూ?

డా:- No. No. చూడండి!

న్యా:- (మెల్లగా కళ్ళు తెరిచాడు. నాగేశాన్ని డాక్టరును చూచాడు) నిజంగా మీరు డాక్టర్ ఆరోగ్యమేనా?

డా: ఊ!

నాగే:- అవునండి. నేను నాగేశాన్ని.

న్యా:- (చూచాడు. మరలా డాక్టర్‌ని చూచాడు. తిన్నగా లేచాడు. డాక్టర్‌ను పరిశీలనగా జూచి దగ్గరకు వొచ్చి.....అమాంతం కౌగిలించుకున్నాడు.) శ్రీ వెంకటరమణా! ఎంత పని జరిగిందయ్యా!

డా:- అసలు జరిగిన విషయమేమిటి?

న్యా:- ఆఁ! ఏదోలేండి. చెప్పుకుంటే సిగ్గుచేటు. ఆ! మీరు యెంత పిలిచినా పలుకలేదు.

డా:- నేనా! నన్ను మీరు పిలిచారా?

న్యా:- వొక్కసారి కాదు. అరడజన్ సార్లు. మీరు పలుకలేదు. నాకు పిచ్చి పట్టింది. వొరే నాగేశం, యింటికెళ్ళి అబ్బాయినోసారి పిల్చిరా! (నాగేశం వెళ్ళిపోయాడు) డాక్టర్! మీరు యేమైనా ఆలోచిస్తూ ఆలా గుండిపోయారా?

డా:- అవును. చంద్రమండలం సరిహద్దుల్లోకి సరాసరి వెళ్ళిపొయ్యాను.

న్యా:- చంద్రమండలం కళ్ళారా చూచారా?

డా:- లేదు. తీరా వెళ్ళేసరికి యింజన్ చెడిపోయింది. తిరిగి భూమి మీద పడ్డాం. యీసారి మరో ప్రయత్నం చేస్తున్నాను. తప్పక చంద్ర మండలం చేరుకుంటాను. ప్రపంచంలో అన్ని దేశాలకన్నా మొట్ట మొదటిసారిగా భారత పతాక ప్రతిష్ఠాపన చంద్రమండలంపై జరిగి తీరుతుంది. ఇది తిరుగులేని నా దృఢ విశ్వాసం. అయితే యిది నా వొక్కడితో అయ్యే పనికాదు. మీ అందరి సహాయం కావాలి. మొత్తం భారతీయులందరూ యీ ప్రయత్నంలో నాకు చేయూత నివ్వాలి.

న్యా:- మీరు మాట్లాడుతున్నది చంద్రమండలం గురించి కదూ? మరి సూర్యమండలం మాటేమిటి?

డా:- ఒకటి తర్వాత మరొకటి. ఆఁ! Mr. న్యాయపతి, మీరు గూడా నాతో రావాలి.

న్యా:- తప్పకుండా వస్తాను...ఆఁ! ఎక్కడికి ?

డా:- చంద్రమండలంలోని అపూర్వ శృంగార దృశ్యాలు మీకంటితో మీరే చూచి తన్మయత్వం చెంది మత్తుగా ఆనందించటానికి. అచ్చటి ప్రకృతి మీకు చాలా పుత్సాహాన్ని కలిగిస్తుంది. ఆ లోకపు వింత నాగరికత మిమ్మల్ని దిగ్భ్రాంతులుగా చేసి పారేస్తుంది. ఆ నైసర్గిక స్వరూపం మిమ్మల్ని ఆనేక ఆలోచనలలో ముంచేస్తుంది. మీరు తప్పక నాతో రావాలి.

న్యా:- రావటానికి నా అభ్యంతరం అంతగా లేదనుకోండి. అయినా నేను వయసు చచ్చి, ఆరోగ్యం చెడి, నడుంవంచి నడుస్తున్నాను. ఇంకొక కారణమేమిటంటే...

డా:- కారణాలు ఎన్ని అడ్డం వచ్చినా కాదనటానికి వీలులేదు. మీరు రాజకీయాలు మాట్లాడుతారు గదా— మన దేశానికి కలుగబోతున్న వొక అఖండ విజయానికి మీరు గూడా కర్తలుగా నిలబడాలి. విప్లవాత్మకమైన యీ విజయం ద్వారా భారతశాంతి ప్రపంచంయొక్క ఆశీర్వాదాలు పొందుతుంది. అప్పుడు ప్రపంచంలో మన స్థాయి

పెరుగుతుంది. మన పేర్లు చిరస్థాయిగా ప్రజా హృదయాల్లో మెరుస్తూ, మేల్కొల్పుతూ వుంటాయి. దీనిమూలంగా మన దేశానికి ఎంతకీర్తి రానున్నదో ఊహించండి మీరు తప్పక నాతో చంద్ర మండలం రావాలి.

న్యా:- సే నెందుకండి, మన M.L.A. ప్రజాపతిగారిని వెంట తీసుకు పోండి. వారు నాకన్నా చిన్నవారు. రాజకీయాలన్నా, రాజ్యాలు చూడాలన్నా వారికి సిండా ఆసక్తి, శ్రద్ధ. పైగా చంద్రమండలం చూడాలని నాతో వోమాట చెప్పిపున్నారు. కాబట్టి మీతో తప్పకుండా వొస్తారు. చూడంటి... మీరు నన్ను క్షమించే వుంటారని భావిస్తు న్నాను. యింకొక కారణం యేమిటంటే... (కాస్త పొడుంపీల్చి) నాకు పిల్లా, జెల్లా పెద్ద సంసారం. పిల్లాడు మొన్ననే M. A. ప్యాసయి వుద్యోగంలేక తిరుగుతున్నాడు. వాడిని అలాగే విడిచిపెడితే యీ రాజకీయాల్లోపడి మనమాట వినకుండానే పోతాడు. యింకొక కారణమేమిటంటే అమ్మాయి... నా కూతురండీ.....కారద.... B.A. చదివి, భర్తకోసం అంటే తనకు తగుమైన వాడుగా వో అందంలోగాని, చదువులోగాని వుండాలని కోరిక. కట్నం ఎక్కువ అడుగకూడదు. యింకొక కారణం యేమిటంటే-

డా:- అబ్బ! మీకు అన్ని కారణాలుంటాయ్.

న్యా:- వున్నాయని చెప్పండి.

డా:- మనిషన్న తర్వాత కారణాల కేం తక్కువ? కోటి రూపాలు గాడు దొంగతనం చేస్తాడు. ఎందుకు చేశావని జడ్జిగా రతిగితే కోటికారణాలు చెప్పుతాడు. అవన్నీ మన మంగీకరిస్తామా ?

న్యా:- (కోటి రూపాలుగాడు పేరెత్తగానే న్యాయపతిలో భయంకనిపించింది కాస్త గొంతు సవరించుకొని) చూడండి, వాడి పేరు మాత్రం ఎత్తకండి.

డా:- వాడంటే మీ కెందుకంత భయం ?

న్యా:- వాడు గజదొంగ, ఖూనీకోరు, దగాకోరు, దుష్టుడు, దుర్మార్గుడు. అబ్బ, కాసిన్ని మంచి నీళ్ళివ్వండి (డాక్టరు యిచ్చాడు) (తాగి)

వాడు... నా కొంపతీయటానికే పూనుకున్నాడు. నేను ప్లీడర్ని, అంత సులభంగా విడిచిపెడతానా ? Twenty years of experience! ముప్పై కోర్టులూ తిప్పి, మూడు చెరువుల నీళ్ళు త్రాగించి, మూడు సంవత్సరాలు కఠిన శిక్ష వేయించాను. (కాస్త దిగులుతో) కాని, వాడు నెల శిక్ష కూడా పూర్తికాకుండానే జైల్లో నుంచి తప్పించుకొని పారిపోయాడు.. నన్ను పబ్లిక్‌గా చంపుతానని వుత్తరం వ్రాశాడు. (డాక్టర్ చేతులు పట్టుకుని) డాక్టర్! నా కన్న చిన్నవాడివైనా నీ చేతులు పట్టుకుని ప్రార్థేయపడుతున్నాను. నన్ను ఎలాగైనా ఆ రాక్షసుడి గండంనుంచి తప్పించు. నా సంసారం నిలుపు. నా తర్వాత నా పిల్లలకు దిక్కులేదు. ఆస్తినంతా పాడు చేసేస్తారు.

డా:- యింతకూ కోటిరూపాలుగాడు మీకేం అపకారం చేశాడు?

న్యా:- అయ్యో, అదంతా పెద్దగొడవ. యిప్పుడెందుకులే. వాడు పరమ దుర్మార్గుడని చెప్పానుగా. అంతే, మనస్సులో పెట్టుకో. వాడు యీ గోడలచాటున పొంచయినా మనమాటలు వింటూంటాడు.

డా:- వింటే వినసీండి!

న్యా:- నీకు తెలియదు నాయన! తర్వాత నా కొంప మీద నిప్పులుపోస్తాడు. వాడి విషయమే మనకొద్దు. ఆ! యేదీ ఆ చంద్రమండలం యింకా యెలాగుంటుంది? ఆఁ-నన్ను గూడ రమ్మన్నారు గదూ! ఓ తప్పకుండా వస్తాను. ప్రజాపతిగారినికూడ తీసుకెళ్దాం! మనతో వొస్తాడు. ఇంతకూ మనం చంద్రమండలానికి నడిచి వెళ్ళాలా లేక విమానం మీదనా ? ప్రపంచాన్ని దాటిపోవాలి గదూ? అబ్బ! చాలా దూరమే! ఆఁ! దయచేసి అలా ఐయట చూసిరండి, ఆ కోటి రూపాలు గాడొస్తున్నాడేమో? యీ రోగ నేనోగ్లాసు మంచినీళ్ళు త్రాగుతాను. కాస్త దడ తగ్గుతుంది.

డా:- (న్యాయపతి కనబడుస్తున్న వికారాలకు కాస్త చీకాకు కనబడుస్తూ తాపిగా ఐయట గుమ్మం వరకు వెళ్ళి గిర్రున న్యాయపతి వంక తిరిగి) మీరు పవిత్రమైన భారత దేశంలోని ఆవేశ పూరితమైన

ఆంధ్రప్రదేశ్‌లో వున్నతమైన బ్రాహ్మణ కులంలో జన్మించారు. బాగా చదువుకున్నారు. సుష్టుగా డబ్బు సంపాదించారు. జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు మీ సంపాదనలో రాగిదమ్మిడీ కూడా వుపయోగపడకపోగా, యింకా యెక్కువ సంపాదించి యిట్లో పోగుచెయ్యాలని మీకు ఆరాటం.

న్యా:- ఇదిగో డాక్టరుగారు ! ఆ విషయాలు మా సంసారానికి సంబంధించినవి. వాటిని బయటపెట్టి నన్ను రచ్చ కీడ్చడం మీకు న్యాయం కాదు.

డా:- Mr. న్యాయపతి ! నేను డాక్టరును, లెబరేటరీ చీఫ్‌ను, సైకాలజిస్టును-అవునంటారా ?

న్యా:- కాదని యెలా అనగలను ?

డా:- అనలేరు కాబట్టి వింటూ వుండమని నేనంటున్నాను. మానసికంగా శారీరకంగా మీరు పొందే కష్టాలు, సుఖాలు, లాభాలు, నష్టాలు, మీ మొఖం చూస్తే చెప్పి వేయగలను. చెప్పమంటారా ?

న్యా:- చెప్పినందువలన మీకేమైనా లాభమా ?

డా:- మీరు న్యాయవృత్తిలో సత్యాలు అసత్యాలుగా, దొంగను దొరగా, దొరను దొంగగా తారుమారుచేసి కేసులు గెలుస్తారే, దాని వల్ల మీకేమైనా లాభమా ?

న్యా:- అది వృత్తికి సంబంధించిన విషయం. సైగా అలా చేయడం ప్రతి వ్యక్తిదరు బాధ్యత. ఇందులో నా వొక్కడి లాభంతో పనేముంది?

డా:- ఆలాగే నేను సైకాలజిస్టును. ప్రతిమనిషి యొక్క మానసిక తత్వాలు పరీక్షించి ప్రపంచానికి తెలపడం నా బాధ్యత. యిందులో నా తప్పేముంది ?

న్యా:- ఏమీ వుండదు...ఆ...యేదీ, ఆ చంద్రమండలం విషయం మరిచిపోయాం. కాస్త విపులంగా చెబుదురూ ! ఆకాశంలో ప్రయాణము చేయడానికి పరికరాలన్నీ సిద్ధంగా వున్నాయా ?

(డాక్టరు అతని అవకాశవాద ధోరణికి నవ్వుకుంటూ వుంటాడు)

(నాగేశం తొందరగా కొంపమునిగిన వాడిలా వొక్క పరుగులో న్యాయపతి ముందు వాలి వొగురిస్తూ).

నాగే:- మీ కోసం యెవరో వచ్చారండి. నిండా అవుసరమైన పని వుందని చెప్పారు. యెలాగైనా మిమ్మల్ని పిలుచుకొని రమ్మన్నారు.

న్యా:- యీ సమయంలో నా కోసమెవరొస్తారు? కోర్టు పనిగా వచ్చారా?

నా:- ఏ విషయమైనా మీతోనే నేరులో మాట్లాడాలట. అమ్మాయిగారు తొందరగా పిలుచుకుని రమ్మన్నారు.

న్యా:- మనిషి యెలా వుంటాడు ?

నా:- పొడుగ్గా, లావుగా, వొంపుగా, బాగానే వున్నాడు.

న్యా:- అతని పేరు కనుక్కున్నావా ?

నా:- పేరు చెప్పనన్నాడు సార్. మీతోనే చెపుతాడట. పైగా గుర్తులు చెబితే మీరే తెలుసుకుంటారని కూడా చెప్పాడుసార్.

న్యా:- (కోటి రూపాలు గాడేనని గుండె జారిపోయింది. విస్తుపోయిన వాడిలా) ఆఁ ! చెప్పాడూ, కొంపతీసి కోటి రూపాలుగాడు కాదు గదా !

నా:- ఏమోసార్, యింట్లో పెద్ద గొడవగా వుంది. అమ్మాయి గారు చాలా కోపంగా వున్నారు. పెద్దగా... వెక్కి ... వెక్కి యేడ్చేస్తున్నారు.

న్యా:- ఆఁ ! యేడుస్తున్నారా ? ఎందుకురా ?

నా:- ఆమె చీరలు, నగలూ, పెట్టె, పక్క, అన్ని మూటగట్టి...

న్యా:- మూట గట్టి.....

నా:- ఎక్కడికో పోతానంటున్నారు... !

న్యా:- వెళ్ళిపోతానంటు దీ ! ఆ కోటి రూపాలుగాడు దానికేదో మచ్చ మందు చల్లాడు. బి ఎ. వరకు చదివిన పిల్ల తన్ను గురించి నేనెంత కష్టపడుతున్నదీ తెలుసుకోకుండా ఆ వెధవ దొంగతో వెళ్ళిపోతానంటుందీ అంటే సంవత్సరాలు నిండి రామా కృష్ణా అనుకునే ఈ వయస్సులో యి కా వృత్తిని విడిపెట్టకుండా డబ్బు సంపాదించి

కూడపెటుతున్నది పీళ్ళ కోసమేగా ! పీళ్ళు బాగుపడతారనేగా ! డాక్టర్ ! (డాక్టర్ దగ్గరకొచ్చి) డాక్టర్ ! మీరీ విషయంలో నాకు గొప్ప సహాయం చేసిపెట్టాలి... యింకో కారణమేమిటంటే... దీని వల్ల మా సంసారమంతా...

డా:- (నాగేశంతో) ఆ వచ్చిన మనిషి కోటి రూపాలని సీకు బాగా తెలుసా ?

న్యా:- తెలిసేదేమిటండి వాడి పిండం ... నేను చెపుతున్నానుగా! వాడు ముమ్మాటికీ వాడే...నన్ను చంపి మా అమ్మాయిని యెగరేసుకు పోదామనే వచ్చాడు. ప్లీజర్ని, 20 సంవత్సరాల Experience ఆ మాత్రం తెలీదా సార్ నాకు...మీరు నాకు సహాయం చేసిపెట్టండి. వెంకటరమణా !

డా:- మీరు అనవసరంగా కంగారు పడకండి ! (నాగేశంతో) ప్లీడరు గారమ్మాయితో వొచ్చిన వ్యక్తియేమైనా ముఖాముఖి మాట్లాడినాడా?

నా:- మూతులు మూతులు కలిసి పోయేటంత దగ్గరలో చేరి ... తర్వాత చెవులో యేదో...గుసగుసలు.

న్యా:- ఆఁ ! గుసగుసలా ? మా అమ్మాయితోనే...!

డా:- పూర్తిగా విననిదానే మీ కెందుకు ఈ ఆవేదనా ?

న్యా:- ఆవేదన యేమిటండి ఆరాటము పుట్టుకొస్తుంటేను... ! (కుర్చీలో చేరగిలండి నెత్తిన చేతులుపెట్టి యింకేమీ చేసేది లేదన్నట్లుగా ఆకాశంవైపు చూస్తున్నాడు)

డా:- ఆఁ ! గుసగుసలాడుతున్నారా ?

నా:- అవునండి.

డా:- . తర్వాత !

నా:- కొంతసేపయిన తర్వాత...నన్ను జూచి అమ్మాయిగారు బయటకు వెళ్ళిపొమ్మన్నాడు.

డా:- వెంటనే వెళ్ళిపోయ్యావా ? (న్యాయపతి ఆతురతగా నాగేశంవంక చూస్తున్నాడు)

నా:- నేను వెళ్తానా ? గోడ చాటు నుంచి వాళ్ళ మాటలన్నీ వింటూనే వున్నాను

డా:- ఏం మాట్లాడుకున్నారో త్వరగా చెప్పు !

నా:- రెండు నిమిషాల వరకు వొట్టి నవ్వు మాత్రం వినిపించింది.

డా:- తర్వాత?

న్యా:- ఆ! తర్వాత యేముంటుంది? ఆ దొంగముండాకొడుకు మచ్చు చల్లి మా అమ్మాయికి మంత్రం వేసుంటాడు.

నా:- అదికాదండి!

న్యా:- ఇంకేమిటిరా ?

నా:- తర్వాత యేదోరూపాయలు లెక్కబెడుతున్నట్టు వినిపించింది సార్ ! చిల్లరంతా క్రిందబోసి యెంచుతున్నారు.

న్యా:- (హుర్తిగా దిగజారి పొయ్యాడు.) అయిందీ! నా యిల్లంతా గుల్లయి పోయిందీ. వెంకటరమణా, యికనేమి చేతునయ్యా! కన్నబిడ్డకన్నా మిన్నగా నా డబ్బును సాకేనే! అందరినోట మాటలనిపించుకొని, వ్యసనాకోర్చి ఆస్తినంతా ప్రోగుచేసేనే! డాక్టర్! డబ్బువిలువను మా పిల్లలు తెలుసుకోవాలని, పొయ్యిలో కట్టెలు కొనాలంటే పాపలా ఖర్చని చెట్టుమీద కాకిగూడు పడగొట్టి వంటచేయమని...పనిమనిషితో చెప్పాను. దాని కిష్టం లేక ఆ పని చేయనంటే నౌకరి వూడగొట్టి నేనే మడిగట్టుకొని వంటచేసిపెట్టాను. యిరవై పైసలు పెరుగుకొంటే డబ్బుదండుగని అణా వజ్జిగలో నౌటాకునీళ్ళుకలిపి రెండు పూటలు సుష్టుగా భోంచేసేవాణ్ణి. యింత కష్టపడి కూడబెట్టిన డబ్బు...ఆ గజి దొంగ లాక్కొనిపోతుంటే చూస్తూ వూరుకోమంటావా...డాక్టర్! (డాక్టర్ చేతులు గట్టిగా పట్టుకొని) ఇవి చేతులుగాదు... మీరు తప్పక మాయింటివరకు వెళ్ళిరండి...డాక్టర్! (యేడుస్తాడు)

డా:- మీరు చాలా వింత మనుషులండి! మీ వయస్సు మీ ప్రాణానికెంత ప్రమాదమో—మీ మాటలు గూడా వినేవాడికి అంత ప్రమాదం కలిగిస్తున్నాయ్. పాపం! మిమ్మల్ని చూస్తే నాకెందుకో చాలా జాలిగా వుంది!

న్యా:- జాలిగా వుందికదూ ! వుంటుంది. వుంటుంది. మీరు సగ్వవిధ సంపూర్ణ పండితోత్తములు కాబట్టి నామీద జాలిచూపుతున్నారు. ఆ గజదొంగకు నామీదెందుకు జాలివుంటుంది. నా డబ్బు కొల్లగొట్టు కొని పోతున్నాడు. పట్టపగలే నా యింట్లో దోపిడీకి సిద్ధమయి నాడు. డాక్టర్ ! మీరు వెంటనే మాయింటికెళ్ళాలి.

డా:- వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే మంచిదికదూ?

న్యా:- అమ్మయ్యో! వద్దు. మరీ కోతిపుండు బ్రహ్మాండమైపోతుంది. అందర్ని కోర్టుకు తాగుతారు... లేనిపోని గొడవ బయల్దేరుతుంది.

డా:- సరే అయితే, నేను వెళ్ళేముందు యింకా కొన్ని విషయాలు తెలుసు కోవాలి. (నాగేశంతో) అమ్మాయి గారు యెక్కడికి పోతున్నారో నీకు తెలుసా?

నా:- తెలీదు సార్! డబ్బులన్ని బాగాలెక్క పెట్టి మూటగట్టారు. తర్వాత గాజుల శబ్దం వినిపించింది. దాన్నిబట్టి చేతిగాజులు, మెడలోవున్న నగలుకూడ మూటగట్టినట్లు ఆనవాసం వేసింది సార్ ! తర్వాత అమ్మాయిగారి యేడుపు వినిపించింది...

న్యా:- నగలుకూడా దోచుకున్నాడూ! వోరి పీడి పాపాలు పండిపోను. శ్రీ వెంకటరమణా ! నన్ను యింకా ఎందుకు బ్రతికించినావయ్యా? డాక్టర్! నీకింకా అర్థం కాలేదా? మా అమ్మాయి ఆ నగలు యివ్వనని వుంటుంది... వాడు కత్తిచూపించి అన్నీ విప్పి మూటగట్టేసుంటాడు. అమాయకురాలు యేడుస్తూంది. గోలచేస్తే నలుగురూ వింటారని ఆ పిల్లను గొంతు పిసికేస్తాడేమో! డాక్టర్, మీకు నమస్కారం చేస్తాను...వెళ్ళండి. యీ సమాచారం పోలీసుకు మాత్రం పట్టించ కండి, అంతా తారుమారైపోతుంది.

నా:- అబ్బాయిగారుకూడా యింట్లోనే వున్నారండీ!

న్యా:- ఏమిటీ! మా అబ్బాయి గోవిందుగూడా యింట్లోనే వున్నాడా?

నా:- తర్వాత వొచ్చాడండీ!

డా:- ఆ... పచ్చి... ఏం చేశాడు?

న్యా:- ఆ గజదొంగను నాలుగు తన్నాడా లేదా? వెధవకు బుద్ధివొచ్చేట్టు చెయ్యాలి!

డా:- ఇంతకూ గోవింద్ మీ కుమారుడేకదూ?

న్యా:- ఆవును. M.A. ఫస్టుక్లాసులో ప్యాసయినాడు, చాలా చురుకైనవాడు, నేనంటే యెంత ప్రాణం-యెంత మర్యాద, యెంత భక్తి డాక్టర్! మీరు నమ్మోతారో లేదోగాని నాకీమధ్య మా బంధువుల దగ్గరనుంచి వోపెండ్లి సంబంధ మొచ్చింది. నా వంటరితనాన్ని చూచి సహించ లేక మా అబ్బాయి గూడా నన్ను పెండ్లిచేసుకోమని ప్రాధేయపడ్డాడు. నేను అంగీకరించలేదు. వొద్దన్నాను. మావాడు అన్నం మానేశాడు. వెంటనే 80 వేల రూపాయల కట్నమిస్తామని, పెండ్లికంగీకరించమని టెలిగ్రాం వచ్చింది. నేనందు కంగీకరించాను.

డా:- (ఆశ్చర్యంతో) What! మీకు మళ్ళీ పెళ్ళా?

న్యా:- నా కోసమా? నా యింటి గౌరవం కోసంగాని! (నాగేశంతో) యింతకూ ఆ దొంగను బయటకు గెంటి డబ్బులు- నగలు లాక్కున్నాడా లేదా?

నా:- లేవండీ! అబ్బాయిగారు యింట్లోకి పోగానే-హల్లో, హల్లో అని వొకటే పకపకలు...యికయికలు... కాపీ కాయమని అమ్మాయిగారితో చెప్పారు. ముగ్గురూ హాయిగా త్రాగేసి కులాసాగా కాలం గడిపారు. (డాక్టరుకు యీ వింతపోకడ యేమి అర్థంగాక గుట్టుగా కుర్చీలో కూంబడ్డాడు.)

న్యా:- ఓరి దొర్భాగ్యుడా! ఆ దొంగ రాస్కెల్‌ను గొంతు నులిమి బయటకు నెట్టక కులాసాలు మాట్లాడాడాడు- కులాసాలు! యేకవలేక పొయ్యాడు చచ్చుపీనుగ!

(ప్రజాపతి దర్జాగా ప్రవేశించాడు. సిల్కు లాల్చీ, సిల్కు కండువా, సిల్కు ధోవతి! తీవిగా నడుస్తాడు. తీవిగా మాట్లాడుతాడు. తను మాట్లాడే ప్రతి మాటలోను హోదా కనుపరుస్తూ వుంటాడు. చేతిలో వో పేపరు.)

ప్ర:- అంతా క్షేమమేనా న్యాయపతిగారూ!

న్యా:- ఆదిగో దొంగ—పట్టుకో! పట్టుకో!!

ప్ర:- ఎవరండీ దొంగ!

డా:- హల్లో! Mr. ప్రజాపతి, యిప్పుడేనా రావటం?

ప్ర:- హల్లో! Dr. ఆరోగ్యంగారా? మీరూ యిక్కడే వున్నారన్నమాట!

న్యా:- (ఓన్నబుచ్చుకొని) క్షమించాలి. పేరే ధోరణిలోపడి మిమ్మల్ని ఆన కూడని మాటన్నాను. యింకో కారణమేమిటంటే.....

ప్ర:- ఏమైనా కానివ్వండి, అనడంమాత్రం సుద్ద పొరబాటే, నేను MLA ని.

న్యా:- కాదని యెవరనగలరు?

ప్ర:- అంటేమాత్రం నేనొప్పుకుంటానా?

న్యా:- (నాగేశంతో) నేను, ప్రజాపతిగారు, ఆరోగ్యంగారు, ముగ్గురం కలసి వొస్తున్నాం. యీలోగా నువ్వు వాడిని బయటకు పోనివ్వకుండా జాగ్రత్తగా చూడు.
(నాగేశం వెళ్ళిపొయ్యాడు. న్యాయపతి ప్రజాపతిని సమీపించి)
మీరు అత్యవసరంగా నాకొక సహాయం చేసిపెట్టాలి. నా సంసారాన్ని నిలబెట్టాలి. నా గౌరవాన్ని కాపాడాలి.

ప్ర:- ఏమిటండీ, అప్పుడే నివేదికలు సమర్పించుకుంటున్నారు. యేమిటి అంత కొంపమీదకొచ్చిపడింది ?

న్యా:- కొంపమీద పడటమేమిటి, నా కొంపే కూలిపోయింది. నా ఆస్తి నాశనమైపోయింది. అంతా ఆ దొంగముండాకొడుకు చేతిలో చిక్కిపోయింది. Mr. ఆరోగ్యం! మీరైనా వీరికి అర్థమయ్యేటట్లు చెప్పండి. యీలోగా రెండు గుటకలు మంచి నీళ్లు త్రాగుతాను, గొంతుపిడచగట్టుకొని పోయింది. (కూజా దగ్గరకు పోతాడు.)

ప్ర:- ఈపాటి విషయం నాకు తెలియకపోవటమేమిటి? నేను ప్రజాపతిని ! అందులో M.L.A. ని. ఆఁ! ఇంతకూ విషయమేమిటండీ డాక్టర్?

డా:- న్యాయపతిగారింట్లో దొంగలు పడ్డారు. పాపం, వాళ్ళ అమ్మాయిని బలవంతాన చంపటానికి ప్రయత్నిస్తున్నారు...

ప్ర:- న్యాయపతిగారమ్మాయి కారదనే? ఘోరం! ప్రపంచంలోని మన భారతసూత్రాలకే విరుద్ధం. యిలాంటి ఖూనీకోరుఁందరికీ, కఠిన శిక్షలు మాన్పించి, పురికఁబాలు తప్పించి, ఊరిజయటకు పంపాలని వొక చట్టాన్ని అసెఁబ్లీలో ప్రవేశపెడతాను. నేను ప్రజాపతిని. అందులో M.L.A. ని. ఆఁ? తర్వాత చెప్పండి? (న్యాయపతి గుండెకు సవరించుకుఁటూ మెల్లమెల్లగా గ్లాసులోని నీరు త్రాగుతున్నాడు.)

డా:- న్యాయపతిగారు తన విలువైన రక్తపు బొట్టుకన్నా మిన్నగా కాపాడి పోగుచేసి, రాసిపోసిన డబ్బును కొల్లగొట్టి మూటగట్టి...

ప్ర:- ఏమిటి–ఏమిటి! కొల్లగొట్టడమే! యిలాంటి దొంగలను వొళ్ళుఁచంచి కాళ్ళుగట్టి ఖజానాలో పారెయ్యాల్సిఁదిగా ప్రభుత్వానికి సలహా పంపిస్తాను. అందులో M.L A. మాట పాటించకుండా వుంటారా ? త్వరగా తర్వాత యేం జరిగిందో చెప్పండి?

న్యా:- (మెల్లగా సమీపించి) ఏమి చెప్పమంటారు! నన్ను హత్యచేస్తానని... పబ్లిగ్గా...

ప్ర:- పబ్లిగ్గానా?

న్యా:- అవునండీ, పబ్లిగ్గా హత్యచేస్తానని ఆకాశరామన్న వుత్తరాలు వ్రాశాడు. (జేబులోని వుత్తరం తీసి యివ్వబోతాడు.)

ప్ర:- వుంచండి వుంచండి. హత్యచేస్తానని ఆకాశరామన్న ఉత్తరాలా! ఈ ఆకాశరామన్న ఏ మండలానికి చెందినవాడో వెతికి గాలించి వివరాలు తెలిపిన భారతీయునికి M.L.A. ప్రజాపతి బంగారు పతకం బహూకరిస్తాడని పత్రికల్లో ప్రకటించి పారేస్తాం. ఆఁ! తర్వాత జరిగే ప్రమాదాన్ని చల్లగా సెలవీండి!

డా:- ప్రమాదమంతా మన ముగ్గురం వారి ఇంటికెళ్ళి ఆ దొంగను పట్టుకొని వారి ఆస్థిని కాపాడి, వారి అమ్మాఁయి ప్రాణం రక్షించి, వారి స్నేహాన్ని చంద్రమండలం వరకూ తీసుకొని పోవటమే.

న్యా:- ఆరోగ్యంగారు సత్యం సెలవిచ్చారు స్వార్థ త్యాగులై ప్రజా క్షేమాన్ని సర్వదా వాంఛించే ప్రజాపాలకులైన ప్రజాపతిగారునూ...

ప్ర:- మీరు నన్ను చిన్నబుచ్చుతున్నారు.

న్యా:- నేనా?

ప్ర:- అవును! ప్రజాపతికి తర్వాత M. L. A. కలిపి పూర్తిపేరుతో పిలవండి.

న్యా:- క్షమించాలి. ప్రజాపాలకులైన ప్రజాపతి M. L. A. గారునూ...

ప్ర:- చూడండి, ప్రజాస్వామ్యం అనిపించుకునే యీ దశలో ప్రజాపాలకులకు విలువ తక్కువ కాబట్టి ఆవగింజంత హోదా పెరగాలన్నా ప్రజాసేవకులైన ప్రజాపతి M.L.A. గారు అని మీరు నన్ను పిలవాలి. తర్వాత విషయాలు నేను చూచుకుంటాను.

న్యా:- అలాగే పిలుస్తాను. ప్రజాసేవకులైన ప్రజాపతి M.L.A. గారు... ప్రజారోగ్యాన్ని సర్వదా కాంక్షించే ప్రాణదాతలైన ఆరోగ్యంగారు... ఈ క్షణమే జాగుచేయక మా ఇంటి కరుదెంచి, మా డబ్బు రక్షించి, ఆ గజదొంగను శిక్షించి, మా వందనాలను స్వీకరిస్తారని బహుళ విధముల ప్రార్థిస్తూ అర్థిస్తున్నాను.

ప్ర:- భేష్! వచనాన్ని కవిత్వసరళతో మూడు ముక్కల్లో ముంచి తేల్చారు. బహిరంగ సభల్లో గూడా మా కిలాంటి బిరుదులు రావటం చాలా అరుదు. అసలు రావనే చెప్పాలి. ప్రజలు అమాయకులు. ఆవేశంతో వివేకం కోల్పోయి ప్రజాపతి M. L. A. మీరనే ప్రశ్నలవర్షం కురిపిస్తారు. కాని, మీరు మమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు. డాక్టర్! వెంటనే అస్మదీయ నేస్తంగారి యిల్లు పరిక్షించి, దొంగను చూపించి వారి ఆస్తిని పోషించాల్సిన బాధ్యత మనది. బయల్దేరండి.

డా:- మీరు నన్ను క్షమించాలి!

ప్ర:- క్షమించేశాం! ఏమిటి! ప్రజాపతి M.L.A. ని మీరు క్షమాపణ కోరుతున్నారా? కారణం తెలుసుకోవచ్చునా?

డా:- తెలుసుకోకూడదు.

న్యా:- అనగా?

డా:- మీరు దయచేసి నన్ను విడిచిపెడితే చాలు.

ప్ర:- మీరు మనస్నేహాన్ని అర్థం చేసుకోలేక పోతున్నారు. ముఖ్యంగా ప్రజాపతి M.L.A. గారిని...

డా:- అర్థం చేసుకుంటూ వున్నాను.

న్యా:- డాక్టర్! యీపాటికి ఆ గజదొంగ ఇరుప్పెట్టంతా ఖాళీ చేసుంటాడు.

డా:- ఇల్లుదాటి పదిమైళ్ళు ప్రయాణం గూడా చేసుంటాడు.

న్యా:- అయ్యో! వెంకటరమణా, నన్ను యిలా యెందుకు పరీక్షిస్తున్నావయ్యా!

ప్ర:- డాక్టర్! మీలో కలిగిన ఈ వింతమార్పుకు కారణం?

డా:- మీ మనస్తత్వం!

ప్ర:- మీరు అర్థం చేసుకున్నారా?

డా:- నేను కేవలం డాక్టరునే కాదు; సైన్టిస్టుని, సైకాలజిస్టుని! ఇప్పుడు మీరు అర్థంచేసుకున్నారా?

న్యా:- డాక్టర్! మా అమ్మాయి కారద ఆ గజదొంగ కబంధహస్తాల్లో యమచర పడుతూవుంటుంది. మీరు వెంటనే కరుణించి బయల్దేరండి, పుణ్యముంటుంది.

డా:- మోక్షమంటేనే మమకారం చూపని మానవుడు-పుణ్యాన్ని లంచంగా పుచ్చుకుంటాడా? మరేం పర్వాలేదు. మీ కుమారుడు గోవింద్ వున్నాడుగా! వ్యవహారం అదుపులోకి తెచ్చేవుంటాడు.

ప్ర:- డాక్టర్, మీది రాతిగుండె!

డా:- అవును, వొక్క రోగి విషయంలో మాత్రం!

న్యా:- కాదు, ప్రజలంటే మీకు విశ్వాసం లేదు.

డా:- ప్రజలకు ప్రాణదాతలని వేదే చెప్పారుగా? అంతకుమించి నేనేమీ చెప్పదలుచుకోలేదు.

ప్ర:- మీకు స్నేహితులన్నా గౌరవం లేదా?

డా:- గౌరవమా?

ప్ర:- అవును!

డా:- ఆ మాటను ముందుగా మీరు అర్థం చేసుకోవాలి. స్నేహితులంటె నా హృదయాన్ని కోసి వారి అవసరం తీర్చగల శక్తి నాకుంది. కాని మీకు లేదని నాకు తెలుసు.

ప్ర:- మీకెలా తెలుసు?

డా:- చెప్పానుగా! నేను సైకాలిజిస్టునని. మీరు చేసే స్నేహిత మంతా మీ స్వార్థాలను పోషించి మీ సుఖాలను కూడగట్టుకోడానికే చేస్తున్నారు.

ప్ర:- మామీద మీకు కలిగిన యీ దురభిప్రాయానికి ప్రజాపతి M.L.A. చాలా చింతిస్తున్నాడు. పైగా అభిప్రాయం మార్చుకుంటె మనమధ్య స్నేహం పెరిగి చంద్రమండలం దాకుతుందని గూడా సంతాయిస్తున్నాడు.

డా:- సంతోషం !

న్యా:- డాక్టర్! యీపాటికి ఆ దొంగ మా యింటికి నిప్పు గూడా పెట్టేసుంటాడు.

డా:- నేను మీకు సహాయం చేయలేనని చెప్పటానికి చింతిస్తున్నాను.

ప్ర:- యేడ్చేస్తే మరీ సరదాగా వుంటుంది.

డా:- ఆ అవసరం మీరే కలుగజేసుకుంటే మరీ బాగుంటుంది

ప్ర:- ఓ రాజకీయ నాయకుడితో మాట్లాడుతున్నామనే మర్యాద గూడా మర్చిపోయారు !

డా:- మీరు M. L. A. అని బాగా తెలుసు.

ప్ర:- మీకేమిటి? ప్రపంచమంతా తెలుసు.

డా:- పొరపాటు ఆంధ్రప్రదేశ్ వరకు.

ప్ర:- ఆ మాటకొస్తే ఆరు వందల మైళ్ళవరకు—అంతకు మించయినాసరే మీ ఉద్యోగాన్ని బదిలీ చేయించగలను. ఆ మాత్రం పలుకుబడి ప్రజాపతి M.L.A.కి లేదనుకోకండి !

డా:- సరిహద్దుల వరకూ సంతోషిస్తాను. కానీ మీరు వొక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మీదంతా సీజనల్ పలుకుబడి. అయిదు సంవత్సరాలే మీ పలుకుబడికి జీవితం. తర్వాత చచ్చిన శవాన్ని చూచి జాలిగా కన్నీరైనా కారుస్తారు గాని, మీకంటే...

ప్ర:- మేమంటె? యేంజేస్తారేం.!

డా:- కొంతకాలమైన తర్వాత మీరే అనుభవం మీద తెల్సుకోవాలి.

ప్ర:- (మీసంమీద చేయివేసి మీసం త్రిప్పుతూ) ఇంతవరకు M.L.A. ప్రజాపతి అపజయమంటె యేమిటో అనుభవించి యెఱుగరు.

డా:- తారుమారు చేయటం ప్రజాపతిగారికి పరిపాటయితే విజయాలు పొందటం కూడా.....

ప్ర:- యేమిటయ్యా మేము తారుమారు చేసింది?

డా:- ప్రజాస్వామ్యాన్ని! ప్రజల హక్కుల్ని! రాజకీయ యంత్రాంగాన్ని! యింకా విపులంగా చెప్పమన్నారా?

న్యా:- మీరేమీ చెప్పనక్కర్లేదు. యీపాటికి వాడు కొంపను సదరంగా పూడ్చేసే వుంటాడు...మీ వాదోపవాదాలు నా కొంపకు చేటేగాని మేలులేదు. డాక్టరు గారు...యింతకాలంనుండి మనమెంతో క్లోజ్‌గా వున్నామే! యెన్నో విషయాలు మాట్లాడుకున్నామే, మీతో చంద్రమండలంవరకూ వస్తానన్నానుగదా. నామీదెందుకండీ మీకింత కోపం? మా అమ్మాయి గతేమయిందో యేమో...! అయ్యో, వెంకటరమణా, యీ వృద్ధాప్యంలో యెందుకయ్యా నన్నిలా పరీక్షిస్తావ్ ! నేనేం పాపం చేశాను!

డా:- క్షమించండి. పవిత్రమైన నా కాలాన్ని ప్రయోజనంలేని మీ చర్చతో వృధాపుచ్చాను. నా పరిశోధనను గురించి చాలా ఆలోచించాలి,

ఏస్తాను. (వెళ్ళబోతూ కాస్త ఆగి) అరగంట వరకు మీరు నన్ను పిలవడానికి అవకాశంలేదు–అసలు పిలచినా కూడ నేను పలకను–తర్వాత మీ కార్యక్రమంలో పాల్గొంటాను. (గ్లోబ్ తీసుకొని వెళ్ళిపోతాడు)

న్యా:- (ఏమి చెయ్యాలో తోచక దిగులుతో ప్రజాపతి వంక చూస్తాడు) అనుకున్నంత పనీ చేశాడు ... యిప్పుడేం చెయ్యాలి...మనయిద్దరం ఆ దొంగను పట్టగలమా!

ప్ర:- ప్రజాపతి మీ వెంట వస్తున్నాడంటే పది పదుల నూరు మంది పోలీసులు మీకు అండగా, మీ గండానికి కాపలా కాస్తున్నట్లే ననుకోండి.

న్యా:- ఆ మాట మీరు చెప్పాలా...నాకు మాత్రం తెలీదూ? త్వరగా వెళ్ళి పట్టుకుందాం రండి.

ప్ర: M. L. A. ప్రజాపతంటే దిష్టి బొమ్మనుకున్నాడు డాక్టరు) చూపిస్తాను. ప్రజా నాయకులుగా ప్రజలచే యెన్నుకొనబడిన M.L.A. లను మర్యాదగా చూడని వారిని, వినయంగా మాట్లాడని వారిని, చాటుగా దూషించిన వారిని ప్రభుత్వం వారు విధిగా శిక్షించి, పదహారణాలు జరీమాన వసూలుజేసి అందులో యెనిమిదణాలు క్షయ రోగనివారణకు చందా కట్టాలని వొక చట్టం ప్యాస్ చేయిస్తాను, త్వరగారండి దొంగను పట్టుకుందాం ! (ఆడుగు ముందువేసి. ఇంతకూ దొంగ పేరు ?

న్యా: వాడేనండి, మనకు ఆజన్మ శత్రువు.

ప్ర: న్యాయపతిగారు, మీరు పొరపాటుపడ్డారు.రాజకీయాల్లో జన్మ ప్రధానం గాని, "ఆ" పనికిరాదు. తండ్రికి కుమారుడు శత్రువై పోతాడు, భర్తకు భార్య శత్రురాలవుతుంది. మొత్తంమీద మిత్రులంకన్నా శత్రువులే మనకెమరౌతారు. అంతమాత్రునికి గుండెజారి, బిందబారి మనంవ్యవహరించకూడదు. ఆఁ! ఇంతకూ మనజన్మకు శత్రువెవరు?

న్యా: ఆ కుక్కమూతి నక్కతోలుగాడు.

ప్ర: మీరు జంతువు పేరు చెబుతున్నారా ?

న్యా: మనిషేనండి ! ఆ గజదొంగ పేరే !

ప్ర: ఓ ! భారతదేశంలో దొంగలకు కరువులేదు. యీ దొంగలనంతా సంఘం తయారుజేస్తున్నదనే విమర్శలకు కొదువలేదు. యింతకూ పేరు చెప్పను మరిచారేం ?

న్యా: పేరు చెప్పను నాకు ధైర్యంలేదు —చెప్పక తర్వాత మీరు బంధువుండరు, శుంఠశైలిలో చెప్పాలంటె సెక్షన్ 457 & 389 I P C క్రింద మూడు సంవత్సరాలు కఠిన శిక్ష వేయించామే, ఆ మనుడే

ప్ర: అంటే మీకు కోపం వొస్తుందేమోనని ... అనాలని నాకు కోరిగ్గా వుంది. చూడండి. అనేక సెక్షన్ల క్రింద అనేక మంది ప్రతిరోజు జైలుకెళ్లతున్నారు. అందులో దోషులున్నారు. నిర్దోషులున్నారు. అంతా మీ చలవేనని అందరూ అంటారా కొందరు తిట్టిపోస్తారు మరికొందరు పొగిడి పారేస్తారు...

న్యా: దానికి మనమేం చేస్తాం. అది మా వృత్తిధర్మం!

ప్ర: సరేసరే! యింతకూ పేరు చెప్పండి! దొంగలుపడ్డ ఆరు మాసాలకు తుక్కలరిచాయని...తీరా దొంగపొయ్యాక మనం వెళ్ళి మాత్రం చేసేదేముంది?

న్యా: వాడు నిండు దరిద్రుడండి. యిప్పుడర్థమయిందా?

ప్ర: ఎలా అవుతుంది? దరిద్రంవల్లనే దొంగతనాలు జరుతున్నాయని ప్రభుత్వాన్ని తెలివిలేకుండా తిట్టిపోస్తున్నాయ్ రాజకీయ పార్టీలు. M. L. A. గా వుండి యీపాటి తెలివి నాకున్నా-ప్లీడరుగావుండి మూసలితనంలో మీకువున్న మతి మందమెక్కి పోతూవుంది. యింతకూ దొంగపేరు చెబుతారా చెప్పరా?

న్యా: (కళ్ళు రెంచూ గట్టిమూసుకొని) ప్రజాపతిగారు యెవరైనా వొస్తున్నారేమో అలా చూడండి.

ప్ర: ఎందుకు?

న్యా: మీకు పేరు చెబుతాను.

ప్ర: (గుమ్మం వరకూ వెళ్ళి) ఫోర్డుకంపెనీ మోటార్‌కార్లు యిండియాలో తయారైన సైకిల్ షాలు తప్ప బయట యెవరూ లేరు—యెవరూ రావటం లేదు. పోవటం లేదు

న్యా: (కళ్ళుమూసుకునే) అయితే చెప్పేస్తున్నాను. వెంకటరమణా రావుపాడు తండ్రి! ఆ గజదొంగ పేరు ... వాడేనండి, మా యింట్లో దొంగ పేరు ... కో...టి...రూ...పా...లు ... (ప్రజాపతికి గుండె గతుక్కుమంది.)

ప్ర: న్యాయపతిగారూ!

న్యా: ఏమండీ ప్రజాపతిగారూ! క్షమించండి M. L. A. ప్రజాపతి గారూ?

ప్ర:- ఇప్పుడు యెలా పిలిచినా వొక్కటే లెండి ! ఇంతకూ నేను మీ యింటికి రావాలంటారా ?

న్యా:- రావాలనే కదా యింతసేపూ ప్రతిమాలటం ? రండీ !

ప్ర:- ముందు కాసిని మంచినీళ్ళందుకోండి. గుండెలో యెందుకనో పోటుగా వుంది. (న్యాయపతి కూజాలో నీళ్ళు పోసుకుని తెచ్చి యిచ్చాడు. ప్రజాపతి ప్రాగి గుండెను సర్దుకుంటూ) నాకు యీ మధ్య ఆరోగ్యం కొంచెం చెడింది. Blood Pressure వుందని డాక్టర్ ఆరోగ్యంగారే చెప్పారు. ఎక్కువ దూరం నడవకూడదని కచ్చితమైన సలహా యిచ్చి తుదా తప్పక పాటించమన్నారు...మరి ...మీ యింటివరకు యెలారాగలనో... చెప్పండి.

న్యా:- కారులో వెళదాం రండి !

ప్ర:- ప్రజాసేవకుడైన ప్రజాపతి కాలినడకతో ప్రయాణం చేస్తాడు గాని..

న్యా:- టాక్సీకి నే నిచ్చుకుంటానండి డబ్బులు !

ప్ర:- అంత అవువరం మీకు కలుగజేస్తానా !

న్యా:- పోనీ జట్కాలో వస్తారా ?

ప్ర:- అది మన ప్రాహతుకే కళంకం!

న్యా:- పోనీ నడిచి వెళ్దాం రండి ! యిప్పటికే యిల్లు గుల్లయి పోయి వుంటుంది.

ప్ర:- చెప్పానుగా, నాకు Blood Pressure వుందని. నడిస్తే గుండె బాధ యెక్కువై పోదూ?

న్యా:- పోనీ, నా వీపుమీదెక్కండి, మోసుకొని పోతాను.

ప్ర:- నరవాహనం నాగరిక లక్షణం కాదు.

న్యా:- ప్రాణంతో చెలగాటలాడటం రాజకీయ లక్షణమా ?

ప్ర:- (వినిపించుకోనట్లే) ఏమన్నాడు ?

న్యా:- నా నెత్తిన నిప్పులు పోయమంటున్నాను. (కొంచెం కోపం తెచ్చుకొని) అసలు మీరు మొన్న మద్రాసులో కారెందుకు కొన్నాడు ?

ప్ర:- మావాడు విశ్వం కోసం ! వాడి సరదా తీర్చటానికి...మా అర్ధాంగి కోరిక నెరవేర్చటానికి !

న్యా:- విశ్వం కోసం కొన్నారా లేక విలాసం కోసం కొన్నారా ? ప్రతాపతిగారూ, మీకు చేసిన మేలు మరచిపోకండి.

ప్ర:- నేను చేసిన మేలు మీరు మర్చిపోతారా ?

న్యా:- మరిచిపోలేదుగాబట్టే మిత్రులని యింతదూరం బ్రతిమాలాను. నా సహాయం మీరు మరిచిపోయారుగాబట్టె నిరాకరిస్తున్నారు. యింత అహంకారం యెవ్వరికి పనికిరాదు.

ప్ర:- మేము చూపిస్తున్న అహంకారం యేమిటండీ ?

న్యా:- ఇంకా యేం చూపించాలి, నాకష్టార్జితమంతా దోపిడై పోతూ వుంటే మీరు దర్జాగా చూస్తూ నిలబడుతున్నారు.

ప్ర:- మీతోపాటు నోరు కొట్టుకోమన్నారా ?

న్యా:- అంతేనంటి, యిప్పుడు మీరు ఆ మాటలనక మరేమంటారు ? మీ పాలేరు పాపయ్య ప్రాణాలు నిలవునా తీసి, యీ కేసు నేలాగైనా తప్పించి పేరు ప్రతిష్ట కాపాడమని కాళ్ళు పట్టుకొని దా గేడుపు

లేచినవాడు యీ న్యాయపతి అడ్డుపడి మీ పరువును కాపాడాడు. ఆ విశ్వాసమైనా లేదు మీకు !

ప్ర:- అందుకోసం మీకు మా కృతజ్ఞతలు తెల్పుకుంటూ ఆరు వేల రూపాయలు పారితోషికం చదివించాం.

న్యా:- వెధవ పారితోషికం! పరువుపోయ్యాక యెంత చేస్తే యేముంది? కళ్ళు నెత్తినపెట్టుకొని, వొళ్ళు బలిసి మీ కుమారుడు నిండు చూలాలి మీద కారు పోనిచ్చాడు, ఆమెను చంపాడు.

ప్ర:- ఆ కేసు గెలిచినందుకు వెయ్యి రూపాయలు మీకు ఫీజు చెల్లించాను

న్యా:- గ్రామాల్లో కక్షలు పెంచి, మత్తెక్కిన మీ వర్గం పేదల పాకలకు నిప్పంటించి, ఆడంగులను అవమానపరచి...గ్రామాన్నంతా భీభత్సం చేసి విడిచిపెట్టారు. వారి ఆస్తులంతా అగ్నిపాలుచేశారు. మొర్రో అంటూ వాళ్ళు కోర్టు వారికి ఫిర్యాదు చేస్తే మీది అక్రమమని తెలిసి గూడా మీ కేసు గెలిపించారు... మీ అన్యాయాన్నే బలపర్చాను.

ప్ర:- ఆ సంతోషంలో నా చేతిదబ్బు ఆయిదు వేలిచ్చాను— పార్టీ దగ్గర పది వేలు వసూలు చేసి మీకు సమర్పించాను. మీ భార్య తద్దినానికి మూడు వీశలు వంకాయలు పంపాను... రెండు బండ్ల కట్టెలు తోలించాను. మీ ఆమ్మాయికి రెండు సవర్ల నెక్లెసు చేయించి యిచ్చాను. మీరు నాకుచేసిన మేలుకు, నాను తోచిన వుపకారమే చేశాను కాని అపకారం చేయలేదు. ప్రజాపతి M. L. A. అంటే రాతి గుండె గల కసాయికాడు. యింతటితో మీ వుద్రేకం తగ్గిస్తే బాగుంటుందేమో !

న్యా:- మీరు నాకు వుపకారం చేశారా ! యీ కోటి రూపాయిగాచిని నా కొంపమీదకు తెచ్చిందెవరు ?

ప్ర:- మీరే తెచ్చుకున్నారు !

న్యా:- నేనా ? B. A. చదివిన కోటయ్యను కోటిరూపాయిగా పేరు సృష్టించి... మీ దబ్బుబలంతో సాక్ష్యం అంద సంపాదించి, కోటయ్యను ఖూనీకోరుగా కోర్టుముందు హాజరు పెట్టిందెవరు ?

ప్ర:- ఆ ఖూనీకోరు కోటయ్యకు కఠిన శిక్ష విధించాలని కోర్టు వారికి సలహా యిచ్చిందెవరు ?

న్యా:- చక్కెర ఫ్యాక్టరీ దివాలా తీసిందని లాభాలు మూట గట్టి, దొంగ లెక్కలతో నష్టమొచ్చిందని నాటకమాడి, ఫ్యాక్టరీని మూసేసారు. యీ దొంగలెక్కలు ప్రభుత్వానికి చేరవేస్తాడని కోటయ్యమీద కత్తి గట్టి కోటిరూపాలుగా పేరుమార్చి, నిలువెత్తు ధనం యిస్తానని ఆశ జూపి, కోటయ్యపై కేసుపెట్టి ఖైదుకు పంపమని కళ్ళనీళ్ళతో కాళ్ళమీదపడి ప్రాధేయపడిందెవరు ?

ప్ర:- న్యాయపతిగారు, అంతటితో ఆగండి. మీ అమ్మాయి శారదా దేవి B A. గారికి Mr. కోటిరూపాలు, I mean కోటయ్యకు యెన్ని సంవత్సరాలుగా ప్రేమ సంబంధాలున్నవో మీకు తెలుసునా?

న్యా:- ప్రేమలేదు, సంబంధంలేదు. అంతా వొట్టి అబద్ధాలు, అభాండాలు.

ప్ర:- (విషపునవ్వు నవ్వి వోరకంటితో న్యాయపతినిచూస్తూ) అబద్ధాలని మీరు బుకాయిస్తారు. గట్టిగా మాట్లాడితే నాకు తెలియదంటారు. అంతేనా? కాని ప్రజాపతి M L.A. గారికి వారిరువురి అన్యోన్య ప్రేమను గురించి బాగా తెలుసు.

న్యా:- ఇదిగూడా పచ్చి అబద్ధమే !

ప్ర:- అబద్ధమని యిప్పుడంటే యేం లాభం ? నాతో యీ విషయం చెప్పక ముందే మీరు జాగ్రత్తపడుంటె యింత రచ్చకెక్కే వారు గాదు. ప్లీడరుగారు ! అమ్మపుట్టిల్లు మేనమామకు తెలీదూ ? అబద్ధమని బుకాయిస్తారా ?

న్యా:- మళ్ళీ చెబుతున్నాను. అంతా అబద్ధం. నీవు దొంగవు, మోసగాడివి, ఖూనీకోరువు. రాక్షసుడివి, మైరావణుడివి..... (గుండెపట్టుకొని బాధపడున్నాడు. ముఖమంతా చెమటలు కమ్మి నెరసిన గడ్డం పైకి జారుతున్నాయ్)

ప్ర:- (న్యాయపతి ఆవేశంచూచి బాగా కడుపుబ్బ నవ్వేశాడు.) అనండి యింకా అనండీ శపించండి. కాని, నిజాన్ని మాత్రం దాయ

కండి. మీ అమ్మాయిని ప్రేమించి, మీ వంశం పేరు నాశనం చేస్తున్నాడని కోటయ్య మీద విషం గ్రక్కుతూ వొచ్చారు మీరు. కారదకు పెండ్లి చేయాలని యెంతో ప్రయత్నించారు. అందుగ్గాను పెద్ద రూపాయలు ఖర్చయిందని చాలా బాధ పడ్డారు మీరు. కాని వివాహం కుదరలేదు. కారద కోటయ్యనితప్ప మరెవ్వరిని పెండ్లాడనంది యెంత చెప్పినా పినిపించుకోలేదు. వొకనాడు రాత్రి కారదను మీరు తన్నబోయ్యారు. కాళ్ళుగట్టి మెళ్ళో పుస్తె వేయిస్తానని శపథం తీశారు. ఆ రాత్రే కారద నూతిలోపడబోయింది. అదిచూచి మీరు గొల్లుమన్నారు. ఆనాటి నుంచి కారదతో పెండ్లి విషయం మాట్లాడటం మానుకున్నారు. కాని పగపట్టిన వ్రాచులాగా కోటయ్య మీద ప్రతీకారం తీర్చుకోవాలని శుభ ఘడియ కోసం యెదురు చూశారు. మనమిద్దరం కలిశాం. యేవిధంగానైనా కారద నుంచి కోటయ్యను వేరు చేయ్యాలనుకున్నారు. అందుకు నా విద్యాదును జోడించారు. కోటయ్యకు కఠినశిక్ష వేయించారు. వాళ్ళ సంసారాన్ని చిందర వందర చేసారు. ఆ దిగుల్తో వాళ్ళమ్మ మంచ మెక్కింది. చిన్నతమ్ముడు బడి మానేశాడు. ముసలి తండ్రి పస్తులతో చస్తున్నాడు. కాని కోటయ్య జైల్లోనుంచి తప్పించుకున్నాడు. మీ మీద కక్ష సాధిస్తాడు. మీ డబ్బు కొల్లగొట్టాడు, మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు.

న్యా:- ఇది యెన్నటికి జరుగదు!

ప్ర:- ఈపాటికి జరిగిపొయ్యేవుంటుంది!

న్యా:- ఇదంతా మీవల్లనే జరిగింది! మీ స్నేహం చెయ్యడం మూలాన జరిగింది!

ప్ర:- కాదు, మీ వల్లనే జరిగింది!

(బిగ్గరగా అరుచుకుంటారు ఆవేశంగా. వీరి కొట్లాటను చూచి డాక్టర్ ఆరోగ్యం పరిగెత్తుకుంటూ వొచ్చాడు)

(డాక్టరు వొచ్చిన విషయం గూడా గమనించకుండా వారి వాదోపవాదాలు తీవ్రరూపం దాల్చాయి.)

న్యా:- మీ వల్లనే పచ్చని మా సంసారం పదిమందికి లోకువై పోయింది!

ప్ర:- మీ చలవవల్లనే M. L. A. ప్రజాపతంటే—ప్రజలదృష్టిలో పనికి రాకుండా పొయ్యాడు.

న్యా:- నా మాటను మీరు వొప్పుకుంటారా?

ప్ర:- మరి నా మాట సంగతి?

డా:- (వారి మధ్యచేరి వారిస్తూ) Peace! Peace! ఆంధ్రుల మధ్య ఐకమత్యం కుదరాలి. మీరు వెంటనే రాజీకుదుర్చుకోవాలి.

ప్ర:- కుదరాల్సిందే మరోజన్మకు! యిలాంటి చచ్చు ప్లీడర్లు, పిసినిగొట్టు పీకుగలు చస్తేనేగాని ముందుతరం ఆంధ్రుల్లో ఐకమత్యం కుదరదు!

న్యా:- ప్రజాపతులమంటూ, M.L.A.ల మంటూ ప్రజల నెత్తిన చేతులు బెట్టి పరిపాలన సాగించాలనే దుర్మార్గులా, దౌర్భాగ్యులు మట్టి పాలయ్యేవరకు ముందువారికి ముక్తి రాదు.

ప్ర:- ఎవరయ్యా దుర్మార్గులు?

న్యా:- ఎవరయ్యా పిసినిగొట్టు, చచ్చుప్లీడర్లు?

ప్ర:- దుర్మార్గులు మేమంటారా?

న్యా:- పిసినిగొట్టు మేమంటారా?

ప్ర:- అవును నువ్వే!

న్యా:- అవును నువ్వే!

డా:- (వారు అరుస్తున్న అరుపులకన్నా బిగ్గరగా అరుస్తూ) ఇద్దరూ ఇద్దరే, దిష్టిబొమ్మలు. అనవసరంగా మీ కుళ్లునంతా ఐదారు కెక్కించి అల్లరి పాలుకాకండి. ఏనేవాడు, చూచేవారు ముఖాన వుమ్మేసిపోతారు.

ప్ర:- మరి అతని మాటలు మీరు విన్నారుగా?

డా:- బాగా విన్నాను!

న్యా:- మరి అతని దౌర్జన్యం మీరు చూచారుగా?

డా:- సమస్తం నా రెండు కళ్ళతోనే చూచాను!

ప్ర:- మీరే చెప్పండి యెవరు చచ్చుపీనుగర్లో !

డా:- ఆంధ్రుల మేలుకోరి పీరు యింతటితో యీ రగడ మానేస్తే చాలా సంతోషిస్తాను.

ప్ర:- ప్రజాపతి MLA దుర్మార్గుడంటే యేలాగండి వూకోట్టం ?

న్యా:- మరి న్యాయపతిని చచ్చు పీనుగంటె విటూ కళ్లు మూసుకో మంటారా ?

డా:- చెప్పానుగా, యిద్దరూ దిష్టి బొమ్మలేనని. వాగుడు కట్టిపెట్టి పెద్ద మనుషుల్లా బ్రతకడానికి ప్రయత్నించండి !

ప్ర:- ఏమిటండి మీకనేది ? అప్పటికి మేము పెద్దమనుషులంకాదనా మీ అభిప్రాయం !

న్యా:- అరవై సంవత్సరాలు నిండినా వొకిపన్నయినా రాలి నేలమీద పడ లేదు. వొక్కరిదగ్గర వొక్కమాటగూడా అనిపించుకోలేదు. నేను పెద్దమనిషిని కాదంటారా ?

డా:- గౌరవనీయులైన M L A గారికి, పీనుగు గారైన న్యాయపతిగారికి, డాక్టర్ ఆరోగ్యం యిస్తున్న సున్నితమైన సలహా యేమిటంటే... వొకటి — కుళ్ళుకంపు కొట్టే మీ కాకిగోలను కట్టిపెట్టి పెద్ద మనుషుల్లా, నీతిగల తెలుగు పీరుల్లా బ్రతకమని. రెండు – ఇది ప్రజాయుగం. ప్రజాపాలన జరుగుతున్నదని పాప పుణ్యాలు పసికి రావని ప్రజాపతి M L A గారికి బాగా తెలుసు. అలాగే ధర్మ చక్రం వెలుగునీడలో ధర్మప్రభుత్వం న్యాయాన్ని కలుగ జేస్తున్న దని పీనుగు న్యాయపతి గారికి తెలుసు. కానీ, మరిగిపోయిన పాత సాంప్రదాయాలనే మీరనుసరిస్తూ, ప్రజలను, ప్రభుత్వాన్ని, న్యాయాన్ని వొక్కరించాలని మీరు కుట్రపన్నారు. నాటకమాడారు.

ప్ర:- కుట్రా ?

న్యా:- నాటకమా ?

డా:- అవును. గౌరవనీయుడైన వొక తెలుగు బిడ్డకు, అమెరికా బి ఏ. వరకు చదివిన విద్యావంతుడికి, దరిద్రుడని, గజ దొంగని, ఖూనీ

కోరని, కోటిరూపాలని పేర్లు సృష్టించి మీ దబ్బుబలంతో. వృత్తి బలంతో, అన్యాయంగా భ్రదుసాలు చేసారు. మూడు — ఆధునిక ప్రపంచంలో ప్రేమకు అగ్రస్తానముందని మీకు తెలిసికూడా,కుంము మతము, సాంప్రదాయమనే పిచ్చికలలు కని, అమాయికురాలైన కారదను, అమాయకుడైన కోటయ్యను వేరుచేసి వారి అనురాగ హృదయాలను భగ్నం చేశారు. కోటయ్య సంసారాన్ని కూల్చేశారు. వాళ్ళనాన్నను పస్తుల్తో చంపుతున్నారు. ఒక ప్రళయ భయంకరమైన ప్రజాద్రోహానికి, బీభత్సానికి కారకులైనారు.

ప్ర:- మీరు చెప్పినదంతా సత్యమని అభిప్రాయపడుతున్నారా ?

న్యా:- ఇదంతా మీకెలా తెలిసింది ?

దా:- దొంగతనం, రంపుతనం దాగదని మీకు తెలిసిందేగా ? పతనమైన మీ పరువు ప్రతిష్టల్ని తిరిగి ప్రజలముందు నిలుపుకోవాలంటె వొక్కటే మార్గముంది !

ప్ర:- అడుగదల్చుకుంటె మీరు చెప్పడానికి నిరాకరించక గదా ?

న్యా:- మనిషికి మార్గం చూపడం మహాత్ముల లక్షణం ! సెలవిస్తే తప్పక స్వీకరిస్తాం !

దా:- (చరచరా టేబిల్ దగ్గరకెళ్ళి రెండు తెల్లకాయితాలు తెచ్చి) మీరు జైలుపాలు కాకుండా మర్యాదస్తులుగా, మంచిగా బ్రతకాలనుండే, కోటయ్య... కాదు... మీరు పెట్టిన పేరు ప్రకారం, కోర్టు వారికి తెలిసిన పేరు ప్రకారం కోటిరూపాలు నిర్దోషని, మేమే అతనికి అన్యాయం చేశామని యీ కాగితంలో వ్రాసియివ్వండి.

ప్ర:- మీరు చెప్పేది నాకేమీ అర్థం కావటంలేదు. మేమెందుకు రాసివ్వాలి?

న్యా:- ఆయన మూలంగానే కోటిరూపాలు భ్రదు పాలయ్యాడు..... యిందులో నేను చేసిందేముంది?

ప్ర:- నావల్ల యేమీ తప్పులేదు. తప్పంతా మీదే. మీరే వ్రాసివ్వండి.

న్యా:- నేనెందుకు వ్రాస్తాను? ఆ తప్పులో మీకూ భాగముంది. మీరే వ్రాసివ్వండి.

ప్ర:- మీరే వ్రాసివ్వండి.

న్యా:- మీరే వ్రాసివ్వండి? (పీరి వాదం మరలా తీవ్రమైంది)

డా:- (గట్టిగా) మీరు వ్రాసిస్తారా లేక నన్నే పోలీసులకు రిపోర్టు యివ్వ మన్నారా? (ఫోను దగ్గరకు పోపోడు

న్యా:- చూడండి ఆరోగ్యంగారు! మా యింటివరకు వెళ్ళి పరిస్థితులెలా గున్నాయో వొక్కసారి చూసి చిటికలో తిరిగొస్తాను

డా:- ఆ విషయంలో మీ కెలాంటి భయమక్కరలేదు!

న్యా:- బోలెడాస్తి వుందండీ! రొక్కం యాభై వేలు, బంగారు ముప్పై వేలు, యిల్లు యిరవై వేలు, కుల్లులక్ష...ఇంత ఆస్తి...

డా:- దమ్మిడీతో సహా మీకు అప్పగించేట్టు నేను చేస్తాను. నమ్మకం లేదా? లేకుంటే నా ఆస్తినంతా మీ పేర వ్రాచ్చేస్తాను. నా మాట నమ్మండి. ముందు స్టేట్‌మెంటు రాయండి. కోటిరూపాలు యెక్కడున్నా పట్టి, బంధించి, ప్రాణంతో యిక్కడకు లాక్కు రమ్మని యిప్పుడే ఫోను చేస్తాను ఊ! వ్రాయండి! (ఫోను దగ్గరకు వెళ్ళి ఫోను చేత్తో తీసుకుని) Heleow! Yes: Dr. Arogyam Speaking! Yes! Jupiter r Club! ఆఁ! చూడండి! కోటిరూపాలనే గజదొంగ; మన ప్లీడరు న్యాయపతిగారింట్లో ఆ! ఆ! న్యాయపతిగారింట్లోనండి!

న్యా:- No. 25, National Road.

డా:- ఆఁ! No. 25, National Road; అవునండి! పట్టపగలు జొరబడి...ఆస్తినంతా-ఆఁ! వారు సంపాదించిన దబ్బునంతా దొంగిలించుకొనిపోతున్నాడు...మీరు వెంటనే అతన్ని అరెస్టు చేసి...

న్యా:- చూడండి...మా అమ్మాయి కారదను గూడా చంపబోతున్నాడని చెప్పండి.

డా:- ఆ మాటెందుకు చెప్పటం?

న్యా:- నిజం చెప్పకుంటె యెలాగ?

డా:- ప్రేమించినవాడు...ప్రేయసిని చంపుకుంటాడా? మీడంతా పిచ్చి.

న్యా:- ఏం ప్రేమో, వల్లకాటి ప్రేమ, నా కొంప ముంచింది.

డా:- ఆఁ! ఆ! వెంటనే అరెస్టు చేసి యిక్కడకు తీసికొస్తే యింకా కొన్ని విషరాలు మీకు తెలుస్తాయి! ఇప్పుడే వెళ్తున్నారా? ఆ! Jupiter's Club! Thank You (ఫోను క్రింద పెట్టేశాడు).

న్యా:- ఆ దగుల్బాజీగాడు యిక్కడికెందుకండి!

డా:- వొచ్చినా మీకేమి భయంలేదు!

న్యా:- అవునులెండి మీరుండగా నాకెందుకు భయం!

డా:- ఇంకా మీరు నిల్చుకొని వున్నారేం, యిలా కుర్చీలో కూర్చొని అనుకున్న మూడక్షరాలు విపులంగా వ్రాసివ్వండి. (ప్రజాపతి, న్యాయపతి తప్పదన్నట్లు వొకరినొకరు చూచుకొని గిర్రున మొఖాలు దాటుగా త్రిప్పుకున్నారు.) కానివ్వండి! పోలీస్ వొచ్చేలోగా మీవ్రాత పూర్తి కావాలి. (ఇరువురూ కుర్చీల్లో కూర్చొని దీర్ఘంగా ఆలోచిస్తూ మధ్య మధ్యలో వొకరి నొకరు చూచుకుంటూ వొకరిపై మరొకరు అక్కసు వెళ్ళబుచ్చుకుంటున్నారు. డాక్టరు చంద్రమండలం, తారా మండలం గీచియున్న బొమ్మ (MAP) దగ్గరకుపోయి యేదో లెక్కలు కూడుకుంటూ వొక కాగితంమీద వ్రాసుకుంటున్నాడు. అప్పుడప్పుడూ గ్లోబు దగ్గరకొచ్చి త్రిప్పి ఏదో వ్రాసుకొని MAP దగ్గరకెళ్ళి పరిశీలనగా చూస్తున్నాడు. నాగేశం తొందరగా వొచ్చి న్యాయపతితో)

నాగే:- సార్! సార్! (న్యాయపతి దీర్ఘాలోచనలో వుండడంమూలంగా పలుక లేదు. డాక్టరు అతనిని పిలువవద్దని సైగచేసి నాగేశం చెవిలో యేదో చెప్పి పంపుతాడు. యీలోగా న్యాయపతి, ప్రజాపతి వ్రాత పూర్తి చేసి డాక్టరువంక చూస్తారు.)

డా:- పూర్తి చేశారా? Very Good! మీరు చాలా వుత్తములు. యేదీ యిలాగివ్వండి! (యిద్దరి దగ్గరనుంచి కాగితాలు తీసుకొని బాగా చదివి) యెలాగైతేనేం, యెవరివల్లనైతేనేం కోటిరూపాలు నిర్దోషయ్యాడు.

న్యా:- ఇంతకూ ఆమెన గారు యేసుని వ్రాళ్ళారో వినిపించితే బాగుంటుంది.

ప్ర:- నాదెందుకు. ప్లీడరు యేమి వ్రాళ్ళారో చదవండి.

న్యా:- మీదే ముందు చదవాలి, మీరేయిందులో మొదటి ముద్దాయిలు.

ప్ర:- కాదు, మీరే యిందులో మొదటివారు. మీదే చదవాలి.

న్యా:- పిల్లేదు మీదేచదవాలి.

ప్ర:- పిల్లేదు మీదేచదవాలి.
(కుర్చీల్లోనుంచి లేచుకుంటూ పైకి లేచాను.)

డా:- మళ్ళీ మీలో ఐకమత్యం చెడిపోతూవుంది. వుద్రేకాలతో యిప్పుడు మనకు సమిత్తంలేదు. మనకు కావల్సినదంతా వ్యవహారం పరిష్కారం కావటమే. యీ ఘట్టం పూర్తయ్యేలోగానే మీకొక సంగతి నివ్వ దల్చుకున్నాను. చూడండి మీరు మీ స్వార్థం కోసం, చేసిన పాపం మూలంగా భయంతో, ఆందోళనతో ఈ జీవితంలోని ప్రతిక్షణం చావుబ్రతుకులమధ్య రోజులు నెట్టుకుంటూ వొచ్చారు. ప్రతి మానవుడూ తన జీవితంలో మీలాగే చేయరాని పొరపాట్లు చేస్తూ పరిహారంగా నాశనాన్ని కోరి తెచ్చుకుంటూ వుంటాడు. ఇలాంటి మానసిక దౌర్బల్యానకు అతీతుడు కాగలవాడే మహాత్ముడు, మార్గదర్శకుడు అనిపించుకుంటాడు. కాబట్టి నా ఆంధ్ర సోదరులకంతా నేను చెప్పదల్చింది వొక్కటే ప్రజాపతి,న్యాయపతిగార్లలాగా సాంఘిక దురాచారాలకు తావివ్వక, పలుకుబడి నుపయోగించి పాప కృత్యాలు చేయక; న్యాయాన్ని తల్లక్రిందులు చేసి నాగరికతకే కళంకం తెచ్చి పెట్టక, అఖండ భారత దేశానికి తెలుగుజాతి వెలుగును చూపించాలని కోరుతున్నాను! నా సలహా మీకు నచ్చిందికదూ?

ప్ర:- (తలూపాడు.)

డా:- (న్యాయపతితో) మీకు కూడా నచ్చిందా?
(నాగేశం తొందరగా వొచ్చి)

నాగే:- సార్! సార్! కొంప మునిగిపోయింది సార్!

న్యా:- ఏం జరిగిందిరా?

నాగే:- అమ్మాయిగారి మెడలో...

న్యా:- అమ్మాయిగారి మెడలో...ఉరి తగిలించాడా...డాక్టర్ గారూ...! వెంకటరమణా!

నా:- అదికాదు సార్! (ఒగురుస్తున్నాడు.)

డా:- త్వరగా చెప్పవోయ్!

నా:- చెబుతాను సార్, చాలా ఆయాసంగా వుంది.

న్యా:- కాఫీకి బేడిస్తాను, త్వరగా చెప్పరా!

నా:- అమ్మాయిగారి మెడలో...దేవుని పటానికెదురుగానిలబడి-

న్యా:- (ఇంకా ఆతురతతో) నిలబడి! ఏం చేశాడు ?

నా:- తాళిబొట్టు కట్టేశాడు సార్ !

న్యా:- (అలాగే కుర్చీలో కూలబడుతూ) ఆరి పీడిచావు చదరంగాను! వెంకటరమణా, ఎంతపని చేశావయ్యా ! ఆసి పాపిష్టిదానా ! నిప్పుతో నాలుక కాల్చుకున్నా ఎగగస పాపం చేశావు కదా ; వంశంపేరు పాడుచేశావుకదే !

నా: అమ్మాయిగారిని యింట్లోపెట్టి కోటిరూపాలు సరాసరి మీ దగ్గరకే వొస్తున్నాడు.

న్యా:- (కోపంతో) వొస్తున్నాడు ; రానీ ; యీ దెబ్బతో ఆజన్మాంతం జైల్లో కుళ్ళి చచ్చేటట్లు చేస్తాను.

(S. I. ప్రవేశం. రాగానే అందరినీ వొక్కసారి చూచాడు. హాలంతా తాపీగా కలయజూచాడు.

S. I:- మీలో Dr. ఆరోగ్యం యెవరు ?

డా:- నేనేనండి ; వీరిపేరు న్యాయపతి. పేరుపొందిన పెద్ద ప్లీడరు.

S. I-: Oh ! అలాగా ; నేను యిారోజే మీవూరు బదిలీ అయ్యాను. రాగానే మీదే మొదటి పరిచయం. (న్యాయపతి S. I. కరస్పర్శ చేసుకుంటారు.)

డా:- వీరు ప్రజాపతి M. L. A. గారు ; రాజకీయాల్లో రాటు తేలిన గొప్ప ఘనులు.

S. I:- చాలా మంచిది. ఈ రోజు చాలా శుభదినం. గొప్పవారితోనే పరిచయం కలిగింది. (నమస్కరించుకుంటారు).

డా:- (S. I,కి కుర్చీ చూపిస్తూ) Take your seat Sir!

S. I:- Thank you Doctor !

డా:- మీరు సరాసరి నేరుగా యిక్కడికే వొచ్చారా ?

S. I:- లేదు. న్యాయపతిగారింటి కెళ్ళి మీరు చెప్పిన Information ను గురించిన దర్యాప్తుచేసి వొస్తున్నాను.

న్యా:- దొంగను పట్టుకున్నారా ?

S. I:- ఆ యింట్లో దొంగలెవరూ లేరు. అసలు దొంగ యిక్కడికి పారిపోయి వచ్చాడని అక్కడివారు చెప్పారు !

న్యా:- ఆ! దొంగ పారిపోయి వొచ్చాడా ! అయ్యో, వాడి నెందుకు విడిచి పెట్టారు సార్? (గడియారంచూచి) సరిగ్గా ఆరుగంటలు. S.I. గారూ! ఈరోజు ఆరు గంటలకు నన్ను పట్టిగ్గా హత్య చేస్తానని వొక ఆకాశ రామన్న వుత్తరం గూడా వ్రాశాడండి. యిదిగో (చూపిస్తాడు. S.I. చదువుకొని జేబులో పెట్టుకుంటాడు).

S. I:- ఇందులో మూర్తి పేరు లేదే !

న్యా:- వాడిపేరు కోటయ్య సార్ ! (తప్పు చెప్పేశానని నాలుక కొరుక్కొని) కాదు సార్ ; వాడి పేరు కోటి రూపాలు ! (ఈ సారి ప్రజాపతిలో కొంత కంగారు కనిపించింది)

S. I:- మీరు కోటయ్యఅని మొదట్లో చెప్పారు... మరి...

న్యా:- పొరబాటు సార్ ! అది... అది... ప్రజాపతిగారబ్బాయి పేరు !

S. I:- ప్రజాపతిగారికి కోటయ్య అనే కుమారుడున్నాడా ?

ప్ర:- అబ్బే లేదండి. వాడెవడో దొంగ !

S. I:- దొంగని మీకు తెలుసా ?

ప్ర:- దొంగేమోనని నా ఐడియా సార్ !

S. I:- యిప్పుడు మాకు కావల్సింది, నిఖరమైన మీ వాజ్మూలం. ఇంతకూ యీ కోటయ్య, కోటిరూపాలు యెవరు ? వారికి మీకు యేమిటి సంబంధం ?

ప్ర:- సంబంధం యేమీ లేదు సార్ !

S. I:- డాక్టరుగారూ! మీరు చెప్పిన కోటిరూపాలనే వ్యక్తి న్యాయపతి గారింట్లో యెవరూ లేరు. కాని వారు చెప్పిన దొంగపేరు, మీరు చెప్పే దొంగ పేరు ఐట్టి చూస్తే మీరు కొంచం Strong గా వివరాలు చెప్పాలి. మీరు న్యాయపతిగారింట్లో దొంగలు పడ్డారని ఎందుకు ఫోన్ చేశారు?

న్యా:- పద్మమాటా నిజమే. యాభై వేల రూపాయల రొక్కం, ముప్పై వేల రూపాయల ఐంగారు దొంగిలించిన మాటా నిజమే సార్!

S. I:- మీ కెలా తెలుసు ?

న్యా:- మా హ్యాను నాగేశాన్నడగండి. చెప్పరా తెప్ప ! నువ్వు చూచిందంతా చెప్పు.

నా:- (వినయంగా S. I. దగ్గర చేతులుకట్టుకొని) నేనేమీ చూడలేదు సార్! అంతా విన్నాను! నేను వారికి చెప్పిందంతా నా ఐడియా సార్!

S. I:- ఏమిటోయ్, వేళాకోళమాడుతున్నావా ?

నా:- లేదుసార్, సత్యం చెబుతున్నాను !

S. I:- సరే, అలా వెళ్ళి నిలుచుకో ! (నాగేశం వెళ్ళి నిల్చుకున్నాడు) డాక్టర్‌గారూ! న్యాయపతి గారింటివద్ద మాకు దొరికిన ఆధారాలను బట్టి దొంగలెవరో యిప్పుడే తేల్చేస్తాను. మీరు నాతో సహకరించాలి.

డా:- తప్పకుండా సహకరిస్తాను. కానివ్వండి.
(ప్రజాపతి, న్యాయపతి దొంగలు కామే కాబోలుననే భయంతో బొమ్మల్లాగా చలనం లేకుండా నిలబడిపొయ్యారు).

S. I:- న్యాయపతి గారూ ! (న్యాయపతి పలకడు), ప్రజాపతి గారూ ! (పలకడు). మిమ్మల్నే పిలవటం ! అలా దిష్టిబొమ్మల్లా నిల్చొనున్నారేం ?

న్యా:- (తత్తరపడి) నన్ను పిలుస్తున్నారా ? యెందుకు సార్ ?

S. I:- మీ అమ్మాయి పేరు శారద గదూ !

న్యా:- అవును.

S. I:- మీరు దొంగసి చెప్పిన కోటి రూపాయలకు మీ అమ్మాయి శారదకు యేమైనా సంబంధముందా ?

న్యా:- అబ్బే, యేమీ లేదు సార్ !

S. I:- పోనీ కోటయ్యతో యేమైనా సంబంధముందా ?

న్యా:- ఏమీలేదు ?

S. I:- డాక్టర్, యీ విషయంలో మీ కెంతవరకు తెలుసు ?

డా:- వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారని యిప్పుడే తెలిసింది.

S. I:- You are correct. (ప్రజాపతిని సమీపించి) ప్రజాపతిగారూ ?

ప్ర:- (బెదిరిపడి) ఆఁ ! నేను M. L. A. నండి !

S. I:- Oh ! I See M. L A. ప్రజాపతిగారూ ! మీకూ న్యాయపతి గారికి యెంతకాలం నుంచి పరిచయముంది ?

ప్ర:- పరిచయమేమీ లేదుసార్ ! ఆయన ప్లీడరు, నేను M L A ని.

డా:- ఇది మాత్రం చాలా అబద్ధం సార్ ! (ప్రజాపతి డాక్టర్‌ను చూస్తాడు. డాక్టరు వారు ప్రాసియిచ్చిన కాగితాలను చూపుతాడు. అది చూచి M. L. A గారికి గాబరాపుట్టి)

ప్ర:- అంతా వో మూడు సంవత్సరాల నుంచి !

న్యా:- అబద్ధం సార్, పరిచయమే లేదు ! (డాక్టరు మరలా న్యాయపతికి కాగితం చూపుతాడు, న్యాయపతి కొంచెం సర్దుకొని) అంటే సార్ ! అంతే ! మూడు సంవత్సరాలే !

S. I:- ప్లీడరుగా మీరు న్యాయవృత్తి చేస్తున్నారు, M. L. A. గా మీరు ప్రజాసేవ చేస్తున్నారు, యెందుకండీ అలా అబద్ధాలనే జపిస్తూ వుంటారు ?

డా:- అది వారికలవాటే లెండి !

S. I:- You are correct ! న్యాయపతిగారూ, మీ మీద, ప్రజాపతి M. L. A. గారి మీద మాకు C I.D. రిపోర్టులు బోలెడొచ్చాయి.

ప్ర, న్యా:- (యిద్దరూ వొక్కసారిగా) మా మీదనా ?

S. I:- అవును మీ మీదనే ! కోటిరూపాలు నిర్దోషి ! మీరు కాదంటారా ?

న్యా:- తప్పకుండా అంటాం. వాడు గజదొంగ?

ప్ర:- వాడు ఖూనీకోరని కోర్టువారే వొప్పుకున్నారు!

న్యా:- నేనేనండి ఆ కేసును Take up చేసింది. మూడు సంవత్సరాలు కఠినశిక్ష వేశారు. కోర్టు వారిచ్చిన తీర్పునుగూడా మీరు కాదంటున్నారా సార్ ?

S. I. కోర్టువారు CID రిపోర్టు బాగా చదివారు, నిజం తెలుసుకున్నారు. అసలు దొంగలెవరో తేలిపొయ్యారు. వెంటనే కోటయ్యను విడుదల చేశారు. మీ యిద్దర్ని అరెస్టు చేయమని వారంట్లు జారీ చేశారు. ముందు మీరు కదలండి!

న్యా:- అలా వీల్లేదు. అలా చేయటానికి "లా" వొప్పుకోదు. ముద్దాయికి శిక్షపడితే గడువు ముగిసేవరకూ వాడు శిక్ష అనుభవించాల్సిందే!

ప్ర:- అందులో బోలెడు సాక్ష్యం యిప్పించి, వాడు గజ దొంగని గట్టిగా నిరూపించి, ఆ దొంగను జైలుకు పంపించాం.

S. I. దొంగలను అమాయకులుగా, అమాయకులను దొంగలుగా మీ యిష్ట ప్రకారం చేయటానికి యిదేం గుడ్డికాలం కాదు. అసలు దొంగలెవరో గాలించి పట్టుకోవటమే ప్రజాప్రభుత్వ లక్ష్యం. యింతకూ కోటి రూపాలు నిర్దోషని మీరు వొప్పుకుంటారా లేదా?

యిద్దరూ:- మేము వొప్పుకోమండి! (డాక్టరు వారు వ్రాసిచ్చిన కాగితాలను S.I. చేతికిస్తాడు).

S. I. (బాగా చదువుకొని) యీ స్టేటుమెంటు మీరు వ్రాసిందేనా? (అది చూచి యిద్దరూ విస్తుపోతారు). చెప్పండి! మాట్లాడరేం? యీ కాగితం మీది అవునా కాదా?

న్యా:- అవును.

S. I. ప్రజాపతిగారూ, మీరేమంటారు?

ప్ర:- నాదేనండి. నేనే వ్రాసిచ్చాను.

S. I. సరే నడవండి స్టేషనుకు.

న్యా:- ఎందుకు సార్?

S. I. జైల్లో కోటయ్యకు బదులు మీరు నిద్రపోవటానికి!

ప్ర:- జైల్లోనా?

S. I. ఏం! అవమానంగా వుందా?

న్యా:- S. I. గారు, నేను చేసిన పాపాలకు నాలుక కోసుకోమన్నా కోసుకుంటాను. ఇంకెప్పటికి యిలాంటి నేరాలు చెయ్యను. నన్ను క్షమించండి. డాక్టరుగారూ, మీరన్నా కొంచెం రెకమెండ్ చెయ్యండి. కావాలంటే ప్రజాపతిగారికొస్తారు మీవెంట.

ప్ర:- ఏమిటి నేనా! S. I. గారూ, నాదేమీ లేదండీ. నేనీ మధ్యనే M. L. A. అయ్యాను. కాస్త నా గౌరవమాలోచించండి. కావాలంటే వారే వస్తారు మీవెంట.

న్యా:- నేనెందుకు పోవాలి? మీరేగా యింతాచేసింది. మీరే పొండి!

ప్ర:- మీరు చేసిన పాపాలు నా నెత్తికి రుద్దుతున్నారా? మీరేగా కోర్టులో యింత నోటితో వాదించింది? మీరే పొండి.

న్యా:- నేను పోను, మీరేపోండి!

ప్ర:- మీరేపోండి, నేనెందుకు?

న్యా:- మీరేపోండి.

ప్ర:- మీరేపోండి. (మరలా వ్యవహారం ముదురుతుంది S I. బిగ్గరగా వారిగోల అణిగేటట్టు)

S. I. Shame! Shame! సిగ్గుచేటు; నోరుమూసుకోండి మీరు వెంటనే కదులారా లేదా?

న్యా:- (తాపీగా) ఎక్కడికి సార్?

S. I. జైలుకి?

న్యా:- యేమిటిసార్! మేమేదో నాటకమాడుతుంటే మధ్యలో మీరొచ్చి పెద్ద గొడవ చేస్తున్నారు?

S. I. ఏమిటి? నాటకమా?

ప్ర:- అవునండి... నేను అసలు M. L. A. ని కాదు. నాటకంలో M. L. A. ని.

న్యా:- నాలాంటి ప్లీడర్లు చాలామంది దేశంలో చెలామణి అవ్వటమే, న్యాయాన్ని యెలా తారుమారుచేస్తుంటాకో ప్రజలు తెలుసుకోవాలని, ఆ వేషం వేశాను. ఆంతే. నేను న్యాయపతిని గాదు, ప్లీడర్ని కాదు, వొక నటుణ్ణి.

ప్ర:- అంతేసార్! M.L A. ల మని చెప్పుకుంటూ ప్రజాసేవను మరచి, రాజకీయ నాయకులమని తిరిగేవారిని గురించి వొక్క కంట కని పెడ్తూ వుండాల్సిందని ప్రజలను హెచ్చరిస్తూ నేను M. L. A. వేషంకట్టాను. అంతే, నిజానికి నేనూ వొక నటుణ్ణే.

డా:- చూడండి సార్! మా సంఘం వాళ్ళు వొక నాటకం వేయాలను కున్నారు! ప్రజలకు నీతి, నాగరికతా, విజ్ఞానము కలిగించే వొక అభ్యుదయ కళను ప్రదర్శించాలని యీ ''దిష్టిబొమ్మలు'' అనే నాటికను వేశాం. అందులో నేను డాక్టర్ను, అంటే సైంటిస్టును, సైకాలజిస్టును. అంతే, యిందులో నేనూ వొక నటుణ్ణే.

న్యా:- నేనుగూడా వొక నటుణ్ణే సార్!

S. I. అయితే నేనేనా అంత పూల్ని? న్యాయపతిగా రమ్మాయిని వివాహ మాడి, మిమ్మల్ని భయసందేహాల మధ్య వుయ్యాల లూపిన ఘనుణ్ణి, కోటిరూపాలుగాడ్ని, మిమ్మల్ని భయపెట్టడానికి S. I. వేషంలో వచ్చిన ఘనుణ్ణి !

అందరూ:- నువ్వేనా కోటిరూపాలు ?

S. I. అవును.

డా:- (ప్రేక్షకుల నుద్దేశించి) సోదర సోదరీమణులారా ! ఇంతసేపూ సహనంతో కూచొని మా నాటకాన్ని చూచినందుకు మా సంఘం తరపున ధన్యవాదాలు. మీ అందరి సహకారముంటే ఇటువంటి కళనే ప్రదర్శిస్తూ మీ అభిమానాన్ని పొందగలం నాటకం పూర్తయింది. శలవు. జై హింద్

[తెర]

ప్రార్థన

రచన :

డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు

పాత్రలు

1. మొదటి సైనికుడు
2. రెండవ సైనికుడు
3. ముసలివాడు
4. ముదుసలి
5. వ్యక్తి

[ద్వితీయ ప్రపంచ సంగ్రామపు అంతిమ దినాలు. సంగ్రామం జరుగుతున్నది. యుద్ధం జరుగుతూవున్న ఒక దేశపు ఒక కు గ్రామం పొలిమేరలో. చీకటిరోజుల్లో ఒక రాత్రివేళ, ఇద్దరు సైనికులు దోవ వెతుక్కుంటూ ప్రవేశిస్తారు. ఆ చీకట్లో ముందు ఏముందో, వెనక ఏముందో తెలియటం లేదు. కాసేపటికి-]

మొదటి సైనికుడు :- (పెద్దగా నవ్వుతూ) హై హా ? Soldier చూశావా ? కన బడేదే మన వూరు. యుద్ధ మేఘాలు ప్రపంచాన్నంతా కమ్మేసి నవే, Black out మన వూరిని కమ్మేసింది. కమ్మివేసిన గాఢాంధకారాన్ని చీల్చుకొని బయటపడి కనిపిస్తోంది దూరాన-వీధి దీపాల కాంతి... అమ్మయ్య... ఎదతెగకుండా నడిచి, ఎల్లాగయితే ఏం మన వూరు చేరుకున్నాం.

రెండవ సైనికుడు :- చేరుకున్నాం ఎట్లాగయితేం, ఓ! తిరిగి మనవూరు చూస్తుంటే నా హృదయం పొంగిపోతోంది—ఏవో పూర్వ స్మృతులన్నీ జ్ఞాపకంవచ్చి. పరిచితమైన స్పర్శవల్ల కాలోలు, పాదాలు వుబ్బి తబ్బిబ్బులవుతున్నాయి చిన్ననాడు మనం ఆడుకున్నదే కాలోలు యీ నేల !

మొదటి:- ఆ. ఈ నేలా ? ఆ కొండ, ప్రతి అంగుళం, మనం తొక్కి గంతు లేసిందే.

రెండవ:- విసురుగా ఆ కొండవాలులో పరుగెత్తటం, ఆనాటి ఒక ప్రజ్ఞావిశేషం జ్ఞాపకముందా ?... ఒకనాడు నేను పడ్డాను పరుగెత్తుతూ. నువ్వు నవ్వేవు

మొదటి:- ఆవేళ నిన్ను చూసి నేను నవ్వేను. ఇవాళ మనల్ని చూసి అలాగే నవ్వుతారు అందరూ.

రెండవ:- ఎవరు ?

మొదటి:- మనవూరు వాళ్ళంతా, మనిద్దర్నీ చూసి.

రెండవ:- మనిద్దర్నీ చూసి నవ్వుతారు. అవును.

మొదటి:- అర్థమయిందా ! ఎందుకు నవ్వుతారో ?

రెండవ:- అర్థమయింది. ఆఁ, సిగ్గువేస్తోంది కూడా.

మొదటి:- సిగ్గువేసీ లాభం ఏమిటి? పద పోదాం. (ముందుకుపోయి, రెండో సైనికుడు కదలక పోవడం చూసి) ఏం ? ఆగావ్ ?

రెండవ:- అడుగు ముందుకువెయ్యా బుద్ధిపుట్టడం లేదు.

మొదటి:- అందుకని ఇక్కడే ఉండిపోదామా ?

రెండవ:- ఆఁ, ఇక్కడే ఆగిపోతే మంచిదిలావుంది.

మొదటి:- ఇక్కడా ! మనం వున్నది ఎక్కడో గుర్తుపట్టావా ?

రెండవ:- ఎక్కడ ?

మొదటి:- ఊరివెలుపల, కొండపక్క, ఏముందో గుర్తు లేదా ?

రెండవ:- ఉంది, శ్మశానం.

మొదటి:- అక్కడే మనం వున్నది.

రెండవ:- శ్మశానంలో మనం వున్నాం. ఇక్కడే వుండిపోదాం.

మొదటి:- ఇక్కడా ?

రెండవ:- అవును ఇక్కడే ! సైనికుడు యుద్ధంలో చచ్చినా శ్మశానం చావేగా! బ్రతికీ శ్మశానంలోనే వుందాం.

మొదటి:- యుద్ధంలో చచ్చి శ్మశానంలోవుంచే బాగుంటుంది. కాని యుద్ధం లోంచి పారిపోయొచ్చి, శ్మశానంలో వుంచే ఏం బాగుంటుంది ?

రెండవ:- బ్రతికి, ఊళ్ళో తలెత్తుకు తిరగలేనప్పుడు, శ్మశానంలోనే నశించి పోవటం బాగుండదూ ?

మొదటి:- బాగుంటుందేమో ! కాని నశించడం నాచేత కాదు. నేను ఇవాళ ఓడి పారిపోయి వచ్చాను. కాని కంఠంలో ఊపిరుండగా శత్రువుకు తలవంచను, నా రెక్కల్లో జవసత్వాలు చలనంతో వున్నంత వరకు పోరువిహారం చేస్తాను. ఆఖరి క్షణంవరకూ దెబ్బలాడతాను.

రెండవ:- (మాట్లాడదు)

మొదటి:- చూడు చూడు-ఇవిగో గోరీలు-గోరీలు- క్రిందటి యుద్ధంలో మన కోసం సీకోసం నాకోసం చచ్చిన మన తాతలు, ముత్తాతలు, తండ్రులు, దేశంకోసం ప్రాణాలొదలిన ధన్యులు. మన ఊరివారందరూ చిర కాలం స్మరించుకునే ధన్యజీవులూ. ఈ గోరీ ఎవరిదో జ్ఞాపకం వుందా? వళ్ళు తూట్లు పడినా చేతిలో తుపాకి వదలని మన పౌరుగు తాతయ్యది. (మరో ప్రక్క చూపిస్తూ, పరుగెత్తి) ఈ గోరీఎరగవ్? ఈ ముసలాడి సాహస కృత్యాలు వింటుంటే మన హృదయాల్లో గర్వం పొంగి పొరలేది. వీళ్ళిద్దరూ మన ఊరికేకాదు, మన దేశానికే గౌరవం సంపాదించి పెట్టారు అనే వాళ్ళంతా. *

రెండవ:- మన తాతలూ. తండ్రులు, దేశానికంత గౌరవం సంపాదించిపెడితే మనం సిగ్గు, అవమానం, అపకీర్తి ఇంటికి మోసుకువచ్చాం. చూడు ఆ వీధి దీపాలు మన్ని చూసి దుఃఖిస్తూ తలలు వంచుకున్నాయి.

[దూరాన్నుంచి విమానాలు దగ్గరకు వస్తున్నట్లు శబ్దం వినిపిస్తుంది]

మొదటి:- ఏమిటిది ?

రెండవ:- విమానాలు !

మొదటి:- మనవెనకే వెకుక్కుంటూ వచ్చాయి !

రెండవ:- పారిపోయి వచ్చిన మనమీద కసితీర్చుకోవటానికి వచ్చాయి.
(విమానాలు రెండో పక్కకి వెళ్ళిపోయాయి. సైనికులిద్దరూ వాటి వంకే చూస్తూ తలలు రెండో పక్కకి తిప్పుతారు.)

రెండవ:- ఊరి మీదకు వెళుతున్నాయి.

---

* ఈ గుర్తువున్నచోట నాటికా నిర్వాహకులకు Foot notes లో కొన్ని Directions యివ్వబడతాయి. ఇక్కడ Aeroplane Sound రాబోతోంది కనక ప్రామ్టర్ జాగ్రత్త పడాలి.
గుర్తు చూడగానే Technical assistants కు Warning యివ్వాలి. ఇక్కడ విమానాల రికార్డుకు వార్నింగ్ యివ్వాలి.

మొదటి:- ఇద్దరు పిరికి వాళ్ళకోసం ఊరినంతటినీ Bomb చేస్తారు.

రెండవ:- తరిమి పట్టుకోవటం చేతకాక తేలికపద్ధతికి తయారయ్యారు.

మొదటి:- మనవూరికి మనం చేసిన ఉపకారం ఇదే. మన్ని చూసి, మన్నే Bomb చేసి, తిరిగిపోతే ఎంత బాగుండును.

(దూరాన Bomb లు వేసిన శబ్దం *)

రెండవ:- ఊరిమీద బాంబులు వేస్తున్నారు.

మొదటి:- (కాసేపాగి) తిరిగి వస్తున్నాయ్ ! ఇంకా బాంబులు వేస్తున్నారు. పోదాకోక్క (రెండోవాణ్ణి ఒకప్రక్కకు త్రోసి తాను రెండవప్రక్కకు పోతాడు)

(బాంబు ప్రేలుడు దగ్గరగా ఇంకా దగ్గరగా మరీ దగ్గరగా వినిపిస్తుంది. విమానాల రొద మరీ ఎక్కువ అవుతుంది. ఒక పెద్ద మెరుపు ప్రేలినమోత. ఆంతా చీకటైపోయింది. అంతా పొగ. మొదటి విమానాల రొద క్రమేపి తగ్గిపోయింది. సైనికుడు నెమ్మదిగా లేచి కనిపిస్తాడు)

మొదటి:- (ఒళ్ళు దులుపుకుంటూ లేచి) ఎక్కడున్నావోయ్ నేస్తం, బయటికిరా. విమానాలు వెళ్ళిపోయాయిలే ఇక బయటికి రావచ్చు. రా. రావేం ! ఎక్కడున్నావ్ ? (వెతుక నున్న గోరీలవెతుక వెతికి తెల్లబోయి నుంచుంటాడు) ఆ ! దెబ్బతగిలిందా ?

(గోరీల వెతుక నుంచి స్నేహితుణ్ణి ముందుకు లాగుతాడు.) గూడు నలిగి పోయింది రక్తం బాగా కారుతోంది !! (కంగారుపడుతూ) తొందరగా వూళ్ళోకి తీసికెళతా పట్టు.

రెండవ:- ఎందుకు ? (హీనస్వరంతో బాధతో మాట్లాడతాడు.)

మొదటి:- Hospital ల్లో చేరుస్తా.

---

* Lights off. విమానాల క్రమోత, బాంబుల శబ్దం, మెరుపుపొగ, 2 వ సైనికుని భుజం నెత్తురుతో తడవటం, సమాధులు విరగటం, విమానాల రొద ఆగటం. On lights.

రెండవ:- ఇంకా నేను బ్రతుకుతాననే ఆశ వుందా ?

మొదటి:- ప్రయత్నిద్దాం.

రెండవ:- ప్రయత్నాలేం లాభం లేదు. విరిగిన ఎముకలు గుచ్చుకుని బాధ పెడుతున్నాయ్. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయ్.

మొదటి:- ఉండు. నేను మోసుకుపోతా. రా.

రెండవ:- ఒద్దు. నీచెయ్యి తగిల్తేనే బాధ ఎక్కువవుతోంది. వద్దు, నువ్వెళ్ళిపో. నన్నొదిలేసి వెళ్ళిపో. (కాసేసాగి) ఎందుకు అనుమానిస్తావ్ ?

మొదటి:- ఉహు. వెళ్ళను. ఎట్లా వెళ్ళమంటావ్ ?

రెండవ:- జీవన్మరణాల సంధిలో వున్న నన్ను వదిలేసి వెళ్ళక మరేం చెయ్యగలవ్ ?

మొదటి:- చేసేదేంలేకపోయినా, స్నేహధర్మం నన్నిక్కడ కట్టి పడేస్తోంది.

రెండవ:- ఏదైనా నువ్వు నాతో రాలేవుగా ! అబ్బా, బాధ.

మొదటి:- అధైర్యపడకు. ఊళ్ళోకి తీసుకెళతా. రా.

రెండవ:- లాభంలేదు. దోవలోనే ప్రాణం పోతుంది... ఆ ... నువ్వు నాకు ఆప్తమిత్రుడివి కదూ !

మొదటి:- ఏం ! ఏం ?

రెండవ:- ఒక్క సహాయం కావాలి, చెయ్యగలవ్ ?

మొదటి:- తప్పకుండా చేస్తాను.

రెండవ:- నీ తుపాకిలో ఒక తూటా మిగిలింది కాదూ?

మొదటి:- మిగిలింది.

రెండవ:- దానితో నన్ను పేల్చేసి నీ దోవన నువ్వుపో.

మొదటి:- ఇదా సహాయం !!!

రెండవ:- అదే! అంతకంటే వేరేంకావాలి ? సుఖమరణం మంచిది కదూ-యీ ఖలవన్మరణం కంటే ?

మొదటి:- అహా ! వల్లకాదు.

రెండవ:- అబ్బా ! ఈ బాధపడలేను.

మొదటి:- నా చేతుల్తో చెయ్యలేని పని.

రెండవ:- నన్ను త్వరగా వడ్డెక్కించు.

మొదటి:- కానీ నా స్నేహితుణ్ణి నిన్నే, ఆహహా-

రెండవ:- నీ శత్రువుని సహించంపి వదిలేశావా ఎప్పుడైనా ?

మొదటి:- కాని నువ్వు ?

రెండవ:- ఒక్క గుండుతో చచ్చేవాడి మీద పదిగుళ్ళు పేలుస్తావెందుకు ?

మొదటి:- (మాట్లాడడు)

రెండవ:- అనుమానరహితంగా చావటానికి కాదూ ?

మొదటి:- అయితే ?

రెండవ:- వాడికంత ఉపకారం చేసి— ఆదే ఉపకారం నాకు చెయ్యడానికి సందేహిస్తావేం ?

మొదటి:- నువ్వు నా స్నేహితుడివి.

రెండవ:- స్నేహితుణ్ణవటమేగా, నేను చేసుకున్న పాపం—నీకు దణ్ణం పెడతాను. ఈ బాధ భరించలేక అడుగుతున్నాను. ఈ ఉపకారం చెయ్యి.

మొదటి:- కాని—

రెండవ:- నీ స్నేహితుడిలా బాధపడటం నీ కిష్టమా—నే బ్రతుకుతాననే ఆశ నీకేమైనా వుందా ?

మొదటి:- లేనిమాట నిజమే.

రెండవ:- అయితే ఎందుకీ అనుమానం? స్నేహితుడు శత్రువుపాటివాడు కాడా? నీ శత్రువునైతే బాగుండేది కాదూ నేను. *

మొదటి:- ఓ! (దుఃఖంతో వివశుడౌతాడు)

రెండవ:- పేల్చెయ్ నన్ను! చెయ్యెత్తి దణ్ణంపెడతాను. ఈ బాధనుండి తప్పించు.

---

* తుపాకీ శబ్దం రాబోతున్నది.

మొదటి:- ఆఁ ఆఁ, నీస్నేహితుణ్ణి. స్నేహితుణ్ణిచంపే స్నేహితుణ్ణి. ఈ చేతుల్తోనే ఆ పని ముగిస్తాను. ప్రపంచం ఆ తర్వాత నన్ను నిందించనీ, ఏమైనాగానీ.

రెండవ:- ఆ. ఆ. త్వరగా కానియ్యి ప్రతిక్షణం ఒక యుగంగా వుంది. పేల్చేయ్. నీ ఆఖరి తూటాను సార్థకం చెయ్యి. ఇంకా ఆలస్యం చేస్తావేం? కానీ.

మొదటి:- నేను సిద్ధమే!

రెండవ:- ఐతేకానియ్యి! త్వరత్వరగా! కానియ్యి. (మొ.సై.తుపాకీ పేల్చాడు) అహహ ! బాగుంది, చాలా బాగుంది. నీఉపకారం నేమరచిపోలేను. ప్రాణంవదుల్తూ చాలా సంతోషించానని మా వాళ్ళందరితోనూ మా నాన్నతోనూ చెప్పు. నిజమైన స్నేహితుడంటే నువ్వే. వెళ్ళు. పో నాన్నతో చెప్పు. నా దోవ నాది. నీ దోవ నీది. పో (మరణించాడు) [మొదటి సైనికుడికి కళ్ళు నీళ్ళు తిరిగినై. కాసేపాగి కళేబరాన్ని గోరీలవెనక్కి కనబడకుండా లాగి, తన తుపాకే అవతలపారేసి, రెండోవైపుకు జారుతూ దేరాడు. కాని అప్పటికే ఒక ముసలివాడు అంతరుతోవచ్చి రెండవవైపున వున్న ఒక గోరీదగ్గర ఆగి వున్నాడు. మొదటి సైనికుడు అతన్ని చూసి వెనక్కి వెళ్ళి అతని వంకే చూస్తున్నాడు. ముసలివాడు ఆ గోరీని పరీక్షగా కొంతసేపు చూచి]

ముసలివాడు:- అంతా బాగానే వుంది. ఏమీ పగిలిపోలేదు. అంతా సరిగానే వుంది. ఓ భగవంతుడా! భూమిమీద బ్రతుకుతున్నాళ్ళూ, ప్రతి జీవినీ బాధపెడ్తూన్న ఈ భౌతిక శక్తుల్ని, ఈ గోరీమీదకూడా తరమకు. ఇవే నా ప్రణామాలు. (ముందుకు పస్తాడు. మొదటి సైనికుణ్ణి చూసి ఆగి) ఎవరునువ్వు ?

మొదటి:- నువ్వెవరు ?

ముసలి:- నేనా! కనబడటంలా? ఒక ముసలివాణ్ణి-నువ్వూ?

మొదటి:- నేను ఒక పదుచువాణ్ణి-నాదీ యీ వూరే!

ముసలి:- అబద్ధం !

మొదటి:- ఆహా. నిజమే!

ముసలి:- అబద్ధం, పచ్చి అబద్ధం. నువ్వీవూరివాడివికావు.

మొదటి:- ఏం అలా అన్నావ్?

ముసలి:- ఈ వూళ్ళో పడుచువాళ్ళెవరూ లేరు. 18 ఏళ్లు దాటిన వాళ్ళంతా యుద్ధానికి వెళ్ళారు.

మొదటి:- నేను యుద్ధంనుంచే తిరిగి వస్తున్నా.

ముసలి:- పారిపోయి వస్తున్నావా?

మొదటి:- యుద్ధకై దీల శిబిరాలలోనుంచి తప్పించుకొని.

ముసలి:- ఎలా తప్పించుకొన్నావ్?

మొదటి:- చీకట్లో పహరావాళ్ళమీద పడి చంపేశాం. వాళ్ళ తుపాకులే తీసుకు బయలుదేరాం. కొంతదూరం వాళ్ళూ మమ్మల్ని తరుముకువచ్చారు. మేం దొరకలేదు.

ముసలి:- ఆగు. నీమొహం సరిగాచూడనీ కంఠం. విన్నదిలాగేవుంది. (ముసలి వాడు లాంతరు మొహంమీదకు యెత్తుతాడు.) ఏమిటి నువ్వా?

మొదటి:- ఆ ! నేనే తాతా !

ముసలి:- చాలా మారిపోయావ్. చిక్కిపోయావ్-అవును, ఆగటం ఎందుకులే.

మొదటి:- నువ్వూ బాగా మారిపోయావ్.

ముసలి:- అవును; మారేను. అందరూ మారుతారు- కాలం గడచినకొద్దీ.

మొదటి:- అయిదేళ్ళయింది నిన్ను చూసి.

ముసలి:- అయిదా ? అయిదేనా? (లెక్కట్టుకుని) అవును. అయిదే, నేనింక యెక్కువనుకొంటున్నా! ఐదేగాని, చాలా నిమ్మదిగా గడిచాయి కదూ, యీ ఏళ్ళు? పదపోదాం రా-ఊళ్ళోకి. (తను వెళ్ళబోతాడు)

మొదటి:- ఊళ్ళోకి రావటానికి మనసొప్పకే ఇక్కడ ఆగాను.

ముసలి:- ఏం ?

మొదటి:- ఏం చెప్పను? యుద్ధానికి వెళ్ళి వెనక్కి వచ్చానని నలుగురూ నన్ను చూసి నవ్వుతారు. చూడు, ఆ వీధి దీపాలు నన్నుచూసి మొహం మాడ్చుకొంటున్నై. ఇదే గెల్చివస్తే? ఎన్ని దీపావళులు మిరుమిట్లు గొల్పుతూ స్వాగతం యిచ్చేవి!

మునలి:- పారిపోయి వచ్చినందుకు సిగ్గుపడుతున్నావా ?

మొదటి:- ఆ. (తలవంచుకుంటాడు)

మునలి:- మరే! గెల్చివస్తే- మన ఊరికి- మన మనసుకి బాగానే వుంటుంది. కాని, గెల్చు నీ చేతిలోవుందా ?

మొదటి:- లేదనుకో. కాని-

మునలి:- గెల్చినా అది నీఒక్కడి గెల్పా?

మొదటి:- అందరి సైనికుల్దీ !

మునలి:- అయితే, ఈ అవమానమూ అందరి సైనికుల్దీనూ,

మొదటి:- కాని, అందరూ ఇంకా పోరాడుతున్నారు.

మునలి:- ఆ. ఆ. పోరాడుతూనే వుంటారు. తరతరాలుగా పోరాడుతూనే వున్నారు. దశాబ్దాలు శతాబ్దాలుగా పోరాడుతూనే వుంటారు. పోరాటంలో గెలుపా, ఓటమా అనే-ఆలోచనా లేకుండా పోరాడుతూనే వుంటారు. సైనికుడిపంతు పోరాడటం మాత్రమే. గెలుపూ ఓటమి ఒక్కడివే. అవి యుద్ధం ప్రారంభించిన వాడెవడో-వాడివి.

మొదటి:- అదేమిటి? గెలుపూ, ఓటమీ-నావీ-దేశానివీను.

మునలి:- నా దేశం ఏమిటి, నీ దేశం ఏమిటి? ఆ దేశపు ఒక సైనికుడితో ఈ దేశపు ఒక సైనికుడు యుద్ధంలో తలపడ్డాడు. ఇద్దరూ తుపాకులు పేల్చుకున్నారు. విధివశాన ఒకడికి గుండుతగిలి చచ్చాడు. రెండోవాడు గెల్చాడు. వాళ్ళవాళ్ళెవరో ఒక వందమంది మిగిల్తే వాళ్ళదేశం గెల్చింది. అంతేగా?—కాని, గెల్చివాడేం బావుకున్నాడు? వాడు గెల్చినా, వాడిపక్షం ఎక్కువ చస్తే, వాడి గెలుపుకేం విలువ?

గెలుపూ ఓటములు సైనికుడివి కావు—మీ సైనికులందరూ 'పావులు' 'గుర్రాలు' 'ఏనుగులూ'. మీ అందరి వెనుక ఎత్తులు వేసే అజ్ఞాత హస్తం వుంది. గెల్పు ఓటములు, ఆ అజ్ఞాత హస్తానివి.

మొదటి:- ఆ అజ్ఞాతహస్తం నా నాయకుడు. నా దేశానికి నాయకుడు. నేనూ, నా నాయకుడూ, నా దేశంకోసం పోరాడుతున్నాం.

ముసలి:- అందరూ తమ దేశంకోసమే పోరాడుతున్నా మంటారు. అందరూ దేశభక్తితోనే యుద్ధాలు చేస్తారు.

మొదటి:- అదేమిటి, అట్లాగంటావ్?

ముసలి :- నేను నా జన్మలో రెండు ప్రపంచ సంగ్రామాలు చూశాను. మొదటి సంగ్రామంలో నా పెద్దకొడుకును బలిపెట్టి ఇక్కడ గోరీ కట్టాను. (తను మొదట వచ్చి పరీక్ష చేసిన గోరీని చూపిస్తాడు) రెండో కొడుకును ఈ యుద్ధానికి పంపాను. పెద్దవాడు నాకూ నా దేశానికి వొరగ బెట్టిందేం లేదు. ఇక ఈ చిన్నవాడేం ఒరగ బెడతాడో యింకా తెలీదు. చూద్దాం కానీ, యింటికి పోదాం పద (వెనక్కు తిరిగి నడుస్తాడు రెండోవైపుకి)

మొదటి:- నేను రాలేను.

ముసలి:- రాక ఇక్కడేం చేస్తావ్? ఈ గోరీల్లో అసంతృప్తితో చచ్చి అణగి పడియున్న పిశాచాల్తో పోట్లాడతావా? మరణానంతరం అవ్వి కాస్త సుఖజీవనం చేస్తున్నై. వాటిని లేవగొట్టకు.

మొదటి:- నాకేదో భయంగా వుంది. ఆందోళనగా వుంది.

ముసలి:- ఉంటుంది- మొదట్లో- కాని, ఇంటికిపోయి భార్యనీ పిల్లల్నీ చూస్తే సర్దుకుంటుంది. అరే- నీ భార్య (ఏదో అనబోయి - ఆగి) ఇంటికి పోతున్నాగా. రా. పిల్లలు కులాసాయే. బాగా అల్లరి చేస్తున్నారు. మీవాడు నన్న తాతా తాతా అంటూ వదలిపెట్టడు. నా నెత్తి నెక్కి కూర్చుంటాడు.

మొదటి:- మా వాడా?

ముసలి:- అరే. మహాకబుర్లు చెబుతాడు.

మొదటి:- కబుర్లా!

ముసలి:- ఒక్క కబురులేమిటి, ఆటలూ, పాటలూ! మొన్న, అయిదో ఏడు రాగానే బళ్ళో వేశాం.

మొదటి:- (ఆశ్చర్యంతో) అయిదేళ్ళే !!

ముసలి;- ఆఁ!

మొదటి:- (గుర్తుకు తెచ్చుకుని) అవును. 5½ ఏళ్లు. అవును. కాని నా మనస్సులో యింకా 6 నెలల పిల్లాడుగా మెదులుతున్నాడు - ఇప్పుడు పెరిగి వుంటాడు.

ముసలి:- బాగా పెరిగాడు. మరి పది-పదకొండేళ్లు వెళితే వాడూ యుద్ధానికి బయలుదేర్తాడు.

మొదటి:- తర్వాత ఇక్కడో, ఇలాంటి మరో శ్మశానంలోనో వుంటాడు.

ముసలి:- ఛ ఛ యువకుడివి, సైనికుడివి-అలా ఎందుకనుకోవాలి?

మొదటి:- (విచారంగా) కానీ--నాకదే కనిపిస్తోంది.

ముసలి:- అలా అయిపోయావేం? నాకు తెల్సు, నాకు తెలుసు. కొడుకు గోరీలో ఉండటమంటే నాకు తెలుసు. 20 ఏళ్ళ క్రిందట నా పెద్దకొడుకును ఈ గోరీలో పెట్టాను. భూమాత ఎప్పుడో వాణ్ణి జీర్ణం చేసేసుకుంది. కానీ నాకు వాడింకా యీ గోరీలో వున్నాడనే అనిపిస్తుండి.

మొదటి:- తాతా! నీకొకటి చెప్పాలి. కానీ-

ముసలి:- కానీ గీనీ ఎందుకు. తర్వాత చెబుదువుగాని. ఇంటికి పోదాంరా. ఐదేళ్ళక్రితం చూశావ్! పెరిగిన పసికందును కళ్ళారా చూసుకుందువుగాని రా.

మొదటి:- రాను. రాలేను. ఇక్కణ్ణుంచి కదిలిరాలేను.

ముసలి:- ఇంకా తలను వంచిన అవమానభారం తగ్గలేదా?

మొదటి:- కాదు.

ముసలి:- మరి?

మొదటి:- నే నేదో ఇక్కడ పోగొట్టుకున్నాను.

ముసలి:- రేపు వచ్చి వెతుక్కోవచ్చుగా. రా.

మొదటి:- కానీ నాకది దొరకదింక. ఎంత వెతికినా దొరకదు.

ముసలి:- ఏదైనా-నీ కన్నకొడుకును, అయిదేళ్ళ తర్వాత చూడడానికంటే అమూల్యమైందా? పద, నీ కన్నకొడుకును కళ్ళారా చూచుకుంటువు గాని - నా ఒక్క కొడుకును గురించి చెప్పులారా చెబుదువుగాని-

మొదటి:- వో (వివశుడై) ఎల్లా చెప్పగలను?

ముసలి:- ఏడుస్తున్నావా! ఆంత ముఖ్యమైందా ఆ వస్తువు? ఏమిటది? ఎలా వుంటుంది? దీపం వుందిగా-వెతుకుదాం రా !

మొదటి:- ఒద్దు. వెతకవద్దు.

ముసలి:- ఏం?

మొదటి:- వెతికితే దొరికేది కాదు.

ముసలి:- మరేమిటి!

మొదటి:- ఆది - నా స్నేహితుడి ప్రాణం.

ముసలి:- ఆఁ!

మొదటి:- నేనూ, నా స్నేహితుడూ శత్రువుల నుండి తప్పించుకొని ఇక్కడి దాకా వచ్చాం. మమ్మల్ని వెంబడించి పట్టుకోలేక, వెనకనే విమానాల్ని పంపారు.

ముసలి:- ఆఁ ఆఁ. ఆ విమానాలు బాంబులు వేసుకుంటూ యిటునుంచే వచ్చాయి. (పెద్దవాడి గోరీచూపించి) ఈ గోరీమీద కూడా బాంబులు పడ్డాయేమోనని చూచుకోవటాన్కి నేను వచ్చేశాను.

మొదటి:- తాతా!

ముసలి:- కానీ, గోరీ ఏం దెబ్బతినలేదు.

మొదటి:- నాతో వచ్చిన-ఈ చిన్నవాడికి దెబ్బతగిలింది.

ముసలి:- పాపం చిన్నవాడేనా! ఎన్నేళ్ళుంటాయ్?

మొదటి:- 23 ఏళ్ళు.

ముసలి:- అంతేనా! పాపం, బాగా గాయాలు తగిలాయా?

మొదటి:- ఈపక్క భుజం, పక్క ఎముకలు, వెంట్రు అన్నీ విరిగి పోయాయి.

ముసలి:- ఆఁ !!

మొదటి:- రక్తం వరద.

ముసలి:- పాపం.

మొదటి:- బాధ, భరించలేని బాధ.

ముసలి:- అంత దెబ్బ తగిలితే ఎంత సేపుకావాలి ప్రాణం పోవటానికి.

మొదటి:- ఉహూఁ-ప్రాణందానంతటది పోలేదు.

ముసలి:- మరి?

మొదటి:- చాలాసేపు బాధపడ్డాడు; బాధభరించలేక చివరికి.

ముసలి:- ఆఁ చివరికి?

మొదటి:- నన్నే ఈ తుపాకితో పేల్చమన్నాడు. కాని.

ముసలి:- ఆఁ ఆ.

మొదటి:- కాని పేల్చలేకపోయాను. పేల్చనన్నాను.

ముసలి:- ఎందుకన్నావ్? వెంటనే పేల్చి సహం పోయిన ప్రాణాన్ని పూర్తి చెయ్యలేకపోయావా ?

మొదటి:- చేశాను తాతా, చేశాను. అంతపనీ చేశాను, చివరికి.

ముసలి:- చేశావా? అమ్మయ్య. చెయ్యొత్తి దణ్ణంపెట్టి వుంటాడతను.

మొదటి:- పెట్టాడు, దణ్ణం పెట్టాడు.

ముసలి:- జన్మ జన్మాలకీ నీ పేరు తల్చుకుంటాడు. స్నేహితుడికి ఏ మానవ మాత్రుడూ చెయ్యలేని ఉపకారం చేశావ్.

మొదటి:- అనే అతనూ అన్నాడు.

ముసలి:- పాపం ఏడీ? (వెతుకిబోతూ) ఎక్కడ? అతనేడీ? మనం త్వరగా అతన్ని సమాధి చేద్దాం. మా పెద్దవాణ్ణి సమాధిలో పెట్టిన ఈ చేతుల్తోనే ఇతన్నీ పెడతాను. ఇతనూ మరో చిన్న కొడుకనుకుంటాను.

మొదటి:- అవును తాతా! ఇతను చిన్నకొడుకే!

ముసలి:- అవునవును. యుద్ధంలో పోయిన వాళ్ళంతా నా బిడ్డల్లాంటి వాళ్ళేగా. అవును

మొదటి:- కాదు తాతా!

ముసలి:- ఇంతకూ నాకు చూపించవేం అతన్ని? ఎక్కడున్నాడు?

మొదటి:- అక్కడ.

ముసలి:- (వెళ్ళి సమాధుల వెనుక చూస్తాడు)

మొదటి:- (కళ్ళు మూసుకుని వెనక్కు తిరిగిపోతాడు)

ముసలి:- (తిరిగి వస్తూ) పాపం, అదేపొడుగు, అదేమాదిరి, సరిగ్గా మా చిన్న వాడిలాగే వున్నాడు కదూ! అదే వయస్సుకూడా! అయిపోయింది. ముందు ఇతన్ని సమాధి చేద్దాం. నేను వెళ్ళి పనిముట్లూ అవీ పట్టుకువస్తా. నువ్వు యిక్కడే ఇతన్ని చూస్తూవుండు. ఏం? వస్తా. (వెళతాడు) *

మొదటి:- (అటే చూస్తూ నిలబడి వున్నాడు. వెనక్కి తిరిగి నడిచాడు మళ్ళీ. 'తాత' వెళ్ళిన వైపుకు చూస్తున్నాడు. కాసేపట్లాచూసి పెద్దగా) ఓ హో, నేనెందుకు బ్రతికి వున్నాను? ఎందుకు బ్రతికున్నాను? ఎందుకు బాంబు తగిలి చావలేదు? [లోపల్నుంచి ప్రతిధ్వని మూడు సార్లు వినిపిస్తుంది. ఒకసారికంటె మరోసారి దూరాన్నుంచివస్తున్నట్లు శబ్దం తగ్గుతూ:-]

"ఎందుకు బాంబుతగిలి చావలేదు"

"ఎందుకు బాంబుతగిలి చావలేదు"

"ఎందుకు బాంబుతగిలి చావలేదు"

మొదటి:- ఈ తాత పుత్రశోకం చూడటానికేగా?

ప్రతిధ్వని:- ఈ తాత పుత్రశోకం చూడటానికేగా

ఈ తాత పుత్రశోకం చూడటానికేగా

ఈ తాత పుత్రశోకం చూడటానికేగా

---

* ప్రతిధ్వనులు. 2వ సైనికునిలోపల నుంచి మాటలు.

మొదటి:- అహఁహఁ నేనిమాట చెప్పలేను. చెప్పలేను. యీ మాట నా నోటితో తాతతో! వెళ్ళిపోతాను. పారిపోతాను. ఏదూరతీరానికో పారిపోతాను. ఇక ఈ వూరు తిరిగి రాకుండా ఎక్కడికో అక్కడికి పారిపోతాను. ఇక ఎప్పటికీ.

[లోపల్నుంచి రెండవ సైనికుడి కంఠస్వరం వినిపిస్తోంది]

కంఠస్వరం:- ఇక ఎప్పటికీ తిరిగిరాకుండా పారిపోతావా?

మొదటి:- ఆ! (ఆశ్చర్యంగా) ఎవరా మాట్లాడేది?

కంఠస్వరం:- అప్పుడే మర్చిపోయావా?—నీస్నేహితుణ్ణి.

మొదటి:- నువ్వా? చచ్చిపోయినా?

కంఠస్వరం:- ఁ చచ్చిపోయినా మాట్లాడగలనులే. పారిపోతానంటున్నావ్. ఎక్కడికి పారిపోతావ్. పారిపోయి సత్యాన్ని కప్పిపుచ్చగలవా?

మొదటి:- మరి యీ వార్త తాతతో ఎలా చెప్పగలను? అతన్ని చూస్తేనే- నా గుండె...

కంఠస్వరం:-నిజమే. కాని చెప్పెయ్యి. అంతేకాదు. మరణించిన తర్వాత 'తాత' 'తండ్రి' అనే విభేదాలు లేవని కూడా చెప్పు. నువ్వు చూడలేని ఒక వింత లోకాన్ని నేనిప్పుడు చూడగల్గుతున్నాను. ఇక్కడ చాలా ఛాయాదేహాలు కనిపిస్తున్నాయి. బహుశా దీన్నే పిశాచలోకం అంటారు మానవులు. ఏదైనా తల్లీ, తండ్రి చుట్టరికాలు ఇక్కడలేవు. ముక్కూ పొడుగూ, పొట్టి భేదాలు లేవు. చర్మం నలుపూ, తెలుపూ భేదాలు లేవు. అంతా ఒకటే జాతి, ఒకటే లోకంగా కనిపిస్తోంది. దీన్నంతా చూస్తుంటే నాకాశ్చర్యంగా వుంది. 'ఈ ఆత్మలే గం మానవ శరీరాల్లో ఈ భేదాలెందుకున్నాయా?'అని. "ఈ భేదాలతో ఈర్ష్యలు పెంచుకుని, ఒళ్ళు నొళ్ళు చంపుకుని, మానవుడెందుకీ పిశాచ లోకాన్ని సృష్టిస్తున్నాడా!" అని-

మొదటి:- ఆ లోకాన్ని మానవుడే సృష్టించాడా?

కంఠస్వరం:-ఆఁ. మానవుడే. ఈ అసంతృప్తిరూపలోకాన్ని సృష్టిస్తున్నాడు. ఇక నే వెళ్తున్నాను. నా ప్రశ్నకు జవాబు మీ లోకాన్నడిగి తెలుసుకో.

మొదటి:- ఆగు. ఆగు. వెళ్ళావా [కాసేపు ఆలోచిస్తూ నుంచున్నాడు-వెనక్కి తిరిగి నడిచాడు. తలెత్తి చూసేసరికి ఏదో కనిపించింది] ఎవరది? ఎవరావచ్చేది? (వెనక్కు నడుస్తూ) ఎవరు? నువ్వేనా నా నేస్తానివి? ఆగు. అక్కడే ఆగు. రాక [వెనక్కి వెనక్కి పోతాడు. ఖంగారుగా. నల్లని దుస్తుల్లో ఒక వ్యక్తి ప్రవేశిస్తుంది. చేతుల్లో ఏదో వున్నది]

మొదటి:- ఎవరునువ్వు ?

వ్యక్తి:- ఒక దౌర్భాగ్యురాల్ని. నువ్వూ? నువ్వెవరివి?

మొదటి:- సైనికుణ్ణి.

వ్యక్తి:- సైనికుడా!!

మొదటి:- పారిపోయి ఇంటికివస్తున్న సైనికుణ్ణి.

వ్యక్తి:- ఈ దేశం వాడివేనా ?

మొదటి:- ఆ, ఈ వూరివాణ్ణే.

వ్యక్తి:- అయితేసరే. నాకు కాస సాయం చేస్తావా?

మొదటి:- ఏమిటి?

వ్యక్తి:- ఈ పసివాణ్ణి కాస్త సమాధి చెయ్యాలి.

మొదటి:- సమాధా? ఎవరిది?

వ్యక్తి:- నా కొడుకు.

మొదటి:- చచ్చిపోయాడా?

వ్యక్తి:- చచ్చిపోయాడు. ఇప్పుడొచ్చిన విమానాలు వేసిన బాంబుల్కి.. కాస్త సహాయం చెయ్యి. నే త్వరగా వెళ్ళాలి.

మొదటి:- ఏం ?

వ్యక్తి:- ఇంకోపిల్లవాడున్నాడు. నిద్రపుచ్చివచ్చాను, నిద్ర లేచేలోపల ఈ పని పూర్తి చేసుకుపోవాలి.

మొదటి:- సరే కానియ్యి. (పిల్లవాణ్ణి తీసుకోబోయి; ముట్టుకుని-ఆగి)! వళ్ళింకా వేడిగానే వుంది.

వ్యక్తి:- మొహం నవ్వుతూనే వుంది. ప్రాణాలొక్కటే లేవు. చిటికెలో విమానా లెత్తుకుపోయాయి. నిమిషంలో చిన్నినాయన వేరై పోయాడు.

మొదటి:- విచారించకమ్మా! నీబోటి వీరమాతలే-

వ్యక్తి:- వీరమాత! వీరమాత!- వర్ణనలకేం, మనసొచ్చినట్లు వర్ణించవచ్చు కాని, ఆ వీరమాత హృదయం తెల్సుకోటం చాలా కష్టం.

మొదటి:- మనబోటి వాళ్ళు త్యాగం చేస్తేనే ముందు వాళ్ళకి-

వ్యక్తి:- త్యాగం! త్యాగం! మేం చేసిన త్యాగం నీకేం తెల్సు? తెలిస్తే నువ్విలా అనవ్!

మొదటి:- తెలియకేం - అంతా తెలుసు.

వ్యక్తి:- తెలియదు; ఏమీ తెలియదు. యుద్ధపరికరాల్లో ఒక పరికరానివి నువ్వు. బాంబు విసిరిన తర్వాత ఏమైందో, ఎంతమంది అమాయకుల్ని బలి తీసుకుందో నీకు తెలియదు.

మొదటి:- నాకూ—

వ్యక్తి:- నాకిప్పుడు 25 ఏళ్ళు. 18వ యేటనే ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. రెండేళ్ళు ఎంతో అనురాగంతో కాపురం చేశాను. ఒక మగపిల్లవాడు కలిగాడు. ఆర్నెల్లయిందో లేదో యుద్ధంవచ్చి మా వాళ్ళి పిలుచుకు పోయింది. ఆయన తుపాకి భుజాన వేసుకొని వీధిలో March చేసుకుంటూ పోతుంటే నేనూ ఒక 'వీర పత్ని'నని గర్వించాను.

మొదటి:- ఆఁ!

వ్యక్తి:- మరో ఏడాదికి ఈ భూమి శత్రువశమైంది. శత్రుసైన్యాల చేతుల్లో పడి మా సర్వస్వాన్నీ గోల్పోయాం, ఒక్క మా ప్రాణాలూ-పిల్లల ప్రాణాలూ తప్ప.

మొదటి:- అహఁ!

వ్యక్తి:- మీకు తెలిసిండల్లా యుద్ధం చెయ్యటం-కాని, ఆయన తిరిగివస్తే ఈ మొహం ఎల్లా చూపించాలో నాకు తెలియదు.

మొదటి:- కాని ఒకమాట—

వ్యక్తి:- ఇంకా మాట ఏమిటి? నీకూ ఒక సోదరివుండే. నీకూ ఒక భార్యవుండే, వాళ్ళు ఇలాగే యుద్ధంలో పరాభవించబడితే, తెలిసేది నా క్షోభ. ఈ పరాభవం ఒకరోజూ, రెండురోజులూ కాదు- నెలలు, ఒకటే వ్యధగా, ఒకటే కసాయికోతగా! చిట్టచివరికి ఎలాగో మనవాళ్ళు ఈ ఊరిని వశపరచుకున్నారు. కాని ఇప్పటికే నేనొక గర్భిణిని.

మొదటి:- ఏమిటి?

వ్యక్తి:- 9 నెలలు గడచి పిల్లవాణ్ణి కన్నాను. పిల్లవాడు! నేనెంతో ఆసహ్యించుకొనే పిల్లవాడు. కాని నా పిల్లవాడు ప్రపంచంలో ఏ తల్లీ అసహ్యించుకోనంతగా అసహ్యించుకొంటూ, ద్వేషించనంతగా ద్వేషిస్తూ, ఈ చేతుల్తోనే ఈ దేహంతోనే ఆ పాప స్వరూపాన్ని పోషించి పెంచాల్సివచ్చింది. పెంచుతున్నాను– మెడపిసికి చంపలేని బలహీనతవల్ల.

మొదటి:- ఆశ్చర్యమయింది.

వ్యక్తి:- ఓ! నేను చావలేను, పిల్లల కోసం ప్రతీకారి. ఈ జీవితంమీద అసహ్యం పుట్టినా, యీ దేహం మీద రోత పుట్టినా, ప్రతీకవలసిందే. ప్రతికి ఏదో ఒకనాడు ఆయన్ని చూడక తప్పదు యుద్ధం ముగియగానే ఆయన వస్తారు, వస్తే ఆయన కాపిల్లాణ్ణి చూపించక తప్పదు. చేతిలో ఆ పిల్లాడితో ఎదురువెళ్ళి స్వాగతం ఇవ్వాలి ఏమి స్వాగతం? ఏముఖంతో స్వాగతం? ఏ అనురాగంతో ఎదురు వెళ్ళను?

మొదటి:- ఆ పిల్లవాణ్ణి చంపేస్తే?

వ్యక్తి:- నీకు చంపటంతప్ప వేరేంచేతకాదు. 9 నెలలు మోసి కని, పెంచిన పసిగుడ్డును యీ చేతుల్తో చంపడం నా చేతకాలే ఆయనవస్తే జరిగేసంగతి అనూహ్యం. ఆయన రాకుండావుండే– అవును. అప్పట్నుంచి ఆయన రాకుండా వుండాలనే కోరుతున్నా. భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా, యుద్ధంనుంచి ఆయన తిరిగి రాకుండా యుద్ధంలోనే ఆయన అణిగిపోవాలని. ఇంకా ఏమేమో ఊహలు లొద్దాయి. నిరాశతో ఎండిపోయిన నా హృదయంలో వింత ఆశల్ని రేకెత్తాయ్. ఆ పాపిష్ఠి

సంతానాన్ని చేతిలో వుంచుకొని, ఆకాశంలోనే ఆశలు పెట్టుకుని, ఆరుఐయట విమానాలవెంట బాంబులు పడేవైపుకు పరుగెత్తుకు పోయాను. కాని అవేవీ యీ మలిన దేహాన్ని ముట్టుకోలేదు ఇంటికి తిరిగివచ్చాను. మా ఇంటిమీద బాంబులు పడ్డాయి. మా అనురాగాల ప్రోగు, ఈ పెద్దపిల్లవాడు చచ్చిపడి వున్నాడు.

మొదటి:- ఆపవమ్మా !

వ్యక్తి:- ఎందుకాపాలి? నువ్వూ నీలాంటి వాళ్ళతో కలిసి, నీలాంటి శత్రువులతో యుద్ధంచేసి మాకు తెచ్చిపెట్టేది యిదేగా నికిఎ కొత్తా! నీచేతుల్తో ఎంతమందిని చంపావో, ఎంతమందిని చెరిచావో నీకు తెలియదా?

మొదటి:- తెలుసు.

వ్యక్తి:- తెలుసు, ఈ పనులు అంతా తెలిసేచేస్తుంటారు. అయితే ఈ కళేబరాన్ని ఏంచెయ్యాలో నీకు తెలిసేవుంటుంది. పీడూ నీలాంటివాడికొడుకే. ఇంద తీసుకో, నీ యుద్ధఫలితాన్ని.

(కళేబరాన్ని అతని చేతుల్లో పడవేసి వెళ్ళిపోయింది)

మొదటి:- నేనేం చేసుకోను!

వ్యక్తి:- ఏం చేసుకున్నా సరే. *

మొదటి:- ఉద్రేకపడకమ్మా, నీకొడుకును సమాధిచేద్దాం.

వ్యక్తి:- నేచెయ్యలేనా పని. మాతృహృదయానికి పోషించడం చేతనవునుగాని, పూడ్చిపెట్టడం చేతకాదూ. అది చేతనయింది నీకు. (వెళ్ళిపోయింది.)

మొదటి:- ఏమిటిది! సైనికుడంటే ఇదా! ఇదా, నా పని? వట్టి కాటికాపరా? కసాయివాడా సైనికుడంటే? కాదు, నే కసాయివాణ్ణి కాదు.

(లోపల్నుంచి కంఠస్వరం వినిపిస్తుంది)

కంఠస్వరం:- కాక మరెవరివి?

మొదటి:- ఏమిటీ?

[ఒక ముదుసలి గోరీలమాటునుంచి బయటికి వస్తాడు]

---

* ముదుసలి ప్రవేశం—Dim light focus on ముదుసలి.

మొదటి:- (తెల్లబోయి, ఆశ్చర్యంతో) ఏమిటది, ఎవరు నువ్వు?

ముదుసలి:- ప్రపంచం అంతా విస్మరించిన ఒక ముసలివాణ్ణి.

మొదటి:- ఆ! అంటే నా కర్థంకాలేదు. ఎవరివి నువ్వు? ఇప్పుడు యీ గోరీల మధ్య ఎందుకున్నావ్?

ముదుసలి:- ఉన్నాను. ఇదే నా నివాసంగనక. దానిదేముందిలే, ప్రతివాడూ ఎక్కడో అక్కడ వుంటాలి. నేనీ గోరీల మాటున ఉన్నా, ఈ గోరీలమాటున ఏమందో నాకు బాగాతెల్సు, నీకు తెలుసా అదేమిటో?

మొదటి:- ఏముండీ?

ముదుసలి:- దుఃఖం, అశాంతి, మనోక్షోభ.

మొదటి:- ఇదెవరికి తెలియదు.

ముదుసలి:- చాలామందికి తెలియదు. తెలిస్తే యిన్ని యుద్ధా లెందుకు చేస్తారు? ఇన్ని మారణ యంత్రాలెందుకు కనిపెట్టుతారు? నీ చేత, ఇన్ని యుద్ధాలెందుకు చేయిస్తారు?

మొదటి:- ఎవరెందుకు చేస్తున్నారో, నేను మాత్రం నా దేశంకోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్నాను.

ముదుసలి:- అబద్ధం, ఆత్మవంచన.

మొదటి:- ఆ- మరి నే పోరాడుతున్న దెందుకు?

ముదుసలి:- దేశం పేరిట, ప్రజాసేవ పేరిట - నీ స్వజనులకోసం - నీ స్వార్థం కోసమే పోరాడుతున్నావ్.

మొదటి:- కాదు, దీంట్లో స్వార్థంలేదు. నా ప్రజలకోసం, ప్రజా స్వాతంత్ర్యం కోసం, ప్రజాభివృద్ధికోసమే పోరాడుతున్నాను.

ముదుసలి:- నీ విరోధికూడ అతని ప్రజలకోసం, స్వతంత్రం కోసం, అభివృద్ధి కోసం పోరాడుతున్నా నంటున్నాడు.

మొదటి:- అబద్ధం, అదంతా అబద్ధం.

ముదుసలి:- నీది అబద్ధమని అతనంటాడు.

మొదటి:- ఆ శత్రువే నామీద బండెత్తాడు మొదట.

ముదుసలి:- ముందు నువ్వు చేసిన అన్యాయమే యుద్ధంలోకి దింపిందంటాడు అతను.

మొదటి:- అయితే ఇది తేకేదెట్లా?

ముదుసలి:- ఎందుకు తేందు? మందు మీ హృదయాల్లో ద్వేషం బయలుదేరింది. ఆ ద్వేషం పరస్పర అనుమానాలకు దారితీసింది. ఈ అనుమానం మీ యిరుపక్షాలకీ భేదం కలిగించింది. ఆ భేదం మీ యిద్దర్నీ వేరు పరచి, జాతి మత విభేదాలకి దారితీసింది. ఇవన్నీ యుద్ధాలకు దోవ తీసినై.

మొదటి:- కావచ్చు. కానీ ఈ అసూయతో నేను యుద్ధం చెయ్యటంలేదే! ఈర్ష్యలతో యుద్ధం చెయ్యటంలేదే! దేశమాత ఆర్తనాదం విని, మాతృమూర్తి ఋణం తీర్చుకోటాన్కి ఈ యుద్ధంలో కురికాను.

ముదుసలి:- దేశభక్తి-స్వార్థానికి మరో పేరు. ఈ అనంతభూతలం ఏఒక్కడి దేశం కాదు - అందరిదీను. ఈ కనపడే ఎల్లలూ హద్దులూ మనం కల్పించుకున్నవే. వాటిని మనం మార్చుకోగలం. "విశ్వవసుంధరంతా ఒకటే దేశం. విశ్వ మానవులంతా ఒకటే జాతి" అని అందరూ వప్పుకుంటున్నారు. మానవులంతా ఒకటే అయితే, జాతివైషమ్యాలెందుకు ? జాత్యహంకారాలెందుకు? జాతియుద్ధాలెందుకు ?

మొదటి:- ఎందుకు? ఎందుకు ?

*

ముదుసలి:- ఎందుకా ? మీ నాయకుల నాయకత్వంకోసం, దేశభక్తిపేరిట జాత్యహంకారాన్ని రెచ్చగొట్టి మమ్మలందర్ని యుద్ధంలోనే నివగ్నుల్నిచేసి

---

* Lights off. అలెగ్జాండర్, అశోకుడు, ఒక మహమ్మదీయ చక్రవర్తి నెపోలియన్, Lloyd George, Hitler వరసగా పెనక తెరమీద Magic lantern తో focus చేయబడతారు. వాని జాతి భాషల్లో వారు మాట్లాడతారు. ఈ ౬ కంఠస్వరాలవారూ తయారవాలి.

తమ నాయకత్వాన్ని నిలుపుకోవటాన్కి, మీ నాయకులు పన్నిన పన్నాగం యిది.

మొదటి:- కాము—మా నాయకుడు- ''శాశ్వతమైన శాంతి కోసం, యుద్ధాన్ని సమూలంగా తొలగించటంకోసం'' అంటున్నాడు. యుద్ధాన్ని అణగకొట్టటాన్కి యుద్ధమే సులభమార్గం.

కంఠస్వరం:-'యుద్ధాన్ని అణగ కొట్టటానికి యుద్ధమే సులభమార్గం' అని మీ నాయకుడన్నాడు. ఈ మాటలే అనేక శతాబ్దాలనుంచి అనేక మంది మహానాయకులూ అంటున్నారు. అనేక శతాబ్దాలకు పూర్వం, అలెగ్జాండర్ (అలెగ్జాండర్ అనగానే రంగమంతా చీకటౌతుంది. ఆకాశంలో అలెగ్జాండర్ కనిపిస్తాడు.)

ALEXANDER — దిగంచలాంవరకూ గల వివిధ దేశాలనూ జయించి ప్రపంచానికే చక్రవర్తి నౌతాను.

కంఠస్వరం —అశోకుడు (అనగానే అలెగ్జాండర్ అంతర్ధానమై అశోకుడు కనిపిస్తాడు).

అశోకుడు—''అఖిల భారతాన్ని ఏకచ్ఛత్రంచేసి సుస్థిర శాంతి రాజ్యమను స్థాపిస్తాను.''

కంఠస్వరం—ఇంకా Alfred the great మొదలుగాగల అనేకమంది మహావీరులూ, మధ్యకాలంలో అనేక మహమ్మదీయ చక్రవర్తులూ.

[ఒక మహమ్మదీయ చక్రవర్తి ఆకాశంలో కనిపిస్తాడు.]

మహమ్మదీయ చక్రవర్తి-మైపూకీ మునియా గా ఫతేహ్ కర్కే జిస్మే కామిల్ ఆఖాని ఒస్మాన్‌కి హుకుమత్ థా యుంకర్కే. ఏఖీ కామ్, ఏఖీ మజహబ్ ఏఖీ ఝుండా లహరావుంగా. (ఉరుము)

కంఠస్వరం:- ఈమధ్యనే Napolean- (నెపోలియన్ కనిపిస్తాడు)

నెపోలియన్:- ఝువెన్‌క్రై - లెథోమాన్‌త్ ఎత్‌ఎతాబ్లెరె నాత్రెరొయోమ్ సో ఉనెఐనేర్. (ఫ్రెంచి)

కంఠస్వరం:- Lloyd George [లాయడ్ జార్జి కనిపిస్తాడు]

Lloyd george:- Our war is to end all wars.

కంఠస్వరం:- హిట్లర్ [హిట్లర్ కనిపిస్తాడు]

హిట్లర్:- ఇఖ్ బెసీగెన్ ది గాంజ్ వెల్టు ఉంట్ బ్రింగెన్ ఆలె లాండన్ ఉంటర్ ఐన్ రైష్. ఐస్ లాండ; ఐన్ కొనిగ్, ఐన్రైష్: ఐన్పొల్క్. (జర్మన్)

[తిరిగి లైట్లు వెలుగుతాయి]

కంఠస్వరం:- అందరూ ఇదేమాట అన్నారు. అందరూ కుమిలిపోతున్న భూమాత కాలగర్భంలో అంతర్లీనమైపోయారు. గతించిన చరిత్ర నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే మానవుడి ప్రత్యేకత ఏముంది? ... యుద్ధం ఆపివేయుటానికి యుద్ధం మానివేయ్యటమే మందు. కాని యుద్ధం చేయుటం కాదు.

యుద్ధానికి కారణం స్వార్థం, ఈర్ష్య, దురాశ 'యుద్ధం' తనతోపాటు ఆకలి, దరిద్రం, కరువు, దుఃఖం తెస్తుంది. ఈ నిరాశలో మానవుడు మళ్ళీ యుద్ధానికే దారితీస్తాడు. కాబట్టి యుద్ధానికి జవాబు యుద్ధం కాదు శాంతస్థాపన. దేశాభివృద్ధికోరే ఏ నాయకుడూ యుద్ధాన్ని కోరడు. శాంతినే వాంఛిస్తాడు. శాంతికిముందే అభివృద్ధి. ఆపందం వస్తాయి. శాంతి కోర అభివృద్ధి. యుద్ధపీడ సర్వనాశనం. శాంతిచిహ్నం ఐక్యత. యుద్ధచిహ్నం విభిన్నత. శాంతి ఫలితం సంతృప్తి!! యుద్ధ ఫలితం యుద్ధం!!

మొదటి:- అవును కాని, యీ యుద్ధం కావాలని నేనెప్పుడూ కోరలేదే!

ముదుసలి:-కోరలేదు. నీలోటి సామాన్యుడెప్పుడూ కోరలేదు. కోరింది కొద్ది మంది స్వార్థపరులు మాత్రమే! వాళ్ళేనాయకత్వం వహించి ప్రపంచాన్ని సంగ్రామాల్లో ఏంపుతున్నారు. నీలోటి సామాన్యుల్ని బలి పెడుతున్నారు.

మొదటి:- నా దేశ స్వాతంత్ర్యం మీదకు దాడి చేస్తే నేను యుద్ధం చెయ్యకపోతే ఎలా ?

ముదుసలి:-దాడి వచ్చేవరకూ ఎందుకూరుకున్నావ్? దాడి రాకముందే 'శాంతి ప్రాముఖ్యం' ప్రజలందరికీ నచ్చజెప్పి, ప్రపంచం అంతా ఒకే జాతి అని బోధించు. అన్ని దేశాలలోనూ ఐక్యత సాధించు.

మొదటి:- దీనికి అన్ని దేశాల ప్రజలూ పూనుకోవాలి, అది సాధ్యమా?

ముదుసలి:- ఎందుకు సాధ్యంకాదు? అన్ని దేశాలు కూడగట్టుకుని ఇంత పెట్టున యుద్ధ సన్నాహాలు చేస్తున్నాగే. ఇంత ప్రయత్నమూచేస్తే శాంతి సుస్థిరం కాకపోయిందా! నీ నాయకు లిచి చెయ్యక, సామ్రాజ్య కాంక్షలతో నీ దేశానికి స్వలాభం చూపించి యుద్ధాల్లోకి దింపు తున్నారు. నీ నాయకులు విస్మరించిన పని నీమీద పడింది. నువ్వే నాయకత్వం వహించి శాంతి ప్రచారం చెయ్యి, ఇది నీ విధి. నీలోటి వాళ్ళందరి విధి.

(ముదుసలి అదృశ్యమై పోతాడు)

*

మొదటి:- నా విధి. నా బోటివాళ్ళందరి విధి. ఈ సందేశాన్నే అనేక మంది మహాత్ములు అనేకసార్లు అందించారు, యీ మానవ లోకానికి. కాని, ఎందువల్ల ఈ ప్రపంచం యీ అమూల్య సందేశాన్ని ప్రతితరవా విస్మరిస్తోంది? ఎందుకని ఈ అమర సందేశం ప్రతిసారీ పరాభవింప బడుతోంది? ఎందుకని?? ఎందుకని???

(రెండు కొమ్మలమధ్య ఒక పావురం కనబడుతుంది, వెనక స్వచ్ఛమైన శాంతివలయంతో.)

పావురం:- ఎందుకనా? ప్రతిమనిషిలోనూ కాస్తకాస్త స్వార్థం ఎప్పుడూ వుండడం వల్ల! అధికారంలో వున్న ఈ దురాశాపరులు యీ స్వార్థానికే ప్రోత్సాహం యివ్వటంవల్ల. మనిషిలో మిశ్రమంగా వున్న మంచి చెడ్డల్లో చెడ్డతనానికే ప్రోత్సాహం ఎక్కువగా వుండటంవల్ల! ప్రక్కవాడి ప్రాణం నువ్వు తీసిననాళ్ళు ప్రపంచంలో శాంతి వుండదు. ఒకడి సౌభాగ్యానికి నువ్వడ్డు వెళ్ళకుండావుంటే, నీ సౌభాగ్యాని కెవరూ అడ్డురారు. ప్రక్కవాడి కష్టాల్లో నువ్వు సహాయపడితే, నీకు వాడూ సహాయపడతాడు. ప్రపంచంలో ఈ సౌహార్ద్ర త్యాగశీలత ఎక్కువైతే ఆదే ప్రపంచ సౌఖ్యానికి దారితీస్తుంది. మానవాభ్యుద

---

* పెట్టెతో చేసిన పావురంగాని, నిజమైన పావురంగాని కనిపిస్తుంది. బొమ్మ పావురమైతే Lights off on పావురం.

యానికి ఆకారణం అదొక్కటే ఒక్కటి! (పావురం అదృశ్యమౌతుంది.)

మొదటి:- మానవాభ్యుదయానికి ఆకారణం అదొక్కటే ఒక్కటి. ఎప్పుడీ ఒక్కకిరణం సర్వప్రపంచానికి వెలుగునిచ్చి అంధకారాన్ని పటాపంచలు చేసుంది!

(వేరే కంఠస్వరం వినిపిస్తుంది)

కంఠస్వరం:-సదా యుద్ధాన్ని వరించే స్వార్థపరుల్లారా! సదా కంఠాల్ని కత్తిరించే కసాయి సైనికుల్లారా! నన్ను చూసైనా మీ ప్రయత్నం ఆపండి. నన్ను చూసైనా మీ యుద్ధప్రయత్నం ఆపండి. నన్ను చూసైనా మీ యుద్ధ ప్రయత్నం ఆపండి.

మొదటి:- ఏమిటీ విచిత్రం! ఎవరీ మాట్లాడేది?

(వ్యక్తి తెల్లని దుస్తుల్లో ప్రవేశించి, సైనికుడిఎంక చూడకుండానే తనలో తాను మాట్లాడుకుంటూ ఒక ప్రక్కనుంచి మరోప్రక్కకు నడిచిపోతుంది)

మొదటి:- ఏమిటది? ఎవరునువ్వు?

వ్యక్తి:- యుద్ధరాక్షసి భీకర దంష్ట్రాగ్నుల్లోపడి-కాలి కుమిలిపోయిన సామాన్య స్త్రీని.

మొదటి:- ఇందాక వచ్చింది నువ్వేనా? నువ్వేనా? నిన్ను చూస్తే నాకు నా...

వ్యక్తి:- తోడి మానవుడే ధన ప్రాణ మానాల్ని దోచుకోగా, నీచపు బ్రతుకులో నిరుత్సాహపడి, నిండు ప్రాణాల్ని విడిచిన నిర్భాగ్యురాల్ని.

మొదటి:- అయితే నువ్వు?

వ్యక్తి:- ప్రపంచంలో తంయెత్తుకు తిరగగల ప్రాప్తం సంపూర్తిగా తుడుచుకుపోగా తెగించి భవబంధాల్ని తెంపి వేసుకున్న తెగువంని.

మొదటి:- అయితే నువ్వు మనిషివి...

వ్యక్తి:- అసంతృప్తితో జీవించి అసంతృప్తిగా మరణించి అసంతృప్తితో యీ అనంత భూతలంచుట్టూ తిరుగుతున్న అమానుష అశాంతి రూపాన్ని!

మొదటి:- ఓ మనిషివికావూ ?

వ్యక్తి:- మనిషి కాకపోయినా మాతృమూర్తినే. చిక్కుమాలిన యీపిల్లల్ని విడచి ఏ లోకానికి పోను ? ప్రాణాల్ని తీసుకోగలిగాను గాని కడుపు తీపినెలా తోసుకోను.

మొదటి;- నీ పిల్లల్ని నే చూస్తాను.

వ్యక్తి:- నీబోట్లు వెయ్యిమందైనా ఒక తల్లితో సమానం కాలేరు. నా పిల్లలు నా చేతులతో పెరిగితేనే నాకు తృప్తి.

మొదటి:- అయితే నన్నేం చెయ్యమంటావ్ ? ఏం కావాలంటావ్ ? అసలెందుకు వచ్చావ్ ?

వ్యక్తి:- ఏదీచెయ్యమనటం లేదు నీకు ఏమయినా చేతనయితే నాబోటివాళ్ళను తయారు చెయ్యకు !

మొదటి:- అంటే నాకు అర్థంకావటం లేదు.

వ్యక్తి:- ఏ నిండు ప్రాణాల్నీ నిలువునా తియ్యకు. ఏ తల్లి గర్భానా చిచ్చు పెట్టకు (వెళ్ళిపోబోతూ)

మొదటి:- ఆగు. ఎవరు నువ్వు ? ఆ ఒక్కమాట చెప్పు.

వ్యక్తి:- ఒక సామాన్యురాల్ని.

మొదటి:- కాదు-నిన్ను చూస్తుంటే నాకు...

వ్యక్తి:- అంతే అంతకంటే నేనెవర్నీ కాను. (వెళ్ళిపోయింది)

మొదటి:- (ఆటే చూస్తాడు కాసేపు తర్వాత క్రిందనున్న పిల్లవాడి కళేబరం చూచి) ఇక్కడ ఒక పసివాడు, అక్కడ ఒక సైనికుడు. ప్రపంచం అంటే అర్థం కాని ఒక లేతమొగ్గ. ప్రపంచాన్ని చూసి వికసించి ఫలించబోయే ఒక లేత పిందె-ఇద్దరూ నిస్తబ్ధులైపోయారు. [కాసేపాగి పిల్లవాణ్ణి చేతుల్లో తీసుకుని ఆలోచిస్తూ వుండగా ముసలి వాడు వస్తాడు]

ముసలి:- ఏం ప్రపంచం, ఏం జీవితం. అబ్బ !

మొదటి:- (దగ్గరకెళ్ళుతూ) తాతా !

ముసలి:- తాత. తాతనై వుండి కూడా ఎందుకు బ్రతికివున్నానా అని.

మొదటి:- ఏమయింది తాతా ?

ముసలి:- నీకు తెలుసుగా ! నాకున్న ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడు పోయాడు.

మొదటి:- ఆఁ !

ముసలి:- పెద్దవాడు పోయిన తర్వాత యీ చిన్నవాడి మీద నాకెంతో మమకారం పెరిగింది. పెద్దతనంలో పుట్టాడు కదూ ;

మొదటి:- అవును.

ముసలి:- వీణ్ణి చూసుకుని దుఃఖం దిగమింగుకునే వాణ్ణి.

మొదటి:- అయితే !

ముసలి:- ఈ కష్టసుఖాల్లో పండిపోయిన నాకు ప్రాణం విలువ బాగా తెలుసు.

మొదటి:- అంతేగామరి.

ముసలి:- ఎక్కడయినా ప్రాణం పోయిందనగానే నా మనస్సెంతో బాధపడుతుంది.

మొదటి:- నిజమేగాని మనం ఏం చెయ్యగలం ?

ముసలి:- మన చేతిలో ఏదోవుందనికాదు. కాని ఆ మాటలో మాత్రం ఏం ఉపశాంతి వుంది చెప్మా యీ హృదయానికి?

మొదటి:- అఁ అదీ నిజమే.

ముసలి:- నేనిక్కడికి రాకముందు Air Raid వచ్చింది. చూశావ్!

మొదటి:- ఆఁ, అవును.

ముసలి:- ఆ Raid లో బాంబులు.

మొదటి:- అవును. బాంబులు పడ్డాయి.

ముసలి:- ఆపి-మా యింటికీ మీ యింటికీ మధ్యపడ్డాయి.

మొదటి:- (నిశ్చాంతపోయి) ఆ!

ముసలి:- మా ఇంట్లో సగం కూలిపోయింది. మీ యిల్లూ సగం కూలిపోయింది.

మొదటి:- ఎవరికేం దెబ్బలు తగలలేదు కదా !

ముసలి:- బొంబు పడటానికి ముందే నేనిక్కడికి వచ్చాను కదూ ? దెబ్బలు తగలటానికి మా యింట్లో ఎవరూ లేకపోయారు.

మొదటి:- మా యింట్లో?

ముసలి:- మీ యింట్లో మీ కుర్రాడికి,

మొదటి:- దెబ్బతగిలిందా ?

ముసలి:- ఆఁ దెబ్బతగిలి పోయాడుట.

మొదటి:- తాతా !

ముసలి:- ఏడ్చి ఏం ప్రయోజనం నాయనా- సత్యాన్ని యివాళ కాకపోతే రేపైనా తెలుసుకోవాలి. అక్కడంతా గలభాగా వుంది. నీ భార్య కనపించలేదు. నేవెళ్ళేటప్పటికి రెండో పిల్లాడు ఉయ్యాల్లో వంటరిగా ఉన్నాడు.

మొదటి:- రెండో పిల్లాడా !

ముసలి:- ఈ గలభాలో నీ భార్య ఏమయిందో తెలియదు.

మొదటి:- నా భార్యా !

ముసలి:- మీ పెద్ద పిల్లాడి శరీరమేమయిందో?

మొదటి:- ఏమవలేదు తాతా ! ఇదిగో (పిల్లాడి శరీరం చూపిస్తాడు)

ముసలి:- ఇదా ? ఇక్కడి కెలావచ్చింది !

మొదటి:- నా భార్య తెచ్చియిస్తే వచ్చింది.

ముసలి:- తెచ్చియిచ్చిందా ?

మొదటి:- ఆ, నేనే భర్తనని తెలియక నా చేతికే యిచ్చింది.

ముసలి:- ఇక్కడికి వచ్చిందా ?

మొదటి:- వచ్చింది. నే లేనప్పుడు తనకు జరిగిన అన్యాయమంతా చెప్పింది. రెండో కొడుకు సంగతి చెప్పింది. ఈ పిల్లవాణ్ణి పాతిపెట్టుకోమని వెళ్ళి-

(దుఃఖావేశంతో మాట్లాడలేక పోతాడు)

ముసలి:- వెళ్ళి వెళ్ళుతూ దోవలో ఆత్మహత్య చేసుకుంది. నేను తిరిగి వస్తూంటే దోవలో ఆ శవం కనిపించింది.

మొదటి:- నాకాఆత్మ కనపించింది.

ముసలి:- భగవాన్ ! (నిట్టూరుస్తాడు).

మొదటి:- భగవంతుడేంచేశాడు తాతా? సుఖపడమని యీ ప్రపంచంలో పుట్టించాడు. చేతకాక మనమే జీవితాన్ని దుఃఖభాజనం చేసుకుంటున్నాం.

ముసలి:- అంతే, అంతే! కానియ్యి యీ కళేబరాన్ని, ఆ ఏడీ నీ స్నేహితుడు?

మొదటి:- ఇదుగో ఇక్కడ సరిగా చూడలేదుగా యిందాక. ఇప్పుడు చూడు.

ముసలి:- చూడకేం? చూశాగా.

మొదటి:- చూశావా? గుర్తుపట్టలేదుకదూ?

ముసలి:- ఉహూఁ, ఎవరేమిటి? (వెళ్ళి చూస్తాడు)

మొదటి:- చూశావా సరిగ్గా. నీ కొడుకు,

ముసలి:- (పెద్దగా వెర్రిగా నవ్వి) కొడుకు మా చిన్నవాడు. పెద్దవాణ్ణి వెతుక్కుంటూ చిన్నవాడూ వెళ్ళాడు.

మొదటి:- తాతా !

ముసలి:- వెళ్ళాడు. ఇక ఎప్పటికీ తిరిగిరాకుండా-పెళ్ళాం పిల్లల్ని బాధ పెట్టక్కర్లేకుండా-

మొదటి:- తాతా! ఏమిటిది?

ముసలి:- పోతే, ఒక్క ముసలితండ్రిని దుఃఖపెట్టాడు. అంతేగా! అదేం మించిపోయిన పనికాదుగా (నవ్వుతాడు)

మొదటి:- (దగ్గరకెళ్ళి) ఆగు తాతా !

ముసలి:- నేనేం దుఃఖిస్తాననుకున్నావా? పట్టు. యిద్దర్నీ సమాధి చేద్దాం. ఇంతకంటె ఘోరమైన పనులే చేశాను యీ చేతుల్తో. ఎంత గుండె

పగిలే ఘోరకృత్యాలు చెయ్యటానికైనా మొదటసారే కాస్త భయ పడతాం. తరవాత అవి చాలా సులభకార్యాలు. చాలా తేలిక పనులు. రా దుఃఖించకు, రా (వెళ్ళిపోతాడు) *

మొదటి:- ఆగు తాతా! పీళ్ళిద్దరూ యుద్ధపిశాచానికి బలియైన అమాయకులు.

ముసలి:- తండ్రికడుపులో చిచ్చుపెట్టి కళ్ళుమూసిన కఠిన హృదయులు.

మొదటి:- వీళ్ళిద్దర్నీ ప్రాముఖ్యంగా ఈ మధ్యన సమాధి చేద్దాం యిక్కడ- ఇంతవరకూ ఏ సమాధి లేనిచోట.

(ప్రతిధ్వని మూడుసార్లు వినిపిస్తుంది)
("ఇంతవరకూ సమాధిలేని చోటా?)
ఇంతవరకూ సమాధిలేని చోటా ?
ఇంతవరకూ సమాధిలేని చోటా ?")

మొదటి:- అవును. కాదా ?

ప్రతిధ్వని:- కాదు...కాదు...కాదు...

మొదటి:- ఇక్కడిదివరకే సమాధి పుందా?

ప్రతిధ్వని:- ఇక్కడిదివరకే చాలా సమాధులున్నై!
ఇక్కడిదివరకే చాలా సమాధులన్నై!!
ఇక్కడిదివరకే చాలా సమాధులున్నయ్!!!

ముసలి:- అవును. భూమాత కడుపు పగిలి ఏడ్చేవరకూ అనేక మంది, అనేక చోట్ల సమాధి చేయబడ్డారు. ఆ సంగతి మనం విస్మరించాం. ఎంత మంది మనలాంటివారి మనోక్షోభను భూమాత గర్భస్థం చేసుకుందో యీ శతాబ్దాల కాలపరిమితిలో!

మొదటి:- (నెమ్మదిగా ప్రారంభిస్తాడు) అయితేకానీ, ఇది మొదటిది కాకపోతే ఆఖరిది కానియ్యి. ఇక్కడే కాదు. ఎక్కడా ఏ ఒక్కడూ ఏ యుద్ధానికీ ప్రాణం అర్పించవలసిన అవసరం లేనంతవరకూ యుద్ధ పిశాచాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేసేంతవరకూ, నేను నిద్రపోను. నిద్రపోతుందేనే యుద్ధరాక్షసి రాజ్యమేలగల్గుతోంది.

---

* ప్రతిధ్వనులు. Lights dim. get ready for sunrise.

నిద్రపోతుంటేనే తరతరాలుగా మానవుణ్ణి తన ఖానిసగా చేసు కొంటోంది. స్వార్థాన్ని రేకెత్తించి మానవుణ్ణే మానవునిమీదికి పురి కొల్పి మానవుడి చేతనే కూట హత్యలు చేయిస్తూ మానవాత్మ్య దయానికే అభ్యంతరం కలిగిస్తోంది. ప్రపంచానికిది బోధించి, ప్రపంచంలో యుద్ధం తల ఎత్తకముందే ప్రచారం చేసి, అంతా యిద్ధంమాట మరచిపోయేవరకూ, ప్రపంచం నలుమూలలా నిత్య శాంతిశోభలు పచ్చతోరణాలతో ప్రభవిల్లేవరకూ, స్వచ్ఛంద సేవా వాంఛ, స్వార్థరహిత జీవితప్రవృత్తి ప్రతివాని మనసులో పాదుకునే వరకూ, సర్వమానవ సమానత్వమే బంగారు, అహింసే ఆయు ధంగా, అభ్యుదయమే ఆశయంగా పరిఢిల్లేవరకూ యీ శాంతి సందేశం ప్రతి దేశంలో, ప్రతి గ్రామంలో, ప్రతి హృదయంలో మారుమ్రోగేవరకూ, ఈ 'శాంతి' చక్కనితల్లి వెచ్చని సండిల్లో మైమరచి మానవుడు నిద్రించగలిగేవరకూ నేను నిద్రపోను. వెళు తున్నాను తాతా! ఈ జరిగిపోయిన వృత్తాంతాన్ని నువ్వే సమాధి చేసుకో. (వెళ్తాడు)

ముసలి:- వెళ్ళు. నాయనా, వెళ్ళు, ప్రపంచంలో కరడుగట్టిన కఠిన హృద యాలు చాలా వున్నై. నీ దీనాలాపంలో కఠినత్వాన్ని కరిగించివెయ్యి. ప్రపంచం నలుమూలలా నీ కంఠధ్వని ప్రతిధ్వనించేటట్లు ప్రచారం చెయ్యి. నీ జీవిత లక్ష్యమే ప్రతి మనిషి పరమలక్ష్యంగా పరిణమించే వరకూ తిరిగిరాక. ఓ నిర్వికల్ప నిర్వికారమూర్తీ! అనేకమంది మహాత్ముల అమర సందేశం అరణ్యరోదన మయిపోయిం దింత వరకూ. ఈ సారయినా యీ సామాన్యుని కోరిక సఫలం చెయ్యి. ఇదే నా "ప్రార్థన"—

(తర్వాటం ప్రారంభించగానే)

(తెర.)

వెంకన్న కాపురం

రచన :

ముదిగొండ లింగమూర్తి

పాత్రలు

వెంకన్న పంతులు :

రిటైర్డ్ హెడ్ గుమాస్తా

వెంకట్రావ్ :

పెద్దకుమారుడు

ప్రకాశం :

చిన్న కుమారుడు

శేషమ్మ :

వెంకన్న పంతులు భార్య

(రంగంమీదికి రాదు)

శేషాచలంచెట్టి :

వ్యాపారస్తుడు; కాంగ్రెసు వాది

వెంకటేశ్వర్లు :

ప్లీడరు గుమాస్తా

వెంకన్న పంతులింట్లో మధ్యసావిడి. గోడకు పాత గడియారం, దాని ప్రక్కగా ఒక పెద్ద ఫోటో వుంటుంది. క్రింద డ్రాయరు. దానిపైన చిందవందరగా కొన్ని పుస్తకాలు, మందుసీసా, టొన్ను గ్లాసు వుంటాయి. డ్రాయరుకు ఎడమభాగంలో రెండు పెద్దెలుంటాయి. వాటి దగ్గరగా కోటు స్టాండు, దానిపైన కొన్ని పాత చొక్కాలూ వుంటాయి. ఆ స్టాండు ప్రక్కన నీళ్ళబిందె, చెంబూ వుంటాయి.

డ్రాయరుకు కుడివైపున నులకమంచం నిలబెట్టి వుంటుంది. కుడి వైపునున్న గదిలో శేషమ్మ రోగంతో పడుకొనివుంది.

[గడియారం ఆరుగంటలు కొడుతుంది. ఆరేసిన గుడ్డలన్నీ పోగేసుకుని ఎడమ వేపునుంచి వెంకన్న వస్తాడు. ఆ గుడ్డలన్నిటినీ మధ్యగా పడేసి, వాటిలోని చీరెకు కుచ్చెళ్ళు పెడుతూ]

వెంకన్న:- ఇంటిపేరు కస్తూరివారు, ఇంట్లో గబ్బిలాం కంపని వూరికే వచ్చిందా సామెత? నా లాంటి అభాజనులుండబట్టే వచ్చింది. ఎంత ప్రతికితే యేం లాభం? కొమ్ములు తిరిగిన జడ్జీలు, మునసఫ్‌లు, హెడ్‌గుమాస్తా వెంకన్న పంతులంటే యెంత ఆదరించేవారు? ఎంత గౌరవించేవారు? (చీర చేతిలోనుంచి జారిపోతుంది) ఈ చీర కేమొచ్చిందోగాని, చేతిలో నిలవనంటుందే! దీని తస్సాగొయ్యా! నేనంటే దీనికికూడా చులకనే! అయినా, దీని తప్పేముందిలే! ఆ వాసన అటువంటిది. (భార్యను చూస్తాడు.)

శేషమ్మ:- .....

వెంకన్న:- పొనులేవె! నా మాటలన్నీ నీకు బాధగానే వుంటాయ్. నావన్నీ అఘాయిత్యం మాటలు, నీవన్నీ ముద్దులు మూటలుగట్టే మాటలు. మంచంలో పడుకొని యేవైనా ఆటాపట్! రానియ్యి చెబుతా!

శేషమ్మ:- .....

వెంకన్న:- ఎవరా? మన డాక్టరే.

శేషమ్మ:- .....

వెంకన్న:- (వెటకారంగా) "చెప్పండి" అని పెద్దరాగం తీశావే! చెప్పననికదూ నీ వుద్దేశం? "ఓ డాక్టరుగారూ! ఒకరి రక్తాన్ని తీసి మరొకరి

కెక్కించినట్టు, మా ఆవిడగారి జబ్బును తీసి, నా వంట్లోకి యెక్కించండి'' అని అడుగుతాను. ఇక మంచాన పడుకూ, దిండూ పక్కేసుకుని హాయిగా పడుకుంటా?

[గడియారం చూచి]

ఈ రోజు కూడా డాక్టర్ రాదల్లేవుండి. ఎట్లా వస్తాడు! ఆయన తప్పేముంది? పోసి, పొద్దునగాచిన కషాయమైనా తాగు. (బొన్ను గ్లాసులో పోస్తూ) ఉస్నంతవరకు గొంతులో పొయ్యాలిగా?

[తెస్తూ ఆగిపోతాడు]

శేషమ్మ:- .....

వెంకన్న:- కారణం? ఎందుకు తాగవ్?

శేషమ్మ:- .....

వెంకన్న:- చస్తా చస్తానంటూ ఎవరిని బెదిరిస్తావ్? ఈ కషాయం...

శేషమ్మ:- .....

వెంకన్న:- అదిగో మళ్ళీ ఆ మాటేనా? గుండె అసలే బలహీనంగా వుందాయె. కనీసం కషాయమైనా...

శేషమ్మ:- .....

వెంకన్న:- సరే కానియ్యి! (మందును బల్లపీదపెట్టి, గుడ్డలను మడతపెడుతూ) సత్యాగ్రహం ఆరంభించావన్నమాట! ఇలాంటి వెర్రి మొర్రి సత్యాగ్రహాలకు అదిరిపోయి, తుర్రుమని తోక పీకటానికి నేనేం అల్లాటప్పాగాడ్ని కాదు. చస్తానంటూ బెదిరిస్తున్నావ్‌గా? సరే కానియ్యి. ఉండుండు. కొడుకులిద్దర్నీ కొంపచేరనియ్యి. కూతురెట్లాగు రాదులే. వాళ్ళా దాన్ని పంపేది? నీకు జబ్బుగా వుంది, పిల్లనొకసారి పంపితే చూసి వస్తుందని నాలుగు ఉత్తరాలు రాశాను. ఒక్కదానికి కూడా సమాధానం లేదు. ఈ దౌర్భాగ్యపు సంబంధం తెచ్చి మా దుంప తెంచావ్!

శేషమ్మ:- .....

వెంకన్న:- ఛీ ఛీ! నోటికి హద్దుపద్దు వుండాలి నేనా దాని గోంతు కోసింది? ఛీ ఛీ! (గుడ్డలన్నిటిని డ్రాయరువేపుకు విసిరివేస్తాడు) సిగ్గులేకుండా మాట్లాడితె సరేనా? ఈ సంబంధం కుదిర్చిందెవరు? నువ్వుకాదు? నీ పిఱతల్లి కొడుకని మురిసిపోయినావ్‌గాని, కట్నంలో ఒక కానీ వదిలాడు? అమ్మపుట్టిల్లు మేనమామ దగ్గిరని, మీ వాళ్ళింతకు నా దగ్గరా చెప్పడం? మీ వాళ్ళంతా...

[శేషావఁచెట్టి వస్తాడు]

దగుల్బాజీలు, పుండాకోరులు, పొగరుబోతులు...

చెట్టి:- అయ్యోరామ! ఈ దండకం ఎక్కడిదండి పంతులుగారూ?

వెంకన్న:- (సర్దుకొని) రా! చెట్టి, రా కూర్చో. ఎంతసేపైంది వచ్చి?

చెట్టి:- మీరు శలవిస్తుండారే ''పుండాకోరులు, పొగరుబోతులు'' అప్పుడొచ్చా.

శేషమ్మ:- .....

చెట్టి:- (శేషమ్మతో) ఆఁ! నేనేకంటి, శేషావఁచెట్టిని. మీ వంట్లో యెట్లా వుంది శేషమ్మగారూ?

శేషమ్మ:- .....

చెట్టి:- అయ్యో! అట్టానా, (వెంకన్నతో) సూటిమందిప్పించండి పంతులుగారు? అమ్మగార్కి నయమౌతుంది. (నాలుగు మూలలూ చూసి) అబ్బాయిగార్లు కనిపించరేం?

వెంకన్న:- ఇంటర్వ్యూకు రమ్మని వుత్తరమొస్తే హైదరాబాద్ వెళ్ళారు పొట్ట తప్పలకు పాటుపడాలిగా?

చెట్టి:- మీకేముండి? రత్నాల్లాంటి కొడుకులున్నారు. ఒకరు యం.ఏ; మరొకరు బి.ఏ. రేపటికుంచి లక్ష్మి మీ యింట్లో పీటేసుకు కూర్చుంటుంది. నాలుగు చేతులా సంపాదనే.

వెంకన్న:- ఆ దేవుడి దయవల్ల ఆరోజే వస్తే, మా బరువు తగ్గుతుంది. మీ బాకీ కూడా తీరుతుంది.

చెట్టి:- దాకీని మీ అంతట మీరే చెల్లేస్తున్నారుగాని, నేను నోరుతెరచి అడిగానా యెన్నడైనా? ఈ రోజు ఒకడైనా యిస్తారేమో, దాన్ని ఆ ఇన్‌కంటాక్సువాళ్ళ మొహానపారేద్దామని వచ్చాను.

వెంకన్న:- ఇంకెంతుంది మీ బాకి?

చెట్టి:- (జేబులోనున్న ప్రోనోటు తీసిచూసి) పెద్దబ్బాయిగారి చదువుబాపతుగా తమరిచ్చింది, అమ్మాయిగారి కళ్యాణం బాపతుపైకం ఆట్టాగేవుంది.

శేషమ్మ:- .....

చెట్టి:- (శేషమ్మతో) పిల్లలాడీ? ఏం చెప్పను శేషమ్మగారూ! మా యింటిది ఒకటే యేడుపు. ఊరుకోవే, యేడిస్తేమాత్రం పిల్లలు పుడతారా అని నే నెంతజెప్పినా వినదు పంతులుగారూ! ఆంజనేయుడి గుడి చుట్టూ అయిదురోజుల నుంచి ప్రదక్షిణాలు చేస్తున్నది. ఆ స్వామి అనుగ్రహించి ఓ పిల్లో పీచో పుడితే, వారిపేరు పెడతామని ముడుపు కూడా కట్టాం.

వెంకన్న:- మంచిపని చేశారు. నీ దైవభక్తి. నీ మంచితనం, నీ త్యాగం ఊరికే పోతాయా? అంతా ఆ దేవుడిదయ.

శేషమ్మ:- .....

వెంకన్న:- అబ్బా! నీ కెందుకే యీ గొడవ? కళ్ళుమూసుకుని పడుకోరాదూ?

చెట్టి:- ఎందుకండి అట్టా కసురుతారు? (శేషమ్మతో) మీరు చెప్పినట్టే 40 రోజులు చేస్తుందిలెండి స్వామి ప్రదక్షిణాలు. మీరు చాలా సీరసంగా వుండారు, పడుకోండి అమ్మగారు!

వెంకన్న:- నా మాట విని, స్వామిని నమ్మండి. మీకు సంతానం తప్పక కలుగుతుంది. మరి, వెళ్ళిరా! నా కింటిలో తొందరపనుంది.

(వెళతాడు)

చెట్టి:- (వెళ్ళేవాడల్లా ఆగి) పంతులుగారూ!

వెంకన్న:- (లోపలినుంచే) ఎందుకు?

చెట్టి:- నేనిందాక మనవి చేసుకున్నదే. ఈ రోజు ఎట్టా గడుస్తుందా అని.

(వెంకట్రావ్ సూట్‌కేసుతో వచ్చి, కోట్‌స్టాండ్ దగ్గరికెళ్ళి కోటును విప్పుతూ వుంటాడు.)

వెంకన్న:- (వచ్చి చూస్తూవుంటాడు)

చెట్టి:- (వెంకన్నతో) మీ పెద్దబ్బాయిగారి మొహం...

వెంకట్రావ్:- వాడినట్టుందా? మీరు వెంటనే తెలుస్తుంది. చెట్టిగారా మరే వన్నానా? బ్లాకును వైటుగా, వైటును బ్లాగ్గా మార్చే వాళ్ళకు ఇదొక లెక్కా?

చెట్టి:- ఎంతలావు మాటన్నారు వెంకట్రావ్‌గారూ!

వెంకన్న:- ఏమిట్రా నీ మాటలు, పిన్నాపెద్దా లేకుండా? వెళ్ళి కాళ్లు కడుక్కో. నీతో పనుంది.

[వెంకట్రావ్ చెంబుతో నీళ్లు ముంచుకుని ఎదమవైపుకు వెళ్ళాడు.]

చెట్టి:- అదికాదు పంతులుగారూ! నే నేమన్నానో మీరే విన్నారుగా! చెప్పండి న్యాయం. చెయ్యి చెయ్యి చేరిస్తే చప్పుడేనా? ఇక నా పెద్దమనిషి తనమేముంటుంది.? పిచపకాలమై పోయిందండి- ప్రతి ఒక్కరికి తామసమే! సహనం, శాంతం సన్నగిల్లిపోయింది. మరో నాలుగు కాలాలపాటు ఆ మహాత్ముడు, మన భారతజాతి పిత, శ్రీ మోహనదాస్ కరంచంద్ గాంధిచెట్టిగారుంటే ఎంత బాగుండేది? ఈ వృద్ధుకు ఛత్తాలన్నిటినీ...

వెంకట్రావ్:- (టవల్‌తో చేతులు తుడుచుకుంటూ వచ్చి) దిబెన్యాలని పేరు తగిలించి జైల్లో నెట్టారు. అంతేగా? ఈ రోజులా మీవే లెండి. ఊరికే ధరించారా టోపీ, ఆ ఖద్దరు?

చెట్టి:- కథ చాలాదూరంపోచ్చిందే! వెళ్ళినచోట కమ్యూనిస్టుల్తో పొత్తు కలిసింది గాబోలు! నిప్పులవర్షం కురిపిస్తున్నారు.

వెంకట్రావ్:- ఇంకేం? మీరు లాటిలు బయటికి దీయించండి.

చెట్టి:- ఆఁ! ఆఁ!

వెంకన్న:- చాలుచాల్లే ప్రయోజకత్వాలు! చదవేస్తే ఉన్న మతికూడ పోయిందట!

చెట్టి:- అయ్యో! నే నేమన్నానండి ? అయినా మీరుమీరు ఒకటే. మధ్య నాకెందుకులెండి. నా మాటేదో చెబితే నా పాటిన నేను పోతాను.

వెంకన్న:- ఇది సమయం కాదుగాని, మళ్ళీరా మాట్లాడదాం.

చెట్టి:- అట్లాగేలెండి పంతులుగారూ (నమస్కరిస్తూ) వస్తా ! (వెళ్లుతూ, వెంకట్రావుతో) కలవిప్పించండి పెద్దబ్బాయిగారూ!

వెంకట్రావు:- ఓ యస్! ఇచ్చాం. ఇక దయచెయ్యి!

(చెట్టి నిట్టూర్చి వెళ్తాడు.)

వెంకట్రావు:- (వెళ్లుతూ) అమ్మా!

వెంకన్న:- ఇలారారా! నీతో మాట్లాడాలి.

వెంకట్రావు:- (సందేహిస్తాడు)

వెంకన్న:- నిన్నే పిలిచేది? వినండటంలా?

వెంకట్రావు:- అమ్మను చూచివస్తాను.

వెంకన్న:- నిద్రపోతూంది. లేపకు.

వెంకట్రావు:- (నడ్డిన చేతులు పెట్టుకుని ఆలోచిస్తాడు.)

వెంకన్న:- రమ్మంటే అట్టా నడ్డిన చేతులు పెట్టుకు చూస్తావు ఏమిట్రా! నీ ఉద్దేశం?

వెంకట్రావు:- (వస్తూ) ఉద్దేశ్యాలకేం? సాగాలిగాని ఎత్తున్నాయ్.

వెంకన్న:- ఆ లక్షలో ఒకటి చెబుమా. కొడుకు ప్రయోజకత్వం వినైనా సంతోషిస్తాను.

వెంకట్రావు:- (చెప్పబోయి ఆగుతాడు)

వెంకన్న:- ఏం? ఆగుతావేం? అనదల్చుకుందేదో బయటకే అను. ఇంకా సందేహమెందుకు ?

వెంకట్రావు:- (మాట్లాడడు.)

వెంకన్న:- బుద్ధిలేకపోతేసరి? ఆ పెద్దమనిషిని పట్టుకుని అట్టా పేల్తావుట్రా? ఆమాత్రం మర్యాద తెలియక్కర్లా?

వెంకట్రావు:- మనగొడవ అతనికెందుకు తనపని చూచుకోకుండా?

వెంకన్న:- ఉహూ! అతనంటే అంత తెలిగ్గావుందేం నీకు? అతనే ఆ అప్పివ్వక పోతే నువ్వు చెల్లెలి పెళ్ళి చేసేవాడివె! పెద్దకబుర్లు చెబుతావు పైగా! నీలాంటివాళ్ళని నేనేంతమందిని చూశానో నా సర్వీసులో?

వెంకట్రావు:- క్షమించండి. నేనే మన్నేదు. అనవసరంగా మీరే.....

వెంకన్న:- అంటున్నానా? కడుపు నిండిందిగాని కట్టిపెట్టవోయ్ ఆ వాగుడు. హుఁ!

వెంకట్రావు:- (వెళ్తూంటాడు).

వెంకన్న:- వెళతావేమిరా?

వెంకట్రావు:- పిలిచిన పని ఆయిపోయిందిగా!

వెంకన్న:- నువ్వు వెళ్ళినపని ఏమైంది?

వెంకట్రావు:- ఉద్యోగం ఇస్తామన్నారు.

వెంకన్న:- ఎప్పుడు?

వెంకట్రావు:- 3rd Five year plan లో.

వెంకన్న:- ఇంకానయం పైజన్మలో ఇస్తామన్నా. అందాకా యేవూళ్ళెందలచుకున్నావు?

వెంకట్రావు:- ఏలటానికేం, మారాజులాగా యేలవచ్చు. కాని వున్న చిక్కల్లా ఒక్కటే.

వెంకన్న:- ఏంటది?

వెంకట్రావు:- బుజాన జంధ్యం వేలాడుతుంది.

వెంకన్న:- హైదరాబాదు వెళ్ళి ఇదా నువ్వు నేర్చుకొచ్చింది? ఎంత చదివితేనేం? ఎన్ని డిగ్రీలుంటేనేం? ప్రపంచంలో బ్రతికే సూత్రం నేర్చుకోవాలి. రికమెండేషన్ లేంది యీ రోజుల్లో వుద్యోగమిస్తారా? ఏ మంత్రిగారి కడుపో కాళ్ళో పట్టుకొని పని పూర్తిచేసుకోవాలనన్న జ్ఞాన ముండొద్దూ? ఆ మాత్రం బుర్రవుంటేగా దొరగారికి? నాదగ్గర మాట్టాడమంటే నుంచు వెనుక తడుముకోనక్కరలా! ఎందుకురా

సీ చదువంతా? ఈ అప్పుల వాళ్ళకు నేనెట్లా సమాధానం చెప్పాలి? రామచంద్రా! ఎన్ని కష్టాలు పెడుతున్నావు తండ్రీ! నేను పదుగురిలో తలెత్తుకుని తిరగాలని నీ కుందిట్రా? ఇంతకంటె ఆ అప్పులవాళ్లు, నువ్వూ కలసి నా గొంతు నులిమి చంపగూడదూ, పీడ విరగడై పోతుంది?

వెంకట్రావు:- నాన్నా!

వెంకన్న:- నా...న్న! ఈ నాన్నకు చావు రాకుండా వుంది. దానిక్కూడా అసహ్యమే నేనంటే!

శేషమ్మ:- .....

వెంకట్రావు:- అవునమ్మా! నే నే (తండ్రితో) అమ్మ పిలుస్తూంది.

(వెళ్ళబోతాడు)

వెంకన్న:- (చెయ్యిపట్టుకుని ఆపి, ముందుకు తీసుకొచ్చి, రహస్యంగా,) గంపెడంత ఆశతో యెదురుచూస్తున్నది మీ అమ్మ. మీరేవో పెద్దపెద్ద ఉద్యోగాలుజేసి, మన ఋణాలు, ఫణాలు తీరుస్తారని ఆ పిచ్చిదాని నమ్మకం. అసలే జబ్బుగా వుందా? దానికితోడు నీకు ఉద్యోగం దొరకలేదంటే, దానిగుండె ఆగిపోవచ్చు. ఒకవేళ మీ అమ్మ ఆడిగితే, ఆఫీసర్ వుద్యోగమొచ్చిందని చెప్పు తడుముకోకుండా.

వెంకట్రావు:- అబద్ధాలా? చేసిన పాపం చాలునాన్నా క్షమించండి.

వెంకన్న:- ఈ కాస్తతో కొంప మునగదులే!

వెంకట్రావు:- మునిగినాసరే! ఈ పాడుపని నేను చెయ్యను.

వెంకన్న:- పాడుపనా? పోసీ! నువ్వు వెళ్ళకపోట్లా నీకుద్యోగం దొరకని మాట అబద్ధమా? ఎందుకూ పనికిరాని నీ చదువు, నా కష్టార్జిత మంతా హరించినమాట అబద్ధమా? పుసుం ఋణాల పాలైనమాట అబద్ధమా? ఇన్ని అబద్ధాలుండగా .యీ ఒక్క అబద్ధంతో భూమి బద్దలు కాదులే!

శేషమ్మ:- .....

వెంకన్న:- (విసుగ్గా) అబ్బబ్బ! వస్తాడులే! ఎందుకు గొంతు చించుకుంటావ్? నన్ను మాట్లాడనీ!

వెంకట్రావు:- ఎంత మాట్టాడినా యిదేగా ? వస్తున్నానమ్మా ! (లోపలికి వెళతాడు.)

వెంకన్న:- (విసుగ్గా) ఛీ ఛీ వెధవజన్మ ! ఈ పాడుబతుకు బతకటం కంటె కళ్లు రెండూ మూసుకొని రైలుకింద పడితే నయం.

వెంకటేశ్వర్లు:- (మధ్యలోవచ్చి, నవ్వుతూ) అది అంత తేలగా వుందనుకున్నావా వెంకన్నా ? ప్లాటుఫారం మీద పోటీలు పడుతున్నారు, ఆ చావు కోసం. ఎవరో తెలుసా ? పరీక్షల్లో తప్పి యింటిముఖం చూడలేక ప్రాణాల్ని తృణప్రాయంగా త్యాగం జేసే పిరపుత్రులు. నువ్వాపని చేయలేవుగాని నా మాట విని, వూరుకో !

వెంకన్న:- అవున్లే వెంకటేశ్వర్లూ ! నీ భయం నీది. నేను కాస్తొగుటుక్కుమంటే నీ బాకీ ఏమౌతుందో ననుకుంటున్నావు. సహజమేలే !

వెంకటేశ్వర్లు:- బలేవాడివే ! నా చెవులు కుట్టింది కూడా కంసాలే. పిచ్చివాడా ! భయం నాకెందుకయ్యా ? వుంటే బాకీలు ఎగేసే వాళ్ళకుండాలి గాని.

వెంకన్న:- నన్నెంత నీచంగా భావిస్తున్నావ్ వెంకటేశ్వర్లు? నీ బాకీని ఎగవేస్తానని అనుకుంటున్నావు ? నేనిప్పుడు లొంగుబాటులోవున్నాను కదాయని నీ చిత్తం వచ్చినట్టు మాట్లాడటం ధర్మం కాదు. ఆత్మాభిమానం నాకింకా వుంది. నువ్వనుకున్నంత పతనానికి నే నింకా దిగిపోలేదు. నాలుగు నెలలు ఓపికపట్టు, ఆఖాపైసలతో అవతల పారేస్తాను.

వెంకటేశ్వర్లు:- పారేస్తావుగా ? దర్జా అంతా వెలగబోతావే ? ఇప్పుడు పారేయ రాదు అంత మగతనముంటె? ఇల్లాంటి వాయిదా లెన్నైనాయ్ ? బతకని బిడ్డ బారెడని మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయ్ ! (ప్రకాశం హోల్డాల్‌తో వచ్చి అతని వెనగ్గా నిలబడతాడు) (బారలు జాపుతూ) మింగటానికి మెతుకు లేదుగాని మీసాలకు సంపెంగ నూనెట !

ప్రకాశం:- ఉందా సంపెంగనూనె (భుజంతట్టి అడుగుతాడు.)

వెంకటేశ్వర్లు:- (మాట్లాడడు)

ప్రకాశం:- నోము పెగట్టేం యిప్పుడు ? (వెళ్ళి హోల్డాల్‌ను పెట్టెమీద పెట్టి) నోటికివచ్చినట్టు పేల్తున్నావు. యిది నీ బాబుగాడి యిల్లా ?

వెంకటేశ్వర్లు:- ఎవరి బాబుగాడిల్లో రేపు దావా పడినప్పుడు తెలుస్తుంది.

ప్రకాశం:- (మీదికొస్తూ) ఏమిటి తెలిసేది నీ మొహం ?

వెంకన్న:- ఆగు ! ఇదో గొప్పనుకుంటున్నావా ? పో అవతలికి. ఇంటి కొచ్చిన వాళ్ళను గౌరవించాలని తెలీదూ ?

ప్రకాశం:- పీడ్నా ? వీడ్ని ఎలా గౌరవించాలో నాకే తెలుసు. (వెంకటేశ్వర్లుతో) మా నాన్నంటె నీకింత అలుసుగా వుందేం ? Take care !

వెంకటేశ్వర్లు:- ఇవిగోనండోయ్ వెంకన్నపంతులుగారూ ! ఇక క్షణం ఆగను. తేల్చి చెప్పండి తండ్రి కొడుకులు ?

వెంకన్న:- చెప్పానుగా నాలుగు నెలలాగమని.

వెంకటేశ్వర్లు:- పిల్లేదు వడ్డితోసహా కట్టాలిప్పుడే !

ప్రకాశం:- నోర్ముయ్ !

వెంకన్న:- నువ్వు నోరుముయ్యరా ప్రకాశం ! మధ్య నీ కెందుకురా ? పోవేం అవతలకి ?

ప్రకాశం:- నువ్వెడు నాన్నా ! ఆ అదిరిపాటేదో అంతుతేలుస్తాను.

వెంకటేశ్వర్లు:- ఏమిటోపు ! అంత మగతనముంటె టక్కరా నా పైకం? కక్కు? సొరకాయలు కాదు వూరికే కోసిపారెయ్యటానికి ? ఒకటా రెండా ? వెయ్యి రూపాయలు మీ మొహాన పోశాడు. అయ్యా, బాబూ అంటూ నా కాళ్ళావేళ్ళాపడితే యిచ్చానురా అంత డబ్బు ? ఆ డబ్బే నే నివ్వకపోతే అబ్బాయిగారికి రోగం బాగా కుదిరేది. బి. ఏ. కాదు, నుయ్యే గతయ్యేది.

ప్రకాశం:- (మీదికివస్తూ) రాస్కెల్ ఏం కూశావు ? పళ్లు రాల గొడతాను.

వెంకన్న:- (అడ్డుపడుతూ) ప్రకాశం ! నీకు పిచ్చెక్కిందా ఏమిరా ? చెప్పేది నీకుకాదూ ? నువ్వు మనిషివా పశువ్వా ?

ప్రకాశం:- వదులు నాన్నా, ఆ పశువు నాలుక పీకి పారేస్తాను.

వెంకదేశ్వర్లు:- (పంచ పైకి కడ్తూ) రారా కుంక ! ఒక్క దెబ్బతో నెత్తురు కక్కి చస్తావ్. వదలవోయ్ వాణ్ణి. వదులూ ?

ప్రకాశం:- ఇడీ రాస్కెల్ ! అబ్బా ! నువ్వు వొదులు నాన్నా ! ఏం కూళావు ?

వెంక దేశ్వర్లు:- రారా ముంద ! రా గుద్దుకు చంపుతా! రా .

[ఇద్దరినీ ఆగమంటాడు వెంకన్న. కొడుకుని ఆదమాయిస్తాడు. వెంకదేశ్వర్లును బ్రతిమాల్తాడు. కాని, యిద్దరూ విరు. మాటలు పెరుగుతాయ్. చేతులు కలస్తాయ్. చొక్కాలు చిరుగుతాయ్. వెంకన్న అడ్డుపడ్తాడు. కొన్ని దెబ్బలు వెంకన్నకు తగుల్తాయ్. ఆఖరున వెంకదేశ్వర్లు కొట్టిన దెబ్బతో వెంకన్న కూలబడతాడు. ప్రకాశం మితిలేని ఆవేశంతో వెంకదేశ్వర్లు మీదకు దూకబో తుండగా-వెంకట్రావ్ లోపల్నుంచి ఆదుర్దాగా వస్తాడు.]

వెంకట్రావు:- నాన్నా ! నాన్నా ! (దుఃఖం పొంగుతూ వుంటుంది.)

[అందరూ వెంకట్రావును చూస్తారు.]

వెంకట్రావు:- అమ్మ పలకటంలేదు స్మారకం తప్పుతోంది. త్వరగా రండి.

(వెళతాడు.)

[ప్రకాశం, వెంకన్న ఆదుర్దాగా లోపలికి వెళ్తారు.]

వెంకదేశర్లు - పాపం వూకేపోతుందేం ? దేవుడు లేడూ ? మంచి మర్యాదా లేకుండా యింటికొచ్చిన పెద్దమనిషి మీద కలబడతాడూ? చేతిలో పైసా లేకపోయినా పొగరుకేం తక్కువలేదు. ఇవ్వలేకపోతే చచ్చినట్టు పడుండాలి. తండ్రి కొడుకులు పచ్చి నా కాళ్ళమీద పడరాదూ-ప్రొనోటు నిక్కడే ముక్కలు జేసి పోతాను.

వెంకన్న:- (వికారంగా రెండు చేతుల్తో చరుదంపెడ్తూ వచ్చి) వెంకదేశ్వర్లూ !

ప్రకాశం:- (వచ్చి) నే వెళ్ళి డాక్టర్ను పిల్చుకొస్తాడు.

వెంకన్న:- మన యింటికి యిక డాక్టర్ రాడు.

ప్రకాశం:- ఏం ? వైద్యం చెయ్యటం మానుకున్నాడా ?

వెంకన్న:- ఆయన వైద్యం చేస్తూనే వున్నాడు. కాని ఏమీ చెయ్యలేని వాళ్ళం మనమే.

ప్రకాశం:- నా కేం understand కావటంలేదు. మన మేం చెయ్యాలంటారు?

వెంకటి:- నా బాకీ తీర్చాలంటారు. ఇప్పుడైనా అండర్‌స్టాండు ?

ప్రకాశం:- (పళ్ళుకొరుకుతూ తీవ్రంగా చూస్తాడు.)

వెంకన్న:- (బుజం తడుతూ) ఎందుకు నాయనా ఆ చేతగాని ఆవేశం ? కాలానికి తలవొగ్గటం నేర్చుకో. ఆదే మన పాలిట బ్రహ్మాస్త్రం. ఇతని వెయ్యి రూపాలకే ఇంత కంగారుపడితే ఎట్టా ? మనం శేషాచలం చెట్టికి మూడువే లివ్వాలి.

వెంకటి:- అమ్మబాబాయ్! కొంప ముంచావన్నమాట ఐ. పి. పెడతావాయేం వెంకన్నా ?

ప్రకాశం:- (దగ్గిరకెళ్ళి) చిత్తం ! తమ కంత కోరిగ్గావుంటే తప్పుతుందా ? ప్లీడర్ గుమాస్తావి. వ్రాయి పిటిషన్ ఐ.పి. పెడితే నీ కొచ్చేది వెంట్రుకలే; పిచ్చి పిచ్చి మాటలు మాని మర్యాదగా వుండు. (తండ్రితో) చెప్పు నాన్నా ! డాక్టరెందుకు రాడు ?

వెంకన్న:- రోగం వూరికే వచ్చిందని డాక్టరెట్టా పస్తాడు ? మన చేతిలో పైసా లేదు. అతనికూడా అర్థమయింది. మన యింటికి రాడు.

ప్రకాశం:- (కోపంగా) రాడో ? ఎట్టా రాడో నేనూ చూస్తాను ఫీజ్ యివ్వాలంటే తరువాత యిస్తాం. అమ్మకు ప్రాణం పోతుంటే చూస్తూ వూరుకుంటాడా ? పోనీ, మరొక డాక్టరును తెస్తాను.

వెంకన్న:- ఏం లాభంలేదు. ఆయన చీటీ యివ్వందే యే డాక్టరూ రాడు.

ప్రకాశం:- కనీసం మా చీటినైనా ఇవ్వమని అడుగుతాను.

వెంకన్న:- మనం ఆయనకు ఫీజంతా యివ్వందే ఆ చీటీ యిస్తాడు.

ప్రకాశం:- ఇక్కడ ప్రాణంపోతుంటే వీళ్ళు చూస్తూ ఊరుకుంటారా? వీళ్ళకు దబ్బేనా ప్రధానం? ఇందుకేనా వీళ్ళు మెడిసిన్ చదివింది? ఇందుకేనా మెడికల్ సీట్లకోసం వీరు ఆరాటపడుతోంది? ఆ చదువంతా

మానవసేవకాక్కదూ? డబ్బేనా వాడి ఆదర్శం? ఇంతకంటె హంతకులెవరు? రోగాలతో వ్యాపారం చేస్తూ, మేడలు కట్టించి రూపాయల మీద శయనించే ఈ డాక్టర్లను శిక్షించరేం? ప్రభుత్వం శాసనాలు చెయ్యదేం? ఔషు, ఎందుకు చేయాలి? బీదవాళ్లెందుకు బ్రతకాలి? ఇది ప్రజారాజ్యం! ఇది రామరాజ్యం!

తోటిమానవుల దుర్భవస్థలను గుర్తించని యీ డాక్టర్లకు హృదయం లేదు; అభిమానం లేదు; మానవత్వం లేదు.

వెంకటే:- తెలుసుకో ఇప్పటికైనా! నేను కాదు నోరుమూసుకొని పడుండటానికి-వాళ్ళు డాక్టర్లు. ఇంగ్లీషు డాక్టర్లు. ఇంగ్లాండ్ రిటర్న్డు—

ప్రకాశం:- Shutup !

(శేషాచం చెట్టి వస్తాడు)

(ప్రకాశం లోనికి వెళతాడు. వెంకన్నకూడా అతణ్ణి అనుసరిస్తాడు)

వెంకటే:- (చెట్టితో) వాడు తిట్టింది, ఎరిగినవుకున్నావు?

చెట్టి:- ఎవడో గడపాయిని! అయినా మన కెందుకు?

వెంకటే:- అవున్లే! మన కెందుకు? శేషాచలం!

చెట్టి:- అయ్యో!

వెంకటే:- నిన్ను చూస్తే, నాకు చాలా యిదిగా వుందయ్యో?

చెట్టి:- ఇదంటె?

వెంకటే:- అదే!

చెట్టి:- అదంటె?

వెంకటే:- చాలా జాలిగా వుంది. పాపం!

చెట్టి:- ఏం?

వెంకటే:- ఏవని చెప్పను?

చెట్టి:- ఏం చెప్పకు. ఊరుకో!

వెంకటే:- నీకుపయోగించే మాటైనా చెప్పొద్దా?

చెట్టి:- చెప్పు.

వెంకటే:- ఇంతాక వద్దన్నావ్! ఇప్పు డెందుకు చెప్పాలి?

చెట్టి:- నీ ప్లీడరు గుమాస్తా బుద్ధి చూపిచ్చావయ్యా. చెప్పనన్నావ్. చెప్పకన్నా-చెబుతానన్నావ్. చెప్పన్నా! చెప్పనూలేవు, మూసనూలేవు. భలే కాపనయ్యావు! ఎట్టాగయ్యా నీతో?

వెంకటే:- ఈ వెంకన్నపంతులు దివాలా పిటీషన్ పెట్టి బాకీ అన్నిందికి సున్నా చూదతారట-నీ బాకీ రామార్పణమే.

చెట్టి:- ఈ డాబులన్నీ నా దగ్గరనా? ఆ యెవవ పని ఆయ నెన్నడూ చెయ్యడు. ఇదిగో! మనలోమాట: నువ్వేమన్నా పెట్టమన్నావా?

వెంకటే:- ఛా ఛా! నే నెందుకు చెబుతాను?

చెట్టి:- అయినా నీ బాకిపోతే నాదీ పోతుంది.

వెంకటే:- నా దెంతలే! వెయ్యేగా!

చెట్టి:- నీది పోతేమాత్ర మేమిలే! కష్టపడి సంపాదిస్తేగా? పార్టీల నోట్లో దుమ్ముకొట్టినబాపతు. పోయినా ఏం ఫర్వాలేదు. మళ్ళి ఇట్టే సంపాస్తావు.

వెంకటే:- నువ్వో? కొరియా యుద్ధం పేరుతో రేట్లు పెంచి ప్రజలను మోసం చెయ్యాలా? మీవంతా పాపపుసొమ్మ్మ.

చెట్టి:- నిన్ను కదిలిస్తే అంతా కంపేనయ్యా! నీకు పుణ్యముంటుంది కాని యిక్కడేం పితలాటకం పెట్టకు. నా బాకీ సంగతి మేము చూసుకుంటాం.

వెంకటే:- నేకు వద్దంటేగా? చూసుకోండి. ఇప్పటివాతా నా వంతు. యిప్పటినుంచి నీ వంతు. ఏమిటో చూస్తాట్ట!

(వెంకన్న వస్తాడు)

అదుగో వచ్చాడు-వీడు—ఏం చూస్తావో? (వెంకన్నతో) చూపించవయ్యా చెట్టి? బాగా చూపించు!

వెంకన్న:- (ముందుకు వచ్చి గంభీరంగా) విరిగిన నడుంమీద రాయి వేస్తున్నావ్ వెంకటేశ్వర్లు! నన్ను అపహాస్యం చేయటం నీకు ఆనందమైతే, నేను చెప్పవలసిం దేంలేదు. కాని మన చిరకాల స్నేహం భగ్నమౌతున్నందుకు విచారిస్తున్నాను. గడచిన రోజుల్లైనా జ్ఞాపకం తెచ్చుకో! పదేళ్ళనాడు నువ్వూ నీ కుటుంబం పస్తున్న రోజులున్నాయ్. నా కొచ్చిన జీతమంతా నీ కెన్నిసారులిచ్చానో, దాని ఫలితంగా మా కుటుంబమంతా మీ పస్తుల్లో ఏ విధంగా పాలు పంచుకున్నామో నువ్వు మరచిపోవటం నా దురదృష్టం. ఈ రోజున నీ దృష్టిలో నేను ఒక దోమ కంటె హీనంగా కనబడుతున్నాను. క్యాలండర్‌లోని తేదీల్లాగా మనుష్యుల విలువలు యిట్టా మారిపోతాయని యీనాడే తెలుసుకున్నాను.

క్షమించు! ఏ వేవో అన్నాను. నీకు కావలసిందల్లా దబ్బు! ఇస్తున్నాను తీసుకోండి. పిత్రార్జితమైన యీ ఒక్క యింటిని వదల్లేక యిన్నాళ్ళు బాధపడుతున్నాం. ఈ బాధను తీర్చి పుణ్యం కట్టుకుంటే, యే చెట్టు నీడనో తలదాచుకుంటాం.

శేషా:- బాధపడకండి పంతులుగారూ! ఊరుకోండి. మీంకూడా మనుష్యులమె! వెంకటేశ్వర్లు! ఏమిటయ్యా నీ మాటలు? దేవుడెక్కడోలేడు. మన నీడలోనే వున్నాడు. మంచి అంటూ లేదటయ్యా నీకు? మంచోళ్ళ మనసు నొచ్చుకుంటంది. ఆ పుసురు వూరికేపోదు. పాతాళానికి పడిపోకు! జాగర్త.

వెంకటే:- అవునయ్యా? నా కళ్ళముందు పుట్టాను ఆ గుంట వెధవ! నా మీద కలబడటం న్యాయమేమో చెప్పుమను. అది నాకు అవమానంకాదేం?

వెంకన్న:- కాదు. ఆ అవమానం నాకి. (వచ్చి, రెండుచేతులు బట్టుకొని) నువ్వు నన్ను కొట్టావని నా కెంతమాత్రం బాధలేదు. కాని నేను బ్రతికుండగానే యీ యింట్లో నీ మనసుకు బాధకలిగిందే అని దుఃఖిస్తున్నాను. మా అందరిని క్షమించు.

(బయటనుంచి 'పోస్ట్' అను లేక వినబడుతుంది. ప్రకాశం వెళ్ళి జాబును తెస్తాడు.)

ప్రకా:- (వెటకారంగా) ఆల్లుడుగారి యేడుపే యిది. నాట్ పేడ్ వుత్తరం!

శేషా:- ఐలే ఆల్లుడే!

ప్రకా:- (కవరుచించి, వుత్తరం తీసి, చదువుతాడు) '...మామగార్కి నమస్కారములు. మీరు వ్రాసిన వుత్తరమందింది. ఐద్ధకంవల్ల సమాధానం వ్రాయట మాలశ్యమైంది. ఆత్తగార్కి జబ్బుగా వుందని, అమ్మాయిని చూడాలని కలవరిస్తుందని, వెంటనే మా యిద్దరిని Next train లో ఐయలుదేరి రమ్మని వ్రాశారు. కాని రైలు చార్జీలు అయినా పంపాలన్న విషయం మీ కెందుకు తోచలేదో తెలియటం లేదు. పెళ్ళిలో యిస్తామన్న మోటార్ సైకిల్ విషయంకూడా మీ జాబులో లేదు. అనవసరంగా కంగారు పడుతుందని మీ వుత్తరాన్ని మీ అమ్మాయికి చూపలేదు. దాని మనసు బాధపడటం నేను చూడ లేను కదా!

మరొక్క విషయం. నా మాట విని ఆత్తగారిని మద్రాసుకు వెంటనే తీసుకువెళ్ళి మండిప్పించండి. మోటార్ సైకిల్స్ అమ్మే షాపు, మౌంటురోడ్డులో స్పెన్సర్ కంపెనీకి దగ్గరగా వుంది. మీకు తీరిక లేకపోతే మీ పెద్దబ్బాయి వెంకట్రావును పంపండి. మీ ప్రకాశాన్ని మాత్రం వద్దు. వాడికీ విషయం చెప్పకండి. వాడొట్టి రౌడీ...'
(తండ్రితో) కొను మోటార్ సైకిల్? చెయ్యి మనియార్డరు? వ్రాయండి మరో ప్రోనోటు? డబ్బిచ్చే వాళ్ళిక్కడే వున్నారుగా? వాళ్ళకు వడ్డీ వస్తుంది. మనకు డబ్బొస్తుంది. అమ్మకు మందు అక్కర లేదు. మా అమ్మ పోయినా ఫర్వాలేదు. మీ ఆల్లుడుగారికి మాత్రం ఆగ్రహం రాకుండా చూచుకోండి. నేను రౌడీని, మీరు పెద్ద మనుష్యులు!

శేషా:- ఎంత లావు ఆల్లుడైనా అంత అదిరిపాటా? అడిగిన కట్నం పెళ్ళిలో ఇవ్వటం, పుచ్చుకోటం అయిపాయ. మళ్ళి ఇదేం బుద్ధయ్యా?

వెంక:- ఆల్లుడంటె మరేమనుకున్నావు? ఒకమాట కట్నమంటూ యిచ్చి దాని చూపించారు. ఇంకెందు కూరుకుంటాడు? పండగొస్తే కట్నం! పురుడు వస్తే కట్నం! రమ్మంటె కట్నం! పొమ్మంటె కట్నం!

ఎందొస్తే కట్నం! వానొస్తే కట్నం! అడగటం రివాజే, యివ్వటం విధాయకమే! ఇది బావి, ఆది చేద!

ప్రకాశం:- ఈ చేదకు తాడు తెగింది. నువ్వొచ్చి ముడెయ్యి.

(లోపల వెంకట్రావ్ ''అమ్మా! అమ్మా!'' అంటూ ఏడుస్తాడు. Back-ground music ఆరంభమౌతుంది. చెట్టి, వెంక టేశ్వర్లూ గోనికి వెళ్ళి ఓదారుస్తారు మాటంతో.)

(వెంకన్న నిశ్చేష్టుడై చూసి, రెండడుగులు వేసి, పోలేక ఏడుస్తాడు.)

చెట్టి:- (లోపలనుంచి కన్నీళ్ళు తుడుచుకుంటూ వచ్చి, వెంకన్నను చూస్తూ) మహాతల్లి! ఈ లోకంనుంచే వెళ్ళిపోయింది.

(వెంకన్న ఆవురుమంటాడు)

ఊరుకోండి పంతులుగారూ! మీరే దిగులుపడితే ఎట్టా? వెళ్ళి అబ్బాయిలకు ధైర్యం చెప్పండి. ఆ తల్లి కేంతక్కువ? పసుపు కుంకుమతో వెళ్ళిపోయింది. మహా పుణ్యాత్మురాలు!

వెంకటే:- (వచ్చి) సందేహమేమిటి? తన పొట్టెంత మాడ్చుకుందో, ఒళ్ళెంత విరుచుకుందో పక్కింటివాళ్ళకైనా తెలిసేదికాదు. ఎటువంటి మనసు ఆ యిల్లాలిది! మా యింట్లో పట్టెడన్నం కూడా లేనిరోజుల్లో, మా పిల్లల్ని తీసుకువెళ్ళి అన్నం వండపెట్టి, మిగిలిందేమైనావుంటే తన పిల్లలిద్దరికి తరువాత పెట్టేది. ఆమె సాక్షాత్తు అన్నపూర్ణ తల్లే!
(అంటూ చేతులెత్తి దండం పెడతాడు.)

(వెంకన్న కన్నీరు తుడుచుకుంటూ వుంటాడు)

ప్రకాశం:- (కన్నీరు ముంచెత్తిన ముఖంతో పచ్చి, తండ్రిని తీవ్రంగా చూసి) నువ్వుకూడా యేడుస్తున్నావె! అదంతా నిజమైన దుఃఖమేనా? అది నీ హృదయంనుంచే వస్తున్నదా? మా అమ్మను చంపిందెవరు? ఆఖరు చూపైనా నోచుకోని మా చెల్లెలి గొంతును కోసిందెవరు? ఇప్పుడు నీకు తృప్తి అయిందా? నీ హృదయం శాంతించిందా?

(వెంకన్న తలవంచుకొని వెళ్తుండగా, ప్రకాశం వెళ్ళి అడ్డంగా నుంచొని రెండు చేతులు చాపి)

చెప్పాలి సమాధానం? నువ్వు చేసింది ఒక గుమాస్తా ఉద్యోగం. నువ్వు చదివిందల్లా మెట్రిక్కు. మేం మాత్రం గ్రాడ్యుయేట్సు మవ్వాలి, మేం గెజిటెడ్ ఆఫీసర్లం కావాలి. నీ పేరు, నీ ఖ్యాతి పెరగాలి. ఇదికదూ నీ ఆశయం? నీ కొడుకులిద్దరూ ఆఫీసర్లని నలుగురికి చెప్పటం కదూ నీ సంతృప్తి?

(వెంకట్రావ్ వస్తాడు)

చిట్టిపేకతో మేడను కట్టావు! ఆది చిన్నగాలికే చితికిపోయింది. మనకంటె కూలివాడెంతో నయం. ఉన్నదాంతో తృప్తిపడటం వాళ్ళకు తెలుసు. శక్తికి మించిన ఆశలు పెట్టుకోవటం వాళ్ళకు చేతకాదు. అది మన కుటుంబాలకు బాగా తెలుసు, లేంది వున్నట్టు నటించటం మన జన్మహక్కు. ఇంట్లో చినిగిన గుడ్డలు, బైట జరీపంచెలు. మధ్యతరగతి కుటుంబాలు నాశనమవుతున్నాయంటె దానికి కారకులెవరు? బాధ్యులెవరు? ఇదేనా మీ ముందు తరాలవారికి నేర్పాల్సిన మహా విద్య?

ఇప్పుడేమ్చి యేం లాభం? ఎందుకూ పనికిరాని మా చదువుల కోసం ఆప్పుజేసి మన కాపరాన్ని పీధి కెక్కించావ్! అంతేగాని, మనందరికోసం నానా బాధలు పడిన మా అమ్మ, కదల్లేక మంచాన పడితే మందిప్పించి బ్రతికించుకోవాలని, అది మీ విధి యని తెలుసు కోలేదు. ఆ ఉద్దేశమే మీ హృదయంలో లేదు. మీ దసలు మానవ హృదయం కాదు. కటిక పాషాణం!

(వెంకట్రావ్ ప్రకాశాన్ని రెండు చెంపలు బాగా వాయిస్తాడు.)

వెంకట్రా:-నోటికొచ్చినట్టు మాట్టాడుతావుట్రా? ఆయనెవరని! నాన్నను పట్టుకొని అంతమాటంటావా? నాన్న అంత తేరగా ఉన్నాడనుకున్నావేం? నువ్వు పెరిగిందెక్కడ? నాన్న బుజాలమీద కాదు? నువ్వింతవాడివి అయ్యింది నాన్న చేతులమీదకాదు? నువ్వడిగిందల్లా తెచ్చియిచ్చిందెవర్రా? నాన్న కాదూ? మనిద్దరి చదువులతో కష్టా నాన్న చితికిపోయింది? నడవలేని స్థితిలో, ఆఫీసుకు కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి, ఆ రిక్షా డబ్బులు నాలుగు ఆణాలు నాన్న మిగిల్చిందెవరి

కోసంరా? పిల్లలపైన ఆయనకా మమతే లేకపోతే మనగతేమయ్యేది? ఈడొచ్చినవాడి కామాత్రం జ్ఞానముండాలి. విశ్వాసం లేనివాడు బ్రతికినా ఒకటే, చచ్చినా ఒకటే ఈ మాట బాగా జ్ఞాపకముంచుకో!

మన కాపురం ఒక బండిలాంటిది. ఆ బండికి నువ్వూ నేనూ రెండు చక్రాలం. ఆ బండికి ఇన్నేళ్ళూ లాగిన ముసలెద్దులు అమ్మ, నాన్న! ఆ బండి బరువుకు నడుం విరిగి అమ్మ చనిపోయింది. నాన్నను కూడా చంపాలనుకుంటున్నావ్!

ఆ కాస్త ప్రాణం పట్టుల్తూ అమ్మేం చెప్పిందో నీకేం తెలుసు? నా కన్నీరు తుడుస్తూ "ఎందుకు నాయనా యేడుపు? నాకేం తక్కువ? మీ చేతుల్లో చల్లగా దాటిపోతాను, కాని నాకు ఒక్కటే దిగులు. అది మీ నాన్న! ఆయన దేవుడులాంటివాడు. మీకు అప్పగించిపోతున్నా. జాగ్రత్తగా కాపాడుకోండి.....

ప్రకాశం:- (దుఃఖాన్ని ఆపుకోలేక, వెళ్ళి తండ్రి కాళ్ళపైన పడుతూ) నాన్నా! నాన్నా! నన్ను క్షమించు నాన్నా!

(వెంకన్న, ప్రకాశాన్ని లేవదీసి, తన హృదయానికి హత్తుకుంటాడు. వెంకట్రావు వెళ్ళి తండ్రిని కౌగలించుకుంటాడు.)

(చెట్టి, వెంకటేశ్వర్లు, తమ ప్రోనోట్లను చింపివేసి వెళ్తూవుండగా.)

వెంకన్న:- (వాళ్ళకడ్డంగా వెళ్ళి) ఆగండి! నన్నొక బిచ్చగాడినిగాచేసి వెళ్తున్నారా? ఇది మీకు న్యాయంకాదు. మీ ఋణాన్ని తప్పకతీరుస్తాను. ఈ ఇంటిని మీ బాకీకు తీసుకోండి. అంతేగాని, నన్ను బిచ్చగాడిని మాత్రం చెయ్యకండి.

శేషా:- ఊట్టా అనుకోకండి బాబూ! మా మనస్ఫూర్తిగా వదలిపెట్టాం.

(చెట్టి, వెంకటేశ్వర్లు వెళ్తారు)

వెంకన్న:- నేనొక బిచ్చగాడినా? అవును. నేను బిచ్చగాడినే. నా తండ్రొక బిచ్చగాడు. మా వంశమంతా బిచ్చగాళ్ళే!

(ప్రోనోటు ముక్కలను తీసికొని)

వెంకన్న:- (వెఱ్ఱివాడిలాగా) స్టాంపు బిళ్ళలు నవ్వుతున్నాయ్! ఈ చినిగిన కాగితం ముక్కలు నన్ను వెక్కిరిస్తున్నాయ్!

(వెట్టిగా నవ్వుతాడు-ఆ నవ్వు క్రమేణా ఆగిపోతుంది. నోరు వంకరపోతుంది. చెయ్యి పడిపోతూ వుంటుంది. మనిషి తూలిపోతూ వుంటాడు)

వెంకట్రా:- (పట్టుకుని) కొంప మునిగిందిరా ప్రకాశం! నాన్నకు పక్షవాతం వచ్చింది.

ప్రకాశం:- (వచ్చి తండ్రిని పట్టుకొని) నాన్నా! నాన్నా!

వెంకట్రా:- పద! నాన్నను హాస్పిటల్‌కు తీసుకువెళదాం! పద.

(లోనికి వెళ్ళి లాంతరు తెస్తాడు - ప్రకాశం వెంకన్నను బుజాని కెత్తుకుంటాడు-ముందు లాంతరుతో వెంకట్రావు, వెనుక తండ్రిని మోసుకుంటూ ప్రకాశం బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్తారు) గడియారం అరగంట కొడుతుంది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఆగిపోతుంది.

(తెర పడుతుంది)

మనస్తత్వాలు

రచన :
భమిడిపాటి రాధాకృష్ణ

పాత్రలు

రమణయ్య

రామం

సుందరం

రంగయ్య

హనుమంతరావు

విశాలాక్షి

కమల

[తెర తప్పుకోగానే ఒక ఇంట్లో హాలు కనిపిస్తుంది. హాలుకి వెనక మధ్యగా ఇంట్లోకి ఒక ద్వారం, హాలుకి కుడి ఎదర ఇంట్లోకి మరోద్వారం, హాలుకి ఎడమ ఎదర వీధులోకి ఒక ద్వారం ఉంటాయి. హాల్లో మధ్యగా Teapoyతో సహా సోఫా సెట్టు. కుడిమధ్యలో గోడకి దగ్గరగా cloth stand, దానిమీద ముఖ్యంగా రెండు, మూడు కోట్లు ఇంకా కొన్ని సాధారణమైన బట్టలూ ఉంటాయి. ఎడమ మధ్యలో గోడకి దగ్గరగా ఒక ఇల్లు. దానిపైద రేడియో, రేడియోపైద క్లైమ్‌పీస్ ఉండాలి. సమయం సుమారుగా సాయంత్రం అయిదు గంటల వుతుంది. మధ్యసోఫాలో రమణయ్య తాపీగా కూచుని, పెద్దసైజు సంస్కృత రామాయణం చేత్తో పుచ్చుకుని చదువుతూ, లీనమై, ఆనందిస్తూంటాడు].

రమ:- అహం శూర్పణఖానామ రాక్షసీ కామరూపిణీ। భగినీ రాక్షసేంద్రస్య రావణస్య మహాత్మనః ...ఓహోహో!...

[కుడి ఎదరలోంచి విశాలాక్షి వస్తుంది]

విశా:- ఏమండీ !-

రమ:- అహం శూర్పణఖా నామరాక్షసీ...

విశా:- బాగానే ఉంది మీవరస ! అయిదయింది, తెలుసా ?

రమ:- అబ్బా ! అయిదయిందీ ?

విశా:- (ఈసడింపుగా) అబ్బే ! మూడే అయింది.

రమ:- ఇంతేనా ! (మళ్ళీ చదువుకుంటూ) ఖరేణ సహితా...

విశా:- చాల్చాలు !- లేవండి ! (పుస్తకం లాక్కుంటూ) ఈ రామాయణం పుచ్చుగుని కూచుంటే మీకు మనుషులు కనపడరు.

రమ:- మనుషుల్లో ఏముందే అమానుషత్వంతప్ప !- రామాయణంలో ఉంది మోక్షానికి హైరోడ్డు.

విశా:- ఆల్లానేగాని, మీరు ముందు త్వరగా తెమలండి.

రమ:- ఎందుకూ ?

విశా:- సినీమాకి వెళ్ళద్దుటండీ ?

రమ:- ఎందుకూ ?

విశా:- అయ్యో, మీ 'ఎందుకు' బంగారంగానూ ! ఈవాళ మన కోదలు పుట్టినరోజూ కదుటండీ ? అందరం కలిసి సాయంత్రం సినీమా కెడదామనుకున్నాంగా ?

రమ:- అనుకున్నామా !-

విశా:- సరిపోయింది. చదవేస్తే ఉన్న మతి పోయించట !

రమ:- చెప్పే చదువులు అల్లానే ఉన్నాయిలే ! అన్నట్టు - సుందరం కాలేజీ నుంచి వచ్చాడా ?

విశా:- వాడూ, రామం కూడా వచ్చేవేళయింది. మీరు తెమల్డమే లేటం లేదు !

రమ:- (లేస్తూ) ఓమూల్నించి లేస్తూంటేనే చదువుతా వెందుకే ? ఆడవాళ్ళ నోటికీ గోదావరి వరదకీ అడ్డూ ఓడ్డూ లేదనుకుంటాను. మరి !...

[ఎడమ ఎదర ద్వారంలోంచి రంగయ్య వస్తాడు. చేతిలో సంచీ ఒకటి ఉంటుంది]

విశా:- ఏం, రంగయ్యా ! తెచ్చావా మిఠాయి ఉండలు ?

రంగ:- తెచ్చానండి.

విశా:- పీక కెన్నితూగాయి?

రంగ:- పదహారండి!-కాదండి, పదిహేనండి!

విశా:- ఇంతే!-తక్కిడకింద చింతపండూ అదీ అంటించాడేమో చూశావా?

రంగ:- (నమ్మకట్టు) మిఠాయిఉండలో చింతపండు ఎందుకు పేస్తాడండీ?

విశా:- తెలివి తెల్లారినట్టేవుంది!—

రమ:- పోన్లే! జీడిపప్పు భాగావేశాడా?

విశా:- (విసుగ్గా) ఆ, ఆన్నీ వేశాడుగాని. ముందు మీరు నడవండి! (కుడి ఎదరకుతిరిగి) కమలా!-కమలా !- ('వస్తున్నా!' అని సమాధానం వస్తుంది) రంగయ్య వచ్చాడు, చూడు!

[రమణయ్య, విశాలాక్షి మధ్యగదిలోకి వెళతారు. కుడి ఎదర ద్వారంలోంచి కమల వస్తుంది. రంగయ్య బుర్రగోక్కొని ఆలోచిస్తుంటాడు.]

కమ:- తీసుగొచ్చావా, రంగయ్యా!

రంగ:- చిత్తం ! - కానండి, అమ్మగారూ! అందులో ఓ ముక్క చిదిపి రుచిచూడండి!

కమ:- ఎందుకూ?

రంగ:- చూడండి, చెబుతాను!

కమ:- ఏం?-విశేషం ఏమన్నా ఉందేమిటి? (పొట్లంపైన చింపి, ముక్క చిదిపి, తింటుంది.) బాగానేవుంది!

రంగ:- మరి, చింతపండు ఉందాండి, అందులో?

కమ:- మిఠాయిఉండలో చింతపండు ఏమిటోయి, మతిపోయిందేమిటి?

రంగ:- లేదండి. నేనూ అల్లానే అడిగితే నాకు మతిలేదన్నా రండి!

కమ:- (నవ్వి) ఎవరూ?

రంగ:- (నవ్వుతూ) పెద్దమ్మగారండి!

కమ:- (నవ్వుఆపేసి) సరేలే!- నువ్వు ముందు సుబ్బారావు దగ్గరికెళ్ళి ఫొటోలు అయ్యాయేమో తీసుకురా!

రంగ:- సుబ్బారావాండి?

కమ:- ఫొటోగ్రాఫరోయి!-మొన్న మనందరికీ గ్రూపు ఫొటో తియ్యలేదూ?

రంగ:- అందులో నన్ను ముందు కూచో పెట్టాడూ?

కమ:- అవునే!

రంగ:- ఆ!-ఆ పక్కమేడలోకి కొత్తగా వచ్చాడూ?

కమ:- అతనేనోయి!

రంగ:- అవునండి, తెస్తాను.

కమ:- త్వరగా, రా!-సినిమాకెళ్ళాలి.

రంగ:- చిత్తం!-చిటికెలో వచ్చేస్తానండి.

[రంగయ్య ఎడమ ఎదరలోంచి వీధులోకి వెళతాడు. కమల పొట్లంసంచీ పుచ్చుగొని ఉత్సాహంగా మధ్యగదివైపు వెడుతూంటే, ఎడమ ఎదరలోంచి పుస్తకాలు పుచ్చుగుని సుందరంవస్తాడు. వస్తూనే రేడియోబల్లమీద పుస్తకాలు పడేస్తాడు.]

సుంద:- ఏం వదినా! ముస్తాబయిందా? (బాగాపీల్చి) ఊ! ఆ పొట్లం ఏమిటీ?

కమ:- పొట్లానికేంగాని, టిక్కట్లు దొరికాయా?

సుంద:- టిక్కట్లకేంగాని, పొట్లం ఏమిటో చెబుదూ!

కమ:- టిక్కట్లు తస్తేనే పొట్లంలో వాటా!- తెచ్చావా?

సుంద:- ఏమనుకున్నావు. మరి! పొద్దున్న ఎడ్వాన్సు బుకింగు దగ్గరికి, నే వెళ్ళేటప్పటికి అక్కడ జనమే లేదు!

కమ:- ఎంచేత?

సుంద:- బుకింగే లేదు.

కమ:- అదేమిటీ?

సుంద:- టిక్కట్లయిపోయాయి.

కమ:- మరెల్లా?- నువ్వన్నీ ఇల్లానే చేస్తావు?

సుంద:- కోపగదకు మరీ!- నేను ఆమటుగా మేనేజరు దగ్గరకెళ్ళి, ఏమయ్యా! తొమ్మిది గంటలనుంచి, పదకొండు గంటలదాకా ఎడ్వాన్సు బుకింగు ఉంటుందని బోర్డు కట్టారు పది గంటలకే మూసెయ్యడానికి మీ కేమధికారం ఉంది? మా అన్నయ్య N.G.O మా వదిన G.O. ఏమనుకుంటున్నారోగాని, అసి దులిపేశాను-

కమ:- ఈ కబుర్లకేంలే!- అసలు సంగతి చెప్పు!- టిక్కట్లు తెచ్చావా, లేదా?

సుంద:- అదే చెబుతున్నా. విసుకురీ!- అని దులిపేశాప్పటికి వాళ్ళు రాలిపోయాడు. (కమల కోపంగా వెళ్ళిపోబోతుండి) వదినా, వదినా!- అంత కోపం ఎందుకు వదినా!- ఇదుగో టిక్కట్లు

కమ:- నాకెందుకూ? నీదగ్గిరే ఉంచు.

సుంద:- సరే! మరి పొట్లంలో వాటా ఏదీ?

కమ:- తెస్తానుగాని, నువ్వు త్వరగా తయారవు. బైలుదేరుతోంది.

సుంద:- ఓ, రెండు నిమిషాల్లో రెడీ!- అన్నట్టు, వదినా! ఆఫీసునుంచి అన్నయ్య వచ్చాడా ? (అంటూ టిక్కట్లు రేడియో బల్లమీదున్న పుస్తకాల్లో పెడతాడు.)

కమ:- ఇంకా రాలేదు.

సుంద:- సీకేమన్నా ప్రెజంటు కొంటానికి బజారుకెళ్ళేడేమో?

కమ:- ఆ, ప్రెజంట్లు కూడాను ! వీధులో కేడితే అసలు ఇంట్లోవాళ్ళు జ్ఞాపకం వుంటారా, మీకూ?

సుంద:- ఇంట్లోవాళ్ళని జ్ఞాపకం ఉంచుకుని వీధులో కెడితే ఆ వుద్యోగంకాస్తా పీకేసి ఇంటికి పంపించేస్తారు, తెలుసా?

కమ:- తెలుసు, తెలుసు! నువ్వు మాత్రం త్వరగా తెములు,

[కమల, కమల వెనక్కాల చిరునవ్వుతో సుందరం మధ్య గదిలోకి వెడతారు. మరుక్షణంలోనే సుందరం తువ్వాయి భుజంమీద వేసుగుని వచ్చి ఉత్సాహంగా తుడిఎదరలోకి వెడతాడు. వెంటనే ఎదమ ఎదరలోంచి రామం వస్తాడు. చేతులో చిన్న పేకెట్ ఉంటుంది. కమలని పిలవబోయి ఆగి, ఆలోచించి ఉత్సాహంగా తలపంకించి, కోటుజేబులో ఆ పేకెట్ దాచుకొని, కోటుతీసి స్టాండుకి తగిలిస్తాడు.]

రామం:- కమలా! కమలా!

కమ:- (మధ్యగదిలోంచి వచ్చి) ఎంతసేపయింది, మీరు వచ్చి?

రామం:- ఈ ఆప్యగస ఎవరు? ఇది ఏలోకం?

కమ:- (చిరాగ్గా) ఉత్తభూలోకం. ఇంటి అద్దె 40 రూపాయలు!-ఇంత ఆలస్యం చేశారేం ?

రామం:- (నిట్టూరుస్తూకూసుని) ప్రేమలోఉన్న సౌరభ్యం కొంచెమైనా తెలియదే, ఈ ఆడవాళ్ళకి!- ఈవాళ ని పుట్టినరోజుగదా అని-

కమ:- (ఉత్సాహంతో) అని!-

రామం:- చచ్చీచెడి తిరిగి—

కమ:- (ఇంకా ఉత్సాహంగా) తిరిగి!-

రామం:- తిరిగి చక్కావచ్చాను.

కమ:- (విసుగ్గా) అబ్బ, చెబుదురూ!-ఏంకొనుక్కొచ్చారు?

రామం:- ఎల్లాచెప్పనూ? మూడ్ అంతా చెడగొట్టేశావు.

కమ:- (చిరికోపంతో) పోన్లే దాచుగోండి! కోటేదీ? (స్టాండు కేసి తిరిగి, గ్రహించినట్లు నవ్వుకొని) సరే!-శ్వరగా తయారవండి, సినీమా కెళ్ళాలి.

రామం:- (బూట్లువిప్పుకుంటూ) సుందరం టికెట్లు తెచ్చాడా? (కమల మెల్లగా కోటుస్టాండు దగ్గరకువెళ్ళి కోటు వెతకబోతుంది. రామం చూస్తాడు) ఏయి, కమలా!-నా కోటుదగ్గరకి వెళ్ళకు!

కమ:- (దొరికిపోయినట్టు నవ్వుతూ) మగవాళ్ళకి అన్నీ అనుమానాలే!-అయినా మీ కోటుతో నాకేంపని? (కిందనున్న Sandals తెస్తూ) మీ చెప్పులు తీసుగు వస్తున్నాను.

రామం:- నీ ఎత్తులు నాకు తెలుసులే! (అని లేచి Sandals తొడుక్కుంటూ) రంగయ్యేడీ?

కమ:- వీధులో కెళ్ళాడు. ఇప్పుడే వస్తాడు. (అంటూ బూట్లు స్టాండుదగ్గర పెట్టి) మీరు నడవండి!

రామం:- అబ్బే, ladies first అన్నారు! ముందర నువ్వు నడు!

[కమల రామం చిరునవ్వులతో మధ్యగదిలోకి వెడతాడు. కుడి ఎడరలోంచి స్త్రీరంగయ్య మెల్లిగా వచ్చి, ఇటూఅటూ చూసి, ఉత్సాహంతో తన బనియను జేబులోంచి ఓ ఫోటోతీసి, చూసుగుని, బరువుగా సిట్టూరుస్తాడు]

రంగ:- ఫోటోచూడగానే చెక్కెయ్యాలనిపించింది. ఈ పిల్ల ఎవరోగాని, ఇంటికొచ్చేలోపల మూడులారీలకింద పడేవాణ్ణి!- ఏమి అందం!- ఏమి అందం!- ఆ చూపు చూడు. తస్సాదియ్యా!- ఫోటోగ్రాఫర్నేనా అయ్యానుకాదు, ఖర్మ!

(ఆసి ఫొటోచూస్తూ మెచ్చుగు.టూ ఉత్సాహంగా తిరుగుతుంటాడు. ఎడమ ఎదరలోంచి ''రంగయ్యా! రంగయ్యా!'' అని విశాలాక్షి కేక దగ్గరగా వినిపిస్తుంది. ఎడమ ఎదర ఉన్న రంగయ్య, ఆ కేక విని, హడిలిపోయి, ఫొటో కేసి భయంగాచూసి, ఫొటోపట్టిగెళ్ళి, రేడియో బల్లమీద సుందరం పెట్టిన పుస్తకాల్లో దాచేస్తాడు)

విశా:- (ఎడమ ఎదరలోంచివచ్చి) ఏం, రంగయ్యా?—

రంగ:- ఏమిండీ?—

విశా: (కోపంగా) ఎక్కడి కెళ్ళావు?

రంగ:- (కంగారుగా, వెంటనే) ఎక్కడి కెళ్ళానూ?

విశా:- నేను నిన్నడిగితే, నువ్వు నన్నడుగుతావేమిటి?

రంగ:- అదేనండి?- ఫొటోలు తెమ్మంచే ఫొటోగ్రాఫరు దగ్గిర కెళ్ళానండి.

విశా:- తెచ్చావా?

రంగ:- లేదండి. కాని రేపు తప్పకుండా ఇస్తానన్నాడండి!

విశా:- ఆ, నువ్వెడితే అసలు ఏ పనీ అవదు. అదిసరేగాని, ఎన్నిసార్లు చెప్పాలి నీకు? నీళ్ళగదిలో నీకు పెట్టవేం?

రంగ:- (పుస్తకాలకేసి బాధగాచూస్తూ) ఎందుకండీ?

విశా:- ఎందుకేమిటోయి?- మతిగాని పోతోందేమిటి, నీకు!

రంగ:- (నీరసంగా నవ్వి) అబ్బే, లేదండి!

విశా:- చాలు, చాలు!- ముందు నీళ్ళు పెట్టు!- అవతల అయ్యగారు నుంచున్నారు.

రంగ:- చిత్తమండి!

విశా:- చిత్తమని అక్కడే తచ్చాడతావేమిటీ?- వెళ్ళుముందు!

(ఇక లాభంలేదనుకుని, రంగయ్య బాధగా, కుడి ఎదరలోకి వెడతాడు. మధ్యగదిలోంచి కమల ఉత్సాహంగా వచ్చి, కోటుస్టాండుకేసి వెళ్ళబోయి, విశాలాక్షినిచూసి, ఆగిపోతుంది.)

ఏమే కమలా!- మీ ఆయన వచ్చాడా?

కమ:- ఆ, వచ్చారు!

విశా:- (కమలని, పరీక్షగాచూసి) ఆదేమిటే కమలా! నెక్లెసు పెట్టుగోలేదేం?

కమ:- (కొద్దిగానవ్వి) ఏంలేదండి'- సినిమా కెడుతున్నాం గదా, అని!-

విశా:- సినిమాకెళితే మాత్రం? చేయించుగున్ననగలు పెట్టుగోడానికి కాక పోతే, పెట్టిలోపెట్టి పూజించుకోడానికిటే? లోపలికి, నడు!-

కమ:- (ఆదుర్దాగా, నవ్వి) ఎందుకూ?- నేను పెట్టుగుంటాను లెండి!-

విశా:- ఈ కబుర్లు నాకు తెలుసులే! నగలెట్టుకుంటే నామోషి అన్నట్లు ఇదవుతారేమిటే, మరీనూ!- ఆదేమీ పిదరము ముందు నాతోరా? (విశాలాక్షిమాటకి ఎదురుచెప్పలేక, కమల, విశాలాక్షి వెనకాలే మధ్యగదిలోకి వెడుతుంది. కుడి ఎదరలోంచి సుందరం తున్నాల్తో మొహం ఆద్దుకుంటూ మధ్యగదిలోకి వెళ్ళిపోయి, పక్కకితిరిగి, రేడియోఐల్లమీద ఉన్న తన పుస్తకాలు తీసుగుంటూ, టిక్కట్లకోసం పేజీతెరవగానే ఫొటో కనిపిస్తుంది. ఆ ఫొటోకేసి ఆశ్చర్యంగా చూసి పుస్తకాలు అక్కడే ఉంచేసి, ముందుకివచ్చి, ఫొటో పరీక్షగా చూసి, ఉత్సాహంగా ఈలేసి కుడి మధ్యకు నడుస్తూ.)

సుంద:- అరే! - ఎవరీభామ? - ఎప్పుడూ చూళ్ళేదే! - నా పుస్తకంలోకి ఎల్లా వచ్చింది, చెప్మా!-చంద్రుణ్ణి వెక్కిరించే ఆ అందం!-హృదయాలు హరించే ఆ వాలుచూపులు!-సర్వం మరిపించే ఆ చిరునవ్వు!-ఎవరు, భామా, నువ్వు? ఎద్రసేనా లేదే!-

[అంటూ ఇటూ అటూ తిరగేస్తూంటే మధ్యగదిలోంచి 'ఇప్పుడే వస్తాను' అన్న కమల మాటలు చాలా దగ్గరగా వినిపిస్తాయి. సుందరం ఆగి, ఫోటోకేసి చూసి భయపడి, 'బాబో, వదిన!' అని కంగారుగా చూసి, తనకి పక్కగా స్టాండుమీదున్న కోటుజేబులో ఆ ఫోటో పడేస్తాడు. కమల ఉత్సాహంగా వచ్చి, సుందరాన్ని చూసి, విసుగ్గా నిట్టూరుస్తుంది]

కమల:- నువ్వున్నావా, ఇక్కడ!-మీ అమ్మగారు పిలుస్తున్నారు.

సుంద:- ఆ, ఆవిడకేం పన్లేదు!-(అని కుర్చీలో కూచుంటాడు)

కమ:- ఆదికాదు, అర్జింటుగా రమ్మంటున్నాడు.

సుంద:- (విసుగ్గా) ఎందుకూ?

కమ:- ఏమో, నాకేం తెలుసూ?

సుంద:- సరే, వస్తున్నానని చెప్పు!

కమ:- (చిరికోపంతో) ఇది చెప్పడానికి ఒకళ్ళా? లేచి త్వరగా వెళ్ళు!

సుంద:- (విసుగ్గా లేచి) ఆవిడ చాదస్తం నీకు తెలుసుగదా, వదినా!- నీక్కూడా ఇంత కంగారయితే ఎల్లా?

కమ:- (Nervous గా నవ్వి) నాకేం కంగారూ? - బాగానే ఉంది!-(దబాయింపుగా) ఆయినా పిలుస్తూంటే ఓసారి వెళ్ళకూడదూ?- నువ్వికక్కడ వెలగబెట్టే రాచకార్యం ఏమిటీ?

సుంద:- (Nervous గా నవ్వి) ఏముంది?-ఏంలేదు!-వెడుతున్నా!-

[సుందరం బాధగా, భయంగా, కోటుకేసి చూసి, తప్పదుగనుక మధ్యగదిలోకి వెడతాడు. కమల ఉత్సాహంతో నవ్వుకుంటూ గబగబా కోటు దగ్గరికి వెడుతుంది. జేబులో చెయ్యి పెట్టగానే ఫోటో తగులుతుంది. ఏమిటో అనుకుని ఇవతలికి తీసి చూసి, తెల్లబోతుంది. 'ఆ!-' అంటూ నిశ్చేష్టురాలైపోతుంది. కళ్ళమ్మట నీళ్ళు కారతాయి. మధ్యగదిలోంచి ''కమలా!-కమలా!-'' అన్న రామం కేక వినిపిస్తుంది. కమల కంగారుగా ఫోటో మళ్ళీ ఆ కోటు జేబులోనే పడేసి, బాధగా సోఫా దగ్గరికి వచ్చేసి, కళ్ళు తుడుచుకుని ఏడుపు ఆపుకుందుకు ప్రయత్నిస్తుందిగాని ఏడుపు ఆగదు]

రామం:- (మధ్యగదిలోంచి వచ్చి) ఇక్కడున్నావా కమలా?- ఊ! మొత్తానికి గడుసుదానివే!- బయటికి చూశావా? (చిరునవ్వుతో) అయినా ఆడవాళ్ళకి తొందరెక్కువ!

కమల:- (రోషంగా, ముందుకు నడుస్తూ, ఏడుస్తూ) ఆ! మగవాళ్ళకి హృదయా లెక్కువ!

రామం:- (స్టాండుమీదున్న కోటుతెచ్చి, పేకెట్ తీస్తూ) అదేమిటి? నచ్చలేదా?

కమల:- (వెనక్కి తిరక్కుండానే) మీరూ ఇల్లాంటివారనుకోలేదు.

రామం:- ఇదీ నచ్చకపోతే ఇంకెల్లా?-చూడు, ఎంత బాగుందో! ముద్దొస్తోంది!

కమ:- (తీవ్రంగా) చాలు, మాట్లాడకండి !

రామం:- (తెల్లబోయి) అదేమిటి, కమలా ?

కమ:- (విసురుగా వెనక్కితిరిగి) ఏమీ ఎరగనట్లు మాట్లాడతారేం ?

రామం:- (విసుగ్గా) ఏమిటి నువ్వనేది ?

కమ:- (ఏడుస్తూ) మీరే నా దైవం, నా సర్వస్వం అనుకున్నాను. ఈ జీవితానికి ఇహంపరం అన్నీ మీరే అని నమ్ముకున్నాను-(ఆవేశంతో) అందుకు నాకు ముట్టచెప్పవలసిన ప్రతిఫలం ఇదేనా ?

రామం:- అల్లా మాట్లాడతామేమిటి కమలా ? ఇప్పుడు నేను చేసిన లోటేమిటి?

కమ:- (నమ్మలేనట్టు చూస్తూ) ఎంత నిబ్బరంగా అడుగుతున్నారు !- ఎంత మోసం నేర్చుకున్నారు !

రామం:- నీ మాటలు నాకేమీ అర్థమవటం లేదు కమలా ?- నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా ?- నీ మాటలు నన్నెంత గాయపరుస్తాయో ఆలోచించావా ? గుండెలు పగలకొట్టడం సులభం కాని, అతగడం కష్టం కమలా !

కమ:- (మొండిగా) ఆ కష్టం పగలకొట్టేవాళ్ళకి ఏం తెలుస్తుంది ?

రామం:- (కోపంగా) చాలు, కమలా!-

కమ:- (భయపడి రామం దగ్గరగావచ్చి, కంగారుగా చూస్తూ, దణ్ణంపెట్టి ఏడుస్తూ) మీకు దణ్ణం పెడతాను-మెల్లిగా మాట్లాడండి, ఎవళ్ళైనా వింటారు.

రామం:- (కోపంగానే) వింటే తప్పేముంది ?- (ఎవళ్ళైనా వస్తున్నారేమోనని కంగారుగా ఇటూ అటూ చూసి, ఏడుస్తూ మధ్యగదిలోకి వెళ్ళిపోతుంది) నీ మస్తత్వం ఎంత సంకుచితమో తెలుస్తుంది. తెచ్చిన ఐహామతికన్నా ఇచ్చిన హృదయాన్ని చూసి పుచ్చుగోడం సంస్కారం!- సరదాంకేనా సరిహద్దులుండాలి. (తిరిగివచ్చిసోఫాలో కూచుంటూ) ఎంత పని చేశావు, కమలా!-ఆభరణాలమీద ఆపేక్ష ఆడవాళ్ళని, రాళ్ళల్లా మారుస్తుంది గావును! (బాధపడుతూ) ఛీ!-

(అని విసుగుగా లేచి కోటు తొడుక్కుంటాడు. వాచీ, పేకెట్‌లో పెట్టి జేబులో పడేస్తూ, చేతికి తగిలిన ఫొటో ఇవతలకి తీసిచూసి ఆశ్చర్యపడతాడు) ఎవరీ ఆమ్మాయి?-ఎప్పుడూ చూసిన జ్ఞాపకమేనా లేదే!- నా జేబులోకి ఎల్లా వచ్చింది చెప్మా ? కమల చూస్తే ఎంత గొడవ!...

[మధ్యగదిలోంచి విశాలాక్షి విసురుగా, ''రామం!-రామం!-'' అని పిలుస్తూ వస్తూవుంటుంది. రామం విని, కంగారుపడి, భయంగా 'అమ్మ!' అని ఫోటో కేసి అదుర్దాగా చూసి, కోటుజేబులో దాచుగో బోయి, భయపడి, ఎదురుగుండా ఉన్న రామాయణంతో దాచేసి, బెదురుగా కూచుంటాడు.]

విశా:- (పచ్చి, కొంచెం కోపంగా) ఏరా, రామం!- ఏమిటిది?

రామం:- ఏదమ్మా!

విశా:- పుట్టినరోజునాడు దాన్ని అల్లా ఏడిపిస్తావెందుకురా?

రామం:- నేను ఏడిపించానూ?

విశా:- లేకపోతే అదెందుకు ఏడుస్తోంది?

రామం:- ఏమో, వెళ్ళి దాన్నే అడుగు!

విశా:- చదువుకున్నవాడివి, నీకూ అంత మూర్ఖత్వమైతే ఎల్లా నాయనా ?

రామం:- లేకపోతే ఏమిటమ్మా ఇది? తను పుట్టినరోజుగదా అని ముచ్చటపడి నేను ప్రెజంటు తెస్తే, ఇదేనా వరస ?

విశా:- ఏం, నచ్చలేదందా ?

రామం:- ఇంకా అనాలేమిటి?

విశా:- పోనీ, నచ్చిందే తీసుగొస్తా ననలేకపోయావు?

రామం:- నేను అనలేదు !

విశా:- ప్రతివిషయానికీ పంతాలకి పోతే సంసారాలు ఎల్లా నడుస్తాయిరా?- ఎవరో ఒకరు తగ్గడం నేర్చుకోవాలి. వెళ్లు!-దానికి ఏమిష్టమో కనుక్కో!- అదే తెస్తానను!- ఇంటికోడలు పుట్టినరోజునాడు, కంట తడి పెట్టడం మనకే శ్రేయస్సు కాదు!

రామం:- అయితే ఇంకదాని పంతానికి అర్థంలేకపోయినా సరే అంటావు !

విశా:- (విసుగ్గా) అర్థంలేని పంతం గురించి, నీకుమాత్రం పంతం ఎందుకురా?- ఎవరైనా వింటే నవ్వుతారు కూడాను. జరిగింది చాలుగాని, వెళ్ళి దానికి నచ్చజెప్పి తీసుకురా!- వెళ్ళు-

[రామం ఇంక ఎదురు చెప్పలేక కదలబోయే సమయానికి విశాలాక్షి రామాయణం తియ్యబోతుంది.]

రామం:- (కంగారుగా) అమ్మా!-

విశా:- (రామాయణం బల్లమీద ఉంచేసి) ఏరా?-

రామం:- ఏం లేదు!-

విశా:- ఏం లేదంటూ అక్కడే నిలబడతావేరా?- వెళ్ళు లోపలికి?

రామం:- సరేనమ్మా!

[ఇంక ఏం చెయ్యాడానికి తోచక, నిట్టూర్చి రామం మధ్యగది లోకి వెడతాడు.]

విశా:- ఆ తండ్రికి కొడుకు కదూ వీడూ !- దురుసుతనం బిరుసుమాటలూనూ!- ఏం సంసారాలో ఏమిటోగాని విసుగేసుకొస్తోంది! (ఇంతలో మధ్యగదిలోంచి సుందరం గబగబా కోటుస్టాండు దాకా వచ్చి, తల్లిని చూసి, తెల్లబోయి, పెద్దపనున్నట్టు కుడిఎదరకి బయల్దేరతాడు) ఏంరా, సుందరం?

సుంద:- (ఆగి) ఏం, అమ్మా!-

విశా:- ఇంకా అల్లానే తిరుగుతున్నావేరా?

సుంద:- ఇంకొతసేపమ్మా, రెండు నిమిషాలు! మొహం కడుక్కుని వచ్చేస్తాను.

విశా:- ఇప్పుడేకదురా కడుక్కుని వచ్చావ్?

సుంద:- (తలగోక్కుంటూ వెట్టిగా నవ్వి) అదే!- ఇప్పుడే తలకి అయిల్ రాసుగున్నాను. చేతులకి జిడ్డయింది. మొహం కడుక్కుని వచ్చేస్తాను!

విశా:- చేతులకి జిడ్డయితే మొహం కడుక్కుంటావ్?

సుంద:- అదేంటమ్మా!- మొహానికి జిడ్డయింది; చేతులు కడుక్కుని వచ్చేస్తాను' (అని హడావుడిగా కుడి ఎదరలోకి వెళ్ళిపోతాడు.)

విశా:- సినీమా హడావుడిలో పీకకి మతిగూడా పోతున్నట్టుంది! (అని ఎదురుగా వున్న రామాయణం లేస్తుంది. పేజీలు తిరగేస్తుంటే ఫొటో కనిపిస్తుంది. విశాలాక్షి తెల్లబోయి ఫొటో తీసి, పరీక్షగాచూసి మరీ తెల్లబోయి) అ!- ఇది ఎవత్తీ?- ఎంత దారుణం! ఎంత దారుణం! వయస్సు ముదిరినా బుద్ధి పాకినట్టులేదు ఈ ముసలాయనకి!...సిగ్గు లేకుండా ఎల్లా నవ్వుతోందో, ఈ పిసుగు! దీన్ని రామాయణంలో దాచుకుని, పైకి చదువుతున్నట్టు నటించి, చూసుకుని తెగమురిసిపోతున్నట్టున్నాడు!- ఎహెవ్వ!- ఎంత అప్రతిష్ట!- అందుకనేగావును, పుస్తకం వదిలిపెట్టడం కూడా మానేశారు!- రానీ చెప్తాను! (అని కోపంతో తలపంకిస్తూ, ఫొటో రామాయణంలోనే ఉంచేసి, పుస్తకం Teapoy మీద పడేస్తుంది. రంగయ్య కుడి ఎదరలోంచి వచ్చి, బాధగా విశాలాక్షిని చూసి రేడియోఅల్లపైపు ఏమీ ఎరగనట్టు నడుస్తూంటాడు. విశాలాక్షి రంగయ్యని చూస్తుంది)... రంగయ్యా!

రంగ:- (గతుక్కుమని) ఆఁ, ఏమండి, అమ్మగారూ !-

విశా:- (కోపంగా) మీ అయ్యగారు నిళ్ళోసుకోడం అయిందా ?

రంగ:- ఏ- ఏ అయ్యగారండీ .

విశా:- (విసుగ్గా) పెద్ద మొగాడోయి !-

రంగ:- అయిందండీ!- ఇది మిప్పుకుంటున్నారు !

విశా:- (కోపంగా లేస్తూ) ఆపుడు మరి. షోకు చాల్దూ :-

[అంటూ విసురుగా మధ్యగదిలోకి చక్కాపోతుంది. రంగయ్య హాయిగా నిట్టూర్చి, గబగబా రేడియో దగ్గరకెళ్ళి, అల్లిమీద ఉన్న పుస్తకాలు ఒక్కొక్కటే తీసి, పుస్తకంపళంగా దులిపేస్తూ, తన పట్టుకుంటూ ముసిముసిగా నవ్వుకుంటూంటాడు. కుడిఎదరలోంచి ఎవరో వస్తున్న అలికిడి వినిపిస్తే, హడలిపోయి ఇవ్వేదగ్గర పడేసినట్టు చతికిల పడతాడు.]

సుంద:- (కుడి ఎడరలోంచివచ్చి, రంగయ్యని చూసి, విసుగ్గా తలకొట్టుకుని) ఏం రంగయ్యా !- అక్కడ కూచున్నావ్ ?

రంగ:- ఏం లేదండి, ఐద్ధకంగా ఉందనీ-

సుంద:- ఏం ఓంట్లో బాగుండలేదా ?

రంగ:- ఆ, బాగానే ఉందండి!

సుంద:- మరి? - తీరిక ఎక్కువయిందేమిటి? - నిన్ను పెద్దయ్యగారు పిలుస్తున్నారు. లోపలికెళ్ళు!

రంగ:- ఇప్పుడక్కణ్ణించేకదండీ, వస్తున్నానూ? -

సుంద:- ఏమో! ఇప్పుడు మళ్ళీపిలాచారు. త్వరగావెళ్ళు!

రంగ:- చిత్తం!

[రంగయ్య బాధగా మధ్యగదిలోకివెడతాడు. వెంటనే సుందరం ఉత్సాహంగా చిటికవేసి, కోటుస్టేండు దగ్గిరకి పరుగెత్తుకెళ్ళి, కోటు కోసం తెగ వెతుకుతూంటాడు. అకోటు కనపడదు. "కర్మ! కోటే మయిందీ!"అని గొణుక్కొని మతోయినట్టు స్టేండు వెనకవైపువెళ్ళి వెతిగేస్తూంటాడు. రంగయ్య మధ్యగదిలోంచి జాగ్రత్తగావచ్చి, ఇటూ అటూ చూసి, హాల్లో ఎవరూ లేరనుకుని ఉత్సాహంతో చటికేసి రేడియోబల్లదగ్గిరికి పరుగెత్తుకెళ్ళి పుస్తకాలు పిచ్చెక్కినట్టు తిరగేస్తూ "కర్మ! ఇదేమయిందీ?" అని గొణుక్కుంటాడు. ఒకళ్ళనొకళ్ళు చూసుగోరు. ఇద్దరూ ఈ హడావుడిలో ఉండగా మధ్యగదిలోంచి రమణయ్య "చాల్లెద్దూ, చెప్పొచ్చావ్!" అని కేకలేసుకుంటూ చక్కా వస్తాడు. రంగయ్య హడిలిపోయి పక్కని నక్కి, రమణయ్యరాగానే, మధ్యగదిలోకి చక్కాపోతాడు. సుందరం హాలుమధ్యగా నిలబడి పోతాడు.]

రమ:- (విసుగుగా) అందుకనే అంటారు. అనుమానం ముందూ. తరువాత ఆదదీ పుట్టిందని! ప్రతీదానికి అంక్షలే? - ప్రతీదానికీ ఆరాలే? - తలకాయ దువ్వుకుంటే తప్పొచ్చింది, ఈవిడగారికి!-(సుందరంతో) తలమీద జుట్టున్నాక దువ్వుకోకపోతే ఎల్లాగరా?

సుంద:- దువ్వుకోద్దని ఎవరన్నారు నాన్నా?

రమ:- ఇంకెవరూ? - మీఅమ్మ !- మీ అమ్మ !- నేను జుట్టుపోలిగాడిలా లేనని, మీ అమ్మ బాధ !

సుంద:- (కొద్దిగా నవ్వి) అదేమిటి, నాన్నా!-

రమ:- నీకేం తెలుసురా, నీ మొహం ? అడదానితో కాపరం చెయ్యడం బదులు ఆడివితో కూచోడం నయం. చేసుకున్నవాళ్ళ బాధలు చూస్తూన్నావుగా ? నువ్వయినా సుఖపడుదువుగాని. ఒరేయి- నువ్వు పెళ్ళి మానేసెయ్యి !

సుంద:- (గతుక్కుమని) అదేమిటి, నాన్నా ?

రమ:- అర్థం చూస్తావేమిట్రా ? నేను చెబుతున్నానుగా, మానెయ్యి !

సుంద:- (ఆదోలానవ్వి) ఇప్పుడే వస్తాను, నాన్నా ! (అని కంగారుగా మధ్య గదిలోకి చక్కాపోతాడు.)

రమ:- (రోషంతో చూస్తూ సోఫాకేసిపస్తూ) హుష్ ! ఏం గొడవవొచ్చి పడిపోయిందీ ? స్త్రీ జితం భ్రాంత హృదయం ఉత్కార్గపరివర్తినమ్, అన్నాడు దశరథుడు. ఎంత బాధపడి అన్నాడో ఇప్పుడు నాకు తెలుస్తోంది. రాముడికి పట్టాభిషేకం చెయ్యవద్దని ఆవిడ కూచుంది. ఆడవాళ్ళంతా ఇంతే ! (సోఫాలో కూపుని, సిట్టూర్చి, రామాయణం తీసి, పేజీలు తిరగవేస్తూంటారు. కనిపించిన ఆ ఫొటో ఇవతలికితీసి) ఇదేమిటీ?- (పరీక్షగాచూసి, ఉత్సాహంగా) ఎవరీ అమ్మాయి?... (మెచ్చుగుంటూ) ఆ'- కళ్లు అందంగా ఉన్నాయి!- మొహం ఎంత గుంభ్రంగా ఉ దీ!- వీడ్నితండ్రి ఎంత అదృష్టవంతుడోగదా! మామగారూ కన్నాడు, ఏం లాభం?- ప్చ్!- అన్నట్టు, ఇది నా రామాయణంలోకి ఎల్లాగచ్చింది చెప్మా!- మా ఆవిడచూస్తే ఇంకే మన్నా ఉందా?- లంకాదహనం అయిపోదూ? (అని ఫొటో వేరేతీసి రామాయణం Teapoy మీద ఉంచేస్తాడు. మధ్య గదిలోంచి, రంగయ్య ఒక ట్రే తీసుకుని వస్తాడు. రమణయ్య, రంగయ్యని చూసి ఫొటో దాచుకుంటాడు. ట్రేలో ఒక మిఠాయి ఉండ వున్న

ప్లేటూ, మంచినీళ్ళున్న గ్లాసూ వుంటాయి. రంగయ్య పుస్తకాలున్న చోటుకి. రమణయ్యకి, మధ్యగా వచ్చి నిలబడతాడు)... ఏమిటది, రంగయ్యా!

రంగ:- మిఠాయి వుండండి!-

రమ:- అడిసరే, ఎవరు తెమ్మన్నారు?

రంగ:- పెద్దమ్మగారు మీకు ఇచ్చిరమ్మన్నారండి!-

రమ:- (ట్రేలో ప్లేటు తీసుకుంటూ) ఉహూ!- ఆవిడగారు ఏం చేస్తోంది?

రంగ:- ఏం లేదండి!-

(రంగయ్య, తలమాత్రం వెనక్కి తిప్పి, రేడియో జల్లమీదున్న పుస్తకాలకేసి బాధగా చూస్తూ, ట్రే పట్టుగుని అక్కడే నిలబడి వుంటాడు మిఠాయి తింటూ, రమణయ్య మధ్య మధ్య ఆ ఫోటోకేసి ఉత్సాహంగా చూస్తూంటే, మధ్యగదిలోంచి విశాలాక్షి 'రంగయ్యా!' అని కేకవేస్తుంది. రంగయ్య వినిపించుగోడు. రమణయ్య మాత్రం విని, ఫోటోకేసి భయంగా చూసి, వెనక్కి బెదురుగా చూసి, 'రంగయ్యా!' అని విశాలాక్షి మరోసారి కేక వెయ్యగానే, రమణయ్య ఆ ఫోటోని రంగయ్య చిన్నబనియనుకి ఎదర ఉన్న చిన్న జేబులో వదిలేస్తాడు. పుస్తకాలకేసి అస్తమానూ మతోయినట్టు చూస్తున్న రంగయ్య ఈ సంగతి గమనించడు.)

రమ:- (గట్టిగా) ఒరేయ్!-

రంగ:- (హడిలిపోయి) బాబయ్యా!- (ట్రేకోడుగ్లాసు దడదడలాడుతుంది.)

రమ:- అదేం రోగంరా, నీకూ?

రంగ:- ఏం లేదండి:

రమ:- అల్లాచూస్తావేం? (మంచినీళ్ళు తాగుతాడు)

రంగ:- ఊరికినేనండి!- అమ్మగారు, పిలుస్తూంటే!

రమ:- ఊ!- (గ్లాసు మళ్ళీ ట్రేలోపెట్టి) రంగయ్యా! నీ పెళ్ళాం తలకాయ దువ్వుకోద్దంటే మానేస్తావుట్రా?

రంగ:- అదెందుకంటుంచండి?-

రమ:- అందనుకోరా, ఏంజేస్తావ్?

రంగ:- పోనీ మానేస్తానండి!

రమ:- మానేస్తావ్?- ఓరి వాజమ్మా!- సీలాంటివాళ్ళనిబట్టే వాళ్ళల్లా నెత్తెక్కుతున్నారు!- ఫో, లోపలికి!- (రంగయ్య తెల్లబోయి. మధ్యగదిలోకి చక్కాపోతాడు. రమణయ్య రామాయణం తీసి ఇంకా ఏమైనా ఫొటోలు ఉన్నాయేమో : అన్నట్లు, పేజీలు తిరగ వేస్తూంటాడు. ఇంతలో మధ్యగదిలోంచి విశాలాక్షి వస్తుంది)

విశా:- (వెటకారంగా) మీరు కూస్తున్నారూ?- రామాయణం చదువుతున్నారా?

రమ:- ఆ!- చదువుతున్నాను. ఏం?

విశా:- చదవండి, చదవండి!- ఇంక పనేముంది, మీకూ?

రమ:- నాకేముంది?- రిటైరయిపోయాను. ఇంకేబాధ్యతాలేదు. నా ఇష్టం వచ్చినట్టుంటాను.

విశా:- అయితే ఇంక మాలెక్కేం లేదన్నమాట, మీకు?

రమ:- ఏమీలేదు! పైగా ఈ కోలాహలంలో కాస్త మనశ్శాంతి కలిగించేది ఇదొక్కటే నాకు, దీన్ని మాత్రం వదల్ను.

విశా:- (రోషంతో) వదల్రూ!

రమ:- (మొండిగా) పదల్ను!- ఏంజేస్తావ్?

విశా:- అయ్యో, అయ్యో!- అంతటరితెగించిపోయారూ? ఇంక దాంతో ఎప్పుడో లేచిపోతారేమో కూడాను!

రమ:- ఆ! ఏ ఆడవుల్లోకో లేచిపోతాను. అక్కడేనా హాయిగా ఉండొచ్చు.
(మధ్యగదిలోంచి అనుమానంగా చూస్తూ రామం వస్తాడు)

రామం:- ఏమిటి, నాన్నా?-

విశా:- ఏముంది?- దాన్నుచ్చుగుని ఏ అడవుల్లోకో లేచి పోతార్ట!- రిక్షా పిలిపించు!

రాము:- అదేమిటమ్మా, మరీనూ!

విశా:- లేకపోతే అంతవయసొచ్చినమనిషి, ఆ పన్లేమిటి? ఆ మాట్లేమిటి?

రామం: ఏమయిందిప్పుడూ?

రమ:- ఏమీలేదురా, అబ్బాయి!- నేచెప్తావిను!- దానితల ముగ్గుబుట్టలా నెరిసిపోయిందసీ, నా తల నల్లగా ఉండి పోయిందనీ, పైగా అది నేను నున్నగా దువ్వుకుంటున్నానని, దాని ఏడుపు!

విశా:- చాల్లెద్దురూ!- మాట మార్చి చెప్పడం మనకి మొదట్నుంచీ తెలిసిందేగా?

రమ:- ఆవును!- మనసుమార్చి కూచోపెట్టడం మనకి మామూలేగా?

రామం:- (రామాయణం జాగ్రత్తగా తీస్తూ) అది సరేగాని, అమ్మా!

విశా:- (కోపంగా) ఒరేయి, రామం! నువ్వుముందు ఆ రామాయణం కిందెట్టు!

రామం:- (తెల్లబోయి, పెడుతూ) ఏం?

విశా:- అపవిత్రగ్రంథంరా, అదీ!-

రమ:- ఇదిగో!- దాన్నే మన్నా అంటే నేనూరుకోను. తెలిసిందా?

[మధ్యగదిలోంచి రంగయ్య వస్తాడు]

విశా:- అంతవరకూ వచ్చిందీ?-

రంగ:- అమ్మగారూ! సినిమాకి టైమవుతోంది.

విశా:- (విసుగు, రామాయణంలో పిడకల వేటలాగ నువ్వేమిటోయి! నోరుమూసుకో!

రమ:- వాడిమీద విరుచుకుపడతావెందుకూ?- సినిమాకంటూ బయల్దేరదీసిన దానివి నువ్వేగా?- నడుమరి!

విశా:- (మూతివిరిచి) ఆ!- (రామంతో) అబ్బాయి, కమలింకా రాదేరా?

రామం:- పిలు, రంగయ్యా!- (రంగయ్య పుస్తకాలకేసి చూస్తూ, బాధగా మధ్యగదిలోకి పోతాడు.)
నాకు అంత చెప్పినదానిని, నువ్వే ఇంత కోపం తెచ్చుకుంటే ఎల్లా చెప్పమ్మా!

విశా - మరీ ఇంత అసందర్భం మనిషయితే ఏం చెయ్యమంటావురా?- పోసి ఊరుషుందాం అంటే ఊరుకోనిస్తేనా?

రమ:- అదీ సంగతి!- నేను జుట్టు, పీచుమిఠాయిలా ఉంచుకుంటే ఈవిడ ఇంచక్కా ఊరుకుంటుంది!

విశా:- చాల్లెద్దురూ!- మీకు ఎవరూ చెప్పలేరుగాని కాస్సేపు ఊరుకోండి!- (రామంతో) ఏరా, కమలంకి నచ్చచెప్పావా?

రమ:- నచ్చచెప్పడం ఏమిట్రా?

రామం:- ఆ, తెచ్చిన వాచీ నచ్చలేదట! కోపగించి కూచుంది.

రమ:- ఆడవాళ్ళంతా అంతేరా! కోపగించడం వాళ్ళ జన్మ హక్కు!. . .

విశా:- ఆ, మీరు మరీచెబుతారు! పుట్టినరోజు నాడైనా దానిష్టం కనుక్కోకి పోతే ఎల్లా?

రమ:- అల్లానే, అల్లానే!- దీనికున్నంతకోపం ఈ తాలూకాలో ఎవరికీ ఉండదు. ఆ కోపానికి అర్థం అసలే ఉండదు. ఓసారి, దీని పుట్టిన రోజుకి పోసీ తింటుంది గదా అని, పావలా పకోడీలు పట్టుగొస్తే, నాలుగు మైళ్లు గిరవాటెట్టింది.

విశా:- చేసిన ప్రయోజకత్వానికి చెప్పుకోడంకూడా ఎందుకూ?- పుచ్చుగుందిరా, వాచీ!

రామం:- పుచ్చుగోక ఏంజేస్తుంది? లేకపోతే వీధులో గిరవాటెడతాననన్నాను.

రమ:- అదిసంగతి!- అసలు నేనుకూడా పకోడీలు తెస్తూనే వీధులో గిరవాటెట్టవలసింది. చచ్చినట్టు తెచ్చుకు తిన్ను!

విశా:- అబ్బబ్బా, దిక్కుమాలిన పకోడీలు!- ఊరుకుందురూ!

[ముద్దగదిలోంచి మూడు కాఫీ కప్పులతో ప్రేపుచ్చుగుని సుందరం, వెనకాల కమలా వస్తారు. కమలంచేతికి వాచీ ఉంటుంది.]

ఇంకా కాఫీలు కలుపుతూ కూచున్నారా?

సుంద:- ఇంకెంతసేపమ్మా?- కాఫీలు తాగడమే ఆలస్యం!

(కమల అందరికీ కాఫీలు అందిస్తూంటే, సుందరం, రామం తొడుకున్నకోటు గుర్తుపట్టి, ఆదుర్దాగా స్టాండు కేసితిరిగి నెర్వస్‌గా నవ్వుతూ) అదేమిట్రా అన్నయ్యా!- ఇంట్లో కోటేసుకుని, కూచున్నావేమిటి?- అబ్బ, ఉక్కబోయ్యటంలే?- ఏం, నాన్నా?-

రము:- మరే! ఇప్పుడు కోటేకావేమిట్రా, తెలుగు సినిమాలో హీరోలాగ!- తీసెయ్!

(రామం, చిరునవ్వుతో లేచి, చేతిలో కప్పు Tea Poy మీద ఉంచి వెళ్ళి కోటు తీసేసి వస్తాడు. ఇంతలో రమణయ్య కాఫీరుచి చూసి)

ఎవరర్రా కాఫీలు కలిపింది ?

కము:- సుందరం కలిపాడు.

సుంద:- అవున్నాన్నా!- నేనే కలిపాను. (ఉత్సాహంగా) ఎల్లా ఉంది ?

రము:- అల్లానే ఉంది! ఇందులో పంచదార ఏదిరా?

సుంద:- తక్కువయిందా ?

రము:- తక్కువేమిట్రా? అసలు లేదు!

విశా:- (రుచిచూసి) అబ్బ, ఇదేం కాఫీరా?- ఇంత పంచదార వేశావేమిటి?

సుంద:- (అనుమానంగా) ఎక్కువయిందా?

విశా:- ఎక్కువేమిట్రా, పానకంలా ఉందేనూ!

రామం:- (ఈ గొడవంతా చూసి, అనుమానంగా కప్పు తీసుకుని రుచిచూసి) రామ, రామ!-

సుంద:- నీ కాఫీకి ఏ మొచ్చిందిరా?

రామం:- ఏం, రావడమేమిట్రా?- ఇందులో ఉప్పేళావేమిటి?

సుంద:- ఆ!- ఉప్పేలాపచ్చింది, చెప్మా!-

రామం:- బాబూ!- నువ్వు వంటింటిజోలికి మాత్రం వెళ్ళకు!- నీ ఆతిథ్యం పుచ్చుగుంటే మనుషులా బతగరు!

కమ:- (రమణయ్యతో) నేను తెస్తానుండండీ!- (మళ్ళగదిలోకి వెడుతుంది)

సుంద:- ఆల్లా అంటావేమిట్రా?- కంగారులో ఏదో కొంచెం పొరపాటయింది.

విశా:- పొరపాటేమిటి, అసలు ఇందాకణ్ణుంచి, వీడికి మతిలేదు.

సుంద:- (తెల్లబోయి) నీకెల్లా తలుసూ?

విశా:- తెలియడానికి కొత్తేముంది? సినిమాకి ప్రోగ్రాం పెట్టినప్పుడల్లా నువ్వింతేగా?

సుంద:- (నీరసంగా నవ్వి) అదా?- మరే, మరే!- (అని అక్కడ కప్పులన్నీ హడావుడిగా ట్రేలో పెట్టుకుని మధ్యగదిలోకి చక్కాపోతాడు).

రమ:- అక్కడికి మహా తనకి లేనట్టు ఆ పిచ్చి! బాలరాజు సినిమాకి కిరి సార్లు వెళ్ళింది, ఈవిడగారు.

విశా:- చాల్లెద్దురూ, ఆపండ్డాలు!

[రంగయ్య ట్రేతో మూడు కాఫీలు తిసుకుని మధ్యగదిలోంచి వస్తాడు. వెనక్కాలే కమల వస్తుండ. కాఫీలు రంగయ్య అందిస్తాడు]

రామం:- నాకక్కర్లేదోయి! నోరు చెడిపోయింది. (కమల, రామంకేసి ఉడుకు మోత్తనంగా చూస్తుంది)

విశా:- పోసి, నువ్వు తీసుగోవే కమలా!

కమ:- అక్కర్లేదు. తాగాను!

[మధ్యగదిలోంచి సుందరంపచ్చి స్టాండుదగ్గర నిలబడతాడు.]

రమ:- ఒరేయి, సుందరం! ఆ కాఫీ తాగిచూడరా? ఫట్టుగా ఉంది.

సుంద:- తాగానులెండి! (కాళీ కప్పులు ట్రేమీద అంతా పెట్టేస్తారు. రేడియో బల్లదగ్గిర దిక్కులు చూస్తున్న రంగయ్యతో) ఏయి, రంగయ్యా!- ఆల్లా దిక్కులు చూస్తావేమిటోయి?- ఆ కప్పులు తీసెయి!

రంగ:- (కంగారుగా వస్తూ) చిత్తం!

రమ:- ఈ రంగయ్య వాలకం ఇందాకణ్ణుంచీ చూస్తున్నాను. కడుపులో పామున్నట్టు తిరుగుతున్నాడు. ఏదో ఉంది గ్రంథం!- ఏరా, అబ్బీ!-

రంగ:- (హడలిపోయి) ఏం-ఏం లేదండి! (తను పట్టుకున్న ట్రేలో కప్పులు దదవడలాడతాయి)

రామం:- ఆడేవిటోయి, ఇల్లా పిలిచేవ్? ఆ కప్పులు కింద పారేస్తావు కూడాను!- లోపలపెట్టు!

రవ:- ఏం కవలా'- ఈవాళ సినీమా ప్రోగ్రాం లేదేవిటి?

కమ:- ఎందుకులేదూ?- సుందరం టిక్కట్లు కూడా తెచ్చాడు.

రమ:- అయితే నడవండి మరి!-

రామం:- (రామాయణం కేసి చూస్తూ) తలనెప్పిగా వుంది. నేను రాను!- మీరు వెళ్ళండి!

సుంద:- (కోటు కేసి, క్రిందగా చూసి) ఉబ్బే, నేను మానేద్దామనకుంటున్నాను. ఒళ్ళు నెప్పులుగా వుంది! మీరందరూ తప్పకుండా వెళ్ళండి. మంచి సినీమా!

రంగ:- (పుస్తకాలకేసి బాధగా చూసి) ఎందుకంటవ్వాయి గారూ!- మీరంతా వెళ్ళండి, నేనంటాగా?

పిళా:- అసలు ఇప్పుడు ఎవళ్ళైనా మాత్రం మానెయ్యాలం ఎందుకూ?

రామం:- అవును, మానెయ్యాలం ఎందుకూ?- నాకేదో తలనెప్పిగా వుందనీ!-

సుంద:- అదేమిటన్నయ్యా!—

కమ:- పోనీ, సుందరం?- బలవంత పెట్టకు!— (రోషంతో) వారికి వేరే పనుందేమో!

(రంగయ్య బాధగా చూసి మధ్యగదిలోకి వెళ్ళిపోతాడు)

రామం:- పన్లేంలేవు! రోజులు బాగా లేనప్పుడు తాళం వేసి అంతా వెళ్ళడ మెందుకని ఆలోచిస్తున్నాను! (కమల విసురుగా కుడి ఎడంలోకి వెడుతుంది)

రమ:- పోనీ, నేనుంటాను- మీరంతా వెళ్ళండి!

పిళా:- ఏం? మీకుందేమిటి వేరేపని!

రమ:- నాకేం పనుంది?- ఇదుచ్చుగుని కూచుంటాను.

విశా:- అదే!- నాకు తెలుసు!- ఇదుగో, మిమ్మల్ని ఒక్కర్ని ఇంటో అట్టే పెట్టి మేం వెళ్ళేది లేదు'- ఏమయినా సరే!- వెడితే అంతా వెళ్ళాలి!- లేకపోతే అంతా ఉండాలి.

రమ:- అంతేలే!- అందులో నువ్వు వొచ్చుల్తావా, నన్ను?

విశా:- ఈ కంఠంలో ప్రాణం ఉండగా వొచ్చన్నే!-

రమ:- (కోటుస్తాండు దగ్గిర తచ్చాడుతున్న సుందరంతో) వినరా, సుందరం!- అందుకనే నువ్వుకూడా పెళ్ళి చేసుగునీ పాడవకురా, అంటున్నాను!- ఇప్పుడేనా- తెలిసిందా?

సుంద:- అదేమిటి నాన్నా!-మధ్య నన్ను పెళ్ళి మానెయ్యమంటా వేమిటి?

రమ:- నీ సుఖం కోరేవాణ్ణి గనుక, కష్టనష్టాలు భరించినవాణ్ణి గనక, చెబుతున్నాను. పెళ్ళంటే ఏమిటో అని మురిసిపోతున్నట్టున్నావు. రెప్పొద్దున్న నీ పెళ్ళాం వచ్చి, ఆ క్రాపింగు బాగుండలేదూ, చలిమిడల్లా చేయించుగోండి, లేకపోతే గోదావర్లో దిగుతానంటుంది- ఏం జేస్తావు?

సుంద:- (తెల్లబోయి) అల్లా ఎందుకంటుంది నాన్నా?-

రమ:- అంటుందిరా, అంటుంది. ఇన్నేళ్ళు కాపరం చేశాక నన్నంటంలేదురా, ఈవిడ? నువ్వో లెక్కా, నీ పెళ్ళానికి?

విశా:- చాల్లెద్దురూ, వితండవాదన!- వాడికేం? నిక్షేపం లాంటి పిల్లని చేసుగుంటాడు. లక్షణంగా కాపరం చేస్తాడు. వాడు నా పోలిక !

రమ:- ఇదోటా!-ఇల్లా మొదలెట్టకు, వాడికి పెళ్ళిసంబంధాలు కూడా రావు !

[ఎడమ ఎడలోంచి "రామారావుగారూ!- రామారావుగారూ!" అని పిలుపు.]

రామం:- ఒరేయి, సుందరం!-ఎవరో పిలుస్తున్నారు చూడు! (సుందరం ఎడమ ఎడరకేసి వెళుతూంటే మళ్ళీ పిలుపు వినిపిస్తుంది) హనుమంతరావు గారయివుంటారు.

రమ:- హనుమంతరావుగారు, ఎవర్రా ?

రామం:- మా ఆఫీసులోనే పని చేస్తున్నారు, నాన్నా!- ఈ వూరు కొత్తగా వచ్చారు. మనం సినిమా కెడుతున్నామంటే తనూ వస్తానన్నాడు. పరిచయం చెయ్యచ్చుగదా అని ఇంటికి రమ్మ న్నాను.

విశా:- మరి ఇందాక సినిమాకి రానంటావేం?

రామం:- వస్తానుగాని, నువ్వు లోపలికెళ్ళి, కమలిని ఇంక బయల్దేరమను!

(విశాలాక్షి కుడి ఎదరలోకి వెడుతుంది.)

రమ:- (జేబులు తడుముకుని లేచి) ఇప్పుడే వస్తారా? (అని మధ్యగదిలోకి వెడతాడు.)

[రామం బరువుగా నిట్టూర్చి, సంతోషంతో రామాయణం తెరవబోయేసరికి "అన్నయ్యా!-" అని ఎడమ ఎదరలోంచి సుందరం కేక వినిపిస్తుంది. రామం, రామాయణం మూసేస్తాడు.]

సుంద:- (వచ్చి) హనుమంతరావుగారట్రా, వచ్చారు!

రామం:- ఆల్లానా, లోపలికి తీసుకురా!

సుంద:- సరే!- (అని మళ్ళీ ఎడమ ఎదరలోకి వెడతాడు. మధ్య గదిలోంచి రంగయ్య వస్తాడు)

రామం:- (విసుగ్గా) రంగయ్యా !- నా స్నేహితు డొకాయన వచ్చారు. కాఫీ పట్రా ?- త్వరగా !

రంగ:- (విసుగ్గా) చిత్తం !- (మధ్యగదిలోకి వెడతాడు.)

రామం:- (సోఫాలోకి మారి రామాయణం గబగబా తిరగేస్తూ) ఈ దిక్కుమాలిన ఫోటో ఏమయిందిచెప్మా !... (ఎడమ ఎదరలోంచి సుందరం హనుమంతరావు గారూ వస్తారు. రామాయణం, రాముం చేతులోనే ఉండిపోతుంది) రండి, హనుమంతరావుగారూ ! కూచోండి.

హను:- మళ్ళీ కూచోడం ఎందుకూ ? సినిమాకి టైమవుతోంది. రండి పోదాం !

రామం:- పరవాలేదు. కూచోండి ! మావాడు టిక్కట్లు తెచ్చేవాడులెండి.

హను:- ఇంకనే !- (కూచుని) ఏమిటి మీరు చదువుతున్నారు ?

రామం:- అబ్బే, ఏంలేదు !- ఊరికే చూస్తున్నా !

హను:- (ఆత్రుతగా) ఏమిటది ?

రామం:- (నెర్వస్‌గా) రామాయణం !- నాన్నగారిది !

హను:- ఇంకనే !- ఇల్లా ఇవ్వండి ?- ఏదీ ! (అని మొండిగా అడిగిపుచ్చు గుని, కుర్చీలో జేర్లబడి పేజీలు తిరగేస్తూ, ఆగి, కళ్ళెగరేసి) ఓహోహో ! చెప్పారు కారేం ?

రామం:- (హడలిపోయి, చూడ్డానికి లేచి) ఏమిటి ?

హను:- మీకు సంస్కృతం కూడా వచ్చన్నమాట !

రామం:- అదా?-హూ!-అట్టేనాదు ! (రంగయ్య కాఫీతెస్తాడు) అ!- వారికియ్యి. అ పుస్తకం ఇల్లా ఇవ్వండి !

హను:- వొద్దండి ! ఇప్పుడే కాఫీ తీసుగుని వస్తున్నాను ?

రామం:- కాఫీకేమిటండీ ?- పుచ్చుగోండి ! - అది ఇల్లాఇవ్వండి ! (అని రామాయణం పుచ్చుగుని హాయిగా సిట్టూర్చి, సుందరంవైపు చూస్తాడు. ఈలోగా సుందరం కోటుస్టాండు దగ్గరజేరి, రామంకోటు, జాగ్రత్తగా తొడిగేసుగుంటాడు) ఆ, సుందరం !- అదేమిట్రా, నా కోటు తొడుకున్నావ్ ?

సుంద:- సీదా అన్నయ్యా ?- (అప్పుడే తెలిసుకున్నట్లు నవ్వి) నా కోటను కున్నాను, నేనూ !

రామం:- చాల్చాలు ! అది అక్కడపెట్టి అమ్మనీ వాళ్ళనీ రమ్మను.

సుంద:- ఆ ! (అంటూ సుందరం. కావాలనే కోటుతోటే కుడిఎదరలోకి చక్కాపోతాడు. మధ్యగదిలోంచి రమణయ్య వస్తూంటే, రామం బాధగా, రామాయణం Teapoy మీద ఉంచేస్తాడు.)

రామం:- (వచ్చి) ఏరా, వీళ్ళింకా రాలేదేం ?

రమ:- వస్తున్నారు నాన్నా !- హనుమంతరావుగారని చెప్పానే, వీరేనాన్నా! మా నాన్నగారు, రమణయ్య గారు !

రమ:- (హనుమంతరావు చేసిన నమస్కారం అందుకుంటూ) నేను తహసీల్దారు చేసి రిటైరు అయ్యాను !

హను:- (చిరునవ్వుతో) అల్లానాండి !

రమ:- కూచోండి !-ఆ కాఫీ పూర్తిగా తీసేసుగోండి ! (అని సోఫాలో కూచుంటాడు.)

[హనుమంతరావు కాఫీ తాగేస్తాడు. కుడిఎదరలోంచి విశాలాక్షి, కమల వస్తారు. కోటు చేత్తోపట్టుగుని విచారంగా, మతోయినట్లు చూస్తూ, వెనకాలే సుందరం వస్తాడు. రాగానే కోటు స్టాండుకి తగిలించేస్తాడు.]

రామం:- (తల్లితో) వీరు నా మిత్రులు, హనుమంతరావు గారు!- (హనుమంతరావుతో) మా అమ్మగారు !- నా భార్య !- అతను నా తమ్ముడు, సుందరం. బి. ఎ. చదువుతున్నాడు. (నమస్కారాలు అవుతాయి)

హను:- (సుందరంతో) మీకూ సంస్కృతం వచ్చా ?

సుంద:- రాదండీ !

రమ:- మా ఇంట్లో నాకు తప్ప సంస్కృతం ఇంకెవ్వరికీ రాదండీ ! ఎంత పట్టుదల ఉండాలండీ దానికీ ?

హను:- ఆ ! రామారావు గారికి వచ్చును కదండీ ?

రమ:- ఆ, వాడిమొహం ! వాడికేంవచ్చు ?-వాడికి తెలుగే తిన్నగా రాదు !

హను:- (నవ్వేసి) మా భలేవారే, మీరూ !

రమ:- అన్నట్లు మీకు పెళ్ళయిందా ?

హను:- ఈ మధ్యనే అయిందండి !

రమ:- (ఆశ్చర్యంగా) అయిపోయిందీ ?

హను:- ఏం అలా అంటున్నారూ ? (సిగరెట్టు పెట్టి తీస్తాడు)

రామం:- (కంగారుగా నవ్వి) ఆ, ఏంలేదు !-వెడదామా, మరి!- నువ్వు కూడా రావోయి, రంగయ్యా !

రంగ:- (భాధగా) చిత్తం !- (సుందరంతో) అబ్బాయిగారూ ! పుస్తకాలు లోపల మీ బల్ల మీద పెట్టెయ్యనాండి ?

సుంద:- (విసుగ్గా) అక్కర్లేదు, అల్లాడించు.

[హనుమంతరావు సిగరెట్ నోట్లో పెట్టుగుని, జేబులు తడుము కుంటూంటాడు]

రామం:- ఏం కావాలి, హనుమంతరావు గారూ ?

హను:- అగ్గిపెట్టి మర్చిపోయినట్టున్నాను !

రామం:- అగ్గిపెట్టా ? ఆ, రంగయ్యా ! సిదగ్గిర ఉంటుందిగా ? అయ్యగారికి ఓ మాటియ్యి !

[రంగయ్య, హనుమంతరావుకి ఎదురుగావచ్చి, చిరునవ్వుతో జేబులో చెయ్యెట్టి అగ్గిపెట్టి తీస్తాడు. అగ్గిపెట్టెతో, ఫోటో కూడా వస్తుంది. అగ్గిపెట్టి నేలమీదికి వదిలేసి, ఫోటోకేసి తెల్లబోయిచూస్తూ నిలబడి పోతాడు. తరవాత సుందరం కేసి వెర్రిగా చూస్తాడు. సుందరం కంగారుగా రామాన్ని చూస్తాడు. రామం హడలిపోయి రమణయ్య కేసి తిరుగుతాడు. రమణయ్య ఏమీ ఎరగనట్లు పైకి చూస్తూ కూచుంటాడు. వెనకనుంచి విశాలాక్షి, కమల ఆ ఫోటోకేసి మంచి కోపంతో చూస్తూంటారు.]

హను:- ఉల్లా అయిపోయా రేమిటీ? అంతాను!- ఏమిటోయి, అది? (అని రంగయ్య చేతిలో ఫోటోతీసుగునిచూసి తెల్లబోయి, కోపంతో బిగుసుకుపోయి, టీకరంగా రంగయ్యనిచూసి, రంగయ్య బనియను బిగించి పట్టుగుని) నా భార్య ఫోటో నీ దగ్గరికి ఎల్లా వచ్చిందిరా? ఎల్లా వచ్చింది, నా భార్య ఫోటో !- చెప్పు ! !

[రంగయ్య పిచ్చాడిలా చూస్తూ, నోరు తేలేసి, బిగుసుకుపోయి ఉన్న పళంగా వెనక్కిపడిపోతాడు. రామం, సుందరం పట్టుగుని ఆపుతారు]

సుంద:- రంగయ్యా !-

హను :- (కోపంగా) సీతా!- ఎంత ద్రోహం చేశావ్ నాకు!- వుండండి, ఇప్పుడే వస్తాను ! (అంటూ విసురుగా ఎడమ ఎదరలోకి పోతాడు)

రామం :- హనుమంతరావుగారూ?-

సుంద :- వదినా!- కొంచెం సిక్కుతే ! (కమల మధ్య గడీలోకి వెడుతుంది.)

రమ :- ఆ సోఫాలో కూర్చోపెట్రా ! (రామం, సుందరం, రంగయ్యని సోఫాలో జేరస్తారు. కమలం సిళ్ళు తెస్తుంది. రామం రంగయ్య మొహంమీద సిళ్ళు చిలుకుతాడు. రంగయ్య కదుల్తాడు) ఊ ! రంగయ్యా !- ఆ సిళ్ళు తాగు!-

రంగ :- (గ్లాసుడు సిళ్ళు గదగదా తాగేసి) హమ్మయ్య !

విశా :- (కోపంగా, గ్రహించినట్లు తల ఊపుతూ) ఆయితే, ఈ ఫోటో, ఆయన పెళ్ళాందా?- హవ్వా!- ఏం పన్లండిపీ ? (కమలం రామం కేసి చురచురా చూస్తుంది)

రమ :- అనవసరంగా గొడవ పెట్టకు !- ఊరుకో, కాస్సేపు!- రంగయ్యా!- ఇప్పుడెల్లా వుండీ?-

రంగ :- (బెదురుతూ) బాగానే వుందండి. (అని లేవబోతాడు)

రామం :- లేవకు, పర్వాలేదు కాస్సేపు కూచో !- అసలు ఆ ఫోటో నీ కెక్కడిది ?-

రంగ :- (బిక్క మొహంతో) అదాండి?- బుద్ధి గడ్డితిని తెచ్చానండి -

రామం :- ఎక్కణ్ణుంచి తెచ్చావు ?-

రంగ :- మరండి !- ఇందాకా మన గ్రూపు ఫోటో కోసం ఫొటోగ్రావరు దగ్గిర కెళ్ళానండి. అతను లోపలం ఉన్నాడు. బల్ల మీద ఆ ఫోటో వుండే తీసి చూస్తున్నాను. ఇంతలో ఆయన వచ్చేశాడు. ఆయన చూస్తే మర్యాదగా వుండదని జేబులో పెట్టేశాను.

రామం :- హారి ?- తరవాత ఏం చేశావు?-

రంగ :- తరవాత ఇక్కడికి వచ్చాక, ఫోటో బావుందని తీసి చూస్తుంటే, గబుక్కుని ఎవరో వచ్చారండి. కంగారులో సుందరంగారి పుస్తకంలో పెట్టేశానండి !-

సుంద :- నా పుస్తకంలో దాచింది నువ్వా, రంగయ్యా !- చంపేశావు కదురా !-

రామం :- మరి, నా కోటు జేబులోకి ఎల్లా వచ్చింది?-

సుంద :- (నెర్వస్‌గా నవ్వి) అదా? నా పుస్తకంలోకి ఎల్లా వచ్చిందా అని, చూస్తూంటే ఎవరో వచ్చా రన్నయ్యా!- కంగారులో నీ కోటుజేబులో పెట్టాను!-

కమ ;- అయితే, వారి కోటుజేబులో ఫోటో నువ్వు పెట్టావా సుందరం ?-

రామం :- చూశావేమిటి?- అదా నీ కోపం !- నగల కోసం అనుకున్నాను, నేనూ '- ఓ చిన్న ప్రపంచ యుద్ధం లేవదీశావు కదురా !-

రమ :- మరి నా రామాయణంలోకి ఎల్లా వచ్చింది?-

రామం :- (నెర్వస్‌గా నవ్వి) అదా ?- నా కోటు జేబులోకి ఎల్లా వచ్చిందా అని, చూస్తూంటే ఎవరో వచ్చారు నాన్నా !- కంగారులో నీ రామాయణంలో పెట్టాను !

విశా :- అయితే, వారి రామాయణంలో ఫోటో, నువ్వు పెట్టావా, రామ్మ

లత :- చూశావేమిటి?- ఇదో పెద్ద C. I. D. ఇనస్పెక్టర్ మన కొంపలో! అందుకనా నా మీద ఎల్లా విరుచుకు పడ్డాపు?- నీ పేర 'విశాలాక్షి' అని మీ నాన్న ఊరికే పెట్టలేదు.

రంగ :- మరి, మళ్ళీ నా జేబులోకి ఎల్లా వచ్చావంటి ?-

రమ :- అదా?-నా రామాయణంలోకి ఎల్లా వచ్చిందా అని చూస్తూంటే ఈవిడగారి గొంతుక వినపడింది, రక్షణ ఎందుకేనా మంచిదని నీ జేబులో పడేశాను

విశా :- మా గొప్ప పనిచేసావు. అసలు మగవాళ్ళంతా ఇంతే !-

రంగ :- పిల్లిని చంక నెట్టుకున్నట్టు, జేబులో పెట్టుకుని, పుస్తకాల్లో కనపడ దేమో అని భస్తున్నాను, నేనూ !- ఎల్లా కనిపిస్తుందీ ?

విశా :- జరిగిన భాగోతం చాలుగాని, ఇల్లాంటి అప్రతిష్ట పనులు ఎప్పుడూ చెయ్యకు !-

రంగ :- (లేచి) చిత్తం !- జన్మకే సరిపోయే బుద్ధొచ్చింది, కదంటే ?

రమ :- ఈ భాగోతం అప్పుడే ఎక్కడయిందీ?— అవతల అక్కడేం కొంపలు అంటుగుంటున్నాయో !-

రామం :- ఎక్కడ నాన్నా !-

రమ :- ఎక్కడేమిట్రా, మీహనుమంతరావింట్లో?-

విశా :- మరేనండోయి!— పిచ్చాళ్ళా పడిగెత్తాడు, ఏంజేస్తాడో ఏమిటో!- ముందు వాళ్ళందికెడదాం నడవండి!-

రామం :- అవును, రండి !— వెడదాం !-

కమ :- రంగయ్యా !- త్వరగా రిక్షాలు కేకేయి !-

రమ :- అందుకనే గాంధీగారు మూడుకోతుల కథ అన్నిసార్లు చెప్పేవారు, తొందరపడి, ఏదీ చూడకు, ఏదీ వినకు, ఏదీ చెప్పకు అని !— నడవండి !-

(అందరూ తొందరగా ఎడమ ఎదరలోకి వెడతారు)

(తెర)

దంత వేదాంతం

రచన :

భమిడిపాటి రాధాకృష్ణ

పాత్రలు

జగన్నాథం

కాంతమ్మ

సుందరం

రంగయ్య

జ్ఞానశ్రీ

విక్రమరావు

డాక్టరు

(తెర తప్పుకోగానే ధనవంతుడైన గృహస్థు ఇంట్లో, తమ కుటుంబం కలుసుకునే ఉమ్మడిహాలు కనిపిస్తుంది. హాలుమధ్యగా సోఫా సెట్టు దగ్గరలో టేబుల్ ఫాను, R. M. వద్ద ఒక ఫోను ఉంటాయి. R.F.లో ఒకటి, L. F. లో ఒకటి, M. B. లో ఒకటి మొత్తం మూడు మార్గాలు హాల్లోంచి రాకపోకల కుంటాయి. L.B. ప్రాంతాల్లో ఒక చిన్న డ్రాయరు, దానిమీద రేడియో, ఆపైన అల్లారం గడియారం ఉంటాయి. గడియారంలో టైము 4-45 గంటలు అవు తుంది. L. F. లోంచి ముందు జగన్నాథం, వెనక్కాల ప్లీడరు గౌను, కాగితాలకట్టా పుచ్చుకుని రంగయ్యా వస్తారు. కాగితాల కట్ట రేడియోబల్లమీద పెడతాడు.)

జగ:- (సోఫాముందుకి నడుస్తూ, కాలర్ బేండ్సూ, కోటూ తీసేస్తూ) రంగయ్యా!- అబ్బాయి వచ్చాడా?

రంగ:- ఇంకా నేదండి.

జగ:- ఉ!- (తనలోలాగ, తలపంకిస్తూ) వస్తాడొస్తాడు! (అని కోటు, కాలర్ బేండ్సు రంగయ్య కిచ్చేసి) ఆ కాగితాలు తీసుగెళ్ళి ఆఫీసులో బల్లమీద పడేయి! (అని సోఫాలో కూచుని, టీపాయిమీద ఉన్న పేపరు తీస్తాడు.)

రంగ:- (వినయంగా, చిరునవ్వుతో) అయ్యగారు!-

జగ:- ఏమిట్రా?

రంగ:- (జగన్నాథం తలకేసి చూపిస్తూ) తలపాగా అండి!

జగ:- ఆ !ఒహో. ఇదా!- దీసుగెళ్ళు! (ఇచ్చేసి) అన్నట్లు, ఒరేయి!- కారు, షెడ్డులో పడేసి డ్రైవరు చక్కా పోతాడేమో!- పనుంది, ఉండ మన్నానని చెప్పు. ఆ?

రంగ:- సిత్తం! తమకోసం ఎంకయ్యగారొచ్చి ఆఫీసులో కూకున్నారండి.

జగ:- వెంకయ్యాలేడు, డొంకయ్యాలేడు!- నాకు బోల్డు పనుంది. రేపు పొద్దున్న రమ్మను!-

రంగ:- సిత్తం! ఖూసి సేసిన సుక్కయ్య నేడండీ?- ఆడి బాబండి, ఈ ఎంకయ్య!

జగ:- (తగ్గి) అల్లానా!- అయితే, ఒరేయి!- (మంచిగా, మెల్లగా) గుమాస్తా గారు ఇంటి కెళ్ళిపోయారూ, ప్లీడరుగారికి పాపం ఒంట్లో బాగా లేదూ, ఊ!- పొద్దున్నే దయచెయ్యమన్నారూ, అని జాగ్రత్తగా చెప్పి పంపించెయ్యి.

రంగ:- సిత్తం! (లాయరు గౌను, కోటూ, కాలర్ బేంచ్‌మీ, తలపాగా పుచ్చుకుని M. B. లోకి వెడతాడు.)

(R. F. లోంచి శాంతమ్మ యాదాలాపంగా వస్తుంది)

శాంత:- (జగన్నాథాన్ని చూసి) వచ్చారా? (అని వెంటనే R. F. కేసి తిరుగుతుంది. రంగయ్య. M. B. లోంచి వచ్చి రేడియోబల్లకేసి వస్తూంటాడు.)

జగ:- (చిరుకోపంతో, శాంతని ఉద్దేశించి) ఆగు ఆక్కడ? (ఇద్దరూ ఆగిపోతారు. రంగయ్యతో) నువ్వుకాదు నువ్వహోరా!- (రంగయ్య కాగితాలు తీసుగుని L. F. లోకి వెడతాడు.)

శాంత:- ఎందుకూ?

జగ:- ఎందు కేఎటి?- అల్లా తొంగిచూసి చక్కాపోతున్నా వెక్కడికి?

శాంత:- బాగానే ఉంది వరస!- (వెనక్కి తిరుగుతూ) కాఫీ తెస్తానుండండి?

జగ:- (లేస్తూ)- కాఫీ వద్దు, కషాయం వద్దు నువ్వు ముందిల్లాకా!- రా!- అల్లాకూచో!

శాంత:- (విద్రూపంగా) ఇదేం మనిషమ్మా ఎక్కడోనూ!- (కూచుని, మొగుడు కోపం చూసి) అల్లా ఉన్నారేం?- కేసేమన్నా పోయిందేమిటీ?

జగ:- నీ మొహం!- కేసుగాదు. కీర్తిప్రతిష్ఠలు గంగపాలయ్యాయి.

శాంత:- అయ్యో, అదేమిటీ?

జగ:- అదా? చేసుగున్న ఖర్మ!- ఇరవై వేళ్ళ క్రింద చెప్పాను, కొడుకుట్టాడు, కొడుకుట్టాడని మరీ సంబరపడకే, ముందుంది ముసళ్ళపండగ అని.

శాంత:- మన సుందరమా?- ఏంచేశాడు?

జగ-: ఏంజేస్తాడు?- నా వంశమర్యాదలేదూ, అదట్టిగెళ్ళి మరలో పోయించి పిండాడిస్తున్నాడు!

శాంత:- ఖర్మ!- (భయంగా) ఏమిటో తిన్నగా చెప్పండి!

జగ:- అసలు దీనికంతకీ కారకురాలవు నువ్వు. నీ ఆసరా చూసుగునేగా వాడింత అఘాయిత్యం చేశాడు!

శాంత:- (ఖంగారుగా) అఘాయిత్యా మేంచేశాడండి !- ఉన్!- నాకు దడొస్తోంది!

జగ:- వస్తోంది?- ఇంకేముందీ- కేసు దిన్ మిస్!

శాంత:- (రోషంతో) అంతేగాని, సంగతేమిటో చెప్పరు!-

జగ:- అయితే వినుు!- నీ కొడుకు పీకలోతు ప్రేమ వ్యవహారంలో దిగాడు.

శాంత:- ఏమిటి?- (ఆశ్చర్యంగా) నిజమే?-

జగ:- (కోపంగా నవ్వుతూ) అబ్బే, శుద్ధ అబద్ధం!- (జేబులోంచి తీసి) చదువుకో ఈ ఉత్తరం !

శాంత:- (చదువుతూ) ఏమిటిదంతా?- (తెల్లబోయి) ఈ కమలెవరండీ?

జగ:- రావణాసురుడు కూతురు! ఎవరైతే ఏం! ప్రస్తుతం మనవాడికి నెత్తిమీది దేవత, ఆ దేవత అందం చూసి వీడు జడుసుగున్నాట్ట! జడుసుగుని వెనక్కాలే పడ్డాట్ట! పది ఘాతుకు కొట్టినట్టు ప్రేమించేట్ట. ప్రేమించి, తన గుండెకాయ పట్టిగెళ్ళి ఆ అమ్మాయి పాదాలముంద పడేసి, తెంగపిండి తిన్నట్టు తినెయ్యి మన్నాట్ట- ఆ అమ్మాయి తినేసిందిట! అదే ఇందులో కవి హృదయం !

శాంత:- ఏదో కుట్రతనం అయి ఉంటుంది.

జగ:- ఆ! నువ్విల్లా వెనకేసుగొస్తుంటేనే వాడంత ముందుకి దూకాడు. చివరికి పెళ్ళి చేసుగుంటానని కూడా ప్రమాణం చేశాట్ట!

శాంత:- ప్రమాణం కూడానా? (నోరునొక్కుకుని) అవ్వ! ఎంతపనిచేశాడు? ఇప్పుడెల్లా? పోనీ, ఆ అమ్మాయి స్థితిగతు లేమిటో, వంశమేమిటో-

జగ:- ఏమీ అక్కర్లేదు! ఆ పెళ్ళికి నేను ఎంతమాత్రం అంగీకరించ దలుచుగోలేదు! నువ్వూ వాడూ కలిసి ఏమున్నా వూహలు పన్ను తారేమో, అసలా సంబంధం గురించి ఈ ఇంట్లో ఇక ప్రస్తావించ డానికి వీల్లేదు. తెలిసిందా!

శాంత:- మీ మాట నేనెప్పుడేనా కాదన్నానా? కాని సుందరం సంగతి మీకూ తెలుసుగా? వాడు ససేమిరా అంటే?—

జగ:- నేను ససేమిరా అంటాను. అబ్బాయి అద్దాంతరంగా వ్యవహరించి వంశమర్యాద మంటగలుపుతూంటే చూస్తూ ఊరుకోడానికి నేనేమీ చేతకాని వాణ్ణి కాదు. ఈ ఇంట్లో నేనున్నంతకాలం నా మాట జరిగి తీరాలి. నేను సుందరానికి అన్నివిధాలా యోగ్యమైన మరో సంబంధం నిశ్చయం చేసుగొచ్చాను.

శాంత:- మరో సంబంధమా? మీకూ ఇంత పట్టుదలయితే ఎల్లాగండీ? వాడు వెళ్ళి పిల్లని చూసుగోవద్దూ?

జగ:- ఇంకా చూడ్డం ఏమిటే! తాంబూలాలుచ్చుగుంచుకు పెళ్ళివారిని ఇప్పుడి అయిదుగంటలకి రమ్మన్నాను. అంతా స్థిరపడిపోయింది.

శాంత:- వాడేమన్నా గొడవ పెడతాడేమో?

జగ:- ఇంట్లోంచి బయటికి నడవమంటాను.

శాంత:- (ఏడుపు ఆపుగుంటూ) అదేంమట్లండీ? నిషేపంలాంటి సంసారంలో ఎన్ని గొడవలొచ్చాయి? మీ పట్టుదలకి రెట్టింపు పట్టుదల వాడిదగ్గ రుంది. పైగా దురుసుమనిషి కూడాను.

జగ:- అయితే?

శాంత:- కాస్త ఆలోచించండి! తప్పు క్షమించి ఆదుకోవలసిన కన్నతండ్రే విసిరికొడితే, విసుగెత్తి వాడే అఘాయిత్యమేనా చేస్తే జన్మంతా మధ్య నేను అలోలక్షణా అని ఏడవాలి! (అని ఏడుస్తుంది.)

జగ:- ఏడిసినట్టే వుంది! వాడూ, వాడి తరపున వకాల్తానామా పుచ్చుగుని నువ్వు ఇల్లా తయారవుతారని నాకు ముందే తెలుసు. ఇంక ఆ కుళాయి కట్టెయి! మనవాడు ప్రేమించిన కమలి సంబంధమే స్థిరపరచు గొచ్చాను!

శాంత:- (ఆనందంతో, కళ్లు తుడుచుకుంటూ) నిజమే! మీరెంత మంచివారండీ!
(జగన్నాథం నవ్వుతాడు.)

జగ:- అవునులే! మనకి జరిగిన లాభంబట్టేగా అవతలవాడి మంచి కొంచెం!

శాంత:- మీతో ఎవరూ మాట్లాడలేరు గాని, ఆ కమల ఎవరండీ ?

జగ:- సర్కిలు ఇన్‌స్పెక్టరు విక్రమరావుగారు లేరూ ?

శాంత:- మొన్న ధైర్యంగా మంటల్లో దూకాడన్నారూ !

జగ:- ఊ! ఆయనే! ఆయనకి ఈ కమల ఒక తై కూతురు. అమ్మాయి బాగుంది. B.A చదువుతోంది. ఆస్తి ఫరవాలేదు. పైగా అబ్బాయి ఎన్నుకున్నాడు. ఆంచేత విక్రమరావుగారిని తాంబూలాలు పుచ్చు గుందుకు ఈ సాయంత్రమే అయిదుగంటలకి వచ్చెయ్య మన్నాను. (ఉత్సాహంతో) అయిదవుతోంది !

శాంత:- ఊ! (ఆలోచించి, నిరుత్సాహంగా) చివరకి మీరన్నీ ఇల్లాగే చేస్తారు.

జగ:- ఏం ?

శాంత:- నాకొక్కగా నొక్క కొడుకుగదా, వాకి పెళ్ళి విషయంలో నా ప్రమేయం ఏమీ లేకుండా చేస్తారా ? నేవెళ్ళి పిల్లని చూసుగోదం, నాకు నచ్చడం, కట్నాలూ కానుకలూ మాట్లాడుకోడం ఏమీ అక్కర్లేదనుకున్నారా ? కొడుకు గారు రహస్యంగా ప్రేమించారు, తగుదునమ్మా అంటూ తండ్రిగా రెళ్ళి ఖాయపరుచు గొచ్చారు. పైగా ఇందాకణ్ణుంచీ నన్నాడిపోసుగున్నా రెందుకూ మధ్య ?

జగ:- ఇంతా విని మళ్ళీ నువ్వు సణుగుడు మొదలెట్టావేమిటి? కట్నాలూ కానుకలూ అన్నీ లాభసాటిగానే స్థిరపరుచుగొచ్చాను. ఇక అమ్మాయి ఉంటుందీ ! బంగారపు బొమ్మ ! ఎట్టగా, సన్నంగా, నాజూగా, రెండుజడ లేసుగుని—

శాంత:- (ఆడ్డొచ్చి, చిరాగ్గా చూస్తూ) రెండు జళ్ళేసు గుంటుందా ? అయితే మనకొద్దు.

జగ:- అదేమిటి ?

శాంత:- రెండు జళ్ళేసుగునే ఆమ్మాయంటే నా కసలు ఒళ్ళుమంట. సుబ్బరంగా పనీ పాటా నేర్చిన పిల్లయి ఉండాలిగాని, రెండు జడలూ, పదహారు జడలూ వేసుగుని సింగుసింగూ మంటూ తిరుగుతూ కూచుంటే ఇంక మనకేం చేస్తుందండీ ?

జగ:- బాగుంది! నీకు అభ్యంతరమల్లా రెండు జడలేగా?- పెళ్ళవగానే సిగ చుట్టించెయ్యి !

శాంత:- అసలీసుందరం వ్యవహారం నాకేం నచ్చలేదండి. రానీండి చెబుతాను. మొహం వాయకొడతాను.

జగ:- ఏమో !- మీసాలొచ్చిన కొడుకుల్ని మిత్రుల్లా చూసుగోవడం తల్లిదండ్రులికి మంచిది.

శాంత:- ఏమీ ఫరవాలేదు. అసలు నేను కళ్ళెర్ర చేశానంటే వాడు గజగజా వణికిపోతాడు.

జగ:- ఏమీ లాభంలేదు. ఆ అమ్మాయి కళ్ళు సన్నచేసిందంటే వాడు గజగజా బలిసి లేచి చక్కాపోతాడు.

శాంత :- నాదగ్గిర చెబుతారు ఎన్నికబుర్లేనాయనా!-! ఇల్లా నీ ఇష్టమొచ్చినట్లు ప్రేమించడమేనా ? మంచీచెడ్డా చూసుగోక్కర్లేదా ? పెద్దవాళ్ళని అడగక్కర్లేదా ? అని వాణ్ణి గట్టిగా నాలుగుమాటలు అడగలేరూ ! ఇంక వాడికి భయమూ, భక్తి ఎక్కణ్ణించి వస్తాయి? - ఏదో సంబంధం పుంచిదయిందిగనక సరిపోయింది.

జగ :- ఎందుకడగనూ?-అడుగుదామనే నీదగ్గిర రిహార్సలు వేశాను !- నువ్వు మళ్ళీ మధ్యలో అడ్డంపడి ఆగమన్నావంటే జాగ్రత్త ! - అన్నట్లు మరోటి ! - నేను ఈ సంబంధమే స్థిరపరుచు కొచ్చినట్టు పెళ్ళివారొచ్చేలోపల అబ్బాయి కెంతమాత్రం తెలియకూడదు. తెలిసిందా ?- రంగయ్యా !-రంగయ్యా !

రంగ :- (L.F. లోంచి వచ్చి) ఏం బాబయ్యా ?

జగ :- లోపలికెళ్ళి మంగమ్మగార్నడిగి వేడి వేడి కాఫీపట్రా !

రంగ:- సిత్తం !

శాంత:- రంగయ్యా!- అబ్బాయికి పెళ్ళివా రొస్తున్నారు.

రంగ:- ఏటి? సుందరంగారికే?- ఏవూరండి?

శాంత:- (ఉత్సాహంతో) ఈవూరే!- సక్కలుగా రమ్మాయి !- B.A. పిల్లి!

రంగ:- (ఆనందంతో) ఏటి?- సెప్పారుగారేం?

జగ:- (విసుగ్గా) చెప్పి గంటయింది!- వెళ్ళి కాఫీ తీసుగురా! (రంగయ్య R. F. లోకి వెడతాడు. జగన్నాధం శాంతకేసి కోపంగా చూస్తాడు)

శాంత:- ఏం? అల్లా చూస్తారేం?

జగ:- నోట్లో నువ్వుగింజనానదు!- ఇప్పుడేనా సంబంధం విషయం రహస్యంగా ఉంచవే అని చెప్పాను?

శాంత:- మరీబాగుంది. పీడికి చెబుతే ఏముంది?

జగ:- పీడెళ్ళి వాడురాగానే చెప్పెయ్యడుటండీ!- అప్పుడు నేనేమని కేక లేస్తానూ?

శాంత:- మరిచిపోయానండీ!- (రంగయ్య కాఫీ తెస్తాడు.)

జగ:- రంగయ్యా! ఈ పెళ్ళి సంబంధం మాట మన సుందరాని కేసి తెలియకూడదు.

రంగ:- అదేటి బాబయ్యా!-పెళ్ళి కాయమయిందన్నారుగదా?

జగ:- అయిందనుకో!-

రంగ:- అయితే ఇంకేటండీ!- అబ్బాయిగారి కోసం గుమ్మంలో కాత్తాను. ఆరు రాగానే ఒక్క గుక్కలో సెప్పేత్తాను. నవ్వుతున్న ఆ బాబుని ఎత్తుగు తీసుగొత్తాను ఇంట్లోకి!

జగ:- (నవ్వుతూ) బావుంది!- (కోపంగా చూసి) పీడు- బజారెళ్ళి ఏమన్నా తేవాలిదే?

శాంత:- (ముభావంగా) అన్నీ పొద్దున్నే తెచ్చాడు.

జగ:- (కోపంగా నవ్వుతూ) ఉహూ!- ఒరేయి. నువ్వు తక్షణం బజారు కెళ్ళి గెమేక్సీను పట్రా, రూపాయి ఇదిగో!- (అని, తీసి ఇస్తాడు)

రంగ:- (పుచ్చుకుంటూ) ఏటుందదీ?

జగ:- పురుగుల విషంరా!-బొజ్జింకలూ, నల్లులూ, ఆపీ చావడానికి.

రంగ:- ఓహో-అదాండి-గెమాస్కీము!

శాంత:- (అయిష్టంగా చూస్తూ) ఇప్పుడెందుకందదీ?

జగ:- ఎందుకేమిటి? - ఆక్కడ ఆఫీసులో బీరువాల్నిండా పురుగులా జేరి పుస్తకాలన్నీ తగలేస్తున్నాయి. ఎప్పటికప్పుడే చెబుదామని మర్చిపోతున్నాను. వెళ్ళి తీసుకురా!

రంగ:- సిత్తం! (అని L.F. కేసి తిరుగుతాడు)

జగ:- ఇల్లాదొడ్డిదారమ్మటవెళ్ళు!-ప్రతీదానికి హాల్లోంచి తయారవక్కర్లేదు!

రంగ:- సిత్తం!-(అని R.F. లోకి పోతాడు)

శాంత:- (వెనక్కాలే వెడుతూ) త్వరగా రా!-పెళ్ళివారొస్తున్నారు!

జగ:- (జేబులోంచి ఉత్తరం తీసి చదువుతూ, శాంత వెనకాలే నడుస్తూ, హేళనకింద అభినయిస్తూ) ఒకర్నొకరు బాగా అర్థం చేసుకున్నాం. మనసారా ప్రేమించుకున్నాం?

శాంత:- (గబుక్కని ఆగి) చాల్లెద్దురూ! - మీక్కూడా మతిపోతోందేమిటి? ఎవరేనా వింటే నవ్వుతారనేనా లేదు మనిషికి. ఇన్నేళ్ళొచ్చి పైగా ఇప్పుడు ప్రేమట! (అని సిగ్గుపడుతూ, చిరునవ్వుతో కోప్పడుతుంది)

జగ:- (విసుగ్గా) నీ మొహంలా ఉంది!-నేను చదువుతున్నది ఈ ఉత్తరం!-

శాంత:- (నిరాళగా) అంతేనా?-

జగ:- (L.F.లో ఏదో విన్నట్టు నటించి) ఆదుగో, సైకిలు చప్పుడయింది! సుందరం వచ్చాడు. నువ్వక్కడ కూచో!- నేనిక్కడ కూచుంటాను. వాడు వచ్చేటప్పటికి మనం కోపంతో మటమట లాడిపోతోండాలి, తెలిసిందా? - దాంతో వాడు పిల్లి అయిపోయి 'అదేమిటమ్మా!-' అంటూ ముందు సీకేసి తిరుగుతాడు, ఆమటుగా నేను అడ్డమెళ్ళి 'ఏడిశావు నోర్ముయ్!-' అని అందుకుంటాను.

శాంత:- (భయంగా జూస్తూ) మరి గట్టిగా కేకలెట్టకండేం? వాడసలే దురుసు మనిషి!-

జగ:- అల్లానేలే!-వస్తున్నాడు!-

(జగన్నాధం, శాంత కంగారుగా కూచుని L F. చేసి కోపంగా చూస్తూంటారు. సుందరం వచ్చి, పిళ్ళనసలు గమనించకుండా ఉత్సాహంగా కూనిరాగం తీసుకుంటూ M.B.లోకి చక్కాపోతాడు. జగన్నాధం తెల్లబోతాడు, శాంత నవ్వాపుకుంటుంది. అది జూచి జగన్నాధం కోపంతో హుంకరిస్తూ లేచి)

జగ:- సుందరం! సుందరం!

సుంద:- (M B. లోంచి వచ్చి, యదాలాపంగా) ఏం, నాన్నా!-

జగ:- (ఎగాదిగా చూసి) నువ్వు అవకాశ మిస్తే రెండు మాటలు మాట్టాడతాను !

సుంద:- అదేమిటి నాన్నా, అల్లా అంటున్నారు!

జగ:- మా ఇద్దరి అవసరమూ నీకు ఇంక పూర్తిగా అనవసరమని తేల్చేశావు, గనక!-

సుంద:- (తెల్లబోతూ) నేనా ?

జగ:- ఆ!- అక్షరాలా నువ్వే! - తల్లిదండ్రులికి కొడుకుమీద ఎంత మమకారం ఉంటుందో, ఎన్ని ఆశలుంటాయో, తండ్రి అయ్యేదాక ఏ కొడుక్కీ తెలిసిరాదు. కాని చదువూ సంస్కారమూ కలవాడివి కదా, కొంతేనా ఊహించుగో లేవూ? ఊహించుకున్నా కనీసం మా ఇష్టా యిష్టాలు గుర్తించవలసిన గౌరవానికి కూడా మేం తగమనుకున్నావా? ఏమిటసలు నీ ఉద్దేశం ?

సుంద:- (ఏమీ అర్థంకాక, తల్లివైపు తిరిగి) ఏమిటమ్మా ఇది?

శాంత:- అది కాదురామరీ!- (అని ప్రారంభించి జగన్నాధం కోపంచూసి ఆగిపోతుంది)

జగ:- నేను నిన్నడిగాను. నిజంచెప్పగలిగిన ధైర్యంఉంటే నాకు చెప్పు!

సుంద:- పిరడిగే దేమిటో నాకు అర్థం అవటంలేదు. అయినా మీకిష్టం లేంది, కష్టం కలిగించేదీ, ఏ పనీ ఎప్పుడూ నేను చెయ్యలేదు?

జగ:- (యీసడింపుగా) ఒక్క ముక్కలో కొట్టేశాడు!

సుంద:- పోనీ, మీరు చెప్పండి నాన్నా! నేనేం తప్పుచేశాను?

జగ:- అయితే నే నడిగిన వాటికి డొంకతిరుగళ్ళు, తిరకుండా, అబద్ధ మాడకుండా నిజం చెబుతావూ?

సుంద:- చెబుతాను.

జగ:- మన వంశానికి ఏమన్నా గౌరవప్రతిష్ఠలున్నాయా?

సుంద:- ఉన్నాయి.

జగ:- ఆ గౌరవ ప్రతిష్ఠలు నిలబెట్టవలసిన సమిష్టి బాధ్యత మనందరిపైదా ఉందా ?

సుంద:- ఉంది !

జగ:- అందులో నేనెక్కువ బాధ్యత వహించానంటావా, లేదంటావా?

సుంద:- లేదనేటంత సీచుణ్ణికాదు నాన్నా, నేను!

జగ:- ఫరవాలేదులే!- ఏ విషయంలోనేనా బాధ్యత ఎక్కువ వహించిన వాళ్ళకి హక్కులుగూడా ఎక్కువ ఉండడం న్యాయమేనా?

సుంద:- న్యాయ మేమిటి నాన్నా, ఉండి తీరాలి.

జగ:- అల్లాం టప్పుడు, ఈ వంశ విస్తరణ విషయంలో స్వతంత్రంగా, నిరంకుశంగా వ్యవహరించడానికి నీకు ఒక్కడికీ పూర్తి హక్కు ఉందా ?

సుంద:- లేదు!

జగ:- లేదని తెలిసికూడా ఆ హక్కు నువ్వెందుకు పుచ్చుగున్నావు? మమ్మల్ని విస్మరించి, స్వతంత్రించి పెళ్ళి చేసుగుంటానని ప్రమాణం ఎందుకు చేశావు?

సుంద:- పెళ్ళా?- ప్రమాణమా? (తెల్లబోతాడు)

జగ:- అవునురా!- కమలకి!-

సుంద:- (హుషారిపోయి) కమలా?

శాంత:- మరేరా! సర్కసులుగా రమ్మాయి!

సుంద:- (నమ్మలేనట్టు చూస్తూ) మీకెల్లా తెలుసూ?

జగ:- (శాంతతో) నవ్వూ నోర్మూయి! (సుందరంతో) ఎవర్రా ఈ కమల?

సుంద:- కమల నాన్నా ! (తబ్బిబ్బయిపోయి) ఆదే! విక్రమ రావుగారి అమ్మాయి.

జగ:- నువ్వు ప్రేమించావా?

సుంద:- (ఆశగా చూస్తూ) మరే నాన్నా!

జగ:- (గంభీరంగా) ఎందుకు ప్రేమించావు?

సుంద:- (తెల్లబోయి) ఎందుకా?

జగ:- (దగ్గరగా వస్తూ) ఏం? అల్లా తెల్లబోతావేం? ప్రేమించి పెళ్ళి చేసుగోకుండా బతగలేనని ఎల్లా నిర్ణయించుగున్నావు? నిర్ణయించుగుని పెళ్ళి చేసుగుంటానని ఏ ధీమాతో స్వతంత్రించి ప్రమాణం చేశావు? అసలు మేం ఇద్దరం బతిగున్న సంగతి మరిచిపోయావా? అనవసరం అని తేల్చుగున్నావా? ఏం మాట్టాడవేం? (అంటూ ఆ ధూకుడులోనే మధ్యనున్న శాంతతో)- your honour! ఒహో నువ్వా? మళ్ళీ ఎందుకు లేచావు? మాట్లాడొద్దని చెప్పలే?-

శాంత:- (ఉక్రోషంతో) మీరన్ని ప్రశ్నలూ ఒక్కసాగే అడిగేస్తూంటే వాడు సమాధానం ఎల్లా చెబుతాడు?

జగ:- అదా సి రూలింగు? ఏమీ కిష్టంలేదు. పీటన్నిటికి ఒకటే సమాధానం. వెట్టి మొహం వెయ్యడం. నువ్వుకూడా వేసుగుని ఆల్లాకూచో!

సుంద:- క్షమించండి, నాన్నా! ఏరోజు కారోజే మీతో చెబుదా మనుకుంటున్నాను గాని అవకాశం చిక్కటంలేదు.

జగ:- ఈ శషభిషలేం నాదగ్గర పనికిరావు. నువ్వు హద్దు మీరి వ్యవహరించావా లేదా?

సుంద:- మీరు కూడా పూర్తిగా అంగీకరిస్తారని ఆశించాను.

జగ:- (బింకంగా) నువ్వు హద్దుమీరి వ్యవహరించావా లేదా?

సుంద:- ఇది నా జీవిత సమస్య నానా!-

జగ:- (నిశ్చలంగా, మొండిగా) నువ్వు హద్దుమీరి వ్యవహరించావా లేదా?

సుంద:- వ్యవహరించాను.

జగ:- అందుకనే చెబుతున్నాను. నేనీ పెళ్ళికి అంగీకరించను.

సుంద:- నాన్నా!- మరోసారి ఆలోచించండి. నేనూ, కమలా మనసారా ప్రేమించుకున్నాం, పెళ్ళి చేసుకుంటానని ప్రమాణం కూడా చేశాను.

జగ:- నికేం భయంలేదు. ఏ వస్తువు మీదేనా హక్కు ఇచ్చేవాడికే లేకపోతే పుచ్చుకునేవాడికి ఎక్కణ్ణుంచి వస్తుంది? Sale of goods Act. కర్తకే హక్కు లేని ప్రమాణం భూమ్మీద ఏ కోర్టులోనూ చెల్లదు.

సుంద:- నా మాట వినండి, నాన్నా !

జగ:- పాయింటు లేకుండా వాదించకు, సుందరం ! ఇంక ఆ గొడవ ఒదిలెయ్. నేను మరో సంబంధం నిశ్చయం చేసుకొచ్చాను.

సుంద:- (దెబ్బ తిన్నట్లు చూస్తూ) నాన్నా! మరో సంబంధమా?

జగ:- అవును!- సంబంధం అన్ని విధాలా యోగ్యమైంది. ఆస్తిపాస్తులుంది, చదువూ సంస్కారమూ కలిగి, అంద చందాలతో నిండిన పిల్ల. తాంబూలాలు పుచ్చుకుందుకు పెళ్ళివారిని ఇప్పుడే అయిదు గంటలకి రమ్మన్నాను.

సుంద:- వీల్లేదు, నాన్నా!- నా కమలకి నేను ద్రోహం చెయ్యలేను- ఈ పెళ్ళి చేసుకోడానికి నే నెంత మాత్రం అంగీకరించను.

జగ:- అయితే, నీ కమలకోసం కన్న తల్లిదండ్రులకి కూడా ద్రోహం చెయ్యటానికి సిద్ధపడతావన్నమాట!

సుంద:- అంతమాట అనకండి. నాన్నా! మీరిద్దరూ నాకు దైవసమానులు. కమల నా ప్రాణం!- ఏమిటమ్మా ఇదంతా?-

శాంత:- (తోసుగొస్తున్న బాధ ఆపుకోలేక) బాధపడకు సుందరం! (భర్తతో ప్రార్థిస్తున్నట్టు) ఏమండీ!

జగ:- నువ్వేం మాట్టాడ్డానికి వీల్లేదు!

శాంత:- (ఏడుస్తూ) నేనింక ఊరుకోలేను!

జగ:- అయితే వెంటనే లోపలికెళ్ళు! వెళ్ళు!- (శాంత భర్తవైపు రోషంతో చూచి R F. లోకి వెళ్ళిపోతుంది) ఆలోచించుకో సుందరం!- అవతల పెద్దమనిషికి మాటిచ్చాను. నా గౌరవమర్యాదలసి, నీ ప్రేమ వ్యవహారాలనీ తూచుగు చూసుగో!- తేల్చుగు చెప్పు!

సుంద:- పోనీ, ఈ సంబంధం విషయం నాతో ముందుగా చెప్పకపోయారా ?

జగ:- నువ్వేమన్నా ముందుగా నాతో చెప్పావు, కనకనా? ఏదో కాలేజీకి వెళుతున్నావు, బుద్ధిగా చదువుకుంటున్నా వనుకున్నాను గాని, మధ్యలో మిఠాయి దుకాణం పెట్టావని నాకేం తెలుసు? జరిగిందేదో జరిగి పోయింది. అదంతా మర్చిపో! ఇహనో ఉప్పుడో పెళ్ళివారొచ్చే సమయంకూడా సమీపించింది. నా గౌరవం నిలబెట్టవల్సుగున్నావో, గోరీ కట్టియ్యా దల్సుగున్నావో నిర్ణయించుగో! నా నిర్ణయం మాత్రం మారదు. లోపల పడుండి, అయిదు నిమిషాల్లో వస్తాను. (అని విసురుగా R.F. లోకి వెడతాడు).

[సుందరం భిన్నుడై R.F. లోకి చూస్తూ ఉండిపోయి నిట్టూర్చి ఆవేశంతో L. F. వరకూ నడిచి ఆగిపోయి ఆలోచించి వెనక్కి తిరిగి సోఫావైపు వస్తూ, "చివరికి ఎల్లా అయింది నా బ్రతుకు !" అనుకుని కోటు తీసేసి విరక్తితో సోఫాలో గిరవాటేసి, సోఫాలో కూలబడి బరువుగా, భారంగా చేతుల్లో మొహం దాచుగుని మధన పడతాడు]

రంగ:- (చేత్తో పొట్లం పుచ్చుగుని L.F. లోంచి వస్తూ, ఉత్సాహంగా) వచ్చారా, బాబయ్యా!

సుంద:- ఏమిటిది, రంగయ్యా!

రంగ:- ఇషమండి!

సుంద:- (ఆశ్చర్యంగా) ఆ !-విషమా?

రంగ:- (విసుగ్గా) ఆ- అయ్యోగారికి పని నేకపోతేసరి!- శుభమా అంటూ పురుగుల విషం తెమ్మన్నారు. (అంటూ ఆ పొట్లం రేడియో బిల్లి మీద ఉంచేసి, నవ్వుతూ, ఆనందంతో) ఆది సరేగాని, తమరింకా ఇల్లా కూకున్నారేం ?

సుంద:- (విచారంగా, నవ్వి) ఏం చెయ్యమంటావు ?

రంగ:- ఇదేటండీ-కాంబూలా లుచ్చుగుందుకు పెళ్ళివారొత్తూంటే పెళ్ళికొడుకు గారు ఎల్లా ఉండాలి!- చాకల్లా సోకు సేసుగుని వాల్‌రైట్ నెంబరు వన్ లా ఉండాలి !- సంది!

సుంద:- (బాధగా) నేనంటే నీకూ ఇంత వేళాకోళంగా ఉందా రంగయ్యా!

రంగ:- అబ్బా, ఈ సిగ్గు, సిటపటలూ, సదువుకున్నాళ్ళకి సామాన్యమే !- కానండి అబ్బాయిగారు ! ఇంక మీ సైకిలికి దీపం నేకపోయినా ఇబ్బంది నేదు.

సుంద:- (గట్టిగా) రంగయ్యా !

రంగ:- (హడలిపోయి) ఏటండీ!—

సుంద:- (కోపంగా లేచి) వాగుడు కట్టిపెట్టి నోరు మూసుగుని లోపలికెళ్లు!-

[రంగయ్య తెల్లబోయి చూసి ఏమీ అర్థమవక R.F. లోకి పోతాడు. సుందరం విసుగెత్తి పోయినట్లు చూసి M.B. వైపు విసురుగా తిరిగి, రేడియో బల్లమీదున్న విషం పొట్లం దగ్గర ఆగిపోతాడు. బల్లని సమీపించి, ఆ పొట్లం తీసి, తీక్షణంగా చూస్తూ ఆలోచిస్తాడు, సిట్టూర్చి. తల పంకించి పొట్లం రేడియో బల్లమీద ఉంచేస్తాడు. రంగయ్య, సాసర్లతో నాలుగు కాఫీ కప్పులు, నిండుగా ఉన్న కాఫీ పాట్ ఒక ట్రేలో ఉంచి పట్టుగొస్తాడు.]

సుంద:- ఇదంతా ఎవరికి, రంగయ్యా ?

రంగ:- (ముభావంగా) పెళ్ళోరికండి!

సుంద :- నాకన్నగారేం చేస్తున్నారు?

రంగ :- మేకమీద కెళ్ళారండి !

సుంద :- అమ్మగారూ?

రంగ :- ఆహూనండి ! అదేటో గాని అమ్మగారొక్కరూ కదుల్తే అయ్యగారు కస్సుమంటున్నారండి !

సుంద :- (రోషంతో) ఊహూ ! తమరి మాట నెగ్గించుగు తీర్తారన్న మాట ! సరే ! ఒరేయి నువ్వు వీధులో కూచుని ఎవరేనా వస్తూంటే చెప్పు !

రంగ :- అమ్మగారు పిలుత్తారండి !

సుంద :- (కోపంతో) జన్మ అంతా వాళ్ళకే చెయ్యడా !— ఈ ఒక్కసారీ నా మాట విను. ఇంకెప్పుడూ ఏమీ అడగను !

రంగ :- మాటంటేనే అంత కోపం ఎందుకండి ? ఎడుతున్నానుగా ? (L.F. లోకి వెళతాడు)

[సుందరం గబగబా రేడియో బల్ల దగ్గిరికి వెళ్ళి ఆ పొట్లం తీసుకుని వచ్చి, నెర్వస్‌గా విప్పి, రెండు మూడు చెమిచాలు ఓ కప్పులో వేస్తాడు. మళ్ళీ మరో రెండు చెమిచాలు వేస్తాడు. పొట్లం మళ్ళీ యధాప్రకారం కట్టేసి, రేడియోబల్ల మీద పెట్టేసి వచ్చి నిళ్ళు యించుగున్నట్టు చూస్తూ, ఆ కప్పు సాసరుతో సహా తీసి చేత్తో పట్టుకుని మళ్ళీ ఆలోచన తెగనట్టు రేడియో బల్లకేసి నడుస్తాడు. రంగయ్య L. F. లోంచి తొందరగా వస్తాడు సుందరం కప్పు సాసరు హడావుడిగా రేడియో మీద ఉంచేసి రంగయ్యకి అది కనపడకుండా నుంచుంటాడు.)

సుంద :- (నెర్వస్‌గా నవ్వుతూ) ఏం రంగయ్యా ?

రంగ :- ఆర్జంటుగా మాట్లాడాల్టండీ. తమ కోసం ఎవరో అమ్మాయిగారొచ్చారు.

సుంద :- (విసుగ్గా) ఎవరా అమ్మాయి?

రంగ :- ఎవరో కమలమ్మగార్టండి !

సుంద :- (ఉత్సాహంతో) కమలా !- (అని రంగయ్యని పక్కకి నెట్టి L. F. లోకి తొందరగా వెడతాడు)

(R. F. లోంచి జగన్నాధం, శాంత వస్తారు]

జగ :- అబ్బాయి ఏడిరా?

రంగ :- ఎవరో అమ్మాయి గారొత్తె ఇప్పుడే ఈధులో కెల్లా రండి.

జగ :- అమ్మాయా ?

రంగ :- మరేనండి. కమలమ్మగారంట !

శాంత :- ఏమిటి !- కోడలుపిల్లే?- చూశారా. మామగారి కంటె నాజుగాడులు ఎక్కువే చదివింది కోడలు ?

రంగ :- ఏటి?- ఈ అమ్మాయిగారే పెళ్ళికూతురు ?

జగ :- (విసుగ్గా) ఆ !- సమయానికొచ్చి స్వారస్యం కాస్తా చెడగొట్టింది. ఒరేయి!- నోరు తేలేసుగుని ఆల్లా నుంచోక పోతే ఆ బ్రై అక్కణ్ణించి తీసెయ్య కూడదూ ? నలుగురూ వచ్చినప్పుడు అడ్డంగా పెట్టద్దని చెప్పలే?-

[L. F. లోంచి 'జగన్నాధంగారూ! జగన్నాధంగారూ!' అని కేకలు వినిపిస్తాయి]

అదుగో పెళ్ళివారొచ్చినట్టున్నాడు. సమయానికి హాల్లో ఒక్కడూ ఉండడు. వెళ్ళి లోపలికి తీసుగురా రంగయ్యా !

శాంత :- ఒరేయి, నువ్వాపని చూడు ! మీరెళ్ళి తీసుగురండి !

జగ:- (చురచుర చూస్తూ) పెళ్ళికొడుకు తల్లికదూ ! ఇహ మొదలు!- (తొందరగా L.F.లోకి వెడతాడు)

శాంత:- (రంగయ్య బ్రై రేడియో బల్లమీద పెట్టాక) ఆ పొట్లమేమిటి, రంగయ్యా?

రంగ:- ఇదాండి! పురుగుల ఇషమండి!

శాంత:- ఛ్ఛ! మతిలేకపోతేసరి! – అని పట్టిగెళ్ళి వారి ఆఫీసు గదిలో పారెయి-ఏ గుమాస్తావో తింటాడు, తీరిపోతుంది!-

[రంగయ్య పొట్లం తీసుకొని M B.లో వెడతాడు, శాంత చీక వగైరా ఉత్సాహంతో సర్దుకుంటుంది. L. F. లోంచి జగన్నాధం, సర్కిలు ఇన్ స్పెక్టరు విక్రమరావు, వేదాంతి జ్ఞానశ్రీ ప్రవేశిస్తారు.]

జగ:- (వారికి కుర్చీలు చూపిస్తూ) దయచేయండి!-ఏమేవ్! మన విఘ్నం కులు విక్రమరావుగారు! (విక్రమరావు నమస్కరిస్తాడు)

శాంత:- ఆల్లానా?-నమస్కారమండి.

జగ:- (జ్ఞానశ్రీ వైపు చూపిస్తూ) వీరు?-

విక్ర:- మా మామగారు!-జ్ఞానశ్రీగారు!

జగ:- (ఆశ్చర్యంగా) ఏమిటి?-సాక్షాత్తూ ఆ జ్ఞానశ్రీగారే! దయచేయండి!-ఇన్నాళ్ళూ తమ అమూల్య వేదాంత రచనలు పారాయణ చేసుకోవడమేగాని, తమర్ని దర్శనం చేసుకునే అదృష్టం కలుగలేదు. ఈవేళ తమ రాకతో మా ఇల్లు నిజంగా పావనమయింది. (జగన్నాధం, శాంత నమస్కరిస్తారు.)

జ్ఞాన: బాలాకృతజ్ఞుణ్ణి! (నమస్కరిస్తాము. అంతా కూచుంటారు.)

జగ: ఎంతమాట! (శాంతతో) వారెవరో తెలుసా! మన దేశానికి విజ్ఞాన దీపం అని ప్రఖ్యాతి చెందినవారు. వేదాంత పరిజ్ఞానంతో అద్వితీయులనిపించుకున్నవారు.

శాంత: అల్లానా?- మన సుందరం నిజంగా అదృష్టవంతుడండీ!

జగ: ఇంకా సందేహమా?- అన్నట్లు భగవద్గీతావ్యాఖ్యానం తరువాత మళ్ళీ తమ రేమైనా రాశారా?

జ్ఞాన: రచనకూడా ఒకవ్యసనమే! అలవాటుపడ్డ చేతికి, చెయ్యాడుతున్నంత సేపూ ఆటవిడుపు ఉండదు. అంతా భగవత్సంకల్పం. ఈమధ్యనే ఉపనిషత్సారమనే రచన పూర్తి చేశాను. అచ్చు అవుతోంది.

జగ: ఉపనిషత్సారమే! చాలా బాగుంది.

శాంత: రంగయ్యా!- కాఫీలు తీసుకరా!

జ్ఞాన: ఈమధ్య జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో మా అల్లుడు చూపెట్టిన ధైర్యసాహసాలకి నేను కేవలం ముగ్ధుణ్ణయి, పండితుణ్ణి మాత్రమే గనక, ఈ గ్రంథాన్ని అతనికి అంకితం ఇవ్వదలిచాను.

జగ: తప్పకుండా ఇవ్వవలసిందే.

విక్ర: ఆ! మంటల్లో దూకడంకూడా ఓ ఘనకార్యమే?- ఇల్లాంటివి మా ఉద్యోగంలో నిత్యకృత్యాలు.

శాంత:- (ఆశ్చర్యంతో) ఏమిటి?- నిత్యకృత్యాలా ?

విక్ర:- అక్కగారు ఈమాత్రానికే ఆశ్చర్యపడుతున్నారు. నేను మిలటరీలో పనిచేసిన రెండేళ్ళలోనూ ప్రతీరోజూ రెండు చెవుల్లోంచి తుపాకీ గుళ్ళు దూసుగుపోయేవి. కత్తులు తెగగీసుగుపోయేవి.

శాంత:- అబ్బ!- ఇంక చెప్పకండి. నాకు భయమేస్తుంది!

(అంతా నవ్వుతారు)

జగ:- ఒరేయి, రంగయ్యా!

రంగ:- (M.B. లోంచి) బాబయ్యా!

జగ:- ఏం జేస్తున్నావురా?- కాఫీలు ఇయ్యి.

రంగ:- సిత్తం !

జగ:- (ఉత్సాహంతో) ఊ! - బావగారు తాంబూలాలకి ఆయుధాలుచ్చుగుని బయల్దేరారేమిటి?

విక్ర:- ఇదా?- (నవ్వి) బజారులో పని చూసుగుని మామగారు స్టేషను కొచ్చారు. ఇద్దరం ఇంటికెళ్ళి సక్రమంగా వద్దాం అనుకుంటుండే ఇంతలో ఏక్సిడెంటని ఫోను వచ్చింది. దాంతో ఆలస్యమయిపోయింది. అంచేత ఇల్లానే చక్కావచ్చాం.

జగ:- ఏక్సిడెంటే?- ఏమిటది? (రంగయ్య పాట్‌లో కాఫీ ట్రేలో ఉన్న మూడు కప్పుల్లోనూ పోస్తుంటాడు)

విక్ర:- ఆ!- ఎవడో కుర్రాడిమించి లారీ వెళ్ళిపోయిందట.

జగ:- రామ, రామ! -

శాంత:- పోనీ, ఆ కుర్రాడు బతికాడాండీ పాపం?

జగ:- ఇంకా బతకడమేమిటే? - మీద నుంచి వెళ్ళింది. చంటి పిల్లాడి సైకిలనుకుంటున్నావేమిటి? - దారుణమైన లారీ!

శాంత:- చావు ఎంత విచిత్రంగా ఉన్నాయి, ఈ రోజుల్లో!

[నాలుగో కప్పుకోసం తటపటాయించి, రంగయ్య రేడియో మీదున్న కప్పు సాసరు ట్రేలో పెడుతూంటాడు]

జగ:- (విసుగ్గా) ఏరా ? -

రంగ:- ఇదుగోనండి! - (అని కంగారుగా ఆ కప్పులోగూడా కాఫీ పోస్తాడు చెమటలతో సుబ్బరంగా కలుపుతాడు)

విక్ర:- అసలు విచిత్రమేమిటంటే, ఆ కుర్రాడు బతిగాడు.

శాంత:- (ఆశ్చర్యంతో) ఏమిటీ? -

జగ:- What ? -

విక్ర:- పైగా లారీలో ఉన్న డ్రైవరు గుండె ఆగి చచ్చిపోయాడు.

శాంత:- అయ్యో ! -

జగ:- చాలా విచిత్రంగా ఉందే? లారీకింద పడ్డవాడు బతిగి, నిక్షేపంలా లారీలో కూచున్నవాడు పోవటమేమిటి?

[రంగయ్య ట్రే తీసుగు వచ్చి నిలబడతాడు]

జ్ఞాన:- చూపు పడాలేగాని మృత్యువుకి చోటుతో పనేముందంది? - "జనన మరణములు జనులకు నిక్కము అడివిలో నున్న, ఆలయంబున నున్న!-"

జగ:- ఏం చక్కగా శలవిచ్చారు!- ఎవరికి ఎప్పుడు ఋణం తీరిపోతుందో ఎవరు చెప్పగలరు ? - కాఫీ ఇవ్వరా ! (కాఫీలు అంతా అందుకుంటారు)

జ్ఞాన:- బాధపడవలిసింది బాన్ని గురించికాదు. ఈ ఋణం ఎంత పెంట్రాళ్ళే తీరిపోతుందా అని. పాప పంకిలం కదండీ, ఈ ప్రపంచకం? విముక్తుడైనవాడే ధన్యుడు. "సంస్పృజ్యతే నఉత్కామన్ ప్రియ మాణః పామ్సనో విజహాతి" అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. (అని కొంచెం తాగుతాడు)

శాంత:- (కొంచెం చప్పరించి) అల్లానాండి? - అయితే ఈ మనుష్యులకి మృత్యువంటే ఇంకా భయం దేనికండి!

జ్ఞాన:- (కొంచెం చప్పరించి) అజ్ఞానమండీ, అజ్ఞానం! - మృత్యువుచేసే పనేమిటి, చెప్పండి? దేహాన్నుంచి, ఆత్మను వేరు చేస్తుంది. ఇహానికి మనకీ అనుబంధాన్ని అంతరింప జేస్తుంది. బ్రహ్మరుద్రులైనా దాని దారికి అడ్డురాలేరు. అయినాసరే ఈ దేహాన్ని నమ్ముకుని ఇహాన్ని అనుకుని మనకి మనమే పొదిగి పెంచుగున్న ఈ ఐహిక బంధాలు మనలో శాశ్వతత్వాన్ని ప్రేరేపిస్తాయి. కాని అశాశ్వతమయి తీరుతుందని అనుభవం మనకి సిద్ధాంతీకరిస్తుంది అప్పుడే మనస్సు మధనపడుతుంది. బంధాలను తెంచుగోలేక, మృత్యువుని ఎదుర్కో-

లేక చివరకి భయానికి కానిసయిపోతుంది. కాని, అనుభవాన్ని ఆధారంగా చేసుగుని, విద్యని పనిముట్టుగా ఉపయోగించుకొని అర్థం లేని ఈ ఐహిక బంధాలను మనకి మనమే తృంచివేసుగున్ననాడు మనకీ మృత్యువంటే, భయంకాదు ఖాతరే ఉండదు! (చప్పరించి మొహం చిట్లించి) కొంచెం పంచదార వెయ్యి, నాయనా!

జగ:- (రంగయ్య ట్రేలో పంచదార కప్పు చెమిచా జ్ఞానశ్రీకి అందించాక తనూ మొహం చిట్లించి) ఇల్లా ఉండేమిట్రా ! ఏ పనీ తిన్నగా చెయ్యవు ! (అని విసుక్కుంటూ తనుకూడా పంచదార కలుపు గుంటాడు.)

విక్ర:- మృత్యువు గురించి మేమంత ఆలోచించ లేదుగాని మనకి స్వతహాగా మృత్యువంటే తెగనిర్లక్ష్యం! ఎంచేతంటే, మృత్యువుకీ మాకూ ప్రతీ రోజూ ముఖాముఖీ ఓ చిన్న పీటింగవుతూనే ఉంటుంది. అంతేకాదు. చివరికి ఈ మృత్యువుకి కూడా మేమంటే భయమేది చెప్మాఅని విసుగేసుకొస్తోంది! (అని కాఫీ చప్పరిస్తాడు.)

జ్ఞాన:- (కాఫీ మళ్ళీ పీల్చి) యోధులకి ఆ ధిక్కారం ఉగ్గుపాలతో వస్తుంది!

జగ:- (హాయిగా, తలపంకించి; చిరునవ్వుతో) ఆదేం చిత్రమోగాని నాకూ మృత్యువంటే మహా నిర్లక్ష్యం సుమాండి ! నిండైన జీవితాన్ని అనుభవించేశాను. గృహస్థాశ్రమ ధర్మాలను అనుసరించి ఆచరించవలసిందంతా చేశాను. వలితం గురించి అసలు నేనెప్పుడూ ఆలోచించను.

జ్ఞాన:- చాలాబాగుంది. కర్మణ్యే వాధికారస్తే మావలేషు కదాచన ?

జగ:- చిత్తం ! ఇంక నాకు కావలిసిందేముంది, చెప్పండి? "నీ ఇష్టం వచ్చినప్పుడురా !" అని మృత్యువుకి కాలదోషం లేని నోటీసు ఒకటిచ్చేసి కూచున్నాను.

శాంత:- ఆమాటకొస్తే ఐహిక బంధాలూ, ప్రాపంచిక చింతలూ మగవాళ్ళకిందే ఆడవాళ్ళకే చాలా తక్కువ !

జగ:- ఆమాటమాత్రం ఉంది చూశారూ, అది ఒప్పుగోడానికి ఎంత మాత్రమూ పిల్లెదు! ఒకసారి ఈ మనిషే వజ్రాలవజ్రాణం కావాలని మూడు రోజులు ఉపోషాలుచేసి మరీ సాధించింది !

శాంత:- (చిరకోపంతో) చాల్లెద్దురూ! జీవితానికల్లా నే నడిగింది అదొక్కటేగా? పైగా ఇల్లా మొదలెడితేనే పెట్టుకోడానికి కూడా విసుగేసుగొచ్చి పెట్టిలోనే పడేశాను. అయినా, అవేమన్నా ఆకలితీరుస్తాయా, కన్ను మూశాక కూడా వస్తాయా? ఏమిటో! ఆసలిప్పుడు అబ్బాయికి అన్నివిధాలా తగిన సంబంధం వచ్చిందా, ఇంక నాకే భ్రాంతిలేదు! ముత్తైదువుగా మాత్రం ఈ తనువు చాలిస్తే చాలని ముక్కోటి దేవతలకీ మొక్కుతున్నాను. అంతే!

[కాఫీ తాగడానికి కాగుండలేదన్నట్లు మొహం పెట్టి రంగయ్యకేసి కోపంగా చూచి కాఫీ కప్పు టీ పాయిమీద పెట్టేస్తుంది.]

జ్ఞాన:- అంతేనండి! జీవిత పరమార్థం తెలుసు గున్నాక ''దేహమే నాది కాణాచి దానిమీద తీపి కొరగాదు'' అనిపించి తీర్తుంది. శుద్ధ పామరత్వంగాని మనమెంత. మన తనువెంతండీ! ఇది ఉత్త నీటి బుడగ కదండీ? తేల్తాం, పేల్తాం! అంతే!- ''కలుములు నిత్యంబుకావు, మెరపు మెరయురీతి. మేఘంబులట్ల, బుద్బుదంబుల తంగి పోవును చెదరి!''

జగ:- ఆహా! జ్ఞానశ్రీగారూ! మీరు మా ఇంట్లో ఉండి పోకూడదూ?

జ్ఞాన:- ఎందుకూ?

రంగ:- తమరి పురాణం అత్తమానం ఇనచ్చుగందా అని!- (అంటా నవ్వి తాడు)

జగ:- పురాణమేమిట్రా, నీ మొహం!- ఈ కప్పులు తీసెయ్!

రంగ:- సిత్తం? (జ్ఞానశ్రీతో) నాకేవి తెల్దని అయ్యగారి అభిప్రాయం. మాటలకి అర్థాలు పూర్తిగా తెలవకపోయినా మొత్తమ్మీద సంగతేటో నాగేత్తానంటి!

జగ:- (హేళనగా) ఆ, ఆ!- అల్లాగ లాగే ఒకసారి నా ప్రాణం మీదికి తెచ్చాడు.

రంగ:- (కప్పులుతీస్తూ) ఉండండయ్యగారూ!- (జ్ఞానశ్రీతో) నాతో సిన్న సంగతి సెప్పనాండీ!

జ్ఞాన:- అవశ్యం చెప్పు. ఏమిటది?

రంగ:- వేదాంతంకన్నా, ధైర్యంకన్నా, తెలివితేటలుకన్నా సివరికి భక్తికన్నా దరిద్రం గొప్పదండి!

జ్ఞాన:- చాలా కచ్చితంగా చెబుతున్నావే?

రంగ:- సిత్తం! ఎంత వేదాంతం తెలిసినా, ఎంత ధైర్యం ఉన్నా, ఎన్ని తెలివితేటలున్నా, ఎంతభక్తి ఉన్నా ఐతుకుమీద ఆశమాత్రం పూర్తిగా పోదండి. కాని దరిద్రం మాత్రం దండిగాఉంటే, బాబయ్యా! మడిసికి ఐతుకుమీద ఆశ సత్తెప్పమానికంగా ఎంటనే పోద్ది!

[ఒక్క క్షణం ఒకరికేసి ఒకరు చూసుగుంటారు]

జగ:- ఆరి పీడి శిఖాతరగా!- వీడు వెప్పిందాఁటో కొంత పాయింటు ఉందండోయి!

జ్ఞాన:- లేదండి, జగన్నాథంగారూ?- నానాబాధలు పడుతూ విముక్తి కోరే వాడికీ, సకలసుఖాలూ అనుభవిస్తూ విముక్తి అర్థించేవాడికీ తేడా లేదూ?- అంతేకాదు, దారిద్ర్యం, బాధా జలాక్షరాలు. వేదాంతం, విజ్ఞానం శిలాక్షరాలు!

జగ:- అదీ పాయింటేనఁదోయి!-

[L F. లోంచి సుందరం ఉత్సాహంగా వస్తాడు.]

శాంత:- అదుగో, సుందరం వచ్చాడు!

జ్ఞాన:- ఇతనే నేమిటి; మన కమలనాభుడు!

జగ:- (ఉత్సాహంగా) ఒరేయి సుందరం!- వారెవరో తెలుసా? జ్ఞానీ గారు!- మీ మామగారికి మావగారు!

సుంద:- (ఉత్సాహంగా) సుప్రీం కోర్టన్నమాట!- నమస్కారమండి!

జగ:- సంతోషించాం గాని, ఇంత ఆలస్యం చేశావేం?

సుంద:- ఆ!- ఎవరో స్నేహితు డొస్తేనూ!-

జగ:- నాకు తెలుసురా ఎవరొచ్చారోనూ!-

సుంద:- అదీ తెలిసిందీ?- కాని, నాన్నా!- మీరెంత నాటకం ఆడారు!

జగ:- ఏమనుకున్నావు మరీ? నీ గుండు పురాణీలు నా దగ్గిర పని కొస్తాయిరా?

సుంద:- అమ్మకూడా అల్లాగే నీబడేప్పటికి నిజం ఆనుకుని నేను చాలా బాధపడిపోయాను.

శాంత:- (బాధగా) చూశారా?- (సుందరంతో) ఏం చెయ్యనురా? మన లెక్కే మన్నా ఉంటేగా? ఆయనకి ఎంత తోస్తే అంతే!

క్షీన:- ఏమన్నా స్వవిషయమా?

జగ:- అదేంకాదు. మంచితమాషా జరిగింది, శ్రద్ధగా వినండి! - (ఉత్సాహంతో) ఊ!- బాధపడి చివరికి ఏమాలోచించావురా?

సుంద:- ఆలోచనేముంది నాన్నా!-సర్వనాశనం అయిపోయానన్నకున్నాను. చివరికి నామీద నాకే ఆసహ్యమేసి - (అని రేడియో బిల్లవై పుచూసి కప్పు, సాసరూ కనపడకపోగా నోరు తెరుచుగుని నిలబడిపోతాడు.)

జగ:- ఊ!- ఆసహ్యమేసి? ఏంజేశావు? (అని ఉత్సాహంగా చూస్తాడు.)

సుంద:- (బిగుసుగుపోయి) రంగయ్యా! - బిల్లమీద కప్పు సాసరూ ఏమయాయి?

జగ:- అబ్బో. మాట మార్చకుండా చెప్పవోయి! - నే చెప్పలా? - వీడేదో దూడేసి ఉంటాడు.

సుంద (కంగారుగా, భయంగా) మీరుందరంకి, నాన్నా! - రంగయ్యా! - అక్కడ కప్పేంచేశావు!

రంగ:- (కంగారుగా) అక్కడిదేనాంకి?

సుంద:- ఈదేరా! - ఏంజేశావు?

రంగ:- కాఫీపోసి ఆ రెపరికో ఇచ్చానండి!

సుంద:- (హడలిపోయి) ఏమిటి! ఆడే!! - (నోరుమూసుగుని గుడ్లు పేల్తున్నట్లు చూస్తాడు)

జగ:- రంగయ్యా! - వాడికో కప్పు కాఫీ ఇయ్యి?

శాంత:- ఏమిట్రా సుందరం, ఆ అల్లరి?

సుంద:- అల్లరి కాదమ్మా! - (చెప్పబోయి సంజ్ఞలు మొదలెట్టి మానేసి) ఎంత దారుణం జరిగిపోయింది? - ఇప్పుడెల్లా?

జగ:- (అనుమానంగా) దారుణ మేమిట్రా!

విక్ర:- (లేచి) ఆ, ఏంలేదు! - మీరుండండి! - అసలువిషయమేమిటో చెప్పకుండా అంత కంగారు పడతావేమిటి, సుందరం! - ఏమిటి సంగతి? (మాట రాక సుందరం భయపడుతూ వెట్టిగా అందరికేసి చూస్తూ నిలబడిపోయాడు.)

జ్ఞాన:- కుర్రతనం కదూ? - కంగారు సామాన్యమే మరి!-ఏమిటి, నాయనా, సంగతి?

శాంత:- (బాధగా) సంగతేమిటో చెప్పకుండా ప్రాణం తీసేస్తారు! - ఈ వంశంలో ఉన్నదే, ఇది! ఉస్! - నాకు దడస్తోంది!

సుంద:- (మతోయినట్లు చూస్తూ) వస్తోందీ!—

జగ:- (కాస్త కోపంతో లేచి) ఏమిళావుగాని, ఏమిటి సంగతి?

సుంద:- (గుటకేసి, తమాయించుకుని) ఇందాకా నామీద నాకే అసహ్యమేసి, విషంతాగి చచ్చిపోదామనీ!

జగ:- (ఆశ్చర్యంగా) ఆ!—

శాంత:- అయ్యో, విషమే! - ఎందుకు తాగావురా, నాయనా?

జ్ఞాన:- ఈమధ్య విషాలేం పనిచెయ్యటం లేదు! - మీరు అనవసరంగా కంగారు పడకండి!

సుంద:- (విసుగ్గా) అబ్బ. అసలు నేను తాగందే! - కప్పులో విషం బాగా వేసుకున్నాను. ఆ దుల్లో కాఫీ పోద్దామనుకుంటూంటే కమల వచ్చింది.

విక్ర:- (అనుమానంగా) ఊ, వస్తే?-

సుంద:- హడావుడిలో ఈ కప్పు రేకియోమీద ఉంచేసి వెళ్ళిపోయాను!

జ్ఞాన:- (అనుమానంగా) ఊ వెడితే?-

సుంద:- (రంగయ్య కేసి చూపెట్టి) ఈ చవట ఆ కప్పులో కూడా కాఫీపోసి మీలో ఎవరికో ఇచ్చేసినట్టున్నాడు!-

విక్ర:- (హడలిపోయి) ఇప్పుడు మేం తాగిన కాఫీలో విషముందా?

సుంద:- అంతలోనూ కాదండీ? ఒక్క కప్పులోనే ఉంది! అది మీలో ఎవరు తాగారు? (మిగతా అందరూ నోళ్ళు తెరిచి, బిగుసుగుపోయి కుర్చీల్లో చతికిలపడిపోతారు.) ఆ, ఆ! కంగారుపడకండి! ఆ కప్పులూ ట్రే అన్నీ యిల్లా పట్రా?

జగ:- ఎంతపని చేశావురా, అప్రాచ్యుడ! - (ప్రయత్నం మీద గుటక వేసి) అసలు నీకు విషం ఎక్కడిదిరా?

సుంద:- పురుగుల విషం! - ఇందాకా రంగయ్య తెచ్చాడు!

శాంత:- అదే! - నేను అప్పుడే మొత్తుగున్నాను. ఈ దిక్కుమాలిన విషం ఇప్పుడెందుకండీ అని! - వింటేనా? ప్లానుప్లానంటూ ప్రాణంమీదికి తెచ్చారు!

జగ:- (విసుగ్గా) అర్థం పర్థంలేకుండా ఏమిటా వాగుడు? - కాస్సేపు ఊరుకో!

సుంద:- రంగయ్యా! ఇల్లా తీసుగురా! - (అని చూసి) ఈ కప్పులో, అదుగుని తెల్లగావుంది. ఇదే విషంకప్పు! (అంతా ఆ కప్పుకేసి భయంగా చూస్తారు) ఎవరికిచ్చావురా, ఈ కప్పు? (రంగయ్య ఏడుపు మొహంతో చూస్తాడు)

జగ:- నీ మొహం ఈడ్చ! - మాట్లాడరా?

రంగ:- (శ్మశాన మొహంతో) గుర్తు నేదండి!

జ్ఞాన:- (బాధగా, కోపంతో) అంత కళ్ళుమూసుగుని ఎల్లా ఇచ్చావు? - ప్రాణమా, మరోటా? అసలు నేను రాసు మొర్రో అంటూంటే బలవంతాన్ని ఇతనే లాక్కొచ్చాడు! ఇప్పుడు నా గతేమిటి?

విక్ర:- అనవసరంగా అంత కంగారు పడతారెందుకూ? ఆ విషం కాఫీ మీరే తాగారని ఎక్కడుందీ?-ఏమో, ఎవరి ప్రాణంపోతుందో!-(భయంకరంగా చూస్తూ) ఏయి, రంగయ్యా! - ఎవరికిచ్చావు ఆ కాఫీ! (రంగయ్య హడలిపోయి ట్రేతోసహా ఒణికిపోతాడు).

శాంత:- కప్పులు కూడా బద్దలుకొట్టేస్తావేమిట్రా! ముందవి కిందెట్టు! (టీపాయిమీద పెడతాడు.)

విక్ర:- (ప్రతిమాల్తున్నట్టు) ఇదిగో ! - ఆ విషం కప్పు నాకివ్వలేదు కదూ? చెప్పు రంగయ్యా ! నువ్వు చాలా మంచివాడవు ! - నాకివ్వలేదు కదూ ?

జ్ఞాన:- నీకివ్వలేదు. నాయనా !- కేవలం నాకు కేటాయించబడ్డ యములాడు వాడు ! – (బాధగా కళ్లుతూ) నాకే ఇచ్చాడు ! - నా ప్రాణం పోతోంది ! - మందేదేనా చూడండి, బాబూ, నా ప్రాణం !

శాంత:- ఇల్లా మీనమేషాలు లెక్కెడుతూ కూచుంటే నాప్రాణం కాస్తాపోతుంది తీరిపోతుంది ! - డాక్టర్నెవర్నైనా పిలవండీ ?

జగ:- ఉండవే ! - నాకేమిటో ఒళ్లు తిరుగుతున్నట్టుంది ! - నాయనా, సుందరం! - నా ప్రాణం !

సుంద:- కంగారుపడకండి నాన్నా! డాక్టర్ని పిలుస్తాను! - పురుగుల విషానికి ప్రాణం అంత తొందరగా పోదు.

జ్ఞాన:- ఏమయితేం, పోడం రూఢిగా ? ముందు డాక్టర్ని పిలవ్వయ్యా!

సుంద:- (కంగారుగా ఫోనుదగ్గరకెళ్ళి, ఫోనుతీస్తాడు!) హలో! 290 ఇవ్వండి! రంగయ్యా! - డైరీవరు ఉన్నాడేమో చూడు! (రంగయ్య వెళతాడు. మళ్ళీ ఫోనులో) హలో! - డాక్టరుగారున్నారాండీ! ఓహో మీరేనా ? డాక్టరుగారూ! - నేనూ! - నేను లాయరు జగన్నాథంగారబ్బాయిని. మా యింట్లో దారుణమైన ప్రమాదం జరిగిందండి! - అర్జంటుగా రావాలి! ఏమిటి? - దోసెలు తింటున్నారా? - ఇక్కడ ప్రాణాలు పోతున్నాయండీ! - ఎవరికో ఇంకా తెలీదు! - ప్రస్తుతం అంతా ప్రమాదంగానే ఉన్నారు! - పొరపాటుని పురుగుల విషం కలిపిన కాఫీ ఎవరో తాగేశారు ! - మీరు త్వరగా రావాలి! - కారు పంపించమంటారా? - మీ కారులోనే వస్తారా? - సరే, త్వరగా రండి ! - (అని ఫోనుపెట్టేసి శ్రమ పడిపోయినట్టు నిట్టూరుస్తాడు)

జ్ఞాన:- దోసెలేమిటోయి? (అని ఆశగా చూస్తాడు)

జగ:- ఆ, ఖర్మ!-ఆ డాక్టరుకి దోసెలంటే తెగఇష్టం. దోసెలు వేసిన్నాడు కేసుల కేసి చూడధ్ధు!

జ్ఞాన:- ఆయితే ఇప్పుడు నా మాటేమిటి?

జగ:- వాడు నాతో చదువుకున్నాడు లెండి! - ఇక్కడికందే అన్నీ వదిలేసి వస్తాడు.

జ్ఞాన:- ఏమో! - నాదసలే ముసిలి ప్రాణం! - దాన్ని మొహమాట పెట్టి గెంటుకొస్తున్నాను. ఇదిగో, నేనో పాతిగ దోసెలు ఇమ్మగుంటాను వెంటనే రమ్మని మళ్ళి ఫోను చెయ్యి నాయనా?

సుంద:- అక్కర్లేదండి. బయల్దేరారు!
(విక్రమరావు ఇటూ అటూ చూసి, దిన్నట్టుంది, జేబురుమాలు అడ్డం పెట్టుకుని ఒళ్ళంతా కుదుపుగుంటూ ఏడుస్తాడు)

సుంద:- అదేమిటండి, మామగారూ! - మీరు కూడా అధైర్యంపడితే ఎల్లా?

విక్ర:- (అతిబలవంతాన్ని ఏడుపు ఆపుగుంటూ) నా ప్రాణం పోతోంది!

సుంద:- అదేమిటండీ! డాక్టరుగారు వచ్చేస్తున్నారుగా?

విక్ర:- ఏం డాక్టరో ఏమిటో! - నా ప్రాణం పోతుంది! - నేను చావడానికి సిద్ధంలేదు! (Hysterical గా) నేను బతగాలి!

శాంత:- ఎంత ఖర్మ కాలిపోయిందిరా, నాయనా! - కావలసిన పెళ్ళి కాదంటే మాత్రం ఇంత అఘాయిత్యంగా! - విషం తాగెయ్యడానికి సిద్ధ పడతారా ఎక్కడేనా? - మీ నాన్నగారికి నేను మేనమామ కూతు రైనా ఈ సంబంధం మా నాన్నకి ఏమీ ఇష్టం ఉండేది కాదు. చివరికి వీరే మొండికెత్తి వచ్చి, మా నాన్నని ఒతిమాలినా, 'చీ అవ తలికి పో' మన్నాడు. అయితే మాత్రం, అయినేమన్నా ఇల్లా తొందర పడ్డారా?

జగ:- ఏడిశావులే!- ఎందుకల్లా అబద్ధమాడుకుంటావు? 'చీ అవతలకి పొమ్మన లేదు, మీ నాన్న!- మళ్ళి రమ్మన్నాడు.

శాంత:- (రోషంతో) చస్తూందే కూడా అబద్ధమాడతానాండీ? మెత్తగా ఉన్న వాళ్ళని చూస్తే మొత్తబుద్ధిట! ఒక్క పుణ్యక్షేత్రమేనా చూపెట్టారూ? నా బతుగంతా వంటింట్లోనే తెల్లారి పోయింది! - ఆసలు నా నాలిక పెనేసుగుపోతుంది! – ఆ డాక్టరింకా రాడేరా, నాయనా?

సుంద:- ఏస్తున్నారమ్మా! - రంగయ్యా!

రంగ:- (L. F. లోంచి వచ్చి) డైవరున్నాడండి!

సుంద:- అక్కర్లేదు గాని నువ్వు గేటుదగ్గర నుంచుని డాక్టరుగారు రాగానే లోపలికి తీసుకురా!

రంగ:- సిత్తం!- (తొందరగా L. F. లోకి వెడతాడు)

జగ:- (ఉన్నట్టుండి, వెట్టిచూపుచూస్తూ) ఇదేమిటి? - ఆ! - నాయనా. సుందరం! - నీ వేళ్ళు చూపెట్టు!

సుంద:- వేళ్ళా?-

జగ:- (Desperate గా) అవునురా! (సుందరం హడలిపోయి అయిదు వేళ్ళూ చూపిస్తాడు జగన్నాథం కళ్ళు పెద్దవి చేసుకొని చూసి) అవి మూడేనా?

సుంద:- (భయంగా) కాదు నాన్నా! - అయిదు!

జగ:- అయిదా! అయిపోయింది! - సుందరం! - చూపు దిగజారి పోతోం దిరా! ఐతిగే మార్గం చూడరా!

సుంద:- కంగారు పడకండి. నాన్నా!

విక్ర:- విషం కాఫీ నాకిచ్చి ఆయన కంగారు పడతాడెంచుకూ? కుర్చీలోంచి లేవగానే బ్రినాట్ టూ తుమ్మాడు. పీడ తుమ్ము తగలెయ్య! టూపిస్ తిన్నగా అందటంలేదు! సుందరం! టూపిస్! - నా ప్రాణం ! !

క్షీన:- చాల్లెద్దూ. - ఎవరేనా విందే, నవ్విపోతారు!-తుండిమీద కొడితే పళ్ళు రాలాయన్నట్టు, పిషంకాఫీ నేరాగుతే నువ్వెగ బీలుస్తావేమిటి? కర్మం కాలిపోయి వచ్చా సిక్కడికి - అమ్మకాబో!-నా ప్రాణం-పోతోంది! పోతోంది!-(అంటూ ఉన్నట్టుండి కళ్ళు మూసేస్తాడు.)

రంగ:- (L. F. లోంచి డాక్టరు సూటీ పుచ్చుగుని తొందరగా వచ్చి) డాక్టరుగా రొస్తున్నారండి!

[జ్ఞానశ్రీ తప్ప మిగతావాళ్ళంతా ఆనందంతో లేచి నుంచుంటారు. డాక్టరు L F.లోంచి తొందరగా వస్తాడు. వచ్చి వీరందర్నీ రోగుల్ని చూచినట్టు కళ్ళు సన్నంచేసి, డాక్టరు ఠీవితో పరికిస్తాడు.]

డాక్ట:- అప్పుడే ఇన్‌స్పెక్టరుగారు రావడందాకా జరిగింది ! - ఏమిట్రా జగన్నాథం సంగతి?

జగ:- ఇంకా ఏం జరగలేదురా! ఇన్‌స్పెక్టరుగారు తాంబూలాలకి వచ్చారు- ఇప్పుడేం చెప్పలేను. ప్రాణం పోతోందిరా! త్వరగా మందెయ్యి!

డాక్ట:- ఏదీ, ఆల్లాకూచో! (అని చెయ్యి పట్టుగోబోతాడు)

విక్ర:- (అడ్డమొచ్చి) డాక్టర్!-ఆయన అనవసరంగా ఖంగారుపడుతున్నారు. అసలు విషం కాఫీ నాకిచ్చారు. ప్రాణం పోతూంట నాకు! - ముందు నాకు మందెయ్యండి!

శాంత:- డాక్టరుగారూ!-అసలు ప్రాణం పోతూంట నాకు! - ఇంక నిమిషాల మీదున్నాను! వెంటనే మందెయ్యకపోతే లాభంలేదు !

డాక్ట:- (కొంచెం విసుగ్గా చూసి) ప్రాణంమాట దేముడెరుగ్గాని ముందు మీ కందరికీ మతులుపోయినట్టున్నాయేమిటి? ఒక్కసారి కూచోండి, చెబుతాను!-కూచోండి! (అంతా కూచుంటారు) సుందరం!-వీళ్ళంతా విషం తాగారేమిటోయి?

సుంద:- లేదండి! విషం వీళ్ళలో ఎవరో ఒక్కరే తాగారు.

డాక్ట:- మరి అంతా కళ్ళు తేలేస్తున్నారేమిటి?-హా! అసలు ఏమిటా విషం?

సుంద:- పురుగుల విషమండి!-

జగ:- గెమేక్సిను!

డాక్ట:- గెమేక్సినుకే ఇంత కంగారు చేస్తున్నార్రా?-ఏమాత్రం వెళ్ళిందేమిటి?

సుంద:- నాలుగు చెమిచాలండి !

జగ:- ప్రాణం పోతూంటే ఈ ప్రశ్నలన్నీ ఏమిట్రా?

డాక్ట:- ఏడిసినట్టే ఉంది! నాలుగు చెమిచాల గెమేక్సినుకి ఎనకపిల్ల కూడా చావదు. ఏరా, జగన్నాథం! ఏమిగంత ఉన్నావు, నువ్వూ అంత కంగారుపడతావేమిట్రా?

విక్ర:- అయితే ప్రాణం పోదంటావా?

డాక్ట:- ఛ! ఎక్కడికి పోదు!-

రంగ:- పోయినట్టే వుందండి!

డాక్ట:- ఏమిటీ?-

రంగ:- (జ్ఞానశ్రీని చూపెట్టి) ప్రాణం!

డాక్ట:- అరే!-ఈయన్నిందాకణ్ణుంచీ చూడలేదే?

విక్ర:- (కంగారుగా) ముసలి ప్రాణం! పోయిందేమో కూడాను! చూడండి చూడండి డాక్టరుగారూ! ఆయన మా మామగారు! (డాక్టరు నాడి చూస్తాడు.)

డాక్ట:- మీరేం కంగారుపడకండి! ఆయన పేరేమిటి?

విక్ర:- జ్ఞానశ్రీగారు!

డాక్ట:- జ్ఞానశ్రీగారూ! ఏమందోయి!

జ్ఞాన:- (అల్లాడుండే) నేను పోయి అరగంటయిందండి!

డాక్ట:- (నమ్మలేనట్టు చూసి) .What! (నాడి బాగా పరీక్షించి) ఇదేమిటయ్యా! నాడి గోడగడియారంలా కొట్టుగుంటూంటే ప్రాణంపోయిందంటావేమిటి?

జ్ఞాన:- ఏమిటి? నా ప్రాణంపోలే! (నమ్మనట్టు చూసుగుంటూ) నేను ఇంకా బతిగేఉన్నానా? అయితే నా ప్రాణం, పోతూ పోతూవుంది గావును! మందెయ్యరూ! బాబూ! నా ప్రాణం! మీ కాళ్ళట్టుగుంటాను.

డాక్ట:- మీరు మరీ దారుణం మనిషిలా ఉన్నారేమిటి?—తాతగారూ! జీవిత యాత్ర చాలామట్టుకు సాగించేశారు కదా. మీకూ ఇంత తాపత్రయ మయితే ఎల్లా చెప్పండి! - ఆ! (అని తేలికగా నవ్వి) ఎందుకేనా మంచిది, మీరంతా తలోమాత్రా మింగండి! (అని Bag లోంచి తీసి ఇస్తాడు)

జ్ఞాన:- (చివరికి పుచ్చుకుంటూ) ఎందుకేనా మంచిది, నాలుగివ్వండి! అనుమాన రహితం అయిపోతుంది.

డాక్ట:- అల్లామింగుతే మెదడు మసీచయిపోతుంది! ఒకటి దాల్లెండి!

శాంత:- డాక్టరుగారూ!-మాత్ర ఇచ్చారుగాని, మరోమాటు పరీక్షిస్తే మంచి దేమో !

డాక్ట:- ఏమీ అక్కర్లేదమ్మా, అల్లా కూచోండి! మీ ప్రాణానికేం భయంలేదు. కాస్తదానికి ఎంత గొడవ చేశారు? ఇల్లాంటప్పుడే కంగారుపడకుండా నిలబడాలి! పోనీ, శాంతమ్మగారు ఏదో భయపడ్డారంటే అర్థముంది!

విక్ర:- దాల్లెద్దురూ, డాక్టరుగారూ ! మీరు మరీ చెబుతారు. కలిసింది గెమేక్సినా మరోటా ?

డాక్ట:- గెమేక్సిను కనకనే అసలు ఫరవా లేదంటున్నాను. నాకు పదేళ్ళున్న ప్పుడు పొట్లం కనిపిస్తే పంచదార అనుకుని అరవీశడు గమేక్సిను తినేశాను!

జగ:- ఏం మనిషివిరా! రుచేనా తెలియలేదురా ?

డాక్ట:- సరే, మనకి రుచి తెలి శాటప్పటికి అరవీశ దయిపోయింది.

జ్ఞాన:- అబ్బా! - అరవీశడే! - అయితే అప్పుడు తమరు పోలే? (అంతా నవ్వుతారు)

డాక్ట:- తాతగారికి మాత్ర పట్టిచ్చినట్టుంది!-

[ఫోను చప్పుడవుతుంది. సుందరం ఫోనుతీస్తాడు. డాక్టరు లేచి సిగరెట్ వెలిగించుకుంటాడు.]

జగ:- కూచోరా! - రంగయ్యా! - డాక్టరుగారికి కాఫీ తే!-

డాక్ట:- కాఫీయా?- ఇంక మీ ఇంట్లో తాగను!

శాంత:- (లేచి) నేను చేసి తీసుగొస్తానుండండి! (R. F. లోకి వెడుతుంది).

సుంద:- (ఫోనులో) హలో! - ఎవరు? - ఎవరు కావాలండి? డాక్టరుగారా? - ఉన్నారు!

డాక్ట:- ఎవరోయి!-

సుంద:- ఆ, మీ కంపోండరండి' - (ఫోనులో) అరే, ఆ కంగారేమిటండి, మెల్లిగా చెప్పండి! - ఏమిటీ! మా రంగయ్య తెచ్చింది గెమేక్సిను

కాదూ? మైదాపిండా? - హారి! - పీకెల్లా తెలుసూ? - కొట్టువాడు చెప్పాడా? సరే!-పంపిస్తున్నాను! (అని ఫోను పెట్టేస్తాడు)

జగ:- ఇంతాచేసి మైదాపిండా?

జ్ఞాన:- నేను అప్పుడే అనుకున్నానుస్మి! - ఆ రుచి పురుగుల విషం రుచిలా ఎంతమాత్రం లేదు!

విక్ర:- మరే! సరిగ్గా మైదాపిండిలా ఉంది!

డాక్ట:- ఇది మా కంపౌండరుకి ఎల్లా తెలిసింది?

సుంద:- (తేలిగ్గా) ఆ! - మీరు మాకూ కొట్టుదగ్గిర పొట్లాలు తారుమారయ్యాయిట, మే మడిగిన గెమేక్సిను మీ బంట్రోతు పట్టుగుపోయాడు, మీరడిగిన మైదాపిండి మా కంగయ్య పట్టుగొచ్చాట్ట!

రంగ:- కంగారులోను పొరపాటయిపో ఉంటదండి!

జ్ఞాన:- పోన్లె రక్షించినవాడు రంగయ్య!

డాక్ట:- (బిగుసుకుపోయి) ఆగండి! - మైదాపిండి మీకొస్తే గెమేక్సిను మాకొచ్చిందా? అయితే నే ఇందాకా మైదా పిండనుకొని! - (అని ఆగిపోయి భయంగా) దోసెలు! - దోసెలు! - ! (శాంత కాఫీ తెస్తుంది)

జగ:- దోసెలేమిట్రా? - ఈ కాఫీ తాగు?

డాక్ట:- వొద్దు! ఇందాకా నేతిన్నదోసెల్లో గెమేక్సిసుంది! - చాలా తిన్నాను! గుండె పట్టదుతోంది! - ఓరేయి! - ప్రాణం! - నా ప్రాణం ! !

విక్ర:- (గబుక్కని లేచి) డాక్టరుగారూ!- కంగారు పడకండి !

సుంద:- ఒహో, ఇప్పుడందుకనా మీ కంపౌండరల్లా గోలెడుతూ ఫోను చేశాడు?

డాక్ట:- అందుకనే ఫోను చేశాడు! - నేను తిని చాలా సేపయింది. ఓరేయి, జగన్నాథం! కాళ్ళూ చేతులూ పట్టు తప్పిపోతున్నాయి!

శాంత:- మీరూ అల్లా కంగారు పడతారేమిటి, డాక్టరుగారూ!

జ్ఞాన:- అబ్బే అల్లా కంగారు పడితే ఎల్లామరీ? - అసలు దీనికి ప్రమాద మేమీ లేదన్నారుగా?

డాక్ట:- (విసుగ్గా) లేకపోవడ మేమిటండీ? - నిక్షేపంలా ఉంది!

జ్ఞాన: ఉంటే మాత్రం? సముద్రుఖి సుఖుండీకం సోప్యుతత్వాయ కల్పతే! సిదానించాలి నిలబడాలి! - మీ దగ్గిర మాత్రలున్నాయిగా! సీసా చూపెట్టండి. గుప్పిడు తీసుకొచ్చి నోట్లో పడేస్తాను.

డాక్ట:- ఊరుకోవయ్యా. గొడవ! - ఆ మాత్రలేం లాభం లేదు! - నాకు తెలుసుగా? - ఓరేయి జగన్నాథం! - వెంటనే నన్ను గవర్నమెంటు ఆసుపత్రికి చేరెయ్యాలి! - ఆలస్యం చేస్తే మాట దక్కదు! - (అని జేబు రుమాలుతో కళ్ళు తుడుచుకొని బాధపడతాడు.)

విక్రి:- చాలు, చాలు! - ఊరుకోండి, డాక్టరుగారూ! - మతి లేకపోతే సరి! ఈ మాత్రం దానికి కళ్ళమ్మట నీళ్ళెట్టుగుంటారా?

సుంద:- ఏం భయంలేదు. డాక్టరుగారూ! - నేను కారుతో మిమ్మల్ని వెంటనే తీసుగెడతాను. రండి! - రంగయ్యా! - డాక్టరుగార్ని పట్టుగో!

డాక్ట:- (లేచి, రంగయ్యని తడుముని) సుందరం! నువ్వు త్వరగా డ్రైవ్ చెయ్యాలి సుమా! నా ప్రాణం! జగన్నాథం! (అని మాటరాక ఏడుస్తాడు.)

జగ:- ఏమిట్రాయిది? - నీకేం భయంలేదు! మళ్ళీ ఆరగంటలో నిక్షేపంలా తిరిగొస్తావు! వెళ్ళిరా! సుందరం, త్వరగా తీసుగెళ్ళు!

జ్ఞాన:- మనం ఎంత చెబుతే ఏముంది? - అసలు మనిషికి మనోనిగ్రహం ఉండాలి! అదీ ముఖ్యం!- "మానసంబున మానవు డెందాక వర్తించు నెనిమిదింతలు నందాక సతను కర్మాను బంధంబులం బొరలు!"

విక్ర:- మనోనిగ్రహం దాకా ఎందుకండీ? - అసలు గుండె నిబ్బరం ఉంటే చాలు!

జగ:- నన్నడుగుతే ఏమీ అక్కర్లేదు. ఒక్క విషయం తెలుసుగుంటే చాలు!-
ఈ మానవ జీవితాలు కేవలం బుద్బుదాలు!

శాంత:- ఎదో సామెత చెప్పినట్టుంది. ఇంతకీ అసలు విషయం తాంబూలాలు!

(అంతా నవ్వుతారు)

(తెర)

చావకూడదు!

రచన :

ఆచార్య ఆత్రేయ

పాత్రలు

డాక్టరు

రజిని

సిస్టర్ (నర్సు)

పేషెంటు (స్త్రీ) 1

పేషెంటు - 2

[అదొక హాస్పిటల్ వార్డు. మూడు పక్కలున్నాయి. హాస్పిటల్ వార్డులో ఉండాల్సిన వస్తువు లుంటాయి. గోడగడియారం కూడా వుంది. మూడుపక్కలలో మగ్గురు పడుకున్నారు. ఒక పక్కదగ్గర కుర్చీవేసుకొని ఒకావిడ కూర్చునివుంది. ఆమెను చూడగానే తెలుస్తుంది డాక్టరని. ఆ దగ్గరే నర్సు నిలబడి వుంది. డాక్టరు ఆ పక్క మీద మనిషిని పరీక్ష చేస్తూంది. నర్సు కాస్త ఇటటూ తిరుగుతూ పనులు చేస్తూండవచ్చు.]

డాక్టరు:- హారిబిల్ కేసులు. మన ప్రాణాలు తీయటానికొస్తూంటాయి ఇవన్నీ. వైద్యమే చేస్తామా. వాళ్ళప్రాణానికి కోర్టులకే తిరుగుతుంటామా ? స్యూసెన్స్ !

[లేచింది. నర్సు బేసిన్, టవల్-తెచ్చింది. డాక్టరు చేతులు కడుక్కుంటూంది. ఇంతలో బయటినుంచి ఒకావిడ గబగబ వచ్చింది. చాలా నాజూకుగా ఉందిమనిషి. బుజానికొక సంచి తగిలించి వుంది. ఎండలోనుంచి రావడంవల్లనేమో కూలింగ్ గ్లాస్ వేసివుంది; లోపలికొచ్చి తీసేసింది. కత్తిరింపు జుట్టు, ఎత్తుమడల జోళ్ళు. చీరెకట్టు చాలా సెక్సీగా ఉంది. వేతికి గడియారం, లిప్‌స్టిక్, ముఖాన ఏదో బొట్టులాంటిది ఉంది; మనిషి సన్నగా పొడుగ్గా ఉంది. మంచిరంగు]

రజిని:- హల్లో డాక్టర్ !

డాక్ట:- హల్లో, రజినీ !

రజిని:- ఏమిటి? ఎలాగుంది పేషెంటు ?

డాక్ట:- ఎలాగుంది ! మా పేషెన్స్‌ను చంపుతూంది.

రజిని:- ఏమిటో దాటినిపోయే వరకం నెత్తిన తగులుతుంది దీనివల్ల నా వర్క్ ఎంత సఫర్ అవుతూందో తెలుసా? ఆంతా అయోమయంగా ఉంది. ఓమైగాడ్(కూర్చుంది)వచ్చేనెల ఆలిండియా ఆర్ట్రా మాడెర్న్ లేడీస్ కాన్ఫరెన్సు ఉంది. దానికి ఏర్పాట్లన్నీ చేయాలి. ఎల్లుండి విమానంపై ఢిల్లీకి పోవాలి. రేపు మీ వర్కింగ్ కమిటీ మీటింగు ... దీనిలో రాయలసీమ కరువునిధి వసూలొకటి ... ఇవన్నీ ఇలా వుండే ... ఈ న్యూసెన్సు ఒకటి నాకు. (ఈమె ఇలా మట్లాడు

తుండగానే డాక్టర్ అయటికెళ్ళింది. ఈ విషయం తెలియక ఈమె మాట్లాడుతూనే ఉంది. తిరిగిచూచి డాక్టరు లేదని తెలుసుకొని, ఒకరకంగా బుజాలెగరేసి ఇటు చూసింది. నర్సు కనిపించింది.)

సిస్టర్ !

సిస్టర్:- హల్లో ! (దగ్గరకొచ్చింది)

రజిని:- (ప్రక్కవైపు చూపించి) ఇంకా స్మృతి రాలేదు కదూ !

సిస్టర్:- లేదండి.

రజిని:- పిల్లాడిని పోస్టుమార్టం చేశారా ?

సిస్టర్:- చేశారండి.

రజిని:- ఏం తేలింది ?

సిస్టర్:- గొంతు నులిమి చంపేసిందండి.

రజిని:- విషం పెట్టలేదా ?

సిస్టర్:- లేదు (వెళ్ళిపోతుంది)

రజిని:- సిస్టర్...ఒకమాట !

సిస్టర్:- ఏమిటి !

రజిని:- ఈ కేసులో మన నెత్తిమీదకేం రాదుకదా ?

సిస్టర్:- మీకేముందమ్మా ! మీ కాంపౌండులో జరిగింది, అంతేగా ...

రజిని:- కాంపౌండులో కాదు. కాంపౌండు గోడదాటున కూర్చుని, పిల్లాడి గొంతు నులిమేసింది.

సిస్టర్:- చూచీ చూడనట్లు మీ దూరికేపోయివుంటే పోయేది.

రజిని:- నిజమే. కాని, పిల్లాడిని కాంపౌండులోపల పారేసింది. అదీ వచ్చిన ఆపద...

సిస్టర్:- అయినా ఏం ఫర్వాలేదులెండి ఈలాంటివెన్నో జరుగుతుంటాయి. కాకుంటే కాస్త ట్రైంవేస్టు. అంతే !

రజిని:- అదే వచ్చినచిక్కు. ఈ దిక్కుమాలిన వాళ్లెవరో, ఐతకలేక ఆత్మ హత్యలకు పూనుకోవడం, మన ట్రైం పాడుచేయటం ఏంటి ? ఛీ ఛీ.

[డాక్టర్ వచ్చింది]

డాక్ట:- రజినీ !

రజిని:- వాట్ డాక్టర్ !

డాక్ట:- మహిళాసభ పక్కన డిస్పెన్సరీగాని, హాస్పిటల్ గాని ఉందా?

రజిని:- లేదు డాక్టర్ !

డాక్ట:- ఎవరన్నా డాక్టరున్నారా ?

రజిని:- లేదు ! ఏం ?

డాక్ట:- ఏమిటో న్యూసెన్సు. ఈవిడ ఏదో విషం మందు తాగింది !

రజిని:- మందా ?

డాక్ట:- అవును. అదేమిటో ఇంకా తేల్లేదు. కాని అలాంటిది సామాన్యంగా దొరికేది కాదు.

రజిని:- అరె ! మైగాడ్ !

డాక్ట:- చాలా ఐజార్ రకంగా ఉంది చూస్తే ఈ మనిషి

రజిని:- వేశ్యా ?

డాక్ట:- కావచ్చు

రజిని:- అలాగైతే ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏముంది ?

డాక్ట:- ఐతకలేక చావడం. అంతే.

రజిని:- మీకో, తన జీవితచరిత్ర ఏమన్నా చెప్పిందా ?

డాక్ట:- ఆఁ – వీళ్ళకో జీవితం! దానికో చరిత్ర కూడానా ? చెత్తరకం... వీళ్ళు సంఘానికి చీడపురుగులు. దేశానికి తీరని మచ్చలు.

రజిని:- మా మహిళా సంఘం ఈసారి వర్కింగు కమిటి మీటింగులో ఈలాంటి వారి విషయం చాలా సీరియస్‌గా చర్చించబోతోంది. స్త్రీకి ఆర్థిక భద్రత లేనంతవరకు ఈ అగచాట్లు తప్పవు.

డాక్ట:- రజినీ! ఇలా చూడు, ఈ రాజకీయ నినాదాలన్నీ మానేసి కాస్త ప్రాక్టికల్‌గా ఆలోచించటం నేర్చుకో. వెరీ సారీ, మహిళాసంఘం

ప్రెసిడెంట్ వయ్యావనే కానీ ఇంకా నువ్వు పసిపిల్లలా మాట్లాడుతున్నావు. నువ్వు అందరిలాగే పొలిటికల్ స్లోగన్స్ స్టంట్స్ కొడితే ఎలా ?

రజిని:- లేదు డాక్టర్! అది నా నమ్మకం. నేనే...

డాక్ట:- షటప్ మైచైల్డ్ ! ఈనాటి కుర్ర కారంతా వట్టి మాటల పోగులై పోతున్నారు; దేట్లోనూ లోతుగా పోనంటారు. అంతా పైపై దేవులాడుతా నంటారు. అదే నాకు మంట.

రజిని:- మరి మీరేమంటారు డాక్టర్?

డాక్ట:- మీరెన్ని ఆర్థిక భద్రతలు, రూల్స్, విడాకులు-తమలపాకులు ఎన్ని చేసినా నైతిక పతనం అనేది ఎప్పటికీ ఏదో ఒకరకంగా ఎక్కడో ఒకచోట ఉంటుంది. ఉండి తీరుతుంది. తెలిసిందా? ఈ మనిషి ఇలా కావడానికి కారణం ఎవరంటావు? 'సంఘం' అని సులభంగా గట్టిగా చెప్పేస్తావు కదూ? నాకు తెలుసు. సంఘం అంటే ఎవరు? నువ్వూ, నేను, ఆ నర్సు, అందరూ కదూ! - ఏం?

రజిని:- అవును.

డాక్ట:- దెన్... ఇప్పుడాలోచించు. ఈ అమ్మాయి యిలా కావడానికి కారణం నువ్వు అని అంటే ఒప్పుకుంటావా? చెప్పు.

రజిని:- నో !

డాక్ట:- నే సంటావా ?

రజిని:- నో !

డాక్ట:- ఆ నర్సంటావా ?

రజిని:- నో !

డాక్ట:- మరి ఈ లోకంలో ఎవరో ఒకరుంటా రంటావు. అంతేనా ?

రజిని:- అంతే ?

డాక్ట:- కనక ఎవరో ఒకవ్యక్తి చేసిన అక్రమానికో, అన్యాయానికో, పొరబాటుకో, నువ్వు సంఘాన్నంతా తిడతానంటావు. దానికోసం సంఘం మీదంతా ఒక కాసేపు చేస్తానంటావు-ఏం?

రజిని:- అలాంటివాళ్ళు చాలామంది ఉంటారు.

డాక్ట:- అలాంటివాళ్ళు కానివాళ్ళు కూడా చాలా మంది ఉన్నారు. ఉదాహరణకి-ఈ అమ్మాయి పరిస్థితులేవో మనకు సరిగా తెలియవు. కాని ఈ అమ్మాయికన్నా హీనమయిన స్థితిలో ఉన్నవాళ్ళు ఉన్నా రంటావా, లేదా? ఏం !

రజిని:- ఉన్నారు.

డాక్ట:- మరి వాళ్ళందరూ యీ దొంగబ్రతుకు బ్రతకలేదేం? ఇలా బిడ్డల్ని కని చంపలేదేం? ఇలా విషంతాగి చావాలనుకో లేదేం? నేనెందరినో చూచాను. డబ్బు, గౌరవం, హోదా, చదువు, అన్నీఉండీ నైతికంగా పతనం పొందినవాళ్ళను, ఇవేవీలేకున్నా హాయిగా నీతిని అంటిపెట్టు కొని, సంతోషంగా తృప్తిగా జీవిస్తున్న వాళ్ళనూ చూచాను. దీని కేమంటావు?

రజిని:- ఇంతకూ మీరనే దేమిటి—

డాక్ట:- నైతిక జీవనం కేవలం వ్యక్తిగతమైనది. అది తప్పి పోవడానికి ఒక్కొక్క కారణం ఉంటుంది. ఆ కారణాలన్నీ మనం తీర్చలేం. ఇదంతా సమం నెత్తిమీదరుద్ది, ఏదో వుద్ధరించాలనుకోవడం వెర్రి, అంతే.

రజిని:- నా వాదనకూడా కాస్త వినండి.

డాక్ట:- ధారాళంగా చెప్పు.

రజిని:- ప్రపంచంలో జరిగే దేవీ కారణం లేకుండా జరగదు. ఒప్పుకుంటారా?

డాక్ట:- ఓ యస్ ! కాని కొన్ని కారణాలు మనకు తెలియవు.

రజిని:- తెలిస్తే అలాంటివి జరక్కుండా ఆపవచ్చు - కాదంటారా ?

డాక్ట:- అదే పోరపాటు.

రజిని:- మీరు డాక్టరుగా ఉండి ఇలా వాదిస్తే నాకు ఆశ్చర్యంగా ఉంది.

[ఇంతలో సర్దు వచ్చింది]

సిస్టర్:- డాక్టరుగారండీ !

డాక్ట:- ఏమండీ !

సిస్టర్:- ఈవిడ మూటలో ఈ ఫొటో దొరికిందండి.

డాక్ట:- ఫోటో !

రజిని:- ఏం ఫొటో?

సిస్టర్:- అవునండి, ఎవరో ఒక మగవాడి ఫొటో.

డాక్ట:- ఓ చాలాఉందే ! ఈవిడ ప్రేమకలాపాలకి ఫొటోలు కూడానా ? ఊఁ- ఇంకా ఏమున్నాయి?

సిస్టర్:- ఏవో ఉత్తరాలు-రికార్డులు ఉన్నాయండి.

డాక్ట:- వాట్!!!

సిస్టర్:- అవునండి.

డాక్ట:- అయితే యిదేదో పెద్ద కేసే.

రజిని:- మనం అనుకున్నంత తేలి క్కానట్టుంది.

డాక్ట:- ఊఁ- ఏదీ ఫొటో.

సిస్టర్:- ఎవరో కాని అందంగానే ఉన్నాడండీ

డాక్ట:- ఎవడో లోఫర్.

రజిని:- ఎవడో ముందు తియ్యని మాటలుచెప్పి, ప్రేమలోకి దింపి దగాచేసిన వెధవై వుంటాడు.

డాక్ట:- ఎవడో సైకొంద్రల్.

సిస్టర్:- అలా లేదండి చూస్తే.

డాక్ట:- మొగవాళ్ళు చూట్టానికి చాలా మంచిగానే ఉంటారులే ... ఏదీ యిలా ఇవ్వు చూద్దాం...వూరికే ఫొటో చూచి అంత మురిసిపోతున్నా వేమో !

సిస్టర్:- కావాలంటే మీరే చూడండి.

డాక్ట:- (ఫొటోతీసి చూసింది. తెల్లబోయింది. ముఖంలో నెత్తురుచుక్క లేదు. ముఖం శతవికారాలు పోయింది. తన కళ్ళను నమ్మలేక పోయింది) డామిట్! ఏం, నాతో ఆట్లాడుతున్నావేం !

సిస్టర్:- (భయంతో) లేదండి.

డాక్ట:- వాట్ లేదండి! ఈ ఫోటో నీ కెక్కడ దొరికింది ?

సిస్టర్:- ఆవిడ మూటలోనే.

డాక్ట:- నిజంచెప్పు.

సిస్టర్:- నిజంగానండి!

రజిని:- ఏమిటి డాక్టర్—

డాక్ట:- (ఆశ్చర్యంగా చూచింది. మళ్ళా ఫోటోవంక దాలాసేపు చూచింది.) నో! నో! ఇది నిజంకాదు. నే నమ్మలేను. ఇందులో ఏదో మోసం ఉంది! ఇది దగా! ఇదేదో కుట్ర. నో! కానేకాదు...ఇది నిజంకాదు. కానేకాదు.

రజిని:- డాక్టర్...డాక్టర్!

డాక్ట:- (కూలబడింది) ఓ! సిస్టర్...సిస్టర్...పరుగెత్తు...మా యింటికి పరుగెత్తు ... ఇదుగో తాళంచెవి ... నా డ్రాయరులో ... నా బెడ్ రూమ్‌లో...ఎడంచేతివైపు ...ఒక ఆల్బం ఉంది. పరుగెత్తు... త్వరగా పట్రా! క్విక్. రన్ అప్...ప్లీజ్ రన్ అప్...

[సిస్టర్ నిజంగానే పరుగెత్తుతుంది]

రజిని:- డాక్టర్! ఏమిటిది—

డాక్ట:- నో! కాస్త ఉండు...నన్ను ఊపిరిపీల్చుకోనీ...నా కళ్ళనే నే నమ్మ లేకుండా ఉన్నాను...ఈ ఫోటో దీని మూటలోకి ఎలా వచ్చింది చెప్మా—

రజిని:- ఎవరిదండీ యీ ఫోటో—

డాక్ట:- ఓ! హారిబిల్! ఉండు రజినీ! కాస్త ఉండు...నన్ను బాగా కాస్త గిల్లిపెట్టు

రజిని:- ఎందుకు డాక్టర్—

డాక్ట:- చెప్తా...బాగా...

[రజిని నిజంగానే గిల్లింది]

డాక్ట:- (ఖాధపడి) నేసి లోకంలోనే ఉన్నాను. ఏ పొరఖాటులేదు. అయితే... అయితే...యీ ఫోటో...

[నర్సు పరుగెత్తుకుంటూ వచ్చింది]

డాక్ట:- దొరికిందా—

సిస్టర్:- దొరికిందండి.

[డాక్టర్ ఆల్బం తీసుకొని, ఆత్రంగా కొన్ని పేజీలు తిప్పి, ఒక పేజీలో వున్న ఫోటోతో తన దగ్గరున్న ఫోటోను సరిచూచుకొని అలాగే స్తంభించిపోయింది]

రజిని:- ఎవరిది డాక్టర్ ఫోటో...(తానే ఆల్బంతీసి చూసింది) ఎవరీయన—

డాక్ట:- అది నా భర్తది.

రజిని:- ఆఁ.....,

సిస్టర్:- ఆఁ.....

[ఒక్కక్షణం నిశ్శబ్దం]

డాక్ట:- సిస్టర్!

సిస్టర్:- డాక్టర్!

డాక్ట:- చూడు...ఆ పేషెంట్ మేలుకుందా చూడు...

సిస్టర్:- చూస్తా డాక్టర్ (పేషెంట్ దగ్గరికివెళ్ళి చూచింది) అమ్మా, అమ్మా! (పేషెంట్‌ను కుదిపింది)

పేషెంట్:- ఆఁ... (తటాలున లేచి కూచుంది)

సిస్టర్:- ఓ! డాక్టర్!

[అందరూ తటాలున తిరిగి చూచారు ఆశ్చర్యంగా. శవం లేచి కూచున్నంత కంగారు పడ్డారు]

పేషెం:- ఏం - ఎందుకలా చూస్తారు - శవం లేచికూచున్నట్లు కంగారు పడతారేం - నేను చావలేదు. బ్రతికే ఉన్నాను. నాకింకా తెలివి

తప్పలా. తెలిపిగానే ఉన్నాను. అడగండి చెప్తా. ఏంకావాలో అడగండి. (మెల్లగా పక్కమీదనుంచి లేచింది. సిస్టర్ బిత్తరపోయి వెనకడుగు వేసింది.)

రజిని:- డాక్టర్! ఈమెకు పిచ్చిపట్టిందేమో!

సిస్టర్:- నిజం డాక్టర్! పిచ్చెక్కింది...

పేషెం:- నాకేం పిచ్చిలేదు. మీకే పిచ్చి. బతుకంటే ఏమిటో తెలియకుండా వట్టి నీడ వెంబడిపడి పరుగెత్తుతూ, అదే బతుకనుకుంటున్నారే మీరు - మీకూ పిచ్చి; నాకుకాదు! నేను బతుకంటే ఏమిటో, పిచ్చి లోకమంటే ఏమిటో, దాని లోతుపాతులు, అన్నీ చూచా! అడగండి... (ముందుకు నడుస్తూంచి) ఇంతవరకు నన్ను గురించి మీరు మాట్లాడుకున్నదంతా విన్నాను. నేనిలా కావడానికి మీరెవరూ కారణం కాదనికదూ మీరనుకోవటం - పొరబాటు. మీరందరూ కారణమే! మీకు తెలిసో, తెలియకో మీరందరూ తలా ఒక రాయి వేశారు! నువ్వు - నువ్వు-నువ్వు - నా జీవితం నాశనం చేశారు. నన్నీస్థితికి తెచ్చారు. (పక్కన ఉన్న పక్కమీద పేషెంటు లేచింది. ఆమెను చూచి) నువ్వు - ఏం చల్లపోతావేం - మీరందరూ కారణమే నా స్థితికి...తెలిసిందా—

(అందరూ తెల్లబోయారు డాక్టర్‌వైపు నడుస్తూ) నాకొక జీవితం అంటూ లేదూ - నేను సంఘానికి చీడపురుగునా - దేశానికి తీరని మచ్చనా... ఏం—

(డాక్టర్ ఊపిరి గట్టిగా పీలుస్తూంది. కాస్త దమ్ము తెచ్చుకుంటుంది.) అందరూ తెల్లముఖాలు వేశారేం - ఇంతసేపూ వాగిన నోళ్లు పడిపోయినాయా! (వికారంగా నవ్వింది. కుర్చీలో కూలబడింది.)

డాక్ట:- (కాస్త ధైర్యం తెచ్చుకొని) ఈ ఫోటో నీ దగ్గరకెలా వచ్చింది—

పేషెం:- ఆ ఫోటో నీ భర్తదికదూ?

డాక్ట:- ఔను.

పేషెం:- నా మూటలో దొరికింది కదూ?

డాక్ట:- అవును.

పేషెం:- అది ఎలావచ్చిందో చెప్పమన్నావా—

డాక్ట:- చెప్పు.

పేషెం:- వీళ్ళందరి ఎదుట చెప్పమన్నావా - మళ్ళా బాధపడి లాభంలేదు. ముందుగా చెప్తున్నా.

రజిని:- నేను బైటకు వెళ్ళనా—

పేషెం:- ఆగు, నీ బండారం కూడా ఉందిలే? నువెక్కడి కెళ్తావ్.

రజిని:- ఏయ్... ఏమిటా వాగుడు!

పేషెం:- తిట్టకు.

రజిని:- నాకూ నీకూ ఏం సంబంధం—

పేషెం:- (పెద్దగా నవ్వుతూ ఆమె దగ్గరకొచ్చి, బుజం మీద తడుతూ) పిచ్చి తల్లి! పాపం! ఇంత చదువుకున్నావే, ఈ మాత్రం తేలీదూ - నీకూ నాకూ ఏం సంబంధం ! నువ్వూ నేనూ ఆదవాళ్ళం కావడమే సంబంధం! తెలిసిందా-

2వ పేషెం:- డాక్టర్! ఏమిటి గోల - నాకు నిద్రొస్తూంది.

పేషెం:- నిద్రొస్తుందా తల్లీ - చొచొచొ (వెర్రిదానిలా ఆమెను పీపుపీద తడుతూ) జో...జో...లాలి నా చిట్టితల్లీ లాలి వుళ వుళ ఆయీ...

2వ పేషెం:- డాక్టర్... డాక్టర్!

సిస్టర్:- ఇదుగోమ్మా... యిలారా... తాపీగా కూచోని మాట్లాడు...ఇది హాస్పిటల్...గోల చేయకూడదు.

పేషెం:- లేదమ్మా బంగారమ్మా... ఏదీ కాస్తా ఆగు... సరిగా చూడనీ నిన్ను... ఆఁ... నువ్వేనా... నీ పేరు... మిస్... పద్మాజోసఫ్ కదూ—

సిస్టర్:- (తెల్లబోయి) అవును...

పేషెం:- ఏం - అలా చూస్తారేం - ఈమె పేరు ఎట్లా తెలుసు నాకు అనేనా, ఈమె పేరు...ఈమె పెళ్ళి చేసుకోదలుచుకొన్నతని పేరు... వీళ్ళ నాన్న పేరు... అన్నీ తెలుసు నాకు...

సిస్టర్:- డా...డా...డాక్టర్!

రజిని:- ఓ! ఇదేదో నాటకంగా ఉంది.

పేషెం:- అంతా నాటకమే. జీవితమే ఒక నాటకం... మనమంతా వేషాలు వేస్తున్నాం...నాటకాల్లో వేషాలు వేసేవాళ్ళు రంగులు తుడిచేసి, బయట తిరుగుతారు. మనం రంగులు వేసుకొనే ఇంటా బయటా అంతా తిరుగుతాం-అంతే తేడా!

డాక్ట:- సిస్టర్! లెట్ హెర్ స్లీప్! లెట్ హెర్ బీక్ రెస్ట్. మనం పోదాం రండి, రా రజినీ...

పేషెం:- (అధికార స్వరంతో) ఏయ్... ఆగండి... ఎక్కడికి వెళ్తారు, ఆగండి... (అందరు బొమ్మల్లా ఆగిపోతారు) ఉండండి. మీ అందరి కథా చెప్తాను. (ఫోటో డాక్టరు చేతిలోంచి లాక్కొని) ఈ ఫోటో ఎవరిదన్నావు—

డాక్ట:- నా భర్తది.

పేషెం:- నీ భర్తని... ఈ పురుషసింహము నీ భర్త కాకముందు నా భర్త తెలుసా—

డాక్ట:- నాన్ సెన్స్!

పేషెం:- తిడితే తెలుగులో తిట్టు.

డాక్ట:- నువ్వబద్ధం చెప్తున్నావు.

పేషెం:- నిజం నీకు తెలీదుకనుక, నువ్వు అబద్ధం అంటున్నావు ... నీ భర్త బెజవాడలో పుట్టేడు...పెరిగాడు... చదువుకున్నాడు. అవునా—

డాక్ట:- అవును.

పేషెం:- దుర్గాకళామందిరం దగ్గర ఇల్లు.

డాక్ట:- అవును.

పేషెం:- ఆ పక్కనే ఇప్పుడొక పాడుపడిన కొంప ఉంది. చూచావా—

డాక్ట:- చూచాను.

పేషెం:- అదే మా యిల్లు.

డాక్ట:- అఁ... కమలవా నువ్వు—

పేషెం:- (నవ్వి) అబ్బ-ఎంత సేపటికి గుర్తు కొచ్చాను...జ్ఞాపకమున్నానా—

డాక్ట:- కమలా! నువ్వా-ఇలా అయ్యావు – నువ్వేనా-ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చింది–

పేషెం:- మీరెందుకు బతికున్నారో తెలుసా - తెలీదు. చావలేక-బతికున్నారు. నే నెందుకు చావాలనుకున్నానో తెలుసా - బతకలేక చావాలనుకున్నాను - అంతే.

రజిని:- డాక్టర్... మీకీమె తెలుసా—

డాక్ట:- తెలుసు... నాతోపాటు స్కూల్లో చదువుతుండేది... ఆడుకునే వాళ్ళం...

పేషెం:- ఈమె భర్తగారు మొదట నన్ను ప్రేమించారు.

డాక్ట:- కమలా!

పేషెం:- నేను పోయేముందు నా కథ అందరికీ చెప్పిపోతాను. మేము చాలా పేదవాళ్ళం. బట్టాలిచ్చుకోలేం... వాళ్ళ నాన్నకి కట్నాలు కావాలి...పిళ్ళు దబ్బుగలవాళ్లు... ఈమె భర్తను దబ్బిచ్చి కొనుక్కున్నది... ఆ మగాడూ దబ్బుకాశపడ్డాడు... ప్రేమ గీమా అంతా పోయింది... నన్ను నట్టేట్లో ముంచాడు. ఈమెను పెళ్ళి చేసుకున్నాడు... కొన్ని నెలలు గడిచినాయి... నాకంతవరకు ఏమీ తెలియదు...ఆ తరువాత తెలిసింది నేనొక బిడ్డతల్లి కాబోతున్నానని...మా నాన్నకు గుండెలు పగిలాయి... మా అమ్మ మంచం పట్టింది... నేను అనాథనయ్యాను. వీధులు పట్టాను...

డాక్ట:- కమలా! ఇదంతా నాకేం తెలీదు సుమా.

పేషెం:- అబద్ధం! అంతా తెలుసు. నీకంతా తెలుసు. కాని దబ్బు మదం... ఎదుటి ఆడదాని జీవితం గడ్డిపోచలా చూచావు. నీకు జ్ఞాపకముందా మీ నాన్న నాకు భోగందాసికిచ్చినట్లు దబ్బివ్వటానికొచ్చాడు...(చాల తీక్షణంగా అడిగింది)

డాక్ట:- ని...జం...క...మలా!

పేషెం:- నా జీవితం కూలిపోయింది ... అమ్మా నాన్నా పోయారు ... బతుకుతెరువు కోసం బయల్దేరాను (రెండవ పేషెంటు దగ్గరకు పోయి) నీకు నేను గుర్తులేదూ...బాగాచూడు...మీ ఇంట్లో చాకిరీ చేయటానికొచ్చాను... మీ మామ గారు...అరవై ఏళ్ల ముసలాడు... నాకు తాతలాంటివాడు ..

2వపేషెం:-అప్పుడు నీపేరు జయకిదూ—

పేషెం:- పేరేదైతే ఏం లే ! నేనే జయను...కమలను...ఇంకా ఇంకా చాలా పేర్లున్నాయి...నేనే...

రజిని:- డాక్టర్...ఇదంతా ఏదో కట్టుకథగా ఉంది...

సిస్టర్:- మనల్నంతా పిచ్చివాళ్ళను చేసి ఆడిస్తూంది డాక్టర్ !

పేషెం:- షటప్ - నాకు ఇంగ్లీషు ఇంకా జ్ఞాపకముంది. చిన్నప్పుడు ఎప్పుడో, చదువుకునే రోజుల్లో ఎన్నో కలలు కన్నాం. (2వ పేషెంటుతో) నీకు జ్ఞాపకం ఉందా ? నీ భర్త కళ్ళారా చూచాడు ... ఆ రోజు వంటింట్లో పని చేస్తున్నాను. 60 ఏళ్ళ ముసిలాడికి కూడా నేనంటే చులకనై పోయింది. దిక్కులేనిదాన్ని కనుక నామీద (ఏడుస్తూంది) ...ప్రపంచంలో అందరూ చెడ్డవాళ్లు కారు. కొందరైనా ఉంటారు, అనాధలను చూచి అయ్యో అనేవాళ్ళు. నీ భర్తకు నామీద కనికరం కలిగింది. నువ్వది ఓర్చుకోలేక పోయావు...నీ వెధవబుద్ధి పెడ ఆర్థాలు తీసింది. మా ఇద్దరికి ఏవేవో సంబంధాలు కలిపించి, మాము గారితో కలిసి, ఇంట్లోనుంచి తరిమేసేదాకా, ఒంటికాలిమీద నిల్చావు. చూడు! ఇప్పుడు తృప్తిగా ఉందా-

2వపేషెం:- జయా! నేను చేసేపని ఇంతదూరం వస్తాదనుకో లేదు సుమా!

పేషెం:- అదే చాలామందికి తెలీదు. వాళ్ళు చేసేపనులు ఎంతదూరం పోతాయో, ఎందరి జీవితాలు పాడు చేస్తాయో, ఎన్ని తరాలవారికి దాని ఫలితం ఉంటుందో ఎరగరు. ఆ బాధ్యతే కనుక తెలిస్తే ప్రపంచం ఎన్నడో బాగుపడేది. (నర్సువైపుచూచి) నువ్వింకా ఆనాడున్నంత అందంగానే వున్నావా-ఒక్కసారి అద్దంలో చూచుకో.

నర్సు:- నా అందంతో నీ కేంపని-

పేషెం:- నాకేం పనిలేదు - కాని నీ కంటే ఒకప్పుడు నేను అందంగా ఉండే దాన్ని. అదిచూచి నీవు ఓర్వలేక పోయావు. నీకు జ్ఞాపకం లేదూ - ఆ ఫ్యాన్సీషాపు కట్టేశారా, ఇంకా ఉందా-

సిస్టర్:- ఏ ఫ్యాన్సీషాపు-

పేషెం:- అదే శాంథోమేలో, ఆ హాస్టలుకు ఎదురుగా.

సిస్టర్:- ఉంది - ఉంటే ఏం?

పేషెం:- అక్కడ నువ్వు నన్ను ఎప్పుడైనా చూచావా-

సిస్టర్:- నిన్నా (కాస్తా ఆలోచించి) నీవు ఇందిరపు కదూ-

పేషెం:- అఁ...ఇందిరనే.

రజిని:- ఓ మై గాడ్ ! ఎన్ని పేర్లు.

డాక్ట:- షి సీమ్స్ టు బి ఎ చీట్. చూస్తే బలే మోసగత్తె లాగుంది.

రజిని:- ఎ సౌకండ్రల్ కూడా!

2వపేషెం:- వట్టి దొంగముండండీ.

డాక్ట:- అవుననుకోండి. చూస్తేనే తెలుస్తూంది.

రజిని:- ఇక్కడేదో నాటకం ఆడి, మనల్నంతా దబాయించాలని చూస్తోంది.

నర్సు:- ఇప్పుడిది కొత్తఎత్తు వేసిందండీ దీని కథంతా నాకు తెలుసు. దీని వృత్తే ఇది మా ఫ్యాన్సీషాపులో చేరి ఎలాగైనా ఆయకకు మత్తు మందుపెట్టి బుట్టలో వేసుకోవాలని చూచింది. నాకా మాత్రం తెలీదూ! ఒక్క రోజులో తెల్సుకున్నా దీన్ని సంగతేమిటో. చెంపలు వాయించి బయటకు గెంటించా.

రజిని:- మంచిపని చేశావు.

2వపేషెం:- వీళ్ళను చేస్తే సంసారాల్లో నిప్పే!

పేషెం:- (ఒక్కసారిగా లాగి చేత్తో బల్లపీచ కొట్టి) ఆపండి. ఏమిటి నువ్వు తెల్సుకొన్నది! ఈవిధ నన్నెందుకు గెంటేసిందో తెలుసా ... నేను

షాపులో నౌకరీ కున్నాను. ఆదవాళ్లున్న షాపులో వ్యాపారం ఎలా జరుగుతుందో మీకు తెలుసు. నావల్ల ఆయనకు మంచి లాభాలు వచ్చాయి. కాని జీతంమాత్రం పెరగలే. ఒకరోజు ఈమె షాపుకు వచ్చింది. ఒక నెక్లెసు తీసి వేసుకొని అద్దంలో అందం చూచు కొంటోంది. నిజంగా కోతిలాగే ఉంది. కాని నేనామాటను అనలేదు. ఆయనే అన్నాడు తనకంటే నాకే ఆ నెక్లెసు బాగుంటుందని. దానితో అహంభావం పడగెత్తింది. నన్ను గెంటేయించింది. పోతే పోనీ...నన్ను గురించి తెలుసుకుంటే తెలుసుకున్నావు గాని, నీవు ప్రేమిస్తున్న నీ కామ్యాలు విషయం తెలుసుకున్నావ్? చూడు! పో! కావాలంటే నా మూటలో అతను వ్రాసిన ఉత్తరాలు ఎన్ని ఉన్నాయో!

నర్సు:- కామ్యాల్ ఉత్తరాలు వ్రాశాడా!

పేషెం:- అవును. రాశాడు. రాసినంతసేపూ నిన్ను తిట్టేడు - నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు, ప్రేమిస్తున్నా నన్నాడు. అయితే అదంతా నేను నమ్మలేదులే! మొగవాళ్ళ మాటలు నమ్మేకాలం పోయింది. నేనప్పటికి చాలా మందిని చూచాను. (నర్సు పరుగెత్తుతుంది) అయి పోయింది. నా కథ ఇక ఎంతో లేదు. ఐదే ఐదు నిమిషాలు. నేను చచ్చిన తరువాతైనా మీరంతా ఒప్పుకుంటారు; నేనీస్థితికి రావడానికి మీరందరూ కారణమని. బయటకు చెప్పకపోయినా అంతరాత్మలో అనుకుంటే చాలు. నా జీవితంవల్ల ఇంకా లాభం లేకపోయినా మీ కెవరికీ తెలియని ఒక సత్యం చెప్పిపోతాను ... ప్రపంచంలో జరిగే ప్రతిదానికి మనందరం బాధ్యులం, భాగస్వాములం. మనకేం సంబంధ మని చేతులు కడుక్కోటానికి చూడకండి...నేను శీలాన్ని అమ్ము కున్నాను. నేను పతితను. నీతులు మాట్లాడే మొగాళ్ళందరు నా కోసం ఒకప్పుడైనా వచ్చిపోయారు. నేనిప్పుడు జీవచ్ఛవాన్ని, రోగిష్టిని. రోగంతో, కడుపులో బిడ్డతో మహిళా సంఘానికి వచ్చాను. (రజినితో) నువ్వప్పుడక్కడే ఉన్నావు.

రజిని:- అవును...ఉన్నాను.

పేషెం:- నీ కాళ్ళమీదపడి బతిమాలాను. మెడబట్టి గెంటించావు.

రమణి:- అవును, మహిళాసంఘం నీలోటి వ్యభిచారిణులకు కాదు.

పేషెం:- ఓ ! నీవు నీతి మాట్లాడుతున్నావా ? పోసిలే ! నిన్నని ఏంలాభం? ప్రపంచంలోని సంఘాలన్నీ దబ్బుకలవాళ్ళకొసమే ! కాని ఒక విషయం గుర్తుంచుకో. నువ్వు సహాయం చెయ్యని దానివల్ల నన్నే కాదు, ఏ పాపం ఎరుగని ఒక పసిప్రాణాన్ని కూడా చంపేవావు. నీ యీటకపు నీతి, నీ మహిళా సంఘం, నీ అధ్యక్ష పదవి, అన్నీ శాశ్వతంగా ఉండనీ ! మీదింగులు చేయండి ! పూలమాలలు వేసుకోండి ! పత్రికలలో బొమ్మలు వేయించుకోండి! ఇంకా వీలైతే అసెంబ్లీ మెంబర్లు కాండి! నేను - నాబోటి వాళ్ళు - నా బిడ్డలం లాంటి బిడ్డలు...వందలు...వేలు...లక్షలు చస్తూంటాం... ఓ ! చావనీరు ...చావటం కూడా తప్పే! బతకటానికి వీల్లేదు-చావటానికి హక్కు లేదు-ఏమిటీ ప్రపంచం? ఎవరు మీరంతా ? మనం మనుష్యులమేనా? (పెద్దగా నవ్వి) బతక్కూడదు...చావకూడదు.....చావకూడదు (పడిపోయింది)

[రెండవ పేషెంటు కెవ్వుమని కేకవేసింది. అందరూ వికృతంగా అరిచారు. నర్సు పరుగెత్తుకుంటూ వచ్చింది]

నర్సు :- డాక్టర్! డాక్టర్! ఇది నాటకం కాదు. ఇదంతా అక్షరాలా నిజమే డాక్టర్!

[తెర పడుతుంది]

పుణ్యస్థలి

రచన :

ఎన్. ఆర్. నంది

పాత్రలు

ప్రొఫెసర్

పూజారి

కాసులు

పిచ్చిది

కంట్రాక్టరు గుమాస్తా

అయ్యవారు

ఒకటవ విద్యార్థి

రెండవ విద్యార్థి

సమయం : ఒక రాత్రి

కాలం : వర్తమానం

[స్టేజికి ఒక వైపున సత్రం ముందుభాగం కనిపిస్తూంటుంది. సత్రానికెదురుగా ఒక మునిసిపల్ దీప స్తంభం. దానికి చేరువలో ఒక పడక కుర్చీ... వెనుక భాగాన కనీకనిపించనట్లు ఒక దేవాలయం...

రంగస్థలానికి రెండోవైపున ఒక రావిచెట్టు. దాని క్రింద చిన్న చలిమంట. చలిమంటముందు ఒక ముసల్ది. ఆదొక సజీవ ప్రాణిలా కనిపించదు. ఏదో ఒక బస్తా పడేసినట్లుంటుంది.

తెర లేచినపుడు రంగస్థలమంతా చీకటిగా నిశ్శబ్దంగా ఉంటుంది. చలిమంట వెల్తురు, చంద్రుడులేని నల్లని ఆకాశంలో మిణుక్కుమనే చుక్కల కాంతి తప్ప మిగతా పెద్ద వెల్తురేమీ రంగస్థలం మీద పడదు... ఒక క్షణం గడిచాక సత్రంలోంచి ఒక ముసలాడు హరికేన్ లాంతరు పట్టుకొని మెల్లగావచ్చి తగ్గించిపెట్టితీసి ఆరిపోయిన మ్యునిసిపల్ లాంతరు వెలిగిస్తాడు. ఆ వెలిగించేటపుడు దూరంగా దేవాలయంనుంచి గంటలు వినిపిస్తాయి. వాటి శబ్దం క్రమేపీ క్షీణిస్తుండగా ఎక్కడినుంచో ఒక మతిలేనివాడి పాట, తంబూరు మీద వినిపిస్తూంటుంది.]

పాట

స్వర్గలోకం పోదామన్నా; మార్గమేది అన్నయా?
స్వర్గలోకపు దారులెపుడో; స్వర్గమయ్యేర తమ్ముడూ!
స్వర్గలోకపు దుర్గములలో; ప్రజలు ఉన్నా రన్నయా?
స్వర్గలోకపు దుర్గములలో; ఖడ్గ మృగములు చేరెరా!
స్వర్గ పురిలో స్వార్థమన్నది; అర్థమైనా ఉన్నదా?
అర్థమూ మరి స్వార్థమూ; పరమార్థమైనవి ప్రజలకూ!
దిక్కుమాలిన పశువులన్నీ; ఎక్కడున్నవి అన్నయా?
దిక్కుతోచక పిచ్చి ఎక్కి—నక్కి ఉన్నవి తమ్ముడా!

సాధుశీలికి, జ్ఞానశీలికి స్థానమన్నది ఉన్నదా?
దానవత్వం నిండి లోకం; కానగలదా జ్ఞానినీ!—
మరి కానిపించే కాంతి అంతా; ఎటుల వచ్చెర ఆన్నయా?
ఆస్థులూ, ప్రజ నెత్తురూ; అది మిళితమైన భ్రాంతిరా!

(ఓచ్చగడు పాటపాడుకుంటూ రంగంమీద లాంతరు స్తంభానికి-చలిమంటకూ మధ్యగా కూర్చొని ఉండొచ్చు లేదా పాట నేపధ్యం నుండి వినిపించవచ్చు— లేదా పాట డిలీట్ చేయవచ్చు — అది వీలునుబట్టి ప్రదర్శకులు ఏర్పాటు చేసుకోవచ్చు.)

[ముసలాడు ఈలోగా దీపం వెలిగించి చిమ్ని పెడతాడు.]

పాట ఆయిపోతుంది—
పిచ్చిది నవ్వుతుంది—

ముసలాడు పిచ్చిదానివైపు చూచి, హరికేన్ లాంతరు సత్రంయొక్క స్తంభానికి వేలాడదీసి సత్రం రెండోవైపునకు వెళ్ళిపోతాడు. క్షణం సేపు నిశ్శబ్దం—

(తరువాత బయటనుంచి, పూజారి శ్లోకాలు వల్లించుకుంటూ వస్తాడు— సరాసరి "కాసులూ" అని కేకలు వేసుకొంటూ సత్రంలోకి వెళ్తాడు—సత్రంలో ముసలాడు కనిపించకపోగా బయటకివచ్చి మళ్ళీ "కాసులూ" అని పిలుస్తాడు. సమాధానం రాదు.)

పూ:- ఎక్కడ చస్తాడో? ఏవిటో?— వెధవ మనుషులూ, వెధవ నడతలూనూ! ఆ కాస్తంత నౌఖరీ దొరికేవరకు పిటీషన్లూ, ఊరేగింపులు, ఉపన్యాసాలూ, నానా అల్లరిచేసి— అది కాస్తా దొరికాక ఇదీ వరస.

కాసు:- (సత్రం పెరటివైపు నుంచి వచ్చి) ఎవర్తోబాబయ్యా అట్టా మాటేడేసుకొంటున్నారు?

పూ:- వచ్చావూ?— అవును. వొస్తావ్ వొస్తావ్! నాకు తెలుసులే! చచ్చిన ప్రతివాడూ పునర్జన్మ ఎత్తుతాడని!..... ఇంతవరకూ ఎక్కడ తగలడ్డావని?—

కాసు:- వల్లకాట్లో బాబయ్యా—

పూ:- శివ శివా! ఏవయ్యా కాసులూ— నీ కి నౌకరు ఉద్యోగం ఎలా దొరికిందయ్యా?— నానా ఆగచాట్లూ పడి నానా వాళ్ళచేత అయ్యా వారి దగ్గర రెకమెండేషన్లు చేయించుకొందేనే గదా నీ కి నీడ దొరికింది.

కాసు:- అదేంటి బావయ్యా అట్టా మాటాడతారు. ఇక పుట్టినోడికి ఈ గర్ధ మీద నౌకరీలే దొరికినట్టు— నాకు నౌకరీ దొరక్కపోతే నా పాపమని ఏడిసేకాలం పోనాడండోయ్ పూజారిగారూ! రోజులు మారాయి.

పూ:- హారి! అవన్నే... నిన్ననవల్సిన పని లేదులే!— ఈ మితవాదులంతా కల్సిచేరి ఏదో ఉద్ధరించేసేట్టు "ఆకలినీ" అభ్యుదయాన్ని ఆ ఎర్ర జెండాలవాళ్ళ పాలిట చెయ్యదమొచ్చింది—

కాసు:- ఉత్తిపున్నానికి ఆల్ల నాడిపోసుకుంటా వేంటయ్యా పంతులూ! ఏదో సామెత సెప్పినట్లు మాటాడుతున్నావ్...
అమ్మ పెట్టా పెట్టదు—

పూ:- ఆ! ఆ! సర్లే! నెత్తివరకు ఎక్కినవాడికి ఎవరు చెప్పగలరు? చూడు ఈవేళ సర్కాసికి ఎంతమంది యాత్రికులు వచ్చారు?

కాసు:- సానామంది—

పూ:- ఉహూ! ఎంత సంపాయించావేమిటి వాళ్ళందరి ముందూ చెయ్యి చాచి?—

కాసు:- ఏం, వాటా కావాలంటారా?—

పూ:- శివ, శివా! ఎంతమాట?—

కాసు:- ఏమో? అయ్యవారిదగ్గర అలవాటుపడ్డ పాణం గందా అని—

పూ:- [భుజాలు తడువుకుంటాడు]

పిచ్చి:- [నవ్వుతూ లేస్తుంది] పిచ్చివాళ్ళు— పిచ్చిలోకం! మీరంతా పిచ్చి మనుష్యులు— అలవాట్లకు, పొరపాట్లకు అర్థంలేదు ప్రపంచంలో. (కాసులుతో) ఒరే అబ్బీ! నీయంత అమాయకుడు లేడురా లోకంలో-

(పూజారితో) పూజారిగారూ! తమలాంటి పుణ్యాత్ముడు లేడు ప్రపంచంలో. అమాయకులూ, పుణ్యాత్ములూ ఒక్క దగ్గర ఉండలేరురా! వేలూ, లక్షలూ, కోట్లూ అమాయకుల కంఠాలు మూగవోతేగాని, మీలాటివాళ్ళు పుణ్యాత్ములు కాలేరు— పాపం, పుణ్యం శ్లేషార్థాలూ.....

[ఏడ్స్తూ, నవ్వుతూ బయటకు పోతుంది,]

పూ:- ఒరే కాసులూ! ఈ పిచ్చిముండ నిక్కడ చేరనివ్వద్దని నీ కెన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదేవిట్రా—

కాసు:- రావఁ! రావఁ! ఆ యమ్మ పిచ్చిదా? మీకు నోరెట్టా వచ్చిందయ్యా పూజారిగోరూ? సేమేసరం బాబే బతికుంటే ఆ యమ్మ కాగతి పెట్టుండేదా, మీరీమాట అనగలిగి ఉండేవారా?

పూ:- (తడువుకుంటాడు— చిరునవ్వుతో) పిచ్చివాడా! బండ్లు ఓడ లవు తాయిరా— ఓడలు బండ్లవుతాయి— మార్పుకి తగ్గట్టు నడచుకోవడం మానవ లక్షణంరా.

కాసు:- బహా బాగుందయ్యా పూజారీ, ఈ యేదాంతం.

[సత్రంలోకి పోతాడు.]

పూ:- (కాసులు నిష్క్రమించినవైపే చూస్తుంటాడు.)

[కంట్రాక్టర్ గుమస్తా ప్రవేశిస్తాడు]

కంగు:- పూజారిగారూ!

పూ:- అయ్యా!

కంగు:- అయ్యవారున్నారా?—

పూ:- ఏ అయ్యవార?—

కంగు:- ఏ అయ్యవారు!...ఇక్కడెందరు అయ్యవార్లున్నా రేమిటి?—

పూ:- ఇద్దరు—

కంగు:- ఇద్దరా?-

పూ:- ఆఁ! ఒకరు దేవాలయంలోని అయ్యవారు శ్రీ శ్రీ శ్రీ శివశంకర స్వామివారు... శిలామూర్తి... రెండు— వారి ఆలయానికి అధిపతి మా అయ్యవారు— శ్రీమాన్ జగన్నాథస్వామి నాయుడుగారు- సాక్షాత్తు సజీవమూర్తి—

కం॥గు:- బాగుంది... బాగుంది... సరే - శిలామూర్తి శివశంకరస్వామి ఆలయానికి ఆధిపతి ఆయిన తమ అయ్యవారు ఎక్కడున్నారు?-

హా:- వారి ఆలయములో—

కం॥గు:- ఎంతసేపట్లో వస్తారు?

హా:- ఏముంది- ఈవేళ వచ్చిన ఆదాయాలకూ, వ్యయాలకూ గిట్టింపు సరిగ్గా సరిపోయిన తక్షణం వచ్చేయ్యోచ్చు—ఏమిటికథ- అంత తీక్షణంగా అడుగుతున్నారు—

కం॥గు:- ఆ! ఏం లేదు! [పొడం పీల్చి] ఈ మధ్య యాత్రీకుల రాకపోకలు మరీ హెచ్చయి పోయాయని, ఈ ఆలయ శిల్ప సౌందర్యాన్ని, మహాత్మ్యాన్ని మెచ్చుకొంటూ పాశ్చాత్యులు కూడ తరచు రాకపోకలు సాగిస్తున్నారని-ఏవిటి - వారి సౌకర్యార్థం ఆలయావరణలో ఏవో కొత్త వసతులు నిర్మించేందుకు పెండర్లు కోరారట.

హా:- అవును, మొన్న పత్రికల్లో ప్రచురించాం,

కం॥గు:- అవునా? అదిగో దాని కోసమని మా కంట్రాక్టర్ గారు మీ అయ్య వారిని—ఏవిటీ—కల్సుకోమని పంపించారు.

హా:- దానికిలా సంప్రదింపు లేమిటండీ?

కం॥గు:- సాంప్రదాయకమే లెండి.

హా:- అయితే వెళ్ళి ఓ దరఖాస్తు పెట్టుకోమనండి.

కం॥గు:- ఈ విషయాలు మీకు బొత్తిగా కొత్తలా వున్నాయి.

హా:- కొత్తా ! నాకా? అయ్యా ! తమకింకా సరిగ్గా తెలుసునో లేదో ! మా పితామహుల దగ్గర నుండి ఈ ఆలయాన్ని రక్షిస్తూ, ఈ దేవుణ్ణి కొల్చుకొంటూ వస్తూన్నామండీ ఇప్పుడంటే అవేవో ప్రజాస్వామ్య విధానాలట-అవి ప్రవేశపెట్టి; పుణ్యస్థలాలకు కూడ ఎలక్షన్లు, నామినేషన్లు, కమిటీలు నా బొందా చేసి యిదుగో నిజమైన హక్కుదార్లమైన మమ్మల్నిలా శక్తిహీనులుగా చేసేశారు.

కం॥గు:- అహఁహఁ! నిజం శెలవిచ్చారు కదటండి. పూర్వంలో ఈ కంట్రాక్టర్లు, బ్రోకర్లు అనే వాళ్ళుండేవారా మరి? ఇప్పుడంటే ప్రజాస్వామ్య

విధానాలు ప్రవేశపెట్టడం తరువాయిగా నాయకులు, వారితో బాటే వినాయక స్వరూపాలు, వారి ఆల్లళ్ళూ, బావమరదుల బాదరు బందీ అన్నీ పెచ్చయిపోయి బావగార్లు, మావగార్ల సహాయంతో కుబేరులై పోతున్నారుగాని-

పూ:- సరిసరి...రోలొచ్చి వడ్డిల్లో మొరపెట్టుకున్నట్టుంది మీ సంగతి. అయితే ఆ కంట్రాక్టు మీకు ఖాయం చెయ్యాలంటారు-

కం॥గు:- చిత్తం.

పూ:- కాని ఆయ్యవారు సమ్మతించరేమోనని-

కం॥గు:- ఉబ్బబ్బే! తవరలా అంటే పీల్లేదు. నూటికి 30 వంతులు ఆయ్య వారికి ఇవ్వడానికి మా కంట్రాక్టరుగారు నిర్ణయించుకొన్నారు.

పూ:- మంచిపని చేశారు. నీకు బుద్ధిలేదటయ్యా! ఆయన గారేదో నూటికి 30 వంతులు స్వార్థం కొద్దీ ఇస్తానంటుంటే తగదునమ్మా అని మీరు మధ్యవర్తిత్వ రాయబారాలు సాగిస్తున్నారా? (రహస్యంగా) సమయంలో సమయం ఇలాంటి ఆదనులోనే మనలాంటి వాళ్ళు సంపాదించుకోవాలయ్యా నాలుగు రాళ్ళు-ఏవంటారు?

కం॥గు:- అయ్యో! ఎంత మాటెంతమాట (రహస్యంగా) తల వెంట్రుక వాసి మనం కూడా స్వాహా చెయకపోతే అది ప్రజాధనం ఎలా అనిపించుకొంటుంది చెప్పండి? ఆహా! మనలో మాట. పెద్దవాళ్ళు పర్వతాలను పలహారం చేస్తే? ఏవిటి? మనలాంటి వాళ్ళం ఆ రాళ్ళ ముక్కల నన్నా 'హరీ' చేయొద్దటండీ? ఏవిటి?

పూ:- (నవ్వి) ఇప్పు డసిపించుకుంటావయ్యా బ్రోకరు గుమాస్తావని. అది సరే—ఇందులో మన వాటా?

కం॥గు:- అయ్యో అదేమిటండీ! పూజారికి లేని నైవేద్యం ప్రభువులకా? ముందు మనం కాస్తంత రుచిచూచి 'సర్టిఫై' చెయ్యందే ప్రభువుల వారి 'సైనల్' ముద్ర అందుమీద పడదు—పడకూడదు—ఏవంటారు?-

పూ:- నిజం శెలవిచ్చా రంటాను—మరి నా వాటా ఏమిటో తేల్చారు కాదు—

కం॥గు:- ముందు ఆ కంట్రాక్టంతా మా కంట్రాక్టర్‌గారికి వచ్చేట్టుచేయండి—ఆ తరవాత—

పూ:- మొండి చెయ్యి చూపిస్తారు.

కం॥గు:- అమ్మమ్మమ్మ! ఎంతమా దెంతమాట! అలా మోసం చేస్తే పురుగులు పడి ఛస్తారు—

పూ:- (వికటంగా నవ్వి) ఏడ్పటందోయ్ ! అలా పెద్దమాటే ఉపయోగించారు. రోజులు మారాయి గుమాస్తాగారూ, రోజులు మారాయి. నన్నడగండి—నేను చెప్తాను—ఈ నా 50 ఏళ్లు నిస్వార్థంగా ఈ దేవుని కర్చనకని వినియోగించానా! కాని ఒక్కనాడు కూడా, ఈ మా దేవుడు, నిజం చెప్పుకోవాలంటే, అన్యాయం చేసిన వాళ్ళను శిక్షించినట్లు కనిగాని, వినిగాని ఎరుగను. పైగా ఆయన ఆలయానికి వచ్చి "ఈశ్వర్ అల్లా తేరేనామ్ సబ్‌కో పెర్మిట్ దే భగవాన్" అని సహస్ర కలశాభిషేకం చేయించే సరికల్లా ఆ ముండా దేవుడు కాస్తా అలా అలా కరిగి నీరై చిరునవ్వుతో శిలాహస్త మెత్తి చల్లని అభయహస్తమిస్తాడు. అందుకని అన్యాయానికి గురైన ఏ నాలాంటి అమాయక ప్రాణీ దేవుడో అని మొరబెట్టుకో బోతుంటే మ్రొందు నాకే తగలస్తున్నాడు. అందువల్ల—అయ్యా కంట్రాక్టర్ గుమాస్తా గారూ, ఆ యిచ్చేదేదో ముందే సమర్పించుకొండి, అన్యాయమో, న్యాయమో మరి, ఆ కంట్రాక్టంతా మీకే వచ్చేట్టు చేసే పూచీ నాది-

కం॥గు:- ఊ సరే ! ఎంత కావాలంటారు?

పూ:- ఏదో తమరే శెలవియ్యాలి?

కం॥గు:- అహఁ ఎంతమాట! పుచ్చుకొనేవారు తమరు.

పూ:- అబ్బెబ్బె! ఇచ్చేవారు తమరు.

కం॥గు:- (క్షణం సేపు ఆలోచించి) సరే—వంద!

పూ:- వంద? ఓహ్ ! బోడివంద ! ప్రజాస్వామిక విధానాల ననుసరిస్తున్న మా పుణ్యస్థలిలో కేవలం దక్షిణ పుచ్చుకొనేంత వెర్రిబాగులా డెవడున్నాడు చెప్పండి బాబూ ! ఏదో తమరు అనాలని అంటున్నారు గాని—

కం॥గు:- సరే—పోనివ్వండి—వెయ్యి !

పూ:- అయ్యా ! ఇంతెందుకు? నేనొహటి చెబుతున్నాను. కంట్రాక్టంతా మొత్తము ఐదారు లక్షలు విలువ చేసేది అవునా?

కం॥గు:- అవునండి.

పూ:- అందుకో కనీసం లక్షన్నరైనా మీ కంట్రాక్టరి లాభం—అవునా?

కం॥గు:- చిత్తం—ఉండొచ్చండి.

పూ:- నూటికి 30 చొప్పున మా అయ్యవారికి వస్తుంది. ఇది సర్వులకూ తెలిసిన తతంగమే, మీకూడా తెలుసు. మీకు తెలుసునని మాకూ తెలుసు.

కం॥గు:- చిత్తం.

పూ:- అవునా? మరి అయ్యవారిచేత ఒప్పించి సంతకం చేయించి సదరు ఆమోద పత్రాన్ని సురక్షితంగా మీకు చేరవేసే బాధ్యత నాదే గాబట్టి, ముఖ్యుణ్ణి నేనే గాబట్టి, నాకు మీ లాభంలో 15 వంతులు ఇవ్వటం సబబు.

కం॥గు:- 15 వంతులే! అంటే (వేళ్ళు లెక్కబెట్టి) 20 వేలు.....!

పూ:- అదేమిటయ్యా! డబ్బంతా నువ్వే ఇచ్చేట్లు ఆలా కళ్ళు తేలేస్తున్నావ్?

కం॥గు:- అది కాదండి !

పూ:- ఏమి చూచా? అసలు మేనేజరు దగ్గరుండి ఆ కట్టడాలన్నిటినీ కరక్టుగా కట్టిస్తే రెండు లక్షల్లోపునే అయిపోతుంది. కాని, అవి మా స్వార్థాలో మీ స్వార్థాలో ఎవరిదో ఒకరిది— మొత్తానికి అంచనాలు రెట్టింపుచేసి మీకు కంట్రాక్టు యిప్పిస్తుంటే మా మొహంమీద మూట్టి 20 వేలు పారెయ్యడానికి నీకు బాధటయ్యా !

కం॥గు:- అబ్బే, మీరు నన్ను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు—

పూ:- అర్థం చేసుకొన్నాం, ఇంత లాభం చూపిస్తే కోటి మంది ముందు కొస్తారు వెళ్ళవయ్యా ! (వెళ్ళబోతాడు)

కం॥గు:- (అడ్డపడి) అబ్బే! మీరలా అండీకాదు—సరే- ఒప్పుకొన్నాం—

పూ:- సరే-ళాయం చేస్తాం వెళ్ళండి. అదిగో అయ్యవారు వస్తున్నారు.

కం॥గు:- అయ్యవారా? నేను మాట్లాడుతాను.

పూ:- (దీర్ఘం తీస్తూ) ఏవిటీ?

కం.గు:- అయ్యవారితో కంట్రాక్టు విషయం.....

పూ:- ఓహో! చాచావెరకూ వచ్చిందే? నాతో మాటాడింది చాలక ఇహ వారితో కూడానా? పిచ్చివాడా! నేను కాదంటే వారు అవుననగలరా? నేను దేవుడికి పూజారినే కాదోయ్! ఆ దేవుని ఆలయంయొక్క అధికారికి ఆంతరంగిక కార్యదర్శిని కూడాను, ఇహ దయచెయ్.

కంగు:- మరి మీరు ఎలాగైనా ళాయం చెయ్యాలి.

పూ:- తప్పకుండాను. వెళ్ళండి.

[కం.గు నిష్క్రమిస్తుండగా అయ్యవారు ప్రవేశం. కం. గు. అతనికి నమస్కరిస్తాడు. వాడెక్కడ మాటాడేస్తాడేమోనని, కం గు.ని పూజారి ఐయటకు నెట్టేస్తాడు అయ్యవారువెళ్ళి కుర్చీలో, లాంతరు స్తంభం చేరువన కూర్చొంటాడు.]

అయ్య- కాసులూ?

పూ:- ఒరే కాసులూ! అయ్యవా రొచ్చారు. కాస్తంత చన్నీళ్ళు పట్రా (అయ్యవారితో) చన్నీళ్ళు చాలంటారా?

అయ్య:- ఊఁ.

పూ:- నాకు తెలుసు తమ మనోగతభావాలు (కేకవేస్తూ) కాసులూ-మరీ చల్లని నీళ్ళు కావు.

అయ్య:- కాస్త్రీ!

పూ:- అయ్యా!

అయ్య:- ఈవేళ సత్రంలోకి ఎందరు యాత్రికు లొచ్చారు?

పూ:- కాసుల్ని కనుక్కోవాలంటి, కాసులూ! ఆ ఖాతా పుస్తకాలు కూడా పట్రా.

[ముందే తెలుసు నన్నట్టు, ఖాతా పుస్తకం, గ్లాసుతో మంచినీళ్ళు తెస్తాడు కాసులా. మంచినీళ్ళు అయ్యవారు, పుస్తకం పూజారీ అందు కొంటారు.]

పూ:- (పుస్తకంచూచి) 75 కుటుంబాలండీ.

అయ్య:- ఊ.

పూ:- వచ్చిన ఆదాయం 50 రూపాయలు.

అయ్య:- అంత తక్కువ.

పూ:- అవునయ్యా! కాసులూ—వచ్చిన కుటుంబాలు 75 అయితే డబ్బు ఏభయ్యే పస్తా—

కాసు:- అల్లివ్వటం లేదండి.

పూ:- ఏం?

కాసు:- ''అవును ఇది ధనము సత్రం గదా, రోజుకి గదికి రూపాయిన్నర ఎందుకివ్వాలేం'' అని అడుగుతున్నారండి.

పూ:- అడుగుతున్నారూ? అడగరూ మరి! ఈ ప్రజాస్వామ్య సిద్ధాంతాలు వచ్చి హరిజనుడికికూడా ప్రశ్నించే హక్కును కలుగచేస్తున్నాయి గాని—మరి నువ్వు ఒత్తిడి చెయ్యలేదటయ్యా?

కాసు:- చేస్తే రశీదు లిమ్మంటున్నారండి.

పూ:- మరి ఇవ్వలేక పోయావ్—

అయ్య:- శాస్త్రి...కాసులూ! రేపట్నించి గదులు ఖాళీగా లేవని బోర్డు వ్రాసి పెట్టేయ్.

పూ:- (కాసులతో) అర్థమైందా? ఏవిటి?

కాసు:- గదులు కాళీగా ఉన్నా లేవనెయ్యాలి.

పూ:- ఎందుకో తెలుసా?

కాసు:- (వెటకారంగా) తెలుసుకండి.

పూ:- అవసరమై కావాల్సినవా డెవడో రూపాయిన్నర ఇచ్చిడుంటాడు... అంతేనంటారా?

అయ్య:- ఊఁ.

పూ:- (కాసులతో) ఇహ నువ్వు వెళ్ళు.

[పుస్తకం, గ్లాసు పట్టుకొని సత్రంలోకి పోతాడు కాసులు]

అయ్య:- శాస్త్రీ! చెండర్లేమైనా వచ్చాయా?

పూ:- వచ్చాయండి. కుప్పలు. కాని మనకు అనుకూలంగా ఉన్నది మాత్రం ఒక్కటీ రాలేదు.

అయ్య:- ఊఁ !

పూ:- అయితే నేనే స్వయంగా వెళ్ళి కొందరు కంట్రాక్టర్లను కలుసుకొన్నా ననుకోండి—

అయ్య:- వాళ్ళేమంటారు ?

పూ:- అంతా అనుకూలంగానే వున్నారు. కాని వచ్చేదాంట్లో 'మనకు' రావల్సిన—

అయ్య:- ఊఁ !

పూ:- అదే అదే 'తమకు' రావాల్సిన వాటా సరిగ్గా తేల్చటం లేదు. అయితే ఒకర్ని మాత్రం కుదిర్చానులేండి.

అయ్య:- శాస్త్రీ! పనిలో పనిగా కొంత దిగువన నాకో బంగళా కట్టించాలని వుందోయ్-

పూ:- ఇంకా ఉందని మెల్లగా అంటారేవిటండీ! 'శుభస్య శీఘ్రం' అన్నారు పెద్దలు. రేపటికి మన కీ పదవులు వుంటాయో ఊడతాయో ఎవరు చెప్పగలరు? వెలుగుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. అయితే దాని కయ్యే ఖర్చు మాటంటారా? అబ్బే! ఒక సున్నా కుడివైపున ఇరికించి సరిపెడ్తే ఎవరు చూసేవాళ్ళు, అడిగేవాళ్లు-

అయ్య:- ఊఁ అదీ నీ చేతిమీదే కానీయ్!

పూ:- అయ్యో! అదెంతమాట!

అయ్య:- అయితే, ఇంతకూ ఆ కంట్రాక్టర్ ఎంతిస్తానంటాడు?

పూ:- నూటికి ఇరవైవంతులు యిచ్చేందుకు ఒప్పుకొన్నాడు.

పిచ్చిది:- (భర్తను బయటినుంచి వస్తుండి) అబద్ధం. నూటికి 20 కాదు. ఈ దొంగ పూజారి అబద్ధ మాడుతున్నాడు-పట్టి అబద్ధం-అవునయ్యా పూజారీ! ఇదెలానూ ప్రజల సొమ్మేకదా, నూటికి 200 మీ వాటా తీసుకుంటే నీ సొమ్మేం పోయింది?

అయ్య:- శాస్త్రి !

పూ:- అయ్యా! పిచ్చిదండి- ఆ మాటలు అంతగా పట్టించుకోనవసరం లేదు.

పిచ్చిది:- లేదూ ? అవును-అవసరం లేదు-నేను పిచ్చిదాన్నే (నవ్వుతుంది) నేను పరమ వెర్రిదాన్ని. లోకమంతా పిచ్చిదే. అలా మార్చేశారు లోకాన్ని మీరంతా కల్సి. మీరంతా దొంగలు (ప్రేక్షకుల వైపు తిరిగి) వీళ్లు దొంగలు— వీళ్లు ఈ గుడికి అధికారులు—వీళ్ళను మీరు మంచివాళ్ళనుకొని ఎన్నుకొని ఆ పదవిలో కూర్చోబెట్టారు. కాని వీళ్లు చేస్తున్నపని చూశారూ? మీ మొక్కుబడి దబ్బునీ, దమ్మిడి దమ్మిడీ చొప్పున కూడబెట్టుకొన్న, సమర్పించుకొంటూన్న దక్షిణను ఏం చేస్తున్నారో ?

పూ:- ఏమమ్మా !

పిచ్చి:- ఏం మనవడా ? రహస్యాలు చెప్పేస్తున్నానని కోపమెందుకు! మీరు చేస్తున్న దొంగపనులు ఏం తెలీదం లేదనుకోకండి.

అయ్య:- తెలిస్తే తెలీనియ్యమనవయ్యా శాస్త్రి !

పూ:- అవును మామ్మా! తెలిస్తే తెలీనీ ?

అయ్య:- మధ్య తన కంఠశోష తప్పిస్తే యిందులో ఆమెకు అవగింజైనా లాభం కూడా వుండదని చెప్పవయ్యా శాస్త్రి?

పూ:- అవును మామ్మా! పిసరంతైనా లేదు ?

పిచ్చి:- అవునా అవును. ఈ ప్రజలంతా మహానుభావులు, అశక్తులు. అన్నీ తెలిసి ఏం చెయ్యడం? మీకు గుణపాఠం చెప్పే శక్తి వాళ్ళకున్నా వున్నా మీ కల్లిబొల్లి మాటలు నమ్మి మళ్ళా మీ పంచనే చేరుతారు కదా !

అయ్య:- అవునా! అందుకే నువ్విలా వీధినపడి ఆరటం లాభంలేదు తులిశమ్మా?

పిచ్చి:- తులిశమ్మా! ఎవర్రావారు? నా పేరుపెట్టి పిల్చే ధైర్యం ఎవరికుందిరా? (అయ్యవార్ని ఎగా దిగాచూచి) నువ్వా దేశోద్ధారకా! దీనజన రక్షకా! నువ్వేకదూ నా కొంప కూల్చిన రాక్షసుడవ్? నువ్వేకదూ నన్ను పిచ్చిదాన్ని చేసిన పాపాత్ముడవ్? నువ్వేకదూ నా అయిదో తనాన్ని కాళ్ళ రాసిన కసాయివాడవ్?

అయ్య:- శాస్త్రీ !

పూ:- మామ్మా !

పిచ్చి:- నోర్ముయండి. మొహంలకు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. అసలా మీకు సిగ్గులనేవి ఉన్నయ్యా! నా మతిమరుపు మంద. మీకు సిగ్గులనేవి లేవని తెలుసుండి కూడా మీతో వాదా లేస్తున్నా నేవిటి? ఛీ ! ఛీ! మీరు నాకు శత్రువులు-శత్రుశేషం, ఋణశేషం ఉంచకూడదు. (అయ్యవారితో) నువ్వు-నువ్వు జగన్నాధస్వామి నాయుడవుకదూ! అవును నాయుడవే— నాయకుడవ్— తడిగుడ్డల్తో పీకలాకోసే కోమల హృదయుడివే— నువ్వే నా బ్రతుకుని బండలు చేశావ్, నా దేవుణ్ని బలి చేశావ్. నా అయిదో తనాన్ని మంట కలిపావ్— నా సంసారంలో చిచ్చుపెట్టావ్—

అయ్య:- శాస్త్రీ !

పూ:- మామ్మా! కాలం మూడి సి భర్త పోతే ఎదుటి వాళ్ళ నాడపోసుకుంటావేం ?

పిచ్చి:- కాలం మూడి పోయారా ? మీరంతా కలసి ఆయన్ని చంపలేదూ? మీ సుగుణాలకోసం, సౌఖ్యాలకోసం, విలాసాలకోసం, స్వార్థంకోసం, మీరంతా ఒక్కమ్మడిని ఆయన రక్తమాంసాలను పిండి, పిప్పిచేసి, గిల కొట్టుకొని చచ్చిపోయేట్టు చేయలేదూ? ఇది హత్యకదూ? ఏం మాటాడరేం? ఇది చిత్రవధకాదూ ?

భూ:- అయ్యా! అయ్యా! మనం యిక్కడిలా యీ పిచ్చిదాంతో వాదా లేసుకు కూర్చుంటే లాభంలేదు. లోపలికి పోదాం రాండి.
(యిద్దరూ సత్రంలోకి పోతారు)

ప్రౌ వె:- (మాసిన గడ్డం, చిరిగిన దుస్తుల్తో ప్రవేశించి) ఎవరమ్మా? నువ్వు?

పిచ్చి:- (చిత్రంగా చూచి) పిచ్చిదాన్ని...నువ్వు పిచ్చివాడవేనా?

ప్రౌ:- ఆఁ !

పిచ్చి:- అయితే ఏడు— అదిగో ఆ కనిపించే పుణ్యస్థలిలో అధికారం హస్తగతం చేసుకొని, ఎవరి ఆక్రందనలనీ లెక్కచేయకుండా గంతులేస్తున్న యీ రాక్షసుల మేడలు కూలి మన్ను కలిపేంతవరకూ ఏడు— ఊ ఏడవ్వేం ?

ప్రౌ:- ఏడుపు ఆడవాళ్ళ నైజం.

పిచ్చి:- ఆఁ అలాగా! అయితే నువ్వు ఏద్వని మగవాడివా? మరి పిచ్చివాడి వెలా అయ్యావ్ ?

ప్రౌ:- అన్యాయాలను ధిక్కరించినందుకు—

పిచ్చి - ఓహో అలాగా! అన్యాయాలకు గురయ్యేవాళ్ళు— ధిక్కరించే వాళ్ళు-పిచ్చివాళ్ళే నన్నమాట— సరి సరి— నీ పేరేమిటి నాయనా ?

ప్రౌ:- చిదంబరం.

పిచ్చి:- ఏ ఊరు ?

ప్రౌ:- ఈ పుణ్యస్థలే.

పిచ్చి:- కాబట్టే పిచ్చివాళ్ళ మయామయ్యా! అది సరే! నీకు పెళ్ళయిందా?

ప్రౌ:- లేదు—

పిచ్చి:- భేష్— మంచిపని చేశావ్? నువ్వు ఛస్తే, నువ్వు పిచ్చివాడవైతే మకోళక్తిలేని అమాయక ప్రాణి నీ ప్రాణానికపది ఏడవకుండా మంచిపని చేశావ్! ఈ దేశముంది చూశావ్... ఆడదాని పాతి వ్రత్యంగురించి ఏదో ప్రచారం చేసుకోంటోంది. కాని మగాడు

చస్తే ఆ ఆడదానికి మాత్రం చేయూతనివ్వదు నా బ్రతుకు చూడు ఏమయ్యిందో? నా దేవుడు ఈ ఆలయంలో పనిచేసేవారు—ఆయన్ని వాళ్ళు చంపేశారు—

ప్రొ:- చంపేశారా ?

పిచ్చి:- చంపడమంటే కత్తితో పొడిచి చంపాలంటయ్యా! ప్రొద్దుపొడిచింది మొదలు, కృంకేవరకు కష్టపడే మనిషికి యీ వెధవలిచ్చే రెండు రాళ్ళు ఎందుకు పనికొస్తాయి? ఆకలి... ఆకలి... అది చాలదూ చిత్రవధ చెయ్యటానికి?

ఒక్క క్షయరోగం వస్తుంది. ఒక్క పెద్దరోగం వస్తుంది. ఒక్క పక్షవాతం వస్తుంది. అదే చిత్రహింస. ఆయన్ని చంపేశారు. నాకు దిక్కులేదు. నేను పిచ్చిదాన్ని కాక చేసే దేముంది చెప్పు? అబ్బాయి! పిచ్చివాళ్లుగా మారిపోవడంలో ఒక మంచి ఉంది సుమా! వాళ్లు భోగాల నాశించరు. విలాసాలు కావాలనరు. పంచభక్ష్య పరమాన్నాలు కోరరు. స్వస్థలాలు, స్వగృహాలు అవసరంలేదు. ఎంగిలాకులు తిని తృప్తిపడతారు. చెట్లక్రింద నిద్రపోతారు. కావాలంటే పట్టపగలు నడిరోడ్డుమీద దిగంబరంగా పడుకోగలుగుతారు- వాళ్ళతో ఎవరికి పేచీ ఉండదు. వీళ్ళు ఎవర్నీ ఆడగరు, ప్రశ్నించరు, విమర్శించరు. అలా చేస్తే పిచ్చివాళ్ళని లెక్కే చేయరు.

ప్రొ:- నే నలాంటివాణ్ణి కాదమ్మా!

పిచ్చి:- మరి? మరింత మదపిచ్చివాడవా?

ప్రొ:- కాదు. నే నడుగుతాను, నీ కథ పోయాక నిన్ను గాంచి వదిలేసిన యీ సమాజాన్ని విమర్శిస్తాను.

పిచ్చి:- అందుకే నీవి మదపిచ్చి అన్నాను. నాకు తెలుసు నాయనా! అన్నం తిన్నావా ?

ప్రొ:- [తల అడ్డంగా త్రిప్పుతాడు లేదన్నట్లు]

పిచ్చి:- అయ్యో! నాయనా! నువ్వు మా పిచ్చివర్గం సభ్యుడివేగా? రా. తిను.

[కొన్ని రాళ్ళిస్తుంది... ప్రొఫెసర్ బాధగా నవ్వుకొంటాడు]

కాసు:- [సత్రంలోంచి వస్తూ] ఏయ్! ఎవరక్కడ? ఆ? యిసిపించుకోరేం? పొండి [దగ్గరగా వస్తాడు] అమ్మా! ఆ కర్కోటకోళ్లు మిమ్మల్నిలా ఉండనివ్వరమ్మా. మీ రిక్కడినుండి ఎల్లిపొండి.

ప్రౌ:- ఎందుకు ?

కాసు:- ఎల్లిపోవాలి బాబయ్యా..

ప్రౌ:- ఇది ధర్మసత్రంగా—

కాసు:- అని మీరనుకొంటే పొరపాటే బాబయ్యా—

ప్రౌ:- ఏం? పద్ధతులు మారాయా?

పిచ్చి:- కాదు. ప్రభువులు మారారు. నేను వెళ్ళనురా. చెప్పు ఆ రాక్షసుంతో.

ప్రౌ:- నువ్వీ సత్రానికి నౌఖరువా?

కాసు:- అవును బాబయ్యా!

ప్రౌ:- అందుకేరా నీలో ఇంకా మానవత్వం బ్రతుకుంది. నువ్వు మనిషిగానే చచ్చేంత కాలం బ్రతకాలంటే నువ్వు నౌఖరుగానే ఉండాలిరా! కాని ఆజన్మాంతం నౌఖరుగానే ఉండకు సుమీ!

కాసు:- ఉండక ఏం చెయ్యగలను బాబయ్యా!

ప్రౌ:- తిరగబడు.

కాసు:- ఎవరిమీద!

పిచ్చి:- దేవుడిమీద.

కాసు:- దేవుడేనాడో సచ్చిపోనాడు తల్లీ !

ప్రౌ:- చచ్చిపోలేదు పూర్తిగా ... చంపే ప్రయత్నంలో ఉన్నారు చంపే స్తారు కూడా ఇహలా. ఒరే! ఆబ్బీ, అధికారంరా, డబ్బురా! అర్థం కాని అధికారం, అర్హతకు మించిన ఐశ్వర్యం అల్పుడికి సంక్రమిస్తే పర్యవసాన మింతేరా. నువ్వు కళ్లు తెరు. నిన్ను నువ్వు తిరగేసుకో, కోసుకో, నీ రక్తం చూచుకో. నీ కళ్ళు తెరవబడతాయి. అదే ఆత్మ జ్ఞీవం. అదే ఆధ్యాత్మిక చింతన.దాన్ని వాళ్ళు ఏవేవో వాదాలంటారు.

అవన్నీ నీ కనవసరం. నీకు కావలసింది ఒక్కటే, అదగటం నేర్చుకో, అడుగు, ఆకలేస్తుందను, ఇవ్వరూ—మొండిగా ప్రవర్తించు. తప్పలేదు కావలసింది అడిగి అనుభవించు. లేనివాడి బ్రతుకూ ఒక బ్రతుకేనా?

పిచ్చి:- కాదు. కాదు. ముమ్మాటికీ కాదు. వాడిది పిచ్చి బ్రతుకు ప్రొఫెసర్!- అబ్బాయ్, నువ్వెలాగూ పిచ్చివాడవై పోయావనుకో. ఈ పిచ్చినంతా ఈ అమాయక లోకానికి ఇచ్చుతావా? (కాసులుతో) ఒరే అబ్బీ! ఇతను పిచ్చివాడురా. ఇతని మాట వినకు, నోటి దగ్గర కూడు పడిపోతుంది.

కాసు:- అమ్మా! మీరింక లోపలకు వచ్చేయండమ్మా, ఇల్లు చూస్తే లాభం లేదు (ప్రొఫెసర్‌తో) మీరు యోగులా బాబూ ?

ప్రొ:- మీసాలూ, పెరిగిన గడ్డాలూ, యోగులకు చిహ్నాలంటోయ్?

పిచ్చి:- కాదు-కాదు, అతను సన్యాసి కాదు. దేశదిమ్మరి చిదంబరమంట.

కాసు:- చిదంబరం...చిదంబరమంటే...ఈ బల్లో మాష్టారు.

ప్రొ:- (చిరునవ్వు) నేనింకా జ్ఞాపక మున్నానటయ్యా?

కాసు:- ఎందుకు లేదు బాబయ్యా? మారాజులు తమకు పిచ్చెక్కిందనీ, మతి చెడిందనీ, ఆ పూజారీ- అయ్యగోరూ ఊరు ఒక్కటే దండోరా వేసినారు బాబయ్యా, తమరు ఎల్లిపోనాక. కాని, నేను నమ్మలేదు బాబయ్యా. తరువాత తమరు సచ్చిపోనారని యిన్నాను.

ప్రొ:- నిజమే. ఇది పునర్జన్మ (నవ్వుతూ) నీకు కాసులూ !

(ముగ్గురూ సభ్రమం రెండోవైపుకి నిష్క్రమిస్తారు. ఖాళీ. తదుపరి ఇద్దరు విద్యార్థులు ప్రవేశిస్తారు)

1వి:- ఏమిటోయ్. నాకే అర్థం కావటంలేదు. మనం ఇలా పొట్టా యూని వర్శిటీనుంచి వస్తున్నట్టు ప్రాసిన లేఖలుగాని వీళ్ళకు అంద లేదా యేమిటి? స్టేషనుకు ఒకరూ రాలేదు.

2వి:- ఎందుకందకోయ్? మనల్ని స్టేషన్లో ఎవరూ గుర్తించలేకపోయారు,

1వి:- అవును. ఆదీ నిజమే కావచ్చు. అఁ ఆ కనిపించేది ధర్మసత్రం లాగుంది (సత్రం దగ్గరగావెళ్ళి) పూజారిగారూ! పూజారిగారూ!

2వి:- ఆదేమిటోయ్ పూజారిని పిలుస్తావ్? మన హోదాకు తగ్గట్టు పుణ్యస్థలి ఆధికారిని పిలవాలిగాని—

1వి:- ఓహ్! నీకు లౌక్యం తెలీదయ్యా! ఈ నాటి ప్రభువులంతా పర్సనల్ సెక్రటరీల నెందుకు పెట్టుకుంటున్నారు? వాళ్ళకు కాస్త కార్యభారం తగ్గేందుకేనా!- అందుకే నేను పూజారిని పిలుస్తున్నాను. పూజారిగారూ!

పూ:- (సత్రంలోంచి) అయ్యా, పిల్చారా!

2వి:- ఆఁ.

పూ:- తమరు యాత్రికులా!- గదులు ఖాళీగా లేవు.

2వి:- మేము వ్రాసిన లేఖ మీకందలేదూ?

1వి:- మేము పాట్నా యూనివర్సిటీ విద్యార్థులం. ఆంధ్ర శిల్పకళని పరిశీలించి, పరీక్షించి, థీసిస్ వ్రాసే నిమిత్తం ఇక్కడకు వస్తున్నామని లేఖ వ్రాశాం-

పూ:- (ఖంగారుగా) అయ్యయ్యో! తమరా? తమకోసం ధూమశకట విరామధామానికి తైలభక్షక శకటాన్ని పంపించామే! (సత్రంలోకి చూస్తూ) అయ్యా జగన్నాధస్వామిగారూ, రండిబాబూ రండి (మెల్లగా) కొంప మునిగింది.

అయ్య:- (వస్తూ) ఏమిటయ్యా శాస్త్రి? వీళ్ళెవరు?

పూ:- వీళ్ళేనండీ పాట్నా విద్యార్థులు. మన పుణ్యస్థలిని చూచి, మన ప్రగతిని వీక్షించి, మన శిల్పాలను పరీక్షించి, మన మనతనూ, ఉత్కృష్టతనూ, ఔన్నత్యాన్ని, ప్రపంచానికి చాటమని మన మాహ్వానించిన మన పాశ్చాత్య అతిథులు.

అయ్య:- ఆయ్యో! తమరా! తమకోసం స్టేషనుకు కారు పంపించామే. వాళ్ళు మిమ్మల్ని కలుసుకోలేదా?

1వి:- లేదు - పోనివ్వండి. జరిగిందేదో జరిగిపోయింది.

హా:- అబ్బే! అలా అంటే ఎలా! చాలా పొరపాటైంది. క్షమించాలి.

2వి:- పరవాలేదులెండి.

అయ్యా:- తమరలా నిలబడే ఉన్నారు. కాసులూ?

హా:- ఓరే కాసులూ! (చిరునవ్వుతో విద్యార్థుల నుద్దేశించి) మా ఆంధ్రలో నౌకర్లకూ, యజమాన్లకూ పేర్లు ఒకేలాగున ఉంటాయిలెండి.

అయ్యా:- అందుకేనండి. ఇహనుంచి నౌకర్లకూ, అధికార్లకూ భేదం తెల పేందుకు రెండురకాల పేర్ల జాబితా తయారుచేస్తున్నాం. మా పుణ్య స్థలిలోని నౌకర్లంతా ఆ జాబితాలోని నౌకరుపేర్లే ఉపయోగించాలి.

హా:- ఉదాహరణకు నౌకర్లపేర్ల జాబితాలోని రావన్న, సోమన్న ఎంకన్న పుల్లయ్య, నూకయ్య, పిచ్చయ్య, ఎల్లయ్య, సోవులు, రావులు, గంగులు, తలుపులు, లంగాలు వగైరా, వగైరా అనుకోండి. ఆ పేర్లు చచ్చినట్లు నౌకర్లే పెట్టుకోవాలి.

అయ్యా:- అధికార్లకు మాత్రం వారి వారి హోదానుబట్టి ఏ బిరుదో ఒకటి ముందు తగిలించి తదుపరి వారి హోదాను తెలియపరుస్తాం.

హా:- ఎలాగంటే — ఒక అధికారి ఉన్నాడనుకోండి. ఆతని పేరు ఏ పాపేస్వరమో, స్వార్థేశ్వరమో అనుకోండి. ఆతని పేరు ముందర ఏ "పు స్థ. రత్న" బిరుదో ఏ "పు.స్థ. ప్రజ" బిరుదో తగిలించి మొత్తమంతా "పు స్థ.రత్న పాపేశ్వర కొత్వాల్" అని వ్యవహరిస్తాం. "పు స్థ." అనే సంగ్రహానికి పుణ్యస్థలి అని విపులార్థం.

1వి: [చిరునవ్వు] కాసి అలా భేదం చెయ్యకుండా ఉంటేనే మంచిదేమో?

2వి: ఎందుకండీ. ఈ మీ పుణ్యస్థానం శ్రేయోప్రదేశమనీ, ఇక్కడ సర్వులకు సమానస్థాయి ఉందని ప్రతీతి. ఆ మంచిపేరు కాస్తా ఈ విభేదాలతో చెడిపోతుందేమో!

హా:- నిజం, నిజం — వారన్నదికూడా నిజమే సుమండీ!

అయ్య:- ఆఁ తమరింకా అలా నిలబడి ఉన్నారే !— పూలదండలైనా కనీసం లేవే !

[అటూ, ఇటూ చూసి, చేరువలో పూలదండల్లాంటివి ఏవీ కన్పించక పోగా మెడలోని కండువాతీసి ఒక విద్యార్థికి వేస్తాడు. అదిచూసి పూజారి తన గావంచా తీసి మరో విద్యార్థికి వేస్తాడు.]

పూ-: మా ఆంధ్రుల ఆచారాలు మీకు వింతగా ఉండొచ్చు—మాపుణ్యాస్థలిలో మాత్రం మేం మా కుటీర పరిశ్రమలకు విలువనిస్తాం. కాబట్టే తమ కంఠాన్ని చేనేత వస్త్రాల హారంతో అలంకరింప జేసాం.

1వి:- మీ కుటుంబ పరిశ్రమలంటే మీకింత అభిమానమా ?

అయ్య:- అవునండీ !

పూ:- అవునండి—చచ్చేంత అభిమానం.

2వి:- కాని ఈమధ్య మీరేదో మా ముంఫేర్‌లో పాతరేకులకని చాలా డబ్బు పాడుచేశారని విన్నాం.

అయ్య:- అబ్బే! అది...పూర్వం ఉన్న పూజారి దురాశాపరుడై అలాంటి స్వార్థపు పనులు చేశాడు. (మాట మారుస్తూ) ఆ మాటకేంలెండి. తమరు కూర్చోండి (పూజారితో) వాళ్ళ కాపరాలు చూపించవయ్యా!

పూ:- ఉరే కాసుబూ! ఎక్కడ తగలడ్డావురా ?

కాసు:- (వచ్చి) అయ్యా!

పూ:- ఇంతవరకూ ఎక్కడ తగలడ్డావయ్యా? "నౌకరు కాసులూ ?"

కాసు-: ఎక్కడ తగలడతారు బాబయ్యా? వల్ల.....

పూ:- చాల్చాల్లే! వెళ్ళి రెండు కుర్చీలు పట్రా! [కాసు నిష్క్రమించును]

అయ్య:- తమ రాకవల్ల పుణ్యాస్థలికి నిజంగా సుందరతనం వచ్చింది.

2వి:- అబ్బే మాదేముందండి. మీ పుణ్యాస్థలిని పొగిడేంటకు ఆ ఆదిశేషు డైనా పనికిరాడు.

1వి:- ఆ శిలాఫలకాలూ, ఆ ఆలయ ప్రాంగణాలూ, ఆ నియమాలూ, ఏమని వర్ణించడం—

పూ:- మీరేదో అతిగా వర్ణించేస్తున్నారుగాని అందులో మాదేముందండీ (కాసులు కుర్చీలు తెచ్చాడు) అవి ఆలా వెయ్ (కుర్చీలు వేసి నిలబడతాడు కాసులు.)

1వి:- అహఁ ఆలా అనకండి. పారిశ్రామికంగా మీ ఆంధ్ర చాలా వెనకబడి ఉన్నా, నైతిక విలువల్లో మటుకు మా బీహారుకంటే మీరే గొప్పవారు. పొగడ్తలు కాదు, మనసులో మాట.

2వి:- ఈ దశాబ్దంలోనూ, మీరు సాధించిన ఘనకార్యాలు. పారిశ్రామికంగా ముందంజ వేసిన మేంకూడా సాధించలేకపోయాం. మీ రెండేళ్ళ తేలిక ప్రణాళికలూ—

1వి:- మూడున్నరేళ్ళ ఐరువు ప్రణాళికలూ—

2వి:- మీ పుణ్యస్థలి ప్రగతికి వేసిన సోపానాలు, మా ప్రణాళికలుకూడా వెయ్యలేకపోయాయి.

అయ్యా:- ఏదో తమలాంటి విద్యాధికులూ, ప్రగతిశీలురూ, అభ్యుదయ వాదులూ, మాలాంటి చిన్నవాళ్ళకు చేదోడు వాదోడుగా ఉండాలి గాని—

1,2వి:- అబ్బే! అదెంతమాట?

పూ:- ఓరే కాసుబూ, ఆలా బెల్లంకొట్టిన రాయిలా నిలబడతావేంరా? మన వాళ్ళకు కాస్తంత పాడియాలూ, పలహారాలూ పట్రా.

కాసు:- (వెళ్ళబోతూ తక్కున ఆగి) అయ్యా! దేశవాళి సరుకు పట్రమ్మంటారా?

1:- అదేం, విదేశులెవరైనా వస్తే మీ ప్రదేశం సరుకు నివ్వరా?

కసు:- మా తెలుగోల్డి ఆదో నాసిరకం బుద్దిలేండి బాబయ్యా. మా చేతి పనులగాని, మా యింట తయారీగాని మీకు నచ్చవని, గోంగూర నుండి గోదువులు వరకూ-అంతెందుకు, వంటోళ్ళనికూడా నెలకు రెండువేలిచ్చి మీ ప్రాంతాల్నించే రప్పించుకొంటాం.

ఓవి:- మాకు మీ ఆంధ్రదేశమంటేనే యిష్టం. దేశవాళీ సరుకే తీసుకురా, (కాసులు నిష్క్రమణ, అయ్యవారు పూజారిని ఎర్రగా చూస్తాడు. విద్యార్థులు కూర్చుంటారు.)

అయ్య:- ఆఁ మీరీ రెండువారాలూ మా పుణ్యస్థలినంతా ఆమూలాగ్రం పరీక్షగా చూడారి.

పూ:- ఈ పదేళ్ళలోనూ, మా పుణ్యస్థలిలో వచ్చిన మార్పులూ, కూర్పులూ తమరు సూక్ష్మంగా పరిశీలించాలి.

అయ్య:- అందుకోసం మీ పర్యటన వివరాలుకూడా ముందే పథకం వేసి ఉంచాం (జేబులోంచి కాగితంతీసి చదువుతూ) ఆఁ మొట్టమొదట మీరు మా పుణ్యస్థలి పరిపాలకవర్గం సభ్యులతోనూ—

పూ:- అధికార, అనధికార వర్గాలవారితోనూ—

అయ్య:- పరిచయం చేయబడతారు.

పూ:- తదుపరి తేనేటి విందు.

అయ్య:- రెండు— మీరు చిన్న ఉపన్యాసమిస్తారు.

పూ:- తరువాత పలహారాల విందు.

అయ్య:- మూడు— అంతా కలిసి మా సాంప్రదాయసిద్ధమైన కూచిపూడి నాట్యాలను వీక్షిస్తారు.

పూ:- అ వెనక ఆల్పాహార విందు.

అయ్య:- నాలుగు— మీ నాట్యాల సాంప్రదాయాలమీద, మా ఉపన్యాసాలూ.

పూ:- తదుపరి ఉపాహార విందు.

అయ్య:- ఆఁ మర్నాడు—మా పుణ్యస్థలి ఆవరణలో మేం శ్రమదానంతో కట్టుకున్న క్రొత్త కాలేజీ, శిక్షణాలయం, మీరు చూపించబడతారు. ఈ కళాశాల విధాన మంతటమీద మా పుణ్యస్థలి కమిటీ అధికారమే. కనుక—

పూ:- ఆ విధానంమీద తమ అమూల్యాభిప్రాయాన్ని వెలిబుచ్చాక. మా పుణ్యస్థలి ఆవరణలో మేం స్వయం కృషి మీద పండించిన పండ్లరసముల విందు.

అయ్య:- తదుపరి మా పుణ్యస్థలి నడుపుతున్న సూక్ష్మస్టీల్ కార్ఖానా మీరు వీక్షిస్తారు. అందులో—

పూ:- అందులో కమ్మరి కుమ్మరి పనుల దగ్గరనుండి, బట్టలు, బుట్టలు నేత వరకూ పరిశోధనలు జరుపుతారు.

అయ్య:- ఆ లఘుపరిశ్రమల మీద తమరు చిన్న ఉపన్యాసమిచ్చాక—

పూ:- ఆరుణయట విందు.

అయ్య:- తదుపరి మా పూర్వీకులు ఎప్పుడో శతాబ్దాలక్రితం కట్టించిన ఈ శిల్పాలను పరిశీలించిన—

పూ:- తక్షణం చల్లని పానీయములు విందు.

అయ్య:- ఈ మా పుణ్యస్థలి ప్రక్కనుండే "ప్రభావతి" అనే పిచ్చేరు ప్రవహిస్తుంది.

పూ:- అది సాలీనా రెండుమూడు సార్లు సరదాగా ప్రళయ నృత్యం చేసి, ఏటా ఒక్క ఇరవైకోట్ల రూపాయల్ని, ఒక్క రెండు మూడు వందల మంది ప్రజల్ని మాత్రం పొట్టన పెట్టుకుంటుంది.

అయ్య:- ఆ బీభత్సాన్ని ఆరికట్టే నిమిత్తం సదరు పిచ్చేరు మీద మేం కట్టిన కట్టడం—

పూ:- అది ఈమధ్య వచ్చిన వరదకు కొట్టుకుపోయిందిలెండి.

అయ్య:- నువ్వుండవయ్యా శాస్త్రీ! ఆఁ ఆ కట్టడం, కొయ్యవంతెన పరిశీలించాక కొబ్బరిబొండాల-

పూ:- విందు.

(అయ్యవారు పూజారిని ఎగాదిగా చూస్తాడు. అంతలో కాసులు రెండు గ్లాసులు పానీయా.తో వస్తాడు. అయ్యవారు వాటిని విద్యార్థుల కందిస్తాడు.)

1వి:- (తాగుతూ) అమృత మంటే సమ్మండి.

2వి:- ఇది "బీరా"! అండి?

కాసు:- కాదు బాబయ్యా! మంచినీళ్ళు

(అమ్మవారూ, పూజారీ కోపంగా చూస్తారు.)

1వి:- మీ రాష్ట్రంలో మంచినీళ్ళు కూడా ఎంత అమృతప్రాయంగా వుంటాయి.

పూ:- అందుకే మా ప్రజలందరూ యధేచ్ఛగా త్రాగేందుకు రామపాద సాగారాన్ని మూలకునెట్టి, గోదావరి నలుగురికి అందుబాటులో వుండేటట్లు యీ దేశం మీద వదిలేశాం.

(సత్రం వెలుపల్నించి ప్రొఫెసర్ ప్రవేశిస్తాడు. కంగారుతో కాసులు నిష్క్రమించాడు)

ప్రొ:- అయ్యా, నాక్కూడా పానీయమిస్తారా? దాహంగా ఉంది.

పూ:- (ఆశ్చర్యంగా చూస్తూ) ఎవరయ్యా నువ్వు?

ప్రొ:- కాందిశీకుణ్ణి.

అయ్య:- ఎక్కడినుండి వచ్చావ్?

ప్రొ:- ఎక్కడినుండి ఏస్తాను ? కాందిశీకుల పుట్టినిల్లయిన ఈ పుణ్యస్థలి నుండే వచ్చాను.

అయ్య- అయితే ఇక్కడి కెందుకొచ్చావ్?

ప్రొ:- ఆకలేస్తోంది.

పూ:- ఏడ్చినట్టుంది. గతిలేనివాళ్ళందరకు ఇదొక సంతర్పణ కేంద్ర మనుకున్నావా?

ప్రొ:- ఎలా అనుకుంటాను బాబూ? ఇక్కడ దాహానికి ప్రజారక్తాన్ని అతి చవగ్గా ఇస్తారనీ, అన్నార్తులకు నరమాంసం ఉచితంగా సంతర్పణ చేస్తారనీ—

పూ:- "విని" వచ్చావా ?

ప్రొ:- కాదయ్యా, అరఛటంమీద తెల్సుకుని వచ్చాను.

2వి:- ఎవరండీ వీరు?

1వి:- కనిపించటంలేదూ? పిచ్చివాడై యుంటాడు.

ప్రొ:- చూశారా? అనుమానం మీకూ ఎంతలో కలిగిందో. అనుమానించండి. అనుమానం విద్యార్జనకు మొదటి మెట్టు... అన్నట్టు తమ పరిచయం—

2వి:- విద్యార్థులం.

ప్రొ:- పాశ్చాత్యులా ?

1వి:- కాదు. బీహారీలం.

ప్రొ:- అదేనయ్యా— ఇతర రాష్ట్రీయులంతా మా రాష్ట్రీయులకు పాశ్చాత్యులే అవుతారు. ఇక్కడి కెందుకు వచ్చారు? మీరు—

పూ:- అవన్నీ నీ కనవసరం.

ప్రొ:- మీరు చెప్పకపోతే నాకు తెలిదా? అంత దూరంనుండి శ్రమపడి ఈ వందల మైళ్ళు ఎందుకు వస్తారు? మా పుణ్యస్థలిని సందర్శించేందుకు, సందర్శించినదాన్ని అతిశయోక్తులతో చరిత్రలోకి ఎక్కించేందుకు, అందుకేనా ? అయ్యా ! మీరీ పుణ్యస్థలిలో ఏమిటి చూశారు ?

2 వి:- ఇప్పుడే మేం వచ్చాం.

ప్రొ:- ఎప్పుడొచ్చినా పరవాలేదు. మీరు మా పుణ్యస్థలిని పరీక్షించదల్చుకుంటే— అధికార పరిధిలో పరిశీలించకండి. నాతో రండి చూపిస్తాను. ఈ రండి.

అయ్యా:- వెళ్ళకండి. అతడు పిచ్చివాడు.

ప్రొ:- విన్నారా— ఆ పెద్దమనిషి మాట ? పిచ్చివాని అభిప్రాయాలన్నీ పిచ్చిగానే ఉంటాయట. మరి వారిలాంటి స్వార్థంగానే ఉంటాయిగా?

అయ్యా:- శాస్త్రీ !

పూ:- అయ్యా! (ప్రొఫెసర్‌తో) ఏవయ్యా కాస్త చిన్నా పెద్దా, మంచీ మర్యాదా అవసరం లేదటయ్యా ? నోటికి వచ్చినట్టల్లా మాటాడే సెయ్యడమే?

ప్రొ:- నేను పిచ్చివాణ్ణి శాస్త్రిగారూ! నాకు మంచీ— మర్యాద ఏమిటి?

[విద్యార్థుల చేతులు పట్టుకొని లేపి] రండి బ్రదర్స్! ఆ కనిపించే దేవాలయం చూడండి. అదే పుణ్యస్థలి. అదే మా జీవితకేంద్రం. అదే మిమ్మల్ని,మిగతా లోకాన్ని, తన సౌందర్యంతో, ఘనతతో, శిల్పాలతో ఆకర్షిస్తోంది.

ప్రొ:- దాన్నుద్దేశం పెట్టుకుని— చూడండి— (అయ్యవారినీ, పూజారినీ చూపిస్తూ) ఎందరు స్వార్థపరులు బ్రతుకున్నారో మీకు తెలీదు— దాని మహత్వమనే ఎర చూపించి, దాని శిల్పమనే ఇతిహాసాన్ని వినిపించి, దాని ప్రభావమనే భయాన్ని కల్పించి, కొందరు కసాయి వాళ్లు, వందలూ — వేల అమాయక ప్రాణుల ఉత్తుకలు కోసి కొరతలు వేస్తున్నారు. అర్థమైందా ? ఏమిటి?- మీకర్థంకాదు. ఆ దేవాలయాల పునాదుల క్రింద ఎందరు సజీవంగా సమాధి చెయ్యబడ్డారో!—మీరు గ్రహించలేరు. ఆ రాళ్ళను ఎన్నివేల— లక్షల మానవుల రక్తాలతో సిమెంట్ చేసి నిలబెట్టారో మీ రూహించలేరు. ఆ శిల్పాల లోపల ఎందరు జీవుల ఆస్థిపంజరాలనూ, ఆక్రందనలనూ బంధించి వాటిమీద శిలాఫలకాలను అతికించారో—

పూ:- ఏయ్—పిచ్చి మనిషీ! నీ కేమన్నా బుద్ధి ఉందటయ్యా?

ప్రొ:- పిచ్చివాడికి బుద్ధెక్కడుంటుందండీ పూజారిగారూ? అహాహా మీకు కంట్రాక్టర్ల చేతినుండి వేలూ, లక్షలూ కొట్టేసినప్పుడుండే తెలివీ, మెలుకువా మనుషుల్ని గుర్తించేటప్పుడు ఉండవనుకుంటాను.

అయ్య:- కాసులూ! [కాసులు ప్రవేశం] ఆ వెధవను బయటకు గెంటెయ్యరా! (కాసులు కదలడు. కంగారుగా ప్రొఫెసర్‌ని చూస్తాడు.)

ప్రొ:- (నవ్వి) నన్ను శ్రీమాన్ జగన్నాథస్వామినాయుడు గారైన సాక్షాత్ తమరే ఒకానొకప్పుడు నాశనం చెయ్యలేకపోయారే— ఇహ నెలకు 25 రూపాయల జీతగాడు వాడేం చెయ్యగలడు?

పూ:- ఎవరు నువ్వు?

ప్రొ:- గుర్తుపట్టలేదూ? నా కళ్ళలోకి చూడండి. నా మండిపోతున్న గుండె నడగండి. నా జ్వలించిపోతున్న నా హృదయాన్ని ప్రశ్నించండి.

మీ అన్యాయాలకు గురై నోరెత్త లేక నలిగి నశించిన అభాగ్యుల సమాధుల నడగండి—సమాధానం చెప్తారు.

కాసు:- వారు మన చిదంబరంగారు బాబయ్యా !

[నిష్క్రమణ]

1వి:- ఆ ప్రొఫెసర్ చిదంబరంగారా !

2వి:- పుణ్యస్థలి కాలేజీ ప్రిన్సిపాల్.

ప్రొ:- ఆ ఆ Proffessor and Ex. Principal చిదంబరం ఈ పిచ్చివాడే—ఈ వెర్రివాడే—(పూజారి, అయ్యవారితో) అవును—కదూ? మరచారా? అనాడు మీ కాలేజి ప్రిన్సిపాల్‌ని చేస్తామని నా ఉద్యోగానికి రాజీనామా ఇప్పించి (పూజారి బయటకు జారుకుంటాడు) నా స్వశక్తితో, నా తెలివితేటల్తో ఆ కాలేజీని పైకి తీసుకు వచ్చిన తరువాత, నీ మేనల్లుడు, తదుపరి — అల్లుడైన, ఏవీఁలోక జ్ఞానం తెలీని ఆ కుర్రాడికి ఆ పదవిచ్చి, నే నడిగితే— నీ పదవి నీకిచ్చిన అధికారంతో, హోదాతో వచ్చిన పలుకుబడితో నన్ను ఆధఃపాతాళానికి అణగద్రొక్కి సర్వనాశనం చెయ్యబోయావే ఆ చిదంబరమే—ఆ ప్రొఫెసర్ చిదంబరం, M. A. D. Litt వాడే ఈ పిచ్చివాడు.

2వి:- తమరు చనిపోయారని విన్నాం.

1వి:- తమకు మతి చలించనట్టు పత్రికలు వ్రాసాయి.

(ఆయ్యగారు మెల్లగా సభలోకి జారుకుంటాడు,)

ప్రొ:- అవును ఇంకా వ్రాస్తాయి, స్వకీయ విలేఖరి ఎలా లిఖిస్తే అలా ప్రచురిస్తాయి, పత్రికలు. పాపం వాటికేం, తెలుసు.

2వి:- ఇన్నాళ్ళూ మీరెక్కడున్నారు?

ప్రొ:- దేశ పర్యటన—బ్రదర్స్! దేశమంతా తిరగండి. అధికార హోదాతో కాదు, సామాన్య మానవుడిలా. సాధ్యమైతే నాలా— పిచ్చివాడి వేషంలో తేసిది విందులూ, అల్పాహార, ఉపాహారాలూ, ఇవేవీ వద్దు.

పార్టీలూ, ఉపాన్యాసాలూ, ఇంటర్వ్యూలూ — అలాంటివి ఎద్దు. కళ్ళు కాల్వాల ప్రక్క నిద్రపొండి—ఒక్క రాత్రి—రావి చెట్టుక్రింద దుంపలమ్ముకొనే చావలేక - బ్రతకలేక సతమతమయ్యే ముసలిదాని అడుగుజారిన కుండలో నీళ్ళు త్రాగండి. రోడ్డు ప్రక్క ఈగల్తో—దోమల్తో యుద్ధంచేసే కుష్ఠుకోగి గోనె సంచుల్లో నివసించండి— ఒక్కగంట! అప్పుడు మీ కర్తమవుతుంది - ఈ పుణ్యస్థలిలో సామాన్యుని జీవితమెట్టిదో? పల్లకి నెక్కే ప్రభువుల ముఖంలో ఏముందయ్యా—ఆది మోసిన బోయీల భుజస్కందాల్ని తడివి చూడండి.

1వి:- ఈ విషయాలేం మాకు తెలీవు.

ప్రొ:- తెలీకకాదు — తెలుసుకొనే తాపత్రయం లేక. Gentlemen—Self reali station—నిన్ను నువ్వు తిరగేసుకో, నువ్వు వ్రాసిన వ్రాతలు తిరిగి చదువుకో, నువ్విచ్చిన ఉపన్యాసాలు జ్ఞప్తికి తెచ్చుకో- ప్రపంచం ముందుకు పోతుంది. లోకం మారుతోంది. దాని ప్రగతిని గుర్తించు. దాని క్రాంతిని చూడు. ఈ స్వార్థాలూ, స్వాభిమానాలూ, ఈ సంకుచిత భావాలూ, ఈ సోత్కర్షలూ, ఈ బంధుమిత్ర వర్గ పక్షపాతం నీ ఒక్కడి వక్రబుద్ధికే సంబంధించినవై తే దానికి కోటి కోట్ల కంఠాలు తెగిపోతవే!

పిచ్చిది:- [పత్రం పెరట్లోంచి ప్రవేశించి] "నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం సహిస్తుందా? మనవాళికి నిజంగానే మంచికాలం వహిస్తుందా?" మానవాళికి నిజంగానే మంచికాలం వహిస్తుందా?" ఎవరు పీళ్ళు... మీరూ పిచ్చివాళ్ళేనా?

ప్రొ:- కాదమ్మా! యాత్రీకులు- మన ప్రగతిని. గతిని పీక్షించడానికి వచ్చిన మన "పాశ్చాత్య" విద్యార్థులు.

పిచ్చిది: పీక్షించారా? ఏమంటారు?

ప్రొ:- అనుభవరహితులు — వాళ్ళకేం తెలుస్తుంది? దూరం నుంచి చూస్తున్నారు. కనిపించే ప్రతి వెలుగునీ మనం సాధించిన ప్రగతే

అనుకుంటున్నారు కాని, ఆ రశ్మి సామాన్య ప్రజ కెంత ఉపయోగకరంగా ఉంటుందని యోచించటం లేదు.

పిచ్చిది: అవును. ఎలా యోచిస్తారు? విందులు—విందులపై విందులు ఆరగించేసరికి ఉక్కిరిబిక్కిరై పోతున్నారుగాని—దుష్టులార—భ్రష్టులార—బాధాసర్ప దష్టులారా—ఏడవండేడవకండి. మీకోసం వాళ్ళు వచ్చి, మీ ప్రతుకులు వాళ్ళు చూసి, మీ దేశం విందులారగించి మీకోసం, మీకోసం, మీకోసం-అరుగో అరు గరుగో నాయకుల్, వినాయకుల్—జగన్నాధ, జగన్నాధ రథచక్రాల్ వలె వస్తున్నారు. వాటికింద మీరు నలిగి, మీ రక్తం చిందించి, హరోం హర హర యని చావండి.

[బయటకు పోతుంది]

1వి:- ఎవావివిడ ప్రొఫెసర్?

ప్రొ:- వినుపించటంలేదూ! పిచ్చిది — ఒకరి స్వార్థం...పర్యవసానం మరొకరి సర్వనాశనం.

2వి:- ఆమె పిచ్చిమనిషిలా కనిపించటంలేదు.

ప్రొ:- పిచ్చివాడా! మా పుణ్యస్థలిలో ఒక సామాన్య మానవుని జీవితం ఎంత సున్నితమైందో తెలుసా? ఉద్యోగం ఉన్నంతకాలం వాడికి ప్రాణం ఉంటుంది. అది పోయిన వెంటనే వాడు చస్తాడు. చావాలి లేదా వాడిమీదికి ఒక క్షయ, ఒక పక్షవాతం, ఒక ఉబ్బసం ఉరుక్కుపడతాయి. అతను పోయాడు. ఆమెను ఈ అధికారు లెవరు ఆదరించలేదు. ఈమె పిచ్చిదైంది. కాని వ్యభిచారి మాత్రం కాలేదు సుమా! అలాగే ఊరిమీద హాహాకారాలు చేసుకుంటూ తిరుగుతుంది. కాని—ఈ ప్రజ, ఈ సమాజం, ఈ దేశం ఈమెకు చేయూత నివ్వలేదు.

2వి:- మా కీ విషయాలేవీ తెలీవు. క్షమించండి ప్రొఫెసర్!

ప్రొ:- కాని, మీ దేశస్తుల్లోమటుకు ఈ మా పుణ్యస్థలిని గురించి నీచంగా ప్రచారం చెయ్యకండేం.

ఎక్కడ బయటపెడ్తుందోనని ఆమె పిచ్చిదనీ, వెర్రిదని లోకం నమ్మేట్టు దండోరా వేయించిన నేనా పిచ్చివాణ్ణి? మీ మేనల్లుడూ, తత్రాపి అల్లుడయి కూర్చున్న ఏవీ లోకజ్ఞానం తెలీని ఆ కుర్రాణ్ణి, ఈ కాలేజీ ప్రిన్సిపాల్‌ని చేసేందుకు విద్యాధికుడు, నిగర్వి, నిజమైన వ్యక్తిత్వంగల ఈ చిదంబరాన్ని పదభ్రష్టుణ్ణి చేసిన నేనా పిచ్చివాణ్ణి? ఈ నాలుగేళ్ళ హయాంలో మీ Bank Account అయిదు లక్షలకు పెరిగించిన నేనా పిరికివాణ్ణి? తమకు నోరెలా వచ్చింది నాయుడుగారూ!

అయ్య:- ఊరుకోవయ్యా శాస్త్రీ! అవన్నీ తప్పకు. నన్ను క్షమించు. ఏదో ఆవేశంలో అనేశా. నువ్వు చేసినవన్నీ నేను కాదన్నానా? నీ ఉపకారం మరువగలనా శాస్త్రీ? ఆ పిచ్చిది నిజంగానే పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళటం చూశావా?

పూ:- (తన బాధనుండి వెంటనే తేరుకోలేదు) చూశాను. ఈ నా రెండు పాపిష్టి కళ్ళతో చూశాను.

పిచ్చిది:- (బయట్నుంచి వస్తుంది) వట్టిది. ఈ పూజారి అన్నీ అబద్ధాలే ఆడతాడు. నేను పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళానా?

(పూజారీ, అయ్యవారూ మొహాలు చూసుకుంటారు.)

పూ:- ఇహ మనం దీన్నిలా వదిలేస్తే లాభం లేదు.

అయ్య:- ఏం చెయ్యాలి?

పూ:- రండి (పిచ్చిదాన్ని సమీపించి) తులసమ్మా! నీకిదే చెబుతున్నాను, ఈ ప్రదేశాన్ని విడిచి పోతావా లేదా?

పిచ్చిది:- ఎక్కడికి? పోవాలా? ఎక్కడికిరా?

అయ్య:- నీ యిష్టమైన చోటుకి—

పిచ్చిది:- నా కిష్టమైన చోటు యిదే, ఇదేరా. ఇది నా జన్మస్థలం. ఇక్కడే నా జీవితం గడిచింది. ఇక్కడే బంధువులూ, కుటుంబాలూ, సంతానాలూ ఉన్నయ్. వీళ్ళను విడిచి ఎక్కడికి పోవాలిరా? ఎందుకు పోవాలి?

పూ:- మేం నిన్ను బహిష్కరిస్తున్నాం.

అయ్య:- నీకు పిచ్చెక్కింది.

పూ:- నీవు ప్రజల్లో కల్లోలాన్ని కలిగిస్తున్నావ్. పిచ్చిని వాళ్ళ కంటిస్తున్నావ్.

అయ్య:- ఈచోట శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నావ్.

పూ:- ప్రజలుకూడా నీలా పిచ్చెత్తిపోతే—

పిచ్చిది:- మంచిదేగా! మీరే ఈ పిచ్చి రాజ్యాన్ని ఎన్నికలు లేకుండా ఏలొచ్చు. నోరు మూసుకుని సిగ్గుపడండి.

అయ్య:- శాస్త్రీ!

పూ:- మామ్మా! నువ్వు పోతావా? పోవా?

పిచ్చిది:- పోను! పోను!- ముమ్మాటికి పోను (ఏడుపు) పోవాలా! ఎక్కడికి? ఎలా? నా పసుపుకుంకుమ ఏది? అనాడు సన్నాయి మేళాంతో సుమంగళిగా వచ్చి, ఈనాడు బేడి చేతుల్తో, తెంపేసిన మంగళ సూత్రంతో ఎలా వెళ్ళాలి? నా అయిదోశనం ఏది?

పూ:- అవన్నీ మాకేం తెలుసు?

పిచ్చిది:- తెలీదూ? మీరు కాదూ ఆయన్ని చంపింది? మీరు కాదూ అయన్ని చిత్రవధ చేసింది? మీరు కాదూ ఆయన్ని మీ హోదాలంకూ, స్వార్థాలకూ బలియిచ్చి ఆ రక్తంతో మీ పదవుల్ని నిలబెట్టుకున్నది ?

అయ్య:- శాస్త్రీ!

పూ:- మామ్మా...

పిచ్చిది:- నేనో పిచ్చిదాన్నిరా! మామ్మను కాదు. నేను నది వయస్సులోనే నీకు అమ్మమ్మనయ్యానురా? (ఏడుపు) నాకు దిక్కులేదు, నాకు దోవ తెలియదు. భగవాన్! నేను వచ్చేస్తా— నీ సన్నిధికి వస్తున్నా భగవాన్! నన్నూ నీలో ఐక్యం చేసుకో. ఈ స్వార్థపు గర్భసీద నే నెందుకు బ్రతికుంది ? నేను పోతానురా. చచ్చిపోతా. చచ్చేముందు మిమ్మల్ని చంపి మరీ చస్తాను—

పూ:- ఆఁ అయితే నువ్వస్నంత పనీ చేశావన్నమాట (అయ్యవారితో) అయ్యా! ఇది పోలీసులకు చెప్పేసింది. దీన్నిలా విడిచి పెడితే లాభంలేదు. రండి.

(పూజారి ఆమె చేతులు పట్టుకొని లాగుతాడు. ఆమె అరుస్తుంది. అయ్యవారు ఆమె నోరు మూస్తారు. ఆమెను సత్రంలోకి లాక్కు పోతూండగా ప్రొఫెసర్ వస్తాడు.)

ప్రొ:- వదలండి నీచులారా! (వాళ్ళమీదకు వెళతాడు.)

అయ్య:- సమయానికి వచ్చాడు. మనకు అడ్డం వచ్చేవాళ్ళ నందర్నీ నాశనం చేసేద్దాం.

(ప్రొఫెసర్ అయ్యవారి మీదకు వెడుతుండగా పూజారి అతన్ని అక్కడ పడివున్న కర్రతో నెత్తిన బాదుతాడు.)

పిచ్చి:- బాబో! చంపేశార్రో! (అరుస్తుంది)

(పూజారి అదే ఆవేశంతో ఆమెనూ బాదుతాడు. ఇద్దరూ నేల కొరుగు తారు. కాసులు ప్రవేశిస్తాడు.)

కాసు:- బాబయ్యా! అమ్మగోరూ! అమ్మ బాబో చంపేశారు.

ప్రొ:- (వణికే కంఠంతో) కా...సు...లూ!

కాసు:- బాబయ్యా, బాబయ్యా, ఏంటిది. బాబయ్యా ? ఇలాంటి సావు సావ డానికేనా, ఇక్కడి కొచ్చారు. బాబయ్యా! పున్యాత్ములు మీ కిలాంటి సావా?

పిచ్చి:- భగవాన్...నా...మొర...విన్నావా? వచ్చే స్తున్నా...ఇదిగో... వ-చ్చే-స్తు...న్నా...(చచ్చిపోయింది.)

కాసు:- అమ్మా తులసమ్మగోరూ! (ఏడుస్తాడు)

ప్రొ:- పోయావా తల్లీ...(బలహీనంగా చేతులెత్తి నమస్కరిస్తాడు. కాసులు ఏడుపు విని) కాసులూ ... ఏడుస్తున్నావా?... పిచ్చివాడా!... నే నొక్కడ్ని చచ్చిపోతే.....సకల చరాచర.....ప్రకృతి..... స్తంభించిపోతుందనుకుంటున్నావా ... నన్నుపోనీ...నేనుపోవా...లి నాలాంటి ... లక్షలు...కోట్లు ... ప్రాణాలు... రక్తంలో ... గిల

గిలా... కొట్టుకుంటూ... పీళ్ళ ... ఆకాంక్షలకూ ... అహంకారాలకూ...స్వార్థాలకూ... సోతక్కర్షలకూ...బలి కావాలి.....

కాసు:- బాబయ్యా!

ప్రో:- వెళ్లు... కసులూ... ఏదవకు... నీ జీవితాన్ని... వాళ్లు .. సర్వనాశనం చేస్తారు...

కాసు:- చెయ్యనియ్యండి బాబయ్యా! ఇలాంటి కసాయోల్ల దగ్గిర బతికే కంటే సావటం మేలు.

ప్రో:- చావు, చావు, చావు...చస్తున్న... మేం... ఏం... సాధిస్తున్నాం? చచ్చి... సాధించగలిగే... దేముంది?... బ్రతుకు... కాసులూ... బ్రతుకు...శరవేగంగా...బ్రతుకు... అదుగో...ఆటుచూడు... ఆ చీకట్లని...దూసుకుంటూ...ఎలా...వచ్చేస్తున్నారో...

కాసు:- (సూన్యంవైపు చూస్తూ) ఏంటి బాబయ్యా!

ప్రో:- కనిపించటం... లేదూ... అదిగో... మహా ప్రళయం... రుంకృతితో...భైరవ...నృత్యం...చేస్తూ...ఎలా... విజృంభిస్తుందో... ఆ... అంతరిక్షాల... దహన...జ్వాలా... ప్రచండత్వంలో...ఈ ద్రోహాలూ... దోషాలూ..... దుర్మార్గాలూ.....దౌర్జన్యాలూ... దాస్యాలూ...దానవత్వాలూ...దారుణకృత్యాలూ...సమూలంగా... నాశనమై.....స్వాతంత్ర్యం... సమభావం.....సౌభ్రాత్రం... సౌహార్దం...పునాదులై ...కళ్లలేచి...జనావళికి...శుభం...పూచి.. శాంతి...శాంతి...శాంతి...శాంతి...జగన్నంతా...నింపుతుంది... జగన్నంతా...హసింప జేస్తుంది...నా స్వప్నం ఫలిస్తుంది...నా ఆశలు ఫలిస్తాయి.

(మెద వాలిపోతుంది. కాసులు ఏడుస్తూ సత్రంలోకి నిష్క్రమణ.)

తెర

కుక్కపిల్ల దొరికింది

రచన :
రావి కొండలరావు

పాత్రలు

చిదంబరం

సీను

కాంపౌండర్

అబ్బాయి

చతుర్భుజం

కంట్రాక్టర్

పోయిన కుక్కపిల్ల

[పరిశుభ్రంగా అలంకరించబడిన ఒక గది, ఒక మూల టెలిఫోను వున్నది. గోడకు ఎదురుగా పటాలూ, కాలెండర్లూ వున్నై. కాలెండరుకు దిగువగా ''కుక్క వున్నది జాగ్రత్త!'' (''Beware of Dog'') అనే బిల్ల ప్రేలాడుతున్నది. తెర లేచేసరికి స్టేజిమీద మనుషులెవరూ లేరు. కాసేపటికి టెలిఫోన్ ప్రోగింది. ఇంట్లోంచి నౌకరు ''సీను'' అనే కుర్రాడు వచ్చాడు. వచ్చి ఫోనుతీసి-)

సీను:- ఎవరండీ ఆఁ... అయ్యా, లేరండి... ఆవునండి... అయ్యగారు లేరు... తెలీదండి... తెలీదండి ఏదీ తెలీదండి... (కాసేపు విని కుక్కపిల్లకు అన్నంపెట్టే ఒక గిన్నె ఒక మూలవుండే వెళ్ళి దాసికేసి దీనంగా చూస్తూన్నాడు. ఫోను మళ్ళీ ప్రోగింది. వెళ్ళి తీసి) ఎవరండీ?... నేనేనండి... అయ్యా - - అయ్యగారూ తమరా— ఎక్కడనుంచీ మాట్లాడుతున్నారు? ఈ ప్రక్క నుంచే!... చిత్తం దొరకలేదండి... లేదండి తమరు రండి. తమరు రావాలంటాను. మాటిమాటికీ తమరట్లా ''దొరికిందా దొరికిందా'' అంటే ఎట్లా?... ఐదునిముషాలు కిందటేగా ఆడిగారు— అవును అడిగరు లేదన్నాను అవునండీ లేదన్నాను... చిత్తం (విసిగిపోయినట్టు తపీమనిపెట్టాడు. అటూ ఇటూ చూసి గదంతా సర్దుతున్నాడు. బయటనుంచి కాస్సేటిలో యిండి యజమాని చిదంబరం హడావుడిగా వచ్చాడు. 50 సంవత్సరాల ప్రాయం. సూటు వేసుకున్నాడు. వస్తూనే నెత్తి మీద టోపీ తీసి బల్లమీద విసిరాడు).

చిదం:- అబ్బబ్బబ్బ ... రామచంద్రా ... శ్రీరామచం ... (ఆగి గోడకు తగలించివున్న 'Beware of dog' బోర్డుకేసి చూసి) ఈ బోర్డు ఇక్కడ తగలించడంలో నీ ఉద్దేశం? (ఆగి, చూస్తూ) ఈ బోర్డు ఇక్కడ తగిలించడంలో ఏమిటి నీ ఉద్దేశమూ అనిఅడుగున్నాను— చెప్పు సమాధానం... చెప్పూ?

సీను:- ఉద్దేశం ఏముంటుందండీ?

చిదం:- ఈ బోర్డు 'ఇక్కడ' ఎందుకు తగించావురా వెర్రిపీనుగా?

సీను:- ఉండిపోయిందిగదా అని—

చిదం:- అంతేనా?

సీమ:- అంతేనండి?

చిదం:- అంతేగద... ఇంతకూ దాని అర్థం ఏమిటో నీకు తెలుసా? అదే- ఆ బోర్డుపైద వున్న ఇంగ్లీ అక్షరాలలోని గూఢార్థం? (సీను తెలియ దని తల వూపటోగా) 'తెలీదని' తల వూపక్కర్లేదులే— నాకు తెలిసిందిలే నీకు తెలీదని! 'ఇక్కడో కుక్క వుంది... జాగర్త!' అని దాని అర్థం, అర్థం నీకు తెలీదు కాబట్టి ఆ బోర్డు ఇక్కడ కట్టినందుకు వూరుకుంటున్నాను. వెధవాయా 'ఇక్కడో కుక్క వుంది— జాగ్రత్త' అనే బోర్డు తెచ్చి ఈ గదిలో పెడితే మనిద్దరి లోనూ ఆ కుక్క ఎవరం అవి నీ అభిప్రాయంరా?...మాట్లాడకు... మాట్లాడకుండా దాన్ని అక్కడ నుంచి తీసెయ్యి. అసలెందుకు తెచ్చి పెట్టావు దాన్నిక్కడ?

సీను:- అర్థం తెలీకనేనండి... తెలిస్తే రోపల మీ గదిలోనే వుంచేసే వాడిని కదండీ!

చిదం:- నా గదిలో వుంచే వాడివా— లేక గోడకు వ్రేలాడగట్టేవాడివా!

సీను:- రామ రామ! అర్థం తెలిసిన తర్వాత ఇప్పుడెందుకు చేస్తానండీ ఆ పని?

చిదం:- ఉంతకు పూర్వం ఐతే అదికూడా చేసేవాడివే నన్నమాట!

సీమ:- అనుకున్నానండి, మీ గదిలోనే పెట్టేస్తే జాగర్తగా వుంటుంది గదా అని—

చిదం:- ఏడిశావ్‌గాని—దాన్నితీసి బల్లక్రిందపెట్టు. పెద్దమనుషులెవరన్నా వస్తారు (సీను కియ్యటానికి పోబోతున్నాడు) ఆ బోర్డును అసలు అక్కడనుంచి ఎందుకు కదలించావ్?

సీను:- కుక్కపిల్ల లేదుకదా, దాని బోర్డుమాత్రం ఎందుకని?

చిదం:- అటువంటప్పుడు తెచ్చి పడెయ్యక గోడకు ఎందుకు తగిలించావ్?

సీమ:- పోనీ, ఏదో పటాలమాదిరి అదీ ఉంటుంది కదా అని—దానికీ వేలాడ తియ్యటానికి తాడొకటి వుంది మరి—

చిదం:- సరే తీసేయ్ (సీము తీసి బల్లమీద పెట్టాడు.) బోర్లించు (బోర్లించాడు) దానిమీద ఏదన్నా కప్పు (అటూ ఇటూ చూసి సీను కొత్త వార్తాపత్రిక తెచ్చి కప్పబోయాడు) ఉందుందు— ఆట్లా కప్పితేనే అనుమానం. ఒకటి చెయ్యి — టేబిల్ క్లాత్ క్రిందపెట్టు సరిపోతుంది. (సీము టేబిల్ క్లాత్ క్రింద పెట్టాడు) ఏదో ఎత్తుగా పున్నట్లు కనిపిస్తోందిరా. నా మాట విను. ఇక్కడ నుంచి లోపలకు తీసుకుపోయి నా గదిలో ... నా గదిలో వొద్దు, అవతల గదిలో పడెయ్, జాగ్రత్త, దాని ఆవసరం ఐపోలేదు. (సీను వెళ్ళాడు. చిదంబరం కోటు తీసేసి చిరాగ్గా కూలబడ్డాడు. సీను వచ్చాడు.) ఏమయిపోయిందిరా మన కుక్కపిల్ల? దొరక నట్టే? ఇల్లంతా చిన్నబోయిందిరా — ఎంత ముద్దు. నన్ను చూస్తే ఒక నిమషం వదిలేదికాదు ఎంత దూరంలో వున్నా ఇట్టే అనవాలునట్టి తోక వూపేది... నేను బిస్కట్లు తీసుకు రాకపోతే వెధవకెంత కోపం— పాపం— ఎక్కడుందో— ఏమయిందో!

సీను:- విచారించకండి సార్ ! మన కుక్కపిల్ల మనకు దొరుకుతుంది కాని— అది లేకపోతే నాకేం తోచటంలేదు సార్! (అమాయకంగా) ఎంతమంచి కుక్కపిల్ల సార్ అది! ఎవ్వర్నీ ఏమీ అనేది కాదు. దొంగల్ని చూసినా ఎంతసేపూ అరిచేదేకాని కరవటానికి నోరే వచ్చేది కాదు సార్... అరిచే కుక్క కరవదంటారని— అరుపు తగ్గిద్దామని ప్రయత్నించాను. అరుపు తగ్గించేది. ఐతే 'ఒకర్ని కరిచి పాడిస్తానా' అన్నట్టు నోట్లో చెయ్యిపెట్టినా విదిలించుకొని పారిపోయేది!

చిదం:- సీనూ! ఆ కుక్కపిల్ల మనకు ఎట్లా వచ్చిందో తెలుసురా నీకు?

సీను:- తెలీదు సార్!

చిదం:- చెబుతా విను. బెంగుళూరునుంచి వస్తూంటే మధ్య ఒక స్నేహితుడు నాకు బహూకరించాడు. అంతకుపూర్వం కుక్కపిల్ల కోసం తెగ ప్రయత్నించాను. చిన్నప్పట్నుంచీ కుక్క పాఠాలు తెగ చదవటం ఏల్లా, కుక్కలమీద బాగా మక్కువ కలిగింది. ఏం చేస్తాం? మా

నాన్నగారికి కుక్కలంటే, కోపం—భయం! ఎంచాతంటే ఆయన తండ్రిగారు కుక్కకాటువల్ల చచ్చిపోయాట్ట. ఆ భయంవల్ల మా నాన్నగారు ఇంట్లో కుక్కబొమ్మ కూడా ఉంచేవాడుకాదు. గ్రామ ఫోను పాటలకోసం రికార్డులు కొంటే 'వెధవా, హిజ్ మాస్టర్స్ రికార్డులు కొనవద్దని చెప్పానా, లేదా?' అంటూ అవన్నీ తీసికెళ్ళి బయటపారేసేవాడు. సీళ్ళుపోసి—ఆ బొమ్మను వూడదీసి ఇంట్లోకి తెచ్చుకొనేవాడిని. వీధిలో కుక్క అరుస్తే నౌకర్ను పంపి ఆ కుక్కను ఊరవతలిదాకా తరుముకు పోయెచ్చి ఇంట్లో కాలుపెట్ట మనేవాడు ! అంత చాదస్తపు మనిషి ! నాకా చాదస్తమూ లేదు, భయమూలేదు సరికదా—అడేమిటో ఆయన 'ఉద్దు' అంటున్న కొద్దీ నా మనస్సు కుక్కలపీదికే పోయేది! 'కుక్క విశ్వాసముగల జంతువు' అనే మాట నా మెదడులో ఎప్పుడూ పనిచేస్తూవుండేది. అంచాత బెంగుళూరు నుంచి వస్తున్నప్పుడు నా స్నేహితుడిని ఆ కుక్కపిల్లను నాకు బహూకరించమన్నాను. ఆ బహూకరణతోపాటు ఓ కాగితం కూడా యిచ్చాడు. 'ఆకలివేస్తున్న కుక్కకు అన్నం పెడితే అది నిన్ను కరవదు—కుక్కకూ, మనిషికీ వుండే పెద్ద భేదమల్లా ఇదొక్కటే!' అని 'మార్క్ ట్వేన్' అనే మహానుభావుడి కొటేషన్ ఆ కాయితం మీద రాశాడు. ఎంత మంచి వాక్యం అను కున్నావు...ఆ కాగితం మాత్రం పెట్లో మిగిలిపోయింది.

సీను:- మ్చ్...ఏంచేస్తామండీ—ఖర్మ !

చిదం:- ఖర్మేమిట్రా నీమొహం ! (ఆగి) అసలు నువ్వే కారణం అది పోవ టానికి—

సీను:- నేనాండీ ?

చిదం:- అవును నువ్వే. ఆ కుక్కకోసం, దాని పోషణకోసం నిన్ను ఏర్పాటు చేశాను. దానికి తల్లీ తండ్రీ అన్నీ నువ్వే అనుకోమని చెప్పాను—'వూఁ, వూఁ' అని దాన్ని వొదిలేశావ్!

సీను:- నాకు తెలీకుసొన్! తెలిసి తెలిసి ఎందుకొదిలేస్తానండీ?

చిదం:- వెధవా-ఇరవైనాలుగ్గంటలూ దాన్ని నువ్వు కనిపెట్టుకుని కూచో నక్కర్లా?

సీను:- అది మన యిల్లు కాయాలని వీధిలో వుంచారు, దాన్ని కాస్తూ నేనూ అక్కడే కూచోనా?

చిదం:- ఏం, నువ్వు వెధవపనులు చెయ్యకుండానూ, పారిపోకుండానూ నేను నిన్ను కాస్తున్నాను కానూ? ఐనా నిన్ను అనేం లాభం? నీవంటి తెలివితక్కువ దద్దమ్మను నౌకరుగా ఉంచుకున్నందుకు నా బుద్ధి నసాలి!—అసలు ఎట్లా పోయిందిరా కుక్కపిల్ల?

సీను:- నేను చూడలేదుసార్—మొన్నరాత్రి మామూలుగానే అన్నం తిన్నది.

చిదం:- సరిగ్గానే తినేసిందా?

సీను:- మరి కాస్త ఎక్కువపట్టే పట్టింది—ఎట్లాగూ పోతాను కదా అని. అన్నం తిన్నాక గొలుసుతో స్తంభానికక్కట్టేను. మామూలుగా నేను నిద్రపోయాను. సగంరాత్రికే లేదు, గొలుసుమాత్రం ఉండిపోయింది.

చిదం:- ఆ గొలుసు ఓసారి తీసుకురా. (సీను లోపలికి వెళ్ళి గొలుసు తెచ్చాడు. చిదంబరం పరీక్షగా చూసి) గొలుసు కొరుక్కొని పారిపోలేదు.....విప్పేసివుంది. అంటే ఎవరో విప్పేశారన్నమాట! నువ్వసలు మెడకు గట్టిగా కట్టావా?

సీను:- గట్టిగానే కట్టానండీ—ఇంకాస్త బిగిస్తే గుటుక్కుమనేటంత గట్టిగా కట్టాను.

చిదం:- ఐనా పారిపోయిందే—ఏ దొంగ వెధవో ఎత్తుకుపోయాడు! దాని మానాన అది పోయివుంటుందని నేను అనుకోను. నిన్న పత్రికల వాళ్ళకు ప్రకటన యిచ్చాను. పోలీసు స్టేషన్‌లో గంటసేపు కూచున్నాను. ఊరంతా వెతికాను. కనిపించిన స్నేహితులందర్నీ అడిగాను. మాకు తెలీదంటే మాకు తెలీదనేవాళ్ళేగాని 'చూచాం' అని ఒక్కరనలేదు—ఇంకెందుకూ వెధవ స్నేహితులు?

సీను:- పోలీసులు ఏమన్నారండి?

చిదం:- నీ మొహం అన్నారు. 'మీ కుక్రాడిదాత వెదికించండి' అన్నారు. నువ్వు వెతికి దాన్ని వాళ్ళకు వప్పజెప్తే—అప్పుడు నా చేతికిచ్చి 'మేమే పట్టుకున్నాం' అని గొప్పగా చెప్పుకోటానికి కాబోలు! 'మీ కుక్క ఏదన్నా దొంగతనం చేసిందా?' అని వో పోలీసు అడిగాడు. 'లేదు' అన్నాను. 'ఐతే మాకేం సంబంధం లేదు—దొంగతనంచేస్తే పట్టుకునే బాధ్యత మాది' అంటాడు. ఇంకోడు 'ఎవర్నన్నా చంపి పారిపోయిందా?' అంటాడు. నా మొహం! అది కరవనే కరవదంటున్నావు నువ్వు! అది దొంగతనంచేసి పారిపోయుండేనూ, ఎవర్నన్నా హత్యచేసి పారిపోయుండేనూ, వాళ్ళు నిమిషాలమీద వెళ్ళి పట్టుకుని ఉందురట! 'మోసగాళ్ళను కూడా పట్టుకుంటారు కదా మీరు?' అని అడిగాను. 'ఓ' అన్నారు. ఐతే నా దగ్గర నమ్మకంగా వుంటూ నన్ను మోసంచేసి ఓ కుక్కపిల్ల పారిపోయింది...పట్టుకోమన్నాను. నన్నుచూసి వాళ్ళంతా ఒకటే నవ్వు! 'కుక్కపిల్లల్ని కూడా మేమెక్కడ వెతగ్గలం?' అంటాడు ఒకడు. నాకు వళ్లుమండి 'కుక్కపిల్లను వెతికి పట్టుకోడం కూడా మీకు చాతకాదు—పొండి' అని వాళ్ళ మొహంమీద అనేసి పారిపోయొచ్చాను.

సీను:- మీ వెనకాల పరుగెత్తి రాలేదు సార్ పోలీసులు ?

చిదం:- ఏమో! గభాలున ఆ పక్కనే ఓ సందుంటే అందులో దూరిపోయాను.

సీను:- మంచిపనిచేశారు సార్! లేకపోతే ఏమయిపోయారోనని మిమ్మల్ని కూడా వెతుక్కునే స్థితికి వచ్చేవాడిని!

చిదం:- నిన్న రాత్రంతా ఒకటే కల, దాన్ని ఎవరో ఎత్తుకుపోయినట్టూ, కొడుతున్నట్టూ, పెద్ద పెద్ద కుక్కలన్నీ దాన్ని కరుస్తున్నట్టూ! అబ్బ—భయం వేసిందిరా!.....పాపం, ఇప్పుడెక్కడుందో, ఏం చేస్తోందో...చిన్న వెధవ...ఎవడన్నా తిండి పెడుతున్నాడో లేదో-'కుయ్ కుయ్' మని మూలుగుతుందిగాని మాటాడలేదు కదా—నోరులేని జీవం.

సీ :- సారీ! ఆమధ్య మీ స్నేహితుడొకాయన అడిగారు కదండీ?

చిదం:- అవును అడిగాడు—లక్షమంది అడిగారు, ఏం?

సీను:- ఆయనగాని...

చిదం:- అబ్బే! కుక్కను ఎవడు ఎత్తుకుపోతాడ్రా? ఈ యింట్లో దానికి స్వతంత్రం లేదనో, ఇక్కడ సుఖం లేదనో అర్ధరాత్రివేళ పారిపోయుంటుంది. ఎవరికన్నా దొరకదా?... అన్నట్టు పత్రికలో ప్రకటన వేశారా?

సీను:- వేశారు సార్— పేరు రాగానే చూపిద్దామనుకున్నాను— మరిచే పోయాను. (పత్రిక తెచ్చి యివ్వబోయాడు)

చిదం:- నువ్వే చదువు.

సీను:- (చదువుతూ) 'కుక్కపిల్ల కనబడుట లేదు. తెల్లని రంగూ, కోల మూతీమూ, కుచ్చువంటి పొట్టితోకా గల కుక్కపిల్ల కనబడుట లేదు. మెడలో తోలుపట్టకా యున్నది. వెతికి తీసుకు వచ్చిన వారికి నూట పదహారు రూపాయలు బహూమాన మిచ్చెదను. జి. డి. యస్. చిదంబరం...''

చిదం:- (ఆపుతూ) ఏమిటేమి వేగిరి... మళ్ళీ చదువు (సీను మళ్ళీ చదివాడు. చిదంబరం జాగ్రత్తగా విన్నాడు) 'కుక్కపిల్ల కనబడుటలేదు—' మళ్ళీ చదవు— (సీను గడగడా చదివి, చిదంబరం కేసి చూసి మళ్ళీ మొదలెట్టబోయాడు.) చాలుచాలు— మరి చదవక్కర్లేదు— ఆ ప్రకటన చాలు. నూటపదహారు రూపాయిల బహుమతి కోసం ఎవడన్నా వెతుకుతాడు.

సీను:- కుక్కపిల్ల ఖరీదు అందులో నాలుగోవంతు వుంటుందా సార్?

చిదం:- పోరా వెర్రిమొహం— నూటపదహారు కాదు రెండు నూటపదహార్లిస్తే మాత్రం ఆటువంటి కుక్కపిల్ల మనకు మళ్ళీ ఎక్కడ దొరుకుతుంది? మన అడ్రసంతా 'క్లియర్'గా వుందా పేపర్లో?

సీను:- వుంది సార్!

చిదం:- చూద్దాం, నాలుగురోజులు ఓపికపడదాం... కాస్త కాఫీ తీసుకొచ్చి యిస్తావూ?

[సీను లోపలకుపోయి ఫ్లాస్కు, గ్లాసు తెచ్చి కాఫీ పోస్తున్నాడు.]

సీను:- నిన్నట్నుంచీ కాఫీమాటే మరిచిపోయారు సార్ మీరు.

చిదం:- నిన్నట్నుంచీ ఆ కాఫీ అందులోనే అట్లావుందా యేమిటి?

సీను:- అబ్బే... నిన్నటిది అప్పుడే ఐపోయింది సార్! ఆహా... చెయ్తున్నాను— మీకు ఎంత మనస్తిమితం లేకుండా పోయిందోనని!

చిదం:- కాదురామరీ— కుక్కపిల్ల ఐతేమాత్రం మనింట్లో ఓ పిల్లగా వుంటూ మన చెంత తిరుగుతూ— మనం అంటే ప్రాణం పెట్టే పిల్ల— కనిపించకపోతే మనస్తిమితం వుండకపోవటం యేమిటి, పిచ్చే ఎత్తాలి! (కాఫీ తాగుతున్నాడు.)

సీను:- (సంశయిస్తూ) సార్.....

చిదం:- ఏమిట్రా?.....

సీను:- ఏంలేదుసార్— చిన్న కోరిక.....

చిదం:- కోరికా! కోరిక లడిగితే తీర్చే దేవుణ్ణి అనుకుంటున్నా వేమిట్రా— తీరా ఎదుట ప్రత్యక్ష మయితే దేవుడే తీర్చడు! ..... అడుగు—

సీను:- ఏంలేదు సార్... మా నాన్న రెండోపెళ్ళి చేసుకుంటాడట— వో వందరూపాయలిప్పించాలి సార్—

చిదం:- ఏవిటీ! మీ నాన్న రెండోపెళ్ళి చేసుకుంటే నేను వంద రూపాయలివ్వాలా! మీ నాన్నకు రెండోపెళ్ళేం— ఆఖర్లేదు వూరుకోమను!

సీను:- అదికాదు సార్—నా జీతంలో విరకోర్కాసు కుంటానండి!

చిదం:- నాన్సెన్సు— మీ నాన్నకు రెండోపెళ్ళి నువ్వు డబ్బెట్టి చేయిస్తావా? మతిలేదురా నీకు ? డబ్బుపోసి సవతితల్లిని కొనుక్కుంటావురా వెధవా ?

సీను:- పోనీండి సార్— మా అన్నయ్య చేసుకుంటాడు. యివ్వండి సార్!

చిదం:- పోరా ఇడియట్— తగుమాషాది! ఐనా— కుక్కపిల్లపోయి నేనేడుస్తూ వుంటే, నీ వళ్ళో, వందరూపాయలు గుమ్మరించటానికి నేనేమన్నా 'బ్యాంకీ' అనుకున్నావా— వెళ్ళు అవతలకు వెళ్లు!

సీను:- పోనింది, కుక్కపిల్ల దొరికిన తర్వాతన్నా...

చిదం:- ఆలోచిస్తాలే—

[సీను నెమ్మదిగా బయటకు వెళ్ళాడు. పత్రిక తీసి చిదంబరం ప్రకటన చూశాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. సీను బయటనంచి వచ్చి]

సీను:- ఎవరో ఒక అబ్బాయి వచ్చాడు సార్!

చిదం:- మనింటికా?

సీను:- అవును సార్!

చిదం:- మనింట్లో కుర్రాళ్ళెవరూలేరు పొమ్మను.

సీను:- కుర్రాళ్ళకోసం కాదుసార్—తమకోసం!

చిదం:- [ఆలోచిస్తూ] నాకోసం? కుర్రాడు?...రమ్మను!

(సీను బయటకు వెళ్ళి కుర్రాడిని తీసుకొచ్చాడు. ఆ అబ్బాయికి 14, 15 ఏళ్లుంటాయి. అబ్బాయి వచ్చి కూచున్నాడు. పత్రిక అడ్డు పెట్టుకొని చదువుకుంటున్న చిదంబరాన్ని గమనించలేదు.]

అబ్బా:- [సీనుతో] పింవ్వోయ్— పిలువ్—

సీను:- ఎవర్నండీ ?

అబ్బా:- చిదంబరంగార్ని !

చిదం:- (పత్రిక పక్కకు నెట్టిచూచి) నేనే-నేనే చిదంబరాన్ని, ఏం కావాలి?

అబ్బా:- మీరేనా చిదంబరంగారు !

చిదం:- నేనేనమ్మా... ఎప్పుడూ నా ఫొటో అన్నా పేపర్లో చూశలేదా సవ్వ్రీ ?

అబ్బా.- మీ ఫోటోనా-మూతలేదే, మీరు బ్రతికేఉన్నారుగా- ఎవరి ఫోటోలన్నా చచ్చిపోయిన తర్వాతే పేపర్లో పడతాయట. మా నాన్నగారంటారు.

చిద - మీ నాన్నగారి పేరు ?

అబ్బా:- అదెందుకుగాని- నేను మీకో పనుండి వచ్చాను.

చిదం:- [అయోమయంగా అబ్బాయికేసి చూసి] చదువుకుంటున్నావా?

అబ్బా:- స్కూల్‌ఫైనల్ !

చిదం:- అబ్బో– సరే ఐతే-పాస్ అయినతర్వాత వస్తే కాలేజీలో చేరటానికి ఒకటో రెండో సాయం చేస్తాలే. పో (తిరిగి పత్రిక చూడటంలో పడబోయాడు)

అబ్బా:- (బల్లమీద చేత్తో చరిచి) నాన్‌సెన్స్! ఒకటో రెండో సాయంచేస్తారా? ముష్టెత్తుకోడానికి రాలేదు. నా సొమ్ము నాకివతల పారెయ్యండి.

చిదం:- (ఆశ్చర్యంగా చూసి) అబ్బాయ్- నీకేమన్నా పిచ్చా...?...

అబ్బా:- పిచ్చియితేనేం - కాకపోతేనేం - అదంతా మీ కనవసరం. నా డబ్బు నాకిచ్చి మాట్లాడండి.

చిదం:- నీ డబ్బేమిటి-నా దగ్గర వుండటమేమిటి? నువ్వేమోచూస్తే వెలెడులేవు 'డబ్బు' 'డబ్బు' అని ఒకటే పోరేస్తున్నావు. నాకేంఅర్థం కావటంలేదు.

అబ్బా:- నేను వేలెడు లేకపోయినంత మాత్రాన నా డబ్బు నాకివ్వరటండీ?... నేను ఎవర్నానుకున్నారు? అన్యాయంగా నన్ను మోసగిస్తున్నారని పోలీసులకు ఫోన్ చేస్తాను. (ఫోన్ దగ్గరకు వెళ్ళబోయాడు)

చిదం:- అబ్బాయ్... అబ్బాయ్...వుండుండు...ఆ ఫోను పనిచెయ్యదు.

అబ్బా:- పనిచెయ్యదా?... పనిచెయ్యనప్పుడు మీకెందుకండీ అంత అదుర్దా. (ఫోను తీశాడు)

చిద:- సీనూ, సీసూ! (వెళ్ళి ఫోను తీసుకుని) నీ డబ్బిస్తాను. రా-కూచో?

అబ్బా:- (కూచున్నాడు)

చిదం:- చూడూ, కొన్ని ప్రశ్నలడుగుతాను. సమాధానం చెప్పవా నీ డబ్బు నీకిచ్చేస్తాను.

అబ్బా:- లేకపోతే ఇవ్వరా?

చిదం:- ఇస్తాలే-చెప్పు మీ యిల్లెక్కడి?...కోప్పడకు, చెప్పు - ఫరవాలేదు. మీ యిల్లు ఆసుపత్రిలా ఉంటుందికదూ-ఆక్కడ కొందరు మనుషులు కేకలు వేస్తూ అరుస్తూ వుంటారు కదూ?

అబ్బా:- అర్థమయింది. పిచ్చాసుపత్రి మా యిల్లా? (ఆలోచిస్తూ) అంటే పిచ్చాసుపత్రినుంచి నేను వచ్చేనని మీరు అనుకుంటున్నారా - (గట్టిగా) నేను పిచ్చివాణ్ణా?

చిదం:- కాదుకాదు-కూచో!

అబ్బా:- ఆఖరుసారి అడుగుతున్నా. దబ్బిస్తారా, ఇవ్వరా?

చిదం:- ఎంతివ్వాలి?

అబ్బా:- ఎంత యివ్వాలి? ఏమని వేశారు పేపర్లో?

చిదం:- పేపర్లో వేశానా?

అబ్బా:- ఆహ్హా ! తెలిసింది. మీకే పిచ్చి. ఈ రోజు పేపర్లో వెయ్యలేదటండీ నూట పదహార్లు ఇస్తానని—

చిదం:- అవును. మా కుక్కపిల్లను వెతికి తీసుకొచ్చిన వారికి నూటపదహారు రూపాయలు బహుమాన రూపంగా ఇస్తానని ప్రకటించాను గాని వూరికినే కాదు.

అబ్బా:- వూరికినే ఇమ్మనటానికి నేనేం పిచ్చివాణ్ణి కాదు నానాశ్రమలూపడ్డాను —మీ కుక్కపిల్లను వెతికాను—తీసుకొచ్చాము.

చిదం:- తెచ్చావా—ఏదీ—ఆ మాట మొట్టమొదటే చెప్పరేదేం? ఏదీ—ఏదీ నా కుక్కపిల్ల?

అబ్బా:- తెస్తాను. ముందు నాకు మాటివ్వండి.

చిదం:- ఏమని?

అబ్బా:- నా డబ్బు నాకు ఉడా పైసలతో సహా వెంటనే ఇస్తానని!

చిదం:- ఎందుకివ్వను బాబూ! తప్పకుండాఇచ్చేస్తాను కుక్కపిల్లను తీసుకరా

[అబ్బాయి అదొకలాగచూసి బయటకు వెళ్ళాడు. నల్లగావున్న కుక్కపిల్ల మెడకు తాడొకటికట్టి బరబరా లాక్కొచ్చాడు]

అబ్బా:- (వస్తూనే) ఇదిగో—మీ కుక్కపిల్ల.

చిదం:- (తెల్లబోయి చూస్తూ) ఇదా!... ఇది నా కుక్కపిల్లకాదు...!

అబ్బా:- కాదూ (కూచున్న కుర్చీకి తాడుకట్టాడు) అమాట అనొద్దని మొదటే చెప్పాను. తప్పించుకోడానికి ఎత్తులు వెయ్యకండి. నన్ను కుర్రాడిని చేసి నాటకం ఆడారంటే జాగర్త! ఎంత కష్టపడ్డాను దీన్నివెతకటం కోసం? తిండి, నిద్ర, చదువూ అన్నీ మానేశాను. మా నాన్నగారు తిడుతూ వున్నాసరే. యెందలో బయల్దేరి వూరంతా తిరిగి పట్టుకున్నాను. ఇది మీది కాకుండా యెట్లా వుంటుంది? తీసుకొని దబ్బి వ్వండి. నేను త్వరగా వెళ్ళాలి.

చిదం:- అబ్బాయ్! కుక్కపిల్ల ఏదో ఒకటి తీసుకొస్తే దబ్బిస్తానని నేనేం రాయలేదు. నా కుక్కపిల్ల రంగువేరు. జాతివేరు. ఎబ్బే. అది ఇట్లా ఇంత అసహ్యంగా వుండదు!

అబ్బా:- మరి తిండి తిప్పలూ లేక ఎండలో మాడితే అసహ్యంగా కాక ఎట్లా వుంటుంది! నేను ఎండలో తిరిగి ఇంటికిపోగానే మా నాన్నగారూ అ మాట అన్నారు, కొట్టబోయారుకూడా!

చిదం:- దానిమాట కేంగాని—ఈ కుక్కపిల్ల నాదికాదు—తీసుకుపో.

అబ్బా:- తీసుకుపోనా? ఏం మాట!...సరే, దబ్బివ్వక్కరలేదులెండి. మీ కుక్కపిల్లను మీరే వుంచుకోండి—వెళుతున్నాను.

చిదం:- బాబూ! నువ్వుచూస్తే భూమికి జానెడు లేవు నీ మాటలూ, నీ చేష్టలూ చూస్తుంటే నాకు మతిపోతోంది. నువ్వు వెళ్లు. కుక్కపిల్లను కూడా తీసుకువెళ్లు. ఎక్కడ తెచ్చావో అక్కడే వొదిలెయ్యి.

అబ్బా:- సరేనండి, ఐతే, ఈ మాత్రందానికి ప్రకటన వేసి మోసం కూడా ఎందుకు చేశాను? వెళుతున్నాను. (కోపంగా కుక్కను తీసుకపోతూ మళ్ళీ తిరిగివచ్చి) ఈ కుక్కపిల్లను దాని తల్లిదగ్గర ఒదిలి పెట్టాలంటే నేను నానా శ్రమా పడాలి. మంచి బాగానే చేశారు థాంక్స్. పోనింది—కాలేజీలో చేరాక వస్తే ఒకటో రెండో సహాయం చేస్తానన్నారు—అప్పుడొస్తే అదన్నా యిస్తారా—ఇట్లాగే పొమ్మంటారా?

చిదం:- లేదులేదు—తప్పకుండా యిస్తా, ఇప్పుడు వెళ్ళు, (అబ్బాయి సీరియస్‌గా చూసి, సణుక్కుంటో బరబరమని కుక్కపిల్లను లాగుతూ

బయటకు పోయాడు. బయట కుక్కపిల్ల 'కయ్' మనే అరుపు వినిపించింది. చిదంబరం 'ష్' అని కూలబడి లేచి)

అబ్బా:- ఒరే సీనూ...సీనూ...వెధవ ఎక్కడ చస్తున్నాడో—సీనూ!
(ప్లాస్కులో కాఫీ పోసుకుని తాగుతున్నాడు. ఇంకోవ్యక్తి ప్రవేశించాడు. ఆధునిక పద్ధతిలో వున్నాడు)

వ్యక్తి:- (నమస్కారం చేస్తూ) ఈ యింటికి యజమాని మీరేనా—

చిదం:- ఆహా, సాక్షాత్తూ ఈ యింటికి యజమానిని నేనే. ఏం సెలవు.

వ్యక్తి:- (కూచున్నాడు) ఎబ్బే — ఓ చిన్న పనిమీద వచ్చాను.

చిదం:- చెబుదురుగాని వుండండి. (కాఫీ పూర్తిగా తాగేసి, గ్లాసు వుంచేస్తూ) ఏం పనిమీద వచ్చానంటారు?

వ్యక్తి:- ఈ యిల్లు ఏ సంవత్సరంలో కట్టారండి-బయట చాలా 'హోప్లెస్'గా వుంది. (పైకి చూసి) అరె. సీలింగ్ అంతా పూర్తిగా పాడయి పోయింది!

చిదం:- పాడయితే పాడవనివ్వండి. ఈ యింటిని మీకు నేనేం ధారాదత్తం జేసెయ్యటంలేదు!

వ్యక్తి:- అందుక్కాదండి. ఇల్లో కాలుపెట్టిన తర్వాత ఇల్లు కలకల్లాడకపోతే ఎందుకు చెప్పండి ! ఈ పూళ్ళో చాలా ఇళ్ళు చూశాను. వట్టి మురికి కూపాలు. మళ్ళీ మహా మహా ఎంజినీర్లు కట్టిన యిళ్ళూ, వేలూ, లపలూ పోసి కట్టించిన ఇళ్ళూ !... ఇల్లు— కట్టించిన మర్నాటికే ఇంటికి పూసిన రంగంతా వెలవెలా పోటం ప్రారంభిస్తుంది. ఇంట్లో ఎక్కడ చూసినా సున్నం రాలిపోతూ వుంటుంది—అడుగున అంతా బీటలువారిపోతూ వుంటుంది. అదంతా కట్టేవాళ్ళల్లో వుంటుందండీ-ఎంజినీర్లు ఏంచేస్తారు పాపం ! వాళ్ళంతా జాగ్రత్తగానే ప్లాన్ వేసి కట్టిస్తారు. ఏం లాభం ! కట్టిన తాపీపనివాళ్ళు సరిగ్గా పనిచెయ్యరు. అదంతా వీళ్ళ చేతుల్లోనే వుంటుంది. వీళ్ళు సరిగ్గా కట్టాలిగాని ఎంజినీరు ఏంచేస్తాడు? "ఇల్లు కట్టిన ఇంజనీరు కాదోయ్—దానికి ఇటికలు పేర్చి, తాపిచేసిన పనివాడెవ్వడు?" అని మా స్నేహితు

డొకరు గేయాలు రాశారు. అంచాత— చెప్పొద్దూ— 'పనివాడిలో' పస వుండాలి. లేకపోతే మీ యిల్లులాగానే తయారవుతుంది!

చిదం:- ఇంతకూ మీరెవరో, ఏం పనిమీద వచ్చారో చెప్పారు కాదు.

వ్యక్తి:- నేను ఇళ్ళకు మైనర్ రిపేర్స్ (Minor repairs) చేయించే కంట్రాక్టర్నండి. నా కింద అమోఘమయిన పని చెయ్యగలిగిన వాళ్ళు నభై మంది వున్నారు. ఆ రోజుల్లో శ్రీరామచంద్రుడేం కట్టించాడండీ—వారధి? ఐదు నిమిషాల్లో మా వాళ్ళు అటువంటివి తొంభై తొమ్మిది కడతారు. చూస్తారా!... ఐతే, మేము ప్రస్తుతం అంతా మైనర్ రిపేర్స్ మీదే ఎక్కువగా కృషి చేస్తున్నాం. ఊరికే పెద్ద యిళ్ళు కడతామని ఎగబ్రాకటం— చెయ్యలేకపోవటం, సరే, అదంతా ఎందుకు—ప్రతీ యింటికి మరమ్మత్తులు చేయించం ఎంతో అవసరం. ఆ పనివల్ల యింటికి గట్టితనం. ఓ హుందా అవన్నీ వస్తాయి.

చిదం:- ఐతే ఏమంటారు మీరు

కంట్రా:- అనటానికేముందండి! మీ యింటికి ఆవతల వీధిలోవున్న రేణుకమ్మ గారి యింటిని మరమ్మత్తు చేశాం, వాళ్ళింటి ప్రక్కవున్న రాజారావు గారి యిల్లూ చేశాం. తర్వాత... చైర్మన్‌గారూ, వాళ్ళూ ఆర్డర్లు ఇచ్చారు. (సంచిలోంచి 'ఆర్డరు బుక్' తీసి చూపుతున్నాడు)

చిదం:- చైర్మన్‌గారు తన యింటికే యిచ్చి వూరుకున్నారన్న మాట! ఆ స్కూలు పడిపోడానికి సిద్ధంగా వుండికదా, దానికో ఆర్డరు వేయించుకోలేకపోయారా?

కంట్రా:- ఇస్తారుసార్, ఆదీ యిస్తారు. ఎట్లా? ముంచు తనయిల్లు చక్కబెట్టుకుని కదా రెండోయింటికి వెళ్ళాలి. (పుస్తకం చూపుతూ) చూడండి, ప్రస్తుత ఎనిమిదిళ్లకు కంట్రాక్లు తీసుకున్నాను. పర్కు జరుగుతున్నది నాలుగిళ్లు లోగడ చేసిన పర్కుకూడా... (కాయితాలు వెనక్కు తిప్పుతున్నాడు)

చిదం:- అఖర్లేమలెండి...ఆఁ ...మీరు కేవలం ఇళ్ళే మరమ్మత్తు చేస్తారా, ఇంకేమున్నా కూడా మరమత్తు చేస్తారా?

కంట్రా:- (గదగదా) ఇళ్ళూ, భవనాలూ, వంతెనలూ, రోడ్లు, సైడు కాలువలూ...

చిదం:- ప్రస్తుతం నా మెదడు చాలా ఒడిదుడుకుల్లో వుంది. దాన్నేమన్నా మరమ్మత్తు చేయగలరా ?

కంట్రా:- (తెల్లబోయి, సర్దుకుని నవ్వి) చంపేశారు. మీరట్లా అడిగితే నేనేం చెప్పేది? దాన్ని 'రిపేర్' చెయ్యటానికి ప్రత్యేకం హాస్పిటలూ, డాక్టర్లూ వుంటారుగాసి...

చిదం:- ఐతే, ఓ గొడ్డలి తీసుకొని ముందు నా యిల్లంతా ఇవాళ పగల గొడతాను, మీరు రేపురండి—మరమ్మతు చెయ్యొచ్చు.

కంట్రా:- మీరు చాలా చిత్రంగా మాట్లాడుతున్నారు. మీ యిల్లు మరమ్మత్తు కోరుతోందికదా అని అన్నాను. ఒక్కసారి వీధిలోకి వెళ్ళి చూడండి. గోడలన్నీ ఎంత పాలిపోయి వున్నాయో ! ఎంతో ఆవదు. చాలా చిన్న మొత్తం ! రోజుకు మీకయే కాఫీ ఖర్చు.

చిదం:- నాకు రోజుకయే కాఫీ ఖర్చు రెండణాలు, ఇదిగో (ఇస్తూ) తీసుకుని చెయ్యవలసిన మరమత్తేదో చేసుకోండి.

కంట్రా:- (చాలా విచిత్రంగా చూశాడు)

చిదం:- క్షమించండి నేను చాలా చిక్కుల్లో వున్నాను. అదయ్యాక రిపేర్ విషయం ఆలోచిద్దాం. ఇప్పుడు నన్ను మరి కొరుక్కుని తినేయకండి!

కంట్రా:- ఏమిటీ-అంత మనోవ్యధలో వున్నారా ?

చిదం:- మీకు పత్రికలు చదివే అలవాటు లేదా?

కంట్రా:- చంపారు ! న్యూస్‌పేపర్ చదవటం నాకో వ్యసనం లాంటిది. ఏ రోజు పేపర్ లేకపోయినా మరి నాకు నిద్రపట్టదు.

చిదం:- చూడండి-పేపర్ చదివితే కేవలం మీ రాజకీయాలేకాదు- ఇతర ప్రకటనలు కూడా చూడాలి. ఈ రోజు పేపర్లో ఓ ప్రకటన ఇచ్చాను. మా యింట్లో ఓ పిల్లలాగ తిరుగుతూ నా ప్రేమకు పాత్రురాలయిన నా కుక్కపిల్ల 'రోజా' కనిపించకుండా పోయింది. అది దొరికేదాకా నాకు తోచదు. వెతికి తీసుకు వచ్చిన వారికి నూట

పదహారు రూపాయల బహుమానం యిస్తానని ప్రకటన వేశాను. (పత్రిక చూపాడు)

కంట్రా:- (చూసి) అట్లాగా-చిదంబరంగారంటే మీరే అన్నమాట! పాపం? ఎంత కష్టం అండీ-నిజమే నండీ-ఇంట్లో తిరుగుతున్న కుక్కపిల్లే కాదు-నాలుగు రోజుల్నుంచీ ఇంట్లో వున్న ఓ చిన్న చీపురు కనిపిం చకపోయినా అదేమిటో మనసు బాధపడుతున్నది. మీరెట్లా తమా యించుకోగలిగారో ఏమిటో!

చిదం:- ఏం చెయ్యమంటారు - చచ్చినట్టు బాధపడుతున్నాను. నిన్ననంతా తిరిగాను - ఇవాళ తిరిగాను- ఎక్కడా కనిపించలేదు ఏమయిందో ఏమిటో ...సీనూ!...పాపం, నా నౌఖరు కూడా దానికోసం బెంగ పెట్టుకొని కృశించిపోతున్నాడు. వాడే దానికి తల్లి దండ్రీ!

కంట్రా:- బహుమానం కోసం కాదు కానీండి - నేనూ ప్రయత్నిస్తానండి. ఎక్కడ కనిపించినా తీసుకొచ్చి మీకు అప్పజెబుతాను. గుర్తులన్నీ తెలిశాయి కదా— ఆ మధ్య యిట్లాగే మా అబ్బాయి తప్పిపోయాడు పేపర్లో ప్రకటన వెయ్యలేదుగాని— దొరికాడు. దొరుకుతుందండీ— మన సొమ్ము ఐనతర్వాత మనకు దక్కకుండా పోతుందా!

చిదం:- సొమ్ము అంటారేమిటి? అది నా ప్రాణంతో సమానం. మీకు కనిపిస్తే మాత్రం తీసుకొచ్చి అప్పజెప్పండి— మీ మేలు మరిచిపోను.

కంట్రా:- ఎంతమాటన్నారండీ - ఇదుగో పెద్ద మేలు ఏముంది? పనికట్టుకుని కూడా వెతుకుతాను...నన్ను...వెళ్ళమంటారా?

చిదం:- చిత్తం, మీరు వెళ్ళండి. కుక్కపిల్ల దొరకిందనగానే ఎట్లాగూ పండగ చేస్తాను. ఇంటి రిపేర్ చేయించక తప్పదు. అంతవరకూ మాత్రం నన్ను బాధపెట్టకండి. తిన్నాకూ లేనిది ఈ రెండురోజు ల్లోనూ ఈ కొంప కూలిపోతుందనే భయం నాకేం లేదు!

కంట్రా:- సరే, వస్తానండి. కాని రిపేర్స్ చేయించటంవల్ల లాభం మీరే తెలుసు కుంటారు. ఎంతో అవదు మీకు. ఒకవేళ కర్మంచాలక మీ కుక్క పిల్ల దొరక్కపోయినా ఇల్లు మరమ్మత్తు చేయించటం మాత్రం

మరచిపోకండి. అదికాకపోతే వెధవది పురోక్కికును కొనుక్కుం టాంగాని—కిలకాలం నిలబడాల్సింది 'ఇల్లు!'

చిదం:- చేయిస్తానని చెప్పానుగదండీ! మీరు మరీ ఇన్సూరెన్సువాళ్ళలాగ నా ప్రాణాలు తీసేస్తే నా శక్తిమా? చేయిస్తాను. ఈ ఒక్కయిల్లేనా మరో నాలుగయిదిళ్ళు చేయిద్దాం!

కంట్రా:- సెలవు (వెళ్ళి, మళ్ళీవచ్చి) మీ రోజా డిటైల్స్ చెప్పండి కొద్దిగా! (చిదంబరం పత్రిక యిచ్చాడు. కంట్రాక్టరు తీసుకొని "రైట్" అని వెళ్ళాడు.)

చిదం:- (అటూ యిటూ చూసి ఫోన్ తీసి) హలో...ఆఁ ... నేను చిదంబరాన్ని మాటాడుతున్నాను. ... ఆఁ? ... దొరకలేదు ... నీకూ దొరలేదా ... ప్రయత్నించమని చెప్పు ... ప్రయత్నించమనీ ..., చెప్పూ ... దాని ఫోటో లేదయ్యా — నేనూ అదీ కలిసి తీయించుకున్నది ఒకటుందిగాని నా మొహం కనిపిస్తున్నంత బాగా అది కనిపించటంలేదు. అది పనికిరాదులే...ఐనా ఫోటో ప్రకటించాలిసిన అవసరంలేదులేదు. వివరాలన్నీ పూర్తిగా ఇచ్చాంగా. ఆఁ...అందుకే పిల్చాను. ఏం భోజనం నా మొహం!...వుంటాను మరి! (రిసీవర్ పెట్టాడు. సీను వచ్చాడు) దొరికిందా సీనూ?

సీను:- పీధిలో పోతున్న కుక్కపిల్లలన్నిటినీ పట్టి పట్టి మరీ చూశాను సార్- * దేనికీ మన రోజా పోలికన్నా లేవు!

చిదం:- ఏం అదెందుకు?

సీను:- అందాకా దాంతోనన్నా కాలక్షేపం చెయ్యొచ్చుగదా అని. అదీ గాక, కుక్కపిల్ల లేకపోతే నాకీ యింట్లో పనివుండదు. అది లేదని ఉద్యోగం లాగేసి పొమ్మన్నా టారని నా భయం!

చిదం:- నీ కాభయం ఏమీ అక్కర్లేదు. ఏం, ఇవాళ కాకపోతే రేపటికన్నా దొరకదా?

సీను:- దొరక్కపోతే మాత్రం నా కోసమన్నా ఓ పిల్లను కొనాలి సార్!

చిదం:- నోరుముయ్యరా. మన పిల్లి మనకు దొరక్క ఏమవుతుంది?

సీమ:- దొరుకుతుందండీ-దొరికినదాకా నాకు మరి మతి బాగుపడదు. ఏదో వాగేస్తూఁటాను ఆ మతిమరుపువల్ల. కోప్పడకండి సార్!

చిదం:- అవునురా—ఆ ప్రేమ అట్లా అనిపిస్తుంది. అన్నట్టు యిందాక ఓ కుర్రాడొచ్చాడు. చూశావా—వాడో నల్లటి పిల్లను లాక్కొచ్చి, నా యెదాన్నికొట్టి "ఇదే నీ కుక్కపిల్ల తీసుకో — తీసుకొని నా నా డబ్బు నాకివ్వు" అని ఒకటే గోలపెట్టాడు.

సీను:- పోనీ—అందాకా దాన్నన్నా తీసుకున్నారు కారు!

చిదం:- నీ మొహం! దాన్ని చూస్తే దోకొచ్చింది. అసహ్యంగా వుంది. వాడెవడో దేవాంతకుడులాగ వున్నాడు. చూట్టానికి పదిహేనే ళ్ళున్నా లేవు, కబుర్లు మాత్రం ఆకాశానికంటేటట్టు చెప్పాడు. తను చాలా శ్రమపడి వెతికి తీసుకొచ్చాట్ట—పో పొమ్మన్నాను.

సీన:- మంచిపని చేశారు. నాతో చెప్పారు కారు, ఒకటిచ్చుగుని బయటకు తోసేద్దును.

చిదం:- పోనీ పోయాడులే. మరొక్కసారి అట్లా బయటకుపోయి చూసి వస్తాను. నువ్వు జాగ్రత్తగా—కుక్క కాసినంత జాగ్రత్తగా యిల్లు చూస్తూవుండు. ఎవరన్నా నా కోసంవస్తే వుండమని చెప్పు. (కోటు వేసుకొని బయటకు పోబోతూ వుండగా సన్నగా, పొడుగ్గా వున్న వ్యక్తి ప్రవేశించాడు.)

వచ్చిన మనిషి:- మీరేనండీ చిదంబరంగారు?

చిదం:- నేనే.

ఆయన:- నమస్కారం నా పేరు కోదండం. నేను తమతో పనివుండి వచ్చాను

చిదం:- తమరు యిళ్ళకు మేజర్ రిపేర్స్ చేయించే కంట్రాక్టరా — లేక ఏ కంపెనీకన్నా ఏజెంటా?

ఆయన:- క్షమించండి. నేను ఒకాసుపత్రిలో కాంపౌండరు ఉద్యోగం చేస్తున్నాను.

చిదం:- ఏ ఆసుపత్రిలో? (షాక్ తిన్నట్టు)

కోదం:- ప్రయివేట్ హాస్పిటల్ లెండి, డాక్టరు రమేశ్‌గారికి కుడిభుజం వంటివాడిని.

చిదం:- నేను మీ డాక్టరు దగ్గిర ఎప్పుడూ మందు తీసుకోలేదు. మీ బిల్లులు నేనేం ఇవ్వాళ్టికల్లేదు. నాకు పనుంది. వస్తా (వెళ్ళబోయాడు)

కోదం:- కూర్చోండండీ. కాంపౌండర్లెంతసేపూ బిల్లులు వసూలు చెయ్యటానికే ఎస్తారనుకుంటున్నారేమిటి? ఐనా, నా రాక వేరు నేను వేరేపనిమీద వచ్చాను. వూరికే మీకు తెలియాలని నా ఉద్యోగం చెప్పాను.

చిదం:- ఆ పనేమిటో త్వరగా తెల్చండి. అవతల నాకో అర్జంటు పనివుంది.

కోదం:- ఇటువంటి పరిస్థితుల్లో అర్జంటు పనేమిటండీ? ఓ మూల కుక్కపిల్ల పోయిందని ప్రకటన ఇచ్చారు గాదా — ఇంకోమూల విచారంతో క్రుంగిపోవలసిన సమయంలో మీకు ఆర్జంటు పనా?

చిదం:- నా ప్రకటన చూశారా యేమిటి? నిజమే. విచారంతో బాధపడుతున్నాను. ఏంచెయ్యను? ఇప్పుడు అర్జంటు పనంటే ఆదే. ఆ పని మీదే వెళ్తున్నాను.

కోదం:- శునకాన్వేషణే అన్నమాట' అక్కర్లేదు. మీరింక బయటకు పోనక్కర్లేదు. మీ కుక్కపిల్ల మీ కు లభిస్తోంది.

చిదం:- యేమిటి—(కూలబడుతూ) మీకు జ్యోతిషం కూడా తెలిసినట్లుంది. కూచోండి (కుర్చీ చూపాడు.)

కోదం:- (కూచుని) జ్యోతిష్యం కాద .ది—యదార్థమే. మీ కుక్కపిల్లను అతి శ్రమపడి—వెతికి, విసి ి వేసారి—తిరిగి వెతికి వెతికి—పట్టుకువి తీసుకొచ్చాను.

చిదం:- ఏదీ?

కోదం:- కుక్కపిల్ల ఇంట్లో ఎండ పడుతుందీ—బయట దాసిచోటులో అది కట్టబడివుంది.

చిదం:- నిజంగా! సీనూ, వెళ్ళి తీసుకురా. (సీను పరుగెత్తాడు) చాలా థాంక్స్. మీ ఋణం తీర్చుకోలేను. పాపం, ఎంత శ్రమపడ్డారో? అసలది కులాసాగా వుంది?

కోదం:- నిక్షేపమల్లేవుంది. దానికేం-ఐతే మొదట కొద్దిగా డీలా ఐపోయినట్లు కనిపించింది. కాంపౌండర్ను కదా! దాని వ్యాధి కనిపెట్టి ప్రధమ చికిత్సచేసి కొద్దిగా మందిచ్చి పాలుపట్టి జాగ్రత్తగా తీసుకొచ్చాను. అయినా ఆ పాలఖర్చూ మందుఖర్చూ మీరేం యివ్వక్కర్లేదనుకోండీ!

చిదం:- ఎంతమాట! మీ ఋణం వుంచుకుంటానా చెప్పండి! చూశారా, అదంటే నాకు ప్రాణం. దాన్ని పోగొట్టుకొన్నాక నా మనస్సు ఎంత బాధపడిందో తెలుసా?

కోదం:- పాపం! ఆఁ. నాకు చెక్కిస్తారా, కాష్ యిస్తారా?

చిదం:- దేనికి? ఓహో, మీ ఐహుమానం సంగతా! చెక్కు యిమ్మంటారా?

కోదం:- వద్దండీ, ఆర్జంటుగా సొమ్ము అవసరంకూడా వుంది ఇప్పుడు బ్యాంకికి మూసివేసివుంటారు. రొక్కంగా యిప్పించారంటే ఉచితంగా యిచ్చినట్టుంటుంది. రేపు ఆ చెక్కు మార్చుకునేదాకా ఆగటం కష్టం, కొన్ని ఆర్జంటు ఖర్చులున్నాయ్.

చిదం:- చంపారే. అంతమొత్తం రొక్కం నా దగ్గిరలేదు మీ పని చక్కబెట్టుకోటానికి ౬0 ఇస్తాను. మిగిలింది చెక్కు రాస్తాను.

కోదం:- ఆట్లా అంటారూ... మీ యిష్టం...

చిదం:- (చెక్కు పుస్తకం తీసి) మీ పేరు?

కోదం:- యం. కోదండం (చిరంజీవం రాయబోయాడు.)

సీను:- (చివాలున కుక్కపిల్లతో వస్తూ) సార్ సార్, మన రోజాకాదు సార్ యిది!

చిదం:- (షాక్ తిని) ఆఁ!

సీను:- చూడండి. ఇదేదో చవటకుక్క, వీధిలోతిరిగే వట్టి చెత్తరకం.

చిదం:- (చూసి) ఎంత పని! ఇది నాది కాదండి!

కోదం:- ఏమన్నారు మీరు పేపర్లో? తెల్లనిరంగూ, కుచ్చువంటి పొట్టి తోకాగల కుక్కపిల్ల అన్నారు. ముఖం కోలగా వుంటుందన్నారు. దీని మొహం ఏమన్నా గుండ్రంగా వుందా? తెల్లని రంగు అన్నారు. కుక్కపిల్ల

తప్పిపోయిన సమయానికి అది తెల్లగానే వుండేది. ఈ ఎండల్లో తిరిగితిరిగి నల్లబడిపోయింది. కుచ్చువంటి పొట్టితోక కాక ఇదేమన్నా పొడుగుతోకా? కుచ్చు అంటారా అది నా తప్పేలెండి. ఏమిటో నాకు నచ్చక కత్తెరతో కత్తిరించి పారేశాను. కావాలంటే ఆ ... [జేబులు తడుముకున్నాడు.]

సీను:- మా రోజా మెళ్ళో బెల్టు వుండాలి.

కోదం:- బెల్టు వుంటుంచటయ్యా పీధిలోకొచ్చిన కుక్కమెడలో? అదెవడు కొట్టేశాడో! పోనీండి-బెల్టుధర ఆరణాలు, ఆ ఆరణాలు కొట్టేసుకుని, నూటపదిహేను రూపాయల పదిఅణాలూ ఇప్పించండి-ఏంచేస్తాం?... దానిగురించి నేను పెట్టిన ఖర్చు ఎట్లాగూ ఆడగలేదు!

చిదం:- చూడండి కోదండంగారూ — నా కుక్కపిల్ల కోసం నేను నానా శ్రమ పడుతున్నాను. అది దొరికిందంటే నాకు పరమానంద మవుతుంది. నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. ఇది నా కుక్క పిల్లకాదు. మీరు లక్ష చెప్పండి. కోటి చెప్పండి. దాన్ని పెంచి పెద్దచేసిన మా సీనుగాడు—వీడే సాక్ష్యం.

కోదం:- అయ్యా—మీరు 'కాదు' అని కొట్టిపారేస్తే నేనేం చేసేది? మీరు పత్రికలో ప్రకటన వెయ్యగానే చూశాను. ఆసుపత్రీ, డాక్టరుగారూ, పేషెంట్లూ అందర్నీ వొదిలి వూరిమీద పడ్డాను. ప్రతిచోట చూశాను. తోటలూ, వీధులూ, పార్కులూ, రోడ్లూ-అవీ—ఇవీ—ఒకటేమిటి; ఇంటిందికి తిరిగాను. ఆ తిరగటంలో ఎంత శ్రమపడ్డానో మీకు నోటితో చెబుతే తెలీదు. అంత శ్రమపడ్డాను. అపతల డాక్టరుగారు తిడుతున్నా పేషెంట్సు ఏడుస్తున్నా, నా ఇంట్లో నా భార్యా పిల్లలు నాకోసం కలవరిస్తున్నా అవన్నీ లక్ష్యపెట్టక పరోపకారబుద్ధితో కేవలం పరోపకార బుద్ధితోనే - ఎందనక వానన్నక తిరిగాను. మీరే ఆలోచించండి. దారిలో ఓ లక్ష పిల్లలు కనిపించినై. అవేవీ మీవి కావు ఆ మాత్రం పోలిక పట్టలేనా — ఎంత కాంపౌండర్నయితే మాత్రం! ఆఖరుకు పట్టుకున్నాను.

చిదం:- బాగా పోలిక పట్టారు! నా కుక్కపిల్లకోసం మీరు పడిన శ్రమను నేను మరచిపోను. ఈ కుక్కపిల్లను తీసుకువెళ్ళండి. (సీసు బయటకు కుక్కతో వెళ్ళాడు) ఇది మాత్రం నాదికాదు! నా కుక్కపిల్లను తీసుకురండి—నిమిషాలమీద సొమ్మిచ్చేస్తాను.

కోదం:- మంచి పెద్దమనిషేనండోయ్ మీరు! నిన్నట్నుంచీ శ్రమపడి వెతికి తీసుకొస్తే కాదు పొమ్మని పైగా-మళ్ళీ వెదకాలా? బావుంది. నా కవతల పనీ పాటూ లేదనుకున్నారా—నేనేమన్నా కేవలం కుక్కల్ని వెదికే వెధవ ఉద్యోగం చేస్తున్నాననుకున్నారా?

చిదం:- అదంతా నాకేం తెలీదు. మీ కవతల పనీ పాటూ లేదని నేనేం అనలేదు. ఆ పనంతా మానుకొని కుక్కపిల్లను వెతికి తీసుకొస్తే నేగా, నూటపదహార్లిస్తానన్నది?

కోదం:- బాగా ఇచ్చారు. ఇంత మోసం ఎక్కడా చూడలేదండి. ఆరునెల్ల క్రిందట పిల్లవాడొకడు తప్పిపోతే వెతికి పట్టిచ్చి రెండువందల రూపాయలు పుచ్చుకున్నాను. ఆయన ఏమన్నా ఇటువంటి పేచీ మనిషయితే చచ్చివుందును. 'నా కుర్రాడు కాదు పొ'మ్మన్నాడా? ఎంత మర్యాద చేశాడు — ఎంత ఆదరించాడు! కుర్రాడు నాకు ఏలూరు ప్లాటుఫారం మీద దొరికాడు, ఏలూరునుంచి సెకండు క్లాసులో తీసుకొస్తే ఆ ఖర్చుకూడా యిచ్చి వాళ్ళింట్లో నాలుగు రోజులుండమని మరీ బ్రతిమాలారు-ప్చ్!—మనకెందుకు — మన ధర్మం ఏదో మనం నిర్వర్తించాలి. వాళ్ళ అబ్బాయిని వాళ్ళకు వప్పగించాం-అంతే!

చిదం:- ఆ అబ్బాయి వాళ్ళవాడు కాబట్టే ఆచూచన మీ ఋణం వుంచుకోలేదు. ఈ కుక్కపిల్ల నాదికాదు. ఇదేదో వూరిమీద తిరగేరకం. మీరు డబ్బుకోసం ఆశపడి తీసుకొచ్చి ఇస్తున్నారు. దయచేసి వెళ్ళండి!

కోదం:- (ఉగ్రుడై) ఏమండోయ్! ఇదేం మర్యాదగా లేదు. మిమ్మల్ని మోసగించి మీ దగ్గిర డబ్బెత్తుకు పోవాలనే చచ్చు ఉద్దేశంతో వచ్చా నసుకుంటున్నారా? కావలిస్తే మీకు కావలసినంత డబ్బు గుమ్మరిస్తాను. పోనీగదా అని పనిపాటు మాని, ప్రాణం పోతున్నా



లక్ష్మపెట్టక కుక్కను వెతికి తీసుకొస్తే కాదుపొమ్మని కొట్టిపారేస్తారా? ఇదేనా పెద్దమనిషి తరహా?

చిదం:- (విసిగి కోపంగా) ఇది నా కుక్కపిల్ల కాదు మహాప్రభో-నీకు శత సహస్ర నమస్కారాలు. వెళ్ళు. కుక్కపిల్ల దొరక్క నానా బాధ పడుతున్నాను. నా రోజా ఐతే తీసుకోటానికి నాకేం తెగులా? నిక్షేపంగా తీసుకుంటాను. వెళ్ళు — వీలయితేనే నా రోజాను తీసుకురా !

కోదం:- ఏమండోయ్—ఇక లాభంలేదు. అంతా దగా. మోసం! మీ మీద పోలీసు రిపోర్టు ఇస్తాను.

చిదం:- ఏమని ఇస్తారు రిపోర్టు?

కోదం:- ఏమని యిస్తాను? ఫలానా చిదంబరం అనే ఆసామి కుక్క పిల్లను వెతికి తీసుకొస్తే నూటపదహార్లు యిస్తామని ఆశ పెట్టి తీరా తీసుకొచ్చాక దబ్బివ్వక అల్లరి పెట్టాడని. తెలిసిందా?

చిదం:- (చిరాగ్గా చూసి) ఇవ్వవయ్యా ఇవ్వు—రిపోర్టు ఇచ్చుకో. అదిగో ఫోన్—వూ(...చెయ్యి ఫోన్' చెయ్?

కోదం:- (తెల్లబోయి సర్దుకొని) అంతేనన్నమాట! అనవసరంగా చిక్కుల్లో పడిపోతానా? ఫోన్ చెయ్యలేక వూరుకోటం కాదు. బావుండదు-మీ పెద్దమనిషి తరహాకు మచ్చరావటం నా కిష్టంలేక వూరుకుంటున్నాను.

చిదం:- మంచిపని చేశావ్—'నా కుక్కపిల్ల కాదూ'అని శతపోరుతూ వుంటే ఆ దిక్కుమాలిన వెధవ కుక్కకు నా నెత్తిన రుద్దాలనుకుంటున్నావు గదా-నువ్వేమంత పెద్దమనిషివి? నీమీద నేను మాత్రం పోలీసు రిపోర్టు ఇవ్వలేనూ? ఇస్తే నువ్వేమవుతావో తెలుసా? గబ్బుకోసం మోసంచేసి, నన్ను పీడిస్తున్నాడంటే పోలీసులు వాయువేగ మనోవేగంతో వస్తారు. సబ్ ఇన్ స్పెక్టరు నాకు దగ్గర స్నేహితుడు కూడాను!

కోదం:- అయ్యో; మనకూ, మనకూ భేదాభిప్రాయాలెందుకు! ఈ వెధవ కుక్క తగూ పోలీసులదాకా ఎందుకు! నిజంచెప్పండి...నిజంగా ఇది మీ కుక్కపిల్ల కాదా!

చిదం:- ఇంతసేపూ చెప్పినదంతావిని మళ్ళీ మొదటికొస్తారేం—మూడుసార్లు చెబుతున్నాను. వినండిమరి, ప్రశ్న వేయకండి. మీకు నమ్మకం లేకపోతే ఇదిగో ప్రమాణం కూడా చేస్తున్నాను. (తలమీద చెయ్యిపెట్టుకొని) ఇది నా కుక్కపిల్లకాదు—ఇది నా కుక్క పిల్లకాదు-ఇది-నా—కుక్క పిల్ల—కాదు (చెయ్యితీసి) సరా?

కోదం:- మీరంతగా చెబుతూవుంటే నేనేం చెయ్యను. కాని మీ ప్రకటన చూసిన దగ్గర్నుంచి నేనెంత కష్టపడ్డానో—ఎంత బాధపడ్డానో మీ రెరుగరు?

చిదం:- ఎరకేం—ఇంతసేపూ పాడుతూనే వున్నారుగా?

కోదం:- క్షమించండి, బీదవాణ్ణి. దీన్ని వెతకటంకోసం నాకొంత డబ్బు ఖర్చయింది. శ్రమమాటకేం—తమరా ఖర్చులు యిప్పించారంటే...

చిదం:- బావుందయ్యా—ఒకవేళ అది నా కుక్కపిల్ల ఐనప్పటికి నేనా ఖర్చు ఇవ్వను గదా—కాకుండా ఖర్చు కూడా ఇవ్వాలా? వెర్రివెళ్ళు—నన్ను మరి విసిగింపకు!

కోదం:- మీతో నమస్కారం పెడతాను! పిల్లలుగలవాణ్ణి. ఎదిగిన పిల్లకు పెళ్ళి చెయ్యాలి-రెండోవాడు చదువుకుంటున్నాడు—మూడోపిల్ల...

చిదం:- ఉద్ధరిస్తోంది! నా దగ్గిర 'పంచ' ప్రాణాలున్నాయ్, నీక్కావాలంటే ఒకటో రెండో పట్టుకుపో గాని—నన్ను వేధించకు!

కోదం:- అమ్మమ్మమ్మ — ఎంత మాట-ఎంత మాట ! వెధవ డబ్బు కోసం మీ ప్రాణం తీస్తానా?

చిదం:- ఇంకా ఏం తియ్యాలయ్యా రామచంద్రప్రభో! ప్రాణం పట్టుకుపోయే ముందు యమకింకరుణ్ణా 'ఇంత' బాధ పెట్టర్రా బాబూ! ముక్కకు ముక్క చొప్పున కొరుక్కు తినేస్తున్నావ్.

కోదం:- మీకు ఇంత బాధ కలిగిస్తున్నానని నేను అనుకోలేదు. ఆఖరు సారిగా మనవి చేస్తున్నాను...ఒక్క పాతిక రూపాయలిప్పించారంటే...

చిదం:- అబ్బబ్బబ్బ ... సీనూ ... సీనూ ! ... వెళ్ళవయ్యా వెళ్ళు. పాతిక రూపాయలు కావాలా, ఎక్కడన్నా ఎత్తుగొచ్చి యిస్తాను. వెళ్ళు నమ్మకం చాలకపోతే ఈ రాత్రి నాతో కూడా రా.

కోదం:- పోసి, ఇరవై రూపాయలన్నా ఇప్పించండి.

చిదం:- ఇదేం కర్మం వచ్చిందిరా ఇవాళ భగవంతుడా? వెళ్తావా, పోలీసుకు ఫోన్ చెయ్యమన్నావా? చెప్పు.

కోదం:- [కాళ్ళమీద వాలుతూ] నన్ను చంపెయ్యకండి. మీ సహాయం మరిచిపోను. పిల్లలుగలవాడిని. మీకేం తోస్తే అదే యిప్పించండి. మీకు జన్మజన్మాలు బానిసనై పడివుంటాను. అనవసరంగా నాకు ఖర్చయిపోయింది. ఎట్లా చెప్పండి? అది నేను మళ్ళీ సంపాదించాలంటే నా తరం కాదు. కటాక్షించండి. మీకేం తోస్తే అదిప్పించండి, వెంటనే వెళ్ళిపోతాను.

చిదం:- [ఆలోచించి] వెంటనే పోతావు గదా!

కోదం:- ఒక్కనిమిషంకూడా మరి నిలబడను.

చిదం:- [పర్సుతీసి ఐదురూపాయల నోటు యిస్తూ] మాట్లాడకుండా ఇది తీసుకుపో...మరింకేమి వేధించకు వెళ్ళు. మరేం బేరం సారం చెయ్యకు. వెళ్ళు వెళ్ళు.

కోదం:- [నోటు జేబులో పెట్టుకుంటూ, నీరసంగా] కానీండి, ఏం చేస్తాం... సెలవు [వెళ్తున్నాడు]

చిదం:- నీ కుక్కపిల్లనుగూడా తీసుకుపో. మరచిపోయి ఇక్కడ వదలి పెట్టేస్తే గనక!

కోదం:- ఎవరెక్కడ దొరికిందో అక్కడే వొదిలిపెట్టాలంటే నాకు మళ్ళీ పది రూపాయల ఖర్చు...ఈ [పక్క వీధిలో పారేస్తాను [వెళ్ళాడు]

చిదం:- ఏమో ఏడుపో—(కూలబడి)ష్, రామ రామ...ఒరే సీనూ...సీనూ... (సీను వచ్చాడు) వాడు పోయాడా?

సీను:- పోయాడుసార్, కుక్కపిల్లను తీసుకొనే పోయాడు సార్!

చిదం:- ఇంతసేపూ నువ్వెక్కడ చస్తున్నావ్?

సీను:- చాపటం ఖర్మ ఏమిటింది-అవతల మామని కుక్కపిల్లను ఆడిస్తున్నాను.

చిదం:- ఆ వెధవ కుక్కనే!

సీను:- ఏదోఒకటి అలవాటయిపోయింది సాకే-కుక్కతో ఆడుకోవటం !

చిదం:- చూశావా! వూరిమీద తిరిగి, ఆ దిక్కుమాలిన కుక్కపిల్లను తీసుకొచ్చి మనదేనంటాడు ఆ వెధవ! 'కాదురా పోరా యమధర్మరాజా' అంటే ప్రాణాలు పీక్కుని తిని ఐదురూపాయలు పట్టుకుపోయాడు!

సీను:- మీరు మరీనండీ! ఆ మాత్రందానికి ఐదురూపాయలిచ్చేశారా! పెళ్ళి కోసం ఆడిగితే లేదన్నారు!

చిదం:- (చిరాగ్గా) ఇస్తానన్నాను కాదురా, ఇస్తానులే...(తలుపుతోసుకుని ఠీక రంగావున్న మనిషిఒకడు వచ్చాడు. అతనిపేరు చతుర్భుజం. చేతిలో కుక్కపిల్ల వుంది. దాని తోకకు గుడ్డముక్క చుట్టబడివుంది. రక్తం కారిన మరకలు ఆ గుడ్డమీద కనిపిస్తున్నై.)

చతు:- (కుక్కపిల్లను ఐల్లమీదపారేసి. సీరియస్‌గా) ఇదిగో మీ కుక్కపిల్ల-ఇవ్వండి నా నూటపదహార్రూపాయలు. వెంటనే ఇవ్వండి. (రుమాలుతో మొహం వొత్తుకున్నాడు.)

చిదం:- (తెల్లబోయి చూశాడు)

చతు:- అట్లా చూస్తారేం—తీసుకోండి మీ పిల్లను.

సీను:- (కుక్కను తీసి) ఇది మన రోజా కాదు సార్!

చతు:- నవ్వూరుకోవయ్యా—నీ కెందుకూ. ఇది మీ రోజా కాదూ? రోజా కాకపోతే దాని 'బాబు'!...త్వరగా యివ్వండి—వెళ్ళాలి.

సీను:- ఈ తోకకు రక్తం యేమిటి?

చతు:- ఏమిటో ఎవడి నడుగుతావ్-ఏమండి చిదంబరంగారూ - ఇవ్వండి పోవాలి!

చిదం:- ఎక్కడికి పోతారు?

చతు:- మా యింటికి—(తనను చూపుకుంటూ) చతుర్భుజంగార్ల్లు అంటే అందరికీ తెలిసిందే!...కష్టపడి మీ కుక్కను వెతికి తీసుకొస్తే మర్యాదా మంచీ లేకుండా మాటాడతారేం—క్షమాన్-నా డబ్బు!

చిదం:- మీ కుక్కపిల్లను తీసుకెళ్ళండి. ఇది నాది కాదు.

చతు:- ఏమిటీ—కాదూ! మీ గుర్తుప్రకారం పొట్టితోకా, ఇదిగో పొట్టితోక!

సీను:- పొడుగు తోకుంటే కత్తితో తెగేసి పొట్టిచేశాడు సార్!

చతు:- నోరుముయ్యి! మనకా గతిపట్టలేదు. తిండిలేక ఆకలితో మాడిపోతూ, ఏమీ దొరక్కపోతే, ఆదే దాసి తోకలో చిన్న ముక్క కొరుక్కు తినేసి వుంటుంది! ఇంకా నయం. నేను గనక కట్టుకట్టాను. ఆ తర్వాత తెల్లరంగు అన్నారు. మొదట్లో ఇది తెల్లగానే వుండొచ్చు. బురదలో మట్టికొట్టుకొని ఇట్లా తయారయింది.

చిదం:- అసలది నా కుక్కపిల్లేకాదు, తీసుకెళ్ళండి.

చతు:- వాహ్వారే ఎత్తూ! మాంచి ఎత్తు ఎత్తారు! ఏదీ (కుక్కను తీసుకుని, కూచుని) ఆ ఎత్తులేం మనదగ్గిర పనిచెయ్యవు. మర్యాదగా కుక్కను తెచ్చి యిస్తున్నాను. మర్యాదగా నా డబ్బివ్వండి.

చిదం:- (కోపంగా) ఇవ్వకపోతే ఏం చేస్తావయ్యా—తంతావా-కొడతావా-నరుకుతావా?

చతు:- ఎందుకవన్నీ! గొడితోపోయే వ్యవహారం...మీ కుక్కపిల్లను జాగ్రత్తగా వుంచాలి. ఎక్కడ దానిచోటు? (బయటకు పోయి కుక్కను వుంచేసి, వచ్చి సీనుతో) గొలుసుతో కట్టేసిరావచ్చా-ఇట్లా చూస్తామేం దొంగ వెధవను చూసినట్టు! ...పో...(సీను భయంగా వెళ్ళాడు ఎమండీ మాట్లాడరేం?...

చిదం:- కుక్కపిల్ల పోయినమాట వాస్తవమే-దాని కోసం నేను బెంగ పెట్టుకున్నమాట వాస్తవమే - అది దొరికేదాకా నేను భోజనం ముట్టుకోనన్నది వాస్తవమే! ఐతే, ఇది నా కుక్కపిల్లకాదు. ఇంతకు పూర్వం ఇట్లాగే ఇద్దరొచ్చారు. అవి నా కుక్కపిల్లలు కావంటే వెళ్ళిపోయారు!

చతు:- నేనట్లా పోవల్సినవాడిని కాదండీ! ఈ కుక్కపిల్ల మీది కానప్పుడు నాకు డబ్బిడి ఇవ్వద్దు. 'పిదే' అని నిదర్శనాలు చూపించాము. అన్నీ కరిపోయినై...సీను నా శ్రమ వుమకుండా ఇచ్చుకుంటాడు.

చిదం:- ఇంకా ఎప్పుడో అనుభవించటంకాకా ఎందుకు – అనుభవిస్తూనే వున్నాను. (ఫోన్ మోగింది. చిదంబరం తీసి) ఎవరు?...ఆఁ... ఏవయ్యా—లేదయ్యా! ఇద్దరు ముగ్గురొచ్చి చూపారుగాని, వాటిల్లో మనదిలేదు...నీకూ దొరకలేదా...చేస్తానులే, భోజనం మాటకేం—ఎట్లాగన్నా వెతికి పట్టుకో!...కొద్దిగా శ్రమపడు. అది లేకపోతే నాకు నిమిషం తోచదు...దొరికిన వెంటనే పిలిచి చెప్పు...ఆఁ... (ఫోన్ వుంచి ఏదో గుర్తుకొచ్చినట్లు చరచరా లోపలికి పోయాడు. బయటనుంచి ఇళ్ళ కంట్రాక్టరు వచ్చాడు. వేషం మారివుంది. షిసాలు, తలపాగా వున్నయ్, భుజాన సంచీ వున్నది.)

కంట్రా:- చిదంబరంగారు లేరా?

చతు:- లేనట్టే—

కంట్రా:- అంటే?

చతు:- ఉన్నా, ఆయన ఎవరితోనూ ఇప్పుడు మాటాడరు. చాలా నిరుత్సాహంగా వున్నారు!

కంట్రా:- కుక్కపిల్ల దొరకక్కానా?

చతు:- దొరకక్కం–దొరికింది !

కంట్రా:- దొరికిందా?

చతు:- దొరికింది!

కంట్రా:- ఎట్లా దొరుకుతుంది? అదేదో ఇంకో పిల్ల ఐవుంటుంది. అసలు కుక్కమాత్రం అదికాదు.

చతు:- ఎవరయ్యా మీరు-వూరికే అట్లా మాట్లాడతారు! అసలుకుక్క అది కాదంటే మీరేమన్నా చూశారా!...అసలు ఇంతకూ మీరేం పనిమీద వచ్చారు?

కంట్రా:- వారితో వ్యక్తిగతంగా పనుండి వచ్చాను-మీరెవరో తెలుసుకోవచ్చా?

చతు:- నేనా? నేనూ ఓ పనిమీద వచ్చాను. నా పని ఐనతర్వాత మీకాస్తే చావుంటుంది. అందాకా అవతల పెంచి వుంది చూశారా—దానిమీద కూచోవచ్చు. ఏమీ అనరు!

[చిదంబరం వచ్చాడు]

చిదం:- (వస్తూనే కంట్రాక్టరును చూచి) ఎవరది?...ఏమిటయ్యా...నువ్వా వో కుక్కపిల్లను తీసుకొచ్చావా—వెళ్లు—నాకేం చూపించకు!

చతు:- అతను కుక్కపిల్లను తీసుకురాలేదంది!

కంట్రా:- తీసుకురాలేదూ—ఇంకా నయం!

చిదం:- తెచ్చావూ—వద్దులే పో...కుక్కపిల్లను నాకు చూపించకండానే వెళ్లు

కంట్రా - మీ కుక్కేసార్ ఇది! (సంచిలోంచి తియ్యబోయాడు.)

చిదం:- సంచిలోకూడా పెట్టావూ? తియ్యకు, నీకు పుణ్యం వుంటుంది. నా మాట వినండి, మిమ్మల్ని ప్రతిమాలుకుంటాను-వెళ్ళండి.

కంట్రా:- కుక్కపిల్లను చూడనన్నా చూడకుండా వెళ్ళమంటారేమిటండీ! ఇది మీ కుక్కపిల్లేనండీ!

చిదం:- అవును. నా కుక్కపిల్లే...కాలవప్రక్కను పొర్లుతూవుండే ప్రతీ వెధవకుక్కా నా కోజాయే. నా రోజా కాదంటే మీకు కోపం కూడా వస్తుంది. అదంతా ఎందుకు...మీరు ముందు దయచెయ్యండి ... వెళ్ళండి...(ముందుకొచ్చి తరమబోయాడు)

కంట్రా:- చూడండి సార్, ఇది మీదేనండి...(వెనక్కునడుస్తూ) మీ కుక్కే.... పొట్టితోక-తెల్లని రంగూ-

చిదం:- (ముందుకు నడుస్తూ) కోలముఖమూ, కుచ్చుతోకా అవును - అదే! అదే, నాకక్కర్లేదు వెళ్ళండి!

కంట్రా:- వినిపించుకోండి...చూడండి!

చతు:- వెళ్ళవయ్యా - వద్దో అంటూవుంటే వినిపించదూ? అదికాదు వారి కుక్కపిల్ల. అవతల గుమ్మంలో వుంది చూసుకో!

కంట్రా:- (బయటకు వెళ్ళాడు)

చిదం:- (కుర్చీలో కూంబడ్డాడు)

చతు:- చెబుతూవుంటే వినిపించుకోకుండా ఒకటే గోల! కుక్కపిల్ల దొరికినాకూడా 'మీదే మీదే' అట. ఎక్కడ వూడిపడ్డాదో దయ్యంలాగా-

పాపం చాలా బాధపెట్టాడు మిమ్మల్ని ? (విసనకర్ర తీసుకొని విసురుతున్నాడు)

కంట్రా:- (బయటనుంచి వచ్చాడు. చేతిలో అతను తెచ్చిన కుక్కపిల్ల వుంది. తలపాగా జారిపోయివుంది. వెనకనుంచి సీనుకూడా వచ్చాడు) అది మీ కుక్కపిల్ల కాదు సార్-ఇదిగో ఇదీ మీది.

చిదం:- ఇదేమిటి మిమ్మల్ని చూసినట్టుంది. ఇళ్ళకు రిపేర్స్ చేసేవ్యక్తి ఎవరన్నా మీకు అన్నదమ్ముడా?

కంట్రా:- కాదండి-నేనే ఆ వ్యక్తిని!

చిదం:- ఇదొకటి. ఇదో మోసం!

కంట్రా:- కాదండి. నేనేనంటి ఆ కంట్రాక్టరును ఇంతకుముందే మీ దగ్గిర కొచ్చానుగా—మరచిపోయారా! ఇదిగో 'ఆర్డర్ బుక్' (సంచిలో చెయ్యిపెట్టి తియ్యబోయాడు)

చిదం:- మిమ్మల్ని కంట్రాక్టరు కాదని నేనేం అనలేదు. మీరు కంట్రాక్టరేకాని మీరు మరో వేషంలో వచ్చినందుకు మోసం అంటున్నాను.

కంట్రా:- అది ఊళ్ళోవాళ్ళు ఏమన్నా అనుకుంటారేమోనని గాని!.....సరే ఇదిగో మీ కుక్కపిల్ల!

చిదం:- (చూసి) ఇందాకే చెప్పాను వెళ్ళమని! ఇది నాదికాదు - నన్ను మరి వేధించకండి!

కంట్రా:- మీదేసార్. జాగ్రత్తగా చూడండి! ఇదిగో తెల్లని రంగూ, ఇదిగో కోణముఖమూ-(సీనుతో) నువ్వు చూడబ్బాయ్!

సీను:- (తీసుకుని వేరితో రాసి) ఇది తెల్లనికుక్క కాదుసార్-నల్లకుక్క మీదే సున్నం పూశారు.

కంట్రా:- సున్నం పూశానా — నువ్వు వళ్ళు దగ్గిరపెట్టుకునే మాటాడుతున్నావా—సున్నం పూశాడట సున్నం ..... యిది మీదేనండి! ఇదాకా మీ దగ్గిర గర్తులన్నీ తీసుకున్నాను. నా సాయశక్తులా వెతికి తీసుకొస్తానని చెప్పాను. తీసుకొచ్చాను, మీ కుక్కపిల్లను మీరు తీసుకొని నా డబ్బు నా కివ్వండి.

చతు:- ఇంకా ఏం కుక్కపిల్లయ్యా? ఎక్కడ ఎత్తుకొచ్చావ్ దాన్ని. ఒరే అబ్బాయి. దాన్ని తీసుకెళ్ళి బయటపారేయ్. వూఁ చూస్తావేఁ పో (సీను కుక్కను తీసుకొని పోయాడు.)

కంట్రా:- ఒరే అబ్బాయ్! పారేశావంటే వుద్యోగం వూడిందనే లెక్కవేసుకో అది మీదే సార్! నేను అబద్ధం చెప్పటంలేదు.

చిదం:- మీరు నిజమే చెబుతున్నారు. నేనే అబద్ధం ఆడుతున్నాను. నేను వట్టి మోసగాడిగాని. దొంగను-సరా-ఇహ దయచెయ్యండి (చరచరా లోపలికి పోయాడు.)

చతు:- అవునయ్యా! నీకేం మతీ సుతీ లేదూ. ఊరిమీద తిరిగే ఆ చెత్త కుక్కపిల్లను తీసుకొచ్చి ఆయనదేనంటూ యివ్వజూపుతావా? మాంచి వాడివేనయ్యా!

కంట్రా:- అవతల కట్టివున్న కుక్కను నువ్వు తెచ్చావల్లేవుంది!

చతు:- కాక?

కంట్రా:- ఐతేమరి నువ్వు మోసంచేసి ఏదో కుక్కపిల్లను తెచ్చి ఆయనదే అని అంటగడుతున్నావ్. నిజంగా చెప్పు. అది ఆయన కుక్కా?

చతు:- నువ్వు నిజంగా చెప్పు, నువ్వు తెచ్చింది మాత్రం ఆయన కుక్కా?

కంట్రా:- నిజంగా నేను తెచ్చింది ఆయన కుక్కే. పోలికలు చూసుకో.

చతు:- నాదయ్యా అసలు కుక్క. నా మాట విని దాన్ని నువ్వు తీసుకు వెళ్లు! నామాట వినవా?

కంట్రా:- బావుంది. నీతో నాకేమిటి మధ్య! ఎమండీ చిదంబరంగారూ! మీ కుక్కపిల్లను తీసుకుని బాబ్బాబూ! నా డబ్బిచ్చి పంపేద్దురూ!

చతు:- అయ్యో చిదంబరంగారూ! నేను వెళ్ళాలి. త్వరగా నా డబ్బివ్వండి!

కంట్రా:- అవతల అర్జంటు పనులున్నాయండీ. అవన్నీ వదిలిపెట్టి వచ్చాను. (చతుర్భుజంతో) ప్రస్తుతం ఎనిమిది తొమ్మిదిళ్ళు మరమ్మత్తు చేయించాలి. చిదంబరంగారు కుక్కను తీసుకుంటే ఈ యిల్లు కూడా చెయ్యాలి. (పైకి చూస్తూ) నా డబ్బిచ్చేసి ఎంతకూ పంపరు.

చతు:- (చురచుర చూసి) నోట్లు లెక్కపెడుతున్నారేమో, కాస్సేపాగూ? లేకపోతేనూ నాదబ్బాట 'నా డబ్బు!'

కంట్రా:- నాది డబ్బుకాదు. నీదే డబ్బు! నువ్వే తెచ్చావు కుక్కపిల్లను. (లేస్తూ లోపలకు చూస్తూ) చిదంబరంగారూ!

చతు:- చిదంబరంగారూ! (చరచర లోపలకు వెళ్ళాడు. కంట్రాక్టరు కూడా వెనకాలే వెళ్ళాడు.)

చిదం: (ఆత్రుతగా లోపల్నుంచి వచ్చి కూర్చున్నాడు.)

చతు:- (వస్తూ) ఏమండి సార్! ఏమిటిది?

కంట్రా:- మీరు జాగ్రత్తగా పరీక్షించి మీ కుక్కను నిర్ణయించుకోండి సార్!

చతు:- నిర్ణయిస్తారుండవయ్యా, ఏమండీ...

చిదం:- ఏమిటి, ఏమిటి మీ వుద్దేశం? (మండిపోతూ) పోలీస్‌కు ఫోన్ చేస్తాను (లేవబోయాడు.)

చతు:- (కూచో పెడుతూ) ఆఁ, ఎందుకండీ అంతపని? ఈ మాత్రం దానికి వాళ్ళదాకా ఎందుకు!

చిదం:- ఎందుకేమిటి, లేకపోతే ఏమిటీ అల్లరి! ఇంకాస్సేపు పోతే పిల్లి పిల్లల్ని కూడా తెచ్చి 'మీ కుక్కేనండి' అంటారు. పోతారా? పోలీసుకు పిలవమంటారా?

కంట్రా:- కూచోండిసార్! (ఫోన్ వెనక్కి జరిపి, పత్రిక కిస్తాడు.)

చతు:- అయ్యో క్షమించండి. ఇది మీ కుక్కపిల్లకాదని మీ నోక్కమాటతో కొట్టిపారేస్తే మేమెట్లా బతగ్గలం? మేం దొంగలంకాము, దోచుకోము. చాలా కష్టపడి వెతికి తెచ్చాము.

కంట్రా:- నేను చాలా కష్టపడ్డాను. మీరు కనిపెట్టంది ఎవరెంత కష్టమో!

చిదం:- మీ కష్టాలమాట దేవుడెరుగు నన్ను నానా కష్టాలు పెట్టి, ఇంతా అంతా బాధ పెడుతున్నారా మీరు! ష్ ఏం గోలవచ్చిందిరా భగవంతుడా! వెధవకుక్క నేకక తప్పింది. సీమా, సీమా, పోతేపోయింది కుక్కపిల్ల, నాకు మరి అక్కర్లేదు. మీరిద్దరూ వెళ్తారా వెళ్ళరా? (లేచాడు.)

చతు:- తమరు ఒక కంట చూడాలి! లేకపోతే వచ్చిపోతాను.

చిదం:- ఏమంటావయితే?

కంట్రా:- అనటానికేముందండీ, ఏదో మా శ్రమకుతగ్గ ప్రతిఫలం...

చిదం:- (సీరియస్‌గా, విసుగ్గాచూసి పర్సుతీసి ఐదు రూపాయలనోటు యిస్తూ) వెళ్ళండి, మాట్లాడకండి. (ఇద్దరూ సంశయిస్తూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు. చిదంబరం ఈ పాటికే పూర్తిగా విసిగిపోయి వున్నాడు. ఆయాసపడుతున్నాడు. విసుగూ, కోపం హెచ్చిపోయినై) బాబదూ! తీసుకోండి. పర్సులో వున్నది ఇదే! గుల్లచెయ్యండి, పొండి, (రెండయిదులూ ఒకడికిచ్చి, 10 రూపాయల నోటు ఇంకోడికిచ్చి పర్సుదులిపాడు.) పొండి, మీ కుక్కలూవద్దు నక్కలూవద్దు. వెళ్ళరేం! (ఇద్దరూ నడుస్తున్నారు. కంట్రాక్టరు ఆగి, వెనక్కుతిరిగి యింటికప్పుకేసి చూస్తూ జాలిగా చిదంబరాన్ని చూశాడు. చిదంబరం కూడా చూసి నుదుటిమీద కొట్టుకుని కూల బడ్డాడు. ఇద్దరూ పోయారు.)

చిదం:- (తేరుకుని) సీనూ, (గట్టిగ) సీనూ, (చూస్తూ) దిక్కుమాలిన వెధవ, దిక్కుమాలిన వెధవా అని!

సీను:- (రొప్పుతూ వచ్చి) అదెవరోసార్ అవతల, నించున్నాడు. కాదంటే వినడు, పేద్దకుక్కను తీసుకొచ్చి మనదేనంటాడు. ఎంత పొమ్మన్నా పోడు!

చిదం:- (చటుక్కున లేచి, ఆత్రతగా) చంపావ్‌రా, ఏడీ! వస్తున్నాడా కొంపతీసి! నువ్వు త్వరగా ఆ తలుపు వెయ్. గడియవేసెయ్! (నమస్కరిస్తూ) అభ్యర్థన, కుక్కపిల్ల అభ్యర్థన, ప్రాణాలతో మరి వుండనిచ్చేట్టు లేదు. (సీను తలుపువేసి వచ్చాడు.) చూడూ, కాస్సేపు పోయినతర్వాత వెళ్ళి 'కుక్కపిల్ల దొరికింది' అని రాసి బోర్డు గుమ్మానికి కట్టు!

సీను:- దొరికిందా సార్? (సంతోషంగా.)

చిదం:- కట్టరా వెర్రిపీనుగా, బాగదొరికావ్!

సీను:- (ఇంట్లోకి పోయాడు.)

చిదం:- (ఫోన్‌తీసి విసుగ్గానే) హలో...ఆఁ...ఎడిటర్‌గారున్నారా—మీరేనా ...సరే చూడండి...'కుక్కపిల్ల కనబడుటలేదు' అని ఈరోజు మీ పత్రికలో ప్రకటన వేశారు. ఆఁ, ఆఁ...ఆ ప్రకటన నేనే యిచ్చాను. అవును చిదంబరాన్నే...ఈ రోజు పేపర్లో ఆ 'కనబడుటలేదు'అన్న చోట కుక్కపిల్ల 'దొరికింది' అని వెయ్యండి ! అవును దొరికింది. ఎవరో తెచ్చియిచ్చారు ధర్మాత్ములు. బాబ్బాబూ...వెంటనే వేసి పెట్టండి! 'కుక్కపిల్ల దొరికింది' అని పెద్దక్షరాలలో వేసి 'ఫలానా చిదంబరంగారి పోయిన కుక్కపిల్ల దొరికింది' అని వెయ్యండి. దొరికిందని వెయ్యటం ఎందుకఁటారా? వెయ్యండి, నా స్నేహితులు చాలా మఁది ఆతురత పడుతున్నారు. దొరికిందంటే సంతోషిస్తారు. ఎంత డబ్బయినాసరే పంపిస్తున్నాను. దొరికిందని మాత్రం వెంటనే వెయ్యండి. థాంక్స్.

[ఫోన్ క్రిందపెట్టి, నిస్సారంగా కుర్చీలో కూలబడ్డాడు. సీను లోపల్నుంచి ఒక బల్లమీద పెద్ద అక్షరాలలో 'కుక్కపిల్ల దొరికింది' అని రాసి ఆ బిల్లపట్టుకుని, వీధివేపు పోతూ వుండగా తెర]

చరమాంకం

రచన :

అనిసెట్టి సుబ్బారావు

పాత్రలు

పురుషుడు

స్త్రీ

శిశువు

ప్ర శ్న లు :

ఎవ్వరూ కనీ వినీ ఎరుగని, ఏనాడూ ఊహించని ఒక భయం కర మారణ సంగ్రామం చెలరేగి చరాచర ప్రకృతిని స్తంభింప జేస్తే ?—

అందులో నరులూ, నాగరికత సమూలంగా నాశనమైతే?—

మానవ యుగాంతవేళ ప్రారంభమైతే ?

[ప్రపంచంలో ఏదో ఒక ప్రాంతంలో ఒక శిథిలమైన ఇంటిలో- గతానుభవాల వ్యాధులతో కుములుతున్న ఒక వృద్ధుడు; నవయౌ వనావేశంతో పొంగిపోతున్న యువతి, ఒక బోసినోటి పసిపాప ఇంకా ప్రతుకీడ్చడానికి యాతన పడుతున్నారు. వెనక చీలక గోడలోనుంచి, బయట దిక్చక్రంవరకూ భూతాలవంటి మేఘాలతో దట్టంగా నిండిన ఆకాశం కింద; కూలిన భవనాలు, విమానాలు, అస్థిపంజరాలు కన్పిస్తున్నాయి. వాటిలోనుంచి ఉదయ సూర్యుడు ఏడ్చిఏడ్చి కందిన పసిపాప ముఖంతో దీనంగా ఎర్రగా చూస్తు తున్నాడు– ఇంటిలో కొయ్యనుక్కలతో అమర్చిన బల్లమీద సగం పగిలిన రేడియో ఒకటుంది- దానికి ఇరుప్రక్కల ఒక విరిగిన బెంచీ, ఒక విరిగిన కుర్చీ వున్నాయి-

బల్లమీద ఎర్ర సిరా బుడ్డిలో కలం ముంచుతూ వృద్ధుడు తదేక ధ్యానంతో ఏదో వ్రాస్తున్నాడు.

దూరంగా, అతిదూరంగా, ఏవో గద్గద కంఠాల కరుణాత్మక సంగీతం ప్రారంభమవుతుంది-]

ఇదిగో ఇదిగో పెవ్వరిక !
అవని కిదే మా పెవ్వరిక !
అందరికీ తుది పెవ్వరిక !
అనంతకాలపు అంతరాత్మలో
అంకురించినా ప్రాణ కిరణమే

ఆవరించే నీ లోకపు చెల్లలు !
ఆశించెను మహదనంత సీమలు !
నరులకు శత్రువు ప్రచండ మృత్యువు
ప్రపంచమే బలిచేసిన నాడు
నేలకు వాలిన నిండు ప్రాణులం
జీవం విడువని అంతరాత్మలం !

వినండి ఇది మా పొచ్చరిక !
విశ్వానికి తుది పొచ్చరిక !

మానవులారా! మొగకెత్తండి!
దశ దిశలా తలయెత్తండి!
శాంతిసౌఖ్యం సౌభాగ్యాలతో
జగతిని హాయిగ వర్ధిల్లండి
ఆద్యంతాలే లేని మహామృత
మానవోత్సవం సాగించండి.
నిండుగ హాయిగ జీవించండి
నిత్యం సత్యం స్థాపించండి
మృత్యువు మర్మం ఛేదించండి

ఇదిగో ఇదిగో పొచ్చరిక!
అవని కిదే మా పొచ్చరిక!
అందరికీ తుది పొచ్చరిక !

పురు:- [ఆ గానం ఏంటూ భయపడుతూ లేస్తాడు] ఏమిటా సంగీతం! మళ్ళీ విన్పిస్తోంది? శ్రీమతీ శ్రీమతీ! నిన్నే! ఏమిటా సంగీతం! నిన్నే...

శ్రీమతి:- [లోపలినుంచి వచ్చి] ఏమిటా కేకలు! ఊరుకోండి. పాప నిద్ర పోతున్నాడు.

పు:- అదిగో, ఎక్కడిదా సంగీతం? అబ్బబ్బ! రాత్రింబగళ్ళు నన్ను వేధిస్తోంది. ఎవరిదా మరణమోహ !

శ్రీ:- ఏమిటలా వణికిపోతారు! (జాలిగా నవ్వుతూ) ఏమిటీ వెర్రి భయం! లోకమంతా శిథిలాలతో, శవాలతో, శ్మశానంగా మారినా మీకింకా భయమేనా?

పురు:- నేను భరించలేను. శ్రీమతి! అదీ... ఆ పాపానికి బాధ్యత నాదే అయినట్టు... నాకు గతమంతా జ్ఞాపకం వస్తోంది. నన్ను బాధిస్తోంది. అబ్బా! ఎవరు వాళ్లు?

శ్రీ:- (ఆతనివంక చూడకుండానే) ఏవో పదులు చూసుకుంటూ) మీరే అన్నారుగా, అది అంతరాత్మల ఆక్రందనమని.

పు:- అది నిజమేనా? సంగ్రామ సంక్షోభంలో చితికిన అంతరాత్మల ఆవేదనేనా అది?

శ్రీ:- అవును. ఆదర్శం నశించిన అంతరాత్మల ఆక్రందనం.

పు:- అబ్బ! యుద్ధం ముగిసిన మరుక్షణం నుంచి నన్ను వేకువలో, నిద్రలో ఎందుకిలా వేధిస్తుంది? ఇది నాకు శాపమా? శిక్షా? (సంగీతం ఆగిపోయింది.)

శ్రీ:- (కొంచెం నిర్లక్ష్యంగా) ఏదైనా సరే, మీరు అనుభవించవలసిందే!

పు:- తప్పదా ?

శ్రీ:- (నిశ్చయంతో) ఎలా తప్పుతుంది?

పు:- ఏమిటి శ్రీమతీ! నాకంటె ఇంత చిన్నదానివి ఇంత కాఠిన్యం నీకెలా వచ్చింది?

శ్రీ:- (అతని కెదురు నిలిచి) ఎందుకురాదూ! తల్లిని; జీవితాన్ని రక్తంతో పోషించే తల్లిని; ఇంత విధ్వంసం చూసిన తర్వాత ఇంకా కవిని ఎలా వుంటుంది? పురుషుల పుణ్యఫలం ఇది. స్త్రీలు పెంచి, లాలించి, పోషిస్తే పురుషులు సాధించిందిదే-విధ్వంసం.

పు:- (లాలిస్తూ) శ్రీమతీ! చూడు, ఎందుకంత ద్వేషం? రా, ఆంతా మళ్ళీ మార్చి వ్రాశాను. విను.

శ్రీ:- ఇదంతా ఏమిటి? దేనితో వ్రాశావు?

పు:- అక్కడొక లేడిపిల్ల కన్పిస్తే చంపాను.

శ్రీ:- (అతి జాలిగా) పాపం! ఇదంతా ఆ పసిలేడి లేత రక్తమా? చంపారా? దాన్నికూడా చంపేశారా? (తన కోపాన్ని అణచుకొంటూ) ఒక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెపుతారా?

పు:- అడుగు. తప్పకుండా అడుగు. నీవూ, నేనూ తప్ప ఈ లోక వేదిక మీద ఎవరున్నారు?

శ్రీ:- (గాద్గదికంగా ఎన్నో ఏళ్ళ నుండి దాచుకున్న బాధను వెలిబుచ్చుతున్నట్లు) మానవుడు చేసిందేమిటి? మీ ఆహారం కోసం, మీ ఆదర్శాల కోసం అది యుగయుగముండి అంతిమ కాలంవరకు ప్రతిదాన్ని పరిమార్చారే! మీకేం హక్కుంది? (కోపంతో) ఎవరు మీరు?

పు:- (లేనిధైర్యం తెచ్చిపెట్టుకుని గర్వం నటిస్తూ) శ్రీమతీ! ఆ ప్రశ్న వెయ్యకు. లోకంలో ఒక మహోన్నత నాగరికతను నిర్మించడానికి, ప్రాణమైనా, పాషాణమైనా, ఏది అడ్డువచ్చినా సరే నిర్దాక్షిణ్యంగా వధించాము. మా ఆవర్భం గొప్పది. మా మానవ సంస్కృతిని...

శ్రీ:- (వెగటుగా) హుఁ! ఈ భూగోళాన్ని బూడిద ముద్దగా మార్చడమా మీ సంస్కృతి? చూడండి. ఇప్పుడేమైంది? లోకమంతటా నేలకూలిన నగరాలు అల్లాడే ప్రాణాలు వదిలిన పసిబిడ్డలూ...ఛీ! అన్నీ నాశనమైపోయాయి. కాని మీ అహంకారం మాత్రం అంతం కాలేదు.

పు:- (సిగ్గుపడుతూ తన దైన్యస్థితి వెంటనే జ్ఞాపకం వచ్చి) అవును, శ్రీమతీ! అవును. నా దుఃఖం నీకేం అర్థమౌతుంది? ఆనాటి సంస్కృతి, సంగీతం, సంతోషం, అన్నీ నాశనమైపోయాయి. అయ్యో! దగ్ధమైపోతున్న నగరాలు; స్త్రీలు, శిశువులు! ఆ మరణ ఘోషలు, ఆ ఘోషల అంతిమకాలంలో ఎంత అల్లాడిపోయారో! (వణికిపోతూ) నా గుండె జలదరిస్తోంది. భయంకర మృత్యువు నోట పడి విలవిలలాడే శవపేటిక ఘోరం. ఇప్పటికీ నిత్య జ్వాల పంజరం. భూమాత గుండె చెదిరిపోయింది. గంట గంటకూ భూకంపం, రాత్రింబగళ్ళు తుఫాను. (భయపడుతూ అమె దగ్గరగా వచ్చి, ఆసరాగా

ఆమెను పట్టుకుని) మనం ఒంటరిగా ఎలా బ్రతుకుతామో, ఎన్నాళ్ళు బ్రతుకుతామో! కవి విను. ఇది మన ఆశాస్వప్నం! ఆదర్శజ్యోతి!

శ్రీ:- తర్వాత చదువుదాం. ఇవాళైనా పాలకోసం వెళికిరండి. మళ్ళీ పాప నిద్రలేస్తాడు.

పు:- తెస్తాగుగా! అప్పుకుండా ఎంత దూరమైనా వెళ్ళి పాలు తెస్తా శ్రీమతీ! విను; వాణ్ణి గురించి గూడా వ్రాశాను.

శ్రీ:- (ఆతురతగా) అలాగా? ఏదీ చదవండి!

పు:- (గర్వంగా ఒక ప్రకటన చదివినట్టు) ఆగామి మానవులకు ఆదిదంపతుల శుభాభివందనాలు. మానవులారా! సహజంగానో అసహజంగానో ఈ భూమి మీద ప్రాణం ఉదయించించి.

శ్రీ:- ఉదయించడం సహజమే; ఈ అస్తమయమే అపహాస్యంగా వుంది.

పు:- (ఆమెవంక చూసి ఏమీ అనలేక మళ్ళీ చదువుతాడు) క్రమక్రమంగా అనేక శతసహస్ర శతాబ్దాలు గడిచి మానవుడు పెంపొందాడు. బాహ్యలోకాన్ని, మనోలోకాన్ని పూర్తిగా తన వశం చేసుకోడానికి ప్రయత్నించాడు. ఆ మహాయత్నం ప్రారంభం కాకముందే అంతఃకలహాలు బయలుదేరాయి.

శ్రీ:- త్వరగా చదవండి. మూడు రోజుల్నుంచీ పసిపాప ఆకలితో సీరసమై పోతున్నాడు.

పు:- (ఖేదపడుతూ) విను శ్రీమతీ; ఇది మన వీలునామా! "మానవుడిలో అహంభావం వ్యాపించి, అసాధ్యాలు సాధిస్తానని గర్వించి, కిన్ను మిన్నేరుగక, తన మృత్యువును తనే సృష్టించుకున్నాడు. దీనంతటికీ కారణం- అవిభక్త మానవ కుటుంబం రెండుగా చీలి, మారణ యుద్ధం సాగించడం. ఆ ప్రచండ సంగ్రామంలో సృష్టించిన హైడ్రోజన్ బాంబుల వంటి మారణాస్త్రాలు, మానవవృక్షాన్నే సమూలంగా నాశనం చేశాయి. అన్నిటికంటే భయంకరమైనది మృత్యు విరంగి. దాని పేరే రాడార్ కానన్. లోకంలో మనిషి ఎక్కడున్నాసరే, అతని రక్తనాళ స్పందనను అది పసికడుతుంది.

ఎన్నివేలమైళ్లు ఆయినాసరే, తనంతతాను నిరాఘాటంగా ప్రయాణం చేసి వెళ్ళి వెంటాడి వేటాడి హతమారుస్తుంది. మానవుడు అంతిమ దశలో తయారు చేసిన మారణాయుధం ఆవి. యుద్ధం ముగిసిన తర్వాత ప్రాణాలతో మిగిలిన ప్రజలందరినీ. ఆ మృత్యుఫిరంగులే హత్య చేశాయి. (అతి దీనంగా) అందరూ-అందరూ చనిపోయారు. అద్భుతమైన మానవ జీవితం అంతమయింది, అందరూ అపరాధులే. అందరూ తమ శిక్ష ననుభవించారు.

శ్రీ:- (ఉద్వేగంతో) చదవండి. దిగులుపడి ఏం చేస్తాం?

పు:- (ఆమె వంక చూసి అవునన్నట్లు తల పంకించి) ఇది మన క్షమా పత్రం శ్రీమతి !

శ్రీ:- అంతే కాదు; ఆదేశం కూడా చదవండి.

పు:- మేమే చరిత్రలో తుది దంపతులం. ఆగామి మానవులారా ! మీ తల్లి దండ్రులం మేమే. మమ్మల్ని క్షమించండి. పరితాపాగ్నిలో మా పాపం భస్మమైపోయింది. మమ్మల్ని క్షమించండి. మీరు పెంపొందాలనీ, తిరిగి లోకాన్ని పునరుద్ధరించాలనీ, పూర్వ మహోన్నతిని మళ్ళీ నిర్మించాలనీ ప్రార్థిస్తున్నాం! మా పసిబిడ్డకు మా ప్రాణాలు రంగరించిపోస్తున్నాం. పెంచి పెద్దవాణ్ణి చేస్తున్నాం. ఈ పసిబిడ్డే మీకు మూలపురుషుడు! ఎక్కడో ఒక చోట వెతికి తెచ్చి ఇతనికి ఒక సుందరాంగిని వివాహం చేస్తాం. మా ధర్మం మేము నెరవేర్చుతాం, వారు సంతానం కంటారు. చరిత్ర మళ్ళీ ప్రారంభమవుతుంది. మళ్ళీ లోకమంతా మానవ వదనాలతో కళ కళ లాడుతుంది. మానవ జీవితం మహా ప్రవాహంగా సాగుతుంది. మానవుడు అమరుడు. ఇదే మీకు మా శుభాభివందనాలు.''

శ్రీ:- (పంతోషంతో కన్నీరు తుడుచుకుంటూ) ఎంత బాగుంది. ఇదంతా నిజంగా జరుగుతుందా?

పు:- తప్పకుండా. ఆ అనంతకాలం చివరి అద్భుత మానవుడు మన అభివందనా లందుకుంటాడు (లేస్తూ ఆమెను కౌగిలించుకోబోతూ)

మన కల నిజమవుతుంది. నిర్మీకమైన ఈ బూడిదలోంచి నిర్మలమైన మానవ పుష్పం ఉదయిస్తుంది. ఆ మానవత్వ పరిమళం, ఆ సుందర వదన కాంతి ఈ గోళాన్ని ముంచెత్తుతాయి. నవ్వులతో, కేరింతలతో, నృత్యం చేసే మానవులతో, మన మాతృగోళం విశ్వాంత రాళంలో సగర్వంగా విహరిస్తుంది. ఈ విశాల విశ్వానికి చక్రవర్తి మన పాప! ఎందుకిలా పులకించి పోతున్నావ్!

శ్రీ:- (ఉద్వేగంతో పూర్తిగా తన్మయమైపోయి) మనిద్దరం కలిసే వుందాం ఈ విషాదం మరచిపోదాం. నీవు నిజమైన భర్తవు.

పు:- (ఆ మాటకు పరవశమైపోయి) నీవు... నీపు... నీవు నిర్మలమైన భార్యవు శ్రీమతీ! నేను వృద్ధుణ్ణి.. నా అంతరాత్మ గతజీవుం తప్పి దాంతో చితికిపోయింది. కాని నీవు యువతివి, పదుచు రక్తం పొంగెత్తుతూ పచ్చని తోటల్లో పెన్నెల కాంతుల్లో విశృంఖలంగా విహరించాలని కలలుగనే యువతివి. నీ ఆశ ఫలిస్తుంది. మన రక్తం మానవదేహాల్లో శాశ్వతంగా ప్రవహిస్తుంది. మన స్వప్నం మానవ జీవితాలలో శాశ్వతంగా రూపొందుతుంది. మన ఆశ మన ఆనందం, ఆదర్శం నిరంతరం మానవ హృదయాల్లో స్పందిస్తాయి. మనిద్దరం కలిసివుందాం. మన ధర్మం. ఇది మన ధర్మం. (పెద్ద తుపాను గాలి వీస్తుంది. మెరుపులూ వురుములూ ఆకాశాన్ని ఆవరిస్తాయి సాయంత్రపు సూర్యకాంతి ఎర్రగా గదిలోకి వచ్చి పడుతుంది. తర్వాత చివరివరకు క్రమంగా సూర్యాస్తమయం కనిపిస్తుంది)

శ్రీ:- (భయంతో) అదిగో ఉరుముతుందే? తుపాను లాగుందే? (బిడ్డ యేడుపు వినిపిస్తుంది) మన పాప లేచాడు; పాపం! రెండు రోజుల నుంచి పాలులేవు. ఇవాళన్నా వెళ్ళి రండి.

(ఆమె లోపలికి వెళుతుంది)

పు:- వెడతా తప్పకుండా. ఏదో ఒక జంతువు బ్రతికుంటే చాలు; పాలు తెస్తా; పోషిస్తాం శ్రీమతీ!

(డ్రాయరు సొరుగు తెరిచి చూసి జాగ్రత్తగా వున్నది గదా అని మనస్సుస్తిమిత పర్చుకుంటాడు) ఏదీ తీసుకురా, పాపను. తీసుకురా చూద్దాం.

శ్రీ:- (బిడ్డ నెత్తుకొని వస్తుంది)చూడండి,ఆకలివల్ల ఎంత నీరసమైపోయాడో. వెళ్ళిరండి.

పు:- అయితే ఇవళ ఆహారం ఎలా మనకు? నేనీ అతు అలమా తిని వుండ లేను. నాలో ఓపిక లేదు. శక్తిలేదు,

శ్రీ:- ఏం చెయ్యగలం. యిద్దరం కృశించిపోతున్నాంగా.

పు:- చూడు. (పొట్టరాన్ని చూపిస్తూ) చాలా అందంగా వుంది గదూ. ఆది చాలా రుచిగా వుంటుందనేవారు. నిజమేనేమో.

శ్రీ:- (విసుగుపడుతూ) ఎన్నిసార్లు ఉడుగుతారు. ఎన్నిసార్లు కాదని పించకుంటారు. మీ పుత్రమంతా పుట్టుగతోనే కసాయి వాళ్ళను కుంటా మీకు తెలియదూ అదే నాకు మనశ్శాంతి కలిగించే అమృత మూర్తి.

పు:- ఏం చేస్తాం మరి! ప్రాణముంచే గదా మనశ్శాంతి. మరి ఎలా బ్రతుకుతాం. బయట ఎంత వెతికినా ఉస్తి పగుజరాలు తప్ప ఏమీ కన్పించడంలేదు: నువ్వు పాలివ్వడానికి యిష్టపడితే నాకీ యాతనంతా వుండదు కదా?

శ్రీ:- (తప్పనిసరై తలవంచుకుని చెప్పేస్తుంది) వాడి పుట్టుక నాటి నుంచి ఒక్క చుక్క పాలు కూడా యివ్వలేదు.

పు:- ఏం? ఎందుకని?

శ్రీ:- (సిగ్గుపడుతూ) ఏం చెప్పను. పాలు లేవు. మొదటి నుంచీ లేవు.

పు:- పర్వాలేదు. శ్రీమతీ, నేను వెతుకుతా... ఎంత దూరమైనా పర్వా లేదు. మన పాపకోసం ప్రాణమైనా యిస్తా.

(తమ పరిస్థితికి తామే ఆశ్చర్యపడుతారు ఇద్దరు. ఈ లోకంలో బిడ్డ ఏమైపోతుందోనని యిద్దరికి భయమే.)

(చెప్పులు తెల్లగా వుంటాయి. ఆమె విడుస్తుంది. అతను తొడుక్కొని వెళ్ళిపోతూ మళ్ళీ తిరిగి వచ్చి)

పు:- చూడు. యిదిగో, ఆ డ్రాయరు తెరిచేవు సుమా ?

శ్రీ:- ఎందుకు ప్రతిసారీ చెప్పుతారు! అందులో యేముంది?

పు:- అదంతా నీకెందుకు? ప్రతి విషయంలోనూ నీ మాట పాటిస్తున్నా! ఇదొక్కటీ నా కోరిక. ఇది నా ఆజ్ఞ.

శ్రీ:- ప్రతిసారీ అదేనా సమాధానం?

పు:- అవును. (ఫొటోలన్ని చూపిస్తూ) ఇది నీకెంత అవసరమో? అందులోనివి నాకంత ముఖ్యం. రేడియో జాగ్రత్త. అది పొరపాటున పలికినా వినొద్దు. సరేనా?

శ్రీ:- వినడమా? ఎవరున్నారు? ఎక్కడున్నారు వినడానికి! మీ భయం దావదు. ఎవరో ఎక్కడోవుండి మాట్లాడితే అది రేడియోలో వినిపిస్తే! అప్పుడెక్కడో వున్న రేడియో గన్ మీకోసం వెతుకుతూ వస్తుందా ఏం?

పు:- శ్రీమతీ! నీకర్థంకాదు. మన వాపకోసమైనా జాగ్రత్తగా వుండాలి గదా.

శ్రీ:- (వెగటుగా నవ్వుతూ) ఇంకా ప్రపంచంలో మనుష్యులున్నారంటారా?

పు:- (అనుమానంగా) లే...రనుకో!

శ్రీ:- నమ్మకమేనా?

పు:- (సమాధానం చెప్పలేక ఆగి) నమ్మక ఏంచేస్తాం? (వెళ్తాడు)

శ్రీ:- (అతను వెళ్ళినవైపుచూస్తూ ఆశ్చర్యంగా) వెళ్ళిరాపో! పిరికివాడా! పో! కాగడవల్లో పుట్టిన ఆదిమానవుడు గూడా ఇలాగే భయపడి బెదిరిపోయాడా! ఇలాగే తిండికోసం వేటకు వెళుతూ భార్యాబిడ్డలేమో తారోనని గడగడ వణికి పోయాడా? (ఆశ్చర్యంతో తలపంకిస్తూ) జీవితం ఎంత అద్భుతంగా ప్రారంభమయిందో, ఎంత హాస్యాస్పదంగా పరిణమించిందో! (బిడ్డపంక తడేకదీక్షతో పొంగిపొరలుతున్న ప్రేమతో బిడ్డకు ఆర్థంకాదని తెలిసికూడా ఎంతో జాలిగా పలకరిస్తుంది) నిద్రపోతున్నావా? నీకెవ్వరు లేకపోయినా ఏమీ భయం లేదు. నేనున్నాను. మీ నాన్న వున్నారు. నువ్వే మా మోహంమొలక,

మా ముద్దుల చిలక. పిచ్చితండ్రి. ఎంత అందంగా నవ్వుతావురా? నీ నవ్వుతో నా మనస్సులో అమృతం కురస్తుంది నాన్నా! ఏమిటాపిచ్చి నవ్వు? కల వచ్చిందా నాన్నా! చక్కని కల వచ్చిందా! యీ లోకం నీ యిల్లయి, నవ్వు సుఖంగా ఓ యింటివాడివై, భార్యతో కాపురం చేస్తూ, బండెడు సంసారంతో నీ కొడుకులూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ, మనుమలూ, మునిమనుమలూ! ఈ లోకం నీ యిల్లయి, ఇల్లంతా పిల్లలతో కిలకిలలాడుతూ సంతోషంతో నువ్వు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, పూలతోటలో పచార్లు చేస్తూన్నట్లు కల వచ్చిందా. నాన్నా! చల్లని కల వచ్చిందా, నాన్నా! నా మాట వినవూ? వద్దు నాన్నా! మశ్చిరోషాలు, కలహాలు, కుట్రలు, కదనాలు వొద్దు, వొద్దు. నా సంతానం సంతోషపుటుయ్యాలలో సల్లాపాలాడుకుంటూ హాయిగా పాడుకుంటూ ఆడుకుంటూ, కల వచ్చిందా నాన్నా! నాచిట్టి, నా చిన్ని, నిద్రపో, నిద్రపో. (బిడ్డను చేతుల్లోనే వూపుతూ పాడుతూ నిద్రబుచ్చుతుంది)

మా కంటివెలుగా।
మా యింటి దీపమా।
నిదురించు హాయిగా।
మా యింద్రచాపమా।
గతమంత నీ జాలి కన్నీటిజాలులే।
ఇలలోన నీ కలలు నిజములై తీరులే।
బ్రతుకు పెంపొందులే, జీవితమె విందులే।
నిండుగా హాయిగా నిదురించవోయీ।
భువి నుదుట నీ ముద్దు తిలకమద్దునులే।
నీ చలువ చూపులే మాంగల్యమౌనులే।
నవ యౌవనాంగి ఈ అవని నీ అర్ధాంగి।
నిండుగా హాయిగా నిదురించవోయీ।
దివ్యమూర్తీ! విశ్వమందు జీవితమే।
ఆద్యంతములులేని ఆనందనృత్యమే।

మా కంటివెలుగా! మా యింటి దీపమా।
నిండుగా హాయిగా నిదురించవోయీ।

మళ్ళీ నవ్వుతున్నావా? అంతా నిద్రలో! ఏమిట్రా నీనవ్వు? పిచ్చి నవ్వూ! (పాపను తనివితీర ముద్దుపెట్టుకుంటుంది. హఠాత్తుగా రేడియో లైటు వెలుగుతుంది. అందులోంచి ఒక గొంతుక భయంతో ఉన్మాదిలాగా కేకలు పెడ్తుంది)

గొంతుక:- ఎవరు? ఎవరు? లోకంలో ఎవరైనా ఎక్కడైనా వున్నారా? వినండి! వినండి! నేను ఉత్తరాగ్రంనుండి పిలుస్తున్నా. సముద్రం పొంగుతుంది. భయంకరమైన తుఫాను చెలరేగుతుంది. భూమ్యాకాశాలు సీటితో ఇసుకతో మూసుకుపోయినై-అబ్బబ్బ, యేమిటది? మీకు వినిపిస్తుందా? అది రేడియో ఫిరంగి. అవును. వస్తుంది. ఓహో! యేమి జీవితం. ఇటు ప్రళయంగా పొంగెత్తివచ్చే మహాసముద్రం, అటు భయంకరంగా పరుగెత్తి వస్తున్న ఘోర మృత్యువు. మానవుడా! ఇది నా తుది పొచ్చరిక! వస్తుంది. రేడియో ఫిరంగి వస్తుంది. ఆ, వదలవద్దు. ఆయువు నిలుపుకో! అమరత్వం సాధించు, మృత్యువును జయించు. ఇది నా తుది విజ్ఞప్తి. ఇది నా తుది పొచ్చరిక పొచ్చరిక. పొచ్చరిక. (పెద్దకేక: ఆ స్వరం హఠాత్తుగా ఆగిపోతుంది. ఇంతసేపు బిడ్డ నిద్రపోతుంది. ఆమె భయంతో గజ గజ వణికిపోతుంది. బిడ్డనెత్తుకొని భద్రంగా గాఢంగా కౌగలించుకొంటున్నది. ధ్వని ఆగగా ఆమె కన్నీరు తుడుచుకుంటుంది. బిడ్డ వంక చూస్తుంది. బిడ్డ స్పర్శలో శీతలం కమ్మినట్లు గ్రహించి వాడలిపోతుంది. ఏడుస్తూ మాట్లాడుతుంది)

శ్రీ:- ఏమిటిది, వొళ్ళంతా ఇలా చల్లబడిందేమిటి? ఏమిటి నాన్నా! నావంక చూడు. అమ్మో, శీతలంకమ్మిందే నాన్నా, నాన్నా! (బిడ్డను వెచ్చ చెయ్యాలని కాగితాలకోసం గది అంతా వెతుకుతుంది. దొరకవు. తర్వాత జ్ఞాపకంవచ్చి సొరుగు తెరుస్తుంది దానినిండా నోట్లకట్టలు చూసి నిశ్చేష్టురాలౌతుంది.)

డబ్బు! అమ్మో! డబ్బు! డబ్బు! డాచిపెట్టాడు నాన్నా! ఎందుకీడబ్బు నాన్నా! ఎందుకీడబ్బు అంతా, మూర్ఖుడు, కొనవూపిరితో కొట్టుకుంటున్న ప్రాణాలకు డబ్బు. ఎందుకీడబ్బు! ఏంచేసుకోను? (ఒక రివాల్వారు చేతికి తగులుతుంది. తీసి చూస్తుంది భయంతో వణికిపోతుంది.)

అమ్మో నాతో ఎన్నడూ అనలేదే? ఎవరిని హత్య చేయడానికి? ఛీ! (రివాల్వారును నేలకేసి కొడ్తుంది) నాన్నా! నువ్వు పెద్దవాడివి కాగానే ముందు నీ తల్లిదండ్రుల్ని నిర్దాక్షిణ్యంగా హత్యచెయ్యి నాన్నా. లేకపోతే, భయం దూరదు. ఆశ చావదు! ద్వేషం చావదు. ఛీ (బయటకు చూస్తూంది. పురుషుడు సంతోషంగా పాడుకుంటూ వస్తున్నాడు చూసి వెంటనే రివాల్వారును డ్రాయరులో పెట్టి మూసేస్తుంది. నోట్లకట్టలు తీసుకొని బిడ్డనెత్తుకొని త్వరగా లోపలికెళ్లింది. పురుషుడు ప్రవేశిస్తాడు. అతని చేతిలో గ్లాసులో సగానికి పాలు, పూలగుత్తులు, వివిధ ప్రభుత్వ చిహ్నాలతో కుట్టబడిన ఒక పతాకము ఉంటాయి. ఆ గ్లాసు, పూలగుత్తులు బల్లమీదపెడ్తాడు. ఆ సింహ పతాకవిప్పి జాగ్రత్తగా చూస్తూ గోడకున్న మేకుకు వేలాడదీస్తాడు. ఆ పతాకం వస్తున్నదేమోనని లోపలికిచూసి జేబులోంచి నోట్ల కట్టలు తీసి సొరుగులో పెడ్తాడు. లోపలినుంచి ఏదో మంట కనిపిస్తుంది)

పు:- శ్రీమతీ! శ్రీమతీ! ఏమిటక్కడ మంటపెడుతున్నావ్, ఎందుకూ పాపకు వెచ్చని పాలివ్వాలనా? ఇదిగో తెచ్చాను (పతాకంచూపిస్తూ) ఇది చూశావా! దీనితో మనవాణ్ణి కొత్తపెళ్ళికొడుకులాగ ముస్తాబు చేద్దాం! రా! శ్రీమతీ!

శ్రీ:- (బైటకు వస్తుంది. ఆమె స్వరంలో వైరాగ్యం గోచరిస్తుంది) ఏమిటిది?

పు:- ఇది పాపం రెడ్‌క్రాస్‌వాళ్ళది ప్రపంచంలోని ప్రభుత్వాల పతాకాలన్ని దీనిమీద చక్కగా కుట్టారు చూడు.

శ్రీ:- (వెగటుగా) ప్రభుత్వాలు, పతాకాలు పతనమైన పతాకాలమీద, ప్రపంచాన్ని నాశనంచేసిన ప్రభుత్వాలమీద ఆలోకంమీద మీకింకా గౌరవం పోలేదు కదా!

పు:- ఆ! ఆ! ఎంతమాటన్నావే శ్రీమతి! మారోజుల్లో ప్రభుత్వమంటే అబ్బో బిగపంతుతో సమానం. ఇపిగో పాపు (చాలా వుత్సాహంగా) ఇవాళొక అవు కనిపించింది తెలుసా? అవు!

శ్రీ:- (సంతోషంగా) నిజంగానా? ఆరోగ్యంగా వుందికదా?

పు:- ఓ! మరవిచ్చట, శ్రీమతీ! అపిగో ఆ గుట్టవగ్గిర పచ్చి రంగువేసిన టాంకులేమా! దాంకి కట్టేశాను. అది పచ్చిక అనుకొని భ్రమపడి ఎక్కువ పాలిస్తుందిను.

శ్రీ:- పాపు చిచి చూశారా, లేకపోతే నేను...

పు:- వద్దు, వద్దు. నేను చిచి చూశా! మనవాటికేం పర్వాలేదు. ఈ పూలు తీసుకోవే?

శ్రీ:- (సంతోషంతో పొంగిపోతూ) పూలా? చాలాబాగున్నాయి. ఇంత అందమైన పూలు యిలా పూస్తున్నాయా?

పు:- ఒక పటిపోయి, విమానం రెక్కలమధ్య ఒకే ఒక పూలమొక్క పెరిగింది. నీకోసం, పాపకోసం తెచ్చా.

శ్రీ:- (నవ్వుతూ హాస్యంగా) పురుషుడు ఎంత దీనావస్థలోగూడా సంసార సుఖం మరచిపోరనుకుంటా.

పు:- (వెటకారంగా) ఎన్ని బాధల్లోవున్నా స్త్రీలు అలంకారం మర్చిపోరనుకుంటా. (ఎంతో ఉద్రేకంగా ప్రారంభించాడు) శ్రీమతీ! పురుషుడు స్థాపించి పాలించిన ఏకైక వుత్తమసంస్థ సంసారం. అది చక్కని పూలమొక్కలాగ పెరిగి పెద్దదై నలుమూలలా కొమ్మలు విస్తరించి భవిష్యత్తు దానికి చిలుమొగ్గలుగా, విరిసిన పూలగుత్తులుగా, వ్యాపించిన తియ్యని పరిమళంలా...

శ్రీ:- (సిగ్గుపడుతూ) చాల్లెండి! శృంగారానికి సమయాసమయాలు వుండొద్దూ? (లోపలికి వెళుతుంది)

పు:- (చాలా పెద్దగా నవ్వుతాడు) ఎందుకంత సిగ్గు? ఇంతకంటే మంచి సమయం ఎప్పుడొస్తుంది? నీకు పూలు, పాపకు పాలూ తెచ్చాను. ఇంతకంటే నాకానందం ఏమిటుంది? ఈ చీకటిలోకంలో నీ జీవిత

మొక మెరుపువంటిది. ఆ శిధిలాలలో ఎక్కడో ఏడుస్తూ తిరుగుతున్న నిన్ను కావాలని తెచ్చి పెంచుకున్నాను. ఎందుకు? వివాహం చేసుకున్నాను. ఎందుకు? సంతానం కన్నాను. అందుకు. చూడు పాప యెంత మంచివాడో ఏడవకుండా పాలుతాగుతాడు! ఆకలితో ఏడవడు. ఆనందంతో పొంగిపోడు వాడు వేదాంతి శ్రీమతీ! ఆ గుణాలన్నీ నావే కాదూ? నీవా? సరే అలాగే అనుకుందాం. పూలుదండ గుచ్చివెయ్యి. శ్రీమతీ! యివ్వాళ పాలకోసం వెడుతుంటే ఎంత భయం వేసిందో? అడుగుతీసి అడుగు పెట్టలేకపోయాను. ఎర్రని ఎండ భూమ్యాకాశాలనిండా వ్యాపిస్తే, ఆనాడు వరదపారిన రక్తం మళ్ళీ పైకుబికి ప్రవహిస్తున్నదేమోనని ఇళ్ళన్నీ పడిపోయిన యిసుక గూళ్ళలాగున్నాయ్. అక్కడ ఆ విగిరిగినసోఫాలో మిగిలిన అస్థిపంజరం అక్కడ భయంకరంగా నిశ్శబ్దంగా తాండవించేమృత్యువు. ఈగోళాన్నే కర్కశంగా కౌగిలించి నమిలివేసే ఆ మృత్యువు, శ్రీమతీ! పాపను బాగా అలంకరించు. చాల్లే, పూలమాల అలావుంచితే చాల్లే. మన మోహాలమూట, మన ఆశాస్వప్నం, ఆదర్శ జ్యోతి, ఏం ఆశిల్చి పతాకకప్పితే కాళ్ళతోతన్నేస్తున్నాడు? వాడికిష్టంలేదేమో? సరే వద్దులే! అమాయకులైన అసంఖ్యాక ప్రజల్ని అబద్ధాలతో రెచ్చగొట్టి వేటకుక్కలుగా మార్చి వధించిన ఈ ప్రభుత్వాల పతాకాలు నీకెందుకు? నువ్వు నిర్మలంగా, హాయిగా, గనగనగన జ్యోతిలాగా బ్రతుకు నాన్నా, నీపెళ్ళికి నేనుంటానో, వుండనో? మీ అమ్మ నిన్ను దీవిస్తుందిలే! (ఆమెలోపలినుంచి సంతోషంగా వస్తుంది)

శ్రీ:- ఊరుకోండి. ఏమిటా పిచ్చిమాటలు? మీరు లేకుండా నేను జీవించగలనా?

పు:- చూడు, నీకు నామీద యెంత గౌరవమో ఎంత అభిమానమో? (పిలుస్తూ) శ్రీమతీ! (దగ్గరకు వస్తుంది)

శ్రీ:- (ప్రేమతో) ఏమిటది?

పు:- (లాలనగా) వింటావా! నా మాట కాదనవుగా?

శ్రీ:- ఎప్పుడు కాదన్నాను?

పు:- (పావురాన్ని చూపిస్తూ) దాన్ని వంటచెయ్యి. యివ్వాళ్ళ మనం గొప్ప విందు చేసుకొని...ఆనందంగా...

శ్రీ:- మనవాడు ఆడుకోడానికైనా మిగిలిందదేగా? అంతకంటే మనకు బంధువు లెవరున్నారు చెప్పండి?

పు:- మరి ఇకమిగిలింది ఒక్కటే గదా! అవు. ఈ అవుకుగూడా చంపితే, అప్పుడు పాపకు పాలో? అప్పుడు వాణ్ణి ఎలా పోషిస్తాం? (ప్రాధేయ పడుతూ) నాకాకలౌతుంది శ్రీమతీ! ఐతే నేనిట్లా ఆకలితో అలమటించి చనిపోతే అప్పుడు ని కళ్ళు చల్లబడతాయా?

శ్రీ:- (జాలిగా) నాకుమాత్రం ఆకలిగా లేదూ? పడేపదే చెపితే మీరు బాధ పడతారేమోనని చెప్పలేదు. (కన్నీరొలుకుతూ) కొంచమాలస్యమయినా ఏదో ఒకటి వెతికి తీసుకురాకపోయారా ? ఆరోగ్యంగావున్న జంతువొక్కటి కూడా కనపళ్ళేదా?

పు:- అసలేదీ కనపళ్ళేదు ఆ ఆవుతప్ప, దాని పాలు పిండుతూ రుచి చూశాను. మరేమిటో! ఏమిటిది? నిజమేనా? ఏమిటి కళ్ళు మసక పారుతున్నాయి? నాకేదో మగత కమ్మినట్టుంది.

శ్రీ:- లేదులెండి. పోతుందిగా. ఆకలివల్లనేమో ?

పు:- (దీనంగా వేడుకుంటూ) శ్రీమతీ! నామాట విను (ఈసారి తప్పకుండా వప్పుకుంటుందన్న నిశ్చయంతో) పోని, యిది తీసుకోవాలంటే యింకా దబ్బిస్తా! ఇంత బంగారంవుంటే పూర్వం మహాభోగమనుభవించే వాళ్ళం. తీసుకో! నువ్వే అంతా తీసుకొని దాచుకో !

(ఆమె ముఖం కోపంతో ఎర్రబడుతుంది. ద్వేషం పట్టలేక పైకి అనేస్తుంది.)

శ్రీ:- బంగారమా? తవ్వి తెచ్చుకుంటున్నారా? దాచిపెట్టుకుంటున్నారా? ఎందుకీ బంగారం? ఎవరికుద్దరిస్తుంది? ఇది మనుష్యులకు పట్టిన మహా వ్యాధి. ఇంతకంటే భయంకరమైన వ్యాధి లోకంలో ఏనాడూ రాలేదు. ఛీ, ఆ లోకపు దురాశ దుర్మార్గమంతా మీలో యింకిపోయింది. లేకపోతే ఆ నోట్లకట్టు, ఆ రివాల్వర్...

పు:- (హఠాత్తుగా నేరం బైటబడిన ముద్దాయి లాగా కంగారు పడతాడు. అతనిలో ద్వేషానలం చెలరేగింది) రివాల్వర్. ఆ రివాల్వర్ నీకు కనిపించిందా? ఆ నోట్లగట్టలు తీశావా? ఏం చేశావ్, ఎక్కడ పెట్టావ్? నావి నాకిచ్చేశెయ్.

శ్రీ:- తగలబెట్టాను. మంటపెట్టి మన పాప ప్రాణం నిలబెట్టాను.

పు:- పాప. అసలెవరు తియ్యమన్నారు నిన్ను ? ఆ డబ్బెందుకు ముట్టుకున్నావ్? అది నా ఆస్తి నా స్వంతం, అవి తగలబెట్టడానికి నీకేం హక్కుంది?

శ్రీ:- (నిర్లక్ష్యంగా నవ్వుతుంది) హక్కు. ఎవరికేం హక్కుంది? ఎవరికి హక్కులుంటే ఏం ప్రయోజనం ? యీ హక్కులు నిర్ణయించే వాళ్ళెవరు? డబ్బుట డబ్బు. మీకబ్బు మీఆస్తి మీపెన్నిధి ఈనాడు పిడికెడు మట్టితో సమానం తెలిసిందా?

పు:- శ్రీమతీ! యెంత పనిచేశావ్! ఆస్తి కోసం మనుషులెంత యాతన పడ్డారో నీకేం తెలుస్తుంది. ఆ డబ్బుకోసం మనుషులు వొళ్ళు అమ్ముకొని, మెదడమ్ముకొని, ఆఖరుకు మాన ప్రాణాలే అమ్ముకొని ప్రతికారని నీకెలా తెలుస్తుంది. ఎంతపని చేశావ్? నాకు తిండిపెట్టకపోగా నా డబ్బు కూడా కాజేస్తున్నావా? నాకు ఈనాటికి నీవే నాశత్రువైనావా?

శ్రీ:- పర్వాలేదు (లోపలికి వెళ్ళిపోతుంది)

పు:- (రహస్యంగా) నా మాట వినవూ? నిన్నింత కష్టపడి కంటిలో పాపలాగా పెంచుకున్నానే! నిన్నే ప్రాణంగా చూచుకున్నానే? మన పాప కోసమైనా నన్ను (ఆమె తనయెదుట లేదని గ్రహించి) శ్రీమతీ! ఎక్కడ? ఏం చేస్తున్నావ్? (లోపలికి వెళ్ళబోయి బల్ల తగిలి పడిపోతాడు. అతనిలో ఏదో ఆందోళన బైల్దేరుతుంది) శ్రీమతీ! నాకేమీ కనబడటం లేదు. లోకమంతా చీకట్లు కమ్మినట్టుంది. ఏదో ప్రమాదం జరిగింది శ్రీమతీ! రా! నాదగ్గరకురా! ఏదీ ఒక్కసారి పాపను చూడనీ. నన్ను పాప దగ్గరికి తీసుకుపో! నాకేదో భయంగా వుంది.

శ్రీమతీ! వస్తావా! రావా! (కోపంగా పెద్దగా కేక పెడ్తాడు) శ్రీమతీ! (ఈ లోపల రేడియో టేబిల్ దగ్గరికి వస్తాడు) శ్రీమతీ! ఏది? నా రివాల్వర్ ఎక్కడ పెట్టావ్ ? (సొరుగు తెరుస్తాడు. అతని చేతికి రివాల్వర్ తగుల్తుంది. బైటకు తీస్తాడు. ఒకానొక నిశ్చయంతో క్రూరంగా మాట్లాడుతాడు) కృతఘ్నురాలా! లోపలికి పోయి దాక్కున్నావా? నీ ప్రాణం రక్షించుకోవడానికి తాపత్రయపడుతూ పైగా నేను దుష్టుణ్ణీ దుర్మార్గుణ్ణీ నిందిస్తున్నావా? వస్తున్నా నీకు తగిన ప్రాయశ్చిత్తం చేస్తున్నా.

శ్రీ:- (ఏడుస్తూ బైటకు వస్తుంది) మన పాప. మన పాప. ఏమిటీ విపరీతం, రండి! చూడండి! మన పాప ఒళ్ళంతా పచ్చగా మారిపోయింది. కళ్లు తేలవేస్తున్నాడు. చూపు కనపడడం లేదు.

ప:- (నిర్ఘాంతపోయి) నిజమేనా? నాకు పాలు రుచి చూచినప్పటి నుంచి భయంగానే వుంది. నిజమేనా!

శ్రీ:- రండి. మీరే తాకిచూడండి. మీకు చూస్తే యేదైనా వుపాయం చూడగలరేమో?

ప:- (జాలిగా) నేను గుడ్డివాణ్ణి శ్రీమతీ! అందుకేనేమో? పాలు రుచి చూద్దం వల్లనేనేమో!నాకేం తెలుసు? క్రోవలో ఏ విషకిరణాలంటుకున్నాయో అని భయపడ్డాను. ఇంటికి రావడానికే నానాయాతన పడ్డాను. లేకపోతే వెతకనూ. నీకు నాకు తిండి వెతకడానికి నాకేం కష్టం. మన దురదృష్టం శ్రీమతీ! మన దౌర్భాగ్యం.

శ్రీ:- (ప్రాధేయపడుతూ) ఏం చెయ్యాలి. మనమేం చెయ్యాలి. బిడ్డను కాపాడే వుపాయం చెప్పండి. మీకాళ్ళు పట్టుకుంటాను. ఈ యింటి దీపం నిలబెట్టండీ.

ప:- (ఆవ్యక్తంగా తనను సంబోధించుకున్నట్లు) ప్రపంచంలో అంతా నశిస్తే కానపూపితో మిగిలివున్న తుది సంసారం యిది. ఈ కట్ట కడపటి దీపం కూడా కటిక చీకటి మింగుతుంది. నేనంధుణ్ణి. నేనేం చేస్తాను. ఒళ్ళంతా నిజంగా మారిపోయిందా? అంత లేత శరీరం

అంత చక్కని నవ్వు. అంత సుకుమారంగా పెంచుకున్నామే! నిజమేనా శ్రీమతి!

శ్రీ:- నిజమే! నిజమే! వాడి వొళ్ళెంత కాలిపోతుందో తెలుసా. ఆ పాలే వాడి ప్రాణం తీస్తున్నాయ్. యేంచేద్దాం చెప్పండి.

పు:- (గత్యంతరం లేని స్థితిలో మనస్సు కిరుడు గట్టుకపోయి నిర్దయంగా) అయితే నిజమేనా? అయితే గత్యంతరం లేదన్నమాట. నాకేం తోచడంలేదు. నాకంతా చీకటిగా వుంది. శ్రీమతీ! రా. ఒక్కక్షణం ముందు నీమీద కోపంవచ్చి నిన్ను చంపెయ్యాలనుకున్నాను. నేను జీవించాలనుకున్నాను. నిజమే. నాది స్వార్థమే! మానవుల్లో జ్ఞానం నశించి పశుత్వం మీగిలింది. ఇప్పుడు మనం మనుష్యులమో కాదో? మనకే తెలియదు. ఇదిగో ఈ నన్ను కాల్చు. తీసికో! ఇది నా ఆజ్ఞ! నేను నీ ప్రాణదాతను. నీ కర్తవ్యం నిర్ణయించా. ఇందులో ఒక్కటే వుంది. నా జీవితం అంతంచెయ్యి. (ఆమె రివాల్వర్ తీసుకుంటుంది. బయట సూర్యుడు సగం దిగిపోయాడు. భోరున తుపాను గాలి వీస్తుంది. ఉరుము మెరుపులతో భూమి కంపిస్తూంది)

శ్రీ:- మనమెందుకు కలిసి జీవించాం! ఎందుకు నడిపాం యీ సంసారాన్ని? పాపకు నయంకాదా? ఎప్పటికీ? నా ప్రాణం యిస్తాను. యేమైనా చేస్తాను. చెప్పండి. చెప్పండీ, మన బిడ్డ బ్రతకడూ?

పు:- బ్రతుకుతాడు.

శ్రీ:- అయితే మనిద్దరం జీవించవలసిందే. వాడు పెద్దవాడయితే నిండుగా, కన్నుల పండువుగా, ఈ లోకమంతా హాయిగా-

పు:- శ్రీమతీ! (కఠినంగా) మన బిడ్డ బ్రతుకుతాడు. కనీసం ఒకవారం. ఈ వారమంతా చిత్రహింస అనుభవించడానికి, మన పాపం భరించడానికి బ్రతుకుతాడు.

శ్రీ:- (గుండెపగులు ఏడుపుతో) అంతేనా? అంత లేదా ? ఈ ముఖం నేను భరించలేను. తల్లిశోకం మీకర్థంకాదు. ఇదిగో, నన్నెందుకు పెంచి పెద్దదాన్ని చేశారు? ఒద్దు ఒద్దు. మీరే బిడ్డను పోషించండి. మీరే,

మీరే సృష్టించారు. మీరే ఆశించారు. మీరే అనుభవించండి! (ఆమె లోపలికి పోబోతుంటే ఒక భయంకర యంత్రధ్వని దగ్గరగా విన వస్తుంది. ఆమె హఠాత్తుగా ఆగుతుంది. పురుషుడు గడగడలాడి పోతాడు)

పు:- శ్రీమతి! ఓ శ్రీమతి! ఏమిటది చూడు? అదేనా? అదేనా? వస్తూందా? ఎటు? ఎటు?

శ్రీ:- (ఆందోళనగా బైటకుచూసి) ఆ అదే. అదే. మృత్యుఘీరంగి. ఏమిటా ధ్వని. ఇటేఇటే వస్తుంది. మనవైపే.

పు:- నువ్వు రేకియో పలికించావా?

శ్రీ:- అదే పలికింది.

పు:- ఎంతపని చేశావ్. అదే. అదే, నన్ను హత్య చెయ్యి. లేకపోతే, ఏదీ ఆ రివాల్వర్.

శ్రీ:- ఆగండి. ఇక మన జీవితం అంతమైనట్లేనా? అదిగో వస్తుంది. అదే రేడియో ఘీరంగే... మనం ఉండి రాకమునుపే-

పు:- మన జీవితం కాదు. మానవ చరిత్రే అంతమైనట్లు. (ఆమె లోపలికి వెళుతుంది) ఇది విచిత్ర ప్రపంచం. ఇది విషాదాంత నాటకం. ఇది చరమాంకం. శ్రీమతీ! ఓహో! చివరికి నేనే మిగిలినా? కాలిలో కాలుతూ కూడా ఆశాంతను పట్టుకొని బైటకు రావాలని యాతనపడే వృద్ధుణ్ణి. అటు శిశువు ఉచ్ఛ్వాస నిశ్వాసాంతో ఆశా స్వప్నాలు వెలి బుచ్చే అమాయకమైన శిశువు. వెర్రి చిరునవ్వుల్తో భావి మానవ సౌందర్యాన్ని వెల్లడించే పసిబిడ్డ. ప్రతి రక్తనాళ స్పందనలో మానవ చరిత్రలోని శాంతి సౌఖ్యాలను జీవిత మహాసముద్ర సంగీ తాన్ని స్పందించే పసిపాప. ఓహో! శ్రీమతీ! ఈ లోకం మనకు వీడ్కోలిస్తుంది. (రివాల్వర్ పేల్చిన ధ్వని వినిపిస్తుంది. భయపడి పెద్దగా పిలుస్తాడు) శ్రీమతీ! శ్రీమతీ! ఏమిటది? ఏమిటది? ఏం చేశావ్? ఆ అబ్బా! నాచూపుతోపాటు మాటకూడా పడిపోకూడదూ? సీవు నన్నే హత్యచేయకూడదా? (పెద్దగా కేకవేస్తూ) శ్రీమతీ!

శ్రీ:- (విగ్రహం నశించినట్టు బైటికి వస్తుంది. చేతిలో రివాల్వర్ వుంటుంది) ఎందుకు పిలుస్తున్నారు?

పు:- ఏమిటది? ఏమి చేశావ్? మనపాపకోసమైనా— —

శ్రీ:- (అతికర్కశంగా అతి నెమ్మదిగా) పాప లేదు.

పు:- (నమ్మలేక) ఆ, ఏమన్నావ్?

శ్రీ:- లేదు, పాప లేదు. లేదు. ఆశ లేదు. ఇక ప్రపంచానికి భవిష్యత్తు లేదు. హు (వికృతంగా ఒక చిరునవ్వు విసిరి) ఇంకా యిక్కడే వున్నావేం?

పు:- ఎవరు? నేనా ? ఎక్కడికెళ్ళామంటావ్? యేం చెయ్యమంటావ్?

శ్రీ:- ఇంత విధ్వంసం చూసినవాడివి నీ ఆశకూడా నాశనమైన తర్వాత ఇంకా యిక్కడెందుకు? పో! బైటకుపో!

పు:- (ఆశ్చర్యంతో) వెళ్ళమంటావా నన్ను ? ఎక్కడికి? ఎందుకు ? బైటికి వెళ్ళి ఈ శ్మశానానికి కాపలా కాయమంటావా? ఎందుకూ? ఎందుకు వెళ్ళడం ?

శ్రీ:- ఈ నాటితో నీ ఆదర్శం నిరాశాగ్నిలో దగ్ధమైపోయింది. ఇక మనకీ సంసారం వద్దు. ఇన్నేళ్లూ నీ ఏంతకష్టపడినందుకు నాకు జాలి వేస్తుంది. నీ ఆశ చావదు. ఇక మనకు ఆశలేదు. వెళ్ళిపో.

పు:- శ్రీమతీ! యేమిటామాటలు? నేను వెళ్ళిపోతే ఒంటరిగా స్త్రీవి నువ్వే మౌతావ్? ఎలా బ్రతుకుతావ్? ఈ ఇల్లూ, నువ్వూ, ఇంత బంగారం, ఈ ఆస్తంతా...

శ్రీ:- ఇదే మీ జీవితానికి ముప్పు తెచ్చింది. ఇది మీ యిల్లా! మీ దురాశే. ఈ బంగారమే మీ ప్రపంచానికి పతనం తెచ్చింది. మానవ జీవితాన్ని ధ్వంసం చేసింది.

పు:- కాదు. కాదు. యిది దురాశ కాదు. మనుషులు చీమల్లాగా కూడబెట్టడమే కాదు, శ్రీమతీ, మహానాగరికతను నిర్మించారు.

శ్రీ:- ఛీ! చీమలు మనకంటే నయం. దోమలు మనకంటే నయం. మీరు వాటిసీ పొట్టన పెట్టుకున్నారు. యిది మానవుని ఆత్మహత్య.

పు:- అయితే ఆ బాధ్యత అంతా మొగవాళ్లదేనంటావా?

శ్రీ:- (లోని ఆలోచనను అవ్యక్తంగా ప్రకటిస్తున్నట్లు) తప్పకుండా, స్త్రీలు సృష్టికర్తలు, పురుషులు లయకారులు. పాపం యెవరిదైనా ఫలితం అందరూ అనుభవించాల్సిందే?

(బంగారం ముద్దతీసి విసిరేస్తుంది. అతని దృష్టిలో అంతకంటే కోప కారణం మరొకటుందదు.)

పు:- ఏమిటిది? ఈ లోకాన్ని తూలనాడుతున్నావ్. నిన్ను పోషించి పెంచి పెద్దచేసినదిందుకేనా? నా స-సారం నిలబెడతావనుకున్నా. నా సంతానం వృద్ధిచేస్తావనుకున్నాను నా వృద్ధాప్యంలో నాకు సేవలుచేసి నా ప్రతుకు సుఖంగా వెళ్ళిపోయే మార్గం చూస్తావనుకున్నాను. ఇప్పుడు నన్నే వెళ్ళిపోమంటున్నావా?

శ్రీ:- అవును.

పు:- (దిగులుగా వెళ్ళిపోతూ కుర్చీ తగిలి తూలిపడి లేచి వెళ్ళబోతాడు) శ్రీమతీ! మళ్ళీ మనం కలుసుకోలేంగదూ! ఇక లోకం ఇంతే గదూ! నా కళ్లు కనబడక పోయినా నాచెవులు వినపడక పోయినా, నా దేహం కీళ్ళు సడలి వాలిపోతున్నా...

శ్రీ:- (తనలో మళ్ళీ ఆశ అంకురిస్తుందేమోననే భయ-తో) ఎందుకు నన్ను వేధిస్తావ్. ఎందుకు మళ్ళీ మళ్ళీ తిరిగొస్తావ్?

పు:- ఎందుకేమిటి? నామాట విను శ్రీమతీ! మళ్ళీ ఒక పాప కలిగితే దాన్ని నా ప్రాణమిచ్చి పోషిస్తా!

శ్రీ:- (వెగటుగా) యింకా బిడ్డలు కావాలా?

పు:- నా మీద దయతలచవూ?

శ్రీ:- మీరే దయతలచాలి. ఇక నాకు సంతానం కలుగదు ఇది నేను కనలేనే లేను.

పు:- నిజమా! నాతో ఎన్నడూ చెప్పలేదేం?

శ్రీ:- చెపితే మీ ఆశ నశించి పోతుందని చెప్పలేదు. మీ ఆశను అంతం చెయ్యాలని యిష్టంలేకనే ఆ రహస్యం మీకు చెప్పలేదు. నాకు తెలుసు మీ ఆశ చావదు. ప్రాణం వున్నంతవరకు ఆశ చావదు.

పు:- అదే మమ్మల్నింత కాలం నడిపించిన మహాజ్యోతి. అందుకా వెళ్ళి పొమ్మంటున్నావ్? అయితే నాతోనే మానవ చరిత్ర అంతమైపోతుం దని తలుచుకొని- తెలిసి గూడా ఒంటరిగా ఆ శ్మశానంలో కాంక్ష తీరని భూతంలాగా తిరగడం ఎంత దుర్భరంగా ఉంటుందో. అదిగో దగ్గరకొస్తుంది. రేడియోగన్! నా ప్రాణం తీస్తుంది. శ్రీమతీ! ఈ సమయంలో నన్ను నిర్దాక్షిణ్యంగా గెంటేస్తావా? నీకు హృదయం లేదూ? గెంటేస్తున్నావా?

శ్రీ:- (నవ్వుతుంది) అవును. గెంటేస్తున్నానువెళ్లు. నిన్ను జీవితాన్నుంచి తరిమేస్తున్నాను. నీ భార్యనుకాదు- కాదు. నేను ప్రకృతిని మీ మానవుల వికృత ప్రవర్తనతో విసిగివేసారిన ప్రకృతిని. వెళ్లుమానవు లకు జీవించే హక్కు లేదని శాసిస్తున్నాను. వెళ్ళు మీ సంసారం, సంతానం, సంస్కృతి మీ స్వార్థానికి మారు పేర్లు ఇవన్నీ నీతోనే నశించనీ. మీ జీవితం యీ విశ్వానికే కళంకం. పోపో. వెళ్ళిపో.

పు:- నీవు నా శ్రీమతివికాదు స్త్రీవికాదు. అద్భుతమైన ప్రకృతి శక్తివి. నిత్యయవ్వనంతో జీవిస్తూ మానవుణ్ణో, జంతువునో వృక్షాన్నో సృష్టిస్తూ సత్యాన్వేషణచేస్తూ నింపుగా నిర్విరామంగా జీవిస్తూ నువ్వు ఈ క్షణంలో నాకు మూర్తీభవించిన ప్రకృతివి.

శ్రీ:- ఇప్పుడు తెలిసిందా? ఇది మీకు శిక్ష. ఇక చీమలో, తేనెటీగలో, క్రిములో ఈ భూమి నావరిస్తాయి. అవి కూడా మీలాగే వెర్రి యత్నాలుచేస్తే నశిస్తాయి. మీరు మాత్రం నిష్క్రమిస్తారు. తప్పదు.

(పంజరం తెరిచి పావురాయితో చెపుతుంది)

పో అమ్మా, నీవైనా వెళ్ళిపో నీవైనా స్వేచ్ఛగా ఆ నిర్మలాకాశంలో విహరించు మూఢాగ్నిలో నీవెందుకు భస్మమైపోతావు? (పావురాయి

సిగ్గులంగా వుంది. ఆమె అతనివంక చూస్తుంది. ఆది గూడా చని పోయింది.)

పు:- శ్రీమతీ! నీవు ప్రకృతి మాతవు! నన్ను క్షమించవూ? నీవు క్షమిస్తే అదే నా ఆత్మకు శాంతి!

(శ్రీ):- (ఏడుపుతో రెండు చేతులు ముఖానికి అడ్డం పెట్టుకొని) క్షమించ దమా! నేనా! మీద్దరినీ యీ విశ్వమే క్షమించాలి. ప్రచండశక్తి, పరమదయామయీ! ఓ విశ్వ సంసారమా! క్షమించు క్షమించు. అవును. మానవుడే. ఇదంతా మానవుని మహాపరాధం. ఆది నుండి తుది వరకూ అహంకారంతో విరగబడ్డాడు. మృగాలను వధించాడు జంతువుల్ని బానిసల్ని చేశాడు. పక్షుల్ని నేల కూల్చాడు. స్త్రీలను ఆటబొమ్మల్ని చేశాడు. ఈ భూగోళాన్నే శిశువు మాదిరిగా మృత్యు సముద్రంలో ముంచి ఉక్కిరి బిక్కిరై యేడిస్తే యిది మానవుడు చేసిన మాతృహత్య. రా అమ్మా రా. క్షణ క్షణంలోకాన్నే ఆక్రమించి ముంచెత్తే ఓ మహా మృత్యువా! అమ్మా! రా. ధగ ధగ వెలిగే ఈ శత సహస్ర నక్షత్రాలలో అద్భుత నృత్యంలో ఈ గోళం అనాధయై ఏడుస్తూ ఈడ్చుకుంటూ ప్రయాణిస్తుంది. పాపం. పాపం. పాపం. మానవుడేం పాపం చేశాడు? మానవులంతా శైశవంలో తెలియక చేసిన చిలిపి చేష్టలకు ఇంత మోతంగా శిక్షిస్తారా? ఎవరు? ఎవరు?..... దినం దినం మా యిందిని దర్శిస్తూ మా శోకంలో, సౌఖ్యంలో పాలుపంచుకున్న ఓ సూర్యుడా క్షమించు. తల్లో ల్లే మాపుల్ని చల్లని సిరిలో లాలించిన చంద్రుడా క్షమించు ప్రతి క్షణం కిన్నార్పక భూకంపంలో పెనుతుపానులో, కరవులో కదనంలో మా లోకం కాంచిన తారలారా! కిన్నిటితో లోకాన్ని పునీతం చేసిన ఓ వర్షమా! కౌగిలించి. లాలించిన ఓ వాయువా: క్షమించండి, క్షమించండి, ఈ విషాదాంత నాటకంలో చరమాంకం మాత్రమే అంతమౌంది. ఇవే మీకు మా అభినందనాలు.

(సూత్రధార పూర్తిగా దగిపోతాడు. చీకటి దట్టంగా వ్యాపిస్తుంది. తుపాకుగాళ్ళు. ఉరుములు మెరుపులతో భూమ్యాకాశాలు దద్దరిల్లుతాయి.

ఆమె తలవంచుకుంటుంది. కళ్ళు మూసుకుని పాపను ముఖానికెత్తుకొని ముద్దు పెట్టుకుంటుంది. అతను నిశ్చేష్టుడై ఆమె వంక తలెత్తి చూస్తుంటాడు. దూరంగా రేడియో ఫిరంగి ప్రేలిన శబ్దం దిగంతాలలో మార్మ్రోగుతుంది)

(మళ్ళీ అంతరాత్మల ఆక్రందన సంగీతం మార్మ్రోగుతుంది).

నరులకు శత్రువు ప్రచండ మృత్యువు.
ప్రపంచమే ఏలిచేసినవాడు.
నేలకు వాలిన నిండు ప్రాణులము
జీవం విడువని ఆంతరాత్మలం.

వినండి యిది మా పెచ్చరిక
విశ్వానికి తుది పెచ్చరిక.

మానవులారా మొలకెత్తండి.
దిశదిశలా తల యెత్తండి.
కాంతి సౌఖ్యం సౌందర్యంలో
జగతిని హాయిగ వర్ధిల్లండి.

అద్యంతాలే లేని మహాద్భుత
మానవోత్సవం సాగించండి.

నిండుగ హాయిగ జీవించండి.
నిత్యం సత్యం స్థాపించండి!

మృత్యువు మర్మం భేదించండి
యిది మీ ధర్మం జీవించండి.
వినండి ఇది మా పెచ్చరిక
విశ్వానికి తుది పెచ్చరిక.

(తెర)

వాన వెలిసింది

రచన :

ఎన్. ఆర్. నంది

పాత్రలు

వాసుదేవరావు

దొంగ

కామయ్య

ఇన్‌స్పెక్టర్

రంగాలంకరణ :- శ్రీమంతుడైన ఓ వ్యక్తి డ్రాయింగ్‌రూం. రంగానికి మధ్యగా ఓ సోఫా, దానికి రెండువైపులా రెండు చిన్న సోఫాలు. ఒక వైపున రెండు ద్వారాలు ఉంటాయి. ఒకటి వంటింట్లోకి, రెండోది బంగళా అంతర్భాగంలోనికి, మరోవైపు ద్వారం వీధిలోనికి — ఈ మూడు ద్వారాలకూ తెరలు ఉంటాయి. గోడకు ఒక ఇరవై ఏళ్ళ ప్రౌఢ తైలవర్ణ చిత్రం. గాలి వీచేటప్పుడు వీధిద్వారా తెరలు ఊగుతూ ఉంటాయి.

తెర లేచేసరికి పెద్ద సోఫాలో ఒక వ్యక్తి కూర్చొని, దినపత్రిక తిరగేస్తూ ఉంటాడు. వయసు నలభై అయిదు. కాని, ఏదో బాధ, వ్యధ, అతన్ని కృంగదీసినట్టు కనిపిస్తాడు. జీవితంలో అమూల్యమైన వాటన్నిటినీ పోగొట్టుకొని చావలేక బ్రతుకుతున్న మనిషి. ఆ నైరాశ్యం అతనికి మనశ్చాంచల్యాన్ని కలిగించింది. పరధ్యానంగా మాట్లాడుతాడు, అదీ అతిగా మాట్లాడుతాడు.

తెరలేచిన కొద్దిక్షణాలవరకూ అతను వక్కపొడి నోట్లో వేసుకుంటూ, పత్రిక చదువుకుంటూ ఉంటాడు. అంతలో వీధి ద్వారం తెరలు కొద్దిగా గాలికి ఊగుతాయి. గాలి పెచ్చుతుంది.

అతను ఒకసారి ద్వారంవైపుచూసి, మళ్ళీ పత్రిక చదవడంలో నిమగ్నుడవుతాడు. కాని, ఈసారి మెరుపుమెరిసి, గాలి పెచ్చుకావడంతో అతను పత్రిక దింపి, ఓచేత్తో కళ్ళజోడుతీసి, వంటింటివైపు చూస్తాడు. అతని పేరు వాసుదేవరావు.

వాసు:- కావఁయ్యా! (సమాధానంలేదు) కావఁయ్యా!

కావఁ:- (వంటిట్లో నుంచి) అయ్యా!

వాసు:- ఎక్కడున్నావయ్యా?

కావఁ:- ఇక్కడేనండి. ప్రమదావనంలో.

వాసు:- (ఆర్థంకాదు) ప్రమదావనం!

కావఁ:- ఆదేనండి, వనితాలోకంలో.

వాసు:- వనితాలోకం? (అర్థమయినట్టు) ఓహో! అదా! సరి సరి! భగవంతుడు నిన్ను ఆ వర్గంలోనే సృష్టించకుండా చాలా పొరపాటే చేశాడు సుమా. ఇలా రావయ్యా!

కావఁ:- (ప్రవేశిస్తాడు. వంట బ్రాహ్మడి వేషం) అయ్యా!

వాసు:- గాలివాన వస్తూంది. తలుపులు మూసేయ్.

కావఁ:- చిత్తం (తలుపులు మూసేసి, వంటిట్లోకి వెళ్ళబోతూ ఉంటాడు.)

వాసు:- కావఁయ్యా!

కావఁ:- అయ్యా! (వెనక్కి తిరుగుతాడు)

వాసు:- మూసేశావా?

కావఁ:- అయ్యా.

వాసు:- కాని, (పత్రిక పడేసి మెల్లగా చిత్రం దగ్గరికి వెళ్ళి) ఒకవేళ అమ్మాయిగాని వస్తే...

కావఁ:- (ఏ అమ్మాయో చప్పున స్ఫురణకు రాదు. కాని, వాసుదేవం మెల్లగా లేచి, తైలవర్ణ చిత్రం దగ్గరికి వెళ్ళగానే, అర్థమయినట్టు) అమ్మాయిగారా? వస్తే నేను లేనటండీ — తలుపులు తియ్యడానికి?

వాసు:- (చిత్రంవైపుచూస్తూ) కావఁయ్యా!

కావఁ:- అయ్యా! (దగ్గరగా వెడతాడు)

వాసు: అమ్మాయి వెళ్ళడం నీకు జ్ఞాపకముంది కదూ?

కావఁ:- అయ్యో! లేకేమండీ?

వాసు:- అవాళకూడా ఇలా గాలివానే! నా కసలు ఇష్టంలేదు—అమ్మాయిని నాతోబాటు తీసుకెళ్ళడానికి. కాని, తీర్థం చూస్తానని ఒకటే గోల, పాపిష్టివాడ్ని. [కంఠం వణుకుతుంది]

కావఁ:- అయ్యా!

వాసు:- [తేరుకొని] కావఁయ్యా! ఆఁ అమ్మాయి ఏ క్షణాన వచ్చినా రావచ్చు. తలుపులు తీసుంచడం మంచిదనుకుంటాను.

కావఁ:- పర్వాలేదండి! నే నున్నానుగా? అమ్మాయిగారి కంఠం ఇలా వినపడే సరికి ఆలా తలుపులు తెరిచెయ్యనూ?

వాసు:- ఉహూఁ! అప్పటికి మన మెవ్వరం ఈ గదిలో లేకపోతే? గాలివాన పెచ్చిపెరిగితే ప్రమాదంకదూ?

[తలుపులు తీసేస్తాడు. గాలి రయ్‌న కొడుతుంది. మెరుపులు కొద్దిగా పెచ్చుతాయి. ఒక్క క్షణం అలా వీధిలోకి పిచ్చిగా చూస్తాడు.]

సరే, కావఁయ్యా! ఇహ నువ్వు వెళ్ళు.

[కావఁయ్య వంటింట్లోకి వెడతాడు. మరో రెండు క్షణాలలా ఉరుములొన్ని, మెరుపులొన్ని చూస్తాడు. ఒక పెద్ద మెరుపు మెరుస్తుంది. రంగంమీద దీపాలన్నీ ఆరిపోతాయి. వాసుదేవం కంగారుగా 'కావఁయ్యా!' అని వంటింట్లోకి వెడతాడు. ఒక్క క్షణం రంగం ఖాళీ. మెరుపుల వెలుతురు తప్ప రంగం మీద ఎలాటి వెలుతురూ ఉండదు. బయట పెద్ద కోలాహలం...అది రానురానూ పెచ్చవుతుంది. చివరికి "దొంగ...దొంగ...పట్టుకోండి!" అన్న కేకలు పెచ్చుతాయి. ప్రేక్షకులనుంచి ఒక వ్యక్తి కంగారుగా రంగంమీదికి ప్రవేశిస్తాడు. మాసిన తల, మాసికల బట్టలు, చేతిలో నెక్లెస్— మెరుపు వెలుగులో కనిపిస్తూంది. రంగంమీద దొంగలా పిచ్చిగా ఇటూ, అటూ తిరుగుతాడు—దాక్కునేందుకు. చివరికి వంటింటివైపు వెళ్ళి, అక్కడ మనుష్యుల అలికిడి విని, చప్పున రంగంమీదికి వచ్చేస్తాడు)

వాసు:- [లోపలనుంచి వస్తూ] వెధవది గాలివాన ఇలావస్తేచాలు. స్కూలు కుర్రాళ్ళులా, ఈ మునిసిపల్ కరెంట్‌కూడా సెలవు పుచ్చేసుకుంటుంది. ఇక ఈ ప్రదేశ్ నాగార్జునం వస్తేనేం, రామపాదసాగరం వస్తేనేం?

[మళ్ళీ దీపాలు వెలిగాయి దొంగ చప్పున పెద్ద సోఫా వెనక్కి వెళ్ళి దాక్కుంటాడు.]

వాసు:- ఆఁ! వచ్చేశాయా! వెరీగుడ్! అర్జునుని పేరు స్మరిస్తే ఉరుములాగుతాయో—లేదోకాని, రామపాదసాగరం పదం వినిపించేసరికల్లా దీపాలెలా వెలిగిపోయాయో! (వీధి ద్వారం దగ్గరకొచ్చి, బయటకు చెయ్యిచాచి చూసి) అబ్బే! ఇంకా వర్షం పడటంలేదు. (అనుకొంటూఉండగా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేతిలో పిస్టల్‌తో ప్రవేశిస్తాడు.)

ఇన:- (రొప్పుతూ) ఈ ఇంట్లోకి ఎవరైనా వచ్చారా?

వాసు:- (అతనివైపు తేరిపార చూస్తాడు)

ఇన:- ఏవండీ, వచ్చారా?

వాసు:- ఆఁ.

ఇన.- ఎక్కడ?

వాసు:- ఇదిగో, ఇక్కడే. (అతన్నే చూపిస్తాడు)

ఇన:- హాస్యంకాదు.

వాసు - అవును హాస్యంకాదు; మీరే ప్రస్తుతం వచ్చారు.

ఇన: అదికాదు సార్... సారీ ఫర్ ది . డిస్టర్బెన్స్. ఇప్పుడే ఒకడ్ని తరుముకుంటూ వచ్చాం. వాడు ఈ ఇంట్లోనే దూరడం చూశాం. మీరుగాని చూసినట్టయితే—

వాసు: మిమ్మల్ని తప్ప మరో ద్విపాదజీవ మేదీ చూసెరగను మహాశయా! ఇంతకీ ఆ మనిషెవరు?

ఇన:- దొంగ! నిన్నరాత్రి చైర్మన్ చంగయ్యగారింట్లో దొంగతనం చేసి, ఆయన్ని చంపడానికి ప్రయత్నంచేసి పరారై పోయాడు.

వాసు:- దొంగతనం నిన్న జరిగితే,దర్జాపుత్త ఇవాళ చేస్తున్నారా? బాగుంది— బాగుంది! ఏదో సామెత చెప్పినట్టు— (ఇన్‌స్పెక్టర్ ఏదో చెప్పబోతూ ఉంటే) ఇంతకీ, ఇప్పుడు మీరు తరుముకొచ్చిన మనిషెవరు?

ఇన:- వాడే— దొంగండి. ఇవాళ బజార్లో వాడు నెక్లెస్ ఆమ్మబోతూ ఉంటే, మా పోలీసులు కనిపెట్టి...

(సోఫా పక్కనున్న వ్యక్తి ఉలిక్కిపడి, చేతిలోని నెక్లెస్‌ను చప్పున జేబులో వేసుకుంటాడు.)

వాసు:- అక్కడే పట్టుకోలేక తరమడం ప్రారంభించారన్నమాట ! మర్చా ! పోలీస్ ఉద్యోగానికి స్పోర్ట్స్‌లో ఎఫిషియెన్సీ ఒక అడిషనల్ క్వాలిఫికేషన్‌గా?

ఇన:- అదికాదుసార్ !

వాసు:- ఏదికాదు? పోలీస్‌వాళ్ళతో ఉన్న పెద్ద చెక్కే ఇది. దొంగల్ని పట్టుకోమని ఉద్యోగమిస్తే రోడ్‌మీద రన్నింగ్ రేస్ చూపిస్తారు. సైకిల్‌కి లైట్ లేకపోతే, పూజారి దక్షిణకు చెయ్యి చాచినట్టు ఎదం చెయ్యి; దొంగ సారాకేసుకి కుడిచెయ్యి చాస్తారు.

ఇన:- (కోపాన్ని దిగమింగుకుంటూ) ఎక్స్‌క్యూజ్‌మి సార్! మీరు అతిగా మాట్లాడేస్తున్నారు... మరి మేం వస్తాం.

వాసు:- అహ! పోలీస్ శాఖవాళ్ళు వట్టి చేతుల్తో తిరిగి పోకూడదు. రండి. (వాసుదేవం అతని చెయ్యిపట్టుకొని తీసుకెళ్ళి సోఫాలో కూచో బెడతాడు.)

వాసు:- కావఁయ్యా! (కేక వేస్తూ)

కావ:-ఁ (వచ్చి) ఆయ్యా!

వాసు: చూడు! ఇన్‌స్పెక్టర్‌గా రొచ్చారు! రెండు కప్పులు కాఫీ తీసుకురా.

(ఇన్‌స్పెక్టర్ కంగారుపడతాడు)

కావఁ:- చిత్తం.

(ఇన్‌స్పెక్టర్ స్థిమిత పడతాడు. కావఁయ్యా వెడతాడు.)

వాసు:- ఇప్పుడు చెప్పవయ్యా ఏంగ్గా..... చైర్మన్ చంగయ్యగారింట్లో నిన్నను దొంగతనం జరిగింది! గుడ్. ఈవాళ దొంగ, బజార్లో నెక్లెస్ అమ్ముతూవుండగా మీరు చూడటం జరిగింది. వెరీగుడ్. అతన్ని మీరు పట్టుకోబోతే అతను తప్పించుకు పారిపోవడం జరిగింది. బేడ్‌లక్... అతను మీకంటే గొప్ప స్పోర్ట్స్‌మన్‌లా ఉన్నాడు. దొరికితే ఒక్కసారి అతన్ని ఇక్కడికి తీసుకురండి. సన్మానం చెయ్యాలి. చూశారూ, నాకు స్పోర్ట్స్ అంటే మహాపిచ్చి.

ఇన:- ఇది పరిహాసాలకు సమయం కాదు.

వాసు:- సారీ! పరిహాసాలు మానేసి అసలు విషయానికి వద్దాం. ఏమయింది? దొంగతనం జరిగింది. అయితే, సదరు దొంగకు ఆ యింట్లో దొంగతనం చేయాల్సిన అవసరం ఎందుకు కలిగింది? ఆ దుర్బుద్ధి వాడికి కొత్తగా కలిగిందా, లేక ఎప్పటినుంచో ఉందా? అలా అయితే,

వాడు దొంగతనం చేయాల్సిన కారణాలేమై ఉంటాయి? దొంగతనం చేయడానికి వెళ్ళినవాడు హత్య చేయడాని కెందుకు పూనుకున్నాడు?

ఇన:- (విసుగెత్తి) అయ్యా, వాసుదేవంగారూ! తమరు వకీలు కాబట్టి ఇలాంటి ప్రశ్నలు వేస్తున్నారు. కాని, నేను పోలీస్ ఉద్యోగిని కాబట్టి నా ధర్మం కేవలం ఆ నేరానికి కారకులైనవారిని వెదికి బంధించడం- కాని, ఇవన్నీ యోచించడం కాదు.

వాసు:- అవునవును మరిచాను. నువ్వు పోలీస్ వికదూ? (సవ్వి) ఏదో, పాతికేళ్ళనుంచి అలవాటుపడ్డ ప్రాణంకదూ, నాయనా? పొరపాటున హత్యమాట విన్నా, చోరీ మాటవిన్నా లక్ష యక్ష ప్రశ్నలు వేయడం ఆలవాటై పోయింది. అంతెందుకు? (బాధగా) ఒక పుష్కరం క్రితం మా అమ్మాయి (చిత్రం దగ్గిరకి వెడతాడు) కోటిలింగాల తీర్థంలో తప్పిపోయినప్పుడూ ఇలాంటి ప్రశ్నలే వేశాను — నా మనస్సుని.

ఇన:- [లేచి, చిత్రం దగ్గిరకి వచ్చి] ఓ అమ్మాయి తప్పిపోయిందా?

వాసు:- [కంగారుపడి కోపంగా] ఎవరన్నారు. తప్పిపోయిందని? తీర్థాల్లో తప్పిపోయేంత అమాయకురాలేంకాదు, మా అమ్మాయి. ఇదిగో చూడు! ఈ చిత్రం మా అమ్మాయిదే. ప్రస్తుతం విశాఖలో మెడిసన్ చదువుతోంది. ఫైనలియర్ అయిపోయింది, ఈవేళో-రేపో రావచ్చు. ఆసలు ఇప్పుడే వచ్చేసినా వచ్చెయ్యొచ్చు. అందుకే గాభరాన వస్తున్నా — తలుపులు తీసివుంచాను. (ఇన్‌స్పెక్టర్ చిత్రంవైపు చూస్తూ వుంటాడు) అబ్బాయ్!

ఇన:- (ఉలిక్కిపడి) ఏవండి?

వాసు:- ఏం చదువుకున్నావు?

ఇన:- ఆనర్స్.

వాసు:- అయితే, అబ్బాయ్.

ఇన:- అయ్యా!

వాసు:- మా అమ్మాయి ఎలా వుందంటావ్?

ఇ:- (కొంత సిగ్గు) ఆమె కేముంది? చాలా బావుంది.

వాసు:- అయితే, పెళ్ళి చేసుకుంటావా?

ఇన: (కంగారు పడతాడు) నే...వా...డి?

వాసు:- నువ్వేనయ్యా! అమ్మాయి రూపంలో ఎంత సౌందర్యరాళో, గుణంలో కూడా అంతే! చదువా! నీకు ఇంతకు పూర్వమే చెప్పాను. ఎమ్. బి., బి. ఎన్. పాసయిందని.

ఇన:- అయ్యా, వాసుదేవంగారూ!

వాసు:- నువ్వు మధ్యలో ఆపకయ్యా, ఏను. మా వంశమా? రామజోస్యుల వారంటే తెలీని ఆంధ్రుడుండడు. ఈ ప్రదేశ్‌లో సంస్కృతి, సభ్యత, గౌరవ మర్యాదలుకల కొద్ది కుటుంబాల్లో మాది మొదటిది.

కావ:- [రెండు కప్పులతో ప్రవేశం] అయ్యా, కాఫీ!

వాసు:- ఇలా టేబిల్‌మీద పెట్టు.

కావ:- [టేబిల్‌మీద పెట్టి వెడతాడు.]

వాసు:- రావయ్యా అల్లుడూ! కాఫీ సేవిద్దాం.

[ఇద్దరూ వెళ్ళి సోఫాల్లో కూచొని, కప్పులు తీసుకుంటారు.]

వాసు:- నా తదనంతరం నాఆస్తి కంతటికీ వారసురాలు అమ్మాయే! అందువల్ల ఆ ఆస్తి ఆమెను వివాహం చేసుకున్నవారికి చెందుతుంది. నా ఆస్తి ఎంత ఉందనుకున్నావ్? [ఒక గుటక కాఫీ] ప్లీడరీ చేసి నాలుగు 'ల' కారాలు సంపాయించాను— ఫోర్ లాక్స్! [మరో గుటక] అదికాక స్థిరాస్థి ఈ ఇల్లు మరో 'ల' కారం చేస్తుంది. ఓన్‌మోర్ లాక్! [ఇంకో గుటక] పీటికితోడు ఈ జిల్లాలో నా పేర వందెకరాల మాగాణి. [ఇన్‌స్పెక్టర్ కళ్ళు తేలేసి గుటకవేసి ఉక్కిరి బిక్కిరైపోయి, కాఫీ తాగకుండానే టేబిల్‌మీద ఉంచేస్తాడు.]

వాసు:- అదేవిటయ్యా, కాఫీ తాగకుండా అలా దిగబెట్టేశావ్?

ఇన:- [మాట వినిపించుకోకుండా లేచిపోయి] వస్తానండి.

వాసు:- (కాఫీ కప్పు టేబిల్ మీద పెట్టేసి, లేచిపోతూ) ఇంత త్వరగా ?

ఇన:- (బయటకు పోతూ) ఇహ భరించలేనండి

(చమటపట్టిన ముఖం తుడుచుకొంటాడు)

వాసు:- పర్వాలేదు... ఆ ఆస్తి నీకు రాయనులే; అమ్మాయిని పెళ్ళాడు.

ఇన:- వద్దుసార్; వద్దండి.

వాసు:- పోనీ, అమ్మాయిని కూడా చేసుకోవద్దులే! కాఫీ తాగు.

ఇన:- ఆకలిగా లేదండి.

వాసు:- పోనీ, కాఫీ తాగొద్దు, నీ దొంగను పట్టుకునేందుకు ఇల్లంతావెతుకో.

ఇన:- వద్దండి, బయటే ఉంటాను. వాడీ ఇంట్లో ఉంటే గింటే—బయటకు ఎప్పటికైనా వస్తాడు. అప్పుడే పట్టుకుంటా. వస్తా. గుడ్‌నైట్ సార్!
(నిష్క్రమణ.)

వాసు:- గుడ్‌నైట్! వెర్రిపిల్లాడు 'ల' కారం చెవినిపడగానే గుండె బేజారెత్తి పోయిన మనిషి ఇహ ప్రభుత్వకార్యాలయాల్లో ఎలా పనిచేస్తాడో?... కావఁయ్యా! (వంటింటివైపు వెడతాడు)

కావఁ:- (లోపల్నుంచే) అయ్యా...

వాసు:- చూడూ! వర్షం ఇంకా పడడంలేదు. ఇలాంటి సమయంలో వేడి వేడి పకోడీలు తింటే బావుంటుందయ్యా.

కావఁ:- (లోపలే) చిత్తం.

వాసు:- కాస్త ఉల్లిపాయలు ఎక్కువ వెయ్యి.

(ఈ సంభాషణ అవుతున్నప్పుడు, సోఫా వెనుక దాగున్నదొంగ మెల్లగా లేస్తాడు. అంతలో ఉరు మురుముతుంది. వెనక్కి తిరుగుతాడు వాసుదేవం. దొంగ మళ్ళీ సోఫా పక్కకి నక్కిపోతాడు. వాసుదేవం మెల్లగా వెనక్కివచ్చి పెద్ద సోఫాలో కూచొని, పత్రిక తీసుకుంటాడు. ఇదే సమయమని దొంగలేచి, బయటకు వెడతాడు. కాని, బయట వీధిలో ఇన్‌స్పెక్టర్ని చూసి, మళ్ళీ వెనక్కి కంగారుగా పరుగు పీడికి వచ్చేస్తాడు, సోఫా వెనక్కి నక్కిపోవాలనుకొంటుం

(దగ్గు ఉక్కుళ్ళు ఎక్కువౌతుంది. వాసుదేవం పెరక్కి తల తిప్పి చూస్తాడు.)

వాసు:- ఎవడ్రా?...ఎవరది?

రాం:- (తడబడుతూ) నే...నే—నండి...

వాసు:- నువ్వే! ఎవరు? ఎవరు కావాలి?

రాం:- అబ్బే! ఎవరూ, ఎవరూ...

వాసు:- ఓహో! గాలివాన వస్తుందేమోనని వచ్చావా?

రాం:- అవును...అంతేనండి.

వాసు:- రా అయితే, ఇలా వచ్చి ఈ కాఫీ తీసుకో!

[ఇన్ స్పెక్టర్ వదలిపోయిన కాఫీ చూపిస్తాడు.]

రాం:- అబ్బే! వద్దండి.

వాసు:- ఫర్వాలేదు తీసుకో?...ఇంతకుముందొక పోలీస్ ఇన్ స్పెక్టర్ వచ్చాడు అతనికిస్తే తాగకుండా పోయాడు (లేచి, దొంగ దగ్గరగా వస్తాడు అదేమిటబ్బాయ్, ఇలా గుడ్లు మిటకరించి చూస్తావ్?

రాం:- అబ్బే! ఏం లేదండి.

వాసు:- ఏం అబ్బాయ్, వాలకం అలావుంది?

రాం:- అబ్బే! ఏం... లేదండి.

వాసు:- మాటకూడా తడబడుతోంది.

రాం:- అబ్బే! లేదండి...

వాసు:- గొంతుగ్గూడా తగ్గిపోతోంది.

రాం:- లే...లేదం...డి!

వాసు:- ఏమిటి లేదు? కొంపతీసి నీకుగాని వంట్లో బాగుండలేదా ఏం?

రాం:- అవునండి. మూడు రోజుల నుంచి జ్వరం.

వాసు:- అయ్యో పాపం! జర్వంలో ఎక్కడికి బయలుదేరావ్? (దొంగ మాట్లాడడు) డాక్టర్ దగ్గరికా?

రాం:- అవునండి.

వాసు:- కనిపించాడా? (తల త్రిప్పుతాడు దొంగ) ఇంజెక్షన్ ఇచ్చాడా, అపరేషన్ చేశాడా? లేక రెండునా?

రాం:- అబ్బే! రెండూ లేవండి. మందిచ్చాడు.

వాసు:- సీళ్ళ మందా?

రాం:- కాదండి. మంచిమందే. జ్వరం పోయిందంటే వెళ్ళానే.

వాసు:- అయితే, అతను డాక్టరయి ఉండడు...సరే! ఇలావచ్చి కూచో. [సోఫాలో కూచుంటాడు. దొంగ కూచోడు. భయంగా పిరివైపు చూస్తుంటాడు.] అబ్బాయ్! ఎంతవరకు చదువుకున్నావు?

రాం:- అబ్బే! లేదండి, అసలు చదువే రావండి.

వాసు:- అసలు చదువేం రాదా? ఇంకేం నీవు ముఖ్యమంత్రి అయేంత క్వాలిఫికేషన్ ఉంది. నాకు మంత్రులందే దాలా ఇష్టం సుమా!

రాం:- మేం మంత్రులం కాదండి, కాపులం.

వాసు:- మరీ మంచిది. మీ భుజాంమీదే భారతదేశం— ముఖ్యంగా ఆంధ్ర దేశం ఆధారపడిఉంది. నాకు వందెకరాల మాగాణి ఉంది. సేద్యం చెయ్యగలవా?

రాం:- మాకు సేద్యం రాదండి. మేం చాలాకాలంగా పట్నంలోనే స్థిరపడిపోయాం.

వాసు:- దేశద్రోహీ! ఇంకా పారిశ్రామికంగా ఈ రాష్ట్రం వృద్ధికాకముందే దేశానికి వెన్నెముకైన పల్లెపట్టుల్ని విడిచిపెట్టేస్తున్నావుంటే, నువ్వు ఇహ— ఊఁ— సర్లే— ఇక్కడ నువ్వేం పనిచేస్తున్నావ్?

రాం:- ఏం లేదండి.

వాసు:- అంటే? ఏం లేకపోవడంకూడా ఒక పనా? సరే— ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్‌లో పేరు నమోదు చేయించుకున్నావా?

రాం:- లేదండి.

వాసు:- పోనీ, పూర్వజన్మలో నైనా చేయించుకున్నావా? అలంకారాలే? వెరీ గుడ్! నువ్వు చాలా బుద్ధిమంతుడవైన పౌరుడిలా ఉన్నావ్, మరినీకెలా గడుస్తోంది?

రాం:- మా నాన్న పని చేస్తున్నాడండి.

వాసు:- ఆయన పనిచేస్తుంటే నీకెలా? హోమ్ మినిస్ట్రీ అంతా డిక్టేటర్‌లాంటి మీ నాన్న చేతిలో ఉంటే, నీ చేతిలో డబ్బెలా ఆడుతుంది? ఫర్నాలే దంటావా? ఆ జేబులూ, ఆ కరిణలూ వదిలేస్తానంటావా? వెరీగుడ్! ...ఆఁ మీ ఇంట్లో జనాభా ఎంత?

రాం:- నేనూ, మా నాన్న, మా అమ్మా, మా చెల్లాయీ.

వాసు:- ఒక్కరేనా?

రాం:- అవునండి.

వాసు:- బ్రతికావ్... ఆ చెల్లెలికి పెళ్ళయిందా?

రాం:- లేదండి.

వాసు:- చచ్చావ్...పోనీ, నీకు పెళ్ళయిందా?

రాం:- లేదండి.

వాసు:- అయితే, చచ్చి బ్రతికావ్. నీకొచ్చే కట్నంతో ఆడేదో లేదనిపించెయ్యవచ్చులే... సరే? పెళ్ళి చేసుకుంటావా?

రాం:- (కొంత వింత, కొంత సిగ్గుతో చూస్తాడు)

వాసు:- ఓస్! సిగ్గు. సర్లే- చేసుకోవచ్చులే! ఆలా చూడు [చిత్రం చూపిస్తూ] మా అమ్మాయి...అందంగా ఉంది కదూ? ఒక్కతే కూతురు. విశాఖ పట్నంలో ఉంది— ఆసుపత్రిలో ... పిచ్చాసుపత్రిలో కాదు— డాక్టర్ చదువుతోంది. ఇంకా వివాహం కాలేదు. చూడు, ఎంతయినా తండ్రిని కాదూ? ఆరేడు లక్షలు ఆస్తిఉందేనేం, అమ్మాయి పెళ్ళి చేయాల్సి వచ్చేటప్పటికి నేనూ మామూలు మనిషిలానే బేజారెత్తి పోతున్నాను. ఆఁ- అన్నట్లు నీ పేరేమిటి?

రాం:- రాంబాబు సార్!

వాసు:- ఏమిటి? రాముడికి బాబువా? [నవ్వు] నువ్వు చాల మంచివాడిలా కని పిస్తున్నావ్... ... 'ఆఁ చూడూ, అమ్మాయికి ఎన్నో సంబంధాలు చూస్తున్నాను. ఎక్కడా కుదరడంలేదు. ఇందాక ఒక పోలీస్ ఇన్ స్పెక్టర్ వచ్చాడ. ఆనర్స్ చదివాడట! బాగుందన కున్నాను. అడిగాను –అమ్మాయిని చేసుకుంటావా అని. చేసుకోవాలని ఉందనుకుంటాను; ఆశగా చూశాడు. పెదవులు తడుపుకున్నాడ. కాని, నా ఆస్తిమాట వినేసరికి గుండె బేజారెత్తిపోయి, అదే పరుగు లంకించుకున్నాడు. దబ్బుంటే చూడు ఆతనికి ఎంత భయమో! సరే, నీకు దబ్బుంటే భయమేనా ? (ఇంతసేపూ రాంబాబు భయంగా వీధివైపు బెదురు చూపులు చూస్తూనే ఉంటాడు.)

రాం:- అవునండి (అని కాదన్నట్టు తల ఊపూతూ)

వాసు:- ఆదేమిటి? గొంతుక ఒకలా పలుకుతూఉంటే, తలొకలా తిరుగు తోంది? కొంపతీసి నీకు నరాల బలహీనత లేదుకదా?

రాం :- అబ్బే !

వాసు:- సరే, నీకు దబ్బుకావాలి. ఆగు. అమ్మాయికికూడా పెళ్ళి పూర్తవాలి. ఎం. బి. బి. యస్, చదివిందా? దానికి కనీసం ఐ.ఏ యస్. నన్నా వెదకి పట్టుకోవాలి! చూస్తున్నాను. వేస్తున్నా గాలం. చిక్కటంలే దెవ్వరూ!... నువ్వు ఒప్పుకుంటావా?

రాం:- దేనికండి?

వాసు:- మా ఇంట్లో ఉండేందుకు.

రాం:- ఎందుకు?

వాసు:- అమ్మాయి పెళ్ళయ్యేవరకూ ఆ పనీ, ఈ పనీ చేస్తూ ఉండవుగాని. పాపం, ఆ కావఁయ్యా ఒక్కడూ ఎంతకని చస్తాడు!... భయపడకులే, జీతం ఇస్తాను... ఎంత కావాలి?

రాం:- ఏమిటి బాబూ?

వాసు:- నెల జీతం?

రాం:- మీ... మీ... ఇష్టం—

వాసు:- గుడ్! బాలా మంచివాడవ్, సరే, నెలకి ఆరవై... యిష్టమేనా— బాలా? వారంలో ఒక దినం సెలవు. సంవత్సరానికి ఇరవై దినాలు ప్రివిలేజ్ లీవు. అవికాక దేశ నాయకుల బర్త్‌డేలకూ, Death డేకూ వారి దేశ పర్యటన దినాన— వెరసి మొత్తం రెండు వందల దినాలు సెలవు సాలుకి. జ్ఞాపక ముంచుకో... తర్వాత బ్రేడ్ యూనియన్లూ, గ్రేడ్ యూనియన్లూ అంటే లాభం లేదు.

రాం:- తమ ఇష్టం సార్!

వాసు- వెరీ గుడ్! అయితే, అలా అని తర్వాత రాస్తాను. వేలు ముద్ర వేద్దువుగాని...కావయ్యా!

కా.- (వస్తాడు) అయ్యా.

వాసు:- కావయ్యా! ఇతను మనకు కొత్త- (ఏమని పిలవాలో అర్థంకాక క్షణంసేపు రాంబాబుని చూపి) అబ్బాయ్! నీ పోర్ట్‌ఫోలియో ఏమని ఉంచా లంటావ్?

కా:- ఎవరు బాబూ, ఈ కుర్రాడు? (అనుమానంగా చూస్తాడు)

వాసు:- అదేనోయ్... ఏ డిజిగ్నేషన్‌తో పిలవాలా అని ఆలోచిస్తున్నాం. (క్షణం ఆలోచించి) ఆ, నీ డిజిగ్నేషన్ 'నౌర్'...ఆ కావయ్యా. ఈ అబ్బాయి మన కొత్త 'నౌర్'— తల్లి తండ్రులు పెట్టిన పేరు రాంబాబు అట!

కా:- 'నౌర్' ఏమిటి బాబూ?

వాసు:- అదేనోయ్, 'నౌకర్'. ఈ మధ్య... కొన్ని పోర్ట్‌ఫోలియో స్టాఫ్‌వారి హోదాల పేర్లు, కూలీని 'మజ్‌దూర్'గా మారుస్తున్నారుగా? అలాంటిదే ఈ అబ్బాయి మనింట్లో నౌకర్ పనిచేస్తున్నా నౌకర్'లో 'ఓ' కొట్టేసి 'నౌర్'అని పిలుద్దాం.

కా:- ఏమిటి బాబూ! ఆలోచించే చేస్తున్నారా? వాడికాలకం చూస్తూంటే పచ్చి పోకిరీలాగా, పండిన దొంగలాగా, మరిపోయిన రౌడీలా కోర్‌లాగా కనిపిస్తున్నాడు.

వాసు:- మొవట్నో నువ్వూ నా కంటికి అలానే కనిపించావయ్యా. తర్వాత కదా మారిపోయావ్?

రాం:- క్షమించండి, బాబుగారూ! నాకు మీ నౌకరీవద్దు మీ పనీ వద్దు, నా మానాన నన్ను పోనివ్వండి.

వాసు:- విన్నావటయ్యా! భర్తృహరి నుడివిన అభిమానవంతుడు నేటికి అబ్బాయిలో కనిపించాడు. ఇరవై ఏళ్ళనుంచి నువ్వూ ఉన్నావ్! ఎందుకు?...అబ్బాయ్ ఈ ఇంటికి యజమాని ఎవరు—నేను. నేను నిన్ను పిలిచి ఉద్యోగ మిస్తున్నాను.

రాం:- అవును బాబుగారూ!

వాసు:- ఆ మాత్రం గుర్తించగలిగినపుడు, నీ కతనితో పేచీయే లేదు... ఆఁ, కావఁయ్యా, ఈ అబ్బాయిని లోపలికి తీసుకువెళ్ళి స్నానం చేయించి కొత్త బట్టలూ ఆవీ-

కా:- బాబూ, బాబూ! నేను పదహారణాల బ్రాహ్మణ్ణి బాబూ!

వాసు:- నాకు తెలుసునయ్యా నీ ఆత్మకథ. నువ్వు ఒక్క అణా అయినా తక్కువ కాకుండా, పరిపూర్ణబ్రాహ్మడవు కాబట్టే, నిన్ను వంటింటికి ప్రధానమంత్రిని చేశాను.

కా:- [ఏమీ అనలేక] కాని, బాబుగారూ! ఆ కుర్రాడు మాత్రం వంటింట్లోకి రాకూడదనే ఆంక్ష విధించండి బాబూ!

వాసు:- సర్లే! చూడు, నౌర్! నువ్వు కావఁయ్యగారు చెప్పినట్టు వంటింట్లో తప్ప మిగతా గదుల్లో తిరగకూడదు.

కా:- బాబూ!

వాసు:- ఇక మీరు నిష్క్రమించండి కావఁయ్యగారూ!

[కావఁయ్య, రాంబాబువైపు కోపంగా చూసి, వంటింట్లోకి వెడతాడు. వాసుదేవం నవ్వుకుంటూ "నవ్వూ అతని వెనకాలే వెళ్ళు" అన్నట్టు రాంబాబుకి సైగ చేస్తాడు. రాంబాబు భయపడుతూనే వంటింటి వైపు వెడతాడు. కామయ్య కస్సుమంటాడు]

కా:- నా వెనకా లెక్కడికి వొచ్చేస్తున్నావ్? అలా ఆ గదిలో నుంచి పెరట్లోకి తగలడు, (రాంబాబు రెండో గదిలోకి వెళతాడు) ఖర్మరా భగవంతుడా! (అనుకుంటూ వంటింట్లోకి పోతాడు. వాసుదేవం నవ్వుకుంటాడు. చుట్ట వెలిగించి, సోఫాలో కూచుంటాడు. మెరుపు మెరుస్తుంది. పీధివైపు చూస్తాడు. నిశ్శబ్దం. ఎవరో చిన్నపిల్ల "నాన్నగారూ" అన్నట్టు వీలవుతాడ. ఉలిక్కిపడతాడు. చిత్రం వైపు చూస్తాడు. చుట్ట పారేసి, మెల్లగా లేచి చిత్రం దగ్గరికి వెళ్ళి, చాలాసేపు ఆ చిత్రాన్ని తదేక దీక్షగా చూస్తాడు. నిట్టూర్పు విడుస్తాడు. మెరుపు మెరుస్తుంది. ఇన్‌స్పెక్టర్ మళ్ళీ వస్తాడు. యూనిఫార పీద రెండు మూడు వర్షపు చినుకులు పడతాయి)

వాసు:- ఎవరు?

ఇన:- నేనండి.

వాసు:- ఓహో! ఇన్‌స్పెక్టర్‌గారా? రా, రా...కాఫీ తాగుతావా? (అతను విడిచిన కాఫీ కప్పునే చూపిస్తాడు)

ఇన:- అబ్బే, వద్దండి.

వాసు:- పోనీ, అమ్మాయిని పెళ్ళాడతావా?

ఇన:- అబ్బె—అబ్బె! (నసుగుతాడు)

వాసు:- పోనీ, ఆస్తి రాయనులే.

ఇన:- క్షమించాలి, నన్ను మీరు అర్థం చేసుకోలేకపోతున్నారు.

వాసు:- అర్థంచేసుకోలేకపోతున్నానా? వెయిట్ ఎ బిట్. నీ పేరేపిటన్నావు?

ఇన:- ప్రతాపు.

వాసు:- (పక్కనున్న షెల్ఫ్‌లోంచి నిఘంటువు తీస్తాడు) ప్రతాపం యూక్వల్ టు ధైర్యం, సాహసం, వీరత్వం ఎబ్బెటరా.....అర్థమయింది కర్థమయింది ... ... నవ్వొ ఆర్థమయ్యావు, సూర్యరాయాంధ్ర నిఘంటువులో భద్రంగా (పేజీ చూచి) 765వ పేజీలో దాక్కొని ఉంటే నాకెలా అర్థమవుతావయ్యా?

ఇన:- మీరు హాస్యబ్రహ్మలండి.

వాసు:- ఇంకేం ! బిరుదిచ్చావ్! సన్మానం చెయ్యాలిసుంటుంది. ఆఁ లెట్ అజ్ కమ్ టు ది పాయింట్...ఏవిటన్నావ్?

ఇన:- నేను ఏమీ అనలేదు. బయట వర్షం వచ్చేటట్టు ఉంది-చినుకులా కూడ పడుతూ ఉంటే—లోపలికి వచ్చాను, వర్షం తగ్గగానే వెళ్ళి పోతాను.

వాసు:- వెళ్ళిపొమ్మని నేనసనుగాని, ప్రస్తుతం ఉండమంటున్నా.
[అని వాసుదేవం లోపలికి పోతాడు. ఇన్‌స్పెక్టర్ ''థాంక్స్'' అని వంటింటికి వెళ్ళి చూసి, వచ్చి పత్రిక తీస్తాడు. ప్రకటన కాలమ్స్ చదువుతూ ఉంటాడు.]

వాసు:- (వచ్చి చూసి) 'మిస్సింగ్ కాలమ్' చదువుతున్నారు - ఎవరైనా మీవాళ్ళు తప్పిపోయారేమిటి?

ఇన:- నాకు మా వాళ్ళనేవా రెవరూ లేరు లెండి,

[భావగర్భితంగా చిత్రంవైపు చూస్తాడు]

వాసు:- అదేం? బైళ్ళలోని వాళ్ళంతా మీవాళ్ళేగా? వాళ్ళు కూడా లేరా?

ఇన:- [నవ్వుతూ] మీరు బహు చతురులండి.

వాసు:- చతురులంటే జ్ఞాపక మొచ్చింది — ఒక పట్టు చతుర్ముఖ పురాణం వేసుకుందామా?

ఇన:- అబ్బె! నాకు రాదండి.

వాసు:- నిజంగా రాదా ? లేక ఆ నీ యూసిఫామ్‌కి భయపడుతున్నావా ? పర్వాలేదు? రావయ్యా! వర్షం పడేటప్పుడు తింటే పకోడీలు తినాలి. చతుర్ముఖ పురాణమాడాలి (ముక్కలు కలుపుతూ) కమ్ ఆన్. మూడుముక్కలాట ఆడుకుందాం. అన్నిటి కంటే ఈజీ. ఆఁ విను. మూడాసులు అన్నిటికంటె పెద్ద; తదుపరి మూడు కింగ్స్; తర్వాత మూడు క్వీన్స్, తర్వాత మూడు జెన్స్, తర్వాత మూడు నైన్స్—

ఇన:- ఎక్స్‌క్యూజ్‌మి, సార్. నా కసలు పేక ముక్కలు పట్టుకోవడమే చేతకాదు.

వాసు:- చేతకాదూ? పేకార్డం చేతకాకుండా నవ్వే అనభవంతో ఆది తప్పని వాళ్ళను అరెస్టు చేస్తున్నావ్?

ఇన:- అది నా డ్యూటీ సార్.

వాసు:- డ్యూటీ! ఎస్. ఎస్...ఆది సరేగాని, ఇందాక నేనేదో ఆడిగితే, నువ్వేదో సమాధానం చెప్పావు—అది నిజమా?

ఇన:- ఏదండి?

వాసు:- ఆదేనయ్యా, నేనేదో ఆడిగాను, సరిగా జ్ఞాపకంలేదు. నువ్వేదో సమాధానం చెప్పావ్—ఆదీ జ్ఞాపకం రావడంలేదు.

ఇన:- ఏమిటై ఉంటుంది, చెప్మా; (జ్ఞాపకం తెచ్చుకొని) ఓహో! అదా?

వాసు:- ఆ...ఆ, అదే! ఏమిటది?

ఇన:- [చిత్రంవైపు చూస్తూ] మీఅమ్మాయి విషయం.

వాసు:- (చప్పున లేచిపోయి) ఏమిటి? కనిపించిందా? దొరికిందా?

ఇన:- ఎవరు, ఎవరండి? (మెరుపు, ఉరుము)

వాసు:- అనేనయ్యా, మా శారద—పద్మాలుగేళ్ళయింది కదా తప్పిపోయి? అప్పుడు ఆరేళ్ళు అమ్మాయికి...వెతికించాను; నేనూ వెతికాను. మీ వాళ్ళతో మొరెట్టుకున్నాను. పాపం, మీవాళ్ళ కీలాంటి అవాటు లేకపోయినా వెతికారు. చాలా వెతికారు. పత్రికల్లో పబ్లిష్ చేయించాను. (పెదవి విరుస్తాడు)

ఇన:- మీరంటున్నది నాకు అర్థంకావడంలేదు.

వాసు:- ఏం? తెలుగులోనే మాట్లాడుతున్నట్టున్నానే ఇప్పటివరకూ? బహుశా మీకు రాజభాషా వ్యామోహం సోకిందేమో! పోరుడికంటే ఒక మోతాదు హెచ్చయిపోయినట్టుంది — తెలుగు పిండినంటే పదార్థానం వృద్ధపు తోంది. ఆ, ఈ చిత్రం చూశావూ—మా అమ్మాయిది—ప్రస్తుతం ఇరవై ఏళ్ళ ముసలిది— ట్వెంటీ ఇయర్స్ ఓల్డ్, పద్మాలుగేళ్ళ క్రితం తప్పిపోయింది! ఫోర్టీన్ ఇయర్స్!

ఇన:- ఇందాక...విశాఖలో...ఆమె...మెడిసన్ చదువుతోందన్నారు?

వాసు:- ఎవరు ?

ఇన:- మీ అమ్మాయే,

వాసు:- మా కాకదా? విశాఖలోనా? మెడిసిన్ చదువుతోందన్నానా? (జ్ఞాపకం వచ్చింది) ఓహో! ఆఁ ఆఁ! చదువుతోందికదూ? [మెరుపు] గాలివాన వస్తోందికదా, తిరిగి వచ్చేస్తుంది. [మెరుపు ఉరుము] ఆవాళ కూడా ఇలా గాలివానే...నాకసలు ఇష్టంలేదు. అమ్మాయిని నాతో బాటు తీసుకెళ్ళడానికి. కాని, తీర్థం చూస్తానని ఒకటే గోల...తీసుకెళ్ళాను. నేను తీసుకెళ్ళాను, పాపిష్టివాణ్ణి (కంఠం వణుకుతుంది)

ఇన:- వాసుదేవంగారూ!

వాసు:- చూడుబాబూ; ఒక ఐరువంటూ తలమీద ఉన్నాక, దాని భారాన్ని ఎంత త్వరగా వదిలించుకుందామా అని ముసలివాళ్ళు పడే ఆవేదన వయస్సులో ఉన్న నీకు అవగాహన కాదు. అమ్మాయికి సంబంధాలు చూస్తున్నాను. నాకు నచ్చిన ప్రతివాళ్ళనూ అడుగుతున్నాను. కాని, ఎందుచేతనో ప్రతివాళ్ళూ నిరాకరిస్తున్నారు. నువ్వుకూడా నిరాకరించావ్...

ఇన:- నేను నిరాకరించలేదండి, మాటవరసకి అన్నాను.

వాసు:- [చిరునవ్వుతూ] నాకు తెలుసు. యువకులతో ఉన్న పెద్ద చిక్కిది. అయితే, నవ్వు నా 'లా' లో కొడుకువి—ఐమీన్, సన్-ఇన్-లా-అయేందుకు అంగీకరించావన్నమాట!

[రాంబాబు వస్తాడు. వదులైన తెల్లచొక్కా, ఖరాయి—సీటుగా ఉంటాడు. ఇన్‌స్పెక్టరు వాడ్ని చూస్తాడు. చూస్తూ అలానే ఉండిపోతాడు. రాంబాబు ఇన్‌స్పెక్టర్ని చూసి భయపడి, మళ్ళీ వచ్చినట్టే ఇట్లోకి పోబోతాడు. ఇంతలో వాసుదేవం వెనక్కి చూస్తాడు.]

వాసు:- నౌర్! [రాంబాబు ఆగుతాడు] ఇలారా [జంకుతూ వస్తాడు] యితను మా కొత్త నౌర్', బుద్ధిమంతుడిలా అగుపించాడు. పైకొచ్చే గుణమేదో ఇతనిలో ఉందని, పిలిచాను. దానికిగాను మనం కష్టమనుకోకుండా పదును పడితే, రేపు ఏ ఫాక్టరీనో ఎంబాసిడరుగానో అయిపోవచ్చు. ఏమంటావ్?

[ఇన్‌స్పెక్టరు రాంబాబు వైపు చూస్తాడు. వినిపించుకోడు వాసుదేవం మాటలు. వాసుదేవం యిద్దరివైపు, ఒకసారి చూస్తాడు.]

వాసు:- అదేమిటయ్యా, అలా చూస్తావ్?

ఇన:- అబ్బె, ఏం లేదు... ఇతను మీ యింట్లో పనిచేసే కుర్రాడా?

వాసు:- ఆఁ— ఏం అలా అడుగుతున్నావ్?

ఇన:- అబ్బె, ఏం లేదులేండి...ఏమీ లేదు.

వాసు:- ఆఁ, నౌర్. నువ్వు వెళ్ళి, కావయ్యతో చెప్పి రెండుకప్పుల కాఫీ పట్రా. ఆ, యిదిగో ఈ కాఫీ తీసుకుపో.

[ఇన్‌స్పెక్టరు తాగకుండా విడిచిపెట్టిన కాఫీ కప్పునే చూపించి, వాసుదేవం లోనికి వెళతాడు. రాంబాబు దాన్ని తీసుకోవడానికి భయంగా యిన్‌స్పెక్టరు మొహంలోకిచూస్తూ కప్పు దగ్గరికి వస్తాడు. ఇన్‌స్పెక్టరుకూడా రాంబాబు మొహాన్ని చూస్తూ కప్పు దగ్గరికి వస్తాడు. రాంబాబు గభాలున కప్పు తీసుకుని వంటింటోకి వెడతాడు వడిగా.]

వాసు:- (లోనినుండి వస్తూ) ఆ,... 'లా' లో కొడుకా! పెళ్ళి అమ్మాయి వచ్చిన తక్షణం జరిగిపోవాలి. మరి అమ్మాయి ఇష్టపడుతుందో-లేదో అని సీకు సందేహం అవసరంలేదు. ఆమె తరపున నే చెపుతున్నా.

కావ:- (రాంబాబును తీసుకొని రచ్చ వస్తూ) ఏమిటండీ ఈ అఘాయిత్యం? ఒక తడనిలేదు; మడనిలేదు. వాడెవడో తెలుసుకోకుండా మొదట నౌఖరీ యిచ్చేశారు. తర్వాత యిప్పుడు కులగోత్రాలు తెలుసుకోకుండా వంటింట్లోకి కూడా ప్రవేశింప జేస్తున్నారు. రేపు—

వాసు:- ఏమయ్యా, నౌర్! నీ కించాకి చెప్పలేదటయ్యా? వంటిల్లుతప్ప మిగతా గడప్లో తిరగటం నీకు నిషేధమని?

కావ:- బాబూ, వాసుదేవంగారూ! ఈ యింట్లో నే నెంత వంట బ్రాహ్మణుడ్నయినా యిలా జాతులూ, వర్ణాలూ తెలుసుకోకుండా అడ్డమైనవాళ్ళనందర్నీ యింట్లోకి రప్పించేస్తుంటే, నేను చూస్తూ వూరుకోలేను.

ఏదో చదువులేదు కాబట్టి నా ఎదురుగానే బ్రాహ్మణ్యం మంటకలసి పోతూవుంటే నేను సహించలేను.

ఇన:- మీ రంతలా ఆవేశపడకండి కావఁయ్యగారూ! యింతకీ ఈ అబ్బాయి ఎవరు?

కావఁ:- ఏమో బాబూ! నాకేం తెలుసు? పిలిచారు; తీసుకొచ్చారు, పనిచ్చాడు.

వాసు:- మొదట్లో ఆయన్నికూడా అలానే పిలిచి, తీసుకొచ్చి, పనిచ్చాను.

కావఁ:- అందుకే బాబూ, నాకు తగిన శాస్తి చేస్తున్నారు.

ఇన:- ఏయ్ అబ్బాయ్! యిలా రా. (రాంబాబు వణికిపోతాడు) యిలా రమ్మంటూంటే? ఎవరు నువ్వు? మాట్లాడవేం?

వాసు:- నెల జీతగాడ్నని చెప్పవయ్యా నౌకర్..., అయినా అల్లుడూ, నీ కెందుకయ్యా ఈ క్రాస్ ఎగ్జామినేషన్! వాళ్లల్లో వాళ్ళు ఎప్పుడూ ఇలానే కీచులాడుకుంటూ వుంటారు. యాచకో యాచక శ్శత్రువు.

కావఁ:- అదిగో, అదే ఎద్దంటూంట! నేను యాచకుణ్ణా? నేను, ఈ జంధ్యా పోగు వేసుకున్న బ్రాహ్మడిప్పుడాన్ని, నేనా యాచకుణ్ణి? వాడూ (రాంబాబుని చూపిస్తూ) యాచకుడు. యాచక నిర్వచనానికి వాడు తగిన ఉదాహరణ—

వాసు:- అబ్బ! అంతలా ఆవేశపడకండి, కావఁశాస్త్రిగారూ! ఆ పిలకా, ఆ యజ్ఞోపవీతం, ఆ గాపంచా, ఆ విభూతిబొట్టూ మీ యాచకత్వాన్ని సూపిస్తాయని లోకం నమ్మొద్దటండీ? ఒకవేళ నమ్మితే, అది నా తప్పుకాదు... ఇసలీ గొడవంతా వాడిమూలాన కదూ వచ్చింది? నౌకర్! నువ్వా యింట్లోకిపో... (రాంబాబు పోవును) సరే, యిహ తమరా ప్రమాదవనంలోకి నిష్క్రమించండి.

కావఁ:- యాచకుణ్ణట, యాచకుణ్ణి! [గొణుక్కుంటూ వంటింట్లోకి వెళతాడు.]

వాసు:- పిచ్చి బ్రాహ్మడు! మూ కావఁయ్యా ఏ పరిషత్తులోనూ నటించడు గాని, నటిస్తే ఉత్తమ హాస్యనట శేఖర బిరుదు లగిలించవచ్చయ్యా?

ఇన:- ఆ అబ్బాయి మీ యింట్లో ఎంతకాలంగా పనిచేస్తున్నాడు?

వాసు:- ఏ అబ్బాయి, నౌకా. చాలా సేపటినుంచి పనిచేస్తున్నాడు

ఇన:- ఏ పనులు చేస్తుంటాడు సాధారణంగా?

వాసు:- వంట పనులు తప్ప ఇుగతా పనులు చేయవలసి ఉండదు— యింకా సరిగా ప్రోగ్రామ్ ఫిక్స్‌డ్ చెయ్యలేదనకో. ఏమిటి కథ, అంత తీక్షణంగా అడుగుతున్నావ్ వాడిగురించి? కొంపతీసి వాడిమీద ఏ చోరీ నేరమూ మోపవు కదా?

ఇన:- అబ్బే! అదేం లేదులెండి. (రాంబాబు వెళ్ళిన గదిలో ఏదో పడిన శబ్దం) ఆ గదిలో ఏదో చప్పుడవుతోంది!

వాసు:- ఏ గదిలో?

ఇన:- అదేసండి వాడు దూరిన గదిలో.

వాసు:- నౌర్ స్వగతంలో కావయ్య అన్న మాటలకు విచారిస్తున్నట్టున్నాడు... కుర్చీలు, బెంచీలు సానుభూతి చూపిస్తున్నాయి. రండి పోయి చూసివద్దాం.

[ఆ గదిలోకి 'నౌర్' అనుకుంటూ వెడతాడు. ఇన్‌స్పెక్టరు అతనితోబాటే వెడతాడు. కాని, ద్వారం దగ్గిరకి వెళ్ళగానే ఏదో ఉపాయం తోచినట్టు, వాసుదేవం ఆ గదిలోకి వెళ్ళగానే వందింది వైపు వెళ్ళి, కావయ్యని పిలుస్తాడు.]

ఇన:- కావయ్యగారూ! కావయ్యగారూ!

కా:- (వస్తాడు) ఏమిటండీ-: ఇంకా కాఫీ తయారుకాలేదు బాబూ..... మరోక్షణం కూర్చోండి మరగేసి ఇస్తాను.

ఇన:- మీ కాఫీ బంగారంగానూ, కాఫీ గురించి కాదయ్యా మిమ్మల్నిప్పుడు పిలిచింది. మాట— యిలా రండి. (కావయ్య దగ్గరగా వస్తాడు) ఆ కుర్రాడు ఎవరు?

కావ:- ఏమో— నాకేం తెలుస్తుంది— చెప్పండి? బాబూ, ఆడ్డమైన వాళ్ళ కంతా ఈ కొంప ధర్మసత్రమైపోయింది. గుంటూరులో ఉన్నప్పుడు ఎంత కరెక్ట్‌గా ఉండేది! ఇప్పుడదంతా పోయింది. అమ్మగారితోనే... ఒక అప్రాచ్యు దొస్తాడు— వాడికి కాఫీ తగలెట్టాలి. ఏరో లేకివా

డెవడో వస్తాడు. వాడికి ఉద్యోగమిస్తారు. మరో అనామకు డెవడో వస్తాడు. వాడికి (చిత్రంచూపిస్తూ)ఆ అమ్మాయిని అంటగడతారు. మరి ఆ వచ్చేవాళ్ళ పిచ్చివాళ్ళో, లేక ఈ మాట్లాడే వకీలుగారే పిచ్చివారో తేల్చుకోలేక మధ్య నేను పిచ్చివాడ్నయిపోతున్నాను బాబూ! మీరు పోలీసు మనిషిలా అగుపిస్తున్నారు. ఎంతో పుణ్యం చేసుకొని పుట్టి వుంటారు. ఆ ఉద్యోగం దొరికింది. దొరికిన ఆ ఉద్యోగ మోదాతో మమ్మల్ని వేధించకండి, మహాశయా! నా మానాన నన్నిలా ఆ ప్రమాదవనంలో పిండివంటలు చేసుకోనివ్వండి.

ఇన:- నన్ను అపార్థం చేసుకొంటున్నట్టున్నారు. కామశాస్త్రిగారూ! నేను అడుగుతున్నది ఆ కుర్రాడి గురించి– యిందాక ఒక దొంగను తరుముకొచ్చాం.

కావ:- దొంగనా ?

ఇన:- వాడు దొంగే కాదు; ఖూనీ చెయ్యబోయాడు కూడా!

కావ:- ఖూనీయే! ఖు—ఖు—ఖూనీ...

ఇన:- సమయానికి మేము కనిపెట్టి వాడ్ని తరుముకొచ్చాం.....వాడీ యిట్టో దూరడం స్వయంగా చూశాం.

కావ:- ఈ యిట్లోనే?...దొంగే!

ఇన:- మీరు భయపడకండి, శాస్త్రిగారూ! నా దగ్గర పిస్తోలుంది.

కావ:- ఆ పిస్తోలు మిమ్మల్ని రక్షిస్తుంది. కాని, మమ్మల్ని రక్షించదు... బాబూ! పోలీసుబాబూ! మీకు పుణ్యం ఉంటుంది. వెంటనే ఇల్లంతా గాలించండి బాబూ! ఆ దొంగ యిహ నీకొంపలో ఏం దోచుకు పోతాడో—ఎంతర్ని ఖూనీ చేయపోతాడో!

ఇన:- భయపడకండి, కావ్యయ్యగారూ! మీరు నాకు చిన్న సహాయం చేసి పెడితే, దొంగ యిట్టే దొరికిపోతాడు.

కావ:- ఏమిటి త్వరగా చెప్పండి బాబూ! గొంతు కెండిపోతోంది.

ఇన:- ఆ కుర్రాడెవరు?

కావ:- నాకు తెలీదుబాబూ! ఆయన పిలిచాడు; ఉద్యోగమిచ్చాడు.

ఇన:- ఎప్పటినుంచి పనిచేస్తున్నా డీ యింట్లో?

కావ:- నాకు తెలిసినంతవరకూ, వాడు ఈ క్షణంనుంచే పనిచేస్తున్నాడు.

ఇన:- ఈ క్షణంనుంచా? అంటే ఈవేళ క్రొత్తగా చేరాడనా మీ ఉద్దేశం?

కావ:- చేరడమేమిటి బాబూ! ఎవడో దారినపోయే దానయ్యను ఈయన పిలిచి ఉంటాడు. ఇహనేం, మా దానకర్ణయ్య ఉద్యోగం యిచ్చేశారు!

ఇన:- వా డిక్కడికి వచ్చినప్పుడు బికారిలా ఉన్నాడా?

కావ:- ఆ, అంతకంటే ఘోరంగానే ఉన్నాడు. చిరిగిన దుస్తులు, యిప్పుడంటే ఆ గుడ్డలు కట్టుకొని టింగురంగాలా...

ఇన:- ఓ! ఐసీ! వాసుదేవంగారికి వాడి విషయం తెలుసా?

కావ:- తెలిసుండదు బాబూ, తెలిసుండదు. ఆయనకు ఒకళ్ళ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలనే తాపత్రయం ఎప్పుడూ లేదు. పిలుస్తారు, ఏదో అంటారు. అమ్మాయి చిత్రం చూపిస్తారు. బాగుందా అంటారు. పెళ్ళాడతావా అంటారు. ఆ వచ్చినవాడు ఆ చిత్రంలోని అమ్మాయి అందానికీ, ఈయన డబ్బుకీ లొంగిపోయి పెదవులు తడుపుకొంటాడు. ఎగిరి గంతేస్తాడు. అలా వాళ్ళ కుప్పిగంతులు చూసి ఆనందించడం ఆయనకో సరదా!

ఇన:- [బెదరి] అంటే....., వాసుదేవంగారు అమ్మాయి ఫోటోను చూపించి, కుర్రాళ్ళను ఏడిపిస్తుంటారంటారా?

కావ:- కుర్రాళ్ళనే మాటేమిటి? మొన్న శతవృద్ధు డొకడు తప్పిజారీ యింటికొస్తే, ఆయనకా ఫోటో ఆశా, తన ఆరేడు లక్షల ఆశా చూపించి, ప్రధానం చేసేసి, ఆప్పటికప్పుడు పెళ్ళి సరంజామా అంతా తయారుచేయించేసి, తీరా ఆ ముసలాడు పీటలమీదకూచునే సరికి, ఆ ఫోటోను తీసుకొచ్చి ఆయన్ని మంగళసూత్రం కట్టమన్నారు.

ఇన:- అయన ఉద్దేశమేమిటి అలా చెయ్యడంలో ?

కా:- ఉద్దేశం? ఆ ముసలాడి ఉద్దేశ మేమిటి, ఆయన పిచ్చి మాటలు నమ్మి పెళ్ళిపిటలమీద కూచోడంలో? [యిన్‌స్పెక్టర్‌కి అర్థంకాదు; ఫోటో వైపు చూస్తాడు.] వాసుదేవం బాబుగారు గొప్ప చిత్రకారులు బాబూ! ఆయన భార్య గుంటూరులో పోయిన దగ్గరనుంచీ కూడా ఆయన అదోలా మారిపోయారు. పిచ్చి పిచ్చిగా ఎవేవో మాట్లాడతారు; ఏవేవో బొమ్మలు వేస్తారు, అన్నీ ఒకేలాగున ఉంటాయి. అన్నీ ఆ అమ్మాయి చిత్రాలే, వాటిని వచ్చిన వాళ్లందరికీ చూపిస్తారు.

ఇన:- ఇంతకీ, ఆ ఫోటో ఆ అమ్మాయిది కాదంటావా ?

కా:- అహఁ! వారి అమ్మాయిదే నని వాసుదేవంబాబుగారి ఊహ. ప్రస్తుతం ఆమె అలానే ఉండేదని వారి భావం.

ఇన:- ఆమె విశాఖలో డాక్టరీ చదువుతోందన్నారు?

కా:- ఓహో! మీకుకూడా చెప్పారన్నమాట! బాగుంది. బాగుంది! అయితే, పెళ్ళాడేందుకు మీ రొప్పుకున్నారా ? ఆహఁ— ఎందు కొప్పుకోర్లెండి అందం; డబ్బా—

ఇన:- అబ్బే? అదేం లేదులెండి... మీరు నిజం చెప్పండి ఆమె నిజంగా విశాఖలో ఉందా?

కా:- ఉండాలనేది బాబుగారి ఆశ. ఆమెను డాక్టర్ని చదివించి, ఎక్కడో సీమలకు పంపించి పెద్ద చదువులు చదివించాలని వారి ఆశయం. [లోన దగ్గు] కాని, పాపం— [ఆగిపోతాడు]

ఇన:- కాని, ఏమిటి కావయ్యగారూ ?

కా:- అదిగో— బాబుగారొస్తున్నారు !

వాసు:- [వస్తూ] అల్లుడూ! నిష్కారణంగా మా 'నౌర్'ని బెదిరించేశావోయ్. నీ ఎదుట పడటానికి భయపడిపోతుంటేనూ! (కావయ్యతో) ఏమయ్యా కావయ్యా! పకోడీలు, రెండు కప్పుల కాఫీ తీసుకురమ్మనమని నీ కెప్పుడనగా చెప్పానయ్యా? (గాలి) ఆవిగో, గాలివాన వొస్తున్నట్టుంది, తలుపు మూసేస్తా. (కావయ్య వంటింట్లోకి వెడతాడు. వాసుదేవం

వీధివైపు వెళుతూ) అహా! గాలివాన హెచ్చితే, ప్రమాదం కదూ? అమ్మాయి వస్తూందీవాళ్ళే! (మెరుపులు, ఉరుములు. ఇన్‌స్పెక్టర్ వాసుదేవాన్ని చూస్తూ,ఆలోచిస్తూ నిలబడతాడు. మెరుపులు మోరంగా మెరుస్తాయి. చాలాసేపు ఆలోచించాక మెల్లగా వాసుదేవం దగ్గరకి వస్తాడు.)

ఇన:- వాసుదేవంగారూ!

వాసు:- (వెనక్కి తిరక్కుండానే) ఆఁ.

ఇన:- మిమ్మల్నో విషయం అడుగుతాను, చెప్తారా?

వాసు:- (వెనక్కి తిరగదు) అడగండి, వింటాను.

ఇన:- వినడంకాదు; సమాధానం చెప్పాలి.

వాసు:- (తిరక్కుండానే) ఊఁ?

ఇన:- ఈ గాలివానకూ, మీ అమ్మాయికి సంబంధమేమిటి?

[మెరుపూ, ఉరుమూ ఒకేసారి. చప్పున తిరుగుతాడు వాసుదేవం]

వాసు:- [తిరిగి] వ్వాట్ !

ఇన:- అహఁ— అడుగుతున్నా ... ఈ గాలివానకూ. పద్మాలుగేళ్ళనాటి కోల్డింగాల తీర్థానికీ, మీ అమ్మాయి ప్రస్తుతం మెడిసిన్ చదవడానికీ సంబంధ మేమిటి?

వాసు:- ఏమీలేదు— నథింగ్.

ఇన- మీ అమ్మాయి ఈవేళే వస్తుంది.

వాసు:- ఎవరు చెప్పారు?

ఇన:- నాకు తెలుసు.

వాసు:- నీకేం తెలుసు? యు నో నథింగ్.

ఇన:- అని, మీ రనుకుంటున్నారు. కాని, నాకు మీ అమ్మాయి బాగా తెలుసు.

వాసు:- నువ్వో చూశావా?

ఇన:- ఆఁ.

వాసు:- ఎక్కడ?

ఇన:- గుంటూరులో.

వాసు:- అబ్సర్డ్. ఆమెను విశాఖ పంపించాలనుకుంటున్నాను.

ఇన:- ఎందుకు?

వాసు:- మెడిసిన్ చదివించడానికి.

ఇన:- మెడిసిన్‌కి విశాఖే ఎందుకు పంపించాలి? గుంటూరులోకూడ మెడికల్ కాలజీ ఉందిగా?

వాసు:- గుంటూరు పేరెత్తకు. ఐ హేట్ గుంటూరు.

ఇన:- ఏం?

వాసు:- మీకు తెలీదు. గుంటూరు నా భార్యను బలి తీసుకొంది. అది టైఫాయిడ్‌తో పంచమెక్కితే, గుంటూరు దాన్ని బతికించ లేక పోయింది! అది బాధతో నానైవు ఎంత దీనంగా చూసే దనుకున్నావ్? ఒక్క డాక్టర్‌కూడా దానిని సజీవం చెయ్యలేకపోయాడు. అది పోయింది—రెండేళ్ళ కారదను (చిత్రం చూపిస్తూ) నా చేతుల్లో పెట్టి నా జానకిని బలి తీసుకున్న గుంటూరులోనా కారదను డాక్టరీ చదివించడం? నో! అబ్సర్డ్.

ఇన:- ఆ షాకుతో మీరు కారదను డాక్టర్ చేయాలనుకున్నారు.

వాసు:- అవును. అవునని నీకు చెప్పినట్టున్నాను. ఓ! ఐయామ్ సారీ! నీక్కాదు; మా కావఁయ్యకు లాగుంది చెప్పాను... నౌర్! నౌర్! [రాంబాబు వస్తాడు] వెళ్ళి, ఆ కావఁయ్య ఏం చేస్తున్నాడో త్వరగా పకోడిలు, రెండుకప్పుల కాఫీ తీసుకరమ్మనమను.

[రాముడు వెడతాడు. వంటింది బయటనుంచే కేకేస్తాడు.]

రాం:- కావఁయ్యగారూ!

ఇన:- వాసుదేవంగారూ! ఈ కుర్రాడెవరో మీకు తెలీదనుకుంటాను!

[వొంగి అతని చెవిలో] వీడు దొంగ!

వాసు:- దొంగా! కనీసం ఏ ఘరానా మహనీయుడ్రైనా కాకుండా దొంగ బిరుదు సంపాయించుకో గలిగాడంటే! ఎందుకు నేనిందాక చెప్పానుగా, ఈ అబ్బాయిలో పైకొచ్చే గుణా లున్నాయని - లెట్‌మి కంగ్రాచ్యులేట్ హిమ్...

[పిలుస్తాడు] నౌర్!

రాం:- [వస్తూ] ఆయన వస్తున్నారండి

వాసు:- ఆయన కాదుగాని, నువ్వెలారా! నువ్వు ఎవ్వరితో చెప్పకుండా దాలా గొప్పవాడివై పోయావే!

రాం:- ఏమిటి, బాబుగారూ?

వాసు:- నువ్వు దొంగవని ఈ పోలీస్ ఇన్‌స్పెక్టరు డిస్కవర్ చేశారు.

[రాంబాబు తొట్రుపడతాడు. వాడి ప్రవర్తనను సునిశితంగా కనిపెడుతూ ఉంటాడు ఇన్‌స్పెక్టరు] నీలో రాజకీయ నాయకుడయ్యే గుణాలున్నాయని నేను కనిపెడితే, ఈయన నీలోని 'దొంగ బుద్ధి'ని డిస్కవర్ చేశారు... అదేమిటలా కంగారు పడతావ్? 'దొంగ బిరుదు' వచ్చినంతలో నువ్వేం గొప్పవాడివై పోలేదులే! [రాంబాబు కంగారు ఆర్భాటాక ఇన్‌స్పెక్టరువైపు చూస్తాడు- మళ్ళీద్దరూ తన మాటలు వినడంలేదని] అదేమిటయ్యా ఆల్లుడూ, అతన్నలా పటిపటి చూస్తావు?

ఇన:- అదేనండి, ఎలా అరెస్టు చెయ్యడమా అని ఆలోచిస్తున్నా.

వాసు:- అరెస్టా, సన్మానమా?

రాం:- నేను దొంగను కాదు బాబూ! నేను దొంగతనం చెయ్యలేదండి

వాసు:- అదేమిటోయ్! పిలిచి నీ దొంగబుద్ధికి మెచ్చుకొని, 'భారతరత్న' అనే బిరుదిస్తూంటే! నేను దొంగను కాదు అని నీ ఘనతను నువ్వే రెవ్యూజ్ చేసేసుకొంటున్నావు?

ఇన:- [వాసుదేపం మాటలు వినిపించుకోదు, పళ్ళు కొరుకుతూ] దొంగతనం చెయ్యలేదూ? సరే, నువ్వెక్కడికి తప్పించుకు పోలేవు. నేను బయటే ఉంటా. న్యాయంగా ఒప్పేసుకొని లొంగిపో, లేదా నీచేత ఎలా ఒప్పించడమో నాకు తెలుసు. (పోతాడు)

వాసు:- వెళ్ళిపోతున్నావా? సన్మాన సభ ఎప్పుడు?

కా:- అయ్యా! కాఫీ! (రెండు కప్పుల కాఫీతో ప్రవేశం)

వాసు:- (చూసి) అల్లుడూ, కాఫీ!

ఇన:- వద్దు! థాంక్స్! (పోతాడు)

వాసు:- పోనీ, అమ్మాయిని పెళ్ళాడు.

ఇన:- వెరీ మెనీ థాంక్స్ (పోతాడు)

కా:- ఆ పోలీసతనికి కూడా పెళ్ళి చేస్తామన్నా లేమిటి?

వాసు:- ఆఁ చూడూ, తండ్రిసికదా? (ఒక కప్పు అందుకొని) ఆఁ! నార్! నువ్వో కప్పు తీసుకో! వర్వాలేదు; సర్వ సమానత్వం.

కా:- అవ్వ! అవ్వ! ఇది బ్రాహ్మణ కొంపండి!

వాసు:- ఇతను ఇప్పుడు మనకంటే గొప్పవా డయ్యాడయ్యా- ఇతనికి పోలీసుడు మంచి సన్మాన సభ ఏర్పాటు చేస్తున్నారు.

కా:- ఎందుకు?

వాసు:- దొంగతనం చేశాడట!

కా:- దొంగతనమే!!

రాం:- నేను దొంగతనం చెయ్యలేదు బాబూ— మీ పాదాల సాక్షి.

వాసు:- చూశావా? గొప్పవాళ్ళంతా తమ గొప్పతనాన్ని ఎలా ఒప్పుకొంటారో?

కా:- బాబూ! నాకు మొదటినుంచీ తెలుసు. వీడి వాలకం చూస్తూవుంటే నా కలానే అనిపించింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆ పోలీసతన్ని పిల్చి పిన్ని అప్పజెప్పేయండి.

రాం:- మీ కాళ్లు పట్టుకుంటాను. కావయ్యగారూ! భగవంతుడి సాక్షిగా నేను దొంగను కాను. నన్ను వాళ్ళ కప్పజెప్పితే వాళ్లు నన్ను బ్రతక నివ్వరు.

వాసు:- అదేమిటోయ్, అలా భయపడిపోతావ్? గొప్పవాడయ్యే గుణాలు ఎవడి దగ్గ రున్నాయో వాడల్లా పోలీసువాళ్ళచేత వళ్లు మాలిష్

చేయించుకోవాలి. పర్వాలేదులే; జైల్లో పథ్థం ఒక సర్టిఫికేట్- అయి దెకరాల పారితోషికం ముట్టేందుకు.

కా:- బాబూ, మీ వెర్రి మీదే! దొంగలతోకూడా మీ హాస్యాలా? మీరు పామును చేరదీశారు. దానికి పాలుపోసినా కరవక మానదు.

రాం:- నే నలాంటివాడ్ని కాదు బాబూ- మీ పాదాలు పట్టుకొని చెబుతున్నా.

కా:- మరి, నీ వెనకాల పోలీసు లెందుకు పడ్డారు?

రాం:- నేను దొంగతనం చేశానని, ఎవర్నో ఖూనీ చెయ్యబోయానని...

వాసు:- ఇహనేం, నీకు ఇంటర్నేషనల్ ఫేమ్ వచ్చేస్తుంది!

కా:- మీ రూరుకోండి బాబూ! ఆలస్యంచేస్తే వీడు మనల్ని హతమారుస్తాడు. పోలీసుల్ని పిలుస్తా. (పోబోతాడు)

రాం:- (అడ్డుపడి కాళ్ళు పట్టుకొని) నేను నిజం చెబుతున్నాను బాబూ! నేను ఖూనీ చెయ్యలేదు; దొంగతనం చెయ్యలేదు.

కా:- మరి, ఏమీ చెయ్యకపోతే, పోలీసువాళ్ళు నీ వెనకాలెందుకు పడ్డారంట?

వాసు:- పనిలేక. ఆంధ్రప్రదేశ్ వచ్చేశాక పోలీస్‌వాళ్ళకి తిండి ఎక్కువై పని తక్కువై పోయిందికదా, అందుకని—

కా:- నువ్వెక్కడుంటున్నావ్?

రాం:- చంగయ్యగారింట్లో మా నాన్న పని చేస్తున్నాడు బాబూ!

వాసు:- చైర్‌మన్ చంగయ్యా! వెరీగుడ్! చాలా ఉదార స్వభావుడాయన. మొన్న మునిసిపల్ ఎన్నికల్లో పేదలందరికీ ఓటుకో నోటు సంతర్పణ చేశాడని పత్రికలన్నీ అయన్ని వేనోళ్ళ కొనియాడాయి కూడా ఆ మధ్య.

కా:- నువ్వాయన ఇంట్లో ఎంతకాలంగా ఉంటున్నావ్?

రాం:- నేను పుట్టక పూర్వంనుంచీ కూడా మా నాన్న ఆయన దగ్గర నౌకరీ చేస్తున్నాడు బాబూ!

వాసు:- జీతం ఎంతిస్తుంటా డాయన?

రాం:- నాకు తెలియదు బాబూ!

కాసు:- పోనీ, ప్రివిలేజ్ లీవు?

రా:- ఏమో బాబూ!

వాసు:- పోనీ, నాయకులు పుట్టిన దినాల్లో కాని—

కా:- షీ రూరకోండి బాబూ! నవ్వు చంగయ్యగారింట్లోనేనా దొంగతనం చేసింది?

రాం:- అది దొంగతనం కాదు బాబూ!

వాసు:- అవును, నాకు తెలుసు.

రాం:- నాకో చెల్లెలుంది.

వాసు:- అవును, పెళ్ళి అదీ అయిందన్నావు కదూ?

రాం:- లేదు బాబుగారూ; పెళ్ళి కాలేదు.

వాసు:- వయస్సెంత?

రాం:- ఇరవై.

వాసు:- అయితే, ఛాన్సివ్. ఆ పిల్ల నింకెవ్వరూ చేసుకోరు. డబ్బున్నవాళ్ళ ఇళ్ళల్లో ఆడపిల్లలు ముదిరిపోయినా ఫర్వాలేదు కాని, మీలాంటివాళ్ళ ఇళ్ళల్లో ఆడపిల్లలు దోరగా ఉండగానే ఆ మూడు ముళ్ళూ వేయించాల్సుంటుంది.

రాం:- మా నాన్న అలానే అంటూండేవాడు. కాని, మా అమ్మే అభ్యంతరం పెట్టేది.

కా:- ఏం?

రాం:- మా అమ్మ కరోకూటకపుది బాబూ! మా చెల్లెల్నెప్పుడూ తన కూతురిలా చూసేది కాదు. ఎప్పుడూ ఆ చంగయ్యగారి గదిలోనే ఉండమనేది.

వాసు:- ఎందుకు?

రాం:- ఎందుకంటే ఏం చెప్పాలి బాబూ! కడుపు చించుకొంటే కాళ్ళమీద పడుతుంది,

కా:- విన్నారా బాబూ ? ఇలాంటి వెధవలకిక పుట్టగతులుంటాయా? కడుపున పుట్టిన పిల్లల్ని సైతం పడుపువృత్తిలోకి దించే జాతి—

రాం:- (అరుస్తాడు) కావఁయ్యగారూ!

కా:- (భయపడుతాడు)

రాం: మేము పేదవాళ్ళమయ్యాము. కాని, మాకా బుద్ధులు లేవు కాబూ!

కా:- మరి ఇదేవిటోయ్?

రాం:- ఖర్మ, బాబూ ఖర్మ. ఈవేళ తిండే—రేపు పస్తు. ఆకలీ, దాహంకి కూడా మామీదే కసి! ఎంతకని కడుపులో కాళ్ళుపెట్టుకొని పడుకుంటాం? ఎంతకని మంచినీళ్ళతో కాలం గడుపుతాం?

కా:- అందుకని ఆడకూతుర్లని అమ్ముకు బ్రతుకుతారట్రా?

రాం:- నోర్ముయ్!

వాసు:- నువ్వు నోర్ముసుకోవయ్యా, కావఁయ్యా! కథ మంచి సస్పెన్స్‌గా ఉంది. ఆ తర్వాత ఏవయింది? మీ చెల్లెలికీ, చెంగయ్యకూ—

రాం:- బాబూ, మీరూ ఆదేమాటా? (చిత్రం చూపిస్తూ) మీ కూతురే ఆ స్థితిలో ఉంటే—

వాసు:- నా కూతురా? నా కూతురెప్పుడో పోయింది. నా శారదమ్మ ఏనాడో తప్పిపోయింది. పిచ్చివాడా!

రాం:- నాకా సంగతి తెలీదు బాబూ.

వాసు:- నీకేకాదు. ఎవరికీ తెలీదు నా బాధ!

రాం:- అవును బాబూ! ఎవరిబాధ ఎవరి కర్థమవుతుంది? ఆ చంగయ్యబాబు మా లచ్చిమీద కన్నువేశాడు. ఆయన గది లచ్చి తుడవాలట; అలంకరించాలట...మా అమ్మ తుడిచినా, నేను శుభ్రం చేసినా కసురుకొనేవాడు,

కా:- పాపం! అలవాటైపోయుంటుంది మరి...

రాం:- (కోపంగా చూసి) అవును బాబూ, ఆలవాటే ... ఒకనాడు మా చెల్లెలికి జ్వరంవచ్చి ఆయన గది ఊడ్వడానికి వెళ్ళకపోతే, ఆయన

తిన్నగా మా కొంపకి వచ్చేశాడు. మూడు రోజులూ మా దగ్గరేడుండి, డాక్టర్ని రప్పించి మందు లిప్పించాడు.

వాసు:- చంగయ్య చాలా ఉదార స్వభావుడోయ్—ఇందాక అన్నానుగా?

కా:- పాపం! మీ చెల్లెలంటే ఆయనకెంత ప్రేమో!

రాం:- ప్రేమకాదు బాబూ! ఏదో కోరిక. మొన్న సాయంకాలం మా చెల్లెలు ఆయన గది ఊడ్వడానికి వెళ్ళింది. గది ఊడుస్తున్నప్పుడు ఆయ నొచ్చాడట! తలుపు వేసేశాడు. మా చెల్లెలు ఎంత ప్రతిమాలుకున్నా వినిపించుకోకుండా ఆమెను బలవంతం చేశాడు.

వాసు:- బలవంతం చేశాడా? ఆయన చాలా మంచివాడని అనుకుంటున్నానే

రాం:- ఆయన అనుభవిస్తున్న మంచి మాకు తెలుసుబాబుగారూ! ఆయన మాటకు ఎదురాడలేక లోలోపలే కుళ్ళిపోతున్న పేదవాళ్ళకు తెలుసు...ఆమె అరవలోయిందట. ఈయన నోరు మూసేశాడు. అయిదారేళ్ళుగా ఆయనలో ఉన్న కోర్కెను వెళ్ళగక్కాడు. లక్ష్మి ఏడ్చి కాళ్ళమీద పడిందట. ఆయన వినిపించుకోలేదు. ఆమె గట్టిగా అరిచేసరికి నోటితోబాటు పీక కూడా నొక్కేశాడు.

వాసు:- నోరు నొక్కేశాడా?

కా:- చచ్చిపోయిందా?

రాం:- దేవుడు మా పాలిట ఉన్నాడు బాబూ! ఆది తప్పించుకొని బయటకు వచ్చేసింది. లక్ష్మి ఇంటికి వచ్చి ఒకటే ఏడుపు. అమ్మ దాన్ని ఓదార్చడం పోయి, తిట్టడం మొదలెట్టింది. 'కాళ్ళ దగ్గరికి సిరి వస్తూంటే తన్ను కొచ్చేశావటే - ఇలాంటి అవకాశం కోసమే ఇన్నాళ్లు ఎదురుచూశా,' అని ఆమె ఒకటే తిట్టడం. చివరికి ఆమె లక్ష్మిని కొట్టింది కూడా! అంతవరకూ మా అమ్మ—దాన్ని అమ్మా అనేందుకుకూడా నోరు రావడంలేదు—కాని, నిజరూపం తెలీదు. దాపరించుకొనే కొద్దీ అమ్మపీద కోపం, కసి పెచ్చిపోయింది. అమ్మ లక్ష్మిని తిట్టేకొద్దీ నా వొళ్లు మండిపోయింది. లేచాను. నాకు అంతా చీకటనిపించింది. నాకంటె పెద్దది, నన్ను నవ మాసాలూ మోసి,

కని, పెంచిన నా తల్లిని— ఏం చేస్తున్నదీ తెలుసుకోకుండా ప్రక్క నున్న కర్రతో దాడమోదాను. చెప్పండి— నేను చేసింది తప్పా? అడకూతుర్ని పడుపు వృత్తిలోకి దింపాలని ప్రయత్నం చేసిన పాపి నాకు తల్లయితేనేం, ఎవరైతేనేం—

వాసు:- నువ్వు చాలా తప్పు చేశావోయ్, రాంబాబూ!

కా:- మీ అమ్మకు యెట్లా వుంది?

రాం:- ఇప్పుడు దాని తల దిమ్మంతా తగ్గిపోయి ఏడుస్తోంది.

వాసు:- మరి నువ్వు చెంగయ్యను ఖూనీ చెయ్యబోయినట్టు ఇన్స్పెక్టర్ గారు చెబుతున్నారు.

రాం:- ఖూనీ కాదు బాబూ! ఆయన అలాంటి అపనింద మోపారు. ఆ వేళ లక్ష్మిని ఆ బాబు బలవంతం చేసేటప్పుడు పెనుగులాటలో దాని మెళ్ళో గొలుసు తెగి పడిపోయింది. అది తిరిగి తీసుకొనేందుకు ఆ రాత్రి ఆయన గదిలోకి దూరాను దొంగతనంగా. ఆ గొలుసు లక్ష్మి మాకు దొరికినప్పుడు దాని మెళ్ళోశున్న గొలుసు. (మెరుపు)

కా:- లక్ష్మి మీకు దొరికిందాకా నీ సొంత చెల్లెలు కాదూ?

రాం:- కాదు బాబూ! స్వయానా నా చెల్లెలే అయితే, మా అమ్మ దాన్నలాంటి నీచపు పని చెయ్యమని బలవంతంచేసి ఉండేదా?

వాసు:- నిజమే, నే నలానే అనుమానించాను సుమా!

కా:- మీ రాగండిబాబూ... ఆ అమ్మాయి మీ కెక్కడ దొరికింది?

రాం:- మా నాన్నకు రాజమండ్రిలో దొరికిందట!

(ఉరుములు, మెరుపులు)

కా:- రాజమండ్రిలోనా?

వాసు:- ఎక్కడా ! ! ! ?

కా:- బాబూ ! బాబూ! మన కారదమ్మేమో! [మెరుపు]

వాసు:- అవునోయ్! కాని, మన కారదే అయితే, ఒకనాడు కాకపోతే ఒక నాడైనా మనింటికి రాదటయ్యా?

కా:- ఆదికాదు బాబూ! మీరాగండి. ఆఁ, రాఁబాబూ! ఆ అమ్మాయి ఎలా ఉంటుఁడ?

రాం:- ఎర్రగా, సన్నగా—

కా:- చిల్లు బుగ్గలా?

రాం:- ఆఁ. నవ్వితే—

కా:- (పొంగిపోయి) కుడి చెక్కలిపిద పుట్టుమచ్చ—?

రాం:- ఆఁ, ఉంది.

కా:- ఎడం చేతిపిద గాయం మచ్చ—?

రాం:- అవును బాబూ! ఉంది.

వాసు:- ముక్కుకి, ముక్కుపుడక పెట్టుకునేందుకు రంధ్రం—

రాం:- లేదు బాబూ—

కా:- (ఆనందంతో) అవును బాబూ, లేదు. చిన్నప్పుడు అమ్మగారే వద్దని గొడవపెట్టారు.

వాసు:- అవునోయ్—కాని, పేరు లక్ష్మి అంటున్నాడు.

కా:- మీ లక్ష్మి బంగారంకానూ, పేరులో ఏముందండి, మార్చుకొని ఉందొచ్చు.

వాసు:- ఓ, ఐసీ! ఆఁ, రాంబాబూ! ఇప్పుడు మీ చెల్లాయి (చిత్రం చూపిస్తూ) అలా ఉంటుందా?

రాం:- (లేదని తల అడ్డంగా తిప్పుతాడు)

వాసు:- అయితే కారద కాదు.

కా:- మీ రాగండి బాబూ!...నువ్వు ప్రస్తుతం చెంగయ్య గారింట్లోనేనా ఉంటున్నావ్?

రాం:- అవును బాబూ!

కా:- నీ లక్ష్మి ఎక్కడుంది?

రాం:- అక్కడే బాబూ!

కా:- అయితే నడు, నే వస్తా. లక్ష్మిని నే నానవాలు పట్టగలను.

వాసు:- అయితే నడు. తండ్రిని నేను, నేనూ వస్తాను.
(ముగ్గురూ బయలుదేరుతారు. ఇన్‌స్పెక్టర్ ఎదురువస్తాడు.)

ఇన:- ఆగండి, వాసుదేవంగారూ! వీడి మాటలు నమ్మి మీరు వీడి వెనకాల వెడుతున్నారా?

వాసు:- ఏం? కావయ్య ఏదో ''క్లూ'' లాగుతున్నాడు. లెట్ హిమ్ ట్రై.

ఇన:- కాదు. వొట్టిది, అలా మీతోబాటు బయటకొచ్చి, అక్కడ్నించి తప్పించుకు పారిపోడానికి ఇవన్నీ వీడు వేసిన ఎత్తులు. ఏరా, రాస్కెల్! నిజం చెప్పు. (మీదకు వస్తాడు)

రాం:- నిజం చెప్పాను బాబూ! నా మాట నమ్మండి బాబూ! దైవసాక్షిగా చెబుతున్నాను.

ఇన:- పైగా ఇదొకటా! వెధవా, దొంగతనం చేసింది చాలక ఇంకా ప్రమాణాలుకూడా చేస్తున్నావా?
(పట్టుకుంటాడు. ఒకటి కొడతాడు)

రాం:- (వాసుదేవం, కావయ్యతో) బాబూ, కావయ్యగారూ? నా మాట నమ్మండి— నే చెప్పినవన్నీ నిజం. లక్ష్మి నా చెల్లెలు.

ఇన:- నోర్ముయ్!

రాం: (వాసుతో) బాబూ! మీరైనా నా మాట నమ్మండి బాబూ! రక్షించండి బాబూ! నన్ను నిష్కారణంగా చంపేస్తారు, మీ పాదాల సాక్షిగా దొంగతనం చెయ్యలేదు.

ఇన:- నోర్ముయ్!...దొంగతనం చేసిన ప్రతి వెధవా ఇదే ఏడుపు.

కా:- (వాసుతో) బాబూ! వాడి ఏడుపు చూస్తూంటే నాకెందుకో వాడు దొంగతనం చేశాడంటే నమ్మకం కలగడం లేదు.

వాసు:- నాకూ అలానే అనిపిస్తుందనుకో. (ఇన్‌స్పెక్టర్‌తో) చూడు అల్లుడూ!

ఇన:- మీరు మధ్యకు రాకండి.

కా:- వాడు దొంగతనం చెయ్యలేదు మొర్రో అంటూంటే, మీకు కనికరం వెయ్యదటండి.

ఇన:- కావయ్యా! తమరు ఊరుకోవాలి.

వాసు:- ఇన్‌స్పెక్టర్! ఆ అబ్బాయిని విడిచిపెట్టు.

ఇన:- సారీ! మీరీ విషయంలో జోక్యం కలుగజేసుకోకండి. అనవసరంగా ఇబ్బందుల్లో పడతారు.

వాసు:- ఏవిటి? ఇబ్బందుల్లోనా? 'లా' క్షుణ్ణంగా తెలిసిన నన్నటయ్యా నువ్వు బెదిరిస్తున్నది? అయితే సరే, ఏదీ ఏ అధికారంతో నువ్వు, ఒక పెద్దమనిషి ఇంట్లో ఉన్న ఒకానొక వ్యక్తిని బలవంతంగా లాక్కెడుతున్నావ్?

ఇన:- వాడు దొంగ.

కా:- ముజువు?

ఇన:- చెంగయ్యగారి రిపోర్టు.

వాసు:- అయితే, నా రిమార్క్ లెక్కలేదా? అసలు నా అతిథిగా ఉన్న ఒక వ్యక్తిమీద నా ఎదురుగానే చెయ్యి చేసుకునే అధికారం నీకెవరిచ్చారు? చెప్పు నీ పేరేమిటి?

ఇన:- మీరు బాలావరకు వెడుతున్నారు.

వాసు:- ఆన్సర్ టు ది పాయింట్! నా అతిథిని ఏ వారంటూ లేకుండా నువ్వెలా అరెస్టు చేస్తున్నావ్?
[ఇన్‌స్పెక్టర్ రాంబాబు చెయ్యి విడిచిపెడతాడు. వాడు చప్పున వాసుదేవం వెనక్కివచ్చి రక్షణ తీసుకుంటాడు]

వాసు:- చెప్పు. ఊఁ, చెప్పు— వాటీజ్ యువర్ నేమ్? ..... కావయ్యా! నువ్వు వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చెయ్యి— ఒక పెద్దమనిషి ఇంట్లోకి జొరబడి పోలీస్ ఇన్‌స్పెక్టర్ నానా అల్లరి చేస్తున్నాడని...

కా:- [వెళ్ళబోతాడు] ఆగు! [ఆగుతాడు]

రాం:- నేను దొంగను కాదు బాబూ:

వాసు:- నువ్వు నోర్ముయ్...చెప్పు...అలా తెల్లమొహం వేసి చూస్తావేం?

ఇన:- ఐయామ్ సారీ...పీడు పచ్చిదొంగ.

వాసు:- అదే రాంగ్ అండ్ ఫాల్స్ఎలిగేషన్తో, ఇండియన్ డొమినియన్ లోని—బైబర్త్ - పౌరుడైన ఒక వ్యక్తిని దుయ్యపడుతున్నావని పరువునష్టం దావా వేస్తే, నీ జీవితం ఏమవుతుందో ఆలోచించావా?

ఇన:- వాసుదేవంగారూ! మీ ఎదురుగానే వాడ్ని దొంగ అని ఋజువు చేసాను.

రాం:- వొట్టిది బాబూ! నేను దొంగతనం చెయ్యలేదు. చెంగయ్యగారింట్లో మా చెల్లెలు నెక్లెసు పడుంటే తీసుకొచ్చెయ్యడానికి వెళ్ళాను బాబూ!

ఇన:- విన్నారా?

వాసు:- విన్నాను. నెక్స్ట్!

రాం:- కాని, దురదృష్టంకొద్దీ చెంగయ్యగారికి మెలకువ వచ్చేస్తే, భయపడి పారిపోయాను.

వాసు:- (ఇన్స్పెక్టర్తో) విన్నావా? ఏ పరిస్థితులో, ఏ బాధతో వాడా ఇంట్లోకి దూరాడు? దుయునోది బాక్గ్రౌండ్ ఆఫ్ దిస్ డ్రమెటిక్ అండ్ రేదర్ ఫెన్టాస్టిక్ ఎపిసోడ్? పెర్హాప్స్ యు డోన్టు; యు డోన్ట ఈవెన్ బాదర్ టు ఎప్రిహెండ్ ఇట్— థరోలీ... దియర్ సర్, ఐ నో యువర్ కాంప్లెక్స్ — పోలీస్ కాంప్లెక్స్ — దు యు అండర్స్టాండ్ వాట్ ఐ మీన్?

ఇన:- కాని, ఆ నెక్లేస్ చెంగయ్యగారింట్లోనుంచి దొంగతనం చేశాడు.

కా:- ఏ నెక్లేసు?

ఇన:- వాడ్నే అడగండి.

రాం:- ఆ నెక్లెసు మా చెల్లెలిదండ.

ఇన:- విన్నారా? పూటకి గతిలేనివాళ్ళకు ఐంగారపు గొలుసు ఎక్కడ్నించి వస్తుంది— అడగండి—ఎక్కడుందో?

రాం:- అది నా దగ్గరే ఉంది బాబూ! అది లక్ష్మి రాజమండ్రి తీర్థంలో మాకు దొరికినప్పుడే దాని మెళ్ళో ఉంది.

వాసు:- రాజమండ్రి తీర్థంలోనా?

రాం:- అవును బాబుగారూ! కోట్లింగాల తీర్థంలో లక్ష్మి మా నాన్నకు దొరికిందట ఆ నెక్లెసుతోనే... బాబుగారూ, కడుపుకు లేకపోతే మంచినీళ్ళన్నా తాగాం గాని, ఆ గొలుసుమాత్రం ముట్టుకోలేదు.

కా:- ఆ నెక్లెసేది?

(రాంబాబు మొల్లోనుంచి నెక్లెసు తీస్తాడు. కావఁయ్య అందు కుంటాడు. ఉరుములు, మెరుపులు)

కా:- (పరీక్షగా చూసి) బాబూ! సరిగా చూడండి, ఇది మన శారదమ్మగారిదే. [ఇస్తూ] సందేహం లేదు. నాకు బాగా తెలుసు. ఆది మీరు స్వయంగా రెండు తులాల బంగారం వేయించి చేయించారు.

[వాసుదేవం నెక్లెసును పరీక్షగా చూస్తుండగా, ఉరుములు మెరుపులు. అతనికి ఏవేవో గత స్మృతులు]

కా:- ఇంకా సందేహం ఎందుకు బాబూ? రాంబాబు చెల్లెలు సాక్షాత్తూ మన శారదమ్మే. [ఉ॥ మె॥] బాబూ! భగవంతుడు కూడా సాక్ష్యం పలుకుతున్నాడు. [ఉరుములు, మెరుపులు]

వాస:- ఏవిఁది మీ రఁంటున్నది?

(అతనికి సమాధానం చెప్పరు.)

కా:- (నెక్లెస్‌ని భ్రాంతులా చూస్తూ ఉండిపోయిన వాసుదేవాన్ని కదుపుతూ) బాబూ! బాబూ! ఇంకా ఆలోచిస్తున్నారా? మన శారదమ్మ దొరికిపోయింది. దేవుడున్నాడు బాబూ! మన శారదమ్మ బ్రతికే వుంది. రండి బాబూ! ఈ నెక్లెస్ మీరే స్వయంగా, ఆవిడ పుట్టిన రోజు పండక్కి ఆమె మెళ్ళో వేశారు. (మెరుపులు. ఉరుములు)

వాసు:- (పొడిగా) కావఁయ్యా.....తలుపులు మూసెయ్.....తలుపులు మూసెయ్...శారద తప్పిపోతుంది.

కా:- కాదుబాబూ! దొరికిపోయింది. రండి బాబూ!

(పెద్ద శబ్దంచేస్తూ ఉరుముతుంది. భరించలేని వెలుతురు. గోడ మీది తైల వర్ణచిత్రం పడిపోతుంది. వాసుదేవం ఒకటే అరుపు అరుస్తాడు.)

వాసు:- అమ్మా! శారదా! అమ్మా! శారదా! వస్తున్నాను... తల్లీ— వస్తున్నా...వస్తున్నాను. (అని పిచ్చిగా బయటకు పరుగెత్తుతాడు. వెనకాలే కావఁయ్య, రాంబాబూ పరుగు తీస్తారు. ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా తేరిపార చూస్తూ ఉండగా)

(తెర)

"సుల్తాని"

రచన :

కి॥ శే॥ శతావధాని వేలూరి శివరామశాస్త్రి

పాత్రలు

పరమానంద

సుల్తాన్

రాంగిరి

దేవుడన్న

గాలెన్న

శాంతయ్య

పటేల్

మల్లన్న

(అది తెలం . బాగోని ఒకమాపుటూరు కుగ్రామం. రంగస్థలం కుడివైపున పరమానంద పూరిగుడిసె, ఎడమవైపున రాంగిరి పూరిగుడిసె ఉంటాయి. ఈ పూరి గుడిసె : చుట్టూ ఏవో చెట్లు, మొక్కలుంటాయి. రంగస్థలము ఎడమ వైపున ఉన్న పూరి గుడిసెలో రాంగిరి ఒక మట్టి పాత్రలో గంజి తాగుతూ ఉంటాడు-గంజి త్రాగి చుట్ట కాల్చుకుని బైటకు వచ్చి, పరమానంద గుడిసె వంక చూస్తూ ఉంటాడు. ఇంతలో పరమానంద భార్య కుండ చంకి బెట్టుకొని నీళ్ళకు పోతుండగా, రాంగిరి ఆమెను ఆపి]

రాంగిరి:- ఏమమ్మ! రేత్తెల్ల ఎందుగట్ల బరికెల్తా గొట్టి బాదల్ బెట్నడు?

సుల్తానీ:- [పరమానంద భార్యకు పేరు లేదు-దిక్కులేనిది-ఆ తరువాత సీనులో అనగా రెండవ రంగంలో ''సుల్తానా'' లేక సుల్తానీగా పిలువబడుతుంది.]

ఐట్టెగొడ్లు గోగుల మొక్కలు దిన్నవట (కుండ క్రిందబెట్టి.)

రాంగిరి:- ఐట్టె గొడ్లు గోగుల మొక్కలు దిన్నవని, బెండలు జచ్చినవని చీటికి మాటిగిట్ల గొట్టుకుంటరా, పోయెగాల బుద్దులు గానీ—ఈతడా గాలెన్న సావాస మెన్నడు బట్నదో ఆనాడే అనుకున్నను, ఈతడు గాలై పోతడూ అని-(వెళ్ళిపోతూ) యీతడు గాలై పోతడూ అని (వెళ్ళిపోతాడు.)

సుల్తానీ:- (క్రింద ఉన్న కుండ చేత బట్టుకోబోగా - దూరంనుండి గురువు చింతయ్య గోరు తత్వం పాడుతుంటే వింటూ)

చింతయ్య:- (తత్వం) ''ఇల్లు ఇల్లనియేవు-ఇల్లు నాదని యేవు-నీ యిల్లు ఎక్కడే చిలుకా నీయింట కట్టెలే. చుట్టాలు కట్టలే బంధువులు కన్న తల్లెవ్వరే చిలుకా ''నీ''

సుల్తానీ:- గురువు చింతయ్య గోరు యీ పదం నాకోస్రమే పాడతున్నట్టున్నరు.

చింతయ్య:- ''నీవు కాలిపోయిన దాక కావలుందురు గాని వెంట నెవ్వరు రారె చిలుకా''

బిచ్చగాడు:- (లోపల) అమ్మా! బిచ్చమేస్తరా?

సుల్తానీ:- ఏస్తనయ్యా-ఏస్తన -ఇప్పకేస్తన. (లోనికి వెళ్ళబోయి-కొంగుముడి వూడదీసి)...నూకలు నిండకున్నాయి. వాకిలి జెప్పటం మరిసిన్న.

చింతయ్య:- (లోపల నుంచి) నూరేండ్లు నిటిసి బతకండి తల్లి-నూరేండ్లు నిలిసి బతకిండి,

సుల్తానీ:- గెట్లు బతుకుతనయ్యా-ఎవల్ బత్క నిస్తరయ్యా-నెన్నెవల్ బత్క నిస్తరు (కుండ తీసుకని-నీళ్ళకు పోబోతుండగా - పరమానంద ప్రవేశం)

పరమానంద:- (గునపంతో వచ్చి క్రిందవేసి) ఓయ్! గట్లబోతావ?

సుల్తానీ:- నీళ్ళకు బోతున్నను.

పరమానంద:- వాయి యెనకిక్క మల్లదూ-గంజిబువ బెట్టి పోదేందయో!

సుల్తానీ:- ఏదది?

పరమానంద:- ఏమైనదీ? పిరల గంట దాగేశ్నివా? వాయ్యో పటికదేందయ్యా!

సుల్తానీ:- రేతిరి ఉండదంత నీకె బోస్తినిగ. తిరిగిప్డే గాస్తను (పోబోతుంది)

పరమానంద:- ఇప్పుడు గాస్తవ్? - సుక్క బొడిసినప్పుడు బోయి, గోగుం దిబ్బెంత తిరగబెట్టి బండెడాకల్తా నేనొస్తే, యింకెప్పుడు గాస్తవ్- యింగెన్నడు బోస్తవే?

సుల్తానీ:- (వచ్చి చెప్పలేక నిలబడి ఉంది.)

పరమానంద:- పొయ్యిలా ఆగ్గిసుప్పేసిన్నివాని (మండిపడి) నాయ్యో! గుడ్లమ్మలా గట్లగుడ్లు మిట్కరిస్తావేందయో!

సుల్తానీ:- నూకలు నిండుకున్నయి.

పరమానంద:- మరి నాకు జెప్నివా?

సుల్తానీ:- మరిసిన్న.

పరమానంద:- కంచెకు చెవుటం మరువలేదేమె-సిప్ప మెకంచిసిపోను-నిన్నా గుట్టమీది సడసిమ్మ సామెస్నడు నిన్ను యిరసకి దింటడె! నిన్ను మారెమ్మ మింగిపోను-నూకలై పోయినాయె-(ఏడ్చి కొట్టబోతాడు)

గాజె :- (ప్రవేశిస్తాడు) ఏందన్న! మల్లి రగడ జేస్తున్నట్టున్నదే?

పరమానంద:- అరె ఏం జెప్పినా గాలెన్న—వినం జరిగేది కతేగా!

గాలెన్న:- ఏరె దీని శనిముగం జావ, దీన్నేవ దెచ్చిన వేం?

పరమానంద:- ఒలె కాసులపేరు యిచ్చి మరి దెచ్చుకున్ననురా యీ శనెమ్మను, యిది కాలు బెట్టినది, నా దిబ్బలన్నీ జస్తున్నాయి-ఇది గిట్లా కొంపలో కాలు బెట్టిందని నాకు దరిద్రం బట్టినది. ఇది గిట్లా కాలు బెట్టినది నా పాడిబర్రె జచ్చినది. మర్నాటేడు నా పెద్దన్న బిడ్డ జచ్చినాడు. నాకు కూడిగ్గూడ జంపుతున్నది. గింత పొద్దాయె. గింతదనుక నూకలు గాయలె! గిపుడగ్గి నుప్పేస్తున్నదట చూవరి...ఏమమ్మో గడిసెకో కూకొని పల్కుకున్నవ్. పొయ్యిల అగ్గినుప్పేసిన్నవా? ఏమమ్మ పల్కగుండున్నావ్?

సుల్తానీ:- (లోపల్నించి) మండిస్తున్ననయ్యా! మండిస్తున్నను.

పరమానంద:- ఏంకింత గంజిదాగి నాల్గేండ్లయినదిరా గాలెన్నా! దీని పేనాన్కి బడి జస్తున్న ననుకో! ఆఁ-దిబ్బలెట్లున్నయిరా? కోతిపీర మళ్ళి గట్నవా? రామమ్మల్గలేశ్నవా ?

గాలెన్న:- వరె రామ ముల్గంటే యాద్ వచ్చినది. నీకు మాలావ్ రాంచిల్కన్ దెచ్చిన్ననయ్యో!

పరమానంద:- ఊరె! ఏడ జిక్కినదిరా?

గాలెన్న:- ఏన్న దగిల్నది, నువ్ గానేరాదు.

పరమానంద:- నే డిబ్బకత జిచ్చిన-గెట్లి కుంటడీరా?

గాలెన్న:- వరె జూడు సుడి గెత్తి-సంచవన్నెల్ రాంచిల్కయో! యీ పైన్నీరు మొగడకుకుంటున్నావా? సక్కంగ జూస్కుంటడు సన్నగుంటడు, పైసె అంటాడు అన్ననా!

పరమానంద:- గెట్లి పడగొట్టినావు ?

గాలెన్న:- మూడాజు సక్కగుంటది, సన్నబట్టిస్తది. ఏవు పైసె అతడు పైసె అంటడు అన్ననా.

పరమానంద:- ఏమున్నాడి?

గాలెన్న:- సై అన్నాడి. నీ మీన్కి ఉరక లేస్తున్నది జిలక. పరుగు దీస్తనంటది.

పరమానంద:-నేను కూడా సై అంటున్నను. మరిజిల్కను చూడ పోదంరి.

గాలెన్న:- పోదాం రారి.

పరమానంద:- నీవు పదరి. నేవస్తను.

గాలెన్న:- వరె వరె వరె.....పైసలు అంటున్నది జిల్క.

పరమానంద:- గపడె పైసలు అంటున్నది జిల్క. ఆగాలెన్న. ఇదిగీ యిత్తడి జెంబు ఎత్తుకుపోయి కల్లుదూకానంలో లింగయ్య వుండట. వానికి తెగనమ్మి పైసలు దీసుక్కని జిల్కకు వాసన సబ్బు పౌగదరు డబ్బి కాపి ఉప్మలు తెత్తపో...గుమ్మచేయాలి జిల్కను.

గాలెన్న:- హరె గుమాగుమ్మ చేస్తను.

పరమానంద:- ఏమమ్మో! జల్దిగ మఁట బెట్టు... నూకల్ దెస్తను (సుల్తానీ ఐయట కొస్తుంది) గింత కిరసన్‌బొయి బేగి మండ్తుది- గాలెన్న నేవస్తున్నను (వెళ్తాడు)

సుల్తానీ:- దేముడన్నొస్తున్నడు- దేముడన్న- దేముడన్న, బాగున్నవా?

భజనపోళ్లు:- బాగున్నమమ్మా- బాగున్నం- మీ పెనిమిటి బార్ణలు బాగున్నరా?

సుల్తానీ:- బాగున్న మన్నా- బాగున్నం- ఆ- మీ పదమిని ఎంతకాలమయె- ఇనిపిస్తమారి.

భజనపోళ్లు:- ఇనిపిస్తనమ్మ- ఇనిపిస్తము- మరిగత్తె పట్టెదన్నం బెడ్తవా మరి!

సుల్తానీ:- పట్టెడేందన్నా- పొట్టనిండబెడ్తను- మరి గింత తాలిరండి, ఉడుకు ఱువ్వ మరింత బెడ్తను. పదం పాడన్నా-

దేవుడన్న:- సల్లంగుండుతల్లీ-సల్లగుండనీ.

భజనపాట- శ్రీరాముల సతిసీతమ్మ- శెరబట్టిండు రావనుడు.
సెరబడినా సీతమ్మ- రాములదల్సిక యిలపించె.

సుల్తానీ:- సీతమ్మ తల్లీ గట్ల యిలపించె నాదాన్న?

దేవుడన్న:- రాములయ్య గూడ యిలపించి, అనుమంతు దోలిండు.

సుల్తానీ:- ధోలిండూ?

దేవుదన్న:- ఆ ఆమయిని, అనుమంతుల్యా ఏం జేస్నిడంటే

అనుమంతుడే ఎగిరిండు
సంద్రాలే దాటిండు
లంకాపూరికి జేరిండు
అసోక వన మే జూసిండు

సుల్తానీ:- అనుమంతల్యా, సీతమ్మ తల్లిని జూస్నిడా?

దేవుదన్న:-సీతమ్మను జూస్నిడు, రాములయ్యా యిలాపమెల్ల జెప్నిడు, జెప్పి
రాములయ్యా ఐంసిన ఆనవాలు యిచ్నిడు, అది జూస్నెరు రాకాసులు

సుల్తానీ:- వాయ్యో జూసెర్రా?

దేవుదన్న:-రాకాసుండి జూసింర్రు
అనుమంతులపై దూకిర్రు
రెక్కలబట్టి గట్టిర్రు
తోకకు నిప్పు బెట్టిర్రు

సుల్తానీ:- వాయ్యో దోకకు అగ్గిని నిప్పెట్టిర్రా? అనుమంతుల్యా ఊరకున్నడా మరి?

దేవుదన్న:-గెట్లూరు కుంటడు తల్లీ! రామో - -
కోదండ రామునే దలిసినడు
కార కార - కార కార జూసినడు
ఆకాశానికి బెరిగినడు (విశ్వరూపం)
కట్లను బట బట దెంపినడూ

సుల్తానీ:- కట్లను బట బట దెంపేస్నిడూ?

దేవు-: ఆ॥ లంకాపురిపై ఎగిరిండు
లంకకు నిప్పే బెట్టిండు
ధగ ధగ భగ భగ మంటలురేగె

పరమానంద:- (వచ్చాడు) వరె వరె వరె! గుడిసె తగల్బెట్టిర్రా - గుడిసె తగల్బెట్టిన్రా! గుడిసె. ఎవర్రసుమ్? అన్నంతింటున్నవా? గడ్డితింటున్నవా? ఆదవాళ్ళకింత భజన పిచ్చి పెడ్తర్రా [దమురుకం పాశేసి]

భజన పిచ్చి పెట్టర్రా?

దేవు:- సీతమ్మ కథ జెప్తున్నను.

పరమానంద:-సీతమ్మ కథ జెప్తున్నరా? సింగమ కదజెప్తున్నరా ? పొయిరాజే మని నేబోతే-భజన జెట్నివ్ ? యీ భజనపోల్లేడ దొరికినరే నీకు ? నిన్ను మారెమ్మ మింగిపోను. నిన్నామల్క మా లచ్చెమ్మ ఎత్క పోకున్నదేందె! (లోనికిపోయి) గుడిసె తగల్పెట్టినది వాయ్యో! గుడ్డ ఐట్టలూ తగల్పెట్టినది. నేనెట్ల బతికేది! నేనెట్ల జచ్చేది!

సుల్తాని:- గుడిసె అంటుకున్నది నే జూడలె దొరా!

పరమానంద:- గుడిసె అంటుకొనడం నువ్వు జూడలె—నువ్వు జూడలె?

గాలెన్న:- (ప్రవేశించి) ఏమన్నా! గుడిసె తగల్బడెనె? మనవాండ్లిం కల్లిం తాగాల్ బోతిగ జెపుకుంటున్నరు-గెట్లు దగల్బడినది?

పరమానంద:- ఈ దైద్రమొగంది గాదు—పోయి రాజేమని నేను కల్లుకి పోయిన్న, ఈడ భజన పెట్టిండి. ఆ భజనపోల్లు ఏ చుట్ట బీడి కాల్చి గుడిసెమీన పారేసిరో—ఇదిగానోరాలా! (కొట్టబోతాడు)

రాంగిడి:- (వచ్చి) పరమానందా! ఆదబిద్దనుకున్నావా? బత్తెగొడ్డనుకున్నావా? ఎందుగిట్ల గొడ్తవ్?

పరమానంద:- రాంగిడీ! నీ గుడిసెలో నీవు బడివుండక నిన్నెవల్ రమ్మన్నరు?

రాంగిడి:- దేముడు రమ్మన్నడు.

పరమానంద:- దేముడే పొమ్మంటడు జూడు మరి.

రాంగిడి:- ఆ దేముడే తిరిగి రమ్మంటడు జూడు మరి, ఏమనుకుంటున్నవో; దినదినం జూస్తున్నను. నివ్వాబిద్దకు పెట్టేది నరకం—కులపోల్లంతా గిట్లనే ఏలుకుంటున్నరా వాండ్ల పెండ్లాములను.

పరమానంద:- కులపోల్ల పెండ్లములంత గిట్లనే గుడిసెలు దగల్బడతున్నరా? గిట్లనే భజనపోల్లతో భజనర్ జేయిస్తున్నరా-గిట్లనే చిందుల్ దొక్కి సివాల్ జేస్తున్నరా?

గాలెన్న:- గిట్లనే గుడ్డగుడ్సు-పెట్టె బేడలు తగల్బడతున్నరా?

పరమానంద:- చెప్పుమరి?

రాంగిరి:- కొండాల్ జెప్పుమన్రీ? గుడిసె తగల్బెట్టినాడీ? నాట్కపోల్లతో నాట్క మాడుతున్నాడి. ఏమమ్మా! గిట్లంటరు.

సుల్తానీ:- రాంగిరన్నా! మా దేముడు నూకలతబోయిండు-పొయ్యిల అగ్గి నుప్పేసిన్ను! కిరసిన్‌బుడ్డి పొయ్యి దగ్గర ఉంది-గింతలో దేము డయ్యొచ్చిండు. సీతమ్మ కద జెప్తన్నాడ-నే గట్లనె యిసకుంటు న్నన-పొయ్యిలో కిరసిన్‌బుడ్డి బడి మంటలేస్నిదేమో, నే జూడలే పొయ్యి గుడిసె కంటిన్నది.

పరమానంద:- పొయ్యి గుడిసె కంటిన్నాదే? పొయ్యి గుడిసె కంటిన్నాదె? నాల్గేండ్లబట్టి లేని గుడిసె యీ పినమే గుడిసె కంట్నాదె! యీ దినం గుడిసెకు బాకినాదె. తన్నుకు జస్తవ్- ఏడకి జస్తవో జావ్- కదలం మంటుండులే (రాంగిరి గుడిసె లోనికి పోతాడు)

సుల్తానీ:- నా కెవరున్నరనిబోను, ఏడకు బోను?

పరమానంద:- నీ కెవలున్నరో నాకెట్ల తెలుస్తదే. ఏడకు జస్తవోజావు.

సుల్తానీ:- నాకెవరున్న- నీకు సమానమైతరా?

పరమానంద:- ఈ సింగమ్మ సీతులు నాకిక జెప్పకూ, ముందు మూట ముల్లె గట్టు.

సుల్తానీ:- యీతప్పు గాయమంటున్నానగా!

పరమానంద:- ఎల్ గాస్తకు?

గాలెన్న:- నాల్గేండ్ల మట్టి గాస్తుర్కడు మారాజు, ఇంకెంతగాలం గాయాలే- ఉడు పుట్కా బుట్టలె పక్కి గుడిసె తగల్బెట్టినావు (లోనికి చూపిస్తూ)

పరమానంద:- మరి నూ జెప్పర గాలెన్న, నీకు తెలియకుండేనున్నదే-యింటు న్నవా? మనవాండ్లెల్లా యేమంటున్నరో! కనిల్రనరీ!' (చెమ్మాపట్టి లాగుతాడు)

రాంగిరి:- పరమానంద, ఎల్లకుండు. ఆగిడ్డ నేమనకు. ఏమమ్మా, యీ దెబ్బలు నే జూపకీను. మీ వాండ్లెటున్న రమ్మా - నాకు జెప్పక- నేదిస్క పోత.

సుల్తానీ:- నాకెవ్వలూ లేరయ్యా, నేపుట్టంగనే మా అమ్మయ్యలు జచ్చిపోయిన్రని మీ బోండ్లయ్యలు బెంచి పెద్దదాన్ని చేసెన్రని గింత ఓలె బుచ్చుకోని యీ అయ్యకొప్ప జెప్పిన్రని- యీ దేముడే జెత్తె యిన్నను. నా కెవలున్నరని టోను- ఏడికనిబోను?

(లెంపలేసుకొని ఏడుస్తుంది)

పరమానంద:- ఏడికిబోతావోపో; గెట్లనట్ల పరమనంద పక్కన, గుడిసెలో కూసుని, కుల్కుదమనుకుంటున్నవేమొ! అది కుదర్దు- ముందు మూటముల్లెగట్టు.

రాంగిరి:- పరమానంద; ఎందుగిట్ల పాపం మూట గట్కుంటవ్, ఏదోజరా తప్పు జేసెన్నని లెంపలేసుకుంటున్నది, కాల్లబడుతున్నది— కాల్లు మొక్కుతున్నది. నీవు గొడ్తె గొడ్తదా! తిడితే తిడ్తదా! నీ పెండ్లమయ్యా పెండ్లము. "పెండ్లాన్ని గొట్టిన, గోవును గొట్టిన, ఒక్కటే నరకం" ఆ పాపము పది ఇన్మలకబోదు, ఏమనకుంటున్నవో?

పరమానంద:- పోతుంటెమానె.

గాలెన్న:- పుట్టిండయో! పున్నెపురుసుండు.

రాంగిరి:- గాలెన్న, నా పున్నె పురుసత్వం- నూ జెప్పనక్కర్లే. మంది జెప్పుకుంటున్నరులె; నీ పురుసత్వం. రంగురంగుల రాంచిల్కలందెచ్చి. మందికి గుదిర్చి; మంది కొంపలు గూలుస్తున్నవటగా;- నాకు, నాకు పేరుపెట్టొచ్చినావురా రాంచిలకలయ్యా—

పరమానంద:- రాంగిరి!

రాంగిరి:- వీండ్ల కొంపదీస్తున్నది నువ్వుగామరీ?

గాలెన్న:- వాయ్! గెంత మాటన్నడ.

పరమానంద
గాలెన్న } :- రాంగిరి.

రాంగిరి:- వీండ్ల కాపురములు నిప్పులబోసిన్నది నీవుగాదుకి!

గాలెన్న:- రాంగిరి! (గుడిసెలోనికి బోతాడు చిన్నబుచ్చుకొని)

పరమానంద:- నోరుమూస్కో పడుండు. రాంగిరీ—మా కుంపోనివా- తంపో నివా?— ఎవలు పిలువకుండగనే పెద్దమనిసి తీర్గవొచ్చినవ్. కాద నలే! వచ్చినవానివి గెట్లగనో వచ్చినవ్—నిన్న పెద్దమనిషివిగనె ఆడుగుతున్నను— చెల్లు చీట్లిప్పిస్తవా? లేకుంటే యీ రగడిట్లనె పెద్దది జేస్తవా?

సుల్తానీ:- చెల్లు చీట్లిప్పిస్తవా రాంగిరన్నా?

పరమానంద:- మరి ఏం జేస్తడు?

రాంగిరి:- పరమానందా! నువు మనిసి పుట్కా బుట్టలె! పసరం పుట్కాపుట్టినవే. ఆసల్ నీవొక మెకమై పుట్టుండాలే! గెట్టిమ్మంటుండవయ్యా చెల్లు చీట్లు ? నీ నోరెట్లాడినద్రే! పున్నెం జేస్కొనీ పుట్టినదీ బిడ్డ, నువ్ గిట్టనే అంటె నీ నాల్కె చీక్కలుజేస్తను.

పరమానంద:- ఏం గూసినవ్?

రాంగిరి:- పరమానంద.....ఎల్తదుండు..... ఆ బిడ్డనే మనకు. మీవాండ్లే డున్నరమ్మ? నాకు జెప్పు, నేను తీస్కపోతను.

రాంగిరి:- మరి బిల్కకు మరి!

పరమానంద:- ఏంజేస్తవ్రి?

రాంగిరి:- పండ్లూడగొ ట్తను.

పరమానంద:- గొట్టురామరి (చెంపసీవ కొడ్తాడు).

సుల్తానీ:- రాంగిరన్నా! నేననుకుంటూనే వున్నను గిట్టనైతదని. యెల్లిపో అన్నా! గెట్ల నైతదో గట్టనే అయితది.

రాంగిరి:- ఎల్తానమ్మ, ఎల్తను. ఇన్నేండ్లకు నీతో చెంపదెబ్బ తిన్నను, మంచి కోస్రందికలె! పరమానందా! ఎల్తున్ననయ్యా! ఎల్తున్నను. సుల్తాని ఎల్తున్ననమ్మా, ఎల్తున్నను - ఇకనే వుండరాదు - మీ రగడిట్లనే పెద్దది జేసిన వానినైతనేమో ! మా కెట్ల జెప్పకుంటుమొ - నీవె జెప్పకునాలె. ఎల్తున్ననమ్మా - ఎల్తున్నను (వెళ్ళిపోయాడు)

సుల్తానీ:- రామ్ గిరన్నా! యింగ నేనెట్ల బతికేదన్నా ?

గాలెన్న:- (గుడిసెలో నుండి వచ్చి రాగిడిని మండిపడి చూస్తుంటాడు)

పరమానంద:-ఎట్ల బతుక్కతావా? ఇదిగో, కాసులు అమ్ముకడిని. ఏడ బతుక్కతావో బతుక్కబో! (కాసులు మూటలో బెడతాడు)

సుల్తాని:- (తెల్లబోయి చూస్తూవుంటుంది)

పరమానంద:- ఏవట్ల చూస్తవే? జల్దీగా చెల్లు చీట్లిచ్చి ఎల్తవా ఎల్లు – లేకుంటే ఈ జెట్టు కొమ్మకు ఉరివేసోక్కని యాడే జస్తను. ఆట్లనైన నిన్ను గట్కపోతరు - గాలెన్నా, తాలుర.

గాలెన్న:- (వచ్చాడు)– తాలుర (చెల్లు చీట్లుదీసి - యిద్దరి చేతివేలి ముద్రలు వేయిస్తాడు) (వేలిముద్రలు వేయించిన తరువాత) వరె ఎల్తదుండు రగడ జేస్తావ్? మీకు మనసు గుదురదు, మాట గల్వదు. ఎవరి దారి వాళ్ళది.

సుల్తాని:- వద్దు - దొర - వద్దు - నేబోలేను - నే బోలేను. (మూట తీసుకుని నడుస్తు వుంటుంది) సీవే సుకంగవుండు.

పరమానంద:- ఏమమ్మో మరిగత్తె ఆట్లనే బోతవా? ఓలె ఇచ్చినే గట్టిన మరి ఆ తాలెబొట్టు? గాలెన్నా సీళ్ళు జెప్పినట్లుగనే జేసిన. దాని సూత్రం దెంకకొచ్చి ఎల్లగొట్టిన నకు జిక్కను గట్టజెట్టలే

గాలెన్న:- గట్టనె—గట్టనె

సుల్తాని:- ఏం జేయాలె?

పరమానంద:- యాడ బెట్టి పోవాలె!

గాలెన్న:- తాలి బొట్టిడ బెట్టకుంటె యాడెల్లు చీటీలు జెల్లవుగ మరి-జెప్పు.

పరమానంద:- మరి! యిన్నవా మన కుల కట్టి?

సుల్తాని:- తాలిబొట్టు యాడబెట్టి పోవాలె!

పరమానంద:- తలె బోట్టు యాడ బెట్టి పోమంటె నీకు నాకు చెల్లెట్టి అయి తడే? ఎవరి పెండ్లానే అందే ఎవరి పెండ్లాన్ని జెప్తవ్! పెండ్లా మించగా బెండ్లామిస్తరా మరి! అందకీగబెట్టి బోవాలె!

(అని ముందుకు పోతాడు)

సుల్తానీ:- వద్దు దొరా! ఇది గోప్ప పాత్రమచ్చా! యీ సూత్రమిచ్చింది— లేకుండే లోకులు నన్ను జిత్త చిత్రంగ జూస్తరు - లోకుల కండ్లు నే మాయలేరు దొరా! నీ పేరు నే నేడ జెప్పను.

(పరమానంద సూత్రంపై చేయివేస్తాడు) దొరా! (పెద్దగా అరుస్తుంది) నీ పెండ్లాన్నని యెవరికి జెప్పు.....

పరమానంద:- గాలెన్న, నీవు జెప్పినట్లుగనే జేసిన - దాని సూత్రం దెంపు కొచ్చి ఎల్లగొట్టిన నాకు జిల్కను గట్ట బెట్టాలె.)

గాలెన్న:- గట్టనె...గట్టనె

(తెర పడును)

2 వ రంగం

("సుల్తాన్" గుడిసె)

సుల్తాన్:- (తొమ్మిది గంటలు వినపడగా) అరె!!! టాపామే "నౌ" ఐజె గొట్టెను. అభీతక్ "నాష్తా" దేలే; పేట్‌మే ఒహ్తీ; థోల్తో శాంతమ దొర అంట్ల ను అర్ధ దోమి స్తున్నడేమొ! ఒరాచార్ దాగాలె (పొయ్యి దగ్గరకు పోయి) అరె జోగుంక్కా జెప్తదే,

యె "నమ్మకరాం అమ్మా దీన్ని నమ్మకు అన్నా అని, నైనై "బహత్ బోలే బాలీహై"

(చాయి త్రాగబోతుండగా సుల్తానీ కేక)

సుల్తానీ:- చాయి దాగకు, అన్నం దెస్తున్ననూ! (దూరంనుంచి కేక.)

సుల్తాను:- అరె బహత్ దేరైనది; ఇంతదనుక ఏంజేస్తున్నవ్!

సుల్తానీ:- అమ్మగారేదో పండ్డి జేసుకున్నరా (ప్రవేశం) ఏదో పండ్డ జేసుక్కున్నరా (సుల్తాన్ సుల్తానీ బరువు దింపుతూ) అన్నంపులుసు లెన్ని బెట్టెంద్రో జూశ్రని (సుల్తాన్ సుల్తానీ బరువు దింపుతాడు)

సుల్తాన్:- వరె! చాన్ చాన్ జేసిన్రై. వంటశ్రిబాటు అంటల్ గూశ ఎక్కువై పండాలె (నవ్వుకుంటూ, వారెవా! పెద్ద పండ్డజేసుక్కున్నరా! అరె చాన్‌దెచ్చవ్.

సుల్తానీ:- కాంతమ్మ తల్లంచే ఎవుంనక్కంటున్నవ్? చల్లని తల్లి! మనం పూరగ దినమన్నది.

సుల్తాన్:- వరె, జల్దిదే; నే దినాలె, మరి బాగదినాలె.

సుల్తానీ:- ఇదే బొప్పట్లురి - ఇదో పూర్నం బూరె - ఇదొ పరమాన్నం. ఇది అన్నం - ఇది పప్పుబులుసు.

సుల్తాన్:- మరి పులావ్ బెట్టలె?

సుల్తానీ:- చి! చి! బేమ్మర్లు పులావుల్ జేస్తరా? పాళాల్ జేస్తరుగాని.

సుల్తాన్:- పెద్దపండ్లకు గూడ జెయురా మరి.

సుల్తానీ:- (నోరుకు చెయ్యి అడ్డంపెట్టి, అటు ఇటు చూచి) పండ్లుద్వగొట్టరు అయ్యగారిన్నరంచె-ఎమన్నక్కంటున్నవో!

సుల్తాన్:- (ఇద్దరూ నవ్వుకుంటారు) నాకు దెల్వదా? (అని చెవి పట్టుకుంటాడు)

సుల్తానీ:- ఏయ్! ఏయ్! (నవ్వుతుంది)

సుల్తాన్:- ఏయ్! ఏయ్! అంటున్నావ్; భైస్ సపుకుంటున్నావా!

సుల్తానీ:- ఏమునాలె?

సుల్తాన్:- పేరు బెట్టి పిల్వాలె.

సుల్తానీ:- ఏ పేరున బిల్వాలె?

సుల్తాన్:- "సుల్తాన్" అని బిల్వాలె!

సుల్తానీ:- (నేను బిల్వను అన్నట్టుగా తలవూపి సిగ్గుగా) ఏమని బిల్వాలె? (తనలో "సుల్తాస్" అని అనుకొంటు సిగ్గుపడుతుంది) ఏమో నే పిల్వను. సిగ్గైతున్నది.

సుల్తాన్:- సిగ్గైతున్నదిర? ఎంటుగైతవి?

సుల్తానీ:- మగని పేరు పెండ్లాము జెప్తదా? మాకు జెప్పరు.

సుల్తాన్:- మాకు జెప్పాలె [చెయ్యిపుచ్చుకొని] జరూర్ జెప్పాలె - [అని గబ్బిగా చెయ్యి నొక్కుతాడు]

సుల్తానీ:- అబ్బా జెప్పకు—జెప్పను— సు...ల్తా...న్

సుల్తాన్:- (నవ్వుకుంటాడు) మరి నీ పేరు జెప్పవా ?

సుల్తానీ:- (ముఖంవాడి పోతుంది-మాటరాదు) నాపేరు...ఏమని చెప్పాలె ?
(అని తల వూపుతుంది)

సుల్తాన్:- ఏమని జెప్పవ ? నే జప్త యిను— "సుల్తానీ" అని జెప్పాలె ?

సుల్తానీ:- (నెమ్మదిగా తనలో) సుల్తానీ ... (చిన్నబోతుంది)

సుల్తాన్:- (తనను చూపుకుంటూ) సుల్తాన్ (సుల్తానిని చూపి)సుల్తానీ (నవ్వుతాడు) సుల్తానీ ! బడగిర్లా నాటక్-పోల్లు నాటక్ మేస్తున్నరంట— జూడపోదాంరి (పొయ్యి దానిని అంటి ఉన్న గుడిసె చూచి)

సుల్తానీ:- నాటక్-పోల్లు నాటక్ మేస్తున్నరా ? (పొయ్యిచూచి కంగారుపడి)— నేరాను — నాకు నాటక్-మంచె గుబులయితున్నది — నేరాలేను దొరా !

సుల్తాన్:- వరె నాటక్-మంచె, యిత్న ఘూబ్రయినవ్ — క్యూంరి ? ఇంకెన్నడు జెప్పనులె ! (బయటకు పోయే వానివలె బిగ్గరగా) ఆ బకాల్ సాబ్ దుకాన్‌కు బోయెచ్చి ఖానా తింటాను — పంద్రా బుట్టల్కు పైస లియ్యాలె — పరసోం యిస్తనన్నడు. ఆజ్ తక్ యియ్యేలె ? జల్ది పోయి పైసల్ నూకొస్తను (చూచి) వరె ! ఏంగట్టనైనవ్ ! బీమార్ ఉన్నది క్యా !

సుల్తానీ:- (లేదన్నట్లు తలూపుతుంది) నై

సుల్తాన్:- అరె ! జరా చాయి తాగు — బీమార్ గీమార్ సోబ్ దౌడ్ తీయాలె
(అని హుషార్‌గా వెళ్తాడు)
(పొయ్యి దగ్గరకు పోయి కంగారు పడి చూస్తూనే ఉంటుంది)

(పరమానంద వాలిపోయిన పెడమలు, పిచ్చిఅవతారంతో ప్రవేశిస్తుంటాడు)

పరమానంద:-(ప్రవేశం) బాగున్నవా?

సుల్తానీ:- (బిత్తరపోయి చూస్తూంది)

పరమానంద:-బాగున్నవా?

సుల్తానీ:- ఎదొ, గిట్లున్నను.

పరమానంద:-ఆగరి-యెల్లకు-సుల్తానీ ఆని బెట్కున్నవటగా నీ పేరు?

సుల్తానీ:-ఏదో గట్లన్నరు. ఎందుగిట్లొచ్చినవ్? (చాలాసేపు తెల్లబోయి చూచి)

పరమానంద:-ఏమిలె!!

సుల్తానీ:- ఏమీలేకుంటె యీడ కెందుగొచ్చినవ్?

పరమానంద:-ఊకనె వచ్చిన్ను-ఏంజేస్తువ్‌ది?

సుల్తానీ:- ఏదొ జెయాలిగ-పొట్టతిప్పలుక్క, అంట్లు తోముకు బతుకుతున్నను.

పరమానంద:-అంట్లదోమక ఒతుకుతున్నావేం? ఏమంత ఖర్మబట్టి,నా కాసుల పేరు అమ్మికోని బత్కమన్నానుగా.

సుల్తానీ:- నీ కాసులు నాకెందులకు. నా రెక్కల కష్టమే నాకున్నది. ఏం గట్ల నయినొ?

పరమానంద:-హాయలా బడిన్నుగ. మనవాండ్లెల్లిడు బత్కనస్నరు-గుండెనంజ న్నరు-ఆఠార్లయ్యా గులకెమాత్ర లిచ్చిండు-బతికెన-సిన్ను జూసె టాన్కి రుణసున్నది. బతికొచ్చిన వాయినెంత దిరిగెను.

సుల్తానీ:- ఏదొ జర కోగంజేస్తె మట్టు గిట్లొస్తరారా?

పరమానంద:-నీ వొచ్చినవ్. నీతో నా దశె తొలగిపోయినది. నా లచ్మిదేవే పోయినది అంటున్నరు.

సుల్తానీ:- అందుకు నేనేం జేయాలె?

పరమానంద:-మన పల్లెకు పోదాంరారి!!

సుల్తానీ:- పరమానందా! సుల్తాన్ పగ పాంపగ. అతడు నిన్ను జూసినదంటె బొడిసి పారేస్తడు, నిదార్నెబో! ఆసల్ నే గెట్లొస్తను - నీకు నాకు చెల్లయినదిగా!

పరమానంద:- అది జెల్లదన్నరు. నీవు బోంగనె కులపెద్దలంత-నన్ను రచ్చకీడ్చి సడు-బిలపంతాన ఆ పిల్లతో జెల్లు చీట్లు దీస్కుంటవా అని చంపి పారేస్నరు. నిన్ను తిరిగి దీస్కరమ్మంటున్నరు. ఎల్దాం రారి.

సుల్తానీ:- పరమానందా! సుల్తాన్ నన్నుగట్టుకున్నడు-నన్ను నమ్మకున్నడు.

పరమానందఃఃః

సుల్తానీ:- ఏందివ్వే లప్ప దిగినవ్?

జోగులక్క:- (పరమానంద వెళ్ళిపోగానే) ఇద్దిపుడె దిగిన్న. ఎవలాతడు?

సుల్తానీ:- (నోరాడక)... ఆతడు...

జోగులక్క:- (గ్రహించి) పాత జుట్టనూ ! ఎవలన్న?

సుల్తానీ:- (బరువుగా) అదే...పాడైన జుట్టను-కితనే జెప్పలే...ఆతడు

జోగులక్క:- పేరు జెప్పవ్?

సుల్తానీ:- (ఒక్కసారిగ కంగారుగా) పరమనంద.

జోగులక్క:- ఊ! .... (పెద్దరాగం తీస్తుంది) బాగున్నది. ''రామేశ్వర మొచ్చిన కనేశ్రమొదల్లే'' (గడ్డంమీద చేయి వేలాంచి).

సుల్తానీ:- (తెల్లబోయి) ఎవవవ్వ గట్ల నన్నవ్? (జోగుఎమ్మను ఊపస్తుంది).

జోగులక్క:- ఏమిలే ! !

సుల్తాన్:- (ప్రవేశిస్తూ) వరె ! జోగులక్కొచ్చినదే. ఏమక్క, కాన్ రాైనవ్?

జోగులక్క:- దీపాంమాస్కు మిరియల్ గుడి యెల్లెన్నన్న, మా పెద్దన్న రమ్మన్నడు. పండక్కి యెన్నెన్ని, పాళాల్ జిసెన్రు, గెన్నెన్ని టపాసుల్ గాల్చెన్రు.

సుల్తానీ:- (సరసంగా) మరిగత్తె మాకేమైనా టపాస్లు దెచ్చినవా ?

జోగులక్క:- మా సుల్తనన్నకు దేకుంటనామి (అని చిచ్చుబుడ్డి తీసి) అగ్గి నుప్పన్నదా?

సుల్తానీ:- (హేళనగా) జోగులక్కా, యీన చిచ్చుబెట్టకు!! గిపు దిపుదే నిల్చెట్టు కుంటున్నంమా కాకి గూడు (అందరూ నవ్వుతారు) జోగులక్క! సిచ్చుబెట్టినదా ? శివునకైనా సివా లెత్తాలె (అంతా నవ్వుతారు. జోగులక్క చిన్నబోయి నవ్వినట్లు నటిస్తుంది. సుల్తానీ కదవ చాంతాడుతో యింటి దగ్గర నున్న నూతికి నీళ్ళకు పోతుంది. సుల్తానీ వెళ్ళినవైపు జోగులక్క చూస్తూ వుంటుంది)

జోగులక్క:- (సుల్తానీవైపు చూస్తూ) ఎంత చిత్రగత్తెవె? మా అన్న మెత్త్ర దనం జూసి చిత్రచిత్రం జేస్తున్నవు.

సుల్తాన్:- సూపుం గట్లనే వుంటది జోగులక్కా!!

జోగులక్క:- సూపుల గట్లనే ఉంటదా? వట్టి సూపులకు.

సుల్తాన్:- జోగులక్కా! (ఆశ్చర్యం)

జోగులక్క:- వట్టి సూపులకు (అని నవ్వుతూంది)

సుల్తాన్:- జోగులక్కా ?

జోగులక్క:- ఒక్క సూపుంకేగదయ్యో! చేతలుగూడ అట్లనే జేస్తున్నది. చిత్రనాట్కం జేస్తున్నది.

సుల్తాన్:- వరె! ఏమి జేస్తున్నది జోగులక్కా?

జోగులక్క:- ఏమన్నా? సుల్తానీ సూడ సక్కనిదన్నవు? పెద్దలకు సుద్దుల్ జెప్తదన్నవ్—(నవ్వుతూ) ఏందేందో బార్లకు బారలు-మార్లకు మరం జెప్పినవ్ !

సుల్తాన్:- వరె! ముజె పాగల్ జేస్తున్నవు క్యా?.....ఎందుగట్ల నయితన్- నేనెం ఎచ్చుంకు జెప్పుకున్నా.

జోగులక్క:- ఎచ్చుంకు జెప్పుకోరే! ముచ్చటకు జెప్పుకున్నవు! బాగయెను. సుల్తానన్నా మోటార్ బస్ దిగి యింటికెల్తున్నను. యీదెల జనం మూగెన్రు - సుల్తానీ మొగుడొచ్చిండు- మన పల్లెనె వుంటున్నడు. మిఠాయిల్ పంపిస్తున్నడు. అంటున్నడు-వరె! ఏమా! జనం గిట్లంటున్నరు-నీవు లేవేమోనని సిదగ నీయింటి కొచ్చిన్ను-పరమ నందున్నడు. ఎందుకట్ల బిగల్ బిగల్ పడ్తవు? నే తిరిగొస్తనుగా నిన్ను దీస్కపోతను రా అంటున్నడు. ఇన్నను - ఇని గుడ్లనీరు గుడ్లకే తుక్కుకొన్నను. మరి యీ సుక్కలమ్మ సూపులెట్ల దిప్పు కొంటవో మరి!

సుల్తాన్:- బిడ్మాష్ పరమనంద; ఫిర్ వస్తున్నడన్నమాట.

జోగులక్క:- ఇది పిల్వనంపకపోతే వాడెందుకొస్తడన్నా. పిచ్చెక్కి తిరుగుతున్నడట యీడ.

సుల్తాన్:- ఏడకు బోయింది? దాని పేగులీస్తన.

జోగులక్క:- బాయెక నీలకు బోయిందిగా (అటు యిటు చూచి) ఇక ఒస్త దేమో? నే బోతనన్నా! (తిరిగి బుట్టనెత్తిన ఎత్తుకొనబోయి)

జోగులక్క:- ఏమన్నా? నాకు జిత్రమైనదే? పైసల్ నూకి వాసికిస్తున్నదేమో? రాత్రింబగల్ బండెడు చాకిరి జేస్తన? నూర్లకు నూర్లు బుట్టలత్తరు? యీ వగల బొమ్మ అంట్లు దోమి, అన్నం బులాసుల్ దెస్తది. జీతం పైసల్ దెస్తది! ఇదంతేమైతున్నడన్నా? ఎన్నడిన్నా అప్పులే జెప్పుకుంటమా? అసల్ పైస లెక్క నిగ్గ దీస్తున్నవా మరి?

సుల్తాన్:- (సీరైపోయి) పైస లెక్క నిగ్గ దీస్తున్నానా? నై.....నై.....

జోగులక్క:- ఏమన్నా! అసల్ ఎరగనట్లు జెప్తవ్? రూపలన్నీ కాసుల్ జేసి, కాంతయ్య దొర యింట్ల దాపరికం బెట్నదటగా?

సుల్తాన్:- ఏవల్ జెప్పినై నీకు జోగులక్కా?

జోగులక్క:- కాంతయ్య దొరా ..... పటేలయ్యతో జెప్తుంటే మీ బావ ఇన్నడంట.

సుల్తాన్:- నిజం జెప్పు జోగులక్కా!

జోగులక్క:- నీ తోడన్నా! మీ బావ అబద్దం జెప్తడా మరి?

సుల్తాన్:- ఆ పెద్దమన్సీ నూటా బాత్ లెందుక్క జెప్తడు-ఇన్నటికి దెల్సుకున్న పూరగ దీని కత—

(సుల్తానీ ప్రవేశిస్తుంది—జోగులక్క సుల్తానీని చూడదు)

జోగులక్క:- సుల్తానీ యీడ పాదం బెట్టి న్నాడే తనుకున్ననన్నా ఇది సుద్దుల్ జెప్పి...సుక్క నామాల్ బెడ్తదని.....

సుల్తానీ:- జోగులక్కా! (కోపంగా సుల్తాన్‌తో) యీ పుగ ముంతను యింత దన్ కీ డెందు కుంచినవు? ఛీ! అని కొడ్తె కుక్కయి నా మాయింట్ల కాలు బెట్టదు!

జోగులక్క:- ఎవరే పుగముంత? నివ్వా? కుక్కన నే నట్ల యితన్ను? నీ బైతవు - నీ పరమనం బైతదు!

సుల్తానీ:- జోగులక్కా!

జోగులక్క:- చెప్పు గొత్తకు ఏమనుకుంటున్నవో? యిస్మంటియి అన్నీ యిండె మేము నిక్కలు గాక మరేమైతది?

(అని వగలమారి ఏడ్పుతో వెళ్తుంది)

సుల్తాన్:- జోగులక్కా! జోగులక్కా!! టయిరీయే-జర్రా టయిరీయే (సుల్తానీతో) ఏంగూసినవ్? ఏంగూసినేరి?

సుల్తానీ:- గిట్ల కొంపలకు నిప్పుల్ బెట్టే మోండ్లనేమనాలె?

సుల్తాన్:- నోర్ బంద్జెయ్యాలె (మీదకు వెళ్ళి) వారెవా! చిత్రం జేస్తున్నవె చిత్రం-ఇదెన్నట్నించి జేస్తున్నవ్? పరమనందను దింపినవటగ?

సుల్తానీ:- రామరామ. మనిండ్ల దిప్పుకారాజు ఎత్కపోయి జోగులక్కకు నేనంది గిట్టకున్నది. (చెవులు మూసుకుని) జోగులక్కా!! పాపాల మూట్ల నీవు మొయ్యకురి!

సుల్తాన్:- వరె, చుప్! నాకు జెప్పవె-ఏక్ హి ఏక్‌బాత్ అద్దతనూ? నిజం జెప్పు. పరమనంద వచ్చిండా?

సుల్తానీ:- (చెప్పలేకపోతుంది.)

సుల్తాన్:- పరమనంద వచ్చిండా అంటున్నన?

సుల్తానీ:- (ప్రాణాలు బిగపట్టుకొని) వచ్చిండు—

సుల్తాన్:- వానితో నవు గుస గుసల్ జేస్నివా?

సుల్తానీ:- (దీనంగా)గుసగుసల్ జెయ్యిలే. గట్టిగనే జెప్పిన్న-బుద్ధి జెప్పిన్న.

సుల్తాన్:- బుద్ధివాసిక జెప్పలె-నాకు జెప్పిన్వ్-నా కండ్లు దెరిపించినవ్-సంగ జెప్పు?-ఖతం రూకలెక్కున్నయ్?

సుల్తానీ:- (ఏమి లేదన్నట్టు తలూపుతుంది) ఏవనున్నయ్?

సుల్తాన్:- వరె! ఏమైనయ్?

సుల్తానీ:- (దీనంగా) మూకనన్నీ సీవె దాసుకటుర్నపు-!

సుల్తానీ:- (వికటంగా) జోగులక్క రూపాబాత్ లెందుక్క జెప్పత? ఖాంగచ్చు; దొర యిడ్డ కసుకేసూత్రం జేసిండ్-?

సుల్తానీ:- కాసుబ దండైతె ఉన్నది. ఆ కాసులెనో్న నే లెక్కబెట్టలె.

సుల్తాన్:- (కడుపుమండి) ఇన్నటికన్న నిజం జెప్పినవు సుల్తానమ్మా - నీకు సలాం బెడతున్నను-అయిబట్కరా-నే పఁడ్గ జేస్కునాలె —— —— (బిగ్గరగా) తీస్కరమ్మంటున్నను.

సుల్తానీ:- గెట్ల తెస్తన? ఆ ముష్టి కాసులు ఆ పరమనందకె ముట్టాలె!!

సుల్తాన్:- చుప్!-ఫిర్ అన్నవంటె నాల్కె జీంస్తను.

సుల్తానీ:- పూరగ ఇనకుండగా జీలుస్తవా?

సుల్తాన్:- కామోష్!! (మతిపోయినట్లుగా) పూరగ యిన్నను. ఫిర్ విన నక్కర్లే, ఆ కాసులు పరమానందకు ముట్టాలె? ఎందుక్కా ముట్టాలె?

సుల్తానీ:- పరమనంద నన్నెల్లగొట్టిండు - అయిదిని బత్కమన్నడు-ఆ కాసులు నే ముట్టను-ఆ ముష్టి కాసులు నే ముట్టాలె?

సుల్తాన్:- సుల్తానీ! (ఆరుస్తాడు) కాసుల్ దెమ్మంటె! ఎన్ని తిరకాసుల్ బెట్టవు? ఎన్ని సుద్దులు జెప్పినవు, ఇంతకు నీ ఏదాంతమేవుంది-నా కండ్లొ కారంజల్లి-వానికి కాసులదంద యిస్తనంటవు? ఖల్దీ పోయి పట్కరా!

సుల్తానీ:- నే బోన.

సుల్తాన్:- (చెయ్యి పట్టుకొని క్రింద పడేసి - వేప చువ్వతో కొడ్తాడు) (కొట్టి వెళ్ళిపోతూ) బేగి తీరగొస్తగ. కాసుబు దెమ్మంచు. లేకుంటే జూడు మరి-కాసుబు పరమనందకు మట్టాలె?

సుల్తానీ:- నె నెల్లగ. వాయ్యో!! సస్తి- సస్తి (దుఃఖముతో) జోగులక్క యెంత పని జేసినవు--- జోగులక్క నిన్నెట్లైన ఏమన్న గింత మాటన్ననా—— నా కొంప గూలస్తున్నది జోగులక్క! (ఏడ్చుచు క్రిందపడి ఏడుస్తూ ఉంటుంది)

శాంతయ్య:- (ప్రవేశించి) సుల్తానీ...సుల్తానీ!

సుల్తానీ:- ఎవలూ?

శాంతయ్య:- నేను సుల్తానీ!

సుల్తానీ:- (కళ్లుతుడుచుకుంటూ) మీ కాంచెను, ఏందొర గిట్ల వచ్చిన్రు?

శాంతయ్య:- ఏమమ్మా, మళ్ళి యీపూట గూడ అంట్లు దోమటానికి రాలేదేమీ?

సుల్తానీ:- (ఆపుకోలేని దుఃఖంతో) వొంట్లోకాగలేదు దొరా! (ఏడుస్తుంది)

శాంతయ్య:- పోనీ, మీ అమ్మగారికి కబురు చెయ్యకపోయావా? మంచు పడిపించేది.

సుల్తానీ:- వద్దు- దొర- వద్దు- గట్లనే తగ్గిపోతది.

శాంతయ్య:- సరే నీయిష్టము (వెళ్ళబోయి ఆగి) ఆ! సుల్తానీ దాలా రోజుల్నుంచి చెప్పాలీ! చెప్పాలీ అనుకుంటాను?...

సుల్తానీ:- దొరా! పెద్ద దొరలు మన్నించాలె- నా పేరు సుల్తానీ కాదొర.

శాంతయ్య:- పోనీ! నీ అసలు పేరే చెప్పు-అలాగే పిలుస్తాగా!!

సుల్తానీ:- (కుమిలిపోయి దుఃఖంతో) నా కసల్ పేరేమిటున్నది. మా అమ్మ అయ్యలు నాపేరేం పెట్టిన్రో?— మా అమ్మయ్య లేదనున్నారని బోసు? లేరయ్య- శాంతయ్య దొర!- లేరయ్య- చచ్చిపోయిన్రు- ఓ అమ్మా నాపేరేం జెప్పినవ్ అమ్మా- దొరలడుగుతున్నరమ్మ!

శాంతయ్య:- ఏడవకు సుల్తానీ- ఏడవకు "దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు" నీ కథ పూర్తిగా యిపుడు తెలిసింది. అసలు నీపేరేమిటో ఎవరికొక్కవాలీ?.....సుల్తానీగానే పేరు పొందావు- సుల్తానీ అనే పిలస్తాను.

సుల్తానీ:- తమ చిత్తమొచ్చినట్లు పిలవండ్రి దొరా! నేడుఃఖపడి తమని కాధ పెట్టిక్కున్—మన్నించాలె దొర— మీ కాల్ మొక్కను (కాళ్ళపీద పడుతుంది)

శాంతయ్య:- (వంగి నమస్కరిస్తున్న సుల్తానీని - వళ్ళంతా దెబ్బలు చూచి) అదేమిటే- ఆ! వళ్ళంతా దెబ్బలు?

సుల్తానీ:- కట్టెలకు గుట్టపై కెళ్తే; కొమ్మలు గీసుతున్నాయ్; అంతే దొర.

శాంతయ్య:- నాపగ్గరెండుకే దాస్తావు-తప్పకాగి ఆ సుల్తాన్ వెదవ పిళ్ళయీ పూట కూడ నిన్ను కొట్టిపోయాడన్న మాట.

సుల్తానీ:- దొర ఎమిరికి దెలియుందేమున్నది దొరా! (ఏడుస్తుంది)

కాంతయ్య:- అబ్బ! ఇలా దుఃఖపడకే– ఎందుకే అలా ఏడుస్తావు-ఏడవకు-నా మాటవిను తల్లీ, ఇప్పటికైనా ఆ త్రాగుబోతు వెధవ సుల్తాన్ని విడిచి పెట్టు; సుఖపడతావు-ఎన్ని దెబ్బలని తింటవే వాడిచేతుల్లో? వేళకు యింత అన్నంతిని "కృష్ణ రామ" అనుకుంటూ హాయిగా మాయింట్లో పడివుండు. నిన్ను మా బిడ్డను చూచుకున్నట్లు చూచుకుంటాం— నా మాట విను తల్లీ! మీ అమ్మగారు కూడా అదే చెప్పారే!!

సుల్తానీ:- అమ్మగారు చెప్పేరు-తమరు గూడ అదే జెప్పేరు - మీ దయకు దణ్ణం బెడ్తాను (దుఃఖంతో) దొర, యీ యిల్లు సుల్తాన్ కిచ్చిన్నా-ఆడుదాన్నేల్కుంటదో కోస్కుంటదో - తన్నుకుంటదో వాని యిట్టా మెట్టుండె ఆట్టజేస్కుంటడు-నా ఇల్లిడిచి నేనెట్లరాను దొర?

కాంతయ్య:- (విసిగిపోతాడు) ఆ!.....

సుల్తానీ:- (నెమ్మదిగా దగ్గరకు పోయి) తమ మాటకు అడ్డు జెప్పిన్నా. మన్నించాలి!! నేనేమి తప్పు జేసిన్నా దొర?

కాంతయ్య:- నీ వెన్నటికీ తప్పు చెప్పవు. సుల్తానీ! నేనే తప్పు జెప్పానను కొంటున్నాను - సరె - నీ యిష్టం - పస్తాను (దూరంపోయి - వెనుదిరిగి) ఆ సుల్తానీ! మీ అమ్మగారికి ఒక్కసారి కనిపించి పోవే కలవరిస్తోంది!

సుల్తానీ:- దేవుడెయ్య వుండె గట్టనే వస్తను దొరా!

కాంతయ్య:- (వెళ్ళిపోతాడు)

సుల్తాన్:- ఆపాహై - దోస్తు - జిగరాహై (తూగివస్తాడు) (మైకంగా వుండి ప్రవేశం) కాసుల దెచ్చినవా?

సుల్తానీ:- (నివ్వెరబోయిండి)

సుల్తాన్:- ఖాతర్ష్ ఖాకతో - వస్తా బొడ్డుగుడు - పోస్తు గుడు-ఇంకెంత కాలమిట్టబతకాలె - నాదారి నే జూసుకుంటడు - అని జెప్పినట?

సుల్తానీ:- ఎవ్వరు జెప్పిన్రు?

సుల్తాన్:- విన్నవాండ్లె జెప్పెర్రు.

సుల్తానీ:- నే గట్ల చెప్పలె.

సుల్తాన్:- వరె! నీ వెట్ల జెప్తె నాకేం ? ఏం జస్తె నాకేం? ఆడ్డో దోస్తోచ్చేటి ఏలైనది, ఖుషి జేస్కొవాలె !! లేకుంటె నాకు నామోసైతది - నా లీసైతది - జల్ది బోయి పట్కరా !

సుల్తానీ:- ఆ కాసులు నేనెట్లు దేవాల్నె - నాకు తెలియకుంటున్నది.

సుల్తాన్:- (ఏడుస్తూ) నీ కెట్ల తెలుస్తది? నీ కేం తెలుస్తదంటే, నే లేకుంట జూసి పరమనందని పిలిపించడం తెలుస్తది - వాని పొట్టకు నా రూకల్ బెట్టటం దెలుస్తది -నమ్మకర్ణ నన్ గేలి జేయడం తెలుస్తది- జల్ది బొమ్మంటున్నన.

సుల్తానీ:- నే బోను.

సుల్తాన్:- బోవారె.

సుల్తానీ:- బోను. (సుల్తాన్ - సుల్తానీ పీక నులిమి క్రింద బడద్రోయును)

సుల్తాన్:- పదెలయ్యెతో జెప్తను - నాపైసల్ నూకి పరమనందకిస్తున్నదని. నిల బెట్టి తుక్కు మారగొట్టిస్తను జూడు మరి !

(అసి గాబరాగా వెళ్ళిపోతాడు)

సుల్తానీ:- (లేవలేక లేచి కళ్ళు తెరవలేక తెరచుచు—నీళ్ళు త్రాగుటకు బోయి తాగలేక - దోసిలి చూపుతూ ఒరిగిపోతుంది) దాహ మేస్తున్నది. సుల్తాన్ దప్పికై తున్నది. మరి ఏం జప్తవో జెప్పు—ఆ గరినే దెస్తను.

పరమానంద:- ఓయి! దాహమేస్తున్నదా! ఆ కుండ కడప పోలేవు-నేతెస్త జర దాగ్రని -

సుల్తానీ:- నే మట్టకు—మట్టకు—మట్టకు.

పరమానంద:- (సుల్తానీ మట్టకు) సుల్తానీ! నాకు బుద్ధిజెప్పినవు—నాబుద్ధి దిద్దు కున్నను-సుల్తాన్‌నిక్క గట్కున్నడ -నేన నమ్మకున్నడు అన్నవు -

నా కదనేవుండండ్రి — నేనే బోతను (పోబోయి) నాకెవలున్నరని బోను-ఏడ కనిబోను—నీకు బడ రుణమున్నను— యీడనే వీడ నైనా జరా నీకు సాయమై బిచ్చ మెత్తుకొని బతుకుతాను. నే పరమ నందని ఎవలికి జెప్పను — కాదనకు — దన్నం బెట్టి అడుగు తున్నను (దీనంగా)

సుల్తానీ:- పరమనందా, నాకు దన్న బెట్టకండ్రి, యిన్నటికి నీ బుద్ధి డిద్దుకున్నవా పరమనంద?

పరమానంద:- ఆ మరసిన. జరా సీర్ తాగండ్రి—దప్పికైతున్నట్లున్నది (నీళ్ళు తెచ్చి యిస్తాడు) నే నిప్పటికే సగం జచ్చిన, నన్ను మరింత జంప కండ్రి.

సుల్తాన్:- (ప్రవేశించి) పరమనందా? బద్మాష్! ఎఁదుకొచ్చినవు?

పరమానంద:- ఊరకనే. దాహ మంటన్నది...యిస్తున్నను.....

సుల్తాన్:- దాహమంటున్నది ... ఇస్తున్నవు ... గాదనలె...నా పెండ్లమున ఎందుక్కూ ముట్టుకున్నవు అంటున్నన్.

పర:- నీ పెండ్లమా-(నవ్వు) నీ పెండ్లమే గాదనలే! సుల్తాన్ ఎఁదుకా కత్తిదెస్తవ్?

సుల్తాన్:- జోగుంకక్కూ జెప్పలె నీ కత! ఏడకు బోతవురా?

(కత్తి విసురుతాడు. పరమానంద పారిపోతాడు)

(లోపల మల్లన్న అరుస్తాడు) పదేల్‌సాబ్!

మల్లన్న:- (లోపల) అరెరెరే! మా పదేలయ్యను జంపినర్రా-జంపినర్రురా! (వస్తాడు) ఎవర్రా కత్తి యిసిర్నడు? పదేలయ్యగ్గుచ్చుకున్నది.

సుల్తానీ:- మల్లన్నన్నా! పదేలయ్య గ్గుచ్చుకున్నదాన్న!

మల్లన్న:- (చూచి) అద్గొ పదేలయ్యొస్తున్నడు-ఏఁ జెప్పుకుంటరో జెప్పుకొండి, మీ గుడ్లు దీస్తడులే!

పదేల్:- (ప్రవేశించి) యెరా! నా మీదకు కత్తి యిసిర్నడు?

సుల్తాన్:- తమ మీన్కి యిసర్లే ద్గొర.

పటేల్:- ఎవలి మీన్కి యిసిర్నవు?

సుల్తాన్:- పరమానంద మీన్కి.

పటేల్:- ఎందు కిసిర్నవు?

సుల్తాన్:- నా పెండ్లాంకు నాకు లడాయైనది. నేగొట్టెన్నా.....

పటేల్:- మాకొచ్చి జెప్పినవుగ!

సుల్తాన్:- గింతల పరమనందొచ్చి, సీలుదాపించడం-తూకోబెట్టడం జేస్తన్నడు -గింతలోనే వచ్చిన్న- నా పెండ్లామును వాడు ముట్కుంటడా దొరా! కోపం ఐట్టలేక వానిపై కత్తి యిసిర్నను. ఆ బద్మాష్ దప్కున్నడు. తమకు దగిల్నది! మన్నించాలి దొరా!

పటేల్:- (తన్ని) వరె! వాడు నీ పెండ్లామును ముట్టుకుంటె మాకు జెప్పాలె- మరి మామీనకు కత్తెవిసుర్త వన్నమాట! మా మీసకు (కర్రతో కొడ్తాడు)

సుల్తానీ:- (అడ్డుపడుతుంది. కర్ర తలపై తగిలింది) అబ్బా! దొరా!

పటేల్:- సుల్తానీ! గెంతపనిజేసినావె-గెంతపనిజేసినావ్. వానిదెబ్బ నీవెందుకు దిన్నవ్? మల్లన్నా-సుల్తాన్న బట్కరా-బట్కరా వాన్ని - మల్లన్న అడుగో, సుల్తాన్ దిరుకుతున్నడు-బట్కరా వాన్ని-ఠానాకి బట్కరా వాన్ని.

మల్లన్న:- గట్లనే దొరా!!

కాంతయ్య:- ఇదేమి ఖర్మమే? వాడు నిన్ను కొట్టింది చాలక వాని దెబ్బలు కూడా నీవెందుకు తిన్నావే? ఆ త్రాగుబోతు సన్యాసి నాకెదురై చెప్పి ఆట్లా పారిపోతున్నాడు.

సుల్తానీ:- దొర! దొర!! (బావురుమంటుంది)

కాంతయ్య:- సుల్తానీ... నీవు సామాన్యురాలివికావు. మహాసాధ్వివి. నిన్న చూచింది మొదలు నీలో ఏదో తేజస్సు పుందని నాకు తెలుసున.

కర్మ శేషంకోసం యీ మొరటుమృగాల చేతులలో పడ్డాడ్. యిప్పటి కైనా నామాట వినమ్మా-సుల్తానీ- యీ అంటువెధవ సుల్తాన్ను విడిచి పెట్టు, నిన్ను మా బిడ్డను చూచుకొన్నట్లు చూచుకుంటామ్; భగవంతుని ధ్యానంచేస్తూ మా యింట్లో కాలం గడుపు.నామాటవిను తల్లీ!

సుల్తానీ:- ఆయ్యా! అయ్యా!! నా ప్రాణంకే నాకు బరువైనది. తిరిగి తమరికి నేను మరిగింత బరువైతను - తమరెప్పుడు నన్నొక బిడ్డగనె-జూసుకున్నరు - అంట్లదానిగ జూశలె-అతడు గట్ల జేస్నిద-యీతడిట్ల జేస్తున్నడు-(తన్మయత్వం బొందుతూ) దేవర! దేవుడిప్పుడే నా తలలో దిగిండు!! (ఆవేదన... భగవంతుడు తనలో ప్రవేశించినట్లు-అందరిని కలయ చూచి) ఏమో చెప్తున్నడు, ఏడకో రమ్మంటున్నడు (వినయ బాష్పాలతో) మీ కెల్లరకిది ఎట్ల జెప్పాల్నో మాటలు దెలియకుంటున్నయ్ (లీలగా నవ్వుతూ) శాంతయ్య దొర! తమర్ని ఒక్కటి గోర్తాను.

శాంతయ్య:-ఏమిటది సుల్తానీ?

సుల్తానీ:- తమరి కడ — నేవాసిన కాసుబు ఆ పరమనంద కిచ్చేయ్యండి — నేనా తనితో జతబట్టినపుడు అతడు సంపాదించినడు— నన్నెల్లగొట్టినపుడు — తిని బత్క మున్నడు. ఇది తిని బత్క మన్నడు దొర ! (వినన్నట్లు తలూపుతుంది)

పరమానంద:- (ప్రవేశించి సుల్తానీ చూస్తాడు) సుల్తానీ ! ! ఏంగట్ల నున్నవు ?

సుల్తానీ:- పరమానందా ! నీవేవచ్చినవా ? నీతె పిలవరంపాతె తానుకుంటున్నను (శాంతయ్యతో) దొరా ! ఆనసులు వీరికి నవ్వుల్రా.

పరమానంద:- నా కొద్దు. దొర ! నా కొద్దు. ఆ కాసుల సుల్తానీకే ఇచ్చారే. ఆ కాసులు సుల్తానీకే. ఇవుని పీకల్ మొక్తను.

సుల్తానీ:- ఆ కాసులు నా కెందుకు? నా కా వడ్డికాసుల వాడే వున్నాడు. వీడు కొండల వాడా!

శాంతయ్య
పరమానంద } సుల్తానీ!!!...

సుల్తానీ:- వేంకటరమణా!

శాంతయ్య
పరమానంద } సుల్తానీ!!...

సుల్తానీ:- వడ్డి కాసుల వాడా! వేయి నామముల వాడా! (భగవంతునిలో ఐక్యమైపోతుంది)

శాంతయ్య
పరమానంద } సుల్తానీ!!...

పరమానంద:- (ఒక క్షణము ఆగి) సుల్తానీ, ఏంట్లనైనది ! వాయో, ఊపిరే పీల్చదు—మాట జెప్పదు (అని వూరుకుంటాడు) సుల్తానీ!

శాంతయ్య:- ఇంకెక్కడి సుల్తానీ—సుల్తానీ ఇక మనకు లేదు. పూర్వజన్మ సుకృతం వల్ల ఆ "వేయి నామముల" వానిలో ఐక్యమైపోయింది. (తెర జారుతుండి. అందరూ దుఃఖంతో వుంటారు)

చింతయ్య:- "నీవు కాలేనాడు కావలుందురు గాని, వెంటనెవరూ రారు చిలుకా" (అని పాడుతూ వుంటాడు.)

[తెర]

చీకటి తెరలు

రచన :

గన్నిశెట్టి

పాత్రలు

శంకర్

మురళి

చంద్రయ్య

నిర్మల

[రంగము : ఇంటి మధ్యభాగం. హాలు మధ్యన పేముకుర్చీలు, టిపాయ్; ఒక ప్రక్కగా ఈజీచైర్, వెనుక భాగంలో టేబుల్, టేబుల్‌పైన అలారం క్లైంపిన్, మేగ్‌జైన్స్, శంకర్ ఫొటో, రేడియో. గోడలకు రకరకాల ఫోటోలు, వర్ణ చిత్రాలు. ఇంటిలోనికి, బయటకు వాకిళ్ళు. తెర ఎత్తేసరికి శంకర్ కుర్చీలో కూర్చున్నాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. ముఖమంతా స్ఫోటకం మచ్చలతో వికృతంగా ఉంది. కళ్ళు రెండూ గ్రుడ్డివి. వయస్సు 28-30. చేతిలో వంకె కర్ర పట్టుకొని వున్నాడు. రేడియో నుండి తక్కువ స్థాయిలో సంగీతం విన్పిస్తూ వుంటుంది. కొంచె మూగి నౌకరు చంద్రయ్య కాఫీ తీసుకొని వచ్చాడు. వయస్సు 45; నెరిసి నెరవని జుట్టు...]

చంద్రయ్య:- బాబూ!

శంకర్:- ఊఁ!

చం:- టీ తీసుకోండి (అందించాడు. శంకర్ టీ త్రాగి కప్పును అతనికి ఇచ్చాడు. శంకర్ ఏదో వెదుకుతున్నాడు టేబుల్‌పైన) ఏమిటి బాబూ?

శంక:- సిగరెట్.

చం:- (సిగరెట్ కేసుతుండి సిగరెట్ తీసిఇచ్చి అగ్గిపుల్ల ముట్టించాడు)

శంక:- చంద్రయ్యా!

చం:- బాబూ!

శంక:- ప్రైమెంతయింది?

చం:- ఐదున్నర దాటింది బాబూ!

శంక:- ఐదున్నర! (గట్టిగా శ్వాసలాగి) యివ్వాళ గతియాగం ముందుకు జరగట్లేదు.

చం:- కాస్సేపు వరండాలో కూర్చుంటారా బాబూ?

శంక:- వద్దులే. ఇక్కడే హాయిగా ఉంది.

చం:- (కొంచెమాగి) బాబూ !

శంక:- ఊఁ.

చం:- మీరు రోజు రోజుకు చిక్కిపోతున్నారు బాబూ!

శంక:- నిజంగానా చంద్రయ్యా?

చం:- నిజంగానా అంటారేం బాబూ! బొమికల గూడులా అయిపోయారు.

శంక:- (చిరునవ్వు నవ్వాడు)

చం:- మీరు దిగులు పడకండి బాబూ; ఎలా జరగాలో అలా జరుగుతుంది.

శంక:- నేనేం దిగులుపట్టంలేదే !

చం:- (విసరుతూ) నాకు తెలుసు బాబూ, మీరెంత క్రుంగిపోతున్నారో. నాకు తెలుసు. ఏం పాపం చేశారని మీ కీ ఖర్మ రాయాలి?

శంక:- దైవ నిర్ణయాని కెవరేం చేస్తారు చంద్రయ్యా ?

చం:- దైవ నిర్ణయం! మీలాంటి ధర్మరాజుకు కళ్లు పోగొట్టటం, ఇదేనా భగవంతుడి న్యాయమంటే.....(కంఠం రుద్ధమైంది) నా గుండెలు తరుక్కుపోతున్నయ్ బాబూ, మిమ్మల్ని చూస్తుంటే.

శంక:- ఎందుకు చంద్రయ్యా, ఈ నిర్భాగ్యుడిపైన నీకంత మమకారం? (లేచాడు)

చం:- మీరుతప్ప నా కింకెవరున్నారు బాబూ లోకంలో. నా అనేవాళ్ళంతా నట్టేట కలసి, మతిచెడి తిరుగుతున్న నన్ను దగ్గరకు తీసి మళ్ళీ మనిషిని చేశారు. మీరే లేకపోతే యెప్పుడో దిక్కులేని చావు చచ్చి వుండేవాణ్ణి. నేను అడుగుబెట్టింతర్వాతనే మీకీ ఖర్మ రాసింది.

శంక:- చంద్రయ్యా!

చం:- అవును బాబూ! నా మొఖం చూస్తేనే శని పట్టుకుంటూంది. నేను రాకపోతే మీకి...

శంక:- చంద్రయ్యా! ఏం మాటలవి? నా ఖర్మకు నీవేంచేస్తావు చంద్రయ్యా? ఏ పూర్వజన్మ పాపఫలమో ఈ జన్మలో అనుభవిస్తున్నాను. (క్షణం నిశ్శబ్దం)

చం:- మీకిక చూపు రానట్లేనా బాబూ?

శంక:- అంతా అలానే అంటున్నారు.

చం:- అంతేనా. నాకు చావొస్తే ఎంత బాగుణ్ణుబాబూ ?

శంక:- ఎంత స్వార్థం చంద్రయ్యా నీది!

చం:- బాబూ!

శంక:- అవును చంద్రయ్యా! ఈ స్థితిలో నువ్వు కూడా లేకపోతే నాకు దిక్కెవరు చెప్పు ?

చం:- (కళ్లు తుడుచుకుంటూ) పోను బాబూ. మీకోసం బ్రతికే వుంటా.

శంక:- ఆత్మీయులంతా దూరమయ్యారు. నువ్వొక్కడివే మిగిలావు. ఈ స్థితిలో నువ్వే లేకుంటే నాగతేమయ్యేది?

చం:- (కొంచెమాగి) ఏమిటో బాబూ, అంతా అయోమయంగా వుంది. మీరు చూస్తే ఇలావుంటిరి; అమ్మగారికి చీమకుట్టినట్లయినాలేకపోయె. ఎప్పుడూ ఆ నాటకాలు, సినిమాలు, షికార్లు దప్ప...

శంక:- అమెకు మాత్రం బాధ లేదంటావా చంద్రయ్యా?

చం:- అంతమాట నేనెందుకన్నాల్లే బాబూ. కనబడుతూనే వుండిగా.

శంక:- (బాధను కప్పిపెట్టుకుంటానికి ప్రయత్నిస్తూ)చిన్నతనంలేచంద్రయ్యా!

చం:- హాఁ, చిన్నతనం. ఇంకో ఆరకూతురయితే ఈపాటికి మంచ మెక్కకపోయిందా దిగుల్తో.

శంక:- వెళ్ళు చంద్రయ్యా, నీ పని చూసుకో.

చం:- వెళతానులే బాబూ, కాసేపు చల్లగాలిలో కూచోండి, ఉక్కతోస్తోంది.

శంక:- ఇక్కడే కావుందిలే. (కుర్చీలో కూర్చున్నాడు)

చం:- (అతనివంక జాలిగా చూస్తూ లోనికెళ్ళబోయి ఆగారు) ఆ రేడియో అన్నా పెట్టుకోండి, బిక్కు-బిక్కుమంటూంది.

శంక:- (చిరునవ్వుతో) సరే.

[స్విచ్ ఆన్ చేసి చంద్రయ్య లోనికెళ్ళాడు. రేడియోలో సన్నని వయొలిన్ నాదం. కొంచెమయిన తర్వాత బయట కారాగిన శబ్దం. కిల కిల నవ్వులు... శంకర్ రేడియో ఆపేశాడు. నిర్మల కూని రాగంతో వచ్చింది. సన్నగా, అందంగా వుంది. వయస్సు 20-22. వేనిటీ బాగ్ త్రిప్పుకుంటూ సరాసరి లోనికెళుతుంది]

శంక:- ఎవరు ? నిర్మలా!

నిర్మ:- (ఆగి) ఓ, యిక్కడున్నారా ?

శంక:- యెవరు బయట మాట్లాడుతూంది ?

నిర్మ:- శెక్రటరీ మూర్తి.

శంక:- లోనికి రాలేదేం ?

నిర్మ-: పనుందని వెళ్ళాము, ఆఁ వస్తా, డ్రస్ చేంజి చేసుకోవాలి (వెళ్ళింది).

[శంకర్ సిగరెట్ ముట్టించి అటు ఇటు తిరుగుతున్నాడు. మురళి బయటనుంచి వచ్చాడు. వయస్సు పాతికేళ్ళకు పైగా ఉంటుంది. దిప్‌టాప్‌గా వున్నాడు].

మురళి:- (వస్తూనే) హల్లో, శంకర్ ! How are you?

శంక:- యెవరు ? మురళీ!

మురళి:- yes, నిర్మల వుందా?

శంక:- లోపలుంది. కూర్చో మురళీ! (శంకర్ తడువుకుంటూ సోఫా దగ్గరగా వస్తున్నాడు. మురళి ఎదురుగా వెళ్ళి అతన్ని నడిపించుకొచ్చాడు. యిద్దరూ కూర్చున్నారు) విశేషాలేమిటి మురళీ ! నాటకం ఎంత వరకొచ్చింది ?

మురళి:- వచ్చే నెలలో ట్రేస్ చెయ్యగలం మనుకుంటున్నాం. థియేటర్ యూనివర్సరీ కూడా వచ్చేనెల్లోనేగా.

శంక:- ఐ సీ.

మురా:- (సిగరెట్ అందిస్తూ) సిగరెట్ కాల్చు శంకర్! (సిగరెట్ యిచ్చి అగ్గిపుల్లగీసి ముట్టించాడు. తనూ కాల్చుకొని పొగవదలి తాపీగా) ఏమిటో ఈ జీవితాలు. నిరుడీ రోజుల్లో అందరం కలసి ఎంతో సరదాగా నాటకం ప్రాక్టీసు చేస్తున్నాం. అప్పుడు కనీసం ఊహించ గలిగామా నువ్విలాగయిపోతావని.

శంక:- విధికృతాన్ని ఎవరు తప్పించుకోగలరు మురళీ!

మురా:- నిజం చెబుతున్నాను శంకర్! నువ్వులేని లోటు మాత్రం మా కెన్నటికీ తీరదు. నీ సంగతి గుర్తుకొచ్చినప్పుడల్లా చాలా యిదిగా వుంటుంది.

శంక:- థ్యాంక్స్ (అస్పష్టంగా)

మురా:- ఈ నాటకం కాగానే మన మొకసారి కలకత్తా వెళ్ళొద్దాం శంకర్!

శంక:- దేనికి ?

మురా:- అక్కడ సతీష్ అనే మా ఫామిలీ ఫ్రెండ్ ఒకాయన వున్నారు, "ఐ" స్పెషలిస్ట్. ఆయన కొకసారి నిన్ను చూపిద్దామనుకొంటున్నాను.

శంక:- నీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి మురళీ! కాని నాకు తిరిగి చూపు వస్తుం దనే నమ్మకం లేదు.

మురా:- ఆలా అనకు శంకర్! నీకు తప్పకుండా చూపు వస్తుంది. నాకా నమ్మకం వుంది.

నిర్మ:- (వస్తూ) హలో మురళీ, ఎంత సేపయింది వచ్చి ?

మురా:- జెస్ట్, ఇప్పుడే, నువ్వు క్లబ్బులో వున్నావేమో ననుకున్నాను.

నిర్మ:- (కూర్చుంటూ) క్లబ్బులో కూర్చొని కూర్చొని విసుగెత్తి వచ్చేశాను బాబూ ..... (లోనికి చూచి) చంద్రయ్యా!

చం:- (లోపలినుండి) అమ్మా!

నిర్మ:- టీ పంపించు.

ముర:- నిజంగా యీ నాటకంలో మన నిర్మల యాక్టు చేస్తోంది శంకర్; అబ్బ ఏం చెప్పనులే. (వ్యంగ్యంగా అన్నాడు.)

శంక:- అంత బాగా యాక్ట్ చేస్తోందా?

ముర:- బాగా అంటావేమిటి? నిన్న క్లయిమాక్సు సీనులో నా కళ్ళవెంట నీళ్ళు తిరిగాయంటే నమ్ము.

నిర్మ:- ఆబ్బ! ముల్గ చెట్టెక్కించకయ్యా బాబూ! (చంద్రయ్య టీ తెచ్చి టీ పాయ్‌మీద పెట్టాడు.)

ముర:- అసలు శంకరే ఆ ''రవి'' పాత్ర ధరించివుండేనా.

నిర్మ:- (అందిస్తూ) టీ త్రాగు ముందు.

ముర:- థ్యేంక్సు. (అందుకున్నాడు)

నిర్మ:- (శంకర్‌కు కప్పు అందిస్తూ) టీ తీసుకోండి.

శంక:- వద్దు. యిప్పుడే తాగాను.

నిర్మ:- పర్వాలేదు కొంచెం తీసుకోండి.

ముర:- మా కోసం కొంచెం తీసుకో శంకర్! (శంకర్ కప్పు అందుకున్నాడు. చంద్రయ్య లోనికెళ్ళాడు. మురళి కప్పు దింపేస్తూ) మన ప్రయాణం శంకర్‌కు చెప్పావా?

నిర్మ:- ఇంకా లేదు. (చెప్పమన్నట్లు సైగ.)

శంక:- ప్రయాణమేమిటి?

ముర:- మహాబలిపురం పిక్నిక్ వెళుతున్నాంలే.

శంక:- ఎవరెవరు?

ముర:- అంతా పదిమందివరకుంటాం. దాదాపు థియేటర్ మెంబర్సంతా కదుల్తున్నారులే.

శంక:- అలాగా,

మురా:- మూడు రోజులు ప్రోగ్రాం (నిర్మలవంక కొంచెంగా చూచాడు. ఆమె మూతి త్రిప్పింది వెక్కిరిస్తున్న ధోరణిలో. మురళి ఆమె బుగ్గపై లాలనగా వ్రేలితో మీటాడు. ఆమె సుతారంగా వెనక్కు సర్దుకుంది. మురళి సిగరెట్ తీసి) సిగరెట్ కాల్చు శంకర్!

శంక:- వద్దు. (లేచి నిలబడి) చంద్రయ్యా.....

మురా:- ఏమిటి శంకర్?

శంక:- ఆఁ ఏం లేదు. తలనొప్పిగా వుంది. కాసేపు రెస్ట్ తీసుకోవాలి. మీరు మాట్లాడుతూ వుండండి...

మురా:- ఏదైనా ''పేట్లెట్'' వేసుకుంటే...

శంక:- ఆక్కర్లేదులే...చంద్రయ్యా!

చం:- బాబూ (వచ్చాడు).

శంక:- నన్ను లోనికి తీసుకెళ్ళు. (చంద్రయ్య లోనికి తీసుకెళ్ళాడు.)

మురా:- ఏమిటో పాపం! శంకర్ బ్రతుకిలా అయింది. ఎలాంటి వాడెలా అయిపోయాడు. (అతను వెళ్ళినవైపే చూస్తూ జాలిగా అన్నాడు.)

నిర్మ:- (ధోరణి మారస్తూ) ఆ, మురచాను ఇవ్వాళ పిక్చరు ప్రోగ్రాం.....

మురా:- సారీ, నేనా మాటే మరచాను. సెకండ్‌షోకెళదాం. యింక నే వెళ్ళిరానా మరి?

నిర్మ:- (కొంచెంగా చూస్తూ) నే రమ్మంటే వచ్చావా, నన్నడిగి వెళ్ళటానికి.

మురా:- ఊఁ (ఆమె బుగ్గపైన చిటిక వేశాడు.)

నిర్మ:- హుష్.....(వెనక్కి జరిగింది)

మురా:- ఎన్నాళ్ళు నిర్మలా. యీ దొంగ బ్రతుకు?

నిర్మ:- ఏం చేద్దామంటావ్?

మురా:- నువ్వు పూర్తిగా నా దానివి కావాలి. మన మధ్య ఆడుగోడ లుండటం నా కిష్టంలేదు నిర్మలా!

నిర్మ:- అందుకేం లేదూ! చెప్పు మరి. (వయ్యారంగా ఆటు ఇటు తిరుగుతూంది.)

ముర:- (ఆమె ననుసరిస్తూ) నాకేం తోచడంలేదు.

నిర్మ:- అబ్బ! ఎంత ఆమాయకులు "వెన్న పెడితే మింగలేరు, వేలు పెడితే కొరకలేరు" అవునా? ఊఁ! (నవ్వింది.)

ముర:- ఎగతాళి కాదు నిర్మలా! నన్నేం చెయ్యమంటావు చెప్పు. నీ కోసం గంగలో దూకిటాసికైనా సిద్ధమే.

నిర్మ:- నిజంగానా?

ముర:- ఆ...చెప్పు నిర్మలా. (చెయ్యి పట్టుకుంటాడు.)

నిర్మ:- అయితే, వెంటనే.....

ముర:- ఊఁ... వెంటనే

నిర్మ:- పెళ్ళి చేసుకుందాం.

ముర:- పెళ్ళా!

నిర్మ:- ఏఁ?

ముర:- మరి...శంకర్.

నిర్మ:- అది నీ కనవసరం. అయినా ఆయన నాకు తాళి గట్టలేదుగా - (వెళ్ళి కుర్చీలో జారబడింది.)

ముర:- ని-ర్మ-లా (అస్పష్టంగా అన్నాడు.)

నిర్మ:- ఏం యిష్టం లేదా?

ముర:- అదికాదు నిర్మలా, నీకోసం తనవాళ్ళ నందరినీ వదులుకొని వచ్చేశాడుగా పాపం. యీ స్థితిలో నువ్వు వదిలిపెడితే శంకర్ ఏమైపోవాలి?

నిర్మ:- (లేచి దగ్గరకు వచ్చింది) శంకర్‌పై నాకూ అభిమాన మంది మురళీ! అతను నాకోసం త్యాగం చేశాడు. నే నా మాట కాదన్నా ... ఒక

విధంగా నేనూ ఆటువంటి త్యాగమేచేశానేమో?...అదంతా వదిలేయ్. ఆయనంటే నాకు చాలా గౌరవముంది. కాని...కాని ఆ కురూపి కోసం నా యవ్వనం బలిపెట్టుకోలేను మురళీ!

ముర:- నిర్మలా!

నిర్మ:- అవును మురళీ! యీనాడు ఆయనవల్ల ఏ విధంగానూ సుఖపడలేను...ఆ రూపం...ఆ వికృతరూపం తలచుకుంటేనే వళ్ళు జలదరిస్తుంది. అందుకే ప్రతిక్షణం ఆయన్నుండి తప్పించుకు తిరుగుతున్నాను.

ముర:- (శంకర్ ఫోటో దగ్గరగా వెళ్ళాడు)

నిర్మ:- (అతని దగ్గరగా వెళ్ళింది) ఆలోచించు మురళీ! నాదేమంత పెద్ద వయస్సు కాదుగా. యీ వయస్సులో కోరికలన్నీ కాల్చివేసుకొని ప్రతికేకన్నా మృత్యువునే వరించడం మంచిది గాదా!

ముర:- నిర్మలా!

నిర్మ:- యింకేం చెప్పకు మురళీ! నా కిప్పుడు నీ ధ్యానం తప్ప వేరేమీ లేదు. (అతని భుజంపై తలవాల్చింది) నీ ధ్యానంలోనే సర్వం మరచిపోతున్నాను మురళీ! ఏది ఏమైనా నాకు నువ్వే కావాలి. నీ కోసం యే పాపానికైనా, ఏ త్యాగానికైనా సిద్ధమే మురళీ! నువ్వు లేందే నేను ప్రతకలేను మురళీ! (తన్మయత్వం జెందుతూ మాట్లాడింది)

ముర:- (దగ్గరకు తీసుకొని) పిచ్చిదానివై పోతున్నావు నిర్మలా!

నిర్మ:- నువ్వు నన్నిలా చేశావు మురళీ!

ముర:- నిర్మలా... (లోపల చప్పుడవుతుంది. యిద్దరూ దూరమయ్యారు చంద్రయ్య వచ్చాడు) నే వెళ్ళొస్తా నిర్మలా! (తడబడుతూ అన్నాడు.)

నిర్మ:- ఆఁ ఊఁ, (మురళి వెళ్ళాడు. చంద్రయ్య ఖాళీ కప్పులు తీసుకొని అదో విధంగా చూస్తూ లోనికి వెళ్ళాడు. నిర్మల సన్నగా పాట పాడుతూంది. చంద్రయ్య లోపలినుండి మళ్ళి వచ్చాడు.)

చం:- అమ్మా!

నిర్మ:- (మేగజైన్ చూస్తూనే) ఏమిటి?

చం:- బాబుగారు బెంగపడి పోతున్నారు తల్లీ!

నిర్మ:- (యాదాలాపంగా) దేనికి?

చం:- మీరు తప్ప వారి కింకెవరున్నారు చెప్పండి.

నిర్మ:- అంటే?

చం:- వారి బాగోగులు మీరు చూడకపోతే ఇంకెవరు చూస్తారు.

నిర్మ:- ఆయితే నే నిప్పుడొదిలేశానంటావా?

చం:- అది కాదమ్మా.

నిర్మ:- ఏది కాదు (తీవ్రంగా అడిగింది.)

చం:- మీరు కోప్పడితే నేనేం చెప్పేది.

నిర్మ:- కాకపోతే ఏమిది మరి? (కఠినంగా) అలుసిచ్చినంత మాత్రాన అంత స్థులు మరవటం మంచిదికాదు.

చం:- ఆంతస్థులు మరచి నేనేమన్నాను తల్లీ, ఆ మహారాజుని చూస్తుంటే కడుపు తరుక్కుపోయి నోరువిప్పానుగాని.

నిర్మ:- బయట్దేరావులే పెద్ద దయాసిధివి.

చం:- (కొంచెం సీరియస్‌గా) నా దయాధర్మాల్తో ప్రయోజన మేమిటి లేమ్మా! గ్రుడ్డి కన్ను మూసినా తెరచినా ఒకటేనని...

నిర్మ:- ఆలా అనుకున్నవాడివి నోరు మూసుకొని కూచోవాలి...

చం:- అంతకన్నా నేను చేయగలిగేదేమున్నా ఆనందంతో చేసి వుండేవాణ్ణి. ఏం చెయ్యలేకనే ఏదెలా జరుగుతున్నా ఏమీ జరగనట్టే కాలం వెళ్ళబుచ్చుతున్నాను.

నిర్మ:- (సీరియస్‌గా) ఏమిటి జరిగేది?

చం:- జరిగేదేమిటో ఒక్కసారి ఆలోచించుకుంటే అంతా మీకే తెలుస్తుంది.

నిర్మ:- చంద్రయ్యా, వొళ్ళు దగ్గరపెట్టుకుని మాట్లాడడం మంచిది.

చం:- ఆపండి. (సీరియస్‌గా) మాటజారేముందు కొంచెం వెనకాముందు ఆలోచించుకోవటం మంచిది.

నిర్మ:- ఆఁ, ఎంత పొగరు! మాటకు మాట అనే వరకూ వచ్చిందే.

చం:- ఎందుకనరూ! ఆ యింటికి ఈ యిల్లెంతో ఈ ఇంటికీ ఆ యిల్లంతే. ఆ మహారాజుపై వున్న విశ్వాసంతో యిక్కడున్నాగాని మీతో మాటలు పడటానికికాదు.

నిర్మ:- (కొంచెం స్థాయి తగ్గించి) కూటికోసం పంచనజేరి మాకే నీతులు చెప్పటానికి తయారయ్యావు.

చం:- అందరు ఆ స్థితిలో వున్నవాళ్ళే మొదట. కాకపోతే శంకరంగారి పుణ్యమాని ఈ రోజు...

నిర్మ:- నోర్ముయ్ (చెయ్యెత్తి, కొట్టకుండానే ఆగిపోయింది)

చం:- (తీవ్రంగా) ఆగారేం? మీమీద నాకింకా అభిమానం పోలేదుగాబట్టే యింతకుమించి ఏమీ అనలేక పోతున్నాను. లేకుంటే. (వెళ్ళాడు.)

నిర్మ:- (కుర్చీలో కూలబడి కొప్పుతూ) వె...ధ...వ.

శంక:- (లోపలినుండి వచ్చి) ఏమిటి నిర్మలా గొడవ?

నిర్మ:- ఏముంది, అలుసిచ్చి నెత్తినెక్కించుకుంటే సరి.

శంక:- ఎవరి సంగతి?

నిర్మ:- యింకెవరున్నారు, తెచ్చిపెట్టారుగా పోతురాజుని.

శంక:- చంద్రయ్యేనా? ఏమన్నాడు?

నిర్మ:- ఏమయినా అంటాడు. వళ్ళు కొవ్వితే సరి.

శంక:- పోనివ్వు నిర్మలా. ఏదో పెద్దవాడు, బ్రతికి చెడ్డవాడు.

నిర్మ:- మీరిలా అనే వాడికి కళ్ళు నెత్తికి తెచ్చారు. (చరచర లోనికెళ్ళింది.)

[శంకర్ అటు యిటు తిరుగుతున్నాడు]

చం:- (లోపలినుండి చేతిలో సంచితో వచ్చాడు) ఐదాడు కెళ్ళి పళ్ళు తెస్తాను బావా!

శంక:- ఊఁ (చంద్రయ్య వెళుతున్నాడు) చంద్రయ్యా!

చం:- ఏమిటి బావా?

శంక:- నిర్మలనేమయినా అన్నావా?

చం:- లేదు బావా!

శంక:- మరేమిటి యింతకు ముందు...

చం:- ఏదో పెద్దతనఁ. ఒకటి చేయబోయి మరొకటి చేస్తుంటాను. అందుకని ఏదో కోప్పడ్డాడులెండి, వస్తా. పొద్దుగూకుతోంది. (వెళ్ళాడు.)

శంక:- (ఆలోచిస్తూ టేబుల్ వద్దకు నడిచాడు. సన్నగా దగ్గు)

నిర్మ:- (వచ్చి) తలనొప్పి తగ్గిందా?

శంక:- ఆఁ (టేబుల్ పైన వెదుకుతున్నాడు)

నిర్మ:- ఏం కావాలి?

శంక:- సిగరెట్.

నిర్మ:- (రేడియో ప్రక్కనున్న సిగరెట్‌కేస్, అగ్గిపెట్టె తెచ్చియిచ్చి) అబ్బ, ఎందు కీ పాడు సిగరెట్లలా తగలేస్తారు? ఆరోగ్యం చెడిపోదూ!

శంక:- (బరువుగా) ఇంకా చెడేదేముంది, బ్రతుకే పూర్తిగా చెడిపోయిందిగా! (దగ్గుతూ సిగరెట్ ముట్టించాడు. నిర్మలం ఏదో అనబోయి ఆగింది. క్షణం నిశ్శబ్దం) నిర్మలా! (అటూ ఇటూ నడుస్తాడు.)

నిర్మ:- ఏమిటంది?

శంక:- నన్ను మా వూరు పంపించు నిర్మలా!

నిర్మ:- (గతుక్కుమంది) అదేమిటి?

శంక:- నే నిక్కడ వుండలేను నిర్మలా!

నిర్మ:- ఏం?

శంక:- యీ రోజు- యింత దీర్ఘకాలం తర్వాత, నాకు మా వూరు, నా స్వజనం గుర్తుకొస్తున్నారు. వాళ్ళ దగ్గర కెళ్ళాలని మనస్సు తహ తహలాడుతోంది.

నిర్మ:- స్వజనం! నేను పరాయి దాన్నా, (ఉద్రేకంలేకుండా అడిగింది.)

శంక:- అంత మా టకగలనా నిర్మలా ? యిన్నాళ్ళూ నీవు నాపైన చూపిన ప్రేమ, అనురాగం ఎలా మరువగలను? భగ్న హృదయు డనై వ్యధచెందుతున్ననాకు నీసాహచర్యం లభించటంతో ఎడారిలో అమృత వర్షం కురిసినట్లయింది. మోడువారిన బ్రతుకు మరల చిగురించింది. నీతో కలసి స్వర్గసౌఖ్యా లనుభవించాను. నీ నుండి చాలా పొందగలిగాను.

నిర్మ:- మరి...

శంక:- జీవితమంతా ఆ వెన్నెల అలా నిలచిపోతుందని భ్రమించాను. బ్రతు కులో అమావాస్య రాదని ఆశించాను కాని...కాని ...

నిర్మ:- ఏమిటండీ ఈ ధోరణి (దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకుంది) యిప్పుడే మయింది?

శంక:- (ఆవేదనగా) విధి నా కెదురయ్యిని నిర్మలా! నేనిక్కడ నుండి... శాశ్వతంగా వెళ్ళిపోవా లనుకుంటున్నాను.

నిర్మ:- శాశ్వతంగానా!

శంక:- అవును.

నిర్మ:- కారణం?

శంక:- చెప్పలేను.

నిర్మ:- కారణం చెప్పకుండా వెళతాననటంలో అర్థంలేదు.

శంక:- నిర్మలా...ఒక్క మాటడుగుతాను నిజం చెప్పగలవా?

నిర్మ:- ఎందుకు చెప్పలేను.

శంక:- నీవు నన్ను యింకా ప్రేమిస్తూనే వున్నావా? (నిర్మం షాక్ తిన్నట్ల యింది) చెప్పు నిర్మలా! (బుజం పట్టుకొని వూపాడు.)

నిర్మ:- అర్థంలేని ప్రశ్న (తీవ్రంగా అంది.)

శంక:- (సన్నగా నవ్వాడు) అవును అర్థంలేని ప్రశ్నే! తెలుసు నిర్మలా, నిజాన్ని వప్పుకునే ధైర్యం నీకు లేదు.

నిర్మ:- ఏమిటా నిజం?

శంక:- నీకు నామీద రోత పుడుతోంది. నా నుండి దూరంగా తప్పుకోటానికి ప్రయత్నిస్తున్నావు. ఇది నిజం కాదా నిర్మలా ?

నిర్మ:- మీకు పిచ్చిపట్టలేదు కదా.

శంక:- అవును పిచ్చే పట్టింది.

నిర్మ:- కాసేపు రెస్ట్ తీసుకోండి.

శంక:- నీ తప్పేమీలేదు నిర్మలా. నిజంగా నేను నీకు తగను. ఈ వికృత రూపాన్ని, ఈ కఠోరిని నువ్వెలా ప్రేమించగలవ్?

నిర్మ:- మీరు మనస్సెందుకో పాడయింది. నా మాట విని కాస్సేపు రెస్టు తీసుకోండి. రండి లోనికెళదాం. (చెయ్యి పట్టుకుంది.)

శంక:- (ఆమె చేయి తన ఆరచేతుల్లోకి తీసుకుంటూ) మనం కలుసుకొన్న తొలిరోజులు గుర్తున్నయ్యా నిర్మలా ? (నిర్మల జవాబియ్యదు. అతను శూన్యంలోకి చూస్తూ) యింత సర్వనాశనం తర్వాతకూడా ఆ మధుర క్షణాలు నా స్మృతిపథం నుండి తొలగిపోవటం లేదు నిర్మలా. ఎంత తియ్యని రోజులవి? ఎంత కమ్మని కలలు. ఆ వెన్నెల రాత్రులు-ఆ సముద్రతీర విహారాలు. అబ్బ! యెంత మధురాతి మధురం నిర్మలా, ఆ జీవితం. (నిర్మల శూన్యంలోకి చూస్తూ తన చేతిని అతని చేతులమధ్య నుండి తీసుకోటానికి ప్రయత్నించింది. ఆమె చేయి మృదువుగా స్పృశిస్తూ) ఉండు నిర్మలా, ఒక్క రెండు నిమిషాలిలానే వుండు. ఆ మధురక్షణాలు స్మరించుకొందాం...మనం కలుసుకొన్న తొలిరోజులు గుర్తుకొస్తున్నాయా నిర్మలా! అప్పుడు నువ్వు పొట్టకోసం కిరాయి నాటకాల్లో వేషాలు వేస్తుండేదానివి. అప్పటికి నాకింత పేరూ లేదు. మామూలు నటుణ్ణి.

చిన్న రచయితను. సరదాకోసం నాటకాలాడుతుండేవాణ్ణి. నువ్వు తరుచు నా నాటకాల్లో పాల్గొంటుండే దానివి. ఆ రోజుల్లో అవ్యక్త మైన భావంతో నువ్వు నా కళ్ళల్లోకి చూస్తూండేదానివి. నీ చూపుల్లో (క్రమంగా చేయివదలి శూన్యంలోకి చూస్తూ) అర్థంగాని ఏదో ఆశ నా హృదయా న్నాక్రమించింది. ఒకరోజు నీవు చెప్పావు...నా అర్ధనిమీలిత నేత్రాలు నిన్ను ఏదో లోకానికి తీసుకెళుతున్నవనీ... నా కళ్ళల్లోనికి చూస్తూండే లోకాన్నే మరచిపోతున్నాననీ... కాదా నిర్మలా? (నిర్మల ఆలోచిస్తూ నిలబడిపోయింది) నిరాశ సుడిలో అణిగిపోతున్న నాలో ఆశలు పునరుజ్జీవింప సాగినయ్. తరలిన వసంతం మరలివచ్చింది. (చెండడుగులు వేసి) మన మధ్య అనురాగ లత పెరిగి పెద్దదై, రెండు హృదయాలను బంధించి వేసింది. నీకోసం నేను, నాకోసం నీవు సర్వస్వం త్యజించాము. సంఘాన్నెదిరించి ఆత్మీయులందర్నీ వదిలేసి యిక్కడ కొచ్చాం. ఒకరికోసం ఒకరం వ్రతుకు బద్దలు చేసుకొన్నాం. (నిర్మల ఆలోచిస్తూనే అతనివైపు రెండడుగులు వేసింది) కష్టంలో, సుఖంలో ఒకరి హృదయంలో ఒకరం తలదాచుకొన్నాం. నిష్కల్మష ప్రేమి ప్రేమికులమని గర్వించామప్పుడు. మూడు సంవత్సరాలు చీకూ చింత లేకుండా కాలం వెళ్ళబుచ్చాం. వ్రతుకుబాటను నందనవనంగా మార్చుకున్నాం. (నిర్మల అతని చేయి స్పృశించింది.) ఎంత తీయని కల నిర్మలా అది...ఆ కల కరిగిపోకుండా శాశ్వతంగా నిలచిపోతుందని భ్రమించాను. వెలుగు చీకట్లు సహజమన్న సత్యాన్ని విస్మరించాను నిర్మలా...(నిర్మల అతని చేయి వదిలేసింది) విధి నా అదృష్టాన్ని, ఆనందాన్ని చూచి ఓర్వలేకపోయింది తన వక్ర దృష్టి నాపైన ప్రసరించింది. (నిర్మల ఎడంగా జరిగింది) నా వ్రతుకుబాటల్లో (ఆవేదనగా) చీకటితెరలు దిగజార్చింది. అనుకోకుండానే నాకీ సోఁటకం వచ్చింది. నీవు ఎంతగానో ప్రేమించే నా అర్ధనిమీలిత నేత్రాలు మూసుకుపోయినయ్. నేను శాశ్వతంగా గ్రుడ్డివాడినయ్యాను. (దగ్గు)

నిర్మ:- అయ్యో, ఏమిటండీ హింస! (మొహం కప్పుకొని ఏడ్చింది.)

శశక:- దానితో మనిద్దరి మధ్యా అగాధం ఏర్పడింది. నా నేత్రాలలాగే మన హృదయాలు మూసుకుపోయినయ్. ఈరోజు నీవు నన్ను చూస్తుంటే భయపడుతున్నావు. నా నుండి దూరంగా తప్పుకోటానికి ప్రయత్నిస్తున్నావు.

నిర్మ:- (దుఃఖంతో) లేపండి, మీరు అపార్థం చేసుకుంటున్నారు.

శంక:- ఆత్మవంచన మహాపాపం నిర్మలా! ...నీ కోరిక న్యాయమైనదే. ప్రతిజీవి తన జీవితం స్వర్గతుల్యం కావాలనే కాంక్షిస్తుంది. ప్రతికు బాట నందనవనంలా వుండాలనే కోరుకుంటుంది. కోరికోరి కంటకావృతమైన మార్గాన్నెవరూ వరించరు నిర్మలా!

నిర్మ:- నన్ను క్షమించు శంకర్ (పాదాంపై వ్రాలింది)

శంక:- (తల నిమురుతూ) నీ తప్పేమీలేదు నిర్మలా! నా కోసం నీ ప్రతికుని బలెట్టుకోమని కోరేటంత స్వార్థపరుణ్ణి గాను. నీ మేలు కోరుతున్నావో నాకు తెలుసు. నీ ఆనందానికి నే నెప్పుడూ అడ్డుగాను. రేపే నే నిక్కడనుండి వెళ్ళిపోతున్నాను నిర్మలా! (వెళుతున్నాడు లోనికి, దగ్గుతూ)

నిర్మ:- వద్దండీ...మీ (ఏదో చెప్పబోయింది కాని మాట పెగల్లేదు)

శంక:- (ఆగి) ఒక్క సత్యంమాత్రం చెప్పక తప్పదు నిర్మలా! జీవితం మాత్రం నవలలా, సినిమాలా హాయిగా వుంటుందనుకోవటం తప్పు. జీవిత గమనంలో అడుగడుగునా అవరోధా లనేకం ఉంటాయ్. ఒక్క అడుగు పొరపాటు వేశామో అధో లోకానికి జారిపోతాం... (స్థాయి తగ్గించి) నువ్వు వట్టి అమాయకురాలివి నిర్మలా! మెరిసే దంతా బంగారం కాదు. మేడిపళ్ళు చాలా వుంటయ్! త్యాగబుద్ధీ త్యాగం చేసే శక్తి మనుషులందరిలో వుండటం చాలా కష్టం. జాగ్రత్త...నా ప్రతుకేలాగూ మంట కలిసింది, నీవైనా సుఖంగా వుండేనే నాకు కొంతయినా మనశ్శాంతి. (దగ్గుతెర వచ్చింది)

నిర్మ:- పీ...రు...

శంక:- నిండు హృదయంతో నిన్నా శీర్వదిస్తున్నాను. నా కన్నా నీ మేలు కోరేవాళ్ళి ప్రపంచంలో ఎవ్వరూ లేరు నిర్మలా—వస్తా (క్రమంతో తడుముకుంటూ చకచకా లోనికెళ్ళాడు. నిర్మల అచేతనంగా అలానే నిలబడింది. దూరాన్నుండి వయొలిన్ సముద్రపు హోరులా మొదలయింది. నిర్మల సోఫాలో కూలబడింది. క్రమంగా వయొలిన్ ఆగింది. నిర్మల కొంచెం ఆలోచిస్తూంది. ఐయటనుండి మురళి వచ్చాడు)

మురళి:- హల్లో నిర్మలా, రెడీయేనా?

నిర్మ:- (తల ఎత్తి అతనివంక చూచి మళ్ళి దించేసింది)

మురళి:- (దగ్గరకొచ్చి) ఏం అలా వున్నావ్ (మాట్లాడలేదు) నిర్మలా...(భుజం మీద చేయి వేశాడు.) నిర్మల నెమ్మదిగా అతని చేతిని తీసివేసింది. ఆశ్చర్యపడ్డాడు.) ఏంజరిగింది నిర్మలా! (సిగరెట్ నలిపివేశాడు) చెప్పు నిర్మలా! ఎందుకిలా వున్నావ్ (ఆమెలేచి నిలబడింది) చెప్పవూ? (గోముగా) శంకరేమైనా...

నిర్మ:- ఆయనకంతా తెలిసిపోయింది.

మురళి:- ఆఁ! (జేబుగుడ్డతో ముఖం తుడుచుకున్నాడు. క్షణం మౌనం) సరే వస్తా, రేపు కలుద్దాం.

నిర్మ:- (మురళి రెండడుగులు వేస్తాడు. దీర్ఘంగా ఆలోచిస్తూనే) మురళీ!

మురళి:- (ఆగి) ఏమిటి?

నిర్మ:- కూర్చో, నీతో మాట్లాడాలి.

మురళి:- (వెనక్కువచ్చి) శంకర్...మళ్ళి...

నిర్మ:- (అతనివంక చూడకుండానే) మురళి, ఒక్క మాటడుగుతాను నిజం చెబుతావా?

మురళి:- ఏమిటది?

నిర్మ:- నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?

మురళి:- ఆ అనుమానం మొచ్చుకొచ్చింది?

నిర్మ:- నా ప్రశ్నకు జవాబు చెప్పు మురళీ,

మురళి:- ప్రతికరణ శుద్ధిగా!

నిర్మ:- ప్రేమిస్తున్నావు గదూ?

మురళి:- సందేహమేముంది, ఆ వస్తా నిర్మలా...శంకర్ వస్తే...

నిర్మ:- అయితే నేనొక్కటి చెబుతాను చేస్తావా?

మురళి:- చెప్పు.

నిర్మ:- మనిద్దరం ఈ రాత్రే కాంబే వెళ్ళిపోదాం.

మురళి:- దేనికీ?

నిర్మ:- అవన్నీ తర్వాత మాటలు. ముందిక్కడనుండి వెళ్ళిపోవటం అవసరం.

మురళి:- అదంత మంచిపనికాదు నిర్మలా!

నిర్మ:- మురళీ! (దగ్గర కొచ్చిండి) శంకర్ ముందు యింకొక నిమిషంకూడ వుండలేను. ఇంత జరిగినతర్వాత ఏమీ జరగనట్లు నటించలేను. నన్ను ఎక్కడికైనా తీసుకుపో మురళీ!

మురళి:- ఉద్రేకపడకు నిర్మలా! సావధానంగా ఆలోచించు.

నిర్మ:- అంతా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను.

మురళి:- మరి...శంకర్ గతి!

నిర్మ:- వాటన్నిటికి సమాధానం చెప్పే స్థితిలో లేను మురళీ! ఏమంటావు మురళీ?

మురళి:- క్షమించు నిర్మలా, నే నందుకు సిద్ధంగా లేను.

నిర్మ:- మురళీ.....

మురళి:- అవును నిర్మలా! మనం వెళ్తే లోకం ఏమనుకుంటుంది?

నిర్మ:- లోకంతో మనకేం పని మురళీ, నా మాట విను మురళీ?

మురళి:- ఏనడేను నిర్మలా!

నిర్మ:- యింతేనా నీ ప్రేమ? నాకోసం ఏమైనా చేస్తానన్నావు గదూ.

మురళి:- ప్రేమ పేరుతో పశుప్రాయుణ్ణి కాలేను.

నిర్మ:- ఆడదాన్ని నీ ఆనందానికి ఆటవస్తువుగా వినియోగించుకోగలవు. అంతేనా?

మురళి:- ఎలా అన్నా పర్వాలేదు. అయినా ఆ విషయంలో నా తప్పేమీ లేదేమో.

నిర్మ:- నువ్వింత దగాకోరువని కల్లోగూడా అనుకోలేదు.

మురళి:- నిర్మలా!

నిర్మ:- (ఆవేదనగా) నిన్నెంతగా ప్రేమించాను! హృదయమిచ్చి ప్రేమించినందుకు బాగా బుద్ధిచెప్పావు.

మురళి.- ప్రేమ (వికటంగా నవ్వాడు) ఆ మాట ఉచ్చరించే అర్హత కూడా నీకు లేదు నిర్మలా!

నిర్మ:- (కోపంగా) మురళీ!

మురళి:- అపరాధం కాదు నిర్మలా! ఒకప్పుడు శంకర్‌ను ప్రేమించానన్నావే! వలపు నటించి వల పన్నావు, నీ వ్యామోహంలో అతను తనవాళ్ళనందర్నీ దూరం చేసుకున్నాడు. నీకోసం ప్రతుకు ప్రర్దలు చేసుకున్నాడు. ఈ రోజు తన స్థితి మారిపోయింది. నీవు వాంఛించే ఆందచందాలు యిప్పుడు బతనిలో కొరవడ్డాయి. అది కారణంగా అంధత్వంలో ఆసహాయుడై అల్లాడుతున్న అతణ్ణి నిర్దాక్షిణ్యంగా నెట్టి వేస్తున్నావు. యిప్పుడు నీ ఆనందానికి మరో బొమ్మ కావాలి. అందుకు నామీద వల పన్నుతున్నావు. రేపు నామీద మోజు తగ్గగానే...

నిర్మ:- మురళీ! (కోపంగా వణికిపోతూ వుంది.)

మురళి:- నీ ఆనందంకోసం, అవసరాల కోసం ఎంతటి నీచానికైనా దిగజారతావు. నీకన్నా పడుపుకత్తె నయం. పడుపుకత్తె తన కిష్టమున్నా

లేకున్నా గత్యంతరం లేక ఆ వృత్తిని చేపడుతుంది. కాని నీకో ఐచ్ఛికంగానే బాహాటంగా వ్యభిచారాన్ని సాగిస్తున్నావు.

నిర్మ:- యూ స్ట్రాంగ్ర్డల్. షటప్. (లాగి చెంపమీద కొట్టింది.)

మురా:- (క్షణకాలం స్తంభించిపోయాడు. తెప్పరిల్లి చెంప తడుముకుంటూ) ఫర్వాలేదు నిర్మలా, నీ బలహీనతను బాటుకొన్నావు.

నిర్మ:- యూ గెటవుట్!

మురా:- వెళతాను కాని ఒక్కమాట. ఈనాడు నువ్వీస్థితిలో వుండటానికి కారణమెవ్వరో ఒక్క సారి ఆలోచించుకో. శంకర్ లేకపోతే నీ జీవిత మెలా వుండేదో ఊహించుకో. అతని నిర్మలత్వాన్ని, అతను నీకై చేసిన త్యాగాన్ని ఒక్కసారి స్మరించుకో. నీలో మానవత్వ మేమూలనైనా మిగిలివుంటే, అతని ఋణాన్ని తీర్చుకొనేందుకు ప్రయత్నించు. మానవ సహజమైన బలహీనతకు లోనై నీతో సాంగత్యం చేసినందుకు బాధపడుతున్నాను. వస్తా. గుడ్‌బై! (వెళుతున్నాడు.)

నిర్మ:- (ఇంతవరకూ గంభీరంగా ఆలోచిస్తూ నిలబడింది.) మురళీ!

మురా:- (ఆగాడు.)

నిర్మ:- ఎంత విచిత్రమైన మనిషివి మురళీ! ఈ ధర్మోపన్యాసాలన్నీ యింత కాలం ఎక్కడ దాచావు?

మురా:- (ఆమె వంక చూచాడు. తిరిగి వెళ్ళటానికి వుపక్రమించాడు)

నిర్మ:- వెళ్ళబోయేముందు నిన్ను ఒక్కటిమాత్రం కోరుతున్నాను మురళీ! మనం చేసిన ఈ పాపంలో ఈ మహాపాపంలో బాధ్యత ఇద్దరికీ సమంగా వున్నదన్న సత్యాన్ని నా యెదుట ఒప్పుకోకపోయినా నీ అంతరాత్మ ఎదుటనైనా ఒప్పుకో. అంతకన్నా నిన్నేమీ కోరను. ఆవేశంలో నీమీద చెయ్యి చేసుకున్నాను. అందుకు నన్ను క్షమించు. గతాన్ని మరచిపో. వెళ్ళు...వెళ్ళు మురళీ! ఎరువెక్కిన హృదయంతో మాట్లాడింది. మురళి తలవంచుకు వెళ్ళిపోయాడు. దూరా

న్నుండి సముద్రపుహోరులా భయంకరమైన ఆలాపన విన్పిస్తుంది. నిర్మల భరించలేక రివ్వున వెళ్ళి కుర్చీలో కూలబడి ముఖం చేతుంతో కప్పుకుంది. ఆలాపన క్రమేణా సన్నగిల్లింది. చంద్రయ్య వచ్చి నిర్మలకు కొంచెం ఎడంగా నిలబడ్డాడు. ఆమె వంక జాలిగా చూశాడు. నిర్మల అది గమనించలేదు. చంద్రయ్య లోనికెళ్ళాడు. ఆలాపన పూర్తిగా ఆగిపోయింది. నిర్మల లేచి నిలబడింది. శంకర్ ఫోటో దగ్గరగా వెళ్ళి నమస్కరిస్తూ) క్షమించటానికి వీల్లేని అపరాధం చేసి కూడా మీ ఔన్నత్యాన్ని తెలిసిన దాన్ని కావడంవల్ల మిమ్మల్ని క్షమాభిక్ష వేడటానికి సాహసిస్తున్నాను. నన్ను క్షమించండి (క్షణకాలం అలానే నిలబడిపోయింది. వికృతమైన నవ్వు విన్పించింది. నిర్మల త్రుళ్ళిపడి రెండడుగులు వెనక్కు వేసింది.)

ధ్వని:- "నిర్మలా, నీవు మహాపాపివి. నీవు క్షమాభిక్ష కర్హురాలవు గాదు. నీవు వ్యభిచారిణివి. కులటవు. నీకిక్కడ స్థానం లేదు. ఇది దేవతలు నివసించే పవిత్రమైన ఆలయం. పాపుల కిక్కడ స్థానం లేదు. వెళ్ళిపో, వెళ్ళిపో. (భయంకరమైన నవ్వు. నిర్మల భయంతో లోనికిపరుగెత్తింది. కొన్ని క్షణాల తర్వాత చిన్న సూట్‌కేసుతో లోపలనుండి వచ్చి నిదానంగా బయటకు వెళ్ళిపోతోంది. వీధి వాకిలి దగ్గరకు వెళ్ళేసరికి వెనకనుండి 'అమ్మా' అంటూ చంద్రయ్య వచ్చాడు.)

చం:- అమ్మా (నిర్మల ఆగింది) ఎక్కడికమ్మా!

నిర్మ:- నేను మహా పాపాత్మురాల్ని. నా కిక్కడ స్థానం లేదు చంద్రయ్యా!

చం:- అలా అనకమ్మా. తప్పుగదూ (దగ్గరగా వచ్చాడు.)

నిర్మ:- భగవంతునిలాంటి వానికి తీరని అపచారం చేశాను. నా పాపానికి నిష్కృతిలేదు చంద్రయ్యా! (భోరుమంది.)

చం:- నా కంతా తెలుసు వల్లీ. జరిగిందానికి విచారించి ప్రయోజనం లేదు. నా మాట విని లోని కెళ్ళండి.

నిర్మ:- ఓద్దు., పవిత్రమయిన అలయాన్ని కలుషితం చేస్తూ ఇక్కడ వుండ లేను. నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోక తప్పదు.

చం:- దానికిది మార్గం కాదమ్మా. యిది పిరికితనానికి చిహ్నం.

నిర్మ:- చంద్రయ్యా!

చం:- అవునమ్మా. తప్పులు అందరమూ చేస్తూంటాం. చేసిన తప్పను గుర్తించినప్పుడు దాన్ని దిద్దుకోటానికి ప్రయత్నించాలి. కాని యిలా జీవితంలోనుండి పారిపోవటం అవివేక మనిపించుకొంటుంది.

నిర్మ:- యింతకన్నా నాకు మార్గంలేదు చంద్రయ్యా!

చం:- ఉందమ్మా! నీలో పశ్చాత్తాపం బయలుదేరి ఆది నిన్ను దగ్ధం చేస్తుంటే దానికి పరిహారం తప్పకుండా వుంటుంది, (శంకర్ ఫోటో దగ్గరగా వెళ్ళి ఫోటో చేతిలోనికి తీసుకున్నాడు.) యీ పవిత్ర మూర్తి పాదసేవలోనే నీ పాపాలు పటాపంచలవుతయ్. నీ జన్మకు నిష్కృతి యిక్కడే తల్లీ!

నిర్మ:- (గద్గదికంగా) మీరంతా దేవతలు చంద్రయ్యా.

చం:- అంతా మనస్సులోవుంది తల్లీ! మనస్సే మనకు మానవత్వాన్ని దానవత్వాన్ని ఆపాదిస్తుంది. దాన్ని సవ్యంగా నడిపించుకోగలిగిన నాడు మానవుడు అమరుడౌతాడు. (కొంచెమాగి) జీవితంలో ఇలాంటి క్రీనీడలు తొంగి చూస్తూనే వుంటాయ్. వాటిని తప్పుకొని వెలుగులోనికి రావటానికి ప్రయత్నించాలి. అప్పుడే జీవితం సార్థకమౌతుంది. గతాన్ని మరచిపోయి రేపటి జీవితాన్ని సార్థకం చేసుకోటానికి ప్రయత్నించు. రండమ్మా, లోనికెళదాం.

[ఇద్దరూ రెండడుగులు లోనికి నడిచారు. లోపలనుండి 'ధన్' మని పిస్టల్ ప్రేలింది. నిర్మల కెవ్వుమంది. చంద్రయ్య రెండడుగులు ముందుకు వేశాడు. ఆదుర్దాగా, శంకర్ తూలుకుంటూవచ్చి గుమ్మం దగ్గర పడిపోయాడ.రొమ్మునుండి రక్తం స్రవిస్తోంది.)

నిర్మ:- శంకర్!

చం:- బాబూ!

[ఇద్దరూ శంకర్ దగ్గరగా వెళ్ళారు]

చం:- ఎంత ఘోరానికి తలపడ్డాడు బ్రాబూ!

[శంకర్ ప్రక్కనే కూలబడి ఏడుస్తున్నాడు.]

నిర్మ:- నా పాపానికి ప్రాయశ్చిత్తమిదా శంకర్! (ఏడుస్తోంది.)

శంక:- (ఒక చేత్తో గాయా న్నదిమిపట్టి, రెండవ చేత్తో నిర్మలను స్పృశిస్తూ) నిర్మ...లా! నేను...ని సుఖంకోరే...వెళుతున్నాను...చంద్రయ్యా!

చం:- బాబూ!

శం:- (అతని చెయ్యి పట్టుకుని) నిర్మల...జాగ్రత్త. శెలవు...చంద్రయ్యా!
అబ్బా! ని...ర్మ...లా!
(బాధగా మూలిగి ప్రాణం విడిచాడు.)

చం:- బాబూ! ఎంత అన్యాయం చేశారు బాబూ! (ఏడుస్తున్నాడు.)

నిర్మ:- (గంభీరంగా కూర్చునివుంది.) నువ్వే అదృష్టవంతుడివి చంద్రయ్యా సీకు ఏడవటానికి కన్నీళ్ళయినా మిగిలినాయ్! నాకు...నాకేమీ మిగల్లేదు. నేను సర్వం పోగొట్టుకున్నాను (శంకర్ మొహంలోనికి చూస్తూ) ఎంత కఠినమయిన శిక్ష విధించావు శంకర్! ఈ శిక్ష నేను భరించగలనా?

(శూన్యంలోకి చూస్తూ) నా బ్రతుకులో శాశ్వతంగా చీకటి తెరలు దిగజార్చావా భగవాన్!

[తెర జారుతోంది. చూస్తున్నది:]

''అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.''

— తెర పూర్తిగా జారింది —

$$\int_{}^{}$$

జ్వలిత జ్వాల

రచన :

హనుమంతరావు

పాత్రలు

విశ్వం

శేఖరం

శేషు

రంగయ్య

విశాల (సరోజ)

చిట్టి

(అది ఒక కలిగినవాళ్ళ ఇంటి మేడపీద హాలు. హాలుకు ఎడమ వైపున వెలుపలకు వెళ్ళే ద్వారం. కుడివైపున లోనికివెళ్ళే ద్వారం. మధ్యన మరో గదిలోకి వెళ్ళేందుకు మరొక ద్వారం. ఈ ద్వారాల మధ్యనున్నది రంగస్థలం. హాలులో మూడు సోఫాలు. సోఫాల ముందర మూడు టిపాయ్‌లు. కుడివైపు మూలన ఒక టేబిలు, టేబిలుమీద ఒక రేడియో, ఎడమవైపు మూలన ఒక టేబిలు. టేబిలుమీద పూలకుండీ, టేబిలుముందు కుర్చీ వుంటాయి. గోడల నిండా అందమైన ఫొటోలు. చూడడానికి గదంతా అందంగా ఉంటుంది. తెర లేచేసరికి రేడియోలో పాట వినిపిస్తూ వుంటుంది. విశ్వం బ్రాగి సొమ్మసిల్లి మధ్యనున్న సోఫాలో కూర్చుని టిపాయ్ మీదకు జారగిలబడి మగతగా వుంటాడు. ప్రక్కన బ్రాందీ సీసా గ్లాసు వుంటాయి. చీకటిగావున్న గదిలో చేతిలో వెలుగుతున్న సిగరెట్టు తప్ప మరేమీ వుండదు. (ఇక్కడ స్పాట్ వినియోగిస్తే బావుంటుంది) పాట జరిగేకొందికీ విశ్వం పాటకు అనుభూతి పొందుతుంటాడు. పాట ముగిసేటప్పటికి విశ్వానికి చికాకు కలుగుతుంది. లేచివెళ్ళి విసుగుగా రేడియో ఆపుచేస్తాడు)

పాట

దుర్భరం మహాభరం
బ్రతుకంతా వెతలమయం ॥
చితికిన ఆశలు నిండిన వెతల కథల జీవితాలు
పగిలిన మీ జీవితాలు ఆనీటికి పునాదులు ॥దు॥

ఆనబంధం, అనుతాపం, [illegible]
ఎదలో వ్యధలై రగిలే [illegible]
కనుగొలకులలో ఆశలు బాష్పకణాలై
సెగలై మదిలోసించి రగుల్చు జ్వాలికజ్వాలై
రగులుచు జ్వాలితజ్వాలై, రగులుచు జ్వాలికజ్వాలై ॥దు॥

విశ్వం:- (ఎసురుగా లేచివెళ్ళి రేడియో ఆపి) ట్రాష్! ఎక్కడ చూచినా బాధ, ప్రపంచమంతా బాధలతో విలవిలాడుతుంటే ఈ కవిత్వం సంగీతం,

అన్నిటిలో బాధ. చూస్తే బాధలేని బ్రతుకే లేదనిపిస్తుంది. (మళ్ళీ సోఫా దగ్గరకుపచ్చి బ్రాంది సిసా చూచి) ఏదైతే నాకెందుకు! అయినా నాకీ తర్కం అనవసరం. మధువును మించిన సంపర్కం మరొకటి వద్దు. అంతకుమించిన ధ్యేయం అంతకంటే అక్కరలేదు. (ఇంతలో లోపలనించి బిట్టి 'బాబాయ్! బాబాయ్' అని కేక వేస్తుంది. విశ్వం పలుకడు. చిట్టి లోపలనుండి వచ్చి గదిలో లైటు వేస్తుంది)

చిట్టి:- (విశ్వాన్ని చూచి) అమ్మ దొంగా, ఇక్కడుండేనా పలక్కుండా కూర్చున్నావ్ (విశ్వం పలకడు) బాబాయ్! (చెవి దగ్గరకు వచ్చి) బాబాయ్ !

విశ్వం:- (తేరుకొని) చిట్టి! ఎంతసేపయిందమ్మా వచ్చి ?

చిట్టి:- ఇప్పుడే! ఏమిటి బాబాయ్, అలావున్నావ్? ఒంట్లో బాగోలేదా!

విశ్వం:- లేదమ్మా.

చిట్టి:- మరి బాగులేదంటూనే విషం బ్రతుకుతావేం?

విశ్వం:- విషమా ?

చిట్టి:- అవును, అది విషమని నిన్న నీవేగా చెప్పావ్. అప్పుడే మరచిపోయావా ?

విశ్వం:- అవునవును! మరచిపోయాను.

చిట్టి:- బాబాయ్, విషం బ్రతికితే మనుషులు చచ్చిపోరూ?

విశ్వం:- ఎందుకుపోరూ?

చిట్టి:- మరి నువ్వెందుకు తాగుతున్నావ్?

విశ్వం:- బ్రతకలేక.

చిట్టి:- అయితే నిన్ను బ్రతికనివ్వను. (చిట్టి టేబులుమీది బ్రాందీసిసా లాక్కొని దూరంగా వెళుతుంది)

విశ్వం:- చూడమ్మా! ఈ విషం బ్రతికితే మనుష్యులంత తొందరగా చచ్చిపోరమ్మా! క్రమేపీ చస్తారు. రేపు నీకు బోలెడు చాక్లెట్లు కొనిపెడతాగా! ఆ సిసా ఇలా ఇవ్వమ్మా!

చిట్టి:- నే నిప్పుకు.

విశ్వం:- మా అమ్మవు కదూ! రేపు నీకు బొమ్మలు కొనిపెడతాగా! ఇలా ఇవ్వమ్మా.

చిట్టి:- నాకేమీ తెలీదు, నెనేమీ ఇవ్వను.

విశ్వం:- సరే అలాగే! రేపటినుంచి మానేస్తాగా, ఇవ్వాళటికి త్రాగనీయమ్మా.

చిట్టి:- నిజంగా రేపటినుంచి మానేస్తావా?

విశ్వం:- ఓ! తప్పకుండా.

చిట్టి:- ఒట్టు.

విశ్వం:- ఒట్టు.

చిట్టి:- ఊహా, అలాకాదు; చేతిలో చెయ్యివేసి చెప్పాలి.

విశ్వం:- సరే అలాగే! ఒట్టు (చేతిలో చెయ్యి వేస్తాడు) మరి ఇలా ఇవ్వు సీసా (పాప కాసేపు ఆడించి సీసా ఇస్తుంది. విశ్వం త్రాగుతుంటాడు)

చిట్టి:- బాబాయ్! మొన్న కొన్న చెప్పులు ఏమీ బాగా లేవు. రేపు నాకు బూట్లు కొనిపెడతావా?

విశ్వం:- అలాగే.

చిట్టి:- మరేం బాబాయ్. పక్కింటివాళ్ళ సరోజ...

విశ్వం:- చిట్టి! (కోపంగా అంటాడు)

చిట్టి:- ఏమిటి బాబాయి? ఆలా అన్నావ్?

విశ్వం:- ఏమీలేదు చెప్పమ్మా.

చిట్టి:- ఆదే! వాళ్ళ సరోజ కొనుక్కోలేదూ? ఆలాంటి బూట్లు కావాలినాకు. మరేం బాబాయ్, అవి రంగు రంగులుగా ఎంత బాగున్నాయను కున్నావ్!

విశ్వం:- అలాగా!

చిట్టి:- మరి నాకు కొనిపెడతావా!

విశ్వం:- కొనిపెడతానన్నాగా! (మళ్ళీ బ్రాగబోయి సీసా చూచి అందులో సగమే వుండటం గమనించి) రంగయ్యా! రంగయ్యా!

చిట్టి:- ఇప్పుడు వాడెందుకు బాబాయ్!

విశ్వం:- పనుందమ్మా.

చిట్టి:- నా బూట్లు కొనుక్కురావడానికా ?

విశ్వం:- ఈవేళప్పుడు బూట్లెక్కడ దొరుకుతాయమ్మా. రేపు కొనిపెడతాగా! నీవు లోపలికెళ్ళి చదువుకో!

చిట్టి:- నేను పోను, నేనిక్కడే కూర్చుంటా! నేను నిన్నటి ఇంగ్లీషు పద్యం ఒప్పజెప్పాగా! కావాలంటే ఇప్పుడే చెబుతాను. ఢాక్స్ క్రో ఇన్ ది మార్నింగ్ టు టెల్ ఆజ్ టు రైజ్.

రంగ:- (లోపలకువచ్చి) పిలిచారాబాబూ!

విశ్వం:- ఆఁ! షాపుకువెళ్ళి రెండు బాటిల్స్ పట్టుకురా.

రంగ:- ఆలాగే. బాబూ. ఏరకం తెమ్మన్నారు బాబూ!

విశ్వం:- (పిసుగ్గా) ఇదిగో ఇలాంటివి చూశావా? ఇలాంటివే రెండు సీసాలు తీసుకరా!

రంగ:- చిత్తం. (వెళ్ళబోయాడు)

విశ్వం:- రంగయ్యా!

రంగ:- బాబూ.

విశ్వం:- బైమెంతైంది?

రంగ:- ఆరున్నరదాటుతోంది బాబూ! (వెటుఎలిపు వెళ్ళిపోతాడు)

చిట్టి:- బాబాయ్, రేపటినుంచి మానేస్తానన్నావుగా! మళ్ళీ అదెందుకు?

విశ్వం:- నీకు తెలియదమ్మా. తర్వాత చెబుతాగా!

చిట్టి:- అబద్ధం! అన్నీ అబద్ధాలే. నువ్వు మానెయ్యవు. నాతో అబద్ధాలాడుతున్నావ్.

విశ్వం:- లేదమ్మా, నే మానేస్తాగా, నువ్వు వెళ్లు

చిట్టి:- అయితే ఇప్పటినుంచే మానెయ్యాలి (సీసా తీసుకుంటుంది)

విశ్వం:- అలాగే మానేస్తాగా. ఆ సీసా ఇలా ఇవ్వు.

చిట్టి:- నేనేమీ ఇవ్వను.

విశ్వం:- ఇవ్వవూ!

చిట్టి:- ఇవ్వను ఇవ్వను ఇవ్వను.

విశ్వం:- నాకు కోపమొస్తే కొడతాను.

చిట్టి:- అయితే నే నీ విషంత్రాగి చచ్చిపోతాను (చేతిలోని బ్రాందీసీసాను నోటిదగ్గర పెట్టుకుంటుంది)

విశ్వం:- చిట్టీ!

చిట్టి:- బాబాయ్, కొట్టకు బాబాయ్. ఇచ్చేస్తాను బాబాయ్. (విశ్వం సీసా లాక్కొని అవతల పెట్టేస్తాడు)

విశ్వం:- భయపడ్డావా అమ్మా?

చిట్టి:- (మరింత భయపడుతుంది) బాబాయ్, మరెప్పుడూ తీసుకోను. అసలు నేనిక ముట్టుకోను, కొట్టకు బాబాయ్—

విశ్వం:- చిట్టీ! (దగ్గుతెర వస్తుంది. గుండెపోటుతో సొమ్మసిల్లి సోఫాలో సొక్కిపోతాడు. కొద్దిక్షణాలు నిశ్శబ్దం తరువాత)

చిట్టి:- బాబాయ్! (విశ్వాన్ని తాకి చూస్తుంది. విశ్వంలో చలనముండదు) నాన్నా! నాన్నా!

(ఇంతలో శేఖరం వెలుపలనుంచి వస్తాడు)

శేఖ:- ఏమిటమ్మా? ఎందుకు? ఎందుకేడుస్తున్నావు!

చిట్టి:- (ఏడుస్తూ) నాన్నా, బాబాయ్ విషం త్రాగి చచ్చిపోయాడు నాన్నా!

శేఖ:- (ఖంగారుగా) విశ్వం! విశ్వం!

విశ్వం:- ఊఁ!

శేఖ:- లేదమ్మా, బాబాయ్ నిద్రపోతున్నాడు. పిచ్చితల్లీ, బాబాయ్ విష మెందుకు త్రాగుతాడు?

చిట్టి:- మరి బాబాయి రోజూ త్రాగేది విషమేనని బాబాయే చెప్పాడుగా!

శేఖ:- బాబాయికేమీ భయంలేదుగాని నీ వెళ్ళి చదువుకో. (చిట్టి పోదు. నవ్వుతూ శేఖరం వాకిలిదాకావచ్చి చిట్టిని కుడివైపు గదిలోపలకు పంపిస్తాడు)

శేఖ:- (తిరిగివచ్చి) విశ్వం! విశ్వం!

విశ్వం:- (తేరిచూచి) నువ్వా శేఖరం! ఏమిటి?

శేఖ:- ఏమిటలా వున్నావు? మళ్ళీ గుండెపోటు వచ్చిందా?

విశ్వం:- ఊఁ!

శేఖ:- డాక్టర్ని పిలుస్తానుండు.

విశ్వం:- ఊఁ! డాక్టర్లేం చెయ్యగల్రా. వాళ్ళు వ్యాధికి వైద్యం చేయగల వాళ్ళేగాని వేదన చల్లార్చలేరుగా? ఇది నా అంతు చూచిగాని పోదు. అది నాకు తెలుసు.

శేఖ:- అన్నీ తెలిసికూడా ఇదేమిటి చెప్పు?

విశ్వం:- ఏమిటది?

శేఖ:- ఈ త్రాగుడు. నానాటికీ పెరిగిపోతున్న రోగాన్ని సైతం లెక్క చేయకుండా రాత్రింబవళ్లు ఈ త్రాగుడెందుకు విశ్వం? నా మాట విను. ఇకనైనా ఈ త్రాగుడు మాను.

విశ్వం:- శేఖరం! అది నా వల్లగాని పని. నువ్వు చేసిన సహాయానికి నా సర్వస్వం, కడకు నా ప్రాణాన్నయినా బలిపెడతాను. కానీ త్రాగుడు మానమనిమాత్రంనన్నెప్పుడూబలవంత పెట్టకు. నిత్యంజ్వలితజ్వాలలా హృదయంలో రేగే ఘోరనిబాధ నేను భరించలేను. ఆవేదన సహించలేను. నాకయినవాళ్ళను నా కళ్ళముందే నిత్యం చూస్తూ ఏ సంబంధం, అనుబంధం లేనట్టుగా, దూరదూరంగా బ్రతకడం ఎంత

కష్టమో నీకు తెలియదు శేఖరం! అంతకంటే హింస ప్రపంచంలో లేదు. గత్యంతరంలేక అనుభవిస్తున్న చిత్రహింస ఇది. విడిలించుకు బయట పడదామన్నా వీలుపడని వల ఈ వేదన. దీనికంతులేదు, అవధిలేదు, ఇది ఈ జన్మకు తీరదు. సుడిగాలిలో ఎండుటాకులా గింగిరాలాడి ఎప్పుడో ఎక్కడో రాలిపోతేనే గాని ఈ వ్యథ తీరదు. నాకీ బాధనుండి విముక్తిలేదు. (కళ్ళు చెమరుస్తాయి.)

శేఖ:- విశ్వం ఏమిటిది, పసివాడిలా?

విశ్వం:- (రిలేక్స్ అయి) ఏమీలేదు. ఏవో జ్ఞాపకాలు.

శేఖ:- పోనీ విశ్వం! రోజూ ఇలా వేదనతో వేగిపోకపోతే నిజం చెప్పెయ్యరాదూ?

విశ్వం:- శేఖరం! మరెప్పుడూ ఆ మాట నీ నోట వినకు. అది నేను కలలో కూడా అంగీకరించను. నిర్మలమైన సెలయేరులా ప్రవహించే జీవితంతో కలుషితాన్ని కాలేను. ఆపరంజిలాంటి ఈ పవిత్ర జీవితంలో పాపపుఛాయలు పడనీను. నా కడపటి శ్వాసవరకు నే కాంక్షించేదదేరా? (బాధతో ఉద్రేకపడతాడు)

శేఖ:- ఏమిటో అర్థంలేకుండా మాట్లాడుతావు.

విశ్వ:- (హఠాత్తుగా రిలేక్స్ అయి) ఈ తాగుబోతు మాటలకు అర్థమేముంటుందిలేరా (మాటలు మార్చే ధోరణిలో) నా ధోరణిలో మరిచే పోయాను. నీ విషయమేమైంది?

శేఖ:- నా విషయమా?

విశ్వం:- అదే ఇవ్వాళేదో మంత్రివర్గ నియామకం జరుగుతుందన్నావు.

శేఖ:- ఆఁ! అవునవును, అది చెబుదామనే వచ్చాను. కాని నేను వచ్చేటప్పటికి...

విశ్వం:- నేను త్రాగి తూలుతున్నాను. నేను త్రాగినా మైకం తలకెక్కదు. అదే నేను ఈ పదేళ్ళుగా త్రాగుడులో సంపాదించిన అనుభవం. నరాలు తూలిపోతున్నా మనస్సులో స్వరం వినిపిస్తూనే వుంటుంది. చెప్పు ఏమయింది?

శేఖ:- నన్ను మన మంత్రివర్గములో ఒకర్నిగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

విశ్వం:- సంతోషం. ఆ దేవుడనేవాడుంటే, మనఃపూర్వకంగా నీకు ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించమని ప్రార్థిస్తున్నాను. కంగ్రాచ్యులేషన్స్.

శేఖ:- థాంక్స్‌విశ్వం. ఇదంతా నీలాంటివాళ్ళ ఆశీర్వాదఫలమే. ఈ రోజు ప్రజలు నాకు చేసిన గౌరవం, చూపిన ఆదరణ చూస్తుంటే జన్మ తరించిందనిపించింది. ఆ ఆనందం అలాగే నిలచిపోతే అంతకంటే మరేమీ ఆక్కరలేదనిపించింది.

విశ్వం:- శేఖరం! ఈ ప్రజలనెప్పుడూ నమ్మకు. వాస్తవంలో ఈ ప్రజలు గొర్రెలమందలాంటివాళ్లు. ఒకటి కంచె దూకితే అన్నీ దాన్ని అనుసరిస్తాయి. వాటికి వీళ్ళకూ అట్టే తేడాలేదు శేఖరం! ఈ ప్రజలున్నారు చూశావ్? మహారాజ మనస్తత్వం వీళ్ళది.

శేఖ:- అంటే?

విశ్వం:- అదే చెబుతున్నాను. వాళ్ళ వున్నతికోసం జీవిత సర్వస్వాన్ని ధార పోసినా, ఒక చిన్న తప్పిదం పొరపాటున జరిగినా వాళ్ళు మనిషిని మన్నించలేరు. కనీసం తోటి మానవుడన్న సానుభూతితోకూడా చూడరు. దూషించి నోటితోనే దూషిస్తారు. అందలమెక్కించిన వాళ్ళే అధఃపాతాళానికి తోసేస్తారు. నా సంగతే చూడు. వెనక నేనూ ఒక గొప్ప రచయితను. అన్నిటికన్నా మిన్నగా సాహిత్యసేవే ధ్యేయంగా పెట్టుకున్నాను. అందుకోసం బ్రతుకునే బలిపెట్టుకున్నాను. అంచుకు ఫలితంగా నాకు లభించినదేమిటో నీకు తెలుసుగా? త్రాగుబోతునన్న ఒక మచ్చ. ఈ మచ్చతో నాలోని మేధస్సు, శక్తి ఎందుకూ కొరగాకుండా పోయాయి. చివరకు ప్రపంచంలో విశ్వం త్రాగుబోతుగానే మిగలంగలిగాడు.

శేఖ:- నా ఉద్దేశ్యం అదికాదు.

విశ్వం:- మరి?

శేఖ:- ఈ రాజకీయరంగంలో ఉన్నతమైన స్థాయి నందుకోవాలనుకున్నాను. ఆ కారణంగానే పాపాయిల్లా పెంచిన రూపాయలను పానకంలా

పంచిపెట్టాను. ఆ తెగువే నాకి రాజకీయాలలో ఉన్నత పథాన్నం
దించింది. ఇప్పుడు నా శ్రమకు ఫలితం లభించింది. నేను వెచ్చించిన
దానికి పదింతలు హెచ్చుగా నా ముందు వాలింది.

విశ్వం:- ఏమిటది? సూటిగా చెప్పు.

శేఖ:- నేనేం వ్యంగ్యంగా మాట్లాడటం లేదే! ఈ స్థాయికి చేరాలని నేనెంతో
ఖర్చు పెట్టాను. ఉన్న డబ్బును పేరాల్లా కాకుల్లాంటి యీ మూకలకు
వెదజల్లాను. ఇప్పుడు నాకు అంతస్తు, హోదా వొనగూడాయి. నేను
నా పరిధిలో యేమయినా చేయగలను. డబ్బును నా యింట్లో దిబ్బలా
పొయ్యగలను.

విశ్వం:- శేఖరం! ఏమిటి నువ్వనేది?

శేఖ:- నేను వెలపోసింది మళ్ళీ నిండీసుకోగలనంటున్నాను.

విశ్వం:- ఎంత స్వార్థం? ఇంత సంకుచితంగా ఆలోచించగలవని నే నెన్నడూ
వూహించలేదు.

శేఖ:- విశ్వం!

విశ్వం:- చూడు శేఖరం! ఎవరు ఏ రంగంలో శ్రమ చేసినా, మరే విధమైన
కృషిచేసినా స్వార్థప్రయోజనాలకు కాకూడదు. స్వార్థచింతనతో
మంచిచేసినా మంచనిపించుకోదు. అది చెడే అవుతుంది. నమ్మి నీ
కండగా నిలబడ్డవాళ్ళను వంచించడం ఆత్మవంచనే అవుతుంది.
ఒకరి మంచికోసం పదిమందిమీద మట్టి చల్లడం మంచిదికాదు
శేఖరం! అందులో ఒక రాష్ట్రాన్ని ఏలవలసినవాడివి, నీ కిలాంటి
ఆలోచనలు కలగడం సిగ్గుచేటు.

శేఖ:- మరి నే ఖర్చుపెట్టిన సొమ్ము సంగతి?

విశ్వం:- నే నిస్తాను.

శేఖ:- నువ్వా?

విశ్వం:- ఏం, ియివ్వగూడదా? మనిద్దరం అన్నాతమ్ములం కాకపోయినా
అంతకుమించిన బాంధవ్యం మనకుంది. స్నేహితులుగా ఒకరి

బాగోగులు మరొకరు విచారించవల్సిన బాధ్యతవుంది. నీవు పెడ మార్గాలుపట్టిపోవడం నేనెప్పుడూ సహించలేను. ఎంత ఖర్చుచేసినా తరగని డబ్బు నాకున్నది. ఈ డబ్బంతా యేం చేసుకోను? ఒక స్నేహితుడిని మంచి మార్గానికి మరల్చడానికంటే మించిన ప్రయోజనం ఆ డబ్బుతు కలుగుతుందని నేనుకోను. పైగా నువ్వు చేసిన సహాయానికి నే నెంతో ఋణపడి వున్నాను. ఈ రూపేణానన్నా ఆ ఋణం తీర్చుకోనీ! నా మాట కాదనకు. పవిత్రంగా గడపాల్సిన జీవితాన్ని వ్యర్థంచేసుకోకు

శేఖ:- (నిర్ఘాంతపోయి చూస్తుంటాడు.)

విశ్వం:- ఏమిటలా చూస్తావు? ఈ త్రాగుబోతు మాటలు నమ్మవచ్చునా అని ఆలోచిస్తున్నావా?

శేఖ:- విశ్వం... (ఉద్రేకంలో మాటలాడలేకపోతాడు)

విశ్వం:- ఏమిట్రా అది?

శేఖ:- నీవు మనిషివికావు, దేవుడివిరా? స్వప్నలోనే పాపాన్ని రూపుమాపగల పవిత్రమూర్తివి.

విశ్వం:- మరీ నీ పొగడ్తలతో ఆకాశానికెత్తెయ్యకు. కాలుజారితే అగాధంలోకి జారిపోతాను.

శేఖ:- పొగడ్తకాదు విశ్వం, వాస్తవం.

విశ్వ:- అంతగొప్పతనం నా దగ్గరేమీలేదు. ఉన్నదల్లా ఒక్కటే. త్రాగుబోతును. (టీపాయ్‌మీద సీసా తీసుకుంటాడు. దగ్గు తెరవస్తుంది. దగ్గుతూ లోపలకుపోబోగా శేఖరం ఆసరాగా ప్రక్కన నిలుచుని నడిపించుకొని మధ్య గదిలోపలకు తీసుకువెళతాడు. వెలుపలనుండి విశాల వస్తుంది. హాల్‌అంతా ఒకసారి కలయజూస్తుంది. డెరిచూస్తూ తూర్పుభాగంగా మధ్యగదిలోనుండి శేఖరం వస్తాడు)

విశాల:- (శేఖరాన్ని అదాటున చూచి) నమస్కారమండి.

శేఖ:- నమస్తే.

విశాల:- నా పేరు విశాల. 'ధ్వని' పత్రికా విలేఖరిని.

శేఖ:- ఓహో! రండి, కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?

విశాల:- మీతో యింటర్వ్యూ చేద్దామని.

శేఖ:- అలాగా. రంగయ్యా, రంగయ్యా! వీడు సమయాని కుండడు. వుండండి. కాఫీతెస్తాను.

విశాల:- మీ కనవసర శ్రమ కలిగిస్తున్నా ననుకుంటున్నాను.

శేఖ:- ఇందులో శ్రమే మున్నదండి. పాపా, పాపా!

చిట్టి:- (లోపలినుంచే) ఏమిటి నాన్నా?

శేఖ:- అక్కడి ఫ్లాస్కూ, గ్లాసులు యిలా పట్రామ్మా!

విశాల:- ఈ విధంగా మీకు శ్రమ కలిగిస్తున్నందుకు క్షమించాలి.

శేఖ:- భలేవారే! ఈ మాత్రానికే ఇంత "ఇన్‌కన్వీనియెన్స్" ఫీల్ అయితే యిక పత్రికా ఓలేఖరిగా ఎలా నెగ్గుకొస్తున్నారండి. (పాప ఫ్లాస్క్‌తో వస్తుంది. పాప కాఫీ పోయటోతుండగా)

విశాల:- నేను పోస్తా నిలా యివ్వమ్మా!

శేఖ:- ఎందుకండి, పాప పోస్తుందిలెండి.

విశాల:- ఫర్వాలేదు (పాపచేతిలో ఫ్లాస్కు అందుకుని రెండు గ్లాసులలో పోసి ఒకటి శేఖరానికిచ్చి, మరొకటి పాప కివ్వబోతూ) త్రాగమ్మా!

చిట్టి:- నేను భోజనం చేశాగా, భోంచేసిం తరువాత కాఫీ త్రాగడం మంచిది కాదని మా బాబాయి చెప్పాడుగా.

విశాల:- అలాగా. మంచి తెలివైనపిల్ల. ఏమండీ ఈ పాప...

శేఖ:- మా పాపేనండి.

విశాల:- (పాపను దగ్గరకుతీసుకొని) ఏం చదువుతున్నావమ్మా?

చిట్టి:- సెకండ్ ఫారం.

విశాల:- ఊఁహూఁ!

(విశాల, శేఖరం కాఫీ త్రాగుతూ ఒకరి నొకరు చూచుకుంటూ వుంటారు. పాప వారి మధ్యన నిలబడి యిద్దర్నీ పరికించి చూచి

పక్కన నవ్వుతుంది, శేఖర్ విశాలు కూడా శ్రుతికలుపుతారు. ఇద్దరూ కాసి ప్రాగదం ముగిస్తారు.)

శేఖ:- ఇవి తీసుకెళ్ళి నవ్వు పడుతో పోమ్మా.

చిట్టి:- మరి నవ్వో?

శేఖ:- నే తరువాత నస్తాగా!

చిట్టి:- తర్వాగా వచ్చెయ్యాలి మరి (పోతూ పోతూ విశాలను వెక్కిరిస్తుంది. విశాం పాపను పట్టుకోబోతుంది. కాని పాప జారిపోతుంది. విశాం పాప వెళ్ళినవైపే అప్యాయంగా చూస్తూవుంటుంది)

శేఖ:- ఇహ మీరు మొదలుపెట్టవచ్చు.

విశాల:- (తెప్పరిల్లుకొని) ముందు మీరు నా ప్రశ్నలు కొన్నిటికి సమాధానం చెప్పాలి.

శేఖ:- అందుకు అభ్యంతర మేముంటుంది?

విశాల:- [గొంతు సవరించుకొని] మీ పూర్తి పేరు శేఖరమేనాండి?

శేఖ:- కాదండి, చంద్రశేఖరం. మిత్రులు అభిమానుల శేఖరం అని పిలుస్తారు

విశాల:- మీరే కులానికి చెందినవారో చెబుతారా?

శేఖ:- ఈ యుగంలో కులాలేమిటండి. ఈ భేదాన్ని రూపుమాపుదామనే ప్రజలూ, ప్రభుత్వం కూడా శీఘ్రమైన కృషి సల్పుతున్నారు. అలాంటప్పుడు...

విశాల:- అయినా ఉద్యోగ దరఖాస్తులలో ఇంకా కులాన్ని ప్రస్తావిస్తూనే వున్నారుకదా?

శేఖ:- అవుననుకోండి...అది వుద్దేశించి చేస్తున్నది కాదు. పూర్వపు మూఢాచారాల్లాగే ఆదీ ఓ అలవాటయి పోయింది. అంతకంటే మరో ప్రత్యేకత ఏదీ వున్నదనుకోను.

విశాల:- అంటే మీకు కులప్రసక్తి లేదంటారు?

శేఖ:- అనటమే కాదు, ఆచరణలోకూడా చూపిస్తాను. నేను పుట్టి బుద్ధి యెరిగిన నాటినుంచి, ఎవ్వరితో కులంచెప్పి ఎరుగను. అయినా దాని వల్ల ఒరిగేముంది చెప్పండి?

విశాల:- అవునులెండి, పోనీ దినికైనా సమాధానం చెబుతారా?

శేఖ:- ఏమిటది?

విశాల:- మీ కుటుంబం బాగా వున్న కుటుంబమేనా?

శేఖ:- పెద్దగా ఉన్న కుటుంబమేమీ కాదనకోండి. అయినా బొత్తిగా లేదని చెప్పడానికికూడా లేదు.

విశాల:- [చిన్నగా నవ్వుతుంది] ఇపుడు మీ వయస్సెంతండి?

శేఖ:- ముప్పదిమూడు సంవత్సరాలు.

విశాల:- అంటే యింకా యువకులే నన్నమాట?

శేఖ:- [పేలవంగా నవ్వుతాడు.]

విశాల:- మీకు పెళ్ళయి ఎన్ని సంవత్సరాలయిందో?

శేఖ:- పన్నెండు సంవత్సరాలు దాటింది.

విశాల:- మీ భార్యగారు...

శేఖ:- లేరు.

విశాల:- పుట్టింటికి వెళ్ళారా?

శేఖ:- కాదు.

విశాల:- మరి... (చేతిమీద చేయివేయబోయి) ఐ యామ్ సారీ?

శేఖ:- ఆమె చనిపోయి చాలాకాలమైంది.

విశాల:- ఏదైనా వ్యాధితో మరణించారా?

శేఖ:- ఆహా. ప్రసవించడంలో. తొలికాన్పు కావడంతో ప్రసవించడం కష్టమైంది. కనడం కష్టమై కన్నుమూసింది. నా భార్య నాకు దూరమై పోయింది. ఆమె బ్రతికివుండే యీనాడు ఎంత ఆనందించివుండేదో? (విశాల మూర్ఛపోతుంది. శేఖరం చూచి) ఏమండి, ఏమైందండి?

(తాకి చూచి) ఆఁ! ఫిట్‌లో పడిపోయినట్టుందే. (విశాల కదులుతుంది) అరె, యీ మాత్రానికే బెంబేలెత్తి పోయారేమిటండీ? మీరు ఒట్టి సెంటిమెంటల్ ఉమన్‌లా వున్నారే!

విశాల:- ఐ యామ్ సారీ! (అని కదలబోయి మళ్ళా పడిపోతోతుంది. శేఖరం పట్టుకుంటాడు. విశాల శేఖరం మెడమీద చేయి వేస్తుంది. ఇంతలో వెనుపల ద్వారంవద్ద ఫ్లాష్‌బల్బు వెలుగుతుంది.)

శేషు:- (లోపలకు కెమెరా సరిచేసుకుంటూ వస్తూ, వండర్‌ఫుల్! నేను క్రాహ్మండమైన పోజు కాప్చర్ చేశానన్నమాట.

శేఖ:- ఎవరు మీరు?

శేషు:- నన్ను మీకు తెలియదూ? నన్ను, ఓహ్, వాట్ ఏ పిటీ! శేషును తెలియనివాళ్ళింకా యీ ప్రపంచంలో వున్నారంటే ఓ గాడ్, మిజరబుల్!

శేఖ:- మీరు...

శేషు:- మీ కింకా తెలియదన్నమాట? నన్ను మీరు క్రిటికల్ జన్‌చర్‌లో పెట్టేశారండి క్రియాటన్‌కుమల్లే.

శేఖ:- నేనా?

శేషు:- మరి? ఈ సిచ్యుయేషన్‌లో స్వదబ్బా కొట్టుకోవలసిన గతి పట్టిందినాకు. ఏమిటలా చూస్తారు? నేనేం లాటిన్ మాట్లాడటం లేదు. ఓ. అదా? స్వదబ్బా అన్న పదానికి అర్థం తెలియలేదన్నమాట మీకు? వెధవ కంట్రీ ఇడియమ్స్, ఎవడన్నా పీటికో డిక్షనరీ క్రాసిపడేసినా దావుండును. ఆఁ, ఏమిటి? స్వదబ్బాకదూ? చూశారూ! ఈ యుగంలో అంటే మధ్యయుగంలో-నో, నో. మనకావకవులన్నట్లు దాని పేరు యస్. సంధియుగం. ఈ సంది యుగంలో మనుష్యం గొప్పలు చాటుకోవడానికి మూడే మూడు పద్ధతులున్నాయని మనవాళ్ళు డిటెక్ట్ చేశారు. వరుసగా చెబితే అవి-స్వదబ్బా! పరదబ్బా!! పరస్పర దబ్బా!!! ఇందులో వస్తు బిట్టే మీకర్థం కాలేదుకాబట్టి క్రమాలంకారంలో కుదించి వాటి అర్థం నేనే చెబుతాను. స్వదబ్బా

అంటే తన్నుగుంటిచి తాను గొప్పలు చెప్పుకోవడం. ఈ జాతి మనుష్యులు ఎక్కువగా మనకు కవులలో కనిపిస్తారు. కావాలంటే మీరు ఏదైనా గ్రంథంలో ముందుండే నామాటలోనో, వెనుక అట్ట మీద రచయిత బొమ్మక్రిందో చూడండి, మీకే తెలుస్తుంది. ఇక పర దబ్బా అంటే ఒకళ్ళనుగురించి మరొకళ్ళు పొగడ్డం. ఇలాంటిది జరగాలంటే వాడిమీద వీడికి ప్రేమో, అభిమానమో, అలాంటి జబ్బు మరేదో వుండితీరాలి. లేకపోతే యిలాంటిది జరుగదుకదా మరి! వాళ్ళే మర్డరర్స్ ఆఫ్ కీట్స్.ఏమిటలా చూస్తారు? ఇదీ అర్థంకాలేదా? విమర్శకులండీ, క్రిటిక్స్, కాకుల్లాపొడిచి కిట్సు మహాకవిని లోకాని కాకుండా చేశారు. ఈ జాతి మనుష్యులు ప్రపంచమంతటా కుక్క గొడుగుల్లా అంగుళాని కొకడున్నాడు. లేకపోతే మన తెలుగువాళ్ళు తీసే అర్థంలేని సినిమాలకు బాగున్నాయనే పొగడ్తలు, వాటికి డబ్బులు ఎలా వస్తాయి చెప్పండి! పోతే పరస్పరదబ్బా. ఇటీజ్ ఓన్లీ ఎ మ్యూచ్‌వల్ అండర్‌స్టాండింగ్, ఈ కోవ మనుష్యులు ఎక్కువగా మీ జాతీయ నాయకులలో కనిపిస్తారు. ఎందుచేతనంటే- ప్రతి నాయకుడికీ ఒక గ్రూపు, ఆ గ్రూపులో కొందరు శిష్యవర్గం వుండటం ఒక క్వాలిఫికేషన్. మరి గురువుగారు శిష్యుల్ని, శిష్యులు గురువుగార్ని పొగుడుకోవటం, అందులో పబ్లిక్ ప్లాట్‌ఫారమ్స్ మీద, పెద్దపెద్ద మందలముందు పరిపాటయిపోయింది. ఇదీ స్థూలంగా చెప్పాలంటే వాది డిఫనిషన్. ఇకపోతే...

శేఖ:- అసలు మీరెవరో చెప్పారుకాదు.

శేష:- ఐ యామ్ సారీ. కమింగ్ టు ది పాయింట్. నా పేరు శేష. అసలు పేరు ఆదిశేష. ఆద్యంతాలు తెలియని ప్రపంచంలో "ఆది" ఎందుకు సోదిలే అని, అంతవరకు కట్‌చేసి శేష అని షార్టుగా మార్చేశాను. (విశాలంవైపు చూచి) క్షమించాలి. ముఖ్యంగా ఆడవాళ్లు పిలవడానికి. ఆడవాళ్ళిమధ్య పేరు పొడుగ్గా వుంటే ప్రేమించడం మానేశారులెండి. ఇకపోతే యక్స్-రే పత్రికకు కరస్పాండెంటుని. ఫొటోగ్రఫీ నా హాబీ ఆ హాబీ చేతులో వుంది కాబట్టే, ఇందాక జాలీగా మీచ్చిన పోజు కూల్‌గా కొట్టేశాను. అయితే అయిందిగాని

బ్రహ్మాండమైన పోజుంది. రాత్రి బాహాటిలో కాంక్షేపం చేసి ఉదయం కాల్‌షీటుల్‌లో కలుసుకున్న సినిమా హీరో హీరోయిన్లకు కూడా వల్లగాని పోజ్ను దే నమ్మండి. (విశాలను చూచి) క్షమించాలి. అతిగా మాట్లాడేస్తున్నట్లున్నాను.

విశాల:- (వ్యంగ్యంగా) లేదు. చాలా తెలివిగా మాట్లాడుతున్నారు.

శేషు:- వాట్ ఆప్ట్రాల్ వర్డ్స్. చేతలు అంతకంటె తెలివిగా వుంటాయండి. నిజంచెప్పాలంటే దేశంలో జనాళా నన్ను జీనియస్ ఆఫ్ ది జర్నలిస్టు అంటారు...అందుకే ఎందరో మిత్రులు బ్రెయిన్‌ని భీమా చేయించమన్నారు. చచ్చు ప్రేమక్కూడా భీమా వచ్చిన ఈ రోజులలో ఆ పని చెయ్యడం బిసీత్ మై ప్రిస్టేజ్ అని ఆ థాట్ తుడిచి పెట్టేశాను.

శేఖ:- ఇంతకూ మీ రెందుకు వచ్చారో చెప్పారు కాదు.

శేషు:- అది చెప్పబోతుండగానే మీరు తొందరపడి అడిగేశారు. అయితే మాత్రం ఏంలెండి. ఉత్సుకత అలాంటిది. తినబోతూ కూరరుచి అడగడం మన ఆంధ్రులకు అలవాటే. నేనిక్కడకు వచ్చింది మిమ్మల్ని అభినందించాలని. తరువాత ప్రెస్ కో స్టేట్‌మెంటు తీసుకుందామని. ఆ తరువాత హాబీకి, జాబ్‌కి పనికొచ్చేటట్లు మచ్చుకో పోజు పుచ్చుకెళదామని వచ్చాను. వచ్చిన పని వాకిట్లోనే అయిందనుకోండి.

శేఖ:- మీ రనేదేమిటో నా కర్థం కావటం లేదు.

శేషు:- అర్థంకానివే అందంగా వుంటాయి సార్! ఫర్ ఎగ్జాంపుల్. అందని ఆమ్మాయిని కళ్ళల్లో నింపుకొని కవిత్వం చెబితే కమ్మగా వుంటుంది.

శేఖ:- అయ్యా; ఆదిశేషుగారూ! త్వరగా తెమల్చండి. అవతల ప్రొద్దు పోతుంది.

శేషు:- జస్ట్ ఏ మినిట్. ఫస్ట్ ఆఫ్ ఆల్ మీ విజయానికి నా అభినందనాలు. ఇకపోతే మీ ఇద్దరి పేర్లు. మీపేరు తెలిసేవుంది కాబట్టి, మీ సతీమణిపేరుకూడా సెలవిస్తే పేపర్లో ప్రచురించి తాటికాయలంత

అక్షరాలతోటి, గొప్ప రాజకీయవాది గృహస్థ జీవితం అని మీ ఆనందమయ సాంసారిక జీవితాన్ని గురించి కరుకుల్లాంటి కుర్ర వాళ్ళచేత పది కీకాలమ్స్ నింపిస్తాను.

శేఖ:- ఏమిటయ్యా నువ్వనేది?

శేషు:- అదేనండి. ఇందాక మీరూ, మీ శ్రీమతి ఆనందంగావున్న సమయంలో...

శేఖ:- నా శ్రీమతా?

శేషు:- అవును. ఇంత అన్యోన్య చాపత్యం ఎంతమందికి లభిస్తుంది చెప్పండి. ఇంతకుముందే నే తీసిన ఫోటోయే అందుకు నిదర్శనం.

శేఖ:- మిస్టర్ ఆదిశేషూ!

శేషు:- పోసీ వారినే అడిగి తెలుసుకుంటాను. ఎక్స్‌క్యూజ్ మి, మీ పేరే మిటో శెలవిస్తారా?

విశాల:- విశాల.

శేషు:- మీకూ, మంత్రిగారికి వివాహమై యెంతకాలమైందో చెబుతారా?

శేఖ:- ఆమె నా భార్యకాదయ్యా బాబూ!

శేషు:- కాదూ?

శేఖ:- కాదు.

శేషు:- అయితే నా ఫిలింలో ఒక ట్రేమ్ వేస్టయిందన్నమాట. ఇంకా పిరిద్దరూ దంపతు లనుకొని బ్రహ్మాండమైన స్టిల్ తీశాను. (చిన్నగా నవ్వి) వేస్టయినా మోస్టు వండర్‌ఫుల్‌గావుంది. వాస్తవంలో బానర్ మారిందేగాని ఎఫెక్టు అంతకు పదిరెట్లు పెరిగింది.

శేఖ:- ఏమిటది?

శేషు:- ఏముంది. వడ్లగింజలో బియ్యపుగింజ ప్రముఖ రాజకీయవాది రహస్య జీవితం అన్న బేనర్ వేసి ఈ ఫోటో క్రింద వేస్తే ఎలా వుంటుం దంటారు?

శేఖ:- తమాషాగా మాట్లాడుతున్నారా?

శేషు:- పోసీ సీరియస్‌గానే మాట్లాడుతున్నా ననుకోండి.

శేఖ;- తల తిరుగుతోందా?

శేషు:- నా కెందుకు తల తిరుగుతుందండి?దాటుమాటున ఇలాంటిపనులు చేసే మీకు తిరగాలి.

శేఖ:- నేను తలచుకుంటే నిన్నేం చేస్తానో తెలుసా?

శేషు:- ఏమీ చెయ్యలేరు. నన్ను ద్రిమింగితే నీ పళ్ళు రాలగొడతా నన్నడిట వెనుకటికో యెలుక పిల్లితో. అయ్యా మంత్రిగారూ! మీ పరువు ఈ కెమారాలో వుంది. మీ పరువు నిలబడాలంటే దీన్ని మీరు కొనక్కోవాలి. పెద్దగా ఏమీ అక్కరలేదు. ఒక్క పదివేలు చాలు.

శేఖ:- చిల్లిగవ్వకూడా ఇవ్వను.

శేషు:- ఇది మీకు పెద్ద నష్టమేమీ కాదు. అందులో మీరు మంత్రులు, భవిష్యత్తులో లక్షలకు లక్షలు ఆర్జించగలవారు. ఈ పదివేలు మీ కేపాటిది? బాగా ఆలోచించే చెప్పండి.

శేఖ:- ఆ అవసరం నాకులేదు, రాదు. నీ ఆబద్ధాలు క్షణంలో తూపుమాపగలను. ఆమెచేత వాస్తవాన్ని చెప్పించి నిన్ను జైలుకు పంపుతాను. (విశాలవైపు తిరిగి) ఏమండి! ఏమంటారు? (విశాల పలుకదు.)

శేషు:- మంత్రిగారితో-అందులో భార్యా విహీనుడైవున్న వానితో సంబంధం వున్నదని ప్రచారం జరగడంకంటె మించిన అదృష్టం ఆడదానికి ఇంకేముంటుందండి చంద్రశేఖరంగారూ!

శేఖ:- యూ షటప్, ఏమండి! మిమ్మల్నే. మాట్లాడరేం?

(శేషు, విశాల ఇద్దరూ కలసి పగలబడి నవ్వుతారు.)

శేఖ:- అర్థమైంది. మీ యిదరూ కలిసే ఈ నాటక మాడారన్నమాట. ఇద్దరూ కూడబలుక్కునే వచ్చారన్నమాట.

శేషు:- అవును. మీరన్నది అక్షరాలా నిజం.

శేఖ:- వంచన, మోసం. బ్లాండల్.

శేషు:- దానికి మీరేం పేరుపెట్టినా నా కభ్యంతరంలేదు, ఆడిగినపస్తేసరి.

శేఖ:- నా కంఠంలో ఊపిరుండగా ఇవ్వను.

శేషు:- ఇవ్వవేం, ఆదీచూస్తా. 10 నిమిషాలా బై మిస్తున్నాను. అప్పటివరకు విశాల ఇక్కడే వుంటుంది. నిదానంగా ఆలోచించే పంపు. విశాలా! యిలారా. దీన్ని దగ్గరుంచు. (నెగిటివ్ యిస్తాడు) దబ్బిస్తే ఇదిచ్చి దబ్బు తీసుకురా! కాని పక్షంలో ఏం చెయ్యాలో తెలుసుగా?

విశాల:- ఆఁ!

శేషు:- నే వస్తానురి. బై బై మినిస్టరుగారూ! (వెళతాడు.)

విశ్వం:- (లోపలినుండి) శేఖరం! ఏమిటాగొడవ?

శేఖ:- (కంగారుగా) కాసేపు ఆ గదిలో కూర్చో. ఆయన చూస్తే అసహ్యంగా వుంటుంది. వెళ్ళు. ప్లీజ్, (విశాలను కుడివైపు గదిలోకి పంపిస్తాడు.)

విశ్వం:- (లోపలకువస్తూ) ఎవరితో గొడవ పడుతున్నావు?

శేఖ:- ఏమీలేదే.

విశ్వం:- నా దగ్గరకూడా దాపరికమెందుకు! నే నంతా వింటూనేవున్నాను.

శేఖ:- నువ్వూ వింటూనేవున్నావా?

విశ్వం:- శేఖరం, చిత్తుగాత్రాగినా మనస్సుకు మత్తెక్కదు. నీకూ వాళ్ళకు మధ్య జరిగిన సంభాషణంతా వింటూనే వున్నాను. ఇంతకూ ఏం నిర్ణయించుకున్నావ్?

శేఖ:- నిర్ణయించుకునే దేమిటి?

విశ్వం:- దబ్బిచ్చి పరువు నిలుపుకుంటావా? దబ్బు దాచుకుని పరువు నమ్ముకుంటావా? మాట్లాడవేం?

శేఖ:- ఏమైనాకానీ, నే నివ్వను.

విశ్వ:- తెల్లవారితే పరువు పీధిలో వుంటుంది. వెర్రిమాలు కట్టిపెట్టి దానికి దబ్బిచ్చి పంపించు.

శేఖ:- నేనివ్వను. ఇలా ఒకసారి ఆలవాటుచేస్తే ఇది వాళ్ళకు ఆలవాటవుతుంది.

విశ్వం:- పోసి, నేనిస్తాను

శేఖ:- ఎవ్వరేమి యివ్వనక్కరలేదు.

విశ్వం:- [కోపంగా] శేఖరం! వెళ్ళు. ఆ మనిషిని పంపించు.

శేఖ:- అదికాదు విశ్వం.

విశ్వం:- యిక వాదం అనవసరం. వెళ్ళి చెప్పినట్టు చెయ్యి. [శేఖరం కిక్కురు మనకుండా వెళుతుంటాడు.] ఇదుగో శేఖరం ! ఆ టేబిల్ మీద చెక్‌బుక్ యిలాపడేసి నువ్వు వెళ్ళి భోజనం చెయ్యి, అసలే ప్రొద్దు పోతుంది. [చెక్‌బుక్కిచ్చి శేఖరం వెళతాడు. విశ్వం త్రాగుతుంటాడు. విశాల వస్తుంది. విశ్వాన్ని చూచి భయపడి సోఫా వెనుకగా బయటకు పోబోతుంది. వాకిటదాకా పోనిచ్చి]

విశ్వం:- నీ పేరేమిటన్నావ్? విశాలకదూ? విశాల. [ఆగుతుంది.] ఈ వ్యాపారం ఎంతకాలంగా సాగిస్తున్నావ్? అదదానివికదా! కడుపులో చల్ల కదలకుండా పెళ్ళిచేసుకొని పిల్లల్నికంటూ కూర్చోక ఈ అవస్థేం దుకు చెప్పు? చూస్తే బాగా అందంగా వున్నట్టున్నావ్? ఇంత నిక్కష్టంగా బ్రతికేకంటే ఎవడితోనన్నా లేచిపోవడం మంచిది తెలుసా ? ఒక పనిచేస్తావా? నాతో లేచొస్తావా? పోసి, నన్ను పెళ్ళిచేసుకొంటావా? డబ్బుకేమీ ఇబ్బందిలేదు. నా దగ్గర కావలసినంత డబ్బుంది. ఏం ? ఇష్టం లేదా ? మీకు మంచెందుకు నచ్చుతుందిలే. దారిగుంటలో పడేకుక్క ఆలయంలో వుండమంటే వుంటుందా? పోసిలే, ఒకటి మాత్రం గుర్తుంచుకో. మరెప్పుడూ ఇలాంటి పని చెయ్యకు. ముఖ్యంగా ఇక్కడ. తలుపుకుంటే ఇక్కడ నిన్నేమయినా చెయ్యగలను. ఆడదాని వయిపోయావు. అందులో డబ్బుకు యిబ్బంది పడుతున్నట్టున్నావు. పాపం! ఇదిగో నీ డబ్బు. ఆ నెగిటివ్ యిలా ఇవ్వు. ఊఁ- [విశాల నెగిటివ్ ఇవ్వబోతుంది. విశ్వం విశాలచేతిని చూచి.]

విశ్వం:- ఎవరున్నువ్వు? (విశాల పరిగెత్తబోతుంది. వెనుకనుంచి విశ్వం పట్టుకుంటాడు. విశాల ముఖాన్ని చేతులలో దాచుకుంటుంది.) నిజం చెప్పు. ని పేరేమిటి? నిన్నే, మాట్లాడవేం?, (గట్టిగా లాగుతాడు. విశాల గదిమధ్యకు వచ్చిపడుతుంది.) నీవు విశాలవుకాదు, సరోజవు అవునా?

విశాల:- (ఏడుస్తూ అవునన్నట్లు తల ఊపుతుంది.)

విశ్వం:- అమ్మ! ఇంత నికృష్టమైన దశలో నిన్ను చూడవలసి వస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఏం పనిచేశావు సరూ !

విశాల:- క్షమించండి, మీపు అన్యాయం చేశాను. ఈ జీవితంలో మీకు ఈ ముఖం చూపించవలసి వస్తుందని నేనెన్నడూ ఊహించలేదు. నన్ను మన్నించండి. (కాళ్ళమీద పడుతుంది. విశ్వం దూరంగా పోతాడు. విశాల నిరాశగా వెనుపలకు వెళ్ళబోతుంది.)

విశ్వ:- సరూ! (విశాల ఆగుతుంది.) నువ్వు నన్ను విడచి యెందుకు వెళ్ళిపోయావు? నేనేం తప్పుచేశానని యిలా చేశావు సరూ? తెలిసి నే నెప్పుడూ నీపట్ల కర్కశంగా ప్రవర్తించలేదే ! ఇలా యెందుకు చేశావు సరూ?

విశాల:- ఇందులో మీ తప్పేమీలేదు. అజ్ఞానంలో నన్ను నేనే బలిపెట్టుకున్నాన. నా జీవితాన్ని చే జేతులా నేనే నాశనం చేసుకున్నాను. మిమ్మల్ని మీ మంచితనాన్ని అర్థం చేసుకోలేకపోయాను. ఫలితంగా జీవితాంతం వ్యధతో వేగిపోతున్నాను.

విశ్వం:- లేదు సరూ! నేనే నిన్నర్థం చేసుకోలేకపోయాను. కవితాదాహంతో కళ్ళు మూసుకుపోయి, నిన్ను నిర్లక్ష్యం చేసి, నీ జీవితాన్ని బొమ్మలా పగులగొట్టాను. ఆ కైపులో ప్రపంచంలో దబ్బుంటే లేని ఆనందం మరొకటి లేదనుకున్నానే గాని, అంతకుమించిన ప్రేమబంధం దాంపత్యానికి అవసరమన్న విషయాన్నే విస్మరించాను. ఆది తెలుసుకునేటప్పటికే అంతా ముగిసిపోయింది. నువ్వేమో ఎడారిలో ఎండమావుల చూపించి ఎటో ఎగిరిపోయావు. ఆ స్థితిలో అర్థం కాని

ఆ మోమయ దశలో యీ బ్రతుకెంత కాగిపోయిందో నీకు తెలియదు సరూ!

విశాల:- ఏమండీ, బాధపడుతున్నారా? ఈ పాపిష్టిదాని పొందు మీకు లేకుండా పోయిందని చింతిస్తున్నారా? అందుకోసం మీ బ్రతుకును బ్రద్దలు చేసుకుంటున్నారా!

విశ్వం:- సరూ! నేనిప్పుడు నీవు నాకన్యాయం చేశావని బాధపడటం లేదు. నీ బ్రతుకిలా ఎందుకూ కొరగాకుండా పోయిందేమో! అనే బాధపడుతున్నాను సరూ! తప్పు చెయ్యడం మానవ సహజం! తెలిసి దాన్ని దిద్దుకోవడమే మానవత్వం. ఒకసారి ఏదో తెలియని దశలో తప్పటడుగువేస్తే, మళ్ళీ దాన్ని దిద్దుకునేందుకు అవకాశమున్నదని ఊహించలేని నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది.

విశాల:- క్షమించండి. మీ మంచితనాన్ని వంచించలేను. పాపం ఘనీభవించిన ఈ జీవితంతో మిమ్మల్ని మీపవిత్రతనీ కించపరచలేను. దేవతలాంటివారు మీరు. వాడి రాలిన మొగలిరేకును నేను. పరిమళ భరితమే అయినా మొగలిరేకు పూజకు పనికివస్తుందా?

విశ్వం:- అవన్నీ మానవులం మనం నిర్మించుకొన్నవి. వాటికోసం బ్రతుకులు బలి చేసుకోనక్కరలేదు.

విశాల:- ఎన్నయినా చెప్పండి. నేను మాత్రం అంగీకరించను. నిర్మలమైన మీ జీవితంలో మాలిన్యపు మచ్చలను కలిగించలేను. కానీ నా దొక ప్రార్థన. నా కారణంగానే యీ త్యాగము మొదలెట్టారు. ఈ పాడు వ్యసనంతో మిమ్మల్ని మీ రెందుకు హింసించుకుంటారు? నా మాట విని ఈ త్యాగము మానెయ్యండి.

విశ్వం:- క్షమించు సరూ! అది ఈ జన్మకిక సాధ్యపడదు. అదే లేకపోతే ఈ మనస్సుకి శాంతిలేదు నీవు నా దరిలేకపోయినా ఆ వెలితి నది కప్పిపుచ్చుతోంది.

విశాల:- (ఏడుస్తుంది)

విశ్వం:- సరూ! ఈ జీవిత మెలాగూ శిథిలమైపోయింది. నీ జీవితాన్నయినా బాగుచేసుకో. నీకు కావలసినంత దబ్బిస్తాను. పెదమార్గాలు వదిలి సవ్యమైన దారిలో బ్రతుకును వెళ్ళదీసుకో.

విశాల:- మన్నించండి. నా కీ జీవితంలో యే ఆశా, కోరికా లేవు. మృత్యువుకై యెదురుచూస్తున్నాను. నా ఈ పాపాలకు అదే సరైన శిక్ష.

విశ్వం:- సరూ!

విశాల:- కడసారిగా మిమ్మల్ని ఒక టడుగుతాను, కాదనరు గదా?

విశ్వం:- ఏమిటది?

విశాల:- పాప...మన పాపనొకసారి చూపించండి.

విశ్వం:- పాప. పొత్తిళ్ళలో వున్న పాపను వదిలి వెళ్ళినప్పుడు, పాపకెదమై బ్రతికిన ఇన్నాళ్ళు ఈ ప్రేమ, ఆనుబంధం, అనురాగం, వాత్సల్యం ఎక్కడికిపోయింది సరూ? ఆ బంధాన్నే నీవు గమనించివుండే నీవూ, నేనూ కూడా యిలా సరాయి పంచన బ్రతుకవలసిన అవసరం ఏముంది చెప్పు?

విశాల:- మాటలతో నన్ను హింసించకండి. ఉద్రేకంలో ఏమో చేశానేగాని ఆ వలితాన్ని అనుభవించడానికి నేనెంత కుమిలిపోయానో, నా హృదయం పాపకోసం ఎంత పరితపించిపోయిందో మీకు తెలియదు. చేసిన తప్పుకు క్రుంగిపోయి, మీ ముఖం చూడలేక, మీ యెదుటపడ లేక, నాలో రగిలే మాతృత్వాన్ని బలవంతాన చంపుకున్నాను. ఏదైతే ఈ జన్మలో జరక్కూడదనుకున్నానో విధి బలీయమై అదే జరిగింది. నేను మీ ఎదుటపడ్డాను. యిక నాకీ జీవితం మీద కాంక్ష లేదు. మిమ్మల్ని బ్రతిమిలాడుకుంటాను. పాప నొక్కసారి చూపించండి.

విశ్వం:- వద్దు సరూ! ఈ మాలిన్యపు మేలిముసుగుతో పాప జీవితాన్ని, భవిష్యత్తును కంటక ప్రాయం చెయ్యకు. తల్లి సతిత, తండ్రి బ్రాగు

బోతన్న విషయాలు నీదల్లా జీవితాంతం వెన్నంటి పాప జీవితం సిగ్గుతో క్రుమ్గిపోయేలా చేయకు. పాపకు మనిద్దరమూ లేము. నీవు దూరంగావుండి లేకపోతే, నేను దగ్గరుండే పాపకు లేను. పాప జీవితంలో మనిద్దరం ఏనాడో చచ్చిపోయాం. ఇప్పుడు పాప మన బిడ్డ కాదు, శేఖరం బిడ్డ.

విశాల:- మీరు చెప్పినమాట కాదనడం లేదు. కాని ఒక్కసారి, చనిపోయే ముందు ఒక్కసారి పాపను కళ్ళారా చూచుకోనివ్వండి. కాగే నీటిలా పొంగే నా మాతృత్వాన్ని సంతృప్తిపరచుకోనివ్వండి. మీ పాదాలంటి ప్రార్థిస్తాను. నా మాట కాదనకండి. పాపను ఒక్కసారి కళ్ళారా చూడనివ్వండి. చూడనివ్వండి. (విశ్వం కాళ్ళు పట్టుకుని ధోరున ఏడుస్తూంది. విశ్వం కరిగిపోతాడు.)

విశ్వం:- సరే, చూపిస్తాను. అయితే ఒక్క షరతుమీద.

విశాల:- ఏమిటి?

విశ్వం:- నువ్వు పాపను తాకకూడదు. పాపతో మాట్లాడకూడదు. మాతృత్వం ఒలికే మరే తీరులోనూ పాపముందు ప్రవర్తించకూడదు.

విశాల:- (ఏడుస్తూ) అలాగే! ఒక్కసారి నా పాపను చూపిస్తే ఆదే పదివేలు. (విశ్వం లోపలకు వెళ్ళి పాపను తెస్తాడు. విశాల ఏడుపు, నవ్వు మిళితమైన ముఖంతో పాపను చూస్తూ వుంటుంది)

చిట్టి:- ఆమె ఎవరు బాబాయ్? ఎందుకు ఏడుస్తుంది? (విశ్వం పలకడు. బాధను క్రింగుతాడు) చెప్పవేం బాబాయ్? ఆమె ఎవరు?

విశ్వం:- ఆమె...ఆమె, చిన్నప్పుడు నీకు పాలిచ్చి పెంచిన దాయమ్మ!

చిట్టి:- దాయమ్మా? అంటే అమ్మకదూ?

విశాల:- (ఖర్చ్ట్ అవుతుంది) పాపా! నా తల్లీ! నా బంగారు తల్లీ!

విశ్వం:- సరోజా!

విశాల:- (ఏమీ పట్టించుకోకుండా) నా చిట్టితల్లి! ఎంతదానివయ్యావ్? మా అమ్మో, నా చిన్నో (ఒళ్ళంతా ముద్దు పెట్టుకుంటుంది.)

విశ్వం:- సరోజా! (ఇద్దర్నీ విడదీస్తాడు) పాపా! నువ్వు లోపలకు వెళ్లు (పాప వెళ్ళిపోతుంది.)

విశాల:- ఏమండీ! నా పాపను ఒక్కసారంటే ఒక్కసారి గుండెలకు హత్తుకోనివ్వండి. ఆ ముద్దు చెక్కిళ్ళను ఒక్కసారి ముద్దు పెట్టుకోనివ్వండి. మీకో నమస్కారం చేస్తాను. మీ కాళ్ళు పట్టుకుంటాను. బ్రతికినంత కాలం మీకు ఋణపడి వుంటాను.

విశ్వం:- పిల్లేదు. అలా ఎన్నటికీ జరగటానికి వీల్లేదు. (విసిరికొడతాడు) వెళ్ళు! నీ యిష్టం వచ్చినచోటికి వెళ్ళు. మరొకసారి నీ ముఖం పాపకు చూపించడానికి ప్రయత్నించకు, వెళ్లు.

(సరోజ కళ్ళవెంట జలజల అశ్రువులు రాలతాయి. యిద్దరూ ఏడుస్తూ కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా ఒకరిని ఒకరు చూచుకుంటారు. సరోజ నిరామయంగా వెలుపలకు వెళ్ళిపోతుంది. విశ్వం బాధగా సరోజ వెనుకే వాకిలిదాకా దగ్గుతూ వచ్చి, మళ్ళీ వెనక్కొచ్చి, చేతులను పిచ్చిగా టిపాయ్‌కు వేసి కొట్టుకుంటుంటాడు. ఇంతలో లోపలకు వచ్చిన శేఖరం విశ్వాన్ని చూచి)

శేఖ:- విశ్వం! ఏమిటిది పిచ్చివాడిలా? (చేతులు పట్టుకుంటాడు.)

విశ్వం:- నీకు తెలియదు శేఖరం, నన్ను వదులు. నేను మహాపాపం చేశాను. మాతృత్వానికి మమకారానికీ మధ్య బంధనాలు తెగగొట్టాను. ఇవి చేతులుకావు. (మళ్ళీ కొట్టుకోబోతాడు.)

శేఖ:- (పట్టు విడవకుండా) విశ్వం !
(బయటనుండి బ్రాందీ బాటిల్సుతో రంగయ్య వస్తాడు)

రంగ:- బాబుగారూ, బాబుగారూ! ఎవరో ఆమె మన మేడమీదనుంచి క్రిందకు దూకిందండి. ఒళ్ళంతా చిదురు చిదురై పోయింది. పాపా, పాపా అని కలువరిస్తోందండి.

విశ్వం:- సరోజా ! శేఖరం, వెళ్లు, ఆమెకు పాపను చూపించు. మరణించేవాళ్ళ కడసారి కోరిక తీర్చడం మానవధర్మం. వెళ్లు శేఖరం!

శేఖ:- సరోజా? సరోజెవరు?

విశ్వం:- ఆమే శేఖరం, ఇందాక వచ్చిందే విశాల.

శేఖ:- దానికి మన పాపను చూపించడం ఎందుకు? ఆ కళంకిని కళ్లుపడితే పాప జీవితమే మైల పడిపోతుంది.

విశ్వం:- శేఖరం! ఇక మాట్లాడకు, ఆమె విశాల కాదురా. నా భార్య సరోజ. వెళ్ళు, పాపను చూపించు. మరణించే ముందైనా ప్రశాంతంగా మరణించనీ. వెళ్ళు, వెళ్లు శేఖరం! (శేఖరం, రంగయ్య పాపను తీసుకుని వెళ్ళబోతారు. విశ్వం పాపను కావులించుకొని అమ్మ అని చెప్పలేక అమ్మ అని భోరున ఏడుస్తాడు. టేబిల్ మీద వున్న బాటిల్ మూత నోటితోనే తెరచి గటగటా త్రాగుతుంటాడు. ఇంతలో రంగయ్య లోపలకు కంగారుగా వచ్చి)

రంగ:- బాబుగారూ, బాబుగారూ! అమ్మగారు పోయారండి. పాపను చూడ కుండానే పోయారండి. (మళ్ళీ కంగారుగా బైటకు వెళతాడు.)

విశ్వం:- సరోజా! (దగ్గుతెర వస్తుంది. తూలుతూ ముందుకు నడవబోతాడు. దగ్గు మరీ ఉధృతమౌతుంది. సోఫా ఆధారం చేసుకుని కూర్చుం టాడు. టిపాయ్‌మీద బాటిల్ పెడుతుంటాడు. గుండె పట్టుకుంటుంది. టిపాయ్‌మీద సీసా దొర్లుతుందేగాని చేతిక్రింద ఇరుక్కుంటుంది. విశ్వం టిపాయ్‌మీద సోలిపోతాడు.)

నేపథ్యం: కనుగొలకులలో ఆశలు, బాష్పకణాలై
సెగలై మదిలో నిలచి రగులును జ్వలితజ్వాలై
రగులును జ్వలిత జ్వాలై-రగులును జ్వలితజ్వాలై॥
(గీతం వస్తూండగా, బాటిల్ నుండి బ్రాందీ చుక్కచుక్కగా పడుతుండగా, తెర ఐరుపుగా జారుతుంది.)

శిరోమణి

రచన :

దివ్యప్రభాకర్

పాత్రలు

వల్లభరావు

పరశురామ్

రాజశేఖరం

పత్రికావిలేఖరి

సుభద్ర

కలవారింట ముందు హాలు. అలంకరణకు లోటులేదు. ఎదురుగా లోపలకు పోయే గుమ్మం. ఎడమచేతి వైపు ప్రక్కగదిలోకి పోయే గుమ్మం. టేబులు మీద రేడియో, ఫ్యాను, ఫ్లవరువాజూ, గాజుచేప, అగరువత్తుల స్టాండూ, యాష్‌ట్రే మొదలయినవి తీద్దిదిద్దినట్లు అమర్చివుంటాయి. మరోప్రక్క సొరుగులువుండే బల్ల వుంటుండి. దానిమీద కుడిచేతిప్రక్కగా ఓ అరడజను ఫైల్సు పడివుంటాయి. వ్రాత పరికరాలూ, యాష్‌ట్రే మరోప్రక్క. హాలుమధ్యనున్న చిన్నబల్లమీద ఓ అమ్మాయి, ఓ అబ్బాయి ఒప్పులకుప్ప తిరగడానికి సిద్ధంగా చేతులు పట్టుకొనివున్న బొమ్మ, ఆ బొమ్మ చక్కని రోజ్‌వుడ్ బేస్‌మీద అమర్చి వుంటుంది. ఒక్కసారి యిలా త్రిప్పితే గిట్టున గ్రామఫోను ప్లేటులా తిరుగుతుందది. దానితో పాటు పైనున్న బొమ్మలు తిరుగుతూండే చూడ ముచ్చటగా వుంటుంది.

తెర తీసేసరికి ఫైల్సువున్న బల్ల మీదవున్న టెలిఫోను మోగుతూంటుంది—

వల్లభరావు:- (లోపలనుంచి వస్తాడు. మధ్య వయస్కుడు. ఆర్థికంగా సంఘంలో ఉన్నతస్థానాన్ని ఆక్రమించుకొన్న హుందాతనం కనిపిస్తుంటుంది. రిసీవరు అందుకుని) హలో!...ఆర్ డి ఓ. గారా? నమస్కారం సార్! ... సుభద్రాండీ?...ఆ!...ఆ! రావటానికే సిద్ధమౌతోంది. నేనాండి...నాకు తీరిగ్గా లేదుసార్!... ఆయ్! Thanks! వుంటానండి. (రిసీవరు పెట్టేస్తాడు. డ్రాయరు సొరుగులాగి ఏ కాగితాల కోసమో వెతికి కనుపించక లోపలకు వెడతాడు. వెంటనే ఫోను మోగుతుంది.)

సుభద్ర:- (వెనుక ద్వారంగుండా వస్తుంది, అందం, చదువూ, సంస్కారం— ఈ మూడి తేజస్సుతో ముఖం కలకల లాడుతూంటుంది. చేతిలో వున్న ట్రే టిపాయ్‌మీద పెడుతుంది. భుజానికి తగిలించుకు వచ్చిన ఫ్లాస్కు వెనుక బల్లమీద పెడుతుంది. రిసీవరు అందుకుని) హలో!...ప్రొఫెసర్ శక్తివత్సలంగారా! నమస్తే!... పార్టీ కమెన్స్ అయిందాండి...(నవ్వి)...అయితే ఇహనేం! పదినిమిషాల్లో రాలేక పోతానా? ... ఇక్కడేకదండీ!...మీ శ్రీమతిగారు వచ్చారా! ... ఇప్పుడే వస్తానని ఆమెతో చెప్పండి, రాజశేఖరంగారింకా రాలే

దండి!...ఆహా!... Thank you sir! (రిసీవరు పెట్టేసి వచ్చినదారినే వెడుతుంది...మళ్ళీ ఫోను మోగుతుంది.)

వల్ల:- (ఫైల్సుతో తిరిగివచ్చి, వాటిని బల్లమీద పడేసి, రిసీవరు అందుకుని) హలో!...సుభద్రగారా! టాయిలెట్ అవుతున్నారండి. అయిదు నిమిషాల్లో వస్తారు...రాజశేఖరం ఇక్కడ లేడండి...ఉంటా. (రిసీవరు పెట్టేసి, ఫైలు తేరిచేసరికి మళ్ళీ ఫోన్) హలో...సుభద్ర గారు వస్తున్నారు...రాజశేఖరం ఇక్కడికి రాలేదు. ఉంటా! (రిసీవరు పెట్టేసి ఫైల్లో ఓ కాగితం తిప్పేసరికి మళ్ళీ ఫోను) హలో... సుభద్ర వస్తుంది. రాజశేఖరం ఇక్కళ్నేడు. (అని విసుగ్గా ఫోను చప్పుడయేట్టు పడేసి ఫైలు గబగబ తిరగేస్తున్నంతలో మళ్ళీ ఫోను) హలో! ఇక్కడ ఎవరూలేరు. ఎవరూ - రారండి. (అని రిసీవరు చెవికి దూరంగా అలాగే పట్టుకొని, ఫైల్సు చూచుకుంటుంటాడు) సుభద్రారాజశేఖరం, సుభద్రారాజశేఖరం! (అని గొణుగుతుంటాడు)

సుభ:- (వస్తుంది) ఏవిటీ, మీ రిప్పుడా ఫైల్సు ముందేసుకూర్చున్నారు?

వల్ల:- (పరధ్యానంగా ఫోనులో) హలో! ఏవిటన్నారూ?

సుభ:- (నవ్వి) నేనండి! ఇక్కడ!

వల్ల:- (ఆమెనుచూచి, రిసీవరు పెట్టేసి) ఆ?

సుభ:- అని తరవాత చూసుకోవచ్చు, లేచి డ్రెస్ చేసుకోండి.

వల్ల:- ఆ?...ఆ!

సుభ:- మరి లేవండిక!

వల్ల:- ఆ?...నేనా?...నేను రాను.

సుభ:- మీరెప్పుడూ యింతే!

వల్ల:- ఆ? నేను కదూ!...అవును, ఎప్పుడూ యింతే!

సుభ:- అబ్బ! ఏవిటండీ ఆ పరధ్యాస?...రండి మీరుకూడా! (లాలనగా)

వల్ల:- నిజంగా రమ్మంటున్నావా? (ఆమెవంక చూస్తాడు)

సుభ:- మీ మాటలు నా కర్థంకావు బాబూ!

వల్ల:- కావా? (అంటాడు. అంతలో అతని దృష్టి చీరమీద పడుతుంది. పయిటకొంగు అందుకుంటాడు. అతని ముఖంలో ఏదో చిత్రమైన రేఖ మెరిసింది) ఈ చీర...

సుభ:- నా పుట్టినరోజు పండక్కి రాజశేఖరం ప్రెజెంట్ చేసింది-బాగుందా?

వల్ల:- చాలా బాగుంది. పదిమంది పెద్దలు వచ్చే పార్టీకు పనికి వచ్చేది. (అంటూ ఆమె భుజాలు గట్టిగా పట్టుకొని, ఆమె కళ్ళలోకి వింతగా చూస్తూ) కదూ? (అని తల తిప్పుకుంటాడు. అప్పుడతని ముఖంలో జుగుప్స పొంగివస్తోంది.)

సుభ:- (అది గమనించకుండా, తన ధోరణిలో) మీరు మరీనూ! ఇంట్లో వున్నప్పుడు కట్టుకుంటే బాగుండదాయేం?

వల్ల:- పదిమందీ మెచ్చితేనేకాని దాని అందం సార్థకంకాదు.

సుభ:- చాల్లెండి.

(ఫోనుమోగుతుంది.)

వల్ల:- (రిసీవరు అందుకుని) హలో!... ... సుభద్రగారు వస్తున్నారు... రాజశేఖరం యిక్కడికి రాలేదండి...నేనా? ... నాకు చాలా పనులుండిపోయాయండి... ఆబ్సన్స్‌మేమీ లేదండి,. ఇదుగో బయలుదేరుతోంది...Thanks ! సెలవండి. (రిసీవరు పెట్టేస్తాడు.)

సుభ:- అయితే మీరు రారన్నమాట?

వల్ల:- ఊ!

సుభ:- నాతో రావటం మీకు నామర్దాగావున్నూ!... సరే, మీ యిష్టం. కాఫీ తాగండి.

(లోపలకు వెడుతూందగా.)

రాజశేఖరం:- (వస్తాడు. మధ్య వయస్కుడైనా యువకునిలా కనిపిస్తాడు. అలా కనిపించాలనే తహ తహ అతని దుస్తుల్లో, క్రాఫులో కనిపిస్తూ వుంటుంది.) ఏమిటి సుభద్రా, నువ్వింకా రెడీ కాలేదా?

సుభ:- (ఆగి) ఆయన రాకట?

రాజ:- మామూలేగా! ఒకప్పుడు వచ్చాడాయే! పార్టీలూ, పిక్‌నిక్‌లూ అంటే తలనొప్పిగా! ఏం వల్లభం, అంతేనా?

వల్ల:- అంతే! అంతే!

రాజ:- డబ్బుతోనే యిహాన్ని, పరాన్ని కూడా సాధించగల వాడివి, ఇహ మనుషు లెందుకు? ప్రపంచ మెందుకు నీకు? నిజానికి నువ్వలా రెండు చేతులా ఆర్జించటం నాకెంతో గర్వంగా ఉంటుంది.

వల్ల:- గర్వం?...గర్వం!...

రాజ:- ఏవిటి నువ్వలా నిట్టూనే వున్నావు సుభద్రా? పుణ్యకాలం కాస్తా గడచిపోతోంది—తెములూ!

సుభ:- (లోనికి వెడుతుంది.)

రాజ:- అన్ని ప్లైల్స్ ముందేసు కూర్చున్నా వేవిటివాళ?

వల్ల:- నాకు క్షణం తీరిక లేదని మీకు తెలియడానికి!

రాజ:- ఆ!...ఓహో! what a fine joke! హుషారుగా మాట్లాడతావు గానీ, ఆ హుషారు నీ ముఖంలోనూ, నీ ప్రవర్తనలోనూ కనిపించ నియ్యవు. నాకదే చిత్రంగా ఉంటుంది.

వల్ల:- నాకూ చిత్రంగానే ఉంటుంది.

సుభ:- (వేనిటీ బ్యాగుతో వస్తుంది.)

రాజ:- (ఆమెను చూచిన క్షణంలోనే) సరే వస్తాం వల్లభం! (అంటూ వెడతాడు.)

సుభ:- (రాజశేఖరాన్ని అనుసరించి గుమ్మం వరకూ వెళ్ళి, వెనక్కు తిరిగి భర్త దగ్గరకు వచ్చి) కాఫీ చల్లారిపోతోంది, తీసుకోండి. ఇంకా కావాలంటే flask లో ఉంది. (అని కప్పు అతని దగ్గిరికి జరిపి వెళ్ళిపోతుంది.)

వల్ల:- (ఫైల్స్ చప్పుడయేటట్టు ఎత్తిపడేసి, గబగబా వెళ్ళి భడాల్న పీది తలుపు వేసేస్తాడు అదే చూస్తున్నాడు - అనుమానంగా! అతని ముఖంలో ఏవో ఆలోచనలు రేఖలు మెరిసి మాయమవుతున్నాయి.

చివరకు అనుమానం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. తన భార్య పర పురుషునితో నవ్వుతూ, ఆడుతూ, పాడుతూ స్వేచ్ఛా విహారం చేస్తున్నట్టు అతనికొక ఊహ వస్తుంది. ఆ ఊహ విస్తృతమై అతని మేధస్సునూ, కన్నులనూ ఆవరిస్తుంది. ఏదో మంత్రానికి లొంగి పోయినట్టు అవుతాడుమనిషి! — స్టేజిమీది లైట్లు ఆరిపోతాయి. అతని ఊహకు రూపకల్పన జరుగుతుంది. శేఖరమూ, సుభద్రా పకపకనవ్వుతూ చెట్టపట్టాలు వేసుకుని గిర్రున తిరుగుతున్నారు. భరించలేక బిగ్గరగా కేకవేస్తాడు - 'సుభద్రా' అని! — ఆ ఊహ చెదిరిపోతుంది. టేబిలుమీది బొమ్మ గిర్రున తిరుగుతూంటుంది. లైట్సువెలుగుతాయి. అతనిలో కలిగిన కల్లోలంలో అతనింతవరకూ గుర్తించలేకపోయాడు – ఎవరో తలుపు కొడుతున్నారని ! అతని ముఖాన చెమటలు దిగజారుతున్నాయి. కన్నులు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. నిలువునా కంపిస్తున్నాడు. తలుపు కొడుతున్న శబ్దం ఎక్కువైంది. ముఖం తుడచుకుని మామూలుగా ఆవుదామనుకుంటున్నాడు. ముఖంలోకి గాంభీర్యాన్ని, చిరునవ్వునీ తెచ్చుకుంటున్నాడు. వెళ్ళి తలుపు తీస్తాడు.) ఎవరూ ?

పరశురామ్:- (వస్తాడు. యువకుడు)

వల్లి:- (తేరబారిచూచి) ఎవరూ?

పర:- ఒకానొకనాడు జ్ఞాపకశక్తికి మీ ముందు మహా మహా మేధావులు కూడా ఎందుకూ పనికిరారని మిమ్మల్ని హృదయపూర్వకంగా పొగిడిన నన్ను గుర్తించటానికే మీ జ్ఞాపకశక్తి చాల్లేదా వల్లభరావు గారూ?

వల్లి:- (క్షణంసేపు నొసలు చిట్లించి ఆలోచించి, అంతలో పెద్ద సంతోషంతో) ఓహో! ఓహో!.....నా జ్ఞాపకశక్తినే శంకిస్తున్నావా పరశురామ్!...రా! రా!...వచ్చి ఇలా కూర్చో! ఆఁ ! ఎక్కడుంటున్నావిప్పుడూ ? ఏం చేస్తున్నావూ ? అయిదు సంవత్సరాల కివాళ అమాంతం దర్శనమిచ్చావ్, ఏవిటి కథ ?

పర:- అఖిల భారత ఔషధ పరిశోధన కేంద్రంవారిచే ఆమోదించబడిన సిక్కిమ్ ప్రకారం ఓ పెద్ద మందుల కంపెనీ పెట్టబోతున్నాను. ఒక టన్ను కాఫీ గింజల్లోనుంచి తీయబడ్డ ఒక్క చుక్క ఔషధం సేవిస్తే అయిదు సంవత్సరాలు నిద్రాహారాలు లేకుండా బ్రతకవచ్చు మనిషి!

వల్ల:- What a mystery ! ఆద్భుతం! మహాద్భుతం! ఇప్పటికేమాత్రం తయారుచేశావ్?

పర:- ఇంతవరకూలేదు. త్వరలో తయారౌతుంది. అయితే కొంత పెట్టుబడి అవసరం.

వల్ల:- దీనికి పెట్టుబడెందుకు పరశురామ్! గవర్నమెంటే ఇస్తుంది. ఈ దెబ్బతో అటు కాఫీ దురభ్యాసాన్నీ, ఇటు ఆహారసమస్యనీ ఠాక్కున అరికట్టవచ్చని గవర్నమెంట్ ఏ మాత్రం గుర్తించినా నీ కాకవల సిన పెట్టుబడికి నాలుగింతలు ఇస్తుంది—తొందరపడకు!

పర:- ఆ అవకాశం ఉంటే నేను వదులుతానా వల్లభరావుగారూ! 'నీ కంపెనీ యేదో నువ్వు మొదలుపెట్టి పని కానిస్తుండు-అర్ధాంతరంగా ఆగిపోయే పరిస్థితివస్తే నేనిస్తాను'– అంది గవర్నమెంటు.

వల్ల:- అయితే గవర్నమెంటు ఎత్తేశాడో నే చెప్పనా?

పర:- ఊఁ! చెప్పండి.

వల్ల:- నీ కంపెనీ పనిపాటల్లో పడగానే, వెంటనే దాన్ని కాస్తా నేషనలైజ్ చేసేస్తుంది.

పర:- గవర్నమెంటు ఎత్తు ఏమోగానీ, మీరు మాత్రం నన్నూ, నా విషయాన్నీ ఎటో లాక్కు పోతున్నారు.

వల్ల:- No, No, అదేంలేదు పరశురామ్! నాకు ఒకప్పుడు నువ్వు చేసిన సహాయాలు మరచిపోతానా— వ్యాపారస్థుణ్ణి! విషయమేదో చెప్పు!

పర:- మీకలా అంటారని తెలుసు, అందుకే ఎందరు ఎంతెంత మొత్తాలు ఆఫర్ చేసినా భాకరు చెయ్యకుండా, ఆ కంపెనీమీద రాబోయే లాభమేదో మీరే తింటూగని మీదాకా వచ్చాను.

వల్లి:- My dear పరశురామ్! నువ్వొక్క సంగతి గుర్తు పెట్టుకుంటే సీతో ఎంత సేపు మాట్లాడటానికైనా ప్రభ్యంతరం లేదు

పర:- ఏవిటో చెప్పండి.

వల్లి:- వేరే ఏం లేదూ, నువ్వు పెట్టబోయే కంపెనీకి పెట్టుబడి మాత్రం నన్నడగద్దు అంతే! Then you are my friend!

పర:- చంపేశాయ- వచ్చిందే ఆ పనిమీదే!

వల్లి:- అయితే గుడ్‌బై!

పర:- అలా తేలిగ్గా అనకండి వల్లభరావుగారూ! మాటవరసకి అంటున్నా నిజం చెప్పక తప్పదు- చూడండి! నే నొకప్పుడు మీకు మహోపకారాలు చేశాను. చేశానని మీరే ఒప్పుకున్నారు. దానికి ప్రత్యుపకారంగా నాకీ సహాయం చెయ్యండి.

వల్లి:- చూడు పరశురామ్! ప్రస్తుతం నేనే చాలా చిక్కుల్లో ఉన్నాను. ఆర్థికంగా, సాంసారికంగా పరిస్థితులంత బాగాలేవు. ఇహ నువ్వు అట్టే మొహమాటపెట్టి, బాధ పడక ఇంతటితో ఆ మాటకి మంగళ గీతం పాడెయ్! నా మాట విను!

పర:- ఎంతండి... అట్టే ఆశపడి పెద్ద మొత్తమేమీ మిమ్మల్ని అడగటం లేదు- అంతా ఓ పాతిక!

వల్లి:- వేలేనా? ఆ?

పర:- ఆ పైన ఐదువేలో, పదివేలో మీ సంతోషంకొద్దీనూ!

వల్లి:- (పక పక నవ్వి) సరదాగా మాట్లాడతావోయ్ పరశురామ్!

పర:- అవును, సరదాగానే మాట్లాడుతాను. అంత సరదాగానూ మీరు పని పూర్తిచేస్తే సరదాగా వెళ్ళిపోతాను.

వల్లి:- (సీరియస్‌గా) ఏవిటీ, నువ్వునిజంగా అడుగుతున్నావా?

పర:- అక్షరాలా నిజం!

వల్లి:- ఎంత చెట్టుకి అంతగాలి! నా స్థితిగతులు తెలుసుకో పరశురామ్!

పర:- తెలుసుకున్నానండి వల్లభరావుగారూ! తెలుసుకునే వచ్చాను, కొత్తగా రెండు మిల్లులూ, ఓ సినిమాహాలూ కూడా కట్టిస్తున్నారని తెలుసుకునే వచ్చాను.

వల్ల:- నువ్వెన్నో తెలుసుకున్న మాట నిజమే! అయితే ఇన్నిట్లో ఒక్కటి హూర్తికాక, పెట్టుబడి చాలక కంఠంలోతున దిగబడి మునగానాం, తేలానాంగా ఉంది నా పని!

పర:- నిజమే! ఇన్ని భారీ వ్యాపారాల మీదా వచ్చేదెంతో తెలియదు, పోయేదెంతో తెలియదు. రోజులు మంచివి కావు, మనుషులు మాయవాళ్ళయిపోయారు. అందుకనే ఉభయతారకమైన మరోమాట చెప్పమంటారా?

వల్ల:- ఏదో లిటిగేషనన్నమాటే!

పర:- ఆదేం కాదు. మీ వ్యాపారాలు మీ తలకు మించిన వంటున్నారు గదా! అందువల్ల ఆ మిల్లులమీద మేనేజ్‌మెంటో, ఆ సినిమాహాలు కట్టించే పనో నా భుజాలమీద పడెయ్యండి. ఓ సంవత్సరంపాటు మీరు తిరిగి చూసే పనిలేకుండా వప్పగించిన పని వప్పగించినట్లు సక్రమంగా మీకు వప్పగించే బాధ్యత నాది. నమ్మండి.

వల్ల:- నమ్మకమనేది చాలా గొప్పది పరశురామ్! అది దైవ స్వరూపం. అనుమానమనేది పెనుభూతం. (ఉద్రేకంగా) నమ్మకం వెనకాలే అనుమానం కూడా నీడల్లే ఉంటుంది. ఓ మనిషిని నమ్మామూ అంటే, వెంటనే అనుమానించామన్న మాటే! (ఇంకా ఉద్రేకంగా) అక్కడితో ఆ మనిషికీ మనకీ చెల్లు!

పర:- ఏవిటి మీరంత ఉద్రేకంగా మాట్లాడుతున్నారు?

వల్ల:- ఉద్రేకమే పరశురామ్! బంగారమని నమ్మి చేతికి తీసుకున్నాను. రత్నాలు పొదిగి ఉన్నాయనీ నమ్మి శిరోమణిగా ధరించాను. అది ఉండవలసినచోటు అదేనని నమ్మి గౌరవించాను-తీరాచూస్తే-పరశురామ్—అది బంగారమూ కాదు, రత్నహారమూ కాదు.

పర:- ఆఁ??

వల్ల:- విషజ్వాలలతో నా శరీరాన్ని భగ భగ మండించి, కాల్చి పారేస్తున్న సర్పం.

పర:- మీరు కొంచెం నిదానంగా మాట్లాడండి.

వల్ల:- అలా మాట్లాడి చూశాను. లాభం లేకపోయింది.

పర:- ఆహా! అదికాదండి...

వల్ల:- సువ్వు కాదనకు పరశురామ్! నేను చెప్పేది నిజం. అందువల్లే నాకు మనుషులమీద నమ్మకంలేదు.

పర:- అంతా మీరనుకున్నట్లే ఉంటారుటండి! నూటికో, కోటికో ఈ పరశురామ్ లాంటి నమ్మకస్థులు కూడా ఉంటారండీ!

వల్ల:- నాలోనే నమ్మకమనే పదార్థం నశించిపోతోంది పరశురామ్! ఇక యితరుల మీద నమ్మకాన్నెలా ఉంచగలను చెప్పు?

పర:- అయితే నాచేత మీరేపని చేయించుకోరన్నమాట!

వల్ల:- పాతిక వేలిచ్చి నీ చేత చేయించుకోవలసిన పనేవిటో నాకేం తెలీటం లేదు. అసలయినా నేను చెయ్యలేనిదీ, నువ్వు చెయ్యగలదీ ఏవిటో చెప్పు!

పర:- ఫోర్జరీ!

వల్ల:- (నవ్వి) అది నా వల్లకాదనే!

పర:- పోనీ, కామ్‌గా ఎవర్నయినా చంపి అవతలం పారెయ్యమంటారా?

వల్ల:- ఆ!!!

పర:- ఆ! చెప్పండి, నిమిషాల్లో గోటితో గిల్లేస్తాను.

వల్ల:- చూస్తుంటే...అమెరికా ప్రెసిడెంట్ కెనెడీని నువ్వే చంపినట్టున్నావే!

పర:- నేను కాకపోతే మా కిరాయి హంతకుల ముఠాకి చెందినవాడు మరొకడు. అయినా ఒక్క కెనడీనన్న మాదేవిటి? అబ్రహాం లింకన్ని, మహాత్మాగాంధీని చంపినవాళ్ళు నా జాతి వాళ్ళు కారూ! మహా పురుషుల్ని చంపి ఆ మహా పురుషులతో పాటు చరిత్రలో

శాశ్వతంగా నిల్చిపోయారు. అలాగే చిరస్థాయిగా నా పేరు కూడా నిల్చిపోయే యేర్పాటు చేయండి.

వల్ల:- ఇష్!టూరో్క్. ఎవరై నా వింటే మన్ని ఆ దేవుడుకూడా రక్షించలేడు.

పర:- పోసీలెండి, మెల్లిగా మాట్లాడుకుందాం. (మెల్లిగా) ఎవరా అదృష్ట వంతుడు?

వల్ల:- ఏవిటి నువ్వనేది, నా బుట్టి పాడుచేస్తున్నావ్ పరశురామ్!

పర:- మీ బుట్టి నేను వచ్చేసరికే పాడైంది కదండీ!

వల్ల:- ఆ !

పర:- అవును ఇహ చెప్పండి. ఎవరా శత్రువు?

వల్ల:- నాకు శత్రువు లెవరయ్యా, నన్ను వేధించకు.

పర:- మీగలా అనగానే మీరు అజాత శత్రుపని నేను అనుకుంటానుటండీ! పరవాలేదు చెప్పండి. ఎవరు ఈ లోకంలో నుంచి నిష్క్రమిస్తే మీ హృదయంలోకి ఆనందం ప్రవేశిస్తుందో, ఎవరు శాశ్వతనిద్రపోతే మీకు ఆనంత శాంతి లభిస్తుందో, ఎవరు పరమపద సోపానాలు ఎక్కితే మీరు రాతిబండనే మానస తూలికా తల్పంగా భావించి గుండెలమీద చెయ్యి వేసుకుని సుఖ పోగలరో - ఆ వ్యక్తి పేరు చెప్పండి. చెప్పలేకపోతే సావధానంగా వ్రాయండి. మీకు మేలు చేయటం, తద్వారా మీ మేలూ, మెప్పూ పొందటం నా విధి!

వల్ల:- ఏమో అనుకున్నాను గానీ పరశురామ్! నువ్వు... నువ్వు...

పర:- నాకు సరిపడే మాట మీరెంత వెతుక్కున్నా దొరకదు గానీ, ఇక చెప్పండా వ్యక్తి ఎవరో, ఐదు నిమిషాల్లో ఖండ ఖండాలుగా ఖండించి... ...

వల్ల:- ఆ ! !

పర:- ఏం? ఖండించ వద్దంటారా? పోనీ, ఓ పిస్టల్ సప్లయి చెయ్యండి. కామ్‌గా కాల్చిపారేసి, మీ గార్డెన్‌లో నిబ్బు లోతున పాతేస్తాను.

వల్ల:- ఇదిగో పరశురామ్! నాకు పిస్టలూపుంది. దానికి లైసెన్సూవుంది. అయితే నాకీ పిస్టల్సూ, కత్తులూ, శవాలూ అంటే పరమ అసహ్యం. తెలిసిందా?

పర:- అలాఅయితే మీ కళ్ళముందు చంపను. చచ్చేవ్యక్తి చావుకేకగానీ, చివరి మూలుగుగానీ మీ చెవుల పడనియ్యను. పిస్టలు ఇలా పడెయ్యండి.

వల్ల:- (డ్రాయరు సొరుగు తాళంతీస్తూ) పరశురామ్, జరగవలసిన పనిని సక్రమంగా జరుపు. ఆ తరువాత ఏం జరిగినా నా పంపతి నీకు కవచంగా ఉంటుంది. గుర్తుంచుకో. (పిస్టలు బల్లమీద పెడుతూంటే- పరశురామ్ తీసుకుంటాడు.)

పర:- ఈ ప్రపంచంలోకి మనిషి ప్రవేశించటం ఎంత కష్టమో నిష్క్రమించటమూ అంతే! అయితే మీ పనిని అవలీలగా పూర్తిచేసేందుకు ఈ పరశురామ్ దీక్షతో నిల్చున్నాడు. అందుకు సందేహం లేదు. మీరిక వెళ్ళి నాకు యివ్వవలసిన పైకం యావత్తూ పదులూ, ఐదులుగా మార్చి జాగ్రత్తగా ఓ bagలో పెట్టి పట్టుకురండి. ఆ దబ్బుని మీరు నాకు బుద్ధిపూర్వకంగా, కేవలం నాకు సహాయం చేయాలనే సదుద్దేశంతో ఇచ్చినట్టు ఓ కాగితంకూడా వ్రాస్తే మరి మంచిది.

వల్ల:- కాగితా లెందుకు, నా మాట చాలదా?

పర:- నమ్మకాన్ని గురించి మీరు చెప్పిన మాటలు పిన్నాక నాకూ మనుష్యుల్లో నమ్మకం పోతోంది వల్లభరావు గారూ!

వల్ల:- సరే నీ యిష్టం.

సుభ:- (గబగబా వస్తూ, పర పురుషుణ్ణి చూచి నిండా పయిట కప్పుకుని లోపలకు వెడుతోంది.)

వల్ల:- సుభద్రా!

సుభ:- (ఆగింది.)

వల్ల:- ఇతన్ని పరిచయం చేస్తానిలా రా! (ఆమె వస్తుంది.) ఇతని పేరు పరశురామ్ (పరశురాంతో) ఈమె నా భార్య సుభద్ర. (మళ్ళీ భార్యతో) ఇతను మనకీ, మన వ్యాపారానికీ ఎంతో కావలసినవాడు. ఒకసారి గూడూరు దగ్గిర మన ధాన్యం లారీలను అకారణంగా ఆపి సర్లు పట్టుకుందే, ఇతను ఎంతో ప్రయత్నించి. తన మాట నెగ్గించుకుని, ఆ లారీలను ముందుకు నడిపించాడు. ఇంతా ఎన్నో ఇలాంటి చిక్కుల్లో ఆదుకున్నాడు.

సుభ:- నమస్కారమండి.

పర:- సంగతి యింత వెపితేగానీ నాకు నమస్కారం చెయ్యాలనిపించ లేదన్నమాట!

సుభ:- (పేలవంగా నవ్వి) అబ్బే! అది కాదండి!... క్షమించండి. ఇప్పుడే వస్తాను (అని లోపలకు వెడుతుంది.)

పర.- (ఆమె వెళ్ళిన వైపు చూస్తూ) ఏవిటి అదోలా వున్నారు?

వల్ల:- ఒక్కొక్క మనిషికి ఎన్నోరకాల మానసిక రుగ్మతలు పరశురామ్!

పర:- నిజం నిజం? అవేలేకపోతే అంతా ఆ శ్రీరామచంద్రులే!... ఆ సీతా మహా లక్ష్ములే!... ఏవిటిలా ఖంగారు పడుతున్నారు?

వల్ల:- ఆ?... ఆ!... నే నంతవరకూ నీకో చెప్పింది...

పర:- What? ఈమెను గురించా...!

వల్ల:- (తల వూపుతాడు.)

పర:- మీ భార్యనా?... వ్యవహారాలూ! నా డబ్బు కోసం నేనీ పని చెయ్యడానికి సిద్ధమే వనుకోండి. అయినా మీ భార్య మీద మీరు చూపుతున్న కాఠిన్యానికి కారణం తెలుసుకోవచ్చా?

వల్ల:- నిజమే! కారణం సువ్వు తెలుసుకోవలసిన పని లేదు. అయినా చెప్పటానికి నాకు అభ్యంతరంలేదు. నీకు ఆశ్చర్యం కలిగించిన నిజానికి వెనుక ఓ అగ్నిపర్వతం బద్దలయింది... ఎంతో మృదువుగా వుండే

ధూళి మసుపు పాదాలక్రింద పడి నలిగి కఠినాతికఠినమైపోతుంది. సున్నితమైన మానవ హృదయం కూడా యితరులచేత బాధించబడి కఠిన పాషాణమై పోతుంది. పరశురామ్!...నా పని అంతే అయింది. నేను ఆదరించి సంతోషపెట్టినా, వాత్సల్యంతో లాలించినా నానుంచి దూరమై నన్ను ప్రేమించేందుకు ఇష్టపడకుండా నన్ను కష్టపెట్టాలని చూసే వాళ్ళ మనఃప్రవృత్తి గమనించే సరికి నేను రాక్షసుణ్ణయిపోతున్నాను. కాక తప్పటం లేదు. నన్నలా మార్చేస్తున్నారు. వాళ్ళు మారిపోయి నన్ను మార్చేసి, మాడ్చి మసి చేసి నన్నీ స్థితికి తీసుకొచ్చారు. ఇద్దరూ కావలసినవాళ్ళే! ఏసంఘంలో వాళ్ళు సభ్య మానవులుగా బ్రతుకుతూ గౌరవ పురస్కారాలు పొందుతున్నారో ఆ సంఘంలో వాళ్ళకి అటువంటి స్థానం కలిగించింది నేనూ నాలోని స్వతంత్రభావాలూ! అయితేయేం? ఎక్కువచ్చిన మెట్లు కూలదోసుకునే స్వభావం వాళ్ళది. ఆ భావాన్ని సమూలంగా నాశనం చేయాల్సిందే! అవ... తప్పదు.

పర:- మీ మాటే నమ్మకమనేవిఁటి?

వల్ల:- తర్కించకు పరశురామ్! తర్కిస్తే ఆఇద్దరూ నిజమైపోదు. ఈ తర్కాలు నన్నింకా పశువుని చేస్తాయి... నేను వెళ్ళి డబ్బు ఏర్పాటు చేస్తాను... నీ విధీ, అవసరమూ నీకు తెలుసు. వస్తా... (వీధిలోకి వెళ్ళబోతున్నాడు.)

పర:- ఆ! వల్లభరావుగారూ! ఒక మాట.

వల్ల:- ఏవిఁటి?

పర:- మీ పార్టనర్ ఒకాయన ఉండాలి-ఆయన యిప్పుడెక్కడున్నారు?

వల్ల:- ఆ! ఉన్నాడిక్కడే! అతనితో నీ కేంపని? అతనునాతో విడిపోయి వేరే వ్యాపారం చేసుకుంటున్నాడు. ఏం?

పర:- తరువాత చెపుతాను. వెళ్ళిరండి.

వల్ల:- (EXIT)

పర:- (వెళ్ళి తలుపు వేసివస్తాడు.)

సుభ:- (లోపలనుంచి కాఫీ తీసుకొస్తుంది.) ఏరండీ యీయన ?

పర:- పనుందంటూ వెళ్ళాను. ఇలా చీటికీ మాటికీ కాఫీ తెచ్చేలోపలా, భోజనం వడ్డించే లోపలా పనుందంటూ వెళ్ళిపోయే మనిషితో ఎలా వేగుతున్నారండీ?

సుభ:- ఎప్పుడూ అలా వెళ్ళరండి. వెళ్ళినా వెంటనే వచ్చేస్తారు. కూర్చోండి. మీరు కాఫీ తీసుకోండి.

పర:- (కూర్చుంటూ) మీరు కూడా... (ఇద్దరూ కూర్చుని కాఫీ తాగుతున్నారు.) మీరు బి.యే. అనుకుంటాను?

సుభ:- అదే అనర్థాలకు కారణం!

పర:- ఏ? అలా అన్నారు?

సుభ:- నేను బి.యే. చదివి ప్రయోజనం లేదు కదండీ! ఏ పేదరాలో ఈ చదువు చదివి వుంటే ఏదో ఉద్యోగం చేసుకుని తన కుటుంబానికి ఆసరాగా నిల్చేది.

పర:- ఏం చేస్తాం? పదవుల్లాగా ఈ డిగ్రీలని త్యాగం చెయ్యటానికీ, ట్రాన్స్‌ఫర్ చెయ్యటానికీ వీల్లేదు కదండీ? తప్పని సరిగా భరించాల్సిందే!...ఆ! చూడండి, మాటిమాటికీ గుర్తుచెయ్యటం మంచిది కాకపోయినా చెప్పక తప్పదు. నేను మీ భర్తగారికి పూర్వం ఎన్నో సహాయాలు చేశాను.

సుభ:- అవును, ఆయనే ఆ మాట చెప్పారుగా!

పర:- దాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పుడు నేనే ఆయన సహాయాన్ని కోరుతూ వచ్చాను.

సుభ:- ఏమన్నారు?

పర:- నేనే ఆయన సహాయాన్ని కోరుతున్నా నంటున్నాను.

సుభ:- అది కాదండీ, అందుకాయన ఏమన్నారంటున్నాను.

పర:- అదా మీకడిగింది! మొదట ఆయన ఒప్పుకోలేదు. నానుంచి ఆయన ఏ ప్రతిఫలమూ కోరకుండా ఒప్పుకుంటారను కున్నాను. కాని ఆయన ఓ షరతు పెట్టారు.

సుభ:- వ్యాపార విషయమైతే మీరు నాకు చెప్పి ప్రయోజనంలేదు.

పర:- దబ్బుకి ప్రతిఫలంగా దేన్నికోరినా-అది వ్యాపారమేనని మీరు ఒప్పుకుంటే-ఇదీ వ్యాపార విషయమే!

సుభ:- ఇంతకీ ఆయన చెయ్యమన్న దేవిటి?

పర:- ఇదంతా బిజినెస్సే గనుక నేను స్ట్రయిట్‌గానే చెపుతాను. ఆయన ఓ మనిషిని కామ్‌గా చంపెయ్యమన్నారు.

సుభ:- ఛ! ఛ! ఆయన ఎన్నడూ అలాంటి పని చెయ్యమనరు.

పర:- అది మీ నమ్మకం!

సుభ:- మీ Joke నాకాట్టే నచ్చలేదు.

పర:- నెవర్ మైన్డ్! అయినా నేను చెప్పేది నిజం. మీ భర్తగారికొక బద్ధ శత్రువున్న మాట నిజం! ఆ శత్రువుని కాల్చి చంపమని నన్ను నియమించిన మాట నిజం! అందుకు నేను పాతికవేలు అడిగిన మాట నిజం!...మీ భర్తగారు సరేనన్నారు నేను అందుకు సిద్ధంగా ఉన్నాను. ఇన్ని విధాలుగా నిజమైన ఓ విషయాన్ని ఒప్పుకోడానికి మీకేవిటి అభ్యంతరం?

సుభ:- నిజమా? నమ్మలేకుండా ఉన్నాను. ఇదే నిజమైతే ఎంత ఘోరం! ఆయనకి ఇటువంటి ఆలోచన వస్తుందని కల్లోకూడా అనుకోలేదే!

పర:- ఆయనచేసే ప్రతిపనీ ముందుగా మీ కల్లోకి రావాల్సిన పనేముంది చెప్పండి! పోతే, ఇహ యీ పని నాచేతి మీదుగా జరగబోతున్నా-అందుకు బాధ్యత మీ భర్తగారిదే! ఆయన్ని చిక్కులోనుంచి తప్పించాలంటే ఒక్కటే మార్గముంది-మీరు ఒప్పుకుంటే!

సుభ:- ఏవిటది?

పర:- ఏముంది, ఆ పాతికవేలూ మీరు ఇచ్చేస్తే నా దారిన నేను కామ్‌గా వెళ్ళిపోతాను. ఏమంటారు?

సుభ:- నేనా!...పాతికవేలా?...క్షమించండి. ఇది నావల్ల అయే పనికాదు. పైగా ఆయన కిలాంటి ఆలోచన రాకుండా ప్రయత్నించటం నా విధి

గానీ, ఆయన పనిని మరో విధంగా నేను కాకుండా చేయటం మంచిది కాదు. ఆయన మనస్సు మార్చటానికి ప్రయత్నిస్తాను. నా వల్ల అయేదంతే.

పర:- అయితే మీ ప్రయత్నం నిష్ప్రయోజనం. ఒకవేళ ఆయన మనసు మారినా నాకేం లాభం? ఉత్త పుణ్యానికి నాకు పాతికవేలు యివ్వరుగదా! అంతా మంచి వాళ్ళుగా మారిపోతే నాపనేంగాన?

సుభ:- అందుకని మనుషుల మనసులో విషాన్ని నింపుతారా? ప్రాణాంతో చెలగాట మాడతారా?.....

పర:- ఆగండి. పూర్తిగా చెప్పాక ఏకంగా ఒక్కసారే తిట్టేదురుగాని! ఆగండి.

సుభ:- ఏంటి? ఇంకా ఉందా? ఇంకేం ఘోరాలు చెయ్యటానికి ఒప్పుకున్నారు?

పర:- మీరు మీ భర్తగారిని అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్నారు గదా... ఇలాంటప్పుడు మీరు పర పురుషునితో.....

సుభ:- షటప్!

పర:- యస్, మేడమ్!

సుభ:- మీరేం మాట్లాడుతున్నారో మీకే తెలీనట్లుంది.

పర:- ఎందుకు తెలీదు మేడమ్! మీరా పురుషునితో సినిమాలూ, షికార్లూ, పిక్‌నిక్‌లూ, పార్టీలూ—అన్నీ తెలుసు మేడమ్!

సుభ:- ఆఁ! ఎవరు చెప్పారు మీకు?

పర:- ఎవరో చెపితే ప్రచారం చెయ్యడం నా పని కాదు. మీ భర్తగారే!

సుభ:- అన్యాయం!

పర:- మీరు తప్పుదారి తొక్కినట్టు ఆయన మనస్ఫూర్తిగా నమ్ముతున్నారు.

సుభ:- అపద్ధం!

పర:- ఈ సతి కాని భార్యతో ఒక్క క్షణంకూడా గడపలేనన్నారు.

సుభ:- (కన్నీటితో) ఆ మాట పదేపదే అని నన్నెందుకు హింసిస్తారు? స్త్రీకి స్వాతంత్ర్యం యిచ్చామనీ, వాళ్ళతో కల్చర్ వృద్ధి చేస్తామనీ మీరు చెప్పే ఉపన్యాసాలన్నీ-అంతరికి భార్యని అనుమానించేందుకు ఉప యోగిస్తున్నారన్నమాట!

పర:- నేనా?

సుభ:- మీరంటే మీరుకాదు - మగవాళ్ళు. చదువుకున్న భార్య కావాలని పెళ్ళికి ముందు గొప్పకబుర్లు చెప్పి, పదిమందితో కలిసి మెలిసి తిరగమని ప్రోత్సహించి, తీరా ఆ భార్య ఏ మగాడితో మాట్లాడినా, కాలక్షేపానికి కలిసి తిరిగినా అనుమానించి, హింసించాలనే మీ ప్రవృత్తి ఏవిటో అర్థం కావటంలేదు. తిరగకపోతే పదిమందిలో నామర్దా అని గోల, తిరిగితే వ్యభిచారం ఇది. తన భార్య ఇల్లు కదల కూడదు. తాను పరస్త్రీల వెంట తిరగొచ్చు. దాన్ని సమర్థించుకుంటూ తిరిగే వాళ్ళు కొందరు. అవును. శేఖర్‌తో చనువుగా ఉన్నాను. కలిసి తిరిగాను. తిరిగి ఇవాళ శేఖర్ తత్వం ఏపాటో, ఈయన తత్వం ఏవిటో తెలుసు కున్నాను. నిజానికిందులో నా దోషం ఏపాటి లేకపోయినా నాది తప్పేనని ఒప్పుకుంటున్నాను. పెళ్ళయిన ఆడది పర పురుషుని వెంట తిరగటం ముమ్మాటికీ తప్పే! అది మన సంస్కృతికే విరుద్ధం. అందుకే నా మనసు ఎదురు తిరుగుతూండేది. అయినా నా యిష్టా యిష్టాంతో నిమిత్తం లేకుండా ఆయన తిరగమని ప్రోత్సహించారు... పరశురామ్‌గారు! ఇంతకీ ఆయన ఇదంతా రచ్చకీడ్చి నన్నేం చెయ్యదల్చు కున్నారట?

పర:- (పిస్టల్ తీసి బల్లమీద పడేసి) దీనితో మిమ్మల్ని కాల్చి చంప మన్నారు.

సుభ:- ఆఁ!

పర:- అవును, ఆయన నన్ను చెయ్యమన్న పని యిదే! మీ ప్రాణం విలువ పాతికవేలు!

సుభ:- (గద్గద స్వరంతో - నిష్ఠురంగా) పరశురామ్‌గారూ! స్త్రీ విలువ ఏవిఁటో ఈనాడే తెలుసుకున్నాను. ఈనాడు నా జీవితంలో రెండు

ప్రధాన సంఘటనలు జరిగాయి. రెండూ గుణపాఠాలు నేర్పాయి. భర్తచేత అనుమానింపబడి, అవమానించబడ్డ స్త్రీకి కర్తవ్యం ఒకరు బోధించక్కర్లేదు. (అంటూ పిస్టల్ తీసుకుంటుంది.

పర:- ఆఁ! ఆఁ! (పిస్టల్ లాక్కుని) ఏవిఁటది? మంచివారే! మీరు ఆత్మ హత్య చేసుకుంటే నా గతేంకాను! మీరు ప్రాణాలు అలా నిష్ప్రయోజనంగా తీసేసుకుఁటూంటే చూస్తూ ఊరుకునే దద్దమ్మను కానండీ! మీరు ఆత్మహత్య చేసుకుంటే నాకు చిల్లిగవ్వ దక్కదు. నేను మిమ్మల్ని చంపాలి. మీ భర్తగారు తృప్తిపడి, సంతోషపడి నా డబ్బు నాకు పారెయ్యాలి. అదీ జరగ వలసింది, కథ అడ్డం తిప్పకండి మరి!

సుభ:- మీ ఇష్టం వచ్చినట్టే కానివ్వండి. చస్తూనైనా ఒకరికి ఉపకారం చేసి చస్తాను. చంపండి.

పర:- (పిస్టల్ గురిపెట్టి - నిదానించి.) పోసి సుభద్రగారూ! ఓ పని చెయ్యరాదూ!

సుభ:- ఇక నా వల్ల ఏమీ కాదు - చంపండి!

పర:- అది కాదండి. వృధాగా ప్రాణాలెందుకు తీసుకుంటారు? ఆ పాతిక వేలూ మీరే పారేస్తే మీదారిని మిమ్మల్ని వదిలేసి, నా దారిని నేను పోతాను.

సుభ:- దయతలచి నన్ను విడిచి పెడతారన్నమాట! పరశురామ్‌గారూ! భర్తచేత శీలాన్ని శంకించబడి, తిరస్కరించబడ్డ ఆదది పరపురుషుడి దగ్గర ప్రాణాలు యాచించదు. ఇది గుర్తుంచుకోండి.

పర:- అవకాశాన్ని వదులుకోకండి, మీ నగానట్రా ఇవ్వచ్చు - Cash లేక పోతే!

సుభ:- మీ వల్ల కాకపోతే ఆ పిస్టల్ ఇలా పడెయ్యండి... నన్ను సరక యాతన పెట్టకండి - (ఏడుస్తుంది.)

పర:- నావల్ల కాకపోవడమా! Shame Shame!... పదండి తోటలోకి. తీరా కాల్చాక మిమ్మల్ని అంతవరకూమోసుకు పోవటం నా వల్ల కాదు. పదండి.

(సుభద్ర వెనుతిరిగి లోనికి నడుస్తుంది. పరశురామ్ అనుసరిస్తాడు. Pause. వీధి తలుపు చప్పుడౌతుంది. లోపలనుంచి పరశురామ్ వచ్చి తలుపు తీస్తాడు. వల్లిభరావు - చేతిలో ప్లాస్టిక్ Bag తో వస్తాడు. ఆందోళనగా గదిలో అటూ యిటూ చూస్తాడు. తరువాత పరశురామ్ ముఖంలోకిచూసి, చూడలేక తల తిప్పుకుంటాడు.)

వల్లి:- ఏమైంది? ఏం చేశావ్?

పర:- ఇష్! (అని కూర్చోమని సైగచేసి గబగబా లోనికి వెడతాడు.)

వల్లి:- (ఆ గది గుమ్మం దగ్గరికి వెడతాడు. తలుపులు మూసి ఉంటాయి. అతని ముఖం క్రమంగా మారిపోతుంది భయంకరంగా, వికృతంగా తయారవుతుంది...ఏదో అనుమానం! వింత ఊహ!... అతని ఊహలో పరశురామ్, సుభద్రలు చెట్టపట్టాలు వేసుకొని గిట్టుస తిరుగుతుంటారు. స్టేజీమీద లైట్సు ఆరిపోతాయి. అతని ఊహకి రూపకల్పన జరుగుతుంది. ముఖం మీద పడిన వెలుగులో అత నెంతో వికృతంగా కనిపిస్తుంటాడు. అంతలో తలుపు తట్టిన చప్పు డౌతుంది. అతని ఊహ చెదిరి పోతుంది. లైట్సు వెలుగుతాయి. అతను రొప్పుతుంటాడు. నిదానించి, తన్ను తాను సర్దుకొని వెళ్ళి తలుపు తీస్తాడు)

పత్రికా విలేఖరి:- (వస్తాడు.) నమస్కారమండి.

వల్లి:- ఎవరు నువ్వు?

ప. వి:- నేను 'హంతకుడు' అనే పక్ష పత్రికకు ప్రత్యేక విలేఖరినండి.

వల్లి:- ఆ! ఏం కావాలి?

ప. వి:- మీ రెందుకలా ఖంగారు పడ్డారు?

వల్లి:- అది నీ కనవసరం. ఎందుకొచ్చావు?

ప. వి:- మీ ఇంట్లో ఏదైనా హత్య జరిగిందా?

వల్లి:- హత్యా?

ప. వి:- అదుగో, మళ్ళి ఖంగారు పడ్డారు!

వల్లి:- పడ్డానా? పడితే పడతాను. నీ కెందుకు?

ప. వి :- పడండి, పడండి. ఇంతకీ ఇక్కడ హత్య జరిగిందా, లేదా?

వల్లి :- ఏవిఁటయ్యా నీ మాటలు ? 'ఇచ్చట హత్యలు చేయబడును' అని మా వాకిట్లో బోర్డు ఉన్నట్లు మాట్లాడతావేవిఁటి ?

ప. వి :- మీరు బోర్డు కట్టుకున్నంత కరెక్టుగా మాకు కబురు అందిందండి.

వల్లి :- ఎవడా చెప్పినవాడు ?

ప. వి : ఎవడో పౌరధర్మం తెలిసిన పెద్ద మనిషి !

వల్లి : ఉవ్వూరా ! మరి నీ పౌరధర్మం ఎక్కడ తగం బెట్టావ్ ? వేళకాని వేళ తిని పరుగెత్తుకొచ్చి 'ఇక్కడ హత్యజరిగిందా?' అంటావ్?

ప. పి:- నాకేం పని లేదుటండీ పరుగెత్తుకు రావటానికి? ఎవరో పెద్ద మనిషి పనివేళా ఫోన్‌చేసి 'ఫలానా వీధిలో ఫలానా నెంబరుగల ఫోనుగల యింట్లో ఇప్పుడే హత్య జరిగింది- పరిగెత్తండి' అని చెప్పారు. మా వృత్తి మాది! ఎక్కడ ఏ హత్య జరిగినా పోలీసుల కంటే ముందుగా మాకు కబురు వస్తుంది- వాళ్ళకంటే ముందే మేం తయారవుతాం. ఇది ఆచారం!

వల్లి:- పీటికూడా ఆచారాలు తగఁడ్డాయ్?

ప. వి:- అయ్యో! ఉండవటండీ మరి- ఆచారాలు! అసలు నన్నడిగితే- ఇటు పఁటి బలవంతపు మరణాలకే కాక, బలవంతపు జననాలకు కూడా విధిగా ముందుగా మా వంటి పత్రికా విలేఖరులంకు ఫోన్ చెయ్యాలనే రూలు ఉండాఁలంటాను, ఏవంటారు?

వల్లి:- ఇక దయచెయ్యమంటాను.

ప. వి:- వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను. మీరేదో అంగారు పడుతూనే ఉన్నారు. sం, ఇక్కడొక హత్య తప్పని సరిగా జరిగుండాలి!

వల్లి:- షటప్! (విసుగ్గా)

ప. వి:- నాలుగు వివరాలూ తెలుసుకుని చివరికి షటప్! ఇప్పుడే ఎలా?

వల్లి:- నాయనా! నీ కిక్కడ వివరాలేమీ దొరకవు. దయచెయ్యి.

ప వి:- మీ ఇంట్లో మొత్తం members ఎంత మందండి?

వల్లి:- ఆహా తొంభైమంది! (విసుగ్గా)

ప. వి:- అయితే వెంటనే లెక్క పెట్టించండి- ఆహా ఎనభై తొమ్మిదిమంది మాత్రమే ఉంటారు.

వల్లి:- మొత్తానికి మీ జాతిబుద్ధి పోనిచ్చుకున్నావుగాదు.

ప. వి:- ఏం జాతి? ఏం బుద్ధి?

వల్లి:- విలేఖరుల జాతి! మెడ పట్టుకు గెంటితేగాని పోనిబుద్ధి!

ప. వి :- మేం ఆలాంటి పట్టింపులు పెట్టుకుంటే ఎలా చెప్పండి. మాక్కావలసింది ఇన్‌ఫర్‌మేషన్ - కేవలం హెడ్ లైన్‌కి పనికివచ్చే ఇన్‌ఫర్‌మేషన్! That's all! ఇంతకీ హత్య జరిగి ఎంత సేపయిందన్నారు?

వల్లి:- మరీ యింత అభిమానంలేని బ్రతుకైతే ఎలాగయ్యా!

ప వి:- Thank you! ఆ! చంపబడ్డది స్త్రీయా! పురుషుడా?

వల్లి:- నీ ప్రశ్నలంతటితో కట్టిపెట్టి నే నడిగే దానికి జవాబు చెప్పు.

ప వి:- Yes ready sir!

వల్లి:- ఎవరు నీకు ఫోన్ చేసింది?

ప. వి:- తెలియదు.

వల్లి:- ఎక్కణ్ణుంచి ఫోన్ చేశారు?

ప. వి:- The same answer please!

వల్లి:- హత్య ఎక్కడ జరిగిందన్నారు?

ప. వి:- ఈ వీధిలోనే!

వల్లి:- అంటే రోడ్డుమీదా?

ప. వి:- No, no! చక్కని బిల్డింగ్‌లో!

వల్లి:- దాని door number?

ప. వి:- తెలియదు.

వల్ల:- మరి యిక్కడికెలా వచ్చావ్?

ప. వి:- బిల్డింగ్ గుర్తులూ, ఫోన్ నంబరూ చెప్పాడు.

వల్ల:- ఎంత ఫోన్ నంబర్?

ప. వి:- ఫోర్, ఫోర్, సిక్స్.

వల్ల:- Oh! That's all right. Please get out; మాఫోన్ నంబర్ ఫోర్, సిక్స్, ఫోర్ you see! Please get out!

ప. వి:- ఆ! నిజం! మీ ఫోన్ నంబర్ ఫోర్, సిక్స్, ఫోరా?

వల్ల:- Get out I say?

ప. వి:- సారీ సార్! వెరీ సారీ! ఇంతకీ ఫోర్, ఫోర్, సిక్స్ ఎవరి ఫోన్ నంబరండి?

వల్ల:- ఆ వివరం కూడా నేనే చెప్పాలీ? ప్రక్క బిల్డింగ్ కూడా మా బిల్డింగ్ లాగే ఉంటుంది. వాళ్ళ ఫోన్ నంబర్ ఫోర్, ఫోర్, సిక్స్! వెళ్ళిరా!

ప. వి:- Thank you sir! Thank you (వెనుతిరిగి వెళ్ళబోతుండగా పిస్టల్ పేలిన శబ్దం వినిపిస్తుంది.)

ప. వి:- అదుగో సార్! హత్య జరిగింది!

వల్ల:- (ముఖం పాలిపోతుంది. భీతితో వణుకు తున్నాడు. ముఖాన్ని మరో ప్రక్కకు తిప్పుకుని నీరసంగా కళ్ళు మూసుకున్నాడు. పెదవులు అదురుతున్నాయి.)

ప. వి:- పదండి సార్! చూద్దాం. హంతకుణ్ణికూడా పట్టుకోగలిగితే మన పేరు షెర్లాక్ హోమ్స్ పక్కన నిలబడుతుంది. హర్రియవ్ ప్లీజ్! హర్రియవ్!

వల్ల:- (మెల్లిగా) హత్య...జరిగింది!

ప వి:- అందుకే పదండి మరీ!

వల్ల:- నేను రాను.

ప. వి:- మీరు రాకపోతే నాకు తప్పుతుందా? (అంటూ లోపలకు వెళ్తు తున్నాడు.)

వల్ల:- అదెక్కడికి?

ప. వి:- మరెటుండీ?

వల్ల:- హత్య జరిగింది-మాయింట్లోకాదు. ప్రక్కబిల్డింగ్‌లో! ఫోర్, ఫోర్, సిక్స్ నెంబరు ఫోను గం ఇంట్లో!

ప. వి:- Oh! what a wonder! ఎంత కరెక్టుగా చెప్పి జరిగిందీ హత్య!...వస్తానండి. విషయం తెలుసుకునీ నాలుగు పుటోలు తీసుకుని మళ్ళీ మీ దర్శనం చేసుకుంటాను. (Exit)

వల్ల:- (గభాలున తలుపు వేసివచ్చి ఖంగారుగా లోపలి గుమ్మందగ్గరికి నడుస్తాడు.)

పర:- (తలుపు తీసుకుని ఇవతలకు వచ్చి, తలుపు గొళ్ళెం పెట్టి, ముఖం మీద పడ్డి జుట్టుని వెనక్కు తోసుకుంటాడు. చేతిలోఉన్న పిస్టల్ జారల్‌లోకి చూస్తూ) వల్లభరావుగారూ,...నా పని నెరవేర్చాను. ఏదీ నా bag!

వల్ల:- .....చంపేశావా, పరశురామ్!...చంపేశావా? ఆ అనుబంధం ఇవాళతో తీర్చిపారేశావా? పరశురామ్, తీర్చిపారేశావా? ... అయి పోయింది. అంతా అయిపోయింది. ... సుభద్రా! సుభద్రా!...నీ కెందుకు పుట్టిందీ పాడుబుద్ధి? ... పచ్చని క్షితుకులో నిప్పులు పోసుకుపోయావా సుభద్రా!... సుభద్రా!...(ఏడుస్తాడు)

పర:- (వల్లభరావువంక సానుభూతిగాచూసి కరుగ్గా) వల్లభరావుగారూ! చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. రాలినపూలు మళ్ళీ రెమ్మకు అతుక్కోవు. ఆ! డబ్బు కరెక్టుగా పెట్టారుగా! (వల్లమీదున్న bag తీసుకుని)

వల్ల:- (తన ధోరణిలో) సుభద్రా!...సుభద్రా! (అంటూ లోనికి వెళ్ళ బోతాడు.)

పర:- (అతనికి ఆర్డుగా సిల్చని) చూస్తారా ఓల్లభరావుగారూ ! రండి! చూడండి !... మధుర స్వప్నంలాంటి జీవితానికి భయంకరమైన మృత్యువే ముగింపు. ఆ మృత్యువు కొందర్ని మరింత భయంకరంగా ఆవరిస్తుంది. నన్నూ, నా చేతిలోని ఆయుధాన్నీ చూసి ఆమె భయపడి పారిపోలేదు. నిబ్బరంగా నిల్చున్న ఆమె గుండెలకు గురి పెట్టి ఒకే ఒక్కసారి కాల్చాను. ఫౌంటెన్‌లోంచి రంగునీరు ఎగజిమ్మినట్లు ఆమె గుండెల్లోంచి గోరు వెచ్చని నెత్తురు ఎగ జిమ్మింది. అంతే! దభాలున కిందపడి, ఈ ప్రపంచంలోనుంచి నిష్క్రమించటానికి రెండు మూడు క్షణాలు నరక యాతన అనుభవించింది. మరుక్షణంలో సుఖ దుఃఖాలకు అతీతమైన జగత్తుకో అడుగు పెట్టింది! చూస్తారా, రండి.

వల్లి:- ఆ!!!చూశ్నేను.

పర:- చూస్తారా, రండి! పరువూ మర్యాదా లేకుండా పదిమంది మగాళ్ళతో చెట్టపట్టాలు వేసుకుని తిరిగి, మీ పరువు ప్రతిష్ఠల్ని మంట గలిపిన నరరూప రాక్షసి రక్తపు మడుగులో పడి గిలగిల తన్నుకుని శాశ్వత నిద్రపోతోంది—చూస్తారా, రండి.

వల్లి:- చూశ్నేను పరశురామ్! చూశ్నేను.

పర:- పదిమందినీ తన వాలు చూపులతో మత్తెక్కించిన వంచకి కనుగుడ్లు వెళ్ళుకొచ్చి వికృతమైన చావు చచ్చింది—చూస్తారా, రండి!

వల్లి:- చూశ్నేను, పరశురామ్! చూశ్నేను.

పర:- మీరు చూడలేరనే తలుపు వేశాను మీకు చూడాలని ఉండవచ్చు. అయినా చూశ్నేరు.

వల్లి:- చూడాలనికూడా లేదు పరశురామ్! ఆదరించి, నెత్తిన పెట్టుకుని గౌరవించినందుకు నన్నే మోసగించిన ఆ రాక్షసిని చూడాలని లేదు. నన్ను ఎవరూ మోసం చెయ్యలేదు. నే నెవర్నీ చంపలేదు, అంతే! ఏమీ జరగలేదు. ఏదైనా జరిగితే అది నా ఆనందంకోసం జరిగింది. ఇప్పుడు నాకు ఆనందంగా ఉంది (నవ్వూ, ఏడుపూ కలిసిన స్వరంతో) నా మనస్సు శాంతంగా ఉంది. ఎన్నడూ లేనంత

హాయిగా ఉంది. (కృత్రిమంగా విస్మయంగా నవ్వుతాడు) హాయిగా ఉంది.

పర:- అంతే. అంతే! ఏమీ జరగలేదు. మీరలా శాంతంగా కూర్చోండి.

వల్ల:- శాంతంగా కూర్చుంటాను. ఇంకొక్క పనిచేసి ఇంకా శాంతంగా కూర్చుంటాను. వాణ్ణి గుమ్మంలోకి రాకుండా చేసి, గుండెలమీద చెయ్యి వేసుకుని నిద్రపోతాను.

పర:- వాడెవడండి?

వల్ల:- ఇంకెవరు? రాజశేఖరం!

పర:- ఓ! మీ పార్టనరా? ఆయనేనా ఈ కథకి మూల పురుషుడు!

(తలుపు చప్పుడౌతుంది.)

వల్ల:- వాడే! వాడే నా సంసారానికి చిచ్చుపెట్టింది.

పర:- అదేమన్నమాట లెండి. మన బంగారం మంచిదైతే వాళ్ళు దేస్తారు?

వల్ల:- అవును పరశురామ్!...అంతే! (తలుపు చప్పుడు ఆలకించి కొంచెం కంగారుగా) ఆ! అది సరే!...ఆ గదిలో...అలాగే ఉంచేశావ్!... ఎలా?

పర:- అదంతా నేను చూసుకుంటా లెండి. మీరు మాత్రం కాస్త నిబ్బరంగా ఉండాలి, మీ కంగారు ఎవరైనా చూస్తే.....

వల్ల:- కంగారా? లేదు ... ఏమీలేదు ... నాకేం భయంలేదు. అసలు నేనే ... నా చేతుతో ఆ పని చేసేవాణ్ణి...కానీ...కానీ...

పర:- అవునవును! సెంటిమెంటల్ అబ్జక్షన్! నాకు తెలుసులెండి. (తలుపు చప్పుడు. పరశురామ్ వెళ్ళి తలుపు తీస్తాడు.

రాజ:- (వస్తాడు. ఇందాకటి చురుకుదనం కనిపించదు.)

వల్ల:- రా, శేఖరం! ఇతనిపేరు పరశురామ్! నాకు వ్యాపార విషయాల్లో చాలా సార్లు సహాయం చేశాడు. మంచి మేధావి...

పర:- చాల్లెండి. మీరా మాత్రం చెపితే మిగతాకంతా నేను చెప్పుకుంటాను.

రాజ:- మిమ్మల్నెక్కడో చూసినట్టుందండి. గుర్తురావటంలేదు.

పర:- నాకూ అలాగే అనిపిస్తోంది. అయితే మనం కలుసుకోకపోయినా మన ఫోటోలు ఎక్కడైనా కలుసుకున్నాయేమో!

వల్ల:- అదేవిటి పరశురామ్! ఇందాక నా పార్టనర్ ఎక్కడ ఉంటున్నాడని అడిగావుగా! ఇతనే రాజశేఖరం!

పర:- ఓ!...ఓహో!...మీరేనా? చాలా సంతోషం! చాలా సంతోషం!

రాజ:- నా గురించి మీ రెందు కడిగారు?

పర:- ఈయనకో పార్టనర్ ఉన్నాడని తెలుసు. అందుకే అడిగాను.

వల్ల:- మీ పరిచయం బాగానేఉంది. మాట్లాడుతూందండి, ఇప్పుడే వస్తా. (మధ్య గదిలోకి వెడతాడు.)

పర:- ఆ! మీకు పిల్లలెంత మందండి?

రాజ:- జనాభా లెక్కల కొచ్చారేమిటి?

పర:- అబ్బే!...చెప్పటానికి అభ్యంతరమా?

రాజ:- పిల్లలు లేరండీ!

పర:- కొంపతీసి మీరు బ్రహ్మచారులా?

రాజ:- పిల్లలులేని వాళ్ళంతా బ్రహ్మచారులైతే నేనూ బ్రహ్మచారినే!

పర:- అయితే పెళ్ళయిందన్నమాట! అత్తవారు ఉన్నవారేనా?

రాజ:- మీరు ఏవిటేవిటో తడుముతున్నారు!

పర:- ఓ మనిషిని చూడగానే నాలో కొన్ని ఊహలు రేకుతాయి. అవెంత వరకూ నిజమో నాకు నేను నిర్ణయించుకోటం అలవాటు.

రాజ:- బాగుంది...మా అత్తవారు అంతగా ఉన్నవారు కాదులెండి.

పర:- మీ బిజినెస్ బాగా సాగుతోందా?

రాజ:- ఏదో ఫరవాలేదులెండి, ఎలాగైనా వల్లభంతో విడిపోయాక నే నాట్టే సంపాదించలేదు.

పర:- అవసరానికి అడ్డుపడేవారేనా మీ అత్తగారు?

రాజు:- (వెంటనే ఖంకి-నిదానించి) నన్నిన్ని ప్రశ్నలు అడిగారుగానీ, మీరెం చేస్తుంటారో, ఎక్కడుంటారో ఒక్క ముక్కయినా చెప్పారూ?

పర:- చెప్పనా?

రాజు:- చెప్పమనేగా!

పర:- మీరు ఖంగారుపడతారేమోనని!

రాజు:- ఎందుకూ?

పర:- నేను ప్రొఫెషనల్ మర్డరర్‌ని!

రాజు:- ఆఁ!

పర:- అవును. నేను కోరిన డబ్బు ఇస్తే, మీరు కోరిని వ్యక్తిని...ఉష్!

రాజు:- Is it?

పర:- Yes yes!

రాజు:- మీరు జోక్ చేస్తున్నారు. నేను నమ్మన.

పర:- పరీక్షించి చూడండి.

రాజు:- ఎలా?

పర:- ఓ పాతిక వేలు ఇలా పారేసి ఓ మనిషి పేరు చెప్పండి చాలు!

రాజు:- What a hell!

పర:- (నవ్వి) ఖంగారు పడకండి. (ఫ్లాస్కులోని కాఫీ రెండు గ్లాసుల్లో పోస్తున్నాడు) అది నా వృత్తి. మీరు సిద్ధమేనా?

రాజు:- తలేవారే!...నాకు శత్రువు లెవరూ లేరు.

పర:- అంతా మొదట ఇలాగే అజాతశత్రువుల్లాగా మాట్లాడతారు - నా ముందు!...ఆ! కాఫీ తీసుకోండి. (అందిస్తాడు)

రాజు:- (తాగబోయి ఆగి, గ్లాసులోకి అనుమానంగా చూస్తాడు) కొంపదీసి ఎవరైనా మీకో పాతిక వేలిచ్చి నా పేరు చెప్పలేదు గదా!

పర:- అంటే మీకు శత్రుశేషమన్నమాట!

రాజు:- బోల్తా కొట్టించారు మొత్తానికి!

పర:- మొదట జుట్టు అందించి, తరవాత గుట్టు అందుకోవం నా అలవాటు! చెప్పండి. ఎవరా శత్రువు? మీరెవరినైనా ప్రేమించారా?

రాజు:- ఆహా!

పర:- ఆరు సంవత్సరాలు అహోరాత్రాలూ ప్రతిఫలంలేకుండా ప్రేమించారా?

రాజు:- అయితే మీకు నా పరిస్థితి అర్థంకాదు.

పర:- పరిస్థితుల్ని అర్థంచేసుకోవంలో పరభగామ్ తరవాతే ఎవరైనా! చెప్పండి, హాలో అవుతాను.

రాజు:- ఆరు సంవత్సరాలు నిస్వార్థంగా ఆరాధించాను. రాత్రి కలలు, పగటి కలలు కన్నాను. కన్ను మూసినా తెరిచినా ఆమె సుందరవిగ్రహాన్నే చూశాను. ఆమె తృప్తి కోసం, ఆనందం కోసం ఎన్నో చేశాను, ఎన్నెన్ని ప్రలోభాలో తిప్పాను. ఎంతో ఖర్చు పెట్టాను. ఏ మహా భక్తుడూ ఏమాత్రం ప్రతిఫలాన్ని ఆశించకుండా నాలాగా ఏ దేవుణ్ణీ ఆరాధించి పూజించి ఉండడు-పూజించి ఉండడు. ఆమె నోటిలోనుంచి మాట రాకపూర్వమే ఆమెకేం కావాలో గ్రహించాను. ఆమె కనుసన్నల్లో మెలిగాను. ఆమె మౌనం కన్నెంతో ముగ్ధుణ్ణి చేసింది? ఆమె చిరునవ్వులు నాలో ఎన్నో అశలు రేకెత్తించాయి ... నా ఆరాధనకి రాళ్లకూడా కరగవలసింది...ఏమంటారు మీరు ?

పర:- Sure, sure !

రాజు:- అవునా, ఇవాళ జరిగిన సంఘటన చెపుతాను వినండి. ఇక్కడికి నాలుగు మేళకు ఉత్తరి మేళలో ఇవాళొక పెద్ద పార్టీ జరిగింది. అంతా ఇంగ్లీష్ మోడల్లో ఏర్పాటు చేశాడు. ఆ వాతావరణం ఉత్సాహకరంగా ఉంది. నాలో కూడా ఉత్సాహం పొంగి కట్టలు తెంచుకున్నది! నా ఎదుట ఆమె కూర్చుంది. ఆమె నవ్వులు నాతో

దోబూచులాడాయి. ఆమె కన్నులు నాలో ఆవేశాన్ని రగిలించాయి. ఆమె మాటలూ, చేష్టలూ-ప్రతి ఒక్కటీ నన్నామెకు సన్నిహితుణ్ణి చేశాయి. పిచ్చివాణ్ణి చేశాయి ఆ సంచల్లో, ఆ ఆంగ్ల సంగీతం కలిగించిన మత్తులో ఆమెను దగ్గరకు తీసుకున్నాను. ఆమె ముఖంలో ముఖం ఉంచాను...అంతే. అంతే నా గూడు పగిలిపోయింది. పార్టీ ఆగిపోయింది! ప్రపంచం గిర్రున తిరిగిపోయింది. అంతా నిర్ఘాంత పోయి చూస్తున్నారు. లాయర్స్, డాక్టర్స్, high rank officials, పెద్ద పెద్ద వ్యాపారస్తులూ, ఉన్నతభావాలుగల వ్యక్తినిగా నన్ను మెచ్చుకుని గౌరవించేవాళ్ళూ ఎందరో ఉన్నారు. అంతా నాకు కలిగిన అవమానాన్ని కళ్ళారా చూశారు. ఆ చూపుల్ని నేను భరించలేక పోయాను. నా ప్రాణాలూ, నా వ్యక్తిత్వం, నా పరువు ప్రతిష్టలూ, నా ఉన్నత భావాలూ గిల్లార్చుకపోయాయి. ఏం చెయ్యను? ఏం చెయ్యాలసలు?...నిలువునా కూలిపోయాను. రక్తం గడ్డ కట్టుకు పోయింది. నా ఆరాధన అంతా వ్యర్థమైపోయి, నా జీవిత ఏనాశ నానికి దారి తీసింది. అది...అది స్త్రీయేనా? ... నా పట్ల ఒక ఆడది చూపిన యీ మర్యాదకి ప్రతిక్రియగా నేనేం చెయ్యాలి? ఆమెకు ఏం చెయ్యాలి? మీరైతే ఏం చేస్తారు? ఇంత మోసంగా అవమానించిన ఆడదాన్ని మీరైతే ఏంచేస్తారు?

పర:- నిలువునా చీల్చేస్తాను.

రాజ:- అదే అనిపించింది. కానీ...కానీ-

పర:- కానీ మీరాపని చెయ్యలేరు. మీ చేతులా పనికి ఒప్పుకోవు!

రాజ:- అవును. అయినా ప్రతీకారం చేసి తీరతాను.

పర:- మీరేం చేస్తారు? మీరల్లా ఎలాగౌతుంది? దానికెంత గుండె నిబ్బరం, ఎంత ఆత్మశక్తి కావాలి! అవన్నీ ఈ పరశురామ్‌కి ఉన్నాయి!

రాజ:- ఆ!

పర:- అ! ఓ పాతిక వేలేగా - పారెయ్యండి. పది నిమిషాల్లో పని ముగించేస్తాను. సైయేనా?

రాజ:- (ఉద్రేకంతో ఆలోచిస్తూంటాడు.)

పర:- ఆలోచించకండి. ఆలోచిస్తే అన్నంకూడా ముట్టలేం. గొప్పవాళ్ళంతా గొప్పగొప్ప పనులన్నీ ఆవేళంలోనే చేసేశారు,

రాజ:- (టేబులోనుంచి ఓ నెక్‌లెస్ తీసి) ఇది...ఇది ఆమెకోసం తెచ్చిన ప్రేమతానుక! ఇదిప్పుడామె ప్రాణాలు రియ్యటానికి ఉపయోగపడుతోంది...మీ దగ్గిరుంచండి.

పర:- అక్కర్లేదు. మీ దగ్గరే ఉంచండి. పరవాలేదు-అడ్వాన్సు ఇవ్వకపోయినా!

రాజ:- అయితే పని పూర్తిచెయ్యండి-పది నిమిషాల్లో డబ్బు తెస్తాను. (అంటూ పీఠిలోకి వెళ్ళబోయి వెనుదిరిగి) ఈ సంగతి మరో మానవుడికి తెలియకూడదు. అలా చెయ్యగలిగితేనే చెయ్యండి.

పర:- ఆ జాగ్రత్తలన్నీ నేను ఉగ్గుపాలతో రాగిన విద్యలు...ఆ!...!పేరు..

రాజ:- ఓ!...(అంటూ జేబులోనుంచి ఓ కాగితాన్ని తీసి దానిమీద నాలుగు అక్షరాలు గిలికి పరశురామ్‌కి యిస్తూందగా)

వర్ధ:- (వస్తాడు)

రాజ:- వస్తా!...వస్తా వర్ధిభం!

వర్ధ:- అప్పుడే వెళ్ళిపోతున్నావేం?

రాజ:- మళ్ళీవస్తా (EXIT)

వర్ధ:- ఏవిటి వాడితో మంతనాలాడుతున్నావ్?

పర:- శత్రువులేని మనిషి లేడు. నాలాంటి మనిషి లేడు. కనుక మనుషులందరికీ నాతో పనుంటుంది. అందరి రహస్యాలూ నాతో చెప్పుకుంటారు. వాళ్ళు చెప్పేదంతా ఓర్పుతో నేను వింటాను. అందువల్ల నేను అందరికీ ఆప్తుణ్ణే! నిజంగా నాలాగా ఏ ప్రజానాయకుడు డైరెక్టుగా ప్రజాసేవ చేస్తున్నాడో చెప్పండి. చూద్దాం!

వర్ధ:- ఏవిటి పరశురామ్! వాని దగ్గరకూడా డబ్బు తీసుకున్నావా?

పర:- తీసుకోలేదు. తీసుకోబోతున్నాను.

వల్ల:- ఆ!...అయితే వాడి శత్రువెవరో నాకు తెలుసు...నాకు తెలుసు!...

పర:- ఎవరు?

వల్ల:- నేనే!...నేనే వాడి శత్రువుని! నేనే వాడికీ వాడి ప్రియురాలికీ మధ్య రాక్షసుడల్లే నిల్చున్నాను. నేనే వాళ్ళ స్వేచ్ఛా విహారాలకు అడ్డు తగులుతున్నాను. అందుకే, అందుకే నా అడ్డు తొలగించుకుంటే వాళ్ళకి సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తుంది. వాళ్ళిద్దరూ చిలకాగోరింకాల్లా కిలకిల్లాడుతూ ఉండచ్చు! (వెట్టిగా నవ్వుతాడు.) నా అడ్డు తొలగించుకుంటే—చీమలు నూకలు పోగుచేసినట్టు నేను కూడబెట్టిన ఆస్తినంతా ఇద్దరూ అనుభవించవచ్చు! (మళ్ళీ వెట్టినవ్వు) అంతేగా పరకురామ్! నాకు తెలుసు!...నువ్వు చెప్పక్కర్లేదు...అనుభవించమను! స్వేచ్ఛా విహారం చెయ్యమను! ఆ ప్రేతంతో బాల్‌రూమ్ డాన్స్ చెయ్యమను యిక్కడ! దర్జీ రోగ్స్!

పర:- అంతా అయిపోయాక ఎందుకలా ఆవేశపడతారు వల్లభరావుగారూ! అతను చంపమన్నది మిమ్మల్ని అవునో, కాదో నాకు తెలీదు. ఇంతలో తొందరపడతారెందుకు? చిటికేసి యిచ్చి పోయాడు. నేను కూడా చూళ్ళేదు. (అంటూ చీటీ యిస్తాడు.)

వల్ల:- (చూస్తూ) ఆ! ఏవిటిది?

పర:- ఏముంది, మీ భార్యను చంపమన్నాడు, అంతేగా!

వల్ల:- సుభద్రనా?...ఎందుకు?...ఎందుకు?

పర:- ప్రతీకారం!

వల్ల:- (ఆయాసపడుతూ) ఎందుకూ?

పర:- అవమానించినందుకు ప్రతీకారం!

వల్ల.- సుభద్ర అవమానించిందా? శేఖరాన్ని అవమానించిందా? ఎందుకు?

పర:- నిప్పుని తాకితే కాలకుండా ఉంటుందా, వల్లభరావుగారూ?

వల్లి:- నిప్పు!...నిప్పు!...ఎవరు?...సుభద్రా?

పర:- అవును తేరగా నిప్పు అంటే చాలదండీ... అది పవిత్రాగ్ని !

వల్లి:- పవిత్రాగ్ని! నేను నమ్మను!

పర:- నమ్మకపోవడం, నమ్మనని మీరెంత గొంతు చించుకుని ఆరిచినా నిజం నిజం కాకపోదు. వల్లభరావుగారూ! అక్కడ జరుగుతున్న పార్టీలో మీరు నిజంగా నమ్మలేని అద్భుత సంఘటన జరిగింది-ఇంతకు ముందే ! ఆమె చనువుని అపార్థం చేసుకున్న శేఖరం కల్మషంతో ఆమెని సమీపించాడు. ఏదో పూసుకున్న చేతులతో ఆమెను తాకాడు. అప్పుడేం జరిగిందో ఊహించ గలరా? పరస్త్రీల వెంట పిచ్చి కుక్కలా తిరిగినందుకు గూబ గుయ్యి మనిపించి పదిమందిలో శాశ్వత ముద్రవేసి, చన శీలం ఎటువంటిదో చాటుకుంది.

వల్లి:- నిజమా?

పర:- మీకు నమ్మనివన్నీ నిజాలు కాకుండా పోవండీ! మీ దృష్టిలో పది మందిలో మెలగటం చేతకాని స్త్రీ బ్రూట్ ! ఆ బ్రూట్ అంటే మీకు మంట! ఇది ఒకనాటి మాట ! అప్పట్లో ఆ అభిప్రాయంతోనే మీ భార్యనీ పదిమందికి పరిచయం చేశారు. సోషల్‌గా ఉండమని ప్రోత్సహించారు. ఉన్నత భావాలు గల వాడనీ, ఇంద్రుడనీ, చంద్రుడనీ, మీచేతా ఈ సొసైటీచేతా పొగడ్తలు అందుకుంటున్న శేఖరంతో చనువుగా ఉండి మీ భార్య! అది చూసేసరికి మీ మనస్సులో విషం పుట్టుకొచ్చింది. ఆ పాపం యీ నాటికి ఐద్దలై ఆమె చస్తేనేగానీ శాంతి లేదనుకునే వరకూ వచ్చింది. మీ కోరిక నెరవేర్చాను. నా అవసరం నాది కనుక ! ఇక ఇప్పుడామె పవిత్రాగ్ని అయినా-సాక్షాత్తు ఆ సీతామహాదేవి అయినా చేసేదేమీ లేదు. అనుభవించండి.

వల్లి:- పరశురామ్ ! ... ఆమెను చంపటానికి ముందే నీకీ సంగతి తెలిసిందా ?

పర:- ఆ!

వల్ల:- మరయితే ఎందుకు చంపావ్ ?

పర:- మరి నా గట్టో ?

వల్ల:- డబ్బు ! డబ్బుకోసమని నిర్దోషని తెలిసుండి చంపుతావా! ఆమె తప్పుచేసిందని నేను మాయలో పడితే నిజం తెలిసినవాడివి నాకు చెప్పకుండా అమాయకురాల్ని నిలువునా కాల్చి చంపుతావా ? ... సుభద్రా!

పర:- మళ్ళీ మీరు పిచ్చిని ఎడుతన్నారు ఆమె దోషి అయితే నాకేం ? నిర్దోషి అయితే నాకేం? నా వృత్తి నాది.

వల్ల:- పరశురామ్! అసలు నువ్వనే వాడివే కొంపలో అడుగు పెట్టకుండా ఉంటే నాకీ సాహసం ఉండేది కావ. ఈ గంటా గడిస్తే నిజం తెలుసుకుని నా సుభద్రని క్షమాపణ కోరేవాణ్ణి!...దీని కంతకీ కారణం నువ్వు, పరశురామ్ నువ్వే!

(అతని చొక్కా పట్టుకుని గుంజుతున్నాడు.)

పర:- (నిర్లిప్తంగా సిగరెట్ కాల్చుకుంటూ) సరే. మీరింతగా బాధ పడుతున్నారు గనక నేనో ఉపకారం చేస్తాను.

వల్ల:- ఏవిటది?

పర:- చెపితే ఏవిస్తారు?

వల్ల:- పరశురామ్! ... ఏవిటది? (ప్రాధేయపడుతూ) ఏవిటది చెప్పు పరశురామ్!...చెప్పు!...సుభద్రని చంపలేదని చెప్పు పరశురామ్! ...నీకేది కావాలంటే అదిస్తాను.

పర:- సరే, మీరు ఆపదలో ఉన్నారు గనక ఈ ఉపకారం చేస్తా!

వల్ల:- చెప్పు పరశురామ్!

పర:- ఆమె దోషి అనుకున్నారు గనక కామ్‌గా పాతిపెట్టేస్తానన్నాను. ఇప్పుడు నిర్దోషి అనే తెలుసుకున్నారు గనక ఆ శవాన్ని ఆలా వదిలేస్తాను - పట్టహాసంగా ఊరేగింపు జరిపి, బ్రహ్మాండంగా ఉత్తర క్రియలు జరిపించండి...

వల్ల:- పరశురామ్! (బిగ్గరగా అరుస్తాడు.)

(నిశ్శబ్దం)

రాజు:- (మెల్లిగా తలుపు తోసుకుని వస్తాడు.)

వల్ల:- (అతన్ని చూస్తూనే) రా, శేఖరం, రా! (విషంగా నవ్వుతూ అహ్వానిస్తాడు)...సుభద్రని ప్రేమిస్తున్నావా శేఖరం? ఆమెను అందిపెట్టుకుని తిరిగి ప్రియుడి నవదావసకన్నావా శేఖరం! (పెరుగుతున్న ఉద్రేకంతో) ఆమె నీ సొత్తయినట్టు నటించి నాలో కార్చిచు. రగిలించావా శేఖరం!...చెప్పు, చెప్పు, ఆమె నీ ప్రియురాలా? చెప్పు!

రాజు:- ఆ రాక్షసి నా ప్రియురాలా?

వల్ల:- రాక్షసి!...రాక్షసి!...నిన్ను త్యజీకరించింద. నిన్ను యీ సంఘానికి బీద పురుగ్గా విడిలించేసింది...అవునా శేఖరం!...అవును. అంతే!...పరశురామ్! నా భార్యని నేను అనుమానించేట్టు చేసి, ఆ అమాయకురాలి జీవితాన్ని, నా జీవితాన్ని నాశనం చేసిన ఈ రాక్షసుణ్ణి చంపేందుకేం తీసుకుంటావ్?...కాల్చి చంపటంకాదు. ఖండ ఖండాలుగా ఖండించేందుకేం తీసుకుంటావ్? ఒక్క క్షణం ఆలస్యం చేయకు. చంపిపారేయ్! ... పీడమూలాన దేవతలాంటి భార్యని చంపుకున్నాను. చేతులారా చంపుకున్నాను. పరశురామ్! చంపుకున్నాను.

రాజు:- ఆ! సుభద్రని చంపేశారా?...సుభద్ర చచ్చిపోయింది. (విషంగా ఉన్మాదంగా నవ్వుతూ) నన్ను అవమానించి నందుకు ప్రతీకారం జరిగిపోయింది...నేను చేయకుండానే జరిగిపోయింది. నాతో నిమిత్తం లేకుండానే జరిగిపోయింది...పరశురామ్‌గారూ! పాతిక వేలిస్తేనేగానీ సుభద్రని చంపనన్నారు. చిల్లిగవ్వ ఖర్చులేకుండా నా కోరిక తీరిపోయింది. ఆరాధించిన నన్ను అవమానించిన పాషాణం బద్దలయి పోయింది, ... (నవ్వి) చంపించింది నువ్వు! చంపింది నువ్వు! ... నాకేంటీసంబంధం లేదు. నాకేం సంబంధం లేదు, (అని పీఠి తలుపు దగ్గిరికి వెడుతూండగా)

ప.వి:- (వస్తూనే కేఖలాన్ని చూసి) హలో! మీరిక్కడున్నారేఁటి? (వల్లభంతో) ఈయన మీ friend అనుకుఁటాను. ఇందాక బ్రహ్మాండమైన పార్టీలో ఒకామె ఈయన్ని ... ...

రాజ:- షటప్!

ప వి:- విషయం పూర్తిగా చెప్పాక చివరికి షటప్! ఇప్పుడే ఎలా?..... ఆహాహా! నిజఁగా పెద్ద టపాకాయ పేలినంత చప్పుడయిందనుకోండి. ఆహాహా!

రాజ:- You fool, get out!

ప.వి:- ఇక్కడ జరిగిన హత్యకి సంబంధించిన ఇన్‌ఫర్‌మేషన్‌కోసం వస్తే అప్పుడే get out ఏవిఁటండీ?

రాజ:- హత్యా?

ప.వి:- ఏవిఁటి మీరలా కంగారు పడుతున్నారు?

రాజ:- ఇక్కడ హత్య జరిగిందని మీ కెలా తెలుసు?

ప వి:- షేమ్ షేమ్! మాకు తెలియక పోవటమేవిఁటండీ! (వల్లభంతో) ఆ! ఏవఁండోయ్! మనం అనుకున్నట్టు ఆ బ్రహ్మ బిల్డింగ్‌లోకి వెళ్ళాను. కానీ మీరు చెప్పినట్టు అక్కడ హత్యజరగలేదు సరిగదా, ఆ ఇల్లు ఖాళీగా ఉంది. ఎవరో ఆకతాయి వెధవ ఫోన్ చేసివుంటాడు. నాకు మాత్రం మీ ఇంట్లో మీ అందరి ఖంగారు చూస్తూంటే హత్య జరిగినట్టే ఉంది. హత్యకీ, ఆందోళనకీ అంత చుట్టరికం! ఏవంటారు?

పర:- అవును. హత్య జరిగింది.

ప.వి:- మీరెవరు?

పర:- చెపుతాను. శిరసున ప్రతిష్ఠించుకుని ఆరాధించ వలసిన నారీ శిరోమణిని పతితగా అనుమానించి నిలువునా కాల్చి చంపమన్నదీయన! స్నేహితుని భార్యని ప్రేమించాననీ ఆరాధించాననీ దబ్బా వాయించుకుని,ఆమెచేత దవడ పగలగొట్టించుకుని,ప్రతీకారంకోసం చంపమన్నదీయన! ఇద్దరూ చెరొక పాతిక వేలకి నన్ను మాట్టాడుకున్నారు. నే

నా మెను చంపాను—కేవలం నా అవసరం కోసం! మా ముగ్గురిలో ఎవరు హంతకులో, మాలో ఎవరి ఫోటో మీ పత్రికలో వేసుకోవాలో మీరే నిర్ణయించుకోండి.

ప.వి:- What a lucky day! హాట్స్ ఆఫ్ గిడి. హంతకుడు దొరికాడు. కాదుకాగ. హంతకుల ముగ్గురు దొరికారు. ఓ! బ్రహ్మాండమైన హెడ్‌లైన్! ఈ కేమరా ఇంతవరకూ ప్రాణాలతో వున్న వాళ్ళని ఫ్లోటో తియ్యలేదు. కనక ఇది బయలుదేరినందుకైనా హత్య జరగవచ్చు!For its honour'...ఆ! ఇంతకీ శవం ఎక్కడుంది? నాలుగు ఫోటోలు తీసుకుపోతాను.

పర:- రండి చూపిస్తాను.

వల్ల:- పరశురామ్! నీకేమైనా పిచ్చెక్కిందా? వెళ్ళవయ్యా! ఇక్కడ హత్యలూ లేవు, శవాలూ లేవు!

ప.వి:- కాదు, హత్య జరిగింది. మీరే చంపారు. శవం వుంది. చూపించండి.

వల్ల:- నువ్వెవరసలు? పో, బయటికి పో!

పర:- ఆగండి వల్లభరావుగారూ! తొందరపడకండి (ప.వి తో) రండి. (లోపలి తలుపు గొళ్ళెం తీసి, తలుపు బార్లగా తోసి) ఊ! తియ్యండి ఫోటో! భయపడకండి.

ప.వి:- (కేమెరా సరిచేసుకుంటున్నంతలో)

సుభ:- (లోపలినుంచి గబగబా నస్తుంది.)

[పత్రికా విలేఖరి చేతిలో flash వెలుగుతుంది. నిర్ఘాంతపోతాడు. ఆమెవచ్చి వల్లభం కాళ్ళమీద పడ్డది. పరశురామ్ మధ్య కుర్చీలో తాపీగా కూర్చుని సిగరెట్టు వెలిగిస్తాడు.]

సుభ:- నన్ను క్షమించండి. పాపిష్టిదాన్ని, ఇంతసేపూ మీరు పడుతున్న బాధంతా చూస్తూ కుమిలిపోతూ కూర్చున్నాను—ఆయన కూర్చోమన్నారని!...నన్ను క్షమించండి...మీకు అపమానం కలిగేట్టు ప్రవర్తించటం నాదే తప్పు! నన్ను క్షమించండి. (ఏడుస్తుంది.)

పర:- వల్లభరావుగారూ! అది భయంకర సర్పం కాదు. మీ శిరోమణే!... ధరించండి... (అని నవ్వుతాడు.)

వల్ల:- (కన్నీటితో) సుభద్రా! (ఆమెను లేపదీసి) నువ్వే నన్ను క్షమించాలి సుభద్రా! ఇన్నేళ్లు నీతో కాపురం చేసి, నీ మనసెరిగి కూడా మాయలో పడ్డాను. (అని పరశురామ్ దగ్గరకి గబగబా వెళ్ళి, అతని రెండు చేతులూ పట్టుకుని) పరశురామ్! నీ ఋణం తీర్చుకోలేను పరశురామ్! నా సంసారాన్ని నిలబెట్టావ్ పరశురామ్!

పర:- నేను మీ సంసారాన్ని నిలబెట్టడానికి రాలేదు, వల్లభరావుగారూ! అది యాదృచ్ఛికంగా జరిగిండ్. నేను నా చెల్లెలి సంసారాన్ని నిలబెట్టుకోడానికి వచ్చాను. మా పెత్తండ్రి కూతుర్ని ఓ ధనవంతుడికిచ్చి చేశారు. పరస్త్రీ వ్యామోహంలో పడి భార్యనే భారంగా భావించి పాతిక వేలు తెస్తేనే తన గుమ్మంలో అడుగుపెట్టనని ఆమెను పుట్టింటికి పంపేశాడాయన! మా వాళ్ళంతా కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడినా ఆయన మనసు మారలేదు. దానితో ఆమె భ్రాంతుకు బెందలై పోయింది. ఇన్నాళ్ళూ పుట్టింట్లో ఉండిపోయి ఆఖరికి ఆత్మహత్యకు సిద్ధపడ్డది. చివరి ప్రయత్నంగా ఆస్పాంలో ఉంటున్న నాకు ఉత్తరం రాసింది. "నువ్విప్పుడు రాలేకపోతే ఆడదై పుట్టిన దౌర్భాగ్యానికి నీ చెల్లెలు బలి అయిపోతుంది. గుర్తుంచుకో" అని రాసింది. ఆమె ఆక్రోశం నన్నిక్కడికి లాక్కొచ్చింది. ఆమె ఆవేదన నన్ని సరికి పురిగొల్పింది. ఇదుగో, ఇలా సంపాదించాను -పాతిక వేలు!...మా చెల్లెలు తెలివి గలది. అందగత్తె! భర్తని పువ్వుల్లో పెట్టి పూజించే స్వభావం గలది...ఆలాంటప్పుడు ఏం తప్పుచేసిందని ఆమెను వెళ్ళగొట్టి, పరస్త్రీల వెంట తిరిగి, తలెత్తుకోలేని అపమానాలపాలై పాతాలు నేర్చుకోవలసి వచ్చింది- రాజశేఖరంగారూ!

(అంతా నిర్ఘాంతపోతారు. పరశురామ్ బల్లమీద bag రాజశేఖరం కాళ్ళ దగ్గిరకి విసిరి) ఇదిగో, మీరు కోరిన పాతిక వేలు! నా చెల్లెల్ని అన్యాయం చెయ్యకండి. వస్తా! వస్తానమ్మా!

(వెళ్ళిపోయాడు.)

వల్ల:- పరశురామ్!

సుభ:- ఏవండి!

ప. వి:- పరశురామ్‌గారూ! ఏవండోయ్! ఒక్క పోటో ? (Exit)

రాజు:- (నిలువునా క్రుంగిపోతాడు. పశ్చాత్తాపం దహిస్తోంది. కన్నీరు జలజల రాలింది. మెల్లగా వంగి bag అందుకుని వల్లభరావు దగ్గరికి వెడతాడు. bag అతని చేతిలో ఉంచుతాడు. సుభద్రని చూస్తాడు. ఆమె అతనివంక సానుభూతిగా చూసి తల తిప్పుకుంటుంది. అతను ఆమె దగ్గరికి నడుస్తాడు. ఆమె ముఖంలోకి చూస్తాడు. చూడలేక తలతిప్పుకుని) సుభద్రా! (దగ్గుత్తికతో) సుభద్రా! మీ వదిన్ని తీసుకు రావటానికి ఇప్పుడే వెడుతున్నాను. (గిడకున్న వెనుదిరిగి వెడుతుండగా అతన్ని వెంబడిస్తూ)—

—: తెర :—

ఉలిపికట్టె

రచన :

ఆవుల శ్రీనివాసరావు

పాత్రలు

పాపయ్య

గోవిందు

శ్రీహరి

ప్రసాద్

రంగనాథం

రామరాజు

దొర

శేఖర్

కృష్ణవేణి

[తెర లేచేసరికి శ్రీమంతుని భవనంలోని ముందు హాలు కనిపిస్తూ ఉంటుంది. కుడిప్రక్క ఒక పేము మంచముపైన ఒక పరుపు పరచి ఉంటుంది. మరి ఒక పరుపు చుట్టబడి ఉంటుంది. మంచంమీద ఇంటి యజమాని పాపయ్య కూర్చొని దగ్గుతూ ఉంటాడు. మధ్యలో రెండు కుర్చీలు, వెనుక మధ్య ద్వారం, ద్వారానికి తెరలు, నాయకులు, సినీ తారల, దేవతల చిత్రపటాలు గోడలపై వ్రేలాడుతుంటాయి]

పాపయ్య:-(దగ్గుతూ) గోవిందా గోవిందా...(జవాబు లేదు. గట్టిగా) గోవిందా... (దగ్గు తమాయించుకొంటూ) గోవిందా...

గోవింద:- అయ్యా...వస్తున్నా (అంటూ బిరబిర వచ్చి చేతిలోవున్న వేడినీళ్ళ సంచిని వీపుమీద పెడతాడు. అవును సంచిలోనివి తెల్లటి నీళ్ళ యుంటవి)

పా:- అబ్బ! చంపేశావురా. నీ దుంపతెగ. తెల్లనీళ్ళు పోసుకొచ్చావా!

గో:- కిదుమరె...కదుమరె...ఎంత పొరపాటు ... ఎంత పొరపాటు... (సంచితో లోనికి పరుగుతీస్తాడు)

పా:- కృష్ణా...కృష్ణా...కృష్ణా...

కృష్ణవేణి:-వస్తున్నా నాన్నా..... (కాఫీ తొట్రిపడుతూ వస్తుంది) నాన్నా, ఈ మాత్ర వేసుకొని కాఫీ త్రాగండి.

పా:- ఊరు పొమ్మంటుంది. ఏరు రమ్మంటుంది. ఇంతా ఎందుకమ్మా ఈ మందులు మాకులు?

కృష్ణ:- ఊరుకోండి నాన్నా. ఏమిటా మాటలు? మీరు ఆరోగ్యవంతులై హాయిగా వుంటే, ఈ ఇల్లు హాయిగా ఉంటుంది. ఈ ఇంటితోపాటు ఈ ఊరు హాయిగా ఉంటుంది.

పా:- (మాత్ర మింగి, కాఫీ త్రాగి వగ్గుతూ) నా మొఖంమీదనే తెల్లవారుతుందా ఏమిటి? పెద్ద చిన్న, భయం భక్తి ఏమీలేదు. ఎవరికివారు పెద్దలైపోయారు. నా మాట ఇంటిలోవారు వింటున్నారా? ఊరిలోవాళ్ళు వింటున్నారా? అయినా నా కెందుకొచ్చిన బాధ? నేను ఇంకెన్నాళ్ళు బ్రతుకుతాను? ఊరు పొమ్మంటుంది, ఏరు రమ్మంటుంది.

గో:- (సంచితో ప్రవేశిస్తూ) కదుమరె ..... కదుమరె (అంటూ సంచిని పాపయ్య వీపుమీద పెట్టబోతాడు)

పా:- ఒరేయ్...ఒరేయ్, వేట సరిగా వుందా?

గో:- ఏమిటీబాబు మీరు మరీ ఇదైపోతారు. ఇప్పుడు చూడండి. (అంటూ సంచి వీపుమీద పెట్టి కాపటం కాస్తూ ఉంటాడు)

పా:- (దగ్గుతూ) శ్రీహరి శ్రీహరి శ్రీహరి.

శ్రీవా:- (మధ్య వాకిలినుంచి నల్లనికోటు వేసుకొంటూ ప్రవేశిస్తూ) యేం మామయ్యా.

పా:- నిన్నెవరు పిలిచారయ్యా?

శ్రీ:- శ్రీహరీ శ్రీహరీ అని మీరేగా ఇప్పుడు పిలిచారు?

పా:- అబ్బా, ఈ ఇంటిలో దేవుని గూర్చి ధ్యానం చేయడంగూడా తప్పేనే!

శ్రీ:- ఓహో! మీరు వారిని తలంచుకొంటున్నారా ... తలంచుకొండి ... తలంచుకొండి. కృష్ణా, త్వరగా కాఫీ తీసుకురా. డ్రైం అయిపోతూ ఉంది.

కృష్ణ:- (పకపక నవ్వుతుంది)

శ్రీ:- ఎందుకలా నవ్వుతావు?

కృష్ణ:- అదికాదండి. ఈరోజు ఆదివారంకదా. తమరు ఏ కోర్టుకెళ్ళాలో?

శ్రీ:- (తెల్లబోయి) ఓ, ఈరోజు ఆదివారం కదూ? (సిగ్గుపడుతూ లోనికెళ్ళబోతాడు. కృష్ణవేణి చిన్నగా నవ్వుతుంది. గోవిందు పెద్దగా నవ్వుతాడు. శ్రీహరి కోపంతో వాకిలంక చూసి వెక్కిరింపుగా నవ్వి) ఛీ నోరుమూయ్!

గో:- (నోరు మూసుకొంటాడు. శ్రీహరి లోనికెళ్తాడు) అయినా చిన్నబాబు గారికి మరీ మీదు దుంటుంచయ్యా కోపం.

పా:- ఆయనగారి కోపానికేంలే!

గో:- కదుమరే...కదుమరే?

(కృష్ణవేణి మూతి ముడుచుకొంటుంది)

పా:- గోవిందా!

గో:- అయ్యా!

పా:- నేను చాలా దురదృష్టవంతుణ్ణిరా!

గో:- అదేంటయ్యా అట్లా అంటుండారు?

పా:- అంతేరా. అంతే. (దగ్గు) నా హోదాకు తగిన అల్లుడు వస్తాడను కొన్నాను. కాని ఇంతటి పరధ్యానపు మనిషి, ఇంతటి అప్రయోజకుడూ నా అల్లుడౌతాడని కలలోకూడా అనుకోలేదు.

కృష్ణ:- నాన్నా! ఎందుకు వారిని అలా చులకనచేసి మాట్లాడుతారు? వారికి ఏమి వంక ఉందని? యం. ఎ. యల్.యల్.బి. ఫస్ట్లుక్లాసులో ప్యాసయ్యారు.

గో:- కదుమరి.

పా:- (గోవిందువంక తీక్షణంగా చూస్తాడు. గోవిందు నోరు మూసుకొంటాడు) ఆఁ, ప్యాసయ్యాడు వారభోజనాలు తిని, పీఢి దీపాల క్రింద చదివి. దానికే మురిసిపోవాలా?

కృష్ణ:- ఆ విషయం వారికిచ్చిన డిగ్రీలో వ్రాయలేదులెండి.

పా:- అవునవును. మాటలు బాగా నేర్చావు. మొత్తానికి వకీలు భార్యవని పించుకొన్నావు. (దగ్గి) కృష్ణా, నేను నీ మేలుకోరే చెప్పుతున్నాను. అయినా నా కెందుకొచ్చిన బాధ? ఊరు పొమ్మంటుంది. ఏరు రమ్మంటుంది.

గో:- కదుమరి.

కృష్ణ:- మీరు చెప్పదలుచుకుందేదో సూటిగా చెప్పితే సరిపోతుందిగా. ఎత్తి పొడుపు మాటలు దేనికి?

పా:- ఎత్తిపొడుపు మాటలా నాని? అంతేనమ్మా అంతే. నా బాధ నీకెలా అర్థమవుతుండీ? (దగ్గి) ఆయనగారి డిగ్రీలు చూచి నీవు మురిసి పోతున్నావు కాని, డిగ్రీ సంపాదించినంత తేలికా కాదమ్మా డబ్బు సంపాదించడం. అయినా నా కెందుకులే! ఊరు పొమ్మంటుంది, ఏరు రమ్మంటుంది.

కృష్ణ:- ఓహో!. వారు డబ్బు సంపాదించడంలేదనా మీ బాధ నాన్నా? మన కిప్పుడున్నది చాలదా? ఇంకా ఎందుకు నాన్నా, మనకు ఆ పాపిష్టి డబ్బు?

పా:- ఏమిటీ, డబ్బు పాపిష్టిదా? డబ్బు పాపిష్టిదా? ఏన్నావట్రా గోవిందా! డబ్బు పాపిష్టిదట.

గో:- కదుమరి...కదుమరి.

పా:- ఓరి వెధవా. ఆ డబ్బు కోసమే కదరా నీ పీ బాకిరియంతా చేస్తుండేది?

గో:- కదుమరి...ఈ పాపిష్టి పనులన్నీ చేస్తుండేది ఆ పాపిష్టి డబ్బు కోసమే కదయ్యా! (సంచితో లోనికి వెళతాడు. కృష్ణవేణి పకపక నవ్వుతుంది)

పా:- కృష్ణా, నేను ఇన్నాళ్ళు నానాగడ్డితిని సంపాదించుంది మీ రిద్దరూ తూర్చొని తినడానికి కాదు. మీ ఆయనకు గట్టిగా చెప్పు.

కృష్ణ:- యేమని?

పా:- డబ్బు సంపాదించమని.

కృష్ణ:- సంపాదించకపోతే?

పా:- సంపాదించకపోతే! ఆ!...ఏమిటా ప్రశ్న...(దగ్గుతాడు) సంపాదించకపోతే—

కృష్ణ:- ఎక్కడికైనా వెళ్ళి ప్రభవమంటాము. అంతేనా? మీ కంత కష్టంగా ఉంటే చెప్పండి, ఇప్పుడే వెళ్ళిపోతాము.

పా:- ఏమిటి. మిమ్మల్ని వెళ్ళనుంటానా? మిమ్మల్ని-ఎందుకే నన్నిలా అపార్థం చేసుకొంటావు. (దగ్గి) హూఁ? - ఇంతకీ నా ఖర్మ... మీ అమ్మ ఏ నాడు పోయిందో ఆ నాటినుంచే నాకు మనశ్శాంతీ లేకుండా పోయింది. అయినా నా కెందుకొచ్చిన బాధ, నే నెన్నాళ్ళు బ్రతకబోతాను? ఊపు పొమ్మంటుంది, ఏరు రమ్మంటుంది. శ్రీహరి...శ్రీహరి...

శ్రీ:- ఏం మావయ్యా!

కృష్ణ:- ఏమండీ, మీరు లోనికెళ్ళండి.

శ్రీ:- ఏం?

కృష్ణ:- అబ్బ వెళ్ళుదురూ.

శ్రీ:- అలాగే వెళతానుగాని, కాసిని కాఫీ నీళ్లు నా ముఖాన పడెయ్యమని చెప్పి ఎంతసేపయింది?

కృష్ణ:- తెస్తాను. (లోని కెళ్ళబోతుంది)

శ్రీ:- కృష్ణా! ఏమిటా కన్నీరు.

కృష్ణ:- ఏమిలేదండి, అమృతాంజనం...

శ్రీ:- అమృతాంజనం కళ్ళలో పెట్టుకొన్నావా?

కృష్ణ:- అవునండి. (లోనికెళ్ళుతుంది)

శ్రీ:- (నవ్వుతూ) మామయ్యా, కృష్ణవేణి వట్టి పిచ్చిది మామయ్యా!

పా:- అవును. పిచ్చిది కాకపోతే నిన్నెందుకు పెళ్ళి చేసుకొంటుంది?

శ్రీ:- కరెక్టు మామయ్యా! వాట్! ఏమన్నారు?

పా:- ఏమీలేదు. (ఆలోచనలో వుంటాడు)

శ్రీ:- యేమిటి మామయ్యా, అలా దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నారు!

పా:- నా కార్డాన్ని గురించి.

శ్రీ:- ఓ అదా! దానికేముంది మామయ్యా! మీరు తలచుకొంటే ఏదైనా దర్జాగా చేసెయ్యగలరు...వాట్, ఏమన్నారు?

పా:- యేమంటానా! నా నెత్తిన కొరివి పెట్టమంటాను.

శ్రీ:- మామయ్యా! ఇలాంటి మాటలు మాట్లాడవద్దని మీకు లక్షసార్లు బల్లగుద్ది చెప్పాను.

పా:- అక్కడ కోర్టులో గుద్దుతున్నావు చాలదూ, ఇక్కడకూడా ఎందుకు? ఇదిగో శ్రీహరీ! నీ వ్యవహారం నాకేమీ నచ్చడం లేదు.

శ్రీ:- ఏమో అంత నచ్చకపోవడం.

పా:- కారణాలు చెప్పమన్నావా?

శ్రీ:- చెపితే వద్దన్నానా?

పా:- అయితే చెపుతాను విను. 1. నీవు ప్రాక్టీసుపెట్టి 6 మాసాలయినా నయాపైసా సంపాదించలేదు. 2. కూలీనాలీ చేసుకొనే దరిద్రపు గుంపును వెనుకవేసుకొని వాళ్ళ కేసులకు వకాల్తా పుచ్చుకొని వాదించి గెలవడంద్వారా ఊరి పెద్దలకంతా నీమీద ద్వేషం ఏర్పడింది. 3. నిన్ను ఆదుపులో పెట్టలేదని వాళ్ళంతా నామీద విరుచుకపడుతున్నారు. 4. నీ ప్రవర్తన వలన నా పరపతి, పలుకుబడి దెబ్బతిన్నది. 5...

శ్రీ:- స్టాప్. ఫుల్‌స్టాప్ మామయ్యా! ఇప్పుడు మీరు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పనీయండి. మరలా ఆరోపిస్తురుగాని. చూడండి, నేను ఆరు మాసాలనుండి ప్రాక్టీసు చేస్తున్నాను. ఈ ఆరు మాసాలలో నేను చేపట్టిన ప్రతి కేసు గెల్చాను. కోర్టులో నా వాదనలు విన్న వారంతా సెహబాష్ అన్నారు. ఇక డబ్బు విషయమంటారా, నా దగ్గరకు వచ్చిన పార్టీలన్ని పేదవి గనక కొన్ని సందర్భాల్లో స్టాంపు ఖర్చులు కూడా నేనే భరించుకున్నాను. రెండు-నేను న్యాయవాదిని. న్యాయాన్ని అన్యాయంగా, అన్యాయాన్ని న్యాయంగా వాదించడం నా అభిమతం కాదు. అందువలన ఊరి పెదలకు నా మీద ద్వేషం కలగవలసిన అవసరం లేదు. మూడు - నేను మీ అల్లుడనైనంత మాత్రాన మీ అదుపాజ్ఞలలో ఉండాల్సిన అగత్యం లేదు. నా మూలంగా మీ పరపతి, పలుకుబడి దెబ్బ తినాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఇక కానివ్వండి.

పా:- మాటకు మాట జవాబు చెప్పడంకాదు నాకు కావలసింది. నీ పద్ధతులు మార్చుకుంటావా లేదా?

శ్రీ:- ఏ పద్ధతులు?

పా:- శ్రీహరి! నీవు డిగ్రీలు సంపాదించావని, పేరు ప్రఖ్యాతులు సంపాదించుతున్నావని వుబ్బితబ్బిబ్బౌతున్నావు. యీ రోజుల్లో ఆడవాళ్ళు కూడా డిగ్రీలు సులభంగా సంపాదిస్తున్నారు. డిగ్రీలు సంపాదించినంత సులభం గాదయ్యా, డబ్బు సంపాదించడం.

శ్రీ:- మావయ్యా! డబ్బుకోసం గడ్డి తినడం నా వేషగాదు. అక్రమ సంపాదనకు నన్ను ప్రోత్సహించవద్దని మీకు లక్షసార్లు విన్నగుద్ది చెప్పాను.

పా:- డబ్బులేనివాడు డబ్బుకు కొరగాదని నేనుకూడా యీ పరుషమీద గుద్దిగుద్ది చెప్పగలను. (దగ్గు) శ్రీహరి, నన్నెందుకిలా బాధ పెడతావ్? నేనింక ఎన్నాళ్ళు బ్రతుకుతాను? ఊరు పొమ్మంటుంది, యేరు రమ్మంటుంది. ఈ అవసానకాలంలోనైనా ప్రశాంతంగా ఉండనివ్వవా?

శ్రీ:- అయితే, మీ ఇష్టానుసారంగా నడుచుకొని డబ్బు సంపాదించమంటారు.

పా:- అవసరంలేదు కాని, నా సొంత వ్యవహారాల్లో మాత్రం జోక్యం కలుగజేసుకోకుంటే అంతేచాలు.

శ్రీ:- మీ స్వంత వ్యవహారాల్లో నేనేమీ జోక్యం కలుగచేసుకోలేదే!

పా:- ఎందుకయ్యా, అట్లా పచ్చి అబద్ధాలాడ్తావ్? మన ఊరి చెరువు పూడిక తీయాలని మేమంతా నిర్ణయించుకొన్నాం. అలా పూడిక తీస్తే ఎక్కువ నీరు నిలుస్తుంది. ఎక్కువ పంటలూ పండుతవి. మన వూరూ బాగుపడుతుంది.

శ్రీ:- అందుకు కావలసిన పైకం దాదాపు లక్షరూపాయలదాకా రైతులవద్ద వసూలు చేశారుగా.

పా:- చేశాము. కాని మన వూరి చెరువు వూడిక తీస్తే రామాపురం చెరువుకు నీరు చాలదని ఆ వూరి రైతులు ఆడ్డు తగిలేరుగా.

శ్రీ:- తరువాత వారు రాజీపడ్డారుగా. వూడిక తీసుకోమన్నారుగా. లోతు పెంచుకోమన్నారుగా.

పా:- ఆదే ఆదే. వాళ్ళనలా రాజీపడేటట్లు చేసింది నీవుకదు. నీకెందు కొచ్చిన బాధ. ఆదేదో మేము కోర్టులో తేల్చుకోలేకపొయ్యామా?

శ్రీ:- ఆదా మీ బాధ మామయ్యా! యేది నీరు మన చెరువేకాదు, రామాపురం చెరువేకాదు, సక్రమంగా ఉపయోగించుకొంటే యిలాంటి చెరువులు 10 అయినా నిండిపోతాయి. ఆ విషయం వారికి వివరించి చెప్పాను. అందుకు వారు సమ్మతిపడి రాజీ పడ్డారు. పైగా యీ స్వల్ప విషయానికి కోర్టుకెక్కి గ్రామ డబ్బును పాడుజెయ్యడం ఏం బాగుంటుంది? అంతేనా? దీనివల్ల గ్రామాల మధ్య కక్షలు పెరిగి ఎంత అనర్థానికి దారితీస్తుందో వూహించగలమా? ఇదంతా ఆలోచించే వాళ్ళను రాజీపడేటట్టు చేశాను. నేను మంచే చేశానుగాని చెడ్డ చెయ్యలేదే.

పా:- చెయ్యలేదు? ఆ విధంగా రామాపురం వాళ్ళని రెచ్చగొట్టింది నేనేనని చెప్పలేదూ?

శ్రీ:- నేనా? ఎందుకు మామయ్యా, అలా బుజాలు తడువుకొంటూ నా మీద అభాండాలు వేస్తారు?

పా:- నేనా? బుజాలు తడువుకొంటున్నానా? నేన? శ్రీహరి! పిల్లి కళ్ళు మూసుకొని పాలు త్రాగుతూ తన్నెవరూ చూడటం లేదనుకొంటుందట. ఇది వూరుగాని, అడివికాదు. నీవు నా మీదచేసే దుష్ప్రచారమంతా యెప్పటికప్పుడు నాకు తెలుస్తూనేవుంది. ఈ వూరిలో కాలేజీ పడకుండా పోవడానికి కారణం నేనేనని చెప్పుతున్నావటగా. వూరి పెద్దలంతా కలిసిరాకపోతే నేనేం చేసేది? పైగా నేనే వాళ్ళల్లో ఐకమత్యం లేకుండా చేస్తున్నానని ప్రచారం చేస్తావా? ఇదిగో శ్రీహరీ! ఆఖరిసారిగా చెప్పుతున్నాను. అనవసరంగా నన్ను గురించి చెడ్డగా ప్రచారం చేస్తే మాత్రం బాగుండదు.

శ్రీ:- ఎందుకు మామయ్యా, అనవసరంగా ఉద్రేకపడతారు? మీరనుకొంటు న్నంత చెడ్డగా నేనేం చేయడంలేదే?

పా:- శ్రీహరీ! నేను కృష్ణవేణినికాను నీ మాయమాటలకు మోసపోయి నీ వలలోపడి దొంగతనంగా పెళ్ళి చేసుకోడానికి. నేను పాప య్యాను. నా తాహత్తుకు తగ్గ ఇల్లుడివి కాకపోయినా, మీ పెళ్ళి నా కిష్టం లేకపోయినా, జరిగిందంతా మర్చిపోయి నిన్ను అలాణిగా స్వీకరించి నీ గౌరవానికి యే లోటు రాకుండా చూచుకొంటున్నాను. ఆ గౌరవాన్ని తుదివరకూ కాపాడుకుంటావో లేదో త్వరగా నిర్ణ యించుకో. (అని దగ్గుతూ విసురుగా లోనికి వెళ్ళాడు)

శ్రీ:- (కోపంగా చూస్తూ ఆటూ ఇటూ తిరుగుతూ సిగరెట్టు కాల్చి పారే స్తుంటాడు)

కృష్ణ:- (కాఫీ కప్పుతో ప్రవేశించి) కాఫీ తీసుకోండి.

శ్రీ:- ఊఁ! మీ నాన్నగారు నాకు గొంతుదాకా టిఫిన్ పెట్టారు. నీవేమో కాఫీ తీసుకోండి అంటూ వచ్చావ్. తీసుకోడానికి సందేది?

కృష్ణ:- ఏమిటండి, నామీద అనవసరంగా కోప్పడుతున్నారు?

శ్రీ:- అనవసరంగా కోప్పడుతున్నానా? అవును. నీకలాగే అనిపిస్తుంది. అయినా నా కోపానికేంలే. పేదవానికోపం పెదవికి చేటన్నారు.

కృష్ణ:- మిమ్మల్నిప్పుడు పేదవాడని యెవరన్నారు? కాస్త కాఫీ ఆలస్యా మైనందుకే ఇలా ఎత్తిపొడవాలా? ఈ ఇంటిలో నన్నెవరూ అర్థం చేసుకోరు. అంతా బాధపెట్టేవాళ్ళే. (ఏడుస్తుంది)

శ్రీ:- అది, అది మీ ఆడవాళ్ళకు చేతనైంది అంతేగా, చీటికి మాటికి భోరుమని యేడవడం, గోడలన్ని ఖరాబు చేయడం.

కృష్ణ:- అవునవును. మీ మగాళ్ళకున్న వోర్పు మాకెలా వస్తుంది.

శ్రీ:- ఓర్పు అనేదానికి కొంత పరిమితి వుంది. కృష్ణా! మీ నాన్నగారి గుణ్ణాన్ని కాస్త ఆదుపులో పెట్టుకోమని చెప్పు. లేకపోతే వ్యవ హారం చెడుతుంది.

కృష్ణ:- ఏమండి, కాస్త కాంతించండి. వారి ఆరోగ్యం యేమీ బాగులేదు. నిన్నటి నుండి బ్లడ్ ప్రెషర్ యెక్కువైంది.

శ్రీ:- ఉబ్బసం, వడవేవం, కీళ్ళనొప్పులు, వివ్వవాతం, పైత్యం ఒక్క టేమిటి-అన్నీ ఉన్నాయి. ఉన్నవాడు మందులతీటూ మంచంలో పడుండక యీయనగారి కెందుకో ఊరి పెత్తనం? బహిరంగ సభల్లో దేశాభివృద్ధిని గురించి, పట్టణాభివృద్ధినిగురించి గొంతులు చించుకునేటట్లు ఉపన్యాసాలిచ్చేది, చాటున చేరి ప్రతి మంచి పనికి ఆడ్డుపుల్లలు వేసి పాడు చేసేది. ఛీ, ఛీ. ఏం మనుషులా, ఏం మనస్తత్వాలు. ఇక దేశం బాగుపడాలంటే యెలా బాగుపడుతుంది? ఎప్పుడు బాగుపడుతుంది?

కృష్ణ:- ఇప్పుడేం జరిగిందండీ?

శ్రీ:- ఘన సన్మానం జరిగిందండి. ఘన సన్మాన. నేను వ్యాపైసా సంపాదించడం లేదట, దండుగ తిండి తింటున్నానట, ఆయనగారి మీద దుష్ప్రచారం చేసి ఆయనకున్న పరపతిని, పలుకుబడిని దెబ్బ తీస్తున్నానట. ఆయన అవమానం చాలుగాని బయలుదేరు. దూరంగా ఉండి గౌరవంగా బ్రతుకుదాం.

కృష్ణ:- ఏమండి, ఈ పరిస్థితిలో నాన్నగారిని వదిలి దూరం పోవడం ఏమన్నా బాగుంటుందా. అమ్మే బ్రతికుంటే నాన్నగారి మంచి చెడ్డలన్నీ అమే చూచుకొనేది. ఆయన కెవరున్నారు. మనమేగా!

శ్రీ:- ఆ ఇంగితజ్ఞానం ఆయనకుండొద్దు. కృష్ణా! నిన్ను కోరి, ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు బాగా సుఖపడుతున్నాను.

కృష్ణ:- (మనస్సు చివుక్కుమంటుంది) అవును, నన్ను చేసుకున్నందు వల్ల మీరేమి సుఖపడటంలేదు. (మన పెళ్ళి జరక్కుంటేనే బాగుండేది. (కన్నీరు కారుస్తుంది)

శ్రీ:- ఆఁ, అది మాట కృష్ణా! ఈ చిన్నమాటకే నీవు యింతగా గుంజు కొంటున్నావే? మీ నాన్న నన్ను ఇంతింతమాట లన్నాడే, నేనెంత ఇరైపోవాలా, నా వళ్ళు ఎంత యిదిగా మండిపోవాలా?

కృష్ణ:- దీనికంతా కారణం నేనేగా. నన్ను కొట్టి మీ కోపాన్ని చల్లార్చు కోండి.

శ్రీ:- ఆహా...బాగుంది ... బాగుంది — కృష్ణా! అనవసరంగా గంట గంటకు మీ నాన్నగారిచేత మందలెందుకు మింగిస్తావ్, ఆ మందు లేవో నీవే మింగితే పోలా?

కృష్ణ:- చాల్లెండి మీ పరిహాసం. నేను మందులు మింగితే మా నాన్న జబ్బు నయమవుతుందా?

శ్రీ:- మరి నిన్ను కొట్టితే మీ నాన్నకు బుద్ధివస్తుందా?

కృష్ణ:- అయితే మా నాన్నగారినే కొడతానంటారా?

శ్రీ:- ఆ మాటెవరన్నారు? ఏమేయ్, కొంపదీసి మమ్మల్నిద్దర్నీ కొట్లాటకు దింపేటట్లున్నావ్.

కృష్ణ:- చాల్లెండి...(నవ్వు) మీ కోపం చల్లారిందిగా ... కాఫీ తీసుకోండి. (ఇద్దరూ చిలిపిగా చూచుకొంటారు. పాపయ్య దగ్గుతూ ప్రవేశించి, వారిని తీక్షణంగా చూస్తూ మంచంపై అగ్గిపెట్టె వెతుకుతుంటాడు)

కృష్ణ:- యేం నాన్నా, యేం కావాలి?

పా:- రెండు చుక్కలు విషం కావాలి.

శ్రీ:- నాగుపాము కోరలు పిందండి.

పా:- పాలపోసి పెంచుతున్నానుగా. (విసురుగా లోనికెళతాడు. కృష్ణవేణి తండ్రి వెళ్ళినవైపే తీక్షణంగా చూస్తూ వుంటుంది)

శ్రీ:- కృష్ణా, శాంతించు-శాంతించు, ఆయనగారి ఆరోగ్యం యేమీ బాగు లేదు. ఊరు పొమ్మంటుంది, యేరు రమ్మంటుంది. ఇవాళగాక పోయినా రేపైనా వెళ్ళవలసినవారే,

కృష్ణ:- అబ్బబ్బ, మీ యిద్దరి మధ్య నేను నలిగి చస్తున్నాను బాబు.
(వాకిట్లో బిచ్చగాడి పాట వినిపిస్తుంది)

బిచ్చ:- ఎవరుచేసిన ఖర్మ వారనుభవించక
యేరికైనను తప్పదన్నా

యేనాడు యేతీరు ఎవరు చెప్పాగలరు
అనుభవించుట తథ్యమన్నా

శ్రీ:- గోవిందా...గోవిందా?

గో:- అయ్యా!

శ్రీ:- బయట బిచ్చగాడురా?

గో:- బిచ్చమెయ్యమంటారా! అమ్మో అమ్మో! అయ్యగారికి తెలిస్తే యింకేమన్నా వుందా? నా పీపు చిల్లిపోదూ?

కృష్ణ:- నోరు మూయరా చవటా, నాన్నగారంటే నీకు చులకనైపోయింది.

గో:- కదుమరె, కదుమరె.

శ్రీ:- ఒరేయ్ గోవిందా...యిందా, యీ ఆయిదు నయాపైసలు తీసుకెళ్ళి యిచ్చిరా.

గో:- సరేనయ్యా!

కృష్ణ:- కాఫీ తీసుకోండి. చల్లారిపోతున్నాయి.

శ్రీ:- కృష్ణా, యిద్దరం త్రాగుదాం fifty, fifty.
(కాఫీ సాసర్లో సగం పోస్తాడు. ఇద్దరూ చిలిపిగా నవ్వుకొంటూ త్రాగబోతారు. లోపలనుండి పాపయ్య, కృష్ణా, కృష్ణా అని కేకలు)

కృష్ణ:- వస్తున్నా నాన్నా! (అంటూ కాఫీ త్రాగకుండానే పరుగు తీస్తుంది. శ్రీహరి కప్పు క్రింద పెట్టి చికాకుగా సిగరెట్టు కాలుస్తుంటాడు)

గో:- (ప్రవేశించి కాఫీ చూచి) కాఫీ తాగలేదేమయ్యా?

శ్రీ:- చప్పగా చల్లారిపోయినయ్. తీసుకెళ్ళి కుడితి తొట్టిలో పోయి.

గో:- కుడితి తొట్టిలో యెందుకయ్యా, యీ తొట్టి ఖాళీగానే వుందిగా! (అంటూ తన పొట్టను చూపించి కాఫీకప్పు లోనికి తీసుకెళతాడు. శ్రీహరి వాడివంక ఆశ్చర్యంగా చూస్తూ వుంటాడు. కృష్ణవేణి ప్రవేశం)

కృష్ణ:- ఏమండీ, కాఫీ త్రాగరా?

శ్రీ:- ఎందుకూ! ఒకేసారి భోంచేస్తే సరిపోతుందిగా?

కృష్ణ:- నేనలా వెళ్ళానని నా మీద కోపమొచ్చిందా?

శ్రీ:- కోపమెందుకు ?

(లోపల్నుంచి కృష్ణా, కృష్ణా అని పిలుపు)

కృష్ణ:- అబ్బబ్బ! కృష్ణా, కృష్ణా.

శ్రీ:- విసుగుపడకు. ఆలా జపిస్తే కాస్త పుణ్యమైనా లభిస్తుంది. ఇంతకూ ఆయన లోపల ఏం చేస్తున్నట్టు?

కృష్ణ:- యేమిటో బీరువాలోని కాగితాలన్నీ వెతుకుతున్నాడు. కృష్ణా అని పిలుస్తాడు. ఏం నాన్నా అంటే యేమీ లేదంటాడు. ఆరోగ్యం సరిగ్గా లేదు కదా, మంచం మీద పడుకొని విశ్రాంతి తీసుకోకూడదూ? ఆ చిత్తు కాగితాలన్నీ కట్టబెట్టి కూర్చోకపోతే.

శ్రీ:- అవి చిత్తుకాగితాలు కావు కృష్ణా, రికార్డు, పాపయ్యగారి పాపాల చిట్టా. అయినా యిప్పుడు ఆయనగారు ఏమి వెతుకుతున్నట్టు? ఓ, ఈ రోజు కాలేజీ కమిటీ మీటింగు వున్నది. దానికి కావలసిన మందుగుండు సామగ్రి అంతా తయారు చేస్తున్నట్టుంది. మన వూరిలో కాలేజీ పడకుండా చేయడానికి మీ నాన్నగారు పడుతున్న తాపత్రయం అంతా యింతా కాదు.

కృష్ణ:- కాలేజీ అధ్యక్షులు ఆయనేగా, కాలేజీ పడకూడదని ఆయన కెందుకుంటుంది?

శ్రీ:- ఆ విషయం మీ నాన్నగారినే అడుగు.

కృష్ణ:- నాకు తెలుసులెండి. ఊరిపెద్దలే కలిసి రావడంలేదు. మా నాన్నగారేం చేస్తారు?

శ్రీ:- అవునవును. ఆయనగారేం చేస్తారు మరి.

(లోపల్నుండి కృష్ణా, కృష్ణా)

కృష్ణ:- వస్తున్నా నాన్నా! (వెళుతుంది)

(శ్రీహరి కృష్ణవేణి వెళ్ళినవైపే చూస్తూ వుంటాడు. అయటనుండి ప్రసాదు ప్రవేశం.)

ప్రసాద్:- హల్లో శ్రీహరీ, ఏమిటలా దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?

శ్రీ:- ప్రసాదుబాబా! రావయ్యా రా. కూర్చో. ఏమిటి, మరీ కనిపించడమే మానివేశావు?

ప్ర:- ఏం చెయ్యను! బాధ్యతలు ఆలా వున్నై. నాన్నగారు పోయారు. ఇంటి వ్యవహారం, వ్యాపారం, వ్యవసాయం అన్ని నేనే చూసుకోవాలి.

శ్రీ:- అవును. మీ నాన్నగారే బ్రతికుంటే యీ పాటికి నీవు ఉన్నత విద్యకై అమెరికాకు వెళ్ళి వుండేవాడివి.

ప్ర:- అవును శ్రీహరీ! ఉన్నతవిద్యకై అమెరికానుండి ఆహ్వానం, నాన్నగారు పోయారని టెలిగ్రాం రెండూ ఒకేసారి వేతికందాయ్. ఆ నాడు నేను...

శ్రీ:- వద్దు ప్రసాద్! చెప్పొద్దు. గతాన్ని తలుచుకొని బాధపడొద్దు. ఆశలు అందరికీ వుంటాయికాని, అవకాశాలు కొంతమందికే లభిస్తాయ్.

ప్ర:- అంతేకాదు. ఆ అవకాశాలు లభించిన కొంతమందిలో నాలాంటి దురదృష్టవంతులు కూడా కొంతమంది వుంటారు బ్రదర్!

శ్రీ:- ఆదీ నిజమే, అవును, యిప్పుడు నీవు నాకోసం వచ్చావా, లేక మా మామగారి కోసం వచ్చావా?

ప్ర:- మీ యిద్దరికోసం. ఈ రోజు కాలేజీ కమిటీ మీటింగు వుందిగా. మర్చిపోయావా?

శ్రీ:- నేనెందుకు మర్చిపోతాను?

ప్ర:- శ్రీహరీ! యేమైనాగాని, యీ సంవత్సరం కాలేజి నిర్మాణం జరిగి తీరాలి. మా నాన్నగారి ఆశయం నెరవేరాలి.

శ్రీ:- నెరవేరాల్సిందే కాని, మా మామగారు...

ప్ర:- యేం? మీ మామగారు సుముఖంగా వున్నారే!

శ్రీ:- యేమిటేమిటి, సుముఖంగా వున్నారా! wait, wait (అని బయటి వాకిలివైపు వెళ్ళి చూచివస్తాడు)

ప్ర:- యేమిటది?

శ్రీ:- ఆఁ...ఏమీలేదు. సూర్యుడు యే దిక్కున వుదయించాడాని చూచి వస్తున్నా. తూర్పు దిక్కునే ఉదయించాడు.

ప్ర:- బలేవాడివి శ్రీహరీ, నీవు.

శ్రీ:- అవును బ్రదర్! మా మావగారు సుముఖంగా వున్నారు అంటే సూర్యుడు పడమటి దిక్కున వుదయించాడన్నమాటే.
(పాపయ్య ప్రవేశం)

పా:- ప్రసాద బాబుగారా!

ప్ర:- నమస్కారమండీ!

పా:- నమస్కారం. కూర్చోవయ్యా, కూర్చో (దగ్గు)

ప్ర:- ఆరోగ్యం బాగా లేనట్లుంది.

పా:- ఇంకెక్కడి ఆరోగ్యం? 60 యేండ్లు దాటాయి. ఊరు పొమ్మంటుంది, ఏరు రమ్మంటుంది. అయినా, నే నింకెన్నాళ్ళు బ్రతుకుతాను? కాని ప్రసాదబాబూ, మీ నాన్నగారు చాలా అదృష్టవంతులయ్యా. మాట్లాడుతూనే కన్నుమూశారు.

శ్రీ:- అలాంటి మంచి చావు మనబోటి పాపాత్ములకు రాదు మామయ్యా!

పా:- అదేనయ్యా, నేను చెప్పేది (దగ్గుతాడు)

ప్ర:- చాల నీరసంగా వున్నారు.

శ్రీ:- నిమ్మరసం త్రాగుతూనే వున్నారు. (పాపయ్య తీక్షణంగా చూస్తాడు) మందులు కూడా గంట గంటకు వాడుతున్నాము. కాని వారికి అన్నిటికంటె విశ్రాంతి చాల అవసరం. సారీ, మీరు మాట్లాడుతూ వుండండి. నేనిప్పుడే వస్తాను. (లోనికెళతాడు)

ప్ర:- పాపయ్యగారూ, ఈ రోజైనా కమిటీ మీటింగులో మనం సరియైన నిర్ణయం తీసికొని కాలేజీ నిర్మాణానికి పూనుకోవాలి.

పా:- దానికోసరమేగదయ్యా నే నింకా బ్రతికే వున్నాను. మీ నాన్న గారిని కాలేజీ నిర్మాణానికి పూనుకొనేటట్లు ప్రోత్సహించింది నేనేగా. కాని వారి ఆశయం నెరవేరకముందే కన్ను మూశారు.

ప్ర:- అదేనండీ నేనూ చెప్పేది. కాలేజీ నిర్మాణం జరిగితే నాన్నగారి ఆశయం నెరవేరుతుంది. వారి ఆత్మకు శాంతి లభిస్తుంది.

పా:- అదేనయ్యా నా తాపత్రయంకూడా. కాని ప్రసాదుబాబూ, మన వూరికి కాలేజీవస్తే బాగుపడేదెవరు?

ప్ర:- అదేమిటండీ అలా అంటారు? కాలేజీ చదువు అందుబాటులో లేక ఎంతమంది బాధపడుతున్నారో మీకు మాత్రం తెలియదూ?

పా:- ఆ తెలివి వారికుండొద్దూ? మనమేదో స్వార్థంతో చేస్తున్నామని ప్రచారం మొదలెట్టారు. మనకెందుకొచ్చిన బాధ?

ప్ర:- ఎవరో విమర్శించారని మన ప్రయత్నం మానుకొంటామా?

పా:- మానుకోక చేసేదేముంది? విమర్శ లొచ్చేటప్పటికి విరాళా లిచ్చే వాళ్ళంతా వెనక్కెళ్ళారు. మా పిల్లల్ని పట్నం పంపించి చదివించు కొంటాం, కాలేజీ లేకపోతే మూసొచ్చే ముప్పందేమి లేదు అంటు న్నారు. ఇక మీ నాన్నగారిచ్చిన రెండు లక్షల రూపాయలతో కాలేజీ నిర్మాణమెలా జరుగుతుంది?

ప్ర:- పాపయ్యగారూ! పెద్దలు విరాళాలు యివ్వకపోతే ముంగిపోయిందేమీ లేదు. కాలేజీకి కావలసిన ఖర్చంతా నేనే భరించుకొంటాను. ఇక ఆ స్థలాన్ని మంజూరు చేయించడానికి అందరినీ ఒకదారికి తీసుకొని రండి.

పా:- అదే సాధ్యం కావడంలేదు. గ్రామదేవత జాతర అక్కడే జరుగు తుందని...

ప్ర:- జాతరా! అలాంటిది నాకు తెలిసి ఎప్పుడూ జరగలేదే!

పా:- నా చిన్నతనంలో, నేను పీఠిబడిలో చదువుకునేటప్పుడు జరిగింది. జాతరంటే మాటలా! ఆ రోజుల్లోనే 10 వేల రూపాయలు ఖర్చు

పెట్టేవాడు. ఈ రోజుల్లో అయితే లక్షలు పైబడుతుంది. ఇకపోతే గ్రామపకువులు చేరటానికి అదే, పిల్లలు ఆడుకోవడానికి అదే, బహిరంగ సభలకు అదేనాయె. అంత ముఖ్యమైన స్థలాన్ని కాలేజీ కివ్వడానికి ఎవ్వరూ వొప్పుకోవడంలేదు. కందకు లేని దురద కత్తిపీట కెందుకయ్యా?

ప్ర:- అయితే మన ప్రయత్నం మానుకోవడమే మంచిదంటావా?

పా:- నన్నేం చెయ్యమంటావ్? (కాస్త ఆలోచించి) ప్రసాద్! ఇంకొక పని చెయ్యరాదూ?

ప్ర:- ఏం చెయ్యమంటారు?

పా:- నీవు కాలేజీకి ఖర్చు పెట్టదల్చుకొన్న డబ్బుతో తిరుపతిలో సలక్షణమైన వొక సత్రం కట్టించు. ఇటు పేరూ వస్తుంది. అటు పుణ్యమూ వస్తుంది. ఏమంటావ్?

ప్ర:- ఏమిటండి మీరు చెప్పేది? మన డబ్బుతో మన వూరు బాగుపరచుకోవడం మాని, తిరుపతిలో సత్రం కట్టించమంటారా?

పా:- నాకు తోచింది నేను చెప్పాను. అయినా, నాకెందుకొచ్చిన బాధ చెప్పు? ఊరు పొమ్మంటుంది, యేరు రమ్మంటుంది. నేనింకెన్నాళ్ళు బ్రతుకుతాను?

ప్ర:- మీకలా నిరుత్సాహపడితే యెలా? మీరు కాస్త గట్టిగా ప్రయత్నిస్తే గ్రామ పెద్దలందరూ ఆ స్థలా లివ్వడానికి తప్పక వొప్పుకుంటారు.
(రంగనాథం ప్రవేశం)

రంగ:- అదేం యీలు పడేటట్టు లేదయ్యా!

ప్ర:- నమస్కారమండి రంగనాథంగారూ!

రంగ:- నమస్కారం. పాపయ్యా! అయినా మన వూళ్ళోవుందే. యెటు బడితే అటేకయ్యా, వొట్టి గొట్టె గుంపు. కాలేజీ లేకపోవడంవల్ల కానా యిబ్బందిగా వుండావని వొకపక్కంటారు. కాలేజీ కడదామంటే యీలుపడదంటారు. ఏందిది?

పా:- రంగనాథం! మన వూరివాళ్ళ విషయం నీకు సరిగ్గా తెలియదయ్యా!

రంగ.- యేంది? నాకు తెలియదా? నాకు తెలియదా? ఆహాఁ...నాకు తెలియదాని, యీ పంగనామాల రంగనాథానికి తెలియంది యీ పెపంచకంలో వుందాని? నాకు తెలియపంటావా? ఇదిగో పెసాదుబాబూ! పెపంచకం తలకిందులె నా సరే, కాలేజీ పని జరిగి తీరుతుంది. నే నుండాను పోవయ్యా. నీకేమీ పరవాలేదు. మీటింగులో తేల్చేస్తాం పో.

ప్ర:- అదేనండీ నాక్కూడా వున్నది. (పాపయ్యతో) మీరు మీటింగుకు తప్పక రావాలి.

రంగ:- ఆయన్నేందయా నువ్వు పిల్చేది. ఉప్పులేని పప్పు, పప్పులేని పెళ్ళి యేం బాగుంటది? పాపయ్య పెసిడెంటైపోయినే కమిటీకి. ఆయన రాకుండా మీటింగెట్టా జరగుద్దే. వస్తాము పోవయ్యా, నీకా దిగులే వద్దు.

ప్ర:- ఇక నేను శెలవు తీసుకుంటానండి.

పా:- అలాగే, వెళ్ళిరా నాయనా! (ప్రసాదు వెళ్ళిపోతాడు).

పా:- (కోపంగా) రంగనాథం! తెలిసితెలియకుండా మాట్లాడవద్దని నీకెన్ని సార్లు చెప్పాను?

రంగ:- నాకు తెలియదా, నాకు తెలియదా. ఆహాఁ నాకు తెలియదాని? నాకు తెలియదంట్నా, పాపయ్యా! 80 యేళ్ళకుండి యీ వూరిని డాయింటుగా యాంతుండమే మనిద్దరమూ. నీ సంగతి నాకు తెలియదా, నా సంగతి నీకు తెలియదా?

పా.- ఏమిటయ్యా నీకు తెసింది? కాలేజీ కట్టి తీరతామని మహా ధైర్యంగా చెప్పేశావే. ఏమిది నీ వుద్దేశం? అప్పటికి నీవు చాలా సమర్థుడవై నట్లు, నేనేమి చేతగానివాడినై నట్లూ కా?

రంగ:- అయితే నీవేమో కాలేజీకోసం పాపులాడుతున్నట్లు, మేమంతా పడగొట్టున్నట్టా నువు చెప్పేది?

పా:- నేనన్నా నా మాటా?

రంగ:- నేనుమాత్రం ఏమన్నాను?
(రామరాజు ప్రవేశం)

రామ:- అబ్బెబ్బెబ్బె, ఏమిటయ్యా ఇది పసిపిల్లల్లాగా. వూరిపెద్దలుగా వుండి. ఈ మాదిరి తగులాడుకోవడం ఏమీ బాగులేదు.

రంగ:- అయ్యో రామరాజో! మీ మాదిరి మున్సిపాలిటి మీటింగుల్లో కుర్చీ లతో కొట్టుకొంటున్నట్లు మేమేం కొట్టుకోవడంలేదు లేవయ్యా.

రామ:- రంగనాధం, మేమేమీ బజారు మనుషులంకాదు. మా కౌన్సిలర్లం దరూ చదువు సంస్కారం ఉన్నవాళ్ళు, తెలిసీ తెలియకుండా మాట్లాడితే మర్యాద చెడుతుంది.

రంగ:- తెలిసి తెలియకుండా మాట్లాడుతున్నానా నేను. నాకు తెలియదా. నాకు తెలియదా. ఊహూ నాకు తెలియదాని. నాకంతా తెలుసు లేవోయీ.

రామ:- ఏమిటయ్యా నీకు తెలిసింది. తెలిస్తే చెప్పరాదూ.

రంగ:- అట్టా అడుగరాదో. మొన్న మీ కౌన్సిలర్లు మీటింగులో ఆ యెని మిదో వార్డు కౌన్సిలర్ ఈరా సోమి నీమీద కుర్చీ ఎత్తుల్లా.

రామ:- ఎవరయ్యా నీకు చెప్పింది.

రంగ:- ఒకరు చెప్పేదేందయ్యా, వూరంతా గబ్బు రేగిపోతేనో.

పాప:- రంగనాధం, నికాళ్ళాపు తెంపుకోసుంటా యెందుకయ్యా అలా తొందరపడతావు?

రంగ:- నేను తొందరపడ్తున్నానా. నాకు తెలియనా. నాకు తలియనా, ఊహూ నాకు తెలియదాని. నాకు తెలియదంట్నే.

రామ:- ఈ తెలుసు. అబద్ధాలు బుకానవేసుకొని మోసకపోవడం.

రంగ:- అబద్ధాలా ?

పా:- రంగనాధం! నీవు కాసేపు వూరుకోవయ్యా. అసలేం జరిగింది రాము రాజూ?

రామ:- ఏముంది పాపయ్యా, మన వూరిలో శానిటేషన్ బాలేగాదని, దోమల బాధ, నల్లుల బాధ విపరీతంగా వుందని పీఠాస్వామి విమర్శించాడు. మీ విమర్శలకు ఆధారాలేమైనా ఉన్నవా అని నేనడిగాను. వెంటనే ఆతను పైకిలేచి తన కుర్చీ పైకెత్త క్రిందపడేశాడు అంతే. ఇన్ని నల్లులు నేలమీద రాలాయ్. వెంటనే శానిటరీ ఇన్స్పెక్టర్ చర్యతీసు కోవలసిందిగా తీర్మానించాం. అదీ సంగతి.

రంగ:- అదా సంగతి. అయితే నాతో అట్టా చెప్పారే.

పా:- కాసెవాళ్ళు నూరుచెపుతారు. ఆ మాటలన్నీ నీ వెట్ల నమ్ముతావయ్యా. అబ్బెబ్బెబ్బె నీవంతా తెలిసీ తెలియని వ్యవహారం.

రంగ:- ఆ మాటే నే ననొద్దనేది. నాకు తెలియదా. నాకు తెలియదా. అహా నాకు తెలియదాని. ఈ పంగనామాల రంగనాథానికి అంతా తెలుసు లేవోయీ! సరే సరే, నా కెందుకొచ్చిన సంగతిగానీ పాపయ్యో, ఇప్పుడు మీటింగు వుండాది. నువు రాకపోతే నేను బలే ఇబ్బంది పడిపోతాను. కాబట్టానువు మీటింగుకు తప్పకుండా రావాల.

రామ:- ఆయన మీటింగుకు వచ్చేటట్లున్నాడటయ్యా. లేవలేక మంచంలో పడుంటే మీటింగుకు రమ్మని పిలవడానికి నీకు నోరెలా వచ్చిందయ్యా. అబ్బెబ్బెబ్బె.

పా:- తంగనాథం! మీటింగుకొచ్చే పరిస్థితుల్లో ఉన్నానటయ్యా నేను.

రంగ:- రాకపోతే ఎట్టాగయ్యా.

పా:- నేనేం చెప్పేది (దగ్గు) గోవిందా...గోవిందా...

గో:- ఆయ్యా వస్తున్నా! (పస్తాడు) ఏమయ్యా?

పా:- కాస్త ఈ భుజం వత్తరా.

రంగ:- పాపయ్యా! ఏటో కాస్త యీబుచేసుకొని నువు రాకపోతే నా పీక పొట్టకుంటారయా వాళ్ళు.

రామ:- ఎవరయ్యా నీ పీక పొట్టుకునేది నాకు తెలియకుండా?

రంగ:- రామరాజూ! నువ్వుటూడా ఉండాల్సినోడివేరయ్యా! మనిషిదగ్గర మనిషిమాట మాట్లాడుతావు.

పా:- రంగనాథం! నేను రాకపోతే యేమయ్యా! ఆ మాత్రం సర్దలేవూ!

రంగ:- ఏందయ్యా, నేను సర్దుకొనేదా. కమిటీ నెంబర్లంతా నా మాటినేటట్లు న్నారా? నీ వేమో ఆరుమూసాల్నుండి మీటింగుకు పోకపోతివి. గ్రామ డబ్బు లక్షా యాభై వేలు ఏమయిందని వాళ్ళడగతా ఉంట్రి. నువ్వేమో ఖర్చయిపోయిందని చెపుతుందివి. ఆ మాట చెప్పితే, లెక్కలు చూపించమని వాళ్ళడిగితే నేనేం చూపించేది?

రామ:- ఉన్నదే చూపిస్తే సరి. దానికూడా కష్టమైతే ఎలా?

రంగ:- ఏందీ? ఉండేది చూపించమంటా. ఏముందని చూపించమంటావ్. అసలుండేకదయా చూపించడానికి. లెక్కా పక్కా అంతా ఆయన దగ్గిర్నే ఉండీనే? నేనేం చూపించేది. చూపించాలంట్నే? నాకు తెలియదా, ఆహా నాకు తెలియదా?

పా:- రంగనాథం! వాళ్ళంతగా లెక్కలు చూపమని గట్టిగా అడిగితే నా దగ్గరకలేవు. పాపయ్యగాన్ని అడగండి అని చెప్పు. ఆ తర్వాత నేను చూసుకొంటాను.

రంగ:- నువ్వు చూసుకోకేమా. నువు చూసుకోమని. ఇదిగో పాపయ్యో! అదేం యాబు పదదు చెప్తుండా. వాళ్ళకో నాకు ఐదే టబుల్‌గా ఉంది.

పా:- దానికేం చెయ్యమంటావు?

రంగ:- మీటింగుకొచ్చి లెక్కలు చూపించాల్సిందేకదో!

పా:- నేను రాలేనయ్యా. నా ఆరోగ్యం బాగులేదు. (దగ్గు) రంగనాథం! ఎందుకయ్యా నన్నిలా బాధపెడతావ్–నే నింకెన్నాళ్ళు బ్రతుకుతాను. ఊపు పొమ్మంటుంది, యేమో రమ్మంటుంది. ఈ ఆఖరు రోజుల్లో నైనా నన్ను కాస్త ప్రశాంతంగా ఉండనీ.

రంగ:- అమ్మా, ఐదే పాయింటు పట్టినావుకదయా పాయింటా. ఆ వంకన వాడిచేత నువు వళ్ళు పట్టించుమంటా కూసుండే నన్నేమో ఆ కమిటీ నెంబర్లచేత వళ్ళు పట్టించుకోమంటా. "ఉలిపికట్టె కెదురుగా ఊరు పెత్తనం" అని నా కెందుకొచ్చిన తగాటకమయ్యా యిది?

రామ:- రంగనాధం! పాపయ్యను మీదింగుకు నేను తీసుకొస్తాను. నీ కెందుకు నీ వెళ్లు.

పా:- రామరాజు!

రామ:- ఇష్. పాపయ్యా. నువ్వు కాస్త వూరుకో. రంగనాధం, నువ్వుపదా. పాపయ్యను నేను తీసుకొస్తాను.

రంగ:- ఆదీమాట. అట్టావెప్పు. ఇదిగో రామరాజో, మళ్ళా మాటతప్పేవ్. తప్పకుండా తీసుకురావాల. నేను నా పదవికి రాజీనామా గీకిపారేస్తాను రాజపోతే.

రామ:- అంత అవసరమేమొచ్చిందయ్యా నీకు!

రంగ:- అయితే ఈయనగారికోసం నా పరపతిని పోగొట్టుకోమంటా. పరపతి పోయినాక తిరుపతి చేరుకోవలసిందేగదా. ఎందు కంతదూరం తెచ్చుకోవాలని.

పా:- సరేలేవయ్యా, నీవేమీ బాధపడనక్కరలేదుగాని నేను వస్తాను పదా.

రంగ:- అబ్బా అబ్బా! ఎన్నాళ్ళకొచ్చిందయ్యా నీ నోటిగుండా మాట. ఆఁ. ఆ మాట మొదట్నే చెప్పుంటే ఎంత బాగుండేది. సరే, నే వస్తా. అయితే అయ్యో రామరాజో, ఆయన్ని కాస్త జాగ్రత్తగా తీసుకు రావయో, అసలే మనిషి చాల ఇదిగా ఉండాడో. అయినా వూరు పొమ్మంటుంది, యేరు రమ్మంటుంది. ఈయన కెందుకయ్యా ఇదంతా. వూపిరి పోయ్యేదాకా వసులుకునేటట్టు లేడే వూరి పెత్తనమో.

రామ:- అబ్బెబ్బెబ్బె రంగనాధం! పెంచుకొనిపోతూ వుండేదేనా.

రంగ:- లేకులే పోతుందనా. పాపయో, మరిచిపోతావ్‌గనేం.

పా:- లేదులే పోవయ్యా.

రంగ:- పోతుండాలేవయా. నేనేంది అందరూ పొయ్యేవాళ్ళే, కాస్త ఎనకా ముందూ చూచుకొని. పవయో రామరాజూ, నేను పోతుండా కాస్త తొరగా రండయో.

రావు:- అలాగే వస్తాం పదవయ్యా (రంగనాథం వెళతాడు)

రాము:- అబ్బ బ్బ బ్బ, పూపిరాదనివ్వలేదయ్యా. ఎలాగో పంపించేశాం. Happy Now I am. పాపయ్యా, మీదింగుకొస్తారా?

పా:- నేను రాలేనని చెప్పాను కదయ్యా!

రాము:- మరెలా? కాలేజీ విషయం అందరూ చాలా గట్టిగా దిన్నారు. పైగా కాలేజీ ఖర్చంతా ప్రసాదు వక్కడే భరించుకొంటా నంటున్నాడు. పాపయ్యా, మనకెందుకొచ్చిన బాధ. వొప్పుకొంటే సరిపోతుంది. We will be very happy then afterwards.

పా:- రామరాజూ! నీకు వయసొచ్చేకొంది బుద్ధి సన్నగిల్లుతుంది. అత గాడు సొంతంగా కాలేజీ కట్టిస్తే వూరివాళ్ళంతా అతన్ని దేవుడుగా చూడరూ. తరువాత నీ మున్సిపల్ చైర్‌మన్ పదవి ఏమౌతుందో ఆలోచించుకో.

రాము:- అదా విషయం. అబ్బా, అది నేను ఆలోచించనేలేదే. నో నో నో. ఇది ఎంతమాత్రం ఇరగడానికి వీలులేదు. కాలేజీ లేకపోతే పీడా పోయింది. మన పిల్లల్ని కావాలంటే పట్నం పంపించి చదివించు కొంటాం. ఐలే ఎత్తు వేశాడే, నా పదవి కాజెయ్యాలనా అతని ఆలోచన! పాపయ్యా, వెళ్ళొస్తా. సభ్యుల్ని కలుసుకొని మనం బలం పెంచుకోకపోతే చాలా ప్రమాదముంది. అబ్బెబ్బెబ్బె. యీ రోజుల్లో ఎవర్ని నమ్మకూడదయ్యా. Hopeless. Hopeless (అంటూ వెళతాడు.)

పా:- అయనగారు ఏం చేస్తున్నారా లోపల?

గో:- భోంచేస్తున్నాడయ్యా!

పా:- అహ, ఓహో (గోవిందు బుజం గట్టిగా వత్తుతాడు)

పా:- అబ్బా! చిన్నగారా నీ దుంపతెగ. ఆ అది అలాగా ఉ, ఉ, ఒరే గోవిందా. ఎంతకాలం ఇలా వంటరిగా ఉంటావ్, దేనో ఒకదాన్ని చూది ముడేసుకోరా.

గో:- పెళ్ళా? నాకెందుకయ్యా పెళ్ళి.

పా:- అదంతా ఎందుకు చేసుకుంటున్నట్లో? ఏమిరా చేసుకుంటే? పెళ్ళాన్ని పోషించలేనని భయమా?

గో:- నేను పోషించేదేముందయ్యా. యిద్దే పడుంటది. నేను మీకు సేవ చేస్తుంటే, అది అమ్మాయిగార్కి సేవ చేస్తుంటది. అదికాదు నా బాధ. రెయ్యాం బొగళ్ళు నేను మీకు సేవ చెయ్యటానే సరిపోయ్యానే. అడేం సుఖపడొద్దా.

పా:- నోరుమూయ్‌రా చవటా.

[శ్రీహరి ప్రవేశం]

శ్రీ:- ఏంమావయ్యా, వెళ్ళి భోజనం చెయ్యరూ. ఈ రోజు మీటింగు వుంది. త్వరగా కానివ్వండి.

పా:- నేను మీటింగుకొచ్చేటట్లున్నానటయ్యా.

శ్రీ:- అయితే నన్నొక్కడ్నే వెళ్ళమంటారా.

పా:- నేను చెప్పలేదే. శ్రీహరి, నీవు మీటింగుకు వెళ్ళకుంటే మంచిది.

శ్రీ:- అదేమిటి మామయ్యా, పట్టుబట్టి కమిటీలోకి వేయించింది మీరేగా.

పా:- అవునయ్యా నా జీవితంలో నేను చేసిన పెద్ద తప్పు యిదొక్కటే.

శ్రీ:- ఆహా.. అయితే మీ జీవితంలో ఇది తప్ప మిగతావన్నీ మంచిపనులే చేశారన్నమాట. వెరీగుడ్. వెరీగుడ్. (ఆటూ లోని వెళతాడు)

కృష్ణ:- నాన్నా, మీరు భోజనానికి లేవండి. నాకు పూజకు వేళైంది.

పాప:- వస్తున్నానమ్మ (లోనికెళతాడు)

[గోపిందుకూడా లోనికెళ్ళబోతాడు. బయట ద్వారంనుండి దొర స్వామి ప్రవేశం]

దొర:- పాపయ్యగారూ ! పాపయ్యగారూ!

గో:- ఇష్ (అని సైగ చేస్తాడు) అయ్యగారు ఇప్పుడే భోజనానికి వెళుతున్నారు. మీరు పిలిచారంటే ఆయన భోంచేయకుండానే వచ్చి కూచుంటారు. అమ్మాయిగారి పూజకు ఇబ్బందయిపోతాది.

దొర:- పూజవెందుకు?దానివలన ఫలితమేమైన ఉన్నదా.లేదూ.రాయిలకురప్పలకు మొక్కుడూ దేవుడా. దేవుడా అని దేబరించుడూ మనుష్యుని పాడు

చేసుకొనుచూ ముక్తిని పొందజాలకున్నారు. ఓ దేవా, ఈ మూఢులను యీ పాపమును క్షమించి బుద్ధినొసగి ప్రభువైన ఏసుద్వారా ముక్తిని ప్రసాదించుము తండ్రీ.

గో:- ఆయ్యో దొరసామి.

దొర:- స్వామి (కోపంగా) స్వామి, వామి అని పిలవద్దని నేను చెప్పలేదూ. తెల్లదొరల చల్లదనములో పెరిగిన నేను స్వామిని కాకూడదని చెప్పలేదు. నన్ను దొరా అని పిలవమని చెప్పలేదు.

గో:- కదుమరె. కదుమరె. పొరపాటే. ఇదిగో దొరా. మీకు మీ దేవుడెక్కువ. మాకు మా దేవుడెక్కువ. మీరు మీ దేవుడ్ని కొలుచుకోండి. మేము మా దేవుడ్ని కొల్చుకుంటాం.

దొర:- దేవుడు ఒక్కడే. దేవుడు ఒక్కడే. పరిశుద్ధ ప్రభువైన యహోవా ఒక్కడే దేవుడు-కాదందువా? కాదందువా?

గో:- కదుమరె. కదుమరె. ఇదిగో దొర, మనిషికి నీతిగాని ముళ్ళము దేవుడి దేంది లేవయా.

దొర:- ఎంతటి నీతిమంతుడైనను. యెంతటి బుద్ధిమంతుడైనను యెహోవాను నమ్మినపుడే మోక్షము కలుగును. ఓ ప్రభువా, దయా సముద్రుడవై కరుణించి ఈ పాపులను క్షమించుము తండ్రీ.

గో:- దొరా ! నన్నొకసంగతి చెప్పమంటా?

దొర:- యేమిటది చెప్పుమూ.

గో:- మిమ్మల్ని మాస్తుంటే నాకు చిన్నప్పుడు నేర్చుకొన్న పాదొకటి జ్ఞాపకాని కొస్తుంది, పాడమంటా.

దొర:- ఓ...నీవు పాడెదవా. చాల సంతోషము. మాకు పాడువారనిన చాలా ఇష్టము. మా పరిశుద్ధమైన మతమును బోధించుటకు పాడువారు చాలా అవసరము. పాడుము, పాడుము.

గో:- ఓ పాడతాను వినండి.

ఒకానొకా వూరిలోన ఒకానొక అయ్యవారు
ఒక్కపని చేసినాడు మాదిరి

ఐల్‌చక్కగా నడించినాడు పాదరి
ఆదివారం ప్రొద్దుస లేచి అటూ ఇటూ పారజూచి
అరవకుంద పట్టినాడు కోడిని
ఒక గంపక్రింద దాచినాడు దానిని
హడావడిగ గుడికివెళ్ళి చెడాఁడా మాటలాడి
చెప్ప మొదలుపెట్టె ప్రసంగము
చెవులు విప్పి ఆలకించిరా సంఘము
దొంగతనము చేయరాదు, దొంగసొత్తు కోరరాదు
దొంగలై మీరుండరాదు సఖికులు
అట్టివారి కెపుడు దొరకదు పరలోకము
అయ్యగారి బోధవినగ, అమ్మగారు హాదలుయెత్తి
గబగబా ఇంటికొచ్చి కమ్మయున్న తట్టనెత్తి
పొమ్మనంచు నొడిలిపెట్టె కోడిని
దానిబిదులు కాచె చింతపండు చారుని
అయ్యగారు ఇంటికొచ్చి కార్యతోడ నిట్లు పలికె
కోడికూర నొండి పెడ్తివా, ఓ సఖియా
మినప పడలు చేసిపెడ్తివా
అయ్యా మీదు బోధవినగ, విజ్ఞానం కలిగె నాకు
గంపకింద కోడి నొడిలిపెడ్తిని, దానిబిదులు కాస్తి
చింతపండు చారుని
సఖియ నే చెప్పినబోధ, సఖికులకే యెరుకగాని
నీకు నేను చెప్పియుంటినా
పిచ్చిదానా, నిన్ను నేను నమ్మమంటినా.

దొర:- (కోపముతో) గోవిందూ! నీకు బుద్ధి వున్నదా?

గో:- బుద్ధా, ఏం బుద్ధయా?

దొర:- అది కాదూ, నీకు బుద్ధి వున్నదా?

గో:- అదేనయ్యా ఏం బుద్ధి? నా దగ్గర బుద్ధి గద్ధి ఏమిలేదే!

దొర:- అబ్బా, అదికాదు. నీకు బుద్ధి వున్నదా?

[శ్రీహరి ప్రవేశం]

గో:- ఏం బుద్ధయ్యా అంటుంచే?

దొర:- అబ్బా. అదికాదు.

శ్రీ:- దొరా! శాంతించండి. ఒరే గోవిందూ! దొర నీమీద చాల కోపంగా ఉన్నారు. నీకు బుద్ధి వున్నదా అంటున్నారు.

గో:- అదా సంగతి! నాకెందుకులేదు బుద్ధి?

దొర:- ఉంటే పెద్దలను పరిహాసముచేసి, పాపమును మూటగట్టుకొను చున్నావు ఎందుకు?

గో:- నేనేమీ మూటకట్టుకోవడంలేదు దొరో. ఎనకటికి ఒక ఫాదరీ కథ నేను పాట్టపాడితే నీకెందుకయ్యా కోపము, గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకొన్నట్టు.

దొర:- గోవిందూ. (విసుగుగా) నీకు బుద్ధిలేదు. బుద్ధిలేదు.

గో:- లేకపోతే పోయిందిలేవయా.

శ్రీ:- గోవిందు, నీవు లోపలికిపో. శాంతించు దొరా. నే నొకటి చెపుతాను వింటారా?

దొర:- ఏమిటదీ చెప్పుమూ.

శ్రీ:- ప్రతి మతములోను మంచివాళ్ళున్నారు. చెడ్డవాళ్ళున్నారు. ఇంతెందుకు. మా మతమే తీసుకోండి. ఎందరో స్వాములార్లున్నారు. నిత్యానందస్వామి, సదానందస్వామి, సచ్చిదానందస్వామి, పరమానందస్వామి, ఆవాలస్వామి, మిరియాలస్వామి, జీలకర్రస్వామి. వీరిలో దొంగలూ ఉన్నారు, దొరలూ ఉన్నారు. అలాగే ప్రతి మతంలోనూ ఉంటారు. యేమంటారు?

దొర:- నీవు చెప్పినది కూడ నిజమే. కాని యీ లోకములోని పాపులను రక్షించువా దొకడున్నాడు. ఎవరు? చెప్పుమందువా. చెప్పుమందువా? అతడే పరిశుద్ధ యేసుప్రభువు. ఆ రక్షకుని ఆజ్ఞ ప్రకారం పాపులను పరిశుద్ధ మొనరించుటకు, పాపమును అరికట్టుటకు పాటు

పడుచున్నాము. న్యాయసమ్మతమైన పెళ్ళిళ్ళుచేసి సృష్టిని కాపాడుచున్నాము.

శ్రీ:- న్యాయమైన పెండ్లిండ్లు అంటే?

దొర:- యీ లోకరక్షకుని ఆజ్ఞప్రకారము మేము పెండ్లి భర్తలను, పెండ్లి భార్యలను నిర్ణయించెదము. అదియే న్యాయమైన పెళ్ళి. దేవుని ఆజ్ఞ ప్రకారము జరిగిన పెళ్ళి.

శ్రీ:- ఆలాగా, అయితే నేను కష్టపెళ్ళి చేసుకొన్నాము. మా పెళ్ళి పెద్దల ఇష్టప్రకారం జరగలేదు. మేమే నిర్ణయించుకొని చేసుకున్నాము. ఇది న్యాయమైన పెండ్లి కాదా?

దొర:- ఎందులకు కాదు? చెప్పమందువా? నిన్ను ఆమెకు పెండ్లి భర్తగను, ఆమెకు నిన్ను పెండ్లి భార్యగను నిర్ణయించి ఇద్దరిని ఒక్కటిగా చేసినదేమి చెప్పమందువా? అదియే ప్రేమ, ఆ ప్రేమే దైవము. కాదందువా, కాదందువా?

శ్రీ:- కాదని నేనెలా అనగలను? మీరు చెప్పినది అక్షరాలా నిజం.

పాప:- (ప్రవేశించుట వస్తాడు) యేం దొరా, చాలా కాలానికి కనపించావు?

దొర:- ఏమిటి పాపయ్యగారూ, నిన్నగాక మొన్న వచ్చితిని. ఇంతలోనే చాలాకాల మెట్లయినది. చెప్పుము, చెప్పుము.

పా:- సరేలెవయ్యా, నీతో వాదించే పరిస్థితులలో ఉన్నానా నేను.

దొర:- అవును. మీ ఆరోగ్యము కొరకు ప్రతినిత్యము పరిశుద్ధ ప్రభువైన దేవుని ప్రార్థించుచున్నాను. ఇప్పుడు మీ ఆరోగ్య మెట్లున్నది?

పాప:- ఇంకెక్కడి ఆరోగ్యం? ఊరు పొమ్మంటుంది, ఏరు రమ్మంటుంది. (దగ్గు)

దొర:- దిగులుపడకుము, దిగులుపడకుము. దేవుని తలుచుము, మేలు కలుగును. ఓ లోకరక్షకుడవైన ప్రభువా, యీ నా మిత్రుని ఆరోగ్యవంతునిచేసి కాపాడుము తండ్రి. పాపయ్యగారు, మీతో ఒక ముఖ్య విషయము చెప్పవచ్చితిని. చెప్పమందువా, చెప్పమందువా.

పాప:- ఇష్ (సైగ చేస్తాడు)

శ్రీ:- (ఆది గమనించి) ఓహో ఆంతరంగిక విషయాలా. సరె సరె. (అని లోనికెళతాడు)

పా:- ఇక చెప్పవయ్యా, కాస్త మెల్లగా చెప్పు. గోడలకు చెవులుంటాయి.

దొర:- 20 బియ్యపు బస్తాలు, 10 నేతి దబ్బాలు, 8 పాలపొడి టిన్నులు మొత్తము లారీలో పంపినాను. వాటిని దబ్బుచేసి మీ భాగము మీరు తీసుకొని, నా భాగము నాకు పంపుము.

పా:- అలాగే!

దొర:- నేను వెళ్ళివచ్చెదను.

[దొర వెళ్ళబోతాడు. ఎదురుగా ఒక వ్యక్తి వచ్చి నిలబడతాడు. సూటు, హ్యాటు, కళ్ళజోడు ఉంటాయి. సిగరెట్టు పొగ దొర ముఖాన్ని కమ్ముతుంది. దొర దగ్గుతూ]

దొర:- ఎవరు మీరు?

శేఖ:- (జవాబివ్వడు. అలాగే ఇంటిని, వ్యక్తులను పరీక్షిస్తుంటాడు)

(దొర భయపడతాడు)

పా:- ఎవరు నీవు? ఏం కావాలి?

శేఖ:- (పాపయ్యవైపు చూచి, మరలా దొరవైపు చూచి) హల్లో, తెల్ల దొరల చల్లదనంలో మెల్లమెల్లగ పైకి వచ్చిన వో నల్లదొరా, నన్ను నీవు గుర్తు పట్టలేదూ?

దొర:- (పరీక్షించి) ఓ శేఖర్‌బాబూ. పాపయ్యా, మీ శేఖర్‌బాబు, మీ అన్న కుమారుడు, 15 సంవత్సరముల క్రిందట ఇంటిమీద అలిగిపోయిన మీ అన్న కుమారుడు.

[పాపయ్య జేజారై మౌనంగా వ్యుంటాడు]

దొర:- కృష్ణవేణి అమ్మా! కృష్ణవేణి అమ్మ! శ్రీహరి బాబు! శ్రీహరిబాబు (ఇద్దరూ వస్తారు) ఈ వచ్చిన వ్యక్తి ఎవరో తెలుసా? మీ శేఖర్ అన్నయ్య.

కృష్ణ:- అన్నయ్యా! (ఆనందానికి అంతులేదు.)

శేఖ:- కృష్ణా. అ. రె. రె. రె. పావడాలు పరికిణీలు, చీరలు కట్టేశావే. ఆ...ఇతనెవరూ?

కృష్ణ:- మీ బావగారు.

శేఖ:- బావగారా ఓ... కంగ్రాచ్యులేషన్స్ ! మీ పెళ్ళికి నన్ను పిలవనే లేదు.

శ్రీ:- క్షమించండి. మా పెళ్ళి పెద్దలు ఇష్టప్రకారము జరగలేదు.

శేఖ:- ఓ...ఎక్...మారేజ్. వెరీగుడ్. దబుల్ కంగ్రాచ్యులేషన్స్.

శ్రీ:- మీరు మాట్లాడుతూ ఉండండి. మీటింగ్ వుంది. వెళ్ళి ఇప్పుడే వచ్చేస్తాను.

శేఖ:- ఓ దానికేం, ఆలాగే.

[శ్రీహరి వెళతాడు. కృష్ణ కాఫీ తేవడానికి లోనికి వెళుతుంది]

శేఖ:- బాబాయిగారు... బాబాయిగారు! ఆఫ్ట్రాల్ ఇంటిపై అలిగిపోయిన నేను 15 ఏండ్ల తర్వాత ఇంటికి తిరిగివస్తే ఇదేనా మీ ఆదరణ. ఎక్స్‌క్యూజ్‌మీ.

దొర:- మీ బాబాయిగారి ఆరోగ్యమేమీ బాగాలేదు.

శేఖ:- బాబాయిగారికి ఆరోగ్యం బాగాలేదా? నో, నో, నో, బాబాయి శరీరం గట్టి శరీరం (ఆటూ పాపయ్యవద్ద కూర్చుని) ఉలిపికట్టె నిప్పులో పడవేసినా చెక్కు చెదరకుండా యేలా అయటకొస్తుందో మా బాబాయి కట్టెకూడా ఎన్ని రోగములు వచ్చినా చెక్కుచెదరకుండా గట్టిగానే వుంటుంది. (అని పాపయ్యను గట్టిగా తట్టుతాడు).

పా:- అబ్బా—ఏమిటిరా ఇది. నన్ను చంపేస్తున్నావ్. ఒరే శేఖర్ ! ఇన్నాళ్ళకు మేము గుర్తుకొచ్చామట్రా. నామీదెందుకురా నీకింత కక్ష. నే నింకెన్నాళ్ళు బ్రతుకుతాను. టూరు పొమ్మంటుంది, యేరు దమ్మంటుంది.

శేఖ:- మీరేమీ దిగులుపడకండి బాబాయ్. మీరింకా 60 ఏండ్లు గట్టిగా గ్యారంటీగా బ్రతుకుతారు, నేను వచ్చానుగా. మీకేమీ వర్వాలేదు. ఎక్సూజ్‌మీ ఆఁ... దొరా ఇప్పుడు తమరేం చేస్తున్నారు?

దొర:- (తెల్లదొర పద్ధతిలో) పిల్లలకు అన్నము పెట్టుచు—

శేఖ:- ఆఫ్‌ట్రాల్ పిల్లలకు మీరేంటండీ అన్నం పెట్టేది. మీ ఆవిడగారు ఏం చేస్తుంటారు? ఎక్సూజ్‌మీ. ఆవిడగారు ఉన్నారా లేక—

దొర:- మా పిల్లలు కాదుబాబు. హాస్టల్ పిల్లలు. నేను ఒక చిన్న హాస్టల్ నడుపుతున్నాను.

శేఖ:- ఓ...మీరు హాస్టల్ నడుపుతున్నారా? వెరీగుడ్, వెరీగుడ్. రెండు చేతులా సంపాదన. అబ్బా, కొట్టారండి ఛాన్స్, లక్కీఛాన్స్. ఎక్సూజ్‌మి.

దొర:- (కోపంగా) శేఖర్‌బాబు, ఇటువంటి పాపపు మాటలు నేను వినజాలను.

శేఖ.- ఆఫ్‌ట్రాల్ ఈ మాత్రానికే మీకు కోపం రావడం నాకు విచారంగా ఉంది.

దొర:- కోపమురాదా, కోపమురాదా. ఓ దేవా, ఈతని పాపపు మాటను మన్నించి, ఈ బిడ్డను క్షమించుము తండ్రి.

శేఖ:- దొరా, నేను చెప్పేది కాస్త వినిపించుకోండి. హాస్టల్ నడపడమంటే సామాన్యమా! దానికి యెంతో అదృష్టం చేసుగొని వుండాలి. బాబాయ్. గోవిందపల్లెనే ఊర్లో ఒక పెద్ద హాస్టల్ వుంది. అది ఒక పూరే అనుకోండి. విద్యార్థులు 4 వేలకుపైగా వుంటారు. ఆ హాస్టల్ నడిపేవ్యక్తికి మొదట ఏమంత ఆస్తిలేదు. మధ్య తరగతి కుటుంబీకుడు. ఇప్పుడతనికి 5 కార్లు, 500 యెకరాల మాగాణి, రెండు సినిమా హాల్సు వున్నవి. ఇక పేరు ప్రఖ్యాతులంటారా. ప్రజలంతా అతనిని అన్నదాతయని, విద్యాదాతయని, దయాసాగరుడని, కరుణానిధి అని పొగడుతూ పూలదండలపై కూర్చోబెట్టి ఊరేగిస్తున్నారు. ఇంత స్వల్పకాలంలో ఇంతటి శ్రీమంతుడెలా అగగలిగాడా

అని ఆలోచించేవారే లేరు. అటు సిరిసంపదలు, ఇటు పేరు ప్రఖ్యాతులు వచ్చాయుంటే యెలా వచ్చాయ్? హాస్టల్ నడపడంవల్లనే. ఆఫ్ట్రాల్ నే నీ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మీరూ ఆతనిలాగే గొప్పవారు కావాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ఉంటే నా మీద కోప్పడతారా. ఎక్స్‌క్యూజ్‌మీ.

దొర:- బిడ్డల నోటి తూకు ఆపహరించడం పాపముకాదా, పాపముకాదా! నే నటువంటి వాపినికాను, అటువంటి పాపపు పనులు చేయజాలను.

శేఖ:- అటులైనా నీవు బాగుపడలేవు. పైకి రాజాలవు తండ్రీ.

దొర:- శేఖర్ బాబు, నాకు కోపము తెప్పింపకుము.

శేఖ:- కోపమెందుకు దొరా. మీ లోపి పెద్దలకు కోపము తగునా దొరా. లోకరక్షకుడైన పరిశుభ్రుడైన క్రీస్తు యెన్నడైనను కోపపడెనా? మూర్ఖులు, పాపులు ఆ పవిత్రమూర్తిని పట్టి, కొట్టి బాధించినను సిలువ అను కొయ్యకు కట్టి చీలను శరీరమున దిగగొట్టినను, రక్తము ధారలై ప్రవహించినను, ఆ పవిత్రమూర్తి వారిని కోపగించెనా, కోపగించెనా, లేదు. చిరునవ్వుతో మూర్ఖుల తప్పులను మన్నింపుమని దేవుని ప్రార్థించెను. కాదందువా, కాదందువా. ఓ దేవా. యీతని కోపమును తగ్గించి, ఈతని పాపమును మన్నించి, ఈతనికి బుద్ధిని ప్రసాదించుము తండ్రి.

కృష్ణ:- (ప్రవేశించి నవ్వుతూ) అన్నయ్యా, బాగా నేర్చావే బోధ చేయటం. (అంటూ కాఫీ అందిచ్చింది)

శేఖ:- నేను బోధచేయుచుంటినా, లేదు. ఆ దేవుని ప్రార్థించుమంటిని చెల్లీ.

పా:- ఒరేయ్ శేఖర్, పెద్దవాళ్ళతోనటనా పరిహాసాలు?

దొర:- పెద్దలను పరిహసించి పాపమును మూటకట్టుకొనుచున్నాడు.

శేఖ:- వకవాలేదులే దొరా. ఆ మూట మీ బుజాన పెడతాను. మోసుకపొండి.

పా:- శేఖర్, కాసేపు ఊరుకోరా.

శేఖ:- యేమిటి బావాయ్ నిన్న చెప్పిన, ఆఫ్ట్రాల్. (అని తట్టుతాడు)

పా:- ఒరేయ్ ఒరేయ్ నేను మామూలు మనిషినట్రా.

శేఖ:- ఎక్సూజ్‌మీ.

దొర:- పాపయ్యగారు నేను పోవుచున్నాను. నీవా పనిని చూచు. జ్ఞాపక ముంచును కదూ.

పా:- నేనేమంత మతిమరుపు మనిషిని కాదులేవయ్యా, వెళ్ళిరా. (దొర వెళ్ళును)

పా:- ఒరే గోవిందా...గోవిందా.

కృష్ణ:- (శేఖర్ వద్దనుండి కాఫీ కప్పునందుకొంటూ) గోవిందా.

గో:- అమ్మా.

కృష్ణ:- నాన్నగారు పిలుస్తున్నారు.

గో:- పిలిచారా అమ్మా.

కృష్ణ:- ఈ కాఫీకప్పు లోపలపెట్టు.

గో:- సరేనమ్మా.

పా:- ఒరేయ్, నేనెందుకు పిల్చానో కనుక్కోకుండానే పోతున్నావా.

గో:- కదుమరె. కదుమరె.

పా:- ఛీ నోరుముయ్. అది లోపలపెట్టి రంగనాథంగారి ఇంటిదగ్గర మీటింగు జరుగుతూవుంది నీవెళ్ళి గోడచాటునుండి అక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకొనిరా.

గో:- అట్టాగే (గోవిందు వెళతాడు)

శేఖ:- మీటింగేమిటి బావాయ్. బావగారు కూడా అక్కడికే వెళ్ళారు.

పా:- ఈ వూర్లో కాలేజీ కట్టించాలనుకొంటున్నారు.

శేఖ:- వాట్, కాలేజీ కట్టించాలనుకొంటున్నారా. వెరీగుడ్. బావాయ్, కాలేజీ కోసం ఒక నాటకం ఆడేస్తాం. ఖర్చులు పోను మిగతా పైకం కాలేజీ కిచ్చేస్తాం

పా:- ఒరేయ్, నీవు నాటకాలు మానుకుంటావా లేదా?

శేఖ.- మానేశాను బాబాయ్

కృష్ణ:- ఏమిటి, నాటకాలాడటం మానేశావా నిజంగా.

శేఖ:- అవును కృష్ణా, మా నాటకాలు ప్రేక్షకులు చూడడం యెప్పుడైతే మానేశారో మేము అప్పుడే నాటకాలాడడం కూడా మానేశాం. అంచు తేగా ఇక్కడికొచ్చేశాను.

కృష్ణ:- ప్రేక్షకులు మీ నాటకాలెందుకు చూడరు?

శేఖ:- కృష్ణా ! మా నాటకాల్లో ఏ ముంటాయమ్మా. ఆదే రామాంజనేయ యుద్ధమైతే, హనుమంతుడు వచ్చి తన తోక కండే మూడింతలు. పొడుగున రాగం తీశాకండే ప్రేక్షకులు వన్స్‌మోర్ అని ఒకటే గోలచేస్తారు. మా నాటకాలు చూచి యేమయ్యో ఒక పాటా. పద్యము లేదు. మీరెపి మూతులు మూతులు కలుపుకొని గుసగుస లాడు కుంటుంటే మేము నోరుతెరమకొని చూస్తుండాలా? చాల్ చాల్లేవయ్యా ఆడేరు నాటకాలు అంటున్నారు. చెల్లాయ్. మనవాళ్ళ స్టాండర్డు పెర గదు. మన దేశం బాగుపడదు. ఎక్స్‌ట్రీమి.

కృష్ణ:- అదేమిటన్నయ్యా. మంచినాటకాలాడితే యెందుకు చూడరు. ఇంతకూ మీరేమి నాటకాలాడేరు?

శేఖ:- ఆఫ్‌ట్రాల్ ఒక టేమిటి, 76 నాటకాలు ఆడేం. 1. ఆడదాని సీద, 2. గోడమీదపిల్లి; 2, అంబోతు రంకె: 4. ప్రేమించి పెళ్ళిచేసుకో 5. కాసులుంటే కలదు సుఖం; 6. పాపాల భైరవుడు; 7. డబ్బు కోసం గర్భితను...

పా:- ఓరేయ్. ఇవన్నీ నాటకాలేనట్రా !

శేఖ:- అవును బాబాయ్

పా:- అందుకేరా ఎవరూ చూడంది.

కృష్ణ:- అన్నయ్యా ! ఏవైనా చారిత్రాత్మక నాటకాలాడకూడదూ. రాణి రుద్రమదేవి, పల్నాటి యుద్ధం.

శేఖ:- కృష్ణా ! ఆడాలనే అనుకున్నాం. ఒక గొప్ప నాటకం. పెద్ద నాటకం బొబ్బిలియుద్ధం.

కృష్ణ:- ఆడేరా?

శేఖ:- చెప్పని. ఆ నాటకంలోని పాత్రలకు సరిపోయే విగ్రహాల కొరకు గాలించాం. కొందరు దొరికారు. కాని పాపారాయుడు పాత్రకు సరియైనవాడు దొరకలేదు. చాల రోజులు వూరంతా వెతికాము. ఒక రోజున వున్నట్టుండి ఒక వ్యక్తి కనిపించాడు. బాబాయ్, అతనున్నాడు చూడు. నా మీద అరడుగు పొడుగు. యింతంత రెట్టు. ఆ... దారాసింగే అనుకో. కనుగుడ్డు యింతింత. అతన్ని చూడగానే నాకు పట్టరాని ఆనందం కలిగింది. వెంటనే అతని దగ్గిరకెళ్ళి యేమండీ, మీపేరేమిటి అన్నాను. అతను ఇలా సీరియస్‌గా చూచాడు. ఎక్స్‌క్యూజ్‌మి. మీ పేరు చెప్పండి, యేమీ అనుకోకుండా అన్నాను. వెంటనే అతను (స్త్రీ కంఠంతో) "నా పేరు భీమయ్య. ఏం?" అన్నాడు.

కృష్ణ:- ఆవే కీలగొంతు... (నవ్వు) తర్వాత?

శేఖ:- ఇంకేముంది? ఆ నాటకాలాడాలన్న వుద్దేశమే పోయింది. తరువాత సాంఘిక నాటకా లాడేవాళ్ళం-ఎక్స్‌క్యూజ్‌మి.

పా:- ఒరేయ్ శేఖర్ ! నాటకాలాడావు కదా, ఎంత సంపాదించావ్ ?

శేఖ:- సంపాదించడమంటే ఎకూజ్స్‌మీ. పేరా, లేక దబ్బా?

పా:- దబ్బురా !

శేఖ:- After all దబ్బుదేంటి బాబాయ్! ఇవాళ వస్తుంది, రేపు పోతుంది. మనం పేరు సంపాదించాం.

కృష్ణ:- అన్నయ్యా! నాటకాల్లో నీవు యేమి వేషాలు వేశావు? ఆ...హీరో వేషాలే వేసుంటావులే, ఫున్నమి చంద్రుడిలాంటి ముఖం.

శేఖ:- (నవ్వి) నా ముఖం చూచినవారంతా యిలాగే అనేవారు. కాని అద్దం ముందు నిలబడ్డప్పుడు నా ముఖం నాకే అసహ్యం వేసేది. అందుకని ప్రతి నాటకంలోను నాకు సరిపోయే వేషాన్నే తీసుకొనే వాడ్ని.

పా:- ఆడినమట్టుకు చాలుగాని, యిక వాది జోలికి పోకు.

కృష్ణ:- అన్నయ్యా! ఇన్నాళ్ళ కొచ్చావుకదా, నాకేం తెచ్చావ్?

శేఖ:- కృష్ణా! నిన్ను మరిచిపోతానా. తెచ్చానమ్మా. ఇదిగో! (అని సంచిలోనుండి నెక్లెస్ తీసి యిస్తాడు)

కృష్ణ:- అరెరెరె! చాలా బాగుందే, ఇదేమిటి యింత తేలిగ్గా వుంది? బంగారం కానట్టుందే?

శేఖ:- బంగారం మీదెందుకమ్మా అంత మమకారం? బంగారం వంటికి భారం, దొంగల భయం, మెడకు చిలుము, అబ్బెబ్బెబ్బె. యిదం టావా తేలిగ్గా, నాజూగ్గా, అందంగా, తళతళ మెరిసిపోతూ వుంటుంది. రంగు గ్యారంటీ, దొంగల భయం లేదు. వెలంటావా 75 Paise only. ఎక్స్‌ట్రాజ్‌మి.

కృష్ణ:- పైసలా?

శేఖ:- అవును. ఇది ప్లాస్టిక్ నెక్లెస్.

కృష్ణ:- ప్లాస్టిక్ నెక్లెసా అన్నయ్యా! నాకేం అవసరంలేదుగాని, వెంటనే ఎవరినన్నా పెళ్ళాడి, ఆవిడకు బహూకరించు.

శేఖ:- వాట్! పెళ్ళా? నాకు పెళ్ళేమిటి? పెళ్ళి చేసుకోవడం. పదిమంది పిల్లల్ని కనడం, వారిని భుజానవేసుకొని తిరగడం, ఛఛఛ.

పా:- అయితే పెండ్లి చేసుకోవటరా?

శేఖ:- ఎందుకు చేసుకోను? నాకు సరియైన పిల్ల దొరకద్దు?

పా:- పిల్లలకేమిరా కావలసినంతమంది, చూడమంటావా?

శేఖ:- ఆఁ...ఆ పిల్లలు కాదు బాబాయ్ నాకు కావలసింది. కందుకూరి వీరేశలింగంగారి ఆశయసిద్ధికొరకు నేనొక వితంతువును పెళ్ళాడ దల్చాను.

పా:- ఏమిటి. వెధవముండను పెళ్ళాడుతావా?

కృష్ణ:- నీ ఆలోచన చాలా బాగుందన్నయ్యా!

పా:- నీకు బాగానే వుంటుందిలే. (కృష్ణ నోరుమూసుకుంటుంది)

శేఖ:- ఏరా చెల్లాయ్! ఆ వితంతువు ఎలా వుండాలో తెలుసా? బంగారం బొమ్మలా వుండాలి. ఇక్షలకొలది ఆస్తి వుండాలి. ఆమె తల్లి దండ్రులకు ఆమె ఒకతే సంతానమై వుండాలి. తల్లిదండ్రులు చని పోయి వుండాలి. అటువంటి వితంతువు దొరికితే నేను వివాహ మాడుతాను. టూ బర్డ్స్ యెట్ ఎ షాట్ అని గిరీశం అన్నట్టు అటు ఆమెకు ఆయిదవతనం, ఇటు మనకు ఐశ్వర్యం, ఎలా వుంది? ఎక్సాజ్‌మి.

కృష్ణ:- (మూతి ముడుచుకుంటుంది)

శేఖ:- మన ఆలోచన నీకు నచ్చదులే. మా బాబాయ్‌కి చాలా బాగా నచ్చ తుంది. ఏమంటావు బాబాయ్? (తట్టుతాడు)

పా:- అబ్బా, చంపేస్తున్నావురా...అవును. అలాంటి సంబంధ మెక్క-డుంది?

శేఖ:- మీరు తలుచుకొంటే దొరక్కపోతుందా?

కృష్ణ:- అన్నయ్యా! మీరు స్నానం చెయ్యరూ?

శేఖ:- ఏమిటి కృష్ణా! మేమింత స్టార్టింగ్ డిస్కషన్‌లో వుంటే ఆఫ్‌ట్రాల్ స్నానానికొచ్చిందా తొందర-ఎక్సాజ్‌మి.

కృష్ణ:- సరే, మీరు చర్చించుకుంటూ వుండండి. నేను హూజ్ చేసుకోవాలి. (లోనికెళుతుంది)

శేఖ:- ఏం బాబాయ్! ఆటువంటి సంబంధం వున్నదేమో చూడండి.

పా:- చూస్తానుగాని, నీవు యిందిపట్టునే వుంటావో లేక నాటకాలంటూ దేశంమీద పోతావో అనుమానంగా వుంది.

శేఖ:- నాటకాలు మానేశానని ఎన్నిసార్లు చెప్పాలి? ఎక్సాజ్‌మి. నేను నా ఆస్తిని స్వాధీనం చేసుకొని యేదైనా వ్యాపారం చేసుకోవాలను కుంటుంది.

పా:- నీ ఆస్తా...ఎక్కడుంది?

శేఖ:- మీ దగ్గరే. నాన్నగారు పోయేటప్పుడు నన్ను, నా ఆస్తి రెండు లక్షలటుంటుంది, మీ స్వాధీనం చేశారుగా.

పా:- ఆఁ...చేశాడు. నీవు నాటకాలవాళ్ళతో వూరు వదలిపోయావు. మీ నాన్నగారు చేసిన అప్పులు తీర్చడానికి రెండు లక్షలేమిటి, నా చేతిది 25 వేలు వదిలింది.

శేఖ:- ఏమిటి అప్పులా? ఏం అప్పులు?

పా:- ఎందుకురా అలా అరుస్తావ్? మీ నాన్న త్రాగుడికి, జూదానికి చేసిన...

శేఖ:- నోరుముయ్.

పా:- ఒరేయ్, ఒరేయ్! ఏమిట్రా, పెద్దా చిన్నా లేకుండా నన్ను నోరు మూసుకోమంటావా?

శేఖ:- అవును. మా నాన్న త్రాగుబోతా, జూదగాడా! ఇటువంటి కూతలు కూశావంటే పళ్ళు రాలగొడతాను.

పా:- ఒరేయ్! నీవు చాలా పెద్దవాడివైనావుగాని, నా యింటిలో ఒక్క క్షణం వుండొద్దు, వెళ్ళు వెళ్ళు.

శేఖ:- వెళతానుకాని బాబాయ్, నా ఆస్తిని మర్యాదగా స్వాధీనం చేశావా సరే, లేదా కోర్టుకు లాగి నీ పరువుతీసి నిన్ను ముప్పతిప్పలు పెట్టి నా ఆస్తిని నేను స్వాధీనం చేసుకోకపోతే నేను ఆంధ్ర నట సామ్రాట్ వచ్చ రామయ్యగారి కొడుకునేగాదు.

పా:- అరె పోరా! నీవిలా వస్తావని, అగాయిత్యం చేస్తావని నాకు తెలుసురా. తెలిసే నా పేర నయాపైసా లేకుండా అంతా కృష్ణపేర వేశాను. కోర్టుకు లాగి యేం చేసుకొంటావో చేసుకో పో.

శేఖ:- కృష్ణపేర వేశావా! సరే, ఆవిడ్నే అడుగుతాను. కృష్ణా! (లోని వెళతాడు)

[లోపల సంభాషణ]

శేఖ:- కృష్ణా!

కృష్ణ:- ఏం అన్నయ్యా! యేం కావాలి?

శేఖ:- మీరింత విశ్వాస ఘాతకులనుకోలేదు. నా ఆస్తినంతా కాజేసి తులుకు దామనుకొన్నారా?

కృష్ణ:- అన్నయ్యా! మాటలు జాగ్రత్తగా రానీ. ఎవరికి కావాలి నీ పాడు ఆస్తి?

శేఖ:- నోరుమూయ్. నా ఆస్తి నాకు యిస్తావా లేదా?

కృష్ణ:- నాకు తెలియదు. నాన్ననడుగు.

శేఖ:- ఆస్తంతా నీ పేరే వుంటే మీ నాన్న నడగడం దేనికి?

కృష్ణ:- నాకు తెలియదు.

శేఖ:- తెలియదూ?

కృష్ణ:- తెలియదు.

శేఖ:- కృష్ణా! ప్రాణంమీద ఆశవుంటే మర్యాదగా చెప్పు.

కృష్ణ:- నన్ను చంపుతావా? చంపు చూద్దాం.

శేఖ:- కృష్ణా!

కృష్ణ:- నోరుమూసుకొని అవతలకు నడువ్.

శేఖ:- ఏమన్నావ్? (కత్తితో పొడుస్తాడు)

కృష్ణ:- అమ్మా! (అని మూలిగి పడిపోతుంది)

పా:- కృష్ణా! తల్లీ!...నిన్ను చంపేశాడా? (అని లేచి తోపంకు పోతాడు. శేఖర్ రక్తసిక్తమైన కత్తితో ఎదురుగా వచ్చి)

శేఖ:- ఆగు...నిన్నుకూడా నీ కూతురుతోపాటు పరలోకానికి పంపుతాను.

పా:- (అరవబోతాడు)

శేఖ:- ఆలిచావంటే గొంతు తెగిపోతుంది.

పా:- అరవను. (అని మంచంపై వాలిపోతాడు)

శేఖ:- జాగ్రత్త! దొర వస్తున్నాడు. గుట్టు రట్టు చేశావా, మట్టుబెడతాను. ఖబడ్దార్ బడాచోర్.

దొర:- (లోనికొచ్చి పాపయ్యను కాగలించుకొని) పాపయ్యగారి! నన్ను రక్షింపుడు.

పా:- దొరా! నన్ను కాపాడు, నన్ను కాపాడు.

దొర:- పరిహాసముకాదు పాపయ్యగారు! పోలీసులు వారిని పట్టుకొన్నారు. నా కోసం వెతుకుతున్నారు.

పా:- పోలీసు లొస్తున్నారా? రాని, రాని. నీ పాపం పండిందిరా. నీకు వురిశిక్ష వేయించకపోతే నా పేరు పాపయ్యేకాదు.

దొర:- ఏమిటి? నాకు వురిశిక్ష వేయించుతావా పాపయ్యా! ఈ పాపములో నీకు భాగములేదా, భాగములేదా?

శేఖ:- దొరా! ముందు నీ పాపం పండింది. నీవు చిక్కుకొంటివి. ఈతని పాపం కూడా పండనున్నది. తొందరపడకుము. ఇక్కడ వుండిన నీకు రక్షణలేదు. ఆ పవిత్రమైన గ్రంథము నక్కడపెట్టి నీ పాప మును కడుగుకొనుము. పొమ్ము. పొమ్ము.

దొర:- పాపయ్యా! నన్ను ముందావ్. ఈ పాపం వూరికే పోదు. పైన దేవుడున్నాడు. చూస్తాడు. వస్తా! (వెళతాడు)

రంగ:- పాపయ్యా! అనకున్నంతా అయిందయ్యా. మనిద్దర్నీ పదవుల నుండి వూడబెరికేశారు. డబ్బు లెక్కాపక్కా అంతా వప్పజెప్ప మన్నారు. ఎంత అవమానం.

పా:- రంగనాధం! నా కొంప మునిగింది రంగనాధం!

రంగ:- నీ కొంపేందయా! నా కొంపకూడా మునిగుళ్ళా!

గో:- అయ్యా! కథంతా ఆడ్డం తిరిగిందయ్యా.

పా:- గోవిందూ! ఆంతా అయిపోయిండిరా. ఈ దుర్మార్గుడు, ఈ పాపాత్ముడు...

గో:- ఏంటయా! అన్నకొడుకును పట్టుకొని ఆట్లా శిదతారా?

పా:- వీడు అన్నకొడుకా! కాదు. నా కన్న కూతుర్నే పొట్టబెట్టుకున్న క్రూరకర్ముడు.

శ్రీహరి:- ఏమిటి మామయ్యా!

పా:- నాయనా శ్రీహరీ! వచ్చావా నాయనా! మన కృష్ణవేణిని వీడు హత్య చేశాడు నాయనా!

శ్రీ:- ఏమిటి? చంపేశాడా! కృష్ణా! (అని వెర్రిగా అరుస్తాడు)

కృష్ణ:- ఆ వస్తున్నా...నాన్నా! ప్రసాదం తీసుకోండి. (అందరూ నోరు తెరుస్తారు)

రంగ:- ఆఁ...యేంది పాపయ్యా! కృష్ణవేణిని చంపేశారని గోల చేశావు?

పా:- అమ్మా! నా తల్లి. నీవు బ్రతికే వున్నావా! నేను కలగనటం లేదు కదా! ఇప్పుడే కదమ్మా శేఖర్ నిన్ను హత్య చేసింది. ఇంతలోకే ఎలా బ్రతికావ్?

కృష్ణ:- ఏమిటి నాన్నా యీ హత్యలూ, చంపుకోవడాలు?

పా:- లేదు. నా కృష్ణ చావలేదు. నా బంగారుతల్లి బ్రతికే వుంది.

కృష్ణ:- (భయపడి కృష్ణ నాన్నగారి తలపై చెయ్యిబెట్టి) ఏమంది! నాన్న గారి వళ్ళు కాలిపోతోంది. కలవరింతలు కూడా మొదలైనై. వెంటనే డాక్టరుకు ఫోన్ చెయ్యండి.
(గోవిందు తట్ట తీసుకొని లోనకెళతాడు.)

శ్రీ:- అలాగే.

పా:- ఏమిట్రా, నన్ను పిచ్చివాడ్నిచేసి ఆడిస్తున్నారా?

శ్రీ:- ఏమిటి బావా, యిదంతా?

శేఖ:- ఏమీలేదు బావా! నా ఆస్తంతా కాజేసి కూతురు పేర వేశాడు. నేను లోపల చిన్న "మోనో" యాక్షన్ చేశాను. అంతే. బాబాయ్, ఎలా వుంది నా మోనోయాక్షన్?

రంగ:- మోనోయాక్షనా! యేంటయా అది ? జబ్బులో వున్న వాళ్ళతోనా పరిహాసాలా. ఈ దెబ్బతో ఆయన గుడాగి చచ్చుంటే యేం గావాలి?

శేఖ:- నేను చెప్పేది వినవయ్యా గంగనాధం !

రంగ:- ఏంటయా నువ్వు చెప్పేది సింగినాదం!

శేఖ:- మిష్టర్ సింగినాదం!

రంగ:- ఆఁ!

శేఖ:- ఎక్స్‌క్యూజ్‌మీ రంగనాథం! ఈ మాత్రానికే అయన గుండె ఆగిపోతే నా ఆస్తంతా అమాంతం కాజేస్తే నా గుండె ఏం కావాలని ఆలో చించావా? పైగా నన్ను హంతకుడని అవమానిస్తాడా !

శ్రీ:- అవును. ఇది భరించరాని అవమానం. కావా! వెంటనే దావా పడై, స్టాంపు ఖర్చులు నేను పెట్టుకొంటాను.

పా:- శ్రీహరీ! మర్యాదగా చెప్పుతున్నాను. నా వ్యవహారంలో జోక్యం కలుగచేసుకున్నావా, బాగుండదు.

రంగ:- పాపయ్యో! అయ్యగారి యవారం చాలదూరం పోయింది. అసలు నీకు తెలివిలేదు లేవయ్యా. లేకపోతే 30 సంపత్సరాలనుండి ఎదురు లేకుండా యేలుతున్నామే. ఈరోజు మనల్ని తీసేశారు. ఏంది అన్యాయం, అయో పాపయో! నీ పదవిలోకి ప్రసాదు, నా పదవిలోకి మీ అల్లుడు వచ్చేశారు. రెండు రోజుల్లోపల లెక్కా పక్కా అంతా వప్పజెప్పాలని తీర్మానించారు.

పా:- వాళ్ళెవరు నన్ను లెక్కలడగడానికి? అదేమీ వీలుకాదు. అసలది మీటింగే కాదు. ప్రెసిడెంటు లేకుండా మీటింగేమిటి ? అర్థం లేకుండా.

శ్రీ:- చూడయ్యా! అదేం లాభంలేదు. ఇప్పటికి జరిగిన అవమానం చాలు. మర్యాదగా లెక్కలు వప్పచెప్పండి.

పా:- నాకు మర్యాద నేర్పుతున్నావా నీవు? ఒరేయ్, నీవు నా అల్లుడివి కాదు. ముందు నా యింటిలోనుండి బయటికి నడువు.

కృష్ణ:- నాన్నా! మర్యాదగా మాట్లాడండి. ఆయనేమీ యిక్కడ గతిలేక వుండడంలేదు.

పా:- ఏమే, ఏమే! వాడే యెక్కువైనాడా నీకు? అంతేనే అంతే. కని పెంచి పెద్దచేసిన నేను నీకు పనికి రాకుండా పోయానా? ఛీ ! నీ మొఖం చూడగూడదు. వెళ్ళు.

కృష్ణ:- వెళతాం! మేమేమీ బ్రతకలేక యిక్కడుండడంలేదు. దిక్కులేని చావు చస్తావేమోనని కనిపెట్టుకొని వున్నాం. అందుకని అనరాని మాటలని అవమానిస్తారా? ఏమండీ, ఖయ్యర్దేరండి, వెళదాం. (విసు రుగా లోనికెళుతుంది. శ్రీహరి, శేఖర్లు ఆమె ననుసరిస్తారు).

రంగ:- అమ్మా! చూచావయో పాపయ్యా! కన్నతండ్రి కంటే కట్టుకొన్న మొగుడే ఎక్కువైనాడు. అంతేకదయా అంతే అసలు నీకు తెలివి లేదు లేవయ్యా. ఊరంతా వొకదారి. ఉలిపికట్టెది ఒక దారనా? మొండిపట్టు పట్టి అందర్నీ విరోధం చేసుకొన్నావు.

పా:- రంగనాధం! ఊరు పొమ్మంటుంది, యేరు రమ్మంటుంది. ఈ అవ సాన కాలంలో నాకెందుకయ్యా యీ చింత?

రంగ:- ఎందుకంటే? చేసుకున్నోడికి చేసుకొన్నంత.

[కృష్ణవేణి, శ్రీహరి, శేఖర్లు ప్రవేశిస్తారు]

పా:- యేం? వెళతారా? వెళ్ళండి.

కృష్ణ:- మేమెక్కడికి వెళతాం నాన్నా?

పా:- అవును. ఎక్కడికి వెళతారు? వెళితే యెలా బ్రతుకుతారు?

కృష్ణ:- మాకేం అంత దరిద్రమొచ్చింది? కావలసినంత ఆస్తి పెట్టుకొని.

పా:- ఏమిటి! నా ఆస్తితో కులుకుదామనుకొన్నారా? అదేం వీలుపడదు చెపుతున్నా.

శేఖ:- బాబాయ్! ఆఫ్ట్రాల్ నీ ఆస్తేమిటి; నా ఆస్తి కూడా కృష్ణపేర వ్రాశేశావ్గా. ఎక్స్ఛేంజ్ మి.

పా:- ఓసి పాపాత్ముడా! దానికంటా చెప్పేశావట్రా.

కృష్ణ:- చెప్పితే యేం? గోవిందా ... గోవిందా!

గో:- ఏమమ్మా?

కృష్ణ:- మీ అయ్యగారి మంచం లోపల పూజా మందిరం ప్రక్క గదిలో వెయ్. నాన్నా! మీ కిష్టమైనంచి భోజనం, మందులు అన్నీ అక్కడికే వస్తాయ్.. ఊరి పెత్తనంతో పాటు యింటి పెత్తనం

కూడా వొదులుకుని, కృష్ణా, రామా అనుకొంటూ ఆ గదిలో పడుందండి.

పా:- ఏమే, ఏమే! నువ్వేనా మాట్లాడేది?

కృష్ణ:- అవును. నేనే. అన్నయ్యా, గోవిందా! నాన్నగారిని లోపలకు తీసుకుపోండి! (అలాగే అతన్ని ఎత్తుకొనిపోతూ వుంటారు)

పా:- ఒరే శేఖర్!

శేఖ:- ఎక్స్‌క్యూజ్‌మి! ఎక్స్‌క్యూజ్‌మి!

పా:- ఒరే గోవిందా! అన్యాయంరా!

గో:- అఁ. కదుమలె. కదుమరె. (అంటూ పాపయ్యను లోనికి తీసుకెళతారు)

కృష్ణ:- ఏమండీ! గ్రామ డబ్బు, కాలేజీ డబ్బు. అంతా లెక్క చూడండి. యిచ్చేస్తాను. రికార్డంతా ఆ బీరువాలో వుంది, స్వాధీనం చేసుకోండి. (తాళపు చేతులు శ్రీహరి కిస్తుంది)

శ్రీ:- అంతేకాదు కృష్ణా! మీ అన్నయ్య ఆస్తికూడా మీ అన్నయ్య కిచ్చేయాలి.

కృష్ణ:- అలాగే! ఏమిటి రంగనాధంగారు, అలా నోరు తెరచుకొని చూస్తున్నారు?

రంగ:- ఇంకేముందమ్మా! చూడాల్సిందంతా చూసేస్తినే. (అంటూ నెత్తిన గుడ్డ వేసుకొని నీరసంగా నిష్క్రమిస్తాడు.)

[కృష్ణవేణి, శ్రీహరి నవ్వుకుంటూ వుండగా]

— తెర : —

మనిషి చావకూడదు

రచన :

యన్. ఆర్. నంది

పాత్రలు

శ్రీనివాసులు

రామచంద్రరావ్

హనుమంతరావ్

సుబ్బరాజు

సీత

ఒకానొక సమయంలో బాగా బ్రతికింది ఆ యిల్లు. యజమాని పడిపోవడంతో అదీ దిగాలు పడిపోయి శిధిలావస్థలో వుందిప్పుడు. ఇంట్లో ఆలంకరణలు లేవు. ఒకానొకప్పుడు బాగానే వుండి వుండొచ్చు. ప్రస్తుతం మాత్రం ఎదుటి గోడకి పాతకాలం నాటి ఆయిల్ పెయింటింగ్-ఒక నడివయస్సు స్త్రీది-వడిలిపోయిన పూల మాలతో వుంది. కుడివైపు ద్వారం పీధిలోకి, ఎడంవేపు ద్వారం యింటి లోపలి భాగాలకి. ఎదురుగాకనిపించే ద్వారం లోనించి వెనక గదిలో జీర్ణావస్థలో వున్న టేబిల్, కుర్చీ వుంటాయి. ఎడం వేపున మూలగా ఒక మంచం–ముక్కాలి పీట. కుడి వేపున ఐట్టలు దండెం, ఒక కుర్చీ విద్యుద్దీపాలు వుంటాయిగానీ, అవి ధనిక చిహ్నాలు కావు. కూలిపోయిన శిధిల సంసారానికి ఆనవాలుగా మిగిలి పోయిన పాతకాంపు స్మృతులు.

ఆ యింట్లో మూడు జీవచ్ఛవాలు బ్రతుకుతున్నాయి. మానసికంగా చచ్చిపోయిన ఒకానొకప్పటి శ్రీనివాసులు. ఆర్థికంగా చచ్చిపోతున్న అతని కొడుకు రామచంద్రరావ్, నైతికంగా చచ్చిపోవాల్సిన అతని కోడలు సీత. సత్సాంప్రదాయాలు గల నవ నాగరిక సమాజంలో మనిషి ఏ చావుం క్రైతే లొంగిపోకూడదో, ఆ చావులకే వాళ్లు మ్గుగురూ లొంగిపోయారు; పోతున్నారు; పోబోయారు.

తెర విడేసరికి మూల మంచం మీద శ్రీనివాసులు దగ్గుకి కిరకిర్లాడి పోతున్నాడు. ఎడం వేపు నించి సీత వచ్చి ఒక చింకి దుప్పటి అతని మీద కప్పింది. శ్రీనివాసులు దగ్గు తగ్గింది. సీత అతని వేపు అసహ్యంగా, కోపంగా చూసి, విసుక్కుని లోపలికి పోయింది. ఆమె వెళ్ళిన వేపే చూస్తున్న ముసలాయన బయట తలుపు తట్టిన చప్పుడు విని ఉలిక్కి పడ్డాడు.)

శ్రీని:- అమ్మా! సీతా! చూడమ్మా, రామచంద్రరావ్ వచ్చినట్టున్నాడు.
(లోపలినించి సమాధానం లేదు. తనే లేవబోయాడు)

సీత:- (వస్తూ) మీరు లేవడం ఎందుకు? 'ఇంట్లోవాళ్ళంతా ఎక్కడ చచ్చారు- జబ్బుమనిషే లేచి తలుపులు తియ్యాలా?' అని ఆయనచేత తిట్టించడానికా?

(శ్రీనివాసులు ఉస్సురంటూ కూలబడ్డాడు. సీత తలుపులు తెరిచింది. రామచంద్రరావ్ ఫైల్సుతో లోపలికి వచ్చాడు. చెప్పులు విడుస్తూ ఫైల్సు ఆమె కందించాడు. ఆమె తీసుకుని ఎదుట ద్వారంగుండా లోపలికెళ్ళి ఫైల్సు టేబిల్ మీద పెట్టివచ్చింది. ఈలోపున రామచంద్రరావ్ అక్కడేవున్న చెంబుతీసుకుని బయటకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చాడు. సీత తువాలు అందించింది. రామచంద్రరావ్ ముఖం, చేతులు తుడుచుకున్నాడు.]

రామ:- ఇజ్జిగాడింకా ప్రైవేట్‌నించి తిరిగిరాలేదా?

సీత:- లేదు.

రామ:- చంటాళ్ళు నిద్రపోయారా ?

సీత:- వాళ్ళంత త్వరగా నిద్రపోతే యిహనేం ? ఇక్కడ నేనొక్కదాన్ని తీరుబడిగా వున్నానుగా-నా ప్రాణం పీకి పాకాన పెట్టడానికి?
(శ్రీనివాసులు దగ్గాడు. రామచంద్రరావ్ అతని దగ్గరకు వెళ్ళాడు)

రామ:- ఎలావుంది నాన్నా, నీవంట్లో యిప్పుడు?

శ్రీని:- ప్రైకి పోవాలని గోల పెడుతున్నాను. వద్దని వారిస్తున్నాడు ప్రైవాడు.

సీత:- ఆయనడిగింది మీ జబ్బు గురించి-వేదాంతం గురించి కాదు.

శ్రీని:- తెలుసునమ్మా. మనిషి నేల మీద బోర్లాపడినప్పుడే వేదాంతం మాట్లాడతాడు.

సీత:- ఉహూఁ! (విసుక్కుంటూ లోపలికి పోయింది)

రామ:- అన్నట్టు చెప్పడం మరిచాను. డాక్టర్ ఈ మందులు రాసిచ్చారు నాన్నా!

శ్రీని:- నన్ను బ్రతికించుకోవాలనా? పిచ్చివాడా? ఆకు పండిపోయింది. మందులకి రాలకండా వుంటుందా?

రామ:- అదిగో అలా అంటే యిలా అంటావ్. మనసు పాడు చేసుకుంటే జబ్బేం నయమవుతుంది?

శ్రీని:- నాకింకా మనస్సు వుందనే అనుకుంటున్నావురా? అది మీ అమ్మతో బాటే పోయింది.

రామ:- సర్లే, యిక ఎక్కువగా మాట్లాడకు. కాస్సేపలా నిద్రపో.
(సీత వచ్చింది. రామచంద్రాక్‌కి ఒక కవరు అందించింది)

రామ:- ఏవిటది ?

సీత:- ఏమో! సుబ్బరాజుగారిచ్చారు.

రామ:- ఎప్పుడు?

సీత:- మధ్యాహ్నం.

రామ:- అతనెక్కడికి వెళ్ళలేదా ఈవాళ?

సీత:- ఎందుకెళ్తాడు ? ఇదో ధర్మసత్రం వుందిగా - దిక్కూ మొక్కూ లేనివాళ్ళందరొచ్చినా - నేనో యంత్రాన్ని వున్నానుగా - అందరికీ వండి వార్చి వడ్డించడానికి.

శ్రీని:- తప్పమ్మా! సుబ్బరాజేం దిక్కులేక మనింటికి రాలేదు.

సీత:- కాకపోతే యిదేవిటి? ఆతిధ్యమంటే ఒకటి రెండు రోజులుగానీ, నెలలు తరబడి నెత్తికెక్కూచుంటే ఇక్కడ మాత్రం దబ్బులు చెట్లున్నాయా? తేరగా రూపాయలు వస్తున్నాయా?

రామ:- సీతా! ఒకళ్ల గురించి అంత దురుసుగా మాట్లాడేముందు తారతమ్యాలు కూడా ఆలోచించాల్సి వుంటుంది.

సీత:- నాకా యోగ్యత లేదంటారు. ఇంతకూ నేను లేని కుటుంబంనించి వచ్చాననేగా మీ ఎత్తిపొడుపు?

శ్రీని:- ఇప్పుడందరం ఆదే గొంగళి బ్రతుకు బ్రతుకుతున్నాం తల్లీ! యోగ్యతలు, సంస్కారం గురించి మాట్లాడితే నీకున్నంత చదువూ, సంస్కారం ఈ యింట్లో ఎవరికున్నాయి చెప్పు?

సీత:- అలాగా, ఈ మాటల్ని ఏమంటారో? ఎత్తిపొడుపు కాదూ? ఛీ, ఛీ.
(సీత విసురుగా లోపలికి పోయింది. శ్రీనివాసులు కొడుకు తల నిమిరాడు)

శ్రీని:- రామూ! నేను జీవితంలో ఏమీ సుఖపడలేకపోయాను. నిన్నూ అలానే ఈ నరకంలో తోసేశాను.

రాము:- ఇప్పుడు నాకేం తక్కువ నాన్నా? చక్కగా వుద్యోగం చేసుకుంటున్నాను: పండంటి సంసారం...

శ్రీని:- ఇదే కదూ నీ పండంటి సంసారం...

రాము:- ఇందులో సీత తప్పు మాత్రం ఏవుంది నాన్నా? తనకి ఎన్నో ఆశలు వుండేవి. కాని పరిస్థితులు తల్లకిందులు కావడంతో పిచ్చిగా ఏదో మాట్లాడుతుండి గానీ, సీత మనసు వెన్నలాంటిది నాన్నా!

శ్రీని:- నా ఉద్దేశం అది కాదు రామూ! సీత ఉద్రేకానికి అసలు కారణం నాకూ తెలుసు. కాని ఆ స్థితినించి మన్ని మనం రక్షించుకోవడం ఎలాగన్నదే నాబాధ.

రాము:- రోజు లెప్పుడూ ఒకేలా వుండవు నాన్నా! ఒకనాటికి కాకపోతే ఒకనాటికేనా మారతాయి.

శ్రీని:- ఆశ. ఆ ఆశతోనే బ్రతుకుతాం. ఆ ఆశ ఏనాటికైనా ఫలిస్తుందనే జీవితాన్ని ఈడ్చుకుపోతాం. కాని నేను నాశనమై, మిమ్మల్నందర్నీ సర్వనాశనం చేశాను రామూ!

రాము:- పోన్లే, ఆ వెనకటి విషయా లెందుకులే!

శ్రీని:- భరించ లే నంటావ్. కాని నాకు తప్పటం లేదు. ఇలా పనీ పాటా లేకండా ఒంటరిగా ఈ కుక్కి మంచంలో పడుకునుంటే నా మెదళ్ళో మెదిలేవి ఆ భూతాలే రామూ!

[హనుమంతరావ్ బయట నించి వచ్చి తండ్రి కొడుకుల్ని చూశాడు.]

హను:- ఏవిటి తాతయ్యో య్! కొడుకుని కావలించుకుని ఆ ముద్దు ముచ్చట్లు?

[ఎవరూ మాట్లాడ లేదు.]

హను:- ఆఁ, చూవఁయ్యో య్! ఇందాక బజార్లో సుబ్బరాజు కనిపించాడు.

రాము:- ఏవఁన్నా చెప్పాడా?

హను:- విశేషాలు అంత పెద్దగా లేవుగానీ, ఈ భూకలాన్నంతట్నీ ఉద్ధరించే పథకం వేసేట్టు పోజిచ్చి "వెల్ మై బాయ్" అన్నాడు ఉపోద్ఘాతంలో...

శ్రీని:- సోది మాని సరిగ్గా చెప్పరా.

హను:- సంగ్రహంగా చెప్పాలంటే ఆయన ఘటసేపు వూదరగొట్టిన లెక్చర్‌లో ఆవగింజంతైనా అంశం లేదు. ఎంతయినా పొలిటికల్ లీడర్ అయ్యో లక్షణాలు మరి!

(హనుమంతరావు సోది వినలేక రామచంద్రరావ్ కవర్ విప్పాడు.)

హను:- ఆ కవరు సుబ్బారాజు యిచ్చిందేనా? చదవడం అనవసరం. అందులో ఏం వుంటుందో నేను చెప్తాను. అందులో టూకీగా రాసుంటాడు. విపరాలు నాకు చెప్పాడు.

శ్రీని:- ఏవిటా వివరాలు?

హను:- వివరాలు కూడా వివరంగా వివరించ నవసరం లేదు తాతయ్యా, అందులో జరగబోయే క్లైమాక్స్ను చెప్తాను: పిల్లై సంత త్వరలో ఈ సుబ్బరాజూ ది గ్రేట్ శ్రీ కృష్ణుడు పుట్టిన కటకటాల గదికి పంపించేస్తాడు.

శ్రీని:- జైలుకా?

(రామచంద్రరావు వుత్తరాన్ని చదివి పక్కకి పారేశాడు.
హనుమంతరావు ఆ వుత్తరాన్ని అందుకుని జేబులో పెట్టుకుంటాడు.)

హను:- ఏవిటి పిల్లేనిది? జైలుకి వెళ్ళడవా? ఆయన సలహా పాటించడవా?

రామ:- రెండూను.

హను:- ఎందుకో?

రామ:- అంతరాత్మను చంపుకోలేను.

హను:- (నవ్వాడు.) నీకో అంతరాత్మ వుందేవిటి మావయ్యా?

శ్రీని:- ఏవిటి రాశాడు అందులో?

హను:- జైల్లోకి పోయేందుకు అయిదు సులభ సూత్రాలు.

శ్రీని:- నువ్వుండరా! రామూ, ఏవిట్రా రాసింది అందులో?

రామ:- ఎప్పుడూ పాడే పాతపాటే.

శ్రీని:- బాకీ తీర్చమంటున్నాడా?

హను:- మహానాయకుడు-అంత 'కర్ట్'గా చెప్పేస్తాడా? డిప్లమసీ తాతయ్యా-డిప్లోరబుల్ డిప్లమసీ! డొంకతిరుగుడుగా చెప్తాడు. త్వరలో ఎమ్మెల్యే అయి మినిష్టర్ కావాలని కలలు కాస్తున్నాడు. ప్రాక్టీస్‌కోసం అందాకా యిలా వుత్తరాలు రాస్తున్నాడు.

రామ:- మన కష్టాలు చూడలేకపోతున్నాడట.

హను:- డిప్లమసీలో ప్రథమసూత్రం : అలా సానుభూతి చూపడం.

రామ:- అందుకు ఆయనో వుపాయం చెప్పాడు.

హను:- మనిషిని తప్పుదారిలోకి మళ్ళించేముందు తన గ్రిప్‌లోకి లాక్కోవాలి. నెంబర్ టు అది.

రామ:- లంచం తీసుకోమంటున్నాడు.

హను:- 'ఫైనల్ బ్లో'. ఇది చెప్పడంలోనే పొలిటిక్స్ రహస్యం దాగివుంది.

శ్రీని:- నువ్వుండరా. అయితే ఆ లంచాలు ఎలా తీసుకోవాలో చెప్పాడా?

హను:- Exactly. పరిష్కారం చూపించకపోతే పొలిటీషియన్ కాలేడు. అఫ్‌కోర్స్ పెర్వర్టెడ్ పొలిటీషియనే అనుకో.

శ్రీని:- ఏవిటి రామూ నీ వుద్దేశం?

హను:- యు మిస్ ది అవుట్ కమ్? నెట్ రిజల్ట్? జైలు మనకి, డబ్బు ఆతనికి. ఇదే ఈ ట్వన్టియెత్ సెంచరీ పొలిటికల్ ఫిలాసఫీ తాతయ్యా! నీకేం తెలుసు ఈనాటి డెమోక్రసీ గురించి!

శ్రీని:- ఒరే హనూ! నువ్వు కాసేపు నోరు మూసుకుంటావా?

హను:- ఏవిటి తాతయ్యా, నువ్వు మరీ యింత పిచ్చిగా మాట్లాడుతావ్! ఆ సుబ్బరాజు మన కొంప నిలబెట్టేందుకు వచ్చిన దేవతే అనుకుంటున్నావా?

రాము:- అలా అని నాన్న ఎప్పుడూ అనుకోలేదురా.

హను:- నా వాక్యం యింకా పూర్తి కాలేదు అంకుల్. నేనూ అక్కడికే వస్తున్నా. పూర్వజన్మలో-అంటే తాతయ్య బాగా బ్రతికిన దినాల్లో -ఈ సుబ్బరాజు తండ్రి-సమ్ ఎక్స్ - యమరాజో వాడి తాతో తాతయ్యకు ఆప్పిచ్చాడు. చివరికి, చచ్చేముందు ఈ సుబ్బరాజుని వీలునామా చేసుకోమని ఫర్మానా జారీచేసి మరీ చచ్చాడు. అది యిప్పుడు మనముున్న పరిస్థితుల్లో చచ్చినా తీర్చలేం. అది సుబ్బరాజుకీ తెలుసు, మనకీ తెలుసు. అందువల్ల లంచాల ఉచ్చులోకి అందర్నీ లాగి ఆ డబ్బు మన చేతికి చిక్కకుండానే అడ్డంకొట్టి కథని కంచికి మనల్ని శ్రీకృష్ణుడు పుట్టిన దగ్గరికీ పంపించెయ్యాలని అతని ఎత్తుగడ.

శ్రీను:- అప్పు తీసుకున్నాక తీర్చక తప్పుతుందా?

హను:- అప్పు నువ్వు చేసుకున్నావ్; మామయ్య చెయ్యలేదు.

రాము:- హనూ! ఏవిట్రా నువ్వు మాట్లాడేది? అప్పు ఎవరు చేస్తేమటుకు తీర్చే బాధ్యత నామీదలేదా?

హను:- శ్రీరామ చంద్రుడంతటి వాడివి. నీమీద ఎందుకు లేదంటాను? కాని మామయ్యా, ఒక్క విషయం ఆలోచించు! నీ జీతం యిప్పుడెంత? నెలకి నూటయాభై. అందులోనే మనమందరం బ్రతకాలి. రేపు నీ కొడుకులు పెరిగి చదివి ప్రయోజకులు కావాలి. ఇప్పుడు నువ్వు జైలుకుపోయి, వాళ్ళని మరోతరం మైటురాళ్ళుగా మార్చేస్తావా?

శ్రీను:- వాడెందుకు జైలుకి వెడతాడు? లంచం తీసుకుంటే కదా?

హను:- తీసుకోవాలి.

రాము:- తీసుకోను.

హను:- మరి అప్పుమాట?

(రామచంద్రరావు ఏం చెప్పలేక కూలబడ్డారు. సీత వచ్చింది)

హను:- అత్తయ్యా!

సీత:- ఏం ఉల్లుడూ?

హను:- చంపేశావ్! నువ్వు సరిగ్గా మూడ్‌లో వున్నట్లు లేదు. ఆ కాఫీపొడి, పంచదారా ఎక్కడున్నాయో చెప్పు. రెండు కప్పుల స్ట్రాంగ్ డోన్ పడేస్తే విళ్ళిద్దరూ తేరుకుంటారు.

సీత:- ఆ పాపంకూడా నాకెందుకు? కాచి తయారుగానే వుందాను. పట్టుకొస్తా వెళ్ళి.

హను:- లెట్ మి హేల్ప్. నష్ణ కూడా కాస్త సాయం చెయ్యనీ. పాపం ఒక్కడాసిపీ ఎంతకని కష్టపడతావు.

సీత:- నీ సానుభూతికి ధన్యవాదాలు. ఆ వేలితోనే రేపు నా కంట్లో పొడుస్తావు.

హను:- నేనా? ఎంతమాటనేశా వత్తయ్యా!

సీత:- ఏం నువ్వు, మనిషివి కావా? మొదట్లో ఈ కొంపలో నీలానే సానుభూతి చూపించారంతా. రాన్రాను 'ఎవడికోసం చేస్తుంది, వంటింటి కుందేలు' అన్నట్టు బిగుసుకూర్చున్నారు.

(రామచంద్రరావు ఎదుటి గదిలోకి పోయి వైల్స్ ముందు కూలబడ్డాడు.)

హను:- (టాపిక్ మారుస్తూ) ఈవేళ కూరేమిటి చేస్తున్నా వత్తయ్యా?

సీత:- వెజిటిబుల్ పలావు చేస్తున్నా నల్లుడూ! త్వరగా కట్టించుకతిందువు గాని.

హను:- ఎందుకు కంగారు పడతావు? వెజిటెబుల్ పలావు కాదు, ఏనుగుల్ని తినే రోజు కూడా వస్తుంది.

సీత:- 'వై జన్మలో రాక్షసులమై పుట్టాక' అని కూడా కలుపు.

హను:- చూస్తావుగా ఏ జన్మలో తింటావో? మరో రెండు నెలలు ఓపికపట్టు. మనం అప్పటికి ఉద్యోగంలో చేరి...

సీత:- ఉద్యోగాలు చేసేవాళ్ళు యింత వెలగబెట్టేస్తున్నారు, నువ్వు చేసి మరింత వెలగబెడతావు.

శ్రీని:- హనూ, నువ్వింక లోపలికి పోతావా?

సీత:- అతన్నెందుకు క్షమించడం? ఆ మాటలన్నది నేను.

హను:- కాని నిన్ననడానికి తాతయ్యకు దమ్ములేవత్తయ్యా! ఇక్కడ నే నొకణ్ణి అలుసుగా వున్నానుగా?

శ్రీని:- ఇక్కడెవరూ ఎవరికీ అలుసుకాదురా హనూ, ఎవరికున్న స్థానం వాళ్ళకుంది. ఆ స్థానం విలువ తెలుసుకుంటే ...

సీత:- ఆ విలువ నాకు తెలీదంటారా అయితే?

శ్రీని:- నిన్నన లేదు సీతమ్మా!

సీత:- మరెపర్ని? ఏం చేత కాకపోయినా ఈ కొంపలో ప్రతీవాళ్ళకూ సూటిలు విసరటం మాత్రం తెలుసు.

హను:- కరెక్టు. నీ విషయంలో కూడా సెంట్ పెర్సంట్ కరక్టే నత్తయ్యా!

రామ:- (లోపలనించి అరిచాడు) హనూ !

హను-: పిలిచావా మావయ్యా ?

రామ:- (లోపలి నించే) దయచేసి కాసేపు నన్ను వూపిరి పీల్చుకోనిస్తావా?

హను:- కాంక్షన్డ్. అలానే మావయ్యా... ఏం అత్తయ్యా, మావయ్యకు ఊపిరి సలపటం లేదట. కాస్సేపు వాళ్ళనలా వొదిలేసి మన పెళ్ళి వంటపని చూసుకుంటావా?

సీత:- పిల్లని చంకన పెట్టుకుని కాశీకి వెళ్ళినట్టు నువ్వెందుకు నా వెనకాల?

హను:- తోడు. ఫర్ హెల్ప్. ఎంతయినా మనిషిని చూడూ : పరుల కష్టాల్లో ఆదుకోవడం నా ఐర్రైడ్. నడు నడు.

(హనుమంతరావు ఆమెను లోపలికి తీసుకుపోయాడు. రామచంద్రావు చిరాగ్గా బయటికి వచ్చాడు. తండ్రిని చూసి సిట్టూర్పు విడిచాడు. బయటకు వెళ్ళబోయాడు)

శ్రీని:- ఎక్కడికి రామూ?

రాము:- తెలీదు (వెళ్ళిపోయాడు)

హను:- (రెండు కప్పుల్తో వచ్చాడు.) మావయ్యేడీ?

శ్రీ:- వెళ్ళిపోయాడు.

హను:- ఎందుకు?

శ్రీని:- ఆత్మశాంతికోసం.

(ఒక కప్పు బల్లమీద పెట్టి, తనో కప్పు తాగుతున్నాడు హనుహంతరావు)

హను:- ఎలాగైనా అత్తయ్యది అమృతహస్తం తాతయ్యా, మనిషి చేదుగా మాట్లాడుతుంది గానీ... (బయట చప్పుడైతే బయటకు చూశాడు) ఒహో సుబ్బరాజుగారా! సుస్వాగతం, రండి రండి.

సుబ్బరాజు:-(వస్తూ) రామచంద్రరావు అంత కంగారుగా వెళ్ళిపోతున్నా డెక్కడికి?

హను:- గోదార్లోకి.

సుబ్బ:- ఆఁ?!

హను:- తాత య్యన్నాడు.

సుబ్బ:- దాల్లేవయ్యా! నీకింకా శుద్రతనం పోలేదు.

హను:- లేకపోతే పొలిటిషియన్నే అవుదును, బైదిబై మాష్టారూ - ఈ మధ్య నాకు పొలిటికల్ సైన్సు మీదికి తెగప్రాణం పోతోంది. థియరీ చదివేశాను. కాస్త ప్రాక్టికల్ ట్రైనింగ్ యిస్తారూ?

సుబ్బ:- నాకేం తెలుసు?

హను:- ఆఁ ఆఁ. గొప్పవాళ్ళు అలానే అంటూంటార్లెండి.

సుబ్బ:- నేను గొప్పవాణ్ణా నీ ఉద్దేశం?

హను:- నా ఉద్దేశంకాదు. క్రితం సారు ఎలక్షన్లలోనూ మీకు ఓటిచ్చిన ఏడు వోటర్లదీను...ఆఁ ఏవంటారు? ఇస్తారా ట్రైనింగ్?

[కోపంగా మాకు మాటాడలేక తల పక్కకి తిప్పాడు. కాఫీ కప్పు కనిపించింది]

హను:- కమాన్ కమాన్, కాఫీ నావాలా? తీసుకోండి. [కప్పు అందించాడు]

[తాగి దోకున్నంతపని చేశాడు.]

హను:- మీ యిందిదగ్గర మిమ్మల్ని తలుచుకుంటున్నట్టున్నారు. బై ది బై ఈ మధ్య మీరేదో కొత్త బిజినెస్ మొదలెట్టారట?

సుబ్బ:- కొత్త బిజినెస్సా?

హను:- ఆఁ...దానికి సరైనమాట దొరకటంలేదు. అందాకా బ్రోకర్‌పని అందాం. మరి కంపెనీపేరు ఏవిఁటి పెట్టారు?

సుబ్బ:- బిజినెస్ ఏవిఁటి? కంపెనీ ఏవిఁటయ్యా?

హను:- పొలిటిషియన్ల పనులు గురించి చిన్నవాణ్ణి, నాకేం తెలుస్తుంది సార్! అయితే నాదో చిన్న సజెషన్. మీ కంపెనీకి 'లందాల కంపెనీ'అని నామకరణం చేస్తే?

శ్రీని:- హనూ! ఏవిఁటా వెధవ్వాగుడు?

హను:- వెధవ్వాగుడు? అవున్లే, నేను చెబితే వెధవ్వాగుడులానే వుంటుంది. అదే ఏ పొలిటిషియన్ అన్నా చెబితే—

శ్రీని:- సర్లే, ఇహ నువ్వు లోపలికి పోతావా పోవా?

హను:- [సుబ్బరాజు చేతిలోంచి తాగబోతున్న కప్పు లాక్కున్నాడు] కప్పు యిచ్చెయ్యండి.

[హనుమంతరావు వెళ్ళిపోయాడు]

శ్రీని:- వాడిమాట అంతగా పట్టించుకోకు బాబూ! పిచ్చివెధవ! ఏదో వాగుతూ వుంటాడు.

సుబ్బ:- పర్వాలేమలెండి...అయితే నా వుత్తరంమీద మీ యింట్లో యింత వరకూ దాలా రగడ జరిగి వుంటుందన్నమాట! ఆఫ్‌కోర్స్, నా వూహే అనుకోండి.

శ్రీని:- రగడేవుంది బాబూ! ఆది రామచంద్రరావ్ అంతరాత్మకు విరుద్ధమంటున్నాడు.

సుబ్బ:- మీ అంతరాత్మ కెలావుంది?

శ్రీని:- నా అంతరాత్మ ఏనాఢో చచ్చిపోయింది.

సుబ్బ:- అయితే పేచీయే లేదు. మీరు మాటాడకండా వూరుకోండి. రామ చంద్రరావుని నేను ఒప్పిస్తాను.

శ్రీని:- వద్దు బాబూ !

సుబ్బ:- అయితే, జీవితాంతం ఈ కుళ్ళులో, ఈ దరిద్రాన్ని అనుభవిస్తూ కాలం గడుపుతారా?

శ్రీని:- నుదుటిరాత ఎలావుంటే అలా జరక్క తప్పుతుందా?

సుబ్బ:- నాన్సెన్స్. ఈ నుదుటరాతను ఎవర్రాశారండీ? మనమే రాసుకుంటున్నాం. మనమే గిరి గీసుకుంటున్నాం. మనమే అందులో పడుతున్నాం. అందులోనుంచి బయటకు రాలేకా, వస్తే ఛస్తామనే భయం వల్లా అందులోనే మగ్గిపోతున్నాం. ఎందుకండీ ఈ పనికిమాలిన వేదాంతాలు?

శ్రీని:- వేదాంతాలు కాదు బాబూ, జీవితాలు! మీ నాన్న నీకు బహుశః చెప్పే వుంటాడు. ఒకానొకప్పుడు యీ శ్రీనివాసులు ఎలాంటివాడో ! చేతికి ఎముక లేదన్నారంతా. అందుకే ఆ చేత్తో గిరి గీసుకోలేక పోయాను. ఆడినమాట తప్ప ననేవారు. అందుకే అలుసై పోయాను. ప్రజ లోకవ కట్టింది. కట్టుకున్న భార్య ఏడ్చేది. ఆనాడు అదో తమాషా జీవితం. భవిష్యత్తు మున్ముందు యింత చీకటైపోతుందనీ, ఇరుకైపోతుందనీ ఊహించగలిగితే నిజమే- నువ్వన్నట్టు నా చుట్టూ పెద్ద గిరే గీసుకుని అందులోకి చీమనైనా రానిచ్చి వుండేవాణ్ణికాను.

సుబ్బ:- అవంతా గతం. అది తవ్వుకోకండి ఇప్పుడేం చెయ్యదల్చుకున్నార?

శ్రీని:- ఏం చెయ్యగలను? చెయ్యగలిగినా-చెయ్యనివ్వదు.

సుబ్బ:- మరి నా బాకీ మాట?...తిలోదకాలు వదులుకోమంటారా?

శ్రీని:- ఎంతమాట బాబూ!

సుబ్బ:- మరి?

హను:- (లోపలినుంచి వచ్చాడు వాళ్ళ మాటలు వింటూ వున్నాడు)

శ్రీని:- ఏ తల తాకట్టు పెట్టయినా యిచ్చేస్తాగాని అంత మాటనగలనా?

సుబ్బ:- ఈ యింట్లో ఏ తలకు పాతిక వేలు చేసే విలావుంట?

హను:- మీ తలకి వ్వంది. ఆఫ్‌కోర్స్. అది కుక్కలకూడా పనికిరాదని గత మూడు ఎలక్షన్లలోనూ తేలిపోయిందనుకోండి !

శ్రీని:- హనూ !

హను:- ఎక్కువగా మాట్లాడకు తాతయ్యా. దగ్గొస్తే డబ్బులేదు.

సుబ్బ:- నా బాకీ విషయం అడుగుతున్నాన.

హను:- ఎక్కణ్ణుంచి వస్తుందండీ? ఇప్పుడు మీరేగా అన్నారు-ఈ కొంపలో ఎవరితలా పాతిక వేలు చెయ్యాదని?
(సీత ద్వారం దగ్గిరకొచ్చి నిలబడింది. సుబ్బరాజు సీతను చూశాడు. అది హనూ చూశాడు.)

సుబ్బ:- (సీతను క్రీగంటి చూపుతో చూస్తూ) చేస్తుంది.

హను:- (గ్రహించాడు) అగ్ని పర్వతాన్ని మూర్ఖులు, ఇడియట్స్ తప్పించి మరెవడు కొనుక్కోడానికి సాహసిస్తారు చెప్పండి.

సీత:- హనూ!

హను:- ఓయ్!

సీత:- నువ్విక లోపలికి దయచేస్తావా?

హను:- సీతమ్మవారి ఆజ్ఞ దశరథ మహారాజుగారిని కూడా కదిపి తీసుక రానియ్ మరి! తే తాతయ్యా, కాస్తంత మళ్ళు తడుచుకుని, ఆనక తీరుబడిగా వేదాంతం మాట్లాడుకుందువుగాని!

శ్రీని:- వస్తాను. నువ్వెళ్ళు.

హను:- సుబ్బరాజుగారి పాక్ ట్రీట్‌మెంట్‌తో నిన్ను మటుకి నీకు నడిచివచ్చేసే టంత బలం వచ్చిందేవిటి?

సుబ్బ:- నేనేం షాక్ యిచ్చలేదు.

హను:- జబ్బు మనిషి దగ్గర బాకీ విషయం ఎక్కడకం ఏంటారండి?

సుబ్బ:- అయితే? ఈయన మూడేళ్ళ నించీ మంచం పిడుస్నారు. ఆలా అని నేనిక ఎస్నాళ్ళూరుకోవాలి?

హను:- ఆయన మంచం మీంచి లేచి తిరిగేవరకూ.

సుబ్బ:- అదీ జన్మలో సాధ్యపడదు.

హను:- సుబ్బరాజుగారూ !

సుబ్బ:- ఎందుకలా పొలికేకలు పెడతావ్ ?

హను:- పొలిటిషియన్ నవుదామని.

శ్రీని:- ఒరే హనూ! నేనిలాగన్నా ఇక్కడ వుండటం సికిష్టం లేదట్రా?

హను:- లేదు. అందుకే లోపలికి రమ్మంటున్నా.

సీత:- హనూ! నువ్వికలోపలికొచ్చి స్నానాలగదిలో వేణ్ణీళ్ళుపెట్టు. తర్వాత ఆయన్ని తీసుకురావచ్చు. (లోపలికి పోయింది.)

హను:- (రుసరుసలాడుతూ లోపలికి పోయాడు.)

శ్రీని:- నువ్వా కుర్రవెధవని అంతగా పట్టించుకోకు బాబూ!

సుబ్బ:- అబ్బే-ఆ పట్టింపులే వుంటే మూడు నెలలు యిక్కడ వుండగలిగే వాణ్ణా?

శ్రీ :- నీ బాకి రెండు మూడు మాసాల్లో తీర్చేస్తాను బాబూ!

సుబ్బ:- రామచంద్రరావుని వొప్పిస్తారా?

శ్రీని:- కాదు, ఈ యిల్లు అమ్మేస్తాను.

సుబ్బ:- (హేళనగా) ఈ యిల్లా?

హను:- (వచ్చాడు) ఈ యిల్లా అని యింత పొడుగు సాగదీసి అంటున్నారు- ఈ యింటికే.?

సుబ్బ:- ఏం లేదూ? ఇంద్రభవనంలా వుంది కదూ! భవనం ముంగు గార్డెన్, ఎండకూ వానకూ చెక్కు చెదరని సైకప్పు - టీకొ-తాజ్‌మహల్ కదూ?

హను:- తాజ్‌మహల్ భవంతి కాదు సార్-కరక్ట్ యువర్ సెల్ఫ్- అదో సమాధి. మీకు కావలిస్తే తీసేసుకోండి.

సుబ్బ:- నాకు స... సమాధి చేస్తానంటావా? విన్నారా శ్రీనివాసులుగారూ ఈతని మాటలు?

హను:- ఆయనకు చెప్పడనేది యింకా రాలేదు సార్!

శ్రీ:- హనూ! హనూ! హనూ! నన్ను చంపేస్తేనేగాని నీ కసి తీరదట్రా ?

హను:- ముందు లోపలికిరా, సిళ్ళెట్టి వొళ్ళు తుడుస్తాను.

సుబ్బ:- నా బాకీ మాట తేల్చండి.

హను:- మూణ్ణెల్లు యిక్కడ పడి ఎలానూ మేసేశారు. మరో ఆర్నెల్లు ఓపిక పట్టండి. ఏకంగా నవమాసాలూ నిండిపోతాయి.

శ్రీని:- (లేచాడు) క్షణం ఆగుబాబూ, వచ్చేస్తాను.

సుబ్బ:- నా బాకీ మాట తేల్చెయ్యాలి-ఇప్పుడే ఈ క్షణమే!

హను:- అలా జపిస్తూ ఆ కుర్చీలో కూచోండి-వచ్చేస్తాం యిప్పుడే.
(హనుమంతరావు నిర్లక్ష్యంగా శ్రీనివాసుల్ని లీసుకుని పోవడంతో సుబ్బరాజు కసిగా నేలమీద తన్నాడు. సీతవచ్చి శ్రీనివాసులు పక్క సర్దుతోంది)

సుబ్బ:- విన్నారుగా అయన సమాధానాలు?

సీత:- విన్నాను.

సుబ్బ:- ఏం చెయ్యాలి అయితే నేనిప్పుడు?

సీత:- ఈ తాజమహల్ తీసేసుకోమన్నారుగా?

సుబ్బ:- ఈ సమాధి నాకేం పనికొస్తుంది-నేనేం చేసుకోను?

సీత:- సమాధులు బ్రతికున్నవాళ్ళకి పనికిరాకపోవచ్చు.

సుబ్బ:- సీతా!

సీత:- అలా అరవకండి. ఆలా పిలిచే హక్కు నాభర్తకొక్కరికే వుంది.

సుబ్బ:- భర్త...అతనొక భర్త, తమరొక భార్య!

సీత:- సుబ్బరాజుగారూ! మాటలు కాస్త గౌరవంగా రానివ్వండి.

సుబ్బ:- చిత్తం సీతాదేవిగారూ!

సీత:- యిక యిప్పుడు మీకేంకావాలి? అప్పు తీర్చేస్తా మన్నారుగా?

సుబ్బ:- ఆవసరంలేదు.

సీత:- ఎందుకో?

సుబ్బ:- అప్పుతీరిపోయాక యిక ఈ యింటికొచ్చే అవకాశం నాకుండదు.

సీత:- శాశ్వతంగా ఈ యింటిని పట్టుకుని వేళ్ళాడదామనా?

సుబ్బ:- అవును సీతా! నీకోసం. నిన్ను చూస్తూంటే జాలేస్తుంది. ఎక్కడ వుండవలసినదానవు! ఎక్కడ కొచ్చావు! ఈ కంపు కొంపలో, నిత్యదారిద్ర్యంలో, ఈ పిచ్చివాళ్ళ మధ్య నీకేం సుఖం వుంటుంది?

సీత:- మరెక్కడవుంటాయ్?

సుబ్బ:- నాతో వచ్చేయ్.

సీత:- ఎక్కడికి?

సుబ్బ:- మాయింటికి.

సీత:- నాకు ముగ్గురు పిల్లలున్నారు. వాళ్ళనేం చెయ్యమంటావు?

సుబ్బ:- మధ్యలో వచ్చినవాళ్ళు, మధ్యలోనే పోతారు. నాతో వచ్చేయ్ సీతా!

సీత:- వస్తే హంసలా చూసుకుంటారా?

సుబ్బ:- అంతకంటే ఎక్కువగా చూసుకుంటా. నాకున్న యావదాస్తి నీ పేర రాసేస్తాను. ఆలోచించుకో సీతా! నువ్వు రామచంద్రరావు దగ్గర సుఖపడ్డావు. అతనికి నిన్ను సుఖ పెట్టాలనే యింగితం కూడా లేదు. నువ్వు నగరాల్లో పుట్టిపెరిగావు. పెద్దచదువులే చదివావు. కాని వాటికి విలువ నెక్కడ యిస్తున్నారు? ఒక్కనాడైనా ఒక్కసారైనా నిన్ను తీసుకుని అలా సినిమాకిగానీ, షికారుకి గానీ వెళ్ళాడా నీ భర్త? ఎప్పుడూ ఈ నరకమేనా? ఎప్పుడూ ఈ నాలుగ్గోడలేనా నీ జీవితం? నీకు మాత్రం ఆశలు లేవూ? నీకు మాత్రం ప్రపంచాన్ని చూడాలని వుండదూ?

సీ:- మీ అమ్మకూడా అలాంటి ఆశలే వుండేవేమో? కాని మీ నాన్న గారు ఎప్పుడైనా ఆమెకు సినిమాలు చూపించి ప్రపంచం తిప్పి కొచ్చారా?

సుబ్బ:- వాళ్ళు పాతకాలపువాళ్ళు.

సీత:- అయితే నేనిప్పుడు మీతో వచ్చేస్తే నన్ను మనస్ఫూర్తిగా స్వీకరించగలరా?

సుబ్బ:- ప్రమాణంచేసి చెబుతున్నా.

సీత:- సరే, మీ యిష్టం. మీవెనక రావడానికి నాకెలాంటి అభ్యంతరమూ లేదు.

సుబ్బ:- [ఆనందంగా] సీతా!

సీత:- అయితే ఒక షరతు.

సుబ్బ:- ఏవిటి?

సీత:- తప్పకండా చేస్తారా?

సుబ్బ:- మళ్ళీ ప్రమాణం చేస్తున్నా! నీకోసం ఏవన్నా చేస్తా.

సీత:- అయితే-మీ తలిదండ్రులకి ఎందరు సంతానం?

సుబ్బ:- ముగ్గురం.

సీత:- ఆ ముగ్గుర్నీ విడిచిపెట్టి, మీ అమ్మను మరో మనిషితో లేచిపోయే ఏర్పాట్లు చేస్తారా?

సుబ్బ:- సీతా!

సీత:- సౌ॥ండ్రల్! [లెంపకాయ కొట్టింది.] పో యికృష్ణుంచి, త్వరగా పో. ప్రాణంమీద ఆశవుంటే ఆయన రాకముందే పో, గెటవుట్.

[సీత రయ్యన లోపలికివెళ్ళింది. సుబ్బరాజు చెంప తడుముకుంటూ కోపంతో పరాభవంతో ముక్కులిపిటను తన్నాడు. హను లోపలినించి గబ గబా వచ్చాడు.]

హను:- సుబ్బరాజుగారూ! ఇక్కడ కుక్కలొకటి వుందట. తన్ని తగిలెయ్యమంది అత్తయ్య. [చుట్టూ వెదికి] ఏదీ, ఎక్కడా కనిపించ

దేం చెప్మా ? హనుమంతులవారు వస్తున్నట్టు పసిగట్టి పోయిందేవిఁటి చెప్మా ? ... ... అదిగో, ఎక్కడికి పోతున్నారు సుబ్బాజీ. రండి మాష్టారూ, మీ పని పూర్తి కాకండానే పోతున్నారు ?? [అడ్డం వచ్చాడు].

సుబ్బ:- నన్ను పోనీ.

హను:- అంత కంగారై తే ఎలాసార్ ? ఆలోచించడానికి మావఁయ్య గోదార్లోకి వెళ్ళాడు. వచ్చాక ఏవంటారో ఏని పోదురుగాని. లెట్ అజ్ వెయిట్ ఫర్ ఎనదర్ టెన్ మినిట్స్.

సుబ్బ:- అనవసరం.

హను:- ఏం ? మీరు మనస్సు మార్చేసుకున్నారా ?

సుబ్బ:- నా బాకీ అణా పైసల్తోబాటు వసూలుచేసి మరీ వొదిలి పెశతాను.

హను:- సరే, అలానే చేదాం. కాని దబ్బేది ? మావఁయ్య ఆఫీసులో కాన్ఫిడెన్షియల్ క్లార్క్ అని మీకు తెలుసు. ఏదో మీకు తెలిసిన వుపాయం చెప్పారు. కాని పిళ్ళందరికీ ఎక్కడో ఒక చిన్న ఆంతరాత్మ మిక్కి మిగిలిపోయిందట. దాని గోంకి భయపడి లంచం తీసుకోనంటున్నారు. నేనిప్పుడు తాతయ్య వొళ్ళు తుడుస్తూ తెగ ఆలోచించాను- మీ ప్రతిపాదనగురించి. పొలిటిషియన్లు ప్రజాక్షేమాన్నేకదా కాంక్షిస్తారు ? అందువల్ల మీరు మా క్షేమాన్ని ఆలోచించి ఈ లంచం ఉపాయం చెప్పారనిన్నీ మీరే రైటనిన్నీ నిర్ధారణ చేసుకున్నాను.

సుబ్బ:- నేనిక యెలాంటి ప్రతిపాదనా చెయ్యను. నెరవేరినా మీకు దక్కనివ్వను.

హను:- అదేవిఁటి సార్ అంత త్వరగా అచ్చు పొలిటిషియన్లా మారిపోయారు ? ఇంతవరకూ మీరే కదటండీ యిన్ని వుపాయాలు నూరిపోసారు ?

సుబ్బ:- తెలియక చెప్పాను.

హను:- ఇప్పుడు తెలిసొచ్చిందా ? కొంపతీసి కరంట్ షాక్ ఏవన్నా తగ
ల్లేదు కదా ?

[రొట్టెం కర్ర తీసుకుని సీత వచ్చింది – 'హనూ' అనుకుంటూ. హనుమంతరావు వెనక్కి తిరిగేలోపున "మిమ్మల్ని సర్వనాశనము చేసి గాని వొదల్ను" అని కోపంగా సుబ్బరాజు అక్కడి నించి వెళ్ళిపోయాడు. హను పక పకా నవ్వాడు.]

హను:- ఏం తత్తయ్యా ! కొంపతీసి సుబ్బరాజుకి ఆ కరెంట్ షాక్‌ని నువ్వే యిచ్చావా ?

సీత:- (కంగారుపడిసర్దుకుంటుంది) సర్లే, అవతల పూజగది శుభ్రం చేశాను. మీ తాతయ్యగారిని పూజకి తీసికెళ్లు.

హను:- నీ పూజ అయిపోయిందా ?

సీత:- లేదు.

హను:- చెయ్యవా ?

సీత:- ఆలోచిద్దాం తర్వాత.

హను:- పూజకూడా ఆలోచనే?

సీత:- అబ్బబ్బబ్బ! నన్ను విసిగించక నీకు చెప్పిన పని చేదూ?

హను:- చిత్తం సీతమ్మవారి ఆజ్ఞ (లోపలికి పోబోయాడు)

సీత:- హనూ...పూజ అయ్యాక ఆయనకు బార్లీ ఇవ్వు.

హను:- నన్ను తయారు చెయ్యమంటావా?

సీత:- లేదులే, తయారు చేసే వుండాన్లే ... హనూ! తర్వాత ఓసారి మాష్టారింటికి వెళ్ళొస్తావా?

హను:- ఎందుకు?

సీత:- బుజ్జిగా డింకా ప్రైవేట్ సించి తిరిగి రాలేదు. బయట బాగా చీకటి పడిపోయింది. వాడు ఒంటరిగా రాగలడో లేదో!

హను:- ఏం, ఎవరన్నా ఎత్తుకుపోతారనా? భయం లేదత్తయ్యా, వాడు సినిమా హీరో అంత బలాఢ్యుడు.

సీత:- నాకెందుకో భయంగా వుంది బాబూ ఈవాళ. మీ మావయ్యంటే ఆయన లోకంలో ఆయనుంటారు, పోనీ నేనే వెళ్ళి తీసుకొద్దామంటే యింట్లో పన్లు.

హను:- (ఆమె దగ్గరగా వచ్చాడు.) బుజ్జిగా దంటే నీకంత ప్రేమ ఎందుకత్తయ్యా?

సీత:- మీ అమ్మకు నీమీద అంత ప్రేమ వుండేది ఎందుచేత?

హను:- ప్రేముండేదా? నాకేం తెలుసు? అమ్మపోయినపుడు నేనింకా ఒకటో క్లాసే పాసవలేదు. ఆవిడ ఎలా వుండేదో కూడా నాకిప్పుడు జ్ఞాపకానికిరాదు.

(ఇంతలో తోపలి నించి శ్రీనివాసులు 'హనూ' అని పిలవడంతో మళ్ళీ వస్తానత్తయ్యా అని తోపలికి పోయాడు. సీత గదిలో పైల్సు సర్దింది. రామచంద్రరావు వచ్చాడు. సీతను తీక్షణంగా, పిచ్చిగా చూశాడు. ఇన్నాళ్లు ఆమెలో వో నిగూఢ రహస్యం దాగి వున్నట్టు, దాన్ని తెలుసుకోలేక పోయినందుకు బాధపడ్డట్టు వుంటాడు. ఆమెనే చూస్తూ కుర్చీలో కూచున్నాడు.)

సీత:- మీరు లేచి స్నానం చేస్తారా? అందరికీ ఒకేసారి వడ్డిస్తాను.

(ఆమెకు రెప్పవాల్చకుండా చూస్తాడు. చూపు అర్థంకాదు సీతకు)

సీత:- ఆలా వున్నారేం?

రామ:- (లేచి ఆమె దగ్గరకు వచ్చాడు) సీతా! నిన్నో విషయం అడుగుతాన-నిజం చెప్తావా?

సీత:- ఏవిటి?

రామ:- ఐహుశ యిలాంటి ప్రశ్న నిన్ను అడగాల్సి వస్తుందని నేను కలలోనైనా వూహించుకోలేదు. ఊహించేవుంటే ఎనిమిదేళ్ళక్రితమే పిచ్చివాణ్ణయిపోయి వుండేవాడిని.

సీత:- ఏవిటండి ఆ ప్రశ్న?

రామ:- మనిషి మనిషిని ఎందుకు వంచిస్తాడు సీతా? ఎందుకు నిజాన్ని దాచి కపటనాటకం ఆడాల్సివస్తుంది? ఆ మోసంవల్ల ఎదుటివాళ్ళు సర్వనాశనమైపోతారన్న బాధన్నా ఎందుకు వాళ్ళకు కలుగదు?

సీత:- మీ...మాటలు నాకేం అర్థంకావటం లేదండీ!

రామ:- అర్థమైన క్షణంలో మనం యిద్దరం ఏమైపోతామో తెలీదు. మళ్ళి తలెత్తుకుని చూసుకోలేం. దూరం కాలేక, కలసి వుండలేక కుళ్ళి కుళ్ళి చస్తాం.

సీత:- ఏవిటండీ, యింత వింతగా మాట్లాడుతున్నారు?

రామ:- నేను చెప్పబోయే విషయం మరింత వింతగా వుంటుంది సీతా!

సీత:- అయితే త్వరగా చెప్పండి నన్ను చంపక!

రామ:- సీతా! నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?

సీత:- (షాక్ తగిలింది) ఎనిమిదేండ్లు కాపరం చేశాక అనుమానం ఈవాళ కలిగిందా? ఎందుకు?

రామ:- ఇంతవరకు నేను మోసగింప బడ్డానేమో అని.

సీత:- మిమ్మల్నెవరు మోసం చేశారు?

రామ:- నీ ఆత్మకు తెలీదా?

(అతని వేపు ఆర్థంకాని చూపు చూసి మాటాడుతూ దగ్గరకు రాబోతుంది)

రామ:- దగ్గరకు రాకు-ఇంకా నీ మాలిన్యాన్ని నాకు అంట నివ్వకు.

(సీత తలమీద పిడుగు పడ్డంతపని అయింది. పిచ్చిగా అతని వేపు చూసింది)

రామ:- అలా చూడకు సీతా! దేవుడు నన్నొట్టి పిరికివాడుగా పుట్టించాడు. నాకు ధైర్యం లేదు. నీదొక్కటునే శక్తిలేదు. అలా చూడకు సీతా! నన్ను చంపకు. చెయ్యిదాటిపోకముందే అంతా చెప్పేసెయ్. అంతా వినికూడా నిన్ను క్షమించలేని పిరికివాణ్ణి, నా కొక్కటే చాత నయింది. నన్ను నేను హింసించుకోవడం.

సీత:- ఏవండీ! ఏవండీ! ఏవిటి మీరింత పిచ్చిగా మాట్లాడుతున్నారు? ఏవయింది మీకు?

రామ:- ఏమీ కాలేదు, నాలో ఏ లోపముందో తెలుసుకోవాలనే తపన. అంతే సీతా!

సీత:- ఎవరన్నా మీకు...ఏవన్నా చెప్పారా?

రామ:- నువ్వెలా ఊహించావ్? ఎవరో ఎప్పుడో ఒకప్పుడు చెప్పేస్తారని నీకు ముందునించీ తెలుసుకదూ?

సీత:- ఎవరన్నా ఏవిటి చెప్పడం? ముందునించీ నాకు తెలీడమేమిటి?

రామ:- నీ జీవిత రహస్యం.

సీత:- నా జీవిత రహస్యమేవుందీ?

రామ:- ఏవీ లేదా? ఇంకా నన్ను మోసం చెయ్యాలనేనా? వద్దు సీతా! నీ స్వేచ్ఛకు నేను ఎప్పుడూ అడ్డురాలేదు అడ్డురాను. నేనే జన్మలోనో పాపం చేసుకున్నాను. దేవుడు కూడా క్షమించని పాపమే వుంటుంది. దానికి ఈ జన్మలో యింతటి కఠినశిక్ష వేస్తాడని నేనెప్పుడూ వూహించుకోలేదు. ఆర్థికంగా నేను అడుగు జారిన వాణ్ణే కావచ్చు. నీ విషయంలోమాత్రం నేనెప్పుడూ ఏ లోపం చెయ్యలేదు. పల్లెత్తుమాట అనలేదు. మనది పండంటి సంసారం సీతా, దాన్లో చిచ్చుపెట్టకు సీతా!

సీత:- (గాద్గదికంగా) నన్ను చంపకండి, చిత్రవధ చెయ్యకండి!

రామ:- చిత్రవధ నీక్కాదు— నాకు. ఈ ముగ్గురిపిల్లల్ని నేనేం చేసుకోను? ఎలా పెంచాలి? రేపొద్దుట వాళ్లు పెరిగి పెద్దవాళ్ళయి 'అమ్మ'ను గురించిన 'నిజం' తెలుసుకుంటే వాళ్ళెంత యమ యాతన పడిపోతారు? వాళ్ళకి ఏమని చెప్పను? ఏమని సముదాయించను? నన్ను వాళ్లు కూడా వట్టి చేతకాని వాణ్ణిగా జమకట్టి లెక్కచెయ్యకండా తిరిగిన్నాడు నేనిక వేరే నరకాన్ని అనుభవించడం ఎందుకు? అమ్మని దిద్దుకోలేని నాన్న అని నా మొహంమీదే చెంపపెట్టు పెడితే నేనప్పుడు విషం తాగనా? ఉరివేసుకోనా?

కాల్చుకోనా? నేను అమాయకుణ్ణి కావడమే నేను చేసిన పాపమా? దానికి యింతటి శిక్షా సీతా?

[సీత యింతవరకూ కన్నీళ్ళు కారుస్తూనే వుంటుంది. చివరికి ఆమెలో ఏదో మొండి ధైర్యం వచ్చింది, కన్నీళ్ళు తుడుచుకుని బయటకు వెళ్ళిపోయింది.]

రామ:- ఎక్కడికి?

సీత:- సుబ్బరాజుని తీసుకువస్తాను.

రామ:- అతనెందుకు?

సీత:- మీలో కలత రేపింది అతనే!

రామ:- అనుమానాలకు సాక్ష్యం నువ్వే పలుకుతున్నావా?

సీత:- అనుమానాల్ని ఆ మూర్ఖుడే కల్పించివ్వంటాడు.

రామ:- నిజం ఎవరు చెప్పినా ఒకేలా వుంటుంది.

సీత:- అది నిజంకానప్పుడు?

రామ:- ఎవరన్నా అలాంటి కథలెందుకల్లుతారు?

సీత:- స్వార్థం తీరనపుడు.

రామ:- ఎవరిస్వార్థం?

సీత:- సుబ్బరాజుది. అతడు నన్ను ప్రేమించాడు. నా చిన్నతనంలో కాదు. నేను కాలేజీ చదువు వెలగబెడుతున్నపుడుకాదు. మా ఎదురింటి స్నేహితుల యిళ్ళకు పదేపదే రాకలు సాగించినపుడూ కాదు-ఈ యింటికివచ్చాక. ఈ కొంపలో ఈ మూడ్లెల్లూ మీరిచ్చిన ఆతిథ్యం స్వీకరించాక. నాకు ముగ్గురు పిల్లలు కలిగిన ఏడాది తర్వాత.

రామ:- ఇంతకు ముందు అతను నీకు తెలీదా?

సీత:- కొన్ని సార్లు చూశాను. ప్రత్యేకమైన దృష్టితో కాదు. వెర్రివాళ్ళనూ, పిచ్చికుక్కల్నీ అలానే చిత్రంగా చూసేదాన్ని. ఆనాడు నే నతని గురించి ఏవీ ఆలోచించలేదు. ఆలోచించాలనే తలంపు ఎంచుక్కలుగు

తుంద?్పిధిలో వేలమంది జనం వస్తూ పోతూ వుంటారు. వాళ్ళందరి గురించీ ఆలోచించడం ప్రారంభిస్తే నేవొట్టి పిచ్చిదాన్నయినా కావాలి..

రామ:- నే నడిగిందానికి యింత ఉపన్యాసం అనవసరం.

సీత:- మీ అనుమానానికి యింత ఉపన్యాసం ఐహళ ఒక ఇసుక రేణువేమో! ఇది మామూలు అనుమానం కాదు-మిమ్మల్నీ నన్నూ; కళ్ళు తెరవని మూగ్గురిపాపల్నీ, మన కుటుంబాన్నీ వంశాన్నీ సర్వనాశనం చేసే సే అనుమానం. దీనికి నేనెంత చెప్పుకున్నా ఏదో సంజాయిషీ చెప్పుకున్నట్టే వుంటుంది.

రామ:- నిజమే మరి.

సీత:- అయితే ముందు నాప్రశ్నకి సమాధానం చెప్పండి. ఎనిమిదేళ్ళు నాతో కాపురం చేసికూడా నా మనస్సు ఎలాంటిదో తెలుసుకోలేక పోయారా?

రామ:- మేడిపండు చూసేందుకు ముద్దుగానే వుంటుంది...నువ్వు నైతికంగా...పతనమైయ్యావ్!

సీత:- శివశివా !

రామ:- అతన్నెందుకీ రొంపిలో తలచడం?

సీత:- నిజం ఆయనకొక్కడికే తెలుసునుగాబట్టి (స్థిరంగా) సరే అయితే! మిమ్మల్నింక నమ్మించలేను. ఇంతకూ మీరేం చెయ్యదల్చుకున్నారిప్పుడు?

[రామచంద్రావ్ ఏం చెప్పడు. కూలబడ్డాడు.]

సీత:- [ఇక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది] దేవుడు నన్ను అడవిలో ప్రేమనై పుట్టించి వుంటే ఎంత బాగుండి పోయేది ? నన్ను నేను నమ్మించుకోలేని అబలను: తప్పులు చెయ్యకపోయినా, చేసే వుంటా నని భ్రమ కలిగించే నా పెళసరపు మాటలు ! బాధని ఆణచుకోలేని ఉద్రేకం—ఇన్ని 'సద్గుణాలరాశి'ని - నేను నిప్పులాంటి దాన్నంటే ఎవరు నమ్మగలరు ? ఎనిమిదేళ్ళు కాపురం చేసిన భర్తకే అర్థంకాని సమస్యను తెచ్చిపెట్టిన నేను, ఉత్తమ యిల్లాలినంటే ఎవరు ఒప్పు

కుంటారు ?...చూడండీ మిమ్మల్ని బ్రతిమాలకోవటం లేదు. బ్రతి మాలకోసుతూడా ! నన్ను ఏవన్నా చేసెయ్యండి. కాని నేను పతన మైనదాన్ననే ఊహను కలలోనైనా రానివ్వకండి...నేను పతనమై వుండే యింత బాధపడను, మీకు అర్థంకాలేకపోయాననేదే నన్ను చిత్రవధ చేస్తోంది.

[రామచంద్రరావు చాలాసేపు మాట్లాడడు. సీత అటుతిరిగి కన్నీళ్ళు కారుస్తూనేవుంది. రామచంద్రరావు ఏదో నిర్ణయానికి వచ్చినట్లు నిట్టూర్పు విడిచాడు.]

రామ:- రేపట్నుంచి సుబ్బరాజుని యిక్కడికి రావద్దని చెప్పు.

సీత:- నేను చెప్పగలనా అతన్ని?

రామ:- ఈ యిల్లు అమ్మి అతని బాకీ తీర్చేద్దాం. తర్వాత మరో చోటికి దూరంగా పోదాం. ఇక్కడ వుండొద్దు.

సీత:- ఎందుకు ?

రామ:- పరాభవాన్ని భరిస్తూ యిక్కడ నే వుండలేను. నడిరోడ్డుమీద నువ్వూ సుబ్బరాజూ చర్చనీయాంశాలయ్యారు.

సీత:- అందుకని భయపడి పారిపోతారా ?

రామ:- తప్పదు. నేను అశక్తుణ్ణి. పిరికివాణ్ణి

సీత:- నాకా పిరికితనం లేదు.

రామ:- కాని, నువ్వు ఆడదానివి సీతా!

సీత:- అదో బలహీనత కాదు, ఆ జన్మ పాపం కూడా కాదు. భయపడే వాళ్ళను మరింత భయపెడుతుంది లోకం.

హను:- (వచ్చాడు) పూజ పూర్తయిందత్తయ్యా బుజ్జిగాణ్ణి! తీసుకరావడానికి నేవెళ్తున్నా (రామచంద్రరావు లోపలికి పోయాడు. హనుమంతరావు బయటకు వెళ్ళబోయాడు.)

సీత:- హనూ ! దార్లో సుబ్బరాజు ఎక్కడన్నా తారసపడితే తీసుకొస్తావా ఓసారి ?

హను:- సీతమ్మవారి ఆజ్ఞ.

(హను వెళ్ళాడు. రామచంద్రరావు తండ్రిని తీసికొచ్చి మంచంమీద కూచోబెట్టాడు. సీత ఆత్తగారి ఫోటో దగ్గర నిలబడి నిట్టూర్పు విడిచింది. మెల్లగా లోపలికి పోయింది).

శ్రీని:- రామూ.

రాము:- ఏం నాన్నా ?

శ్రీని:- మీ బావగారింటికి ఓసారి వెళ్ళొస్తావా ?

రాము:- ఎందుకు ?

శ్రీని:- ఈ యిల్లు అతనికి అమ్మేద్దాం.

రాము:- అక్కడికెళ్ళడం అనవసరం. అయినా అయన తీసుకోడు. ఇక్కడే ప్రయత్నంచేద్దాం.

శ్రీని:- (నిట్టూర్పు విడిచాడు) చివరికి ఈ కొంపకూడా మిగల్చకుండా మిమ్మల్ని పిధిపాలు చేస్తున్నాను రామూ! నేను బ్రతికిన రోజుల్లోనూ మిమ్మల్ని చంపేశాను; చచ్చిపోతూ కూడా చంపేస్తున్నాను.

రాము:- ఇప్పుడలా ఆలోచించుకోవడం దేనికినాన్నా ! ప్రాప్తం ఎంతుందో అంతే జరుగుతుంది.

శ్రీని:- మీ అమ్మకూడా అచ్చు నీలానే కష్టాలకు చిరునవ్వు నవ్వేది. ప్రాప్తమని సరిపెట్టుకునేది ఆ మహాసాధ్వి. కాని ఆమెను ఒక్కనాడైనా, ఒక్కసారైనా సరిగా చూసిన పాపానపోలేదు. సముద్రమంత కల్లోలాన్ని గుండెల్లో దాచుకుని, ఒక్కనాడూ బయటపడేది కాదు. సరిగ్గా ఆ గుణాలే నీకూ వచ్చాయి.

రాము:- నేనేం మనసులో బాధ పడటంలేదు నాన్నా!

శ్రీని:- అబద్ధం చెప్పడం కూడా నీకు చేతకాదురా. నీ మనసులో లేదని డబాయిస్తున్న బాధ, ముఖంలో కనిపిస్తోంది. నేను గ్రహించ లేదనుకున్నావా? చదువు సంస్కారం వుందనే మురిసిపోయాను కాని, వాటివెనక యింత మురికి వుందని తెలిస్తే నీకీ సంబంధం చేసివ్వుండేవాణ్ణే కాను.

రాము:- ఏవిటి నాన్నా? సీత గురించా నువ్వనేది !

శ్రీని:- ఎవరి గురించి ఏవనుకున్నా, ఇక మనకి మిగిలేది ఆ కన్నీళ్ళు ఒక్కటే బాబూ !

రాము:- తప్పు నాన్నా! సీతమీది అనుమానం పొరపాటు. నువ్వు అక్కణ్ణించి మా మాటలు వినుంటే అవన్నీ తప్పుడు ఊహలే. సీతని మనమెవరం అర్థం చేసుకోలేకపోతున్నాం ఆమె అమ్మలాంటి ఉత్తమురాలు.

శ్రీని:- రామూ! పొగరావడానికి నిప్పురవ్వ కొంతైనా వుండాలి.

రాము:- నిప్పే భ్రమ అయినపుడు, పొగసంగతి చర్చించుకోవడం అవివేకం నాన్నా! నేను సీతను అర్థం చేసుకోలేకకాదు, ఆమెనలా నిందీసి అడిగింది! నాలో బాధ. ఎవరో మన్ని గురించి అనవసరంగా చెప్పుకుంటున్నారనే దుఃఖం.

శ్రీని:- వాళ్ళెందుకలా చెప్పుకోవాలి?

రాము:- అదో సరదా వాళ్ళకు. మాటలొచ్చుగాబట్టి ఏదో వాగాలి మనుషులు. ఆ వాగుడుకి ఒక అంశం కావాలి. అందుకు మన పరిస్థితి అలుసయింది.

శ్రీని:- మనమే ఎందుకు గురికావాలి బాబూ?

రాము:- నోరు లేని కప్పం మీదికి రాళ్ళెందుకు రువ్వుతారు ? ఇదీ అంతే. మనం పతినవాళ్ళం. పతినవాళ్ళనేకదా లేవిడి చేసేది?...సీత మీద మీకు గౌరవముంది. ప్రేమొంది. అన్నిటికీ మించిన నమ్మక వుంది. చాలు, అది పిచ్చనుకో, ఏవనాన్నా అనుకో. నాపిచ్చి నాకాసందం. (హనుమంతరావు వచ్చాడు. పరిస్థితి చూచాడు.)

హను:- అత్తయ్యా! అత్తయ్యా...దళకంతుణ్ణి తీసుకువచ్చాను.
(సీత లోపలి నించి కోపంగా వచ్చింది. హనుమంతరావు ఆమెను ఆడ్డాడు.)

హను:- సీకమ్మవారు కాకికా డూపాన్ని దాల్చకూడదు.

సీత:- నువ్వడ్డం తప్పుకో.

మామ:- తీసుకొచ్చింది నేను. మధ్య నువ్వతని చెంపవాయగొడితే ఆ పాపం మీకు చుట్టుకుంటుంది. మగాళ్ళం మేముగ్నాంగా.

[ఆమెను ఒక మూలగా నిలబెట్టి బయట నున్న సుబ్బరాజుని పిలిచాడు, ''రండి మాష్టారూ'' అని. సుబ్బరాజు వచ్చాడు. ఎవరూ మాట్లాడరు. వాతావరణం అగమ్యగోచరంగా వుంది.]

సుబ్బ:- నా కిక్కడ కూచునే ట్రైం లేదు, త్వరగా డబ్బు యిచ్చేస్తే వెళ్ళి పోతాను.

రామ:- (అర్థంకాక) డబ్బేమిటి?

హను:- డబ్బు యిస్తావని తీసుకొచ్చాన్లే (తలుపులు దగ్గరగా వేసాడు) కూచోండి మాష్టారూ! మావయ్యా వారికి - ప్రెసీడ్-అంటే ఉచితాసనం చూపించు.

రామ:- ఇప్పుడు డబ్బెక్కడుంది?

హను:- వెధవడబ్బు ! కుక్కని కొడితే రాల్తుంది (అని సుబ్బరాజుని కొట్టబోయి ఆగాడు) సారీ! ఏం లేదు మావయ్యా, డబ్బిస్తామంటే తనయన యింటికి వస్తారని ఇలా చెప్పి తీసుకొచ్చాన్లే.

సుబ్బ:- అవిద్ధమా అయితే?

హను:- నిజం చెబితే మీరు పారిపోతారుగా?

సుబ్బ:- ఏవిటా నిజం?

హను:- ఇక్కడ, ఇప్పుడు మీకో చిన్న సన్మానం ఏర్పాటు చేశాం. ఏదత్తయ్యా నువ్వుదాచిన చీపురు కట్టా, మావయ్య పాత చెప్పులూ?

రామ:- హనూ!

శ్రీని:- ఏవిట్రా నువ్వనే మాటలు?

హను:- (సుబ్బరాజు వెళ్ళబోతూవుండే ఆపాడు) మీరెక్కడికి వెళతారు.- డబ్బకంతకు లేని దహనకాండవా?

శ్రీని:- హనూ! అతన్ని విడిచిపెట్టు.

హను:- నేను విడిచిపెట్టేస్తే ఇతను అత్తయ్యను ఈడ్చుకుపోతాడు... నువ్వు దగ్గరకు రాకత్తయ్యా - ఎగదర్ వార్నింగ్ నీకిది. అయన్ని గౌరవించి తిరిగి పంపించే బాధ్యత నామీద వుంది. (రామచంద్రావు 'హనూ' అనుకుంటూ దగ్గరకు రాబోయాడు) నువ్వుకూడా ఏధ్యాసు కలిగించుకోకు మావయ్యా; (శ్రీనిలేచి నిలబడితే) చూశారా, ముసలాయనక్కూడా శక్తి వచ్చేసింది- 'వార్' అనగానే! అందరూ శాంతించాలి. శాంతి! ఈ దశకంఠుడైన సుబ్బరాజుగారు ప్రస్తుతం వా అతిధి.

శ్రీని:- హనూ! ఇది నీ కుట్రతనం చేష్టలా కనిపించదు, చాలా వరకు పోతుంది.

హను:- పరవాలేదు. ఎంతవరకూ పోయినా, అది నాలుగురోడ్ల చర్చా వేదిక దగ్గరకే పోతుంది. అక్కడ మనకిప్పుడు ఎలానూ గౌరవం లేదు. చర్చఘాటు మరింత పెచ్చవుతుంది దీంతో.

శ్రీని:- హనూ! నువ్వు తలుపులు తెరుస్తావా - నన్నే వచ్చి తెరవమంటావా?

హను:- తెరచి, ఈ నాల్గుగోడల మధ్యనున్న ఆ కాస్త పరువునీ బయటకు విసిరేస్తావా? (సీత రాబోయింది 'హనూ' అనుకుంటూ) అత్తయ్యా నీకిది ఫైనల్ వార్నింగ్! అక్కణ్ణుంచి కదలొద్దు. నిస్సాం అక్కడే. నే నెంత ఈ చేతకాని శ్రీనివాసుబుగారి మనవణ్ణయినా, ఈ పిరికి రామచంద్రరావు మేనల్లుణ్ణయినా వీళ్ళ పిచ్చి 'సుగుణాలు' నాకబ్బలేదు. మా నాన్న మహా కరోకోటకుడు. ఆయన సుపుత్రుణ్ణి నేను. నా సొంత స్వభావాన్ని రెచ్చ గొట్టకండి... ఆఁ, సుబ్బరాజుగారూ మిమ్మల్ని రెండు మూడు ప్రశ్నలు మాత్రమే అడుగుతాను. సమాధానాలిచ్చి మీదారిన మీరు వెళ్ళిపోవచ్చు.

సుబ్బ:- నేనేం సమాధానాలు యివ్వను ... ఇవ్వకపోతే ఏం చేస్తావ్?

హను:- ఇక్కడ రెండు జీవచ్ఛాలూ, ఒక అగ్నిపర్వతం వున్నాయి. ఆ పైన ఎలానూ నా అభ్యాగత మర్యాదలు తప్పవనుకోండి! వెల్

మీరు సమాధానాలు ఇవ్వకపోయినా అడగడం నా విధి ... మీకు ఆ సీతాదేవి ఎప్పట్నుంచి తెలుసు?

సుబ్బ:- నాకేం తెలీదు.

హను:- అయితే, ఆ నాలుగురోడ్ల సెంటర్లో ఈవిడ గురించి ఎందుకలా ప్రచారాలు చేస్తున్నారు ?

సుబ్బ:- నేనేం చెయ్యటంలేదు.

హను:- పొలిటిషియన్‌లా అబద్ధాలాడెయ్యకండి. ఉఁ... చెప్పండి.

శ్రీని:- చెప్పుబాబూ ! ఏవిఁటన్నావు ? ఎందుకు మా పరువు మర్యాదల్ని యిలా రచ్చకీడుస్తావ్ ?

సుబ్బ:- నాకేం తెలీదని చెప్తుంటే మీక్కాదు ? అసలా నేనక్కడ లేను.

హను:- మీరులేరు. కాని మీ పది తలలూ అక్కడున్నాయ్. సరే, మీరు చెప్పకపోతే నేను చెప్తాను. మీ పది తలల్లో ఒక తల "ఆ రామచంద్రరావు భార్య సీత ఓ పెద్ద కథానాయకురాలు తెలుసా అంది. "చెప్పండి విందాం" అంది ఓ మారీచుని కంఠం. సుబ్బరాజుగారి దశ కంఠాల్లో మధ్య కంఠం వణుకున నవ్వింది. ఆ నవ్వు వాళ్ళ కర్థమయింది. "మరి చెప్పరేం? ఆ రామచంద్రుడి ముగ్గురి పిల్లల్లో ఎవరుబాబూ మన అంశం ? ' అన్నాడో కుంభకర్ణుడు. "అందరూ అనుకోకూడదా!" అన్నాయి సుబ్బరాజు పది తలలూ. ఏవండీ దశకంఠ సుబ్బరాజూ, ఇవేనా డైలాగులు, తప్పేవఁన్నావుందా ?

[సీత గోడవేపు తిరిగి ఏడ్చింది. "ఖర్మబాబూ ఖర్మ"అని శ్రీనివాసు కూలిపోయాడు. రామచంద్రరావ్ కుర్చీలో కుమిలి పోయాడు]

హను:- అందరూ మూర్ఛపోయాడు. సరే, నాకా పీక్‌నెస్ లేదు సుబ్బరాజుగారూ ! ఇప్పటికైనా వొప్పుకుంటారా మీరు పదిమందిలో అంత సీదాతీసీచఁగా మాట్లాడ్డం ఎంతటి విపరీత పరిణామాలకి దారితీస్తుందో ! ఒక సంసారం కూలి పోతుంది. ఒక ముసలి గుండె ఆగిపోతుంది. ఒక అగ్నిపర్వతం ఆరిపోతుంది. ఒక గృహ

మేధి ఆత్మహత్య చేసుకుంటాడు. ఇందర్ని హింసించి మీరు బావు కునే దేవిటి ? ఏవిటి మీకిందులో వచ్చేలాభం ? అది కొందరి పుట్టుక బుద్ధి అనుకోవాలా? తమాషా అనాలా? ఏం మాటడగేం?... మీరిలా మాట్లాడరు.

[హనుమంతరావు ఇంతకు ముందు సీతతెచ్చి వొదిలిపోయిన రొట్టెల కర్ర తీస్తాడు. రామచంద్రరావు భప్పున వచ్చి పట్టుకుంటాడు]

రామ:- హనూ ! నీకేం మతిగాని పోలేదు కదా ?

హను:- పోయింది మీకు. నన్ను విడిచి పెట్టు. (విదిలించుకొంటాడు). వాడి అంతు తేల్చనీయ్, అక్కడే ఆగు మావయ్యా! నువ్వు అమాయకుడి వని మీ నాన్న భావం. కాని నువ్వు అనుమానించగలవ్. అవమానించగలవ్. మాటల్తో చిత్రవధ చెయ్యగలవ్. మీ రంతా జీవచ్ఛవాలనుకున్నాను. కారు. తేనె పూసిన వాడికత్తులు. అలుసుగా కనిపిస్తే చాలు అణగ దొక్కేస్తారు. (సీత ఏడ్చింది) నువ్వెంత ఏడ్చినా ఈ రాళ్లు కరగవత్తయ్యా, ఆపు యిక.

రామ:- సరే ! నువ్విప్పుడాయన్ను ఏం చెయ్యాలని పిల్చుకొచ్చావ్ ?

హను:- నేనేం నిర్ణయిస్తాను ? అతన్నోటంట నిజం కక్కించాలని తీసుకొచ్చాను. తద్వారా మీ మనసుల్లో వున్న అనుమానాలని తీసెయ్యాలనుకున్నాను.

రామ:- మాకో అనుమానాలేం లేవు. ఎవరో ఏదో వాగినంతక్రో మేం గుడ్డి వాళ్ళమై పోతావా ?

హను:- శ్రీరామ చంద్రుడంతటివాడే చాకలాడి మాటలకి సీతను దూరం చేసుకున్నాడు. ఏవయ్యా సుబ్బారాజూ, నేను నీకింకా ఎంతో క్రైమ్ యివ్వలేదు.

సుబ్బ:- నేనేం తప్పు చెయ్యలేదు.

హను:- అయితే, నీకూ సీతాదేవికీ సంబంధం వుంటా ?

సీత:- హనూ ! నీకు పుణ్యముంటుంది బాబూ, నన్నింకా చంపకు.

హన :- ఈ యింట్లో వున్న జీవచ్ఛవాలు నిన్ను చంపే చావు కంటే నేనాడే మాటలు శూలాల్లా వున్నాయా అత్తయ్యా ! నిన్ను లోబర్చుకోడానికి ఈ సుబ్బరాజు ఎడిన మాటలు నేనూ తాతయ్యా పక్కనించి విన్నాం. నువ్వు కొట్టిన చెంపపెట్టునీ చూశాం. కానీ తాతయ్య నిన్ను నమ్మటం లేదు ఎందుకు ? నువ్వరిటాకువి నువ్వు బలవడానికి పుట్టావ్ గాని గౌరవాలు పొందటానికి కాదు. (రామచంద్రరావ్ బయటకి పోబోతాడు) నువ్వెక్కడికి ? నిన్నే ?

రామ:- నేనిక్కడిక వుండలేను.

హన:- ఆత్మహత్య చేసుకుంటావా ? (రామచంద్రరావ్ వెళ్ళబోతూ వుంటే సీత 'ఏవండీ ఏవండీ' అని వెంటపడబోతుంది.) వెళ్ళనీ అత్తయ్యా! వొదిలిచూడు: అతనెక్కడికీ వెళ్ళలేడు. ఆయనకు చావంటే భయం. బతుకంటే పిరికితనం. ఆత్మహత్య చేసుకోడానికి ఎంత గుండె ధైర్యం కావాలో తెలుసా ? (రామచంద్రరావ్ ఆగిపోతాడు)

సీత:- హనూ ! యింతవరకూ వోపిక పట్టాను, నీమాటలు మరీ హద్దు మీరుతున్నాయి. ఇది నా సంసారం. దాంట్లో ఎన్ని అభిప్రాయ భేదాలు వస్తాయి. వాటిని ఎత్తి దెప్పటానికి నీకేం హక్కులేదు.

హన:- విన్నారా సుబ్బరాజూ, ఆడవాళ్ళకి తన సంసారం మీద ఎలాంటి భావం వుంటుందో ?

సుబ్బ:- నేనేం మూర్ఖుణ్ణి కాదు. ఒకళ్ళ సంసారంలో నిప్పులు పోస్తే నాకొచ్చే దేవిటి ?

హన :- అదేకదా నేనడిగేది ! మరి కోడ్డు సెంటర్లో తమరు చేసే ప్రచారం ఆంతరార్థం ?

సుబ్బ:- నేనేం చెయ్యలేదని ఎన్నిసార్లు చెప్పాను. ఇంతవరకూ నీ యిష్టం వచ్చినట్లు వాగావ్. సహించాను, అర్థం పర్థం లేని నిందల్లు వేసినావ్. భరించాను. నీకు భయపడీకాదు, నువ్వేదో నన్నుచేసేస్తావనీకాదు.

హను:- మరి ?

సుబ్బ:- నేను పక్కా వ్యాపారిని మీదగ్గర నా డబ్బుంది. దాన్ని నేను సామదాన దండోపాయాలతో ఎలాగన్నా రాబట్టుకోవాలి.

సీత:- అందుకని మా సంసారాన్ని రచ్చకీడుస్తావా ? చెప్పు : నీకు బాకీ వుంటడమేనా మేము చేసిన అపకారం ? బాకీలున్న వాళ్ళందర్నీ యిలానే అపహాస్యాలు చేస్తారా ?

హను:- పొరపడుతున్నావత్తయ్యా. ఆయన చేసింది అపహాస్యం కాదు. సుబ్బరాజుది చాలా గట్టి బుర్ర. పెద్దగానే ఉచ్చు పేర్చాడు. లంచం తీసుకోమని యిక్కడ మావయ్యకు చెప్పి ఆటు తీసుకునే టప్పుడు పోలీసు లొచ్చి మావయ్యను పట్టుకుని తీసుకుపోయే ఏర్పాట్లన్నీ చేశాడు ఈ సుబ్బరాజు. మావయ్యను అలా పోలీసులు లాక్కెళ్ళగానే తాతయ్య గుండె ఆగి చచ్చిపోతాడు. అప్పుడు నువ్వు వొంటరిదానవై పోతావ్. తినటానికి తిండి వుండదు. ఆకలికి తట్టుకోలేవు. ఆ స్థితిలో నిన్ను పూర్తిగా చంపేసి, తన వశం చేసుకోవాలని సుబ్బరాజు ఎత్తుజి.

(సీత యిక భరించలేక లోపలికి వెళ్ళిపోబోతూ ద్వారం దగ్గర ఆగి పోతుంది.)

సుబ్బ:- నోర్ముయ్.

హను:- మరో క్షణంలో ఎవరు నోరు మూసుకోవాల్సి వస్తుందో చూద్దురు గాని. (సుబ్బరాజు వెళ్ళబోతాడు.) క్షేమంగా వెళ్ళిరండి; మీకోసం పోలీస్ వేన్ సిద్ధంగా వుంది. (సుబ్బరాజు ఆగి హనుమంతరావు వేపు చూస్తాడు) అంత లమాయకంగా చూడకండి సార్ ! మీరు పొలిటీషియనే కాని పొరపాట్లు చేసి డిపాజిట్లు పోగొట్టుకున్నాడు. తమరు లంచాలు తీసుకోమని మావయ్యకు రాసిన ఉత్తరాన్ని పోలీసులకి అందించాను. చాలా జాగ్రత్తగా వుంచారు వాళ్ళు.

సుబ్బ:- స్కౌండ్రల్. (పిది కొడ్చాడు. సీత ఆడ్డుకుంది.) మిమ్మల్నందర్నీ ఒకేసారి యమలోకానికి పంపించేస్తాను. (పిస్టల్ తీసాడు.) అడుగు ముందుకి వేసారా, ప్రాణాలు పక్కన వు!

హను:- (నవ్వాడు.) పొలిటికల్ ఫిలాసఫీకి ఎదురీదుతున్నారు. పొలిటీషియన్లు పిస్తోళ్ళతో హత్యలు చెయ్యబడతారుగానీ, హత్యలు చెయ్యరు. వాళ్ళు చేసే హత్యలు మరోలా వుంటాయి. మర్యాదగా పారెయ్ పిస్తోలుని.

(హనుమంతరావు ముందుకి వెడతాడు. సుబ్బరాజు అరుస్తూనే వెనక్కి ఒక్కొక్క అడుగు వేస్తాడు. సీత 'హనూ' అంటూ హనుమంతరావుని వెనక్కి లాగేస్తుంది.

సీత:- హనూ, నా మాట విను.

హను:- భయం లేదత్తయ్యా. సుబ్బరాజుచేతిలో ఛస్తే మీకీ బాకీ గొడవన్నా తప్పుతుంది.)

శ్రీని:- (లేచి వచ్చాడు) అప్పుచేసింది నేను, నన్ను చంపు. చిన్నవాడైనా హను నిజమే చెప్పాడు. నీవల్లే నేను నా కోడల్ని అనుమానించాను. ఆమె శీలాన్ని నువ్వు నాశనం చెయ్యబోయావ్. నేను పాపాత్ముణ్ణి. నన్ను చంపెయ్. తర్వాత నువ్వు ఛస్తావ్. మనం మంచివాళ్ళమధ్య వుండకూడదు. ఉఁ-కానియ్.

సుబ్బ:- తొందర పడకండి. అందరినీ అక్కడికే పంపించేస్తాను.

(ఈ మధ్యలో హనుమంతరావ్ సుబ్బరాజు మీదికి దూకడం, వెనక నుంచి రామచంద్రరావు వచ్చి అతనిచేతిమీద కొట్టడం, పిస్టల్ పేలడం ఒకేసారి జరిగాయి. గుండు ఎవరికీ తగలదు. రామచంద్రరావు సుబ్బరాజు చేతినీ, హనుమంతరావు నడుంనీ, శ్రీనివాసులు తలనీ పట్టుకుంటాడు. సుబ్బరాజు గింజుకుంటాడు. బయటకు లాక్కెళ్ళి పోలీసులకు అప్పచెప్పాడు)

శ్రీని:- ఇదిగోనండి ఇన్స్‌పెక్టర్‌గారూ - ప్రజాసేవకుణ్ణి పట్టి యిచ్చాను. ఇదిగో పిస్టల్. ఆయనకు బాగా వుపాయాలు తెలుసు. పొలిటీషియన్. కళ్ళల్లో కారం కొట్టేస్తాడు. జాగ్రత్త...ఏవండోయ్ ఇన్స్‌పెక్టర్‌గారూ- ప్రభుత్వంవారు ఎవరెవరికో బిరుదులు యిచ్చేస్తున్నారు. నాపేరుకూడా మర్చిపోవద్దని చెప్పండి.

(హనుమంతరావు ఇటు తిరిగేసరికి రామచంద్రరావు సీత దగ్గర కొచ్చాడు)

రాము:- నన్ను క్షమించు సీతా!

(సీత ఏడుస్తూ అతని కాళ్ళమీద పడింది. శ్రీనివాసులు కళ్ళు తుడుచుకున్నాడు. రామచంద్రరావు తండ్రి దగ్గరకు వెళ్ళాడు. శ్రీనివాసులు అతనికి ముఖం చూపించలేదు. ఎదుట గదిలోకిపోయి కుర్చీలో కూలబడ్డాడు. హను రామచంద్రరావు దగ్గరకొచ్చాడు)

హను:- వెల్ అంకుల్, గ్రహణం విడిచింది. సుస్నానాదులు చేద్దామా?

సీత:- హనూ! ఈ కొంపను నింబెట్టావు బాబూ!

హను:- నా 'తల్లిదండ్రుల్ని' బ్రతికించుకోవడం కూడా గొప్పేనా అమ్మా? అయితే ఒక విషయం. మనది సత్సాంప్రదాయకమైన నవ నాగరిక సమాజం. ఇందులో మనిషి ఏవిధముగా చచ్చినా ఫర్వాలేదు. కాని (రామచంద్రని చూపిస్తూ) ఆర్థికంగా, (శ్రీనివాసుల్ని చూపిస్తూ) మానసికంగా, (సీతను చూపిస్తూ) నైతికంగా మాత్రం చావకూడదు. అలా చచ్చినాడు ఇది దేశమూ కాదు. మనం మనుషులమూ కాము. (అందర్లోనూ చిరునవ్వు. బయటినించి బుజ్జిగాడు 'అమ్మా అమ్మా' అని పిలిచాడు. సీత ఛప్పునవెళ్ళి కొడుకుని ఎత్తుకుని ముద్దాడింది.)

[—తెర—]

కళ్ళు

రచన :

గొల్లపూడి మారుతీరావు

పాత్రలు

పూజారి బసవయ్య

సీతాలు

పెద్దయ్య

కరీం మియా

రాజిగాడు

రంగడు

సింహాచలం

ఖాజా

జగ్గూ

ఇంకా ఇద్దరు ముగ్గురు కొటసాపులు

[పట్నంలో ఒక వేపువున్న శివాలయం. పెద్ద రద్దీగా వున్న ప్రాంతం కాదది. అడపా తడపా మనుష్యులు అటు వస్తూ పోతూ వుంటారు. ఎడమవేపు దేవాలయం ముఖద్వారం తెరిచి వుంటుంది. ఆ ప్రదేశం శుభ్రంగా లేదు. దేవాలయం కాస్తా పాడుపడినట్టు కూడా వుంది. కుడిమూలకు ఒక చెత్తకుండి, చెదురుగా కాగితం ముక్కలూ పడి వున్నాయి. ప్రంటు స్టేజిమీద దాదాపు మధ్యకి ఒక కర్ర స్తంభం వుంది. దానికి ఒక మేకు వుంది. చీకటి పడ్డాక అటు మనుష్యుల రద్దీ కాస్త ఎక్కువవుతుంది, పక్కనున్న పల్లెకి అదే నడవాలి కనక.

గుళ్ళో గంటలు ప్రోగుతుండగా తెర తొలగింది. గంటలు ఆగేసరికి కుడివైపునుంచి సీత వచ్చింది. కాస్త అటు ఇటుగా గుడిద్వారం దగ్గరకువచ్చి దేవుడికి దండం పెట్టింది. గుడిలోపల పూజారి బసవయ్య పూజకు అన్నీ సిద్ధం చేస్తున్నాడు.]

సీత:- గంటలు వినిపిస్తున్నాయి, బసవయ్య వచ్చేశాడన్నమాట. పూజారయ్యా!

బస:- (వస్తూ) ఏమే సీతాలూ- వచ్చావా (సీతాల్ను చూసి) ఏమిటీవేళ నీ డబ్బా నిండినట్టుందే!

సీత:- ఏదోలే బాబూ- ఎవరో నాయకులంట. అదేదో వూరు ఎల్తున్నారని స్టేషనంతా మనుషులొస్తే నిండిపోయింది.

బస:- సరే! పనిలోపని నీ డబ్బా కూడా నిండి వుంటుంది. బీదరికం యింత అందంగా వుండడంచూసి ముచ్చటపడి ముడుపులు చెల్లించి వుంటారు. ఏం?

సీత:- పో! పూజారయ్యా! నేనంటే నీ కెప్పుడూ- ఏకాకోళమే?

బస:- (నవ్వుకొని) నిన్ను చూస్తుంటే గుడ్డితనానికే కొత్త అందం వచ్చినట్టుంది- ఆ దేముడు ఎంత చిన్న చూపు చూడకపోతే నీ లాంటి దానికి కళ్లు లేకుండా చేస్తాడా? అడుగుతా నడుగుతాను. ఎప్పుడయినా తటస్థపడితే మొదట నీ గురించే అడుగుతాను. ఆఁ! ఆ పువ్వులు

ఇలాతే. (వెళ్ళబోయి ఆగి) త్వరగా ఆ లాంతరు సిద్ధం చేయి. (లోపలికి వెళ్ళాడు.)

(సీత Back Stage దగ్గరకు నడిచింది. అక్కడ సగం కూలిపోతున్న ప్రహరీగోడ వుంది. ఆదీ సగంమేరకే వుంది. ఆ గోడకు ఆనుకొని ఒక సిమెంటు బల్ల వుంది. దాని వెనుకనుంచి ఒక చింకి దాప తీసి కాస్త ఎడంగా కుడివైపు పరచింది. రెండు పింగాణి పళ్ళాల్ని దానిమీద వుంచింది. ఇప్పుడు గోడ వెనుకనుంచి ఒక లాంతరు తీసింది. అది బాగా మసిబారి వుంది. తొందర తొందరగా చిమ్ని తుడవడం ప్రారంభించింది. తెరచుకొని వున్న అమె అందమయిన కళ్ళు ప్రపంచాన్ని చూడలేవని యీపాటికి అర్థమై ఉండాలి. సీత చిమ్ని తుడుస్తోంది. ఇప్పుడు బసవయ్య హారతి తీసుకువస్తూ బయటకి వచ్చాడు. ఆ ఆలికిడికి ఇటు కదలి...)

సీత:- రంగా! రంగా!!...(గ్రహించి) ఓ పూజారయ్యా!

బస:- (నవ్వి) మీ రంగడు ఇంత మెల్లగా వస్తాడటే. గాలి వానలాగరాతూ! వచ్చేడంటే ఈ శివారంతా ఒక్కసారే మేల్కొంటుంది.

సీత:- ఏదోలే పూజారయ్యా! ఆడో దుడుకు మనిషి. ఏం ప్రమాదం తెచ్చుకుంటాడోనని 'పెద్దయ్య' భయం.

బస:- వాడా! వాడికి ఈ భూ ప్రపంచంలో ప్రమాదమా; భస్తే రావడానికి వీల్లేదు. ఆ! 'కరింగాడు', 'రాజిగాడూ' ఇంకా రానట్టేనా!

సీత:- చీకటి పడిందిగా-మెల్లగా చేరుకుంటారు.

బస:- ఆ! సీతాలు - అన్నట్టు చెప్పడం మరిచాను. ఈ ఊరికి రేపో డాక్టరు వస్తున్నాడు. ఎలాంటి కళ్లయినా ఇట్టే బాగు చేస్తాడట. ఇప్పటికి కొన్ని వందల మందికి కళ్ళు బాగు చేశాడని పేపర్లో వేశారు గొప్ప హస్తవాసని అందరూ చెప్పుకుంటున్నారు.

సీత:- ఉరొచ్చినా అంత అదృష్టం వుండొద్దా పూజారయ్యా! అంత గొప్ప వైద్యానికి ఎంత డబ్బు కట్టాలో-ఏమో?

బస:- ఆదీ నిజమే సీతాలూ ! లోకమంతా కళ్ళున్న బీదవాళ్లతో నింపి; కళ్ళులేని ధనవంతుల్ని మిమ్మల్ని ... ఈ మూలి మరచిపోయాడు ఆ దేముడు.

సీత:- (నవ్వి) మేం ధనవంతులమా ఆంటావేంది పూజారయ్యా!

బస:- (సిట్టూర్చి) మీ కలిమి మీ కర్ణంకాదులే. మీ అందరిమధ్యా వున్న ఆప్యాయతలు - అభిమానాలు - వీటికి ఎంత విలువ కడితే మాత్రం సరిపోతుంది!...వెలిగించు...వెలిగించు...ఆ లాంతరు వెలిగించు.

(అ టూ లోపలికి వెళ్ళాడు)

(చేతికర్ర చప్పుడు)

సీత:- ఎవరది ! ఆ? మా పెద్దయ్య మావే ! (ఉత్సాహంగా) మావా! పెద్దయ్య మావా!

(పెద్దయ్య లోపలికి వచ్చాడు. వయస్సు 45 సం॥. పైన పంచ బురద కొట్టుకొనివుంది. కాలు కుంటుతున్నాడు. చేతిలో కర్ర వుంది. సీత మాటకు బదులు చెప్పలేదు.)

సీత:- పంకవేం మావా! ఒంట్లో బాగాలేదా?

పెద్దయ్య:-సీతమ్మా! చెరువుగట్టున పడ్డానమ్మా!

సీత:- మావా ! (చిమ్ని ఒక చేతిలో పట్టుకొని ఆత్మతగా అతడికోసం వెదికింది. క్షణంలో అతని చేయి దొరకింది) సెరువుగట్టు కెందు కెళ్ళావు మావా? రోజూ బస్సుస్టాండులో వుండేవాడివిగా? మంచినీళ్ల కుండ ఏమయిండి?

పెద్ద:- పగిలిపోయిండే. అయినా ఇంక దాని ఉపయోగం లేదులే. బస్సు స్టాండులో యివాల్టినుంచి చల్లనీళ్ల మిషను పెట్టార. ఇక నా మంచినీళ్లు ఎవరు తాగుతారు? నయాపైస ఎవరిస్తారు?

సీత:- పోసిలే మావా! మనలాటోలికి ఒక చోటేంటి-ఒక పేటేంటి..... కాలు ఎలా వుంది మావా ?

పెద్ద:- బాగానే వుందిలే...అయినా కాలు విరిగినా పోయేదేముందిలే సీతా ...గుడ్లోడ్ని...ఇవాల్టినుంచి కంటోడ్ని కూడా అవుతాను.

సీత:- ఏంటి మావా? ఆలా అంటావు? మేమంతా లేవా! ఇలా కూచో.

పెద్ద:- (బల్లమీద కూర్చొని) అవును సీతా! నువ్వూ, మన రంగడూ, రాజిగాడూ, కరీంగాడూ వుంటే నాకేంటే. సెట్లు తెగిన ఎండుటాకుల్లాంటి వాళ్ళం. ఎగిరెగిరి యీ మూలకు చేరాం. ఇక మనల్ని ఎవరూ వేరు చేయలేరు సీతాలూ! సీతాలూ! ఈ వేళ రెండు రూపాయలు సంపాదించి వుంటాను. కానీ... చెరువులో దబ్బా పోయిందే...

సీత:- పోనీలే మావా! నీ వేదాంతం వుందిగా. నీది పోయిందంటే మరొకడికి దొరికిందన్నమాట. అయినా నీ దబ్బా, నా దబ్బు నేనే సంపాదిస్తాను. మావా! ఈ దబ్బులు లెక్క పెట్టు మావా?

పెద్ద:- నాకీ లెక్కలు తెలీవు. మన రాజిగాడు సూసుకుంటాడులే. ఆ లాంతరు వెలిగించావా?

సీత:- ఇంకా లేదు.

పెద్ద:- (గుడిలోపలికి వెళ్తూ) వెలిగించు. వెలిగించు: చీకటి పడిపోయింది. పాపం, ఎవరన్నా ఇటొస్తే దీపం వెలుగుండదు. అటుచూస్తే గొయ్యి – ఇటు చూస్తే కాలువ.

సీత:- ఆళ్ళబాధ మనకెందుకు మావా? దీపం పెట్టినా కనిపించదుగా.
(దీపం వెలిగిస్తోంది.)

పెద్ద:- అందుకేనే. కనిపించని బాధేంటో మనకి తెలుసు. మనం పుట్టుకతోనే సీకటికి అలవాటు పడిపోయినోళ్ళం. వాళ్ళు వెలుగులో బ్రతుకతునోళ్ళు. మనం కాస్త వెలుగు చూపిస్తే వచ్చే జన్మలో నయినా మనకు కాస్త వెలుగుండదే. మన బ్రతుకులు సీకటయి పోయాయని ఆళ్ళకి తెలీడానికి కసింత వెలుగుండాలే పిచ్చిదానా!
(సీతాలు లాంతరు అక్కడ స్తంభానికి తగిలించింది - ఎవరో ఇటు నడిచారు.)

పెద్ద:- దారి చూసుకోండి బాబూ! కాలు జారితే తూలి పడతారు. అక్కడ దీపం వుంది. ఇటు వెలుగులోకి అడుగు వేయండి, బాబూ!

(సీతాలు ఇప్పుడు మూడు పింగాణీ పళ్ళాల్ని గోడవారనుంచి తీసి చీరతో తుడిచి దాపమీద పెడుతోంది. ఇప్పుడు రాజిగాడు, కరీం పాట వాయిస్తున్నారు. ఇద్దరూ హుషారుగా వున్నారు. ఇద్దరికి కళ్ళు కనిపించవు. కానీ అది బాగా తెలిసిన స్థలం కావడం వల్ల హాయిగా మెసులుతున్నారు. కరీం మెడలో సగం విరిగిన పాత 'హార్మోనియం' వుంది.)

పెద్ద:- సీతా! మనవాళ్ళు వస్తున్నట్టు ఉన్నారు.

సీత:- అవును మావా!

కరీం:- ఒరే రాజిగా! ఇప్పుడే చెబుతున్నాను. పెద్దయ్యకు పంచె.

రాజి:- వూహూ ! సీతాలుకు సీర.

కరీం:- పంచె కొనాల్సిందే !

రాజి:- సీర కొనాల్సిందే!

పెద్ద:- ఏంట్రా ఆ గొడవ? ఏం కరీంభాయ్?

కరీం:- ఏంలేదు భయ్యా! సీకు పంచె కొనాలని నేను అంటే - యీడు, సీతాలుకు సీరా కొనాలంటాడు. పాతిక రూపాయలంకి రెండూ ఎలా ఒత్తాయో నువ్వే చెప్పు.

పెద్ద:- ఇంతకీ ఆ డబ్బు ఎక్కడిదిరా ?

రాజి:- అంతా ఓ పెద్ద కతలే మావా? యీవేళ కరీంమియా, నేనూ చౌక్‌లో నిలబడ్డాం.

ఐస:- (లోపల్నుండి వస్తూ) అయితే రూటు మార్చారన్నమాట

కరీం:- నువ్వూ యిను పూజారయ్యా! నేను హార్మోనిపెట్టి నొక్కుతున్నాను. రాజిగాడు పాడెత్తుకున్నాడు. వోరెత్తి పోతోంది. హార్మోనీ మెట్లమీద నా చెయ్యి ఐర్మా డ్యాన్సు చేస్తోంది.

రాజి:- వున్నట్టుండి కరీంమియా 'కంయ్యి' మన్నాడు. ఎవరో చిన్నపిల్ల గొల్లుమంది. అందరూ 'దొంగ' 'దొంగ' అని అరుస్తున్నారు. ఆడు-ఆ దొంగోడు కరీంమియా మీద పడ్డాడు.

కరీం:- నా హార్మోనియం పట్టుకుపోతాడేమోనని ఆది మెడ పట్టుకున్నాను.

రాజి:- నేనాది కాళ్ళు సుట్టేసి పట్టేశాను.

పెద్ద:- వూఁ! తర్వాత.

రాజి:- ఆది జేబులో ఏదో బంగారం గలగలమంది. నా కర్థమైపోయింది- "ఈడు నెం. 1 కేటుగాడూ" అని. ఇంతలో పోలీసులొచ్చి ఆర్ని పట్టుకున్నారు.

పెద్ద:- భలే! మీరు మంచిపనే చేశార్రా!

రాజి:- పోలీసులూ అదేమాట అన్నారు మావా! అందరూ మమ్మల్ని ఎంత మెచ్చుకున్నారూ? అప్పుడు ఏం చేశారో తెలుసా?

బస:- ఏం చేశారూ?

రాజి:- ఎలా అయినా గొప్పోళ్ళు గొప్పోళ్ళే పూజారయ్యా! కిస్ పాస్ అని అని ఓ కాగితంముక్క మా చేతిలో పెట్టారు.

బస:- కాగితం ముక్కా! (ఆశ్చర్యంగా)

రాజి:- (నవ్వి) ఒరే కరీంమియా! మన పూజారయ్య నిజంగా పప్పులో కాలేశాడ్రా! అది వుత్తకాగితంముక్కకాదు పూజారయ్యా! అదేం టంటే-చెక్కు.

బస:- ఓహో! చెక్కే!!

కరీం:- మరేంటనుకున్నావు! పాతికరూపాయల చెక్కు. ఒరే రాజిగా-అది మన పూజారయ్యకు చూపించరా-అదెలా వుంటదో చూసి, మన పెద్దన్నకి, సీతకి చెప్తాడు.

రాజి:- ఓ (తీసి ఇస్తూ) ఇదిగో చూసుకో...ఇప్పుడే సెప్పే సీతాలూ-నీకు సీక కావాలా, ఒద్దా?

సీత:- నా కెందుకురా. ఆ రంగడు బుస్‌కోటు కావాలంటున్నాడు. ఆడికి కొనితెండి. మన పెద్దయ్య రాత్రివేళ దగ్గుతున్నాడు. మందుతెస్తే బాగుంటుంది.

రాజి:- నువ్వుండే. ఏం పూజారయ్యా మాట్టాడవేం? పాతిక రూపాయల చెక్కు ఎలా వుంటదో కాస్త వివరంగా చెప్పు. మనోళ్ళంతా వింటారు.

[ఈ మాటలు జరుగుతుండగా బసవయ్య చెక్కుకు బదులు దాన్నే కాగితం ముక్కగా అబద్ధ మాడటానికి నిర్ణయించుకుంటాడు.]

బస:- ఒరేయ్! మీ కెవరిచ్చారో కాని-ఇది నిజంగా కాగితం ముక్కేర్రా!

రాజి:- (ఆశ్చర్యంగా) ఆ! ఏమిటీ?!

కరీం:- చిత్తెరీ-ఇదేదో మోసం - నేన్నమ్మను – పూజారయ్యా! అసలు నువ్వెప్పుడయినా చెక్కు చూళావా?

బస:- ఓరీ పిచ్చి సన్నాసుల్లారా! కళ్ళున్నవాడ్ని నన్నే నమ్మరట్రా? వాడెవడో చెక్కని నమ్మించి మోసం చేశాడ్రా!

(చెక్కు కరీం చేతిలో పెట్టాడు.)

కరీం:- బడ్మాష్! (చెక్కును నలిపి నేలపై పారేశాడు.)

బస:- (తెల్లబోయి) ఎవరూ! నేనా!!

పె:- ఒక దొంగని పట్టిచ్చారు. మరో దొంగ చేతుల్లో పడ్డారు.

రాజి:- (అనుమానంగా) అదకు,-డా ఇచ్చినోడు పిలిచి మోసం చేసాడ్రా! ఒరే ... కరీంమియా! ఇందులో ఏదో మోసం వుందిరా!!

కరీం:- ఛత్! ఈ కళ్లనోళ్ళంతా దొంగముండా కొడుకులే, గుడ్డోళ్ళని చేసి...గుడ్డోళ్ళనిచేసి.

పె:- అంతా ఏం చేశార్రా! ఎవరో డబ్బుకు గడ్డితినే యదవలు వుంటారని అందరిని అంటే ఏం లాభం? ఏం పూజారయ్యా?

పూజా:- (క్రిందనున్న చెక్కు తీసికోబోతున్న వాడల్లా తుళ్ళిపడి అంతలో సర్దుకొని) అంతే! అంతే! మంచిమాట చెప్పావు నాకు చిన్న పనుంది. నే వస్తా పెద్దయ్యా! ఇంటికి వెళ్తున్నాన. రేపు ఉదయం వస్తా.

పె:- ఆ దీపం కాస్త పెద్దది చేయి బాబూ!

పూజా:- (తల పంకించి) ఆ ! ఈ దీపం విషయం నేను చూసుకుంటాగా. మీరు వచ్చే పోయేవాళ్లకు జాగ్రత్తగా దారి చూపించండి, ఇక్కడ బాగా వెలుగు పడుతోంది. (అంటూ దీపం పట్టుకుపోతాడు.)

[ఇప్పుడు 'రంగడు' చాలా వుషారుగా పరుగెత్తి వచ్చాడు. చూడ డానికి అందరికంటే యువకుడిలా వున్నాడు. అందరికంటె గుడ్డితనంవల్ల తక్కువ ఇబ్బంది పడుతున్నాడు. అందరిలోకి హుషారుగా వున్నాడు.]

రంగ:- పెద్దయ్యమావా ! ఒరే రాజిగా, కరీంమియా! మంచి చాన్సు-లక్కి చాన్సు-గొప్ప చాన్సు, కరీంమియా ! హె ! హె !

(అంటూ సీత పీపు చెళ్లున చరిచాడు.)

సీత:- (ముందుకు పడబోయి, ఆపుకొని నవ్వి) నేనురా ! సీతని...

రంగ:- చూసుకోలేదే—దెబ్బ తగిలిందా !

పె:- అసలు సంగతేంటిరా ?

రంగ:- ఏం లేదు మావా-! ఈసారి ఏనుగు నెత్తిమీద చావు దెబ్బ తీద్దామనుకున్నాను. అనుకొని పోర్టుకేసి వెళ్ళాను-షిప్సుల దగ్గరికి. ఒక దొరసానమ్మ, దొరగాడూ ఆటు వస్తున్నారు. దొరగారు ''డార్లింగ్సు, హోటల్సు, ఇండియాస్, నైన్, గియిస్'' అంటున్నాడు. ఫసిగట్టేశాను.. సమయంచూసి ముందుకు దూకాను. ''మై బ్లయిండ్స్ దొరసాబ్-మై బ్లయిండ్స్ మసిస్'' అన్నాను.

రాజి:- (నవ్వి) యదవ బొల్లెరు ఇంగ్లీషూ నువ్వునూ !

రంగ:- ఆవునురా! ఆ రోజుల్లో, ఆ రోజుల్లో అంతే నేర్పారా. అప్పట్లో మా ఇంటిమీద పిడుగుపడి మా అమ్మ, నాన్న చచ్చిపోకపోతే, అప్పుడు నా కళ్లు పోకపోతే-హూ ! నేను ఇంకా గొప్ప చదువులే చదువుకునేవాడ్ని.

రాజి:- సర్లేరా... అక్కడేమయిందో చెప్పరా !

రంగ:- నన్ను చూసి దొర నవ్వి వూరుకున్నాడు. దొరసాని ఆడకోతిలా అర్థంకాని ఇంగ్లీషులో కిచకిచ లాడింది. ఇద్దరూ ఏదో చెప్పు

ఉన్నారు. నాకు ఫోటోలు తీశారు. 'మనీన్ దొరా' అన్నాను. దొరగారు నవ్వుకొని నోటు తీశాడు.

రాజి:- ఏంటి ! రూపాయి నోటే !

రంగ:- ఓ రెల్లరా—రూపాయి నోటెంటి ? నూరు రూపాయిలు నోటురా, ఇదిగో చూడు (తీసి ఇచ్చాడు.)

కరీం:- శభాష్ రంగా ! శభాష్ ! !

రంగ:- పెద్దయ్య మావా ! ఇప్పుడే చెబుతున్నా. ఈ దెబ్బతో మనం పూర్తిగా మారిపోవాలి. నీకు రెండు పంచెలు - సీతాలకి పూసల దండ — మనకు రెండు పింగాణి కంచాలు — పెద్ద దాప — కరీంగాడికి ఎర్రటోపి — హార్మోనియం కర్రపెట్టె — రాజిగాడికి చెప్పులు, ఇవన్నీ కొనుక్కోవాలి.

సీత:- మరి నీకురా?

రంగ:- నాకేం వద్దులేవే ! మళ్ళి సంపాదిస్తాగా — అప్పుడు చూద్దాంలే.

కరీం:- నీకు బుస్‌కోటు కొనాల్సిందే. నువ్వు కొనక్కోకపోతే నేనూ కొనుక్కోను.

రంగ:- (వెక్కిరిస్తూ) కొనాల్సిందే — ఒరే కరీంమియా ! మనకు అవుసర మైందేదో అది ముందు కొనుక్కోవాలి ఏం పెదయ్య మావా - మాట్లాడవేం?

పె:- నా కీ డబ్బు చూస్తుంటే భయంగా ఉందిరా !

(ఆ నూరు రూపాయిల నోటు తిరిగి రంగడికి ఇచ్చేస్తాడు.)

రంగ:- (నోటు తీసుకుంటూ) చూస్తేకదా మావా !....ఒరే రాజిగా, పదరా అన్నీ కొనక్కొద్దాం —

సీ:- ఒరే రంగా !

రంగ:- ఏంటే ! నీ కేమయినా కావాలా ?

సీ:- నాక్కాదురా రంగా ! ఈ డబ్బుతో అందరికీ కావలసిందేదో కొనుక్కుందాం.

రంగ:- అందరికీ కావలసిందా' ఏమిటది? రొట్టెలా? (నవ్వుతూ)

రాజి:- ఆవెప్పుడూ తినేవేగా !

సీత:- అవి కాదురా — 'కళ్ళు.'

కరీం:-
రంగ:- } కళ్ళా !

రాజి:- కళ్ళు కొందామా ! ఏంటి ? నీకేమైనా పిచ్చెక్కిందా ఏదే! !

సీత:- కాదు రాజీ ! ఇందాక బసవయ్యగారు చెబుతుద్నారు, రేపెవరో కళ్ళ డాక్టరొస్తారట. ఎలాంటి కళ్ళనైనా బాగుచేస్తాడట. ఈడబ్బుతో మనం కళ్ళు బాగుచేయించుకుందే ?

రంగ:- (కోపంగా) ఏంటి ! ఈ డబ్బుతో కళ్ళు బాగుచేయించుకుంటావా? సీతా ! మనం సుఖంగా, హాయిగా బ్రతకడం నీకిష్టం లేదా ఏమిటి?

పె:- రంగా!

రంగ:- లేకపోతే ఏంటి మావా ! సుఖంగా హాయిగా బ్రతుకుతున్న మనకి కళ్ళెందుకు మావా ! అదో అడ్డంకూడానూ! మనకదేం వద్దు, ఇలాగే బావుంది.

కరీం:- అవును బాయ్ ! రంగడు చెప్పిందే రైటు

రంగ:- ఆ ! పదరా రాజిగా! (వెళ్ళబోతాడు)

రాజి:- అయినా నూరు రూపాయిలతో అంత పెద్ద వైద్యం ఏటవుద్దే?

సీత:- మనం ఎప్పటికప్పుడు సింహాచలం దగ్గర డబ్బులు దాసుకుంటున్నాంగా. మరో నిముషంలో ఎలాగూ రొట్టెలు తీసుకొస్తాడు. రాంగానే ఇంతవరకూ దాచిన డబ్బు తీసుకుందాం.

రాజి:- అదంతా ఎంతుంటుందే— ! నందో, రెండొందలేగా !

సీత:- ఆ మొత్తం డబ్బుతో ఒక్కడికి కళ్లుగావా పెద్దయ్యా ! మనందరికీ లేని కళ్లు మనలో ఒకడికి వచ్చినా చాలు.

పె:- రాజీ, నువ్వే మంటావ్ ?

రాజి:- మిగతావాళ్ళంతా ఏటవుతారు సీతా !

సీత:- ఏమీ కారు. మనందరం హాయిగా బ్రతకడానికి రెండు కళ్లు చాలు. నువ్వు మాట్లాడవేం పెద్దయ్యా!

పె:- అవును సీతా!

రంగ:- (కోపంగా) మావా? నువ్వు సీతమాటే సెబుతున్నావా... (ఎవరూ మాట్లాడరు.) సరే...మీలో ఎవరికి కావలిస్తే వాళ్ళే బాగుచేయించుకొండి.

పె:- రంగా!

రంగ:- (నూరు రూపాయల నోటు కరీంకు యిస్తూ) నా కక్కర్లేదు.

కరీం:- నాకు కావలసినా రావు మావా!

సీత:- కరీం!

కరీం:- అవును సీతాలు! కళ్ళే పుంటే మిమ్మల్ని అందర్నీ కడుపులో పెట్టుకు చూసుకొనేవాడ్ని...కాని...కాని...

రాజి:- ఏంటిరా?

కరీం:- కమ్మరి కొలిమిలో నిప్పుగవ్వలుపడి నా కళ్ళు కాలిపోయాయి. ఈ కళ్ళు యింక కనిపించవురా, ఇంక కనిపించవురా!

రాజి:- పోసీ మామా, మన సీతాలుకు బాగుచేయిస్తే!

సీత:- (ఆందోళనతో) వద్దు రాజీ, వద్దు.

పె:- కాదనకు సీతాలు! నువ్వు బాగయితే మా అందర్నీ సాకుతావు. నీ వెనక మేమంతా నడుస్తాం.

సీత:- వద్దు పెద్దయ్యా! మా అమ్మ తిరిగిన చేతు తిరుగుళ్ళకి మా అమ్మ ఒళ్లు చెడి చచ్చిపోయింది. అళ్ళ పాపానికి యీ పెపంచంలో కళ్లు లేకుండానే పడ్డాను. అంటనా, కళ్లుండి యీ పాడు పెపంచంలో ఎవర్ని చూడాలి-ఏటి చూడాలి? మనకు కావలసింది మగదిక్కురా. ఆడ సాయంకాదు. మా అందర్లోకి పెద్దవాడివి. మమ్మల్ని నీ బిడ్డల్లాగ చూసుకుంటావు, నీకే కళ్లు రావాలి పెద్దయ్యా!

పె:- సికేమయినా పిచ్చెక్కిందా ఏదే సీతా! పెద్దోడ్ని కనుకనే నాకు కళ్లు అక్కర్లేదే బ్రతికినంత కాలం—నాకెందుకే?

రంగ:- (బాధగా) మావా!

పె:- అవును రంగా! ఒంట్లో రక్తం, శక్తి వున్నవాడు బాగుపడాలి. మాలో నువ్వొక్కడివేరా మనిషివి. సికే కళ్లు రావాలి.

రాజి:- అవున్రా రంగా! నువ్వు డబ్బు సంపాదించావు కనుక సీకే కళ్లు రావాలి.

రంగ:- (కోపంగా) రాజిగా! ఆ మాటన్నావంటే చంపేస్తాను.

రాజి:- నే నేం తప్పుమాటన్నానురా?

రంగ:- లేకపోతే, నేను సంపాదించిన డబ్బు న్దాదని ఎవరన్నారు సీతో? బుద్ధెరిగినప్పట్నుంచి మీతో వుంటున్నాను. ఇవాళ డబ్బు నాకు దొరికింది కదా అని మిమ్మల్ని వదలి నే నొక్కడ్ని బాగుపడి పోయేదా? నేనూ మనిషినేరా! నాకు మీకంటే 'కళ్లు' ఎక్కువ కాదురా. ఒరేయ్! ఆఖరుసారిగా చెబుతున్నాను. నేను గుడ్డివాడి లాగ మీ అందరిమధ్యా చస్తాను. కాని- బాగుపడి బయట ప్రపంచం లోకి వెళ్ళనురా.

రాజి:- ఆదికాదురా, మా అందరిలోకి చురుకయిన వాడివి, కొద్దో గొప్పో చదువుకున్నవాడివి. నలుగురిమధ్య తిరగడం తెలిసినవాడివి. ఈ పెపంచం ఎలా వుంటదో నీకు పదేళ్ళయినా తెలుసు. నాకు పుట్టి నప్పట్నుండీ తెలీదు. మనల్ని ఎవరూ మోసం చేయకుండా చూడు. నా మాట వినరా రంగా! కాదనకురా రంగా!

రంగ:- కానీ, మీకు లేని కళ్లు నాకు రావడం బాధగా వుంటుందిరా.

సీత:- బాధెందుకు రంగా! మనం అయిదుగురం సుఖంగా బ్రతకడానికి రెండు కళ్ళు చాలు.

రాజి:- మేం చూడలేని కళ్ళు నువ్వు చూడగలుగుతావు.

పె:- మనం వెలిగించిన దీపం ఎలా వెలుగుతుందో చెప్తాడు.

సీత:- మనం దండంపెట్టే దేవు డెలా వుంటాడో చెప్తావు!

కరీం:- నీ వల్ల మా అందరి జిపితాలూ మారిపోతాయి రంగా - మారి పోతాయి.

రాజి:- అవున్రా రంగా!

సీత:- కాదనకు రంగా!

రంగ:- (ఉద్రేకంగా) అవును, మారిపోతాయి. మీది, నాది అందరి జీవితాలు మారిపోవాలి. మార్చేస్తాను-నాకు కళ్ళు కావాలి. నా కళ్లు చూడాలి. నా కళ్ళు చూడాలి. నా కోసం కాకపోయినా-మీకోసం-మీ కోసమయినా నా కళ్ళు చూడాలి.

[లైట్లు ఆరి మళ్ళీ వెలిగాయి]

[కొన్నాళ్ళ తర్వాత...]

(సీత చుట్టుప్రక్కల చీపురుతో తుడుస్తోంది. కరీం సిమ్మెంటు బల్లమీద కూర్చొని హార్మోని పెట్టి బాగు చేస్తున్నాడు.)

కరీం:- బెహెన్!

సీత:- ఏం, కరీం భాయ్?

కరీం:- రంగడికి మనల్ని చూడగానే ఏమనిపిస్తోందో చెప్పు చూద్దాం.

సీత:- ఏమనిపిస్తుంది-నిన్ను చూసి 'మా కరీంమియా ఇలా ఉంటాడా!' అనుకుంటాడు. నన్ను మాత్రం సుబువుగా పోల్చేస్తాడు.

కరీం:- ఎలాగా?

సీత:- ఇక్కడ నే నొక్కతే అనపల్లని గనుక.

[ఇద్దరూ నవ్వుకున్నారు-క్షణం తర్వాత]

కరీం:- రంగడ్ని తీసుకురావడానికి పెద్దయ్య ఆసుపత్రికి వెళ్ళాడు, ఇంకా రాలేదేం?

సీత:- ఏం, రంగడిని చూడాలని తొందరగా వుందా కరీం?

కరీం:- అవును సీతా! ఆది కళ్ళతో ఈ ప్రపంచం అంతా ఒక్కసారి చూడాలని ఆశగా వుంది.

(ఇంతలో బసవయ్య లాంతరుతో వచ్చాడు. కరీం, సీతాలు తృళ్ళిపడి లేచారు. ఒక్క క్షణం నిశ్శబ్దం. ఇద్దరి ముఖాల్లో ఆశ్చర్యత తెలుస్తోంది.)

కరీం-సీత:-(ఇద్దరూ ఒక్కసారి) రంగా!

బస:- (నవ్వుకొని, కర్రస్తంభం దగ్గర్నుండి లాంతరు పట్టుకొస్తున్నట్టు నటించి) ఏమిటర్రా? యీ వేళంతా రంగడు గురించి కలవరిస్తున్నారు! ఊరు వెళ్ళినవాడు రాకుండా పోతాడా? వస్తూనే వుంటాడు. సీతమ్మా! ఇదిగో ఈ లాంతరు వెలిగించు—త్వరగా...(అంటూ లోపలికి పోయాడు. సీత లాంతరు వెలిగించడానికి సిద్ధపడుతోంది.)

కరీం:- ఆడు వూరికి వెళ్ళాడనే అనుకుంటున్నారంతా. ఆడు వస్తేగాని అసలు బయట పడదు (అంటూ బయటకు పోయాడు.)

(సీత లాంతరవత్తి పెద్దది చేసి అగ్గిపుల్లతో వెలిగించబోయింది. ఒత్తి అంటుకొని, ఒక్కసారి భగ్గుమంది. దీపంమీద వంగివున్న ఆమె చీర అంటుకోబోయే సమయంలో రంగడు వచ్చాడు. ఒక్కసారిగా ఆమెవైపు పరుగెత్తి - ఆమె రెక్క పుచ్చుకొని దూరంగా లాగాడు. సీత గభరా పడింది.

సీత:- ఎవరది? (ఆతని చెయ్యి స్పృశించి) ఓహో రంగా! నువ్వా? బాగున్నావా?

రంగ:- నేను సమయానికి రాకపోతే నీకు ఎంత ప్రమాదం జరిగేదో తెలుసా?

(రంగడు పైజామా, లాల్చీలో వున్నాడు. కొంచెం చిరిగి వున్నాయి. అతనికి యీ ప్రపంచమంతా ఆశ్చర్యంగా కనిపిస్తోంది.)

సీత:- నాకేం తెలుసు రంగా! ఏది ప్రమాదమో, ఏది కాదో తెలియకుండానే ఇన్నాళ్ళు బ్రతికాం, నువ్వొచ్చి మొదటి ప్రమాదంనుంచే నన్ను కాపాడావు. ఏం రంగా, నీ కళ్ళు బాగా కనిపిస్తున్నాయా?

రంగ:- ఓ (అంతా కలయచూస్తున్నాడు.)

సీత:- మన చట్టూవున్న యీ తోట, ఈ గుడి, ఆ చెరువు, కొండలూ ఇవన్నీ ఎలా కనిపిస్తున్నాయి? ఈ ప్రపంచం ఎలా వుంది రంగా!

రంగ:- చాలా విచిత్రముగా వుంది సీతా! ఇదివరకు నా కెన్నో తెలిసిన విషయాల్లాగే వున్నాయి. తెలియనిది- అతి విచిత్రమైనది ఒకటి చూస్తున్నాను.

సీత:- ఏమిటి రంగా?

రంగ.- నువ్వు!

సీత:- (దిగ్భ్రమతో) నేనా?

రంగ:- అవును సీతా! ఎదుటవున్న మాణిక్యాన్ని ఇన్నాళ్లు తెలుసుకోలేక పోయాను. నువ్వెంత అందంగా వున్నావో తెలుసా!

సీత:- అందమా! అందే?

రంగ:- అందే- ఎలా చెప్పడం? కళ్లుండే కాని, చెప్పినా నీ కర్థం కాదు.-

సీత:- అలాగా! అది సరేగాని- పెద్దయ్య ఏడీ?

రంగ:- ఆదేమిటి? ఇక్కడ లేడా?

సీత:- నిన్ను తీసుకురావడానికి ఆసుపత్రికి వచ్చాడు. పాపం, యింకా అక్కడే వుండి వుంటాడు. కానీ, నువ్వు గుర్తుపట్టి వుండవు (నవ్వి) చూశావా రంగా! కళ్లు రాగానే నువ్వు ఇన్నాళ్లు కలిసి బ్రతికిన మనుష్యుల్నే గుర్తుపట్టలేక పోయావు. (రంగడు మాట్లాడలేదు-క్షణం విరామం) ఏంరా, ఆకలిగా వుందా?

రంగ:- వూఁ!

సీత:- అయితే వుండు రొట్టెలు పట్టుకొస్తాను. (బిల్లిచాటున వెడుతుంది. రంగడు ఆశ్చర్యంగా అంతా కలయ జూస్తున్నాడు.)

సీత:- (రొట్టెలు పట్టుకొస్తూ రంగడ్ని గుద్దుకొంది.) ఏంరా యింకా ఇక్కడే వున్నావా? అలా అరుగుమీద కూర్చో.

రంగ:- అక్కడా! పరవు మోరంగా వుంది సీతా!

సీత:- ఆలాగా! నాకు కనిపించదుగా, బాగానే వుందనుకున్నాను - వుండు నా చీరతో తుడుస్తాన.

రంగ:- (సీత తుడవబోతే- ఆత్మతగా ఆపి) వద్దు సీతా! ఆ మురికి నీ చీర కంటుకుంటుంది.

సీత:- (నవ్వి) ఇప్పటికి అంటుకున్న మురికి నాకు కనిపించిందా ఇది కనిపించడానికి- పరవాలేదులే - (తుడవబోయింది)

రంగ:- అ హ హా! వద్దు- తుడవకు.

సీత:- (నవ్వి) కనిపించే ప్రపంచంలో ఎన్ని ఆటంకాలు వున్నాయి రంగా సరే, ఇదిగో- ఈ రొట్టెలు తిను.

రంగ:- ఏమిటి ? యీ కంచంలో తినేదా !

సీత:- ఏం ?

రంగ:- (చెప్పబోయి అంతలో ఆగి) అబ్బే. ఏం లేదు ... ఏం లేదు— (కంచం అందుకున్నాడు.)

సీత:- రంగా ! నువ్వికక్కడ ఇదే కంచంలో పదేళ్లు అన్నంతిన్నావు. తెలుసా? రొట్టె ఎలా వుంది ?

రంగ:- ఓ! రొట్టెం—బాగానే వుంది.

సీత:- నిన్నటిది— కాస్త పాసిపోయింది

రంగ:- అయినా బాగానేవుంది.

సీత:- రంగా ! రోజూ గొంతుతూ కేకలేస్తూ వుండేవాడివి. హాయిగా కబుర్లు చెప్పేవాడివి—నవ్వేవాడివి—నవ్వించేవాడివి. ఇప్పుడిలా అయి? పోయావేం ? ఏంరా, నువ్వు చూస్తున్న ప్రపంచం బాగాలేదా భయమేస్తుందా ?

రంగ:- నేను చూడడం బాగానే వుంది. కానీ, చూసే విషయాలే వింతగా వున్నాయి—అంతే.

[ఇప్పుడు పెద్దయ్య వచ్చాడు]

పెద్ద:- (అత్యతగా) రంగా! రంగా ! !

సీత:- రంగడు వచ్చాడు మావా !

పెద్ద:- రంగా ! వచ్చేశావా, (కావలించుకోబోయాడు కాని, రంగడు అతని మురికి బట్టలు చూసి, అసహ్యించుకొని దూరంగా జరిగాడు.) ఏంరా! దూరంగా పోతావు.

రంగ:- (తడబడుతూ) అబ్బే ! అదేం లేదు మావా ? ఇక్కడే వున్నాను. (కరీంగాడు, రాజిగాడు వచ్చారు. రంగడు వీరినికి గ్రహించి ఒక్క సారే 'రంగా' అన్నారు - ఆ పిలుపుకు రంగడు ఇటు తిరిగాడు.)

సీత:- (నవ్వి, రంగడి వేపు తిరిగి) రంగా! (వాళ్ళిద్దరినీ చూస్తూ) ఎవరు? ఎవరో చెప్పుకోవాలి.

పె:- ఎందుకే వాడిని ఆటలాడిస్తావ్ ?

సీత:- వుండు పెద్దయ్యా— చెప్పు రంగా ! (చెయ్యి పట్టుకు తోసింది.) (రంగడు ఇద్దరి దగ్గరకీ వచ్చాడు - ఒక్క క్షణం ఆలోచించి)

రంగ:- (సీతనుద్దేశిస్తూ) నీకు కుడిచేతివైపు వున్నవాడు కరీం—ఎడమ చేతి వైపు వున్నవాడు రాజిగాడు.
(అంటే రాజిగాడ్ని చూసి కరీం అని, కరీంని చూసి రాజిగాడు అనీ అన్నాడు. అందరూ గొల్లునవ్వారు.)

సీత:- (నవ్వుతూ) కళ్లు మూసుకొని చూడరా — తెలుస్తుంది (కరీంను, రాజిగాడ్ని ముందుకు తోసింది)

రంగ:- (కళ్లు మూసుకొని—ఇద్దర్నీ ముట్టుకొన్నాడు) ఆ! అవును— వీడు రాజిగాడు, వీడు కరీం.

రాజి:- (నవ్వుతూ) రంగా ! మమ్మల్ని గుర్తు పట్టడానికి మళ్ళీ గుడ్డితనమే అవసరమయిందిరా నీకు ! (అందరూ నవ్వుకున్నారు.)

పె:- ఏంటే, వాడ్ని వేడిపిస్తారు—వాడికి రొట్టెలు పెట్టావా ?

సీత:- ఓ—ఇందాకే పెట్టాను— (రంగడు నేలమీద పడివున్న రొట్టెల్ని చూస్తున్నాడు.)

పె:- అయితే-కరీంకు, రాజిగాడికి కూడా యివ్వు.

రాజీ:- ఒరే రంగా ! ఈ దబ్బాలో లెక్క ఎంత వుందో చూడరా ! (ఈలోగా ఆటు ఎవరో నడిచారు)

పె:- (తంయెత్తి) దారి చూసుకొండి బాబూ - కాలుజారితే జారిపడతారు. అక్కడ దీపం వుంది. ఇటు వెలుగులోకి అడుగువెయ్యండి బాబూ!

ఐస:- ఏరా రంగా! వచ్చావా? ఆ దేముడుకోసం ఎదురుచూసినట్టు నీకోసం ఎదురుచూస్తున్నారు పిళ్లంతా.

పె:- (నవ్వి) మాకు దేముడు ఎలా వుంటాడో తెలీదు బాబూ ! కానీ పీడికి మేమెలా వుంటామో తెలుసు, మా కష్టాలకి ఇక వాడే దిక్కు. వాడు మాకు దేముడేనయ్యా.

ఐస:- ఏమిట్రా నీ వేదాంతం ? ఇదిగో ఈ హారతి తీసుకో.....ఊఁ! ఎక్కడికెళ్ళావురా ఇన్నాళ్లు ?
(రంగడిని గమనించకుండానే లాంతరు దగ్గిరికి వెలుతూ ఆగాడు. రంగడు ఆశ్చర్యంగా చూస్తున్నాడు తప్ప సమాధానం చెప్పలేదు. లాంతరు ఐసవయ్య తీస్తుండే గమనించి)

రంగ:- అదేమిటి? ఆ లాంత రెందుకు తీస్తున్నారు?

ఐస:- (మొదట విస్తుబోయి, అంతలో తేరుకొని) గుడ్డివాడివయినా నీకు మంచి గ్రహింపే.
(ఇంకా రంగడు గుడ్డివాడేనని అభిప్రాయం) నీ లాంతరు ఎక్కడికీ పోదులేరా. వత్తి పెద్దది చేస్తున్నాను. (జేబులోకి దీసుకొని ఐయటకు నడుస్తూ) రాత్రంతా ఇక్కడే వుండి, నలుగుటకి దారి చూపిస్తూ వుండు. జాగ్రత్త. నేను వెళ్తున్నా ... (అంటూ లాంతరు పట్టుకొని ఐయటకు వెళ్ళబోయాడు.)

రంగ:- (కంఠంలో క్రౌర్యం కంటె, ఆశ్చర్యం ఎక్కువ ధ్వనిస్తోంది.) ఏమిటండీ మీరు చేస్తున్న పని?

ఐస:- (నిర్ఘాంతపోయి — ఇంకా విషయం గ్రహించలేక) ఏమిట్రా నీ దబాయింపు?

రంగ:- (సూటిగా అతని కళ్ళల్లోకి చూసి, చేతిలోవున్న లాంతరు తీసుకొని స్తంభానికి తగిలించాడు)

ఐస:- (విషయం అర్థమై—స్తంభించిపోయాడు) ఏమిటి? నువ్వు-నువ్వు-చూస్తున్నావా? అయితే ఇన్నాళ్లు...

రంగ:- ఇన్నాళ్లు కాదు-ఇవాల్టినుంచే చూస్తున్నాను, కొత్త కొత్త విషయాల్ని. ఐసవయ్యగారూ! మా పెద్దయ్య మిమ్మల్నింత నమ్ముతాడు కదా! ఏమిటీ దొంగ పని?

ఐస:- (ఒక్క క్షణంలో తేరుకుని నవ్వి) రంగా! నువ్వు చూడగలుగుతున్నావు కాబట్టి ఇది దొంగపని అంటున్నావు. ఒక్కసారి కళ్ళు మూసుకుంటే ఇదే దొరపనిలాగ కనిపిస్తుంది. ఇన్నాళ్ళు నువ్వు చూడని ప్రపంచంలో యిదేగా "నీతి" అంటే!

రంగ:- ఐసవయ్యగారూ!

ఐస:- నువ్వు యిప్పుడిప్పుడే కళ్ళు విప్పావు. ముందు ముందు నీకే అర్థమవుతుంది. చూడు రంగా! కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఇరవై ఏళ్లబట్టి సేవ చేస్తున్నా, ఈ దేముడు నన్ను కరుణించడం లేదు. గంపెడు సంసారం, రోజులు గడవక ఆఖరికి ఇలా కిరసనాయిలుకి కూడా కక్కుర్తి పడుతున్నానని.

రంగ:- ఏమిటండీ! దేవుడినే నిందిస్తున్నారా?—

ఐస:- పిచ్చివాడా!—ఎక్కడున్నాడ్రా—దేముడు, కళ్ళు మూసుకుని నమస్కారం పెట్టేసి మనసులో తప్ప? సరేలే — అదంతా వరో ప్రపంచం-వస్తా-[లాంతరుతో దాటిపోయాడు.]

రంగ:- ఆగు. చేసిన వెధవపని చాలక, యింకా సిగ్గులేక సమర్థించుకొంటావా?- నిన్ను ఏంచేసినా పాపంలేదు. వుండు- ఈ విషయం అందరికీ ఇప్పుడే చెబుతాను.

ఐస:- రంగ! నన్ను అల్లరి చేయకు-నన్ను రక్షించు. చిన్నవాడివయినా నీ చేతులు పట్టుకుంటున్నాను. ఇదిగో, యీ డబ్బులు వుంచుకో. అప్పుడప్పుడు అవసరానికి ఆదుకుంటూ ఉంటాలే. [అని చేతిలో డబ్బులు వుంచాడు]

రంగ:- [చేతిలో డబ్బులు చూసుకొని నిర్ఘాంత పోయాడు. అతను ఆశ్చర్యం నుండి తేరుకొనేలోగా బసవయ్య దాటేశాడు. ఈలోగా ఎవరో అటు నడిచారు.]

పె.- [తలెత్తి] దారిచూసుకోండి బాబు. కాలు జారితే తూలి పడతారు. అక్కడ దీపం వుంది. ఇటు వెలగులోకి ఆదుగెయ్యండి.

(ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు.)

రంగా! పూజారయ్య వొత్తి పెంచాడా?

రంగ:- [కాసేపు ఆలోచించి, చేతిలో డబ్బు చూసుకుంటూ, బిగిసినంగా...] పాపం... పెంచాడు.

కరీం:- పాపం, ఐసవయ్య దేవుడిలాంటివాడు.

(కాస్త విరామం)

పై:- రంగా, నిజం చెప్పరా?

రంగ:- (తుళ్ళిపడి) ఆ! నిజమా! ఏమిటది?

పై:- లోకం అంతా మోసం, మోసం అంటారు కదా-మన కళ్ళముందే మోసం జరిగి పోతుందంటారు కదా? అది నిజమేరా?

రంగ:- (ముఖం పాలిపోయి) ఏమో... నాకు తెలీదు.

రాజి:- (వస్తూ-రొట్టె చేతికో వుంటుంది) ఆడు ఇప్పుడిప్పుడే అన్నీ చూస్తున్నాడు మావా! రేపట్నుంచి చూసుకో, ఈ యెదవ ప్రపంచం గురించి రోజుకో కథ చెప్తాడు. ఏరా రంగా! (రంగడు మాట్లాడడు) డబ్బు లెక్క పెట్టడం అయిపోయిందిరా?

రంగ:- ఊ!

కరీం:- (వస్తూ-రొట్టి చేతిలో వుంటుంది) ఆ సింహాచలం ఎప్పుడూ మన లెక్కలు తప్పేనంటాడు. ఈ సారి నీ లెక్క ఎలా తప్పంటాడో చూస్తాంగా రానీ- నీ లెక్క చూసి వాడు తారెత్తిపోవాలి.

(గర్వపడి పోతున్నాడు రంగడిని గురించి)

సీత:- (వస్తూ) ఇంతకీ లెక్కెంత రంగా ?

(రంగడు చెప్పలోయేలోగా 'సింహాచలం' ఉంగిడలో రొట్టెలు పట్టుకొని వచ్చాడు)

సింహా:- ఆ! ఆ!! ఏంట్రోయ్! అంతా త్వరగా గూటికి చేరుకున్నట్టున్నారు... ఏంటి ? నిన్నటి రొట్టిలు దాచారా... అయితే ఇవాళ బేరం లేదన్న మాట-

రాజి:- ఇవాళ ...

కరీం:- నువ్వుండరా. మనోడ్ని మాట్లాడనీ ...

సింహా:- (గదబిడగా) ఏంరా రంగా ? ఎక్కడికి మాయమయావు ? (పిహాసంగా) కళ్లురావాలని తపస్సుచేసి వచ్చేవేంరా? (తన హాస్యానికి తనే నవ్వుకున్నాడు. అతని చేతిలో దబ్బులాక్కొని గంగలాడించి) ఏంటి ? ఈసారి చాలా పోగుచేసినట్లున్నారే ! (చేతిలోకి పావులా కాసుల్ని, అర్ధరూపాయల్ని తీసికొని, కళ్ళెర్రజేసి) ఏమిటీ! పైసలేనా! మీతో ఇదే చిక్కు. చూడడానికి బోలెడు దబ్బులాగ వుంటుంది; లెక్కపెడితే సగం తేలదు. (లెక్క వేస్తున్నాడు)

సీత:- నిన్న పాసిపోయిన రొట్టిలు ఇచ్చారు సింహాచలంగారూ !

సింహా:- (తనసి తిట్టినంత కోపం తెచ్చుకుని) ఇదిగో సీతాలూ! ఆ మాదీ అనొద్దన్నాను. ఊరికి నాలుగు ఆమడల దూరంలో బేరంపెట్టిన మీ దగ్గరికి చచ్చీ చెడీ నడచి వస్తున్నాను-ఏదో ముష్టి బేరానికి.

రాజి:- (కోపంగా) ఏమిటయ్యా! 'ముష్టి' 'ముష్టి' అని పదిసార్లు అంటావు. ఆ ముష్టి దబ్బుంతోనే నువ్వు బ్రతుకుతున్నావ.

సింహా:- (కోపంగా) చూశావా పెద్దయ్యా! ఈ రాజిగాడి నీలుగుడ! ఏదో ఆ పరమేశ్వరుడి సమక్షంలో బ్రతుకుతున్నవాళ్ళు కదా అని—

హాసవ సేవ చేసినట్టు అవుతుందని — బేరం వున్నా రొట్టిలు మిగిల్చి తెస్తుంటే పాసికొట్టి, బోసి నోరూ అంటారు? ఇదేనా మర్యాద?

పె:- కోప్పడకండి సింహాచలంగారూ! వాళ్ళు చిన్నోళ్ళు.

సింహా:- చిన్నవాళ్ళయితే చిన్నవాళ్ళలాగ మాట్లాడాలి. గుడ్డివాళ్ళకు పెద్ద మాటలేంది? ఏంరా రంగా!

(రంగడు ఇదంతా మాట్లాడకుండా గమనిస్తున్నాడు. సింహాచలం వేళ్లు చకచకా నాడాల్ని లెక్కపెడుతున్నాయి. ఆ టోపులోనే రూపాయినోట్లు కోటుజేబులో దాచేశాడు.)

రాజి:- ఇంతకీ యీవేళ ఎంత తేలిందో చెప్పండి?

సింహా:- (వ్యంగ్యంగా) ఆ! ఎటు లెక్కపెట్టినా-నాలుగు రూపాయిల అరవై రెండు పైసలే తేలింది.

కరీం:- అదేంటండీ—బజారులో ఒక్క మా ఆటకే...

సింహా:- (కోపంతో) ఇదిగో కరీం! ఇలా నువ్వు, నా నిజాయితీని శంకించడం యిది రెండోసారి-మళ్ళీ మరోసారి...

రంగ:- (నెమ్మదిగా) మరోసారి లెక్కపెట్టండి సింహాచలంగారూ!

సింహా:- (పట్టుదలగా) నేను లెక్కపెట్టనయ్యా! లెక్కపెట్టవలసిన అవసరం లేదు. నేను కాకపోతే కళ్ళులేని కబోదోడివి రోజూ నువ్వు లెక్కపెడుతున్నావా అంట?

రాజి:- ఏంట్రా కూస్తావ్ మా రంగడ్ని?

పె:- (ఇద్దర్నీ ఆపుతూ) ఒరేయ్-మీరంతా లోపలికి పదండి. అదంతా మన రంగడు చూసుకుంటాడు. ఊ - పదండిరా.

[అందరూ లోపలికి వెళ్ళారు. పావలాలు, అర్ధ రూపాయిలు రహస్యంగా తన జేబులో దాచుకొంటూ వుండగా, రంగడు గబ గబా వచ్చి, సింహాచలాన్ని కోటు పట్టుకుని రెండు గడ్డాలు పైకి గాలిలోకి లేవదీసి]

రంగ:- లెక్క ఎంతో ఇప్పుడు సరిగ్గా చెప్పు సింహాచలం!

[సింహాచలం ముఖానికి రంగడి ముఖం ఎదురుగా వుంది. సింహాచలం ఇప్పుడు ఆతని కళ్లు గమనించి బిక్కచచ్చిపోయాడు.]

సింహా:- రంగా! నువ్వు!...నువ్వు!...(కంఠంలో వణుకు, భయం)

రంగ:- ఆవును-నేనే-నిజాన్ని ఇప్పటిప్పుడే సరిగ్గా చూడడం నేర్చుకుంటు న్నాను. చెప్పు-ఎంత డబ్బో సరిగ్గా చెప్పు!

సింహా:- ఇందులో పది వున్నాయి. నాలుగని చెప్పాను. మిగతా ఆరులో నాలుగు నాకు-రెండు నీకు, సరేనా?

రంగ:- (కోపంగా) సింహాచలంగారూ! నిన్ను నమ్ముకున్న వాళ్ళను ఇలా మోసం చేస్తావా?

సింహా:- నమ్మిన వాళ్ళను మోసంచేయకపోతే దాన్ని 'మోసం' అని ఎందు కంటారు? ఇదిగో రంగా! గడిచిపోయిందేదో గడిచిపోయింది. మళ్ళి ఆ కథను ఎందుకు త్రవ్వుతావు?

రంగ:- నోర్ముయి! గడచిపోయింది కాదురా గాడిదా! నువ్వు సరిగ్గా దారికి రాకపోతే – ఆ కథనే కాదు - నిన్ను నిలువునా త్రవ్వి పాతే స్తాను. చేసి వెధవపని ఎలాగూ చేయించావు దాని ఫలితంకూడా పూర్తిగా పొందని...

సింహా:- అమ్మో! తిన్నదంతా కక్కమంటే నాకు శక్యమా?

రంగ:- లేకపోతే గొంతుపట్టుకొని నేనే కక్కిస్తాను. (మెడ పట్టుకొని ముందుకు లాగాడు.)

సింహా:- (ఏడుస్తూ) అమ్మో, నీలాంటివాడు కళ్లు తెరవడం ఈ దేశానికి ఎంత ప్రమాదమో ఇప్పుడర్థమౌతోంది.

రంగ:- ఊ! (కొట్టబోయాడు.)

సింహా:- (గభాల్న ఆ చేయి పట్టుకొని ఆ చేతిలో కొన్ని రూపాయల నోట్లు ఉంచాడు. లోపల్నుంచి పెద్దయ్య 'రంగా' అని పిలిచాడు) ఆ పెద్దయ్యా! మీ రంగడితో లెక్కంతా తేల్చేశాను. వాడింక మీ

సంగతి జాగ్రత్తగా చూసుకుంటాడులే ! (రంగడికి కన్నుకొట్టి వెళతాడు.)

ఈవేళ ఒక్కసారి ఆ మహాతల్లికి మొక్కుకొని వెడతాను, తల్లీ ! ఆపద్బాంధవీ ! జగజ్జననీ ! (అంటూ లోపలికి వెళ్ళాడు.)

పె:- (వస్తూ-కరీం వెనకాలే ఉంటాడు) కరీంభాయి ! అయినా సింహా చలాన్ని అలా కోప్పడడం మంచిదికాదు. అయిదేళ్ళయి మనల్ని కాపాడుతున్నాడు. మన డబ్బు మనకి-రంగడు ఆపరేషనుకి కావాలంటే నిక్కచ్చిగా లెక్కలు కట్టి ఇచ్చాడు. ఇప్పుడు స్వయంగా అతని నిజాయితీ రంగడు చూశాడు, ఏంరా రంగా?

రంగ:- అవును (పెద్దయ్య అంటున్నప్పుడు సీతకూడా లోపలి నుండి వచ్చింది. ఇంతకుపూర్వం రంగడు విసిరిపారేసిన రొట్టె ఆమె కాలి క్రింద పడితే చేతిలోకి తీసింది. కొట్టిని గుర్తించి తుళ్ళిపడింది. ఇది గమనించాడు రంగడు. కాని ఏమీ మాట్లాడలేదు.)

సీత:- పెద్దయ్యా! రంగడు ఒంట్లో బాగుండలేదు. ఈ రోజంతా ఆదోలా వున్నాడు.

పెద్ద:- అయితే రేపు మాట్లాడుకుందాంలే, ఇంక పదుకో పోరా!

రంగ:- (ఏమీ మాట్లాడడు)

సింహా:- (లోపల్నుండి వస్తూ) ఇక్కడా?

పెద్ద:- ఇంకెక్కడ సింహాచలంగారూ!

సింహా:- ఈ మురికి కాలవ ప్రక్కన - ఈ చెత్తకుండీ దగ్గర పదుకోవాలంటే కాస్త తటపటాయిస్తున్నాడు. ఏంరా రంగా, అంతేనా?

కరీం:- (అప్పటికే వచ్చి వుంటాడు) వెళ్ళండి... మా రంగడు ఇక్కడే పదేళ్ళున్నాడు, ఇదేం వాడికి కొత్తకాదు.

సింహా:- కళ్ళు లేనప్పుడు తెలీక యీ మురికి కూపంలో బ్రతికాడు. మీతో పాటు ఈ రొంపిలో పడివున్నాడు. కానీ, యీవేళ చూస్తూ చూస్తూ ఎవ్వడా భరించేది? ఏంరా రంగా?

సీత:- సింహాచలంగారూ? మీకు సంబంధంలేని విషయాల్లో కల్పించుకోకండి. మా రంగడు సంగతి మీకు తెలీదు.

సింహా:- ఓసి పిచ్చిదానా! కళ్ళులేని రంగడు గురించే మీకు తెలుసు. కళ్ళున్న మనిషి ఎలా ఆలోచిస్తాడో నాకు బాగా తెలుసు. అందులోనూ మీ రంగడా! హూ! వాడికేం ఖర్మ! కావాలనకుంటే వూళ్ళో ఎంచక్కటి ఇల్లు తీసుకొని మహారాజులాగ వుంటాడు.

రాజి:- ఇదుగో! సింహాచలం! మా రంగడ్ని మా నుంచి వేరుచేయాలని చూశావో, నీ ప్రాణాలు తోడేస్తాను.

సింహా:- వేరుకాక నీతో యీ కళ్ళుకాలువ ప్రక్కన బ్రతకమన్నావా? పోరా జెష్టా!

రాజి:- ఏంట్రా కూశావ్?

(మీదికి వస్తే రంగడు ఆపాడు)

రంగ:- ఆగండి! ఏమిటా దురుసుతనం. పెద్దా చిన్నా లేకుండా? అతను చెప్పింది నిజమే.

సీత:- రంగా!...

రంగ:- నీకు తెలీదు సీతా! ఇంతవరకు నేను చూసింది చెప్పలేక, తెలిసింది దాచుకోలేక గిజగిజలాడుతున్నాను. మీరు ఎలాంటి మురికి బ్రతుకు బ్రతుకుతున్నారో మీకు తెలీదు.

సీత:- (దుఃఖంతో) అవును రంగా! నాకు తెలీదు-తెలుసుకోవాలని లేదు.

రంగ:- కానీ నాకు తెలుసు. ఈ చాప, మురికి పట్టిన కంచాలు...

రాజి:- కానీ నువ్వు అందులోనే ఇన్నాళ్ళూ తిన్నావురా!

రంగ:- ఆది జ్ఞాపకం చేసుకుంటూ బ్రతకడం మరీ ఘోరం!!

క్రీ.:- హూ! ఘోరం!!

రంగ:- ఘోరంకాక-ఆ చెత్త కుండీ ప్రక్కన, ఈ మురికి కాలువ ప్రక్కన చూస్తూ నిద్రపోలేను. నే నిక్కడ వుండలేను.

(రాజిగాడు ఆడ్డబోతే ప్రక్కకు తోసేస్తాడు)

రాజి:- ఒరే రంగా, ఎట్లే ఎల్లరా. నువ్వు ఎక్కడయినా బాగా వుండే మా కంతే చాలు. ఎల్లరా ఎళ్లు. మేం చూడలేని 'గొప్ప' నిజాన్ని తెలుసుకున్నావు. అలాగే ఎల్లరా-ఎల్లు (ఏడుస్తున్నాడు.)

కరీం:- రంగా! ఎల్లిపోతావా! కళ్ళొచ్చాక మాకు దూరమవుతావా రంగా (రంగడ్ని సింహాచలం లాక్కువెళ్ళాడు) రంగా!! (గట్టిగా అరి చాడు.)

సీత:- (గట్టిగా) రంగా!! (పెద్దయ్యతో) రంగడు ఎల్లిపోతున్నాడు మావా; నువ్వు పిలు మావా!

పెద్ద:- ఎందుకే ఏడుస్తావ్ పిచ్చిదానా! వాడు బాగుపడడం నీ కిష్టం లేదా?

సీత:- అదికాదు మావా! ఇన్నాళ్ళూ అయిదుగురం ఒక శరీరంలో ప్రాణా ల్లాగ మసిలాం. ఇవాళ ఒక పేణం లేచిపోతోంది—పిలు మావా!

పెద్ద:- (నవ్వి) ఎక్కడికి పోతాడే? ఆ దెక్కడున్నా మనవాడే-ఆడు మన గురించే ఆలోచిస్తూ వుంటాడు. ఇప్పుడెళ్ళినా మళ్ళీ మన దగ్గరికే వస్తాడే—ఊరుకోయే...

—లైట్లు ఒక్కసారి ఎరి మళ్ళీ వెలిగాయి—

(లైట్లు వెలిగేసరికి నలుగురూ ఒక్కప్రక్క నిలబడి వున్నారు. వాళ్ళముందు రంగడు వున్నాడు. ఇప్పుడు కొంచెం భిన్నమైన బట్టలు వేసుకున్నాడు)

రంగ:- బాబూ! నే నెక్కడున్నా వాళ్ళ మనిషినే బాబూ! వాళ్ళ బాగే నా బాగు. ధర్మం చేయండి. దానం చేయండి. కంటి చూపుకైనా నోచుకోని యీ నిర్భాగ్యుల్ని కరుణించండి. మన మధ్య పుట్టికూడా మన అదృష్టానికి నోచుకోని ఈ దీనుల ఆర్తిని తీర్చండి. ధర్మం చేయండి. దానం చేయండి.

(చేయి చాచేడు ఎవరో చేతిలో డబ్బులు వేస్తున్నట్లు Mime చేస్తు న్నాడు. అందరికి తలవంచి నమస్కారం చేస్తున్నాడు...)

(ఈ క్రింది డైలాగులన్నీ చెప్పక్కరలేదు. Mime చెయ్యాలి.)

మీ నీడలో బ్రతకవలసిన వాళ్ళం. ఒక్కపైసా యిచ్చి మా ప్రాణాల్ని కాపాడండి. ఒక్క కన్నీటిబొట్టు మాకోసం కార్చండి. మీ జాలితో, మీ అంధతో, మీ కాలిదగ్గర బ్రతకవలసిన వాళ్ళం. మీరు కడుపారా అన్నంతినే క్షణాల్లో పట్టెడు అన్నానికి నోచుకో లేని ఈ దీనుల్ని గుర్తు ఉంచుకోండి-కరుణించండి - కాపాడండి - ఒక్కపైసా-ఒక్కపైసా దానం చేయండి.

(చెయ్యి డబ్బుతో నిండాక జేబుల్లో పోసుకుంటున్నట్లు Mime. రంగడు మాట్లాడుతున్నట్లు పెదాలు కదులుతుంటాయి. శబ్దం రాదు. Mime.)

పెద్ద:- వాడి మాటలు వింటుంటే వాడు 'మన రంగడేనా' అనిపిస్తోంది.

రాజు:- మనం సరైన వాడికే కళ్ళు యిచ్చాం.

కరీం:- నలుగుర్నీ ఆకట్టుకోవడం వాడికి బాగా తెలుసు.

రంగ:- ధర్మం చేయండి. దానం చేయండి. కళ్ళులేక, చేయనినేరానికి శిక్షను అనుభవిస్తున్నట్టున్న ఈ దీనుల్ని రక్షించండి. మీముందు మీ సోదర మానవుడు యిలా బాధపడడం ఈ కర్మభూమిలో చూస్తూ సహించ గలరా? మీరు పుట్టిన గడ్డమీదే పుట్టిన గుడ్డివాళ్ళు వీళ్ళు. కానీ పట్టెడు అన్నానికి నోచుకోలేని నిర్భాగ్యులా. వీరికి పట్టెడు అన్నం పెట్టి, అంతా ఆ భగవంతుడి బిడ్డలని నిరూపించండి. ధర్మం చేయండి—దానం చేయండి.

(అంతా వెళ్ళిపోయినట్టు Mime)

దండాలు బాబు - దేవుడు మీకు మేలు చేస్తాడు.

(రంగడు సంతోషంగా నేలమీద పోకెట్ రుమాలు పరచి, జేబుల్లోంచి డబ్బుతీసి లెక్క పెడుతున్నట్టు Mime.)

రాజు:- ఈవేళ సింహాచలానికి పెద్దపనే. మన డబ్బులు లెక్క పెట్టలేక గింజుకు చావాలి—నాయాల.

రంగ:- సింహాచలం ఇంక రాదు.

కరీం:- ఏం?

రంగ:- ఈవేళే కాదు - మరెప్పుడూ రాడు.

పెద్ద:- అదేంరా!

రంగ:- నేనే రావద్దన్నాను.

రాజి:- ఎందుకని రంగా?

రంగ:- వాడెందుకు మధ్య! వాడు చేసేపని నేనే చేస్తున్నాను.

కరీం:- అవునవును. అదే మంచిపని. పైవాడి చేతిలో మన డబ్బు పెట్టేకన్నా మనవాడి చేతిలోనే డబ్బు ఉంచడం మంచిది.

రంగ:- ఊ! మీరంతా వెళ్ళి ఆ గుడి దగ్గర వుండండి. నేను వెళ్ళి రొట్టి పట్టుకొస్తాను.

పెద్ద:- పదండిరా.

రంగ:- (డబ్బు జేబులో పోసుకుంటూ) ఇవేళ పాతిక రూపాయలు లాభం. ఇదంతా మన మాటల మహిమ-వాళ్ళదేముంది, గుడ్డినాయాళ్ళు.

(వెళ్ళబోయాడు—సీత రావడం చూసి ఆగిపోయాడు. వాళ్ళు లేచి వెళ్తూ)

రాజి:- పెద్దయ్య మావా, నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు, రంగడ్ని చూస్తూంటే నాకేదో అనుమానంగా వుంది.

కరీం:- అవును పెద్దయ్య మావా—

పెద్ద:- ఒరేయ్-వాడిని మనం నమ్ముకున్నాం. మనకు తెలియని వెన్నో వాడికి తెలుస్తాయి. ఏది ఎందుకు చేస్తున్నాడో మనకు తెలియాల్సిన పనిలేదు. వాడు మనవాడు-అది మరచిపోకండి. వాడు లేకపోతే మనం గుడ్డివాళ్ళమేనని మరచిపోకండి. పదండి.

[అంతా వెళ్ళారు.]

రంగ:- (ఇప్పటికి డబ్బు లెక్కించడం అయింది.) ఇవాళ పాతిక రూపాయలు లాభం. ఇదంతా మన మహిమ— వాళ్ళదేముంది, గుడ్డినాయాళ్లు- (బయలుదేరబోతూంటే సీత ఎదురొచ్చింది)

రంగ:- రొట్టెలు తెచ్చావా?

సీత:- ఓ! యివిగో- ఆవును, వాళ్ళంతా ఏరీ?

రంగ:- యిప్పుడే వెళ్ళారు- పద.

సీత:- యీవేళ బాగా ఆకలిగా వుందిరా. పదరా రంగా, తొరగావెళ్ళి ఈ రొట్టెలు అందరం కలిసి తిందాం

రంగ:- ఛ ఛ!! నీకీ చచ్చు రొట్టె లెందుకే? కావాలంటే ఫ్రూట్‌సలాడ్ ఇప్పిస్తాను.

సీత:- అదేమిట్రా?

రంగ:- అదో తియ్యటి విందులే!

సీత:- అయితే తీసుకురా, అందరం తిందాం.

రంగ:- పిచ్చిదానా! ఇది నీకే స్పెషల్. మధ్యలో ఆ చవటలం కెందుకు?

సీత:- రంగా!

రంగ:- సీతా! ఈ కళ్లు నాకు లేకపోతే ఎంత నష్టపోయేవాణ్ణో నిన్నుచూస్తే అర్థమౌతుంది. ఈ అందం అంతా నాకు తెలియకుండా వృధా అయిపోయేదేగా! అక్కడే నిలబడ్డావేం సీతా! ఇవిగో రొట్టెలు తీసుకో. నే వెళ్ళి నీ కోసం ఫ్రూట్‌సలాడ్ తీసుకొస్తా.

[సీత తీసుకోకోతే చెయ్యి పట్టుకు లాగాడు]

సీత:- రంగా!

రంగ:- కాస్త ఓపికు నేర్చుకోవోయ్ వెర్రిదానా (అని దగ్గరకు తీసుకో బోయాడు- ఆమె విదిలించుకుంది.)

సీత:- చిఛీ! ఓపికంటే యిదా ? (అని తప్పించుకొని వెళ్ళిపోయింది. రంగడు నవ్వుకొంటున్నాడు.)

(లైట్లు ఆరి- మళ్ళీ వెలిగాయి)

(రంగడు ఈసారి మరీ ఖరీదైన దుస్తుల్లో వున్నాడు. చేతిలో వ్యానిటీ స్టిక్. ఇద్దరు మ-ష్టివాళ్లు నిలబడి వున్నారు. కుడిప్రక్కన పెద్దయ్య, రాజిగాడు, కరీంమియా కూర్చున్నారు - నిస్సహాయంగా.

ఇద్దరు గుడ్డివాళ్లు - ముందు - అంచే రోడ్డు ప్రక్కకు నిలబడి వున్నారు. వాళ్లు నిజానికి గుడ్డివాళ్లు కారు.)

ఖాజా:- బాబుల్లారా ! అయ్యల్లారా ! అన్నంలేక అలమటించి పోతున్న వాళ్ళం. గుడ్డివాళ్ళం. మమ్మల్ని కాపాడండి. రక్షించండి. మీ కాలిక్రింద చెప్పులనుకొని ఆదరించండి. మీ ఎంగిలి కూడయినా తిని బ్రతకనివ్వండి, మీరు త్రొక్కిన నేలమీదయినా నడవనివ్వండి. ధర్మం చేయండి.

జగ్గు:- బాబూ! ధర్మం!! దానం చేయండి!!!

రంగ:- (బెత్తంతో రెండోవాడి వీపుమీద చరిచి) ఏంరా గాడిదా! నోరు పెగలదా! ప్రొద్దుటే రెండు దోసెలు, టీ త్రాగుతావు. సాయంత్రానికి రెండు రూపాయలు పుచ్చుకుంటావు. వూ! (పొడిచి) అదుగో ఎవరో వస్తున్నారు. కళ్లు ముయ్యి-నోరు తెరువు.

జగ్గు:- బాబుల్లారా! అయ్యల్లారా!
(ఇక్కణ్ణుంచి అతని పెదవులు కదులుతున్నాయి. శబ్దం వినిపించదు. Mime- రంగడు సిగరెట్టు వెలిగించి అందరూ ధర్మం చేయడం చూసి సంతోషిస్తున్నాడు.)

రాజు:- ఏంటి మావా? హాయిగా గౌరవంగా ఏదో దొరికినది తింటూ బ్రతుకుతున్నవాళ్ళం కాళ్ళక్రింద చెప్పులకంటే నీచం చేసేవాడు- రంగడు.

కరీం:- ఇంత చేసినా మనం తినేది చల్దికూడే-తాగేది ఆ గంజినీళ్ళే- ఛీఛీ!

రంగ:- (దగ్గరకువచ్చి) ఒరేయి గుడ్డి రాస్కెల్స్! నోరు మూసుక్కూర్చోలేరూ! ఎవరు వస్తున్నారో, ఎవరు పోతున్నారో తెలియకుండా వాగితే వచ్చేబేరాలు కూడా చెడుతాయి. మీ రెలాగూ వాగలేరని మనుష్యుల్ని కీరాయికి యేర్పాటు చేసుకోవలసి వచ్చింది. దబ్బుకు దబ్బూ నష్టం- మీకు పెట్టే తిండి నష్టం.

పెద్ద:- ఇది అన్యాయంరా !

రంగ:- అవును. మిమ్మల్ని కూచోబెట్టి వత్తపుచ్చానికి మేపుతుండడం కూడా అన్యాయమే.

రాజి.- కానీ, నిన్నిళ్ళ ఈ స్థితికి తీసుకొచ్చింది మేమేగా- మేం కళ్ళు ఇవ్వబట్టి...

రంగ:- నోర్ముయ్ ! సిగ్గులేదూ ఆ మాటలు అనడానికి-మీకు లేని శక్తి నాకు వుంది. పెరిగాను— పెద్దవాణ్ణి అయాను. నేను మంచివాడ్ని కనుక మీకు గంజయినా పోస్తున్నాను. ఇదివరకు - తినేరోజు తినేవాళ్ళు, పస్తున్న రోజు లుండేవాళ్ళు. ఇవేళ రూఢిగా గంజి నీళ్ళకయినా నోచుకున్నారు. దానికి సంతోషించండి.

పెద్ద:- మా సంగతి పోనీరా. ఇలా నలుగుర్ని మోసం చేయడం అన్యాయం రంగా!

కరీం:- గుడ్డివాళ్ళ పేరు చెప్పుకొని, వాళ్లు తినడం తప్పురా !

రంగ:- (పగల్బడి నవ్వి) తప్పా ? ఈ ప్రపంచాన్ని చూస్తే - ఆలాంటి చప్పుకబుర్లు చెప్పకుభాయ్ ! ఆ మాటకొస్తే గాంధిగారి పేరు చెప్పుకొని మన దేశంలో ఎందరు బ్రతకడంలేదు ?

పెద్ద:- రంగా ! నువ్వెంత మారిపోయావురా !

రాజి:- నే చెబితే విన్నావుకాదు. హూ! పద మావా! ఈడితో మనకేం పని. (లేచాడు)

కరీం:- నువ్వు ఎప్పటికయినా బాగుపడతావని ఆశగా వుండేది. కానీ నువ్వింక బాగుపడవురా, బాగుపడవు.

(అందరూ బయటకు నడిచి గుడివైపు వెళుతుంటారు. వాళ్ళను చూస్తూ రంగడు నవ్వుతూంటాడు. ఇప్పుడు 'భాబా', 'జగ్గూ' దగ్గరికి వచ్చారు.)

జగ్గూ:- Boos ! భక్తులంతా వెళ్ళిపోయినట్టుంది.

రంగ:- ఒరేయ్ ! జగ్గూ !! ఇక్కడికి మరొకడొచ్చి బిచ్చమెత్తడానికి పిల్లేదు. ఈ గుడిదగ్గర బిచ్చగాళ్ళను మనం కంట్రాక్టు పాడాం. తెలిసిందా !

భాజా:- కానీ బాస్! పక్కవీధిలో కంట్రాక్టరు—ఆ వీధి బిచ్చగాళ్లను మన వాళ్ళ మధ్య కూర్చోపెడుతున్నాడు. మొన్న ఎదిరిస్తే— 'అట్టే మాట్లాడితే మునిసిపాలిటీవాళ్లతో చెప్పి ఈ వూళ్ళో బిచ్చగాళ్ల బెడద లేకుండా చేస్తాను' అన్నాడు.

రంగ:- ఎవర్రా ఆ అన్నది? అలా అనడానికి ఎన్ని గుండెలు! ఇది మన రాజ్యం, ప్రజారాజ్యం. వాళ్ళు బిచ్చగాళ్ళుగానే బ్రతకనివ్వడానికి మనం ఏం చేయడానికైనా సిద్ధమే. వాళ్ళని ముష్టెత్తుకునేటట్టు చేయడమే మన లక్ష్యం. వాళ్ల కనీసపు హక్కుల రక్షణకు-అంటే వాళ్లు నిరాఘాటంగా ముష్టెత్తుకునేటట్టు చేయడానికి అవసరమైతే కిరాయికి మనుష్యుల్ని పెట్టి నిరాహారదీక్షలు చేద్దాం. హర్తాల్ చేద్దాం. బంద్‌లు చేశాం. బస్సులు తగలబెడదాం - రైళ్లను పడగొడదాం. డబ్బుకు గడ్డికరిచే దబ్బాకాయిళ్లచేత సమ్మెలు జరిపిద్దాం. మహోద్యమంగా ఉద్యమాలు రెచ్చగొడదాం. ఈ ఉద్యమాల్లో అమాయకులు చచ్చిపోయినా, తోబట్టువులకు మానభంగాలు జరిగినా, మన లక్ష్యానికి తిరుగువుండదు—వుండకూడదు, అవసరమైతే అఖిల భారత ముష్టివాళ్ల సంఘం స్థాపిద్దాం. రాజధానికి రాయబారం వెడదాం. ముష్టివాళ్లకు పార్లమెంటులో ఒక రిజర్వేసిటు కావాలందాం. అనాదిగా వాళ్లను గుడ్డివాళ్లుగా ముష్టివాళ్లుగా బ్రతికించే మన హక్కుల్ని మనం పరిరక్షించుకుందాం. అంతకి సాధ్యంకాకపోతే ముష్టివాళ్లకు 'ప్రత్యేకరాష్ట్రం' కావాలందాం. నీతికి వెన్నెముకలేని ఈ దేశంలో నీచానికి పాల్పడే దరిద్రగొట్టు రచయితలంతు డబ్బుతో దశపట్టించి ముష్టివాళ్ల రాష్ట్రానికి వెయ్యేళ్ల మూగచరిత్ర వుందని శతకాలు రాయిద్దాం, కవిగోష్ఠులు పెట్టిద్దాం. గొల్లెల్లా ఆరిపిద్దాం.

(ఆవేశంలో భయంకరంగా నవ్వుతుంటాడు.)

అగ్గూ:-
పాటా:- } (ఇద్దరూ) మ ష్మివాళ్ళ సంఘానికి జై!

ముష్మివాళ్ల సంఘానికి జై!

(ఇద్దరూ నిష్క్రమిస్తారు)

రంగ:- (జేబులోంచి క్రాందిసిసా తీసి చూశాడు. సీత గుర్తుకొచ్చింది. తనలోతాను 'సీతా' అంటూ ఐయటకు నడిచాడు)

-లైట్లు ఆరి వెలిగాయి-

(సీత చెత్తను కుండీలో పారెయ్యడానికి వెడ్తోంది)

రంగ:- సీతా! సీతా!! ఓ! నువ్వికక్కడే వున్నావా? పూలు తెచ్చానే! పెట్టుకో.

సీత:- హా! గుడ్డిదాన్ని-నా కెందుకు పూలు?

రంగ:- (నవ్వి) ఈ పూలు నీకోసం కాదే! నిన్ను చూసి నలుగురూ ఆనందించడానికి. నువ్వు గుడ్డిదానివి. కానీ లోకం కాదుగా. ఊ! పెట్టుకో. (ఇదలో పెట్టబోయాడు.)

సీత:- (తాగిన వాసన సీతకు తెలుస్తుంది. పూలు నేలకేసి కొట్టి) ఛీ! నువ్వెంత దిగజారిపోయావురా రంగా!

రంగ:- (నవ్వి) యిది దిగజారడమో, ఎగబ్రాకడమో, నీకేం తెలుసే సీతా! నాకు పడేళ్ళు నీచేత్తో అన్నం పెట్టావు. ఇప్పుడు నీచేత బంగారం తినిపిస్తాను. రా! నాతోరా. (గట్టిగా లాగుతాడు)

సీత:- (దుఃఖంతో ప్రాధేయపడుతూ) రంగా! దేవాలయం ముందు నిలబడి వున్నాం. ఈ పాపపు ఆలోచనలు మంచివి కావు.

రంగ:- దేవాలయమా! (పగలబడి నవ్వుతాడు) సీతా! ఈవేళో, రేపో, ఆ దేముడితోపాటు-ఈ దేవాలయాన్ని కూడా కొనేయబోతున్నాను-తెలుసా?

సీత:- (నిర్ఘాంతబోయి-తనలో) దేముడ్ని కొనేస్తావా?

రంగ:- అవునే - తప్పేం - ఎవరో ఒక దేముడు మన జేబులో వుండాలిగా. దేముడు మనకు శక్తిని, ముక్తినీ ఇచ్చే రోజులు ఆ ప్రహ్లాదుని

కాలంలోనే పోయాయి. ఈరోజు దేముడికి మనం గుర్తిస్తేనే శక్తి. మనం కల్పిస్తేనే శక్తి. లేకపోతే బాజు పట్టిపోయి గబ్బిలాం పంచన గాఢనిద్ర పోవలసిందే ! (గట్టిగా కౌగిలించుకుంటాడు. సీత విడిలించుకొని క్రిందపడిపోయింది)

సీత:- రంగా! గుడ్డిదాన్ని, నిస్సహాయురాల్ని. నీకు పడేళ్లు తోబుట్టువులాగ సేవలు చేశాను. నన్ను అన్యాయం చేయకు-నీకు దండం పెడతాను.

రంగ:- (వికారంగా నవ్వుతూ సీతను మళ్ళీ గట్టిగా పట్టుకొని, ముద్దుపెట్టుకో బోయాడు.)

సీత:- ఛీ ! దూరంగా వుండు. (రంగడ్ని తోసింది. దూరంగా తూలిన రంగడు వేగంగా వచ్చి మళ్ళీ ఆమెను గట్టిగా కౌగలించుకోబోయాడు. చాచి చెంపకాయ కొడతుంది - ఒక్కక్షణం రంగడు బిత్తర పోయాడు. అంతలోనే నవ్వి - ఆమెను పిట్టలా పట్టుకున్నాడు.)

సీత:- ఛీ ! వదులు - వదుల్తావా లేదా! మావా, కరీం! రాజిగా!...
(రంగడు గట్టిగా ఆమె నోరు మూశాడు - మెల్లగా ఆమెను సిమెంటు బల్లమీదకు పందాడు)

రంగ:- బోనలోవున్న పిల్లిపిల్లా! నీ పంజా చిన్నదే. నన్ను మొండివాణ్ణి, బండవాడినీ చేసినకొద్దీ - నిజంగా - నేను పశువులా ప్రవర్తిస్తాను. (సీతను క్రిందకు త్రోశాడు. ఎడం కాలితో బలంగా రంగడు ఛాతి మీద తన్నింది. ఆ తాపుకు రంగడు దూరంగా పడిపోయాడు. సీత గాభరాగా దేవాలయంలోకి పరుగెత్తింది.)

రంగ:- (తేరుకొని - తనలో తాను నవ్వుకొని) ఓహో ! నీకు దేవాలయం అంటేనే ఇష్టమన్నమాట. సరే, అలాగే కానీ - (ఒక్క క్షణం గుమ్మం ముందు ఆగి) కళ్లులేని ఆ దేముడు మనం చేసేపనికి ఏం సాక్ష్యం ఇస్తాడే !
(నవ్వుతూ లోపలికి వెళ్ళాడు. ఇద్దరూ మర్షణ పడుతున్నారు)

సీత:- రంగా ! నన్నొదులు - వదులు - నన్నన్యాయం చేయకు - రంగా ! నీకు దణ్ణం పెడతాను-రంగా! నన్ను వదులు.

(రంగడు ఆదేపసిగా నవ్వుతూ ఉంటాడు. ఉన్నట్టుండి సీత 'రంగా' అని గట్టిగా అరిచింది. ఆ వెంటనే రంగడి 'సీతా' అంటూ చావుకేక వినిపించింది - ఒక్కక్షణం నిశ్శబ్దం. కుడివైపునుంచి పెద్దయ్య, రాజిగాడు, కరీం పరుగున వచ్చారు.)

పెద్ద:- సీతా ! అమ్మా, సీతా!

కరీం:- సీతా !

రాజి:- సీతా, ఎక్కడున్నావ్-ఏం జరిగిందమ్మా?

(ముగ్గురూ ఒక్కసారే అంటారు)

పెద్దయ్య, రాజి, కరీం:- అమ్మా సీతా!

సీత:- (లోపల్నుండి గభాలున వచ్చి) మావా, (అంటూ ఏడుస్తూ ముగ్గుర్ని ఒక్కసారి కౌగలించుకొని, వాళ్ళ కడుపులో తన తల దాచుకొని ఏడుస్తూ వుంటుంది.)

కరీం:- నీకేం భయంలేదు సీతా! మేమున్నాం-ఏం జరిగిందో చెప్పమ్మా!

సీత:- (ఏడుస్తూ) మావా! రంగడు! రంగ...

(చెప్పలేక ఏడుస్తుంది.)

రాజి:- (సీత జుత్తు విడిపోవడం, జాకెట్టు చినిగిపోవడం గమనించి...) ఆ! ఒరే, రంగా! నీ రక్తం తాగుతాను-నీ కళ్లు పీకేస్తాను-ఒరేయ్! (అంటూ కర్రను నేలమీద కొడుతూ ముందుకు వస్తాడు.)

పెద్ద:- రాజీ! తొందరపడకు. (పట్టుకున్నాడు.)

రాజి:- ననొన్నదులు మావా! ఈవేళ వాడి రక్తం కళ్ళజూస్తాను. ఆడి కళ్లు పీకేస్తాను.

(నాలుగు అడుగులు వేసేసరికి, రంగడు లోపల్నుండి బయటకు వచ్చాడు. ఇంతకుముందు జరిగిన ఘర్షణలో త్రిశూలంతో పొడవడం వల్ల, ఆది రంగడి కళ్ళల్లోకి గుచ్చుకొని కళ్లు పోయాయి. మనిషంతా రక్తంలో మునిగిపోయాడు. ముఖం రక్త సిక్తమయి వుంది.)

రంగ:- (త్రిశూలాన్ని క్రిందపారేసి - క్రింద పడ్డాడు. మెల్లగా లేస్తూ) సీకా శ్రమ అక్కర్లేదు రాజి-సీతే ఆ పని చేసింది.

పెద్ద:- రంగా!

రంగ:- అవును మావా! మీరంతా కలసి ఇచ్చిన కళ్ళను సీత మూసేసింది.

పెద్ద:- అమ్మా సీతా! ఎంతపని చేశావు తల్లీ!

సీత:- నాకేం తెలీదు మావా! నేనేం చేశానో నాకే తెలీదు.

రంగ:- తెలీకపోయినా చెయ్యాల్సిన పనే చేశావు సీతా! మీరిచ్చిన అర్హతను నిలబెట్టుకోలేకపోయాను—మీ శ్రేయస్సును కాపాడలేకపోయాను- అందుకని, మీ అర్హతను మీరు తీసుకొనే హక్కు మీకు వుంది. మీరిచ్చిన కళ్ళను మీరే తీసుకున్నారు. నేను వస్తాను. మావా! (వెళ్ళబోయాడు.)

రాజి:- ఒరే రంగా, వద్దురా!

సీత:- రంగా! వెళ్ళకురా (ముగ్గురూ ఒక్కసారే)

కరీం:- రంగా!

పెద్ద:- రంగా! నీమీద మాకేం కోపం లేదురా! నా మాట విను. ఎక్కడికీ వెళ్ళకురా! ఇక్కడే వుండరా.

రంగ:- వద్దు–వద్దు!...మావా! నన్ను క్షమించే గొప్పతనం మీకుంది. కానీ దాన్ని భరించే శక్తి నాకు లేదు. వద్దు మావా! నన్ను మీ నుంచి దూరంగా వుండనివ్వండి.

(రంగడు అందర్నీ విడిచి వెళుతుండగా-రాజిగాడు హఠాత్తుగా 'రంగా' అని పిలిచాడు. మెల్లగా దగ్గరకు వచ్చి తన చేతికర్ర రంగడికి సహాయంగా వుంటుందని ఇచ్చాడు. రంగడు-రాజిగాడు లోపలకు వేడ్చారు.)

పెద్ద:- ఒరే రంగా! దారి చూచుకొని నడవరా! కాలు జారితే తూలిపడతావు- అక్కడ దీపం వుంది. వెలుగులోకి అడుగెయ్యరా!

LIBA131B214

BL



కళావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదర్‌గూడ, హైదరాబాదు - 500 001.

మువసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	LIBA1313214
పుస్తకం పేరు	బాలికా పంచవింశతి
తారీఖు	24 July 2024
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	861
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	ANUSHA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	